పచ్చని ప్రకృతి అందాల అటవీ ప్రాంతంలో రక్తపు ధారలు పారాయి. పర్యాటకుల ఆటపాటలతో హోరెత్తే మారేడుమిల్లిలో తూటాలు గర్జించాయి. మారేడుమిల్లి మండలం నెల్లూరు సమీపంలో ఎన్‌కౌంటర్ జరిగి 24 గంటలు గడవకముందే.. బుధవారం తెలతెలవారే వేళ మరోసారి తుపాకులు పేలాయి. రెండురోజులు వరసగా జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ పరిస్థితులతో మన్యంలోని పల్లెగడపల్లో భయాందోళన నెలకొంది.

ఆసుపత్రిలో మార్చురీ వద్ద సాయుధ బలగాల పహారా

మళ్లీ తుపాకుల గర్జన

మరో ఎన్‌కౌంటర్‌తో మన్యంలో భయాందోళన

ప్రకృతి ఒడిలో రక్తపుటేరులు

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, మారేడుమిల్లి, రంపచోడవరం, చింతూరు, దేవీపట్నం

ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్‌తో పెరిగిన నిర్బంధాలు, ఆంక్షల నేపథ్యంలో మావోయిస్టులు తమ మనుగడ కాపాడుకునేందుకు షెల్టర్ జోన్లను వెతుక్కుంటూ వెళ్లారు. వీరిలో కొందరు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతానికి వచ్చారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఇక్కడి అటవీ ప్రాంతంలో అణువణువు జల్లెడ పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాలు వరసగా పోలీసు బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. నెల్లూరు సమీపంలో మంగళవారం ఉదయం మావోయిస్టు అగ్రనేత హిడ్మా సహా ఆరుగురు మరణించగా... బుధవారం గుజ్జుమామిడివలస వద్ద మరో ఏడుగురు మృత్యువాత పడ్డారు. వీరి మృతదేహాలను సాయుధ బలగాలు మూడు కి.మీ. దూరంలో ఉన్న రోడ్డు పాయింట్ వరకు మోసుకొచ్చి.. అక్కడి నుంచి వ్యానులో రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. రంపచోడవరం ఆసుపత్రి శవాగారం వద్ద సీఐ గోపీ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యంత్రాంగమంతా ఇక్కడే.. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు రోజుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. వారి మృతదేహాలను రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకురావడంతో.. యంత్రాంగమంతా ఇక్కడే ఉండిపోయింది. పంచనామా నిమిత్తం వచ్చిన ఏజెన్సీలోని ఏడు మండలాలకు చెందిన తహసీల్దార్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, మహిళా పోలీసులతో ఆసుపత్రి రద్దీగా మారింది. మృతులతోపాటు వారి బంధువుల వివరాల నమోదులో సిబ్బంది నిమగ్నమయ్యారు. జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కాకినాడ, రాజమహేంద్రవరం జనరల్ ఆసుపత్రుల నుంచి ఫోరెన్సిక్ నిపుణులు ఉమామహేశ్వరరావు, రమేష్, ఉత్తమ్, ప్రశాంత్, వీరభద్రరావు రంపచోడవరం ఆసుపత్రికి వచ్చారు. బుధవారం రాత్రి చీకటి పడేవరకు అధికార యంత్రాంగమంతా ఆసుపత్రి వద్దే ఉంది.

రంపచోడవరం ఆసుపత్రికి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు

జిల్లావ్యాప్తంగా హైఅలర్ట్

వరస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా హైఅలర్ట్ కొనసాగుతోంది. దండకారణ్యాన్ని వీడి మైదాన ప్రాంతాలకు చేరిన మావోయిస్టులే లక్ష్యంగా సాయుధ బలగాలు కూంబింగ్ చేస్తున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి మరికొంత మంది మావోయిస్టులు పారిపోయారన్న సమాచారంతో అడవిని జల్లెడ పడుతున్నారు. ఏఓబీలోనూ పోలీసులు నిఘా పెంచారు. ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఏజెన్సీలో వారపు సంతలపైనా నిఘా పెట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు గ్రామాల్లోనూ నిఘా పెంచి బలగాలను మోహరించారు.

జీఎం వలస నుంచి మావోయిస్టుల మృతదేహాలు తరలిస్తున్న వ్యాను


ఎదురుకాల్పులు జరిగిన అటవీ ప్రాంతం

ఏఓబీలో మావోలకు ఎదురుదెబ్బ!

సీలేరు, న్యూస్‌టుడే: మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టు పార్టీకి షెల్టర్ జోన్‌గా ఉన్న ఆంధ్రా, ఒడిశా సరిహద్దు (ఏఓబీ)పై ప్రస్తుతం మావోయిస్టులు పట్టు కోల్పోయినట్టయిందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు ఏఓబీ ఇన్‌ఛార్జులు మృత్యువాత పడటంతో పార్టీకి కోలుకోలేని దెబ్బగా పేర్కొంటున్నారు.

- మావోయిస్టులు తమ కదలికలు, దాడులకు వ్యూహాలు రచించడానికి ఏఓబీలోని అటవీ ప్రాంతాన్ని వినియోగించుకునేవారు. శిక్షణ శిబిరాల నిర్వహణ, ఆయుధాల తయారీ ఇక్కడ చేసేవారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పార్టీ చాలా బలంగా ఉండేది. 2016 అక్టోబర్‌లో ఒడిశాలో రామ్‌గుడా వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌తో వారి హవా తగ్గింది. ఈ ఎదురుకాల్పుల్లో 31 మంది మృతి చెందారు. వీరిలో కీలక నాయకులూ ఉన్నారు.

- 2018 సెప్టెంబర్‌లో జిల్లాలో అప్పటి అరకులోయ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను కడతేర్చి ఏఓబీలో వారి ఉనికి బలంగానే ఉందని చాటారు. ఇదే సమయంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఒడిశాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పోలీసు అవుట్ పోస్టులను ఏర్పాటు చేశారు. దీంతో నెమ్మదిగా ఏఓబీలో మావోయిస్టుల దూకుడుకు కళ్లెం పడింది.

- గాజర్ల రవి అలియాస్ ఉదయ్, చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, అరుణక్క, జోగారావు అలియాస్ టెక్ శంకర్, కాకూరి పండన్న అలియాస్ జగన్ నేతృత్వంలో ఏఓబీలో కార్యకలాపాలు నడిచేవి. ఈ క్రమంలో గాజర్ల రవి అలియాస్ ఉదయ్, చలపతి, అరుణక్క, కాకూరి పండన్నలు ఈ ఏడాది ఏప్రిల్, జూన్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. అప్పటివరకూ ఏఓబీ ప్రత్యేక జోనల్ కమిటీ ఇన్‌ఛార్జిగా ఉన్న ఉదయ్ మృతితో ఈ బాధ్యతలను పార్టీ జోగారావు అలియాస్ టెక్ శంకర్‌కు అప్పగించింది. ఎదురుకాల్పుల్లో బుధవారం ఆయనా మృతి చెందడంతో ఏఓబీలో పార్టీ భవిష్యత్తు ప్రమాదంలో పడింది.

కూంబింగ్‌కు వెళ్లొచ్చిన బలగాలు

గంజాయి కారణమా?

సువిశాలమైన ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో చీమ చిటుక్కుమన్నా మావోయిస్టు పార్టీకి తెలిసేలా గతంలో నెట్‌వర్క్ ఉండేది. కొత్త వ్యక్తులు ప్రవేశించినా, పోలీసులు గాలింపులకు వచ్చినా వారికి వెంటనే సమాచారం అందేది. దీని ఆధారంగా బలగాలపై దాడులకు దిగేవారు. దీంతో పెద్దఎత్తున పోలీసులకు నష్టం వాటిల్లింది.

✦ ఈ క్రమంలో గిరిజనులు, మావోయిస్టుల మధ్య గంజాయి దూరం పెట్టింది. ఏఓబీలోని వేలాది ఎకరాల్లో ఈ పంట సాగయ్యేది. గంజాయి సాగు ప్రోత్సహించడానికి బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులతో తమ కదలికలకు ముప్పు వాటిల్లుతుందనే అనుమానంతో మావోయిస్టులు బయట వ్యక్తుల రాకను నిషేధించారు. ఈ మేరకు గిరిజనులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు, గిరిజనులకు మధ్య దూరం పెరిగింది.

✦ ఇదే అవకాశంగా తీసుకున్న పోలీసులు గిరి గ్రామాల్లో పర్యటిస్తూ.. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో క్రమేణా వారు ఛత్తీస్‌గఢ్ బాట పట్టారు. మావోయిస్టులు లొంగిపోవడం, ఎదురుకాల్పుల్లో మృతిచెందడంతో ఏఓబీలో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీనపడింది.

క్షణక్షణం.. ఉత్కంఠ

రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి 42 మంది మావోయిస్టులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం వద్ద బుధవారం రాత్రి క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. భారీ సంఖ్యలో మావోయిస్టులను ఇక్కడకు తరలించడంతో పోలీసు, జైళ్లశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వివిధ జిల్లాల్లో కోర్టులు రిమాండ్ విధించిన మావోయిస్టులను నగరంలోని కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. కాకినాడ జిల్లా నుంచి ఇద్దరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఒకరు, ఏలూరు జిల్లా నుంచి 15 మందిని రాత్రి 8.30 గంటల్లోపు జైలుకు తరలించారు. విజయవాడ నుంచి 24 మందిని రెండు ప్రత్యేక బస్సుల్లో 10.30 గంటల సమయంలో లోపలికి తరలించారు. మొత్తం 42 మందిలో 15 మంది పురుషులు, 27 మహిళలు ఉన్నారు. మహిళా మావోయిస్టులను ప్రత్యేక కారాగారానికి తరలించారు. సాధారణ ఖైదీలతో కలవకుండా ప్రత్యేకంగా వీరిని ఉంచారు. ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు జైలు వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బస్సును కేంద్ర కారాగారంలోకి పంపుతున్న పోలీసులు

పర్యాటకం డీలా

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పర్యాటకంగా మారేడుమిల్లికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. రెండు రోజుల్లో వరస ఎన్‌కౌంటర్ల ప్రభావం పర్యాటక ప్రాంతాలపై పడింది. మారేడుమిల్లి రహదారితోపాటు సందర్శనీయ ప్రదేశాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇజ్జలూరు, గుజ్జుమామిడివలస అటవీ ప్రాంతాల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పుల ఘటనల్లో హిడ్మాతోపాటు 13 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే. రెండు రోజులుగా మారేడుమిల్లి నిశ్శబ్దంగా మారిపోయింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే చోట భీతావహ వాతావరణం నెలకొనడంతో పర్యాటక ప్రాంత సందర్శకులు వచ్చే వారాంతం తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. ఇక్కడకు వచ్చే వారాంతం ముందుగానే రిసార్టుల్లో గదులు, లోకల్‌గా పర్యటించేందుకు వాహనాలను బుక్ చేసుకుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో వారంతా బుకింగ్స్‌ను రద్దు చేసుకుంటున్నారని రిసార్ట్ సిబ్బంది చెబుతున్నారు. వరస ఎన్‌కౌంటర్ల ప్రభావం మారేడుమిల్లి పర్యాటకంపై కొంతకాలం కొనసాగే ఆస్కారముంది.

బోసిపోయిన వనవిహారి

● దీపం.. దేదీప్యమానం!

కార్తిక మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం పాడేరు ఉమానీలంఠేశ్వరస్వామి సన్నిధిలో 108 మట్టి శివలింగాల అలంకరణ, దీపారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.
– పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

హమ్మయ్య.. బీఎన్ రోడ్డు పనులు మొదలు

చోడవరం, న్యూస్‌టుడే: వాహనదారులకు నరకం చూపిస్తున్న భీమిలి-నర్సీపట్నం రోడ్డును అభివృద్ధి చేసే పనులకు గుత్తేదారుడు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. చోడవరం అటవీశాఖ కార్యాలయం నుంచి వెంకన్నపాలెం వరకు ఉన్న భాగంలో రహదారి మార్జిన్ విస్తరిస్తున్నారు. ప్రస్తుతం 5.5 మీటర్ల మేర రహదారి వెడల్పు ఉన్న దీన్ని 7.5 మీటర్లకు పెంచుతారు. దీంతో రుద్దుకు ఇరువైపులా మీటరు మేర పెరగనుంది. ఈ పనులు పూర్తికాగానే తారువేసి రహదారిని అభివృద్ధి చేస్తామని ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మేజరు పంచాయతీలైన గోవాడ, చోడవరం ఊరి మధ్యలో రహదారి మార్జినను వెడల్పు చేసే కార్యక్రమం ఉండదన్నారు. ఎన్‌డీబీ నిధులతో ఈ పనులు జరగనున్నాయి. ★ బి-ఎన్ రహదారి మార్జిన్ వెడల్పు, తారు వేసే కార్యక్రమం 6.3 కి.మీ. మేర చేపట్టాలి. కాని 4.5 కి.మీ మేరకు కుదించారు. ప్రస్తుతం గౌరీపట్నం కూడలి నుంచి విజయరామరాజు పేటతోపాటు గోవాడలోనూ పనులు చేపట్టరు. ఈ రెండు చోట్లా (గౌరీపట్నం నుంచి పేట, గోవాడ బిట్‌లను) రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం.

రహదారి మార్జిన్ విస్తరణ పనులు చేస్తున్న పొక్లెయిన్

దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలోని ఆర్ఐటీఐలో స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఉమాశంకర్ తెలిపారు. ఫీల్డ్ కంప్యూటర్స్ క్లౌడ్ కంప్యూటింగ్‌లో మూడు నెలలపాటు శిక్షణ అందించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులు డిసెంబరు 1లోగా తమ దరఖాస్తులను ఆర్ఐటీఐ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

1,44,222 మందికి అన్నదాత సుఖీభవ

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాను సేంద్రియ జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. పాడేరు కాఫీ హౌస్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన పథక ప్రారంభోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 1,44,222 మంది గిరిజన రైతులకు రూ. 7 వేల చొప్పున జమ చేసినట్లు పేర్కొన్నారు. నగదు జమ కానివారు టోల్‌ఫ్రీ నంబర్ 155251కు తెలియజేయాలని సూచించారు. ఈశ్వరి, శ్రావణ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మంగతల్లి మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ నంద్, లగిశపల్లి సర్పంచి పార్వతమ్మ, పాడేరు ఎంపీపీ రత్నకుమారి పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జీసీసీ ఛైర్మన్ శ్రావన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి తదితరులు

మనసు పెట్టారు.. నీరు నిలబెట్టారు

కూనవరం, న్యూస్‌టుడే: నీటి నిల్వ కోసం కర్షకులు నానా పాట్లు పడుతుంటారు. కూనవరం మండలం జగ్గవరానికి చెందిన కారం హరనాథ్ లంక పొగాకు సాగుచేస్తున్నారు. పంటకు తడి పెట్టాలంటే రూ.వేలు ఖర్చు అవుతాయన్న భయంతో మనసు పెట్టి ఆలోచించారు. తక్కువ ఖర్చుతో తోటలోకి నీటిని ఎలా తీసుకురావాలని ఆలోచన చేశారు. ఇటీవల గోదావరి వరదలకు ప్రభుత్వం అందించిన పెద్ద టార్పాలిన్‌ను నీటి ట్యాంకులా అమర్చాలని నిర్ణయించుకున్నారు. వెంటనే తన తోటలోని కొద్ది భాగంలో నీటి ట్యాంకు ఆకారంలో కర్రలు కట్టి అందులో టార్పాలిన్‌ను రెండు మడతలుగా అమర్చారు. సమీపంలోని చెరువు వద్ద ఓ ఆయిల్ ఇంజిన్ పెట్టుకుని నీటిని తోటలోని టార్పాలిన్ వద్దకు చేర్చారు. ఇలా తోటలో రెండు ప్రాంతాల్లో ట్యాంకులను ఏర్పాటు చేసుకుని వాటి నిండా నీరు పట్టిన తరువాత ఇంజిన్ ఆపి వేసి పంటకు నీరు అందిస్తున్నారు. ఒక్కో ట్యాంకులో సుమారు 20 పీపాల నీరు పడుతుంది. దీంతో ఖర్చు బాగా తగ్గి పంటకు నీరు అందుతోందని రైతు హరనాథ్ చెప్పారు. ఇదే నీటిని చేనులో నిల్వ చేయాలంటే పెద్దగొయ్యి తీయాలి. అందుకు రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. ఆయన చేసిన ఈ పని కేవలం రెక్కల కష్టంతో తీరింది.

టార్పాలిన్‌ను ట్యాంకులా అమర్చి నీటి నిల్వ

వన్నాడ గ్రామస్థుల చొరవ అభినందనీయం

పెదబయలు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమంతో సమాజానికి ఎంతో మేలు జరుగుతోందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. గోమంగి పంచాయతీ వన్నాడ గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ ప్రజల భాగస్వామ్యంతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించి గ్రామస్థులని అభినందించారు. ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ చొరవతో గ్రామంలో ప్రతి ఒక్కరూ సహకరించి రూ. 4 లక్షలతో ఈ బడిని నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్థులు, విద్యార్థులతో ముచ్చటించారు. రహదారి, వీధి కాలువలు, తాగునీరు, అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, ఎంపీడీఓ శ్యాంసుందర్, తహసీల్దార్ త్రినాథరావు, ఇన్‌ఛార్జి ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్పజోసెఫ్, సహాయ గిరిజన సంక్షేమాధికారి జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్‌ని సన్మానిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

RAGHU COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi, Affiliated to Andhra University, VSP)
Dakamarri, Bheemili (M), Visakhapatnam - 531162, A.P
Ph. 08922-248014, 15 Email Id: raghucollegeofpharmacy@rediffmail.com
B.PHARMACY SPOT ADMISSIONS (CAT-A) AP EAPCET-2025
Candidates qualified in AP EAPCET-2025 and have not taken admission in any institution are eligible for Spot Admissions. If AP EAPCET-2025 qualified candidates are not available, the candidates having percentage of aggregate marks in qualifying examination or its equivalent as per the eligibility criteria by the Chairman/Convener, APSCHE, AP EAPCET-2025 (Admissions) will be considered.
The interested candidates may attend the Institutional Spot Admissions in our college on 20-11-2025 (Thursday) at 10.00 AM along with all original certificates and requisite fee.
The vacant seats will be filled as per the guidelines of Chairman/Convener, APSCHE, AP EAPCET-2025 Admissions and the admitted candidates are not eligible for tuition fee reimbursement.
For details Contact: 08922-248014,15
14-11-2025 Mob: 9177779084, 9490302033 Principal

కొట్టుకుపోయిన రక్షణ గోడలు

మూడు మండలాలకు ప్రధానమైన కించుమండలోని సంపంగిగెడ్డపై రూ. 4.4 కోట్లు ఖర్చుపెట్టి వంతెన నిర్మించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి దీన్ని ప్రారంభించారు. మొంథా తుపాను ప్రభావంతో వంతెనకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు కొట్టుకుపోయి.. ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గిరిజనులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

సంగింపగెడ్డలో కొట్టుకుపోయిన రక్షణ గోడ

కాఫీ రైతుకు కమ్మని కబురు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గిరిజన రైతుల సంక్షేమం నిమిత్తం కాఫీ గింజల సేకరణ ధరలు పెంచామని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) వైస్ ఛైర్మన్, ఎండీ కల్పనాకుమారి తెలిపారు. బుధవారం బీచ్‌రోడ్డులోని జీసీసీ ప్రధాన కార్యాలయంలో.. 2025-26 ఏడాదిలో కాఫీ కొనుగోలు ధరను నిర్ణయించేందుకు అపెక్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కల్పనా కుమారి మాట్లాడుతూ పెంచిన ధరలపై ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎవరూ ప్రకటించిన ధర కంటే తక్కువకు విక్రయించి నష్టపోవద్దన్నారు. జీసీసీ సిబ్బంది గిరిజన ప్రాంతాల్లోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి రైతుల నుంచి ఎలక్ట్రానిక్ కాటా ద్వారా కచ్చితమైన తూకంతో సేకరిస్తారన్నారు. అనంతరం 24గంటల్లో నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే 70130 70990 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శ్రీపూజ, బెంగళూరు కాఫీ బోర్డు ఆఫ్ ఇండియా ప్రతినిధి ప్రదీప్ బాబు, జీసీసీ జీఎం (కాఫీ) ఉమాదేవి, సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రకం(కేజీ)	ప్రస్తుతం	పెంచిన ధర (రూ.ల్లో)
అరబికా పార్చుమెంట్	400	450
అరబికా చెర్రీ	250	270
రొబస్టా చెర్రీ	160	170

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

సవాళ్లను అధిగమించి సమర్థవంతంగా జనగణన

నూతిబందలో సూచనలు చేస్తున్న కేంద్ర మంత్రిత్వశాఖ డిప్యూటీ జనరల్ శర్మ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి సమర్థవంతంగా జనగణన నిర్వహించేందుకు ప్రీ టెస్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కేంద్ర మంత్రిత్వ వ్యవహారాల శాఖ డిప్యూటీ జనరల్ (మ్యాప్) వి.వి.ఎల్.ఎన్.శర్మ అన్నారు. గూడెంకొత్తవీధి మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. నూతిబంద గ్రామంలో జనగణన ప్రీ టెస్ట్ నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జనగణన, మ్యాపుల సవరణ చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముందస్తుగా పైలట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రంలో నాలుగు మండలాలను ఎంపిక చేశామన్నారు. అందులో గూడెంకొత్తవీధి ఒక్కటని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితుల్లో సమర్థవంతంగా సర్వే చేపట్టేందుకు అవసరమైన శిక్షణ ఇప్పటికే అందించామన్నారు. ఆర్‌డీఓ లోకేష్, సర్వే ఏడీ దేవేంద్రుడు, తహసీల్దార్ అన్నాజీరావు, వీఆర్‌ఓ కృష్ణారావు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

బలిమెల నిర్వహణపై సమీక్ష

సమీక్ష సమావేశంలో ఇరు రాష్ట్రాల అధికారులు

సీలేరు, న్యూస్‌టుడే: బలిమెల జలాశయం నిర్వహణ, నీటి వాడకంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు బుధవారం సీలేరు ఎస్ఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 79.66 టీఎంసీల నీరుండగా.. జోలాపుట్ జలాశయంలో 29.83 టీఎంసీలు నీరుందని, మొత్తం 109.49 టీఎంసీలు నీరుందని పేర్కొన్నారు. రాబోయే నెలలో సుమారు 6.50 టీఎంసీల వరకూ నీటినిల్వలు రెండు జలాశయాల్లోకి చేరే అవకాశముందని లెక్కగట్టారు. మొత్తం సుమారు 115.99 టీఎంసీల్లో ఒడిశా 46.75, ఏపీ జెన్‌కో 69.24 టీఎంసీలు వాడుకోవడానికి నిర్ణయించారు. అక్టోబర్ నెలలో ఏపీ 2.73 టీఎంసీలు, ఒడిశా 9.35 టీఎంసీలు వాడుకున్నట్లు లెక్కలు తేల్చారు. ప్రస్తుతానికి గ్రిడ్ డిమాండ్, విద్యుత్తు అవసరాల నిమిత్తం ఒడిశా 2500 క్యూసెక్కులు, ఏపీ 3700 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి వాడుకోవడానికి నిర్ణయించారు. ఒడిశా జలవనరులశాఖ నుంచి ముఖ్యనిర్మాణ ఇంజినీరు సిబాప్రసాద్ పాణిగ్రహి, పర్యవేక్షక ఇంజినీర్ రామకంత పాత్రో, ఏఈఈ గదాదర్ ప్రధాన్, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ తరఫున డిప్యూటీ మేనేజర్ బెహరా, అసిస్టెంట్ మేనేజర్ సుబదీప్ పండా, ఏపీపీ జెన్ తరఫున ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈ చింతాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకంలో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | Digital Partner: ఈనాడు.net, ETV Bharat | Organised by: ఈనాడు

ఈనాడు - హైదరాబాద్

కళాశాల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్‌లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన.. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్ క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా నిర్వాహకులకు చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్లు, వికెట్ కీపర్ ఉపయోగించే హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అబ్‌డామినల్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా: ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీస్, రత్నమాల రెసిడెన్సీ, డోర్ నెం.45-40-42, 3వ అంతస్తు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, విశాఖపట్నం-530016.

వివరాలకు: 9618775577

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

120 కేజీల గంజాయి పట్టివేత

చింతూరు, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి తవుడు బస్తాల్లో తరలిస్తున్న 120 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చింతూరు మండలం మోటు కూడలిలో బుధవారం తనిఖీలు చేస్తూ కారులో పరిశీలించగా గంజాయి లభ్యమైందని ఎస్సై రమేశ్ చెప్పారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులు మల్కనగిరి జిల్లా బిశ్వజిత్ మండల్, సుదీప్ హల్దార్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు.

నిందితులతో పోలీసులు

ఫోర్‌బే కెనాల్‌లో యువకుడి గల్లంతు

జగదీశ్వరరావు (పాత చిత్రం)

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు ఫోర్‌బే పవర్ కెనాల్‌లో బుధవారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు విహార యాత్రకు మోతుగూడెం వచ్చారు. వారిలో ముగ్గురు యువకులు ఈతకొట్టేందుకు కెనాల్‌లో దిగారు. ప్రవాహ వేగానికి గనిశెట్టి జగదీశ్వరరావు కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై సాధిక్ సిబ్బందితో అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు.

మూర్ఛతో బాలిక మృతి

జనని మృతదేహం

చింతూరు, న్యూస్‌టుడే: ఆడుకుంటూ మూర్ఛతో పడిపోయిన బాలిక (5) ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందిన ఘటన చింతూరు మండలం కుయిగూరులో బుధవారం చోటుచేసుకుంది. పెదసీతనపల్లి గ్రామానికి చెందిన శ్యామల రమాదేవి, మారయ్య దంపతుల కుమార్తె జనని. అమ్మమ్మ ఊరైన కుయిగూరులో ఉంటోంది. ఉదయం ఇంటి వద్ద భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిలో రేగు పండ్లు తింటూ ఆడుకుంటుండగా మూర్ఛతో పడిపోయింది. అంగన్‌వాడీ కార్యకర్త ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చింతూరు ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

గ్రంథాలయంలో పాటల పోటీలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రంథాలయ అధికారిణి సునీత ఆధ్వర్యాన బుధవారం పాటల పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు దేశభక్తి పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు కమలాకర్, దివాకర్, ఉపాధ్యాయిని సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ అందిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. వాసవ్య మహిళా మండలి, ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గిరిజన ఉద్యోగభవనంలో ఎంపిక చేసిన 15 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు శిక్షణ, ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ముగింపు రోజున మిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. ఎంఈవో బోడంనాయుడు, ఉషా కోఆర్డినేటర్ కూన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సామాజిక స్పృహ కలిగి.. బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులను చైతన్యపరచాలని చెప్పారు. ఎస్సై పాపినాయుడు, ప్రిన్సిపల్ వెంకటస్వామినాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ హిమగిరి

వృద్ధుల బాధ్యత పిల్లలదే

రంపచోడవరం: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉందని రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం.మురళీ గంగాధరరావు అన్నారు. రంపచోడవరం కోర్టు ఆవరణలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. యోగక్షేమాలు పట్టించుకోకుండా వృద్ధాశ్రమంలో వదిలేస్తే.. తల్లిదండ్రులు కేసు వేయవచ్చని సూచించారు. న్యాయవాదులు భగవాన్, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, వీరబాబు పాల్గొన్నారు.

7న ఆదివాసీ ఉపాధ్యాయ మహాసభ

కూనవరం, న్యూస్‌టుడే: ఆదివాసీ ఉపాధ్యాయ రాష్ట్ర మహాసభ డిసెంబరు 7న పాడేరులో జరగనుంది. ఈ నేపథ్యంలో టేకులబోరులో సంఘ జిల్లా అధ్యక్షుడు సరియం అనిల్‌కుమార్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఉద్యోగ నియామకాలపై మహాసభలో చర్చ జరుగుతుందన్నారు. వీరయ్య, వెంకట్రావ్, భవాని, జితేంద్ర పాల్గొన్నారు.

శిశు మరణాల నియంత్రణకు చర్యలు

రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్

పెదబయలు, న్యూస్‌టుడే: న్యుమోనియోతో శిశు మరణాలను తగ్గించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) కృష్ణమూర్తినాయక్ అన్నారు. పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రోగులతోపాటు ప్రసూతి, చిన్నపిల్లల వార్డులని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి న్యుమోనియో అధికంగా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి సత్యశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రంపచోడవరంలో విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో ఈ నెల 18న జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. కబడ్డీ అండర్-17 విభాగంలో పి.జాన్‌డేవిడ్‌రాజ్, 200, 100 మీటర్ల పరుగులో కె.శశిధర్‌దొర, 200 మీటర్ల పరుగులో కె.కార్తీక్‌రెడ్డి, 400 మీటర్ల పరుగులో ఎన్.అజిత్‌కుమార్, ఖోఖో అండర్-14 విభాగంలో ఎ.భూపతిరెడ్డి, కె.సురేశ్, భరద్వాజ్‌సాయితేజ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు. ప్రిన్సిపల్ అహ్మద్‌ఆలీషా, పీడీ ప్రసాద్‌రాజు, పీఈటీలు వీరిని అభినందించారు.

రాజవొమ్మంగి: బోర్నగూడెం బాలుర ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థి టి.దుర్గాప్రసాద్ అండర్-14 వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు తెలిపారు. పీడీ ధర్మరాజు, ఉపాధ్యాయులు కృష్ణ, వరప్రసాద్ అభినందించారు.

నర్సింహపురంలో..

చింతూరు: నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నర్సింహపురం బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-14 విభాగంలో పద్దం ప్రవీణ్, ఖోఖో అండర్-17 విభాగంలో కట్టం వెంకటేశ్ ఎంపికైన వారిలో ఉన్నారు. ఏడుగురాళ్లపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి అండర్-14 విభాగంలో వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

జీకేవీధిలో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుధాకర్

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని గూడెంకొత్తవీధి సీఐ సుధాకర్ సూచించారు. జీకేవీధిలో బుధవారం ఆటోలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులు ఉండటాన్ని చూసి ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చడమే డ్రైవర్ల ప్రధాన లక్ష్యమన్నారు.

క్రీడలతో ఉన్నత అవకాశాలు

అరకులోయ, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణిస్తే ఉన్నత అవకాశాలు ఉంటాయని ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర అన్నారు. అరకులోయ గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాలలో 'అస్మిత ఖేలో ఇండియా' వెయిట్‌లిఫ్టింగ్ జిల్లాస్థాయి పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గిరి క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరి యువతలో మంచి నైపుణ్యాలున్నాయన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మి, వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాము, తెదేపా నాయకులు మహదేవ్, బాబూరావు, చందు, ఆనందరావు, ప్రిన్సిపల్ పీఎస్ఎన్ మూర్తి, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ఉపకరణాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ కార్యదర్శి జిస్బిర్‌సింగ్

పాడేరు, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శి జిస్బిర్ సింగ్ బుధవారం పాడేరు జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో 'ది ఎబిలిటీ పీపుల్ సంస్థ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ఆసుపత్రిలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకురాలు హేమలత, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరామ్ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో సాగితే విజయం

జ్ఞాపికలతో ఉద్యోగులు, నిర్వాహకులు, అధికారులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో ప్రణాళికతో ముందుకుసాగితే విజేతలుగా నిలుస్తారని ఏఎస్‌డీఎస్ డైరెక్టర్ గాంధీబాబు, తహసీల్దారు సరస్వతి విద్యార్థులకు సూచించారు. సంస్థ కార్యాలయంలో బుధవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత లక్ష్యాలపై దృష్టిసారించాలన్నారు. విలీన మండలాల నుంచి వచ్చిన విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు జ్ఞాపికలు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు రంగారెడ్డి, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎస్సై సంతోశ్‌కుమార్, తెదేపా నాయకులు నరేశ్, రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఉక్కు మహిళ అని కొనియాడారు. నాయకులు కిల్లో చిరంజీవి, మొట్టడం బాలరాజు, గెమ్మెలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిన్నస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పంచవర్ష ప్రణాళికలు, పరిశ్రమలతో దేశప్రజల ఉన్నతికి కృషిచేశారన్నారు. యూత్ కాంగ్రెస్ అరకు పార్లమెంట్ అధ్యక్షులు ప్రేంకుమార్, భగత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల, చింతూరు, న్యూస్‌టుడే: అడ్డతీగల గాంధీ బొమ్మ కూడలిలో పీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు అధ్యక్షతన ఇందిరాగాంధీ జయంతి వేడుక జరిగింది. నాయకులు మద్దేటి అంజిరెడ్డి, ఎం.భాస్కర్, రమణ, టి.కృష్ణ తదితరులు నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీలాట, విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. చింతూరులో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టె పంపిణీ చేశారు. అహ్మద్ ఆలీ, కృష్ణమూర్తి, లక్బర్, కన్నారావు, జోహార్, ప్రసాద్ పాల్గొన్నారు.

చింతపల్లిలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దళారులకు విక్రయించి మోసపోవద్దు

రాజవొమ్మంగిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కేశవ్

రాజవొమ్మంగి, ఎటపాక, చింతూరు, న్యూస్‌టుడే: ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని రాజవొమ్మంగి పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పన కేశవ్ రైతులకు సూచించారు. స్థానిక పీఏసీఎస్ వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాజవొమ్మంగి, జడ్డంగి, శరభవరం, దూసరపాము, కొమరాపురం, లబ్బర్తిలోని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని ఏవో చక్రధర్ చెప్పారు. నాయకులు సావిత్రి, త్రిమూర్తులు పాల్గొన్నారు. ఎటపాక మండలం త్రిపురపెంటవీడు రైతు సేవా కేంద్రంలో సొసైటీ తరఫున ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటైంది. ఎటపాక పీఏసీఎస్ అధ్యక్షుడు మాచినేని రాజేష్, సర్పంచి మోసం రాజులు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కూటమి నాయకులు పుల్లయ్య, గంగాధర్, చందు, ఏవో దుర్గారమేష్, వీఏఏ రమేష్, రైతులు పాల్గొన్నారు. చింతూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ అమల ప్రారంభించారు. ఏవో రత్నప్రభ మాట్లాడుతూ.. చదలవాడ, ఏడుగురాళ్లపల్లి, చింతూరు, ఏజికొడేరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చిట్టిబాబు, సాల్మన్‌రాజు, లక్ష్మణ్, చంద్రయ్య, ప్రసన్న పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించండి

రైతులతో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఏడీ కిషోర్

పెదబయలు: గోమంగి పంచాయతీ కమ్మరి వీధిలో బుధవారం పశుసంవర్ధకశాఖ ఏడీ కిషోర్ పర్యటించారు. రైతులతో మాట్లాడారు. పశువుల్లో కృత్రిమ గర్భధారణ, పాల ఉత్పత్తి పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. ఎంపీవీసీ కుమారి, సహాయాధికారి బుచ్చిరాజు పాల్గొన్నారు.

24 అమరవీరుల సంస్మరణ సభ

చింతూరు, న్యూస్‌టుడే: ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 24న చింతూరులో అమరవీరుల సంస్మరణ సభ జరగనుంది. చింతూరులో బుధవారం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. దుర్గారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

ఎటపాక, న్యూస్‌టుడే: గౌరిదేవిపేట జడ్పీ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ

మోతుగూడెం, న్యూస్‌టుడే: డొంకరాయిలో ఉపాధి హామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు బుధవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి సంధ్యారాణి అధ్యక్షత వహించారు. గ్రామ సభ దృష్టికి వచ్చిన అంశాలను ఏపీవో స్వామి నమోదు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, వార్డు సభ్యులు సత్యనారాయణ, బొజ్జమ్మ, కార్యదర్శి రఘునాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ

అన్నవరం వాగుపై రాకపోకలు ప్రారంభం

వరరామచంద్రాపురం: వరదలకు కొట్టుకుపోయిన అన్నవరం వాగుపై తాత్కాలిక రహదారి నిర్మాణంతో బుధవారం వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. మారుమూల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి, రేఖపల్లి వైద్యశాలకు వచ్చేందుకు ఇబ్బందులు తొలగాయి. అధికారులు వారం రోజులుగా చేస్తున్న పనులు చివరి దశకు చేరడంతో వాగు మీదుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలకు పచ్చజెండా ఊపారు.

తాత్కాలిక రహదారి మీదుగా వెళ్తున్న వాహనాలు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు వెలుగు కార్యాలయం ఆవరణలో తాగునీటి బోరు మూలకు చేరింది. దీని చుట్టూ మొక్కలు పెరిగి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. – రామచంద్రుడు, స్థానికుడు

✓: బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తాం. – రాజేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ముంచంగిపుట్టు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం తుప్పల మధ్య దర్శనం ఇస్తోంది. కార్యాలయం చుట్టూ పొదలు పెరిగిపోయాయి. – రాజు, చింతపల్లి

✓: తుప్పలను తొలగిస్తాం. – బాలకిషోర్, మండల ఇంజినీరింగ్ అధికారి చింతపల్లి

మన్యంలో మంచు వర్షం

పాడేరు, ముంచంగిపుట్టు, పెదబయలు, న్యూస్‌టుడే: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. సాయంత్రం ఐదు గంటల నుంచి వీస్తున్న చలిగాలులకు మన్యంవాసులు వణుకుతున్నారు. ముంచంగిపుట్టు, కిలగాడ, కరిముఖిపుట్టు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెదబయలులో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, విద్యార్థులు చలి మంటలతో ఉపశమనం పొందారు.

కిలగాడ ఘాట్‌రోడ్డులో కమ్ముకున్న పొగమంచు

సొంతింటి కల నెరవేరేనా?

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. నిర్మాణాలు చేపట్టిన గిరిజనులకు బిల్లులు మంజూరుకాక నిరాశకు గురవుతున్నారు. ఉన్న ఇంటిని తొలగించి పాకల్లో తలదాచుకుని.. కొత్త ఇంటి నిర్మాణం చేపట్టిన పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీవీటీజీ గిరిజనులకు ప్రధానమంత్రి జన జాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎంజన్‌మన్) పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ముంచంగిపుట్టు మండలంలోని 23 పంచాయతీల్లో పేదలకు 4731 ఇళ్లు కేటాయించారు. వాటిలో 4405 ఇళ్ల నిర్మాణానికి గృహనిర్మాణశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. లబ్ధిదారులు మొదటి విడతగా పునాదులు నిర్మించేందుకు రూ.70 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పునాదులు, లింటల్ స్థాయి వరకు పూర్తి చేస్తే రూ.90 వేలు, పైకప్పు నిర్మాణం పూర్తయితే రూ.40 వేలు చెల్లించాల్సి ఉంది. మరో రూ.27 వేలను గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెల్లించాల్సి ఉంది. వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటే లబ్ధిదారులకు మరో రూ.12 వేలు మంజూరు చేస్తారు.

బిల్లులు చెల్లించక లబ్ధిదారుల పాట్లు

రూ.3 కోట్ల బకాయిలు

బాబుసాల, బంగారుమెట్ట, బరడ, కుమడ, రంగబయలు, వనుగుమ్మ, మాకవరం తదితర పంచాయతీల్లో గిరిజనులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 23 పంచాయతీల్లో 300కు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. మొత్తం 4405 ఇళ్లకు సంబంధించి సుమారు రూ.3 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. రూఫ్ లెవెల్ వరకు 2448 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించలేదు. ఆర్థిక స్తోమత లేక అప్పుచేసి నిర్మాణాలు చేపడుతున్నామని.. బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మూడేళ్ల క్రితం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు సైతం బిల్లులు విడుదలకాలేదు. ముంచంగిపుట్టు మండలంలో 536 కుటుంబాలకు పీఎంఏవై కింద ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 108 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయగా.. మిగతావి వివిధ దశల్లో నిలిచిపోయాయి. వాటికి రూ.18 లక్షల మేర బకాయిలు విడుదల కాలేదు.

చిప్పాపుట్టులో అసంపూర్తిగా ఇల్లు

ఉన్నతాధికారులకు తెలియజేశాం

పీఎం జన్‌మన్, పీఎంఏవై కింద పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు పరిశీలించాం. వివిధ దశల్లో పనులు పూర్తి చేసినవారికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతాయి. నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. లబ్ధిదారులు నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి. – సీహెచ్ కృష్ణారావు, ఏఈ, గృహనిర్మాణశాఖ, ముంచంగిపుట్టు

ఏఓబీలో పోలీసుల అప్రమత్తం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోవడంతోపాటు రాష్ట్రంలో మరో 50 మంది మావోయిస్టులు పట్టుబడటంతో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి మావోయిస్టులు సరిహద్దు ప్రాంతానికి వచ్చారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమై గాలింపు ముమ్మరం చేశారు. జి.మాడుగుల సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ముంచంగిపుట్టు ఎస్సై రామకృష్ణ ప్రధాన కూడళ్ల వద్ద బుధవారం తనిఖీలు చేపట్టారు. కొత్తూరు, కిలగాడ, కుజబంగి కూడళ్ల వద్ద నిఘా పెట్టారు. కొత్తూరు కూడలి వద్ద వాహనాలు నిలిపి చోదకుల వివరాలు సేకరించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

కొత్తూరు కూడలి వద్ద పోలీసుల తనిఖీలు

పవన్ సారూ...రోడ్డు బాగు చేయరూ.!

రోడ్డు బాగు చేయాలని కోరుతున్న గిరిజనులు

ఉప ముఖ్యమంత్రి పవన్ సారూ.. రోడ్డు బాగు చేసి తమ కష్టాలను తొలగించాలని అయిదు గ్రామాల గిరిజనులు వేడుకుంటున్నారు. జీకే వీధి తీముబంద, కుంకంపూడి, చీపురుగొంది, ఎర్రగెడ్డ, వాడమామిడి, అగ్రహారంతోపాటు సుమారు 12 గ్రామాలకు ఆధారంగా ఉన్న తీములబంద అగ్రహారం రోడ్డు ధ్వంసమైందన్నారు. అంబులెన్స్ సైతం రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని జనసేన పార్టీ నాయకులు గుంట కోటి, గెమ్మెలి నర్సింగరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. – గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

అంగన్‌వాడీలో అపాయం

ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు స్లాబు కుంగిపోయింది. కిటికీలు, తలుపులు పోయాయి. గోడలు బీటలువారి ఏ క్షణంలో కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. స్లాబు ఇనుపచువ్వలు బయటకు వచ్చాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కార్యకర్త తన ఇంటి బయట ఉంచి పోషకాహారం అందిస్తున్నారు. పాత భవనం తొలగించి కొత్తది నిర్మించాలి గ్రామస్థులు కోరుతున్నారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

పెచ్చులూడుతున్న స్లాబు

సచివాలయం ప్రారంభమెప్పుడు?

మారుమూల బలపం పంచాయతీ కోరుకొండ గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని గిరిజనులు కోరుతున్నారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన దీన్ని ఇంతవరకు అందుబాటులోకి తీసుకురాలేదు. తాత్కాలిక భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. పనులు పూర్తయిన నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చింతపల్లి గ్రామీణం

పూర్తయిన బలపం సచివాలయం

పైకప్పు లేని విశ్రాంతి భవనం

పెదబయలు మండలం గలగండలో రహదారికిరువైపులా రెండు ప్రయాణికుల విశ్రాంతి నిలయాలున్నాయి. ఒకదాని పైకప్పు పోయి నీడనివ్వలేని స్థితిలో ఉంది. మరోవైపు విశ్రాంతి భవనంలో వలసదారులు నివాసముంటున్నారు. రెండూ ప్రయాణికులకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెదబయలు

గలగండలో ఇలా..

శుభ్రతతో వ్యాధులు దూరం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని వెలుగు వీఓఏ కామేశ్వరరావు అన్నారు. సుజనకోట పంచాయతీలోని తలాబుతోట గ్రామంలో బుధవారం వరల్డ్ టాయిలెట్‌డేను నిర్వహించారు. సెర్ప్ సీఈఓ ఆదేశాల మేరకు మహిళలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. 14 గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు మద్దతివ్వండి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు మద్దతివ్వాలని జనసేన మండల అధ్యక్షుడు చిట్టం మురళీ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఐవీఆర్ ఫోన్ కాల్స్ వస్తే.. ఒకటి నొక్కి వారికి మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఇంకా ఎవరూ చేయరని, ఉన్నవారికి సహకరించాలన్నారు.

గిరిజనులకు వితరణ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి పంచాయతీ రాజుపాకలో మదర్ థెరిసా సేవా సంస్థ, బ్లడ్ డోనర్స్ క్లబ్ సహకారంతో విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు, దుస్తులు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు, ప్లేట్లు, బ్యాగులు అందించారు. సంస్థ ప్రతినిధి ప్రసాద్ పట్నాయక్.. గిరిజన గ్రామాల్లో సేవా కార్యక్రమాలకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, బగ్గాం జోగారావు, సోమెల నాగులు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రసాద్ పట్నాయక్

పొదుపు వివరాలు తెలుసుకునేందుకు యాప్

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: స్వయం సహాయక మహిళలు మన డబ్బులు- మన లెక్కలపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం కళావతి అన్నారు. జర్రెల పంచాయతీలోని దాసరిపుట్టు గ్రామంలో బుధవారం మహిళలకు అవగాహన కల్పిస్తు ర్యాలీ చేపట్టారు. మహిళలు వారి పొదుపు, అప్పుల వివరాలు సులభంగా తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ రూపొందించారని చెప్పారు. వీఏఓలు తౌడుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినందుకు గ్రామ బహిష్కరణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: క్వారీ పేలుళ్లతో నష్టపోతున్నామని అధికారులకు ఫిర్యాదు చేసినందుకు గ్రామం నుంచి బహిష్కరించారంటూ నరసాపురం పంచాయతీ దిరిసినపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీనుతో కలిసి బుధవారం ఐటీడీఏ ఏపీవో రమణ, సబ్‌కలెక్టరేట్‌లో వినతులు అందజేశారు. నల్లరాయి క్వారీ వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని ఈ నెల 17న ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గ్రామ పెద్దలంతా కలిసి ఫిర్యాదు చేసిన బల్లెం చిన్నాలు దొర కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో, అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ఎటపాక, న్యూస్‌టుడే: నల్లకుంటలో ఈ నెల 10న విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమైన ఘటనలో నిరాశ్రయులైన కుటుంబాలకు జేఏసీ ఆటో యూనియన్ సభ్యులు చేయూతనందించారు. బాధితులకు బుధవారం నిత్యావసర సరకులు అందజేశారు. యూనియన్ సభ్యులు సురేష్, రమేష్, పాపా, వెంకట్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అరకులోయ, న్యూస్‌టుడే: రైతులు అన్నదాత సుఖీభవ పథకాన్ని సద్వినియోగం చేసుకొని సాగులో ముందడుగు వేయాలని ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర అన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడత సొమ్ము విడుదల కార్యక్రమాన్ని బుధవారం అరకులోయ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రూ. 7 వేలు జమ చేస్తుందన్నారు. అరకులోయ నియోజకవర్గంలో 56,919 మంది రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేశామన్నారు. తెదేపా నాయకులు మహదేవ్, బొరిబొరి లక్ష్మి, శెట్టి బాబూరావు, తుడుం సుబ్బారావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో మాట్లాడుతున్న దొన్నుదొర

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా చింతపల్లి పట్టణ అధ్యక్షుడు రీమల ఆనంద్ తెలిపారు. చిన్నగెడ్డ రైతు సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావుతో కలిసి బుధవారం అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. తెదేపా నాయకులు మంగు, అప్పారావు పాల్గొన్నారు.

చిన్నగెడ్డలో ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న తెదేపా నాయకులు

పథకాలు సద్వినియోగం చేసుకోండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ సూచించారు. రంపచోడవరంలో బుధవారం పీఎం కిసాన్ సుఖీభవ పథకం నమూనా చెక్కు పంపిణీ చేశారు. ఎస్టీ కమిషన్ డైరెక్టర్ సునీత, అసిస్టెంట్ డైరెక్టర్లు రామ్మోహనరావు, సావిత్రి పాల్గొన్నారు.

రంపచోడవరంలో చెక్కు అందజేస్తున్న పీవో స్మరణ్‌రాజ్

శిశు మరణాలు పునరావృతమైతే చర్యలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: శిశుమరణాలు జరగకుండా పిల్లల పోషణ, సంరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. శిశుమరణాలు పునరావృతమైతే ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దారెల పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఇటీవల సంభవించిన శిశుమరణాలపై గ్రామస్థులతో మాట్లాడి ఆరా తీశారు. మూడు గ్రామాల్లో ఐదుగురు శిశువులు మృతి చెందడం విచారకరమని పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, పిల్లల వైద్య నిపుణులను పంపించి ఈ మరణాలపై సమాచారం తెలుసుకున్నామని చెప్పారు. పోషణ విధానం తెలియక పిల్లలు మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. చలికాలంలో శిశువు సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాటు మందులు పట్టొద్దన్నారు. డీఎంహెచ్ఓ కృష్ణమూర్తినాయక్, తహసీల్దార్ అప్పారావు, సర్పంచి పాండురంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపుట్టులో శిశు మరణాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గోమంగి మండలం ఏర్పాటుకు వినతి

పెదబయలు, న్యూస్‌టుడే: మారుమూల గోమంగి కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని మండల సాధనసమితి నాయకులు కోరారు. కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. మండల సాధన సమితి నాయకులు, సర్పంచి సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రావు, ఉపసర్పంచి మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

హుకుంపేట, ముంచంగిపుట్టు: మన్యంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది దిగుబడి బాగుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వరి చేలు పూర్తి స్థాయిలో పండిపోవటంతో గిరిజనులు ఇతర పనులు పెట్టుకోకుండా వరి కోతల్లో నిమగ్నమయ్యారు. హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల్లో సగానికి పైగా గ్రామాల్లో కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు వాటిని కుప్పలుగా వేస్తున్నారు.

హుకుంపేటలో కట్టలు మోసుకొస్తున్న గిరిజనులు

ఘాట్ రోడ్డులో రాకపోకలకు ఇక్కట్లు

మారేడుమిల్లి - చింతూరు ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు తరచూ అవస్థలు తప్పడం లేదు. ఈ దారిలో ప్రయాణం అంటేనే హడలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మలుపుల్లో ఎప్పుడు, ఏ వాహనం నిలిచిపోతుందో, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందో తెలియడం లేదు. ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ఓ లారీ సోమవారం వాలమూరు సమీపంలోని మలుపులో సాంకేతిక సమస్య తలెత్తి నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లారీ పక్కగా కొంత జాగా ఉండటంతో చిన్న వాహనాలు వెళ్తున్నాయి. ఈ మార్గంలో బుధవారం ఉదయం ఓ కంటైనర్ వెళ్లేందుకు యత్నించి ఇరుక్కుపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మారేడుమిల్లి నుంచి పొక్లెయిన్లను రప్పించి, నిలిచిపోయిన లారీని పక్కకు తొలగించడంతో చిన్న వాహనాలు ముందుకు కదిలాయి. లారీలన్నీ మారేడుమిల్లిలోనే ఆగిపోయాయి. – న్యూస్‌టుడే, మారేడుమిల్లి

లారీని పక్కకు నెట్టేందుకు తీసుకొచ్చిన పొక్లెయిన్

నిత్యావసరాల పంపిణీలో తేడాలొస్తే సహించం

సీలేరు, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల పంపిణీలో తేడాలొస్తే సహించేది లేదని జీసీసీ డివిజనల్ మేనేజర్ బి.వెంకటేష్ హెచ్చరించారు. బుధవారం సీలేరులో పర్యటించారు. జీసీసీ డిపో, గ్యాస్ గోదాము, జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అధిక ధరకు గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెట్రోల్‌బంక్‌లో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సీలేరులో గ్యాస్ సిలిండర్లు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు వైకాపా నాయకులు, స్థానికులు డీఎంకు ఫిర్యాదు చేశారు. తాము సూచించిన ధరకే విక్రయించాలని ఇన్‌ఛార్జి బంగారయ్యను డీఎం ఆదేశించారు. పెట్రోల్ బంక్ ఇన్‌ఛార్జి ఎం.వీ.రమణమూర్తి పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీలు నిర్వహిస్తున్న డీఎం వెంకటేష్

తెదేపా అరకు పార్లమెంట్ కార్యదర్శిగా చలపతిరావు

ఎటపాక, న్యూస్‌టుడే: తెదేపా అరకు పార్లమెంట్ కార్యదర్శిగా పాటి చలపతిరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల నాయకులు బుధవారం ఆయన్ను సన్మానించారు. చోడవరం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అరవింద్, నాయకులు గోపి, శ్రీనివాసరావు, కోటయ్య, రామారావు, నరేష్, రవి, మంగయ్య, పుల్లయ్య, కొండయ్య, రమేష్, శ్రీనివాసరావు, రాజు, సాయి, బుజ్జోడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. జి.మాడుగుల కొత్తూరు కూడలిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారులందరికీ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్సై షణ్ముఖరావు

సీహెచ్‌సీగా మార్పునకు ప్రతిపాదనలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆసుపత్రిగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఏడీఎంహెచ్‌వో డా. ప్రతాప్ సూచించారు. రాజేంద్రపాలెంలోని ఆశ్రమ బాలికల పాఠశాల, ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థత ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో నలుగురు మాత్రమే ఆసుపత్రిలో ఉన్నారని, మిగిలినవారందరూ కోలుకున్నారని పేర్కొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్ఓ ప్రతాప్

పరిహారం చెల్లించాలని ఆందోళన

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం పరిహారం చెల్లించాలని డిమాండు చేస్తూ ముల్లూరు గ్రామస్థులు చింతూరు ఐటీడీఏ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. పదేళ్ల కిందట పొలాలకు పరిహారం ఇచ్చి పాలకులు వదిలేశారు. రైతులకు అందిస్తున్న రాయితీలు వర్తించక ఇబ్బందులు పడుతున్నామని, గ్రామస్థులకు ఇళ్లు, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, భూమికి భూమి చూపించి న్యాయం చేయాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఆందోళనలో ముల్లూరు గ్రామస్థులు

ల్యాబ్, బోధన కీలకమే..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పాల్ ల్యాబ్, సైన్స్ పరికరాల ల్యాబ్‌ల నిర్వహణ, విద్యార్థులకు బోధన రెండూ కీలకమేనని సర్వశిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త స్వామినాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. వీఆర్ పురం జడ్పీ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ ఏడాది కొత్తగా పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పాల్ ల్యాబ్ (ట్యాబ్‌లతో విద్యా బోధన), సైన్స్ పరికరాల ల్యాబ్‌ల నిర్వహణకు అవసరమైన గదులను పరిశీలించారు. హెచ్‌ఎం అజయ్, టెక్నీషియన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల బాక్సులు పరిశీలిస్తున్న స్వామినాయుడు

గిరిజన పూజారులకు శిక్షణ

కొయ్యూరు, న్యూస్‌టుడే: గిరిజన పూజారుల వృత్తి నైపుణ్యం పెంపొందించేలా శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు అన్నారు. వికాస తరంగిణి, దానధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ తరగతుల పోస్టర్‌ను బుధవారం ఏపీ ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ శిక్షణను గిరిజన పూజారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డీవీడీ ప్రసాద్, భాజపా మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు, ఉష పలువురు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: జోలాపుట్‌లో బుధవారం అయ్యప్ప అంబలం పూజ ఘనంగా జరిగింది. ఇక్కడి పీఠంలో మాలధరించిన స్వాములకు ఇదే చివరి బుధవారం కావడంతో ఈ పూజను ఏర్పాటు చేశారు. రాంబాబు గురుస్వామి ఆధ్వర్యంలో తాంత్రిక పూజ నిర్వహించారు. జగన్నాథ్‌పతి సోదరులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గురుస్వాములు సమ్మంగి సూరిబాబు, పొడుగు గుప్తేశ్వరావు, కొంచాడగోపాలస్వామి, గంగారావు పాల్గొన్నారు. ఒనకఢిల్లీ రామాలయంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు నది ఒడ్డున బుధవారం సాయంత్రం అడవి గంగకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివాలయం అర్చకులు రామశర్మ, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ఆకాశదీపం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

ఒనకఢిల్లీలో దీపారాధన

సీలేరు నది ఒడ్డున అడవిగంగకు హారతి

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సర్పంచి రమణి, లబ్బర్తి ఎంపీటీసీ సభ్యుడు, ఏపీ ఐబీసీ డైరెక్టర్ పెద్దిరాజు సమక్షంలో ఆలయ కమిటీ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తికమాసంలో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఏకాదశ రుద్రాభిషేకాలు, శాంతిహోమం, లక్ష కుంకుమార్చన, కార్తిక దీపోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది.

(c) eenadu

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

27న వెంకటపాలెం శ్రీవారి ఆలయ రెండో ప్రాకార నిర్మాణానికి శంకుస్థాపన

తుళ్లూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ నెల 27న వెంకటపాలెం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం రెండో ప్రాకారానికి శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 10.50 గంటల మధ్య ముహూర్తం నిర్ణయించారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం సీఎం.. శ్రీవారి దర్శనం చేసుకొని ఆలయం వద్ద జరిగే బహిరంగ సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఆయా ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. అనంతరం సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సీఎం పర్యటనకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. తితిదే జేఈవో వీరబ్రహ్మయ్య శంకుస్థాపన కార్యక్రమం వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయి కుమార్, తుళ్లూరు డీఎస్పీ టి.మురళీ కృష్ణ, సీఐ కె.శ్రీనివాస రావు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, పంచాయతీ, తితిదే అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

జడ్పీ ఆరో స్థాయీ సంఘ సమావేశం 26న

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు ఆరో స్థాయీ సంఘ సమావేశం ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో వి.జ్యోతిబసు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్తు ఉపాధ్యక్షురాలు బత్తుల అనూరాధ అధ్యక్షత వహిస్తారన్నారు. సంక్షేమ శాఖలు, కార్పొరేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ అనుబంధ శాఖల కార్యక్రమాలపై సమీక్షిస్తారని వివరించారు.

రైతుల నుంచి 99,623 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

పత్తిని పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత

గుంటూరు(మిర్చియార్డు), న్యూస్‌టుడే: పత్తి రైతులు పూర్తిగా పంట విక్రయించుకునేంత వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత స్పష్టం చేశారు. గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, గురజాలలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న పత్తిని ఆమె పరిశీలించారు. రైతులకు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా విజయసునీత మాట్లాడుతూ 'రాష్ట్ర వ్యాప్తంగా 5.39 లక్షల హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. 8 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అంచనా వేశాం. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలుగా రాష్ట్రంలో 11 మార్కెట్ యార్డులతో పాటు 66 జిన్నింగ్ మిల్లులను ప్రకటించారు. ఇప్పటి వరకు 24 జిన్నింగ్ మిల్లుల ద్వారా 3,643 మంది రైతుల నుంచి రూ.78.13 కోట్లు విలువైన 99,623 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాం. సీసీఐ నిబంధన మేరకు ఎక్కువ తేమ శాతం ఉంటే.. కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుపాను, ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతంలో సడలింపులు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. రైతులు. . రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించాలి. స్లాట్ బుకింగ్ వివరాలను సరళతరం చేసేలా కపాస్ కిసాన్ యాప్‌ను సీఎం యాప్‌తో అనుసంధానం చేశాం' .. అని వివరించారు.

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, తుళ్లూరు

ఈ గోతుల్లో రోడ్డెక్కడో!

పెదపరిమి - తుళ్లూరు మధ్య దారుణం

తాత్కాలిక పనులతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

గుంటూరు నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో తాడికొండ నుంచి తుళ్లూరు వరకు రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. ప్రధానంగా పెదపరిమి-తుళ్లూరు మధ్య భారీ గోతులతో కార్లు కూడా వెళ్లలేని పరిస్థితి. గుంటూరు నుంచి తాడికొండ మీదుగా రాజధానికి వెళ్లే మార్గం కావడంతో తోపాటు రద్దీ ఎక్కువ. రోడ్డును బాగు చేయాల్సిన యంత్రాంగం జాప్యం చేస్తోంది. వాహనదారులకు నరకం చూపిస్తోంది. భారీ గోతులు పూడ్చడానికి రూ.70 లక్షలతో పెదపరిమి-తుళ్లూరు మధ్య పనులు చేపట్టిన అధికారులు.. రోడ్డులో సగం తవ్వేశారు. దీంతో రెండువైపులా రాకపోకలు సాగించాల్సిన వాహనాలు ఒకటే మార్గం కావడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. 30 నిమిషాలకు పైగానే ఆగిపోవాల్సి వస్తోంది. పోలీసులు ఉంటున్నా.. వాహనాలు కదలడానికి ఎక్కువ సమయం పడుతోంది. మంగళవారం ఉదయం ఇసుక లోడుతో వెళ్తున్న లారీ సగం రోడ్డులో మట్టిలో కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయంలో గుంటూరు నుంచి హైకోర్టుకు వెళ్తున్న న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ వాహనం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. అధికారులు వెంటనే పరిస్థితిని చక్కబెట్టలేకపోవడంతో వాహనాన్ని తుళ్లూరు నుంచి తీసుకురావాలని చెప్పి ఆయన హైకోర్టుకు వెళ్లారు. వీవీఐపీలు తిరిగే మార్గంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం.

రోడ్డుపై భారీ గుంత

తుళ్లూరు-పెదపరిమి మధ్య తవ్వేశారిలా..

రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

పెదపరిమి శివారు నుంచి శాఖమూరు మలుపు వరకు సుమారు 2 కిలోమీటర్ల పరిధిలో భారీగోతులున్న చోట రూ.70 లక్షలతో మరమ్మతులు చేస్తున్నాం. వీటిని రెండు వారాల్లో పూర్తి చేస్తాం. పెదపరిమి - రాయపూడి మార్గంలో శాఖమూరు చెరువు నుంచి 6.3 కిలోమీటర్ల మార్గం అభివృద్ధి చేయడానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– రాజశేఖర్, ఏఈ, ఆర్అండ్‌బీ, తాడికొండ

- తాడికొండ నుంచి రాజధాని ప్రాంతంలోని రాయపూడి వరకు రోడ్డు పొడవు 14.3 కిలోమీటర్లు.
- అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చినప్పుడు దీన్ని బాగు చేశారు.
- జూన్ తర్వాత వర్షాల కారణంగా గోతులు పడగా.. ఆర్అండ్‌బీ అధికారులు రెండుసార్లు పూడ్చించారు.
- ఇటీవల మొంథా తుపానుకు రోడ్డుపై వరదనీరు ప్రవహించింది. ఇసుక, మట్టి లోడుతో భారీ లారీలు తిరుగుతుండటంతో పెద్దపెద్ద గోతులు పడ్డాయి.

భారీ వాహనాలకు రోడ్డు తట్టుకుంటుందా?

- నల్లరేగడి నేల కావడంతో 60 టన్నుల బరువుతో వెళ్తున్న వాహనాల రద్దీకి గోతులు మరింత పెద్దవై లోపలి మట్టి బయటికొచ్చింది.
- భారీ గోతులున్నచోట 7 కిలోమీటర్ల పరిధిలో 3.5 కిలోమీటర్లు రోడ్డు తవ్వేసి రూ.70 లక్షలతో పనులు చేపట్టారు.
- రహదారి సామర్థ్యాన్ని పెంచకుండా చేస్తున్న తాత్కాలిక మరమ్మతులతో పరిష్కారం లభించడం లేదు.
- ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు ఈఎన్‌సీ వివేకానందరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథరెడ్డి బుధవారం రహదారిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

డీఏపీకి డిమాండ్...!

ధర పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు

ఈనాడు–అమరావతి

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మెట్ట ప్రాంతాల్లో రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న సాగు ఊపందుకోవడంతో డీఏపీ ఎరువుకు డిమాండ్ పెరిగింది. బస్తా గరిష్ఠ చిల్లర ధర రూ.1350 కాగా ప్రైవేటు వ్యాపారులు రూ.1400 నుంచి రూ.1420కు విక్రయిస్తున్నారు. మిగిలిన కాంప్లెక్స్ ఎరువులతో పోల్చితే డీఏపీ ధర తక్కువగా ఉండడం, దుక్కుల్లో వేయడానికి అనుకూలంగా ఉండడంతో డిమాండ్ ఏర్పడింది. మరోవైపు కారంచేడు మండలంలో రబీ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు కొనుగోలు చేస్తున్నారు. మొంథా తుపానుతో దెబ్బతిన్న పంటలు కోలుకోవడానికి కొన్ని ప్రాంతాల్లో డీఏపీ చల్లుతున్నారు. మిగిలిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచుకోవడానికి కంపెనీలకు కేంద్రం వెసులుబాటు ఇచ్చింది. డీఏపీ ధరపై నియంత్రణ విధించడంతో తయారీ కంపెనీలు కూడా ఆచితూచి సరఫరా చేస్తున్నాయి. మొంథా తుపాను తర్వాత అందరూ రబీ సీజన్‌లో ఒకేసారి సాగుకు సిద్ధం కావడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీనికితోడు 70శాతం ఎరువులను మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేసి, 30 శాతం మాత్రమే ప్రైవేటు డీలర్లకు ఇస్తున్నారు. దీంతో ప్రయివేటు మార్కెట్‌లోనూ లభ్యత తక్కువగా ఉంది. ఇదే అదనుగా వ్యాపారులు లింకు ఉత్పత్తులు కొనుగోలు చేయాలని చెప్పడం, లేనిపక్షంలో బస్తాకు ప్రాంతాన్ని బట్టి రూ.50 నుంచి రూ.70 అదనంగా వసూలు చేస్తున్నారు. అప్పుగా కొనుగోలు చేసే రైతులకు రూ.100వరకు అదనంగా వేస్తున్నారు.

గుంటూరు జిల్లాలో నెల వారీగా డీఏపీ అవసరాలు (టన్నుల్లో)	
నెల	డీఏపీ
డిసెంబరు	685
జనవరి	8455
ఫిబ్రవరి	6489
మార్చి	550

మార్కెట్‌ఫెడ్ వద్ద సరిపడా నిల్వలు

డెల్టాలో నవంబరు ఆఖరులో వరికోతలు మొదలైతే డిసెంబరులో మొక్కజొన్న సాగు చేస్తారు. ప్రస్తుతానికి అవసరం లేకపోయినా రైతులు నిల్వ చేసుకోవడంతో కృత్రిమ కొరత ఏర్పడుతోంది. గుంటూరు, పల్నాడు జిల్లాలకు సరఫరా చేయడానికి మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలున్నాయి. డిసెంబరు, జనవరిలో డిమాండ్‌ను తట్టుకునేలా అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తున్నారు. బాపట్ల జిల్లాలో నిల్వలు తక్కువ, డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కొరత ఏర్పడింది. అక్కడ శనగ సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండడం కూడా కారణమైంది. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్క్‌ఫెడ్ అధికారులు రైతుసేవాకేంద్రాలు, డీసీఎంఎస్, సొసైటీలకు డీఏపీ సరఫరా చేస్తున్నారు. ఒక్కసారిగా డిమాండ్ రావడంతో ఆయా కేంద్రాల్లో నిల్వలు తరిగిపోవడంతో ఆందోళన నెలకొంది. మరోవైపు కంపెనీలు కూడా కేటాయింపుల మేరకు సరఫరాలో జాప్యం జరుగుతుండడం, ప్రైవేటులో లభ్యత తగ్గడం వంటి కారణాలతో నల్లబజారులో అధికధరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, విజిలెన్స్ విభాగాలు క్షేత్రస్థాయిలో అమ్మకాలపై దృష్టి సారించి అధికధరకు అమ్మకుండా అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

రుణగ్రహీతలను వేధించినా.. బెదిరించినా నేరమే

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: లోన్ రికవరీ ఏజెంట్లు రుణగ్రహీతలను బెదిరించటం, అభ్యంతరకర భాష ఉపయోగించటం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భానోదయ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సౌత్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల యజమానులు, రికవరీ ఏజెంట్లతో జిల్లా పోలీసు కల్యాణమండపంలో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. నిబంధనలను అతిక్రమించినవారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నల్లపాడు సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లడుతున్న డీఎస్పీ భానోదయ. పక్కన సీఐ వంశీధర్

డీఎస్పీ చేసిన సూచనలు....

❖ రుణగ్రహీతలను ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల్లోపే సంప్రదించాలి. గుర్తింపు కార్డులు ధరించడం తప్పనిసరి. ❖ వారితో గౌరవంగా వ్యవహరించాలి. ❖ వేధించడం, నిర్బంధించడం, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం చేయకూడదు. ❖ వారి అనుమతి లేకుండా వివరాలను ఇతరులకు వెల్లడించకూడదు. ❖ ఏజెంట్లు స్వయంగా ఆస్తి జప్తు చేయకూడదు.

అవినీతిపై సమరానికి సిద్ధమా..!

లంచం అడిగితే ఫోన్ చేయండి... టోల్‌ఫ్రీ నంబర్ 1064

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే

కార్యాలయాల్లో పౌరులకు సేవలు అందజేసేందుకు ఉద్యోగులకు ప్రభుత్వం వేతనం చెల్లిస్తోంది. విద్యార్థులకు నివాసం, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకుంటే.. అధికారులు విచారణ చేసి అర్హులకు ఉచితంగా ధ్రువపత్రాలు జారీ చేయాలి. నిరుపేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధి కోసం దరఖాస్తు చేసుకున్నా. . విచారణ చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అభివృద్ధి పనులు చేసిన గుత్తేదారులకు విధిగా బిల్లులు చెల్లించాలి. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే.. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

పౌర సేవలు ఉచితంగా పొందే అవకాశన్ని ప్రభుత్వం కల్పించగా కొందరు అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి లంచం డిమాండ్ చేసి పీల్చి పిప్పి చేస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనిశా అధికారులు గోడపత్రికలు ముద్రించి ఆయా శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో నోటీసు బోర్డుల పక్కన అంటించారు. 'అవినీతిని అంతమొందిద్దాం.. ఆదర్శ ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం' నినాదంతో లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064కు ఫిర్యాదు చేయండి అని ముద్రించారు. ఈ-మెయిల్ complaints-acb@ap.gov.in కు లంచావతారాల వివరాలు మెయిల్ చేయొచ్చు. 0866-2428770, 9440440057 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ పోస్టర్లు ఉపకరిస్తాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

డ్వామా కార్యాలయంలో ఏర్పాటు చేసిన గోడపత్రిక

★ ఫిర్యాదు చేసిన వ్యక్తుల వివరాలు రహస్యంగా ఉంచుతారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై ఏసీబీ అధికారులు ప్రత్యేక విచారణ చేసి వారిపై దాడులు చేసే అవకాశముంది.

బకాయిలిస్తేనే.. సాగు బండి కదిలేది

ఈనాడు, అమరావతి



నల్లబర్లీ రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన పొగాకుకు సంబంధించి ఇప్పటికీ కొంతమందికి బకాయిలు అందలేదు. గుంటూరు జిల్లా పరిధిలో రూ.7.60 కోట్లు, పల్నాడు జిల్లా పరిధిలో రూ.4.43 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉంది. బహిరంగమార్కెట్‌లో ధరలు పతనమైన నేపథ్యంలో అప్పట్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మార్క్‌ఫెడ్ పొగాకు కొనుగోలు చేసింది. నాణ్యతనుబట్టి క్వింటాకు రూ.6 వేలు, రూ.9 వేలు, రూ.12 వేల చొప్పున ధర చెల్లించింది. రెండు జిల్లాల్లో కలిపి 2,928 మంది రైతులు విక్రయించగా.. ఇందులో 75 శాతంమందికి చెల్లింపులు పూర్తయ్యాయి.

గతేడాది పొగాకు సాగు చేసిన రైతులు నష్టాలపాలయ్యారు. ఒక్కసారిగా ఉత్పత్తి ఎక్కువగా రావడం, ధరలు పతనం కావడం, ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండగా.. ప్రస్తుత రబీలో పెట్టుబడులకు కొత్త అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం రంగంలోకి దిగి కొనుగోలు చేసినా.. వాతావరణ పరిస్థితులు, కొనుగోలు కేంద్రాల్లో జాప్యం, గోదాముల కొరత వంటి సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో బకాయిలు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

బర్లీ పొగాకు కొనుగోలు వివరాలు ఇలా....

విభాగం	గుంటూరు	పల్నాడు
అమ్మిన రైతుల సంఖ్య	1,674	1,254
సేకరించింది (టన్నుల్లో)	3236.9	2,150
చెల్లించాల్సింది (రూ.కోట్లలో)	23.86	15.13
రైతులకిచ్చింది (రూ.కోట్లలో)	16.26	10.70

ప్రభుత్వానికి పంపించాం

బకాయిల చెల్లింపు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే రైతుల ఖాతాకు సొమ్ము జమవుతుంది.

– మార్క్‌ఫెడ్ అధికారి నరసింహారెడ్డి

ఉద్యోగుల అంతర జిల్లాల బదిలీలకు అవకాశం

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అంతర జిల్లాల బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. బదిలీలకు దరఖాస్తు గడువు నవంబరు 30వ తేదీగా నిర్ణయించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 12 శాఖలకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. దాంతో 12 శాఖల జిల్లా అధికారుల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకుని ఉద్యోగులకు తెలియజేయాలి. ఉద్యోగులకు సంబంధించి వారి భర్త/భార్య ఇతర జిల్లాల్లో పని చేస్తుంటే.. వారు ఆ జిల్లాల్లో ఖాళీలుంటే దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాల మేరకు ఉద్యోగులను అంతర జిల్లాలకు బదిలీ చేస్తారని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారి సీహెచ్.కృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డు పొందండిలా..

మ్యాపింగ్ అయిన సచివాలయం వద్దే తీసుకోవాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే

పౌర సరఫరాల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టింది. రేషన్ కార్డులను స్మార్ట్‌గా ఏటీఎం కార్డు పరిమాణంలో కార్డుదారులకు అందిస్తోంది. రెండు నెలల కిందటే జిల్లాకు స్మార్ట్ రేషన్ కార్డులందాయి. లబ్ధిదారుల ఆచూకీ తెలిసిన కార్డులను డీలరు వద్ద, సచివాలయం వద్ద పంపిణీ చేశారు. జిల్లాలో 5,85,615 స్మార్ట్ కార్డులు రాగా.. అందులో 5,38,331 కార్డులు పంపిణీ చేశారు. 47,284 కార్డులు ఇంకా తీసుకోవాల్సి ఉంది. మ్యాపింగ్ సమస్యలు, స్థానికంగా లేకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లడం వంటి కారణాలతో ఇంకా స్మార్ట్ రేషన్ కార్డు పొందనివారు.. దానిని ఏవిధంగా తీసుకోవాలో తెలియక తికమక పడుతున్నారు.

సొంతూరు వదిలి వేరేచోట ఉంటున్నారా.. ఉపాధి, పిల్లల చదువుల కోసమని సొంతూరు వదిలి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్నవారు తొలుత మ్యాపింగ్ చేసుకున్న ప్రదేశం నుంచి మరో ఊరికి వెళ్లిన తర్వాత కూడా మ్యాపింగ్ చేయించుకున్నారు. ఆ మ్యాపింగ్ రేషన్ కార్డుకు అనుసంధానం కాలేదు. దీంతో కార్డుదారులు చివరిగా మ్యాపింగ్ అయిన సచివాలయానికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను అడుగుతుండగా.. సచివాలయ సిబ్బంది తమ వద్దకు రాలేదని చెప్పడంతో లబ్ధిదారులు.. వారి కార్డు తీసేశారేమోనని ఆందోళన చెందుతున్నారు. వినియోగదారుడు తన స్మార్ట్ రేషన్ కార్డు ఎక్కడుందో సులువుగా తెలుసుకోవచ్చని చెబుతున్నారు అధికారులు.

స్మార్ట్ రేషన్ కార్డు

ఏం చేయాలంటే.. కార్డుదారులు ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రాంతంలోని సచివాలయానికి వెళ్లి రేషన్ కార్డు నంబరు చెబితే సిబ్బంది ఆ కార్డు నంబరును ఆన్‌లైన్‌లో పరిశీలించి స్మార్ట్ రేషన్ కార్డు ఏ ఊరిలో.. ఏ సచివాలయంలో ఉందో చెప్పేస్తారు. తద్వారా కార్డుదారులు నేరుగా ఆ సచివాలయానికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డు పొందొచ్చు.

పంటల సేద్యానికి ప్రోత్సాహం

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: పంటల సేద్యానికి రైతులకు అవసరమైన పెట్టుబడి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు జమ చేసి ప్రోత్సహిస్తున్నాయని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు నుంచి ప్రధాని మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిఖరాగ్ర సమావేశం-2025 కార్యక్రమాన్ని.. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఎస్ఆర్ కడప జిల్లా చిన దాసరిపల్లిలో రచ్చబండ కార్యక్రమం ద్వారా అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో బుధవారం ప్రారంభించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఆడిటోరియం నుంచి కలెక్టర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి వీక్షించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 1,06,329 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.70 కోట్లు జమయ్యాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.53.16 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.16.84 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రూ.5.69 కోట్ల విలువైన వ్యవసాయ ఉపకరణాలను పంపిణీ చేశామన్నారు. మొంథా తుపానుతో 2 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, రూ.4.14 కోట్లు పెట్టుబడి నష్టపోయినట్లు నివేదించామన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో ఒక్కో రైతుకు రూ.7 వేలు జమైందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 30,428 మందికి రూ.20.07 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రైతులకు రూ.70 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఆంగ్రూ విస్తరణ విభాగం సంచాలకుడు జి.శివనారాయణ, హజ్ కమిటీ ఛైర్మన్ బాషా, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వ్యవసాయ శాఖ ఉపసంచాలకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే రామాంజనేయులు, ఆంగ్రూ వీసీ శారద జయలక్ష్మీదేవి తదితరులు

వీధి కుక్కలకు పక్కాగా శస్త్రచికిత్సలు

ఈనాడు, అమరావతి

➡ రూ.47 లక్షలతో ఏబీసీ సెంటర్ నిర్మాణం
➡ రూ.98 లక్షలతో అనుబంధ పనులు

గుంటూరు నగరంలో శునకాల సమస్యపై జీఎంసీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించేందుకు రూ.47 లక్షల అంచనా వ్యయంతో ఏబీసీ సెంటర్ నిర్మిస్తోంది. మరో రూ.98 లక్షలతో అనుబంధ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి స్థాయీసంఘ అనుమతి తీసుకుంది. పశువైద్యుడిని కేటాయించాలని పశుసంవర్ధకశాఖకు లేఖ రాసింది.

పొన్నూరు రోడ్డులో నిర్మితమవుతోన్న ఏబీసీ సెంటర్

ఏం జరిగిందంటే...

★గుంటూరు నగర పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం వీధి కుక్కల సంఖ్య సుమారు 30 వేలు. అనధికారికంగా 60 వేలకుపైగానే.
★గత రెండేళ్ల కాలంలో వాటి బెడద తీవ్రస్థాయికి చేరుకుంది. తరచూ జనంపై దాడి చేస్తుండడంతో పలువురు క్షతగాత్రులవుతున్నారు.
★వాటిని పట్టి దూరంగా విడిచిపెట్టడానికి కొన్ని నిబంధనలు అడ్డు వస్తున్నాయి.
★సంతతి కట్టడికి శస్త్రచికిత్సలు చేయించే బాధ్యతను గతంలో ఓ ఏజెన్సీకి అప్పగించగా.. అది మధ్యలోనే ఆగిపోవడంతో ఫలితం లేకుండా పోయింది.

ఇదీ పరిస్థితి..

● ఏటుకూరు కంపోస్టుయార్డు సమీపంలో ఏబీసీ సెంటర్‌లో శస్త్రచికిత్సలు చేసేవారు.
● నిబంధనల మేరకు అక్కడ ఇబ్బంది ఏర్పడడంతో తక్కెళ్లపాడు పాత పంపుహౌస్ వద్ద భవనం నిర్మించాలనుకున్నారు.
● చివరకు పొన్నూరు రోడ్డులోని డంపింగ్ యార్డు ఖాళీ స్థలంలో 200 కుక్కలకు శస్త్రచికిత్సలు నిర్వహించడానికి అనువుగా యాంటీ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) ఏర్పాటవుతోంది. ● అక్కడ బోన్లు, సంప్, నీటి ట్యాంకు తదితరాలు నిర్మిస్తున్నారు. ● రూ.98 లక్షలతో రెండు ఆపరేషన్ థియేటర్లు, ప్రహరీ, ఫ్లోరింగ్, పాత ఎంఆర్ఎఫ్ కేంద్ర మరమ్మతుల ప్రక్రియ టెండరు దశలో ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లకు ప్రణాళిక

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు ముందస్తు ప్రణాళికతో చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పోలీసు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. దీక్షల విరమణకు హోమగుండాలు, ఇరుముడి పాయింట్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, అన్నప్రసాద వితరణ ఏర్పాట్ల నిమిత్తం స్థల పరిశీలన చేశారు. ఈవో మాట్లాడుతూ ఈ నెల 20న సీపీ, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లతో దేవస్థానం అధికారుల సమావేశంలో ఏర్పాట్లపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్, దేవస్థానం డీఈ రవీంద్ర, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

CHEBROLU HANUMAIAH INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
Accredited by NAAC & AUTONOMOUS
Chandramoulipuram, Chowdavaram, Guntur – 522019, Andhra Pradesh.
Ph:7382008494, www.chips.ac.in

B. PHARMACY AND PHARM.D SPOT ADMISSIONS - 2025

Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions in I B.Pharmacy and I Pharm.D with all original certificates between 20-11-2025 to 23-11-2025. The vacant seats created to unreported candidates shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025.

PRINCIPAL

CHALAPATHI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(AUTONOMOUS)
Estd:2004
Chalapathi Nagar, Lam, GUNTUR-522 034
Ph: 0863-2524124, 2524125, www.chalapathipharmacy.in

CATEGORY-B / SPOT / NRI ADMISSIONS I B.PHARMACY & I PHARM.D

S.No.	Course	EAPCET Code	Category-B Seats	NRI Seats
01	B.Pharmacy	CLPT	30	10
02	Pharm.D	CLPT	09	02

Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions for I **B.Pharmacy** and **I Pharm.D** with all original certificates on **21/11/2025.** The vacant seats created by unreported candidates, shall be filled-up as per guidelines of APSCHE & Convenor **APEAPCET-2025.** Seats for Foreign Nationals/NRI are available as per PCI regulations

Principal

(c) eenadu

రైతుల సంక్షేమమే ప్రభుత్వాల ధ్యేయం

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. గుంటూరు నల్లపాడు రోడ్డులోని వెంకటేశ్వర ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెటింగ్ కమిషనర్ విజయసునీతతో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే అధిక ధర లభిస్తుందన్నారు. మార్కెట్‌లో పత్తి క్వింటా ధర రూ.6 వేలు ఉండగా.. సీసీఐ ద్వారా నాణ్యత ఉన్న పత్తికి రూ.8110 కనీస మద్దతు ధర అందిస్తున్నామని వివరించారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఫిబ్రవరి వరకు కొనసాగుతాయన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత మాట్లాడుతూ జిల్లాల్లో నాలుగు సెంటర్లకు గాను 14 జిన్నింగ్ మిల్లుల్ని సీసీఐ నోటిపై చేసిందన్నారు. రైతులు దళారుల వద్దకు వెళ్లకుండా నాణ్యమైన పత్తిని నోటిపై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. పత్తిని బాగా ఆరబెట్టుకుని ప్లాస్టిక్ గోతాల్లో కాకుండా లూజుగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు, డీడీ దివాకర్, ఏడీ సత్యనారాయణ చౌదరి, మిర్చియార్డు కార్యదర్శి చంద్రిక, సీసీఐ బయ్యర్లు రవీంద్ర, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అమరావతి ప్రాంత రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులు.. రైతు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. పదేళ్లుగా ఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని, 29 గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల కేసులు, ఆర్-5 జోన్ కేసులు ఉపసంహరించుకోవాలని, రైతులకు వార్షిక కౌలు బకాయిలు చెల్లించాలని కోరారు. అమరావతిని రాజధానిగా చేస్తూ పార్లమెంటులో చట్టం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. రాజధాని రైతుల ఉద్యమాలకు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే త్రీమాన్ కమిటీలో అమరావతి రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఆర్‌డీఏ స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన తన లేఖలో కోరారు.

ఆర్టీసీ కండక్టర్‌పై సస్పెన్షన్ వేటు

పట్నంబజారు: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తికి స్త్రీ శక్తి టికెట్ ఇచ్చిన కండక్టర్‌ను బుధవారం ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈనెల 4న గుంటూరు నుంచి తుళ్లూరు వెళ్తున్న బస్సులో కండక్టర్ ఒక వ్యక్తి నుంచి టికెట్ డబ్బులు తీసుకొని, స్త్రీ శక్తి టికెట్ ఇచ్చారు. లాం వద్ద చెకింగ్ అధికారులు బస్సును ఆపి టికెట్లు తనిఖీ చేయగా విషయం బయటపడింది. విచారణ అనంతరం కండక్టర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పురపరిపాలన శాఖ వినుకొండ పురపాలక సంఘం

"ఇ-ప్రొక్యూర్‌మెంట్" టెండరు నోటీసు

NIT.No.822/2024/ఇ1,తేది.19-11-2025

(1) పని పేరు: వినుకొండ పురపాలక సంఘ పరిధిలో 7 నెం.ల పనులకు సంబంధించి ఇ-ప్రోక్యూర్‌మెంట్ టెండర్లు పిలువబడుచున్నవి. (2) 5 నెం.ల పనులకు సంబంధించి టెండర్లు స్వీకరణకు చివరి తేది/సమయం. 26.11.2025, సాయంత్రం 4.00 గం వరకు (3) 2 నెం.ల పనులకు సంబంధించి టెండర్లు స్వీకరణకు చివరి తేది/సమయం.03.12.2025, సాయంత్రం 4.00 గం వరకు (4) సంబంధిత మునిసిపల్ కమీషనరు పేరు: శ్రీ యమ్.సుబాష్ చంద్రబోస్, కమీషనరు, వినుకొండ పురపాలక సంఘము, ఫోన్ నెం.08646-273656, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరు, వారి సెల్ నెం.7093403723 తదుపరి వివరములను http://tender.apeprocurement.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ నందు చూడవచ్చును.

సం/- కమీషనరు, వినుకొండ పురపాలక సంఘం.

క్రికెటోత్సవానికి వేళాయె...

● ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు-522 005
వివరాలకు: 7799102585, 8328360034
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ | Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat | Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు ఉద్యోగాలివ్వాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ఉద్యోగాలివ్వాలని దళిత సంఘాల నేతలు కలెక్టర్ తమీమ్ అన్సారియాను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ హైకోర్టు దగ్గరగా ఉండడంతో నిందితులు కేసులపై స్టే ఆర్డర్లు తెచ్చుకుంటున్నారన్నారు. పోలీసులు స్టే వెకేషన్ పిటిషన్లు సకాలంలో వేయడం లేదన్నారు. పోలీసులు కేసు నమోదు, దర్యాప్తులో జాప్యం చేస్తున్నారని, నేరానికి తగిన సెక్షన్లు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులైనా ఎస్సీ, ఎస్టీ చట్టం అమలుపై అధికారికంగా సమీక్ష చేయలేదన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో.. బాధితులకు పునరావాసం నిమిత్తం జిల్లాకు వచ్చిన రూ.2 కోట్లలో నాలుగో వంతు కూడా చెల్లించలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, న్యాయవాదులు భూపతి సునీల్‌కుమార్, పొందుగుల ప్రకాష్, మాల మహానాడు నాయకుడు కాకుమాను రవి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష 3న

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ డిసెంబరు 3న విజయవాడలో ఆవేదన దీక్ష చేపడుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సత్వర న్యాయం కోసం విజయవాడ కేంద్రంగా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ రాష్ట్రంలో 19.52 లక్షల మంది ఖాతాదారులను రూ.3986 కోట్లకు మోసం చేసిందని గుర్తు చేశారు. 8 రాష్ట్రాల్లో దాదాపు 1300 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే జనవరి నాటికి ఉద్యమం చేపట్టి 12 సంవత్సరాలు అవుతుందన్నారు. కంపెనీ ఆస్తులు విక్రయించి సమస్య పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

మల్లన్న సేవలో మంత్రి వాసంశెట్టి సుభాష్

మంత్రికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామిని మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం అందించారు. తొలుత మంత్రి రాహుకేతు పూజల్లో పాల్గొన్నట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని తెదేపా నేతలు దర్శి భాస్కరరావు, వలివేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో ఆరవై ఏళ్ల క్రితం వైద్య విద్య అభ్యసించి.. వృత్తిరీత్యా స్వస్థలం, వివిధ ప్రాంతాలు, ఇతర దేశాల్లో సేవలందిస్తున్న వారంతా గుంటూరులో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలవనున్నట్లు సీనియర్ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఎన్.వి.రమణారావు తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్‌లోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 60 ఏళ్ల తర్వాత తొలిసారిగా తమ బ్యాచ్ గుంటూరులో కలుసుకోనుండడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం బృందం సభ్యులంతా 82 ఏళ్లు నిండినవారేనన్నారు. చదువు పూర్తయిన తర్వాత బ్యాచ్ విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని క్యాపిటల్ హోటల్‌లో గురువారం ఉదయం 9 గంటలకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల, జీజీహెచ్‌ను సందర్శించి వాటి అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలపై ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారితో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

91.9FM Vijayawada — ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

నీటి వినియోగదారుల సంఘాలకు అదనపు బాధ్యతలు

మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటరత్నం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: జలవనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు వినియోగదారుల సంఘాలకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు జలవనరులశాఖ ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు. గుంటూరులోని జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయంలో బుధవారం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘాల పరిధిలో నిర్దిష్ట ఆయకట్టుతో పాటు మైనర్ చెరువుల కింద సాగవుతున్న భూములు కూడా వస్తాయన్నారు. నీటి సంఘాల సంస్థాగత, కార్యాచరణ సామర్థ్యాలను పెంచేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీరు వెంకటరమణయ్య, ఇరిగేషన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరు రమేష్, డీఈఈలు, ఏఈఈలు, డీసీల అధ్యక్షులు బూసిబాబు, తిరపతిరావు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ చేయండి

మీడియాతో మాట్లాడుతున్న కుమ్మర యువసేన ప్రతినిధులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తితిదే పరకామణిలో చోరీ ఘటనకు సంబంధించిన కేసులో ఫిర్యాదుదారైన సతీష్‌కుమార్ మృతిపై విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెళ్లూరు సుమన్ ప్రజాపతి, బొమ్మిని కోటేశ్వరరావు మాట్లాడుతూ తితిదేలో అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్‌వో), పరకామణి చోరీ కేసులో కీలకసాక్షిగా ఉన్న సతీష్‌కుమార్ కేసు విచారణ కోసం వెళుతూ మృతి చెందడం తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. సతీష్‌కుమార్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి నిందితులకు శిక్ష పడే విధంగా చేసి న్యాయాన్ని కాపాడాలని కోరారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసేవారిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించడంతోపాటు రూ.2 కోట్లు పరిహారం ఇవ్వాలని, ఇద్దరు పిల్లల పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. శాలివాహన సంఘం అధ్యక్షుడు అన్నవరపు ప్రభాకర్, నాయకులు బాపనపల్లి వాసు, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

శబరిమలలో గుండెపోటుతో భక్తుడి మృతి

మంత్రి లోకేశ్ చొరవతో స్వగ్రామానికి మృతదేహం

వెంకటకృష్ణ (పాత చిత్రం)

తాడేపల్లి, న్యూస్‌టుడే: అయ్యప్ప దర్శనార్థం వెళ్లి శబరిమలలో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి భౌతికదేహాన్ని మంత్రి లోకేశ్ చొరవతో స్వగ్రామం చేర్చారు. వివరాల్లోకెళితే.. ఇప్పటం గ్రామానికి చెందిన వెంకటకృష్ణ(30) (మాల ధరించలేదు) స్థానిక మాలధారులతో కలిసి మూడు రోజుల కిందట శబరిమల వెళ్లారు. ఈ నెల 17న పంబా నదిలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై మృతి చెందారు. తోటివారు సమాచారం కుటుంబ సభ్యులకు తెలపగా.. తమకు మృతదేహాన్ని తెచ్చుకునే ఆర్థిక స్తోమత లేదని వారు స్థానిక తెదేపా నాయకులను ఆశ్రయించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ వెంటనే స్పందించారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో వెంకటకృష్ణ మృతదేహాన్ని మంగళవారం ఇంటికి చేర్చారు. మృతుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక తెదేపా నాయకులు, పలువురు గౌడ సామాజికవర్గ ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీవీఐపీల భద్రతపై ప్రత్యేక దృష్టి

డ్రోన్ కెమెరాల పనితీరు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు నేరవార్తలు, తుళ్లూరు, న్యూస్‌టుడే: వీవీఐపీల భద్రతపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వెలగపూడి సచివాలయం, పరిసర ప్రాంతాల్లో భద్రత చర్యలను బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. గరుడ కమాండ్ కంట్రోల్ గదిని సందర్శించారు. నిఘా నేత్రాల పనితీరు, నిర్వహణపై ఆరా తీశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు, కరకట్ట రోడ్డు మార్గాల్లో నిఘా నేత్రాలను పరిశీలించాలని చెప్పారు. డ్రోన్ కెమెరాల పనితీరు పరిశీలించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీలు మురళీకృష్ణ, శ్రీనివాసులు, సీఐలు అళహరి శ్రీనివాసరావు, కొంకా శ్రీనివాసరావు, మాతంగి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు ఉన్నారు.

నూనె గింజల సాగు పెంచాలి

రైతుకు మందులు అందజేస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతులు నూనె గింజల సాగును పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా మన దేశం వంట నూనె దిగుమతులు తగ్గించుకునేలా చూడాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. ఆంగ్రూ, నూనెగింజల పరిశోధన స్థానం (ఐఐఓఆర్) హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ ఉప ప్రణాళిక కింద నువ్వులు, వేరుశనగ పంటల్లో దిగుబడి పెంచడానికి శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ నాణ్యమైన నూనెకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు సాగును పెంచాలన్నారు. ఆంగ్రూ పరిశోధన, విస్తరణ విభాగాల సంచాలకుడు పి.వి.సత్యనారాయణ, జి.శివనారాయణ వేరుశనగలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పలువురు శాస్త్రవేత్తలు పురుగులు-తెగుళ్ల యాజమాన్యం, వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకునే విధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సీ రైతులకు బయో ఫెర్టిలైజర్స్‌ని అందజేశారు.

ప్రకటన

గుంటూరు సిటీ, చుట్టుగుంట, హనుమాన్ నగర్ 3వ లైను, డోరు నెం.26-35-14ఎ కాపురస్తులు సముద్రాల సుధీర్ గారి భార్య 47 సం.లు వయస్సు గల నాలాది (సముద్రాల) మేరిరాణి సంజాయిషీ ప్రకారం తెలియజేయునది.

మా క్లైయింట్ గుంటూరు సిటీ, పట్టాభిపురం, రవీంద్రనగర్ 1వ లైను, కె.వి. సుబ్బారావు రెసిడెన్సీ, ప్లాటు నెం.జి2రు కాపుర్తులు లేటు కొండా వెంకట శివ మంగరాజు గారి భార్య కొండా శ్రీలత గారి వద్ద దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయంపొంది అడ్వాన్సు చెల్లించి విక్రయ ఖరారు అగ్రిమెంటు వ్రాయించుకొని యున్నారు. ఈ క్రింది దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి విక్రయంపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి పదిహేను (15) రోజులలో క్రింది న్యాయవాదిని స్వయముగా కాని ప్లీడరు ద్వారా లేదా వ్రాత పూర్వక అభ్యంతరములు తెలియజేయవలసినదిగా కోరడమైనది. అలా ఎటువంటి అభ్యంతరములు తెలియజేయని యెడల దిగువ షెడ్యూలు దాఖలాస్తి నిర్వివాదమైన ఆస్తి అనియూ, మా క్లయింటు మిగిలిన మొత్తం సైకం చెల్లించి రిజిష్టరు చేయించుకొనగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి. నల్లపాడు సబ్.డి. యిలాకా గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ యేరియాలో చేరిన రవీంద్రనగర్ 1వ లైనులో గల నల్లపాడు గ్రామ తాలూకు డి.నెం.61/బి1, 62/బి2, బి3, బి4, బి5, 63/బి2, 64/డి, ఇ, 65/1, 73/ఎఫ్2, బి3/1, బి4/1, బి5/1, బి5/2, బి5/3, 86/2ఎ, 2బి, 87/బి, 88/బి2, 89/బి, 89/బి1-బిర్లు తాలూకు సిటీ ప్లానర్ నగరపాలక సంస్థ, గుంటూరు వారి దిః17-11-2025వ తేదీన ఎండార్స్‌మెంట్ యఫ్.యల్.ఆర్.నెం. 1330/2025/టి.యస్. - 2 దాఖలా నల్లపాడు గ్రామ సర్వే నెం.86రు, వార్డు నెం. 18రు, బ్లాకు నెం. 13రు, టి.యస్.నెం.1176రు ది గుంటూరు కో-ఆపరేటివ్ హౌస్ కన్‌స్ట్రక్షన్ సొసైటీ లిమిటెడ్ వారి ప్లాను దాఖలా ప్లాటు నెం. బి1-71-బి1రు తాలూకు డోరు నెం. 3-26-16రు గల ప్లాటులోని 'కళ్యాణ్స్ కొండా వెంకటసుబ్బారావు రెసిడెన్సి' అపార్టుమెంటునకు హద్దులు.

తూర్పు : దాసరి చిట్టిబాబు గారి ఆస్తి కొంతవరకు, నెం.బి1-75-బి1రు ప్లాటు తాలూకు గోవిందురాజుల లక్ష్మీ గారి ఆస్తి కొంతవరకు హద్దు. **దక్షిణం :** నెం.బి1-72-బి1రు ప్లాటులోని కంచిబొట్ల సాంబశివమోహన్ గారి ఆస్తి హద్దు. **పడమర :** [illegible]

బూదాల సూర్యనారాయణ, అడ్వకేట్, సెల్ నెం. 9849695243, డోరు నెం.27-22-28, [illegible]

EENADU e-Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 9701893458.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

JOBS

Wanted Export Company Staff 1. Accountant, 2. Supervisor (10th Pass), 3. Security Guard. Contact: 73864 82800, 99082 14472.

Jayalakshmi Nexa Hiring for Autonagar, Guntur. Good Opertunity for Freshers/ Experienced Whatsapp: 91007 87054.

గుంటూరు జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వయసు 50 సం||లోపు. ఆకర్షణీయమైన జీతము. 90100 42973, 82478 14976.

అకౌంట్స్ మేనేజర్ కావలెను. బికాం,5 సం||లు. అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్‌వేయగలవారు kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరులోని Elite Infra ఆఫీసు నందు పనిచేయుటకు 5 సం||లు అనుభవం కలిగిన, కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్ట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆: 77997 51199.

గుంటూరులో ఎలక్ట్రిక్ స్కూటర్స్ ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు అశోక్ లేలాండ్ దోస్త్కు డ్రైవరు కావలెను. ✆: 99496 46703.

గుంటూరులో గల కాలేజి హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు 35 సంవత్సరాల పైబడిన లేడీ వార్డెన్స్ మరియు బస్సు డ్రైవర్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164.

FACULTY/ TEACHERS

Faculty: Bio Chemistry - B.Sc., MSc&Nursing: B.Sc., M.Sc.&Employ: Inter, Degree, Computer. Age: 19-25, Con: Victoria Paramedical Institute, Gnt.✆: 0863-2222683, 98481 34028, 8332004478.

MEDICAL

Wanted Receptionist To Work In Dental Clinic. ✆ 6300569298

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్‌టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

తెనాలి

•తెనాలి •పొన్నూరు

విద్యార్థులకు అభినందన

ఏఎన్‌యూ, : విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఏఎన్‌యూ న్యాయ విభాగం విద్యార్థులను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ బుధవారం అభినందించారు. రెండు రోజుల్లో 40 దేశాలతో వివిధ అంశాలకు సంబంధించి 12 రంగాల్లో రూ.13.26 లక్షల కోట్ల విలువైన 613 ఒప్పందాలు జరిగాయని న్యాయ విద్యార్థులు శశికిరణ్, కిషోర్‌కుమార్, నిహా బాబి, ధరణి, శివశంకర్, అజయ్, హర్షిత, నేహశ్రీ, వసంతగీతిక, అశ్విని, అవంతిక చెప్పారు. కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించిన అధ్యాపకులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం నేడు

కొల్లిపర: మండల పరిధిలోని దావులూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలును మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ప్రారంభిస్తారని పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

నిత్యాన్నదానానికి విరాళాలు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన టి.సాంబమూర్తి పేరుతో ఆయన భార్య శోభ రూ.50,116, గుంటూరుకు చెందిన నందిగామ సాంబశివరావు, నర్రా రామమూర్తి, గింజుపల్లి గోపాల్ స్వామి పేర్ల మీద కుటుంబ సభ్యులు శిరీష, ప్రసాద్ రెడ్డి దంపతులు రూ.50,000 విరాళం అందజేశారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం:	1000
అత్యల్పం:	600
సగటు:	800

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణంలోని విభాగినులు, విద్యుత్తు స్తంభాలపై అధిక సంఖ్యలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గాలికి అవి ఊడిపోయి వేలాడుతూ ఒక్కసారిగా వాహనాల మీదకు వస్తున్నాయి. **- రవీంద్ర, సుభాని, తులసీ - తెనాలి.** ✔ వాటిని సత్వరం తొలగింపజేస్తాం. ? తెనాలి పట్టణ పినపాడు మహమ్మద్ జలాలుద్దీన్ రోడ్డులో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- స్థానికులు, పినపాడు.** ✔ వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్

స్పందనకు వందనం

★ తెనాలి పట్టణ షరాఫ్‌బజార్‌లో నడవడానికి కూడా వీలు లేకుండా వాహనాలు పెడుతున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు స్పందించారు. ట్రాఫిక్ సిబ్బందితో వాహనాలను తొలగింపజేశారు. ★ తెనాలి పట్టణ బస్టాండ్ ప్రాంతంలోని కాలువల్లో మురుగు పారకం లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పూడికలు తీయించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

? పొన్నూరు పట్టణ పరిధి 12వ వార్డులోని నీటి కుళాయి వాల్వు లీక్ పోవడంతో నీరు వృథాగా పోతున్నాయి. **- పి.దేవేడ్, 12వ వార్డు** ✔ కుళాయికి వాల్వు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు పరిధి 17వ వార్డులోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. **-కె.ప్రదీప్, 17వ వార్డు, డి.వెంకట్రావు, వీవర్స్ కాలనీ.** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

★ పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలో చెత్త పేరుకుందని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో చెత్తను తొలగింపజేశారు. ★ శాంతినగర్‌లో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నలుగురు యువకులు ఒకే వాహనంపై వేగంగా వెళ్లడం, తండ్రి వెనుక కూర్చుని చిన్న పిల్లాడితో వాహనాన్ని నడిపించడం, పోలీసులను చూసి రోడ్డుకు రెండో వైపు నుంచి జారుకుంటున్న ట్రిబుల్ రైడర్స్.. ఈ పరిస్థితులు చూసి త్రీ టౌన్ సీఐ సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం ఉదయం చెంచుపేటలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించే నిమిత్తం సిబ్బందితో పర్యవేక్షణ చేపట్టారు. నిబంధనలను పాటించని చోదకులను ఆపి.. తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిధులున్నా.. అభివృద్ధి పనులేవి..?

కొల్లిపర, న్యూస్‌టుడే

ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారడం లేదు. ప్రజాప్రతినిధుల మాటలను పెడచెవిన పెడుతున్నారు. కొల్లిపర మండల పరిధిలో ఈ నెల 1వ తేదీకి నాటికి జనరల్ ఫండ్ రూ.72 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.99.82 లక్షలు ఉన్నాయి. వెరసి రూ.1.71 కోట్ల నిధులు వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. అయినా పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులపై దృష్టిసారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంచనాల తయారీలో జాప్యం..

వివిధ పద్దుల్లో గ్రామాభివృద్ధికి గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేశారు. సంబంధిత ప్రతులను పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులకు అందజేశారు. నెలలు గడుస్తున్న సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించడంలో తీవ్రజాప్యం చూపుతున్నారు. ★ వరద ముంపు సమయంలో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని పరిగణలోకి తీసుకుని బొమ్మువానిపాలెం శివారు కొత్తూరులంక అభివృద్ధికి గ్రామ సర్పంచి తీర్మానాలు చేసి పంచాయతీరాజ్ అధికారులకు గత నెలలో అందజేశారు. పంచాయతీ పరిధిలో రూ.21.50 లక్షలు సిద్ధంగా ఉన్నాయి. ★ అత్తోటలో రోడ్డు వెడల్పు కోరుతూ పంచాయతీలో తీర్మానం చేశారు. వివిధ పద్దుల్లో రూ.36 లక్షలు సిద్ధంగా ఉన్నాయి. ★ మున్నంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అంతర్గత రోడ్లు, మురుగునీటి సమస్యల పరిష్కారానికి తీర్మానాలు అధికారులకు అందజేశారు. రూ.30 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నాయి.

అధ్వానంగా కొత్తూరులంక రోడ్డు..

అధికారులు తీరు మార్చుకోవాలి

గ్రామ పంచాయితీ తీర్మానాలను అధికారులు పట్టించుకోవడం లేదు. మాది వరద ముంపు గ్రామం. అంతర్గత రోడ్ల అభివృద్ధి కోసం తీర్మానం సమర్పించి నెలలు గడుస్తున్నాయి. సమస్యను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాను.

- కొల్లిరజని, బొమ్మువానిపాలెం సర్పంచి

ఏఎన్‌యూలో ఫార్మసీ ర్యాలీ

ఏఎన్‌యూ: ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏఎన్‌యూలోని ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఫార్మసీ కళాశాల నుంచి ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వరకు ర్యాలీ కొనసాగింది. రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, ప్రిన్సిపల్ ఆచార్య దివ్యతేజోమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రముఖ రంగస్థల కళాకారుడు నేతి పరమేశ్వర శర్మ, సీతామహాలక్ష్మి దంపతుల స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి 2వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో ఇ.పి.నెం.87/2024 ఇన్ ఒ.యస్.నెం.445/2022

బిట్వీన్:

చుక్కా నాగమ్మ, భర్త. లేటు రామ కోటేశ్వరరావు, నివాసం.డోర్ నెం.2-126, బుర్రిపాలెం గ్రామం, తెనాలి మండలం, గుంటూరు జిల్లా. ...డి.హెచ్.ఆర్

మరియు

కొలపల్లి నరేష్, తండ్రి. సత్య నారాయణ, నివాసం. డోర్ నెం.1-101, బుర్రిపాలెం గ్రామం, తెనాలి మండలం, గుంటూరు జిల్లా. ...జె.డి.ఆర్.

పై నెంబరు దావాలో జప్తుకాబడిన ఇ.పి.లో యస్టిహారు జారీకాబడి జప్తు ఖాయమైన జె.డి.ఆర్. తాలుకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయుటకు శ్రీ కోర్టు వారు ది.08-12-2025కి వాయిదా వేసినారు.కావున వేలంలో పాల్గొనదలచిన వారు వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై వేలంలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

Schedule: Guntur Dt., Tenali Sub. Dt., Tenali(Md), Burripalem(V), 1st Block, D.No.1-107, D.No.185/7 an extent of 338.8Sq.Yds. of site and therein Acc sheet shed is bounded by within the following boundaries, **East:**Panchayat Bazar, **South:** Site of Vadlamanu Sundara Rao, **West:** Site of Vogirala Koti Lingam, **North:** Site of P.Adi Lakshmi Within these boundaries an extent of 338.8 Sq.Yds of site and there in acc shed

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

డి.హెచ్.ఆర్ విలువ రూ.16,00,000/-

అమీనా విలువ రూ.16,00,000/-

వేలం వాయిదా ది.08-12-2025

ఫర్దర్ హియరింగ్ :15-12-2025

నోట్: ఇ.సి. దాఖలా 2వ సీరియల్ నెంబర్‌లో తెలిపిన జె.డి.ఆర్.అయిన కొలపల్లి నరేష్ ది.06-10-2022వ తేదిన అంబటి సుబ్బారెడ్డి గారి పేరుతో రిజిస్టరు చేసిన దస్తావేజు చెల్లనేరదు. ది.01-10-2022వ తేదిన ఈ నెంబరు డి.హెచ్.ఆర్. ఐ.ఏ. నెం.174/2022న షెడ్యూలు ఆస్తిని జప్తుచేసిన దరిమిలా సదరు జప్తు ఖాయమైనందున సదరు విక్రయమునకు లోబడనవసర రము లేదు.కావున ఇ.సి.దాఖలా అన్యాక్రాంతములులేవు.

జె. శివరామ కుమార్, డి.హెచ్.ఆర్. తరుపున అడ్వకేట్, తెనాలి, గుంటూరు జిల్లా. సెల్: 90003 50009

పదిలో ఉత్తీర్ణత శాతం పెరగాలి

పొన్నూరు, న్యూస్‌టుడే: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని డీఈవో సీవీ రేణుక అన్నారు. బుధవారం నిడుబ్రోలు, పచ్చల తాడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించిందని చెప్పారు. సి, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులను ఏ, బీ గ్రేడుల్లోకి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రాణి, జిల్లా స్థాయిలో అండర్14 విభాగంలో కబడ్డీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అమూల్యలను అభినందించారు. ఎంఈవోలు రాజు, విజయ భాస్కర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిణి సీవీ రేణుక

'ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నాం'

కొల్లిపర, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కొల్లిపర పాల కేంద్రం ఆవరణలోని కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 13,381 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్-2 నిధులు జమ చేశామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం, మినుములు, పత్తి, మొక్కజొన్న, పెసలు తదితర పంటలను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఉన్నా హత్యా రాజకీయాలకు తెగపడుతొండన్నారు. హత్యలు, ఆత్మహత్యలు చిత్రీకరించడంలో వైకాపా నేతలు నిష్ణాతులన్నారు. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను కూటమి సర్కారు చెల్లించిందని గుర్తుచేశారు. సబ్ కలెక్టరు సంజనా సింహ, ఏడీఏ విజయ్‌బాబు, తెదేపా నాయకులు వంగా సాంబిరెడ్డి, భీమవరపు చినకోటిరెడ్డి, నక్కా అనిల్‌కుమార్, భాజపా నాయకులు వాసుదేవనాయుడు, మురళి, తహసీల్దార్ సిద్ధార్థ, ఏవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

దుర్గాకామేశ్వరరావుకు 27న అవార్డు ప్రదానం

కొల్లిపర, న్యూస్‌టుడే: విద్యావంతులు, ప్రజ్ఞాశాలి డాక్టరు పెమ్మరాజు దుర్గాకామేశ్వరరావుకు భారత జ్యోతి అవార్డును తెనాలి ప్రచురణలు ఆధ్వర్యంలో ఈ నెల 27న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అందించనున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం కొల్లిపరలో ఆయన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సన్మాన సభకు శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, హైకోర్టు న్యాయవాది కె.ఇంద్రనీల్‌బాబు, విశ్రాంత పీడీ నల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు రానున్నట్లు చెప్పారు. చిత్రకారులు రాయన గిరిధర్‌గౌడ్, చిలువూరి సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

తెనాలి(కొత్తపేట): నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో దేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సాంబశివుడు తదితరులు

'కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది'

పొన్నూరు, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పొన్నూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ షేక్ రిజ్వాన అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం రెండవ విడత నగదు పంపిణీ చెక్కును విడుదల చేశారు. ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రైతులందరి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు వెల్లడించారు. తెదేపా నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వెంకటేశ్వరరావు, నాయకులు రామారావు, బాబురావు, స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కొల్లిపర, న్యూస్‌టుడే: బాధితులకు రక్షణ సైన్యం అత్యవసర విపత్తుల విభాగం ఎప్పుడు అండగా ఉంటోందని రాష్ట్రీయ సంఘ నాయకులు దాసరి డానియేల్‌రాజు అన్నారు. మండల పరిధిలోని కొత్తూరులంక, ఈపూరులంక, అత్తలూరివారిపాలెం తదితర గ్రామాల్లో మొంథా తుపానులో నష్టపోయిన బాధిత కుటుంబాలకు బుధవారం వారు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

అధ్యాపకులు ఐక్యంగా పనిచేయాలి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: అధ్యాపకులంతా ఐక్యంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం పనిచేయాలని ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ కోరారు. అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం హెర్బల్ గార్డెన్‌లో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

తాగునీరు వృథా..!

తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల మార్గంలో భూగర్భంలోని పైపులు పగిలి తాగు నీరు వృథాగా పోతోంది. పగిలిన పైపుల ద్వారా జలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని.. సత్వరం మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

అదుపుతప్పితే అంతే..!



మండల పరిధిలోని కట్టెంపూడి-దండమూడి ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే వాహనదారులు ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

చూశారా.. ఇకనైనా మారుస్తారా?

మండలంలోని ఆలూరు పరిధిలో తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన కుళాయిలు కొన్ని మురుగు నీటి కాలువల్లో ఉన్నాయి. పైపులైనుకు లీకు ఏర్పడితే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని.. వ్యాధులు వ్యాప్తి చెందుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి తాగునీటి కుళాయిలను పక్కకు మార్చే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

చతుర్థ వర్ధంతి

జననం: 16-03-1952 మరణం: 20-11-2021

కీ॥శే॥ కోగంటి సురేష్‌బాబు గారు

తెనాలి.

మీరు మా జీవితంలో చూపిన ప్రతి అడుగు, ఇచ్చిన ప్రతి సలహా మాకు ఓ మార్గదర్శకం, మీరు నేర్పిన విలువలు, ఆదర్శాలు మా జీవితానికి ప్రేరణలు. ప్రేమకు ప్రతిరూపంగా, ధైర్యానికి నిలువుటద్దంగా, మా ఎన్నో తల్లై నడిపించిన మీరు భౌతికంగా దూరమై 4 సంవత్సరాలు గడిచినను మా హృదయాలలో ఎప్పటికీ నిలిచే ఉంటారు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: కోగంటి అమ్మాజి చెల్లెలు: జాగర్లమూడి ఊర్మిళాదేవి

కుమారులు: కోగంటి సుమంత్, కోగంటి హేమంత్

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని ఫిర్యాదు

పెదకాకాని, న్యూస్‌టుడే: చనిపోయిన వ్యక్తి జీవించి ఉన్నారని చిత్రీకరించి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేసినట్లు దానబోయిన ఆంజనేయులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

జనవరి లోపు బయోమైనింగ్ పనులు పూర్తి చేయాలి

తెనాలి(కొత్తపేట): వచ్చే ఏడాది జనవరి లోపు ఒప్పందం ప్రకారం బయోమైనింగ్ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ఆర్డీ ఎస్.హరికృష్ణ సూచించారు. ఆయన బుధవారం కంపోస్టుయార్డు, మురుగునీటి శుద్ధి ప్లాంటు, హోం కంపోస్టును పరిశీలించారు. ఇప్పటికే నెలకొల్పిన వర్మీ కంపోస్టు, బయోగ్యాస్, మురుగు నీటిశుద్ధి కొబ్బరి పీచు తయారీ వంటి వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పులె కాలనీలో మురుగునీటి శుద్ధి ప్లాంటులో శుద్ధి చేసిన నీటిని గ్లాసులో తెప్పించి వాసన చూశారు. ఇప్పటి వరకు కంపోస్టుయార్డులో వ్యర్థాల బయోమైనింగ్ చేసిన నేల కనిపించట్లేదని గుంటూరు ప్రజారోగ్యశాఖ ఎస్ఈ డి.శ్రీనివాస్ గుత్తేదారును నిలదీశారు. చెప్పేదొకటి చేసేది మరొకటి అయితే పని చేసినట్లు ధ్రువీకరణ పత్రం మంజూరు చేయమని స్పష్టం చేశారు. మున్సిపల్ ఇంజినీరు పి.శ్రీకాంత్, ఆరోగ్యాధికారి ఏసుబాబు, ప్రజారోగ్యశాఖ డీఈఈ జె.శివరామకృష్ణ, ఏఈ సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ వ్యవస్థాపకుడి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి నెహ్రూనికేతన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన డి.వి.ప్రకాశరావు (80) బుధవారం సాయంత్రం పట్టణ పద్మశాలిపేటలోని తమ స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

తప్పులు జరగకుండా ప్రణాళికలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఏఎన్‌యూలో పరీక్షల నిర్వహణలో లోపాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్ పరీక్ష భవన్ అధికారులు, పీజీ పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య సుబ్బారావుతో సమావేశమయ్యారు. పరీక్షల నిర్వహించే తేదీకి 30 రోజుల ముందుగానే యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మరోసారి ఇలాంటి ఇబ్బందులు ఎదురైతే చర్యల తప్పవని స్పష్టం చేశారు. కొంతమంది విద్యార్థుల హాల్‌టికెట్లపై వాళ్ల ఫొటోలు లేకపోవడంతో వాటిని ముద్రించిన సంస్థకు షోకాజ్ నోటీసు ఇచ్చామని సీఈ ఆలపాటి శివరామ్ ప్రసాద్ రెక్టార్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం నుంచి అన్ని సజావుగా సాగుతున్నాయని సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు చెప్పారు.

అవీ ఇవీ

ఉద్యోగి తీరుపై నివేదిక అందజేత

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధి సాలిపేటలోని పెరుగు మార్కెట్-2 వార్డు అద్దె సచివాలయంలోని ఉద్యోగి మంగళవారం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిసి విచారణకు ఆదేశించినట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు బుధవారం తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ విల్సన్ జయకర్ ఆ సచివాలయ ఉద్యోగులు, అద్దె భవనం యజమాని, పలువురు స్థానికులను విచారించి తయారు చేసిన నివేదికను కమిషనర్‌కు అందించారు.

వ్యక్తిగత మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకోండి

చేబ్రోలు,న్యూస్‌టుడే: నిర్మాణం చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఎస్‌సీ జిల్లా సమన్వయకర్త జోసెఫ్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

న్యాయస్థానంలో నిందితుడి హాజరు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: చెంచుపేటలో 2021లో యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుల్లో ఒకరైన విజయ్‌బాబు అలియాస్ అప్పును బుధవారం పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసు విచారణకు వచ్చిన క్రమంలో రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న అప్పును పీటీ వారెంటపై ఇక్కడికి తీసుకువచ్చారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం తొలగింపు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఐతానగర్ వార్డు సచివాలయం పక్కన ఉన్న మున్సిపల్ స్థలంలో అనుమతి లేని నిర్మాణం తొలగింపుపై బుధవారం స్థానికులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీతో వాటిని కూల్చివేశారు. అధిక సంఖ్యలో స్థానికులు అక్కడికి వచ్చి అధికారుల చర్యపై అభ్యంతరం తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఐతానగర్‌కు చెందిన 65 సంవత్సరాల పద్మ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ మందులు వాడుతున్నారు. ఈ నెల 15న విపరీతంగా కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకూ రాలేదని కుటుంబ సభ్యుల బుధవారం ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, సిఎ-5, సిఎఫ్‌సి ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

స్థిరాస్తి ఇ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన

ఇఎమ్‌డి (ధరావత్తు) & ఆన్‌లైన్ డాక్యుమెంట్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 23.12.2025, మధ్యాహ్నం గం. 12-00 లకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం నోటీసు.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా/చార్జ్, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి ఉంచబడినవి. సదరు ఆస్తులు అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్ వారిచే లాంఛనాత్మకంగా స్వాధీనత చేసుకోబడి దిగువ నిర్దేశించబడిన నియమ నిబంధనలకు లోబడి "ఎక్కడ ఉన్నది, అక్కడ అలానే" "ఏది ఉంటే అది అలానే" ప్రాతిపదికన దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్ పోర్టల్ https://www.ebkray.in ద్వారా విక్రయించబడతాయి.

ఆసక్తిగల కొనుగోలుదారు ఏదైనా బ్యాంకు పనిదినములో సంబంధిత అధికారి గారి ముందస్తు అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకొనవచ్చును.

ఋణగ్రహీత : శ్రీ మునావత్ జగన్నాథం (లేటు), తండ్రి : కపురా, డి.నెం. 1-80, లంబాడిపాలెం, తూములూరు గ్రామం, కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా-522304.

ఋణగ్రహీత యొక్క చట్టపరమైన వారసులు : 1) శ్రీ మునావత్ సేతు రామ్ నాయక్, (కుమారుడు), తండ్రి: ఎం. జగన్నాదం (లేటు), డి.నెం. 1-80, లంబాడిపాలెం, తూములూరు గ్రామం, కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా-522304. 2) శ్రీమతి మునావత్ రూపా బాయి, (భార్య), భర్త: ఎం. జగన్నాదం (లేటు), డి.నెం. 1-80, లంబాడిపాలెం, తూములూరు గ్రామం, కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా-522304.

బకాయి మొత్తం : టాప్-అప్ అకౌంట్ నెం.35599253777 కొరకు తేది.19.12.2024 నాటికి రూ. 15,22,180/- (అక్షరాల పదిహేను లక్షల ఇరవై రెండు వేల నూట ఎనభై రూపాయలు మాత్రమే) + ప్లస్ పైన పేర్కొన్న మొత్తం పై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వితో కలిపి చెల్లించవలెను.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, కొల్లిపర సబ్-రిజిస్ట్రార్, కొల్లిపర మండలం, తూములూరు గ్రామం, 14వ బ్లాక్, డోర్ నెం. 14 - 117సి, టిఎస్ నెం.824/25 లో ఉన్న 225 చ॥గ॥లకు సమానమైన 188.12 చ॥మీ॥ల ఇంటి స్థలం. ఈ ఆస్తి అమ్మకపు దస్తావేజు నెం. 341/2006, తేది: 17.04.2006 ప్రకారం శ్రీ మునావత్ జగన్నాథం (లేటు), తండ్రి కపురా గారికి చెందినది. **హద్దులు:** తూర్పు: ఎ. వేమారెడ్డి ఇతరుల స్థలం-25 లింకులు, దక్షిణం: జె కోటి రెడ్డి గారి స్థలం-118 లింకులు, పడమర: పంచాయితీ బజార్-43 1/2 లింకులు, ఉత్తరం: బి సీతమ్మ, సింహాద్రి వెంకయ్య గారి స్థలం-118 లింకులు.

విస్తీర్ణం 225 చ॥గ॥ లకు సమానమైన 188.12 చ॥మీ॥ల ఇంటి స్థలం అన్ని యాజిమెంటరీ హక్కులతో.

రిజర్వు ధర : రూ. 17,50,000/- ధరావత్తు : రూ. 1,75,000/-

బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

ఇ-వేలం తేది సమయం: 23.12.2025 మ॥ 12.00 గం॥ల నుండి

(5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)

ఇ.ఎం.డి (ధరావత్తు) సొమ్మును నెఫ్ట్ / ఆర్ టి జియస్ ద్వారా ఇఎమ్ అకౌంట్ ఈ-ఆక్షన్ అకౌంట్ పేరున, ఖాతా నెం.42341799750, IFSC Code: SBIN0064127 నకు జమచేయవలెను.

అమ్మకం బ్యాంకు వారి నియమ నిబంధనలకు లోబడి జరుపబడును. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా M/s PSB Alliance, https://www.ebkray.in వారి వెబ్ పోర్టల్ www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices మరియు హెల్ప్ లైన్ నెం.8291220220, హెల్ప్ లైన్ ఇ-మెయిల్ ఐడి: support.ebkray@psballiance.com మరియు ఇ-వేలము నియమ, నిబంధనలు పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరడమైనది.

ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన వివరాలకు చీఫ్ మేనేజర్, మొబైల్: 89217 68455, ఇ-మెయిల్ ఐడి: sbi.64127@sbi.co.in (లేదా) M/s శ్రీ విజయ మార్కెటింగ్ రికవరీ ఏజన్సీ, బ్రాంచ్ ఆఫీస్, గుంటూరు, సెల్ నెం.93475 44565 మరియు హెడ్ ఆఫీస్, గుంటూరు, సెల్ నెం : 9603061724, ఇ-మెయిల్ ఐడి: srikanthdharmaraju@gmail.com వారిని సోమవారం నుండి శనివారం వరకు పనిదినములలో సంప్రదించవచ్చును.

తేది : 19.11.2025, ప్రదేశం : మంగళగిరి సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నిర్యాణం



కీ॥శే॥ శ్రీ దాసరి ప్రకాశరావు, M.Sc., B.Ed., గారు

నెహ్రూనికేతన్ వ్యవస్థాపకులు, తెనాలి

నెహ్రూనికేతన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు కీ॥శే॥ శ్రీ దాసరి ప్రకాశరావు గారు ది.19-11-2025 బుధవారం శివైక్యం చెందినారు.

అంతిమయాత్ర : ది.21-11-2025 శుక్రవారం ఉదయం 10గం॥లకు తెనాలి సాలిపేట, విక్రాంతబజారులోని మా స్వగృహం నుండి బయలుదేరును. కావున తెలియపరచడమైనది.

అశ్రునయనాలతో.. కుటుంబసభ్యులు మరియు నెహ్రూనికేతన్ సిబ్బంది, ✆ 98493 97458

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

విద్యార్థి దశ జీవితానికి పునాది

మాట్లాడుతున్న ఎస్సై వెంకట్

మంగళగిరి గ్రామీణం: విద్యార్థి దశ జీవితానికి పునాది అని మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ పేర్కొన్నారు. చినకాకాని జడ్పీ హైస్కూల్ పాఠశాలలో బుధవారం విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రీడల్లో రాణించి మంచి అవకాశాలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పెండెం రామారావు, పీడీ కాకుమాను సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముట్లూరు రామలింగేశ్వరునికి పూజలు

వట్టిచెరుకూరు: కార్తికమాసం ముగియనున్న నేపథ్యంలో బుధవారం శైవ క్షేత్రాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మార్మోగాయి.

దుగ్గిరాల: స్థానిక రైలుపేటలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73171 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

మంగళగిరి గ్రామీణం: చినకాకాని పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి వద్ద వ్యర్థాలు పేరుకుని దుర్వాసన వస్తుందని ఎన్‌ఆర్‌ఐ సిబ్బంది, ప్రయాణికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులు, క్రేన్ సాయంతో వ్యర్థాలను తొలగింపజేసి.. బ్లీచింగ్ పిచికారీ చేయించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో స్వామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన అబ్బినేనిగుంటపాలెం, పాలపర్రులలో చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. కార్యదర్శులు నాగయ్య, గోపి పాల్గొన్నారు.

పేదల గూడు.. ప్రభుత్వం తోడు

పీఎంఏవై 2.0 (గ్రామీణ) దరఖాస్తులకు 30 వరకు గడువు

తుళ్లూరు, మేడికొండూరు, న్యూస్‌టుడే: పేద సొంతింటి కలను సాకారం చేయటానికి కూటమి ప్రభుత్వం వడి వడిగా అడుగులు వేస్తోంది. 'సూపర్ సిక్స్' పథకాల్లో ఇచ్చిన హామీ మేరకు అందరికీ ఇళ్లు పథకాన్ని అమలు చేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 కింద ఇప్పటికే పూర్తయిన 3 లక్షల ఇళ్లకు ప్రభుత్వం ఇటీవల గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించింది. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనే అర్హులకు ఈ నెల 30 వరకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. తాడికొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 3 వేల మంది లబ్ధిదారులు అర్జీలు అందజేశారు. వాటిని హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నారు.

గృహాలు నిర్మించుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు కోరుతున్నారు.

ఫిరంగిపురంలో కొనసాగుతున్న నిర్మాణం

ఎవరు అర్హులు..

ఆదాయం తక్కువ ఉన్న వెనుకబడిన వర్గాల కోసం ఈ పథకాన్ని తీసుకువచ్చారు. స్థలం ఉండి తెల్ల రేషన్ కార్డు కలిగి పక్కా గృహం లేని వారు ఈ పథకాన్ని అర్హులు.

మండలం	దరఖాస్తు దారులు
మేడికొండూరు	780
ఫిరంగిపురం	995
తాడికొండ	791
తుళ్లూరు	435

రాష్ట్ర నివాసితులై ఉండాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డు, 10 ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉన్నవారు ఆదాయపన్ను చెల్లింపు చేసేవారు, గతంలో గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు అనర్హులు.

ఇలా చేయొచ్చు..

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం 2.0 ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. స్థలం యొక్క డాక్యుమెంట్లు, ఆధార్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పనికి ఆహార పథకం జాబ్ కార్డులు, బ్యాంక్ ఖాతా పుస్తకం, లబ్ధిదారుల ఫొటోలతో అర్జీలు సమర్పించాలి.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తాడేపల్లి: మంత్రి నారా లోకేశ్ చొరవతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం తాడేపల్లి తెదేపా నాయకులు బాధితులకు పంపిణీ చేశారు. 18వ వార్డుకు చెందిన వాడపల్లి రమేష్‌కు రూ.50వేలు, 19వ వార్డుకు చెందిన శరణ్యకు రూ.2.50లక్షలు చెక్కులను పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

పెదనందిపాడు: పసుమర్రు బెండు చోరీ కేసుకు సంబంధించి ఫిర్యాదుదారు సతీష్‌కుమార్ మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బుధవారం ప్రజా సంఘాల నాయకులు పెదనందిపాడు పాతబస్టాండ్ కూడలి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. దోషులను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎస్సై మధుపవన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, భూషణం, మాణిక్యారావు, వాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుగ్గిరాల పీహెచ్‌సీకి మహర్దశ

మంత్రి లోకేశ్ చొరవతో రూ.1.93 కోట్లు మంజూరు


భవనం లోపల గోడలకు పగుళ్లు

దుగ్గిరాల: దుగ్గిరాల పీహెచ్‌సీకి మహర్దశ వచ్చింది. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ. 1.93 కోట్లు కేటాయిస్తూ ఏపీ ఎంఎస్ఐడీసీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గతంలో స్థానిక మహిళా మండలి భవనాన్ని వితరణగా ఇచ్చారు. తర్వాత భవనం శిథిలావస్థకు వచ్చింది. పైపెచ్చులు ఊడిపోతున్నాయి. గోడలకు పగుళ్లు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆసుపత్రిని పరిశీలించి ఆవరణకు మెరక వేస్తామని చెప్పుకొచ్చారు. కానీ ఆచరణలో పెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పందన కన్పించింది. దుగ్గిరాలతో పాటు మంగళగిరి మండలం మందడం, పెదనందిపాడు పీహెచ్‌సీలకూ రూ.1.93 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల అభివృద్ధిలో గ్రంథాలయాల ప్రాముఖ్యత కీలకమని ఏపీ వీబీటీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.రవీంద్ర ధారి పేర్కొన్నారు. బుధవారం అమరావతిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పుస్తక పఠన ప్రాముఖ్యతను వివరించారు. లైబ్రేరియన్ డా. సి.హెచ్. వీరాంజనేయులు, ఐనవోలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

26,405 మంది రైతులకు రూ.18.24 కోట్లు పంపిణీ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అన్నదాతలను ఆదుకోవడంలో ముందంజలో ఉన్నాయని తెదేపా జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఫిరంగిపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ 2025-26 రెండో విడత లబ్ధికి సంబంధించిన నమూనా చెక్కును ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 26,405 మంది రైతులకు రూ. 18.24 కోట్ల మేర సాయం అందిస్తున్నట్లు చెప్పారు. తొలుత రాయితీపై వ్యవసాయ డ్రోన్లు, జింకు, జిప్సం, శనగలను ఆయన అన్నదాతలకు పంపిణీ చేశారు. డ్రోన్‌ను పనితీరును పరిశీలించారు. రైతులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. కాసేపు అందరికీ అన్నం వడ్డించి ఆప్యాయంగా పలకరించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని తెరపై వీక్షించారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఫిరంగిపురంలో నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కూటమి నాయకులు

మాట్లాడుతున్న కిరణ్‌చంద్, వేదికపై రాజశేఖర్

కర్షకుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని 13,443 మంది రైతుల ఖాతాలకు రూ. 8.97 కోట్లు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద జమ చేశారు. ఈ మేరకు రైతులకు చెక్కును బుధవారం మంగళగిరి మార్కెట్ యార్డులో జరిగిన రైతు సమావేశం మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సాయం అందించినట్లు తెలిపారు. ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ పెట్టుబడికి ఈ నగదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ జబీన్, తోటా పార్థసారథి, ఎండీ ఇబ్రహీం, తాడిబోయిన భాస్కర్‌రావు, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ ఎర్రగుంట్ల భాగ్యారావు, పీఏసీఎస్ ఛైర్మన్ గాదె పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం.. పట్టించుకుంటే పదిలం

వట్టిచెరుకూరు మండలంలోని కాట్రపాడు పంచాయతీ కార్యాలయ భవనం శిథిల దశకు చేరింది. ఇందులో ప్రధానమైన శ్లాబు పగుళ్లు రావడంతో ఏక్షణంలోనైనా కార్యాలయం కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోడలపై రావి, మర్రి, గడ్డి మొక్కలు పెరిగాయి. వీటివేళ్లు భవనంలోకి చొచ్చుకువెళ్లడంతో వర్షపు నీరు లోపలికి చేరి దస్త్రాలు పాడవుతున్నాయి. విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కొత్త భవనం నిర్మించేందుకు రూ.30 లక్షలు నిధులు అవసరమని, వీటిని మంజూరు చేయాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు మూడు దఫాలుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, కాట్రపాడు(వట్టిచెరుకూరు)

కాట్రపాడు పంచాయతీ భవనం

బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

తాడేపల్లి: సమాజంలో బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సమావేశాన్ని తాడేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య, విద్య, పోలీసు శాఖలు సంయుక్తంగా బుధవారం నిర్వహించాయి. బాలలపై జరిగే లైంగిక నేరాలను నియంత్రించే చట్టం 2012 విధివిధానాలకు సంబంధించి ఆయా శాఖలు తీసుకునే చర్యలపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి డాక్టర్ శాంతకుమారి అధ్యక్షతన జరిగిన అవగాహన సమావేశంలో ముఖ్య అతిథిగా డైక్ సెంటర్ మానసిక వైద్య నిపుణుడు నాగకోటేశ్వరరావు పాల్గొన్నారు. వైద్యులు అనూష, శ్రీధర్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీఐటీయూ జిల్లా మహాసభలు ఈ నెల 23, 24 తేదీల్లో తాడేపల్లిలో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చంగయ్య తెలిపారు. బుధవారం మంగళగిరి బస్‌స్టాండ్ కూడలిలో ఆటో యూనియన్ వర్కర్స్ సమావేశానికి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోటారు వాహన చట్టాన్ని సవరణ చేస్తూ అన్నిరకాల ఫీజులు, జరిమానాలు పెంచడం అన్యాయమన్నారు. జీవో నంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం మంగళగిరి కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు: ఈ నెల 23న సాయంత్రం తాడేపల్లిలో జరగనున్న సీఐటీయూ 11వ మహా సభలను జయప్రదం చేయాలని రాజధాని డివిజన్ కమిటీ కో కన్వీనర్ ఎం.రవి పిలుపునిచ్చారు. బుధవారం రాజధాని గ్రామం రాయపూడిలో పని విరామ సమయంలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేనా..?

గుంటూరు నగర పాలక సంస్థ శివారు 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి చేబ్రోలు మండలం నారా కోడూరు మధ్య నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డును ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విస్తరించకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుందని ప్రజలు చెబుతున్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు, చేబ్రోలు, పొన్నూరు, తెనాలి, చుండూరు, రేపల్లె, బాపట్ల, చీరాల వంటి ప్రాంతాలవారు గుంటూరు వెళ్లాలంటే ఇదే కీలకమార్గం. రోడ్డు మధ్యలో డివైడర్లు లేకపోవడంతో ఎవరికివారు ఇష్టానుసారం రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు చొరవ తీసుకుని డివైడర్ ఏర్పాటు చేస్తే కొంత ఉపశమనంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు**

గుంటూరు-నారా కోడూరు మధ్య వాహనాల రద్దీ

అధ్వాన రోడ్డుతో అవస్థలు

మండలంలోని డోకిపర్రు నుంచి పేరేచర్ల వెళ్లే దారి అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా అక్కడక్కడ గుంతలు పడ్డాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పలుచోట్ల కంకర రాళ్లు బయటకు వచ్చాయి. రాత్రి గుంతలు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు కిందపడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **– న్యూస్‌టుడే, మేడికొండూరు**

పూడిక తీయక.. మురుగు పారక

తాడికొండ మండలం దామరపల్లిలోని ప్రధాన మురుగు కాలువ వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారింది. గ్రామ సచివాలయం సమీపంలో ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కాలువలో మురుగు పారక దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు గ్రామంలో మరికొన్ని కాలువలు కూడా ఇలానే ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా దీనికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, తాడికొండ**

పొంచి ఉన్న ప్రమాదం

తాడికొండ మండలం గరికపాడు గ్రామ శివారు ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు భయపడుతున్నారు. ఆటోలు, టాటాఏసీ వంటి వాహనాలు లోపలకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఈదురు గాలులు వీచినప్పుడల్లా ఇళ్లల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. **– న్యూస్‌టుడే, తాడికొండ**

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి


సామినేనిని సన్మానిస్తున్న పెరుమాళ్లు తదితరులు

పుల్లడిగుంట (వట్టిచెరుకూరు): పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'ఫాదర్ ఆఫ్ మోడ్రన్ మేనేజ్‌మెంట్'గా పేరుపొందిన పీటర్ ఎఫ్ డ్రక్కర్ జయంతిని పురస్కరించుకుని యాజమాన్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనంత స్పిన్నింగ్ మిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫణికుమార్ సామినేని హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార నైపుణ్యాలను పెంచుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల ప్రతినిధులు సన్మానించారు. ఆ సంస్థ ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు, కళాశాల సంచాలకులు కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, అకడమిక్ డీన్ జంపని కిశోర్‌బాబు, విభాగాధిపతి కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ప్రతిభ

మంగళగిరి, న్యూస్‌టుడే: విశాఖలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మంగళగిరికి చెందిన దేవతి భువన్ ప్రథమ బహుమతి సాధించాడు. విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో అతడు ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడిని ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దేవతి భగవన్నారాయణ అభినందించారు.

భువన్‌తో శిక్షకులు

'ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

మంగళగిరి: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యాన మంగళగిరిలో బుధవారం సంతకాల సేకరణ నిర్వహించారు. బాప్టిస్ట్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఆ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

మంగళగిరి: బాల్య వివాహాలు అనర్థదాయకమని ఏసీడీపీవో సౌమ్య, డీసీపీవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి, తాడేపల్లి నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలల హక్కులు, రక్షణ చట్టాలను వివరించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు 100 రోజుల పని కల్పించండి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డుదారులకు వందరోజుల పని కల్పించాలని డ్వామా ఏపీడీ, జిల్లా ఇన్‌ఛార్జి డీఈవో శ్యామలాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన క్షేత్ర సహాయకులు సమావేశంలో ఆమె మాట్లాడారు. చెరువుల కట్టలను పటిష్ఠం చేసి మొక్కలు నాటాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో స్వామిరెడ్డి, ఏపీవో సాంబశివరావు, సాంకేతిక సహాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్యామలాదేవి

రైలు గేటు తాత్కాలిక మూసివేత

మేడికొండూరు: సిరిపురం నుంచి పెద్దకూరపాడు వెళ్లే దారిలో ఉన్న రైలు గేటు మరమ్మతుల నేపథ్యంలో గురు, శుక్ర, శనివారాల్లో మూడు రోజులు పాటు తాత్కాలికంగా గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వరగానికి వెళ్లే దారిలోని రైలు గేటు గుండా వాహనదారులు రాకపోకలు సాగించవచ్చని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాలడుగు, పేరేచర్లలో కొద్ది రోజుల కిందట ఒకే రోజు దొంగతనాలు జరిగాయి. దర్యాప్తు చేపట్టిన మేడికొండూరు పోలీసులు పాలడుగుకు చెందిన కేసులో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులకు అభినందన

ఏఎన్‌యూ : విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఏఎన్‌యూ న్యాయ విభాగం విద్యార్థులను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ బుధవారం అభినందించారు. రెండు రోజుల్లో 40 దేశాలతో వివిధ అంశాలకు సంబంధించి 12 రంగాల్లో రూ. 13.26 లక్షల కోట్ల విలువైన 613 ఒప్పందాలు జరిగాయని న్యాయ విద్యార్థులు శశికిరణ్, కిషోర్‌కుమార్, నిహా బాబి, ధరణి, శివశంకర్, అజయ్, హర్షిత, నేహశ్రీ, వసంతగీతిక, అశ్విని, అవంతిక చెప్పారు. కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించిన అధ్యాపకులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏఎన్‌యూలో ఫార్మసీ ర్యాలీ: ఏఎన్‌యూ: ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏఎన్‌యూలోని ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఫార్మసీ కళాశాల నుంచి ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వరకు ర్యాలీ కొనసాగింది. రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, ప్రిన్సిపల్ ఆచార్య దివ్యతేజోమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రంగవల్లులు.. ఆనంద జల్లులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం తాడేపల్లి శాఖాగ్రంథాలయం వద్ద బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారతపై నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్‌బాషా పాల్గొన్నారు. మంగళగిరిలో బాలికలకు మెహందీ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఆరోగ్యం పాల్గొన్నారు.

తాడేపల్లి: ముగ్గుల పోటీలో..

వట్టిచెరుకూరు: వట్టిచెరుకూరులో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి తహసీల్దారు క్షమారాణి, ప్రధానోపాధ్యాయులు శాంతమ్మలు పూలమాలలేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి కనకదుర్గ ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు కుర్చీలాట, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ప్రత్తిపాడు (కాకుమాను), న్యూస్‌టుడే : ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాలను గ్రంథాలయాధికారి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గుంటూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏటుకూరు శాఖా గ్రంథాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. హెచ్ఎం వాణి, కార్పొరేటర్ లక్ష్మీదుర్గ, గ్రంథాలయ అధికారి గిరిధర్ పాల్గొన్నారు.

మంగళగిరి: మంగళగిరి నగర పరిధిలోని నిర్మలా ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ సిస్టర్ నిర్మలజ్యోతి పోటీలను ప్రారంభించారు.

దుగ్గిరాల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం దుగ్గిరాల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి బి.జ్యోతి ఆధ్వర్యంలో మెహందీ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీలకు జంపాల మురళీకృష్ణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఒకేషనల్ టీచర్ కె.బేబీషాలిని ఉన్నారు.

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు పిల్లలకు వివిధ రకాల ఆటలు, మెహందీ పోటీలు జరిగాయి. గ్రంథాలయ అధికారి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: మెహందీ పోటీలో విద్యార్థినులు

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు

తాడేపల్లి: ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం సాయంత్రం ఉండవల్లి నివాసంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర కుటుంబ సమేతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం రాత పుస్తకాలు, పెన్నులు ఈ సందర్భంగా మంత్రికి అందజేశారు.

లోకేశ్‌తో శ్రీనివాసరావు, నరేంద్ర

జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనలో సత్తా

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం నూతక్కి విజ్ఞాన విహార్‌లో 8వ తరగతి చదువుతున్న రోహిణి జాతీయ ఉత్తర ప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మందార పుష్పంలో ఉన్న భాగాలు, వాటి ప్రాధాన్యాన్ని ప్రయోగాత్మకంగా వివరించినందుకు ఈ బహుమతి లభించిందని పేర్కొన్నారు. బాలికను వైస్ ప్రిన్సిపల్స్ రామమూర్తి, సౌజన్య అభినందించారు.

రోహిణిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సురేష్

ద్విచక్ర వాహనాల చోరీ

గుంటూరు గ్రామీణం: ద్విచక్రవాహనాల చోరీపై నల్లపాడు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వారు తెలిపిన వివరాల మేరకు.. గోరంట్లలోని భాష్యం క్యాంపస్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వీరవల్లి శ్రీనివాసరావు స్కూల్ ఎదుట వాహనం పార్కింగ్ చేసి వెళ్లారు. పాఠశాలలో విధులు ముగించుకుని బయటకు వచ్చి చూడగా వాహనం కనిపించలేదని ఆయన ఫిర్యాదు చేశారు. తన ఇంటి ఎదుట నిలిపిన తన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఏటుకూరుకు చెందిన నాగఫణి లక్ష్మి ఫిర్యాదు చేశారు.

SRI MITTAPALLI PHARMACY COLLEGE
(Approved by Pharmacy Council of INDIA & Affiliated to JNTUK, KAKINADA.)
NH-16, Tummalapalem, Guntur - 522 233 ; Phone No: 9000447117
Admissions into B.Pharmacy. for 2025-26 for SPOT & Category 'B' seats (Non-NRI and unfilled NRI quota seats)
Applications are invited from eligible candidates from 19.11.2025 to 23.11.2025 for admissions into I year B.Pharmacy. under SPOT & Category "B" (Non-NRI and unfilled NRI quota seats) as per G.O.s issued by the A.P. Government from time to time in respect of admissions in un-aided non-minority self-financing Pharmacy Colleges. Admissions shall be made as per the G.O. issued by A.P. Government and as per the guidelines issued by APSCHE, Registration fee applicable for candidates as per APSCHE guidelines.
Schedule of admissions:
Admission Process : 19.11.2025to 23.11.2025
Preparation of list of selected candidates : 24.112025 to 25.11.2025
Date: 19.11.2025
SECRETARY

(c) eenadu

గుంటూరు తూర్పు

నేటి నుంచి పద్య నాటకోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళా వేదికపై రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విజయవాడ శ్రీసరేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో పద్య నాటకోత్సవాలు, పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు బి.రాజ బాబు బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం శ్రీకృష్ణరాయబారం పద్య నాటకం, అనంతరం సీవీడీ బీఎస్ గోలి లక్ష్మయ్యకు ఆర్యాభ్ర పురస్కారం ప్రదానం చేస్తారన్నారు. శుక్రవారం సాయంత్రం సత్యహరిశ్చంద్ర పద్య నాటకం, జి.మల్లికార్జునరావుకు రంగస్థల పురస్కార ప్రదానం చేస్తామన్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 41, వంగ 38, బెండ 39, పచ్చిమిర్చి 49, కాకర 30, క్యారెట్ 62, క్యాబేజీ 29, బీర 40, దొండ 64, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుడు 69, దోస 30, పొట్ల 44, చామదుంప 22, మునగ 8, గోంగూర 12, తోటకూర 20, చుక్కకూర 30, కొత్తిమీర 30, బీట్‌రూట్ 41, కీర 29, క్యాప్సికం 79, అల్లం 80, ఫ్రెంచ్ బీన్స్ 49, సొర 28, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

★ షాప్ఎంప్లాయిస్ కాలనీ 3వ లైన్‌లో చెత్తకుప్పలు రెండ్రోజులుగా తీయడం లేదని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికుడు మణికుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో చెత్తకుప్పలు తొలగించారు.

★ జాకీర్‌హుస్సేన్‌నగర్ ప్రధాన రోడ్డులో వైపు కాలువల్లో పూడిక తీయక మురుగునీరు నిలిచిపోయి దోమలవృద్ధి అధికంగా ఉంటోందని స్థానికుడు అష్ఫాక్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో సిబ్బందిని పంపి కాలువల్లో సిల్ట్ తొలగించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

స్పందనకు వందనం

గుంతను పూడ్చారు

ఈనాడు కథనానికి స్పందన

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సీతానగర్ 1వ వీధిలో తాగునీటి పైపు మరమ్మతులకు గుంతను తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారిన వైనంపై 'ఈనాడు'లో ఈ నెల 8న 'ఆగి చూసి వెళ్లండి' శీర్షికతో చిత్ర వార్త ప్రచురితమయ్యింది. స్పందించిన అధికారులు సిబ్బందితో పనులు వేగవంతం చేయించి గుంతను పూడ్చించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

నగరపాలక సంస్థ: నూతక్కి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న నిర్వహించిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్- 14 కబడ్డీ పోటీల్లో ఏపీఆర్ఎస్(యు.బి.) విద్యార్థి షేక్ నదీమ్ ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ ఎం.రజని తెలిపారు. నదీమ్‌ను ఆమెతోపాటు వైస్‌ప్రిన్సిపల్ ప్రజ్వల్, పీఈటీ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సై కుటుంబానికి అండగా ఉంటాం

ఎస్సై వెంకటరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాషా, పోలీసు అధికారుల సంఘ నాయకులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన డీసీఆర్బీ ఎస్సై, ఏపీ హైకోర్టులో జిల్లా సమన్వయ అధికారి టి. వెంకటరావు భౌతికదేహానికి బుధవారం పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాలతో మట్టి ఖర్చులకు రూ. లక్ష అందించారు. ఎస్సై మృతి పట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి జిల్లా పోలీసు విభాగం అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించినవారిలో ఆర్ఎస్సై బాషా, పోలీసు అధికారుల సంఘం సభ్యులు లక్ష్మయ్య, కరీముల్లా ఉన్నారు.

పాడైపోయినా పట్టదా?

న్యూస్‌టుడే - గుంటూరు నగరం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నగర పాలక సంస్థ పరిధిలో సుందరీకరణ పేరుతో కోట్ల రూపాయల నిధులు నీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారు. గుత్తేదారులతో కుమ్మక్కైన అధికారులు పనులు నాసిరకంగా చేసినా... ప్రేక్షక పాత్ర పోషించారు. దీంతో కూడళ్ల సుందరీకరణ కోసం ఖర్చు చేసిన కోట్ల నిధులు నిరుపయోగంగా మారాయి. పాతగుంటూరు పోలీసుస్టేషన్ ఎదుట ఉన్న సర్కిల్ సుందరీకరణకు గత ప్రభుత్వం హయాంలో లక్షల నిధులు ఖర్చు చేశారు. సర్కిల్ చుట్టూ నూతనంగా గోడలు నిర్మించారు. మధ్యలో మొక్కలు నాటి పచ్చదనంతో తీర్చిదిద్దారు. ఫౌంటైన్ నిర్మించి కూడలిలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. పనులు చేసిన ఏడాదికే రెండు వైపులా గోడలు ధ్వంసమయ్యాయి. గోడలకు రక్షణగా ఇనుప రాడ్లను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో వాహనాలు వాటిని ఢీకొంటున్నాయి. ఇలా ఆరు నెలల క్రితం ధ్వంసమైనా వాటిని ఇంతవరకు జీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. గ్రిల్‌లో భాగంగా వేసిన పచ్చికపై పనికిరాని ఇనుప సామాన్లు పడేశారు. స్వచ్ఛత కోసం నగరంలో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న అధికారులు.. ప్రధాన రహదారిలో కళావిహీనంగా మారిన కూడలిని పట్టించుకోకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పచ్చికపై పాత ఇనుప సామగ్రి

పనిచేయని ఫౌంటైన్

అభివృద్ధి ఆగదు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: ప్రధాన కూడళ్ల నుంచి మారుమూల ప్రాంతాల వరకు నిరంతరంగా అభివృద్ధి చేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. శారదాకాలనీ, శ్రీనగర్ ప్రాంతాల్లో రూ.27.50 లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా గత ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. శివారు ప్రాంతాలవైపు గత పాలకులు కన్నెత్తి చూడలేదన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా సొంత సంపాదనలో మునిగి తేలారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి శకం ఆరంభమైందని చెప్పారు. వైకాపా నేతల ఉచ్చులో పడకుండా అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ ముప్పవరపు భారతి, తెదేపా నాయకులు చిట్టాబత్తిన చిట్టిబాబు, మహంకాళి నరసింహారావు, గోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 104 పోలింగ్ కేంద్రాలు

రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏసీ ఓబులేసు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1,200 కంటే అధికంగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణ చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో, అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు తెలిపారు. బుధవారం అదనపు కమిషనర్ ఛాంబర్‌లో రాజకీయపక్షాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1200కు మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో మరో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పశ్చిమంలో 48, తూర్పు నియోజకవర్గంలో 56 కేంద్రాల ఏర్పాటుకు సీఈవో ఆమోదం తెలిపారని వివరించారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై జరిగే సర్వేని రాజకీయ పక్షాల ప్రతినిధులు కూడా పరిశీలించవచ్చని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకుని ఆ వివరాలను ఇవ్వాలన్నారు. సమావేశంలో జీఎంసీ డీసీపీ సూరజ్‌కుమార్, రాజకీయపార్టీల ప్రతినిధులు డి.సత్యం(భాజపా), డి.జాన్‌బాబు(వైకాపా), సీహెచ్ వాసు(బీఎస్పీ), ఎం.శ్యాం(బీఎస్పీ), బి.సునీల్‌కుమార్(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), తాతా సేవాకుమార్(ఆమ్‌ఆద్మీ), త్రినాథ్(జనసేన), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు నూతన శాఖ ప్రారంభం

కెనరా బ్యాంకు శాఖ ప్రారంభిస్తున్న డీజీఎం అనంతపద్మనాభరావు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజలకు చేరువగా బ్యాంకింగ్ సేవలు అందించేందుకు వీలుగా నూతన శాఖను ప్రారంభించినట్లు కెనరా బ్యాంకు డీజీఎం బీఎస్ అనంతపద్మనాభరావు తెలిపారు. బుధవారం సంగడిగుంటలో కెనరా బ్యాంకు నూతన శాఖను ప్రారంభించి మాట్లాడారు. జీరో బ్యాలెన్స్‌తో అకౌంట్ ఓపెన్ చేయవచ్చన్నారు. హౌసింగ్, వాహన రుణాలు అన్ని బ్యాంకులతో పోలిస్తే తక్కువ వడ్డీకే లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు తమనం రాజేంద్ర, ఏజీఎం డి.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 23న తెనాలిలోని వివేక స్కూల్‌లో నిర్వహిస్తామని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం బ్రాడీపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో 15 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. వివిధ మండలాల నుంచి 60 బృందాలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.వెంకటరావు, టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, టీఆర్ రమేష్, టీఆర్ చాందిని, ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రభుత్వ భూములివ్వండి

కమిషనర్ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో అభివృద్ధి పనులకు అవసరమైన ప్రభుత్వ భూములను కేటాయించాలని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ కమిషనర్ పులి శ్రీనివాసులును కోరారు. బుధవారం ఆయన కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేణుగోపాలస్వామి దేవాలయం పరిధిలో ప్రగతినగర్, ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ప్రభుత్వ భూములున్నాయని, వీటిని క్రమబద్ధీకరించాలన్నారు. పీఎంజేవీకే పథకం ద్వారా మైనారిటీల అభ్యున్నతికి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ భూములు దోహదం చేస్తాయన్నారు. స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ఈ స్థలాలు ఉపయోగపడతాయని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు కౌన్సిల్‌లో ఆమోదం తెలియజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జీవో 30 ప్రకారం వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 26.89 సెంట్ల భూమి గుంటూరు యూజీడీ పథకం నిర్మించేందుకు ఇవ్వాలని కోరారు.

ఇందిరకు నివాళి

పట్నంబజారు : ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం ఇందిర జయంతి నిర్వహించారు. పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యన్నం సుధీర్‌బాబు, బి.నాగేశ్వరరావు, కె.పరిశుద్ధరావు, బోడపాటి శ్రీను, బి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీభవన్‌లో ఇందిర చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లింగంశెట్టి ఈశ్వరరావు

పిచ్చిమొక్కలతో ఇబ్బందులు

స్రాఫ్ రోడ్డు, బోరింగ్ పంపు పక్క వీధిలో ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఏపుగా పిచ్చిమొక్కలు పెరగడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సంవత్సరాలుగా అలాగే వదిలేయడంతో పాములు, విష కీటకాలు తిరుగుతూ పక్కనే ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు**

రహదారి పొడవునా వ్యర్థాలే

సీతానగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో చెత్తకుప్పలు తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వచ్చే వారు ఎక్కువ. రైల్వేస్టేషన్, రెడ్డిపాలెం వైపు వెళ్లేవారు ఇటుగా ప్రయాణిస్తుంటారు. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

- న్యూస్‌టుడే, నెహ్రూనగర్

వాహనం తీయాలంటే మురుగులో అడుగేయాల్సిందే

రైల్వేస్టేషన్‌లో వాహనాలు నిలిపే పార్కింగ్ స్థలంలో కొంతభాగం మురుగునీటితో నిండిపోయింది. స్టేషన్ నుంచి వ్యర్థాలను బయటకు తీసుకెళ్లే మ్యాన్‌హోల్ పూర్తిగా నిండిపోవడంతో మురుగు పార్కింగ్ స్థలంలోకి చేరింది. దీంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మ్యాన్‌హోల్ తెరిచిన సిబ్బంది అందులోని వ్యర్థాలను తీయలేదు. రెండు రోజులుగా ఈ సమస్య బాధపెడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

అలరించిన భక్తి సంకీర్తన

గుంటూరు సాంస్కృతికం: నల్లచెరువు 5వ లైన్ కోదండ రామాలయంలో కార్తిక మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్వరరాగ సుధ ఆధ్వర్యంలో బుధవారం భక్తి సంకీర్తన జరిగింది. కేవీ సాయిబాబాశర్మ బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. చిట్టిబాబు, సాయి మహేష్ సహకరించారు.

యువతి అదృశ్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై బుధవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురానికి చెందిన జగ్గవరపు నాగమ్మ తన కుమార్తె ప్రమీల మృతి చెందడంతో మనవరాలు గౌరిని తన వద్ద ఉంచి చదివిస్తోంది. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లిన గౌరి (19) తిరిగి రాలేదని అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

రెండో పెళ్లి చేయడం లేదని..

నెహ్రూనగర్: రెండో పెళ్లిచేయడం లేదని తల్లితో గొడవ పెట్టుకొని ఇంట్లోంచి వెళ్లిపోయాడో యువకుడు. దీనిపై బుధవారం నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి... శ్రీలక్ష్మీనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ గోవర్ధన్‌రెడ్డి ఆరేళ్ల కిందట ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. గొడవల నేపథ్యంలో మూడేళ్ల కిందట భార్య పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. తనకు రెండో వివాహం చేయాలని గోవర్ధన్‌రెడ్డి ఇంట్లో గొడవ చేసేవాడు. ఇంట్లోంచి వెళ్లిపోతున్నానని చెప్పిన అతను ఈ నెల 18న సాయంత్రం నుంచి కనిపించడం లేదని తల్లి జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

మందుబాబులపై కేసు

గుంటూరు నేరవార్తలు: నగరంపాలెంలోని వీఐపీ రోడ్డులో మద్యం తాగి అల్లరి చేస్తున్న ఐదుగురిపై బుధవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్వవిద్యార్థుల దాతృత్వం మరువలేనిది

గుంటూరు వైద్య కళాశాలలో ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి 1975 బ్యాచ్ పూర్వ విద్యార్థుల దాతృత్వం మరువలేనిదని ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి అన్నారు. జీఎంసీలో 1975 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఆధునికీకరించిన ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలను ప్రిన్సిపల్ సుందరాచారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరాచారి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీఎంసీ పూర్వ విద్యార్థి డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో మంది ఉత్తమ వైద్యులను అందించిన కళాశాలకు చేయూత అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డాక్టర్ సీతారామ్, డాక్టర్ శివదేవప్రసాద్, డాక్టర్ ఉమశంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్స్(అడ్మిన్) శ్రీధర్, (అకడమిక్) డాక్టర్ మాధవి, విభాగాధిపతులు, అచార్యులు, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

గాంధీపార్కు నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గాంధీపార్కు నిర్వహణ పకడ్బందీగా ఉండాలని.. స్కేటింగ్ రింగ్, టాయ్‌ట్రైన్ వినియోగంలోకి తీసుకురావాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన గాంధీ పార్కు, స్తంభాలగరువు, తారకరామనగర్, సుగాలికాలనీ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం పరిశీలించారు. చిన్నారులను అలరించేలా చేపల అక్వేరియం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పలుప్రాంతాల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. మౌలిక సదుపాయాల కార్యదర్శులు పనులను తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. పర్యటనలో డీఈఈలు రమేష్‌బాబు, హనీఫ్, కార్పొరేటర్ సమత తదితరులు ఉన్నారు. ★ ఆర్టీవో కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

పాడైన వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటర్లలో ఇవ్వండి

నగరపాలక సంస్థ: నగరంలో మైక్రో ప్యాకెట్లవారీగా తడి, పొడి చెత్త సేకరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజారోగ్య విభాగం అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మెడికల్ వ్యర్థాలు వస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న, పాడైన వస్తువులు, వస్త్రాలను వార్డు సచివాలయాల్లోని ఆర్ఆర్ఆర్ సెంటర్లలో అందించాలన్నారు. రహదార్లు, కాలిబాటలపై అనధికార మాంసం, చేపల విక్రయాలు నిషేధమన్నారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్లు సోమశేఖర్, ఐజాక్, రాజేష్, ప్రసాద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల గుడి.. చదివేద్దాం రండి..

పఠనాసక్తి పెంపునకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు

పుస్తక ప్రదర్శనను వీక్షిస్తున్న చదువరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పుస్తకం అంటే వయసుకు సంబంధించినది కాదు. ఐదేళ్ల పిల్లలు ఆసక్తిగా చదువుకునే కథనాల పుస్తకాల నుంచి అరవై ఏళ్లు పైబడిన వృద్ధులు చదివే గ్రంథాల వరకు అన్నీ గ్రంథాలయంలో కొలువై ఉంటాయి. కేవలం విద్యార్థులకే కాదు.. ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలకు చిరునామాగానూ నిలుస్తుంది. కంప్యూటర్లు, ఆన్‌లైన్‌లోనూ పుస్తకాలు అందుబాటులో ఉంచడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు మరో శిక్షణాలయంగా ఉపయోగపడుతున్నాయి గ్రంథాలయాలు.

సాంకేతికత అందుబాటులోకి రాకముందు వందల సంఖ్యలో గ్రంథాలయానికి పాఠకులు వచ్చేవారు. చేతిలోకి చరవాణి వచ్చాక చిన్నారులు సైతం పుస్తకాల మీద నుంచి సెల్‌ఫోన్‌లోనే ప్రపంచాన్ని చూస్తూ.. విజ్ఞానాన్ని పొందాలన్న విషయాన్నే పక్కన పెట్టేశారు. అయితే విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంది. ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో ఎక్కువగా విద్యార్థులకే ప్రాధాన్యం ఇస్తూ గ్రంథాలయంలో వారికి లభిస్తున్న పుస్తకాల గురించి తెలియజేస్తూ గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని వివరిస్తున్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 11,12,029 పుస్తకాలున్నాయి.

ప్రతి ఆదివారం పిల్లలకు ప్రత్యేకం

పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేలా 'ప్రతి ఆదివారం గ్రంథాలయానికి రండి' అనేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఎంతో ఉత్సాహంగా పిల్లలు పాల్గొంటున్నారు. వేసవి సమయంలో శిబిరం నెల రోజులకు పైగా నిర్వహించి వారందరినీ గ్రంథాలయాలకు వచ్చేలా చేస్తున్నాం. పోటీ పరీక్షలకు అవసరమైనవి అందుబాటులో ఉన్నాయి. ఇటీవల వచ్చిన కానిస్టేబుల్, డీఎస్సీ ఫలితాల్లోనూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని పలువురు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం వారోత్సవాల్లో భాగంగా వారం పాటు చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నాం.

- గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా

గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్లే పరీక్షల్లో విజయం సాధించగలిగాను. ఉద్యోగం సాధించినందుకు సంస్థ అధికారులు సత్కరించారు.

- అనిల్‌కుమార్, గుంటూరు

విజ్ఞానం పొందొచ్చు

వారాంతంలో గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం లభిస్తుంది. చరిత్రకు సంబంధించిన విషయాలను తెలుసుకోవాలంటే పుస్తకాలయానికి రావాల్సిందే. ఫోన్, సిస్టంలో పుస్తకాలను చదవడం వల్ల కళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. గ్రంథాలయానికి వస్తే ఆహ్లాదకర వాతావరణంలో పఠనానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

- ఫయాజ్ అహ్మద్, 8వ తరగతి

ఆలయ నిర్వాహకుల అతి

తలుపులు మూసేసి.. భక్తులను ఇబ్బంది పెట్టి..

దేవస్థానం బయట ఎదురుచూస్తున్న భక్తులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ నిర్వాహకుల తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. కార్తిక మాసం ముగింపు సందర్భంగా బుధవారం ఆలయ నిర్వాహకులు దేవస్థానంలో లక్ష బిల్వార్చన, కుంకుమపూజలు నిర్వహించారు. చందాలిచ్చినవారితో పాటు తమకు తెలిసిన భక్తులను ఉద్యోగులు లోపలకు పంపించి ముఖద్వారం మూసేశారు. కుంకుమ పూజల్లో పాల్గొనేందుకు, స్వామి దర్శనం కోసం పొన్నూరు, విజయవాడ, తెనాలి తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు రెండు గంటలకుపైగా పడిగాపులు కాయాల్సి వచ్చింది. తామంతా ఉపవాసంతో ఉన్నామని, తలుపులు తెరవాలని ఆలయ నిర్వాహకులను వేడుకున్నా వారు స్పందించలేదు. కనీసం వృద్ధులనూ కనికరించలేదు. వేచి ఉండే ఓపిక లేక కొంతమంది వెనక్కి వెళ్లిపోయారు. చంటిపిల్లలతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని వారు చెప్పారు. అధికారులు, సిబ్బంది తీరుపై కొంతమంది భక్తులు పాతగుంటూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి తలుపులు తీయించి భక్తులను లోపలికి పంపించారు. ఆలయంలోని కొంతమంది ఉద్యోగులు ఏళ్ల తరబడి ఇక్కడే పని చేస్తూ ఓ వర్గానికి కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నవగ్రహాల విగ్రహాల వద్ద అపరిశుభ్రంగా ఉందని ఇటీవల పలువురు.. దేవాదాయశాఖ డీసీకి ఫిర్యాదులు చేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ గుంటూరు 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం. 27/2024 ఇన్ ఒ.యస్.నెం. 415/2018

Between:

గుమ్మా బాపిరాజు ...డి.హెచ్.ఆర్.

మరియు

బత్తుల గోవింద రాజులు ...జె.డి.ఆర్.

ఈ నెంబరు ఇ.పి.లో శ్రీ కోర్టువారు జె.డి.ఆర్. తాలుకు ఈ క్రింది ఉదహరించిన షెడ్యూలు ప్రాపర్టీని బహిరంగ వేలం నిమిత్తం ది.05-12-2025నకు వేసియున్నారు. కనుక సదరు వేలంలో పాట పాడుకొనదలచిన వారు ఆ రోజున పై కోర్టు వారి యెదుట ఉ.గం.10-30ని.ల నుండి హాజరు అయి పాట పాడుకొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరుజిల్లా & సబ్.జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలోని(కాకానిరోడ్డు), గుంటూరు నుండి విజయవాడ మెయిన్‌రోడ్‌లో వున్న నవభారత్‌నగర్ కాలనీ, గుంటూరు గ్రామ డి.నెం.450 అవుట్ ఆఫ్ య.4.00 పాత మున్సిపల్ ఎసెస్మెంట్ నెం.46429/129ఎ, న్యూ ఎసెస్మెంట్ నెం.1021067141, ఓల్డ్ డోర్.నెం.15-11-140/1, న్యూ డోర్.నెం. 15-11-62, ఆర్.సి.సి. డాబా ఇల్లు అందులోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ లోగలఇంటి హద్దులు. తూర్పు: ముదిగొండ శివయ్య, దుర్గారావు గారి సరిహద్దు గోడ మరియు ఇతరులు -అ.60లు, దక్షిణం: జి. రాముతులసమ్మ గారి గోడ హద్దు, అ.28-6లు, పడమర: రాపూరి బబుల రెడ్డి & మైలసాంబయ్య గారి హద్దు-అ.60లు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు(ఈప్రాపర్టి గోడహద్దు), అ.28.6లు. ఈహద్దుల మద్య190చ.గ.లలో నిర్మించియున్న గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ డాబా ఇల్లు.

NB: ది.28-10-2021న గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, కొత్తపేట, గుంటూరు వారికి రూ.8,00,000/- లకు తనఖా చేయబడియున్నది. సదరు తనఖాకు లోబడి వేలం జరగపలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వేలం తేదీ: 05-12-2025.

ఏ.ఆర్. శ్రీనివాస్ మూర్తి, డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాది. 2వ లైను, కృష్ణనగర్, గుంటూరు. సెల్:9849478544

వేలం ప్రకటన

మహారాజశ్రీ గుంటూరు 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం. 28/2024 ఇన్ ఒ.యస్.నెం. 416/2018

Between:

పల్లపోతు సాంబశివరావు ...డి.హెచ్.ఆర్.

మరియు

బత్తుల గోవింద రాజులు ...జె.డి.ఆర్.

ఈ నెంబరు ఇ.పి.లో శ్రీ కోర్టువారు జె.డి.ఆర్. తాలుకు ఈ క్రింది ఉదహరించిన షెడ్యూలు ప్రాపర్టీని బహిరంగ వేలం నిమిత్తం ది.05-12-2025నకు వేసియున్నారు. కనుక సదరు వేలంలో పాట పాడుకొనదలచిన వారు ఆ రోజున పై కోర్టు వారి యెదుట ఉ.గం.10-30ని.ల నుండి హాజరు అయి పాట పాడుకొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరుజిల్లా & సబ్.జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలోని(కాకానిరోడ్డు), గుంటూరు నుండి విజయవాడ మెయిన్‌రోడ్‌లో వున్న నవభారత్‌నగర్ కాలనీ, గుంటూరు గ్రామ డి.నెం.450 అవుట్ ఆఫ్ య.4.00 పాత మున్సిపల్ ఎసెస్మెంట్ నెం.46429/129ఎ, న్యూ ఎసెస్మెంట్ నెం.1021067141, ఓల్డ్ డోర్.నెం.15-11-140/1, న్యూ డోర్.నెం. 15-11-62, ఆర్.సి.సి. డాబా ఇల్లు అందులోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ లోగలఇంటి హద్దులు. తూర్పు: ముదిగొండ శివయ్య, దుర్గారావు గారి సరిహద్దు గోడ మరియు ఇతరులు -అ.60లు, దక్షిణం: జి. రాముతులసమ్మ గారి గోడ హద్దు, అ.28-6లు, పడమర: రాపూరి బబుల రెడ్డి & మైలసాంబయ్య గారి హద్దు-అ.60లు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు(ఈప్రాపర్టి గోడహద్దు), అ.28.6లు. ఈహద్దుల మద్య190చ.గ.లలో నిర్మించియున్న గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ డాబా ఇల్లు.

NB: ది.28-10-2021న గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, కొత్తపేట, గుంటూరు వారికి రూ.8,00,000/- లకు తనఖా చేయబడియున్నది. సదరు తనఖాకు లోబడి వేలం జరగపలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వేలం తేదీ: 05-12-2025.

ఏ.ఆర్. శ్రీనివాస్ మూర్తి, డి.హెచ్.ఆర్.తరపు న్యాయవాది. 2వ లైను, కృష్ణనగర్, గుంటూరు. సెల్:9849478544

(c) eenadu

గుంటూరు పశ్చిమ

గాంధీపార్కు నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గాంధీపార్కు నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, స్విమ్మింగ్ రింగ్, టాయ్‌ట్రైన్ వినియోగంలోకి తీసుకురావాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన గాంధీ పార్కు, స్తంభాలగరువు, తారకరామనగర్, సుగాలీకాలనీ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం పరిశీలించారు. చిన్నారులను అలరించేలా చేపల అక్వేరియం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పలుప్రాంతాల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. మౌలిక సదుపాయాల కార్యక్రమాలు పనులను తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. పర్యటనలో డీఈఈలు రమేష్‌బాబు, హనీఫ్, కార్పొరేటర్ సమత తదితరులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

? చుట్టుగుంట సెంటర్ ఎస్‌బీఐ బ్యాంకు దగ్గరున్న సైడ్ డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమల బెడద ఎక్కువైంది. **- స్థానికులు**

✓ సిబ్బందిని పంపించి డ్రెయిన్‌లో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

కాలువల్లో వ్యర్థాల తొలగింపు: కంకరగుంట వంతెన దగ్గర అంకమ్మనగర్‌లోని కాలువలు వ్యర్థాలతో నిండి మురుగు ముందుకు కదలడం లేదు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

స్పందనకు వందనం

కళాదర్బార్ అమరావతి స్వర్ణోత్సవాలు 30న

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న పొత్తూరి రంగారావు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళాదర్బార్ అమరావతి సంస్థ స్వర్ణోత్సవాలను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం ఆయన ఉత్సవ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా విజ్ఞాన మందిరంలో 30న సాయంత్రం అయిదు గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, దాదాపు 50 మంది చలనచిత్ర ప్రముఖులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వీరిలో 16 మందికి గోల్డెన్ ఐకాన్ అవార్డులు, మరో 16 మందికి ది ప్రైడ్ ఆఫ్ ఆంధ్ర ఐకాన్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. ఇదే వేదికపై సినీరంగ ప్రముఖ గాయనీగాయకుల సంగీత విభావరి, జేజే బ్రదర్స్ వాయులీన కచేరి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో మేకల రవీంద్రబాబు, యశోద కృష్ణ, చంద్రబాబు, జొన్నలగడ్డ వెంకటరత్నం, బాబూరావు, అబ్దుల్ ఖాదర్, సుధీర్‌బాబు, హనుమాన్ సింగ్, ధర్మసింగ్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 40, వంగ (సన్నాలు) 54, బెండ 48, పచ్చిమిర్చి 42, కాకర 54, బీర 44, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజీ 30, క్యారెట్ 60, దొండ 62, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుళ్లు 62, దోస 30, సొర 28, పొట్ల 34, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 85, చామదుంప 22, మునగ 10, బీట్‌రూట్ 40, కీరదోసకాయ 29, బీన్స్ 49, క్యాప్సికమ్ 79, కొత్తిమీర 25, ఆకుకూరలు 12, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

పోటీకెళ్తే పతకాలు మావే

సత్తా చాటుతున్న విద్యార్థులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో ఎందరో బాలబాలికలు ప్రతిభ చాటుతున్నారు. పిల్లల అభిరుచి, ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించి శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. గుంటూరుకు చెందిన నాగూర్‌బాషా చిత్రలేఖనంలో సత్తా చాటుతుండగా, జగ్వేకృష్ణ కర్రసాములో ప్రతిభ చాటుతోంది. వీరిద్దరూ ఆయా అంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

చిత్రాలతో మెప్పిస్తూ..

ఏటీ అగ్రహారంలో ఉంటున్న నాగూర్‌బాషా పదో తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే ఇష్టం. తల్లిదండ్రులు బాదర్‌వలీ, బాసిలు కుమారుడి ఆసక్తిని గమనించి ప్రత్యేకంగా చిత్రలేఖనం మాస్టర్ వద్ద శిక్షణ ఇప్పించారు. అప్పటి నుంచి ఎన్నో పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. నేషనల్ ఆర్ట్స్, డ్రీమ్ ఆర్ట్ అకాడమీ, రోటరీ క్లబ్ నిర్వహించిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించాడు. గత ఆగస్టులో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చిత్రలేఖనం నేర్చుకోవడం ఆరంభించిన దగ్గర నుంచి ఏకాగ్రత, చదువు పట్ల ఆసక్తి మరింత పెరిగిందని నాగూర్‌బాషా తెలిపారు. బాస్కెట్‌బాల్, ఎన్‌సీసీలోనూ రాణిస్తున్నాడు. యానిమేషన్ డిజైనర్ కావడమే లక్ష్యమంటున్నాడు.

ఆత్మరక్షణకు కర్రసాము

గోరంట్లకు చెందిన జగ్వేకృష్ణ ఎనిమిదో తరగతి చదువుతోంది. ఒకటో తరగతి నుంచి క్రీడలంటే ఇష్టం. నిత్యం పాఠశాలకు వెళ్లి పరిగెత్తడం, వ్యాయామం చేస్తుండేది. నాలుగేళ్లుగా కర్రసాములో శిక్షణ పొందుతూ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తూ దూసుకుపోతుంది. యువతులపై వేధింపులు, దాడుల ఘటనలను గమనించిన జగ్వేకృష్ణ ఆత్మరక్షణ విద్య నేర్చుకుంటానని తల్లిదండ్రులను కోరగా, వారు కర్రసాములో శిక్షణ ఇప్పించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు చేజిక్కించుకుంది. ఇటీవల నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కర్రసాము వల్ల పది కేజీలు బరువు తగ్గడంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉంటుందని, ఆర్కియాలజిస్ట్ కావడమే లక్ష్యమని జగ్వేకృష్ణ చెబుతుంది.

సీట్ల భర్తీకి తుదిగడువు నేడే

నవభారత్‌నగర్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు జేకేసీ కళాశాల వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు/మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి ఈనెల 20 తుది గడువని ప్రిన్సిపల్ పి.గోపీచంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 రిజిస్ట్రేషన్ రుసుముగా చెల్లించాలని, మెరిట్ జాబితా ఈనెల 21న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు www.jkcc.ac.in లేదా 99493 61406 నంబర్లో సంప్రదించాలన్నారు.

అలరించిన భక్తి సంకీర్తన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నల్లచెరువు 5వ లైన్ కోదండ రామాలయంలో కార్తిక మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్వరరాగ సుధ ఆధ్వర్యంలో బుధవారం భక్తి సంకీర్తన జరిగింది. కేవీ సాయిబాబాశర్మ బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. చిట్టిబాబు, సాయి మహేష్ సహకరించారు.

హరిహరాత్మకం.. కార్తికం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళా వేదికపై బుధవారం రాత్రి జరిగిన కార్తిక మాస విశేషాల ఉపన్యాసం ప్రేక్షకులను ఆకట్టుకుంది. డాక్టర్ నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ కార్తికమాసం హరి, హర నామ స్మరణకు అత్యంత విశిష్టమైందని వివరించారు. శివ, కేశవుల నామాలు రెండూ పవిత్రమైనవని, ఏ నామాన్ని జపించినా సద్గతిని పొందవచ్చని వివరించారు.

నేటి నుంచి పద్య నాటకోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విజయవాడ శ్రీసర్వేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో పద్య నాటకోత్సవాలు, పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు టి.రాజబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం శ్రీకృష్ణరాయబారం పద్య నాటకం, అనంతరం సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్యకు ఆధ్యాత్మిక పురస్కారం ప్రదానం చేస్తారన్నారు. శుక్రవారం సాయంత్రం సత్యహరిశ్చంద్ర పద్య నాటకం, జి.మల్లికార్జునరావుకు రంగస్థల పురస్కార ప్రదానం జరుగుతాయని చెప్పారు.

ముగ్గురు ఉద్యోగులకు శ్రీముఖాలు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: ఏపీ సివిల్ కాండక్టు నిబంధనలు అతిక్రమించి పదోన్నతుల కోసం వినతిపత్రాలు అందజేసిన జిల్లాపరిషత్తుకు చెందిన ముగ్గురు ఉద్యోగులకు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు ఈనెల 17న శ్రీముఖాలు జారీ చేశారు. ఓ టైపిస్టు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు శ్రీముఖాలు అందుకున్నారు. ఇటీవలే సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతులు కల్పించడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. జూనియర్ అసిస్టెంట్లు కొందరు తమకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అంశాలతో పాటు ఏదైనా సమస్య ఉంటే ముందుగా సీఈవోకు వినతిపత్రం అందజేయాలి. దీనిని ఉల్లంఘించి జడ్పీ ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించడం ద్వారా అధికారిపై ఒత్తిడి తీసుకొచ్చారనే కారణంతో వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో వారు బుధవారం సీఈవోను కలిసి వివరణ ఇచ్చారు.

దారంతా గుట్టలు.. దాటలేక తిప్పలు..

నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డు భవన నిర్మాణ సామగ్రికి అడ్డాగా మారుతోంది. ఈ రహదారి పక్కన బహుళ అంతస్తులు నిర్మిస్తున్నవారు ఇసుక, కంకర, ఇటుకలను రోడ్డు పక్కన లారీల్లో తీసుకొచ్చి దింపుతున్నారు. గుజ్జనగుండ్ల నుండి జేకేసీ కళాశాల మీదుగా రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాజధాని అమరావతి, గుంటూరు ఆటోనగర్ వైపు వెళ్తున్నాయి. వాహనాలు వెళ్లేటపుడు కంకర రోడ్డు పైకి జారిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సైతం రాకపోకలకు సాగించడానికి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇటువైపు రాకపోకలు సాగిస్తున్నా రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జీఎంసీ అధికారులు, నల్లపాడు పోలీసుస్టేషన్, ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు)**

అధికారుల అలసత్వం.. ప్రాణసంకటం

కాంచన్ టవర్స్ వద్ద ఇదీ పరిస్థితి

రింగ్‌రోడ్డులో స్వామి థియేటర్ సెంటర్ సమీపంలో మ్యాన్‌హోల్ మూత చుట్టూ ధ్వంసమైంది. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో మ్యాన్‌హోల్ వద్ద వేసిన గచ్చు పగిలిపోయింది. రాళ్లు లేచిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేపట్టడంలోనూ అధికారులు జాప్యం చేస్తుండడంతో రోజుల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని వాహనచోదకులు విమర్శిస్తున్నారు. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**

వెయ్యేళ్లు వర్ధిల్లుగాక

గుంటూరు నగరంలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరం ఆవరణలో ఇటీవల మొంథా తుపాను దెబ్బకు శతాధిక వయసున్న రావి వృక్షం నేలకూలింది. అప్పట్లో విరిగిపడిన చెట్లకొమ్మలను సిబ్బంది తొలగించారు. మోడు నుంచి మళ్లీ చిగుర్లు రావడంతో కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు బుధవారం ఉద్యానవిభాగ సిబ్బంది అదే ప్రాంతంలో నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విలువైన ఈ వృక్షాన్ని రక్షించాలనే సంకల్పంతో దాన్ని మళ్లీ నాటి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

మురుగు పారే దారేది?

గోరంట్ల పరిధిలోని టీచర్స్ కాలనీకి వెళ్లే రహదారి పక్కనున్న డ్రెయిన్ నుంచి మురుగు నీరు పారే దారి లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్‌కు రెండు వైపులా మూసి ఉండడంతో కాలువలోనే నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు వంటి సూక్ష్మ కీటకాలు వృద్ధి చెందుతుండడంతో వ్యాధుల బారిన పడాల్సి వస్తుందేమోనని భయపడుతున్నారు. పక్కనున్న ప్రైవేటు ఖాళీ స్థలాల్లోకి మురుగు నీరు చేరడంతో పారిశుద్ధ్యం క్షీణించే పరిస్థితి నెలకొంది. జీఎంసీ అధికారులు స్పందించి డ్రెయిన్ నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు**

పుస్తకాల గుడి.. చదివేద్దాం రండి..

పఠనాసక్తి పెంపునకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు

పుస్తక ప్రదర్శనను వీక్షిస్తున్న చదువరులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పుస్తకం అంటే వయసుకు సంబంధించినది కాదు. ఐదేళ్ల పిల్లలు ఆసక్తిగా చదువుకునే కథనాల పుస్తకాల నుంచి అరవై ఏళ్లు పైబడిన వృద్ధులు చదివే గ్రంథాల వరకు అన్నీ గ్రంథాలయంలో కొలువై ఉంటాయి. కేవలం విద్యార్థులకే కాదు.. ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలకు చిరునామాగానూ నిలుస్తుంది. కంప్యూటర్లు, ఆన్‌లైన్‌లోనూ పుస్తకాలు అందుబాటులో ఉంచడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు మరో శిక్షణాలయంగా ఉపయోగపడుతున్నాయి గ్రంథాలయాలు.

సాంకేతికత అందుబాటులోకి రాకముందు వందల సంఖ్యలో గ్రంథాలయానికి పాఠకులు వచ్చేవారు. చేతిలోకి చరవాణి వచ్చాక చిన్నారులు సైతం పుస్తకాల మీద నుంచి సెల్‌ఫోన్‌లోనే ప్రపంచాన్ని చూస్తూ.. విజ్ఞానాన్ని పొందాలన్న విషయాన్నే పక్కన పెట్టేశారు. అయితే విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంది. ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో ఎక్కువగా విద్యార్థులకే ప్రాధాన్యం ఇస్తూ గ్రంథాలయంలో వారికి లభిస్తున్న పుస్తకాల గురించి తెలియజేస్తూ గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని వివరిస్తున్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 11,12,029 పుస్తకాలున్నాయి.

ప్రతి ఆదివారం పిల్లలకు ప్రత్యేకం

పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేలా 'ప్రతి ఆదివారం గ్రంథాలయానికి రండి' అనేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఎంతో ఉత్సాహంగా పిల్లలు పాల్గొంటున్నారు. వేసవి సమయంలో శిబిరం నెల రోజులకు పైగా నిర్వహించి వారందరినీ గ్రంథాలయాలకు వచ్చేలా చేస్తున్నాం. పోటీ పరీక్షలకు అవసరమైనవి అందుబాటులో ఉన్నాయి. ఇటీవల వచ్చిన కానిస్టేబుల్, డీఎస్సీ ఫలితాల్లోనూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని పలువురు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం వారోత్సవాల్లో భాగంగా వారం పాటు చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నాం.

-గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా

గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా. ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్లే పరీక్షల్లో విజయం సాధించగలిగాను. ఉద్యోగం సాధించినందుకు సంస్థ అధికారులు సత్కరించారు.

-అనీల్‌కుమార్, గుంటూరు

విజ్ఞానం పొందొచ్చు

వారాంతంలో గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం లభిస్తుంది. చరిత్రకు సంబంధించిన విషయాలను తెలుసుకోవాలంటే పుస్తకాలయానికి రావాల్సిందే. ఫోన్, సిస్టంలో పుస్తకాలను చదవడం వల్ల కళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. గ్రంథాలయానికి వస్తే ఆహ్లాదకర వాతావరణంలో పఠనానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

-ఫయాజ్ అహ్మద్, 8వ తరగతి

పుస్తకం మంచి స్నేహితుడు

పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పుస్తకం నుంచి మంచి స్నేహితుడిని, దాని ద్వారా విజ్ఞానం పొందవచ్చని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. లాడ్జి సెంటర్ ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను బుధవారం ఆమె ప్రారంభించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పాతికేళ్లుగా విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో తలపెట్టిన పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తుందన్నారు. పుస్తక పఠనం మంచి అలవాటన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రచనలు, వివిధ నగరాలకు చెందిన పబ్లిషర్స్ రచనలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని చెప్పారు. పుస్తకాల కొనుగోలుపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నగర కార్యదర్శి అరుణ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, గుంటూరు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి వీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల దాతృత్వం మరువలేనిది

ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సుందరాచారి

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి 1975 బ్యాచ్ పూర్వ విద్యార్థుల దాతృత్వం మరువలేనిదని ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి అన్నారు. జీఎంసీలో 1975 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఆధునికీకరించిన ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలను ప్రిన్సిపల్ సుందరాచారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరాచారి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీఎంసీ పూర్వ విద్యార్థి డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో మంది ఉత్తమ వైద్యులను అందించిన కళాశాలకు చేయూత అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డాక్టర్ సీతారామ్, డాక్టర్ శివదేవప్రసాద్, డాక్టర్ ఉమశంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ (అడ్మిన్) శ్రీధర్, (అకడమిక్) డాక్టర్ మాధవి, విభాగాధిపతులు, అచార్యులు, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

ఏపీహెచ్‌హెచ్‌ఈఏ జిల్లా ఉద్యోగ సంఘ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి

గోరంట్ల, న్యూస్‌టుడే: ఏపీ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీహెచ్‌హెచ్‌ఈఏ) జిల్లా అధ్యక్షుడిగా ఎ.వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీఎన్జీవో సంఘ కార్యాలయంలో ఏపీ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు బుధవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో సహాధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె.రాజీవ్, కార్యదర్శిగా కె.గోపీచంద్, నిర్వహణ కార్యదర్శిగా భువన్, సంయుక్త కార్యదర్శిగా విజయప్రసాద్, కోశాధికారిగా రవికిశోర్, మహిళా కార్యదర్శిగా వెంకట సరిత ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన తప్పనిసరి

మాట్లాడుతున్న ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

నగరంపాలెం, న్యూస్‌టుడే మూర్ఛ వ్యాధిపై ప్రతి ఒక్కరు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ తెలిపారు. లలిత సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ చేతులు, కాళ్లు కొట్టుకోవడం, నోటి వెంట నురగ రావడం, స్పృహ కోల్పోవడం, నాలుక కొరుక్కోవడం, మూతి పక్కకి లాగడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కొందరిలో కనురెప్పలు కొట్టుకోవడం, చప్పరించడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ముందుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వీరమ్మ, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ అజ్మా, డాక్టర్ అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

కొత్తగా 104 పోలింగ్ కేంద్రాలు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏసీ ఓబులేసు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1,200 కంటే అధికంగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరణ చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు తెలిపారు. బుధవారం అదనపు కమిషనర్ ఛాంబర్‌లో రాజకీయపక్షాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1200కు మించి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో మరో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పశ్చిమంలో 48, తూర్పు నియోజకవర్గంలో 56 కేంద్రాల ఏర్పాటుకు సీఈవో ఆమోదం తెలిపారని వివరించారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై జరిగే సర్వేని రాజకీయ పక్షాల ప్రతినిధులు కూడా పరిశీలించవచ్చని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకుని ఆ వివరాలను ఇవ్వాలన్నారు. సమావేశంలో జీఎంసీ డీసీపీ సూరజ్‌కుమార్, రాజకీయపార్టీల ప్రతినిధులు డి.సత్యం(భాజపా), డి.జాన్ బాబు(వైకాపా), సీహెచ్ వాసు(బీఎస్పీ), ఎం.శ్యాం(బీఎస్పీ), బి.సునీల్‌కుమార్(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), తాతా సేవాకుమార్(ఆమ్‌ఆద్మీ), త్రినాథ్(జనసేన), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబర్ 13న నిర్వహించే మెగా ఉద్యోగ మేళా పోస్టర్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గుంటూరు సాయిబాబా రోడ్డులోని కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ, ఉద్యోగ మేళా కమిటీ సభ్యులు కొప్పర్తి సీతారమేష్, భీమవరపు హేమంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి నాగరాజు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలిత శాస్త్రి, ప్రధాన కార్యదర్శి మాచిరాజు మురళీకృష్ణ, అధికార ప్రతినిధి మాదిరాజు తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

శంకరవిలాస్ వంతెన అభివృద్ధిపై దుష్ప్రచారం తగదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శంకరవిలాస్ వంతెన అభివృద్ధిపై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆమె తెదేపా కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'అభివృద్ధి పనులు జరిగే సమయంలో కొంత అసౌకర్యం సహజం. దాన్ని ఆసరాగా చేసుకుని ప్రజల్లో అపోహలు సృష్టించడం తగదు. కొందరి షాపుల సమస్యల్ని వైకాపా నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం భూతద్దంలో పెట్టి పెద్దవిగా చూపుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధిపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వసతులు అందించేందుకు కృషి చేస్తున్నాం. కార్యకర్తలే తెదేపాకు బలం. పార్టీ మరింత బలోపేతం చేసేందుకు ఎవరి పరిధిలో వారు కృషి చేయాలి'.. అని పేర్కొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు బాగు చేశారు

జడ్పీలో బాగు చేసిన ఉద్యానవన స్థలం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలోని జిల్లాపరిషత్తు ప్రాంగణంలోని గుంటూరు డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం ఎదుట ఉన్న ఉద్యానవనం ఎట్టకేలకు మెరుగుపడింది. ఇటీవలే నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు జడ్పీలోని శ్రీసత్యసాయి పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి పరిసరాలు, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడాన్ని గమనించి జీఎంసీ సిబ్బందిని పిలిపించి రోజుల వ్యవధిలో ఉద్యాన స్థలంతో పాటు అక్కడున్న పిచ్చి చెట్ల కొమ్మలను తొలగింపజేసి శుభ్రం చేయించారు. ఖాళీ స్థలం మొత్తం డస్ట్ పోయించారు. రెడ్‌క్రాస్ భవనం, పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయాల వైపు కూడా బాగు చేయించడంతో అక్కడి పరిసరాలు బాగుపడ్డాయి.

* జిల్లాపరిషత్తు కేంద్రంగా ఎన్నో ఏళ్లుగా ఉంటున్న సంచార తెగలవారు జడ్పీ ప్రాంగణంలో ఉంటూ భోజనాలు చేసిన తర్వాత విస్తరాకులను డంపర్ బిన్‌లో కాకుండా కింద పడేస్తుండడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. అయితే జడ్పీ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. జీఎంసీ కమిషనర్ చొరవతో బాగు చేసిన ప్రాంగణం మళ్లీ అధ్వానం కాకుండా చూడాల్సిన బాధ్యత జడ్పీ అధికారులపై ఉంది.

అవగాహన వారోత్సవాలు

నగరంపాలెం, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై ప్రతి ఒక్కరు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ఫార్మకాలజీ, ఇన్‌ఫెక్షన్ కంట్రోలర్స్, జీజీహెచ్ నర్సింగ్ సిబ్బంది, ఫార్మ్-డి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

(c) eenadu

25x7

విభాగాలు.. రోజులు

పేదలకు బాసటగా ప్రభుత్వ వైద్యం

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

విజయవాడలోని కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు చక్కని సేవలు అందిస్తున్నాయి. ఉచితం వైద్యంతో రోగులకు బాసటగా నిలుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్ర సరిహద్దులైన ఖమ్మం, మధిర ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వస్తున్నారు. పాత బిల్డింగ్‌లో, సూపర్ స్పెషాలిటీ (అద్దాల బిల్డింగ్)లో సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. వారాలా వారీగా ఓపీ ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం.

సూపర్ స్పెషాలిటీ బిల్డింగ్‌లో ..

ప్రతి ఆదివారం ఓపీ సెలవు...

- ★ కార్డియాలజీ, డెర్మటాలజీ, సర్జికల్ డిసిప్లేన్, పల్మనరీ మెడిసన్ (సోమ నుంచి శని వరకు)
- ★ న్యూరాలజీ: మంగళ, గురు, శని
- ★ న్యూరోసర్జరీ,ఆంకాలజీ: మంగళ, శుక్ర
- ★ నెఫ్రాలజీ: సోమ, బుధ, శని
- ★ యూరాలజీ: సోమ - గురు
- ★ ప్లాస్టిక్ సర్జరీ: సోమ, మంగళ, గురు
- ★ పీడియాట్రిక్ సర్జరీ: సోమ, బుధ, శుక్ర
- ★ ప్రివెంటివ్ ఆంకాలజీ: మంగళ, గురు

గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెపటాలజీ న్యూట్రిషన్ సోమ, బుధ, శుక్ర

కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జరీ - సోమ, బుధ, గురు

పాత బిల్డింగ్‌లో..

- ★ ఎమర్జెన్సీ మెడిసిన్ (క్యాజువాలిటీ), ఎమర్జెన్సీ విభాగాలు అన్ని రోజులూ అందుబాటులో ఉంటాయి.
- ★ ఈఎన్‌టీ ★ జనరల్ మెడిసిన్
- ★ ఆప్తమాలజీ ★ ఆర్థోపెడిక్స్ ★ అనస్తీషియా (పెయిన్ క్లినిక్) (సోమ నుంచి శని వరకు..)

పాత ప్రభుత్వ ఆసుపత్రిలో..

సోమ నుంచి శని వరకు ఓపీ సేవలు

- ★ ఓబీస్ట్రిక్స్ అండ్ గైనకాలజీ ★ పీడియాట్రిక్స్ ★ సైకియాట్రీ ★ ఫ్యామిలీ ప్లానింగ్

రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు..

- ★ రోజూ ఓపీ : సుమారు 5500 మంది
- ★ మొత్తం విభాగాలు : 25
- ★ పడకలు : 1680 (ఐసీయూలో 294) (సాధారణ వార్డుల్లో ఉన్నవి 1386)
- ★ శస్త్రచికిత్సల గదులు : 26+9
- ★ వైద్యులు : 146 మంది

ఉప్పెన ఆపత్కాలంలో కృష్ణారావు సేవలు ఎనలేనివి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో 1977 దివిసీమ ఉప్పెన 48వ సంవత్సరం సంస్మరణ సభ, మానవతా మూర్తులకు దివ్యవందనం కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని.. నాడు మండలి వెంకట కృష్ణారావు దివిసీమకు అందించిన సేవలను కొనియాడారు. మంత్రి కొల్లు రవీంద్ర, రామకృష్ణ మిషన్ కార్యదర్శి శితికంఠానంద మహారాజ్, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, సీపీఎం మాజీ ఎంపీ ఎ.మధు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, దివిసీమ సోషల్ సర్వీస్ సొసైటీ నిర్వాహకుడు ఫాదర్ అమల్ రాజ్, విజయవాడ నాస్తిక కేంద్రం ఛైర్మన్ డాక్టర్ జి.సమరం, రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ రామారావు, లయన్స్ జిల్లా గవర్నర్ ఆంజనేయులు, తదితరులు ప్రసంగించారు.

మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మంత్రి రవీంద్ర, రామకృష్ణ, బుద్ధప్రసాద్ తదితరులు

వెంకన్న భూమికీ.. ఎసరెట్టారు!

- ✦ రికార్డుల్లో ఉన్న 67 సెంట్లు కనిపించడం లేదు
- ✦ ఏళ్లుగా ఫిర్యాదులు.. పట్టించుకోని యంత్రాంగం

రూ.7 కోట్లపైనే విలువ..

ఈనాడు, అమరావతి

దేవాదాయశాఖ పరిధిలో గ్రామీణంలో ఉండే ఆలయాల భూములు మాయమవుతున్నాయి. మా ఆలయ భూమి కనిపించడం లేదని.. దేవాదాయ శాఖతో ఏళ్లుగా మొత్తుకున్నా కనీస స్పందన లేదు. పమిడిముక్కల మండలం మంటాడలోని అలివేలు మంగా పద్మావతీ సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూమి కనిపించడం లేదని.. 2023లో వైకాపా జమానాలో గుర్తించారు. కొలతలు వేసి.. ఎంత మాయమైందో.. తేల్చారు. ఆ భూమి ఆలయానికి తిరిగి ఇప్పించాలని.. పలుమార్లు ఫిర్యాదు చేసినా దిక్కులేదు.

వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి భూములను కొంటామని.. 1979-80లో భక్తుల నుంచి విరాళాలు సేకరించి.. వారి పేర్లతోనే భూమి కొన్నారు. 92 మంది భక్తులు విరాళాలు ఇవ్వగా.. ఒక సెంటు నుంచి 12 సెంట్ల వరకు ఇచ్చిన దాతలున్నారు. వీరి పేర్లతోనే.. ఎవరెవరు ఎన్ని సెంట్లు దానమిచ్చారో దేవస్థానం రికార్డుల్లో, ఆలయంలో బోర్డుపైనా వివరాలున్నాయి. మొత్తం.. 1.57 ఎకరాలు. జాతీయ రహదారి పక్కనే ఉండటంతో విలువ రూ.15 కోట్లకు పైమాటే. 2023 నవంబరులో కొలతలేయగా.. సర్వేనంబరు 15/1బి, 15/17లో 90 సెంట్లు రావడంతో గోల్‌మాల్ వెలుగుచూసింది.

1979లో జక్కా పిచ్చయ్య నుంచి 35 సెంట్లు, 1980లో జక్కా భాస్కర్‌రావు నుంచి 45 సెంట్లు కొన్నట్లు కనిపిస్తోంది. గరికపాటి రంగారావు, తులసీరామ్ సోదరులు 12 సెంట్లు దానమిచ్చారు. మొత్తం 92 సెంట్లు. దేవస్థానానికి ఈ భూమి మాత్రమే.. ప్రస్తుతం కనిపిస్తోంది. మిగతా భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో కొన్న భూమి ఏమైందో తెలియడం లేదు. ఈ లెక్క తేల్చి ఆలయ భూమి ఇప్పించాలని.. దేవాదాయ శాఖకు మంటాడలోని సామాజిక కార్యకర్తలు, ప్రజలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. 1.57 ఎకరాల్లో 90 సెంట్లే ఉందని, మిగిలిన తేల్చాలని కోరుతున్నారు. ఈ మాయమైన భూమి విలువ రూ.7 కోట్లపైమాటే.

పాలకమండలి తీర్మానాలు చేసినా..

2023లోనే రెండుసార్లు ఆలయ ధర్మకర్తల మండలి సమావేశమై గోల్‌మాల్‌ను తేల్చాలని తీర్మానించి.. బాధ్యులపై కఠిన చర్యలకు దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 18సార్లు ఫిర్యాదు చేసినా.. అటునుంచి స్పందన రాలేదని.. గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు.

కొత్త ఆటోనగర్‌పై ప్రత్యేక నిఘా!

మావోయిస్టుల అరెస్టుతో అప్రమత్తమైన పోలీసులు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే, పెనమలూరు: విజయవాడ నగర శివారుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. కానూరు కొత్త ఆటోనగర్‌లో వందల మంది కార్మికులు ఉపాధి పొందే చోట.. ఓ భవనంలో కొన్ని రోజులుగా 28 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి తలదాచుకున్నారని. . పోలీసులు వచ్చే వరకు చుట్టుపక్కల ఎవరికీ తెలియని పరిస్థితి. దీంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లాలో అలజడి మొదలైంది. మంగళవారం వారిని అదుపులోకి తీసుకున్న తరువాత కూడా ఆ భవనం వద్ద బందోబస్తు కొనసాగిస్తున్నారు. కొత్త ఆటోనగర్ చుట్టూ ప్రత్యేక నిఘా పెట్టారు. ఒకేసారి అంత మంది మావోయిస్టులు ఎందుకు వచ్చారు. ఇక్కడికే రావడానికి కారణమేంటి..? వారికి ఇల్లు ఎలా అద్దెకు ఇచ్చారు. స్థానికంగా వారికి ఎవరైనా సహకారం అందించారా తదితర కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకోవడం.. అందరినీ ఉలికిపాటుకు గురిచేసింది.

నమ్మలేకపోతున్న జనం

ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఇక్కడ పరిశ్రమల్లో పనులు చేస్తున్నారు. స్థానికంగా కూలికి వచ్చే వారి కంటే వీరికి తక్కువ కూలితో పాటు.. ఎక్కువ సమయం పనిచేస్తారన్న కారణంతో యజమానులు ఇతర రాష్ట్రాల వారికే ప్రాధాన్యం ఇస్తుంటారు. రోజూ ముగ్గురు మాత్రమే అప్పుడప్పుడు బయటకు వచ్చేవారని చుట్టుపక్కల పనిచేసేవారు చెబుతున్నారు. రోజూ ఓ కారులో భోజనాల క్యారేజీలు వచ్చేవని, డ్రైవర్‌ను అడిగితే కొత్తగా కూలి పనులకు వచ్చారని చెప్పారని అంటున్నారు. మహిళల మాటలు కూడా వినపడలేదని.. దుస్తులు సైతం బయట కనిపించలేదని చెబుతున్నారు.

పోలీసుల అదుపులో కాపలాదారు?

భవన కాపలాదారుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. భవన యజమాని వారి బంధువుల వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. మావోయిస్టులను ఎవరు తీసుకొచ్చారు. ఎప్పుడు, ఎంతమంది వచ్చారు. వారి వద్ద ఆయుధాలు వంటివి కనిపించినా ఎందుకు పోలీసులకు సమాచారం ఇవ్వలేదని కాపలాదారును కూపీలాగుతున్నట్లు తెలిసింది. ★ మావోయిస్టు బృందం అరెస్టు సంఘటనపై క్రైం నంబరు 658-2025తో పెనమలూరు ఠాణాలో కేసు నమోదు చేశారు. స్థానికంగా వీరికి సహకరించిన వారు ఎవరన్నదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు.

రంగవల్లి.. ఆరోగ్యాల సిరివల్లి

ఈ చిత్రాన్ని చూస్తే మహిళలు అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి మాదిరిగా ఉంది కదూ.. కానీ ఇది ముగ్గులతో వేసింది కాదు. ప్రకృతి సాగు విధానంలో భాగంగా పండించిన వివిధ ఆహార ఉత్పత్తులతో రూపొందించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా బాపులపాడు మండలం వీరవల్లిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రకృతి సాగు ప్రాజెక్టు తరపున స్టాల్ ఏర్పాటు చేశారు. పలు ఉత్పత్తులను ఇలా ప్రదర్శించారు. – హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

చెట్టు చెదరని.. కోవెల!

కంకిపాడు మండలం కుందేరు గ్రామస్థులకు 40 ఏళ్ల కిందట ఓ సమస్య ఎదురైంది. దీన్ని సంప్రదింపులు, నిపుణుల సూచనలతో పరిష్కరించుకున్న విధానం మన్ననలు పొందుతోంది. స్థానిక చెరువు కూడలిలో అలనాటి వేంకటేశ్వరస్వామి గుడిలో వేపచెట్టు పెరిగింది. దేవతా వృక్షంగా భావించిన గ్రామస్థులు మహాలక్ష్మీమానుగా నామకరణం చేసి పూజిస్తుండేవారు. 1985లో గాలివానకు గుడిలో చాలా భాగం ధ్వంసమైంది. అదే స్థలంలో కొత్తగా ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. పనులు చేపట్టడానికి మహాలక్ష్మీమాను అడ్డుగా ఉన్నా దాన్ని తొలగించకుండా ఆలయం నిర్మించారు. భవన నిర్మాణ నిపుణుల సూచనతో చెట్టు కాండం, కొమ్మల చుట్టూ వృత్తాకారంలో ఖాళీ ఉంచి.. గోడలు, ఆర్‌సీసీ కప్పు నిర్మించారు. ఈదురుగాలులకు చెట్టు కాండం, కొమ్మలు ఊగినా అవి కట్టడాన్ని తాకనంత ఖాళీ వదిలారు. అలాగే రంధ్రం చుట్టూ ఇనుప జల్లెడ అమర్చి సిమెంట్, ఇసుక, కంకర మిశ్రమంతో నింపారు. వాన నీరు గుడిలోకి ప్రవేశించకుండా ఇతర ఏర్పాట్లు చేశారు. నాటి నుంచి ఎన్ని తుపానులు వచ్చినా చెట్టు కారణంగా దేవాలయ కట్టడాలకు నష్టం జరగలేదు. ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. – కంకిపాడు, న్యూస్‌టుడే

ఆస్తి ఎవరిది.. హక్కుదారు ఎవరు

వ్యవసాయ భూములు, ఇళ్లు, స్థలాలు.. కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ అవసరం. ఎందుకంటే ఆ భూమి రిజిస్టర్ అయి ఉంటేనే దానికి హక్కుదారులుగా చట్టం పరిగణిస్తుంది. క్రయ విక్రయాల సమయంలో అనుసరించాల్సిన విధానంపై చాలా మందికి అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నంలో ఒక ఆస్తిని వేర్వేరు వ్యక్తులకు విక్రయించిన ఘటనపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే వివాదం చోటు చేసుకోవడం, అధికారులకు ఫిర్యాదు చేయడం క్షేత్రస్థాయిలో సమస్యలను తేటతెల్లం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 350 నుంచి 400 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. క్రయ విక్రయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియకపోతే రూ.లక్షలు, ఒక్కోసారి రూ.కోట్లు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఆస్తి కొనుగోలుకు ముందు అనుసరించాల్సిన విధానాల గురించి తెలుసుకుందాం.

తెలుసుకుందాం

1908

కొనుగోలు చేసే భూములు 1908లోని సెక్షన్ 22ఎ ప్రకారం నిషిద్ధ జాబితాలో ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలి.

✦ ఆస్తి కొనుగోలు సమయంలో దానికి హక్కుదారు ఎవరు, దానిపై ఏవైనా బకాయిలు, లావాదేవీలు ఉన్నాయా అన్న విషయం నిర్ధారించుకోవాలి. ✦ దస్తావేజుల కాపీలు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరికి ఎలా సంక్రమించిందన్న విషయం తెలుసుకునే అవకాశం ఉంటుంది. ✦ మీభూమి వెబ్‌సైట్ ద్వారా భూమి యాజమాన్య హక్కు పత్రం, అడంగల్ తనిఖీ చేసుకుని ఆస్తి అమ్మకందారు పేరిట ఉందా లేదా అన్నది తెలుసుకోవచ్చు. ✦ పురపాలక సంఘం, గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాల విషయంలో అసెస్‌మెంట్ రిజిష్టర్‌లో నమోదు ముఖ్యం. ఆ వివరాల మదింపు రిజిష్టర్‌లో ఆస్తికి సంబంధించిన హక్కులు పరిశీలించుకోవాలి. ✦ ఆస్తిని పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా పొందే సమయంలో సదరు వ్యక్తికి సరైన హక్కులు ఉన్నాయా లేవా అన్నది నిర్ధారించుకోవాలి. ✦ కొనుగోలు చేసే ఆస్తిపై వివాదాలు, ఇతరులకు హక్కులు లేవన్న విషయాన్ని ధ్రువీకరించుకోవాలి ✦ క్రయ దస్తావేజు రాసుకునే సమయానికి సదరు ఆస్తికి సంబంధించి విద్యుత్తు, నీటి, ఆస్తి పన్నులు, ఇతర బకాయిలు లేకుండా చూసుకోవాలి.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అయినోళ్లకు నీడలో.. కానోళ్లకు ఎండలో..!

☛ విజయవాడ పీఎన్‌బీఎస్‌లో ముందస్తుగా టిక్కెట్లు ఇచ్చేందుకు 40 మంది బుకింగ్ కండక్టర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది అనర్హులే. ప్రజాప్రతినిధులు, ఆర్టీసీలో అధికారులను ప్రసన్నం చేసుకుని ఏళ్లుగా ఇక్కడే పాగా వేశారు. ఇటీవలే ఓ నాయకుడి సిఫార్సుతో ఆరుగురికి బాధ్యతలు అప్పగించడంపై దుమారం లేచింది.

ఆర్టీసీలో అనర్హులకు బుకింగ్ కండక్టర్లు, ఓడీ పోస్టులు

☛ బందరు డిపోలో ఓడీ (ఔటాఫ్ డిజిగ్నేషన్) విధుల్లో ఉన్న 12 మందిలో చాలా మంది అనర్హులే.
☛ విజయవాడ మెయిన్ డిపోలో నలుగురు కండక్టర్లు ఉన్నతాధికారుల అండతో ఐదేళ్లుగా కొనసాగుతున్నారు.
☛ విధుల్లో కొనసాగిస్తున్న వారికి ఖరీదైన కానుకలు సమకూరుస్తూ గడిపేస్తున్నారనే విమర్శలున్నాయి.

ఉమ్మడి జిల్లా ఆర్టీసీలో అడ్డగోలుగా బాధ్యతలు ఇచ్చేస్తున్నారు. పలువురు సిబ్బంది సొమ్ములు ఎరవేసి.. నేతల సిఫార్సులతో బుకింగ్ కండక్టర్లు, ఓడీ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఆ బాధ్యతలకు నిజంగా అర్హత ఉన్న వారు ఏళ్లు తిరుగుతున్నా ఫలితం లేక తల్లడిల్లుతున్నారు.

ఎవరికి కేటాయిస్తారంటే..

దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఉండి సాధారణ విధులు నిర్వహించలేని వారికి బుకింగ్ కండక్టర్లు, ఓడీ బాధ్యతలు అప్పగిస్తారు. ☆ వీరి తర్వాత సీనియార్టీ ప్రాతిపదికగా.. బస్సుల్లో కాకుండా డిపోల్లో విధులు కేటాయిస్తారు. ☆ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసి అనారోగ్యం, వైకల్య ధ్రువపత్రాలు సమర్పించాలి. ☆ ఆర్టీసీ త్రిసభ్య కమిటీ పరిశీలించి, వైద్యులతో నిర్ధారించుకుని అర్హత ఉంటే అనుమతిస్తారు.

అర్హత లేకున్నా అందలం...

☆ ఉమ్మడి జిల్లాలో ఈ రెండు విభాగాల్లో ఆరోగ్య సమస్యలు, సీనియార్టీ, వైకల్యం లేని వారు దాదాపు 150 మంది మేర అనర్హులు విధుల్లో ఉన్నారు. ☆ దరఖాస్తు, అనుమతి పత్రాలు ఏమీ లేకున్నా దర్జాగా శ్రమ లేని కొలువులో గడిపేస్తున్నారు. ☆ స్త్రీశక్తి పథకంతో విధుల్లో ఉన్న సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నా ట్రిప్పులు రద్దు చేస్తున్నారే తప్ప... వీరికి మాత్రం విధులు కేటాయించడం లేదు. ☆ కొన్ని బస్సుల్లో డ్రైవర్లతోనే టిక్కెట్ కొట్టిస్తున్నారు. * ఈ అంశంపై ఆర్టీసీ ఉన్నతాధికారుల వివరణ కోసం చరవాణిలో యత్నించగా అందుబాటులోకి రాలేదు.

– ఈనాడు, అమరావతి

పంచాయతీ సొమ్ములు గుటుక్కు!

సర్పంచులు, కార్యదర్శులు కుమ్మక్కయి మేత

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

జిల్లాలోని పంచాయతీలకు చేరాల్సిన సొమ్మును పలువురు కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు కుమ్మక్కయి తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇంటి పన్నులు, కుళాయి కనెక్షన్లు, చెరువుల లీజులు, మట్టి తవ్వకాలు తదితరాలపై వచ్చే డబ్బులను దోచేస్తూ పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. పారిశుద్ధ్యం, నీరు, వీధి దీపాల నిర్వహణ పనుల టెండర్ల విషయంలోనూ సర్పంచులు, కార్యదర్శులు అవినీతికి పాల్పడుతూ రూ.లక్షలు దోచేస్తున్నారు. తమకు అనుకూలమైన వారికి పనులు అప్పగిస్తూ జిల్లా అధికారుల అనుమతులు రాక ముందే జీతాలు డ్రా చేసి కమీషన్లు దండుకుంటున్నారు. మండల, డివిజన్ అధికారుల పరిశీలనలో అక్రమాలు బయటపడినా ముడుపులు తీసుకొని వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పన్నులు స్వాహా: తోట్లవల్లూరు పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్ స్థానిక నేత అండతో గ్రామస్థుల నుంచి ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేసి రసీదులు ఇవ్వకుండా సుమారు రూ.2.50లక్షలు జేబులో వేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ మండలస్థాయి అధికారికి సైతం మామూళ్లు అందడంతో విషయం తెలిసినా చర్యలు తీసుకోలేదని సమాచారం. ★ మోపిదేవి మండలం పెదప్రోలు పంచాయతీలో ఓ పార్టీకి చెందిన నేత కుళాయి కనెక్షన్లు ఇప్పించి పంచాయతీ ఖాతాకు డబ్బులు జమచేయలేదు. దీనిపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కొత్తగా కనెక్షన్లు ఇచ్చినట్లు ఓ అధికారి సాయంతో రసీదులు సృష్టిస్తున్నారని సమాచారం. మరమ్మతుల పేరుతోనూ నకిలీ బిల్లులు పెట్టి దోచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పంచాయతీలు: 497

గ్రేడ్ 1	149	
" 2	52	500లోపు జనాభా 28
" 3	51	
" 4	61	
" 5	156	

రూ.58లక్షలు

ఉంగుటూరు ఎంపీడీవో (2019-21) జ్యోతి హయాంలో (ప్రస్తుత పామర్రు ఎంపీడీవో) రూ.58.56 లక్షలు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలింది. పెదఅవుటపల్లిలో రూ.43.84లక్షలు.. పొట్టిపాడు రూ.13.35లక్షలు, ఎన్.అప్పారావుపేట రూ.1.37లక్షలు దారిమళ్లింది. అప్పటి కార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, ఎం.అమీర్‌బాషా రూ.29.28 లక్షలు, ఎంపీడీవో రూ.29.28లక్షలు దుర్వినియోగం చేసినట్లు తేలడంతో రికవరీకి కలెక్టర్ ఆదేశించారు.

చర్యలు తీసుకుంటాం

పంచాయతీలకు చేరాల్సిన సొమ్ములను సొంతానికి వాడారని ఇటీవల పలు ఫిర్యాదులు అందడంతో బాధ్యులపై చర్యలు తీసుకున్నాం.

- అరుణ, డీపీవో

నగదు రూపంలోనే జోగికి ముట్టజెప్పాం!

సిట్, ఎక్సైజ్ విచారణలో అద్దేపల్లి సోదరుల వెల్లడి

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుల ఆర్థిక లావాదేవీలపై సిట్ దృష్టి సారించింది. అద్దేపల్లి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను సేకరించి క్షుణ్నంగా విచారిస్తోంది. మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు రాములతో ఆర్థిక బంధంపై దృష్టి పెట్టింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావులను సిట్, ఎక్సైజ్ అధికారులు.. రెండో విడత కస్టడీకి తీసుకున్నారు. నాలుగు రోజుల కస్టడీలో భాగంగా బుధవారం తొలి రోజు... నెల్లూరు కారాగారంలో ఉన్న జనార్దనరావు (ఏ1)ను ఉదయం అదుపులోకి తీసుకుని.. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ తరలించారు. విజయవాడ జైలులోని జగన్మోహన్‌రావును కస్టడీకి తీసుకున్నారు. వీరిని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి, అక్కడ విచారించారు.

ప్రతి లావాదేవీపై ఆరా: కొన్నేళ్ల బ్యాంకు స్టేట్‌మెంట్లను తెప్పించి.. పెద్ద లావాదేవీలపై ఇద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించారు. నగదు ఎందుకు డ్రా చేశారు? ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇచ్చారనే వివరాలను రాబట్టారు. జోగి సోదరులకు తాము ముడుపులను నగదు రూపంలోనే ఇచ్చామని అంగీకరించినట్లు తెలిసింది. అక్రమ మద్యం, నకిలీ మద్యం వ్యాపారం కోసమే జోగి రమేష్‌కు ఇచ్చామని వీరు విచారణలో తెలిపారు. జోగి సోదరులతో సంబంధాలపైనా ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో తాము కలిసే మద్యం సిండికేట్‌లో సభ్యులుగా ఉండి వ్యాపారం చేసినట్లు ఒప్పుకొన్నారు. పలు ప్రశ్నలకు జనార్దనరావు సరైన సమాధానాలు చెప్పలేదు. స్పిరిట్, సీసాల కొనుగోలు, లేబుళ్ల ముద్రణ ఆర్డర్లకు నిధులు ఎలా సమకూరాయని ప్రశ్నించగా.. సమాధానాలు సూటిగా చెప్పలేదు.

పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

★ కొన్న రోజే నగదు చెల్లింపు ★ లక్ష్యం 51లక్షల మెట్రిక్ టన్నులు ★ మంత్రి నాదెండ్ల మనోహర్

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మచిలీపట్నం, గూడూరు, పెడన, తదితర ప్రాంతాల్లో బుధవారం మంత్రి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులు, మిల్లర్లతో చర్చించారు. మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి మచిలీపట్నంలో రైస్‌మిల్లును సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి రాష్ట్రంలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలుకు భరోసా కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 4వేల రైతు సహాయ కేంద్రాల ద్వారా 17వేల మంది సిబ్బంది కొనుగోలు ప్రక్రియలో నిమగ్నమయ్యారన్నారు. మొత్తం 30వేల వాహనాలను ధాన్యం రవాణా కోసం వినియోగిస్తున్నారని, 6.50 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కృష్ణాలో మంగళవారం నాటికి 38వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. గతేడాది ఇదే సమయానికి 2,800 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్టు వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా గతేడాది ధాన్యం అమ్మిన 48 గంటల్లోపు నగదు చెల్లిస్తే ప్రస్తుతం అమ్మిన రోజే నగదు ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకూ కొనుగోలు చేసిన ధాన్యానికి 92 శాతం అదే రోజు నగదు చెల్లించారన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు, సాంకేతిక సాయం వంటి అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలుస్తోందన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సన్నకారు, కౌలు రైతులు ఉచితంగా వాడుకునేందుకు వీలుగా టార్పాలిన్లు సిద్ధంగా ఉంచామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా కేంద్ర ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రైతు ప్రయోజనకరంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తున్నారన్నారు. మంత్రుల పర్యటనలో జేసీ నవీన్, అధికారులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మిల్లర్లను ప్రశ్నిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

● ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P.
FM Partner TV Partner Digital Partner Organised by

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రామలింగేశ్వర స్వామికి అఖండ కర్పూర జ్యోతి

అఖండ కర్పూర హారతి నివేదనం

నాగాయలంక, న్యూస్‌టుడే: స్థానిక కృష్ణాతీరాన శ్రీరామపాద క్షేత్రంలో కార్తిక శోభ వెల్లివిరిసింది. గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి 18 కేజీల అఖండ కర్పూర హారతిని సమర్పించారు. వివిధ రకాల పూలతో రామలింగేశ్వరుడిని అభిషేకించారు.

పూలతో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

☛ నాగాయలంకలో శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి దేవాలయంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా స్వామి వారికి 21 కేజీల కర్పూరంతో అఖండ హారతి సమర్పించారు.

పాములు కాదు.. చేపలే!

నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం కొలువైన కృష్ణా నది నీటిలో బుధవారం పాములను పోలినట్లుగా ఉన్న ఈల్ చేపలు భారీగా కనిపించాయి. భక్తజనులు వాటిని చూసేందుకు భారీగా తరలివచ్చారు. కృష్ణా నదిలో తీపి నీటి ప్రవాహం ఉన్నప్పుడు ఇవి వస్తుంటాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. **- నాగాయలంక, న్యూస్‌టుడే**

రైతు సంక్షేమానికి పెద్దపీట

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన పీఎం కిసాన్ అన్నదాతా సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రైతులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారన్నారు. ఇటీవల మార్కెట్ ధరలు లేక పొగాకు, మామిడి రైతులు ఇబ్బందులు పడితే తక్షణం స్పందించి కూటమి ప్రభుత్వం ఆదుకున్న విషయం తెలిసిందే అన్నారు. పీఎం కిసాన్ అన్నదాతా సుఖీభవ రెండో విడత నిధులు బుధవారమే రైతుల ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో 7,526 మంది రైతులకు అన్నదాతా సుఖీభవ కింద రూ.3.76 కోట్లు, పీఎం కిసాన్ నిమిత్తం 7,017 మంది రైతులకు రూ.1.41 కోట్లు చెల్లించారన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి పద్మావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, అప్సడా డైరెక్టర్ లంకే నారాయణప్రసాద్, కూటమి నాయకులు గోపు సత్యన్నారాయణ, తలారి సోమశేఖర్, కాగిత వెంకటేశ్వరరావు, అక్కుమహంతి రాజా, లోగిశెట్టి వెంకటస్వామి, మాదివాడ రాము పాల్గొన్నారు.

రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి రవీంద్ర

సహకార రంగం బలోపేతానికి కేంద్రం కృషి

నున్న, న్యూస్‌టుడే: సహకార రంగంలో విస్తృతమైన అవకాశాలున్నాయని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తద్వారా సొసైటీని లాభాలబాట పట్టించాలని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం నున్నలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీ పేరుతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టిందన్నారు. అందులో భాగంగా కంప్యూటరీకరణ చేయడం జరుగుతోందన్నారు. కేవైసీ వివరాలను సమర్పించని వారిని తొలగించి అసలైన సభ్యత్వం గలవారి వివరాలను నమోదు చేస్తామన్నారు. సహకార రంగంలో రుగ్మతలను రూపుమాపి ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి నెహ్రూ కృషి చేశారని కొనియాడారు.

మాట్లాడుతున్న జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రమంతటా 'స్వచ్ఛ చల్లపల్లి' వ్యాపించాలి

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్ఫూర్తిదాయకంగా సాగుతున్న 'స్వచ్ఛ చల్లపల్లి' కార్యక్రమం అభినందనీయమని, రాష్ట్రమంతటా వ్యాపించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ వై.డి.రామారావు అన్నారు. ఐఆర్‌సీఎస్ ఎన్.టి.ఆర్.జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.సమరంతో కలసి చల్లపల్లిలో అభివృద్ధి చెందిన ప్రదేశాలను బుధవారం సందర్శించారు. డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి స్వచ్ఛ సుందర చల్లపల్లి ఉద్యమ ప్రస్థానాన్ని వివరించారు. అతిథులను సన్మానించారు. కృష్ణాజిల్లా ఐఆర్‌సీఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెనుమూడి శ్రీనివాసరావు, గరికపాటి హరిప్రసాద్, కోడూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఛైర్మన్ వై.డి.రామారావు, డాక్టర్ సమరంలను సన్మానిస్తున్న డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ తదితరులు

సహజత్వం.. సాంకేతికతల కలబోత

ఆకట్టుకున్న 'మహాపురుషుడు మండలి' నాటకం

అవనిగడ్డ, న్యూస్‌టుడే

అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో బుధవారం సాయంత్రం ప్రదర్శించిన 'మహా పురుషుడు మండలి' నాటకం ఆకట్టుకుంది. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో దీన్ని డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించారు. గంగోత్రి సాయి దర్శకత్వంలో 40 మంది కళాకారులు వారి వారి పాత్రలకు జీవం పోస్తూ నటించారు. ఉప్పెన ముప్పు దివిసీమను కల్లోలభరితం చేసి 48 ఏళ్లు కావడంతో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన జీవిత చరిత్ర కళ్లకు కట్టేలా దీన్ని రూపొందించారు. నాటి సంఘటనలు కళ్ల ముందు కదలాడినట్లుగా ఆధునిక సాంకేతికతను వినియోగించి నాటకాన్ని రసరమ్యంగా తీర్చిదిద్దారు. మండలి వెంకట కృష్ణారావుగా గంగోత్రి సాయి నటన ఆకట్టుకుంది. కృష్ణారావు సతీమణి ప్రభావతిగా ఎం.రాధ మెప్పించారు. కథ మొత్తం సూత్రధారి రాజర్షి, నటి వసంతరాణి నడిపించిన తీరు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. 1977 ఉప్పెన వినాశకర దృశ్యాల్ని ఏఐ టెక్నాలజీతో వాస్తవానికి దగ్గరగా చూపించడం ద్వారా నాటక రంగంలో కొత్త దనానికి శ్రీకారం చుట్టారు. బుద్ధప్రసాద్‌గా నటించిన శ్రీధర్ ఆకట్టుకున్నారు.

ఉప్పెన బాధితులను ఓదారుస్తున్న కృష్ణారావు

మండలి వెంకట కృష్ణారావుగా గంగోత్రి సాయి

ఆమెకు 13.. అతడికి 40..

● ఆస్తి కోసం బాల్య వివాహం
● అడ్డుకున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: అమ్మాయిది ముక్కుపచ్చలారని వయసు.. చక్కగా చదువుకుంటూ బడికి వెళుతోంది.. అతనికేమో 40 ఏళ్లు దాటాయి. అతడికి అప్పటికే ఒకసారి పెళ్లయ్యింది. భార్య దూరం కావడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. మరో పెళ్లి ప్రయత్నంలో 8వ తరగతి చదువుతున్న మేనకోడల్ని వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. బాలిక తల్లిదండ్రులు కూడా అతడికి ఎకరం పొలం, రెండిళ్లు ఉండడంతో పెళ్లి తర్వాత ఆస్తిపాస్తులన్నీ తమ కుమార్తె సొంతమవుతాయన్న ఆశతో సరేనన్నారు. పెద్దల సమక్షంలో వివాహానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసు రంగప్రవేశం చేయడంతో రెండు కుటుంబాలు ఇళ్లకు తాళం వేసి గుట్టుచప్పుడు కాకుండా వేరే ప్రాంతానికి వెళ్లి బాల్య వివాహం జరిపించేసి తాపీగా ఇంటికి చేరుకున్నాయి. వీరిపై నిఘా ఉంచిన అధికారులు బాలిక ఇంటికి వెళ్లి చూడగా మెడలో పసుపుతాడు కన్పించింది. దీంతో తల్లిదండ్రుల్ని, వరుడ్ని మందలించారు. తాళి మెడలోంచి తీయకుంటే పోలీసు కేసు పెడతామంటూ బెదిరించారు. రోజూ మాదిరి బాలికను పాఠశాలకు పంపాలని లేకుంటే తగు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో బాలిక తల్లి దిగివచ్చి మెడలో తాడు తీసివేసి యథాప్రకారం బుధవారం పాఠశాలకు పంపింది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రూ. 14 లక్షలతో ఉడాయించిన డ్వాక్రా బుక్ కీపర్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డ వెలుగు కార్యాలయానికి సంబంధించిన బుక్ కీపర్ రూ.14 లక్షలతో ఉడాయించడంతో మూడు గ్రూపులకు చెందిన 30 మంది డ్వాక్రా సభ్యులు గొల్లుమంటున్నారు. గ్రూపులోని సభ్యులు తీసుకున్న రుణాలను బ్యాంకుకు చెల్లించడానికి ప్రతి నెలా ఒక సభ్యురాలు మిగిలిన 9 మంది నుంచి నెలసరి కిస్తీ తీసుకువెళ్లి జమ చేయడం విధానం. అధికారులు కూడా ఇలాగే చేయమని చెబుతున్నారు. అయితే లంకమ్మ మాన్యంలో నివాసం ఉంటున్న బుక్ కీపర్ వి.మల్లేశ్వరికి మూడు గ్రూపులకు సంబంధించిన 30 మంది సభ్యులు గత కొద్ది నెలలుగా కిస్తీ సొమ్ములు జమ చేయమని ఇస్తున్నారు. ఆమె కడుతోందని అనుకుంటున్నారు. ఇటీవల కిస్తీలకు డబ్బులు ఇచ్చినప్పటికీ ఆ మొత్తం వారి బకాయిలు చెల్లించడానికి జమ చేయడం లేదని తెలిసింది. దీంతో విచారించగా బుక్ కీపర్ ఇంటికి తాళం వేసి ఉండటం చూసి లబోదిబో మంటున్నారు. దీనిపై స్థానిక ఏపీఎంకు, పోలీసు స్టేషన్‌లో ఎస్.ఐకి, జిల్లా కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదులు చేశారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా మూడు గ్రూపులకు చెందిన వారి నుంచి రూ.14 లక్షలు బ్యాంకులో కడతానని తీసుకుని కట్టలేదని తనకు ఫిర్యాదు చేశారన్నారు. మూడు గ్రూపులలో ఒక గ్రూపునకు బుక్ కీపర్ మల్లేశ్వరి లీడరు కాగా, మరో గ్రూపునకు ఆమె కోడలు లీడరు అని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇంటికి వెళితే తాళం వేసి ఉందని చెప్పారు.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చిందని, ఆ మేరకే సూపర్-6 హామీలను ఏడాదిన్నరలోనే అమలుచేసి చూపిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' రెండో విడత సాయం విడుదల సందర్భంగా బుధవారం బాపులపాడు మండలం వీరవల్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల మంది రైతులకు దాదాపు రూ.16 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్న నేపథ్యంలో నమూనా చెక్కును మంత్రి సుభాష్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డీకే బాలాజీలు ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వ నిధులతో పాటు, సొంత నిధులతో రైతులకు చేయూతనిస్తున్నారని ప్రశంసించారు. యార్లగడ్డ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో చెల్లింపులు చేయడం, యూరియా కొరత లేకుండా నివారించడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సాయమందించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు తాను కర్షకుల పక్షపాతినని మరోసారి నిరూపించుకున్నారన్నారు. ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నర్సయ్య, రాష్ట్ర మాల కార్పొరేషన్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు దయాల రాజేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, జిల్లా ఉద్యానాధికారి జ్యోతి, గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం, గన్నవరం ఏడీఏ సునీల్, సర్పంచి అనిత, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, నాయకులు రాజాబాబు, ఉమాప్రసాద్, గోపాలకృష్ణ కల్యాణి, కుమారస్వామి, రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ, కలెక్టర్ బాలాజీలు సహకారం సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.


నమూనా చెక్కుతో మంత్రి సుభాష్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ, కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్... కస్టడీపై తీర్పు నేడు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టి అరెస్టయిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్, నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని దాఖలైన పిటిషన్లపై ఇరువర్గాల వాదనలు బుధవారం ముగిశాయి. గురువారం న్యాయాధికారి వీటిపై తీర్పు వెలువరించనున్నారు. నిందితుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి అనుచిత పోస్టుల కేసులో లోతైన విచారణ చేసేందుకు వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరిన సంగతి తెలిసిందే.

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ డిసెంబరు 3న విజయవాడలో ఆవేదన దీక్ష చేపడుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సత్వర న్యాయం కోసం విజయవాడ కేంద్రంగా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ రాష్ట్రంలో 19.52 లక్షల మంది ఖాతాదారులను రూ.3986 కోట్లకు మోసం చేసిందని గుర్తు చేశారు. 8 రాష్ట్రాల్లో దాదాపు 1300 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే జనవరి నాటికి ఉద్యమం చేపట్టి 12 సంవత్సరాలు అవుతుందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు. కంపెనీ ఆస్తులు విక్రయించి సమస్య పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటైనా.. వేగంగా పని చేయడం లేదని ఆయన విమర్శించారు. ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. డిసెంబరు 3వ తేదీలోపు సంస్థ ఆస్తులను వేలం వేసి, యజమానుల పేరుతో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం సింగరాయ హిల్స్ గ్రీన్ పవర్ జెన్‌కో ప్రైవేటు లిమిటెడ్ పేరు మీద ఉన్న 1069 ఎకరాల భూమిని రూ.18కోట్లకు బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకుందని వెల్లడించారు. బ్యాంకు ఆ భూములను వేలం వేయగా.. మరో బినామీ కంపెనీ పేరుతో కుమ్మక్కై పాడుకునేలా యాజమాన్యం చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు కె.గగన్, విజయవాడ నగర కార్యదర్శి ఎస్.కె.షరీఫ్, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.భాస్కరరావు, కె.మణికంఠ పాల్గొన్నారు.

వందేళ్ల జంక్షన్ పుస్తకావిష్కరణ

హనుమాన్‌జంక్షన్: ఒక ఊరి చరిత్రను వరుసగా పుస్తక రూపంలో నిక్షిప్తం చేసి భావితరాలకు అందించడం అభినందనీయమని ప్రముఖ వ్యాపారవేత్త మానేపల్లి కుమార్ పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, రక్తకన్నీరు నాటక ఫేం దాసరి పూర్ణచంద్రరావు నూరు వసంతాల హనుమాన్‌జంక్షన్ పేరుతో ఓ పుస్తకం రూపొందించారు. బుధవారం జంక్షన్ అభయాంజనేయస్వామి పాదాల వద్ద ఈ పుస్తక మొదటి ప్రతిని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత నర్రా సూర్యప్రకాశరావు, ప్రముఖ వాస్తు సిద్ధాంతి రొంపెల్లి భగవాన్ నాయుడు, సహకరించిన వడ్డి త్రివేణికుమార్, తాడి రంగారావు, బోయపాటి వరప్రసాద్, దన్నే దుర్గారావు, గంటా శ్రీనివాస్‌ను సత్కరించారు.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన NIT NO.08/EE-2/2025-26, Dt: 19.11.2025

శ్రీ అమ్మవారి దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి భవాని దీక్షలు విరమణ-2025-26 సందర్భముగా 1. కొండ పైన తాత్కాలిక విద్యుత్ పనులు చేయుటకు 2. కొండ క్రింద కేశఖండనశాల నందు తాత్కాలిక విద్యుత్ పనులు చేయుటకు 3. కొండ క్రింద మహామండపము నందు తాత్కాలిక విద్యుత్ పనులు చేయుటకు 4. కొండ పైన మరియు కొండ క్రింద తాత్కాలిక Publicaddressingsystem ఏర్పాటు చేయుటకు 5. కొండ పైన మరియు కొండ క్రింద CCTV లైవ్ ఏర్పాటు చేయుటకు (2వ పర్యాయము) 6. కొండ పైన తాత్కాలిక షామియానా పనులు చేయుటకు (2వ పర్యాయము) 7. కలశ జ్యోతులు కొరకు ట్రాలీ ఫ్లవర్, ఫైబరు విగ్రహాలు మరియు మండపం ఏర్పాటు చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి కలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments Department వర్క్స్ నందు సందర్శించవచ్చును. టెండరు డౌన్ లోడ్ తేది:20-11-2025 మ॥ 03.00 గం॥ల నుండి సీ.నెం.5, 6 & 7 టెండరు దాఖలు చేయు చివరి తేది:24-11-2025 మ॥ 03.00 గం॥ల వరకు. సీ.నెం.1 నుండి 4 టెండరు దాఖలు చేయు చివరి తేది:27-11-2025 మ॥ 03.00 గం॥ల వరకు. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో లేదా ఫోన్:0866-2423800 ద్వారా సంప్రదించగలరు.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 97018 93458.

BPT/ B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/ Dialysis - Courses in Vijayawada - MGT./ Convener Quota. ✆ 76800 65835.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

PLOT FOR SALE

విజయవాడ సిటీ, బెంజిసర్కిల్ 5 మినిట్స్ జర్నీలో ★ మంచి ప్రశాంతమైన వాతావరణంలో ఈస్ట్ & వెస్ట్‌ఫేస్ రెడిటూ కన్‌స్ట్రక్షన్‌కి అనువైన 133 గజాలు ప్లాట్లు కేవలం 30 లక్షలు ఫైనల్ రేటుతో అమ్మకం. ✆ 77320 51576.

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

JOBS

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు ఇన్‌చార్జ్ (F) జీ. 20K రిసెప్షనిస్ట్ (F) జీ. 15K ఏదైనా డిగ్రీ VJA- 7 ✆ 87905 99799.

ప్రముఖ బ్యాంక్ కలెక్షన్ ఏజెన్సీలో బ్యాంకు లోన్స్ వసూలు చేయుటకు (Ms) ఆఫీసులో అనుభవం కలిగిన (ఫిమేల్) టెలికాస్ట్ కావలెను. 77318 68308.

అకౌంటెంట్ కావలెను. B.Com., GST, ESI, P.F, Returns, Tally అకౌంట్స్ వచ్చినవారు కావలెను. ✆ 79895 77531

Wanted Computer Hardware, Printer Engineers for VLMS IT Solutions. Bhavanipuram, www.vlms.in 98488 18090, 97012 27778.

Wanted Male Floor/ Campus Incharges, Data Entry Operators & Hostel Wardens to work in Sri Medha Jr. College, Labbipet, Exp. Min 3 Years. Age: 30-40 Yrs. Qual: Any Degree/ B.Tech. 91542 10069.

VJA మొగల్‌రాజ్‌పురంలో ప్రముఖ స్వీట్ షాపులో పనిచేయుటకు సేల్స్ సూపర్‌వైజర్స్, స్టోర్స్ సూపర్‌వైజర్స్ కావలెను. అనుభవం గలవారికి ప్రాధాన్యత. ✆ 91778 17557

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆70320 60786

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 - 29000. వ: 18-35. ✆: 7730958410.

విజయవాడలో ప్రముఖ 3 స్టార్ హోటల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ మార్కెటింగ్ మేనేజర్ మరియు యువతి యువకులు కావలెను. ✆ 91001 17227.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఉపాధి పనులు పక్కాగా చేపట్టాలి

పెడన గ్రామీణం: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు పక్కాగా ఉండాలని ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు. నడుపూరులో బుధవారం 2026-27 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. మండలంలో 2026-27 సంవత్సరంలో 2.5లక్షల పనిదినాలతో 1500 పనులు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించి ప్రాథమిక అంచనాలు తయారు చేశారని పేర్కొన్నారు. వీటి విలువ రూ.6 కోట్లు ఉంటుందని తెలిపారు. మండలంలో జరుగుతున్న రహదారుల నిర్మాణ పనుల సామగ్రి రూ.1.55 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. బల్లిపర్రు, గురిందగుంట, చేవేండ్ర గ్రామాల్లో సాంకేతిక సమస్యల కారణంగా గ్రామ సభలు పూర్తి కాలేదని పేర్కొన్నారు. సర్పంచి బీర్ల అనూష, గ్రామ కార్యదర్శి నజీర్ పాల్గొన్నారు.

పెడనలో తాగునీటి సరఫరాకు విఘాతం

పెడన,న్యూస్‌టుడే: పెడనలో బుధవారం తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. మచిలీపట్నం రోడ్డులోని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి బస్టాండు సెంటరులోని రిజర్వాయర్‌కు సరఫరా చేసే ఆస్‌బెస్టాస్ సిమెంట్(ఏసీ) పైపులకు మంగళవారం అర్ధరాత్రి పంపింగ్ సమయంలో భారీ లీకులు ఏర్పడడంతో సరఫరా నిలిచింది. మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది ఉదయం రంగంలోకి దిగి లీకైన పైపును పునరుద్ధరించారు. 1998లో నిర్మించిన ఈ పైపులు తరచూ లీకులు రావడంతో సరఫరాకు అంతరాయాలు కలుగుతున్నాయి. పైపుల మార్పునకు చర్యలు చేపడుతున్నామని ఇన్‌ఛార్జి కమిషనర్ కాగిత రామాంజనేయులు చెప్పారు. గురువారం నుంచి సరఫరా యథావిధిగా షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

★ నగర పరిధిలోని సుకర్లాబాదలో అంతర్గత డ్రైనేజీ పూడిపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. ఈ సమస్యను స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించగా సిబ్బందిని పంపి పూడిక తొలగించడంతో పాటు, బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారు. ★ నగరంలోని జొన్నల్లపేట ప్రాంతంలో రహదారి పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించగా సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ★ నగరంలోని వలందపాలెం బీసీ వసతిగృహం సమీపంలో రహదారి పక్కన వేసిన చెత్తకొమ్మల వ్యర్థాలను తొలగించకపోవడంతో స్థానికులు సమస్యను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించగా సిబ్బందిని పంపి తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

-మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఉక్కు మహిళ ఇందిర

మచిలీపట్నం (గొడుగుపేట),న్యూస్‌టుడే: మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతిని బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ దేశానికి తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అని, ఉక్కు మహిళగా గుర్తింపు పొందారన్నారు. నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్, దత్తుడు, శామ్యూల్ తదితరులు పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ముగ్గుల పోటీలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అర్తమూరు గ్రంథాలయం తరఫున నిర్వాహకులు పుష్పరాణి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పగిలిన పైపులు.. ఆగని లీకులు

రంగుమారిన నీరు తాగలేక అవస్థలు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

★ నగరంలోని ఆర్‌కే కళాశాల సైకిల్ స్టాండ్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన లీకు నుంచి గత కొంతకాలంగా తాగునీరు వృథాగా పోతోంది. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు నగర పాలక సంస్థ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. లీకులకు మరమ్మతులు చేయకుండా వృథాగా పోయే నీరు సరాసరి డ్రెయిన్‌లో చేరేలా దారి చేసి వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌కే కళాశాల వద్దే కాదు బచ్చుపేట ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోనూ ఇలా లీకు కారణంగా నీరు వృథాగా పోతోందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వివిధ ప్రాంతాల్లో పైపులైన్ లీకు సమస్యలను సకాలంలో పరిష్కరించకపోవడంతో నెలల తరబడి నీరు వృథా కావడంతో పాటు శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బైపాస్ రోడ్డులో వివిధ ప్రాంతాల్లో లీకుల ద్వారా నీరు వృథాగా పోతోంది. పలు ప్రాంతాల్లోని వాల్వ్‌పిట్‌ల వద్ద నీరు వదిలినప్పుడల్లా లీకు అవుతూనే ఉంది.

నీటి సమస్యను మంత్రి రవీంద్రకు వివరిస్తున్న మహిళలు

★ ఇటీవల కాసానిగూడెం ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వెళ్లిన మంత్రి కొల్లు రవీంద్రను ఆ ప్రాంత మహిళలు కలిసి నీరు రంగుమారడంతో పాటు వాసన వస్తున్నాయంటూ మొరపెట్టుకున్నారు. ఎప్పటి నుంచో సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. మంత్రి అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. లీకులతో పాటు పర్యవేక్షణ లేమి కారణంగా చాలాచోట్ల తాగు నీరు రంగుమారి సరఫరా అవుతోంది. నీళ్లు మురికిగా ఉండడంతో చాలా మంది ఆర్వో ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి లీకుల సమస్యను పరిష్కరించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎక్కడెక్కడ నీరు రంగు మారి సరఫరా అవుతుందో..ఎందుకు జరుగుతుందో గుర్తించి శుద్ధజలం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్యాంకర్ల ద్వారానే శివారుకు సరఫరా: ప్రస్తుతం నగరంలో మొత్తం 19 రిజర్వాయర్లు ఉన్నాయి. గతంతో పోల్చుకుంటే తాగునీటి సరఫరా వ్యవస్థ కొంతమేర మెరుగుపడినా మాచవరం, వలందపాలెం, పెయింటర్స్‌కాలనీ, గిలకలదిండి ఇలా అనేక ప్రాంతాలకూ ట్యాంకర్ల ద్వారానే నీరు సరఫరా చేయాల్సిన దుస్థితి. సరఫరా అయ్యే నీరు కూడా రంగు మారడంతో తాగలేక పోతున్నామంటూ నగర వాసులు ఆవేదన చెందుతున్నారు.

మురుగుశుద్ధి వాహనాల మంజూరుకు దరఖాస్తులు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: సఫాయి కర్మచారి వృత్తి చేసే వారికి మురుగుశుద్ధి వాహనాలను మంజూరు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో ప్రతిపాదనల మేరకు 3వేల లీటర్ల సామర్థ్యం గల 114 వాక్యూం సక్షన్ మురుగుశుద్ధి వాహనాలను 2023 నవంబరులో ఉమ్మడి జిల్లాలో పంపిణీ చేసినట్లు వివరించారు. వాహన వ్యయం రూ.31.67లక్షలు, సబ్సిడీ రూ.14.16లక్షలు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణం రూ.17.50లక్షలుగా రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రుణాన్ని 72 నెలల వాయిదాలో నెలకు రూ.33,064 చెల్లించాల్సి ఉన్నా లబ్ధిదారులు నెలవారీ వాయిదాలను చెల్లించనందున కార్యాలయానికి తిరిగి అందించేందుకు అంగీకరించారన్నారు. ఈ వాహనాలను నూతన లబ్ధిదారులకు అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సఫాయి కర్మచారి వృత్తి చేసే వారు 50 మంది సభ్యులతో ఒక గ్రూపుగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9652057244 నంబరులో సంప్రదించాలన్నారు.

రైతులకు అన్నదాత సుఖీభవ సాయం పంపిణీ

గూడూరు, న్యూస్‌టుడే: అన్నదాత ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నియోజకవర్గ స్థాయి పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ సాయం పంపిణీని బుధవారం మండల పరిధిలోని మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి నిర్వహించిన కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన నియోజకవర్గానికి పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రెండో విడత రూ.16.03కోట్లు విడుదలయ్యాయని అన్నారు. పెడన మండలానికి రూ.5.90కోట్లు, గూడూరు మండలానికి రూ.5.07కోట్లు, బంటుమిల్లి రూ.3.12కోట్లు, కృత్తివెన్ను మండలానికి రూ.1.94కోట్లు చొప్పున విడుదల చేసినట్లు తెలిపారు. డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, మల్లేశ్వరం ఏఎంసీ ఛైర్మన్ ఒడుగు తులసీరావు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల తెదేపా అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, నగిడి చెన్నకేశవరావు, కూటమి నాయకులు కూనపరెడ్డి పెద్దిరాజు, బూసాశెట్టి శ్రీనివాస్, ముద్దినేని కొండ, బత్తిన వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం

చినగొల్లపాలెం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: దాతల సహకారంతో రాళ్లరేవు జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి చెందడం సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని చినగొల్లపాలెం దీవిలోని రాళ్లరేవు జడ్పీ ఉన్నత పాఠశాల అంతస్తుపై నిర్మించిన 4 గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. దీని నిర్మాణానికి సహకారం అందించిన చినగొల్లపాలెం గ్రామస్థుడు, గుత్తేదారు వీరవెంకట సుబ్బారావును అభినందించారు. కార్యక్రమంలో చందు చౌదరి, చందు కృష్ణమూర్తి (బుజ్జి), ఏఎంసీ ఛైర్మన్ ఒడుగు తులసీరావు, మండల తెదేపా అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, ప్రధాన కార్యదర్శి యాదవరెడ్డి శ్రీనివాసరావు (కొండ), పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ అరవ మురళీ పాల్గొన్నారు.

తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఉత్తమ ఫలితాలు చాటుకునేందుకు పోటీతత్వం దోహదపడుతుందని స్టార్ విద్యా సంస్థల డైరెక్టర్లు పి.శ్రీరామ్, బి.ఆదిత్యప్రసాదు అన్నారు. బుధవారం ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో నగరంలోని స్టార్ ఇంటర్మీడియట్ కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు. ఏఐ వల్ల వచ్చే మార్పులు, ఉపాధి అవకాశాలపై ఉపన్యసించారు. ఈ పోటీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు వి.నాగరోహిత్‌రామ్, వి.ప్రణీత, ఎండీ ఆఫియాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపల్ ఎంఎల్ ఆదిత్య అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ ఎన్.ఓంకారేశ్వరరావు, అధ్యాపకులు వై.లక్ష్మి, జి.అంజనా బహుమతులు అందజేశారు.

విజేతలతో వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

ముగ్గులు వేస్తున్న బాలికలు

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా గ్రంథాలయంలో రంగవల్లులు, మెహందీ పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆనందరావు దేశభక్తి గేయాలాపన పోటీలు నిర్వహించారు. ఉపగ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ పర్యవేక్షించారు. చింతగుంటపాలెం, హౌసింగ్‌బోర్డుకాలనీ, చిలకలపూడి తదితర గ్రంథాలయాల్లో కార్యక్రమాలు జరిగాయి. గూడూరు గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గోరిపర్తి ఫణిరాజ్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి ఎన్ఏబేగ్, నూర్‌అహ్మద్‌బేగ్ తదితరులు పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర గురించి వివరించారు. మల్లవోలు గ్రంథాలయంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథపాలకులు పర్యవేక్షించారు.

చరిత్ర చూడని జలప్రళయం దివిసీమ ఉప్పెన

మృతులకు నివాళులర్పిస్తున్న సయ్యద్‌బీర్ తదితరులు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: చరిత్ర చూడని జలప్రళయం దివిసీమ ఉప్పెన అని వైఎమ్‌సీ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌బీర్ అన్నారు. అబ్దుల్‌బాబా సేవాసమాజం ఆధ్వర్యంలో బుధవారం దివిసీమ ఉప్పెన మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ బీర్ మాట్లాడుతూ ఉప్పెనలో వేల మంది మరణించారని, లక్షల మూగజీవాలు చనిపోయాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవడంతో దివిసీమ కోలుకుందన్నారు. డాక్టర్ నాగలింగం నాగేశ్వరరావు ఉప్పెన గురించి వివరించారు. కార్యక్రమంలో సమాజ సభ్యులు సయ్యద్ బాజి, అమన్, కుమార్, షేరాలి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 100 రోజుల ప్రణాళిక

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పది విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 100 రోజుల ప్రణాళికను అమలు చేయాలని ఎంఈవో-2 వైవీ హరనాథ్ తెలిపారు. నూరు శాతం ఫలితాల సాధనే ధ్యేయంగా కార్యాచరణ ఉండాలని సూచించారు. సాయంత్రం 4గంటల నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్ కచ్చితంగా జరగాలని తెలిపారు.

పంటలకు సులభతర మార్కెటింగ్

మంత్రి నాదెండ్ల మనోహర్

పెడన, గూడూరు, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సులభతరం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ధాన్యం సేకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు బుధవారం గూడూరు, పెడనలో పర్యటించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించిన మంత్రి ధాన్యం విక్రయాల్లో ఎదురవుతోన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జాయింట్ కలెక్టర్ నవీన్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై గూడూరులో రైతులతో మంత్రి మాట్లాడారు. మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో పెడన బైపాస్‌కు చేరుకున్నారు. ధాన్యం సేకరణ, ఆ తర్వాత చెల్లింపులపై రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం సరఫరా చేస్తే మధ్యాహ్నానికి ఖాతాకు నగదు జమైందని బల్లిపర్రుకు చెందిన రైతు ఫణి మంత్రికి తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో ధాన్యం విక్రయించిన రైతులకు ఆర్నెళ్లకు కూడా చెల్లింపులు జరగలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో 16వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, రైతుల ఖాతాలకు ఇప్పటివరకు రూ.560 కోట్లు జమ చేశామన్నారు.

పెడన బైపాస్‌లో రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల.పక్కన ఎమ్మెల్యే, జేసీ తదితరులు

సమస్యలుంటే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయండి

సుల్తానగరం (మచిలీపట్నంరూరల్): మిల్లర్లతో సమస్యలు ఉన్నాయా? తేమ శాతం విషయంలో ఇబ్బందులు పెడుతున్నారా? అంటూ మంత్రి మనోహర్ రైతులను ప్రశ్నించారు. సుల్తానగరంలోని రైస్‌మిల్ వద్ద బుధవారం రైతులతో మాట్లాడారు. ధాన్యం కాటా విషయంలో తేడా ఉన్నా, తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెడుతున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉదయపు నడకకు.. మార్గమేది?

తరచూ రోడ్డు ప్రమాదాలు ★భయాందోళనల్లో వాకర్లు

న్యూస్‌టుడే, పెడన

పెడనలో ఉదయపు నడకకు చోటులేక వాకర్లు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు అందుబాటులో లేక ఉదయపు నడకకు రహదారులను ఎంచుకుంటున్నారు. గత కొంతకాలంగా రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలు మార్నింగ్ వాకర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

★ పెడనను మున్సిపాలిటీగా 1985లో ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. గత నాలుగు దశాబ్దాలుగా ఈ పట్టణం చెప్పుకోదగ్గ ప్రగతిని సాధించలేదు. ప్రధానంగా మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కొంత మంది స్థితిమంతులు నగరాలకు వలస వెళ్లిపోతున్నారు. ఇరుకు రోడ్లు, అధ్వాన డ్రెయిన్లు పెడన పట్టణంలో దీర్ఘకాలంగా ప్రధాన సమస్యలుగా మారాయి. ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెరుగుతున్న పరిస్థితుల్లో మార్నింగ్ వాకర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉదయం 4.30గంటల నుంచే రహదార్లపై వాకర్లు కన్పిస్తుంటారు. కొంతమంది 216 జాతీయ రహదారిపై మరికొంత మంది పెడన-లక్ష్మీపురం రహదారిపై వాకింగ్ చేస్తుంటారు. కొత్తపేట, బ్రహ్మపురం ప్రాంతాల వాసులు రైల్వే ప్లాట్‌ఫాంపైకి వెళ్తుంటారు.

గత ఉదంతాల నుంచి పాఠం నేర్వరా?

★ తాజాగా 216 రహదారిపై విశ్రాంత ఉద్యోగి మట్టా బాబూరావును ఉదయం 6.30 గంటల ప్రాంతంలో లారీ ఢీకొట్టగా దుర్మరణం చెందారు. అంతకముందు గుడివాడ రోడ్డులో వాకర్లపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లగా వ్యాపారి రామకృష్ణ దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ★ 216 రహదారిపై గతంలో ఒక టీచర్ సాయంత్రం వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆ తర్వాత ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటికే పరిమితమవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ★ పట్టణంలో వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చర్యలు చేపట్టాలని పురప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పబ్లిక్ ప్రకటన

నా క్లయింట్స్ అయిన మీసాల సూరిబాబు గారి కుమారుడు మీసాల సాయి, వీరి భార్య మీసాల వాణి, నివాసం: బలరామునిపేట, మచిలీపట్టణం వారి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా... నా క్లయింట్స్ ఇరువురు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని, ఆస్తి యజమానులైన చలమలశెట్టి యోగానంద్ మరియు కొండవీటి తులసీ భవాని వారి వద్ద నుండి కొనుగోలు చేయదలచినారు. అందుకుగాను నా క్లయింట్స్ ఇరువురు షెడ్యూలు భూమి ఆసామి వద్ద నుండి ఈ నోటీసు ప్రకటన 10 రోజుల తరువాత ఎగ్రిమెంట్ చేయించుకొనదలచినారు. సదరు షెడ్యూలు ఆస్తి విషయమై ఇతరులు ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్నట్లయితే ఈ దిగువ అడ్రస్సుకు వారం రోజులలో లిఖిత పూర్వకముగా తెలియపరచగలవారు. అట్లు కాని యెడల షెడ్యూలు భూమి నిర్వివాదమైన భూమిగా పరిగణించుకొని నా క్లయింటు షెడ్యూలు ఆస్తి ఆసాముల నుండి మొదటి ఎగ్రిమెంటు తదుపరి రిజిస్ట్రేషను చేయించుకొనగలరు. తదుపరి వచ్చే లిటిగేషన్లు నా క్లయింట్ల హక్కులను బంధించవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు:- బందరు సబ్‌రిజిస్ట్రారు వారి ఇలాకా, మచిలీపట్టణం, ఈడేపల్లిలోని బైపాస్‌రోడ్డుకి సమీపాన గల రెవిన్యూ వార్డు నెం.4, R.S.No. 173రు సమీప డోర్ నెం. 14/176కు చెందిన 1,227.22 చ॥గ॥ల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు (షెడ్యూలు ఆసాములు షెడ్యూలు ఆస్తిని Doc.No. 4966/20, 5819/2007 మరియు 5820 ద్వారా పొందియున్నారు). **తూర్పు:** బైపాస్ రోడ్డు, **దక్షిణం:** కొండవీటి తులసీ భవాని మరియు ఇతరులు, **పడమర:** కొండవీటి తులసీ భవాని మరియు చలమలశెట్టి యోగానంద్, **ఉత్తరం:** 30 అడుగుల జాయింటు దారి.

ఇట్లు : **పేర్ని సురేష్ బాబు,** న్యాయవాది
D.No: 14-119/2B, ఈడేపల్లి
మచిలీపట్టణం. సెల్: 93464 22969
మచిలీపట్టణం, ది. 20-11-2025

కథలు సమీక్షించి.. గజల్స్‌తో అలరించి..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 'ప్రాచీన, ప్రస్తుత తరాల రచయిత్రుల రచనలు...పరిశీలన' అనే అంశంపై మహిళా రచయిత్రులతో సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడిపూడి రాధికారాణి అధ్యక్షత వహించగా కొమ్మరాజు కనకదుర్గామహాలక్ష్మి, జంపాని చంద్రిక, సింగరాజు కల్యాణిలు వక్తలుగా పాల్గొన్నారు. కొమ్మరాజు కనకదుర్గామహాలక్ష్మి మొల్ల రామాయణం విశిష్టతపై అనేక పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. జంపాని చంద్రిక భానుమతీరామకృష్ణ అత్తగారి కథలను సమీక్షించి అందరి మన్ననలు అందుకున్నారు. ప్రముఖ గాయని సింగరాజు కల్యాణి గడ్డం శ్యామల గజల్స్‌ను విశ్లేషించడంతో పాటు కొన్ని ఆలపించి అలరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సభ ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి అప్పినేడి పోతురాజు తెలిపారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సంస్థ ప్రతినిధులు పైడిపాటి రామ్‌దేవ్, మడమల రాంబాబు, విశ్రాంత ఎంపీడీవో కంచనపల్లి కృష్ణమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు, అతిథులు

ప్రగతి కేంద్రాలు.. పరిశుభ్ర గ్రామాలు

పెడన, న్యూస్‌టుడే: పరిశుభ్రతతో గ్రామీణ ప్రాంతాలు విరాజిల్లుతాయని జిల్లా పంచాయత్ రిసోర్స్ సెంటర్ అధికారిణి అన్నపూర్ణాదేవి అన్నారు. పంచాయతీల్లో తడి పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద సృష్టి తదితర అంశాలపై విజయవాడలోని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం సర్పంచులు, ఉప సర్పంచులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేలా ప్రజల్ని చైతన్య పర్చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తున్న పంచాయతీలు ప్రగతిలో ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించి ఆదాయ వనరుల్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి రిసోర్స్‌పర్సన్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ..

పరిష్కార మార్గం.. ప్రగతికి మూలం

విద్యార్థులతో మాస్టర్ ట్రైనర్ గిరీషా జైన్

భాస్కరపురం (మచిలీపట్నం): సమస్య తలెత్తినపుడు పరిష్కార మార్గాన్ని అన్వేషించడంతోనే అభివృద్ధికి బాటలు పడతాయని మాస్టర్ ట్రైనర్ గిరీషా జైన్ అన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎమోషనల్ ఎసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్ కార్యక్రమంలో గిరీషా జైన్ పలు మానసిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. ఆత్మహత్యలతో పరిష్కారం లభించదని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎస్.రత్నమంజుల, డా.డి.ఆశాలత, ప్రొఫెసర్ డా. సీహెచ్.నిరంజన్ కుమార్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

వృత్తి, వ్యక్తిగత జీవన సమతుల్యతకు ప్రాధాన్యం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: వృత్తి, వ్యక్తిగత జీవన సమతుల్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి యుగంధర్ అన్నారు. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా బుధవారం మచిలీపట్నంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగులకు వివిధ అంశాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పురుషులు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహనతో ఉంటూ సామాజిక బాధ్యతలు నిర్వహించాలన్నారు. చేసే పనిని భారంగా భావించినప్పుడు ఒత్తిడికి గురవుతుంటారని, అదే ఇష్టంతో బాధ్యతగా భావించి చేయడం ద్వారా ఒత్తిడి సమస్యను అధిగమించవచ్చన్నారు. వ్యాయామం, యోగా, ధ్యానం లాంటివాటిని దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేయాలన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

సదస్సులో పాల్గొన్న వారితో డీఎంహెచ్‌వో యుగంధర్

దర్గాను దర్శించుకున్న మర్రి శశిధర్‌రెడ్డి

కరఅగ్రహారం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: మచిలీపట్నం మండలంలోని కరఅగ్రహారం ఫరీద్‌బాబా దర్గాను మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. బాబాకు పూజలు చేశారు. దర్గా కమిటీ పెద్దలు శశిధరరెడ్డికి స్వాగతం పలికారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బజారు బ్రాంచ్ (01596), మచిలీపట్నం, కృష్ణాజిల్లా

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంకు నుండి వాహనములు కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యమును పొందియున్నారు. బ్యాంకుకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమంగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనం చేసుకొని "**యధాతథ స్థితి**" లో వేలం ద్వారా దిగువ తెలిపిన తేదీన అమ్ముటకు నిర్ణయించినారు. వాహనముల లోన్ తాలూకు అసలు బకాయిసొమ్ము, వడ్డీ మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనుటకై ఇ-వేలమును ఆహ్వానించడమైనది.

వ. నెం.	ఋణగ్రహీత పేరు & ఖాతా నెం.	వాహన వివరములు, రిజిస్ట్రేషన్ నెం., మోడల్	రిజర్వు ధర & ఇఎండి	వేలం సమయం	వాహన వివరములకు సం॥
1.	శ్రీ నూలు రాంబాబు, తండ్రి : వెంకటేశ్వరరావు A/c No: 37351693740	MARUTHI DIZIRE BSIV / AP16DN4246/2018/ DIESEL/ Engine No. D13A3183787	Rs.3,30,000/- & Rs. 33,000/-	11.00 AM To 1.00 PM	9959831538, 9290166166 (మురాల ఏజెన్సీస్)

ఇ-వేలం తేది మరియు సమయం : 27-11-2025, ఉ॥11.00 గం॥ల నుండి మ॥ 1.00 గం॥ వరకు
బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.5,000/- లతో గుణింపు ఆన్‌లైన్‌లో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. **2)** విజయవంతమైన పాటదారుడు బిడ్ మొత్తం మీద 15% మొత్తము వెంటనే చెల్లించవలెను, మిగిలిన సొమ్మును 7 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా ఇప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. **3)** వేలం వాయిదా వేయుటకు రద్దుచేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. **4)** వాహనం రిజిస్ట్రేషన్ బాధ్యత విజయవంతమైన బిడ్డర్‌ది మాత్రమే మరియు రిజిస్ట్రేషన్ పేరు మారిన తరువాత మాత్రమే వాహనం ఇవ్వబడును. **5)** వాహనం పార్కింగ్ యార్డు యొక్క అద్దె విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను. **6)** ఇతర వివరములకు అధీకృత అధికారి, **SBI,** బజారు బ్రాంచ్, మచిలీపట్నం, సెల్ : **9908524840** నందు మరియు ఇ-వేలం కొరకు **https://baanknet.com** నందు సందర్శించగలరు.
గమనిక : వాహనం యొక్క రిజిస్ట్రేషన్ పేరు మార్పునకు మరియు వాహనం యొక్క రిజిస్ట్రేషన్ ఛార్జీలు విజయవంతమైన బిడ్డర్ చెల్లించవలెను. బ్యాంక్ వారికి ఎటువంటి సంబంధం లేదు. "షరతులు మరియు నిబంధనలు వర్తిస్తాయి.

తేది : 19-11-2025, ప్రదేశం : మచిలీపట్నం సం/- అధీకృత అధికారి, SBI, బజారు బ్రాంచ్, మచిలీపట్నం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పురాణాల గురించి భావితరాలకు వివరించాలి

భాస్కరపురం (మచిలీపట్నం): పురాణ, ఇతిహాసాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందని రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు రామాయణం, మహాభారతం, భాగవతంపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జవహర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు బుధవారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎ.ఆర్.కె.మూర్తి మాట్లాడుతూ.. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం, జె.ఎస్.ఆర్.శర్మ, మారుతీ దివాకర్, వేమూరి నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఫణికుమార్, బ్రాహ్మణ ప్రతినిధులు

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు దోహదం

పెనమలూరు, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన కింద పెనమలూరు నియోజకవర్గంలోని 15080 మందికి మంజూరైన రూ.5.42 కోట్ల చెక్కును.. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం పోరంకిలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మంచినేని పరమేష్, అన్నె చిట్టియ్య, కొండా ప్రవీణ్, సంగెపు రంగారావు, అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యనభ్యసించాలి

ఉంగుటూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసిస్తే వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన బుధవారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ పాఠశాల సమయం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. డీవైఈవో రవికుమార్, ఎంఈవో సాంబశివరావు, ప్రధానోపాధ్యాయిని అనిత తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

★ పెదపులిపాక పుష్కర ఘాట్‌లో భారీగా ఇసుక మేటలు పేరుకుపోయాయని, కార్తిక దీపాలు వెలిగించడానికి ఇబ్బందిగా ఉందంటూ పలువురు భక్తులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. గ్రామ కార్యదర్శి వెంకటరావు స్పందించి.. పంచాయతీ సిబ్బందితో ఇసుక మేటలు తొలగించారు. ★ పెదపులిపాక ఎస్సీ ఆర్ఆర్‌నగర్‌లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి వెంకటరత్నం స్పందించి.. అదే రోజు కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు. ★ పెనమలూరు పల్లెపేట, అన్నేబాబురావు కాలనీ, జడ్పీ హైస్కూల్ ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి అహ్మద్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, పెనమలూరు.

★ గన్నవరం రాయ్‌నగర్ పరిసరాల్లో డ్రైనుల్లో వ్యర్థాలు భారీగా పేరుకున్నాయని స్థానికులు ఈవో చెన్నకేశవ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయప స్పందించారు. కాలువల్లో పూడికను తొలగించి మురుగు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ★ గన్నవరం మండలం కేసరపల్లి పంచాయతీ శివారులో వీధిదీపాలు వెలగడం లేదని ఈవో ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.
- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

రైతుకు సాయం.. సాగుకు ఊతం

'అన్నదాత సుఖీభవ'లో 25 వేల కుటుంబాలకు లబ్ధి

వీరవల్లి: సీఎం చంద్రబాబు ప్రసంగం వింటున్న రైతులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రైతన్నకు అండగా నిలుస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం, 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ఉదారంగా ఆదుకుంటోంది. ఏటా ఒక్కో రైతు కుటుంబానికి రూ.20 వేలు చొప్పున(పీఎం కిసాన్‌తో కలిపి) సాయమందించేలా కార్యాచరణ చేపట్టింది. ఈ ఏడాది ఆగస్టులో తొలి విడత రూ.7 వేలు సాయమందించగా.. రెండో విడతగా బుధవారం మరో రూ.7 వేలు జమ చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గన్నవరం నియోజకవర్గంలో...

మండలం	లబ్ధిదారులు	జమ కానున్న మొత్తం (రూ.కోట్లలో)
గన్నవరం	7,770	3.89
బాపులపాడు	9,229	4.61
ఉంగుటూరు	5,952	2.98
విజయవాడ గ్రామీణం	1,970	0.98
మొత్తం	24,921	12.46

పీఎం కిసాన్ ద్వారా నాలుగు మండలాల్లో 18,009 మంది రైతులకు రూ.2 వేలు చొప్పున రూ.3.60 కోట్లు జమ కానున్నాయి.

అండగా నిలిచారు - అవిర్నేని భవానీశంకర్, వేలేరు

డెల్టా, మెట్ట పంటల సాగుకు నిలయమైన నియోజకవర్గంలో గత కొన్నేళ్ల నుంచి వ్యవసాయానికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, రకరకాల తెగుళ్ల కారణంగా ప్రధానమైన వరితో సహా అనేక పంటలకు నష్టం వాటిల్లుతూనే వచ్చింది. కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీల్లో భాగంగా ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్‌తో కలిపి రూ.20 వేలు చొప్పున సాయమందిస్తూ అండగా నిలిచింది.

సాగుదారులకు వరం - మాదల శ్రీనివాసరావు, తిప్పనగుంట

చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం రెండో విడతగా రూ.7 వేలు నగదును అర్హులైన రైతుల ఖాతాల్లో వేయడం సాగుదారులకు వరంగా మారింది. సాగుకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరేలా పెట్టుబడి సాయంగా ఈ మొత్తాన్ని అందజేస్తుండడంతో ఎక్కడ చూసినా ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

కష్టాల్లో చేయూత - అట్లూరి సత్యంబాబు, వైకుంఠలక్ష్మీపురం

గత కొన్నేళ్లుగా వ్యవసాయం ఏమాత్రం లాభసాటిగా లేదు. సాగులో అనేక కష్ట, నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.20 వేలు సాయం చేసేలా ముందుకు వచ్చి మూడు నెలల వ్యవధిలోనే రెండు విడతలుగా రూ.14 వేలు సాయంగా అందజేయడం సంతోషంగా ఉంది.

ఉపన్యసించి.. ఉత్సాహం నింపి!

యనమలకుదురు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు

పోరంకిలో ప్రిన్సిపల్ మాధవి నుంచి బహుమతులు అందుకుంటున్న విజేతలు

పెనమలూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా యనమలకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉపన్యాస పోటీలో 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై పోటీ నిర్వహించారు. ఇందులో వి.అఖిల్ (ప్రథమ), టి.హేమవసంత లక్ష్మి(ద్వితీయ), ఎస్.తేజశ్రీ(తృతీయ) స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కర్లి శిరీష, ఉపాధ్యాయులు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు.

పెనమలూరు, న్యూస్‌టుడే: పోరంకి చిగురుపాటి శ్రీవిఘ్నవేణి టాలెంట్ స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై బుధవారం నిర్వహించిన ఉపన్యాస పోటీలో 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవ్ శ్రీవాత్సవ్, ఎం.మేఘన, సీహెచ్ ఇందిరాప్రియదర్శిని వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విరికి ప్రిన్సిపల్ కె.మాధవి బహుమతులు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షణ

ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్.. ఎమ్మెల్యే బోడే, కలెక్టర్ డీకే బాలాజీ

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెలాఖరుకు లక్ష మెట్రిక్ టన్నులు, వచ్చే నెలకు 7.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యం అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గండిగుంట రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి బుధవారం మంత్రి సందర్శించారు. ధాన్యాన్ని పరిశీలించి, కొనుగోలు సమయంలో ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. యంత్రాలు దొరకవని కోతకు రాని పంటను కోసి ఇబందులు పడొద్దని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. మార్కెటింగ్, పౌరసరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

'తూకాల్లో వ్యత్యాసాలు నివారించాలి'

గండిగుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు బుధవారం వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల(ఈపోస్ ఆపరేటర్ల) సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో డీలర్లు కలిసి వివిధ సమస్యలను తెలియజేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం తూకాల్లో భారీగా వ్యత్యాసాలు ఉంటున్నాయని, ఈ కారణంగా నష్టం వచ్చి.. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కోశాధికారి బి.నవీన్‌కుమార్, కార్యదర్శి ఎం.ఏసుబాబు, పట్టణ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కె.ధనుంజయ పాల్గొన్నారు.

ఇందిరమ్మకు నివాళి

తెన్నేరులో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మహిళలు

వీరవల్లిలో నివాళులర్పిస్తున్న స్వర్ణలత, విద్యార్థులు

ఉయ్యూరులో కృష్ణకుమారిని సత్కరిస్తున్న కౌన్సిలర్ వెంకటలక్ష్మి

కంకిపాడు: వారోత్సవాల్లో భాగంగా బుధవారం తెన్నేరు, కంకిపాడు శాఖా గ్రంథాలయాల్లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. వ్యాసరచన తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉయ్యూరు, గ్రామీణం: ఉయ్యూరు గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి, రంగవల్లుల పోటీలు బుధవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆయుర్వేద వైద్యురాలు, చేయూత ఫౌండేషన్ ఛైర్మన్ పి.కృష్ణకుమారి హాజరయ్యారు. కౌన్సిలర్ కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఏజీఎస్‌జీఎస్ కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. * పెద ఓగిరాలలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. సర్పంచి టి.లక్ష్మీ హాజరయ్యారు. ముదునూరు గ్రంథాలయంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గన్నవరం గ్రామీణం: పుస్తక పఠనం చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని గన్నవరం ప్రథమ శ్రేణి గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు సీతారామారావు అన్నారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని గ్రంథాలయాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు, కానుమోలు, వీరవల్లి గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఇందిరాగాంధీ, ఝాన్సీబాయి చిత్రపటాలకు నివాళులర్పించారు.

తానా సేవలు అభినందనీయం

కర్షకులకు రూ.24 లక్షల ఉపకరణాల పంపిణీ

ఉపకరణాలు అందిస్తున్న మంత్రి సుభాష్, విప్ యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డీకే బాలాజీ, తదితరులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన రైతులకు సుమారు రూ.24 లక్షల విలువైన ఉపకరణాలు బుధవారం పంపిణీ చేశారు. తానా కార్యదర్శి రాజా కసుకుర్తి తన స్వగ్రామంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని సమకూర్చారు. 100 మంది రైతులకు అధునాతన పవర్ స్ప్రేయర్లు, వాటికి అనుబంధంగా గొడుగు, టార్చిలైట్, మాస్కు, కళ్లజోడు, ఏప్రాన్లతో కూడిన రక్షణ కిట్లు, 800 మందికి టార్పాలిన్లను మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా అందజేశారు. వీటితో పాటు 20 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం, 100 మంది వృద్ధులకు రగ్గులు, స్వయం ఉపాధి నిమిత్తం ఒకరికి క్షౌరశాల, రైల్వేగేటు సమీపంలో నివసిస్తున్న వారికి మంచినీటి సదుపాయం కల్పిస్తూ రూ.లక్ష వ్యయంతో బోరు ఏర్పాటు చేశారు. యార్లగడ్డ వెంకట్రావు వీటిని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తానా సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా మంత్రి, విప్‌లు కొనియాడారు. రైతు నాయకుడు కలపాల శ్రీధర్ (రాజాబాబు) తానా తరపున కార్యక్రమాలను సమన్వయం చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో జోగేశ్వరరావు సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా థీమ్-5 పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. దీనిపై బుధవారం మండలంలోని 27 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు ఇస్తున్న పంట పెట్టుబడి సాయం ఎవరికి ఇస్తున్నారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గమనిస్తున్నాయా అని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం కంకిపాడు మండే పూడి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు 'అన్నదాత సుఖీభవ' పథకంలో రూ.20వేలు ఇస్తామని వాగ్దానం చేసిందని, అయితే ఆ సొమ్మును పొలం ఉన్న వారికి మాత్రమే ఇస్తున్నారని.. సాగుచేస్తున్న వారికి ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం ఎక్కువ శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వారికి పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కమిటీ సభ్యుడు తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: యువతకు ఉద్యోగాల కల్పించడం ద్వారానే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో జరిగిన వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. స్థానిక పారిశ్రామికవాడలో కొత్తగా 47 ఎకరాలను విలీనం చేసి 83 పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మల్లవల్లిలో 170 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. మిగిలిన వారికి త్వరలో రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. కంపెనీలు రావడంతో యువతకు పెద్దఎత్తున ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. నాయకులు జి.తులసీమోహన్, గన్నవరం ఉపసర్పంచి పాలడుగు నాని తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME AND DATE OF BIRTH

I, LAKSHMI Mother of Army No. 15330500X Rank Hav Name: SAYIRAM SIVAPU, presently residing at D.No. 2-115/4, Takuthota, 2nd Street, Near Panchayat Office, Ambapuram, Vijayawada Rual, NTR District, Andhra Pradesh, Pin: 520012, India., have changed my name and Date of birth from the existing LAKSHMI & 01 July 1964 to SIVAPU LAKSHMI & DOB is 02 December 1967 Vide affidavit dated: 19/11/2025 executed in presence of Notary Public, Vijayawada.

20, 21 తేదీల్లో ఇన్నోవేషన్, డిజైన్లపై కార్యశాల

కానూరు, న్యూస్‌టుడే: సిద్ధార్థ అకాడమీలో ఇన్నోవేషన్ సెల్, వాధ్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఇన్నోవేషన్, డిజైన్లపై కార్యశాల నిర్వహించనున్నట్లు అకాడమీ సభ్యులు తెలిపారు. సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరై.. విద్యా రంగంలో సృజనాత్మకత, వ్యాపార ఆలోచనలు గురించి వివరిస్తారన్నారు.

నేడు మెగా పశువైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు పశువైద్యశాలలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏడీఏ ప్రమీలారాణి తెలిపారు. పశుసంవర్ధక శాఖ, స్రవంతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారన్నారు. పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సూచించారు.

అవమానంతో యువకుడి ఆత్మహత్య

పాయకాపురం, న్యూస్‌టుడే : కొందరు తనను అకారణంగా కొట్టారనే అవమానంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం నున్న పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... నున్న గ్రామానికి చెందిన బి.దానియేలు తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు సన్ని(21) ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తుంటారు. ఈ నెల 16వ తేదీ, ఆదివారం రాత్రి స్థానిక సీఎస్ఐ చర్చి వద్ద కొందరు అకారణంగా అతనితో గొడవపడి కొట్టారు. ఇది తెలుసుకున్న కుటుంబ సభ్యులు.. ఘటనా స్థలానికి వెళ్లి పెద్దలతో మాట్లాడతామని చెప్పి, సన్నీని ఇంటికి తీసుకొచ్చారు. మనస్తాపం చెందిన అతడు.. గత మూడు రోజులుగా అవమానంగా బాధపడుతున్నాడు. బుధవారం తల్లిదండ్రులు, సోదరుడు పనులకు వెళ్లగా.. అతడు ఒక్కడే ఇంటో ఉన్నాడు. తర్వాత తండ్రి ఫోన్ చేస్తే తీయలేదు. అనుమానంతో ఇంటికి రాగా.... సన్ని ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించడంతో నిశ్చేష్టులయ్యారు. వెంటనే ప్రజావైద్యశాలకు తీసుకువెళ్లగా.. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీనిపై దానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబంలో వచ్చిన మనస్పర్థల కారణంగా ఇంటినుంచి బయటకు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కంకిపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తెన్నేరు గ్రామానికి చెందిన కొండవీటి గోపీకృష్ణ అనే వ్యక్తి టైల్స్ పనిచేస్తూ జీవిస్తుంటాడు. ఈ నెల 17న ఇంట్లో జరిగిన గొడవతో మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి కోసం కుటుంబ సభ్యులు స్థానికంగా, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై గోపీకృష్ణ సోదరుడు మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇరుకు వంతెనపై ఇక్కట్ల ప్రయాణం!

రామవరప్పాడు, న్యూస్‌టుడే: మూడు వేల జనాభా కలిగిన రామవరప్పాడులోని నెహ్రూనగర్ నివాసితులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డు గతుకులమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి ట్యాంకు ఉన్నప్పటికీ ఉదయం, సాయంత్రం వేళల్లోనే నీరు వదులుతున్నారు. బోర్లు మూలన పడటంతో మిగిలిన సమయాల్లో నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి. నెహ్రూనగర్‌కి ఓ వైపు బుడమేరు, మరో వైపు ఏలూరు కాలువలు ఉండటంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. శివారు ప్రాంతం కావడంతో ఆకతాయిలు ఆగడాలు ఎక్కువగానే ఉంటున్నాయి. పోలీసులు నిఘా పెంచి అడ్డుకట్ట వేయాల్సి ఉంది. నెహ్రూనగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 10వేల మంది ప్రజలు నివసిస్తుంటారు. వీరు జాతీయ రహదారిపైకి రావాలంటే చిన్నవంతెనే ఆధారం. అది మూడు అడుగుల వెడల్పు ఉండటంతో ద్విచక్ర వాహనం మాత్రమే వెళుతుంది. ఆటోలు, కార్లు రావాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లి ప్రసాదంపాడు వద్ద వంతెనపై నుంచి పటేల్‌నగర్ మీదుగా రావాలి. దీనికి అదనంగా మూడు నుంచి నాలుగు కి.మీ తిరిగి రావాలి. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు సైతం ఇదే మార్గంలో రావాల్సి ఉంటుంది. నెహ్రూనగర్ వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కూరగాయల కోసం కిలోమీటర్లు వెళ్లాల్సిందేనా..?

రైతు బజార్‌కు కేటాయించిన జలవనరుల శాఖ స్థలం

నున్న, న్యూస్‌టుడే: విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామం నగరానికి అత్యంత సమీపంలో ఉంది. ఇక్కడ మొత్తం 14 వార్డులు ఉన్నాయి. నున్నను ఆనుకుని పాతపాడు, పి.నైనవరం, అప్పారావుపేట, అంబాపురం గ్రామాలున్నాయి. మొత్తం అయిదు గ్రామాల్లో కలిపి సుమారు 50వేల మంది జనాభా ఉన్నారు. వారంతా కూరగాయల కోసం సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం.. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు నున్న ప్రధాన రహదారిలోని జలవనరుల శాఖ స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఆ ప్రక్రియ 2018 వరకు కొనసాగింది. ఆ తరువాత 2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. ఇప్పటికే ఆ కల నెరవేరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే సుమారు 40 వరకు దుకాణాలు ఏర్పాటు చేయవచ్చు. తద్వారా 200 మంది వరకు ఉపాధి దొరుకుతుంది. ఈ విషయమై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని అయిదు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యాభ్యాసంలో ప్రణాళిక ముఖ్యం

విద్యార్థులకు సూచనలిస్తున్న ఇంద్రాణి బాధురి

పెనమలూరు: విద్యాభ్యాసంలో ప్రణాళిక ముఖ్యమని ఎన్‌సీఈఆర్‌టీ అధికారి ఇంద్రాణిబాధురి పేర్కొన్నారు. పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు రెండ్రోజుల పాటు నిర్వహించే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రాణి బాధురి మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఇంటర్, పాలిటెక్నిక్ కోర్సులే కాకుండా జాతీయస్థాయిలో అందుబాటులో ఉన్న ఇతర కోర్సులను గురించి వివరించారు. లక్ష్యం ఏర్పాటు చేసుకొని, కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీవైఈవో పద్మారాణి, విద్యాశాఖాధికారులు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, ఇస్మాయిల్, రంగయ్య, హసీనా, ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి విముక్తి

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బొమ్ములూరు గ్రామ పంచాయతీ పరిధిలో వీధి శునకాల బెడద నుంచి స్థానికులకు ఎట్టకేలకు విముక్తి లభించింది. తరచూ ప్రజలపై కుక్కలు దాడులు చేస్తుండడంతో పలువురు పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన బుధవారం ప్రత్యేక బృందాన్ని నియమించి గ్రామంలో సంచరిస్తున్న శునకాలను పట్టించి దూర ప్రాంతాలకు తరలింపజేశారు.

ఎంపీటీసీ సభ్యుల అలక.. సమస్యలు తీరక!

కంకిపాడు, ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే

మండల పరిషత్తు ప్రాదేశిక సభ్యుల గైర్హాజరుతో మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాల లక్ష్యం నీరుగారిపోతోంది. గత 20 నెలలుగా గౌరవ వేతనం అందకపోవడం, ప్రభుత్వ శాఖల ప్రతినిధుల గైర్హాజరు, ప్రస్తావించిన అంశాలపై స్పందన లేకపోవడం, తమ ప్రాదేశికంలో చేపట్టిన పనులు, నిధుల కేటాయింపుపై సమాచారం లేమి.. ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 30 మంది ఎంపీటీసీ సభ్యుల్లో సమావేశాలకు హాజరయ్యే వారు 12కి మించడం లేదు. అలాగే 22 ప్రభుత్వ శాఖలకు గాను రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్యుత్తు, ప్రజారోగ్యం, పశుసంవర్ధక శాఖల ప్రాతినిధ్యమే మాత్రమే కనిపిస్తోంది.

జిల్లా అధికారుల స్పందన నామమాత్రం

ప్రతి సమావేశంలో చర్చించిన అంశాలు, తీర్మానాలను జిల్లా అధికారులకు పంపుతుంటారు. అయితే వాటిపై సమీక్ష, తదుపరి చర్యలు లేకపోవడంతో సభ్యుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక బిస్కెట్లు, టీలకు పరిమితమవుతాయన్నాయని సభ్యులు సమావేశాల్లోనే వాపోయిన సందర్భాలున్నాయి.

నివేదికలకే 75 శాతం సమయం

ముందుగా ఆయా శాఖల నివేదికలను చదవడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి గంటన్నర సమయం పడుతోంది. అప్పటికే కొందరు సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. సమస్యల ప్రస్తావన, చర్చ, ప్రణాళిక రూపకల్పన తూతూ మంత్రంగా సాగుతోంది. కీలకమైన 10 శాఖల ప్రతినిధులు గత మూడు నాలుగు సమావేశాలుగా గైర్హాజరవుతున్నారు. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని సభ్యులు చెబుతున్నారు.

కంఠ శోష తప్ప ఫలితం శూన్యం

సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై స్పందించే వారే కరవయ్యారు. కొత్త కార్యవర్గం ఏర్పడిన ఒకటి రెండేళ్లు స్ఫూర్తిదాయకంగా జరిగాయి. ప్రస్తుతం హాజరయ్యే ఐదారుగురి కంఠశోష తప్ప ఫలితం శూన్యం. అధికారులు గైర్హాజరును అరికట్టాలి. **-ధూళిపూడి కృష్ణకిశోర్, మండల ఉపాధ్యక్షుడు, కంకిపాడు**

22న సర్వసభ్య సమావేశం

కంకిపాడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ రాజ్యలక్ష్మి అధ్యక్షతను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనూష ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

మెయిన్ బ్రాంచి, నూజివీడు, ఏలూరు జిల్లా.

స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం బహిరంగ ప్రకటన తేది 24-12-2025

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ మరియు దానిక్రింద చేయబడిన రూల్స్ మేరకు భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే చూపట్టబడిన దిగువ తెలిపిన వివరముల ప్రకారం సెక్షన్ 13(4) నిబంధనల ప్రకారం ఆస్తి యొక్క స్వాధీనతకు కొనసాగింపుగా దిగువ షెడ్యూల్‌లో తెలిపిన ఆస్తిని దిగువ నిర్దేశించబడిన 13(2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నియమ నిబంధనలకు లోబడి "ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతి పదికన దిగువ తెలిపిన వివరముల ప్రకారం ఇ-వేలం వెబ్ పోర్టల్ https://baanknet.com ద్వారా విక్రయించబడును.

ఋణగ్రహీత(ల) పేరు: శ్రీమతి కందుకూరి సత్యవాణి భర్త: ఆస్కరరావు & శ్రీ కందుకూరి ఆస్కరరావు తండ్రి: చిన్న సుబ్బారావు

స్థిరాస్తి యజమాని పేరు: శ్రీమతి కందుకూరి సత్యవాణి భర్త: ఆస్కరరావు

బకాయి మొత్తం: రూ.44,41,235/- మరియు ది.05-06-2025 నుండి తదుపరి వడ్డీతో సహా.

డిమాండ్ నోటీసు తేది: 04-06-2025

స్థిరాస్తి వివరము: కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, తాడిగడప గ్రామం, లిప్రూ కాలని, ఆర్‌యస్ నెం.5/3ఎ, సమీప డోర్ నెం.5-56, మొత్తం గ్రౌండ్ ఫ్లోర్ లోని ప్లింత్ ఏరియా 1080 చ॥అడుగులతోపాటు మొత్తం విస్తీర్ణం 120.14 చ॥గ॥లలోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగము 60.07 చ॥గ॥లు కలిగిన ఆర్‌సిసి భవనము యొక్క రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.5703/2020, తేది:08-10-2020, పటమట జెయస్ఆర్ఓ, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా, **భవనము హద్దులు:** తూర్పు: 30 అడుగుల వెడల్పుగల పంచాయితీ రోడ్డు, దక్షిణం: దైదా రవి యొక్క ఆస్తి, పడమర: పాపోలు సుబ్బారావు మొ॥లగు వారి ఆస్తి, ఉత్తరం: పొన్నా వెంకటేశ్వరరావు మొ॥లగు వారి క్రాస్ సైట్. **గ్రౌండ్ ఫ్లోర్ హద్దులు:** తూర్పు: మెట్లు & ఉమ్మడి వరండా తరువాత 30 అడుగుల వెడల్పుగల రోడ్డు, దక్షిణం: దైదా రవి యొక్క ఆస్తి, పడమర: పాపోలు సుబ్బారావు మొ॥లగు వారి ఆస్తి, ఉత్తరం: పొన్నా వెంకటేశ్వరరావు మొ॥లగు వారి క్రాస్ సైట్.

రిజర్వు ధర: రూ.36,36,000/- ధరావత్తు: రూ. 3,63,600/- బిడ్ పెంపుదల: రూ.10,000/-

ఇ-వేలం తేదీ & సమయం: 24-12-2025 ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 4.00 గం॥ ల వరకు

NEFT/RTGS సొమ్మును సమర్పించుటకు https://baanknet.com వెబ్‌పోర్టల్ ద్వారా (యూజర్ ఐడి & పాస్‌వర్డ్ ఉచితంగా https://baanknet.com లో రిజిష్టర్ చేసుకొన్న పేరు మీద లభించును) ద్వారా పాస్‌వర్డ్ & లాగిన్ ఐడి కలిగివుండవలెను. తమ బిడ్లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలములో పాల్గొనుటకు ముందుగా మెస్సర్స్ పియస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్, టోల్ ఫ్రీ నెం: +91 8291220220 వారి వెబ్ పోర్టల్ https://baanknet.com మరియు పై లభించు ఇ-వేలపు నియమ నిబంధనల పూర్తి వివరములు పరిశీలించవలసినదిగా బిడ్డర్లను కోరుచున్నాము. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తుల తనిఖీ కొరకు ఆథరైజ్డ్ ఆఫీసర్, SBI, MINI RACPC, నూజివీడు, ఏలూరు జిల్లా, మొబైల్ నెం.9676380525, ఇ-మెయిల్ ఐడి: sbi.64515@sbi.co.in మరియు రికవరీ ఏజెన్సీ: M/s.PRS Associates, మొబైల్ నెం:7013439314 వారిని బ్యాంకు పనిదినములలో సంప్రదించవచ్చును.

ప్రదేశం : నూజివీడు
తేది : 19-11-2025

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే.. పరిపూర్ణ ఆరోగ్యం!

సేవలు అందించిన రోటరీ క్లబ్ సభ్యులు, వైద్య బృందం

గుడివాడ(సత్యనారాయణపురం): గుడివాడ పట్టణం కోతి బొమ్మ సెంటర్ ప్రభావతి గార్డెన్స్ ప్రాంగణంలో రోటరీ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో విజయవాడ ప్రముఖ క్యాన్సర్ సెంటర్ హెచ్‌సీజీ సహకారంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 125 మంది పురుషులకు ప్రొస్టేట్ గ్రంధి, మహిళలకు గర్భసంచి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, కార్యదర్శి గుళ్ళపల్లి కిరణ్‌బాబు, వైద్యులు డాక్టర్ అజయ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మేఘనతో ఉపాధ్యాయులు

నాగాయలంక, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కడప జిల్లాలోని రైల్వే కోడూరులో అండర్ 19 బేస్‌బాల్ స్టేట్ టోర్నమెంట్ జరిగింది. నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థిని సముద్రాల మేఘన అద్భుత ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అలపర్తి సత్యనారాయణ తెలిపారు.

30న ఎన్టీఆర్ మెమోరియల్ ఓపెన్ సైక్లోథాన్ పోటీలు

బ్రోచర్ విడుదల చేస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

గుడివాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఎన్టీఆర్ మెమోరియల్ ఓపెన్ సైక్లోథాన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల ప్రచార పత్రికలను ఆవిష్కరించారు. మాదకద్రవ్యాలపై యువతలో అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. పోటీల్లో 15సంవత్సరాలు దాటిన వారికి 25 కిలోమీటర్లు, 15సంవత్సరాల లోపు వారికి 10 కిలోమీటర్లు సైక్లోథాన్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు స్టేడియం కమిటీ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ హనీఫ్, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్, ఐఎంఏ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీ, నర్రా రత్నశేఖర్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు రోడ్డు పైనే...

❖ రూ.16 లక్షలతో అభివృద్ధి పనులు
❖ దళారులదే హవా అంటున్న రైతులు

చిత్తడిగా ఉన్న చోటే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

గుడివాడ, న్యూస్‌టుడే

గుడివాడ రైతు బజారు అభివృద్ధికి ప్రభుత్వం రూ.16 లక్షల నిధులను విడుదల చేసింది. చాలా కాలం నుంచి పల్లంగా ఉండటం వలన వర్షపు నీటికి నేలపై కూరలు అమ్ముకునే రైతులు ఇబ్బంది పడుతున్నారు. వారి ఆకు కూరలు, కూరగాయలు పాడవుతున్నాయి. ఈక్రమంలో పలుమార్లు పర్యటనకు వచ్చిన అధికారులకు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు రైతులు వారి సమస్యలను విన్నవించారు. ఎంతో దూరం నుంచి వచ్చే తమకు కనీసం మరుగుదొడ్డి కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో కూటమి ప్రభుత్వం రైతుల గోడు విని నిధులను విడుదల చేసింది. గతంలో పాడైన మరుగుదొడ్ల స్థానంలోనే నూతనంగా మూడింటిని నిర్మించనున్నారు. పల్లంగా ఉన్న రైతు బజారు మెరక, పైకప్పు మరమ్మతులు, కార్యాలయం అభివృద్ధి చేయనున్నారు.

✶ ముఖ్యంగా బజారుకు గుడివాడ పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 6 వేల మంది వరకూ వస్తుంటారు. సోమ, శనివారాల్లో 8 వేలకు పైగా జనాభా వచ్చి కూరలు కొనుక్కుని వెళ్తారు. గతంలో ఇబ్బందులు వచ్చినపుడు, కరోనా సమయంలో పక్కనే ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో రైతు బజారు నిర్వహించారు. ఈ నెల 20 నుంచి చేపట్టిన అభివృద్ధి పనులలో భాగంగా రైతు బజారును స్టేడియంలో 20 రోజుల పాటు ఏర్పాటు చేయడానికి అనుమతి కోరగా కమిటీ నిరాకరించింది. దీంతో నేటి నుంచి నడిరోడ్డుపై ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. బజారులో మొత్తం అద్దె దుకాణాలు 33, రైతు వారీ దుకాణాలు 60 ఉండగా.. ఒక్కో దుకాణాన్ని ఇద్దరికి కేటాయిస్తారు. బందరు, పెడన, కొర్నిపాడు వానపాముల, పెదపారుపూడి, పామర్రు తదితర ప్రాంతాల నుంచి మునగ, ఆకుకూరలు, కూరగాయలు అమ్మే రైతులు 50 మందికి పైగా వచ్చి దుకాణాల కింద భాగంలో రహదారి పక్కన కూర్చుని విక్రయాలు చేస్తారు. వీరిలో అధిక శాతం కూరలు అమ్ముకుని వెళ్లిపోతారు. ఇపుడు నడిరోడ్డుపై రైతు బజారు ఏర్పాటు చేస్తే పట్టణంలోని చాలా మంది దళారులు కూడా వచ్చి రైతుల పక్కనే వ్యాపారాలు ప్రారంభిస్తారు. వారిని కట్టడి చేయడానికి అవకాశం ఉండదని, తాము నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే రాము రైతుల గోడు విని కనీసం పక్కనే ఉన్న తుమ్మల రామబ్రహ్మం పార్కులో అయినా ఏర్పాటు చేయిస్తే దళారుల నియంత్రణ జరుగుతుందని, రైతులకు న్యాయం జరుగుతుందని చెబుతున్నారు.

కృత్రిమ మేధతో తస్మాత్ జాగ్రత్త

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ జువ్వనపూడి అనీల్ ప్రసాద్ తదితరులు

అవనిగడ్డలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుడివాడ, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ (ఏఐ) రెండంచుల వాడిగల ఖడ్గం అని, దీని వలన లాభాలు, నష్టాలు రెండూ ఉన్నాయని, జాగ్రత్తగా దీనిని వినియోగించుకోవాలని నవప్రహర్ష ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జువ్వనపూడి అనీల్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నీలామహల్ రోడ్డులోని నవప్రహర్ష ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఈనాడు ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా 'కృత్రిమ మేధ (ఏఐ) వలన భవిష్యత్‌లో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాసం పోటీలు బుధవారం నిర్వహించారు. విద్యార్థులు కె.సుభాష్ ప్రథమ, సాహితి ద్వితీయ, జె.సింధు తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ అనీల్ ప్రసాద్ బహుమతులు అందజేశారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీకి విశేష స్పందన లభించింది. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీలో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలో ఎ.శ్రుతి ప్రథమ, షేక్ రహాన సమన్ ద్వితీయ, ఎ.కీర్తి తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు మత్తి నాగ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులతో కలసి బహుమతులు ప్రదానం చేశారు.

'లంచం ఇవ్వలేదని పడగొట్టారు'

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు

గుడివాడ, న్యూస్‌టుడే: 'పైవంతెన భూసేకరణలో నష్ట పరిహారం ఇవ్వకుండానే దూకుడుగా కోర్టులో ఉన్న తన కుమారుని భవనాన్ని కూల్చేయడం దారుణం' అని మున్సిపల్ మాజీ ఛైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తన కుమారుడు సురేష్‌బాబుకు చెందిన భవనంలో కొంత మేరకు సేకరించారన్నారు. దీనికి నష్ట పరిహారం చెల్లించలేదని, అయినా నిర్మాణంలో జాప్యం జరగకూడదని తామే నెలాఖరులోగా స్వయంగా భవనం ఖాళీ చేస్తామని చెప్పినా.. లంచం ఇవ్వలేదని కొందరు అధికారులు పోలీసు వారితో కలిసి తమ భవనం పడగొట్టారన్నారు. ముందుగానే ఎమ్మెల్యే రాముకు తమ పరిస్థితి వివరించామని, అయినా వినకుండా అధికారులు రాజకీయాలు చేయడం బాధాకరం అన్నారు. సురేష్ బాబు పాల్గొన్నారు.

వరిపంట ఉత్పత్తి పరిశీలన

ధాన్యం పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి

చల్లపల్లి, న్యూస్‌టుడే: ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తల బృందం చల్లపల్లి మండల పరిధిలోని వక్కలగడ్డ, పుచ్చగడ్డ గ్రామాల్లో పర్యటించి కోతలు చేపట్టిన వరిపంట ఉత్పత్తిని బుధవారం పరిశీలించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, రైతులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'తో రూ.20.14 కోట్ల లబ్ధి


నమూనా చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే రాము

అవనిగడ్డ: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గంలో రైతులకు రూ20.14 కోట్లు లబ్ధి కలిగిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. బుధవారం స్థానిక రెవెన్యూ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు వెనువెంటనే ధాన్యం సొమ్ము అందిస్తోందన్నారు. రైతు సేవాకేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైతులకు అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు, ఏఎంసీ ఛైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, సర్పంచ్ పి.కృష్ణకుమారి, ఏడీఏ జయప్రద, ఏవో శుభహారిక పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే పరమావధిగా చంద్రన్న పాలన

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతు సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ ప్రాంగణంలో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకం లబ్ధిదారులకు రెండవ విడత నగదు పంపిణీలో భాగంగా నియోజకవర్గంలోని రైతులకు బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. గుడివాడ నియోజకవర్గంలో 11,168 వేల మంది రైతులకు రూ.7.44 కోట్ల చెక్కును కూటమి నేతలతో కలిసి రాము రైతులకు అందజేశారు. జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా పరిశీలకురాలు నూకానమ్మ యాదవ్, గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవిలు, సురేంద్ర బాబు, వాసే మురళీ, దానేటి సన్యాసి రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సేవకులు మంచి పనులతో ఆదర్శంగా నిలవాలి

మాట్లాడుతున్న కె.శ్యాంప్రసాద్

చల్లపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో సామాజిక సమరసత అవసరమని, స్వయం సేవకులు మంచి పనులు చేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలవాలని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి సందర్భంగా బుధవారం చల్లపల్లి మండలం నడకుదురు ఉసిరివనంలో వనసమారాధన, కుటుంబ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వన సమారాధనలో పాల్గొన్నారు. ప్రముఖ కాలమిస్ట్ దుగ్గరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ అంటే మతంగా చూస్తున్నారని, హిందూ అంటే జాతి అని చెప్పారు.

❖ అతి ప్రాచీన క్షేత్రమైన శ్రీపృధ్వీశ్వరస్వామిని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి దాత మండవ రవీంద్ర, సర్పంచ్ గొరిపర్తి సురేష్ సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ కోనేరు బలరాం, పామర్రు ఏఎంసీ ఛైర్మన్ దోనేపూడి శివ రామయ్య, జన్ను జగదీష్ పాల్గొన్నారు.

మోపిదేవి: రావివారిపాలెంలో పరుచూరి అంజయ్య నివాసం పల్లె వాతావరణానికి అద్దం పట్టిందని బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. బుధవారం అంజయ్య నివాసంలో తేనీటి విందు స్వీకరించారు. మండలి వెంకటరామ్, పరుచూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం

నాగాయలంక మండలంలోని ఏటి మొగలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం పునాదులకే పరిమితమైంది. భవనం పిల్లర్లపై ఉన్న ఇనుప చువ్వలు తుప్పు పట్టి విరిగిపోయే పరిస్థితులో ఉన్నాయి. మండలంలో 16 భవనాలకు కేవలం 4 భవనాలు మాత్రమే నిర్మాణానికి నోచుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. అసంపూర్తి భవనాలను పూర్తి స్థాయిలో నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. - ఏటిమొగ (నాగాయలంక), న్యూస్‌టుడే

వెల్లివిరిసిన ఆనందం

మోపిదేవి, న్యూస్‌టుడే

గత ప్రభుత్వ పాలనకు దీటుగా ప్రజలు, రైతుల కోసం అహర్నిశలు శ్రమించి పనిచేస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ అమల్లోకి రావడంతో జనం మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల లోపు బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ అవుతాయని భరోసా ఇచ్చారు. ఆమేరకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు నెలకొన్నాయి. మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల తదితర మండలాల్లో సేకరించిన ధాన్యానికి డబ్బులు జమ కావటంతో రైతుల రైతు కుటుంబాల్లో సంతోషం నెలకొంది. వారి మాటల్లోనే...


❖ నేను చల్లపల్లి నివాసిని. పెదప్రోలు రెవెన్యూ పరిధిలో పొలం ఉంది. యంత్రంతో నూర్పిడి చేసి పెదప్రోలు సొసైటీ ద్వారా మిల్లుకు ధాన్యం తోలాం. అనుకున్న సమయానికే డబ్బులు జమ అయ్యాయి. కష్టపడి పండించిన పంటకు సొమ్ములు రావటం.. చేసిన శ్రమను మర్చిపోయేలా చేసింది. - వీరంకి పిచ్చేశ్వరరావు, చల్లపల్లి


❖ ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల అనంతరం డబ్బులు జమ అయినట్లు చరవాణికి సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి. గతేడాది కంటే కూడా ముందుగా జమ కావటం కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం. గత ప్రభుత్వంలో పడిన కష్టాలు అంతా ఇంతా కావు. - నాదెళ్ల శరశ్చంద్రబాబు, పెదప్రోలు

❖ నేను 305 చారలు మిల్లుకు తోలాను. నా భార్య సీతా మనోహరమ్మ పేరిట 325 చారలు తోలాం. మంత్రి చెప్పిన విధంగా మా ఖాతాలకు డబ్బులు జమ అయ్యాయి. అవధులు లేని ఆనంద క్షణాలను ఆస్వాదించాం. - మల్లంపాటి ప్రేమానంద మోహన్, శివరామపురం

❖ రెండేళ్ల క్రితం ధాన్యం తడిసింది. దాన్ని వదిలించుకోవటానికి పడిన తిప్పలు మాటలలో వర్ణించలేను. ప్రస్తుతం 190 చారలు మిల్లుకు తోలాను. 24గంటల తర్వాత డబ్బులు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. చేసిన అప్పులు తీర్చా. విత్తనాల మినుములు కొన్నాం. - డొక్కు శివరామలక్ష్మి, పెదప్రోలు

దత్తాత్రేయ, శశిధరరెడ్డిలను సత్కరించిన దృశ్యం

కార్తికేయుని సేవలో బండారు, మర్రి

మోపిదేవి, న్యూస్‌టుడే: హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మర్రి శశిధరరెడ్డి తదితరులు బుధవారం మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు వారికి ఘనస్వాగతం పలికారు. నాగపుట్ట వద్ద పూజలు చేసి గోక్షీరాభిషేకం సమర్పించారు. పట్టువస్త్రాలతో సత్కరించారు. చిరువోలు బుచ్చిరాజు, మండలి వెంకటరామ్, సనకా ప్రశాంత్, పూషడపు రత్నగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: గ్రామ సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం నందివాడ మండలం పుట్టగుంటలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మాట్లాడారు. 128 అర్జీలు వచ్చాయి. గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని చెప్పడంతో అధికారులతో మాట్లాడారు.

ముగ్గుల పోటీలు

జమీగొల్వేపల్లిలో ముగ్గుల పోటీల్లో బాలికలు

పెదపారుపూడి గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచి సమీర, విద్యార్థులు

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం పామర్రు, జమీగొల్వేపల్లి, మొవ్వ, పెదపారుపూడిలోని గ్రంథాలయాల్లో విద్యార్థినులు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటాలకు నివాళులు అర్పించారు. - న్యూస్‌టుడే బృందం

ఉప్పెన మృతులకు నివాళి

పులిగడ్డలోని దివిసీమ ఉప్పెన మృతవీరుల స్మారక స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న అవనిగడ్డ రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఆదిరామ్మోహనరావు, డాక్టర్ వంగర శేషగిరిరావు తదితరులు.

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప్పెన మృతవీరులకు బుధవారం స్మారక స్థూపం వద్ద పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీపీ తుంగల సుమతి, జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ గ్రామస్థులు తదితరులు నివాళులు అర్పించారు.

ఇందిరాగాంధీ చిత్రపటానికి ..

ఘంటసాల: దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని ఘంటసాల, కొడాలి గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి, గ్రంథాలయ అధికారులు ఎం.శరత్‌కుమార్, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

చల్లపల్లి ఎస్సైగా కె.వై.దాస్



చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి ఎస్సైగా కె.వై.దాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం మచిలీపట్నంలోని ఇనగుదురు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

కూచిపూడి, న్యూస్‌టుడే: పెడసనగల్లుకు చెందిన దేవినేని లలితకుమారికి రూ.1,41,250, పామర్తి రవికి రూ.30,786, పాతూరి పార్థబాబుకు రూ.46,500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అందించారు. చినముత్తేవికి చెందిన అమృత శివ ఆంజనేయ ప్రసాద్‌కు రూ.20వేలు, మట్టా చంద్రశేఖర్‌కి రూ.1,26,860 చెక్కులు అందించారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నేత నన్నపనేని వీరేంద్ర, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండవరంలో కార్తిక వనసమారాధన

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ మండలం కొండవరం బావి సెంటరు వద్ద బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక దామోదరునికి, పరమేశ్వరునికి, సత్యనారాయణ స్వామివారికి ఉసిరి చెట్టు కింద విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఆ గ్రామస్థులతోపాటు మొవ్వ, మొవ్వపాలెం, మూలపాలెం, పెదముత్తేవి, వేములమడ, యుద్ధనపూడి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

తోట్లవల్లూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు గ్రామంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ పథకంలో 29,500 మంది రైతులు, పీఎం కిసాన్ పథకం ద్వారా 23,000 మంది రైతుల ఖాతాలో రూ.19.5 కోట్లు నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీరామ రైతు గ్రూపునకు రూ.10 లక్షల విలువైన డ్రోన్‌ను 80 శాతం రాయితీపై ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పబోతోందని తెలిపారు. రైతు సేవా కేంద్రంలో చెప్పిన ధాన్యం తేమ శాతం ఫైనల్ అని, మళ్లీ మిల్లర్ల వద్ద తేమశాతం పరిశీలించడం కుదరదన్నారు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఏడీఏ స్వర్ణలత, ఏవో శ్రీదేవి, ఎంపీడీవో రవికాంత్, ఉద్యాన అధికారిణి మానస పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

పెదపారుపూడి: మండలంలోని భూషణగుళ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతి పర్వత వర్ధిని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ట్రస్టు బోర్డు ఛైర్మన్ మండవ రామకోటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ, కోటి వత్తుల కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

ధాన్యం బస్తాలను కుడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, న్యూస్‌టుడే: రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. బుధవారం స్థానిక సాయిదుర్గా నగర్‌లో రైతులు ధాన్యాన్ని విక్రయిస్తున్న నేపథ్యంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే అక్కడ ఆగి ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం అమ్మకాల్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతుల ధాన్యాన్ని గోనె సంచుల్లో పోసి బస్తాలు కుట్టి రైతులను ఉత్తేజపర్చారు.

కూచిపూడి: ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదేశించారు. బుధవారం చినముత్తేవిలో రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీసి మాట్లాడుతూ రైస్ మిల్లర్లు, రైతుల మధ్యలో ధాన్యం తేమ శాతంలో తేడా వస్తే కస్టోడియన్ అధికారి బాధ్యత తీసుకుని ఆర్‌ఎస్‌కేలో వచ్చిన తేమశాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.

ప్రకటన

మా క్లయింటు కృష్ణా జిల్లా గుడివాడ టౌన్, డోర్ నెం. 11/108-4A కాపురస్తుడు కోన శ్రీ వీర వెంకట సత్యనారాయణమూర్తి గారి కుమారుడు సందీప్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది.

ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వణుదుర్రు పోస్టు, కొత్తపల్లి గ్రామ కాపురస్తురాలు పుట్టా పీటర్ గారి భార్య రమణ గారి తాలూకు యీ దిగువ షెడ్యూలు ఆస్తిని మా క్లయింటు కొనుగోలు చేయుచున్నారు. యీ దిగువ షెడ్యూలు ఆస్తిని గూర్చి ఎవరికైనా లావాదేవీలు గానీ, అభ్యంతరములు గానీ ఉన్నయెడల యీ ప్రకటన తేదీ నుండి 10 రోజులలోగా యీ దిగువ తెల్పిన అడ్రసుకు తెలుపుకొనవలెను. లేనియెడల మా క్లయింటు యీ దిగువ షెడ్యూలు ఆస్తికి క్రమమైన క్రయ దస్తావేజు పొందురనియూ, దరిమిలా తీసుకొను చర్యలు మా క్లయింటు క్రయ దస్తావేజును బైండు చేయజాలదు అనియూ, యిందుమూలముగా తెలియజేయటమైనది.

షెడ్యూలు: కృష్ణా జిల్లా గుడివాడ సబ్‌రి॥ వారి యిలాకా గుడివాడ మున్సిపల్ 1వ వార్డులోని డోరు నెం. 1/5 67-ఎ1రు దాఖలా గ్రామ రీ సర్వే నెం. 247/2 యఫ్ 2, 253, 248, 254, 256ర్లలోని ప్లాటు నెం. 85 దాఖలా చ॥గ॥ 388-6 స్థిరాస్తి నివేశన స్థలముకు హద్దులు: తూర్పు: ప్లాటు నెం. 85ఎరుగా ది. గుడివాడ తాలూకా ఎన్జీవోస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగు సొసైటీ వారి స్థలం అ. 60-0లు, దక్షిణం: మునిసిపల్ చెరువు అ. 58-3లు, పడమర: ప్లాటు నెం. 84రు దాఖలా ఆస్తి అ. 60-0లు, ఉత్తరం: అ. 33ల వెడల్పు గల రోడ్డు అ. 58-3లు. యీ హద్దుల మధ్య చ॥గ॥ 388.6లు లేక 324.90 చ. మీటర్లు నివేశన స్థలము, అందలి చ॥అ॥ 400లు ప్లింతేరియా గల గ్రౌండు ఫ్లోరు బిల్డింగుతో సహా.

కె.వి.ప్రకాష్, జి.ఆర్.కమలామృతం
అడ్వకేట్స్, గుడివాడ. సెల్: 93931 51632
గుడివాడ, 18-11-2025

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
గురువారం నవంబరు 20, 2025

25x7

విభాగాలు.. రోజులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

పేదలకు బాసటగా ప్రభుత్వ వైద్యం

విజయవాడలోని కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు చక్కని సేవలు అందిస్తున్నాయి. ఉచిత వైద్యంతో రోగులకు బాసటగా నిలుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్ర సరిహద్దులైన ఖమ్మం, మధిర ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వస్తున్నారు. పాత బిల్డింగ్‌లో, సూపర్ స్పెషాలిటీ (అద్దాల బిల్డింగ్)లో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆయా.. వారాల వారీగా ఓపీ ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం.

సూపర్ స్పెషాలిటీ బిల్డింగ్‌లో..

ప్రతి ఆదివారం ఓపీ సెలవు..

- ★ కార్డియాలజీ, డెర్మటాలజీ, సర్జికల్ డిసిప్లేన్, పల్మనరీ మెడిసిన్ (సోమ నుంచి శని వరకు)
- ★ న్యూరాలజీ: మంగళ, గురు, శని
- ★ న్యూరోసర్జరీ,అంకాలజీ: మంగళ, శుక్ర
- ★ నెఫ్రాలజీ: సోమ, బుధ, శని
- ★ యూరాలజీ: సోమ - గురు
- ★ ప్లాస్టిక్ సర్జరీ: సోమ, మంగళ, గురు
- ★ పీడియాట్రిక్ సర్జరీ: సోమ, బుధ, శుక్ర
- ★ ప్రివెంటివ్ అంకాలజీ: మంగళ, గురు
- గ్యాస్ట్రో ఎంట్రాలజీ హ్యూమన్ న్యూట్రిషన్ - సోమ, బుధ, శుక్ర
- కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జరీ - సోమ, బుధ, గురు

పాత బిల్డింగ్‌లో..

- ★ ఎమర్జెన్సీ మెడిసిన్ (క్యాజువాలిటీ), ఏఆర్‌టీ విభాగాలు అన్ని రోజులూ అందుబాటులో ఉంటాయి.
- ★ ఈఎన్‌టీ ★ జనరల్ మెడిసిన్ ★ ఆప్తమాలజీ ★ ఆర్థోపెడిక్స్ ★ అనస్థీషియా (పెయిన్ క్లినిక్) (సోమ నుంచి శని వరకు..)

పాత ప్రభుత్వ ఆసుపత్రిలో..

సోమ నుంచి శని వరకు ఓపీ సేవలు

- ★ ఓబిస్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ ★ పీడియాట్రిక్స్ ★ సైకియాట్రీ ★ ఫ్యామిలీ ప్లానింగ్

రెండు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు..

- ★ రోజూ ఓపీ : సుమారు 5500 మంది
- ★ మొత్తం విభాగాలు : 25
- ★ పడకలు : 1680 (ఐసీయూలో 294) (సాధారణ వార్డుల్లో ఉన్నవి 1386)
- ★ శస్త్రచికిత్సల గదులు : 26+9
- ★ వైద్యులు : 146 మంది

ఎగిరే పావురమా.. వెలిగే గోపురమా..

విజయవాడ వన్‌టౌన్‌లోని పాత శివాలయంలో ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచే పావురాలు సందడి చేస్తాయి. వందల సంఖ్యలో పక్షులు ఆలయ గోపురం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లుగా తిరుగుతూ కనిపించే దృశ్యాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.

–ఈనాడు, అమరావతి

వెంకన్న భూమికీ.. ఎసరెట్టారు!

- ✦ రికార్డుల్లో ఉన్న 67 సెంట్లు కనిపించడం లేదు
- ✦ ఏళ్లుగా ఫిర్యాదులు.. పట్టించుకోని యంత్రాంగం

ఈనాడు, అమరావతి

‘దేవాదాయశాఖ పరిధిలో గ్రామీణంలో ఉండే ఆలయాల భూములు మాయమవుతున్నాయి. మా ఆలయ భూమి కనిపించడం లేదని.. దేవాదాయ శాఖతో ఏళ్లుగా మొత్తుకున్నా కనీస స్పందన లేదు. పమిడిముక్కల మండలం మంటాడలోని అలివేలు మంగా పద్మాసమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భూమి కనిపించడం లేదని.. 2023లో వైకాపా జమానాలో గుర్తించారు. కొలతలు వేసి.. ఎంత మాయమైందో.. తేల్చారు. ఆ భూమి ఆలయానికి తిరిగి ఇప్పించాలని.. పలుమార్లు ఫిర్యాదు చేసినా దిక్కులేదు.’

వైకుంఠ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి భూములను కొంటామని.. 1979-80లో భక్తుల నుంచి విరాళాలు సేకరించి.. వారి పేర్లతోనే భూమి కొన్నారు. 92 మంది భక్తులు విరాళాలు ఇవ్వగా.. ఒక సెంటు నుంచి 12 సెంట్ల వరకూ ఇచ్చిన దాతలున్నారు. వీరి పేర్లతోనే.. ఎవరెవరు ఎన్ని సెంట్లు దానమిచ్చారో దేవస్థానం రికార్డుల్లో, ఆలయంలో బోర్డుపైనా వివరాలున్నాయి. మొత్తం.. 1.57 ఎకరాలు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో విలువ రూ.15 కోట్లకు పైమాటే. 2023 నవంబరులో కొలతలేయగా.. సర్వేనంబరు 15/1బి, 15/17లో 90 సెంట్లు రావడంతో గోల్‌మాల్ వెలుగుచూసింది.

రూ.7 కోట్లపైనే విలువ...

1979లో జక్కా పిచ్చయ్య నుంచి 35 సెంట్లు, 1980లో జక్కా భాస్కర్‌రావు నుంచి 45 సెంట్లు కొన్నట్లు కనిపిస్తోంది. గరికపాటి రంగారావు, తులసీదాస్ సోదరులు 12 సెంట్లు దానమిచ్చారు. మొత్తంగా 92 సెంట్లు. దేవస్థానానికి ఈ భూమి మాత్రమే.. ప్రస్తుతం కనిపిస్తోంది. మిగతా భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో కొన్న భూమి ఏమైందో తెలియదు. ఈ లెక్క తేల్చి ఆలయ భూమి ఇప్పించాలని.. దేవాదాయ శాఖకు మంటాడలో సామాజిక కార్యకర్తలు, ప్రజలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. 1.57 ఎకరాల్లో 90 సెంట్లే ఉందనీ, మిగతాది తేల్చాలని కోరుతున్నారు. ఈ మాయమైన భూమి విలువ రూ.7 కోట్లపైమాటే.

పాలకమండలి తీర్మానాలు చేసినా..

2023లోనే రెండుసార్లు ఆలయ ధర్మకర్తల మండలి సమావేశమై గోల్‌మాల్‌ను తేల్చాలని తీర్మానించి.. బాధ్యులపై కఠిన చర్యలకు దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసింది.

ఆ తర్వాత 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 18సార్లు ఫిర్యాదు చేసినా.. అటునుంచి స్పందన రాలేదని.. గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు.

చెట్టుచెదరని.. కోవెల!



కంకిపాడు మండలం కుందేరు గ్రామస్థులకు 40 ఏళ్ల కిందట ఓ సమస్య ఎదురైంది. దీన్ని సంప్రదింపులు, నిపుణుల సూచనలతో పరిష్కరించుకున్న విధానం మన్ననలు పొందుతోంది. స్థానిక చెరువు కూడలిలో అలనాటి వేంకటేశ్వరస్వామి గుడిలో వేపచెట్టు పెరిగింది. దేవతా వృక్షంగా భావించిన గ్రామస్థులు మహాలక్ష్మీమానుగా నామకరణం చేసి పూజిస్తుండేవారు. 1985లో గాలివానకు గుడిలో చాలా భాగం ధ్వంసమైంది. అదే స్థలంలో కొత్తగా ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. పనులు చేపట్టడానికి మహాలక్ష్మీమాను అడ్డుగా ఉన్నా దాన్ని తొలగించకుండా ఆలయం నిర్మించారు. భవన నిర్మాణ నిపుణుల సూచనతో చెట్టు కాండం, కొమ్మల చుట్టూ వృత్తాకారంలో ఖాళీ ఉంచి.. గోడలు, ఆర్‌సీసీ కప్పు నిర్మించారు. ఈదురుగాలులకు చెట్టు కాండం, కొమ్మలు ఊగినా అవి కట్టడాన్ని తాకనంత ఖాళీ వదిలారు. అలాగే రంధ్రం చుట్టూ ఇనుప జల్లెడ అమర్చి సిమెంట్, ఇసుక, కంకర మిశ్రమంతో నింపారు. వాన నీరు గుడిలోకి ప్రవేశించకుండా ఇతర ఏర్పాట్లు చేశారు. నాటి నుంచి ఎన్ని తుపానులు వచ్చినా చెట్టు కారణంగా దేవాలయ కట్టడాలకు నష్టం జరగలేదు. ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. – కంకిపాడు, న్యూస్‌టుడే

ప్రతీ క్లినిక్ ఏడీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే : జిల్లాలో ఏడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్)లో భాగంగా ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, ఆసుపత్రులు, క్లినిక్‌లు కొత్తగా ఏర్పాటు చేసుకోవాలనుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వైద్యులు, స్టాఫ్‌నర్స్ హెచ్‌పీఆర్- హెల్త్ కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రి ధ్రువపత్రం కోసం ఏడీఎం పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎఫ్‌ఆర్ రిజిస్ట్రీ నమోదు చేయని పక్షంలో ఏపీఎమ్‌సీఈ యాక్ట్(ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎస్టాబ్లిస్మెంట్ యాక్టు) అనుసరించి ఆ రిజిస్ట్రేషన్ దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులని గ్రహించి తదుపరి చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం స్థాపించి కొనసాగుతున్న ఆసుపత్రులు వారు కూడా విధిగా రానున్న 15 రోజుల్లో తప్పనిసరిగా పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలని, లేని పక్షంలో ఆసుపత్రి లైసెన్స్‌ను రద్దు చేస్తామని తెలిపారు.

కెవ్వు కేకు!

గుణదలలోని ఓ హోటల్‌లో బుధవారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. వివిధ రకాల ఎండు ఫలాలు, వైన్, ద్రాక్ష రసం కలిపి కేక్ తయారు చేశారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గుణదల(పటమట)

మాటేయడం.. మట్టుబెట్టడం!

☛ భద్రతా బలగాలపై దాడుల్లో వీరిది కీలకపాత్ర...

ఈనాడు - అమరావతి: మావోయిస్టు భావజాలానికి ఆకర్షితులైన ఆదివాసీలు.. పార్టీలో చేరారు. పోలీసులు, ఇన్ఫార్మర్లను చంపారు. పలువురు ఆదివాసీలను ఉద్యమం వైపు ఆకర్షితులను చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసులు మంగళవారం చేసిన ఆపరేషన్‌లో అరెస్టయిన నలుగురు మావోల చరిత్ర ఇది. వీరందరిదీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం.

మావోయిస్టులను జైలుకు తరలిస్తూ..

అసలు ‘రంగు’ ఇదీ...: కుంట జిల్లా పాలమడుగు గ్రామస్థుడు బీమా అలియాస్ రంగు.. 2003లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ గెరిల్లా బెటాలియన్ పార్టీ కమిటీ, దక్షిణ బస్తర్ ఏరియా స్టేట్ కమిటీలో ఉన్నాడు. 20 ఏళ్లుగా మావోయిస్టు కీలక దాడుల్లో పాల్గొనగా 30 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. 2017లో గుర్కపూర్ దాడిలో 22 మంది పోలీసులు చనిపోయారు. ఈదాడిలో అతడి కాలు విరిగింది. ఈ కేసులో పట్టుబడిన మంగిని 2013లో పెళ్లిచేసుకున్నాడు. ఈమె కిస్టాపురం ఏరియా కమిటీ సభ్యురాలు. 2024లో ధర్మపురం దాడుల్లో వీరు పాలుపంచుకున్నారు.

ఇన్ఫార్మర్లను పసిగట్టి: డివిజనల్ కమిటీ సభ్యులైన లక్మ, చిన్మయ్ అలియాస్ మనీలాలు.. చిన్న వయసులోనే పలువురు ఆదివాసీలు విప్లవ బాట పట్టేలా ప్రసంగించేవారు. మనీలా సమాచారం ఆధారంగానే కోరగట్ట బీజాపూర్ జిల్లాలో బీమాను ఇన్ఫార్మర్ అనే నెపంతో చంపారు. పలు ప్రాంతాల్లో లక్మ ప్రజాదర్బార్లు పెట్టి.. మావోయిస్టులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని చంపేవాడు. ఇన్ఫార్మర్ల కదలికలను మావోయిస్టు పార్టీకి సమాచారం ఇచ్చేవాడు. కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పనిచేశాడు.

ఆస్తి ఎవరిది.. హక్కుదారు ఎవరు

వ్యవసాయ భూములు, ఇళ్లు, స్థలాలు.. కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ అవసరం. ఎందుకంటే ఆ భూమి రిజిస్టర్ అయి ఉంటేనే దానికి హక్కుదారులుగా చట్టం పరిగణిస్తుంది. క్రయ విక్రయాల సమయంలో అనుసరించాల్సిన విధానంపై చాలా మందికి అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నంలో ఒక ఆస్తిని వేర్వేరు వ్యక్తులకు విక్రయించిన ఘటనపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే వివాదం చోటు చేసుకోవడం, అధికారులకు ఫిర్యాదు చేయడం క్షేత్రస్థాయిలో సమస్యలను తేటతెల్లం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 350 నుంచి 400 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. క్రయ విక్రయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియకపోతే రూ.లక్షలు, ఒక్కోసారి రూ.కోట్లు కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఆస్తి కొనుగోలుకు ముందు అనుసరించాల్సిన విధానాల గురించి తెలుసుకుందాం.

తెలుసుకుందాం



1908

కొనుగోలు చేసే భూములు 1908లోని సెక్షన్ 22ఎ ప్రకారం నిషిద్ధ జాబితాలో ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలి.

✦ ఆస్తి కొనుగోలు సమయంలో దానికి హక్కుదారు ఎవరు, దానిపై ఏవైనా బకాయిలు, లావాదేవీలు ఉన్నాయా అన్న విషయం నిర్ధారించుకోవాలి. ✦ దస్తావేజుల కాపీలు, ఈసీ ద్వారా ఆస్తిపై హక్కు ఎవరికి ఎలా సంక్రమించిందన్న విషయం తెలుసుకునే అవకాశం ఉంటుంది. ✦ మీభూమి వెబ్‌సైట్ ద్వారా భూమి యాజమాన్య హక్కు పత్రం, అడంగల్ తనిఖీ చేసుకుని ఆస్తి అమ్మకందారు పేరిట ఉందా లేదా అన్నది తెలుసుకోవచ్చు. ✦ పురపాలక సంఘం, గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాల విషయంలో అసెస్‌మెంట్ రిజిష్టర్‌లో నమోదు ముఖ్యం. ఆ వివరాల మదింపు రిజిష్టర్‌లో ఆస్తికి సంబంధించిన హక్కులు పరిశీలించుకోవాలి. ✦ ఆస్తిని పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా పొందే సమయంలో సదరు వ్యక్తికి సరైన హక్కులు ఉన్నాయా లేవా అన్నది నిర్ధారించుకోవాలి. ✦ కొనుగోలు చేసే ఆస్తిపై వివాదాలు, ఇతరులకు హక్కులు లేవన్న విషయాన్ని ధ్రువీకరించుకోవాలి ✦ క్రయ దస్తావేజు రాసుకునే సమయానికి సదరు ఆస్తికి సంబంధించి విద్యుత్తు, నీటి, ఆస్తి పన్నులు, ఇతర బకాయిలు లేకుండా చూసుకోవాలి.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అయినోళ్లకు నీడలో.. కానోళ్లకు ఎండలో..!

☛ విజయవాడ పీఎన్‌బీఎస్‌లో ముందస్తుగా టిక్కెట్లు ఇచ్చేందుకు 40 మంది బుకింగ్ కండక్టర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది అనర్హులే. ప్రజాప్రతినిధులు, ఆర్టీసీలో అధికారులను ప్రసన్నం చేసుకుని ఏళ్లుగా ఇక్కడే పాగా వేశారు. ఇటీవలే ఓ నాయకుడి సిఫార్సుతో ఆరుగురికి బాధ్యతలు అప్పగించడంపై దుమారం లేచింది.

ఆర్టీసీలో అనర్హులకు బుకింగ్ కండక్టర్లు, ఓడీ పోస్టులు

☛ బందరు డిపోలో ఓడీ (ఔటాఫ్ డిజిగ్నేషన్) విధుల్లో ఉన్న 12 మందిలో చాలా మంది అనర్హులే.
☛ విజయవాడ మెయిన్ డిపోలో నలుగురు కండక్టర్లు ఉన్నతాధికారుల అండతో ఐదేళ్లుగా కొనసాగుతున్నారు.
☛ విధుల్లో కొనసాగిస్తున్న వారికి ఖరీదైన కానుకలు సమకూరుస్తూ గడిపేస్తున్నారనే విమర్శలున్నాయి.

ఉమ్మడి జిల్లా ఆర్టీసీలో అడ్డగోలుగా బాధ్యతలు ఇచ్చేస్తున్నారు. పలువురు సిబ్బంది సొమ్ములు ఎరవేసి.. నేతల సిఫార్సులతో బుకింగ్ కండక్టర్లు, ఓడీ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఆ బాధ్యతలకు నిజంగా అర్హత ఉన్న వారు ఏళ్లు తిరుగుతున్నా ఫలితం లేక తల్లడిల్లుతున్నారు.

ఎవరికి కేటాయిస్తారంటే..

దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఉండి సాధారణ విధులు నిర్వహించలేని వారికి బుకింగ్ కండక్టర్లు, ఓడీ బాధ్యతలు అప్పగిస్తారు. ☆ వీరి తర్వాత సీనియార్టీ ప్రాతిపదికగా.. బస్సుల్లో కాకుండా డిపోల్లో విధులు కేటాయిస్తారు. ☆ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసి అనారోగ్యం, వైకల్య ధ్రువపత్రాలు సమర్పించాలి. ☆ ఆర్టీసీ త్రిసభ్య కమిటీ పరిశీలించి, వైద్యులతో నిర్ధారించుకుని అర్హత ఉంటే అనుమతిస్తారు.

అర్హత లేకున్నా అందలం...

☆ ఉమ్మడి జిల్లాలో ఈ రెండు విభాగాల్లో ఆరోగ్య సమస్యలు, సీనియార్టీ, వైకల్యం లేని వారు దాదాపు 150 మంది మేర అనర్హులు విధుల్లో ఉన్నారు. ☆ దరఖాస్తు, అనుమతి పత్రాలు ఏమీ లేకున్నా దర్జాగా శ్రమ లేని కొలువులో గడిపేస్తున్నారు. ☆ స్త్రీశక్తి పథకంతో విధుల్లో ఉన్న సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నా ట్రిప్పులు రద్దు చేస్తున్నారే తప్ప... వీరికి మాత్రం విధులు కేటాయించడం లేదు. ☆ కొన్ని బస్సుల్లో డ్రైవర్లతోనే టిక్కెట్ కొట్టిస్తున్నారు.* ఈ అంశంపై ఆర్టీసీ ఉన్నతాధికారుల వివరణ కోసం చరవాణిలో యత్నించగా అందుబాటులోకి రాలేదు.

– ఈనాడు, అమరావతి

లక్ష్యం 100%

వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో జిల్లా విద్యా శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. గతేడాది 85.68 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకులో నిలిచింది. ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు 14,184 మంది బాలురు, 13,613 మంది బాలికలు మొత్తం 27,797 మంది సిద్ధమవుతున్నారు. వీరంతా అన్ని సబ్జెక్టుల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలనేది లక్ష్యం. ✪ అందులో భాగంగా ఎస్‌ఏ-1 పరీక్షలు అయిన తరువాత సబ్జెక్టు టీచర్లకు విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్ల పరిధిలో జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో తెలుగు నుంచి సాంఘిక శాస్త్రం వరకు అన్ని పాఠ్యాంశాలను సులభంగా బోధించే పద్ధతులపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నారు. ✪ డిసెంబర్ 4వ తేదీ లోపు సిలబస్ మొత్తం పూర్తి చేయాలి. ✪ డిసెంబర్ 5న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తారు.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ముఖాముఖి

‘పది’ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకుకు కృషి

గతేడాది ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనేది లక్ష్యం. అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పునఃశ్చరణ తరగతులు నిర్వహించి సామర్థ్యాలను పెంచి ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతున్నాం.

- యు.వి. సుబ్బారావు, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి

వంద రోజులు...

డిసెంబరు 6 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తారు. అప్పటి నుంచి ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. వారికి పరీక్షలు నిర్వహించడం, వాటి ఫలితాల ఆధారంగా ప్రతిభ అంచనా వేస్తున్నారు. సందేహాలను నివృత్తి చేయడం, విద్యార్థులను బృందాలుగా చదివిస్తూ వారూ ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలి. విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయడం, త్వరగా స్టడీ మెటీరియల్ అందజేసేలా జడ్పీ ఛైర్‌పర్సన్, సీఈవో చర్యలు తీసుకుంటున్నారు.

ప్రాథమిక రంగాల పురోగతితో.. స్వర్ణాంధ్ర సాకారం

వ్యవసాయ పరికరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం తదితరులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : ప్రాథమిక రంగాలను పురోగమనంలో నడిపించడం ద్వారానే సమాజ సర్వతోముఖాభివృద్ధి సాకారమై అది స్వర్ణాంధ్రకు సోపానం అవుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మండల పరిధి బండిపాలెంలో కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కిసాన్ పండగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పండగలో భాగంగా 1,18,629 మంది రైతులకు రూ.79.72 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అందిపుచ్చుకోవాలని సూచించారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగే ప్రభుత్వం అన్నదాతలకు వరమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్కు అందజేశారు. కిసాన్ ఉపకరణాలు, మహిళా రైతులకు ఏర్పాటు చేసిన నవీన సేద్య విధానాల ప్రదర్శనలను పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్డీవో బాలకృష్ణ, ఏడీఏ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆరని మంట.. ఆగక తంటా!

ఆటోనగర్‌లో.. ఏ దారిలో చూసినా నిత్యం చెత్త, టైర్లు, వివిధ రకాల వస్తువులను తగలబెడుతూనే ఉన్నారు. దారుల వెంట వెళ్లే వారి కళ్లలో, నోట్లో సైతం పొగచూరి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలా పరిధి పారిశ్రామికవాడ కావడంతో ఎంత కాలుష్యం వెదజల్లినా అడిగేవారే లేక పోయారు. - ఈనాడు, అమరావతి

నగదు రూపంలోనే జోగికి ముట్టజెప్పాం!

సిట్, ఎక్సైజ్ విచారణలో అద్దేపల్లి సోదరుల వెల్లడి

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుల ఆర్థిక లావాదేవీలపై సిట్ దృష్టి సారించింది. అద్దేపల్లి సోదరుల బ్యాంకు స్టేట్‌మెంట్లను సేకరించి క్షుణ్నంగా విచారిస్తోంది. మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు రాములతో ఆర్థిక బంధంపై దృష్టి పెట్టింది. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావులను సిట్, ఎక్సైజ్ అధికారులు.. రెండో విడత కస్టడీకి తీసుకున్నారు. నాలుగు రోజుల కస్టడీలో భాగంగా బుధవారం తొలి రోజు... నెల్లూరు కారాగారంలో ఉన్న జనార్దనరావు (ఏ1)ను ఉదయం అదుపులోకి తీసుకుని.. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ తరలించారు. విజయవాడ జైలులోని జగన్మోహన్‌రావును కస్టడీకి తీసుకున్నారు. వీరిని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి, అక్కడ విచారించారు.

ప్రతి లావాదేవీపై ఆరా: కొన్నేళ్ల బ్యాంకు స్టేట్‌మెంట్లను తెప్పించి.. పెద్ద లావాదేవీలపై ఇద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించారు. నగదు ఎందుకు డ్రా చేశారు? ఎవరికి ఇచ్చారు? ఎందుకు ఇచ్చారనే వివరాలను రాబట్టారు. జోగి సోదరులకు తాము ముడుపులను నగదు రూపంలోనే ఇచ్చామని అంగీకరించినట్లు తెలిసింది. అక్రమ మద్యం, నకిలీ మద్యం వ్యాపారం కోసమే జోగి రమేష్‌కు ఇచ్చామని వీరు విచారణలో తెలిపారు. జోగి సోదరులతో సంబంధాలపైనా ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో తాము కలిసే మద్యం సిండికేట్‌లో సభ్యులుగా ఉండి వ్యాపారం చేసినట్లు ఒప్పుకొన్నారు. పలు ప్రశ్నలకు జనార్దనరావు సరైన సమాధానాలు చెప్పలేదు. స్పిరిట్, సీసాల కొనుగోలు, లేబుళ్ల ముద్రణ ఆర్డర్లకు నిధులు ఎలా సమకూరాయని ప్రశ్నించగా.. సమాధానాలు సూటిగా చెప్పలేదు.

(c) eenadu

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

క్రికెటోత్సవానికి వేళాయె...

● ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P.
FM Partner TV Partner Digital Partner Organised by

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

తలుపులు వేయడం మరిచిపోయారంట..!

కొండపల్లి ఐదో సచివాలయం, మెప్మా కార్యాలయానికి తలుపులు వేయడం సిబ్బంది మరిచిపోయారు. మంగళవారం సాయంత్రం వరకూ విధులు నిర్వహించిన సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేయకుండా వెళ్లిపోయారు. రాత్రి సమయంలో కార్యాలయం తలుపులు తెరిచి ఉండడం చూసిన స్థానికులు విధుల నిమిత్తం సిబ్బంది ఉన్నారేమోనని భావించారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత కూడా తలుపులు తీసి..విద్యుత్తు దీపాలు వెలుగుతుండడంతో కొందరు స్థానికులు కార్యాలయంలోకి వెళ్లి విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై సిబ్బంది అక్కడికి చేరుకుని కార్యాలయానికి తాళాలు వేసి కమిషనర్‌కు సమాచారం ఇవ్వడంతోపాటు ఉదయాన్నే తాళం చేతులను ఆమెకు అందజేశారు. ఈ భవనం కింద అంతస్తులో సచివాలయం, మొదటి అంతస్తులో మెప్మా కార్యాలయం ఉన్నాయి.

తెల్లవారుజామున తెరిచి ఉన్న సచివాలయం తలుపులు

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లకు ప్రణాళిక

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు ముందస్తు ప్రణాళికతో చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పోలీసు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. దీక్షల విరమణకు హోమగుండాలు, ఇరుముడి పాయింట్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, అన్నప్రసాద వితరణ ఏర్పాట్ల నిమిత్తం స్థల పరిశీలన చేశారు. ఈవో మాట్లాడుతూ ఈ నెల 20న సీపీ, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లతో దేవస్థానం అధికారుల సమావేశంలో ఏర్పాట్లపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్, దేవస్థానం డీఈ రవీంద్ర, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

చర్చిస్తున్న ఈవో శీనానాయక్, ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాశ్

సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి సూర్యారావుపేటలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ పురోగతిపై చర్చించారు. సూర్యఘర్ పథకం గురించి ఇంటింటి ప్రచారం చేయాలని, వినియోగదారులకు కలిగే లాభాలను వివరించాలని చెప్పారు. వారు ఆకర్షితులయ్యేలా చూడాలని సూచించారు. విద్యుత్తు బిల్లుల వసూళ్లు పూర్తి స్థాయిలో నూరు శాతం జరగాలని కోరారు. లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని.. ఎక్కడైనా ఈ సమస్య ఉంటే కారణాలు గుర్తించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మురళీకృష్ణ, టి.వి.ఎస్. ఎన్. మూర్తి, వెంకటేశ్వర్లు, ఎస్ఈ హనుమయ్య పాల్గొన్నారు.

సమావేశంలో పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, మూర్తి

రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి

నందిగామ: ఆధునిక సేద్యం లాభదాయకంగా ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన 'పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ' పథకం రెండో విడత సాయం రూ.7వేలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరిలతో కలిసి ప్రకృతి సేద్యంతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలించారు. రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం కింద నందిగామ నియోజకవర్గంలో 30,216 మందికి సంబంధించిన రూ.20.42 కోట్ల విలువైన నమూనా చెక్కును రైతులకు అందజేశారు. అనంతరం

ప్రకృతి సేద్యం ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, విప్ సౌమ్య

ఎంపీ మాట్లాడుతూ.. అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. సామాజిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పోతుల బాలకోటయ్య పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు పోషకాహారం అందజేస్తా

ఎ.కొండూరు, గంపలగూడెం: కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎ.కొండూరు మండలంలో వెయ్యి మంది కిడ్నీ బాధితులకు ఆరు నెలల పాటు పోషకాహారం అందిస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మండలంలో కిడ్నీ సమస్యలపై ఎప్పటికప్పుడు ఆరాతీస్తూ అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో రెండు నెలల్లో కృష్ణా జలాలను ప్రతి ఇంటికి అందిస్తామన్నారు. తన రాజకీయ జీవితం, సేవా కార్యక్రమాలు ప్రారంభమైన తిరువూరు నియోజకవర్గం తనకు ప్రత్యేకమన్నారు. రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఛైర్మన్ దేవదత్, నాయకులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: లాస్ ఏంజిల్స్‌లో 2028లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నానని ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పసిడి పతక విజేత, ఒలింపియన్ బొమ్మదేవర ధీరజ్ చెప్పారు. ఢాకాలో ఘన విజయం తర్వాత విజయవాడకు వచ్చిన ధీరజ్.. ఈ పతకాన్ని తన దివంగత గురువు చెరుకూరి లెనిన్‌కు అంకితం చేసినట్లు ప్రకటించాడు. బుధవారం నగరంలోని చెరుకూరి ఓల్గా వీఎంసీ ఆర్చరీ అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న అంతర్జాతీయ ఈవెంట్ల కోసం భారత్ జట్టులో స్థానం దక్కించుకోవడానికి శిక్షణ పొందుతున్నానన్నాడు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే జాతీయ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్, వచ్చే ఏడాది టోక్యోలో జరిగే ఏషియన్ గేమ్స్‌కు సన్నాహాలపై తన దృష్టి ఉందన్నాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ సెమీ ఫైనల్‌లో కొరియాపై విజయం తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పతకాన్ని తప్పక గెలుస్తానని విశ్వాసం వ్యక్తం చేశాడు. 2027లో జరిగే ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కూడా పాల్గొనాలని ఉందన్నారు. ఆసియా గేమ్స్‌కు భారత జట్టులో తన స్థానాన్ని భద్రపర్చుకోవడానికి దిల్లీలో జరిగే మొదటి ట్రయల్స్‌లో తలపడాల్సి ఉందన్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత రికర్వ్ జట్టులో నాల్గవ స్థానంలో నిలిచానన్నాడు. ప్రస్తుతం పురుషుల రికర్వ్ ఆర్చరీలో దేశంలో నంబరు 1వ స్థానం, ప్రపంచంలో 13వ స్థానంలో ఉన్నానన్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌ల నాయకత్వంలో ఆర్చర్లకు మెరుగైన ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. ముందుగా తన గురువైన లెనిన్‌కు నివాళులర్పించి అనంతరం అకాడమీ చీఫ్ కోచ్ సత్యనారాయణ నుంచి ఆశీర్వాదాలు పొందాడు. అంతర్జాతీయ యువ ఆర్చర్లు డాలీ శివాని, యుక్తశ్రీలు ధీరజ్‌కు సాదర స్వాగతం పలికారు. చీఫ్ కోచ్ సత్యనారాయణ.. ఆసియా ఛాంపియన్‌షిప్ కాంపౌండ్ ఆర్చరీలో మరో పసిడి పతక విజేత వెన్నం జ్యోతి సురేఖను అభినందించారు. రాష్ట్ర ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జిల్లా సంఘం కోశాధికారి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ కాంస్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ధీరజ్, వెంకటరమణ

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెనెక్‌బ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

వెట్టిచాకిరి రహిత జిల్లాగా మారుద్దాం

పాయకాపురం, న్యూస్‌టుడే : వెట్టిచాకిరి నిర్మూలనకు జిల్లా స్థాయి నిఘా-పర్యవేక్షణ సంఘాన్ని (విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. వెట్టిచాకిరి రహిత జిల్లాగా మారుద్దామని, దీనికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ పీడీ, డ్వామా పీడీ, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ, పోలీసు శాఖల ప్రతినిధులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు సభ్యులుగా ఉంటారని వివరించారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. వీరంతా గ్రామాలు, పట్టణాల్లో వెట్టిచాకిరి బాధితులను గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చర్యలకు నివేదిస్తుందని తెలిపారు. బాధితుల పునరావాసానికి సూచనలు ఇస్తుందని వివరించారు. రుణం వసూలకు వేసిన కేసుల విషయంలో బాధితలకు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. వెట్టిచాకిరి చేయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ సంఘం నోడల్ అధికారి, కార్మికశాఖ డిప్యూటి కమిషనర్ జి.ధనలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, డీపీవో లావణ్యకుమారి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రియాంక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కీర్తి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియాల ఆధునికీకరణ పనులు ప్రారంభించాలి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: వచ్చే నెల 22వ తేదీ నుంచి నగరంలో జరిగే జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌నకు వీలుగా నగరంలోని ఇండోర్ స్టేడియాల ఆధునికీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో బుధవారం నగరంలోని వీటిపై సమీక్ష సమావేశం నిర్వహించగా శాప్ ఎండీ ఎస్.భరణి, పలువురు డైరెక్టర్లు, అధికారులు, ఆర్కిటెక్చర్లు పాల్గొన్నారు. నగరంలోని ఐజీఎంసీ, పటమటలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ, మహాత్మాగాంధీ రోడ్డులోని డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియం, పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం వీఎంసీ క్రీడా ప్రాంగణాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియానికి సంబంధించి ఆధునిక సదుపాయాల ఏర్పాటు, క్రీడాకారులకు అవసరమైన వసతుల విస్తరణ, స్థానిక క్రీడా కార్యకలాపాల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. స్టేడియాల పునరుద్ధరణకు వారం రోజుల్లోగా డీపీఆర్‌లు తయారు చేయాలని ఎంపీ సంబంధిత అధికారులను ఆదేశించారు. శాప్ పరిపాలనాధికారి రమావత్ వెంకట రమణనాయక్, ఈఈ మునిశేఖర్, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, ఆర్కిటెక్చర్లు వడ్లమూడి శ్రీహర్ష, రామ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో శాప్ ఎండీ భరణి తదితరులు

ప్రకటన

నా క్లయింటు, కుమారి గెడ సాయిసాహితి, తండ్రి శరత్‌బాబు, విజయవాడ వాస్తవ్యుల నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా..

నా క్లయింటు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా ఆస్తిని సదరు స్థిరాస్తి యజమానులైన శ్రీ చెక్కా సత్యనారాయణ, తండ్రి శ్రీరామమూర్తి మరియు ఇతర పదిమంది యజమానుల నుండి క్రయం పొందుటకు నిశ్చయించుకొని కొంత అడ్వాన్సు చెల్లించి వారి నుండి విక్రయ ఖరారును పొందియున్నారు. శ్రీ గుంటూరు గోపాలరావు, తండ్రి సుబ్బారావు వారి జీవితకాలమునందు కుందావారి కండ్రిక గ్రామ ఆర్.ఎస్.నెం.51/1ఏరు దాఖలా సంక్రమించబడిన ఆస్తిని గ్రామ ఆర్.ఎస్.ఆర్ కాపీనందు రిజిస్టర్డ్ పట్టాదారునిగా నమోదు చేయించుకొని నిర్వివాదముగా అనుభవించుచూ, పరమపదించిన దరిమిలా వారి కుమారులైన శ్రీ గుంటూరు నాగేశ్వరరావు, గుంటూరు శేషగిరిరావు గారలు స్వాధీన పరుచుకొని వారి పేరిటనే పట్టాదారు పాసుపుస్తకములు పొంది. నిర్వివాదముగా జాయింటు కుటుంబ ఆస్తిగా అనుభవించుచూ, వారు మరియు వారి సోదరీమణులతో కలిసి ది. 27-07-2002న క్రయ దస్తావేజు నెం.5408/2002, జిల్లా రిజిస్ట్రీ, విజయవాడగా శ్రీమతి మున్నంగి మణిమాల, భర్త శివకుమార్ రెడ్డి క్రయం పొంది వారి పేరిటనే నెం. ఎఫ్.563579 పట్టా నెం. 145గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి నుండి భూయాజమాన్య పట్టాదారు పాసుపుస్తకమును పొంది నిర్వివాదముగా అనుభవించుచూ, దరిమిలా వారి నుండి శ్రీ చెక్కా సత్యనారాయణ మరియు ఇతర తొమ్మిది మందితో కలిసి వారి వారి భాగములను నిర్దేశించుకొనుచూ, ది. 10-10-2014న క్రయ దస్తావేజు నెం.3068/2014, సబ్ రిజిస్ట్రీ, నున్నగా క్రయం పొంది జాయింటుగా అనుభవించుచున్న ఆస్తియైయున్నది. దరిమిలా క్రయదారులలో ఒకరైన శ్రీమతి గుడివాడ ఉమామహేశ్వరి ది. 30-05-2022న పరమపదించిన దరిమిలా వారి వాటాకు సంక్రమించిన అవిభక్త చ॥గ॥ 352ల స్థలము హిందూ వారసత్వ రీత్యా ఆమె భర్తగారైన శ్రీ గుడివాడ వెంకట రమణ మరియు వారి కుమారులు శ్రీ గుడివాడ సాజన్ మరియు శ్రీ గుడివాడ వర్షిత్ గారలకు సంక్రమించబడినదని మరియున్నూ శ్రీ మాటూరి రవి వెంకట నాగ సురేష్‌పై క్రయ దస్తావేజు ద్వారా వారికి సంక్రమించబడిన చ॥గ॥440ల స్థలమును ది.13-07-2021న దఖలు దస్తావేజు నెం.5932/2021, జిల్లా రిజిస్ట్రీ విజయవాడగా శ్రీ చెక్కా సత్యనారాయణ గారికి దఖలు పరిచి, స్వాధీనపరిచియున్నారని, తద్వారా తమకు సంక్రమించి తమ సర్వ స్వాధీన యాజమాన్య జాయింటు హక్కు భుక్తములలోయున్న ఎటువంటి తగాయిదాలు గానీ, కోర్టు గ్రంథములు గాని, మనోవర్తి దావాలు గాని, తనఖాలు గాని లేని నిర్వివాద ఆస్తియని మరియున్నూ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఫొటోస్టాట్‌గా గల శ్రీ గుంటూరు గోపాలరావు మరణ, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రములు తన వద్ద గైరవీలు అయినవని శ్రీ చెక్కా సత్యనారాయణ మరియు ఇతర పదిమంది స్థల యజమానులతో కలిసి నా క్లయింటుతో నమ్మబలికి విక్రయ ఖరారును చేసియున్నారు. సదరు విషయమై ఎవరికైనను, ఏవిధమైన అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ, మరి యే యితర మనోవర్తి దావాలు, హక్కులు గానీ ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి ఏడు రోజులలో లిఖితపూర్వకముగా తగిన ఆధారములతో ఈ దిగువ చిరునామాకు రిజిస్ట్రీ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలియచేయవలసినదిగా కోరడమైనది. సదరు గడువు తేదీలోగా చట్టప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గానీ, ఆక్షేపణలు గానీ, క్లెయిములు గానీ రానియెడల నా క్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి మిగిలిన క్రయ ప్రతిఫలమును చెల్లించి వారి విక్రయదారులనుండి తన పేరిట గాని, తాను కోరిన వారి పేరిట గాని రిజిస్టర్ చేయించుకొనగలరు. తదుపరి వచ్చు క్లెయిములు నా క్లయింటును గానీ సదరు ఆస్తిని గానీ ఏవిధంగానూ బైండు చేయజాలవు.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, నున్న సబ్ రిజిస్ట్రారు వారి యిలాఖా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలోని, విజయవాడ కుందావారి కండ్రిక ఆర్.ఎస్.నెం.51/1ఏరు దాఖలా చ॥గ॥ 4549.6లు లేక చ॥మీ॥ 3803.92ర్లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** మండా కోటేశ్వరమ్మ గారి భూమి, **దక్షిణం:** కాసరనేని ఆనందరావు గారి భూమి, **పడమర:** పాతపాడు పొలిమేర డొంక, **ఉత్తరం:** గుంటూరు శివ శంకరరావు గారి భూమి.

ఈ నాలుగు హద్దుల మధ్య చ॥గ॥ 4549.6లు లేక చ॥మీ॥ 3803.92ర్లు ఖాళీ నివేశన స్థలము మరియు అందలి రివాజుగా గల హక్కులతో సహాయున్నూ.

Dr. ధారా సత్యనారాయణ, Advocate
డోర్ నెం: 36-12-13/3, డా.కిలారు బుచ్చిబాబు వీధి, మొగల్‌రాజ్‌పురం, విజయవాడ – 520 010.
Cell. No. 94403 20435, Phone No. 0866-2573736.
విజయవాడ, తేది: 19-11-2025

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ డిసెంబరు 3న విజయవాడలో ఆవేదన దీక్ష చేపడుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సత్వర న్యాయం కోసం విజయవాడ కేంద్రంగా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ సంస్థ రాష్ట్రంలో 19.52 లక్షల మంది ఖాతాదారులను రూ.3986 కోట్లకు మోసం చేసిందని గుర్తు చేశారు. వచ్చే జనవరి నాటికి ఉద్యమం చేపట్టి 12 సంవత్సరాలు అవుతుందన్నారు. ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. డిసెంబరు 3వ తేదీలోపు సంస్థ ఆస్తులను వేలం వేసి, యజమానుల పేరుతో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు కె.గగన్, విజయవాడ నగర కార్యదర్శి ఎస్.కె.షరీఫ్, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.భాస్కరరావు, కె. మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్... కస్టడీపై తీర్పు నేడు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: మహిళలు, కూటమి నేతలు, న్యాయమూర్తులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టి అరెస్టయిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్ రెడ్డి బెయిల్, నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని దాఖలైన పిటిషన్లపై ఇరు వర్గాల వాదనలు బుధవారం ముగిశాయి. గురువారం న్యాయాధికారి వీటిపై తీర్పు వెలువరించనున్నారు. నిందితుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి అనుచిత పోస్టుల కేసులో లోతైన విచారణ చేసేందుకు వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరిన సంగతి తెలిసిందే.

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అమరావతి ప్రాంత రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ప్రభుత్వం, సీఆర్‌డీఏ అధికారులు.. రైతు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. పదేళ్లుగా ఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని, 29 గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల కేసులు, ఆర్-5 జోన్ కేసులు ఉపసంహరించుకోవాలని, రైతులకు వార్షిక కౌలు బకాయిలు చెల్లించాలని కోరారు. అమరావతిని రాజధానిగా చేస్తూ పార్లమెంటులో చట్టం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే త్రీమాన్ కమిటీలో అమరావతి రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఆర్‌డీఏ స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : లైసెన్స్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వి.రామకృష్ణప్రసాద్, కార్యదర్శిగా అరిగెల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎస్.సుధాకర్, కె.శ్రీహరి, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా పి.సుధాకర్, ఉపకోశాధికారిగా ఎం.మదన్‌మోహన్, న్యాయ సలహాదారుడిగా బాలాజీ ఎన్నికయ్యారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

అరుణ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

నేడు ఉత్తర్వులు ఇవ్వనున్న కోర్టు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. గత నెల 13న విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు ఆమెపై మోసం కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఆమెను పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ అరుణ ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఇరుపక్షాల న్యాయవాదులు తమ తమ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి కేసు విచారణను గురువారానికి వాయిదా వేశారు. బెయిల్ పిటిషన్‌పై నేడు (గురువారం) ఉత్తర్వులు ఇస్తామని న్యాయస్థానం ప్రకటించింది.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన NIT NO.08/EE-2/2025-26, Dt: 19.11.2025

శ్రీ అమ్మవారి దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించి భవాని దీక్షలు విరమణ-2025-26 సందర్భముగా 1. కొండ పైన తాత్కాలిక విద్యుత్ పనులు చేయుటకు 2. కొండ క్రింద కేశఖండనశాల నందు తాత్కాలిక విద్యుత్ పనులు చేయుటకు 3. కొండ క్రింద మహామండపము నందు తాత్కాలిక విద్యుత్ పనులు చేయుటకు 4. కొండ పైన మరియు కొండ క్రింద తాత్కాలిక Publicaddressingsystem ఏర్పాటు చేయుటకు 5. కొండ పైన మరియు కొండ క్రింద CCTV లైవ్ ఏర్పాటు చేయుటకు (2వ పర్యాయము) 6. కొండ పైన తాత్కాలిక షామియానా పనులు చేయుటకు (2వ పర్యాయము) 7. కలశ జ్యోతులు కొరకు ట్రాలీ ఫ్లవర్, ఫైబరు విగ్రహాలు మరియు మండపం ఏర్పాటు చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి కలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments Department వర్క్స్ నందు సందర్శించవచ్చును. టెండరు డౌన్‌లోడ్ తేది:20-11-2025 మ॥ 03.00 గం॥ల నుండి సీ.నెం.5, 6 & 7 టెండరు దాఖలు చేయు చివరి తేది:24-11-2025 మ॥ 03.00 గం॥ల వరకు. సీ.నెం.1 నుండి 4 టెండరు దాఖలు చేయు చివరి తేది:27-11-2025 మ॥ 03.00 గం॥ల వరకు. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో లేదా ఫోన్: 0866-2423800 ద్వారా సంప్రదించగలరు.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.

శ్రీ బొర్రా రాధాకృష్ణ — ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ — స్పెషల్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 97018 93458.

BPT/ B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/ Dialysis - Courses in Vijayawada - MGT./ Convener Quota. ✆ 76800 65835.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96401 76677, 95537 86677

REAL ESTATE

PLOT FOR SALE

విజయవాడ సిటీ, బెంజిసర్కిల్ 5 మినిట్స్ జర్నీలో ★ మంచి ప్రశాంతమైన వాతావరణంలో ఈస్ట్ & వెస్ట్‌ఫేస్ రెడిటూ కన్‌స్ట్రక్షన్‌కి అనువైన 133 గజాలు ప్లాట్లు కేవలం 30 లక్షలు ఫైనల్ రేటుతో అమ్మకం. ✆ 77320 51576.

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

JOBS

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు ఇన్‌ఛార్జ్ (F) జీ. 20K రిసెప్షనిస్ట్ (F) జీ. 15K ఏదైనా డిగ్రీ VJA- 7 ✆ 87905 99799.

ప్రముఖ బ్యాంక్ కలెక్షన్ ఏజెన్సీలో బ్యాంకు లోన్స్ వసూలు చేయుటకు (Ms) ఆఫీసులో అనుభవం కలిగిన (ఫిమేల్) టెలికాలర్స్ కావలెను. 77318 68308.

అకౌంటెంట్ కావలెను. B.Com., GST, ESI, P.F, Returns, Tally అకౌంట్స్ వచ్చినవారు కావలెను. ✆ 79895 77531

Wanted Computer Hardware, Printer Engineers for VLMS IT Solutions. Bhavanipuram, www.vlms.in 98488 18090, 97012 27778.

Wanted Male Floor/ Campus Incharges, Data Entry Operators & Hostel Wardens to work in Sri Medha Jr. College, Labbipet, Exp. Min 3 Years. Age: 30-40 Yrs. Qual: Any Degree/ B.Tech. 91542 10069.

VJA మొగల్‌రాజ్‌పురంలో ప్రముఖ స్వీట్ షాపులో పనిచేయుటకు సేల్స్ సూపర్‌వైజర్స్, స్టోర్స్ సూపర్‌వైజర్స్ కావలెను. అనుభవం గలవారికి ప్రాధాన్యత. ✆ 91778 17557

VJAలో డాక్యుమెంట్ రైటర్ దగ్గర పనిచేయుటకు తెలుగు/ఇంగ్లీష్ అను కీబోర్డు (పేజ్‌మేకర్) వచ్చిన టైపిస్ట్ (M) 10th/ ఇంటర్ ఆఫీస్‌బాయ్ కావలెను ✆70320 60786

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ 23000 - 29000. వ: 18-35. ✆: 7730958410.

విజయవాడలో ప్రముఖ 3 స్టార్ హోటల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్ మార్కెటింగ్ మేనేజర్ మరియు యువతి యువకులు కావలెను. ✆ 91001 17227.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

స్టేడియంలో అంతర్జాతీయ వసతులు కల్పించాలి

ఇబ్రహీంపట్నం గ్రామీణం: మూలపాడు క్రికెట్ స్టేడియాన్ని అంతర్జాతీయ పోటీలకు అనువుగా తీర్చిదిద్దాలని ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ కేశినేని శివనాథ్ నిర్వాహకులకు సూచించారు. ఆయన బుధవారం స్టేడియాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు, మౌలిక వసతులు, నిర్వహణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన

విస్సన్నపేట: విస్సన్నపేటలో సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహానికి బుధవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.3 కోట్లతో వసతి గృహం నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా పి.ఎస్.ఎన్.రాజు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మండల విద్యాశాఖాధికారి-2గా పి.ఎస్.ఎన్.రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతుల సందర్భంగా ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మండలంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచండి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మున్సిపల్ కార్మికులకు తోపుడు బండ్లు, రిక్షా బండ్లను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె.నిర్మల, మున్సిపల్ కమిషనర్ కె.మనోజ, వార్డు కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల కారణంగా కొటికలపూడి మసక లంక పొలాల్లో విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. వాటిని ఇప్పటివరకు అధికారులు నిలబెట్టి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించ లేదు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. **- జయపాల్, రైతు, కొటికలపూడి**

✔ పొలాల్లో తడి ఆరిన తరువాత స్తంభాలు నిలబెట్టి విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. **- వెంకన్న, ఏఈ, ఇబ్రహీంపట్నం**

– ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

? కొండపల్లి పంచాయతీ కార్యాలయం రోడ్డు సైకిల్ స్వామి అపార్టుమెంటు వద్ద పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే కూడలి వద్దకు వచ్చి బండిలో వేసుకోవాలని చెబుతున్నారు. **- కిరణ్, స్థానికుడు.**

✔ సిబ్బంది చేత ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాను. **- మేనేజర్ వెంకటరత్నం.** –న్యూస్‌టుడే, కొండపల్లి

అన్నదాత సుఖీభవ

నిధుల జమతో హర్షం

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

రైతుల పంట పెట్టుబడులకు తోడుగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పథకం ద్వారా రెండో విడత కింద నిధులను రైతుల ఖాతాల్లోకి జమచేయడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఒడిదొడుకుల్లో ఉన్న వ్యవసాయరంగానికి ప్రభుత్వం చేస్తున్న సాయం ఊతమిస్తోందని చెబుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేల మందికి పైగా రైతులకు రూ.15 కోట్లకు పైగా లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే తొలి విడత సాయాన్ని అందుకున్న రైతులకు బుధవారం సాయంత్రం నుంచి ఖాతాల్లో జమపై వస్తున్న సంక్షిప్త సందేశాలతో ఆనందపడుతున్నారు. రైతుల అభిప్రాయమిది.



మైలవరం మండలం మెర్సుమిల్లిలో రైతులకు పథకం నమూనా చెక్కు అందజేస్తున్న జేసి ఇలక్కియా

సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగం

అన్నదాత సుఖీభవ రెండోవిడత డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేయడం సన్న, చిన్న కారురైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రస్తుతం మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్న రైతులకు విత్తనాలు, మందుల కొనుగోలుకు అక్కరకు వస్తాయి.

- గుత్తి సత్యనారాయణ, కూనపరాజుపర్వ

నిధుల విడుదల సంతోషం

రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల చేయడం సంతోషం. ప్రస్తుతం మామిడి తోటల్లో మందు పిచికారీ చేస్తున్నాం. అందుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయి. రైతులకు ఊరటనిస్తాయి. **- మాదల సూర్యప్రకాష్‌రావు, కూనపరాజుపర్వ**

కొండంత భరోసా ఇస్తోంది..

రైతుల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయం కొండంత భరోసానిస్తోంది. గతానికంటే మెరుగైన సాయం సన్న, చిన్నకారు రైతులకు ఆసరాగా ఉంటోంది. మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. **- చల్లా సుబ్బారావు, రైతు, మొర్సుమిల్లి**

పంట పెట్టుబడికి వినియోగం

ప్రభుత్వం సాయాన్ని అందించడం మంచి విషయం. ఈ మొత్తం పంట పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. సేద్యంలో ముందుకు సాగటానికి దోహదపడుతుంది. **- అక్కల మధుసూదనరెడ్డి, రైతు, గణపవరం**

రైతు కష్టం తెలిసిన సీఎం చంద్రబాబు

గంపలగూడెం: రైతు విలువ, కష్టం తెలిసిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. అన్నదాతలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి పంటల సాగుకు ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందించాలనే చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సొమ్ములు రైతుల ఖాతాలకు బుధవారం జమ చేస్తున్న సందర్భంగా గంపలగూడెంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సభ వద్ద ప్రదర్శనగా ఏర్పాటు చేసిన ఎరువుల పిచికారీ చేసే డ్రోన్, ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ యోజన ద్వారా 33,658 మంది రైతులకు రూ.22.50 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం రైతులకు నమూనా చెక్కు అందజేశారు.

గంపలగూడెంలో నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఆర్డీవో మాధురి, అధికారులు

సేంద్రియ వ్యవసాయ చక్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం): రైతు సంక్షేమానికి కూటమి సర్కారు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం మూలపాడు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి నియోజకవర్గ స్థాయిలో పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 30,241 మంది అన్నదాతలకు ఈ పథకం ద్వారా రూ.15.12 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీకళ్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఏడీఏ శశికళ పాల్గొన్నారు.

అర్హులకు నెల రోజుల్లో ఉపకరణాలు ఇస్తాం

మైలవరం, న్యూస్‌టుడే: దివ్యాంగులైన విద్యార్థులకు అర్హతల ప్రకారం నెల రోజుల్లో అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా సహిత విద్య సమన్వయకర్త కె.నారాయణ తెలిపారు. ఆ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని దివ్యాంగులను వివిధ అంశాలపై పరీక్షలు నిర్వహించారు. వారిలో వినికిడి లోపం, బుద్ధిమాంద్యం, మెదడు పక్షవాతం, శారీరక వైకల్యం, అంధత్వం తదితర సమస్యలపై నిపుణుల ఆధ్వర్యంలో పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎల్.బాలు, రాజు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు సత్యసాయి బాబా మందిరంలో 100 మంది పేద మహిళలకు భక్తులు చీరలు అందజేశారు. మందిర కమిటీ సభ్యుడైన ప్రభాకరరావు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా నూరో జన్మదిన వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గురువారం 100 మంది పేదలకు దుప్పట్లు అందజేస్తున్నామని వెల్లడించారు.

వృద్ధులకు దుప్పట్లు అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీవాడలో 100 మంది వృద్ధులు, వితంతువులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేసినట్లు సేవా సంస్థ అధ్యక్షుడు సిహెచ్.విజయ్‌కుమార్ తెలిపారు. ఓబులాపురం గ్రామానికి చెందిన నూనె రోశిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, నరుకుళ్లపాడు సర్పంచి నూనె అప్పిరెడ్డి ఆర్థిక సహాయంతో వీటిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జానలపాటి వేణుగోపాలరెడ్డి, ఎం.నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సందడిగా గ్రంథాలయ వారోత్సవాలు

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గంపలగూడెంలోని జ్ఞానకేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, గ్రంథాలయ నిర్వాహకులు ఎం.ప్రసన్న, ఎన్.విద్యాధీశ్ తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి విజయకృష్ణ తెలిపారు. విజేతలకు గురువారం నిర్వహించే సమావేశంలో బహుమతులు అందజేస్తామని ఆమె తెలియజేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో బుధవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. పలువురు మహిళలను సత్కరించారు. గ్రంథాలయ నిర్వాహకులు వి.జ్యోతిర్మయి, వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు.

మైలవరంలో రంగవల్లులు వేస్తున్న మహిళలు

జి.కొండూరు: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో విజయకృష్ణ తదితరులు

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

గంపలగూడెం: పెనుగొలను సమీప మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస ఆలయంలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులు పాల్గొని కర్పూర జ్యోతి వెలిగించి పూజలు చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ గ్రామీణ సీఐ డి.చవాన్ అన్నారు. ఆ మేరకు కంచికచర్ల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో వినియోగదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అసంపూర్తి రహదారి.. నరకంగా మారి..

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెం కవులూరు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. రూ.2 కోట్ల నాబార్డు నిధులతో కట్టుబడిపాలెం నుంచి ప్రారంభించి కవులూరు గ్రామం మీదుగా పైడూరుపాడు వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. తారు పనులు పూర్తి కాలేదు. జులై నెలలో రహదారి నిర్మాణం ప్రారంభించి పాత రోడ్డును తొలగించి వెట్‌మిక్స్ పరిచి పనులు నిలిపేశారు. దీంతో వెట్‌మిక్స్‌లో ఉన్న కంకర రాళ్లు పైకి తేలి వాహనాలు పాడవుతున్నాయని చోదకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేసి తమ అవస్థలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం మండలంలోని చంద్రగూడెం రైస్‌మిల్లును జిల్లా సంయుక్త కలెక్టర్ ఇలక్కియా పరిశీలించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధాన్యాన్ని పరిశీలించి, సకాలంలో కొనుగోలు చేసి, కాటాలు వేయాలని అధికారులకు సూచించారు. కోతలు ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.

ఆర్థిక భరోసా.. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థికసాయంతో వారికి భరోసా లభిస్తుందని జేసీ ఇలక్కియా పేర్కొన్నారు. పథకం మండలస్థాయి కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని మొర్సుమిల్లిలోని రైతుసేవాకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 7389 మందికి గానూ రూ.5.01 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఒక్క మొర్సుమిల్లిలోనే 640 మంది రైతులకు రూ.44.80 లక్షల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ స్టాళ్లను, డ్రోన్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి మాడపాటి రమాదేవి, తహసీల్దార్ అబ్దుల్ దరియా, ఏవో సంధ్యారాణి, డీటీ మాధవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మైలవరం యార్డులో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

ప్రభుత్వ కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ధాన్యం పండించిన రైతులు మద్దతు ధర పొందేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఆర్డీవో కె.మాధురి సూచించారు. మండలంలోని పోలిశెట్టిపాడు, రేపూడిలో నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యం రాశులను బుధవారం ఆమె పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో నగదు బ్యాంకు ఖాతాలకు జమవుతుందని తెలిపారు. రేపూడిలో భూముల రీసర్వేకు సంబంధించి జరుగుతున్న డ్రోన్ ప్రక్రియను ఆమె తనిఖీ చేశారు. మాధవరంలో రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులను పరిశీలించారు. టోకెన్ బుకింగ్ ద్వారా రైతులు తమ సొంత వాహనాల్లో కూడా ధాన్యాన్ని మిల్లుకు తరలించవచ్చన్నారు. తహసీల్దార్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

ఎ.కొండూరు: పోలిశెట్టిపాడులో రైతులు ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి తదితరులు

24 గంటల్లో నగదు జమ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జె.సుశీలాదేవి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 24 గంటల్లో ప్రభుత్వం నుంచి రైతులకు డబ్బులు జమవుతున్నాయన్నారు.

కార్యక్రమంలో అధికారులు, రైతులు

శివాలయాల్లో కార్తికమాసం దీపోత్సవాలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు ఇబ్రహీంపట్నం గ్రామీణం: కార్తికమాసం సందర్భంగా శివాలయాల్లో బుధవారం భక్తులు దీపోత్సవాలు చేశారు. ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ శక్తి విశ్వేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

ఎ.కొండూరు మండలం కంభంపాడులో..

తిరువూరు చంద్రమౌళేశ్వరస్వామి గుడిలో వెన్నపూసతో అలంకరించిన శివలింగం

గంపలగూడెం మండలం కొత్తపల్లిలో..

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడు భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వనసమారాధన సంప్రదాయంగా నిర్వహించారు. సమీప మెట్టగుట్ట శ్రీనివాస ఆలయానికి భక్త బృందం తరలివెళ్లి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సామూహిక భోజనాలు చేశారు. పిరమిడ్ సేవాదళ సభ్యుల ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించారు.

పిరమిడ్ సేవాదళ్ సభ్యులను సత్కరిస్తున్న గోసవీడు భక్త బృందం

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

ముష్టికుంట్ల శాఖ, తిరువూరు (మం.)

సెల్ : 91213 83337

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ పేర్కొన్న ఖాతాదారులు మా బ్యాంకులో బంగారు ఆభరణములు తాకట్టు పెట్టి గడువు తీరిననూ, నోటీసులు పంపిననూ ఋణము తీర్చనందువలన ది 02-12-2025 మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలకు వేలం వేయుటకు నిర్ణయించడమైనది. వేలం పాటలో పాల్గొనదలచినవారు పాల్గొనవచ్చును. వేలం తేదీ మార్చుటకు గాని, నిలుపుటకు గాని, రద్దు పరచుటకు గాని బ్రాంచి మేనేజరుకు సర్వాధికారములు కలవు. వేలం తరువాత ఇంకనూ బాకీ తీరనియెడల ఈ క్రింది తెలుపబడిన వారిపై కోర్టు ద్వారా చర్య తీసుకొనబడును.

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	పేరు / చిరునామా	మొత్తం బరువు గ్రాముల్లో
1)	50057673343	కన్నెపోగు స్వప్న, W/o. రాము చింతలపాడు గ్రామము, తిరువూరు (మం.)	24

సం/- బ్రాంచ్ మేనేజర్

తేది: 19-11-2025 ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ముష్టికుంట్ల శాఖ

పేదల భూముల్ని పందేరం చేయొద్దు

మాట్లాడుతున్న సీహెచ్ కోటేశ్వరరావు

మైలవరం, న్యూస్‌టుడే: అసైన్డు, సీలింగ్, వివిధ రకాల ప్రభుత్వ భూములను దీర్ఘకాలంగా సాగుచేస్తున్న పేదల నుంచి లాక్కొని పందేరం చేయొద్దని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. 9/77 చట్టం ప్రకారం సాగుచేస్తున్న వారి నుంచి 99 సంవత్సరాల లీజు పేరిట తీసుకునేలా సవరణ చేయాలనే ప్రభుత్వ ఆలోచన సరికాదన్నారు. మండలంలోని పోరాటనగర్ 34వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటనగర్‌లో 2300 ఎకరాలతోపాటు సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను పేదలు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు దుర్గ, నాయకులు డి.కన్నయ్య, భీముడు, పెదబాలు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బాలికా విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పీఎంఏజేఏవై కింద మంజూరైన రూ.3 కోట్లతో నిర్మించనున్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహ భవన నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాల మెరుగుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు. చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మంజుభార్గవి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాలు వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

రోడ్డు పనులు ప్రారంభించకుంటే ధర్నా చేస్తాం

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం- నూజివీడు మార్గంలోని వెల్వడంలో రహదారి అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని, లేకుంటే ధర్నా చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ పేర్కొన్నారు. రహదారి దుస్థితి, అభివృద్ధి పనుల జాప్యంపై బుధవారం స్థానిక ర.భ. కార్యాలయంలో ఈఈ సిద్ధయ్యతో, వెల్వడం గ్రామస్థులతో కలిసి చర్చించారు. ఈదారి ప్రమాదకరంగా తయారైనా.. పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. వెల్వడం నుంచి చంద్రాల వరకు రహదారి అధ్వానంగా తయారైందని, పనులు ఎందుకు చేయడం లేదని ఈఈని అడిగారు. పనుల నిర్వహణపై చర్చిస్తున్నామని, రెండ్రోజుల్లో ప్రారంభిస్తారని ఈఈ వారికి బదులిచ్చారు. అలా జరగకపోతే గ్రామస్థులతో కలిసి ధర్నా చేస్తామని సీపీఎం నాయకులు చెప్పారు.

ర.భ. ఈఈతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు, వెల్వడం గ్రామస్థులు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

ధీర వనిత ఇందిరాగాంధీ

కొండపల్లి: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కిరణ్

కొండపల్లి, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ ధీర వనిత అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రాకిరణ్ అన్నారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా విప్లవాత్మక నిర్ణయాలను ఇందిర చేశారన్నారు. దేశం సమైక్యంగా ఉండాలన్న ఆకాంక్షతో.. ఉద్యమాలను అణచివేసి ప్రాణత్యాగానికి సైతం ఆమె వెనకాడలేదని గుర్తు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అక్కల ప్రసాద్, రాము, ఆనందరావు, థామస్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే బృందం: ఇందిరాగాంధీ జయంతిని వివిధ గ్రంథాలయాలు, పాఠశాలల్లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గంపలగూడెం గ్రంథాలయంలో..

చెవుటూరులో...

కొండపల్లి గ్రంథాలయంలో..

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక లీలావతి గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బిర్సాముండా, ఝాన్సీలక్ష్మీబాయి జయంతి పురస్కరించుకుని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం పాఠశాలలో వారికి నివాళులు అర్పించారు. చిన్నారులతో వేషధారణలు వేయించారు. పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.



విజయవాడ తూర్పు

పూడిక తొలగింపు

కరెన్సీనగర్: మూడో డివిజన్ రామవరప్పాడు రింగు నుంచి కరెన్సీనగరుకు వెళ్లే మార్గంలో సైడు కాలువలు వ్యర్థాలతో నిండి దుర్గంధం వస్తోంది. ఈ సమస్యపై 'పీకలే పడిపోవు.. దోమల బాధ..' శీర్షిక మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి కార్పొరేషన్ శానిటరీ అధికారులు స్పందించారు. సిబ్బందితో పూడిక తీయించారు. దోమల నివారణ మందు చల్లించారు. తొలగించిన పూడికను ఎత్తి వేయించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: లబ్బీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

పూజ చేస్తున్న అర్చకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

✦ 19ఈఎస్‌టీ154: 2వ డివిజన్ గుణదల కమ్మరిపాలెం, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి శ్రీనివాసరావు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. ✦ 4వ డివిజన్ భారతీనగర్ 13వ రోడ్డులో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి వెంకటేశ్వరరావు.. ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి యంత్ర సాయంతో పూడిక తీయించారు. ✦ 10వ డివిజన్ కె.పి. నగర్ 10-43/208 విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి వీరమాధవిని రాంబాబు.. ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కొత్త దీపం ఏర్పాటు చేయించారు.

ఫార్మసీ విద్యార్థుల ప్రదర్శన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థులు మొగల్రాజపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని కళాశాల నుంచి సిద్ధార్థ సర్కిల్, జమ్మిచెట్టు కూడలి మీదుగా మదర్‌థెరెసా జంక్షన్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. ప్రిన్సిపల్ ఆచంట సునీత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ధ్యాస.. భవితకు శ్వాస

వివిధ పోటీల్లో ప్రతిభ చూపుతున్న నగర విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కాసేపు సమయం దొరికితే చాలు.. గంటల కొద్దీ చరవాణితో గడిపే ఈ రోజుల్లో.. అందుకు భిన్నంగా కొంతమంది నగర విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూపుతున్నారు. రోజూ ఇందుకోసం కొంత సమయం కేటాయించి గ్రంథాలయానికి వెళుతున్నారు. దినపత్రికలు చదివి కరెంట్ అఫైర్స్, జనరల్‌నాలెడ్జి పెంచుకుంటున్నారు. వీటితో ప్రభుత్వ, వివిధ సంస్థలు నిర్వహించే క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాణిస్తూ భళా అనిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రచయితగా ఖ్యాతి సాధించాలని..

మాతృ భాష, పుస్తక పఠనం అంటే స్రవంతికి ఆసక్తి. పీబీ సిద్ధార్థ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆమె ఇప్పటికే 17 కవితలు, ఏడు కథా రచనలు రాసింది. సమాజానికి మార్గనిర్దేశం చేసేలా ఒక పుస్తకాన్ని కూడా రాస్తోంది. రచయితగా మారి సమాజంలో మంచి మార్పు తీసుకురావాలనేది లక్ష్యమని స్రవంతి తెలిపింది.

జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ..

గ్రంథాలయంలోని పుస్తకాలు చదువుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తోంది సుసన్న. సిద్ధార్థ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆమె జాతీయ స్థాయిలో జరిగే సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్, విద్యార్థి వికాస వాహిని, సిద్ధార్థ అకాడమీతో పాటు వివిధ సంస్థలు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. పుస్తక సమీక్షలు చేస్తోంది. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది లక్ష్యమని సుసన్న చెబుతోంది.

ఏకాగ్రత.. మానసిక వికాసం..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది నీలి మోహన. పీబీ సిద్ధార్థ కళాశాలలో బీఎస్సీ (తృతీయ)చదువుతున్న ఈమె రోజూ రెండు గంటలు పుస్తక పఠనం చేస్తోంది. చదువుతో పాటు వివిధ పోటీల్లో రాణిస్తోంది. గ్రూప్-1 పరీక్షలో విజయం సాధించాలనేది లక్ష్యమని ఆమె పేర్కొంది.

బీపీఎస్‌కు 6 దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అక్రమ కట్టడాలు, అనుమతిలేని నిర్మాణాల క్రమబద్ధీకరణ, పీనలైజేషన్‌కు సంబంధించిన ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీపీఎస్ కింద బుధవారం నాటికి 6 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలయ్యాయి. ఈ నెల 12 నుంచి బీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తేగా.. సాంకేతిక సమస్యలు వల్ల ప్రారంభంలో పోర్టల్ సక్రమంగా పనిచేయలేదు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో పనిచేస్తుండటంతో అక్రమ నిర్మాణదారులు ఒక్కొక్కరు దరఖాస్తులు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు బీపీఎస్ దరఖాస్తుల ప్రాథమిక రుసుము కింద రూ.60 వేల ఆదాయం సమకూరింది.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజలు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 1985 జనవరి 1 తర్వాత 2025 ఆగస్టు 31వ తేదీ ముందు నగరంలో నిర్మించిన అక్రమ, అనుమతిలేని భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉన్నందున, ఆన్‌లైన భవన యజమానులు 2026 మార్చి 11 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భవన యజమానులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ www.bps.ap.gov.in ద్వారా అర్హత కలిగిన లైసెన్సు టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ) ద్వారా అవసరమైన అన్ని పత్రాలను దరఖాస్తుతో జోడించి సమర్పించాలని ఆయన తెలిపారు. 1997 డిసెంబరు 31కి ముందు నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు పీనలైజేషన్ రుసుములో 25 శాతం రాయితీ ఇస్తున్నట్టు వెల్లడించారు. అందుకు సంబంధిత భవన యజమానులు అన్నిపన్ను రసీదు జత చేయాలని తెలిపారు.

కెనరా బ్యాంకులో రక్తదాన శిబిరం

ఉద్యోగికి బహుమతి అందజేస్తున్న రత్నాకరరావు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు వ్యవస్థాపకులు అమ్మెంబాల్ సుబ్బారావుపాయ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని రమేష్ ఆస్పత్రి జంక్షన్‌లోని కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని బ్యాంకు విజయవాడ రీజినల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రత్నాకరరావు ప్రారంభించారు. కెనరా బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రత్నాకరరావు మాట్లాడుతూ కెనరా బ్యాంకు డిపాజిట్లు, అడ్వాన్సులు, డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. ప్రాంతీయ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆది దంపతుల ఊంజల్ సేవ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక మాస వేడుకల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో ఆది దంపతులకు ఊంజల్ సేవను బుధవారం నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ స్టాండ్‌లో భక్తులు దీపాలను వెలిగించారు. గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామిని అలంకరించిన ఉయ్యాలలో ఉంచి పూజ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ

పాత శివాలయంలో భ్రమరాంబదేవి

✦ వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం(పాత శివాలయం), వసంత మల్లికార్జున స్వామి దేవస్థానం, విజయేశ్వరాలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా లింగార్చన, పంచ హారతులను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాత శివాలయంలో అమ్మవారిని శివ మోహిని దేవి అలంకారంలో కుంకుమార్చన సేవ చేశారు.

నిత్యాన్నదానం ప్రారంభం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : గొల్లపూడి అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాధారుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. అన్నప్రసాద పంపిణీ కేంద్రంలో స్వామి వారి చిత్రపటానికి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మకర జ్యోతి దర్శనం వరకు దీక్షాధారులకు ప్రతి రోజు అన్నప్రసాదం పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. ఇంట్లో వసతి లేని వారు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షాధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆలయ ప్రెసిడెంట్ మోహనరావు, అన్నదానం ట్రస్టు సెక్రటరీ శ్రీనివాసరావు, కేబీఎన్ కళాశాల ఏవో నారాయణరావు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మొగల్రాజపురం సెక్షన్, జ్యోతి ఇండోర్ విద్యుత్తు ఉపకేంద్రం, 11కేవీ ఆటో ఇండియా ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ రవీంద్రబాబు తెలిపారు. స్టేడియం రోడ్డు, గిరిపురం, బందరు రోడ్డు, సబ్ కలెక్టర్ కార్యాలయం ఏరియా, మాంటిస్సోరి కళాశాల రోడ్డు, ఫుడ్‌జంక్షన్, స్వగ్రూపు, అమెరికన్ హాస్పిటల్, ఆకాశవాణి, దూరదర్శన్, తిరుమల తిరుపతి దేవస్థానం, రైల్వే సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని వెల్లడించారు.

పటమట, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా స్క్యూబ్రిడ్జి ఉపకేంద్రం పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్య కుర్ర సూర్యనారాయణ వీధి, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, ఖాన్సానగర్, మోడ్రన్ హెచ్‌టీ సర్వీస్, ఎస్‌బీఐ కాంప్లెక్సీ, రాఘవనగర్, సీతారామనగర్, చెన్నుపాటి రామకోటయ్య వీధి, ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్, నేతాజీ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సతీష్ తెలిపారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయరూ..

మూడో డివిజన్ కరెన్సీనగర్ బాయన బాబూజీ రహదారిలో పైపు లీకై తాగునీరు వృథాగా పంట కాలువ డ్రెయిన్‌లోకి వెళుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో మరమ్మతులు చేసినా మళ్లీ అదేచోట లీకేజీ కావడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల శివారు ప్రాంతాలకు తాగునీరు సరిగా అందడం లేదని వారు తెలిపారు. అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధాన కాలువల్లో పేరుకున్న వ్యర్థాలను నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు.. సిబ్బంది సాయంతో బుధవారం తొలగించారు. బుడమేరు, ఏలూరు, బందరు, రైవస్ కాలువల్లో పేరుకుపోయిన చెత్త, ఫ్లోటింగ్ వ్యర్థాలను తొలగించారు. చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు మాట్లాడుతూ నగర ప్రజలకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు వీలుగా బుడమేరులోని గుర్రపుడెక్కతో పాటు, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బయోలజిస్టు కామేశ్వరరావు ఆధ్వర్యంలో దోమల నివారణకు క్రిమిసంహారక మందులు చల్లారు.

జేసీబీతో వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలన

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: నగరంలోని ఆయోధ్య నగర్, విందపేట, కొత్తపేట, కండ్రిక ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం కొనసాగిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని పరిశీలించారు. ఐవీలేటర్ నుంచి శిశువులకు, చిన్నారులకు వ్యాక్సిన్ వేసిన అనంతరం దాన్ని భద్రపరచు విధానాన్ని, గోల్డ్‌చైన్ సిస్టమ్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నారా? లేదా అనే అంశాలను పర్యవేక్షించారు. వ్యాక్సిన్ గదిలో ఉండాల్సిన వస్తువులపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు

విజేతలతో గ్రంథాలయ అధికారులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిద్ధార్థ మహిళా డిగ్రీ కళాశాలలో క్విజ్, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యకుమార్, విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి కేశవరావు, చిత్రకారుడు పావులూరి చిందబరేశ్వరరావు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారులు మల్లిక, లత పాల్గొన్నారు.

ఘనంగా పురుషుల దినోత్సవం



ఈఈ కృష్ణనాయక్‌ను సత్కరిస్తున్న లక్ష్మీనర్సులు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనర్సులు ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ విజయవాడ ఈఈ ఎన్.కృష్ణనాయక్, డీఈఈ వై.శశిభూషణ్, డీఏఓ కేవీఎస్ సుకుమార్‌ను సత్కరించారు. సంఘం నగర అధ్యక్షుడు కేవీఎస్ ఎన్ రవీంద్రకుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె.జాన్సన్, హరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాడితే అక్రమ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019లో జనవరి 21న నగరంలోని వీఎంసీ కార్యాలయం వద్ద అర్హులందరికీ టిడ్కో ఇళ్లు మంజూరు చేయాలంటూ సీపీఎం చేపట్టిన ఆందోళనకు తనతో పాటు కార్పొరేటర్ బోయి సత్యబాబు, మున్సిపల్ కార్మిక సంఘానికి చెందిన డేవిడ్‌లపై కృష్ణలంక పోలీసులు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అప్పటి నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని బుధవారం ఇదే కేసుకు సంబంధించి న్యాయస్థానానికి హాజరవగా డిసెంబర్ 2కు వాయిదా వేసినట్లు తెలిపారు. అక్రమ కేసులను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కేసులను ఎత్తివేయకపోగా మరిన్ని కేసులు నమోదు చేస్తున్నట్లు విమర్శించారు.

తవ్వి వదిలేసి.. అవస్థలు మిగిల్చి..

న్యూస్‌టుడే, కరెన్సీనగర్

పుల్లేటికట్ట నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది. ఇదిగో విస్తరణంటూ రాకపోకలు సాగించే రహదారుల కల్వర్టులను తొలగించిన అధికారులు అనంతరం మిన్నకుంటున్నారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డును డ్రెయిన్ నిర్మాణమంటూ తవ్వేసి వదిలేశారు. నెల రోజులైనా ఇంతవరకు నిర్మాణానికి అడుగు పడలేదు. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

✦ డీవీ మేనర్ నుంచి పిన్నమనేని రోడ్డు, పాలిటెక్నిక్ కళాశాల, లయోలా కళాశాల మీదుగా మురుగునీరు పారుదల చేసే పుల్లేటికట్ట గుణదలకు వచ్చేసరికి నిర్మాణానికి నోచుకోలేదు. గతంలో దీని నిర్మాణాన్ని ఎల్అండ్‌టీ కంపెనీ చేపట్టగా కొంతవరకు పనులు జరిగాయి. వైకాపా ప్రభుత్వం రాకతో గుత్తేదారును సాగనంపారు. దీంతో ఎక్కడికక్కడే నిర్మాణాలు ఆగాయి. వెటర్నరీ కాలనీ నుంచి గుణదల సెంటర్ వరకు దాదాపు కి.మీ పొడవునా నిర్మాణం జరగాల్సి ఉంది. దీనికి గుణదల సెంటర్ నుంచి ఈఎస్ఐ రోడ్డు వరకు నగరపాలక సంస్థ విస్తరణ మొదలు పెట్టింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో డ్రెయిన్ తవ్వకాలతో ఎక్కడి వాహనాలు అక్కడనే నిలిచిపోయాయి. గుణదల ఆపై ప్రాంతాల నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి దగ్గర మార్గం కావడంతో అంబులెన్సులు, ఇతర వాహనాలు ఈఎస్ఐ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. డ్రెయిన్ తవ్వకాలతో వాహనాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. పుల్లేటికట్ట డ్రెయిన్ నిర్మాణానికి సీఆర్‌డీఏ నుంచి నిధులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కానీ నిధులు రాకముందే తవ్వకాలు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఈఎస్ఐ రోడ్డులో డ్రెయిన్ నిర్మాణానికి తవ్విన ప్రాంతం

అనుమానితుల సమాచారం ఇవ్వండి

గుణదల (పటమట): నివాసాల మధ్య అనుమానిత వ్యక్తులు సంచరించినా, అద్దెకున్నా పోలీసులకు సమాచారం అందించాలని మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు. నగరంలో మావోయిస్టుల అరెస్ట్ నేపథ్యంలో బుధవారం మాచవరం స్టేషన్ పరిధిలోని గుణదల కొండపై వైఎస్సార్ కాలనీలో సీఐ ప్రకాష్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. వైఎస్సార్ కాలనీలో తిరుగుతూ స్థానికులతో మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే ఘటనలను నివారించడానికి విజిబుల్ పోలీసింగ్‌తో పాటు ఇంటింటా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కాలనీలో ఎవరికైనా ఇళ్లు అద్దెకు ఇచ్చే క్రమంలో వారి వ్యక్తిగత సమాచారం, శాశ్వత చిరునామా, ఆధార్ కార్డు తదితర వివరాలను సేకరించాలని సూచించారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ ప్రకాష్

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని శాప్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి సూచించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఆక్వాటిక్ స్టేడియం వేదికగా ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగిన 25వ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన రాష్ట్ర పారా స్విమ్మర్లను బుధవారం నగరంలోని శాప్ కార్యాలయంలో ఆమె అభినందించారు. రాష్ట్రం నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభతో 27 పతకాలు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. వీటిలో 13 పసిడి, 10 రజత, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారా క్రీడాకారులకు పలు అవకాశాలు కల్పిస్తోందన్నారు. రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వి.రామస్వామి పతకాలు సాధించిన స్విమ్మర్లను శాప్ ఎండీ భరణికి పరిచయం చేశారు. సంఘం సభ్యులు కె.దయానంద్, డాక్టర్ శీతల్ మాదాన్, లక్ష్మి, శిరీషలత, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మర్లను అభినందిస్తున్న శాప్ ఎండీ ఎస్.భరణి, చిత్రంలో వి.రామస్వామి, తదితరులు

'రాజ్యాంగాన్ని ధిక్కరించి పాలన చేయడం సరికాదు'

గుణదల (పటమట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. బుధవారం గుణదలలోని జిల్లా వైకాపా కార్యాలయంలో వైకాపా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పరకామణి కేసులో సతీష్‌పై ప్రభుత్వం ఒత్తిడి తేవడం వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. తమ పార్టీ నేత వెంకటరెడ్డిని అన్యాయంగా అరెస్ట్ చేస్తే న్యాయమూర్తి పోలీసులకు చీవాట్లు పెట్టి బెయిల్ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని రాజ్యాంగాన్ని ధిక్కరించి పాలన సాగించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, అన్ని రోజులు ఒకేలా ఉండవన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు బాధ్యతగా లేవన్నారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, చిత్రంలో అవినాష్, శ్రీనివాస్, అరుణ్ కుమార్

మహారాజశ్రీ 6వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, విజయవాడ
ఐ.ఎ.నెం: 302/2025 ఇన్ ఓ.ఎస్.నెం: 116/2025
Between:
సింది చంద్రకళ, భర్త ప్రసన్నరాజు, 36 సంగలు, డోర్.నెం: 41-30/4-24, బాపనయ్యనగర్, కృష్ణదేవరాయ స్కూల్ రోడ్, రాణిగారి తోట, కృష్ణలంక, విజయవాడ (అర్బన్), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 520013. ...పిటీషనర్/వాది
And
లక్ష్మీ దుర్గ శివ ఆంజనేయులు ...రెస్పాండెంట్/ప్రతివాది
To:-
రెస్పాండెంట్ / ప్రతివాది:- లక్ష్మీ దుర్గ శివ ఆంజనేయులు, తండ్రి లక్ష్మీ శివకేశవులు, వయస్సు 30 సం.లు, డో.నెం. 41-28/3-47, ఆంధోని స్ట్రీట్, చలసాని నగర్, రాణిగారితోట, కృష్ణలంక, విజయవాడ (అర్బన్), కృష్ణా జిల్లా/ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్-520013.
పై నెంబరు కేసులో రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై తెలిపిన శ్రీ గౌరవనీయులైన కోర్టు వారు ది. 24-11-2025వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున వాయిదా రోజున అనగా ది.24-11-2025వ తేదీన ఉదయం గం.10.30 ని.లకు మీరు గానీ మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా వున్న యెడల శ్రీ కోర్టు వారికి తెలుపుకొనగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు పై నెంబరు కేసును మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది : 24-11-2025
ఇట్లు: కోంపల్లి అరుణ్ కుమార్, అడ్వకేట్
విజయవాడ. సెల్.నెం: 98499 73388

పుస్తకంపై కవి సమ్మేళనం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : విజ్ఞానం అందించే గ్రంథాలు.. సమాజాన్ని సరైన దారిలో పెడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో పుస్తకం అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఆ సంఘం కోశాధికారి నానా అధ్యక్షత వహించారు. కవయిత్రి పోపూరి పుష్పాదేవి కవి సమ్మేళనం నిర్వహించారు. చిత్రాడ కిషోర్ కుమార్, పి.కృష్ణ భార్గవి, చందు నాగేశ్వరరావు, ఆకునూరి నారాయణ, ఎస్.ఎం.సుభాని, తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు పలు కవితలు వినిపించారు. సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ పర్యవేక్షించారు.

మాట్లాడుతున్న నానా. పక్కన పుష్పాదేవి

కార్యక్రమంలో కళాకారులు

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆర్‌అండ్‌బీ స్వర తరంగిణి ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయకుడు పి.శివశర్మ మాట్లాడుతూ.. కళాకారులు అందరూ ఒక వేదికపై కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి రోజూ రాగంపై సాధన చేస్తుంటే.. పాటలను మధురంగా ఆలపించవచ్చని గాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. గాయకులు నాయుడు, పి.లక్ష్మీ తులసి, ఎ.ప్రత్యూష, పి.కిరణ్మయి తదితరులు సినీ గేయాలు ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కె.డేవిడ్‌రాజు, కె.గంగాధర మురళి, కె.వి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పేర్కొన్నారు. బుధవారం చల్లపల్లి బంగ్లా కూడలిలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా ఆమె చేపట్టిన అనేక పథకాలు దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టాయని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షర్మిల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్‌వలీ, నరహరిశెట్టి నరసింహారావు, మీసాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న షర్మిల

మహారాజశ్రీ 6వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, విజయవాడ
ఓ.ఎస్.నెం. 116/2025
Between:
సింది చంద్రకళ, భర్త ప్రసన్నరాజు, వయస్సు 36 సంగలు, డోర్.నెం: 41-30/4-24, బాపనయ్యనగర్, కృష్ణదేవరాయ స్కూల్ రోడ్, రాణిగారి తోట, కృష్ణలంక, విజయవాడ (అర్బన్), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్- 520013. ...వాది
And
లక్ష్మీ దుర్గ శివ ఆంజనేయులు ...ప్రతివాది
To :-
డిఫెండెంట్/ప్రతివాది:- లక్ష్మీ దుర్గ శివ ఆంజనేయులు, తండ్రి లక్ష్మీ శివకేశవులు, వయస్సు 30 సం.లు, డో.నెం. 41-28/3-47, ఆంధోని స్ట్రీట్, చలసాని నగర్, రాణిగారితోట, కృష్ణలంక, విజయవాడ, (అర్బన్), కృష్ణా జిల్లా / ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్-520013.
పై నెంబరు కేసులో డిఫెండెంట్ / ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై తెలిపిన శ్రీ గౌరవనీయులైన కోర్టు వారు ది.24-11-2025వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున వాయిదా రోజున అనగా ది. 24-11-2025వ తేదీన ఉదయం గం. 10.30ని.లకు మీరు గానీ మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా వున్న యెడల శ్రీ కోర్టు వారికి తెలుపుకొనగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు పై నెంబరు కేసును మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది : 24-11-2025
ఇట్లు: కోంపల్లి అరుణ్ కుమార్, అడ్వకేట్
విజయవాడ. సెల్ నెం: 98499 73388

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీనివాసులు(కంచికచర్ల మండల అధ్యక్షుడు)

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కంచికచర్ల, వీరులపాడు మండలాల నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఏపీటీఎఫ్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మరియదాసు అనిత, జిల్లా అధ్యక్షులు వేములపల్లి రాధికల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో కంచికచర్ల మండల శాఖ అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వి.ప్రభు కిశోర్, వీరులపాడు మండల శాఖ అధ్యక్షుడిగా బాణావత్ రవి, ప్రధాన కార్యదర్శిగా ఆళ్లూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పీ-4తో పేదల కుటుంబాల్లో వెలుగు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవచ్చని తహసీల్దార్ పి. రవికుమార్, ఎంపీడీవో ఎస్. రూపవతి అన్నారు. పీ-4 పథకంలో భాగంగా మార్గదర్శులు మేడికొండూరు ఫౌండేషన్, మేడికొండూరు హనుమంతరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సహకారంతో ఆరు బంగారు కుటుంబాల మహిళలకు కుట్టుమిషన్లు, విద్యార్థులకు అవసరమైన వస్తువులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మేడికొండూరు ఫౌండేషన్ సభ్యులు కానూరి వెంకట్, భారతి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

✦ పెద్దవరం గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ కార్యదర్శి జనార్దనకుమార్ స్పందించారు. దీపాలకు మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

స్పందనకు వందనం

వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చవాన్

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ గ్రామీణ సీఐ డి.చవాన్ అన్నారు. ఆ మేరకు కంచికచర్ల ప్రధాన రహదారిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో వినియోగదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరైనా బెదిరిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. క్రెడిట్ కార్డు, లోన్ యాప్‌ల పేరుతో జరిగే మోసాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై పి.విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాలు వేదికగా జరుగుతున్న పెట్టుబడి మోసాలు, సైబర్ నేరాలు అరికట్టడమే లక్ష్యంగా రూపొందించిన ప్రశ్నావళిపై బుధవారం సీఐ వెంకటేశ్వర్లు స్థానిక యూనియన్ బ్యాంకులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. నిపుణుల సలహాలను తీసుకోవడం, భౌతికమైన సంస్థలు, వ్యక్తులతోనే లావాదేవీలు పెట్టుకోవడం, అపరిచితుల మాటలను నమ్మక పోవడం ద్వారా సైబర్ నేరాలను నిరోధించవచ్చన్నారు. ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సుబాబుల ధరలో కోత.. ఆందోళనలో రైతులు!

పల్లగిరి వద్ద లారీలో కర్ర లోడ్ చేస్తున్న కార్మికులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పేపరు పరిశ్రమలు సుబాబుల్ కర్ర ధరలో కోత పెడుతున్నాయి. రెండు నెలల కిందటి వరకు టన్ను ధర రూ.6500 కొనుగోలు చేశారు. లారీల కిరాయిలు పెరిగాయని కొద్దిరోజులుగా టన్నుకు రూ.300 తగ్గించారని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 40 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగుచేస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉంది.

మూడేళ్లలో చేతికొస్తుంది

గతేడాది మిర్చి ధరలు పతనమవడంతో ఈ ఏడాది సుబాబుల్ సాగు చేపట్టారు. ఒకసారి విత్తనం వేస్తే మూడేళ్లలో కర్ర చేతికి వస్తుంది. ఎకరానికి 30 టన్నుల దిగుబడి వస్తుంది. గతంలో గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోయారు. టన్ను రూ.2 వేలకు కూడా కొనుగోలు చేసేవారు లేక తోటలను తొలగించారు. ఏడాది నుంచి మరలా సుబాబుల్ కర్రకు గిరాకీ ఏర్పడి ధర పెరిగింది. ఈ ప్రాంతం నుంచి ఐటీసీ, జేకే, ఏపీపీఎం పేపరు పరిశ్రమ వారు కర్ర కొనుగోలు చేస్తుంటాయి. ట్రేడర్ల నుంచి కొద్దిరోజులుగా కంపెనీలు టన్ను రూ.5900, మరి కొన్ని రూ.6100 వంతున కొనుగోలు చేస్తున్నాయి. ధర తగ్గడంతో రైతులు ఎకరానికి రూ.9 వేలు నష్టపోతున్నారు.

పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేస్తే..

ప్రస్తుతం ట్రేడర్లకు లారీల కిరాయి పెరిగింది. ధాన్యం, పత్తి, మొక్కజొన్న మార్కెట్లో విక్రయానికి రావడంతో లారీలకు డిమాండ్ ఏర్పడింది. వారు కిరాయి పెంచడంతో ఆ మేరకు టన్నుకు రూ.300 ధర తగ్గించారని స్థానిక దళారులు పేర్కొంటున్నారు. ఏపీసీలు ద్వారా సుబాబుల కర్ర కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర స్థిరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. కంపెనీలు ధర తగ్గించిన ట్రేడర్లు, దళారులకు ఇబ్బంది లేదు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఏపీఐఐసికి కేటాయించిన స్థలాల్లో పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తే సుబాబుల్ రైతులకు మేలు జరుగుతుంది. కర్రకు గిట్టుబాటు ధర పెరుగుతుంది. దశాబ్దకాలంగా ఎన్నికల్లో పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెబుతున్న నేతలు ఈ హామీని పట్టించుకోవడం లేదని కర్షకులు వాపోతున్నారు.

సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ప్రారంభం

భగవాన్ సన్నిధిలో వెంకన్నగురుస్వామి, డాక్టర్ పరిమళ, రంగనాథ్, వాసుదేవరావు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రైతుపేట భగవాన్ సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనలు నిర్వహించారు. రామాలయ ఛైర్మన్ మహంకాళి వెంకన్న గురుస్వామి, పద్మజ దంపతులు, డాక్టర్ మందడపు రంగనాథ్‌ప్రసాద్, పరిమళ దంపతులు ఓంకారం రూపంలో జ్యోతులు వెలిగించారు. స్వామివారి పాదుకలకు అభిషేకం చేశారు. మాతృశ్రీ ఈశ్వరమ్మ చిత్రపటానికి మహిళలు పల్లకీసేవ నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వేదపఠనం, భజన చేశారు. రాత్రికి మాతృవందనం కార్యక్రమం నిర్వహించారు. పలువురు మహిళలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, భగవాన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ యు.వాసుదేవరావు, సభ్యులు రవీంద్ర రాజు, సంగమేశ్వరరావు, సాయిరామ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల శాంతి కల్యాణం

జగ్గయ్యపేట మహాలక్ష్మీ వెండి దేవాలయంలో దీపోత్సవం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : కార్తిక మాస శివరాత్రిని పురస్కరించుకొని పలు ఆలయాల్లో పూజా క్రతువులు వైభవంగా జరిగాయి. నాగలక్ష్మీ దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణం, అర్ధనారీశ్వర పూజలు, కళాకారులతో శివకల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. మహాలక్ష్మీ వెండి దేవాలయం ఆధ్వర్యంలో జరిగిన కోటి దీపోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని స్వయంగా దీపాలు వెలిగించారు.

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా నందిగామ నెహ్రూనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించి స్వామివారికి తలంబ్రాలు, నూతనవస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాలువ పూడికతీత పనుల ప్రారంభం

కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే తాతయ్య, పక్కన నాయకులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : మండలంలోని మల్కాపురం నుంచి ఇందుగుపల్లి వెళ్లే మేజర్ కాల్వలో తూటు తొలగింపు, పూడికతీత పనులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య బుధవారం ప్రారంభించారు. నీటి సంఘాల అధ్యక్షుడు మేడూరి రమేష్, డీసీ కెనాల్ ఛైర్మన్ ఏలూరి గోపాలరావు, నాయకులు మన్నె నారాయణరావు, కొఠారి రాంబాబు, చావా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట పట్టణం 14వ వార్డు విలియంపేటలో రూ.30 లక్షలు సీఆర్‌డీఏ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పరిశీలించారు. కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, నాయకులు ఏలూరి గోపాలరావు, మారేపల్లి శౌరి, మల్లెల కొండ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో గోసంరక్షణకు విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : స్థానిక శ్రీతిరుపతమ్మ ఆలయ గోసంరక్షణకు ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం తూటికుంట గ్రామానికి చెందిన పాపినేని అప్పారావు, మీనా దంపతులు రూ.10,021లు విరాళంగా అందించారు. ఆలయాన్ని బుధవారం సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికపూర్‌కు నగదు ఇచ్చారు. దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇరువైపులా కంపచెట్లు.. వాహనదారులకు పాట్లు!

పల్లగిరికొండ వద్ద ఇలా..

నందిగామ-జొన్నలగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. మునేటి వంతెన నుంచి దారి పొడవునా కంప చెట్లు పెరిగి రహదారి అంచులు కనిపించడం లేదు. నందిగామ నుంచి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిరకు ఇటుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కంపచెట్లు ద్విచక్ర వాహన చోదకులకు తగులుతున్నాయి. భారీ వాహనాలు ఎదురొస్తే తప్పుకొనే వీలుండటం లేదు. సమస్య పరిష్కరించాలని పల్లగిరి, మాగల్లు, కొండూరు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

అధ్వానంగా డొంకలు.. రాకపోకలకు తిప్పలు

చింతలపాడులో పొలాలకు వెళ్లే డొంక రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు మరింత దారుణంగా తయారయ్యాయి. కర్షకులు పొలాలకు వెళ్లడానికి, ఎరువులు, కూలీలను ట్రాక్టర్లలో, ఆటోల్లో తీసుకెళ్లటానికి, పండించిన పంటను ఇళ్లకు తెచ్చుకోవడానికి, పశువులను మేతకు తోలుకెళ్లడానికి ఇవే ప్రధాన మార్గాలుగా ఉపయోగించుకుంటారు. వర్షం కురిసిన సమయాల్లో నడవటానికి కూడా వీలు కావడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి డొంక రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చందర్లపాడు

శిలాఫలకంతో సరి.. నిర్మాణం ఊసేది!

ప్రమాదకరంగా తోళ్ల వాగు దాటుతున్న వాహనదారుడు

గొట్టుముక్కల నుంచి దొనబండ వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారింది. అటుగా తోళ్ల, ఏనుగు గడ్డ వాగులు ప్రవహిస్తుంటాయి. వర్షాకాలంలో వాటిని దాటి సుమారు 2వేల ఎకరాలకు చెందిన రైతులు వ్యవసాయ పనులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల గొట్టుముక్కల సమీపంలోని అటవీ ప్రాంతంలో మద్దులమ్మ తల్లి ఆలయం, అక్కడి జలపాతాల సందర్శనకు భక్తులు, ప్రకృతి ప్రేమికులు భారీగా తరలివస్తున్నారు. వాగులు దాటే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రెండింటిపై వంతెనలు నిర్మించేందుకు 2019లో రూ.192.00 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు పట్టాలెక్కలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి వారధుల నిర్మాణాలపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గొట్టుముక్కల (కంచికచర్ల)

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు ఉపకేంద్రంలో ఫీడర్-1లో లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీరామలింగేశ్వరనగర్, రైతుపేట, ముక్కపాటినగర్, కృష్ణబలిజనగర్‌తో పాటు మండలంలోని అంబారుపేట, చందాపురం, ఐతవరం గ్రామాల్లో సరఫరా ఉండదని ఏడీఈ స్టాలిన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

వెల్లంకి (వీరులపాడు), న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారని విజయ వాహిని ఛారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు ప్రోగ్రామ్ అసోసియేట్ భాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా బుధవారం వీరులపాడు మండల పరిధి వెల్లంకి గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లారెడ్డి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కంచికచర్ల: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పింఛనర్ల సేవా భవన్‌లో పేద వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానె రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఏఎంసీ ఛైర్మన్ కోగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : మండల పరిధి సుబ్బాయిగూడెంలో జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండెపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీ భవన్నారాయణ దేవాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 613 మందికి వైద్య సేవలందించామని ఫౌండేషన్ సమన్వయకర్త కట్టా వెంకట నరసింహారావు తెలిపారు. అనంతరం తహసీల్దారు శాంతలక్ష్మి, ఫౌండేషన్ కోఆర్డినేటర్ చింతల వెంకట సీతారామయ్య ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు వెల్ది శ్రీనివాస్, జిల్లేపల్లి సుధీర్ బాబు, ప్రతినిధులు ప్రభాకరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలని వినతి

నందిగామ, న్యూస్‌టుడే: అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్‌ను నందిగామ ఏఎంసీ వైస్ ఛైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్ కోరారు. బుధవారం నందిగామ వచ్చిన ఎంపీని ఆయన కలిసి సమస్య వివరించారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, ఏఎంసీ ఛైర్మన్ కోగంటి బాబు, మన్నే కళావతి, వాసిరెడ్డి ప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, కొండ్రగుంట శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుండెపోటు రావడంతో వ్యక్తి మరణించిన సంఘటన మండల పరిధి జుజ్జూరులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఇబ్రహీంపట్నం మండలం దాములూరు గ్రామానికి చెందిన వద్దేబోయిన వెంకటేశ్వరరావు(49).. అల్లూరు నుంచి కంచికచర్ల వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా..ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో జుజ్జూరు గ్రామంలో రోడ్డు పక్కన వాహనం ఆపి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా.. వారు వచ్చి పరీక్షించి.. అప్పటికే వెంకటేశ్వరరావు మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయికి నివాళి

నందిగామ: ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

జగ్గయ్యపేట గ్రంథాలయంలో..

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయంలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ సిల్వర్ స్టార్ కేసీజీఎఫ్ అధ్యక్షురాలు సంధ్యారాణి, పులిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, విశ్రాంత హెచ్ఎం రాజగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి వి.అమరేశ్వరి పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బాటలు వేశారని కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మందా వజ్రయ్య అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కంచికచర్ల ప్రధాన రహదారిలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : బ్రిటీష్ పాలకులను ఎదిరించి పోరాడిన వీర మహిళ ఝాన్సీ లక్ష్మీబాయి అని ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబురావు కొనియాడారు. బుధవారం పెనుగంచిప్రోలులోని శ్రీస్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి హెచ్ఎం పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాయామోపాధ్యాయుడు వేగినేటి వెంకటరమణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : మండలంలోని గండ్రాయి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నేలవల్లి రమేష్, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, పద్మావతమ్మ, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పట్టణంలోని గ్రేడ్- 1 గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు రంగవల్లులు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్, వడ్డెపల్లి శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సామూహిక వనసమారాధన

మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి

గొట్టుముక్కల (కంచికచర్ల), న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో గొట్టుముక్కల శివారు మద్దులమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం సామూహిక హిందూ వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విశ్వహిందూ పరిషత్తు ఆంధ్రప్రదేశ్ ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ, సామాజిక విలువలు, పర్యావరణ హిత జీవనం, పౌరుల కర్తవ్యం, మంచి నడవడికను.. చిన్నతనం నుంచే అలవరచాలని సూచించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్ర స్వరూపదాస్ స్వామిజీ, కృష్ణమూర్తి స్వామిజీ, సుగుణానంద గాయత్రి స్వామిజీలు హిందూ ధర్మ జీవన విధానం తదితర అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. అనంతరం భారీగా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల వీహెచ్‌పీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

'అన్నదాన'ప్రభువే శరణమయ్యప్ప!

అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్పదీక్షాధారులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ సాయిఅయ్యప్ప ఆలయంలో నిత్య పూజలతో పాటు కార్తిక మాసంలో దాతల విరాళాలతో అయ్యప్పదీక్షాధారులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. నందిగామ చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది అయ్యప్ప, శివ, తిరుపతమ్మ, భవానీదీక్షాధారులు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. మధ్యాహ్నం వేళ వారు సద్ది(అన్నం) సమకూర్చుకోలేక ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో వారి కోసం ఆలయ కమిటీ సభ్యులు పదేళ్ల కిందట అన్నదానం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ క్రతువు యజ్ఞంలా కొనసాగుతోంది. నిత్యం 350 మందికి 45 రోజుల పాటు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది నవంబరు ఒకటి నుంచి వచ్చే ఏడాది జనవరి 14వరకు కొనసాగనుంది. అన్నప్రసాదం తయారీకి ప్రత్యేకించి గదులు ఏర్పాటు చేశారు. పడిపూజ చేసుకునే స్వాములకు రాత్రివేళ భిక్ష సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. 'అన్నదానానికి దాతల సహకారం మరువలేనిది. ఈ కార్యక్రమ నిర్వహణ ఎంతో సంతృప్తినిస్తోంది. కమిటీ సభ్యులు కూడా సహకరిస్తున్నారు'అని ఆలయ కమిటీ ఆధ్యక్షుడు శాఖమూరు వంశీధర్ తెలిపారు.

అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాట్లాడుతున్న ఎంపీపీ మార్కపూడి గాంధీ, పక్కన జడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, ఎంపీడీవో శ్రీను

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : మండల పరిషత్ సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ మార్కపూడి గాంధీ, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. దీనికి వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌తో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ ఎంపీడీవో శ్రీనును కోరారు. అధికారులకు షోకాజు నోటీసు జారీ చేయాలని తీర్మానం చేశారు. గోకులం షెడ్లు అధికార పార్టీకి అనుకూల రైతులకే ఇస్తున్నారని వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఎంపీటీసీ సభ్యులు వెల్ది ప్రభాకర్, మాతంగి శాంతకుమారి ఆరోపించారు. అర్హులకు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల నాగమణి, ఎంఈవో రవీంద్ర, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతుల జీవనోపాధికి ఊతం

గరికపాడు కేవీకేలో ప్రసంగిస్తున్న రవికిశోర్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమాన్ యోజన కార్యక్రమం కింద రైతుల జీవనోపాధికి ఊతమిచ్చే విధంగా జరుగుతున్న పలు అంశాలపై బుధవారం గరికపాడు కేవీల్ రావు కృషి విజ్ఞాన కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ రవికిశోర్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో పాటు రైతులకు వ్యవసాయంలో ఉపయోగపడే అంశాలను వివరించారు. వ్యవసాయ, అనుబంధ వ్యవసాయ అంశాలపై శాస్త్రవేత్తలు ప్రసంగించారు. రైతులు, బాపట్ల వ్యవసాయ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

శనగ సాగుపై ఆశలు

విత్తనాలు సిద్ధం చేస్తున్న రైతులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఈ ఏడాది అధిక వర్షాలతో మెట్ట రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీజన్ ప్రారంభం నుంచి కురుస్తున్న అధిక వర్షాలకు పత్తి, మొక్కజొన్న, పెసర దిగుబడులు లేక అప్పులపాలయ్యారు. అనేక వ్యయప్రయాసల కోర్చి పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోలేక, పెట్టుబడులు రాక బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రెండో పంటగా సాగు చేస్తున్న పుల్ల శనగ పంట పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో ఈ ఏడాది సుమారు 14 వేల ఎకరాల్లో ఈ సాగు చేపట్టారు. గత ఏడాది పండించిన శనగలను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచి వాటిని విత్తనాలుగా సిద్ధం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఈ రెండు మండలాల్లో సాగు పనులు చేపట్టారు.

బాలల భిక్షాటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో భిక్షాటన కోసం బాలలను ఉపయోగించే వ్యవస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని జగ్గయ్యపేటకు చెందిన సంకా శ్రీనివాసరావు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి ఫిర్యాదు చేశారు. భిక్షాటన కోసం బాలలను అపహరించడమే కాక వారికి మత్తు పదార్థాలు అలవాటు చేయడం ద్వారా వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పత్తి కొనుగోలులో తేమ శాతం పెంచాలి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం నిబంధనను 12 నుంచి 18కి పెంచాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం తమ శ్రేణులతో కలిసి వెళ్లి తిరుమలగిరిలోని జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి అమ్ముకునేందుకు వచ్చిన రైతులతో మాట్లాడిన ఆయన మొంథ తుపాను కారణంగా నష్టపోయిన అన్నదాతలకు కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు మరింత సరళం చేయాలన్నారు. మండవ శ్రీనివాస్ గౌడ్, కనగాల రమేష్, బెడదం సత్యనారాయణ, శామ్యూల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, నందిగామ

SOP 06/2025

Between

1. కోట వెంకటేశ్వరరావు, 2. కోట నాగేశ్వరరావు
3. కోట మోహనరావు, 4. లింగాల మార్తమ్మ
5. ఉప్పల్లి రాజేశ్వరి ...పిటీషనర్స్

and

NIL ... రెస్పాండెంట్స్

పై నెంబరు దావాలో పిటిషనర్స్ పైన తెలిపిన కోర్టు నందు SOP 06/2025 దావాను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనర్స్ యొక్క సోదరి కోట ప్రమీల, తండ్రి వీరయ్య చట్టన్నవరం గ్రామము వీరులపాడు మండలం NTR జిల్లా అను వారు ది 01-05-2024వ తేదీన రోడ్ యాక్సిడెంట్ వలన మరణించినందున సదరు కోట ప్రమీల నందిగామ గవర్నమెంట్ ఆసుపత్రి నందు ఆరోగ్యమిత్రగా పనిచేయుచున్నందున గవర్నమెంట్ వారు ఇచ్చే ఎక్స్‌గ్రేషియోను తీసుకొనుటకు, సదరు కోట ప్రమీలకు వివాహము కానందున తల్లిదండ్రులు ముందే మరణించినందున వారసులుగా పిటిషనర్సును డిక్లేర్ చేయమని కోరగా, సదరు దావాలో ప్రతివాదులు లేనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు SOP 06/2025లో వారసులుగా చేరవలసిన వారు ఇంకా మిగిలి ఉన్నచో ది. 25-11-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ముందు స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలియపరుచుకొనవలెను. లేనియెడల వారసులుగా పిటిషనర్స్‌ను డిక్లేర్ చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు: P.ప్రకాశరావు, న్యాయవాది, నందిగామ

NTR జిల్లా – 521 185, Cell: 99519 56739

నందిగామ, తేదీ: 20/11/2025

విజయవాడ పశ్చిమ

బీపీఎస్‌కు 6 దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అక్రమ కట్టడాలు, అనుమతిలేని నిర్మాణాల క్రమబద్ధీకరణ, పీనలైజేషనకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీపీఎస్ కింద బుధవారం నాటికి 6 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. ఈ నెల 12 నుంచి బీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెగా.. సాంకేతిక సమస్యల వల్ల ప్రారంభంలో పోర్టల్ సక్రమంగా పనిచేయలేదు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో పనిచేస్తుండటంతో అక్రమ నిర్మాణదారులు ఒక్కొక్కరు దరఖాస్తులు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు బీపీఎస్ దరఖాస్తుల ప్రాథమిక రుసుము కింద రూ.60 వేలు ఆదాయం సమకూరింది.

కదిలారు.. వీధి దీపాలు వెలిగించారు

భీమనవారిపేట, నాగమ్మ సత్రం ఎదురు కొండ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన 'ఈనాడు' విజయవాడ పశ్చిమ క్లస్టర్ పేజీలో 'వీధి దీపాలు వెలగక అవస్థలు' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

✦ విద్యాధరపురం చెరువు సెంటర్ ప్రాంతం భవానీ గ్యాస్ కంపెనీ మార్గంలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై బుధవారం వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులను పంపించి చెత్తను సేకరించారు. ✦ నాలుగు స్తంభాల సెంటర్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు సిబ్బందితో వాటిని పట్టించి సమస్య పరిష్కరించారు.

? చిట్టినగర్ కేఎల్‌రావు పార్క్ సమీపంలో రోడ్డుపై రాత్రి వేళల్లో యువకులు కూర్చొని మద్యం తాగుతున్నారు. - రమణ బాబు ✔ పరిశీలించి నిఘా ఏర్పాటు చేస్తాం. - చిట్టినగర్, సీఐ, 2వ పట్టణ పోలీసు స్టేషన్

? భవానీపురం ఐరన్‌యార్డు ప్రధాన గేటు సమీపంలో రాత్రి పూట పలువురు లారీ డ్రైవర్లు బహిరంగ మద్యపానం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. - వెంకటేష్, భవానీపురం ✔ తగిన చర్యలు తీసుకుంటాం. - ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం పోలీసు స్టేషన్

? భవానీపురం అన్న క్యాంటీన్ సమీపంలోని పక్క కాలువలో పూడిక తీయక దుర్వాసన వస్తోంది. - పూజిత, స్థానికురాలు ✔ కార్మికులను పంపించి కాలువల్లో పూడిక తీయిస్తాం. - బ్రాహ్మయ్య, స్థానిక శానిటరీ అధికారి - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

'రాజ్యాంగాన్ని ధిక్కరించి పాలన చేయడం సరికాదు'

గుణదల(పటమట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. బుధవారం గుణదలలోని జిల్లా వైకాపా కార్యాలయంలో దేవినేని అవినాష్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పరకామణి కేసులో సిట్ ఏర్పాటు ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు.

హామీ ఇచ్చారు.. అమలు మరిచారు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

విజయవాడ పాత రాజరాజేశ్వరీపేట ఏర్పడి 40 ఏళ్లు అవుతుంది. ఈ ప్రాంతవాసులకు ఇప్పటి వరకు బస్సు మార్గం లేదు. రోజులు గడిచే కొద్దీ జనాభా పెరుగుతున్నారు తప్ప మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. తెదేపా హయాంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు కానీ బస్సు సౌకర్యం ఏర్పాటు అలానే ఉంది. స్థానికుల డిమాండ్‌తో వారం పాటు ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును నడిపి అనంతరం పట్టించుకోలేదు. ఈ ప్రాంతానికి పాతబస్తీ మీదుగా చిట్టినగర్ నుంచి రావాలి. ఎర్రకట్ట పైనుంచి ర్యాంపు మార్గం కిందకు దిగాలి. ఇక్కడి రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తే ఆగాల్సిందే. దీంతో బస్సు మలుపు తిరిగేందుకు ఇబ్బంది ఎదురవుతుంది. అధికారులు స్పందించి రహదారిని వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త రాజరాజేశ్వరీపేటకు వచ్చే బస్సులను పాత రాజరాజేశ్వరీపేట మీదుగా సెంటర్ వరకు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పాత రాజరాజేశ్వరీపేట ర్యాంపు మార్గం

అధికారంలోకి వస్తే..

2019 ఎన్నికల సమయంలో వైకాపా అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సు సర్వీసును పాత రాజరాజేశ్వరీపేటకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. కుదరని పక్షంలో అధికారంలోకి వచ్చాక మినీ బస్సులను ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఇదే ప్రచారాన్ని కార్పొరేషన్ ఎన్నికల వరకు కొనసాగించారు. ఏళ్లు గడిచిపోయినా నేటికీ బస్సు సర్వీసు లేదు.

ఎక్కువ ఛార్జీలు వసూలు

ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే కొత్త రాజరాజేశ్వరీపేట వరకు ఆటోకు వెళ్లాల్సి వస్తోందని, లేదంటే ఎర్రకట్ట పై నుంచి చిట్టినగర్ లేదా మ్యాంగో మార్కెట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఎటు చూసినా నాలుగు నుంచి ఏడు కి.మీ. ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. ఇదే అదనుగా ఆటో చోదకులు ఎక్కువగా ఛార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని, స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవ చూపాలని పేటవాసులు కోరుతున్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజలు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 1985 జనవరి 1 తర్వాత 2025 ఆగస్టు 31వ తేదీకి ముందు నగరంలో నిర్మించిన అక్రమ, అనుమతిలేని భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉన్నందున, అర్హులైన భవన యజమానులు 2026 మార్చి 11లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భవన యజమానులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ www.bps.ap.gov.in ద్వారా అర్హత కలిగిన లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ) ద్వారా అవసరమైన అన్ని పత్రాలను దరఖాస్తుతో జోడించి సమర్పించాలని ఆయన తెలిపారు. 1997 డిసెంబరు 31కి ముందు నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు పీనలైజేషన్ రుసుములో 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. అందుకు సంబంధిత భవన యజమానులు గడువులోపు బీపీఎస్ దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో ఎన్‌వీ.రావు, మల్లేశ్వరి

ఉపన్యాసంతో ఆకట్టుకుని.. బహుమతులు సాధించి

చిట్టినగర్, న్యూస్‌టుడే : కేఎల్‌రావు నగర్ సిండికేట్ బ్యాంకు కాలనీలోని రాజేష్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో వై.హాసిత్రి(10వ తరగతి), ఆర్.సిద్ధిసాయి శ్రీనివాస్(9వ తరగతి), జె.ప్రశాంత్(9వ తరగతి) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ మేరకు విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎన్‌వీ.రావు, ఉపాధ్యాయురాలు మల్లేశ్వరి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

జగన్మాత సేవలో విజయవాడ ఎంపీ దంపతులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్(చిన్ని) దంపతులు బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. పాలక మండలి సభ్యుడు వెలగపూడి శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శివనాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

కనుల పండువగా ఆది దంపతుల ఊంజల్ సేవ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : కార్తిక మాస వేడుకల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో ఆది దంపతులకు ఊంజల్ సేవను బుధవారం నిర్వహించారు. సుందరంగా అలంకరించిన పుష్ప దీపాలంకృత స్వింగ్‌లో ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి వెలిగించారు. గంగా, పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి అలంకరణ దిన ఉయ్యాలలో ఉంచి పూజ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ

శివమోహిని అలంకారంలో భ్రమరాంబాదేవి

✦ వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం(పాత శివాలయం), వసంత మల్లికార్జున స్వామి దేవస్థానం, విరూపాక్షేశ్వరాలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా లింగార్చన, పంచహారతులను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాత శివాలయంలో అమ్మవారిని శివమోహినీ దేవి అలంకారంలో కుంకుమార్చన సేవ చేశారు.

దేవాలయంలో అన్నదానం ప్రారంభం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : గొల్లపూడి అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాధారుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్రిపాటి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. అన్నప్రసాద పంపిణీ కేంద్రంలో స్వామి వారి చిత్రపటానికి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మకర జ్యోతి దర్శనం వరకు దీక్షాధారులకు ప్రతి రోజు అన్నప్రసాదం పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. ఇంట్లో వసతి లేని వారు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షాధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆలయ ప్రెసిడెంట్ గెల్లి మోహనరావు, అన్నదానం ట్రస్టు సెక్రటరీ తూనుగుంట్ల శ్రీనివాసరావు, కేబీఎన్ కళాశాల ఏవో నారాయణరావు పాల్గొన్నారు.

పూజ చేస్తున్న శ్రీధర్, మోహనరావు, శ్రీనివాసరావు

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలన

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే : నగరంలోని అయోధ్య నగర్, వించిపేట, కొత్తపేట, కండ్రిక ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం కొనసాగిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని పరిశీలించారు. ఐఎల్ఆర్ నుంచి శిశువులకు, చిన్నారులకు వ్యాక్సిన్ వేసిన అనంతరం దాన్ని భద్రపరచు విధానాన్ని, గోల్డ్‌చైన్ సిస్టమ్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నారా? లేదా అనే అంశాలను పర్యవేక్షించారు. వ్యాక్సిన్ గదిలో ఉండాల్సిన వస్తువులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న డా.ఎం.సుహాసిని

నిర్ణీత సమయంలో నిర్మాణం పూర్తి చేయాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ప్రజలు ఇబ్బందులు పడకుండా నిర్ణీత సమయంలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని 44వ డివిజన్ కార్పొరేటరు రత్నకుమారి అన్నారు. యొద్దనపూడి వారి వీధిలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రహదారుల నిర్మాణ పనులను సర్కిల్ వన్ ఈఈ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్థసారథి సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ఏఈ జనార్దన్, స్థానిక నాయకులు మైలవరపు దుర్గారావు పాల్గొన్నారు.

పనులు పర్యవేక్షిస్తున్న రత్నకుమారి, శ్రీనివాస్, జనార్దన్

తాగునీరు వృథా..

తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైను లీకుతో రక్షిత నీరు వృథాగా కాలువలోకి చేరుతుంది. 46వ డివిజన్ లంబాడీపేట, ఎస్‌డీపీ చర్చి వీధి అడ్డ రోడ్డు పైభాగంలో పైపు జాయింట్ వద్ద లీకవుతుంది. దీని వల్ల నీటి వేగం తగ్గి కొండ ప్రాంతానికి అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే లీకవుతున్న పైపునకు మరమ్మతులు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

శిథిలావస్థకు చేరినా పట్టించుకోరా?

మల్లికార్జునపేట కూడలి నుంచి కొత్తపేట అడ్డరోడ్డుకు వెళ్లే మార్గంలో ఓ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనాన్ని బ్యాంకు రుణం నిమిత్తం బ్యాంకు అధికారులు జప్తు చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉంది. భవనం పెచ్చులూడి అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులపై పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్ద ప్రమాదం చోటు చేసుకోకముందే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఆదమరిస్తే ప్రమాదమే!

మంగళగిరి-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ద్విచక్ర వాహనంపై ప్లైవుడ్‌ను తీసుకెళ్తున్న వాహనదారుడు. ఏ మాత్రం తాడు జారినా, పొరపాటున ఏదైనా వాహనం తగిలినా వాహనదారులు తీవ్ర గాయాలపాలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి పనులు చేయకుండా కట్టడి చేయాలి. - న్యూస్‌టుడే, విజయవాడ బస్‌స్టేషన్

పూడిక తీయరు.. దుర్వాసన పోదు

పాతబస్తీ వించిపేట వార్డు సచివాలయం వెనుక వీధిలో పక్క కాలువలో పూడిక పేరుకుంది. గత వారం రోజులుగా పూడిక తీయక తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. పారిశుద్ధ్య అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

కెనరా బ్యాంకులో రక్తదాన శిబిరం

ఉద్యోగికి బహుమతి అందజేస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ రత్నాకరరావు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు వ్యవస్థాపకుడు అమ్మెంబాల్ సుబ్బారావుపాయ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని రమేష్ ఆసుపత్రి జంక్షన్‌లో కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని బ్యాంకు విజయవాడ రీజనల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రత్నాకరరావు ప్రారంభించారు. కెనరా బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రత్నాకరరావు మాట్లాడుతూ కెనరా బ్యాంకు డిపాజిట్లు, అడ్వాన్సులు, డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. ప్రాంతీయ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల పోరాట స్ఫూర్తికి నిలువుటద్దం

భాజపా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మధుకర్‌జీ తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : తొలి భారత స్వాతంత్రోద్యమ పోరాటంలో కీలక పాత్ర పోషించిన యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి అని భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని భాజపా రాష్ట్ర కార్యాలయంలో పలువురు ఆ పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, మైనార్టీ మోర్చ అధ్యక్షుడు సయ్యద్ బాషా, మీడియా ఇన్‌ఛార్జి దిలీప్, కోలపల్లి గణేష్, పిట్టల గోవింద్ పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన వీర మహిళా విభాగం నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : మహిళల పోరాట స్ఫూర్తికి ఝాన్సీ లక్ష్మీబాయి నిలువుటద్దం అని దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు పద్మావతి ఠాకూర్ అన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్కుషాపు రోడ్డులోని జనసేన జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకల్లో వీర మహిళా విభాగం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతిరెడ్డి అనిత, తిరుపతి అనూష, సౌజన్య, కార్పొరేటరు అత్తలూరి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలని వినతి

చిట్టినగర్, న్యూస్‌టుడే : పాడైన కాలువలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ప్రజా సమస్యలపై 50వ డివిజన్‌లో ఆ పార్టీ నాయకులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో అనుమతి పొందిన కేటీ రోడ్డు అవుట్‌ఫాల్ డ్రెయిన్ పనులు, మహాత్మా గాంధీ మినీ క్లాత్ మార్కెట్ నిర్మాణాలు, గొల్లపాలెం గట్టు సైడ్ డ్రెయిన్లు మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఏఈ మార్క్, స్థానికులు బాబూరావు, అప్పారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పరిశీలిస్తున్న సత్యబాబు, మార్క్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జేసీబీతో వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధాన కాలువల్లో పేరుకున్న వ్యర్థాలను నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు.. సిబ్బంది సాయంతో బుధవారం తొలగించారు. బుడమేరు, ఏలూరు, బందరు, రైవస్ కాలువల్లో పేరుకుపోయిన చెత్త, ఫ్లోటింగ్ వ్యర్థాలను తొలగించారు. చీఫ్ మెడికల్ అధికారి కె.అర్జునరావు మాట్లాడుతూ నగర ప్రజలకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు వీలుగా బుడమేరులోని గుర్రపుడెక్కతో పాటు, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బయోలజిస్టు కామేశ్వరరావు ఆధ్వర్యంలో దోమల నివారణకు క్రిమిసంహారక మందులు చల్లారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు బుధవారం రాత్రి గీతం డీమ్డ్ వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ముగిశాయి. పురుషుల విభాగంలో విశాఖ జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రథమ, విశాఖ జట్టు ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్-15 బాలుర విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, విశాఖ జిల్లా, బాలికల విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, అనంతపురం జిల్లా జట్లు వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు గీతం డీమ్డ్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖర్, శాప్ డైరెక్టర్ ఎండీ.రమేష్‌కుమార్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.అప్పలరాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్, ఏపీ టేబుల్‌టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మ, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎం.ఎం.పాత్రో, వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సినిమాలు

✦ సంతాన ప్రాప్తిరస్తు, కాంత : జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణా కాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల) లైలా, పీవీపీ, పీవీఆర్ మాల్స్(బందరు రోడ్డు), ట్రెండ్ సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్‌మాల్(కానూరు) ✦ కాంత : అలంకార్, జీ- 3(రాజ్- యువరాజ్), మీరాజ్ ✦ జిగిరిస్ : స్వర్ణా కాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా, పీవీపీ, పీవీఆర్ మాల్స్(బందరు రోడ్డు) ✦ సి-మంతం : అప్సర(గవర్నర్‌పేట) ✦ ఆటకథరా శివ : పీవీఆర్ మాల్(బందర్ రోడ్డు) - విజయవాడ వన్‌టౌన్

మద్యం తాగి వాహనం నడిపిన చోదకుడికి జరిమానా

విద్యాధరపురం, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడిపిన లారీ డ్రైవర్ చంద్ర ముఖేష్‌కు రూ.10 వేలు జరిమానాతో పాటు 15 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి అన్నపూర్ణ బుధవారం తీర్పు ఇచ్చారు. భవానీపురం ఎస్సై రవితేజ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన చంద్ర ముఖేష్ ఈ నెల 18న మద్యం తాగి పట్టుబడ్డాడు. అతడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా జరిమానాతో పాటు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

✤ కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలు

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన ముప్పిడి పృథ్విరాజు తల్లిదండ్రులను చూసేందుకు ఈ నెల 18న విజయవాడ వచ్చారు. గొల్లపూడి వైపు కారులో వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న మరో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ అతడిని బంధువులు అంబులెన్సులో గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని అతడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు భవానీపురం పోలీసులు తెలిపారు.

✤ అనుమానంతో భార్యపై దాడి

గొల్లపూడిలో భార్యపై అనుమానంతో దాడి చేసిన భర్త గోవిద లక్కియాపై భవానీపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన కరీనా లక్కియాకు 18 ఏళ్ల క్రితం గోవిద్ లక్కియాతో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెప్పుల కంపెనీలో పని చేస్తున్న తనపై అనుమానంతో ఈ నెల 19న ముఖంపై కొట్టగా తీవ్ర గాయం అయినట్టు భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏఎస్సైపై దాడి... చంపుతానంటూ బెదిరింపులు

మధురానగర్, న్యూస్‌టుడే : ఏఎస్సైపై దాడి చేయడమే కాకుండా.. చంపుతామంటూ బెదిరించిన వారిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురం ఏఎస్సై జయరాజు, విజయ మార్గరేట్ దంపతులు ఆంధ్రప్రభ కాలనీలోని బొమ్మరిల్లు-2 అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వీరి ఫ్లాట్ ఎదురుగా ఉండే వారు.. కొద్ది రోజులుగా వీరిని దుర్భాషలాడుతున్నారు. దీనిపై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ ఉదయం ఒక వ్యక్తి మద్యం తాగి వచ్చి, వీరి తలుపులు కొట్టి గొడవ చేశాడు. దుర్భాషలాడాడు. తన పేరు శేషు అని, ఎదురుగా ఉండే వారు తనకు సోదరి, బావ అవుతారని.. వారితో గొడవ పెట్టుకుంటే చంపుతానని బెదిరించాడు.

దెబ్బతిన్న కల్వర్టు.. తస్మాత్ జాగ్రత్త!

కలరా ఆసుపత్రి సెంటర్ దీన్‌దయాళ్ నగర్ పట్నాయక్ టవర్స్ వద్ద కల్వర్టుపై సిమెంటు దిమ్మె విరిగి ప్రమాదంగా మారింది. దీంతో స్థానికులు కర్రకు ప్లాస్టిక్ పట్టా కట్టి ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. అసలే చిన్న రోడ్డు దానికి తోడు బియ్యం లోడుతో పెద్ద లారీ అటుగా రావడంతో బరువుతో కల్వర్టుపై సిమెంట్ దిమ్మె మధ్యకు విరిగిపోయింది. నిబంధనల మేరకు పెద్ద లారీలు కాలనీల్లోకి అనుమతి లేదు. అయినప్పటికీ చిన్నపాటి రోడ్డులోకి రావడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది.

- న్యూస్‌టుడే, చిట్టినగర్

రహదారిపై వ్యాపారాలతో ఇబ్బందులు

స్థానిక పండ్ల మార్కెట్ సమీపంలోని ప్రధాన రహదారితో పాటు ప్రభాస్ కళాశాల వద్ద కొందరు వ్యాపారులు రోడ్లపైనే ఎగుమతులు, దిగుమతులు చేస్తుండడంతో పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమీపంలోనే విద్యాసంస్థలు, నివాసాలు ఉండడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి నెలకొంటుంది. ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నా మార్పు రావడం లేదు. వాహనాలు వెళ్లేందుకు కూడా అడ్డంకిగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రహదారులపై వ్యాపారాలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కేదారేశ్వరపేట

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కావలెను
అనురాగ్ పిల్లల ఆసుపత్రి
విజయవాడ One Town నందు
Out Patient Wingలో
పనిచేయుటకు, కనీసం ఇంటర్మీడియట్ చదివిన, మధ్య వయస్కులైన స్త్రీలు కావలెను. సంప్రదించండి
భాస్కర్ ✆ 93911 82838

(c) eenadu

విజయవాడ మధ్య

ప్రసంగం.. మంత్రముగ్ధం

విజేతలతో నాగేశ్వరరావు, రమాదేవి, ఆరుద్ర, భవాని, లీలావతి

దుర్గాఅగ్రహారం (సీతారాంపురం), న్యూస్‌టుడే : స్థానిక దుర్గా అగ్రహారంలోని శ్రీవాణి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో బుధవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసంలో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఎస్.కె.నాజినిన్, డి.వెన్నెల ప్రియ, డి.ఈశ్వర్ తొలి మూడు స్థానాల్లో గెలుపొందారు. విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ ఎస్.నాగేశ్వరరావు, సీఈవో ఎస్.రమాదేవి, ప్రధానోపాధ్యాయిని పి.ఆరుద్ర, ఉపాధ్యాయులు కె.భవాని, వి.లీలావతిలు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న గోపీకృష్ణ

ఉపన్యాసాలతో న్యూనతాభావం మాయం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : స్థానిక ఆంధ్రప్రభ కాలనీలోని శ్రీవిద్య సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని చక్కటి ఉపన్యాసాలు ఇచ్చారు. కళాశాల ఇన్‌ఛార్జి గోపీకృష్ణ మాట్లాడుతూ.. వీటి వల్ల విద్యార్థులు చురుకుగా ఉంటారని, ఆత్మన్యూనతాభావం నుంచి బయట పడతారని చెప్పారు. బి.కీర్తన, బి.జిజ్ఞాసరెడ్డి, ఎం.డి.ఉజెర తొలి మూడు స్థానాల్లో గెలుపొందారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

కళానైపుణ్యం.. కలేనా..?

మూతపడిన శిక్షణ కేంద్రం

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే

రైల్వే కాలనీలో ఏర్పాటు చేసిన హస్త కళల కేంద్రం మూతపడింది. చాలా నెలల క్రితమే దీన్ని మూసివేయడంతో.. మహిళలు ఇతర ప్రాంతాలకు వెళ్లి తర్ఫీదు తీసుకోవాల్సి వస్తోంది. గతంలో స్థానికంగానే అల్లికలు, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ తదితర వాటిల్లో శిక్షణ ఇచ్చేవారు. వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నడిచే ఈ కేంద్రంలో.. ఎంతో మంది ఉద్యోగుల భార్యలు, పిల్లలు సద్వినియోగం చేసుకునేవారు. సత్యనారాయణపురంతో పాటు ఇతర ప్రాంతాల్లోని కేంద్రాలు మూతపడడంతో.. ఎక్కువ డబ్బులు చెల్లించి ప్రైవేటు నిర్వాహకులను ఆశ్రయిస్తున్నారు. ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తే.. కాలనీలోని మహిళలకు సౌకర్యవంతంగా ఉంటుందని రైల్వే కార్మిక సంఘం నాయకులు అభిప్రాయపడుతున్నారు.

మూసివేసి ఉంచిన భవనం

- కాలనీల్లో ఉద్యోగులు : సుమారు వెయ్యి మంది
- మహిళలు, కుటుంబ సభ్యులు : 1500 మంది

ప్రతిపాదనలకే పరిమితం..

రైల్వే కుటుంబాలకు తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర వస్తువులు అందించేందుకు రైల్వే అధికారులు సత్యనారాయణపురంతో పాటు ఆర్ఈ కాలనీ, బొగ్గులైను కాలనీల్లో కోఆపరేటివ్ జనరల్ స్టోర్స్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ రాయితతో నిత్యావసరాలు, ఇతర వస్తువులు లభిస్తాయి. దీనిపై ఏళ్ల తరబడి కార్మిక సంఘ నాయకులు చేస్తున్న ప్రతిపాదనలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు జనరల్ స్టోర్స్‌తో పాటు కాలనీల్లో మూసివేసిన హస్తకళల శిక్షణా కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళతాం

హస్తకళల శిక్షణా కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని డీఆర్‌ఎంను కలిసి వినతి పత్రం సమర్పిస్తాం. శిక్షణా కేంద్రం వల్ల మహిళలకు ఉపాధి లభిస్తోంది. ఉద్యోగులకు ఇచ్చే యూనిఫాం ఇక్కడే కుడితే.. శాఖకు కూడా డబ్బులు ఆదా అవుతాయి.

– రాజారావు, రైల్వే కార్మిక సంఘ నేత

భక్తులకు అన్నప్రసాద వితరణ

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : కార్తిక మాసం సందర్భంగా బుధవారం ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు మాట్లాడుతూ.. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసంలో లోక కల్యాణార్థం అన్నాభిషేకం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు డి.శివరామరాజు, బడేటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

అజిత్‌సింగ్‌నగర్: అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి అందిస్తున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో 30వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు రూ.9.19 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఎంతో మంది నిరుపేదలకు ఆపన్న హస్తంలా ఈ పథకం ఆదుకుంటోందని పేర్కొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం: ఆర్‌అండ్‌బీ స్వర తరంగిణి ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయకులు పి.శివశర్మ, వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి రోజూ రాగంపై సాధన చేస్తుంటే పాటలను మధురంగా ఆలపించవచ్చని అన్నారు. గాయకులు నాయుడు, పి.లక్ష్మీ తులసి, ఎ.ప్రత్యూష, పి.కిరణ్మయి తదితరులు సినీ గేయాలు ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. డేవిడ్‌రాజు, గంగాధర మురళి పాల్గొన్నారు.

భూమిపై ఎదురులేని శక్తి.. వనిత

సన్మానం అందుకున్న మహిళా కవులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : సమాజంలో దుష్టశక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ముందడుగు వేస్తే.. భూమిపై ఎదురులేని శక్తిగా వనిత నిలుస్తుందని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు పి.వి.రాధిక పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రాగూర్ గ్రంథాలయంలో ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'కలం హద్దు వనిత సమర్థత' అనే అంశంపై మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. రాధిక మాట్లాడుతూ.. మహిళ తన తెలివితేటలతో అన్ని రంగాల్లో ముందు నిలుస్తోందని ప్రశంసించారు. తాను విద్యావంతురాలైతే కుటుంబం మొత్తాన్ని ప్రభావితం చేయగలదన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయిని కపూరి సత్యవతి మాట్లాడుతూ.. ఆడవారు అబల కాదు.. సబల అని నిరూపించుకున్నారని కొనియాడారు. మహిళల విజయాలను స్తుతిస్తూ కవితలను చదివి వినిపించారు. కోనేరు కల్పన, తుమ్మల స్నిగ్ధమాధవి, సామినేని శైలజ, పర్వతనేని శ్రీలక్ష్మి, విజయ కనకదుర్గ, శ్రీకర సూర్తి తదితరులు మంత్రముగ్ధుల్ని చేసేలా కవితలను వినిపించారు. గ్రంథాలయాధికారి కె.రమాదేవి నేతృత్వంలో కవులకు జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయరాజు, కోశాధికారి సుబ్బయ్య, కొండికొండ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పేర్కొన్నారు. బుధవారం వల్లభనేని బంగ్లా కూడలిలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రిగా ఆమె చేపట్టిన అనేక పథకాలు దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టాయని కొనియాడారు. ఆమె సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షర్మిల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్ వలీ, నరహరిశెట్టి నరసింహారావు, మీసాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని విగ్రహానికి పూలమాల వేస్తున్న షర్మిల

వృద్ధులకు న్యాయ సేవలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వృద్ధులు తమకు ఏమైనా సమస్యలు ఉంటే మండల న్యాయసేవాధికార కమిటీని ఆశ్రయించాలని 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి సి.రమణారావు పేర్కొన్నారు. బుధవారం గవర్నర్‌పేటలోని నిర్మల్ హృదయ్ భవన్‌లో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి.. వృద్ధులను పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'వృద్ధుల న్యాయ సేవల 2017' అనే పథకం ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయసేవ అధికార పరిడివిజీ రాము, ప్యానెల్ న్యాయవాది బెల్లంకొండ శేఖరబాబు, మానవత సంస్థ ప్రతినిధి దావులూరి సాంబశివరావు, పారా లీగల్ వాలంటీర్ బి.రామకృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి రమణారావు

సామూహిక కుంకుమార్చనలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : స్థానిక కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో బుధవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఈ పూజలు నిర్వహించారు. ఈవో యడ్లపల్లి సీతారామయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బోండా సిద్ధార్థ, రవితేజ, కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

కార్మికపురం (సీతారాంపురం) : కార్మికపురంలోని దుర్గామల్లేశ్వరస్వామి దాసాంజనేయస్వామి వార్ల దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా బుధవారం మల్లేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పూజలో పాల్గొన్న భక్తులు

మల్లేశ్వరస్వామి

కెనరా బ్యాంకులో రక్తదాన శిబిరం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : కెనరా బ్యాంకు వ్యవస్థాపకుడు అమ్మెంబాల్ సుబ్బారావుపాయ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని రమేష్ ఆసుపత్రి జంక్షన్‌లోని కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని బ్యాంకు విజయవాడ రీజనల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.రత్నాకరరావు ప్రారంభించారు. కెనరా బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రత్నాకరరావు మాట్లాడుతూ కెనరా బ్యాంకు డిపాజిట్లు, అడ్వాన్సులు, డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. ప్రాంతీయ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగికి బహుమతి అందజేస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ రత్నాకరరావు

ఆసక్తిగా కవి సమ్మేళనం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : విజ్ఞానం అందించే గ్రంథాలు.. సమాజాన్ని సరైన దారిలో పెడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో పుస్తకం అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఆ సంఘం కోశాధికారి నానా అధ్యక్షత వహించారు. కవయిత్రి పోపూరి పుష్పాదేవి కవి సమ్మేళనం నిర్వహించారు. చిత్రాడ కిషోర్ కుమార్, పి.కృష్ణ భార్గవి, చందు నాగేశ్వరరావు, ఆకునూరి నారాయణ, ఎస్.ఎం.సుభాని, తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు పలు కవితలు వినిపించారు. సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ పర్యవేక్షించారు.

మాట్లాడుతున్న నానా. పక్కన పుష్పాదేవి

నిర్వహణ అధ్వానం

గవర్నర్‌పేట పాత బస్టాండ్ వై కూడలి వద్ద ఫౌంటేన్ నిర్వహణ అధ్వానంగా ఉంది. వీఐపీలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఖాళీ ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా వై కూడలి వద్ద ఫౌంటైన్ ఏర్పాటు చేశారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో నీరు పాకుడు పట్టిపోయింది. మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదు. ఫౌంటైన్ తలలు విరిగిపోవటంతో.. నీరు రావడంతో లేదు. గతంలో రంగు రంగుల దీపాలతో బెలూన్ తరహాలో నీటిని వెదజల్లేవి. ఇవి మూలన పడడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. తక్షణం మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట**

ప్రమాదకరంగా హోర్డింగ్‌లు

మధురానగర్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగిసి నెల రోజులు గడిచినా.. ఫ్లెక్సీలకు సంబంధించిన ఇనుప హోర్డింగ్‌లను అలానే ఉంచేశారు. మధురానగర్ పైవంతెన పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో ఉంచారు. ఇరుకైన దారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు ఆటోలు లేదా కార్లు ఎదురెదురు పడితే తప్పుకోలేక ఆగిపోతున్నాయి. పైగా రాత్రి వేళ ప్రమాదకరంగా మారుతున్నాయి. ఉత్సవ కమిటీ నిర్లప్తత వల్ల హోర్డింగ్‌లను తరలించలేదు. వెంటనే వాటిని తొలగించి.. ఇబ్బందులు తప్పించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మధురానగర్**

రహదారికి అడ్డంగా పైపులు

స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలోని వినాయక గుడి వీధిలో పైపులను రహదారిపైనే వదిలివేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మంచి నీటి పైపులైన్ల నిమిత్తంగా వీటిని చాలా రోజుల క్రితమే తీసుకొచ్చారు. కానీ మధ్యలోనే పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి అలాగే ఉండడంతో.. వాహన చోదకులు అదుపుతప్పి పడుతున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, పైపులు తొలగించడంతో పాటు రహదారికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు. **- న్యూస్‌టుడే, సత్యనారాయణపురం(గాంధీనగర్)**

రక్షణ కంచెకు రంధ్రం

నగరం మీదుగా వెళుతున్న సాగు, తాగునీటి కాలువల్లో చెత్త వేయకుండా రక్షణ కంచె ఏర్పాటు చేశారు. అయితే అలంకార్ కూడలిలోని కొత్త వంతెనపై ఉన్న కంచెకు ఆకతాయిలు కత్తిరించేశారు. పై నుంచి కింది వరకు ఖాళీ ఏర్పాటు చేశారు. దీని ద్వారా చెత్త వేసేందుకు వీలుగా మారిపోయింది. నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది ఈ ప్రాంతంలో కాలిబాట మార్గాన్ని శుభ్రం చేస్తారు. కంచె కత్తిరించినా దాన్ని చూసీచూడనట్లు పోతున్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట**

ఉద్యోగోన్నతులకు విజ్ఞప్తి

సూర్యనారాయణకు వినతి పత్రం సమర్పిస్తున్న గంటయ్య, యశ్వంత్ తదితరులు

సీతారాంపురం: రాష్ట్రంలోని వార్డు, విద్య కార్యదర్శులకు సరైన ఉద్యోగోన్నతి కల్పించేలా చూడాలని సంఘ నాయకులు అధికారులను కోరారు. బుధవారం ఈ మేరకు ఆటోనగర్‌లోని గ్రామ/వార్డు సచివాలయాల సంచాలకుల కార్యాలయంలోని సంచాలకుడు ఎం.శివప్రసాద్, అదనపు కమిషనర్ సూర్యనారాయణలకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని మంత్రి వర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారని కమిటీ ఛైర్మన్ బి.గంటయ్య తెలిపారు. విద్య కార్యదర్శుల ఐకాస కన్వీనర్ జి.యశ్వంత్, కో-కన్వీనర్లు శ్రీకాంత్, రాజశేఖర్, విజయవాడ నగరపాలక సంస్థ ఎస్‌ఈఎఫ్ నాయకులు ఎం.జగదీష్‌బాబు, ఉష, సంధ్యారాణి, మాధవి పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

అజిత్‌సింగ్‌నగర్ : నాగవంశ కుటుంబాల అభ్యున్నతికి రాష్ట్ర నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు సహకారం అందిస్తున్నారని బేబీ చిత్రం హీరో విరాజ్ అశ్విన్ అన్నారు. బుధవారం ఆయన న్యూరాజరాజేశ్వరిపేటలోని రమణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రమణారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరాజ్ అశ్విన్

న్యాయస్థానాల సందర్శన

సూర్యారావుపేట: విజ్ఞాన యాత్రలో భాగంగా నగరానికి చెందిన చైతన్య పాఠశాల విద్యార్థులు బుధవారం విజయవాడ న్యాయస్థానాలను సందర్శించారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా ఇతర కార్యవర్గ సభ్యులు ముచ్చటించారు. న్యాయస్థానాల విధులు తెలుసుకున్నారు. అనంతరం రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్‌ను కలిశారు. చట్టాల గురించి సత్యానంద్ వివరించారు.

అవమానంతో యువకుడి ఆత్మహత్య

పాయకాపురం : కొందరు తనను అకారణంగా కొట్టారనే అవమానంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం నున్న పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... నున్న గ్రామానికి చెందిన బి.దానియేలు తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు సన్ని(21) ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తుంటారు. ఈ నెల 16వ తేదీ, ఆదివారం రాత్రి స్థానిక సీఎస్ఐ చర్చి వద్ద కొందరు అకారణంగా అతనితో గొడవపడి కొట్టారు. ఇది తెలుసుకున్న కుటుంబ సభ్యులు.. ఘటనా స్థలానికి వెళ్లి పెద్దలతో మాట్లాడతామని చెప్పి, సన్నీని ఇంటికి తీసుకొచ్చారు. మనస్తాపం చెందిన అతడు.. గత మూడు రోజులుగా అవమానంగా బాధపడుతున్నాడు. బుధవారం తల్లిదండ్రులు, సోదరుడు పనులకు వెళ్లగా.. అతడు ఒక్కడే ఇంటో ఉన్నాడు. తర్వాత తండ్రి ఫోన్ చేస్తే తీయలేదు. అనుమానంతో ఇంటికి రాగా.... సన్ని ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించడంతో నిశ్చేష్టులయ్యారు. వెంటనే ప్రజావైద్యశాలకు తీసుకువెళ్లగా.. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీనిపై దానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం

సత్యసాయి బాబా పల్లకీ మోస్తున్న సభ్యులు

సీతారాంపురం: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి పురస్కరించుకుని బుధవారం సీతారాంపురంలోని శ్రీసత్యసాయి మందిరంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూజలు, ప్రేమ లింగానికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం బాబా వారి పల్లకీసేవ చేపట్టారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి కేకు కోశారు. పలువురికి కుట్టు మిషన్లు, తోపుడు బండి, ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సేవలను కొనియాడారు. ధ్యానంతో చక్కని మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. సమితి కన్వీనర్ నరసింహారావు, గాయత్రి, విజయలక్ష్మి, యూన్సీ, తులసీరాం, గుప్తా, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకేతర సిబ్బంది సమస్యలపై వినతి

మాచవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. బుధవారం బోర్డు సంచాలకుడు రంజిత్ బాషాను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తానని చెప్పారని వారు పేర్కొన్నారు. అలాగే ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్‌కు సమస్యలు వివరించారు.

ఏఎస్సైపై దాడి... చంపుతానని బెదిరింపులు

మధురానగర్, న్యూస్‌టుడే : ఏఎస్సైపై దాడి చేయడమే కాకుండా.. చంపుతామంటూ బెదిరించిన వారిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురం ఏఎస్సై జయరాజు, విజయ మార్గరేట్ దంపతులు ఆంధ్రప్రభ కాలనీలోని బొమ్మరిల్లు-2 అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వీరి ఫ్లాట్ ఎదురుగా ఉండే వారు.. కొద్ది రోజులుగా వీరిని దుర్భాషలాడుతున్నారు. దీనిపై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ ఉదయం ఒక వ్యక్తి మద్యం తాగి వచ్చి, వీరి తలుపులు కొట్టి గొడవ చేశాడు. దుర్భాషలాడాడు. తన పేరు శేషు అని, ఎదురుగా ఉండే వారు తనకు సోదరి, బావ అవుతారని.. వారితో గొడవ పెట్టుకుంటే చంపుతానని బెదిరించాడు. దీనిపై జయరాజు అతడిని ప్రశ్నించడంతో.. చరవాణితో దాడి చేశాడు. మెడ పట్టుకుని తోసివేయడంతో వేలికి గాయమైంది. ఘటనపై బంధువులతో చర్చించి.. విజయ మార్గరేట్ మంగళవారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శేషు, అతని బావ కృష్ణారావు, సోదరిపై కేసు నమోదు చేశారు.

పొదుపు సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : పొదుపు సంఘాల మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. బుధవారం ఐవీ ప్యాలెస్‌లో 23వ డివిజన్ పొదుపు సంఘాల మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సఖి సురక్ష పథకంలో భాగంగా.. 35 సంవత్సరాలు పైబడిన వారికి ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాదాపు 350 మందికి పరీక్షలు చేశారు. డాక్టర్ సురేంద్ర, జగదీశ్వరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం పెరగాలి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గ్రంథాలయాలు దేవాలయాల కంటే గొప్పవని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాగూర్ గ్రంథాలయంలో మహిళా సదస్సు నిర్వహించారు. భవిష్యత్తరాలు బాగుండాలంటే.. పుస్తక పఠనం పెరగాలని ఆమె పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద అధ్యక్షత వహించారు. మహిళలకు రంగవల్లులు, మ్యూజికల్‌ఛైర్స్ పోటీలు నిర్వహించారు. రామకృష్ణాపురంలోని శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాల బాలికలకు మ్యూజికల్ ఛైర్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గరిమెళ్ల నాగమణి, ఎ.అపర్ణ, మాధవీలత, డి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : వారోత్సవాల్లో భాగంగా చిత్తరంజన్ గ్రంథాయం, ముత్యాలంపాడులోని అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి ప్రసాద్, కె.సుబ్బరాజు, ఎస్.వెంకటేశ్వరరాజు, పి.హరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : వాంబేకాలనీలోని 'ఏ' బ్లాక్‌లోని భూగర్భ డ్రైనేజీ పొంగి రహదారిపై పారుతోంది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక డివిజన్ ఇన్‌ఛార్జి ధనశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి.. వీఎంసీ అధికారులతో మాట్లాడారు. సిబ్బందితో పూడిక తీయించారు.

అద్దెకు కావలెను

Child Development Centre నిర్వహించుటకు సూర్యారావుపేట/సీతారామపురం పరిసర ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల విస్తీర్ణం కావలెను. సంప్రదించండి. భాస్కర్ ✆ 93911 82838

డాక్యుమెంట్లు పోయినవి

[illegible]

ఇట్లు: కొండా వెంకట రమణా రావు
40-9/10-7/2, ప్లాట్ నెం.39A, క్రాస్ రోడ్ - 6, [illegible] బందర్ రోడ్, విజయవాడ, ఫోన్: 95531 41676

ప్రకటన

[illegible]

పి. రామమోహనరావు, [illegible] డోర్ నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

వందనం... వందేమాతరం

వందేమాతరం గీతం ప్రతి పౌరుడిలో దేశభక్తిని పెంపొందిస్తుందని వక్తలు పేర్కొన్నారు. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శంకరంలోని బొజ్జన్నకొండ వద్ద పురావస్తు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ సంస్కృతీ వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సిన ఫొటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు తిలకించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వందేమాతరం గీతంపై నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. – అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

గుండెల్లో భక్తి... కొండల్లో కాంతి

అనంత పద్మనాభ స్వామి వారి కొండ మెట్ల దీపోత్సవం బుధవారం వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, పద్మనాభం

కనికుట్టు

మిషన్లు, ధ్రువపత్రాలకు మహిళల ఎదురుచూపు

కలెక్టరేట్, న్యూస్‌టుడే

మహిళలు ఇంటివద్దే స్వయం ఉపాధి పొందడానికి కుట్లు, అల్లికలు చక్కటి మార్గం. అందుకే కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మహిళలకు మూడు నెలల పాటు ఉచితంగా కుట్లు, అల్లికలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం జీవనోపాధి పొందేలా కుట్టు మిషన్లు సైతం ఉచితంగా అందిస్తామని ముందే ప్రకటించారు. దీంతో ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. వేలాదిమంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా వీరికి కుట్టుమిషన్లు ఇవ్వలేదు. పోనీ ధ్రువపత్రాలైనా చేతిలో పెట్టారా అంటే అదీ లేదు. దీంతో మహిళల ఆశలు అడియాశలుగా మారాయి.

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 24 మండలాల పరిధిలోని 19 కేంద్రాల్లో మహిళలకు కుట్టు శిక్షణ, అల్లికలపై మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక విడతగా.. ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతగా నేర్పించారు. ఇందులో మిషన్ కుట్టడంతోపాటు డిజైన్ ఆధారంగా దుస్తులు కత్తిరించడం, ప్రస్తుత మహిళల అభిరుచికి అనుగుణంగా మెలకువలతో ఎలా కుట్టాలి తదితర అంశాలపై నైపుణ్యం కలిగిన శిక్షకులతో తర్ఫీదు ఇచ్చారు. అనకాపల్లి నియోజకవర్గంలో చింతనిప్పుల అగ్రహారం, కశింకోట, పట్టణంలో తాకాశివీధి తదితర కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కేంద్రాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సైతం సందర్శించి మహిళలను ప్రోత్సహించి అభినందించారు.

తరగతుల్లో 75 శాతం హాజరు ఉన్నవారికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. డిజిటల్ విధానంలో ప్రతిరోజూ హాజరు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా 2,268 మంది మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరంతా కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలు ఎప్పుడు ఇస్తారని రెండు నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. చదువు, అర్హతతో సంబంధం లేకుండా శిక్షణ పూర్తిచేసిన మహిళలందరికీ 50 శాతం రాయితీతో ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వనుందని సైతం అధికారులు ప్రకటించారు. కనీసం ఇదీ అమలు చేయలేదు.

పరికరాలు రాగానే అందిస్తాం: జిల్లాలోని మూడు నెలలపాటు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలు ప్రభుత్వం నుంచి రాగానే మహిళలకు అందిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదు. – జ్యోతిశ్రీ, కార్యనిర్వాహక సంచాలకులు, బీసీ కార్పొరేషన్

హమ్మయ్య.. బీఎన్ రోడ్డు పనులు మొదలెట్టారు!

చోడవరం, న్యూస్‌టుడే: వాహనదారులకు నరకం చూపిస్తున్న భీమిలి-నర్సీపట్నం రోడ్డును అభివృద్ధి చేసే పనులకు గుత్తేదారుడు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. చోడవరం అటవీశాఖ కార్యాలయం నుంచి వెంకన్నపాలెం వరకు ఉన్న భాగంలో రహదారి మార్జిన్ విస్తరిస్తున్నారు. ప్రస్తుతం 5.5 మీటర్ల మేర రహదారి వెడల్పు ఉన్న దీన్ని 7.5 మీటర్లకు పెంచుతారు. దీంతో రుడ్డుకు ఇరువైపులా మీటరు మేర పెరగనుంది. ఈ పనులు పూర్తికాగానే తారువేసి రహదారిని అభివృద్ధి చేస్తామని ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మేజరు పంచాయతీలైన గోవాడ, చోడవరం ఊరి మధ్యలో రహదారి మార్జినను వెడల్పు చేసే కార్యక్రమం ఉండదన్నారు. ఎన్‌డీబీ నిధులతో ఈ పనులు జరగనున్నాయి.

★ బి-ఎన్ రహదారి మార్జిన్ వెడల్పు, తారు వేసే కార్యక్రమం 6.3 కి.మీ. మేర చేపట్టాలి. కాని 4.5 కి.మీ మేరకు కుదించారు. ప్రస్తుతం గౌరీపట్నం కూడలి నుంచి విజయరామరాజు పేటతోపాటు గోవాడలోనూ పనులు చేపట్టరు. ఈ రెండుచోట్లా (గౌరీపట్నం నుంచి పేట, గోవాడ బిట్‌లను) రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం.

ఈనెల 22న వాయిదా: బీఎన్‌రోడ్డు దుస్థితి పై వేసిన పిల్‌కు సంబంధించి కోర్టు వాయిదా ఈ నెల 22న ఉంది. రహదారి దుస్థితిపై సీనియర్ న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ సారథ్యంలో న్యాయవాదులు ఎ.భరత భూషణం, భూపతి రాజులతో పాటు సామాజిక కార్యకర్త ప్రసాదు పిల్ వేశారు.

రహదారి మార్జిన్ విస్తరణ పనులు చేస్తున్న పొక్లెయిన్

తీరానికి ఉగ్రవాదులొస్తే!

తీవ్రవాదుల ముసుగులో వచ్చే పోలీసులు భూభాగం లోకి రాకుండా తీరం ఒడ్డున గస్తీ నిర్వహించడంతో పాటు పడవల్లో అన్వేషించడం, వాహనాలు తనిఖీ చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తారు. ఈ నమూనా ప్రదర్శనను నిజమైన ఉగ్రవాదులను పట్టుకోవడానికి పోలీసులు, రక్షణదళం సిబ్బంది ఎంత ప్రయత్నిస్తారో అంతేస్థాయిలో నిర్వహిస్తారు.

దీనిని చూసే ప్రజలకు మాత్రం నిజంగానే శత్రు మూకలు మన ప్రాంతంలో ప్రవేశించారా అనిపిస్తుంది. అనకాపల్లి కార్యక్రమంలో మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్సైలు సుధాకరరావు, వెంకటరావు, 60మంది సిబ్బంది పాల్గొన్నారు.

సన్నద్ధతపై సాగర్ కవచ్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తీరానికి ఉగ్రవాదులు వస్తే వారిని ఎదుర్కొనేందుకు కేంద్ర రక్షణ బలగాలు, పోలీసులు ఎంతవరకు సంసిద్ధంగా ఉన్నారనే విషయాన్ని తెలుసుకోవడానికి సాగర్ కవచ్ నిర్వహించాలని పక్కా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పోలీసులతోపాటు నేవీ, తీర రక్షణ దళం, కేంద్ర కస్టమ్స్, ఎక్సైజ్, హోంశాఖ అధికారులు దీని నిర్వహణకు సిద్ధమయ్యారు. గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు తీరప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కవచ్‌ను పక్కాగా నిర్వహించాలని అన్ని విభాగాలకు చెందిన అధికారులు బుధవారం విస్తృత స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

ముంబయి తరహా దాడులు తీర ప్రాంతాల్లో మళ్లీ జరగకుండా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తీర ప్రాంతాలున్న రాష్ట్రాల్లో సాగర్ కవచ్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. తీవ్రవాదులు తీరం గుండా భూభాగంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాలని పన్నాగం పన్నితే వీటిదాన్ని ఎదుర్కోవాలనే విషయాన్ని దీనిద్వారా అన్ని విభాగాల సిబ్బందికి, అధికారులకు అవగాహన కల్పించనున్నారు. ఏడాదికి రెండుసార్లు అన్ని రక్షణ విభాగాల అధికారులు దీనిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల 9, 10 తేదీల్లో దీన్ని తీర ప్రాంతాల్లో నిర్వహించారు. తీర రక్షణదళం, నేవీ సిబ్బంది తీవ్రవాదుల ముసుగులో సముద్ర జలాల్లోకి వెళ్లి తిరిగి జిల్లాలో ఏదో ఒక మూలన ఉన్న తీరానికి చేరుకోవడం ఈ కవచ్‌లో ముఖ్యాంశం. వీరు తీరానికి చేరుకుని అక్కడి నుంచి బయటకు వచ్చేలోగా పోలీసులు, మెరైన్ విభాగం సిబ్బంది గుర్తించి వీరిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఏఓబీలో మావోలకు ఎదురుదెబ్బ!

సీలేరు, న్యూస్‌టుడే: మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టు పార్టీకి షెల్టర్ జోన్‌గా ఉన్న ఆంధ్ర, ఒడిశా సరిహద్దు (ఏవోబీ)పై ప్రస్తుతం మావోయిస్టుల పట్టు కోల్పోయినట్లయిందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ నెల మొదటివారంలో ఇద్దరు ఏవోబీ ఇన్‌చార్జులు మృత్యువాత పడటం పార్టీకి కోలుకోలేని దెబ్బగా పేర్కొంటున్నారు.

■ మావోయిస్టులు తమ కదలికలు, దాడులకు వ్యూహాలు రచించడానికి ఏవోబీని అటవీ ప్రాంతాన్ని వినియోగించుకునేవారు. ఈ ప్రాంతంలో పార్టీ గతంలో చాలా బలంగా ఉండేది. 2016 అక్టోబర్‌లో ఒడిశాలోని రామ్‌గుడ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌తో వారి ప్రభావం తగ్గింది.

■ గాజర్ల రవి అలియాస్ ఉదయ్, చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, అరుణక్క, జోగారావు అలియాస్ టెక్ శంకర్, కాకూరి పండన్న అలియాస్ జగన్ నేతృత్వంలో ఏఓబీలో కార్యకలాపాలు నడిచేవి. ఈ క్రమంలో గాజర్ల రవి అలియాస్ ఉదయ్, చలపతి, అరుణక్క, కాకూరి పండన్నలు ఈ ఏడాది ఏప్రిల్, జూన్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. అప్పటివరకు ఏవోబీ ప్రత్యేక జోనల్ కమిటీ ఇన్‌ఛార్జిగా ఉన్న ఉదయ్ మృతితో ఈ బాధ్యతలను పార్టీ జోగారావు అలియాస్ టెక్ శంకర్‌కు అప్పగించింది. ఎదురుకాల్పుల్లో బుధవారం ఆయన మృతి చెందడంతో ఏవోబీలో పార్టీ ఉనికి ప్రమాదంలో పడింది.

గంజాయి కారణమా?: ఏవోబీలో గతంలో వేలాది ఎకరాల్లో గంజాయి సాగయ్యేది. ఈ పంట సాగు ప్రోత్సహించడానికి బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులతో తమ కదలికలకు ముప్పు వాటిల్లుతుందనే అనుమానంతో మావోయిస్టులు బయట వ్యక్తుల రాకను నిషేధించారు. ఈ మేరకు గిరిజనులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు, గిరిజనులకు మధ్య దూరం పెరిగింది.

బొమ్మల కొలువుకు జాతీయ పురస్కారం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఏటికొప్పాక గ్రామానికి చెందిన యువ హస్త కళాకారుడు గొర్సు సంతోష్‌కుమార్ తయారు చేసిన 'బొమ్మల కొలువు'కు జాతీయస్థాయి అవార్డు లభించింది. గతంలో దసరా ప్రతి ఇంటిలో బొమ్మల కొలువు పెట్టేవారు. కాలక్రమంలో ఈ వేడుక తగ్గిపోతూ వస్తోంది. నాటి వేడుకకు జీవం పోసేలా సంతోష్‌కుమార్ అంకుడు కర్రతో ఈ బొమ్మ తయారు చేశారు. దీన్ని హస్త కళల అభివృద్ధి సంస్థకు పంపారు. ఈ సంస్థ ఏటా ఇచ్చే అవార్డుల్లో భాగంగా 2024 సంవత్సరానికి దీన్ని జాతీయస్థాయికి ఎంపిక చేశారు. అవార్డుకు వచ్చేనెల తొమ్మిదిన దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతులమీదుగా ఇతనికి ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు సంతోష్‌కుమార్‌కి వస్త్ర, హస్తకళల అభివృద్ధి కమిషనర్ నుంచి బుధవారం లేఖ అందింది. ఎంపిక పత్రాన్ని సంతోష్‌కుమార్ బుధవారం స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కి చూపించారు. ఆయన ఇతన్ని అభినందించి సత్కరించారు.

సంతోష్ కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మొత్తం పాతిక.. భద్రత ఏదీ చోదకా?

ఆటోల్లో అయిదుగురిని మించి ఎక్కించుకోవద్దని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. మితిమీరిన ప్రయాణికులను ఎక్కించడం వల్ల కలిగే అనర్థాలపై డ్రైవర్లకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులు పెట్టి మరీ వివరిస్తున్నారు. డ్రైవర్లు మాత్రం దీన్ని ఖాతరు చేయడం లేదు. మరీ ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లేవారు ముందుజాగ్రత్తలు గాలికొదిలేస్తున్నారు. డ్రైవర్ పక్కనే రెండువైపులా నలుగురిని కూర్చోబెడుతున్నారు. మధ్యలో 12 మందిని.. వెనుక తొమ్మిదిమంది చొప్పున మొత్తం ఆటోలో 25 మంది ఎక్కించి రహదారిపై పరుగులు తీస్తున్న ఈ ఆటో ఎలమంచిలిలో కనిపించింది. కిక్కిరిసి విద్యార్థులను ఎక్కించడమే కాకుండా వాహనానికి రెండువైపులా ప్రమాదకరమైన రీతిలో గుట్టలుగా బ్యాగ్‌లు వేలాడదీశారు. – ఎలమంచిలి, న్యూస్‌టుడే

25 మంది విద్యార్థులతో వెళుతున్న ఆటో

మార్గశిరం.. శుభకరం..!

న్యూస్‌టుడే, వన్‌టౌన్

రేపటి నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి మాసోత్సవాలు

భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాఖపట్నం పాతనగరంలోని బురుజుపేటలో ఉన్న ఆలయంలో ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు ఉత్సవాలు జరగనున్నాయి.

అంచనా.. మూడు లక్షలు: ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 3 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల దర్శనాలు సాఫీగా సాగేందుకు వీలుగా క్యూలైన్లు, ఇతరత్రా ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రెండుసార్లు ఆలయ సమన్వయ కమిటీతో సమావేశమై పలు అంశాలపై సూచనలు చేశారు.

అలంకరణలో అమ్మవారు

టికెట్ ధరలు	ప్రత్యేక దర్శనం:	విశిష్ట దర్శనం:	శీఘ్ర దర్శనం:
	రూ.500	రూ.200	రూ.100

పంచామృతాభిషేకం : రూ. 10,000 (గురువారం తొలి గంటలో..)

పంచామృతాభిషేకం: రూ. 3,000 (సాధారణ రోజుల్లో)

అర్ధరాత్రి నుంచే...!

■ మార్గశిర మాసోత్సవాల్లో రోజూ శ్రీచక్ర నవవర్ణార్చన, లక్ష్మీహోమం, విశేష కుంకుమ పూజలు, వేదపారాయణం, సప్తశతీ పారాయణం, మహా విద్యాపారాయణం పూజలు ఉంటాయి. ■ గురువారాల్లో (బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత) 12.01 గంటలకు అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఆయా పూజాధికాలు పూర్తయిన తర్వాత నుంచే భక్తుల దర్శనాలకు అనుమతి ఇస్తారు.

■ భక్తులు మండల దీక్ష (41 రోజులు), మాసదీక్ష (31), అర్ధ మండల దీక్షలు (21) చేపట్టి, అమ్మవారికి ఇరుముళ్లు సమర్పిస్తుంటారు.

గత మూడేళ్ల మార్గశిర మాసంలో ఆదాయం (రూ. కోట్లలో..)

2022	2023	2024
4.54	4.86	5.32

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని రామునాయుడు కాలనీలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న నర్సింగ్ విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకుంది. బుచ్చెయ్యపేట మండలం మల్లాం గ్రామానికి చెందిన యువతి (17) అనకాపల్లిలోని ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ చదువుతోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఆరు నెలల పాటు శిక్షణ పొందుతోంది. ఇద్దరు స్నేహితురాళ్లతో కలసి రామునాయుడు కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్సై గౌరి కేసు నమోదుచేశారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉక్కు ఉద్యోగుల నిరసన

ఉక్కునగరం, న్యూస్‌టుడే : ఉక్కు యాజమాన్యం కార్మికుల జీతాలను లక్ష్యాలతో ముడిపెట్టి ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం ఉక్కు కర్మాగారంలో అన్ని విభాగాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులనుద్దేశించి అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, జె.అయోధ్యరామ్ మాట్లాడారు. చట్ట వ్యతిరేక ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమన్నారు.

RAGHU COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi, Affiliated to Andhra University, VSP)
Dakamarri, Bheemili (M), Visakhapatnam - 531162, A.P
Ph. 08922-248014, 15 Email Id: raghucollegeofpharmacy@rediffmail.com
B.PHARMACY SPOT ADMISSIONS (CAT-A) AP EAPCET-2025
Candidates qualified in AP EAPCET-2025 and have not taken admission in any institution are eligible for Spot Admissions. If AP EAPCET-2025 qualified candidates are not available, the candidates having percentage of aggregate marks in qualifying examination or its equivalent as per the eligibility criteria by the Chairman/Convener, APSCHE, AP EAPCET-2025 (Admissions) will be considered.
The interested candidates may attend the Institutional Spot Admissions in our college on 20-11-2025 (Thursday) at 10.00 AM along with all original certificates and requisite fee.
The vacant seats will be filled as per the guidelines of Chairman/Convener, APSCHE, AP EAPCET-2025 Admissions and the admitted candidates are not eligible for tuition fee reimbursement.
For details Contact: 08922-248014,15
14-11-2025 Mob: 9177779084, 9490302033 Principal

సమస్యలున్నా సంక్షేమం ఆగదు

నాతవరం, న్యూస్‌టుడే: ఎన్ని సమస్యలున్నా.. సంక్షేమం ఆగదని సభాపతి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం నాతవరంలో బుధవారం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అయ్యన్న మాట్లాడుతూ.. నర్సీపట్నం నియోజకవర్గంలో 35 వేల మంది రైతులకు రూ.23 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విభిన్న పరిస్థితులున్నాయని, నాతవరం మండలంలో వ్యవసాయాభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్సై తారకేశ్వరరావును అభినందించారు. పంచాయతీకి ముగ్గురు చొప్పున 30 పంచాయతీల్లో 90 మంది యువతను గుర్తించి ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించాలన్నారు. ఆర్డీవో వి.వి.రమణ, కూటమి నాయకులు సూర్యచంద్ర, రమణ, రమణమ్మ, కుమార్, సత్యనారాయణ, ఎన్వీ రమణ, కృష్ణారావు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం సకాలంలో అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎ.జాహ్నవి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధ్యక్షతన సబ్బవరం మండలం ప్రభుత్వ కళాశాలలో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 2,42,480 మంది రైతుల ఖాతాల్లో రూ.158.4 కోట్ల నిధులు జమ చేసినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే విధంగా 50 శాతం రాయితీపై వివిధ రకాల వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేశామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. పెందుర్తి నియోజకవర్గంలోని 18,606 మంది రైతుల ఖాతాల్లో రూ.12.35 కోట్ల నిధులు జమ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించి రైతులకు మేలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు మూడు విడతల్లో ఏడాదికి రూ.20వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో రైతులు వీక్షించే సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంయుక్త సహాయ సంచాలకులు ఎం.ఆశాదేవి, సహాయ సంచాలకులు సీహెచ్ సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారిణిలు రమామణి, అనిత, తహసీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ, ఎంపీపీ బోకం సూర్యకుమారి, మండల వ్యవసాయాధికారి పి.సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

ముందే మేల్కోండి.. క్యాన్సర్‌ని ఎదుర్కోండి

నర్సీపట్నం, న్యూస్‌టుడే

జీవన శైలిలో మార్పులతో క్యాన్సర్ కేసులు అధికమవుతున్నాయి. అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్ రోగులతోపాటు ఈ క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరగడం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. ముందుగా గుర్తించకపోవడంతో మరణాలు ఎక్కువవుతున్నాయి. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ఉచితంగా ఇంటి వద్దే క్యాన్సర్ స్క్రీనింగ్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

★ ఈ వ్యాధి లక్షణాలపై సమాజంలో చాలా మందికి అవగాహన ఉండటం లేదు. బాగా ముదిరిన తరువాత చికిత్స అందించినా ఫలితం దక్కడం లేదు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో గత సెప్టెంబర్ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో ఏర్పాటైన ప్రత్యేక శిబిరాల్లో నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీటిల్లో కొంత మంది అనుమానితులుగా తేలారు. వీరికి మరిన్ని పరీక్షలతో ప్రత్యేక చికిత్స అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

అభియాన్ శిబిరాల సమాచారం

క్యాన్సర్ రకం	పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య	అనుమానితులు
సర్వైకల్	6882	20
నోటి క్యాన్సర్	17486	69
బ్రెస్ట్ క్యాన్సర్	18543	34

★ మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, గుట్కా, అడ్డ పొగ వంటి వాటితో ఈ రోగాన బారిన పడుతుంటారు. శిబిరాలకు వచ్చే వారిని పరీక్షల ద్వారా కనుగొనేందుకు ఇప్పటికే అభియాన్ కార్యక్రమం దోహదపడింది. కొంతకాలంగా కొనసాగుతున్న ఎన్‌సీడీ కార్యక్రమాన్ని ప్రస్తుతం ఎన్‌సీడీ 4.0 గా మార్పు చేసి ఈ వ్యాధిగ్రస్తులను సైతం గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటి సర్వే కింద వైద్య సిబ్బంది ఇళ్లకే వచ్చి రోగ లక్షణాలు ఉన్నవారి వెంటనే రిఫరల్ ఆసుపత్రులకు పంపేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జనానికి వ్యాధిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.



"ముందుగానే గుర్తిస్తే దీనిని పూర్తిగా నయం చేయవచ్చని స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్‌కు జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ వీరజ్యోతి తెలిపారు. ఇది కొందరికే వస్తుందన్న అపోహలను అందరూ వీడనాడాలన్నారు. ఇది వచ్చినా భయపడనవసరం లేదన్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అభియాన్ కార్యక్రమంలో అనుమానితులకు విశాఖ కేజీహెచ్‌లో అన్ని పరీక్షలు చేపడుతున్నామన్నారు. అనుమానం ఉన్నవారంతా తమకు అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలతో వ్యాధిని నిర్ధారించుకొని ఉచితంగా చికిత్స పొందవచ్చని తెలిపారు.

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు బయలుదేరిన విద్యార్థులు

చోడవరం, న్యూస్‌టుడే: పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ నెల 21 నుంచి 23 తేదీలలో జరిగే 8వ క్యాడెట్ క్యొరుగి, పూమ్‌సే తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 14 మంది వెళుతున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై వెళ్తున్న వారిలో చోడవరానికి చెందిన చెందిన నమ్మి రిషితాంజలి, మేఘన, బొచ్చా కార్తిక్‌తోపాటు గండి కారుణ్య, సందీప్, బొసరి రాఘవ, డి.రుద్రాక్షరెడ్డి, వశిష్ట తదితరులు ఉన్నారు. వీరంతా ఈ నెలలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు, శిక్షకుడు పల్లం మురళీకృష్ణ తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆరుగురు విద్యార్థినులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గొడిచెర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌బీవీ సత్యకుమార్ తెలిపారు. కణితి ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన అండర్-14 బాలికల హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి పోటీల్లో కావ్య, దివ్యశ్రీ, అభినందని, దివ్యసంపూర్ణ, జ్యోషిక, సత్యవాణి ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు వీరిని ఎంపిక చేశారు. అన్నమయ్య జిల్లా కనికిరిలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామోపాధ్యాయులు లోవకృష్ణ, నర్సింగ్‌రాజ్, దివ్య తదితరులు అభినందించారు.

ఉపాధ్యాయులతో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, MVP Colony Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. RAVADA GOVINDU REDDY** S/o Ravada Atchireddi by keeping the below mentioned schedule property of as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

Erstwhile Visakhapatnam District, presently Anakapalli District, Nakkapalli Sub-District, Payakaraopeta Mandalam, Kumarapuram Gram panchayat and village accounts zeriothy dry land covered by S. No.8-9 an extent of Ac.0.26 cents, S. No.8-10 an extent of Ac.0.29 cents and S. No.8-12 an extent of Ac.1.56 cents into a single bit an extent of Ac.2.11 cents or 10212.4 sq. yards or 8538.863 sq. meters of land converted for non-agriculture purpose is bounded by:

EAST	Road leading to Kandipudi village
SOUTH	Road leading to Kandipudi village
WEST	Land of Ragala China Appa Rao etc.,
NORTH	Land of Smt. Vasa Lakshmi W/o Gandhi

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara
Visakhapatnam Visakhapatnam-13.
Dt.18.11.2025 Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

తక్కువ ధరకే ఇంజక్షన్లు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పెయ్యల కోసం ఇచ్చే ఇంజక్షను తక్కువ ధరకే అందజేస్తున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శ్రీధర్ తెలిపారు. గతంలో ఈ ఇంజక్షను ధర రూ. 500 ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.150కి వేస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎఫ్, జెర్సీ, దేశవాళీ ఆవులకు పెయ్యలు జన్మించేలా ఇచ్చే ఇంజక్షను పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచామన్నారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీస్, రత్నమాల రెసిడెన్సీ, డోర్ నెం. 45-40-42, 3వ అంతస్తు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, విశాఖపట్నం-530016.
వివరాలకు: 9618775577
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ Digital Partner: ఈనాడు.నెట్, ఈటీవీ భారత్ Organised by: ఈనాడు
EENADU SPORTS LEAGUE 2025

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

సెల్లార్లలో వ్యాపారాలు.. రహదారులపై వాహనాలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వాణిజ్య సముదాయాల్లో సెల్లార్లలో దర్జాగా వ్యాపారాలు చేస్తుండటంతో వాహనాలను రహదారులపై నిలుపుతున్నారని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. పట్టణంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోనల్ కార్యాలయం ముందు బుధవారం వీరు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ మాజీ వైస్ ఛైర్మన్ విల్లూరి పైడారావు, నూకాలమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ బొడ్డేడ అప్పారావు, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు చిన్నయ్యారావు మాట్లాడుతూ అనకాపల్లి పట్టణం జీవీఎంసీలో విలీనమైన పన్నులైతే మినహాయించడం లేదన్నారు. ఊరులో చెత్త తీసుకువచ్చి పట్టణం నడిబొడ్డున ఉన్న జోనల్ కార్యాలయం ఆవరణలో వేయడం సిగ్గు చేటన్నారు. సెల్లార్లలో దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నా అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వేదిక నాయకులు బండి అప్పారావు, కొల్లి దిన అప్పారావు, బొద్దు సోమరాజు, బొర్డు గోవిందరాజులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఉద్యోగ మేళాకు స్పందన

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జర్మనీలో ఉద్యోగాల కోసం ఎలమంచిలిలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. పెద్దసంఖ్యలో అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించినట్లు జిల్లా అధికారి గోవిందరావు తెలిపారు. స్థానిక సూర్య ఐటీఐలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని గోవిందరావు చెప్పారు. పాస్‌పోర్టు విధిగా ఉండాలన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు

విజేతలతో ఈడీ సమీర్‌శర్మ తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: 'ఎనర్జీ కన్జర్వేషన్' (శక్తి ఆదా) అంశంపై సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్ సంగం హాల్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం గ్రూప్-ఏలో 5 నుంచి 7వ తరగతి విద్యార్థులకు, గ్రూప్-బీలో 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు వేర్వేరుగా పోటీలను ప్రారంభించారు. గ్రూప్-ఏలో జి.హమ్సిత(నారాయణ కాన్సెప్ట్ స్కూల్ నెల్లూరు), కె.జాహ్నవి (ఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూల్, లక్కవరం) బి.ప్రత్యేక (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఉక్కునగరం); గ్రూప్-బీలో బి.తేజశ్వని (బాలభారతి పబ్లిక్‌స్కూల్, ఎన్టీపీసీ) కె.పరిణీత్ (డీపాల్ స్కూల్, ఉక్కునగరం) డి.దుర్గానిత్య (ఎస్ఎస్‌టీ మ్యాథ్యూస్ పబ్లిక్‌స్కూల్, పటమట, విజయవాడ) వరుస విజేతలుగా నిలిచారు. గ్రూప్-ఏ, బీ విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతి, మరో 20 మందికి కన్సొలేషన్ కింద ఒక్కొక్కరికి రూ.7500 నగదు, ప్రశంసా పత్రాలను సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ చేతుల మీదుగా అందజేశారు. రెండు గ్రూపుల్లో మొత్తం ఆరుగురు విజేతలను డిసెంబర్ 11న దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు రమణ, మహాపాత్రో, అనిత్ కుమార్, ప్రకాశరావు, శివంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
అనకాపల్లి బ్రాంచ్ (0393), GVMC ఎదురుగా, చోడవరం రోడ్డు, నెహ్రూ చౌక్ దగ్గర, అనకాపల్లి-531001. ఫోన్ నెం: 89259 50393. ఇ-మెయిల్: iob0393@iob.in

e-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది: 09.12.2025, ఉ|| 10:30 గం||ల నుండి మ|| 12:30 గం||ల వరకు

[illegible] https://baanknet.com/eauction-psb/bidder-registration [illegible]

తేది: 08.12.2025 సాయంత్రం 5.00 గం|| లోపుగా చెల్లించవలెను.

[illegible]

రిజర్వు ధర: రూ. 8,03,000/- ధరావత్తు సొమ్ము: రూ.80,300/-

బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/- ఏమైనా తెలిసిన ఎన్‌కంబరెన్స్‌లు: లేవు

ఆస్తి తనిఖీ తేది & సమయం: తేది 20.11.2025 నుండి ఉ|| 10 గం||ల నుండి సా|| 4 గం||ల లోపుగా.

స్థానిక ప్రభుత్వ బకాయిలు (ఆస్తి పన్ను, నీటి పన్ను, కరెంటు బిల్లులు మొ||) : బ్యాంకు వారికి తెలియదు.

*చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌లో ఏర్పాటుచేసిన https://baanknet.com, https://www.iob.in/ e-Auctions.aspx, https://www.publishtenders.gov.in, https://www.iob.in లింకు రిఫర్ చేయండి. మరిన్ని వివరములకు సంప్రదించండి: ఫోన్: 89259 50393.

తేది: 18.11.2025, ప్రదేశం: అనకాపల్లి సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

అసైన్డ్ భూముల్లో లేఅవుట్లపై దర్యాప్తు

స్పందనకు వందనం

రాంబిల్లి, న్యూస్‌టుడే: రైతులకు మంజూరు చేసిన అసైన్డ్ (డి.పట్టా) భూముల్లో దర్జాగా లేఅవుట్ వేసి విక్రయిస్తుండటంపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.. మూలజంపలో సాగుతున్న ఈ దందాపై ఈ నెల 17వ తేదీన 'అసైన్డ్ భూముల్లో లేఅవుట్' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. స్థానిక తహసీల్దారు ఆదేశాల మేరకు ఆర్.ఐ. రవికుమార్, వీఆర్వో కృష్ణ మూలజంప గ్రామంలో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి అమ్మకాలు జరిగిన భూములను గుర్తించారు. అమ్మకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఆ రైతుల 'డి' పట్టాలను రద్దు చేస్తామని తహసీల్దారు శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

మూలజంపలో విచారణ చేస్తున్న ఆర్.ఐ రవికుమార్, వీఆర్వో కృష్ణ

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలియజేయండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డీఆర్‌ఓ సత్యనారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు కోసం 964 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 466 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని సూచించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు వాసునాయుడు, ఉప తహసీల్దార్ ముజీబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం వద్ద నిత్యం అప్రమత్తం

ఈవీఎం గోదాం వద్ద నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. ఎస్పీ కార్యాలయం ఆవరణలోని ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై పార్టీల ప్రతినిధులతో చర్చించారు. పార్లమెంటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను ఎన్నికల విభాగం అధికారులు డీఆర్వోకు వివరించారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు వాసునాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం వద్ద డీఆర్వో సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

కృష్ణారావుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పదవీ విరమణ చేసిన హోంగార్డు కైసర్ల కృష్ణారావుకు ఆర్థిక సాయం చెక్కును ఎస్పీ తుహిన్ సిన్హా అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల ఒకరోజు వేతనం రూ. 4,03,670 అందించడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన కృష్ణారావును అభినందించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్. ✆ 9396 999 669.

HOME NEEDS

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడి బారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్య? 7675873377.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Trinadha Rao Pragada, S/o: Pragada Apparao, R/o: 38-21-10/1 Bapuji Nagar, 104 Area Marripalem, Visakha patnam, 530007. Have Changed My Name To Thrinadha Rao Pragada.

LOST

Sudhabattula Satya Padmalatha W/o. Srihari I Have Lost My Original Document no: 4260/2013, if any Found. ✆ 9908019939.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, బ్యాంక్‌లోన్ సదుపాయంతో VUDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకం. ✆ 8686997700.

SECOND SALE

మిథున్ ఏజెన్సీ కొనబడును. పాత A/C లు, సెంట్రల్ A/C లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్స్, ఫర్నీచర్, ఆన్‌లైన్ UPS లు, ఆడియోలు: 6309745364.

JOBS

Wanted *Project Manager *Accountant (F) *Logistics Faculty *IT Faculty *English & Soft Skills Faculty @ Srikalash Rushikonda. ✆ 8464848488.

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

@**@ ISO Co. Needs for Vizag Branch 1. Admin Managers (Rtd./ VRS) 2. Telecaller (F) 2 yrs. exp. Good Package. ✆ 9848551846.

ఉద్యోగ అవకాశము
ప్రముఖ ISO సంస్థలో నూతన బ్రాంచ్‌నందు పనిచేయుటకు అభ్యర్థులను ఎంపిక చేయబడును.
❖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్: M/F
❖ మేనేజర్స్/ మేనేజర్ ట్రైనీస్: M/F
❖ కో-ఆర్డినేటర్స్: M/F
అర్హత: ప్రైవేట్/ ప్రభుత్వ సంస్థలో పనిచేయువారు & పదవీ విరమణ చేయువారు మరియు ఇన్సూరెన్స్ రంగంలో వారు కూడా కావలెను. "నో ఫీజ్ వర్క్"
MONTHLY PACKAGE: 80 వేలు నుండి లక్షా 60 వేలు వరకు నిర్ణయించబడినది.
గమనిక: 1. పైన పేర్కొన్న ఉద్యోగము, మంత్లీ ప్యాకేజ్ ఇంటర్వ్యూ సమయంలో తెలియజేయబడును. 2. వెంటనే అపాయింట్ చేయబడును.
INTERVIEWS: 20, 21, 22 NOV-25
Con: S. VISWESWARA RAO - DGM
DOCTORS COLONY, VSP
Ph: 9985461280

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 - 29000. వ: 18-35. ✆: 7730958410.

భోగాపురం, ఆనందపురం కొత్త లేఅవుట్‌కి మార్కెటింగ్ చేయుటకు రియల్ ఎస్టేట్ చేసినవారు Rtd. పర్సన్స్, Working పర్సన్స్, హౌస్‌వైఫ్స్ కావలెను. శాలరీ+ఇన్సెంటివ్స్+ కమీషన్ ఇవ్వబడును. ఆసక్తి కలవారు సంప్రదించగలరు. ✆ 9440123604.

ప్రముఖ విద్యాసంస్థకు మేల్ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. (ఓన్లీ మేల్) Contact Phone Number: 9849413138.

వాంటెడ్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్స్ 10 M/F DTP/Tally ఫ్యాకల్టీ-1 M/F ఎగ్జిక్యూటివ్స్ (F) 5 cmsvizag.com@gmail.com ✆ 8465870102

ప్రముఖ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్, స్టోర్స్, టెలీకాలర్స్, అకౌంటెంట్, క్యాషియర్స్, రిసెప్షనిస్టు, మార్కెటింగ్, హెల్పర్స్ కావలెను. 8341177761/ 8019647888.

ప్రముఖ FMCG కంపెనీలో పనిచేయుటకు 3/4 వీలర్ డ్రైవర్స్ & సేల్స్‌మెన్స్, ప్యాకింగ్ కోసం హెల్పర్స్ (Female) కావలెను. ✆ 8897731257.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

ఎలమంచిలిలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పాఠశాలలో అక్రమాలు వివరిస్తున్న మోక్షిత్ తల్లిదండ్రులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో డావెన్సీ పాఠశాల యాజమాన్యం విద్యార్థులు ప్రాణాలు బలిగొంటోందని, ఇటీవల పాఠశాల ఈత కొలనులో మృతి చెందిన మోక్షిత్ తల్లిదండ్రులు ఆరోపించారు. బుధవారం ఎలమంచిలిలో జరిగిన జనవాణి కార్యక్రమానికి వచ్చిన వీరు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. తమ కుమారుడు మృతికి కారకులైన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల యాజమాన్యం చేస్తున్న అక్రమాలకు వీరు ఎమ్మెల్యేకి లిఖితపూర్వకంగా వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విజయకుమార్.. విద్యార్థికి మృతికి కారకులైన వారంతా జైలులో ఉన్నారన్నారు. మీరిచ్చిన ఫిర్యాదును ఎస్పీకి పంపిస్తానన్నారు. ఎలమంచిలి గాజువాక బైపాస్ రోడ్డులో సోమలింగపాలెం కూడలి వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని సమీప మూడు గ్రామాల ప్రజలు కోరారు. కూటమి నాయకులు రమేష్ నాయుడు, బోద్దపు శ్రీను, కొఠారు శ్రీనివాసరావు, గుర్రాల శేఖర్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

కశింకోట, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కశింకోట బస్ స్టేషన్ సమీపంలో బుధవారం సాయంత్రం కారును లారీ ఢీకొట్టిన సంఘటనలో కారు వెనుకభాగం ధ్వంసమైంది ఎలమంచిలి వైపు వెళుతున్న కారును లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. కారు వెనుకభాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ఉన్న మహిళ, డ్రైవరు సురక్షితంగా బయట పడ్డారు.

★ జాతీయ రహదారి బయ్యవరం సమీపాన బుధవారం తెల్లవారుజామున ఓ కారు ప్రమాదానికి గురైంది. ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతల వైపు రహదారిని దాటుకొని దిగువకు దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్నవారు సురక్షితంగా బయటపడ్డారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.కె.పట్నం శివారు పెదపేట సమీపంలో ఆయిల్ పామ్ తోటలో పని చేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన పోతల అప్పలనాయుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకన్నకు చెందిన పెదపేటలోని ఆయిల్‌పామ్ తోటలో ఏపుగా పెరిగిన కొమ్మలను తొలగించడానికి అప్పలనాయుడు కూలి పనికి వెళ్లాడు. తోటలో పనిచేస్తుండగా కత్తి 11 కేవీ విద్యుత్తు లైన్‌కి తగిలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రోలుగుంట ఎస్సై రామకృష్ణారావు తెలిపారు.

ఫోర్‌బే కెనాల్‌లో యువకుడి గల్లంతు

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు ఫోర్‌బే పవర్ కెనాల్‌లో బుధవారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు విహార యాత్రకు మోతుగూడెం వచ్చారు. వారిలో ముగ్గురు యువకులు ఈతకొట్టేందుకు కెనాల్‌లో దిగారు. ప్రవాహ వేగానికి **గనిశెట్టి జగదీశ్వరరావు** కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై సాధిక్ సిబ్బందితో అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు.

డీఫార్మసీలో 20 మందికి ప్రవేశాలు

విశాఖపట్నం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు బుధవారం నిర్వహించారు. 27 సీట్లకు 20 భర్తీ అయ్యాయి. రిజర్వేషన్ కోటాలో కొన్ని మిగిలి ఉన్నాయి.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	107
లైవ్	137	127
డ్రెస్‌డ్	199	224
స్కిన్‌లెస్	226	234

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: మాస్ జాతర, సత్యనారాయణ స్క్రీన్2: ఆటగదరా శివ, పర్తిసాయి: కాంత, షిర్డిసాయి: గర్ల్‌ఫ్రెండ్, రామచంద్ర: జిగ్రిస్, సత్య నారాయణ స్క్రీన్1: శివ, వెంకటేశ్వర: లవ్ ఓటీపీ, అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 కాంత, స్క్రీన్-2: గర్ల్‌ఫ్రెండ్

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

నక్కపల్లి: మండలంలోని ప్రజాప్రతినిధులకు బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ చైతన్య మాట్లాడుతూ వనరులను సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంచడం, సంపద కేంద్రాల నిర్వహణపై అంతా దృష్టి సారించాలన్నారు. సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు మరింత దృష్టి సారిస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఏఓ డి.సీతారామరాజు, శిక్షకులు శ్రీనివాస్, నరసింహరాజు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులతో ప్రమాదాలు

అనకాపల్లి పట్టణం: పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ఆటోలో నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులు, విద్యార్థులను ఎక్కించుకుంటే కేసులు నమోదుచేస్తామన్నారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టవద్దన్నారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్సై శేషగిరి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ

మెరుగైన ఉత్తీర్ణత సాధనకు కృషి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కస్తూర్బా విద్యాలయాల విద్యార్థినులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సమగ్రశిక్షా అదనపు పథ సంచాలకులు డాక్టర్ రోణంకి జయప్రకాశ్ పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థుల కోసం రాష్ట్ర సమగ్రశిక్షా కార్యాలయం నుంచి వచ్చిన అభ్యసన సామగ్రిని బుధవారం జిల్లా సమగ్రశిక్షా కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. జిల్లా పరిధిలోని 20 పాఠశాలల ప్రిన్సిపల్స్‌కు మెటీరియల్‌ను ఏపీడీ అందజేశారు. ఉపాధ్యాయులంతా జిల్లాను అగ్రస్థానంలో నిలపడానికి కృషి చేయాలని సూచించారు. పుస్తకాల పంపిణీలో జిల్లా బాలికాభివృద్ధి అధికారి జెమీమా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి ఉపాధ్యాయులకు సామగ్రి అందిస్తున్న ఏపీడీ జయప్రకాశ్

పంపా కోత.. పట్టదా వ్యథ

పాయకరావుపేట, న్యూస్‌టుడే

పంపా నది

పంపా కోత అన్నదాతకు వ్యధలు మిగుల్చుతోంది. అన్నవరం నుంచి ప్రవహిస్తున్న ఈ నది కుమారపురం, రత్నాయంపేట, రాజానగరం, వెంకటనగరం గ్రామాల మీదుగా గజపతినగరం వద్ద సముద్రంలో కలుస్తుంది. వర్షాలు, నదిలో నీటి ఉద్ధృతి సమయంలో ఏటి ఒడ్డు భూములు కోతకు గురవుతున్నాయి. నదికి ఇరువైపులా కొబ్బరి, సరుగుడు, వరి, జీడిమామిడి పండించే భూములున్నాయి. ప్రవాహం ఒరవడి ధాటికి సమీపంలోని భూములు ఏటిలో కలిసిపోతున్నాయి. దీంతో రూ. లక్షల విలువచేసే పంట భూములు కోల్పోతున్నారు. ప్రధానంగా ఆగస్టు నుంచి డిసెంబరు వరకు నదిలో జలాలు అధికంగా చేరుతుంటాయి.

✦ దీనివల్ల ఒక్కోసారి ప్రవాహ దిశ సైతం మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదటం, పాల్మన్‌పేట మధ్యలో పెద్దఎత్తున నది కోత కారణంగా పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. రాజవరం, గజపతినగరంలోనూ ఇదే పరిస్థితి ఉంది. అలల తాకిడి ఎక్కువగా ఉంటే నదిలోకి సముద్ర జలాలు చేరుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో జీడిమామిడి, సరుగుడు పెంచుతున్న భూములు నదిలో కలిసిపోతున్నాయి.

✦ కోత కారణంగా వెంకటనగరంలో ఇళ్లకు నష్టం వాటిల్లుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కోత నివారణకు వెంకటనగరం వద్ద కొంతదూరం రక్షణ గోడ నిర్మించారు. మిగతా గ్రామాల పరిధిలో కోత అధికంగా ఉన్న ప్రాంతాలు గుర్తించి రాతిపేర్పు వేయాలని కోరుతున్నారు. దీనివల్ల కోతకు అడ్డుకట్ట పడే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

నక్కపల్లి ఆసుపత్రిలో వైద్యుల కొరత..

నక్కపల్లి, న్యూస్‌టుడే

నక్కపల్లి ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఇటీవల వరకు ఇక్కడ అన్ని విభాగాలకు వైద్య నిపుణులు ఉండగా, బదిలీలతో మళ్లీ కొరత ఏర్పడింది. ఫలితంగా రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 50 పడకల ఆసుపత్రి వైద్య సేవల పరంగా ఎంతో కీలకంగా మారింది. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని రోగులతోపాటు జాతీయ రహదారి పరిధిలో జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులకు, ప్రయాణాల్లో ఉన్న రోగులకు ఇక్కడ అత్యవసర వైద్యసేవలందుతాయి. ఇతర గ్రామాలనుంచి వచ్చే రోగుల సంఖ్య భారీగా పెరిగింది. ఇదంతా బాగానే ఉన్నా, ప్రస్తుతం అందాల్సిన వైద్య సేవల్లో ప్రధానమైన నిపుణుల ఖాళీ ఇబ్బందికరంగా మారింది.

వైద్యం నిమిత్తం చంటిపిల్లలతో వచ్చిన తల్లులు

✦ ఆసుపత్రిలో ప్రధాన వైద్యాధికారిగా పనిచేసిన చంటిపిల్లల వైద్య నిపుణురాలు శిరీష బదిలీపై ఎలమంచిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. ఇక్కడ ఇద్దరు గైనిక్ వైద్యుల్లో ప్రస్తుతం ఒక్కరితోనే సేవలు అందుతున్నాయి. ఇక ఎన్‌బీఎస్‌యూ, ఎన్‌సీయూ కేంద్రాలు పర్యవేక్షించే ఇద్దరు వైద్యులు, ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్లు వెరసి ఆరు ఖాళీలున్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఆసుపత్రిలో డిప్యూటి సివిల్ సర్జన్లు పదోన్నతిపై మాత్రమే రావల్సి ఉంది. మరో రెండు పోస్టులు డీఎంహెచ్‌ఓ పరిధిలోనివి. ఇవి కూడా పదోన్నతిపైనే రావాలి. ఇందుకు కొంతసమయం పడుతుంది. గైనిక్, చంటి పిల్లల వైద్యుల ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక్కడ వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. – ఎస్.శ్రీనివాసరావు, డీసీహెచ్

✦ ఎన్‌బీఎస్‌యూ కేంద్రంలో అప్పుడే పుట్టిన పిల్లలకు పచ్చకామెర్లు తదితర సమస్యలు వస్తే వైద్యం అందిస్తారు. దీన్ని పర్యవేక్షించడానికి వైద్యుడు అవసరం తప్పనిసరి. వైద్యుల కొరతపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి తక్షణం వైద్యుల కొరత తీరేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ముఠా కార్మికుల సంక్షేమానికి చట్టం అవసరం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వీవీ శ్రీనివాసరావు, కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న అఖిల భారత సీఐటీయూ మహాసభల కోసం బుధవారం ముఠా కార్మికులు విరాళాలు అందించారు. ముఠా కార్మిక సంఘం నాయకులు సత్తిబాబు, నానాజీ, అప్పలకొండ కోరారు. సీఐటీయూ నాయకులు సోమునాయుడు, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్తు సరఫరా నిలుపుదల

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వెదురువాడ, సెజ్ కాలనీ, అచ్యుతాపురం, మోసయ్యపేట, రామన్నపాలెం, గొర్లె, మెట్ట, ఒంటవర్తవరం గ్రామాలు, మార్టూరువద్ద, సాయిప్రియలేఅవుట్, ఇందిరమ్మకాలనీ, వెంకటాపురం కాడలి, చోడపల్లి పరిసరాల్లో 18 ప్రాంతాలకు గురువారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు. మండలంలోని రామన్నపాలెం, ఎం.జగన్నాథపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్, ఏఈలు శ్రీనివాసరావు, భానుప్రకాశ్ తెలిపారు.

సీఎస్‌సీ వేడుకలో ప్రతిభ చూపండి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జైట్ కళాశాలలో వచ్చే నెల రెండున నిర్వహించనున్న సీఎస్‌సీ వేడుకల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ పేర్కొన్నారు. వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. ప్రాజెక్టు రూపకల్పనలో విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపల్ వైఖాదారావు, సుజాత పాల్గొన్నారు.

పేద మహిళను ప్రభుత్వం ఆదుకోవాలి

అచ్యుతాపురం: మొంథా తుపాను ప్రభావంతో తాటాకు ఇల్లు కూలిపోయి నివాసాన్ని కోల్పోయిన కొండకర్లకు చెందిన పేద మహిళ దొడ్డపూడి వరహాలమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు బుద్ధ రంగారావు, సోమునాయుడు కోరారు. కూలిపోయిన ఇంటిని చూసి వెళ్లిన అధికారులు సాయం అందివ్వకపోవడంతో బుధవారం బాధిత మహిళలతో కలిసి కొండకర్లలో నిరసన వ్యక్తం చేశారు. పేదలకు సైతం సాయం అందివ్వడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు.

వ్యసనాలతో భవిష్యత్తు నాశనం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: యువత చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రామకృష్ణ సూచించారు. మండలంలోని కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ రహిత సమాజం - సంక్షేమానికి సంకేతం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల యువత ఎటువంటి చెడు మార్గాలకు అలవాటు పడుతున్నారన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత దేశానికి వెన్నెముక అని, డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకోవాలని బలవంతం చేస్తే 1972కి ఫోన్ చేయాలని కోరారు. ఎస్సై విభీషణరావు, ప్రధానోపాధ్యాయుడు కప్పల ప్రసాద్, ఉపాధ్యాయులు నానాజీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ ఉన్నా.. ఫలితం సున్నా..

పాఠశాల వేళలో ఇతరులు, మూగజీవాలు ఆవరణలోకి వస్తుండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. నక్కపల్లిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఉన్నత పాఠశాల ఉంది. దాదాపు రూ. 30 లక్షల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో ప్రహరీ పనులు మొదలు పెట్టి ఆదిలోనే ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి వంగలపూడి అనిత చొరవతో దాదాపుగా ఈ పనులు చేయించారు. చుట్టూ గోడ నిర్మించిన అధికారులు ప్రధాన ద్వారం వద్ద గేటు ఏర్పాటు చేయలేకపోయారు. ఐదే వేళల్లోనూ, సెలవుల్లోనూ మూగజీవాలు, పశువుల సంచారం ఉంటుంది. బయటి వ్యక్తులు తిరుగుతుంటారు. ఫలితంగా బోధనా సమయాల్లో ఆటంకం ఏర్పడుతోంది. – న్యూస్‌టుడే, నక్కపల్లి

ఆదమరిస్తే అంతే సంగతి...!

ప్రమాదకరంగా గొయ్యి

ఎస్.రాయవరం - వెంకటాపురం ఆర్‌అండ్‌బీ రహదారిపై కర్రివానిపాలెం వద్ద గొయ్యి ఏర్పడి మూడు నెలలు గడిచినా ఆర్‌అండ్‌బీ అధికారులు గుంత పూడ్చివేత చర్యలు తీసుకోలేదు. ఇక్కడి రహదారిపై కల్వర్టు కుంగిపోవడంతో భారీ గుంత పడింది. ఈ రహదారిపై కర్రివానిపాలెం, వెంకటాపురం, పిట్లపాలెం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఎవరైనా రాత్రి సమయంలో అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో గ్రామస్థులు గుంతలో కొంతమేర మట్టి వేసి, ఎర్ర జెండా ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, ఎస్.రాయవరం

నిరుపయోగం.. కానరాని ఆదాయమార్గం

అనకాపల్లి గవరపాలెంలో జీవీఎంసీ దుకాణాల సముదాయ భవనం శిథిల స్థితికి చేరుకోవడంతో ఇక్కడ అద్దెకు ఉంటున్న వారిని ఖాళీ చేయించారు 2023లో నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించారు. పనులు చేపడతామని నాటి నుంచి నేటి వరకు చెబుతున్నారు. పనులు మాత్రం చేపట్టలేదు. దీంతో విలువైన స్థలం ఉన్నా దుకాణాల ద్వారా వచ్చే ఆదాయం జీవీఎంసీ కోల్పోతుంది. ఇక్కడ దుకాణ సముదాయం నిర్మాణంపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

అగ్గిమర్రిచెట్టు వద్ద జీవీఎంసీ దుకాణాలు

ఉపాధ్యాయులపై బోధనేతర ఒత్తిడి వద్దు

సమావేశంలో జిల్లా ప్రతినిధులు

కొత్తూరు (అనకాపల్లి): ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడిని ఆపాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్షాయాని శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. బోధనేతర పనులతో బోధనకు, విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. జిల్లా పూర్వపు అధ్యక్షుడు జీకేఆర్ స్వామి, జిల్లా ప్రతినిధులు అలివేలు, ఆశ, చింతాడ వెంకట రమణ పాల్గొన్నారు. మండల కార్యవర్గ ఎన్నిక యూటీఎఫ్ జిల్లా కోశాధికారి జోగా రాజేష్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మామిడి బాబూరావు, సూర్రెడ్డి జగ్గుబాబు ఎన్నికయ్యారు.

మహిళలను పూజించే సమాజాన్ని సృష్టించాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మహిళలను పూజించే సమాజాన్ని సృష్టించడానికి అందరూ కృషిచేయాలని స్థానిక గ్రంథాలయాధికారి ఎల్వీ రమణ కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఆమె సేవలను, ధైర్య సహసాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు విజయపావని, శివకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: చినదొడ్డిగల్లు గ్రంథాలయానికి యువకులు కుర్చీలు వితరణగా అందించారు. గ్రామానికి చెందిన యూత్‌రాక్స్ యాక్టివ్ బాయ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 కుర్చీలు ఇచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, మ్యూజికల్ ఛైర్, నక్కపల్లిలో పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు కలగా జనార్దన్, గోవింద ఈశ్వర రావు, హెచ్.ఎం.బాలాజీ పాల్గొన్నారు. ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. లక్ష్మీప్రసన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పేటలో విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి వి.లక్ష్మణరావు, ఎస్.సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: కోటవురట్లలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థినులు హాజరై ముగ్గులు వేశారు.

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెం శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రంగవల్లుల పోటీలు, కుర్చీల పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు బి.శ్రీదేవి, ఎ.రమాదేవి, ఎంవీకె.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి, మునగపాక, న్యూస్‌టుడే: ఎలమంచిలి గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు వి.ఆనంద్ విజేతలను ఎంపిక చేశారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరగాంధీ చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి విమలగిరి పాల్గొన్నారు. గణపర్తి శాఖాగ్రంథాలయంలోనూ మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయాధికారులు సత్యవతి, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో..

పాయకరావుపేటలో..

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అనకాపల్లి, అచ్యుతాపురం, పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక జీవీఎంసీ భవనంలో బుధవారం నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులు విడుదల కార్యక్రమం చేపట్టారు. ఇందుకు సంబంధించిన నమూనా చెక్కును రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గంలోని 22,300 మంది రైతులకు రూ.14.56 కోట్లు నిధులు విడుదలైనట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాము పాల్గొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే రామకృష్ణ వినతులు తీసుకున్నారు. ✦ అచ్యుతాపురం మండలం యర్రవరంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేశారు. నియోజకవర్గంలో 33760మంది రైతులకు రూ.21.9కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఎలమంచిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ తట్టా లోవకుమారి, భాజపా నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, కూటమి నాయకులు ఏడీఏ సుమంత, ఏఈఓ సూర్యనారాయణ పాల్గొన్నారు. ✦ పీఎల్ పురం మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ నగదు మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కంవెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, ఏడీ ఉమాప్రసాద్ విడుదల చేశారు.

రైతులకు నమూన చెక్కు అందిస్తున్న కొణతాల, పీలా

జ్ఞానేంద్రియాలలో కంటికి ప్రాధాన్యం

కశింకోట: జ్ఞానేంద్రియాలలో కంటికి ప్రాధాన్యం ఉందని, వాటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందని కంటి వైద్యులు మురళీకృష్ణ సూచించారు. తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 380 మందికి బుధవారం కంటిపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కంటివైద్యులు మురళీకృష్ణ

అయ్యప్పస్వామి మండల ఉత్సవాలు ప్రారంభం

పూజా కార్యక్రమంలో గురు స్వాములు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అయ్యప్ప స్వామి ఆలయంలో మండల ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా తొలిరోజు మూలమూర్తి అయ్యప్పస్వామికి పలు అభిషేకాలు, పూజలు చేసి విశేష మూర్తిగా అలంకరించారు. ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ, సాయి శర్మల ఆధ్వర్యంలో పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలెంలోని భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం లక్ష బిల్వార్చన, కుంకుమార్చన, శాంతి కల్యాణం, రుద్ర హోమం నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగల సత్యనారాయణ, అర్చకులు పేరూరు సూర్యనారాయణ, చిన్నస్వామి, సాత్విక్ పాల్గొన్నారు.

మునగపాక: మునగపాకలోని సాంబమూర్తిదేవుని శూలాలు, గుమ్మటానికి బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శుద్ధి చేశారు. ప్రతీ ఏటా శూలాల మహోత్సవాన్ని కార్తికమాసం రెండో సోమవారం నిర్వహిస్తామని ఉత్సవకమిటీ ఛైర్మన్ బూడిద శ్రీను తెలిపారు. అర్చకులు నరసింగరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని దుర్గాలమ్మ చెట్టు వద్ద అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ల వరహాలబాబు, జగతా శ్రీను పాల్గొన్నారు.

రాంబిల్లి,: కార్తిక మాసం నెల రోజుల్లో పంచదార్ల ఉమాధర్మలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ. 1,42,635 వచ్చింది. ఆలయంలో బుధవారం ఈఓ కె.ఎస్.వి.తేజ, ఆలయ కమిటీ ఛైర్మన్ యండమూరి గోవిందరావు ఆధ్వర్యంలో హుండీలు లెక్కించారు.

గవరపాలెంలో లక్ష బిల్వార్చనలో భక్తులు

INTERIOR DECORATOR
OLD BUILDING?
We Make it New!
Design-Renovate-Transform
Guaranteed Premium Finish
Cell: 9885824528

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Madhurawada Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. BODDIDA VENKATA KANYA KUMARI** W/o Potnuri Raju D/o Late B Bala Ram by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within Seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY

Anakapalli District, Anakapalli Revenue Division, Sabbavaram Sub-District, Anakapalli Mandalam, Akkireddypalem, Gram panchayat, Maredupudi Sivaru, Akkireddypalem village, Gram Kantam S. No.403-1 site measuring East to West 21.6 feet or 6.58 meters and North to South 30 feet or 9.15 meters totaling 71.666 Sq. yards or 60.199 Sq. meters together with RCC building ground floor with plinth area of 450 SFT bearing D. No.7-826, assessment No.826 is bounded by: **EAST:** Road; **SOUTH:** Foundation of Duli Suryakantham; **WEST:** Road; **NORTH:** Foundation of Aripaka Usha Rani

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.18.11.2025. Mobile No.9885166648 Mail: sreenivaskoduri@gmail.com

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722
ఎలమంచిలి- 80085 74726
పాయకరావుపేట- 80085 74750

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: విద్యుత్తునగర్‌లో మట్టిరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. రహదారి నిర్మాణాలు చేపట్టగలరు. – రమణ, విద్యుత్తు నగర్, ✓: రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – ఈశ్వరరావు, తుమ్మపాల పంచాయతీ కార్యదర్శి

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: స్థానిక విజయరామరాజుపేటలో కల్వర్టు దెబ్బతింది. దీనివల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. – పలకా రాము, అనకాపల్లి, ✓: కల్వర్టు బాగు చేయిస్తాం. – ఎస్.శేఖర్, ఈఈ, అనకాపల్లి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని బృందావనంలో కురుమెళ్ల లేఅవుట్ సమీపంలో రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. – వెంకటేశ్వరరావు, స్థానికుడు, ✓: చెత్త తొలగించి పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – కె.డేవిడ్, ఈవో

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: కొండకర్లలో కుళాయిలకు చప్టా లేకపోవడంతో బిందెలతో నీటిని తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. బురద, మురుగునీరు తలకు అంటుకుంటోంది. – శ్రీలక్ష్మి, కొండకర్ల, ✓: చప్టాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. – నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, కొండకర్ల

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని పాతజాతీయ రహదారి పక్కన డెబ్రిస్ కుప్పలుగా పోస్తున్నారు. దీనివల్ల రోడ్డు దిగడానికి ఇబ్బందిగా ఉంది. – ఎం.రామారావు ఎలమంచిలి, ✓: రోడ్డు పక్కల ఇలా డెబ్రిస్ కుప్పలుగా పోయకుండా చర్యలు తీసుకుంటాం. ఇలాపోసే వారిపై దృష్టి సారిస్తాం. – బాకూరి ప్రసాదరాజు కమిషనర్ ఎలమంచిలి

మత్స్యకారుల ధర్నాకు మద్దతు

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు ఐద్వా ప్రతినిధులు బుధవారం మద్దతు తెలిపారు. గ్రామానికి వెళ్లిన వీరంతా శిబిరంలో కూర్చుని సంఘీభావం ప్రకటించారు. సంఘం రాష్ట్రాధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ 67 రోజులుగా వీరు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమణి, సత్యవతి, మాణిక్యం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార మహిళలకు సంఘీభావం తెలుపుతున్న ఐద్వా ప్రతినిధులు

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి గవరపాలెం నిదానందొడ్డి సాయి మందిరంలో సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల్లో భాగంగా. మందిర ఆవరణలో బుధవారం పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ మళ్ల సత్యసాయి, కన్వీనర్ కెవి మహేశ్వరరావు, కోకన్వీనర్ యల్లపు మాధవరావు తెలిపారు.

పాయకరావుపేట: పేట మండల సత్యసాయి భజన ఆధ్వర్యంలో తుని ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలో గుడారాల్లో నివసిస్తున్న 50 కుటుంబీకుల మహిళలతో కేక్ కట్ చేయించారు. వీరందరికీ చీరలు పంపిణీ చేశారు. పురుషులకు దుప్పట్లు, 25 మంది పిల్లలకు దుస్తులు అందజేశారు. భజన మండలి కన్వీనర్ రమేష్ బాబు, ప్రతినిధులు యజ్ఞవల్క్య శర్మ, రమణరాజు, సాయి సరోజ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక మండలం తిమ్మరాజుపేట సత్యసాయి మందిరంలో మహిళలు వ్రతాలు చేశారు. మందిర నిర్వాహకులు సరిసా శివ, శరగడం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో సత్యసాయి సేవాసమితి జిల్లా విద్యావిభాగం కోఆర్డినేటరు మహేశ్వరి మహిళలచే వ్రతాలు చేయించారు.

నక్కపల్లి: సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా నక్కపల్లిలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. నిర్వాహకులు, దాతలు కలిసి వీటిని పేదలకు అందించారు. అయిదు రోజుల పాటు వేడుకలు జరుగుతాయని, రోజుకో కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

నక్కపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న భజన మండలి సభ్యులు

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజుకు నిర్ణీత మొత్తమే వసూలు చేయాలని విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను సూచించారు. మాకవరపాలెంలోని జడ్పీ పాఠశాల, ఓ ప్రైవేట్ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నవీ, లేనివీ పరిశీలించారు. డిసెంబరు 6 నుంచి మొదలయ్యే వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో-2 మూర్తి వెంట ఉన్నారు.

ఆయకట్టుకు నీటి సరఫరా తగ్గింపు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని కోనాం జలాశయం పరిధిలో వరి కోతలు మొదలవడంతో ఆయకట్టుకు నీటి విడుదలను అధికారులు కుదించారు. ఎగువ కాలువ గేట్లు మూసివేశారు. ప్రస్తుతం స్పిల్‌వే, దిగువ తూముల నుంచి 90 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. అవసరమైనవరకు నీటిని మళ్లించుకుంటున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, బుధవారం నాటికి 95.80 మీటర్లకు తగ్గింది.

కాలువలో పారుతున్న నీరు

గట్టుపై చెట్టు.. నీటివనరులకు పట్టు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: సంప్రదాయ నీటివనరుల పునరుద్ధరణ కార్యక్రమం పేరిట చెరువుల అభివృద్ధికి కేంద్రం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా వర్షపునీటి సంరక్షణతోపాటు చెరువులను ఆక్రమణదారుల నుంచి తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి వ్యవసాయ నీటి పారుదల పథకం కింద రానున్న రోజుల్లో చెరువు గట్లను పటిష్ఠం చేయడం గట్లపై కొబ్బరి మొక్కలు పెంపకం మొక్కలతో కంచెల నిర్మాణం, గ్రీన్ ఫెన్సింగ్, తదితర పనులు చేపట్టే అవకాశం ఉంది.

జమ్మాదేవిపేట చెరువు గట్టుపై కొబ్బరిమొక్కలు

16 చెరువు గట్లపై..

మండలంలోని సుమారుగా 32 సాగునీటి చెరువులు ఉన్నాయి. ఇప్పటి వరకు 16 చెరువులకు ఉపాధి పథకంలో భాగంగా గట్లు పటిష్ఠం చేసి వందల సంఖ్యలో మొక్కలు నాటారు. చాలా చెరువుల వద్ద చెట్లు అప్పటికే కాయలు కాసే దశకు చేరుకున్నాయి. పంచాయతీలకు ఆదాయం చేకూరే అవకాశం ఉంది.

లక్ష్యం మంచిదే ఆచరణ కరవు

మండలంలోని పలు చెరువు గట్లపై వేసిన మొక్కలకు రక్షణ లేక లక్ష్యం నీరుగారిపోతోంది. గట్లపై నాటి కొబ్బరి మొక్కలకు ఎప్పుడు సంవత్సరానికి ఒక్కసారి రక్షణ ఏర్పాటు చేసి వదిలేయడంతో మొక్కలను మేకలు, పశువులు మేసి పాడు చేస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

చర్యలు చేపడతాం...

మండలంలోని ప్రతి చెరువుపై మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు చేపడతాం. ఉపాధి శ్రామికులతో నిత్యం వాటిని నీరు పోయడం, కంచె వేయడం, పశువులు మేకల బారిన పడకుండా చేసేందుకు సిబ్బందికి తెలియజేస్తాం. – మురళీ కృష్ణ, మండల ఉపాధి హామీ పథకం అధికారి

ఆయుర్వేద వైద్యానికి అవస్థలు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లుంది ఆయుర్వేద వైద్యశాలల పరిస్థితి. గవరవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనంలోని ఆయుర్వేద వైద్యశాల ద్వారా సక్రమంగా సేవలందుతున్నా వసతులు లేవు. 2011 జులైలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఈ భవనాన్ని ప్రారంభించారు. సుమారు 14 ఏళ్లకే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వైద్యసేవల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

★ ఆరేళ్ల నుంచి మూతపడిన ఈ వైద్యశాలకు ఈ ఏడాది జూన్‌లో ఆనందపురం మండలం శొంఠ్యాం నుంచి వైద్యాధికారి పద్మావతి బదిలీపై వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. కీళ్లనొప్పులు, నరాల బలహీనత, పక్షవాతం, జలుబు, దగ్గు, ఆస్తమా, చర్మవ్యాధులు, గ్యాస్ట్రిక్, కిడ్నీల్లో రాళ్లు, మూలవ్యాధి, ఎర్ర, తెల్లబట్ట, పిల్లలకు సంబంధించిన వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు.

రక్షణలేని కారుతున్న భవనంలో మందులు

★ కోటపాడు, బొయిలికింతాడ, తిమ్మారం, ఆఫీసాక, గవరవరం, అబ్బవరం, రేవళ్లు, పైడంపేట, ముఖలింగపల్లి, మైచర్లపాలెం, జి.జగన్నాథపురం తదితర గ్రామాల నుంచి వైద్యం చేయించుకోవడానికి ఇక్కడికి వస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత భవనం వర్షానికి కారిపోతుండటంతో రూ.లక్షల విలువైన మందులతోపాటు పరికరాలు కూడా పాడవుతున్నాయి. చోడవరం మండల కేంద్రంలో వైద్యశాల ఏర్పాటుచేస్తే మరింత మంది రోగులకు మేలు జరుగుతుంది.

వర్షానికి కారుతున్న భవనం స్లాబు

పైకప్పు కారుతోంది..

చాలాకాలం కిందట నిర్మించిన భవనం కావడంతో కారిపోతోంది. విలువైన మందులకు సరైన రక్షణ ఉండటం లేదు. ఇరుకు గదిలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవననిర్మాణానికి మరమ్మతులు చేపట్టాలి. లేకపోతే చోడవరం మండల కేంద్రానికైనా మార్చాలి. మేలు. – ఎస్. వెంకటరావు, గవరవరం

అధికారులు పట్టించుకోవాలి..

ఆయుర్వేద వైద్యశాల భవనం పరిస్థితి బాగో లేదు. వర్షం వస్తే రోగులకు వైద్యసేవలు అందించడం చాలా కష్టంగా ఉంటుంది. చాలా ఇరుకు గదిలో రోగులకు సేవలందించాల్సి వస్తోంది. మందులతోపాటు ఇతర పరికరాలు పాడవుతున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. – బి. పద్మావతి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: గోపికల గోవ ట్రైవ్, ఆట్ల కాదరా శివ, సీతా ప్రయాణం కృష్ణతో, లవ్ ఓటీపీ, మా ఊరి వెంకన్న ఆడి 2: ది గర్ల్ ఫ్రెండ్, సంతాన ప్రాప్తిరస్తు ఆడి 3: కాంత, ఆడి 4: శివ, రోలుగుంట సూరి, జగదీష్ బంగార్రాజా: ప్రీ వెడ్డింగ్ షో రాజు: జంగిరి
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: కాంత సాయిలక్ష్మి: శివ, పుష్ప: జటాధర

రాజ్యాధికారమే అందరి లక్ష్యం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్వతంత్ర సంగ్రామంలో స్ఫూర్తిదాయకంగా నిలిచిన దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో ముందుకు సాగాలని టీపీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న కోరారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని రామారావుపేటలోని ఆమె విగ్రహానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాజ్యాధికారమే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా కార్యదర్శి సిద్ధా తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ చెట్లపై అక్రమార్కుల కన్ను

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం కోనాం జలాశయం వద్ద ఉన్న భారీ వృక్షాలపై అక్రమార్కుల కన్ను పడింది. చెట్లను గట్టు చప్పుడు కాకుండా నరికి తరలించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రణాళిక చేశారు. జలాశయం గట్టుపై విశ్రాంత భవనం వెనక ఉన్న భారీ వృక్షాన్ని రాత్రి సమయంలో నరికేశారు. దుంగలను తుప్పల్లో దాచారు. ఇక్కడ ఎన్నో ఏళ్ల నాటి వృక్షాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వృక్షాల అక్రమార్కుల గొడ్డలి వేటుకు గురికాకుండా సంరక్షించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. దీనిపై జలాశయం ఇన్‌ఛార్జి ఏఈ సత్యనారాయణదొరను సంప్రదించగా.. జలాశయం వద్ద చెట్టును నరికినట్లు తెలిసిందన్నారు. తక్షణమే సిబ్బందిని పంపించి దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

జలవనరులశాఖ స్థలంలో అక్రమార్కులు నరికిన చెట్టు

సామూహిక సీమంతం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని శారదా నగర్‌లోని సత్యసాయి మందిరంలో బుధవారం 62 మంది గర్భిణులకు భక్తులు సామూహిక సీమంతం చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం సత్య సాయి నామ సంకీర్తన జరిగింది. సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీమంతానికి హాజరైన మహిళలు

అన్నదాతలకు ఆర్థిక లబ్ధి

చోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని 12,850 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ మేరకు రూ.8.18 కోట్లు నగదు వారి ఖాతాల్లో జమ అయ్యేందుకు వ్యవసాయ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. రైతు సేవాకేంద్రాల్లో సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.

రుణాల సొమ్ము స్వాహాపై విచారణ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: అవురువాడ పంచాయతీ పరిధిలో గ్రామ సమాఖ్య సంఘాల డ్వాక్రా రుణాలు స్వాహాపై బుధవారం జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్టు అధికారిణి శచి దేవి విచారణ చేపట్టారు. బ్యాంకు లావాదేవీలను పరిశీలించారు. అనంతరం అవురువాడ పంచాయతీ సచివాలయంలో బాధితులతో చర్చించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయమని పెద్దల సమక్షంలో తెలిపారు. గిరిజనుల సొమ్మును కాజేసిన వారిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రతినెల డ్వాక్రా సంఘాల సమావేశాలు నిర్వహించి సభ్యులు బ్యాంకుకు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, బుచ్చిరాజు, కోటి, ఎంపీటీసీ సభ్యుడు దొర లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని మహాత్మా జ్యోతిరావ్‌పులే గురుకుల విద్యార్థుల కార్తిక వనసమారాధన బుధవారం ఉత్తరవాహిని తీరంలో ఉత్సాహంగా కొనసాగింది. అమ్మోరు, కాంతారా వేషధారణల్లో నృత్యాలు, కర్రసాము, యోగా, పిరమిడ్ విన్యాసాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ దేవరాజ్ పర్యవేక్షించారు.

శీతాకాలంలో.. న్యుమోనియాతో జాగ్రత్త

చీడికాడ, న్యూస్‌టుడే: ఎవరికైనా న్యుమోనియా రావొచ్చు. కాకుంటే పిల్లలకు ప్రాణాంతకంగా మారుతోంది. చలిపులి ముసిరే వేళ ఎక్కువ మంది దీని బారిన పడుతున్నారు. తొలి దశలోనే లక్షణాలను గుర్తించి చికిత్స అందిస్తే ఎలాంటి సమస్య ఉండదు. న్యుమోనియాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సాన్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆచరణలోకి తెచ్చింది.

ఎల్.బి.పట్నంలో పిల్లలను పరీక్షిస్తున్న చీడికాడ వైద్యాధికారి మురళీకృష్ణ, సిబ్బంది

★ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు ఈనెల 13వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి 0-5 ఏళ్లలోపు పిల్లల ఆరోగ్య పరిస్థితుల్ని ఆరా తీస్తున్నారు. న్యుమోనియా (ఊపిరితిత్తుల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్)లక్షణాలుంటే వెంటనే గుర్తించి చికిత్స అందించేందుకు వైద్యఆరోగ్య శాఖ కార్యచరణ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు సాన్స్ కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు పిల్లలు రెండు లక్షలకు పైగా ఉన్నారు. వారిని నిశితంగా పరిశీలిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

★ జ్వరం ★ అతివేగంగా శ్వాస తీసుకోవడం ★ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ★ శ్వాస తీసుకునేటప్పుడు ఛాతి లోపలకు పోవడం ★ పాలు, ఆహారం రుచి తెలియకపోవడం, ఆకలి తగ్గడం.

ఇలా నివారించవచ్చు..

అవగాహన, టీకాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్సతో న్యుమోనియాను నివారించి పిల్లల్ని దాని నుంచి కాపాడవచ్చని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. చీడికాడతో పాటు జిల్లాలోని పలు మండలాల్లోని పీహెచ్‌సీలను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి దీనిపై సూచనలు చేస్తున్నారు. శీతాకాలం నేపథ్యంలో న్యుమోనియా లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా 24 గంటల్లోగా వైద్య సేవలు పొందాలని సూచించారు. అధికారుల ఆదేశాలతో న్యుమోనియాపై గ్రామాల్లో వైద్య శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికి పర్యటించి అవగాహన కల్పించి లక్షణాలను చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సునీల్‌కుమార్, మురళికృష్ణ, సిబ్బంది ఇంటింటికీ వెళ్తున్నారు.

టైరుపేలి లారీ బోల్తా

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని నీలకంఠాపురం సమీపంలో బుధవారం క్వారీ లారీ బోల్తాపడింది. రావికమతం మండలంలోని క్వారీల నుంచి లారీలతో బండరాళ్లను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేబీరోడ్డు మీదగా అనకాపల్లి వైపు వేగంగా వెళ్తున్న ఓ లారీ నీలకంఠాపురం సమీపంలో టైరు పేలి బోల్తాపడింది. లారీలోని బండరాళ్లన్నీ పక్కనే ఉన్న వరిపొలంలోకి దొర్లుకుపోవడంతో పంటంతా ధ్వంసమైంది. ఆ సమయంలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

కె.బి.రోడ్డులో బోల్తాపడిన వాహనం

దాతల సహకారంతో శివాలయ నిర్మాణం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అంకుపాలెం గ్రామంలో దాతల సహకారంతో శివాలయాన్ని నిర్మిస్తున్నారు. సుమారు రూ. 45లక్షలతో ఆలయ నిర్మాణం జరుగుతోంది. గ్రామంలో అమ్మవారి ఆలయాలతోపాటు రామాలయం ఉంది. శివాలయం లేకపోవడంతో గ్రామ పెద్దలు, దాతల సహకారంతో దుర్గాదేవి ఆలయం పక్కన నిర్మాణం చేపడుతున్నారు. ఆలయాన్ని పూర్తిచేసి త్వరలో ప్రారంభిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధానశాస్త్రవేత్త రాజ్‌కుమార్ సూచించారు. కృషివిజ్ఞాన కేంద్రం ఆవరణలో బుధవారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదగా పీఎం కిసాన్ నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని రైతులంతా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని చెప్పారు. శాస్త్రవేత్తలు ఎన్.సత్తిబాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.6 లక్షల బీమా అందజేత

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు విశాఖ డెయిరీ జోనల్ కార్యాలయంలో సంస్థ డైరెక్టరు సుందరపు గంగాధర్ రూ.6 లక్షల బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో రైతు బీమా చెక్కులు రూ. 3.60 లక్షలు, పశుబీమా చెక్కులు రూ.2.40 లక్షలున్నాయి. సహాయక మేనేజరు మేనేజరు అప్పారావు, సూపర్‌వైజర్ చక్రి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కు అందిస్తున్న విశాఖడెయిరీ డైరెక్టరు సుందరపు గంగాధర్

కె.కోటపాడు, న్యూస్‌టుడే : ఆకస్మికంగా మిత్రుడు మృతిచెందడంతో ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. చౌడువాడకు చెందిన మల్లారపు అప్పలరాజు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన భార్య, బిడ్డలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న 2002లో అతనితోపాటు పదో తరగతికి చదివిన పూర్వ విద్యార్థులు రూ.62 వేలను అందించారు. ఈ మొత్తాన్ని పీఏసీఎస్‌లో డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టరు సుందరపు గంగాధర్, పీఏసీఎస్ ఛైర్మన్ రాజి నాని, పోస్ట్‌మెన్ నంది ఫణికుమార్, తనకల పట్టాలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధిహామీతో వ్యవసాయాన్ని అనుసంధానం చేయాలి

రోలుగుంట, న్యూస్‌టుడే: రైతు పండించే పంటకు గ్యారంటీ లేదని అందుకే ఉపాధిహామీ పథకంతో వ్యవసాయాన్ని అనుసంధానం చేయాలని కోరుకునే వాళ్లలో తానే ముందుంటానని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో భాగంగా బుధవారం రోలుగుంటలో ఏర్పాటైన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకం అర్హులందరికీ అందేలా రెవెన్యూ లోపాలను సత్వరమే సరిచేయాలని నియోజకవర్గంలోని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోలుగుంటలోని ప్రభుత్వ కార్యాలయాలకు గతంలో భూములిచ్చిన రైతుల్లో చాలామంది ఇళ్లు, ఇంటిస్థలం లేకుండా ఇబ్బంది పడుతున్నారని, వారందరికీ స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గేదెల సత్యనారాయణ, మల్లునాయుడు, కోటేశ్వరరావు, అప్పలనాయుడు, రమణమూర్తిలతోపాటు మండల నాయకులు గుములూరు చంద్రమౌళి, సుర్ల రామకృష్ణ, పంచాడ చంద్ర, మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి చిరంజీవి, తహసీల్దార్ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై ఎమ్మెల్యే రాజు, నాయకులు, అధికారులు

ప్రకృతి సాగుపై దృష్టి సారించండి

మాడుగుల గ్రామీణం, దేవరాపల్లి, న్యూస్‌టుడే: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సాగుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని తులసి కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ నగదు పంపిణీ నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. రానున్న రోజుల్లో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు సాగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా అర్హులైన వారికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో 45,340 మందికి రూ. 29.7 కోట్లు మంజూరైందన్నారు. గతంతో పోలిస్తే నష్టపరిహారాన్ని ఎకరాకు రూ.25 వేల వరకు పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పులవెలమ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీకుమార్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నందరపు సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, కార్యదర్శి పుప్పాల రమేష్, నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు, రైతులు, కూటమి నాయుకులు

ఆకాశమే హద్దుగా రాణించాలి

ప్రసంగిస్తున్న గ్రామీణ సీఐ రేవతమ్మ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రంగం ఏదైనా.. పురుషులకు దీటుగా మహిళలు ఆకాశమే హద్దుగా రాణించాలని నర్సీపట్నం గ్రామీణ సీఐ రేవతమ్మ సూచించారు. 'దేశాభివృద్ధిలో మహిళ పాత్ర' అంశంపై నర్సీపట్నం గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మాకవరపాలెం గ్రంథాలయంలో మహిళలకు కుర్చీలాట, విద్యార్థులకు నృత్య పోటీలు, గొలుగొండ గ్రంథాలయంలో బాలికలకు రంగవల్లుల పోటీ జరిగాయి.

రావికమతం, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా కొత్తకోట శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి ఇప్పటి వరకూ పుస్తక పఠనం, పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాస రచన, మ్యూజికల్ ఛైర్, చదరంగం, ముగ్గులు తదితర పోటీలు జరిగాయి. బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు.

రోలుగుంట, మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడ, కేజేపురం, మాడుగుల రోలుగుంట గ్రంథాలయాల్లో భారతదేశపు తొలి మహిళాప్రధాని ఇందిరాగాంధీ జయంతిని స్థానిక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

కొత్తకోటలో క్విజ్ పోటీలు

చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : రైవాడ జలాశయం ఆయకట్టులో సాగునీటి చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో అన్నదాతకు సాగునీటి కష్టాలు తొలగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైవాడ ఎడమ ప్రధానకాలువ నుంచి మారేపల్లి పాత ఆయకట్టు 130 ఎకరాలకు సాగు నీరందించే కిల్లివాని చెరువుకు చెందిన పొర్లుకట్ట శిథిలావస్థలో ఉంది. దీని స్థానంలో కొత్తది నిర్మించి సాగునీటి ఇబ్బందులు తొలగించాలంటూ మాజీ సర్పంచులు అవుగడ్డ కోటిపల్లి రామ్మూర్తినాయుడు, కోటిపల్లి నాయుడుతో పాటు ఉయ్యాల చింతగెడ్డ నీటిసంఘం అధ్యక్షుడు గుల్లిపల్లి మురళి కృష్ణ, సభ్యుడు రెడ్డి అశోక్, మాజీ అధ్యక్షుడు అవుగడ్డ రామారావు ఇటీవల ఎమ్మెల్యేను కోరారు. జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడుతో పాటు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు చెరువు వద్దకు వచ్చారు.

కిల్లివాని చెరువు పొర్లుకట్ట పరిశీలిస్తున్న నాయకులు

దేవరాపల్లి : జనావాసాల్లో తాగునీటి సమస్య తలెత్తకుడా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని ముషిడిపల్లి యాదవుల కల్లాల్లో (కాలనీలో) నీటి ఎద్దడిని తొలగించడానికి ఆయన అక్కడ కొత్త బోరు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవాలు

చోడవరం, న్యూస్‌టుడే: గోవాడలో చక్కెర కర్మాగారం వసతి గృహంలోని సత్యసాయిబాబా మందిరంలో శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎండీ వెంకటేశ్వరరావు బుధవారం ప్రార్థనలు చేసి పేదలకు దుప్పట్లు అందజేశారు. శరగడం రామునాయుడు, వర్మ, సుబ్రహ్మణ్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో దుప్పట్ల పంపిణీ

చీడికాడ : అప్పలరాజుపురం లలితాదేవి వృద్ధాశ్రమంలో సత్యసాయి శతవర్ష జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కటింగ్ చేసి, బాబా చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పేదలు, దివ్యాంగులకు దుప్పట్లు, స్టీల్ కంచాలను వృద్ధాశ్రమం నిర్వాహకురాలు యాళ్ల వెంకటలక్ష్మి, సీడీసీ ఛైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని 27వ వార్డు ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో బుధవారం రాత్రి అయ్యప్పస్వాములు అంబలం పూజ నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు తొలుత పూజలు చేశారు. కౌన్సిలర్ పద్మావతి తదితరులు విగ్రహాలను మేళతాళాలతో మండపానికి తీసుకువచ్చారు. మాజీ కౌన్సిలర్ గోవిందరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విగ్రహాలు తీసుకువస్తున్న పద్మావతి తదితరులు

స్పందనకు వందనం

రావికమతం, న్యూస్‌టుడే: కవగుంటలోని బీసీ కాలనీలోని చేతిబోరు పరిసరాలు చెత్తాచెదారం అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. – వెంకట దుర్గాప్రసాద్, కవగుంట, ✓: బీసీ కాలనీలోని చేతి బోరు చుట్టూ శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. – సూర్య కుమారి, సర్పంచి, కవగుంట

పరిసరాలు పరిశుభ్రం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరంలో లిటిల్ ఏంజిల్స్ సమీపంలో నివాసముంటున్న గృహాల సముదాయం వద్ద పేరుకుపోయిన చెత్తను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. నివాసిత గృహాల మధ్య ఖాళీ స్థలంలో పేరుకున్న చెత్తను తొలగించడం లేదంటూ నివాసితులు 'ఈనాడు మేమున్నాం...మీకు తోడుగా'కు తమ సమస్యను తెలియజేశారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తుప్పలు తొలగించారు..

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ శివారు ఉప్పరగూడెం నుంచి జైతవరం ప్రధానరోడ్డులో ఎట్టకేలకు తుప్పలు తొలగించారు. ఇక్కడ రోడ్డులో తుప్పలు దట్టంగా ఉండటంతో పాటు సూచీలు కనిపించక వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులపై 'తుప్పల్లో సూచీ' శీర్షికతో అక్టోబరు 5న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి తుప్పలు తొలగించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

వేలం ప్రకటన

In the Hon'ble Court of the Civil Judge (Senior Division) at Chodavaram
OS 47/2016 EP 7/2023

Between
మద్దాల బలరామస్వామి - వాది/D.Hr.
And
శరగడం పరమేశ్వరరావు - ప్రతివాది/JDr

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు అమలు బాకీ రాబట్టు నిమిత్తం JDr యొక్క యీ దిగువ షెడ్యూలులో తెలిపిన స్థిరాస్తిని పైకోర్టు వారి ఎదుట తే.10-12-2025దిని పగలు గం॥ 10.30ని॥లు నుండి సాయంత్రం గం॥ 5.00ల మధ్య వేలం వేయుదురు. కనుక వేలంలో పాల్గొనదలచినవారు పై తేదీన కోర్టు వారి ఎదుట హాజరయి పాడుకొనవచ్చును. వివరాల కొరకు D.Hr. తరపు అడ్వకేటు గారిని ఆఫీసులో సంప్రదించవచ్చును.

షెడ్యూలు ఆస్థి వివరం

ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, K. కోటపాడు మండలం, K. కోటపాడు గ్రామం తా॥ S.No. 142-1రులో గల యి.0-52 ట్లు హె.0-208 ర్లు పర్మితి గల గాడిమడి అనే పేరుగల పల్లం భూమికి హద్దులు: తూ: సూరిశెట్టి సత్యవతి గారి తాలూక పల్లం భూమి, ద: సూరిశెట్టి సత్యవతి వగైరాల తాలూక పల్లం భూమి, ప: సూరిశెట్టి చినరామునాయుడు తాలూక పల్లం భూమి, ఉ: పెంటకోట పైడితల్లి తాలూక పల్లంభూమి.

DHr Value : Rs. 3,00,000/-
Amin Value : Rs. 10,40,000/-
JDr Value : తెలియపర్చలేదు

యీ హద్దుల మధ్యస్థమయిన పల్లం భూమియందు JDr.కు సంపూర్ణమైన హక్కు, అనుభవములు కలవు. లాజుహూలు లేవు. వేలం కాబడును.

చోడవరం
తేది. 19-11-2025

ఇట్లు
అల్లు గిరిధర్, అడ్వకేట్
చోడవరం, అనకాపల్లి జిల్లా. Mob No. 9440043369

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 కాంత
స్క్రీన్-2 ది గర్ల్‌ఫ్రెండ్

రేపు మెగా జాబ్ మేళా

సింధియా, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి పేర్లు నమోదు చేసు కోవాలన్నారు. 25 కంపెనీలు యాజమాన్య ప్రతినిధులు అభ్యర్థుల ఎంపిక చేయనున్నారన్నారు చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం చింతగట్ల గ్రామానికి చెందిన రెండు వర్గాలకు రూ.రెండు లక్షల బైండోవర్ చేసినట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14న రాత్రి రెండు వర్గాల మధ్య తగాదా జరిగింది. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా 13 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. ఆ మేరకు బుధవారం పెందుర్తి తహసీల్దార్ వై.వెంకట అప్పారావు ఎదుట ఇరువర్గాల వారిని హాజరుపరిచి ఆరు నెలల పాటు మంచి ప్రవర్తనతో ఉండాలని బైండోవర్ చేయించినట్లు తెలియజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: శ్రీసాయిమాధవ నగర్‌లో రహదారి పక్కన చెట్లు పెరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. – రాజ్యలక్ష్మి
✓: పరిశీలించి తొలగిస్తాం. – శంకర్‌రావు, ఇన్‌ఛార్జి, జోనల్ కమిషనర్

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు గొల్లలపాలెం గ్రామంలో వర్షాలు పేరుకుపోయాయి. –శ్రీనివాసరావు ✓: వర్షాలను తొలగించే ఏర్పాట్లు చేస్తాం. –వై.రాజేశ్వరరావు, గ్రామకార్యదర్శి
?: సబ్బవరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న కాలువలో మురుగు కదలడం లేదు. –ఎం.గౌరీష్ ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, ఈవోపీఆర్డీ, ఇన్‌ఛార్జి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ నుంచి తానాం వెళ్లే మార్గంలో వీధి దీపాలు సరిగా లేవు. రాత్రివేళల ఇబ్బంది పడుతున్నాం. – రమణ ✓: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –మురళీధర్ పట్నాయక్, ఈవోపీఆర్డీ, పరవాడ

దీక్ష విరమణకు.. సదుపాయాలెన్నో

◆ అయ్యప్ప ఆలయాలకు పెరుగుతున్న భక్తులు

పెందుర్తి, న్యూస్‌టుడే

ప్రతి ఏటా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కేరళ రాష్ట్రంలోని శబరిమల క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది దీక్షాధారులు తరలివెళ్తుంటారు. వీరితో పాటు సాధారణ భక్తులు సైతం అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. దీంతో ఏటా రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో మాలధారులు పునరాలోచనలో పడ్డారు. స్థానిక ఆలయాల్లోనే దీక్ష విరమణకు భక్తులు దృష్టిసారిస్తున్నారు. ఈ మేరకు ఆయా ఆలయ కమిటీలు అయ్యప్ప దీక్షల విరమణకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నాయి.

సిద్ధంగా ఉంచిన అరవణ ప్రసాదం

■ ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..: పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో మండల, మకరవిళక్కు, దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అయ్యప్ప సేవా ట్రస్టు ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో దీక్షల విరమణ, మాల విసర్జన చేసే భక్తులకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఇరుముడి ద్రవ్యాలు తీసుకువచ్చే భక్తులకు గురుస్వామి చేతుల మీదుగా ఇరుముడి ధారణ జరిపిస్తామన్నారు. శబరిమల తరహాలోనే మాలధారులు ఇరుముడితో పదునెట్టాంబడి మీదుగా ప్రధాన ఆలయం వద్దకు చేరుకునే సదుపాయం కల్పించారు. ఇరుముడి ద్రవ్యాలను సమర్పించి, నెయ్యి కొబ్బరికాయ నేతితో స్వామికి అభిషేకం చేయిస్తున్నారు. మాలికాపురత్తమ్మ దర్శనం చేసుకునే అవకాశం ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచితంగా వసతి, భిక్ష సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలోని పదునెట్టాంబడి

■ సుజాతనగర్ ధర్మశాస్తా ఆలయంలో..: సుజాతనగర్‌లోని శ్రీపూర్ణ పుష్కల సమేత ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి సమర్పణ, దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇరుముడితో వచ్చిన భక్తులు తొలుత కలష్ట స్వామిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి పదునెట్టాంబడి మీదుగా మణికంఠుడి సన్నిధికి వెళ్లవచ్చని తెలిపారు. స్వామి దర్శనం అనంతరం మాళికాపురత్తమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయ దొర్లించి ఇరుముడి విప్పరావడం జరుగుతుంది. అనంతరం నెయ్యి కొబ్బరికాయలోని నేతితో స్వామిని అభిషేకించి భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. దీక్షల విరమణకు భక్తులకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అందుబాటులో అరవణ ప్రసాదం

అయ్యప్ప భక్తులు ఎంతో పవిత్రంగా భావించే అరవణ ప్రసాదాన్ని పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. శబరిమల తరహాలోనే ప్రసాదం డబ్బాల్లో ఈ ప్రసాదాన్ని నెలల పాటు నిల్వ ఉండేలా ఇక్కడే తయారు చేస్తున్నారు. మాల విరమణ చేసిన భక్తులకు ఇది ఎంతగానో సంతృప్తినిస్తోంది.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

కృష్ణానగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: అన్నదాన సత్రాలతో పేదల కడుపు నిండుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. కృష్ణానగర్ ధర్మమల్లేశ్వరం శివాలయం హిత అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న మూడు అంతస్తుల అన్నపూర్ణ శ్రీ అన్నదాన సత్రం శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదమూడేళ్ల క్రితం తాత్కాలిక రేకుల షెడ్డుతో ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాన్ని తాను ప్రారంభించానన్నారు. ప్రస్తుతం మూడు అంతస్తుల శాశ్వత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. స్వాములు, భక్తులు, స్థానిక పెద్దలు అంతా కలిసి స్వచ్ఛందంగా ఈ భవనాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం భక్తుల ఐక్యతకు నిదర్శనమన్నారు. భవన నిర్మాణానికి వ్యక్తిగతంగా తన వంతు సహాయసహకారాలు అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆలయ కమిటీ ఛైర్మన్‌గా సత్యనారాయణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం లింగాల తిరుగుడు ఆలయ కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షుడిగా అడ్డూరి దొడ్డి రామ వెంకట సత్యనారాయణ, సభ్యులుగా దాడి సత్యనారాయణ, వల్లభ పైడితల్లి పార్వతి, వెంకట పాపమ్మ, జెర్రిపోతుల భవాని, నారాయణమ్మ, వల్లభ జోస్యుల సీతారామమూర్తి, ఆర్ శ్రీనివాసరావు, ఎం. సన్యాసినాయుడు, నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కమిటీ సభ్యులను శాలువతో సత్కరించి అభినందించారు. ఆలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రైతన్నలకు అండగా అన్నదాత సుఖీభవ

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు అన్నారు. 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకం ఆర్థిక సాయం విడుదల నేపథ్యంలో బుధవారం పెందుర్తి మండలం రాంపురంలో రైతులు సంబరాలు చేశారు. పంట పొలాల్లో జరిగిన కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, రైతులు

సైబర్ మోసాలపై అవగాహన

పరవాడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని ఎంఎస్ఎన్‌ఎం భవనంలో ఫార్మా కంపెనీలకు చెందిన సేఫ్టీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సైబర్ నేరస్థుల వలలో చిక్కుకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డిజిటల్ అరెస్టులు, ఏపీకే ఫైల్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్ పేరిట జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు, ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్తు సరఫరా లైన్లు, సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరవాడ, వాడచీపురుపల్లి, పెదముషిడివాడ, వెంకటాపురం విద్యుత్తు ఉప కేంద్రాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ ఏఈ ఈఈ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

21న సబ్బవరంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం సబ్బవరం, అంతకాపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నందున ఈ నెల 21న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొత్తవలస సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయా సెక్షన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం వస్త్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. చినముషిడివాడ వార్డు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శానాపతి వసంత ముఖ్య అతిథిగా పాల్గొని వస్త్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ప్రహ్లాదపురంలో సుమారు 75 ఏళ్ల వయసున్న వృద్ధుడు స్పృహలేని స్థితిలో ఉన్నట్లు స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మరణించినట్లు తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు పెందుర్తి పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో విద్యార్థులకు ప్రయోజనం

వేపగుంట, న్యూస్‌టుడే: అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్ అన్నారు. డీఈవో ఆదేశాల మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం వేపగుంట జెడ్పీ పాఠశాల టింకరింగ్ ల్యాబ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని.. ఆ దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉపకరిస్తాయన్నారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సింహాచలం నాయుడు, శిక్షకులుగా ఎన్ఆర్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు ఎన్. రాజేశ్, ఎస్.రమేశ్ మెంటర్, ఫిజిక్స్ అధ్యాపకులు హాజరయ్యారు. శిక్షణలో ఆరు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరవుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్

ఉత్సాహంగా థాంగ్‌టా పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పరవాడలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి థాంగ్‌టా పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలను వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 24 మంది విద్యార్థులు వచ్చే నెల 5, 6 తేదీల్లో పరవాడ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సత్యవతి, శ్రీదేవి, శ్రావణి, థాంగ్‌టా క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు. * జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 ఖోఖో పోటీలను పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గుర్రం అప్పలరాజు ప్రారంభించారు. బాలబాలికలకు వేర్వేరుగా జరిగిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్, థాంగ్‌టా క్రీడా ప్రతినిధులు

ఖోఖోలో ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, తదితరులు

పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలంటూ ధర్నా

పొర్లుపాలెం (దేవరపల్లి), న్యూస్‌టుడే: పొర్లుపాలెం, చింతలగ్రహారం రైతుల భూముల మీదుగా నిర్మించ తలపెట్టనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలంటూ బుధవారం పొర్లుపాలెంలో రైతులు ధర్నా చేశారు. ఈ మేరకు చర్చలు జరిపేందుకు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఆర్డీవో పిలుపు మేరకు మోటార్ సైకిళ్లతో రైతులంతా ర్యాలీగా తరలివెళ్లి చర్చల్లో పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా శిబిరంలో భాగంగా బుధవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ జరిగింది. సుజాతనగర్ కాలనీలో విద్యార్థులు నినాదాలు చేస్తూ అవగాహన ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి బి. దిబిపాలెం, ఎన్ఎస్ఎస్ పీవో జి.మంజుల, వార్డు సచివాలయ అడ్మిన్ మోహన్‌రావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నందీశ్వరుడికి పంచామృతాభిషేకం

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు శివాలయాల్లో మంగళవారం రాత్రి నందీశ్వరాభిషేకాలు ఘనంగా జరిగాయి. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రామికశక్తినగర్ పోర్లు కాలనీలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని పశుపతినాథ్ ఆలయంలో నందీశ్వరుడిని అర్చకులు పంచామృతాలతో అభిషేకించారు.

శ్రామికశక్తినగర్‌లో నందికి అభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పెందుర్తి సూర్యానగర్‌లో..

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి

పరవాడ, న్యూస్‌టుడే: బోటు బోల్తాపడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సూరాడ ముత్యాలు(56), చింతకాయల పెంటయ్య, తిత్తి రాజయ్య, కొవిరి సత్తెయ్య, ఉల్లిపి బండియ్య, తిత్తి కల్లయ్య, సూరాడ పరుగుడు మత్స్యకారులు కలిసి బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఫైబర్ బోటుపై తీరంలో చేపల వేటకు వెళ్లారు. కొంతదూరం వెళ్లేసరికి బలమైన రాకాసి కెరటం రావడంతో ఒక్కసారిగా బోటు బోల్తాపడింది. దీంతో ముత్యాలు గల్లంతయ్యాడు. మిగిలిన వారు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. పెంటయ్య, బండయ్యకు స్వల్పగాయాలయ్యాయి. బోటు, వేట సామగ్రి దెబ్బతిన్నాయి. మాజీ సర్పంచి, తెదేపా నేత చింతకాయల ముత్యాలు, కూటమి నాయకులు ఒడ్డుకు చేరుకున్న వారితో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముత్యాలు మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య అప్పలనర్సమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరవాడ ఎస్సై కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సూరాడ ముత్యాలు (పాతచిత్రం)

బోల్తాపడిన బోటు

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు దేవేరులు సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయాన్ని జరిపించారు.

మొరపెట్టుకున్నా పట్టించుకోరా..?

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రామికశక్తినగర్ పోర్లు కాలనీలో ఇరవై రోజులుగా రహదారిపై మురుగు తిష్ట వేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు బుధవారం కాలనీలో నిరసన చేపట్టారు. మూడవ లే అవుట్‌లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు ప్రవహిస్తోంది. ఐదంతా రోడ్డుపై నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన, ఆ రహదారిపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కాలనీ వాసులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని వాపోయారు. పత్రికల్లో కథనాలు వచ్చినా యంత్రాంగంలో కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్ తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

మురుగు నిలిచిన చోట నిరసన తెలుపుతున్న కాలనీ సంఘం ప్రతినిధులు, నివాసితులు

'టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి'

పెందుర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్ అన్నారు. పెందుర్తి మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శి చుక్క సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. టెట్ పరీక్షకు వ్యతిరేకంగా డిసెంబర్ 9న ధర్నాలు, 10న పెందుర్తి డివిజన్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ సహాధ్యక్షురాలు రంగాలి ఉమాదేవి, జిల్లా కార్యదర్శి వంగ రామలక్ష్మి, నాయకులు తమ్మారావు, జెన్సీ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్

సుస్థిరాభివృద్ధి వనరులపై దృష్టి సారించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి వనరులపై దృష్టి సారించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు సూచించారు. స్థానిక సంస్థల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై బుధవారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ శిక్షకులు నాగరాజు పాల్గొని పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కొల్లి వెంకటరావు, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న శిక్షకుడు నాగరాజు

నేడు ఎమ్మెల్యే పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక, భరణికం, తానాం పంచాయతీల్లో గురువారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. కూటమి నాయకులు పాల్గొనాలని తెలిపారు.

బాలికలకు ముగ్గుల పోటీలు

పెందుర్తి, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠకులు, బాలలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలు, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వారంతా పాల్గొని ఉత్సాహంగా రంగవల్లికలు అలంకరించారు.

సబ్బవరం, పరవాడ, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఆనంద్, రమాదేవి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ★ పరవాడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.

పెందుర్తి శాఖా గ్రంథాలయం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు, విద్యార్థులు


సబ్బవరం: చిత్రలేఖనం పోటీలో..

కుండలేశ్వరంలో భక్తురాలి మృతి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కుండలేశ్వరం కార్తిక దర్శనానికి వచ్చిన ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందారు. భక్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన బొడ్డు నిర్మల(66), సోదరీమణులు సాయికుమారి, మాధవీలత, మరో మహిళతో కలిసి బుధవారం ఉదయం ఆలయం దర్శనానికి వచ్చారు. ఉదయం పిల్లిపూడి కుక్కుటేశ్వర స్వామి దర్శనాంతరం సాయంత్రం కుండలేశ్వరం చేరుకున్నారు. దర్శనం అనంతరం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానిక యువకులు పీఎస్ ఎంజీలు, రవివర్మ మరికొంత మంది ఆమెకు సీపీఆర్ చేస్తూ అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వాహనం వచ్చే సరికి మృతి చెందారు. స్థానిక యువకులు అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వస్థలానికి పంపించారు.

సీపీఆర్ చేస్తున్న యువకుడు

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

పరవాడ, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించేందుకు ఎన్ఎస్ఎస్ ఇచ్చాపురం వరకు 'అభ్యుదయం' పేరుతో పోలీసు సిబ్బంది చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం లంకెలపాలెం కూడలికి చేరుకుంది. ఈ మేరకు డీఎస్పీ, సీఐ మల్లికార్జునరావు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యమని వెల్లడించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డీఎస్పీ సుమారు 7 కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కి, అందరిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో పరవాడ కళాశాల ప్రిన్సిపల్ వినోద్‌బాబు, ఎంపీడీవో ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు, జీవీఎంసీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు, తదితరులు

(c) eenadu

ఈనాడు
అనంతపురం
గురువారం నవంబరు 20, 2025

ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యం


రైతులకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్, తదితరులు

ఉరవకొండ, అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అందుబాటులోని సాగు నీటి వనరులు సద్వినియోగం అయ్యేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సూక్ష్మసేద్య విధానానికి ప్రాముఖ్యం ఇస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం ఉరవకొండలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 2.75 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.188 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. ఉద్యానపంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నామని.. హంద్రీనీవా ద్వారా సాగునీటి సౌలభ్యాన్ని ఈ ఏడాది గణనీయంగా పెంచుకున్నామన్నారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏడీ సత్యానారాయణ, ఏంపీడీవో రవిప్రసాద్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ పురుషోత్తం, తెదేపా మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, కార్యదర్శి నాగరాజు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు మెగా చెక్కులను పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటలకు ఖాతాలకు సొమ్ము జమ చేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు అంతర్జాతీయ యువజన సదస్సు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలో గురువారం అంతర్జాతీయ యువజన సదస్సు జరగనుంది. ఉదయం 8 గంటలకు వేదపఠనంతో వేడుకలు ప్రారంభం అవుతాయి. వేడుకల్లో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, రాష్ట్ర మంత్రులు జనార్దన్‌రెడ్డి, దుర్గేష్ పాల్గొననున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా ఉత్సవాలు

● ప్రజాప్రతినిధులు, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

ఈనాడు, అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఎక్కడా లోటు లేకుండా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మంగళవారం వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన ఆయన జిల్లా మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 23 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇప్పటికే నిధులు విడుదల చేసి పుట్టపర్తిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించినట్లు తెలుస్తోంది.

టమాటా కిలో రూ.47

అనంతపురం (వ్యవసాయం) : అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్లో టమాటా ధరలు ఊరిస్తున్నాయి. మూడ్రోజులుగా టమాటా కిలో రూ.40 లోపలే పలికింది. బుధవారం కిలో రూ.47లకు పెరగడంతో అన్నదాతల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు 2,145 టన్నులు వచ్చాయి. మొదటి రకం కిలో రూ.47, రెండో రకం రూ.33, మూడో రకం రూ.27 చొప్పున పలికింది. 15 కిలోల బుట్ట ధర మొదటి రకం రూ.705, రెండో రకం రూ.495, మూడో రకం రూ.405 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రూప్‌కుమార్ తెలిపారు.

ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి పయ్యావుల, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బాలికకు సుకన్య యోజన పత్రం అందజేస్తున్న మోదీ, చిత్రంలో సీఎం, సచిన్ తెందూల్కర్, ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ట్రస్టు సభ్యుడు చక్రవర్తి

సత్యసాయి జీవితమే.. వసుధైక కుటుంబం

శతజయంతి వేడుకల్లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పుట్టపర్తి: సత్యవాక్కు, ప్రేమతత్వం, సేవామార్గాలతో ప్రపంచాన్ని గెలవాలనే శ్రీసత్యసాయిబాబా బోధనలను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. బాబాతో తమకున్న అనుబంధాన్ని, అనుభవాలను భక్తులతో పంచుకున్నారు. సత్యం మాట్లాడటమే సత్యసాయిబాబాకు మనం ఇచ్చే నిజమైన కానుక అని చెప్పుకొచ్చారు. దేశ, విదేశాల్లో కోట్లాది మంది భక్తులను సంపాదించుకున్న ఆయన జీవితమే ఒక వసుధైక కుటుంబమని స్పష్టం చేశారు. బాబా మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన బోధనలు ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజకీయ, క్రీడలు, సినీ ప్రముఖులు ముఖ్యఅతిథులుగా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించిన సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సామాన్యుడి నుంచి ప్రధాని వరకు ప్రతిఒక్కరూ సాయి నామస్మరణతో పులకించిపోయారు. ఉత్సవాలకు హాజరైన వేలాది మందితో పుట్టపర్తి పురవీధులు పులకించిపోయాయి.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న సీఎం, డిప్యూటీ సీఎం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సాయికుల్వంత్ మందిరంలో ఉన్న సత్యసాయి మహాసమాధిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ సాదర స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసశర్మ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు దర్శించుకున్నారు.

పుట్టపర్తి శ్వేతశోభితం..

వేడుకల్లో భాగంగా రెండోరోజు దేశ విదేశాల నుంచి భక్తులు ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. అత్యధిక శాతం తెల్లటి వస్త్రాలు, టోపీలు ధరించి హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతం శ్వేతవర్ణ శోభితంలా మారిపోయింది. సూర్యుడి కిరణాలు తెల్లటి వస్త్రాలపై పడి మరింత మెరిసిపోయాయి. సేవాదళ్ మార్గనిర్దేశంలో భక్తులు అత్యంత క్రమశిక్షణతో ప్రశాంతి నిలయం నుంచి స్టేడియంకు చేరుకున్నారు. వేదికపై ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి చిత్రపటానికి మంగళహారతి ఇచ్చి కార్యక్రమాన్ని ముగించారు.

స్టేడియంలో భక్తజనం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాయి విద్యార్థుల సంగీత కచేరి

సాయికుల్వంత్ మందిరంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్ బృందం నాదశక్తి అనే విశిష్ట సంగీత సమర్పణ అందరినీ ఆకట్టుకుంది. సత్యసాయి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారని, అన్ని రంగాల్లో ఇచ్చిన గౌరవాన్ని, శక్తిని, గుర్తు చేసుకుంటూ మహిళభక్తి, మాతృత్వం విలువల బోధన, ఇవి అన్నీ సాయి బోధనల్లో అంతర్లీనంగా ఉన్నాయని గుర్తు చేశారు. వేలాది మంది భక్తులతో మందిరం కిటకిటలాడింది. సంగీత బృందాన్ని రత్నాకర్ సతీమణి హిమవాహిని సత్కరించారు.

కనువిందుగా సాంస్కృతిక ప్రదర్శనలు

హిల్‌వ్యూ స్టేడియంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

హిల్‌వ్యూ స్టేడియంలో విద్యార్థుల వేదమంత్రాలు ఆలాపనతో కార్యక్రమం ప్రారంభం కాగా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ స్వాగత ఉపన్యాసం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు నిర్వహించిన సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలు ముఖ్య అతిథులు, భక్తులను అలరించాయి.

భక్తిగీతాలు ఆలపిస్తున్న సుధా రఘునాథన్, నవీన్,

డ్రమ్స్ వాయిస్తున్న శివమణి



కలగా రైల్వే మోరీ విస్తరణ

గుంతకల్లు - కర్నూలు రహదారిలోని సత్యనారాయణపేట వద్ద ఉన్న రైల్వే మోరీ విస్తరణ కలగా మారింది. ఇక్కడ విస్తరణ పనులను చేపట్టాలని ఎమ్మెల్యే, ఎంపీలు పలుమార్లు రైల్వే అధికారులను కలిసి విజ్ఞప్తిచేశారు. విస్తరణ చేయడానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదని నాలుగు సంవత్సరాల నుంచి రైల్వే అధికారులు సమాధానం చెబుతూ వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధుల సమస్య ఉందని, రైల్వే నిధులతోనే విస్తరణ పనులను చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గుంతకల్లు

తత్కాల్ టికెట్ల జారీలో మతలబు

రైల్వే డివిజన్ : గుంతకల్లు
రైళ్ల సంఖ్య : 120
కౌంటర్లు : 02
రోజూ వారి రిజర్వేషన్లు : 1500
తత్కాల్ టికెట్ల జారీ సమయం : అర గంట

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు జంక్షన్‌లో రైలు ప్రయాణానికి సంబంధించిన తత్కాల్ రైల్వే టికెట్ల జారీలో వివాదాలకు దారి తీస్తోంది. స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ఉదయం అర గంట మాత్రమే టికెట్లు విక్రయిస్తారు. ప్రధానంగా ఏసీ టికెట్లు ఉదయం 10 గంటలకు, స్లీపర్ టికెట్లు 11 గంటలకు విక్రయిస్తారు. వీటికి ఉండే డిమాండ్ కారణంగా కొందరు దళారులు కాసులపంట పండించుకుంటున్నారు. కొందరు క్యూలైన్లలో నిలబడలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. దీనికి గాను దళారులకు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా ఇస్తున్నారు.

దబాయిస్తూ.. టికెట్లు తీసుకుంటూ!

ఎవరు ముందు టికెట్ బుకింగ్ కౌంటరులోకి చేతులు పెడతారో వారికి అధికారులు టికెట్లు ఇవ్వాల్సి ఉంది. దీంతో కొందరు రాత్రే వెళ్లి క్యూలైన్లలో ఉదయం వరకు కూర్చోవడం, నిద్రపోవడం జరుగుతోంది. ఇలా కొందరు ఇబ్బంది పడుతుంటే దళారులు రాత్రే రిజర్వేషన్ ఫారాలను బుకింగ్ కౌంటరు వద్ద పెట్టి వెళ్లిపోతారు. ఉదయం టికెట్లు ఇచ్చే సమయానికి క్యూలైన్ వద్దకు వచ్చి తాము రాత్రే ఫారాలను కౌంటరు వద్ద ఉంచామని దబాయించి టిక్కెట్లను తీసుకుంటున్నారు. రాత్రంతా క్యూలైన్‌లో నిల్చున్న వారికి అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. రైల్వే పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రిజర్వేషన్ కౌంటర్‌లో ఉన్న ఉద్యోగులు సైతం దళారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణను అడుగగా క్యూలైన్‌లో ఉన్న వారు మాత్రమే టికెట్లను పొందేవిధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కౌంటర్ వద్ద దళారులు ఉంచిన చీటీలు

తూకం తక్కువ.. ధర ఎక్కువ

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: మొక్కజొన్న, టమాటా, తదితర విత్తనాలను దుకాణం యజమానులు కొందరు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. రైతులు ఇలాంటి నాసిరకం విత్తనాల పొట్లాలు కొనుగోలు చేసి, ఆపై పంట దిగుబడి రాక అప్పుల పాలవుతున్నారు. కొందరు వినియోగదారులను ఆకర్షించేలా నిత్యావసర సరకులను ఆకర్షణీయ పొట్లాల్లో ప్యాక్ చేసి అమ్ముతున్నారు.

● చౌక ధాన్యం డిపోల డీలర్లు కొందరు ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని పది కిలోలకు రెండు, మూడు కిలోలు తక్కువ తూకంతో ప్రజలకు ఇస్తున్నారు. నగరం, గుల్జార్‌పేటలో డీలరు ఒకరు తక్కువ తూకంతో బియ్యం ఇస్తున్న తీరు రెవెన్యూ అధికారుల తనిఖీలో గుర్తించి, డీలరును సస్పెండ్ చేశారు. పొట్లాల్లో సరకులు ప్యాక్ చేయడానికి తూనికలు కొలతల అధికారుల అనుమతి తీసుకోవాలి. అలాకాకుండా ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

● కొనుగోలు చేసిన దానికి బిల్లు తీసుకోవాలి. తూకం చూడాలి. పొట్లంపై ధర, సరకు నాణ్యత, తయారుదారు, తేదీ, ఈ మెయిల్, ఫోన్ నంబరు, తదితర వివరాలు చూసుకోవాలి. తేడా ఉంటే సహాయ నియంత్రణ అధికారి : 984 909 5707, అనంతపురం డివిజన్ అధికారి: 984 981 6216, టోల్‌ఫ్రీ నంబరు: 1800 425 4202 నంబర్లకు ఫోన్ చేయాలని అనంతపురం డివిజన్ తూనికలు, కొలతలశాఖ తనిఖీ అధికారి ఖాజా చెబుతున్నారు.

ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కేసుల నమోదు ఇలా..

● ప్యాకేజీ కమాడిటీ చట్టం అతిక్రమణ : 90
● తూనికలు, కొలతల చట్టం ఉల్లంఘన: 44
● అపరాధ రుసుం వసూళ్లు రూ.12.11 లక్షలు
● ముద్ర రుసుం : రూ.8.35 లక్షలు

విత్తనాల పొట్లాలను తనిఖీ చేస్తున్న అధికారి

శిక్షణతో అంతర్గత నైపుణ్యాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులు, ఉద్యోగుల్లో అంతర్గత నైపుణ్యాలు పెంపొందించడానికి దోహదపడతాయని ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత పేర్కొన్నారు. కేంద్ర శిల్క్ బోర్డు, మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సెరికల్చర్ విభాగంలో 'రాష్ట్రీయ కర్మయోగి శిక్షణ' కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఇన్‌ఛార్జి వీసీ మాట్లాడుతూ.. శిల్క్ బోర్డు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు నైపుణ్యం, సామర్థ్యాలు మెరుగు పరచుకోవాలన్నారు. ఎస్కేయూలో సెరికల్చర్ విభాగం విద్యార్థులకు ఉపయుక్తమయ్యే కార్యక్రమాలు నిర్వహించడానికి సహకారం అందించాలన్నారు.

CODE: ANCP
ANNAMACHARYA
COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

ఆందోళనకర రీతిలో ఆంత్రాక్స్ విజృంభణ

● 9 గ్రామాల్లో 28 గొర్రెల మృత్యువాత
● పశుసంవర్ధక శాఖ అప్రమత్తం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. గొర్రె మూతి, ముక్కు నుంచి నురుగుతో కూడిన నల్లని గడ్డ కట్టిన రక్తం బయటకు వస్తోంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు చూడటానికి బాగానే ఉంటాయి. ఉదయం లేచేసరికి చనిపోవడంతో కాపర్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 28 గొర్రెలు వ్యాధి బారిన పడి చనిపోవడం గుర్తించారు.

● ఉమ్మడి జిల్లాలో ఆంత్రాక్స్ వ్యాధి విజృంభించింది. నాలుగు నెలల్లో తొమ్మిది గ్రామాల్లో 28 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో 2, విడపనకల్లు మండలం పెంచలపాడులో 2, కూడేరు మండలం పి.యాలేరులో 10, ఆత్మకూరు మండలం శింగంపల్లి, శింగంపల్లి తాండాలో 3, కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లిలో 2, తాడిపత్రి మండలం గంగదేవపల్లిలో ఒకటి చొప్పున మృత్యువాత పడ్డాయి.

● శ్రీసత్యసాయి జిల్లాలో కనగానపల్లి మండలంలో కోనేటిపాలెంలో 6, బత్తలపల్లి మండలం దంపెట్లలో 2 చొప్పున చనిపోయాయి.

గొర్రెకు టీకా వేస్తున్న సిబ్బంది

69,973 గొర్రెలకు..

గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాధి సోకడంతో పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. ఆయా మండలాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. కాపర్లకు అవగాహన కల్పించడంతోపాటు 69,973 గొర్రెలకు టీకాలు వేశారు. అనంతపురం జిల్లాలో ఆరు గ్రామాల్లో 35,473, శ్రీసత్యసాయి జిల్లాలో రెండు గ్రామాల్లో 34,500 గొర్రెలకు టీకాలు వేశారు.

వ్యాధి నిర్ధారణ అయితే..

ఆంత్రాక్స్ వ్యాధి నిర్ధారణ అయితే గొర్రె శరీరాన్ని పోస్టుమార్టం చేయకూడదు. చనిపోయిన గొర్రెలను కాల్చివేయాలి. లేకపోతే గుంత తీసి సున్నం చల్లి పూడ్చేయాలి. మందలో చనిపోతే ఆ ఊరు చుట్టు 5 కిలోమీటర్ల మేర గొర్రెలకు టీకాలు వేయాలి. 3-5 ఏళ్ల టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి. వ్యాధి సోకిన జీవాలు తిన్న గడ్డిని, దాణాను కాల్చివేయాలి. చర్మం, ఉన్ని, మాంసం, కొమ్ములు వినియోగించకూడదు.

ఉచితంగా టీకాలు

- డాక్టర్ రవిబాబు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఉమ్మడి జిల్లా)

ఆంత్రాక్స్ వ్యాధి గడ్డి తినే జంతువుల్లో బాసిల్లస్ ఆంత్రాక్స్ అను స్పోర్స్ ఏర్పరిచే బ్యాక్టీరియాతో వస్తుంది. నివారణకు టీకా ఉంది. ఈ ఏడాది 60 లక్షల డోసులు జిల్లాకు వచ్చాయి. గొర్రెలకు ప్రతి ఏటా సెప్టెంబరులో శాఖ ద్వారా ఉచితంగా టీకాలు వేస్తున్నాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. లక్షణాలు కనిపిస్తే పశువైద్యులకు తప్పనిసరిగా తెలపాలి.

కిలో అరటి రూ.6కు కొనాలి

వ్యాపారులతో కలెక్టర్ ఆనంద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నాణ్యత పేరుతో అరటి రైతులకు అన్యాయం చేయవద్దు. కిలో కనీసం రూ. 6లకు తగ్గకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆనంద్ వ్యాపారులకు సూచించారు. లేదంటే.. డ్వాక్రా మహిళలతో కొనుగోలు చేయించి ఇంటింటా విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. దీనివల్ల వ్యాపారులే నష్టపోతారని అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో ఉద్యాన అధికారులు, అరటి వ్యాపారులు, ఎగుమతిదారులతో ప్రత్యేక సమీక్ష జరిపారు. కిలో అరటి రూ.2, 3లకే పడిపోవడానికి కారణం ఏంటి? అని కలెక్టర్ అడిగారు. అరటి రెండో పంట దిగుబడిలో నాణ్యత తగ్గింది. ఇదే పంట మహారాష్ట్రలో నాణ్యతగా ఉండటంతోనే ఇక్కడ ధర తగ్గిందని వ్యాపారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 38,984 ఎకరాల్లో అరటి సాగు చేశారు. 19,570 ఎకరాల్లో మొదటి పంట, 14,789 ఎకరాల్లో రెంటో పంట, 4625 ఎకరాల్లో మూడో పంట దిగుబడి వస్తోందన్నారు. మూడో పంట పూర్తిగా, రెండో పంట 80 శాతం కోత పూర్తి అయిందన్నారు. తొలి పంట డిసెంబరులో మొదలు కానుందని కలెక్టర్ వివరించారు. రిటైల్ ధర కిలో రూ.25 పలుకుతోంది. రైతుల నుంచి వ్యాపారులు కనీసం రూ.6లకు తగ్గకుండా కొనాలన్నారు. ఎగుమతిదారులు రూ.8లకు తగ్గకుండా కొనాలన్నారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే.. తామే కొని ఇంటింటా విక్రయాలకు పూనుకుంటామని కలెక్టర్ గట్టిగా చెప్పారు. ఉద్యాన అధికారి ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి రాఘవేంద్ర, వెలుగు పీడీ శైలజ, ఉద్యాన ఏడీ దేవానంద్, నెట్టికంటయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి
మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యులు/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

కళ్యాణదుర్గం: గొళ్ల గ్రామంలో సర్వే చేస్తున్న వైద్యులు, సిబ్బంది

గుర్తించు.. వ్యాధిని నివారించు!

క్షేత్రస్థాయిలో కుష్ఠు బాధితులపై సర్వే

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

కుష్ఠు వ్యాధిని నివారించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. జిల్లావ్యాప్తంగా బాధితులను గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30 వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లాలోని 1,602 మంది ఆశా కార్యకర్తలతోపాటు ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కుష్ఠు నివారణ అధికారితోపాటు ఆరుగురు పారా మెడికల్ అధికారులు, డీఎన్‌ఎంవోతోపాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సర్వేను పర్యవేక్షిస్తున్నారు. నివేదికల ఆధారంగా బాధితులకు చికిత్స అందించడానికి వైద్య సిబ్బంది సమాయత్తం అవుతున్నారు.

ప్రారంభంలోనే చికిత్సతో పూర్తిగా నయం

సిబ్బంది గ్రామాల్లో రోజుకు 30 నుంచి 40 గృహాలు సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించి.. కుష్ఠు లక్షణాలపై ఆరా తీస్తున్నారు. అనుమానం ఉంటే వెంటనే పరిశీలించి వారికి అవగాహన కల్పిస్తున్నారు. పరీక్షల అనంతరం బాధితులు తేలితే వారికి ఆరు నెలలు, 12 నెలల కోర్సు మందులు వాడాలని వివరిస్తున్నారు. బాధితుల పేర్లు నమోదు చేసి నిరంతరం పర్యవేక్షణతోపాటు ఔషధాలను సామాజిక, పీహెచ్‌సీల్లో ఉచితంగా అందిస్తున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కుష్ఠు లక్షణాలు ప్రారంభ దశలోనే గుర్తించి తగు చర్యలు తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు. వైకల్యం ఉంటే ప్రభుత్వం ప్రతి నెలా రూ. 6 వేలు పింఛను అందజేయడంతోపాటు చికిత్సలు అందిస్తారు. జిల్లాలో 2024-25లో 203 మంది రోగులు ఉండగా ఏప్రిల్ నుంచి ఈనెల 18 వరకు 96 మంది కుష్ఠుతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

ఆందోళన వద్దు..

కుష్ఠు లక్షణాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ చికిత్సలు సక్రమంగా అందేలా చూస్తున్నాం. వ్యాధి లక్షణాలు ఉంటే ఎలాంటి ఆందోళన చెందకుండా వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. పీహెచ్‌సీ సిబ్బంది ఇంటికే వచ్చి సేవలు అందిస్తారు. **- జయలక్ష్మి, కుష్ఠు, ఎయిడ్స్, టీబీ వ్యాధులు నివారణ జిల్లా అధికారిణి**

కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు

ప్రధాని మోదీ పుట్టపర్తి పర్యటన విజయవంతం

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పుట్టపర్తిపట్టణం: శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి పర్యటనను ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులు విజయవంతం చేశారు. ప్రధానితోపాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో 3 వేల మందితో బందోబస్తు కల్పించారు. ప్రశాంతి నిలయం నుంచి హిల్‌వ్యూ స్టేడియం వరకు వచ్చి, వెళ్లే భక్తుల కోసం రెండువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బస్టాండును తాత్కాలికంగా కర్ణాటకనాగేపల్లి, పడమర ద్వారం, ఆర్డీవో కార్యాలయం ప్రాంతాలకు తరలించారు. ప్రధాని మోదీ ప్రశాంతి నిలయం లోపలికి వచ్చేటప్పుడు, బయటకు వెళ్లే సమయంలో ప్రజలు, భక్తులు ఆయన్ను చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అవకాశం కల్పించారు. భద్రత చర్యలను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్వయంగా పర్యవేక్షించారు.

విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

వినియోగదారులను మోసగించిన కేసులో ఒకరి అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వాహనాల కొనుగోలు కోసం వినియోగదారులు కట్టిన డబ్బులు పక్కదారి పట్టించి మోసగించిన కేసులో రాజేశ్‌ను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గుత్తి రోడ్డులోని ఓ మోటార్ వాహనాల షోరూం యాజమాన్యం వినియోగదారుల నుంచి అడ్వాన్సులు, మరికొందరు వాహనాల ధర మొత్తాలను చెల్లించారు. అందుకోసం కొందరు ఫైనాన్స్, బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన సొమ్మును వాహన కంపెనీకి చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారు. అయితే డబ్బులు చెల్లించినా వాహనాలు డెలివరీ ఇవ్వకపోవడంతో షోరూం యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో వారి నుంచి సరైన సమాధానం లేకపోవడంతో బాధితులు కొందరు ఆరు నెలల క్రితం వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. షోరూం యజమానుల్లో ఒకరైన రాజేశ్‌ను అరెస్టు చేసి జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు నిందితునికి రిమాండ్ విధించింది. సుమారు 40 మంది దాకా బాధితులు డబ్బులు చెల్లించి మోసపోయారని తెలిసింది.

వాలీబాల్‌లో ధర్మవరం, అనంతపురం జట్ల గెలుపు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అండర్-14 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం కొత్తపూరు జూనియర్ కళాశాల మైదానంలో జరిగాయి. బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. బాలుర విభాగం పోటీల్లో ధర్మవరం డివిజన్ జట్టు విజేతగా, పెనుకొండ జట్టు రెండోస్థానం దక్కించుకుంది. బాలికల విభాగంలో జిల్లా ఛాంపియన్‌గా అనంతపురం డివిజన్, రన్నరప్‌గా పెనుకొండ డివిజన్ జట్టు నిలిచాయి. రెండు విభాగాల్లో పెనుకొండ జట్లు గట్టి పోరాట పటిమను ప్రదర్శించాయి. రెండు విభాగాల్లోనూ పెనుకొండ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. అండర్-14 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జట్లను ఆర్డీటీ మైదానంలో ఎంపిక చేశారు. ప్రతిభ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని పర్యవేక్షణలో జరిగాయి. పీడీలు ప్రదీప్‌బాబు, రమేష్, మహేష్, వెంకటేష్, రాజశేఖర్, సిరాజుద్దీన్, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు సంజీవ రాయుడు, సుజాత జట్లను ఎంపిక చేశారు.

వాలీబాల్ అండర్-14 బాలుర జట్టు ఎంపిక

ఎంపికైన జట్ల వివరాలు..

వాలీబాల్ బాలురు జట్టు: చరణ్‌నాయక్, శ్రీకాంత్, మణికంఠ, సాకేత్, బాబాఫక్రుద్దీన్, అఖిల్‌సాయి, భరత్, ముఖేష్, స్కంద, చరణ్, ధీరజ్‌రెడ్డి

బాలికల జట్టు: నిహారిక, అఫ్రీన్, మోక్షిత, అమీనా, అవంతి, శరణ్య, తస్మియా, సింధు, వర్షిత, లావణ్య, చైత్ర, హర్షిత

బేస్‌బాల్ బాలికల జట్టు: స్వాతి, లాస్య, అను, స్వాతి, ఇంతియాజ్, లిఖిత, పూజిత, సౌమ్యశ్రీ, యాస్మీన్, హాసిని, లోకేశ్వరి, అప్సానా, శ్రీలత, విజయలక్ష్మి, అక్షయ, సుచిత్ర

బాలుర జట్టు: రాకేష్, గోకుల్, వరుణ్, కౌశిక్, అశోక్ చక్రవర్తి, వరుణ్ కుమార్, రోహిత్ కుమార్, చరణ్ నాయక్, బద్రీనాథ్, చైతన్య కుమార్, నరేష్, హర్షవర్ధన్, సంతోష్, అరుణ్, బన్నీ, చేతన్‌రెడ్డి.

సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు: సందీప్, రాజు, వెంకటేష్, ఉమేష్ చంద్ర, చైతన్య, నితిన్‌నాని, శివప్రసాద్, హాసినాథ్, త్రివిక్, ప్రవీణ్, భానుప్రకాశ్, సాకేత్, ఓంకారేశ్వ, సంజయ్, మారుతి అభిరామ్.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Regional Sponsor: MITS (Deemed to be University) Madanapalle Institute of Technology & Science

TV Partner: ETV Andhra Pradesh

Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat

Organised by: ఈనాడు

ఈనాడు, హైదరాబాద్: కళాశాల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా

ఈనాడు కార్యాలయం, ఈవెంట్స్ డిపార్ట్‌మెంట్, బెంగళూరు హైవే, రాప్తాడు, అనంతపురం - 515001

వివరాలకు: 80080 01704

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

JOBS

Mypatta కంపెనీలో నైట్ షిఫ్ట్ (4.00 PM to 12.00 AM) కోసం అబ్బాయిలు కావాలి. అర్హత ఏదైనా డిగ్రీ చదువుతున్నవారు/ డిగ్రీ పూర్తిచేసినవారు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే చాలు, ఆకర్షణీయమైన శాలరీ. Cell: 9000088636.

MARKETING/ SALES

ప్రముఖ ఆయిల్ మరియు మసాలాల కంపెనీకి Sales Executive కావలెను. సంప్రదించండి: ✆ 9032963185.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

బుగ్గరామలింగేశ్వరుడు

పంచముఖ రూపా.. బుగ్గరామలింగేశ్వరా

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని ప్రసిద్ధ బుగ్గరామలింగేశ్వరుని ఆలయంలో కార్తికమాస పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం పంచముఖ రూపంలో స్వామిని అలంకరించారు.

ప్రత్యేక ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం తెలిపారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్, ప్రైమరీ ఉపాధ్యాయుల పోస్టులు, తాత్కాలిక స్పీచ్ థెరపిస్ట్ పోస్టులు అర్హులతో భర్తీ చేస్తామన్నారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ పోస్టులు తిరుపతి, అనంతపురం, కడప, చిత్తూరు పాఠశాలల్లో ఒక్కొక్కటి చొప్పున, తమిళనాడులోని తిరుత్తణిలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక ఉపాధ్యాయుల పోస్టులు తిరుపతి, చిత్తూరులో ఒక్కటి చొప్పున, తిరుత్తణిలో మూడు, కడపలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ పోస్టులకు బీఎడ్ (ఎంఆర్ అండ్ ఐడీ), ప్రాథమిక ఉపాధ్యాయుల పోస్టులకు డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్ అండ్ ఐడీ) పూర్తి చేసి ఉండాలి. రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉన్న కళాశాలల్లో కోర్సు పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులు. తాత్కాలిక విధానంలో భర్తీ చేసే స్పీచ్ థెరపిస్ట్ పోస్టులు తిరుపతి, అనంతపురం, చిత్తూరు, తిరుత్తణి, తిరుపతి ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో ఒక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. అభ్యర్థులు డిప్లొమా ఇన్ హియరింగ్, లాంగ్వేజ్, స్పీచ్, బీఎస్సీ (ఎ.ఎస్.ఎల్.పి) చేసిన వారు అర్హులు. అభ్యర్థులు దరఖాస్తులను ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ సేవాసమితి, అన్నమయ్య మార్గ్, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి చిరునామాకు పదిరోజుల్లోగా పంపాలని సూచించారు. వివరాలకు 0877-2242404 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

త్వరితగతిన బీటీపీ పనులు పూర్తి: ఎస్ఈ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: నిర్దేశించుకున్న లక్ష్యంలోపు భైరవాని తిప్ప కాలువ పూర్తయ్యేలా పనులు శరవేగంగా సాగుతున్నాయని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజస్వరూప్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామ సమీపంలో కొనసాగుతున్న భైరవాని తిప్ప(బీటీపీ) ప్రాజెక్టు కాలువ పనులను ఎమ్మెల్యే మేనల్లుడు దేవినేని అవినాష్‌తో కలిసి ఎస్ఈ రాజస్వరూప్‌కుమార్, జేఈ సుదర్శన్ పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్‌కు కాలువ పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం కాలువ 93.65 కిలోమీటర్లు కాగా ఇప్పటి వరకు సుమారు 40 కిలోమీటర్లు పూర్తిచేశామన్నారు. కాలువ కింద సుమారు 200లకు పైగా బ్రిడ్జిలు నిర్మించాల్సి వస్తోందన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ రాజస్వరూప్ కుమార్, అవినాష్ తదితరులు

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు పూజ

డి.హీరేహాళ్: డి.హీరేహాళ్ మండలంలోని సోమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని డి.పూజ నెట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎన్.అనురాధ పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడాపోటీల్లో రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థిని జాతీయస్థాయికి ఎంపికయ్యేలా కృషిచేసిన పీడీ కేశమ్మ, పీఈటీ అశోక్‌తోపాటు క్రీడాకారిణి పూజను పలువురు సన్మానించారు.

VASAVI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES

Peddapalli (V), Near Bhakrapet, Sidhout(M), Kadapa-516 247

www.vipssciences.ac.in e-mail:vipskdp@rediffmail.com

(Approved by PCI, New Delhi & Affiliated to JNTUA Anantapur)

SPOT & CAT – B ADMISSIONS NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2025 – 2026

EAPCET CODE : VSPP

Course	Admissions Vacancy Position
B.Pharmacy	30
Pharm.D	9

Eligibility : Intermediate MPC / BiPC

Few Management Quota & Spot Admissions seats are available

Contact: 9966466281, 7569701117 PRINCIPAL

వాట్సప్ కాల్ చేస్తారు.. మొత్తం దోచేస్తారు

అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న ఎనిమిది మంది అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి బ్యాంకు ఖాతాల నుంచి రూ.2.5 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో కేసు వివరాలకు ఆయన మీడియా వివరించారు. 'ఆగస్టు 26న మనీ లాండరింగ్ కేసు పేరుతో తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి వాట్సప్ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు బదిలీ చేయమని రెండు మ్యూల్(దొంగ పేర్లతో) బ్యాంకు ఖాతాల్లో రూ.80 లక్షలు జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించి బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాతాల్లో ఉన్న రూ.2.5 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. మిగిలిన రూ.77.5 లక్షల నగదు బాధితుడి ఖాతా నుంచి ఆ రెండు బ్యాంకు ఖాతాల ద్వారా 14 రాష్ట్రాల్లోని ఇతరుల ఖాతాలకు.. చివరకు గేమింగ్ యాప్ వినియోగదారుల ఖాతాలకు చేరినట్లు గుర్తించారు.

కంబోడియా వెళ్లి.. నెట్‌వర్క్‌తో పనిచేసి

మొదట అనంతపురం జిల్లాకు చెందిన క్రాంతికుమార్, పవన్‌కుమార్ మ్యూల్ ఖాతాలకు జమైనట్లు తెలుసుకుని దర్యాప్తు చేశారు. వీరి వెనుక హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు ఓ ముఠా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆయన 2024 జనవరిలో కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌తో కలిసి పనిచేశారు. ఆ సమయంలో ఆయన విదేశీ నెట్‌వర్క్‌తో సంబంధాలు పెంచుకున్నారు. తర్వాత ఇండియాకు వచ్చి క్రాంతికుమార్, పవన్‌కుమార్‌తో పాటు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గౌతమ్‌ల ద్వారా భారీ సంఖ్యలో మ్యూల్ ఖాతాలను సేకరించారు. ఆ వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సాక్ష్యాలు టెలిగ్రామ్ ద్వారా విదేశాలకు పంపుతూ.. ప్రతి లావాదేవీపై కమీషన్ పొందేవారు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉండటంతో అరెస్టు చేశారు. మరో కీలక నిందితుడు హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన మోహమ్మద్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

● **గొలుసులు కాజేసింది బావారియా గ్యాంగే:** అక్టోబరు 4వ తేదీ తిరుపతి తూర్పు, అలిపిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు గంటల కాలంలో ఐదుగురు మహిళల మెడలోని బంగారు గొలుసులు కాజేసింది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బావారియా గ్యాంగ్ సభ్యులని ఎస్పీ తెలిపారు. తిరుపతికి రైల్లో వచ్చి ఒక ద్విచక్ర వాహనం దొంగతనం చేసి వరుసగా గొలుసులు కాజేసిన ఘటనపై కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి గుర్ముఖ్(53)ని అరెస్టు చేసినట్లు తెలిపారు. జయరాం, మోహన్ అనే మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ప్రకటించారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె గ్రామ శివారుల్లో గుర్తుతెలియని ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు సజ్జలదిన్నె నుంచి ఆలూరుకు వెళ్లే రహదారి పక్కన ఉన్న పొలాల్లో గుర్తుతెలియని చెట్టుకు ఉరేసుకున్నాడని అటువైపు వెళ్లిన కొందరు గుర్తించి సమాచారం అందించారని తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడికి సుమారు 35 ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

తల్లిపై కత్తితో కుమారుడి దాడి

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన షేక్మున్నీపై ఆమె కుమారుడు దూద్‌వలి కత్తితో దాడి చేసి గాయపరిచాడని బుధవారం పోలీసులు తెలిపారు. షేక్ మున్నీ కుమారుడికి ఇంటిలో భాగం ఇవ్వకపోవడంతో ఆగ్రహించాడు. తీవ్రంగా గాయపడటంతో బంధువులు హుటాహుటిన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

చీనీ చెట్ల నరికివేత

యాడికి, న్యూస్‌టుడే : మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో చీనీ చెట్లను గుర్తుతెలియని దుండగులు నరికివేశారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం గుట్లపల్లి గ్రామానికి చెందిన కరివేన రంగస్వామి యాడికి మండలం ఓబుళాపురం సమీపంలో కొన్నేళ్ల కిందట తొమ్మిది ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఇందులో నాలుగేళ్ల కిందట చీనీ మొక్కల నాటారు. అందులో పూత దశకు చేరుకున్న 69 చెట్లను గుర్తు తెలియని దుండగులు నరికేశారు. పక్క తోట యజమానులు గుర్తించి రంగస్వామికి సమాచారం ఇవ్వగా, అతని పోలీసుల దృష్టికి ఫిర్యాదు చేశాడు. వెంటనే సీఐ ఎం.ఈరన్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నరికిన చెట్లను పరిశీలిస్తున్న సీఐ ఈరన్న

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృత్యువాత

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మఘట్ట మండలం కరిసూరయ్యదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయదుర్గానికి చెందిన మహేష్(36) దుర్మరణం పాలయ్యాడు. అతడి స్నేహితులు అబి, రాజ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. ప్రైవేటు బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్న మహేశ్ ఇద్దరు స్నేహితులతో కలిసి బుధవారం మొండయ్యదొడ్డిలోని పిన్నమ్మ ఇంటికి వెళ్లారు. రాత్రి భోజనాలయ్యాక ద్విచక్ర వాహనంపై ముగ్గురు కలిసి రాయదుర్గానికి ప్రయాణమయ్యారు. కరిసూరయ్యదొడ్డి సమీపంలో దున్నపోతు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే మహేష్ మృతిచెందాడు. మిగతా ఇద్దరు చికిత్సలు పొందుతున్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహేష్

ప్రమాదవశాత్తు కింద పడి రైతు మృతి

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు రామకృష్ణారెడ్డి(60) ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. తన వ్యవసాయతోటలో ట్రాక్టర్‌పై నుంచి పురుగు మందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

నార్పల, న్యూస్‌టుడే : బొందలవాడ గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు(37) దుర్మరణం పాలయ్యాడు. నార్పల పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు వ్యక్తిగత పనిపై తన ద్విచక్రవాహనంలో నార్పలకు వచ్చి తిరిగి వెళ్తుండగా బొందలవాడ గ్రామ శివారులో తాడిపత్రికి వెళ్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కావడంతో దుర్మరణం పాలయ్యాడు. గతంలో మృతుడి భార్య మృతిచెందారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. నార్పల ఎస్సై సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం గ్రామీణం, ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉచిత ఉపాధి శిక్షణకు అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల నుంచి ఈనెల 26 లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9177444351, 7801031771 సంప్రదించాలని కోరారు. ● నిరుద్యోగులు ఉపాధి శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ అశ్రీఫ్‌అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాల మరమ్మతులు, ఐబీఎం డేటా ఇంజినీరింగ్ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రవర్తనలో మార్పుతోనే భవిష్యత్తు

మాట్లాడుతున్న జడ్జి రాజశేఖర్

కళ్యాణదుర్గం గ్రామీణం: పొరపాటుతోనో పరిస్థితుల్లో శిక్షపడి జైలుకు వచ్చిన వారు ఇకపై ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం సబ్‌జైలును తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేకపోతే న్యాయసేవాధికార సంస్థ తరఫున ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు, న్యాయవాదులు పరిపూర్ణావతి, ముత్యాలప్ప, అనంతపురం, కోర్టు సిబ్బంది ప్రభాకర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: కప్పగుంతలరోడ్డులోని సైడ్ కాలువలో మురుగు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- కలందర్, కణేకల్లు**

సమాధానం: వెంటనే కాలువ శుభ్రం చేయిస్తాం. **- చంద్రమౌళి, ఈఓఆర్‌డీ**

సమస్య: బ్రహ్మసముద్రం నుంచి బెణికల్లు రోడ్డు మీదుగా వెళ్లే ఎస్సీకాలనీ కాలువల్లో ప్రాంతంలో మురుగు ముందుకు కదలడం లేదు. **-స్థానికులు, బ్రహ్మసముద్రం**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీ శుభ్రం చేయిస్తాం. **- సురేష్, కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కణేకల్లు

సమస్య: అపిలేపల్లి మాలవీధిలో దారిపై మురుగు పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- మంజునాథ, కాలనీవాసి**

సమాధానం: పరిశీలించి మురుగు ప్రవాహం లేకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనాథ్‌బాబు, కార్యదర్శి

సమస్య: జంబుగుంపలలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మురుగు పారుతూ అపరిశుభ్రంగా మారింది. **-గ్రామ యువకులు**

సమాధానం: మురుగు లేకుండా చర్యలు తీసుకుంటాం. **-షావనాభేగం, కార్యదర్శి**

సమస్య: కుందుర్పి బోయవీధిలో గతంలో ఏర్పాటు చేసిన సోలార్ దీపం రాత్రిపూట వెలగడంలేదు. **- మల్లిస్వామి, కాలనీవాసి**

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- యల్లక్క, కార్యదర్శి**

సమస్య: కుందుర్పిలో మురుగు కాలువ పూడుకపోయి దుర్గంధం వెదజల్లుతుంది.

-గ్రామ యువకులు

సమాధానం: వెంటనే కాలువలను శుభ్రం చేయిస్తాం. **- యల్లక్క, గ్రామ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కుందుర్పి

ఆధార్ నవీకరణ అవశ్యం

■ పాఠశాలల్లో ప్రారంభమైన శిబిరాలు
■ ఇది పూర్తయితేనే ప్రభుత్వ పథకాల వర్తింపు

న్యూస్‌టుడే, రాయదుర్గం: విద్యార్థులు ఆధార్ నవీకరణ నిమిత్తం కేంద్రాలకు వెళ్లాల్సి రావటంతో చదువుకు ఆటంకం కలుగుతోంది. ఈ సమస్య తలెత్తకుండా ప్రభుత్వమే పాఠశాలల్లో పదిరోజులపాటు ఆధార్ నమోదు, మార్పుల చేర్పుల కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఆపార్ నమోదు కార్యక్రమం సక్రమంగా కొనసాగాలంటే ఆధార్‌లో వివరాలు పక్కాగా ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ నవీకరణ (అప్‌డేట్)కు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జిల్లాలోని 33 మండలాలు, పట్టణాల్లో మొత్తం విద్యార్థులు 417085 ఉండగా 331167 మంది విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకుకోగా.. 85918 మంది అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది.

నవీకరణ చేయించుకుంటున్న విద్యార్థులు

నియోజకవర్గం లోని మండలాలు	మొత్తం విద్యార్థులు	ఆధార్ పూర్తయిన వారు	చేయించు కోవాల్సిన వారు
రాయదుర్గం	23525	18864	4661
కణేకల్లు	12987	10993	1994
బొమ్మనహాళ్	11944	9617	2327
డి.హీరేహాళ్	9152	7133	2019
గుమ్మఘట్ట	8078	6204	1874

పదేళ్లకోమారు తప్పనిసరి..

ఒకసారి ఆధార్ వివరాలు నమోదు చేసుకున్నాక పదేళ్లకోమారు నవీకరించుకోవాలి. విద్యార్థులు 5 నుంచి 7 ఏళ్ళు, 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు వారు అప్‌డేట్ చేసుకోవాలి. తద్వారా బయోమెట్రిక్ పక్కాగా నమోదవుతుంది. విద్యార్థుల చిరునామా, జనన వివరాల్లో తేడాలుంటే సరిచేసుకునే అవకాశం ఉంటుంది. నవీకరణ చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాల లబ్ధి, ఇతర గుర్తింపు విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయి.

కేంద్రాల సద్వినియోగం చేసుకోవాలి

- వెంకటరమేష్, ఎంఈవో-2, రాయదుర్గం

పట్టణంలోని పాఠశాలల్లో పది రోజుల పాటు విద్యార్థుల ఆధార్ నవీకరణ కార్యక్రమం జరుగుతుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్ నవీకరణ జరగకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవు.

అన్నదాత సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా సీనియర్ నాయకులు మల్లికార్జున, మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి అన్నారు. రెండో విడత నిధులు విడుదల సందర్భంగా బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రైతులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. రైతుల బాగుకోసం సీఎం చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 46,680మంది రైతులకు సంబంధించి రూ.35.05 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమకానున్నాయన్నారు. అందుకు సంబంధించిన చెక్కును రైతులకు అందజేశారు. కేవీకే సమన్వయకర్త చంద్రాయుడు, ఏడీఏ ఎల్లప్ప, ఏవో వాసకీరాణి, చాపిరి సొసైటీ అధ్యక్షులు మల్లిపల్లి నారాయణ, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, సీనియర్ నాయకులు మురళి, రామాంజినేయులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ఉమ్మడి చెక్కును అందజేస్తున్న తెదేపా నాయకులు, అధికారులు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు: విప్ కాలవ

వరి కంకులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

కణేకల్లు, న్యూస్‌టుడే: అన్నదాతల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో దివాలా తీసిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధితో ముందుకు నడిపిస్తున్నారన్నారు. బుధవారం కణేకల్లు బస్టాండు ఆవరణలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల, పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా 38,508 మంది రైతులకు రూ.28.95 కోట్ల నిధుల చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, తెదేపా మండల కన్వీనర్ వన్నారెడ్డి, నాయకులు లాలెప్ప, ఆనందరాజు, సుదర్శన, ఆది, మల్లికార్జున, ఫక్రుద్దీన్, చంద్రశేఖరగుప్తా, రమేష్, జయరాం చౌదరి, నరేంద్ర, గోపాల్‌రెడ్డి, వన్నూరుస్వామి, శరబనగౌడ పాల్గొన్నారు.

ఉద్యాన ఖిల్లాగా రాయదుర్గం

కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యవసాయం, అనుబంధ రంగాలతోపాటు రాయదుర్గం నియోజకవర్గం ఉద్యాన, వాణిజ్య పంటల ఖిల్లాగా అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వ విప్, కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కణేకల్లు క్రాసింగులో తెదేపా నాయకుడు రైతు ఆదినారాయణ ఉద్యాన క్షేత్రంలో సాగు చేసిన బీర పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన హ్యాండ్‌బాల్‌లో పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు గణేష్, రేవత్, గౌతమ్, హర్షవర్ధన్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పద్మజాదేవి తెలిపారు. ఉపాధ్యాయులు నాగరాజు, పీడీ శ్రీనాథ్ వీరిని క్రీడలో అభినందించారు.

బాబా ఫకృద్దీన్

కుందుర్పి: కుందుర్పి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాబా ఫకృద్దీన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపీచంద్, పీడీ మంజునాథ్ తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

నవ్య

శెట్టూరు: శెట్టూరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నవ్య రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. త్వరలో వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటుందన్నారు. బుధవారం స్థానికంగా విద్యార్థిని అభినందించారు.

మాన్విత

డి.హీరేహాళ్: డి.హీరేహాళ్‌లోని జ్యోతిబాపులేకు చెందిన విద్యార్థిని మాన్విత హైజంప్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ షాజీదా బేగం పేర్కొన్నారు. మాన్వితది గుమ్మగట్ట మండలం గొనబావి గ్రామం.

ప్రతిభ చూపిన విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

ఉరవకొండ: ఉరవకొండలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు తైక్వాండోలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ జ్ఞానప్రసూన తెలిపారు. ఈనెల 14 నుంచి 16 వరకు కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 6వ తరగతికి చెందిన నిర్మల్ బ్రాంజ్, 7వ తరగతికి చెందిన కీర్తిప్రియ వెండి, సాహిత బ్రాంజ్, 9 తరగతి భవ్యదీప సిల్వర్, బ్రాంజ్, 8 తరగతి మైత్రి, సారణ్య వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు కుళ్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటవస్తువుల పంపిణీ

కుందుర్పి, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన.. ఆటలు, క్రీడా పరికరాల కిట్‌లను బుధవారం జంబుగుంపల పాఠశాల విద్యార్థులకు ఎంఈవోలు లక్ష్మీదేవి, తిప్పేస్వామి పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవేంద్ర, సీఆర్‌టీ మహేష్, ఎంఐఎస్ దాదావలి పాల్గొన్నారు.

చెత్త తొలగదు.. చింత తీరదు

ప్రతి నిత్యం వేల సంఖ్యలో జనం తిరిగే కంబదూరు ప్రధాన కూడలి, ప్రతి శనివారం వారాంతపు సంత నిర్వహించే ప్రాంతంలో నిత్యం చెత్తాచెదారంతోపాటు మురుగుతో దుర్వాసన వస్తోంది. సంత తరువాత రోజు ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీ కార్యదర్శి అశ్వర్థరెడ్డితో 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ త్వరితగతిన చెత్తను శుభ్రం చేయించడంతోపాటు మురుగు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే, కంబదూరు

సచివాలయాలు ఎప్పటికి పూర్తయ్యేనో?

శెట్టూరు మండలంలోని 13 సచివాలయాల భవనాలకు కేవలం రెండు రెండు తిప్పనపల్లి, కైరేవు భవనాల నిర్మాణం మాత్రమే పూర్తయింది. పలు ప్రాంతాల్లో భవనాలు మొండి గోడలకే పరిమితమయ్యాయి. మరోవైపు ఇరుగు, అద్దె గదుల్లో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ గదుల్లో సిబ్బందితోపాటు సమస్యలు విన్నవించుకోవడానికి వెళ్లిన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 13 సచివాలయాల్లో కేవలం ఈ సమస్యపై ఎంపీడీవో జిలాన్‌భాషా మాట్లాడుతూ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, శెట్టూరు**

అపరిశుభ్రం.. అస్తవ్యస్తం

బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ ప్రధాన దారి పక్కన తాగునీటి కుళాయికి ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం ధ్వంసం కావడంతో పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. ప్రజలు తాగునీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ఇక్కడ తాగునీటిని పట్టుకోవడానికి వచ్చిన వారికి విష పురుగుల కనిపిస్తున్నాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పరిశీలించి ప్లాట్‌ఫాం మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే,బొమ్మనహాళ్**

మట్టి రోడ్డుతో అవస్థలు

కళ్యాణదుర్గం పరిధిలోని కురాకులతోట గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఇదే దారిలో జగనన్న లేవుట్‌కూ వెళ్తారు. అనంతపురం ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి సుమారు రెండు కిలో మీటర్లు ఉన్న ఈ దారి మట్టితో, గుంతలు పడి ఉంది. గ్రామం నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోల్లో పట్టణానికి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని తారు రోడ్డు వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం**

విద్యతోనే మహిళాభివృద్ధి

రాయదుర్గం, న్యూస్‌టుడే: విద్యతోనే మహిళా ప్రగతి సాధ్యమని స్థానిక గ్రంథాలయాధికారి సత్యనారాయణ సూచించారు. వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాంజనేయులు, బద్రీనాథ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం వల్ల కొత్త విషయాలు తెలుస్తాయని గ్రంథాలయాధికారి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు మహిళల అభ్యున్నతిని వివరించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని, ఒత్తిళ్లు తగ్గించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు చేపడుతున్న దీక్ష బుధవారంతో మూడోరోజుకు చేరుకుంది. కార్మికుల కష్టాలు గుర్తించకుండా వేతనాల్లో కోతల విధిస్తున్నారని వాపోయారు. కొందరిని విధుల్లోకి రాకూడదని గుత్తేదారుడు చెప్పడం తగదన్నారు. కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడంపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నీటి పథకం కార్మిక సంఘం కోశాధికారి వన్నూరస్వామి, సీఐటీయూ తాలూకా అధ్యక్షులు రంగనాథ్ పాల్గొన్నారు.

'కుష్ఠు నిర్ధారణ' సర్వేలో నిర్లక్ష్యం తగదు

అప్రమత్తతతోనే కుష్ఠు నివారణ

చేతి వేళ్లను పరిశీలిస్తున్న జయలక్ష్మి

ఉరవకొండ: కుష్ఠువ్యాధిని గుర్తింపు సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ వైద్యాధికారిణి జయలక్ష్మి హెచ్చరించారు. కూడేరు మండలం కడదరకుంటలో లెప్రసీ వ్యాధి సర్వేను తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యాధి లక్షణాలు గుర్తిస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇవాలన్నారు. పీఎంవో నాగన్న, యశోద, కరిష్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'రుణ విముక్తి చట్టం' అమలుకు వినతి

రాయదుర్గం, న్యూస్‌టుడే: రైతులను అప్పుల ఊబి నుంచి రక్షించేందుకు రుణ విముక్తి చట్టాన్ని అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున కోరారు. దుర్గంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గార్లదిన్నెలో నిర్వహించే రైతు మహాసభల గోడ పత్రికలు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం పట్టణ కమిటీ నాయకుడు నాగరాజు, రమేష్, ఆంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

డి.హీరేహాళ్: గార్లదిన్నెలో నిర్వహించే రైతు సంఘం జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేసిన సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, శివరాం, సురేష్ బుధవారం జాజరకల్లులో మాట్లాడారు.

డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులు చేరదలచిన విద్యార్థులకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ హర్షలత తెలిపారు. ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్‌సైన్స్, బీఎస్సీ బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో పరిమితంగా సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని, ఇతర వివరాలకు 99852 29288, 99664 51288 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్లు నిషేధించండి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరులో దుకాణాలు, హోటళ్లు, పండ్లు, పూలు, కాయగూరలు, చికెన్, మటన్ ఇతర దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారని, వీటిని నియంత్రించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని బుధవారం కార్యదర్శి మల్లయ్యకు స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల రామాంజినేయులుతోపాటు పలువురు పాల్గొన్నారు.

కార్యక్రమంలో బాలచంద్ర గురూజీ తదితరులు

సత్యసాయి చదివిన పాఠశాలకు బల్లల వితరణ

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొడంలో పుట్టపర్తి సత్యసాయి బాబా చదువుకున్న కరిబసవ స్వామి ఉన్నత పాఠశాలకు రూ.8 లక్షల విలువైన 200 డెస్కులను ఎచ్‌ఎం సత్యనారాయణకు బుధవారం అందించినట్లు 'అభయ ఫౌండేషన్' అధ్యక్షుడు బాల చంద్రగురూజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

రాయదుర్గం, న్యూస్‌టుడే: కణేకల్లు వద్ద తీగల లైన్ మార్పు వల్ల విద్యుత్తుకు అంతరాయం కలుగనుండటంతో తాగునీటి సరఫరా ఉండదని ఇన్‌ఛార్జి కమిషనర్ సురేష్ బుధవారం తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని, తిరిగి శుక్రవారం నీటి పంపిణీ ఉంటుందని ఆయన కోరారు.

బకాయిల విడుదలకు డిమాండ్

రాయదుర్గం: ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం కేటీఎస్ డిగ్రీ కళాశాల ఏఐఎస్‌ఎఫ్ కమిటీ ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భానుప్రకాష్, ఉపాధ్యక్షులుగా మనోజ్, తరుణ్, ప్రధాన కార్యదర్శిగా హరికృష్ణ, సహాయ కార్యదర్శులుగా సంతోష్, డేవిడ్‌లను ఎన్నుకున్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో విజయభాస్కర్, ఏపీఎం గంగన్న, ఏపీవో లక్ష్మీకాంతబాయి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యదర్శి పల్లవి, వెలుగు సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

26న ఉచిత వైద్య శిబిరం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పించనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు తెలిపారు. పింఛనర్ల కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

కార్యాచరణ ప్రణాళిక

రాయదుర్గం గ్రామీణం: ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ)పైపీఎం గోవిందప్ప ఆధ్వర్యంలో వీఓఏలు, ఎస్‌హెచ్‌సీలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాల బలోపేతానికి రుణాలు అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్, రిసోర్స్‌పర్సన్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

బొమ్మనహాళ్, డి.హీరేహాళ్: ప్రసిద్ధి చెందిన రామాలయంలో సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా కళాకారుల బృంద కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ● శ్రీశివలింగరూడ స్వామి మఠంలో గురువారం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు మఠం కమిటీ నిర్వాహకులు నాగళ్లి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని మఠం సభ్యులు కోరారు.

అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలి

వజ్రకరూరు: వజ్రకరూరు పీహెచ్‌సీని జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారులు నిర్మల, వేణుగోపాల్, రాజేష్ తనిఖీ చేశారు. కుష్ఠు వ్యాధిని గుర్తించే కార్యక్రమాన్ని వివరించారు. అందరికి అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. డాక్టర్ సర్దార్‌వలి, సీఎచ్‌ఓ లక్ష్మీదేవి, ఆరోగ్య బోధకుడు సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ పాల్గొన్నారు.

డొక్కు బస్సులు.. ప్రయాణ ఇక్కట్లు

ఆక్యూపెన్సీ పూర్తయినా పట్టింపు శూన్యం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కండీషన్‌లో లేని బస్సులు అధిక మంది ప్రయాణికులతో వెళ్తుంటే... ఎక్కడో ఒక చోట ప్రమాదానికి గురవుతూనే ఉన్నాయి. ఇటీవల 'స్త్రీశక్తి' పథకంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య రెట్టింపయింది. దీంతో ఏ బస్సు చూసినా కిక్కిరిసి ఉంటోంది. డ్రైవర్లు, కండక్టర్లు విసుగు చెందుతూ బస్సును నడపాల్సి వస్తోంది. కళ్యాణదుర్గం డిపోనకు ఆరేళ్లుగా కొత్త బస్సులు వచ్చిన దాఖాల్లేవు. ఉన్నవాటికే మరమ్మతు చేస్తూ నడుపుతున్నారు. వేగం తగ్గడం, కండీషన్‌లో లేకపోవడం తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త బస్సులు ఏర్పాటు చేసేలా చూడాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

వారం కిందట బ్రాహ్మణపల్లి- రమణేపల్లి గ్రామాల మధ్య పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

ఇటీవల జరిగిన ప్రమాద ఘటనలు

★ కళ్యాణదుర్గం డిపో నుంచి మంగళవారం శ్రీశైలానికి 51 మందితో బయల్దేరిన బస్సు పట్టణంలోని కొల్లాపురమ్మ ఆలయం వద్ద లోపం వల్ల డివైడర్‌ను ఢీకొంది. దీంతో నలుగురికి గాయాలయ్యాయి.

★ పది రోజుల కిందట కళ్యాణదుర్గం- బళ్లారి మార్గంలో బ్రహ్మణపల్లి- రమణేపల్లి గ్రామాల మధ్య 42 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లింది. ఆరుగురికి చిన్నపాటి గాయాలయ్యాయి.

★ 28 మంది ప్రయాణికులతో బ్రహ్మసముద్రం వెళ్లే బస్సు పోలేపల్లి శివారులో ముందరి చక్రం పంక్చర్ కావడంతో రోడ్డు పక్కనే నిలిచిపోయింది.

డిపోలో బస్సుల తీరిలా..

కళ్యాణదుర్గం డిపోలో 60 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వీటిలో 17 లక్షల కిలోమీటర్లు తిరిగినవి 15 పల్లె వెలుగు బస్సులు, దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్ లగ్జరీ, అల్ట్రాడిలక్స్ 5 బస్సులు 12 లక్షల కిలోమీటర్లు తిరిగాయి. 13 ఎక్స్‌ప్రెస్‌లు ఉండగా 14 లక్షలు కిలోమీటర్లు తిరిగాయి. మైలేజీలు పూర్తయినా దూర ప్రాంతాలకు వీటిని నడుపుతున్నారు. అల్ట్రా పల్లె వెలుగులు 6 బస్సులు 10 లక్షలు కిలో మీటర్లు తిరుగుతుండగా వాటి బాడీలు అధ్వానంగా మారాయి. ఇతర డిపోలకు సంబంధించి మైలేజీ ముగిసిన 20 బస్సులు పల్లె వెలుగులుగా ఇక్కడ నడుస్తున్నాయి.

కండీషన్‌లో పెడతాం..

- ఆర్‌ఎం, శ్రీలక్ష్మి

ప్రస్తుతం బీఎస్ 4, బీఎస్ 6లో మోడల్ బస్సులు ఉన్నాయి. ప్రతి బస్సును కండీషన్‌లో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కళ్యాణదుర్గానికి కొత్త బస్సుల రాక విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటోంది.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదుకు స్పందన

సభ్యత్వ నమోదు పత్రాలు స్వీకరిస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

శెట్టూరు, కుందుర్పి, న్యూస్‌టుడే: శెట్టూరు మండలంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శెట్టూరు, అయ్యగార్లపల్లి, బచ్చేహళ్లి, ములకలేడు, పర్లచేడు, ముచ్చర్లపల్లి తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, మురళి, జిల్లా కౌన్సిలర్లు ఈరన్న, గంగిరెడ్డి, బషీర్, విష్ణువర్ధన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లా ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మయ్య డిమాండు చేశారు. బుధవారం కుందుర్పి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో టెట్ పరీక్షపై సలహాలు, సూచనలు సేకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీటీఎఫ్‌లో పలువురు సభ్యత్వం తీసుకున్నారు. ఆ సంఘం నాయకులు తిమ్మప్ప, రామప్ప, ఈరప్ప, రవికుమార్, మంజునాథ, మైలారప్ప, ఉపేంద్ర, మారుతేష్ పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలను కమ్మేసిన చెట్లు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాపంపల్లి గ్రామ ప్రధాన మార్గం నుంచి ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్తు తీగలను పెద్దపెత్త చెట్లు, కంపలు కమ్మేశాయి. చిన్నపాటి వర్షం, ఈదురు గాలులకు తీగలు ఒకదానికొకటి తగులుకొని కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి నెలకొంటోందని గ్రామస్థులు వాపోతున్నారు. చెట్టు కొమ్మలు తగులుకుని తీగల్లో నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయని, తద్వారా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తుశాఖ ఏఈ రాము 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గ్రామానికి వెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

తీగలు కనిపించకుండా పెరిగిన చెట్లు...

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం

భక్తిశ్రద్ధలతో నవజ్యోతుల ఉత్సవం

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలో నవజ్యోతుల ఉత్సవం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. కార్తికమాసం చివరి రోజున ఆనవాయితీ ప్రకారం స్థానిక తొగట వీరక్షత్రియుల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున చౌడేశ్వరీ దేవి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవజ్యోతులను తలపై పెట్టుకుని అమ్మవారి గీతాలాపనలతో నృత్యాలు చేస్తూ, వీధుల్లో ఊరేగింపు చేశారు. సంతమార్కెట్‌లోని ఆలయంలో అమ్మవారిని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు.

పోటీలు.. విజ్ఞాన వేదికలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ఆదర్శ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచిన మేఘన, నిరంజన్‌రెడ్డి, దివ్యలకు పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య, పలువురు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులోని తిలక్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లైనులో దోమల బెడద ఎక్కువగా ఉంది. **- రాజు**

సమాధానం: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం**

సమస్య: రైల్వే స్టేషన్ రోడ్డులో కాసం షోరూమ్ దగ్గర గుంతల పడ్డాయి. వాహన చోదకులు అవస్థ పడుతున్నారు. **- నాగేంద్ర**

సమాధానం: పరిశీలించి గుంతలను పూడ్చడానికి తగు చర్యలు తీసుకుంటాం.
- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం
– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య: నార్పల మేజర్ పంచాయతీలో మసీదు కట్టకాలనీలో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు. దీనికి తోడు మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- మైనుద్దీన్, నార్పల**

సమాధానం: మసీదుకట్ట కాలనీలో వీధిదీపాలు, మురుగు సమస్య వెంటనే పరిష్కరిస్తాం. **-మమత, ఎంపీడీవో, నార్పల**
– న్యూస్‌టుడే, నార్పల

వెలగని దీపాలు..

➠ ప్రజలకు తప్పని తిప్పలు ➠ పట్టించుకోని పురపాలిక యంత్రాంగం

చీకట్లో కాలనీలు!

జయనగర్ కాలనీ 5వ రోడ్డులో రాత్రిళ్లు చీకటి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి ఆదర్శ పురపాలికలోని పలు కాలనీల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. ప్రధాన రహదారులు, కాలనీల్లో ఇలాంటి పరిస్థితి ఉండటంతో పురవాసులు ఇబ్బంది పడుతున్నారు. 2018 తెదేపా హయాంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ దీపాలను వైకాపా ప్రభుత్వంలో ఏమాత్రం పట్టించుకోకపోవడంతో చాలా వరకు పని చేయకుండా పోయాయి.

✦ పురపాలికలో 1.30 లక్షల జనాభా, 36 వార్డులు ఉన్నాయి. వీటిల్లో సుమారు 4 వేల వరకు విద్యుత్తు దీపాలు ఉన్నాయి. ఇటీవల ప్రధాన రహదారులు, పలు కాలనీల్లో కలిపి 150 దీపాల వరకు పని చేయడం లేదని అధికారులే చెబుతున్నారు. అలాగే కొత్త స్తంభాలకు 120 వరకు దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు.

ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం

-ఏక్‌నాథ్, మున్సిపల్ ఏఈ, తాడిపత్రి

పట్టణంలో ఎక్కడైనా విద్యుత్తు దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తున్నాం. జయన్ నగర్ కాలనీ, ప్రధాన రహదారులు, ఇతర కాలనీల్లో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. కొత్త విద్యుత్తు స్తంభాల ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

సమస్య ఎక్కడెక్కడంటే?

✦ తాడిపత్రిలోని జయనగర్ కాలనీ 5,6వ రోడ్లల్లో దీపాలు లేక రాత్రిళ్లు చీకట్లో ఉండాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా ఎలాంటి స్పందన లేదని వారు వాపోయారు.

✦ తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డులోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆయా మార్గాల్లో నిత్యం నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. కొన్ని చోట్ల విద్యుత్తు దీపాలు చెట్ల మధ్య ఉండటంతో చీకటిగా ఉంటోంది.

✦ నందలపాడు, సీపీఐ కాలనీ, అంబేడ్కర్‌నగర్‌లలో విద్యుత్తు స్తంభాలు నామమాత్రంగా ఉన్నాయి. ఈప్రాంతంలో రాత్రి సమయాల్లో పాములు తిరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

నార్పలలో ట్రాఫిక్ చిక్కులు

ప్రధాన రహదారిలో లారీలు ఇలా..

నార్పల, న్యూస్‌టుడే: నార్పల మండల కేంద్రంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్యలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. నార్పల చుట్టుపక్కల 40 గ్రామాలకు ప్రధాన వాణిజ్య కేంద్రం కావడంతో రోజూ వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా అనంతపురం-గూగూడు రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. పంచాయతీలో ఎక్కడా పార్కింగ్ సౌకర్యం లేదు. ఈకారణంగా వాహన చోదకులు ప్రధాన రహదారుల్లో దుకాణాల ముందు వాహనాలు నిలుపుతున్నారు. దీనికితోడు దుకాణాలకు సరకు రవాణా చేసే లారీలు పట్టపగలే ప్రధాన రహదారుల్లో నిలిపి సరకు దుకాణాల్లో దింపుతున్నారు. దీంతో గంటల సమయం రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీసు సిబ్బంది రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడంలో విఫలం అవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు చొరవ తీసుకుని నార్పలలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై సీఐ కౌలుట్లయ్యను వివరణ కోరగా నార్పల రహదారుల్లో పోలీసులతో నిఘా ఉంచి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఆసుపత్రి నూతన భవనం పరిశీలన

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనంలో నాణ్యత దెబ్బతినడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్న పనులు త్వరగా పూర్తి చేయించి, వచ్చే వారంలో ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా సమస్యలున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఆసుపత్రి వైద్యురాలు సునీత, సీహెచ్‌వో వెంకటలక్ష్మీదేవి, సూపర్‌వైజరు శ్రీనివాసులు, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో భూఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు

కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం

పామిడి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పామిడి, గుత్తి మండలాల బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రహమత్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2025-26 రెండో విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు భూ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. ఎంపీడీవో తేజోత్స్న, డిప్యూటీ ఎంపీడీవో అశ్వర్థమనాయుడు, మండల పశువైద్యాధికారి ఉషా, గుత్తి ఏడీఏ వెంకటరాముడు, పామిడి ఎంఏవో విజయ్‌కుమార్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

సైకిళ్లు అందించిన ఎస్‌బీఐ ప్రతినిధులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: కాలినడకన ఉన్నత పాఠశాలకు వచ్చే బాలికల సౌకర్యార్థం సైకిళ్లను అందజేస్తామని భారతీయ స్టేట్‌బ్యాంకు రీజినల్ మేనేజరు రమేశ్ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదిమంది నిరుపేద బాలికలను గుర్తించి బ్యాంకు అధికారులు సైకిళ్లను అందజేశారు. గుంతకల్లు ప్రధానశాఖ చీఫ్ మేనేజరు సురేశ్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు సురేంద్ర, సందీప్‌యాదవ్, నరేంద్ర, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా రాణించాలి

స్వయం సహాయక సంఘాల సభ్యులు

పుట్లూరు, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలోనూ పచ్చదనం వెల్లివిరిసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో అలివేలమ్మ పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్వయం సహాయక సంఘాలకు, యానిమేటర్లకు, సిబ్బందికి శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. వెలుగు ఏపీఎం వెంకటరామిరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రియదర్శిని మండల సమాఖ్య సభ్యులు, తదితర సిబ్బంది హాజరయ్యారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి

పుట్లూరులో.. ఇందిరాగాంధీకి అంజలి ఘటిస్తున్న గ్రంథాలయాధికారి ప్రకాశ్‌రెడ్డి తదితరులు

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతిని గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఘనంగా నిర్వహించారు. ఇందిరా తన జీవిత కాలంలో తీసుకున్న సాహసోపేత నిర్ణయాలను వక్తలు వివరించారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. **-న్యూస్‌టుడే బృందం**

తెదేపా మండల కన్వీనర్ల ఎంపిక

తాడిపత్రి, న్యూస్‌టుడే: మండల, గ్రామస్థాయి నాయకులు నిత్యం ప్రజల్లో తిరుగుతూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇంటి ఆవరణలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తెదేపా కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా నాయకులు తమ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. అనంతరం తెదేపా తాడిపత్రి మండల కన్వీనర్‌గా నరేంద్రచౌదరి, పెద్దపప్పూరుకు లోక్‌నాథ్‌రెడ్డి, పెద్దవడుగూరుకు పాపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, యాడికికి దడియాల ఆదినాఆయణను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఎమ్మెల్యే ప్రకటించారు. తాడిపత్రి పురపాలికలో ఏడుగురు ఇన్‌ఛార్జులను నియమించినట్లు తెలిపారు. తెదేపా సీనియర్ నాయకులు వెంకటరమణ, కేశవరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

'మాదకద్రవ్యాలతో జీవితాలను నాశనం'

గుంతకల్లు, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు లక్ష్మయ్య అన్నారు. కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ జరిగింది. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగల చోరీ

యాడికి, న్యూస్‌టుడే: మండలంలోని దైవాలమడుగులో గుర్తు తెలియని దొంగలు విద్యుత్తు తీగలను ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన పీరా, నారాయణస్వామి, హరినాథరెడ్డి పలువురు రైతులకు చెందిన తోటల్లో మోటారు నుంచి విద్యుత్తు స్తంభం వరకు ఉన్న తీగలను కత్తిరించి తీసుకెళ్లారు

గోవా మద్యం తరలింపు.. అదుపులో పాత నేరస్థుడు

అనంత నేరవార్తలు: గోవా మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుపడకుండా తప్పించుకుంటున్న పాత నేరస్థుడు ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. అతని నుంచి గోవా మద్యంతోపాటు కర్ణాటక మద్యం సీసాలు, తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. ఈఎస్ టాస్క్‌ఫోర్స్, పట్టణ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిందితుడు రామాంజనేయరెడ్డి తన కారులో మద్యం సీసాలను కోవూరునగర్ నుంచి జన్మభూమి రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్తుండగా, పోలీసులు పట్టుకున్నారు. పుట్లూరు మండలం చింతలపల్లికి చెందిన నిందితుడు రామాంజనేయరెడ్డి నగరంలోని కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. కొన్నేళ్లుగా గోవా మద్యాన్ని తాడిపత్రి, అనంతపురం నగరానికి అక్రమంగా తరలించి విక్రయించేవాడు. ఇతడిపై 4 ఎక్సైజ్ కేసులు ఉన్నాయి.

న్యాయం చేయాలని వేడుకోలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఇంట్లో గొడవల కారణంగా నా భర్త రమేశ్ బయటకు వెళ్లిపోయారని, పంచాయితీ చేయమని కులపెద్దలను అడిగితే అడిగినంత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని గుంతకల్లు కథలగేరికి చెందిన కుళ్లాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కులపెద్దలు, పూజరి కుళ్లాయప్ప రెండు సార్లు పంచాయితీలు చేశారన్నారు. నా భార్త బయటకు వెళ్లి మూడు నెలల అయిందని, ఈక్రమంలో నాపై నిందలు మోపి మా కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని ఆమె వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో దళితుల శ్మశానవాటిక స్థలాన్ని, మరువ వంకను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైకాపా నాయకులు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గంలో దళితుల శ్మశానవాటికను ఆక్రమిస్తూ బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు.

వైకాపా కోటి సంతకాల సేకరణ

గుత్తి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గుత్తిలోని గాంధీచౌక్ వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, గుత్తి పురపాలిక అధ్యక్షురాలు వన్నూరుబీ, ఎంపీపీ విశాలాక్షి, మాజీ ఎంపీపీ కోనామురళీధరరెడ్డి, వైకాపా పట్టణ నాయకులు రంగారెడ్డి, మైనుద్దీన్, హుసేన్‌పీరా, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సొంతభవనం కరవు

ఈ చిన్న గదిలోనే గ్రంథాలయం

యాడికి, న్యూస్‌టుడే: యాడికి గ్రంథాలయంలో పాఠకులు కూర్చొని చదవడానికి చోటు కరవైంది. గత ప్రభుత్వం డిజిటల్ గ్రంథాలయాలుగా మారుస్తామని హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదు. సొంత భవనం లేకపోవడంతో పంచాయతీ కార్యాలయంలోని ఓ చిన్న గదిలో ఏళ్ల నుంచి గ్రంథాలయాన్ని నడుపుతున్నారు. దిన, వార, మాస పత్రికలతో పాటు వివిధ రకాల పురాతన పుస్తకాలు దాదాపు 30 వేలకు పైగా ఉన్నాయి. ఇవి చదవడానికి పాఠకులు ఇద్దరికి మించి కూర్చోడానికి స్థలం లేదు. విజ్ఞాన భాండాగారాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పాలకులు చెబుతున్నా, దీని అభివృద్ధికి మాత్రం చొరవచూపడం లేదు. ఇప్పటికైనా గ్రంథాలయానికి సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలు

మండలంలోని పసులూరు నుంచి యాడికి మండలం రాయలచెరువు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. అడుగడుగునా గోతులతో నిండి దెబ్బతినడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కొట్టాలపల్లి, కమ్మవారిపల్లి సమీపంలో రహదారి ఛిద్రమైంది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచి నడిపినా ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, పెద్దపప్పూరు**

పెద్దపప్పూరు.. సమస్యలు జోరు

పెద్దపప్పూరు మండలకేంద్రంలో పలు వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. ఏళ్లుగా సీసీ రహదారులు నిర్మించకపోవడంతో మట్టి దారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు వీధుల్లోని ఇళ్ల వద్ద దారి మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. మురుగునీరు కదిలే పరిస్థితి లేదు. వీధి దీపాలు సైతం కరవయ్యాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై ఉప ఎంపీడీవో సురేష్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు **-న్యూస్‌టుడే,పెద్దపప్పూరు**

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

వ్యవసాయరంగానికి కొంత ఊరట

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు రైతులకు ఇస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంతో వ్యవసాయానికి కొంత వరకు ఊరట లభిస్తుందని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన అన్నదాత సుఖీభవ కార్యక్రమం మండలంలోని దిమ్మగుడిలో బుధవారం అట్టహాసంగా జరిగింది. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దారు ఉషారాణి, ఎంపీడీవో బారెన్‌సాహెబ్, తెదేపా నియోజకవర్గ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి, ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, మాజీ కన్వీనర్లు బాలిరెడ్డి, కొండూరు కేశవరెడ్డి, కేశవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. బుధవారం రెడ్డిపల్లి కేవీకేలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె నియోజకవర్గంలోని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు రూ.7 వేలు చొప్పున విడుదల చేయడంతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎంపీపీ సునీత, తహసీల్దారు శ్రీధరమూర్తి, ఎంపీడీవో సాల్మన్‌రాజు, శాస్త్రవేత్త మల్లీశ్వరి, ఏడీఏ రత్నకుమార్, తెదేపా నాయకులు శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

పెద్దవడుగూరు: ఈనెల 27,28వ తేదీల్లో జిల్లాలోని గార్లదిన్నెలో జరిగే జిల్లా రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పెద్దవడుగూరులో సీపీఎం నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి దస్తగిరి, నాయకులు శ్రీనివాసులు, రాజా, నారాయణస్వామి, నాగభూషణ, నరేష్, గొల్లారెడ్డి, బాలరాజు నాగేంద్ర తదితరులు పాల్గొని రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

బ్యాంకులో లాకర్ సౌకర్యం ప్రారంభిస్తున్న ఆర్ఎం.శ్రీదేవి

ఖాతాదారులకు లాకర్ సౌకర్యం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖలో ఖాతాదారులకు లాకర్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చామని బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. బుధవారం ఆమె బ్యాంకు మేనేజర్ భాస్కర్‌రెడ్డితో కలిసి లాకర్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు తక్కువ వడ్డీకే అన్ని రకాల రుణాలు ఇస్తామన్నారు. పీఎం జీవన్‌జ్యోతి, పీఎం సురక్షా యోజన, సూర్యఘర్ యోజన కేంద్ర ప్రభుత్వ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం

స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిఆర్.ఎస్.లో బుధవారం ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఏటీఆర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న నవరూప అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తిక మాసం అమావాస్య సందర్భంగా స్వామికి ఆకుపూజతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

యాడికి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను ప్రోత్సహించడం ద్వారా అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని సీడీపీవో సాజీదాబేగం అన్నారు. యాడికి మండలం వేములపాడులోని కేజీబీవీలో బుధవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో బాలల హక్కు వారోత్సవాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు విజయకుమారి, షంషాద్‌బేగం, జీఎం ఎస్‌కే సురేఖా పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

నష్టాల్లో కూరుకుపోయాం.. ఆదుకోండయ్యా!

తోటలోనే మాగిపోతున్న అరటి గెలలు

యాడికి, న్యూస్‌టుడే : అరటి సాగు చేసిన రైతులు నిలువునా నష్టాల్లో మునిగిపోయారు. తోటల్లోనే అరటి గెలలు మాగిపోతున్నాయి. దీనికి తోడు దిగుబడికి ధరలు లేకపోవడంతో దిక్కులు చూస్తున్నారు. మండల వ్యాప్తంగా అరటి తోటలు సాగులో ఉన్నాయి.

✦ ప్రధానంగా రాయలచెరువు, పచ్చారుమేకలపల్లి, లక్ష్మంపల్లి, చందన పలు గ్రామాల్లో అరటి తోటలు సాగు చేస్తున్నారు. పలువురు రైతులు వ్యవసాయ భూమిని పొలాలను కౌలుకు తీసుకుని పంట సాగు చేయగా, వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ సీజన్‌లో మంచి ధరలు పలకాల్సి ఉండగా అమాంతం పతనం కావడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రాయలచెరువు పరిసరాల్లోనే రూ.లక్షల్లో నష్టం జరిగింది. కొందరు అరటి గెలలను తోటల్లోనే వదిలేయగా, మరికొందరు పంటను దున్నేస్తున్నారు.

అరటి తోటలను దున్నేస్తున్న అన్నదాతలు

అడిగేవారు లేక వదిలేశా..

ఎంతో కష్టపడి అరటి పంట సాగు చేశాం. ఆశాజనకంగా దిగుబడులు వచ్చాయి. ఎగుమతి చేసే సమయంలో మార్కెట్‌లో ధరలు లేవు. దీంతో అడిగేవారే లేకపోవడంతో పండ్లను తోటలోనే వదిలేశా. ఈ ఏడాది కోలుకోలేని దెబ్బ తగిలింది.
- పరిమి చరణ్, రైతు, పచ్చారుమేకలపల్లి

అప్పుల ఊబిలో ఇరుక్కున్నాం

అరటి సాగుతో కష్టాల నుంచి గట్టెక్కుతామనుకున్నా. ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. ఇంత తక్కువకు ధర పడిపోతుందనుకోలేదు. ధరల పతనానికి కారణం అంతుచిక్కడం లేదు. ఈ ఏడాది అప్పుల్లో కూరుకుపోయాం. **- రాఘవ, రైతు, రాయలచెరువు**

(c) eenadu

అనంతపురం

●అనంతపురం ●రాప్తాడు

విద్యార్థుల వివరాలు యాప్‌లో అనుసంధానం ముఖ్యం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: గిరిజన గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి సంబంధించి అన్ని వివరాలను రోజూ యాప్‌లో అనుసంధానం చేయాలని గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. యాప్‌లో ప్రతి విద్యార్థి వివరాలను నమోదు చేసి ఆరోగ్యం, మెనూ, శుభ్రత తదితర అంశాలన్నీ పొందుపరచాలన్నారు. ప్రతి సంక్షేమ అధికారి గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఆశ్రమ పాఠశాలలు, ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ వసతి గృహాల వారు హెచ్‌పీటీఎస్, గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల వారు ఐహెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని ఐడీ, పాసు వర్డు ఉపయోగించి రోజూ వివరాలు నమోదు చేయాలన్నారు.

8,947 హెక్టార్లకు బిందుసేద్యం పరికరాల మంజూరు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో బిందు, తుంపర సేద్యం రాయితీ పరికరాల కోసం మొత్తం 38,138 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అందులో 10,255 హెక్టార్లకు రైతులు వాటా సొమ్ము చెల్లించగా, 8,947 హెక్టార్లకు పరికరాలు కలెక్టర్ అనుమతి మంజూరు చేశారని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం రాజధాని నుంచి ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు వీక్షణ సమావేశం ద్వారా సమీక్షించారు. పీడీ మాట్లాడుతూ.. మరో 19,816 హెక్టార్ల క్షేత్రస్థాయిలో పొలాలను తనిఖీ ప్రక్రియ పూర్తి చేశారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులతో తమ వాటా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. పీవో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పొలాలను తక్షణమే తనిఖీ చేయించి, అంచనా వేసి రైతులకు చేరవేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఆత్మకూరు: 9701452321,
ఎస్కే, జేఎన్‌టీయూ: 8008573005
శారదానగర్: 8008573049

సమస్య: రాంనగర్ ఆర్‌ఓ క్రాస్ 06/13 స్తంభానికి ఉన్న వీధి లైటు వెలగడం లేదు.
- రాఘవ

సమాధానం: వెంటనే లైటు వెలిగే విధంగా చర్యలు చేపడుతాం.

సమస్య: కమలానగర్‌లోని కేకే నర్సింగ్ హోమ్ సమీపంలో రోడ్డు గుంతలు పడి ఇబ్బందిగా ఉంది. **- సుబ్రహ్మణ్యం**

సమాధానం: రోడ్డు మరమ్మతులు చేయిస్తాం.

(పై ప్రశ్నలకు ఈఈ షాకీర్, డీఈ దాక్షాయిణి సమాధానాలు ఇచ్చారు.)

– న్యూస్‌టుడే, అశోక్‌నగర్, కమలానగర్

సమయపాలనా.. అబ్బే!

సైకియాట్రీ విభాగంలో ఉదయం 9.40 గంటల సమయంలో ఖాళీగా హెచ్‌వోడీ కుర్చీ

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొందరు వైద్యులు సమయపాలన పాటించటం లేదు. పీజీ, హౌస్‌సర్జన్లే ఓపీ కేంద్రాలకు వచ్చే రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. విధులకు హాజరయ్యే కొందరు వైద్యులు, పీజీలు, హౌస్‌సర్జన్లు సాధారణ దుస్తులు ధరిస్తున్నారు. ఎవరు వైద్యులో తెలియక రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ● సైకియాట్రి, ఆర్థో, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, ఫ్యామిలీ ప్లానింగ్, చర్మవ్యాధుల విభాగాలను మంగళవారం పరిశీలించగా ఉదయం 9.40 నుంచి 10 గంటలైనా డ్యూటీ డాక్టర్లు ఓపీ కేంద్రాలకు హాజరు కాలేదు. వచ్చిన రోగులు చాలాసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ● నిబంధనల ప్రకారం ఓపీ కేంద్రాల్లో ఒక అసోసియేట్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు పీజీలు, హౌస్‌సర్జన్లు ఉండాలి. కనీసం రెండు గంటల పాటైనా హెచ్‌వోడీలు ఓపీ కేంద్రాల్లో కూర్చోవాలి. ఈ నిబంధనలు కాగితాలకే పరిమితం. వైద్యులు ఓపీ కేంద్రాలకు వస్తున్నారా.. లేదా? అని పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా గదులకే పరిమితం అవుతున్నారన్న విమర్శ ఉంది. సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థో విభాగంలో వైద్యులు రాకపోయినా రోగులకు సేవలు అందిస్తున్న పీజీ, హౌస్ సర్జన్లు

ఫ్యామిలీ ప్లానింగ్ ఓపీలో వైద్యులు రాక ఖాళీగా

కాలువలకు మరమ్మతులు చేయండి

నగరంలో నిత్యం జన సంచారం ఉన్న కమలానగర్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. పైకప్పులు మరమ్మతుకు చేరి తీవ్ర దుర్వాసన వస్తోంది. తిరుమల సీడీ పాయింట్ సమీపంలో అధ్వానంగా కాలువలు ఉన్నాయి. ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి వచ్చింది. కాలువలో మురుగు తొలగించి, పైకప్పులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కమలానగర్

కూరగాయల ధరలు

అరవిందనగర్: (అనంతపురం నగరం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) **టమాటాలు** 25, రెండోరకం 20, **ఉల్లిగడ్డలు** 25, రెండోరకం 15, **బంగాళాదుంపలు** 40, **మిరపకాయలు** 50, **బెండకాయలు** 25, **వంకాయలు** 25, **ముల్లంగి** 35, **బీట్‌రూట్** 40, **బీరకాయలు** 40, **కాకరకాయలు** 40, **చౌళేకాయలు** 40, **క్యాప్సికం** 40, **చిక్కుడుకాయలు** 40, **క్యారెట్** 40, **బీన్స్** 40, **క్యాబేజీ** 35, **అల్లం** 70.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ : **సంతాన ప్రాప్తిరస్తు,** గౌరి : **కాంత,** గాయత్రి : **మాస్ జాతర,** గౌతమి : **కె ర్యాంప్,** త్రివేణి : **శివ,** తరంగిణి : **లవ్ ఓటీపీ,** తేజస్విని : **గోపిగాళ్ల గోవా ట్రిప్, జిగ్రిస్,** నీలిమ : **మిరాయ్,** శాంతి : **ది గర్ల్‌ఫ్రెండ్,** సుధా : **సీమంతం.**

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. సమాజంలో మహిళలకు వచ్చే అవకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, వీర శైవ లింగాయత్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ స్వప్న, సహాయ ఆచార్యులు బృంద పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో పెనుమార్పులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: వక్తృత్వ పోటీలతో సృజనాత్మకత వికాసం చెందుతుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం మినర్వా పాఠశాల, నలంద జూనియర్ కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం', ఇంటర్ విద్యార్థులకు 'కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశాలపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ రెండింటితో ముందు ముందు సమాజంలో విపరీత మార్పులు చోటు చేసుకుంటాయని విద్యార్థులు రచనల్లో, మాటల్లో వ్యక్తీకరించారు. ● మినర్వా పాఠశాలలో జరిగిన పోటీల్లో 8వ తరగతి విద్యార్థి హేమంత్ ప్రథమ, 9వ తరగతి విద్యార్థి చేతన్ రాఘవన్ ద్వితీయ, 7వ తరగతి విద్యార్థి జిగ్నేష్‌కుమార్ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు లావణ్య, నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, వహిద పాల్గొన్నారు. ● నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అశోక్, నందిని, ధ్రువ్ జైన్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ ఖాజీబాబు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

నలంద జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఖాజీబాబు నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మినర్వా పాఠశాల కరస్పాండెంట్ భాస్కరరెడ్డి

వృద్ధాశ్రమంలో సాయి జయంతి వేడుక

కార్తిక దీపోత్సవంలో భక్తులు

అనంత సాంస్కృతికం: నగరంలోని శ్రీసత్యజ్యోతి ట్రస్టు ఆధ్వర్యంలోని పలు సంస్థలు బుధవారం రాత్రి విద్యుద్దీపాలంకరణలో వెలుగులీనాయి. అరవిందనగర్‌లోని కల్యాణమండపం, సాయిబాబా ఆలయం, భజన మందిరం, ఎర్రనేలకొట్టాలలోని వృద్ధాశ్రమం తదితర ప్రాంతాల్లోని సత్యసాయి సంస్థల్లో సాయిబాబా శత జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. భజన మందిరంలో బుధవారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించేందుకు అత్యంత ఉత్సాహం చూపారు. అనంత జిల్లా ట్రస్టు అధ్యక్షుడు రామచంద్ర మూర్తి పర్యవేక్షణలో సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో ఈనాడు

అనంత సాంస్కృతికం: నగరంలోని హెచ్ఎల్సీ సమీపాన మంజునాథ స్వామి ఆలయంలోని అష్ట కాలభైరవ లింగానికి ఈ నెల 20న కుంభోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు బసవరాజస్వామి తెలిపారు. ● ఆదిమూర్తి నగర్‌శిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం శ్రీలలిత పరమేశ్వరీదేవి కోటి కుంకుమార్చన జరగనుంది.

రైతుల ఆనందమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పరిటాల సునీత

రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, వ్యవసాయ అధికారులు, తెదేపా నాయకులు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో బటన్ నొక్కితే కొందరికి మాత్రమే లబ్ధి చేకూరిందని, కూటమి ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండిలో రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 51,487 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వల్ల రూ. 35.98 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఐదేళ్ల సైకో సీఎం పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. వచ్చే బడ్జెట్‌లో రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, యాంత్రిక పరికరాలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తెదేపా హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే నేడు జిల్లాలో చెరువులకు హంద్రీనీవా జలాలతో కళకళలాడుతున్నాయన్నారు. అనంతరం ప్రధాని చేతుల మీదుగా సత్కారం అందుకున్న బత్తలపల్లి మండలం రామాపల్లికి చెందిన మహిళా రైతు గంగమ్మను సత్కరించారు. రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు. ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ మురళీకృష్ణ, తెదేపా మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, దామాజిపల్లి సొసైటీ అధ్యక్షుడు నరసింహులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబిలేశు, తెలుగు మహిళా కార్యదర్శి రామసుబ్బమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యమే

మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో రైతులకు ఏ మేలూ జరగలేదని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ విమర్శించారు. వైకాపా పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం గ్రామీణ మండలం ఎ.నారాయణపురంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండోవిడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 371 మంది రైతులకు రూ. 24.73 లక్షలు వారి ఖాతాల్లో జమైందని తెలిపారు. రైతులకు రాయితీపై డ్రిప్ పరికరాలు, ట్రాక్టర్లు అందజేస్తున్నట్లు వివరించారు. పార్టీలకతీతంగా ఈ సాయం అందిస్తున్నామన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క రైతుకైనా డ్రిప్ పరికరాలు రాయితీ అందించారా అంటూ ప్రశ్నించారు. నగదు జమ కాని అర్హులు అధికారులను సంప్రదించాలని సూచించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఆదెన్న, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, తెదేపా నాయకులు గంగారామ్, లక్ష్మీనరసింహులు, వన్నూర్పు, నాగరాజు, కార్పొరేటర్లు బాలాంజనేయులు, బాబా, ఏడీఏ రోజా పుష్పలత, ఏవో వెంకట్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం మెగా చెక్కును రైతులకు అందజేశారు.

బటన్ నొక్కి ప్రజలను మోసం చేశారు

ఆత్మకూరులో క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు, రైతులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో బటన్ నొక్కి ప్రజలను మోసం చేశారని తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు చెప్పారు. అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం ఎదుట ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కార్యాలయంలో ఉంటూ బటన్ నొక్కేవాడని ఎద్దేవా చేశారు. నేడు బటన్ నొక్కకుండానే ప్రజల ఖాతాల్లో నగదు జమవుతోందని హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన భూ సమస్య

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో మండల కేంద్రంలోని ఎస్సీల భూ సమస్య తీరింది. ఆత్మకూరు పంచాయతీలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం కోసం గతంలో స్థలాన్ని కేటాయించారు. దాన్ని కొందరు స్వాధీనం చేసుకున్నారు. కొద్దిరోజుల క్రితం ఆత్మకూరు సచివాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె స్పందించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వారంలోనే స్థలాన్ని సర్వే చేసి 35 సెంట్లకు సంబంధించిన పట్టాను బుధవారం బాధితులకు అందించారు. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గోవా మద్యం తరలింపు.. అదుపులో పాత నేరస్థుడు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: గోవా మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న పాత నేరస్థుడు ఎక్సైజ్ పోలీసులకు దొరికిపోయాడు. అతని నుంచి గోవా మద్యంతోపాటు కర్ణాటక మద్యం సీసాలు, తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. ఈఎస్ టాస్క్‌ఫోర్స్, పట్టణ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిందితుడు రామాంజనేయరెడ్డి తన కారులో మద్యం సీసాలను కోవూరునగర్ నుంచి జన్మభూమి రోడ్డు మీదుగా నగరంలోకి వెళ్తుండగా, పోలీసులు పట్టుకున్నారు. పుట్లూరు మండలం చింతలపల్లికి చెందిన నిందితుడు రామాంజనేయరెడ్డి నగరంలోని కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. కొన్నేళ్లుగా గోవా మద్యాన్ని తాడిపత్రి, అనంతపురం నగరానికి అక్రమంగా తరలించి విక్రయించేవాడు. ఇతడిపై 4 ఎక్సైజ్ కేసులు ఉన్నాయి.

అందరికీ అందుబాటులో ఆధార్ కేంద్రం

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ప్రజలు ఆధార్‌లో ఎలాంటి మార్పులు చేసుకోవాలన్నా జిల్లా కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. ఎక్కడ ఆధార్ కేంద్రం ఉందో తెలియక దళారులను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని ముట్టాల గ్రామ సచివాలయంలో ఏడాదిగా ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్నారు. వివరాలకు 8074506035 కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

రాప్తాడు ముచ్చట్లు

అవీ.. ఇవీ.. అన్నీ..

ఇందిరాగాంధీ సేవలు ఎనలేనివి

ఉమానగర్: ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఇమాం, శర్మాస్‌వలి, వాసు పాల్గొన్నారు.

పేద వ్యాపారికి సైకిల్, నగదు వితరణ

తపోవనం: సైకిల్‌పై తినుబండారాలు విక్రయించుకునే పేద ముస్లిం వ్యాపారికి రోటరీ క్లబ్ సెంట్రల్ ద్వారా ఒక సైకిల్, నగదు సాయం అందించారు. నగరంలోని అరుణోదయ కాలనీకి చెందిన లతీఫ్, అతని భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్య చికిత్సకు కొన్ని నెలల పాటు కర్ణాటకకు వెళ్లడంతో వృద్ధాప్య పింఛను అధికారులు నిలిపివేశారు. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందులు పడుతున్న లతీఫ్ కుటుంబానికి తినుబండారాల వ్యాపారం చేసుకోవడానికి రూ. 5వేల విలువైన ఒక సైకిల్, రూ.2 వేల నగదును రోటరీ క్లబ్ యువజన సేవల విభాగం ఛైర్మన్ కె.శాంతరాజ్, సభ్యుడు కేజీ భూపాల్ నాయుడు, భాజపా మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు జి.మహమ్మద్ రఫీ అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంత నేరవార్తలు: అనంతపురం రైల్వేస్టేషన్ ఆవరణలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందాడు. ప్రయాణికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అతడు మృతి చెందాడని నిర్ధారించుకుని మూడో పట్టణ పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

23న జీపీఎస్ఎస్ ఆవిర్భావ మహోత్సవ సభ

రుద్రంపేట: గిరిజన ప్రజా సంక్షేమ సంఘం (జీపీఎస్ఎస్) ఆవిర్భావ మహోత్సవ సభ ఈనెల 23న పాతూరు గిరిజన భవనంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. బుధవారం జీపీఎస్ఎస్ ఆవిర్భావ మహోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆదర్శప్రాయురాలు ఝాన్సీ లక్ష్మీబాయి

ఎస్కేయూ: ఝాన్సీ లక్ష్మీబాయిని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ఆచార్యులు పేర్కొన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఎస్కేయూలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య శోభాబిందు, గౌరవ అతిథిగా ఎస్కేయూ రెక్టార్ వెంకట నాయుడు హాజరయ్యారు.

ఘనంగా వారోత్సవాలు

తపోవనం, న్యూస్‌టుడే : అనంతపురం గ్రామీణ మండలం చియ్యేడు, రుద్రంపేట సహకార సంఘాల్లో అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. చియ్యేడు సొసైటీలో అధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, సంఘం డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు హాజరై సహకార జెండాను ఎగరేశారు. మానిటరింగ్ అధికారి సర్ఫ్‌రాజ్ నవాజ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌దౌలా, సహకార విద్యాధికారి మురళీమోహన్, రాఘవేంద్ర ఔషధ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి నాగశుభ, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ

రాప్తాడు, న్యూస్‌టుడే : పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాప్తాడు ఎంపీడీవో విజయలక్ష్మి వ్యాఖ్యానించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో 'పర్యావరణం పరిరక్షించడం..పచ్చదనం పెంపు' కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, స్వయం సహాయక సంఘాల లీడర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. శ్రీకాళహస్తి ట్రైనర్ జె. కె. రెడ్డి, సర్పంచులు, మహిళలు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను పరిరక్షిస్తాం

అనంత నగరంలో నిర్వహించిన వారసత్వ నడకలో కలెక్టర్ ఆనంద్, అధికారులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తరతరాలుగా పూర్వీకుల నుంచి వస్తున్న వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలను కలెక్టర్ ఆనంద్ ప్రారంభించారు. ఈ వారసత్వ నడక కలెక్టరేట్ నుంచి మొదలై విక్టోరియా ఆస్పత్రి, ఆర్ట్స్ కాలేజీ, టవర్ క్లాక్, పీస్ మెమోరియల్, పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు పురావస్తు, ప్రదర్శనశాల దాకా కొనసాగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. వృత్తి, ఉద్యోగ పని ఒత్తిడి నుంచి శారీరక, మానసిక ఉపశమనం కోసం నడకే ఏకైక మార్గమన్నారు. జీవితం నిత్యం చురుకుగా, యవ్వనంగా ఉండాలంటే వ్యాయామం, నడక.. వంటి వాటిని అలవరుచుకోవాలన్నారు. నగర నడిబొడ్డులో ఉండే పాత జైలును 1882లో ప్రారంభించారు. బ్రిటీషు కాలపు కారాగారం ఇది. దీన్నే స్వాతంత్ర్య పోరాట కాలంలో రాయలసీమ వాసులను నిర్బంధించారు. ఇపుడు హీనమైన స్థితిలో ఉన్న ఈ కట్టడాన్ని పునరుద్ధరించే చర్యలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత ప్రఖ్యాత చరిత్రకారుడు డాక్టర్ రమేశ్ నారాయణ విద్యార్థులకు చారిత్రక కట్టడాలు, సంపద గురించి వివరించారు. పురావస్తు ఏడీ స్వామినాయక్, పర్యాటక అధికారి జయకుమార్, డీఈఓ ప్రసాద్ బాబు, ఉప కమిషనర్ పావని, ఇంటాక్ సభ్యులు రాంకుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై పోరాటం

రుద్రంపేట: గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్జీఓ రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. నగర పరిధి సచివాలయాల్లోని ఉద్యోగులతో బుధవారం ఏపీఎన్జీఓ కమిటీ సభ్యత్వ నమోదు చేయించారు. నాయకులు మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్స్, తదితర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ప్రవీణ్‌కుమార్, నగర నాయకులు ఉమాశంకర్, కిరణ్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా

ట్రోఫీలు సాధించిన క్రీడాకారులు

అనంతపురం క్రీడలు: విశాఖ నగరంలో రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి జిల్లా కీర్తి పతాకను రెపరెపలాడించారు. సీనియర్ పురుషుల టీమ్ ఈవెంట్ విభాగంలో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. ఈ జట్టులో కుశాల్, వంశీ, సాయిాష్, వంశీకృష్ణ, గౌతం, జయదీప్‌రెడ్డిలు ఉత్తమ ప్రదర్శన చేశారు. అండర్-15 బాలికల జట్టు రజత పతకాలు సాధించింది. ఈషా సంజన, జ్ఞాపిక, హాసిని, ఐశ్వర్యలు అద్వితీయ ప్రతిభతో రాష్ట్రస్థాయిలో రెండోస్థానం లభించింది. అండర్-15 బాలుర టీమ్ ఈవెంట్ విభాగంలో జిల్లాకు మూడో స్థానం దక్కింది. అండర్-17 బాలికల వ్యక్తిగత విభాగంలో ఈషా సంజన కాంస్య పతకం కైవసం చేసుకుంది. క్రీడాకారులను జిల్లా టీటీ సంఘం అధ్యక్షుడు పి.కేశవరెడ్డి, కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఎంవీ పాండురంగయ్య, ఈసీ సభ్యులు, శిక్షకులు రవీంద్రనాథ్, రాజశేఖర్‌రెడ్డిలు అభినందించారు.

పశుగ్రాసం సాగుకు కేంద్రం సాయం

తపోవనం, రాంనగర్: పాడి పరిశ్రమలో సరైన విధానాలు పాటిస్తే పాల ఉత్పత్తులు ఊహించని విధంగా పెరుగుతాయని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్ పేర్కొన్నారు. పశుగ్రాసం సాగుచేసే రైతులకు ఉచితంగా రూ. 32వేల వరకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అనంతపురం గ్రామీణ మండలం కందుకూరులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రైతులకు అనేక సూచనలు అందజేశారు. విశ్రాంత పశువైద్యుడు డాక్టర్ పున్నయ్య ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆవులకు, గర్భకోశ వ్యాధులతో సతమతమవుతున్న 60 ఆవులకు, 500 గొర్రెలకు మందులు పంపిణీ చేశారు.

భవనం.. నిరుపయోగం

నగరం నడిబొడ్డున చేపట్టిన నిర్మాణం. ప్రజల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భారత్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని ప్రజల కోసం జీసస్‌నగర్‌లో నిర్మాణం పూర్తి చేశారు. లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన భవనం ప్రారంభించడం లేదు. ముళ్లపొదళ్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. రాత్రి వేళల్లో పలు అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారుతోంది. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లోని కేంద్రాలు ప్రారంభమై ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తుండగా ఈ భవనం కొంత ఆలస్యంగా పూర్తి కావడంతో ప్రారంభించకుండా ఆగింది. లక్షణమైన భవనం వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు ఆరోగ్య సేవలు అందివ్వాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

శకుంతలమ్మ సేవలు శ్లాఘనీయం

వర్ధంతి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

ఆజాద్‌నగర్: ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు శకుంతలమ్మ ఒకటో వర్ధంతిని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పాల్గొని శకుంతలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శకుంతలమ్మ కొన్ని దశాబ్దాలపాటు పేద ప్రజలు, కార్మిక వర్గం, మహిళా సమస్యలపై కేసులకు వెనుకాడకుండా పోరాటాలు నిర్వహించారు. పార్టీ నిర్ణయాలను శిరోధార్యంగా భావించి, మహిళా అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, నాయకులు కేశవరెడ్డి, లింగమయ్య, రమణ, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫారమ్ నం. URC-2
భాగం-1, అధ్యాయం XXI ప్రకారం నమోదు గురించి ప్రకటన

(కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (రిజిస్టర్ చేయడానికి అధికారం) నియమాలు, 2014 లోని నియమం 4(1) ప్రకారం)

1. కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 366 లోని సబ్-సెక్షన్ (2) ప్రకారం, దీని ప్రకారం పదిహేను రోజుల తర్వాత కానీ ఇకపై ముప్పై రోజుల గడువు ముగిసేలోపు ROC-విజయవాడలోని రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రతిపాదించబడింది, భాగస్వామ్య సంస్థ యొక్క రిజిస్ట్రేషన్ నంబర్ No. 282 of 2020, D.No. 4-1-879, నడిమివంక జంక్షన్, బళ్లారి రోడ్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్, 515001, భారతదేశంలో రిజిస్టర్డ్ కార్యాలయం కలిగి ఉన్న SVR NEURO & NEPHRO CARE, రిజిస్టర్డ్ పార్టనర్‌షిప్ సంస్థ, కంపెనీల చట్టం 2013 లోని అధ్యాయం XXI లోని పార్ట్ I కింద, షేర్ల ద్వారా పరిమితం చేయబడిన కంపెనీగా SUNRAY INSTITUTE OF MEDICAL SCIENCES PRIVATE LIMITED గా నమోదు చేసుకోవచ్చు.

1) దీనివల్ల తెలియజేయునది ఏమనగా, కంపెనీలు చట్టం, 2013 యొక్క అధ్యాయం 366(2) ప్రకారం, ROC-విజయవాడ వద్ద SVR NEURO & NEPHRO CARE (Reg. No. 282 of 2020), # D.No. 4-1-879, నడిమివంక జంక్షన్, బళ్లారి రోడ్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్, 515001 అనే రిజిస్టర్ అయిన భాగస్వామ్య సంస్థను షేర్ల ద్వారా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా నమోదు చేయుటకు దరఖాస్తు చేయబడినది.

2) కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు: హాస్పిటళ్లు, క్లినికులు, మెడికేర్ యూనిట్లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ఆరోగ్య సహాయ కేంద్రాలు, అవుట్ పేషంట్ & ఇన్ పేషంట్ చికిత్సా కేంద్రాలు, పునరావాస కేంద్రాలు మరియు ప్రత్యేక వైద్యసేవల కోసం యూనిట్లను కొనుగోలు, లీజ్, స్థాపన, నిర్వహణ లేదా నిర్వహించడం.

3) ప్రతిపాదిత సంస్థ యొక్క డ్రాఫ్ట్ మెమోరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని D.No. 4-1-879, నడివంక జంక్షన్, బళ్లారి రోడ్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్ - 515001, కార్యాలయం వద్ద పరిశీలించవచ్చు.

4) ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 21 రోజుల్లోగా, ఈ దరఖాస్తుకు ఎవరైనా అభ్యంతరాలను వ్యక్త పరిచాలనుకుంటే, వారు 4వ అంతస్తు, IFCI టవర్స్, 61, నెహ్రూ ప్లేస్, న్యూఢిల్లీ - 110019 లోని రిజిస్ట్రార్ కార్యాలయానికి తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చు అలాగే, కంపెనీ నమోదిత కార్యాలయానికి కూడా నకలును పంపించాలి.

దరఖాస్తుదారుల పేర్లు:
For M/s SVR NEURO & NEPHRO CARE
కంచం వేణుగోపాల్ రెడ్డి, డి.నెం. 4-1-879, నడిమివంక జంక్షన్, బళ్లారి రోడ్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్ 515001
తేది: 20-11-2025

(c) eenadu

ఈనాడు అన్నమయ్య
గురువారం నవంబరు 20, 2025 5

ప్రమాదం అంచున.. ప్రకృతి వీక్షణ

ఆంధ్రా ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్ ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చదనం పరుచుకుని ద్విగుణీకృతమైన ప్రకృతి అందాలతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. కొత్త, పాత వ్యూ పాయింట్ల నుంచి ప్రకృతిని అస్వాదించవచ్చు. పర్యాటకులు వాటి నుంచి మరింత ముందుకు అంచుకు వెళ్లి ఫొటోలు తీసుకుంటున్నారు. ఏ మాత్రం పట్టుతప్పినా నాలుగు వేల అడుగులకు లోయలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బి.కొత్తకోట**

శంభోశంకరా.. చెరకు గడల దేవరా!

చిట్వేలి (పుల్లంపేట): చిట్వేలి మండల పరిధిలోని నక్కలపల్లెలో కొలువైన భవానీ శంకరాలయంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. తొలుత భవానీ శంకరుడి మూలవిరాట్‌ను చెరకు గడలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం భవానీ సమేత శంకరుడి కల్యాణాన్ని వేద పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

మన గ్రోమోర్ కేంద్రంలోని పురుగుల మందులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

మహిళా రైతులతో మాటామంతీ.. రచ్చబండకు హాజరైన రైతులు →

రైతులు మీసం మెలేసే రోజులొస్తాయి

- ◆ అన్నదాతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభయం
- ◆ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జనంతో మమేకం

రైతులతో కలిసి అరటి తోటలోకి వెళుతున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, పెండ్లిమర్రి, కడప వ్యవసాయం, కమలాపురం, సీకేదిన్నె: 'ప్రపంచ వ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులొస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయం కింద పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది. అందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలి. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. రైతులు గర్వంగా మీసం మెలేసే రోజులు తెస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

● పెండ్లిమర్రి మండలంలో సీఎం చంద్రబాబు బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ● వెల్లటూరులోని మన గ్రోమోర్ కేంద్రానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. వ్యవసాయంలో తలెత్తుతున్న సమస్యలు, ఇబ్బందులు, నష్టాలు, కష్టాలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామని.. పరిష్కారం లభించొచ్చని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ● అనంతరం బైరవగుట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ వేదిక వద్దకు సీఎం చేరుకున్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాలను ప్రారంభించి మాట్లాడారు. ● ఆ తర్వాత రాత్రి అయినప్పటికీ చెర్లోపల్లె పంచాయతీ చిన్న దాసరిపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన అరటి, చామంతి, చీనీ, చిక్కుడు, టమాట పంటలు పరిశీలించారు. గొర్రెల పెంపకందారులు, మహిళా కూలీలతో మాట్లాడారు. డ్రోన్ శిక్షకురాలు జ్యోత్స్న నుంచి పురుగు మందుల పిచికారీని తెలుసుకున్నారు.

● చిన్నదాసరిపల్లె పొలంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులోనే రైతులతో కలిసి పంటలను పరిశీలించారు.

● యూరియాను విరివిగా వాడొద్దని రైతులకు సూచించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు.

● అక్కడి నుంచి వెల్లటూరులో పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుని మాట్లాడారు.

రైతులతో ముఖాముఖిలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్

● అనంతరం కడప విమానాశ్రయానికి చేరుకుని విజయవాడ బయలుదేరి వెళ్లారు.

● ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, కమిషనర్ మంజీర్ జిలానీ సమూన్, డీఐజీ ప్రవీణ్, కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితీసింగ్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా నేతలు పుత్తా నరసింహారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అన్నదాత బాగుతోనే పార్టీల మనుగడ

గాలివీడు, న్యూస్‌టుడే: రైతుల అండదండలున్నంత వరకే రాజకీయ పార్టీల మనుగడ సాధ్యమని వారు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత విడుదల సందర్భంగా మంత్రి నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లోపాలను సవరించి ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందేలా వ్యవసాయాధికారులు పనిచేయాలన్నారు. గాలివీడు, చిన్నమండెం మండలాల్లో ప్రతి పల్లెకు మంచినీటిని సరఫరా చేసేందుకు రూ.150 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. వెలిగల్లు కాలువ చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని సరఫరా చేస్తామన్నారు. అనంతరం రూ.26 కోట్ల చెక్కును విడుదల చేశారు. తెదేపా నాయకులు పురం హేమకుమార్‌రెడ్డి, బీకే మహమ్మద్ రియాజ్, షేక్ పరీద్‌బాషా, రవీంద్రబాబు, ఏవో గౌతమి పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఉదయశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బి.కొత్తకోట పీజీటీ (ఇంగ్లిష్), టీజీటీ (హిందీ), పీలేరు జేఎల్ ఇంగ్లిషు పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, బీఈడీ (మెథడాలజీ), టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్స్ నకళ్లను జతపరిచి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు జిల్లా కోఆర్డినేటర్, గురుకుల సొసైటీ, డీ-బ్లాక్, కొత్త కలెక్టర్ కార్యాలయం, కడపలో స్వయంగా అందజేయాలన్నారు.

బాల్యానికి విజ్ఞానం.. వినోదం

- ◆ ఒక్కో విద్యార్థికి రూ.500 విడుదల
- ◆ జిల్లాలో 36 పాఠశాలలకు అవకాశం

చిన్నమండెం, గాలివీడు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పీఎంశ్రీ పథకం కింద ఉన్న పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పించింది. ఈ నెలాఖరులోగా విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లేందుకు నిధులు విడుదల చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.500 వంతున కేటాయిస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌ల ఖాతాలకు సమగ్ర శిక్ష అభియాన్ నుంచి నిధులు జమ చేశారు. ఒక్కో పాఠశాల నుంచి మొత్తం విద్యార్థుల్లో 8 శాతం మందికి మాత్రమే అవకాశం కల్పించారు.

ఎంపికలోనే అసలు సమస్య

విద్యార్థుల సంఖ్యలో 8 శాతం మందికే అవకాశం ఉండడంతో ఎంపిక విషయం ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది. చేసేదేమీ లేని ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల ఆదేశాలు తీసుకొని ఎంపిక చేయాలని భావిస్తున్నారు. చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో 750 మంది విద్యార్థులుంటే కేవలం 43 మందికి మాత్రమే అవకాశం ఉంది. ఇదే పరిస్థితి అన్ని పాఠశాలల్లో నెలకొంది.

● రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో ఉన్న 820 పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన 42,750 మంది విద్యార్థులకు ఎక్స్‌పోజర్ విజిట్ కింద విహారయాత్ర చేసేందుకు అనుమతించారు.

● జిల్లాలో మొదటి, రెండు విడతల్లోని 36 పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 8 శాతం మందికి అవకాశం దక్కింది. వీరితో పాటు చురుకైన 50 ఏళ్ల లోపు ఎస్కార్ట్ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ప్రతి పది మంది బాలురకు ఒక పురుష ఉపాధ్యాయుడు, పది మంది బాలికలకు ఒక మహిళా ఉపాధ్యాయురాలు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తారు.

● ఎస్ఏ-1 పరీక్షలు అనంతరం ఈ నెలాఖరులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడికి వెళ్లాలన్న విషయాన్ని, పాఠశాల వారీగా విద్యార్థుల సంఖ్యను కూడా రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులే ఖరారు చేశారు.

జిల్లా నుంచి ఎక్కడికి వెళ్తారంటే : గండికోట, తాళ్లపాక దేవాలయం, శ్రీవెంకటేశ్వర వన్యప్రాణుల అభయారణ్యం, సిద్దవటం కోట

లంచగొండుల భరతం పడదాం!

రాయచోటి, వీరబల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులు, ఉద్యోగులు ప్రతి చిన్న పనికీ తమకేంటని చేయి తడపనిదే దస్త్రాలు కదలనివ్వడం లేదు. చాలా మంది లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరగలేక విసిగి వేసారిపోతున్నారు. ఎంతో కొంత సొమ్ము ముట్టజెబుతున్నారు. మరికొందరు బాధ్యతగా అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించి ఇలాంటి లంచగొండి అధికారుల భరతం పడుతున్నారు. ఇలా ప్రజలంతా అవగాహన పెంచుకుని ముందుకు వస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి అవినీతిపరుల ఆట కట్టిస్తామని అనిశా అధికారులు చెబుతున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే ఉమ్మడి కడప జిల్లాలో లంచావతారుల భరతం పట్టేందుకు ఏసీబీ అధికారులు ఎప్పుడు తలుపులు తెరిచే ఉంచుతున్నారు. కార్యాలయాల్లో అవినీతి పెరిగితే ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో చెడ్డపేరు వస్తుందనే అభిప్రాయం పాలక వర్గాల్లో ఉంటోంది. ఏ ఉద్యోగి, అధికారి లంచం అడిగినా ఏసీబీకి చెందిన అధికారులకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేసినా స్పందించి అవినీతి తిమింగలాలను వలపన్ని పట్టే అవకాశం ఉంటుంది.

ఈ శాఖలపైనే ఫిర్యాదులు ఎక్కువ: రెవెన్యూ, పురపాలక, రిజిస్ట్రేషన్, ఖజానా, ఇరిగేషన్, ఎస్పీడీసీఎల్, పోలీస్ ఠాణాలు

జిల్లాలో నమోదైన కేసులు ఇలా..

● ఇటీవల సుండుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్కడ పట్టుబడిన నగదుతో పాటు వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది, అధికారిపై కేసు నమోదు చేశారు. నేటికీ ఆ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది.

● జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జౌళిశాఖ కార్యాలయ అధికారిపై బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు ఆరు నెలల కిందట ఏసీబీ అధికారులు వలపన్ని లంచం తీసుకొంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ● నెల కిందట మదనపల్లె గ్రామీణ సర్కిల్ కార్యాలయ అధికారి, ఓ ఎస్సై లంచం తీసుకొంటూ ఏసీబీకి పట్టుపడ్డారు. ● కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల్లో గత ఏడాదిలో అనిశా అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

టోల్‌ఫ్రీ నంబర్	అనిశా డీఎస్పీ	సీఐ కడప
1064	9440446191	9490611024

బొంగావాండ్లపల్లి సమీపంలో తవ్విన గాడి

వారు గాలికొదిలేశారు.. వీరు గాడినపెట్టారు

వీరబల్లి మండలంలోని మాండవ్య నదిని ఇసుకాసురులు చెరబట్టారు. పట్టించుకోవాల్సిన అధికారులు గాలికొదిలేశారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా అక్రమ రవాణా సాగిస్తున్నారు. పొలాల్లో ఇసుక ట్రాకర్లు రాకపోకలు సాగించడం, భూగర్భ జలాలు అడుగంటిపోతుండడం, మాండవ్యలో గుంతలు ఇలా అనేక ప్రమాదాలను నిత్యం చవిచూస్తున్న గ్రామస్థులు ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడక స్వచ్ఛదంగా గాడి తవ్వి ఇసుక ట్రాక్టర్ల రవాణాకు బ్రేక్ వేశారు. ఉచితం మాటున రోజూ వందల ట్రిప్పులు ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించి ట్రాక్టర్ యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. రైతులే స్వచ్ఛందంగా ఆపుతున్నా అధికారులు, పోలీసుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. **- న్యూస్‌టుడే, వీరబల్లి**

పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సింగిల్‌విండో విధానం ద్వారా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించి సహకరించడంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మదనపల్లెకు వచ్చిన ఆయన స్థానిక ర. భ. శాఖ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖ సీఐఐ సదస్సులో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రావటం కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకమన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం ముందుకు వెళుతోందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.4 వేల కోట్లతో రహదారులను అభివృద్ధి చేశామన్నారు. గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇంకా అభివృద్ధి చేయాల్సిన రహదారులను సీ-క్యాటగిరీ కింద త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. రహదారుల సమస్యను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన దృష్టికి తెచ్చారని వాటిని తప్పకుండా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సమావేశంలో హజ్‌కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని మార్కెట్‌యార్డు ఛైర్మన్ జంగాల శివరామ్, నాయకులు ఆర్‌జే వెంకటేశ్, ఆర్.మధుబాబు, మల్లికార్జుననాయుడు తదితరులు కలిశారు.

మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

ANNAMACHARYA COLLEGE OF PHARMACY
CODE: ANCP
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

స్త్రీ శక్తిలో పీలేరు ప్రథమం

పీలేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకాన్ని పీలేరు మహిళలు ఎక్కువగా సద్వినియోగం చేసుకున్నారు. ఆగస్టు నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని ఐదు డిపోల్లోని బస్సుల్లో 32,87,147 మంది మహిళలు సద్వినియోగం చేసుకుని రూ.12.45 కోట్లు లబ్ధిపొందారు. బస్సుల్లో మహిళలు ప్రయాణించడంలో డిపోల వారీగా పరిశీలిస్తే పీలేరు 7,64,529, మదనపల్లె-1.. 7,54,353, రాయచోటి 7,12,859, రాజంపేట 5,31,841, మదనపల్లె-2.. 5,29,565 మంది ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు.

గ్లోబల్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దుకు రంగం సిద్ధం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : కిడ్నీ రాకెట్ వ్యవహారంలో మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాల్యానికి చెందిన యమున (29)కు కిడ్నీ తొలగించడంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో ఆసుపత్రి వైద్యుడు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులుతో పాటు పలువురిపై కేసులు నమోదు కాగా ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేశారు. షోకాజుకు ఈ నెల 18వ తేదీ గడువు ముగిసినా సమాధానం ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు. ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి :
కడప : 99899 97626
మదనపల్లి : 80080 01768

మదనపల్లెలో నయా మోసగాళ్లు

ఆసుపత్రి కేంద్రంగా వసూళ్లు

'హలో.. మీరు శ్రీదేవి బంధువులా..? మీరు మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు కదా.. మీరు రూ.3 వేలు కడితే మీకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఐదు రోజుల్లో రూ.15 వేలు వస్తాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. మీరు కట్టాల్సిన డబ్బు నేరుగా ఫోన్‌పే చేస్తే చాలు' అంటూ కొందరు మోసగాళ్లు రోగులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు ఆసుపత్రిలో చేరిన వారి చరవాణి నంబర్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు**

● ఎలా బయటపడిందంటే.. మదనపల్లెకు చెందిన ఓ కుటుంబం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి అత్యవసర విభాగానికి చికిత్స నిమిత్తం వచ్చి చేశారు. వారిని పరీక్షించిన వైద్యులు యాక్సిడెంట్ రిజిస్టర్‌లో వివరాలతో పాటు ఫోన్ నంబరు నమోదు చేశారు. ప్రథమ చికిత్స అనంతరం ఆ కుటుంబం ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు నుంచే ఓ వ్యక్తి ఫోన్ చేసి తాము మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలోని ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని మీరు ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నారు కాబట్టి రూ.3 వేలు కడితే మీకు రూ.15 వేలు ఖాతాకు జమవుతాయని చెప్పారు. అయితే ఫోన్ చేసిన వ్యక్తి బాధితుల వివరాలు, బ్యాంకు ఖాతా నంబరు తీసుకోకుండా వెంటనే రూ.3 వేలు వేయాలని లేదంటే ఆన్‌లైన్ క్లోజ్ అవుతుందని చెప్పడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది.

ఎవరెవరికి వస్తున్నాయంటే..

● ఆసుపత్రికి వచ్చే రోడ్డు ప్రమాద బాధితులు, ఆత్మహత్యాయత్నాలు, ప్రసూతి సేవలకు వచ్చిన వారికి పలువురికి ఇలాగే ఫోన్లు వచ్చినట్లు ఆసుపత్రికి వచ్చిన బాధితులు చెబుతున్నారు. ఈ వ్యవహారం మొత్తం అత్యవసర విభాగంలో ఫోన్ నంబర్లు నమోదు చేసిన వారికే ఎక్కువగా ఫోన్లు వస్తున్నట్లు బాధితులు తెలిపారు.

● గత వారం రోజుల్లో 8 మందికి ఇలాగే ఫోన్లు వచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారం వెనుక ఆసుపత్రి సిబ్బంది హస్తం ఉందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● ఈ విషయమై ఎన్టీఆర్ వైద్యసేవ విభాగంలో విచారించగా ఇలాంటి ఫోన్లు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌ను వివరణ కోరగా తమకు కూడా ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఎవరైనా డబ్బు చెల్లించాలని అడిగినా, ఫోన్లు చేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోగులు ఎవరూ డబ్బు చెల్లించవద్దని ఆయన తెలిపారు.

MIOT HOSPITALS OUTREACH CLINIC TIRUPATI
MIOT హాస్పిటల్స్, చెన్నై నుంచి స్పెషలిస్ట్‌లు విచ్చేయుచున్నారు
@ MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్, తిరుపతి
డయాబెటిస్ & ఎండోక్రినాలజీ
రోగలక్షణాలు మరియు రుగ్మతలు: • మధుమేహ సమస్యలు • థైరాయిడ్ సమస్యలు • లిపిడ్ రుగ్మతలు • హైపర్ టెన్షన్ సమస్యలు • ఎదుగుదలకు సంబంధించిన రుగ్మతలు • ఇన్‌ఫెర్టిలిటీ (సంతానలేమి) • పాలీసిస్టిక్ ఒవారీ వ్యాధి (PCOD) • ఇతర సెలసరి రుగ్మతలు
Prof. Dr. S. Sridhar MD (Medicine), DM (Endocrinology), FRCP
HOD - Department of Diabetology & Endocrinology
న్యూరాలజీ
రోగ లక్షణాలు మరియు రుగ్మతలు: • స్ట్రోక్ / పక్షవాతం • తలనొప్పితో కూడిన వాంతులు • ఫిట్స్ / మూర్ఛ • ఆకస్మిక అంధత్వం • ముఖం / మెడ / వెనుక భాగాలలో నొప్పి • శరీర అవయవాల బలహీనత • చెవుల్లో శబ్దం / వినికిడి లోపం • డిప్రెషన్ • నిద్ర రుగ్మతలు • ఆందోళన • వణుకు/ అసాధారణ కదలికలు • పార్కిన్సన్స్ • మెదడు కణితులు
Dr. M Paraneetharan Marimuthu
MBBS, MCh (Neurosurgery), DNB (Neurosurgery), MRCS (Ed), Fellow of MicroNeurosurgery (Japan), Fellow of European board of Neurosurgery (FEBNS), European Spine Diploma, FRCS (Surgical Neurology)
Lead Neurosurgeon - Dept. of Neurosurgery
సంప్రదించవలసిన చిరునామా: MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్
D No 20-3-129/1, తిరుమల బైపాస్ రోడ్, శివజ్యోతి నగర్, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501
తేదీ మరియు సమయం: 22 నవంబర్ 2025 శనివారం (10am - 4pm)
కన్సల్టేషన్ ఫీజు: Rs. 400/-
అపాయింట్‌మెంట్‌ల కొరకు*: +91 70953 85111 +91 70953 85333
*ముందస్తు అపాయింట్‌మెంట్ తప్పనిసరి. ఒకవేళ అవసరం అనుకుంటే, దయచేసి ఇంతకు ముందు వైద్య రికార్డులను, తీసుకుని రావలసినదిగా మనవి
Email: tic@miotinternational.com | www.miotinternational.com

(c) eenadu

స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.15 కోట్ల మెగా చెక్కును అందజేస్తున్న ఏపీజీబీ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

వినియోగదారుడికి మెరుగైన సేవలందించడమే లక్ష్యం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట రీజనల్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మూడు కోట్ల రూపాయలతో (బ్యాంక్ ద్వారా రుణం తీసుకున్న) 30 వాహనాలను లబ్ధిదారులకు అందించామని ఆ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. రాజంపేట మండలం బోయనపల్లి హరిత హోటల్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా 51 బ్యాంక్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళ సహాయ సంఘాలకు రూ. 15 కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. అనంతరం రాజంపేట పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మొక్కలు నాటి, ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భావన, ఇతర అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట: వినియోగదారునికి విస్తృత సేవలు అందించే లక్ష్యంతో ఏపీజీబీ ముందుకు వెళుతోందని ఆ బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఏపీజీబీని స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ సభాభవనంలో 51 బ్రాంచ్‌లకు సంబంధించిన మేనేజర్ల సమావేశం నిర్వహించారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్.భావన తెలిపారు. ఈ సందర్భంగా స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.15 కోట్ల మెగా చెక్కును అందజేశారు.

అవిశ్వాస తీర్మానంపై ప్రభుత్వానికి నివేదిక

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సమగ్ర నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. వైకాపాకు చెందిన ఎంపీపీపై అదే పార్టీ ఎంపీటీసీ సభ్యులు ఈ నెల 14న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా అది నెగ్గింది. మండలంలో 11 ఎంపీటీసీ సభ్యులు ఉండగా అందులో పది మంది అవిశ్వాస తీర్మానాన్ని బలపరిచారు. మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి సమక్షంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎంపీపీ పదవిని కోల్పోయారు. ఇదే విషయాన్ని స్థానిక ఎంపీడీఓ అబ్దుల్ షుకూర్ చిత్తూరు జడ్పీ సీఈఓ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపారు. కాగా వచ్చే ఏడాది ప్రథమార్థంలో మండల పరిషత్తు ఎన్నికలు నిర్వహించడానికి పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది. ఈలోగా మండల ఉపాధ్యక్షులుగా ఉన్న రాధమ్మ, ఖాదర్‌వలిలో ఒకరు ఇన్‌ఛార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, ఆలంఖాన్‌పల్లి, కడప-516 003.
వివరాలకు: 9154991003, 8008551774
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

వైకాపాకూ ఆర్జేడీ బతుకే!

- లాలూ ప్రసాద్ కంటే జగన్‌వే ఎక్కువ తప్పులు
- సుపరిపాలనలో అందరూ భాగస్వాములు కావాలి
- తెదేపా కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

కడప విమానాశ్రయంలో చంద్రబాబుతో ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, చైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, పెండ్లిమర్రి: బిహార్‌లో ఆర్జేడీ పార్టీ గతే రాష్ట్రంలో వైకాపాకూ పడుతుందని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు జోస్యం చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ కార్యకర్తలతో ఆయన బుధవారం రాత్రి పెండ్లిమర్రిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్జేడీ అధినేత లలూ ప్రసాద్ యాదవ్ చేసిన అరాచకాలే మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా చేశారని విమర్శించారు. అందుకే బిహార్‌లో ఇరవై ఏళ్లయినా ఆర్జేడీ అధికారంలోకి రాలేదని, లలూ కుమారుడు వచ్చినా పార్టీని ఇటీవల ఎన్నికల్లో గట్టున పడేయలేకపోయారని అన్నారు. 'గుజరాత్‌లోనూ మరోసారి ఎన్డీఏ గెలువబోతోంది. అక్కడ 25 ఏళ్లుగా భాజపా అధికారంలో ఉంది. తెదేపా కూడా 23 ఏళ్లుగా అధికారంలో ఉంది. పార్టీ వరుసగా అధికారంలో ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుంది. ఆపై పార్టీ కార్యకర్తలు, నేతలు బాగుపడుతారు. మధ్యలో అధికారం కోల్పోతే చాలా ఇబ్బందులెదురవుతాయి. ఇప్పటి నుంచే అప్రమత్తమవుతున్నా. అందరూ కలిసిరండి. సుపరిపాలనలో భాగస్వామ్యులై ప్రజలతో అనుసంధానంగా ఉండండి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'ఎన్నడూ గెలవనన్ని స్థానాలను రాయలసీమలో ఈసారి గెలిచాం. కాస్త దృష్టి పెట్టి ఉంటే పులివెందుల, బద్వేలు కూడా గెలిచేవాళ్లం. రానున్న ఎన్నికల్లో వీటిని నిలబెట్టుకోవడానికి అందరూ కృషి చేద్దాం. గెలిచిన స్థానాల్లోనూ పార్టీ బలహీనంగా ఉన్న చోట పటిష్ఠానికి చర్యలు చేపట్టాం' అని వివరించారు. 'రాయలసీమలో ముఠాలను అణిచివేయడంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామికవాడల్లో పలు పరిశ్రమలొస్తున్నాయి. విమానాల తయారీ పరిశ్రమ సైతం రాయలసీమలో ఏర్పాటు చేస్తున్నాం. పండ్ల గుజ్జు పరిశ్రమలు విస్తారంగా వస్తాయి. ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం. ఈ పరిస్థితిలో పార్టీని బలోపేతం చేసుకోవాలి. అరాచక శక్తులు తిరిగి అధికారంలోకి రాకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు.

'రామానాయుడు'లా అందరూ ఉండాలి

'మంత్రి రామానాయుడు నిత్యం ప్రజలతో మమేకం అవుతారు. సైకిల్‌పై తిరుగుతూ ప్రజల్ని కలుస్తారు. ఓటమి లేకుండా వరుసగా గెలుస్తున్నారు. అందరూ ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలి. కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి ఇంకా ప్రజలతో మమేకమై రాణించాలి. యువకుడిగా మంచి భవిష్యత్తు ఉంది. నెలాఖరులోపు జిల్లా, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాలు మరింతగా విస్తరించాలి. కార్యకర్తలు అలక వహించనప్పుడల్లా పార్టీ నష్టపోతోంది. ఆ విషయాన్ని గుర్తించి వారి బాగోగులకు దృష్టి పెట్టాం. నేతలు, కార్యకర్తలు ఏ తప్పు చేయకుండా పని చేయాలి' అని చంద్రబాబు సూచించారు. అధికారులు మాట వినడం లేదని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని కార్యకర్తలు కొందరు నినదించారు. బదులుగా చంద్రబాబు మాట్లాడుతూ.. అధికారులు తప్పు చేసినా వదిలిపెట్టనని.. త్వరలో చూస్తారు కదా అని చంద్రబాబు చెప్పినప్పుడు కార్యకర్తలు కేరింతలు కొట్టారు.

ఆటోను ఢీకొన్న బొలెరో వాహనం

● ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటోను బొలెరో వాహనం ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మదనపల్లెలో బుధవారం రాత్రి జరిగింది. రాయచోటికి చెందిన షాహీదాబాను (40) మదనపల్లెలోని బీకేపల్లెలో ఉన్న బంధువు గౌసియా (38) ఇంటికి బస్సులో బయలుదేరింది. బుధవారం రాత్రి నీరుగట్టువారిపల్లెలో బస్సు దిగిన ఆమెతో కలిసి గౌసియా ఆటోలో ఇంటికి బయలుదేరారు. ఆటో బీకేపల్లె మసీదు వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో ఢీకొంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్, ఎస్టేట్‌కు చెందిన ఖాజాపీర్ (45) కుడి చేయి పూర్తిగా విరిగి రోడ్డుపై పడింది. అలాగే ఆటోలో ఉన్న మహిళలు ఇద్దరూ గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య దుల్షన్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో వారు బోరున విలపించారు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు విచారణ చేస్తున్నారు.

ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, బొలెరో వాహనం

బి.కొత్తకోటకు రూ.80 లక్షలు మంజూరు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట నగర పంచాయతీలో మురుగు కాలువల నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరైనట్లు కమిషనర్ జీవీ పల్లవి తెలిపారు. బుధవారం ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేటాయించిన ఈ నిధులతో పట్టణంలోని 11 వేర్వేరు ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టడానికి టెండర్లను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కాగా పట్టణంలో రహదారులకు మరమ్మతులు చేసేందుకు రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనల్ని పంపినట్లు వివరించారు. నగర పంచాయతీ పరిధిలోని బద్దిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి కొత్తగా బోరు వేసేందుకు పాయింటును గుర్తించామన్నారు. త్వరలో ఆయా పనులు చేపడతామన్నారు.

పొట్టేళ్ల చోరీపై ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని మద్దయ్యగారిపల్లెలో మంగళవారం రాత్రి రెండు పొట్టేళ్ల చోరీకి గురయ్యాయని బాధిత రైతు గొర్రెల కాపరి కొప్పుల ఆదెప్ప బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన 60 పొట్టేళ్లను మేపుకొని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు బొలెరో వాహనం తీసుకొచ్చి అందులో పొట్టేళ్లను ఎక్కిస్తుండగా అలికిడికి ఆదెప్ప నిద్రలేచాడు. ఆయన కేకలు వేయడంతో దుండగులు రాళ్లతో అతనిపై దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు నుంచి పడి మహిళ దుర్మరణం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రైలులో నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో బుధవారం జరిగింది. కురబలకోట ఎస్సీ కాలనీకి చెందిన దొడ్డప్ప భార్య వై.గంగులమ్మ (58) అనంతపురం జిల్లా పామిడి సమీపంలోని కల్లూరులో ఉన్న నల్లాలమ్మ ఆలయానికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లింది. దర్శనం ముగించుకుని కుటుంబ సభ్యులతో కలసి ధర్మవరం వైపు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులో బయలుదేరింది. రైలు కురబలకోట రైల్వేస్టేషన్ వద్దకు వచ్చే సరికి చెప్పులు మరిచిపోయి కిందకు దిగేసింది. దీంతో మళ్లీ రైలులోకి వెళ్లి చెప్పులు తీసుకుని వస్తూ కదులుతున్న రైలులో నుంచి దిగింది. దీంతో అదుపుతప్పి రైలు, ప్లాట్‌ఫాంకు మధ్యలో ఉన్న సందులోకి పడిపోవడంతో కుడికాలుపై రైలు చక్రాలు వెళ్లి కాలు తెగిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వచ్చే సరికే ఆమె మృతి చెందింది. కదిరి రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృత్యువాత

వీరబల్లి: ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వంగిమళ్లకు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రామాపురం మండలం నల్లగుట్టపల్లె బీసీ కాలనీకు చెందిన డేరంగుల రమణయ్య(35) జీవనోపాధి కోసం ఆటోలో పాలు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో సేకరించిన పాలను ఆటోలో తీసుకెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆయన మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశామని చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేశామని బుధవారం పోలీసులు చెప్పారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన ఓ యువతి(23) రైల్వేకోడూరుకు తన స్నేహితురాలితో కలిసి వచ్చారు. ఇక్కడే ఓ బ్యూటీపార్లర్‌లో నెల రోజులుగా శిక్షణ తీసుకుంటున్నారు. ఈ నెల 11న రాత్రి 6.30 గంటల సమయంలో ఆమె రైలు ఎక్కి హైదరాబాద్‌కు వెళ్లినట్లు ఇక్కడి స్నేహితురాలు చెబుతున్నారు. కానీ ఆమె ఇంతవరకు ఇంటికి రాలేదని ఆమె సోదరుడు తమకు ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పుష్పరాజ్ తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

REAL ESTATE

PLOT FOR SALE

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ|. దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం||. 8008685569.

TO LET

COMMERCIAL

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell :7702936190.

JOBS

K K Enterprises Kadapa. Telecaller (Male & Female) Salary: 10000 + Incentives. Contact : 8639923418

Amaravathi Software, Kadapa. Job Offer For Any B.Tech, M.Tech, MBA. Interview Date: 23-11-2025, Time: 9 AM - 5 PM, Cont: 9849720149.

ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్షిప్‌లో పని చేయుటకు స్పేర్స్ ఇన్‌ఛార్జి కావలెను. హనుమాన్ మోటార్స్, M.G.Auto Nager, Proddatur 9390032810.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ|| 350/- మాత్రమే

Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

క్రీడాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

● ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : క్రీడాకారులు దేశం గర్వించే స్థాయిలో రాణించాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాల మైదానంలో 69వ రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ సహకారంతో చంద్రమాకుల పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని విద్యార్థులు ఆటపై దృష్టి పెట్టి రాణించాలన్నారు. ఇక్కడ ఎంపికయ్యే రాష్ట్ర జట్టు జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటి రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఉద్యోగాల్లో కూడా 3 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. విద్యార్థులు ఆటల్లో రాణించి భవిష్యత్‌లో క్రీడా కోటాలో మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడాజ్యోతిని వెలిగించి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు డాక్టర్ బాబు, నాగరాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, కార్యదర్శి మురళీధర్, గ్రీన్ వ్యాలీ పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు 13 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడా జ్యోతితో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు డాక్టర్ బాబు, నాగరాజు తదితరులు

రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు మదనపల్లె విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులతో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తదితరులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు మదనపల్లెలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. ఈ నెల 18వ తేదీన రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌లో కళాశాల విద్యార్థులు చేసిన లంబాడీ డ్యాన్స్ ప్రథమ స్థానం, జానపద గీతం (గ్రూప్‌సాంగ్)లో ప్రథమ స్థానం, జానపద నృత్యంలో రెండో స్థానంలో నిలిచారన్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, డ్యాన్స్ మాస్టర్ సురేశ్, కీబోర్డు ప్లేయర్ మురళి, హరిలను కరస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీమన్నారాయణ రాష్ట్రస్థాయి యోగాసనాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేష్, పీడీ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా బాపట్లలో ఈ నెల 23వ తేదీన జరిగే అండర్-19 విభాగంలో పాల్గొంటారన్నారు.

యోగాసనాలు చేస్తున్న శ్రీమన్నారాయణ

బేస్‌బాల్ క్రీడల్లో ఆదర్శ పాఠశాల ప్రథమం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చౌటపల్లె వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలకు చెందిన ఓంప్రసన్న, అరవింద్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారని ప్రిన్సిపల్ వర్ల రమేష్, పీడీ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఆ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఎంపికై ఇటీవల రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని వారు కప్పు సాధించారన్నారు. అలాగే అండర్-19 కబడ్డీ పోటీలలో చందన రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమేష్

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్లు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని నడిమితండా అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్లు సరఫరా చేసినట్లు భాస్కర్‌నాయక్ భార్య హేమలత పేర్కొన్నారు. ఆమె తొమ్మిది నెలల గర్భిణి. పౌష్టికాహారం పంపిణీలో భాగంగా ఆమెకు అంగన్‌వాడీ కేంద్రంలో 25 కోడి గుడ్లు అందజేశారు. బుధవారం రాత్రి నాలుగు గుడ్లు ఉడికించి పెంకు తీస్తే కుళ్లిపోయి ఉన్నాయి. రెండు రోజుల కిందట కూడా ఇదే విధంగా గుడ్లు కుళ్లిపోయాయని హేమలత తెలిపారు. రెండు నెలలుగా చెడిపోయిన గుడ్లు వస్తుండటంతో లబ్ధిదారులు అంగన్‌వాడీ కార్యకర్తకు, ఆయా దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కూడా కుళ్లిపోయిన గుడ్లు వస్తే ఫిర్యాదు చేశామని, గుత్తేదారులు ఇస్తున్నారు తాము ఏం చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్త సమాధానం చెప్పారని బాధితురాలు హేమలత తెలిపారు. దీనిపై ఐసీడీఎస్ సీడీపీవో నాగవేణిని వివరణ కోరగా దీనిపై తమకు ఫిర్యాదు రాలేదని, ఈ విషయమై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తామన్నారు. గుడ్లను పరిశీలించి మార్పుచేసి ఇస్తామన్నారు. ఈ విషయమై గుత్తేదారుల దృష్టికి తీసుకెళ్లి కుళ్లిపోయిన గుడ్లు రాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

సుండుపల్లి: మధ్యాహ్న భోజనంలో భాగంగా పిల్లలకు ఇచ్చే గుడ్లలో జాప్యం చేస్తున్నారని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం వారం సరఫరా కావాల్సిన గుడ్లు రెండు వారాలకు ఒకసారి సరఫరా చేస్తున్నారని అది కూడా వారం అయిపోయిన తర్వాత తోలుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీని వల్ల గుడ్లు తరచుగా చెడిపోతున్నాయని వాపోయారు. గతేడాది సరఫరా చేసే గుత్తేదారు సక్రమంగా సరఫరా చేసేవారని ఈ ఏడాది చేస్తున్న వ్యక్తి నిబంధనలు పాటించడంలేదని పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుళ్లిపోయిన గుడ్లను చూపుతున్న హేమలత

(c) eenadu

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

కంభంవారిపల్లెలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా పారా మెడికల్ అధికారి రవికుమార్

కుష్ఠు సర్వే తనిఖీ

కంభంవారిపల్లి : కుష్ఠువ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పారా మెడికల్ అధికారి రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గర్నిమిట్ట, కంభంవారిపల్లె గ్రామాల్లో జరుగుతున్న కుష్ఠువ్యాధిపై జరుగుతున్న ఇంటింటా సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది కుష్ఠు అనుమానిత లక్షణాలు ఉంటే, వైద్యాధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.

21న మదనపల్లెకు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రాక

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : మదనపల్లె 1, 2 డిపోల తనిఖీ నిమిత్తం ఈ నెల 21న ఉదయం 10 గంటలకు మదనపల్లెకు వస్తున్నట్లు ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. ఆర్టీసీ బస్టాండుతో సహా ఆయా డిపోలు, గ్యారేజీలను తనిఖీ చేస్తానని తెలిపారు. బుధవారం అంగళ్లలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. మదనపల్లెలో ఆయన కొంత సమయం విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా డిపోల మేనేజర్లు వెంకటరమణారెడ్డి, అమరనాథ్ మర్యాద పూర్వకంగా ఛైర్మన్‌ను కలిశారు. తనిఖీకి వస్తున్నట్లు ఛైర్మన్ వారికి తెలిపారు. 1వ డిపో ఎస్టీఐ భాను, 1, 2 డిపోలకు చెందిన సిబ్బంది బాబ్జి, సెక్యూరిటీ సిబ్బంది వెంకటకృష్ణ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

శివాలయానికి నాగాభరణం వితరణ

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని విరూపాక్ష స్వామి ఆలయానికి రూ.6 లక్షల విలువ చేసే ముఖవాడ నాగాభరణాన్ని లండన్‌కు చెందిన లక్ష్మీనరసింహశర్మ, కృష్ణ, శ్వేత దంపతులు అందచేసినట్లు ఆలయ సేవకులు పట్టాభి రామయ్య తెలిపారు. నాగాభరణాన్ని స్వామి వారికి అలంకరించిన అనంతరం అభిషేక పూజలు చేశారు. శివపార్వతులకు లక్ష బిల్వార్చన నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు, సేవకులు పట్టాభిరామయ్య

26న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పట్టణ శివారు ప్రాంతంలో కొలువైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు అధ్యక్షుడు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ నిర్లక్ష్యం.. పాతాళంలో ప్రజాధనం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చడానికి పురపాలక సంఘం బోరు బావులు తవ్వించింది. గత 20 ఏళ్ల కాలంలో వాటి ఏర్పాటుకు రూ.లక్షలు ఖర్చు చేసింది. బోర్లు తవ్వేందుకు చూపించిన శ్రద్ధ వాటి నిర్వహణపై చూపకపోవడంతో చాలా బోర్లు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా అవి నేడు ఎందుకూ కొరకాకుండా పోయాయి. వాటిలో మోటారు, పంపు, పైపులైన్ ఇరుక్కుపోగా.. వాటిని పైకి తీయకుండా అలాగే వదిలేశారు.

బుగ్గకాలువ గట్టుపై బోరుబావిలోనే ఇరుక్కుపోయిన మోటారు, పంపును అలాగే వదిలేశారిలా..

పురపాలక సంఘంలో 262 బోరుబావులు

మదనపల్లె పురపాలక సంఘం తాగునీటి సరఫరాకు పూర్తిగా బోరుబావులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణంలో 262 బోరుబావులు తవ్వించారు. ఒక్కో దాన్ని తవ్వడానికి రూ.6 నుంచి రూ.7లక్షలు వరకు ఖర్చవుతోంది. 800 నుంచి 1200 అడుగులు లోతు తవ్వి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 262 బోరుబావుల్లో 125 మాత్రమే పనిచేస్తున్నాయి. సుమారు 50 బోరుబావుల్లో మోటార్లు, పంపులు, పైపులైన్లు ఇరుక్కుపోయాయి. బుగ్గకాలువ దోబీఘాట్ సమీపాన, సుభాష్‌రోడ్డు, రామారావుకాలనీ, హెచ్‌పీగ్యాస్ రోడ్డు చర్చి సమీపాన వేసిన బోరుబావిలో మోటారు ఇరుక్కుపోయాయి. ఇలా పట్టణంలో చాలా బోర్లలో మోటార్లు ఇరుక్కుపోయాయి. వాటిని అలాగే వదిలేశారు. వాటిని పైకి తీయకుండా వదిలేశారు. వాటిని పైకి తీసినట్లయితే.. ఆ బోరుబావితో పాటు ఆ వస్తువులను కూడా తిరిగి వినియోగించుకోవచ్చు. వాటిని అలాగే భూమిలో వదిలేయడంతో ప్రజాధనం వృథా అయింది.

కొన్నింటిని పైకి తీశాం

కొన్ని బోరుబావిలో కూరుకుపోవడంతో వాటిని పైకి తీయడం సాధ్యపడలేదు. పైకి వచ్చే అవకాశం ఉంటే తప్పకుండా తక్షణ చర్యలు తీసుకుని.. వాటిని పైకి తీస్తాం. తిరిగి వాటిని వినియోగిస్తాం. **- శ్రావణి, డీఈఈ, మదనపల్లె పురపాలక సంఘం**

స్పందించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

❖ ఎన్టీఆర్ విస్తరణ ప్రాంతంలో వీధి దీపాల మరమ్మతు పనులు పురపాలక సంఘం అధికారులు చేపట్టారు. వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. దీనిపై ఈ నెల 16న 'ఈనాడు'లో సమస్యపై వార్త ప్రచురితం కావడంతో పురపాలక సంఘం కమిషనర్ ప్రమీల స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

❖ మల్లికార్జున కూడలిలోని వ్యవసాయ సహకార బ్యాంకు రోడ్డులో కాలువను పురపాలక సంఘం సిబ్బంది శుభ్రం చేశారు. కాలువలో చెత్త పేరుకుపోయి మురుగు రోడ్డుపై పారుతున్న వైనంపై స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 16న 'మేమున్నాం.. మీకుతోడుగా'లో శీర్షికన వార్త ప్రచురితం కావడంతో పురపాలక సంఘం అధికారులు స్పందించి కాలువ శుభ్రం చేయించారు.

❖ రంగారెడ్డికాలనీ పాల స్టోర్ వీధిలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోవడంపై కాలనీవాసులు సమస్యను 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. దీనిపై ఈ నెల 16న 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, కార్యదర్శి షర్ఫుద్దీన్‌లు స్పందించి చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

నిధులందక.. నిర్మాణం సాగక..

నిధులు పూర్తిగా మంజూరు కాక ఎనిమిదేళ్లుగా పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా ఉంది. భవనాన్ని 2018లో రూ.7 లక్షలతో నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి కేంద్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో నడుస్తోంది. దీనిపై పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణా నాయక్‌ను సంప్రదించగా అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని పూర్తి చేసేందుకు నిధులకోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, పీలేరు**

భాజపాలో పలువురి చేరిక

కలికిరి, న్యూస్‌టుడే : మాజీ సీఎం, భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు భాజపాలో చేరారు. బుధవారం భాజపా కార్యాలయంలో కలికిరికి చెందిన నూర్‌మహ్మద్, రామారావు, సలీం, అబ్దుల్‌జబ్బార్, నాగరాజ, శీను, చంద్ర, మేస్త్రీ ఎల్లప్ప, రెడ్డెప్ప, ఉమాపతి, నూరుల్లాల ఆధ్వర్యంలో పలు కుటుంబాలు పార్టీలో చేరారు. ఈ మేరకు భాజపాలో చేరిన వారికి మాజీ సీఎం కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా జనరల్ కార్యదర్శి నరేంద్రకుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, నాయకులు నల్లారి ఆనందరెడ్డి, రెడ్డప్పరెడ్డి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

భాజపాలో చేరిన వారితో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

బస్టాండులో కాలువ నిర్మాణానికి నిధులు

పీలేరు, న్యూస్‌టుడే : ఎట్టకేలకు పీలేరు ఆర్టీసీ బస్టాండులో వర్షపునీరు నిలువకుండా అధికారులు శాశ్వత చర్యలు చేపడుతున్నారు. బస్టాండులో కొద్దిపాటి వర్షం కురిసినా ప్లాట్‌ఫారాల వద్ద నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. నీరు నిలిచినప్పుడు బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సమస్యను ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి, ఆర్ఎం రాము, ఈఈ శ్రీనివాసులు, ఏఈ సిద్దనాగులు ప్రత్యక్షంగా పరిశీలించి నీరు నిలువకుండా కాలువ ఏర్పాటు చేయిస్తామని గతంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.ఎనిమిది లక్షలతో కాలువ పనులు చేసేందుకు టెండర్లు జరిగినట్లు గురువారం పీలేరు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ప్రసంగంతో ఆకట్టుకున్న విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో జ్ఞానజ్యోతి పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాములు, ఉపాధ్యాయులు

విద్యార్థులతో శ్రీ జ్ఞానాంబిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి, అధ్యాపకులు, తదితరులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని రామిరెడ్డిలేఅవుట్‌లో ఉన్న జ్ఞానజ్యోతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు (స్పీచ్) జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.తేజశ్విని (9వ తరగతి), ఆర్.వర్షిత (8వ తరగతి), బి.చైతన్య (10వ తరగతి) నిలిచారు. వీరికి కరస్పాండెంట్ శ్రీరాములు, ప్రిన్సిపల్ స్నేహలత, ప్రధానోపాధ్యాయిని రెడ్డిలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రణతి, రాజేశ్వరి, నజురుల్లా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

✶ మదనపల్లెలోని శ్రీ జ్ఞానాంబిక జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు (స్పీచ్) జరిగాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎస్.సయ్యద్‌బాషా, పి.హర్షిత, సి.అభిలాష్‌రెడ్డి నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ వెంకటాచలపతి, అధ్యాపకులు శివరాం, సురేశ్‌లు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ టి.చైతన్య

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ప్రతి మహిళ ఓ ఝాన్సీలక్ష్మీబాయి కావాలని బీటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. బుధవారం ఆ కళాశాలలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీ జయంతిని స్త్రీ శక్తి దివస్‌గా జరుపుకొంటున్నామన్నారు. అలాగే శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసోసియేట్ డాక్టర్ టి.చైతన్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, ప్రేరణాత్మక వక్త రామ్మూర్తి, మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాని, విద్యార్థినులు పాల్గొన్నారు.

టీకాలపై తల్లిదండ్రులకు అవగాహన అవసరం

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ఉషశ్రీ

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : చిన్నపిల్లలకు వేస్తున్న టీకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ఉషశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ చిన్నపిల్లలకు జలుబు, దగ్గు వస్తే సిరప్ ఇవ్వాలని, నయం కాకపోతే వైద్యాధికారి దృష్టికి వైద్య సిబ్బంది తీసుకురావాలన్నారు. అనంతరం రికార్డులను, టీకాలు వేసే సామగ్రిని పరిశీలించారు. టీకాల నిల్వను పరిశీలించి, అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ కార్డులో టీకాల వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్‌రెడ్డి, వైద్య సిబ్బంది రమణ, శ్యామల, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఉప సంచాలకుడిగా రసూల్ సాహెబ్

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులుగా డాక్టర్ రసూల్ సాహెబ్ నియమితులయ్యారు. ఆయన ప్రకాశం జిల్లా కురిచేడులో సహాయ సంచాలకులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఉప సంచాలకుడిగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమలలో పనిచేస్తున్న సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు నాయుడు సుమారు రెండు నెలల పాటు బాధ్య ఉప సంచాలకుడిగా పనిచేశారు.

అన్నదాతల పక్షపాతి చంద్రబాబు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే : నాడు జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఆరాచక పాలన సాగిస్తే కూటమి పాలనలో సీఎం చంద్రబాబు రైతు పాక్షపాతిగా పాలన సాగిస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం కురబలకోట మండలం అంగళ్లలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో రెండో విడత అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2వ విడత చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ముందుగా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్‌గా అమలు చేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రెండో విడతతో కలిసి ఇప్పటి వరకు రూ.14 వేలు ఖాతాలకు జమ చేశామన్నారు. గత పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆరాచక పాలన సాగించారని విమర్శించారు. ఆరాచక పాలనకు చోటు లేకుండా సీఎం చంద్రబాబు రాష్ట్రం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, నియోజకవర్గ పరిశీలకుడు దినేష్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర నాయకురాలు పర్వీన్‌తాజ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్పృహ కోల్పోయిన సమన్వయకర్త

సమావేశం ప్రారంభం కాకముందే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడును వేదికపై ఆహ్వానించారు. ఆయన వేదికపైకి రావడంతో అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు మంత్రి ఎదుటే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో చేసేదిలేక మంత్రి ఆయన్ను కిందకు పంపారు. సామాన్య కార్యకర్తలా కుర్చీ కూర్చొన్న మల్లికార్జుననాయుడు ఒక్కసారిగా స్పృహ తప్పిపడిపోవంతో వెంటనే మదనపల్లెలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మల్లికార్జుననాయుడును తెదేపా తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాంచిన్నబాబు పరామర్శించారు.

చెక్కు అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జేసి ఆదర్శ్ రాజేంద్రన్, తదితరులు

రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం : రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం పుంగనూరు రోడ్డులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు రైతు అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని వ్యవసాయం చేస్తున్నారని, ఇలాంటి రైతుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందిస్తున్నాయన్నారు. రైతులకు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వాలను ప్రజలు ఆదరిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందన్నారు. పంటసాగులో ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలు రసాయన ఎరువులు, డ్రిప్ పరికరాలు అందజేస్తోందన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని 20,162 మంది రైతులకు రూ.10.08 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ జంగాల శివరామ్, తెదేపా నాయకులు ఆర్.జె.వెంకటేశ్, ఆర్.మధుబాబు, నవీన్‌చౌదరి, చల్లా నరసింహులు, నంద మాట్లాడారు.

కర్షక సంక్షేమమే ధ్యేయం



పీలేరులో రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పీలేరులో పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేశారు. చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఈ పథకం ద్వారా పీలేరు నియోజకవర్గం ఆరు మండలాల పరిధిలో 38,490 మంది రైతులకు రూ.7 వేలు చొప్పున లబ్ధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దౌర్జన్యం.. కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తహసీల్దారుపై దౌర్జన్యం చేయడంతో పాటు అసభ్యంగా మాట్లాడిన బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు మదనపల్లె ఒకటో పట్టణ ఎస్ఐ అన్సర్‌బాషా తెలిపారు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పునీత్ అతని అనుచరులు తహసీల్దారు కార్యాలయ పరిపాలన విభాగంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి అసభ్యకరమైన భాషను ఉపయోగించడంతో పాటు నినాదాలు చేయడం, శాంతికి భంగం కలిగించేలా వ్యవహరించారని తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌పై ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా తన న్యాయవాదితో వచ్చి పునీత్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయ్యాడు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కుటుంబ సమస్యలతో మదనపల్లె మండలం కొత్తఇండ్లకు చెందిన అయ్యప్పమాలధారుడైన శివ (42) బుధవారం ఇంట్లోనే విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు గుర్తించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తొమ్మిదో తరగతి విద్యార్థి...

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తొమ్మిదో తరగతి విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన మదనపల్లెలో బుధవారం రాత్రి జరిగింది. ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించడంతో కుటుంబ సభ్యులు గుర్తించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థి ఎందుకు ఉరి వేసుకున్నాడన్న వివరాలు తెలియాల్సి ఉంది. ఒకటో పట్టణ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మదనపల్లె సీఐ బాధ్యతల స్వీకరణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రవినాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీపై అనంతపురం వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీసిటీ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న రవినాయక్‌ను డీఐజీ కోయప్రవీణ్ నియమించారు. బాధ్యతలు తీసుకున్న సీఐ మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలాల్లో అసాంఘిక కార్యకలాపాల నివారణకు కృషి చేస్తామన్నారు.

మహిళల సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు

మదనపల్లె గ్రామీణ: గ్రామ, మండల స్థాయిలో మహిళా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జెండర్ రీసోర్స్ కేంద్రాలను బలోపేతం చేస్తున్నట్లు డీఆర్‌డీఏ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం, సీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన సమస్యలను పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో మహిళా సమస్యలపై మదనపల్లె, రాయచోటి, పీలేరు, లక్కిరెడ్డిపల్లిల్లో జెండర్ రీసోర్స్ కేంద్రాలున్నాయన్నారు. ఈ సెంటర్లు పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ఏపీఎంలు, సీసీలు సమన్వయంతో పని చేయాలని, మహిళలకు సంబంధించి ఎటువంటి సమస్యలైన అప్పటికప్పుడే విచారించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోల డీపీఎం ధర్మరాజు, ప్రాంతీయ సమన్వయకర్తలు గంగాధర్, శివ, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

రక్తదానం చేస్తున్న విద్యార్థితో కళాశాల సిబ్బంది

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : రక్తదానం అభినందనీయమని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ రామనాథన్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రాయచోటి దీప రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదానశిబిరం నిర్వహించారు. విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాటాడుతూ దేశంలో ఆసుపత్రిలో చేరే ప్రతి ఏడుగురిలో ఒకరు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. చాలా మంది రక్తం అందక చనిపోతున్నారని, అలాంటి మరణాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ నవీన్‌కుమార్, డాక్టర్ ఎన్.చంద్రమోహన్, రాయచోటి దీప రక్తనిధి కేంద్రం ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ గిరిధర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ భరత్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రాల ఆవిష్కరణ : మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 8 నుంచి 10 వతేదీ వరకు నిర్వహించనున్న 'వైర్‌లెస్ కనెక్టివిటీలో పురోగతి' అనే అంశంపై వర్క్‌షాపు గోడపత్రాలను వీసీ డాక్టర్ సి.యువరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామనాథన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.కమాల్‌బాషా, కన్వీనర్లు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అరవిందరాజ్, డాక్టర్ నాగశ్వేత తదితరులు పాల్గొన్నారు.

స్థల దాతకు సన్మానం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన దాత బైసానిశరత్ గుప్తను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సన్మానించి అభినందించారు. మండలంలోని బసినికొండ పంచాయతీ రహ్మత్‌నగర్‌లో రూ.7 లక్షలతో నిర్మించిన 180 మీటర్ల సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో గత 20 ఏళ్లుగా రోడ్డు సమస్య ఉందని, దీంతో దాత ముందుకొచ్చి 150 మీటర్ల స్థలం ఇవ్వడంతో సిమెంట్ రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. అదే విధంగా రహ్మత్‌నగర్, డ్రైవర్స్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రమణ, నాగరాజు, రహ్మత్, నాయకురాలు కరిష్మా, మైనార్టీ నాయకులు రఫీ, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80080 01768

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 91771 11468

చతుర్థ వర్ధంతి

చెరగని చిరునవ్వుతో ఎల్లప్పుడూ అందరినీ ఆదరిస్తూ... అందరి మంచిని కోరి మా కుటుంబ శ్రేయస్సుకై అహర్నిశలు కృషి చేసిన కీ॥శే॥ గుర్రం శ్రీవాణి గారు మా నుండి దూరమై 4 సం॥ కాలం గడిచినను మీ మధురస్మృతులు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ గుర్రం శ్రీవాణి గారు

హెడ్ నర్స్, జిల్లా వైద్యశాల, మదనపల్లి.

జననం : 01-05-1970 మరణం : 20-11-2021

భర్త : జింకా రామక్రిష్ణ (దొరై), Rtd. Physical Director

కుమారుడు : జింకా హేమదీప్

కుమార్తె : జింకా రెడ్డిమౌనిక అల్లుడు : ఎ.నవీన్‌కుమార్

మనుమడు : ఎ.తియాష్

మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

(c) eenadu

ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

దేవళంపేటలో పన్నులపై ఆరా తీస్తున్న డీపీవో రాధమ్మ

చిన్నమండెం, న్యూస్‌టుడే: ప్రజలు చెల్లించే ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని డీపీవో రాధమ్మ అన్నారు. మండల పరిధిలోని దేవళంపేటలో బుధవారం డీపీవో పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య రాకుండా చూసుకోవాలని, చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇంటి పన్నుల విషయంపై స్వయంగా లబ్ధిదారులతో మాట్లాడారు. పన్నులు ఎలా చెల్లించాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్ కుమార్‌రెడ్డి, కార్యదర్శి రమణలు పాల్గొన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్దిష్ట సమయంలోగా పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ శాఖ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్ సేవలు పారదర్శకంగా అందించాలన్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం దస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దారు రెడ్డెన్న, ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

సమస్యలు తెలుసుకొంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను విని క్షేత్ర స్థాయికి వెళ్లి పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే విషయాన్ని అధికారులు గుర్తించాలని ఆయన తెలియజేశారు.

చిన్నమండెం: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోడిరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విని పరిష్కారానికి తగు చర్యలు తీసుకొన్నారు.

కొత్త బస్టాండు.. సదుపాయాలు కల్పిస్తే బాగుండు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రైల్వేకోడూరు నుంచి కడప, తిరుపతి, నెల్లూరు, చెన్నై వంటి ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. వీరందరికీ ప్రధాన కూడలి పట్టణంలోని పాతబస్టాండే. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఒక వైపు తిరుపతి ప్రయాణికులు - మరో వైపు కడప ప్రయాణికులు మండే ఎండ, వానల్లోనే వేచి ఉంటారు. బస్సులు వచ్చేదాకా నిరీక్షణ తప్పదు. కనీసం కూర్చోవడానికి కూడా వీలుండదు. కోడూరుకి కొత్త బస్టాండు ఉన్నా అది ప్రధాన కూడలికి కొంత దూరంగా ఉండడంతో ఎక్కువ మంది అక్కడికి వెళ్లడం లేదు. పాత బస్టాండు, టోల్‌గేట్ సెంటర్లలోనే బస్సుల కోసం వేచి చూస్తుంటారు.

పాత బస్టాండు వద్ద పరిస్థితి ఇలా..

● ఈ ప్రాంతంలో దుకాణాలు, వ్యాపార సంస్థల ముందు భాగంలో నిలబడాలి. దుకాణదారులు విసుక్కుంటే పక్కకు జరగాలి. మరుగుదొడ్ల సదుపాయం ఉండదు. తాగునీరు కావాలంటే కొనుక్కోవాలి. వృద్ధులు, చిన్నపిల్లలతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. ఆయా ప్రాంతాల్లో రహదారి ఆక్రమణలను తొలగిస్తే ప్రయాణికులకు చిన్నపాటి సదుపాయాలు కల్పించవచ్చు. లేదంటే అన్ని బస్సులను కొత్త బస్టాండుకు మళ్లించి గతిలేక అక్కడే ఏర్పాట్లు చేయవచ్చు. కానీ అధికార యంత్రాంగం ఇవన్నీ చూస్తున్నా ఉదాసీన వైఖరి అవలంబిస్తోంది. కొత్త బస్టాండును 1995లోనే ఏర్పాటు చేశారు. కానీ అది గుంజన నది ఒడ్డున, ఏటి పోరంబోకు స్థలంలో ఉండటం, వరదల సమయంలో ఇబ్బందవుతుందన్న కారణంగా సుమారు ఇరవై ఏళ్ల పాటు ప్రజలకు దూరం చేశారు. దీంతో ప్రజలు పాత బస్టాండుకు అలవాటు పడిపోయారు. ఇటీవల కొత్త బస్టాండు అందుబాటులోకి వచ్చినా ఎక్కువ మంది అటువైపు వెళ్లడం లేదు.

కొత్త బస్టాండులో సదుపాయాలు లేకపోవడంతో నామమాత్రంగానే ఉంటున్న ప్రయాణికులు

ఎమ్మెల్యే పరిశీలించినా ఫలితం శూన్యం: ఏడాది క్రితం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కొత్త బస్టాండును పరిశీలించారు. ప్రయాణికులకు వసతులు కల్పిస్తామన్నారు. కొత్త బస్టాండును అన్ని విధాలా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కానీ ఆ తరువాత ఫలితాలు కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా నేతలు చర్యలు చేపడితే నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరుకు మంచి బస్టాండు సదుపాయం కలుగుతుంది.

రైతులకు కూటమి ప్రభుత్వం అండ

రాజంపేట, న్యూస్‌టుడే: అన్నదాతకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో కలిసి రూ.14.37 కోట్లు విలువ చేసే మెగా చెక్కును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్నకు ఎంత చేసినా తక్కువేనన్నారు. బొప్పాయి, అరటి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్.భావన, తహసీల్దారు, వ్యవసాయాధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

● పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. స్థానిక పురపాలక కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని, పుర మార్కెట్ అభివృద్ధికి అంచనాలు తయారు చేయాలని పుర కమిషనర్ జి.శ్రీనివాసులుకి సూచించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



రైతులతో చెక్కును ఆవిష్కరిస్తున్న జగన్‌మోహన్‌రాజు

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

చిన్నమండెం, న్యూస్‌టుడే: పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు సూచించారు. చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. సిలబస్ డిసెంబరు 5లోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వంద రోజుల ప్రణాళికను అమలు చేసి పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులతో పలు విషయాలను చర్చించారు. అనంతరం పాఠశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతులపై ఆరా తీశారు. వీరి వెంట డీపీఎం ధర్మరాజు, ప్రిన్సిపల్ మలాంషావలీ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు, అధికారులు

వైకాపా పాపం.. అన్నమయ్య నిర్వాసితులకు శాపం

రాజంపేట, న్యూస్‌టుడే: వైకాపా స్వార్థ ప్రయోజనాల కోసం అన్నమయ్య జలాశయం కట్ట తెగిపోయిందని, వారు చేసిన పాపానికి ఆ ప్రాంత ప్రజలు ప్రాణాలు కోల్పోయి నిస్సహాయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. అన్నమయ్య జలాశయం కట్ట తెగిపోయి విధ్వంసం జరిగి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ర.భ.శాఖ కార్యాలయానికి సమీపంలో ఆయన ఆధ్వర్యంలో మృతులకు ఘన నివాళులర్పిస్తూ సంఘీభావ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో జరిగిన ఈ ఘోర ఘటనతో బాధితులు నేటికీ కోలుకోలేకపోతున్నారని, కూటమి ప్రభుత్వం త్వరగా చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానం, కూటమి పాల్గొన్నారు.



సంఘీభావ దీక్షలో పాల్గొన్న కూటమి నాయకులు

రైల్వేశాఖ సహాయ మంత్రి దృష్టికి ఆర్‌యూబీ సమస్య

రాజంపేట రైల్వేస్టేషన్ వద్ద అర్ధాంతరంగా ఆగిపోయిన ఆర్‌యూబీ సమస్యను రైల్వేశాఖ సహాయ మంత్రి వి.సోమన్న దృష్టికి తీసుకెళ్లినట్లు భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన్ని దిల్లీలో కలిసి ఆర్‌యూబీ సమస్యను విన్నవించినట్లు చెప్పారు. 80 శాతం పూర్తయిన ఆర్‌యూబీ స్థానిక అధికారులు చొరవ తీసుకోక పోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు.

బేటీ బచావో పథకంపై అవగాహన

మాట్లాడుతున్న జీడబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి

రాయచోటి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో.. బేటీ పడావో' పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జీడబ్ల్యూఎస్‌వో వి.లక్ష్మీపతి తెలిపారు. పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన వార్డు, గ్రామ వార్డు మహిళ సంరక్షణ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలు ప్రతి ఒక్కరూ బడిలో చేరేలా చూడాలన్నారు. బాలికల హక్కులను కాలరాస్తూ బాల్య వివాహాలు చేయడం నేరమని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిణి హైమావతి మాట్లాడుతూ బేటీ బచావో..బేటీ పడావో పథకంపై గ్రామాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కిశోర బాలికలకు కౌన్సెలింగ్ చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఏటీవో జయలక్ష్మీ, సీడీపీవో శశికళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.వినోద్‌కుమార్, జిల్లా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్ బ్యాట్మింటన్‌లో విద్యార్థి సత్తా

ప్రశంసా పత్రం అందుకుంటున్న ఇస్మాయిల్

వీరబల్లి, న్యూస్‌టుడే: వీరబల్లి ఎస్డీకే ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న షేక్ ఇస్మాయిల్ బద్వేలులోని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్ విశ్వ విద్యాలయ క్రీడా పోటీల్లో బాల్ బ్యాట్మింటన్ సింగిల్స్‌లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించారని ఆ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం విశ్వ విద్యాలయ అధికారుల, నిర్వాహకుల నుంచి బంగారు పతకాన్ని, ప్రశాంసా పత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. ఇస్మాయిల్ గెలుపొందడంపై కళాశాల సిబ్బంది, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి ప్రతిభ చూపితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రారెడ్డి సూచించారు.

వ్యవసాయానికి కూటమి సర్కారు చేయూత

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: వ్యవసాయానికి కూటమి సర్కారు చేయూత నిచ్చే దిశగా అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని డీసీఎంఎస్ అధ్యక్షుడు ఎర్రగుండ్ల జయప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ మణి, ఏవో సందీప్, ఎంపీడీవో నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని 24,622 మంది రైతులకు రూ.16.50 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. నిధులు ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు కొమ్మా శివ, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పుల్లంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఇంటర్ ఉద్యోగస్థుల సమస్యలపై డైరక్టర్ రంజిత్ భాషకు వినతిపత్రం అందించినట్లు రాష్ట్ర ఇంటర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవ్వారు శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరాజు, మల్లికార్జున, రాంబాబు పాల్గొన్నారు.

ఆపస్ నూతన కార్యవర్గం ఎన్నిక

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కిరెడ్డిపల్లె మండల ఏపీ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కార్యదర్గం జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడుగా కేవీ సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా పాశం నాగరాజు, కోశాధికారిగా తిరుపతి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ అధ్యక్షుడు వి.రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

సమావేశాలతో సంఘాలకు జవసత్వాలు

వీరబల్లి, న్యూస్‌టుడే: సంఘాలకు సమావేశాలు తప్పనిసరి అని ఏపీఎం ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని శికారుపాళెంలో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న సంఘాల వారు క్రమం తప్పకుండా ప్రతి నెలా వంద శాతం చెల్లింపులు చేయాలన్నారు. రుణాలతో ప్రతి కుటుంబం తమ జీవనోపాధుల ద్వారా కనీసం నెలకు రూ.10వేల ఆదాయం సపాదించాలన్నారు. కార్యక్రమంలో సీసీ కృష్ణయ్య, వీవోఏ కత్తిబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శికారుపాళెంలో మాట్లాడుతున్న ఏపీఎం ఖాదర్‌వలీ

కొండారెడ్డిపోడులో అలముకున్న విషాదం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద నివాసం ఉంటున్న విజయ్ దంపతుల మృతదేహాలను బుధవారం మండల పరిధి కొండారెడ్డిపోడులోని స్వగ్రామానికి తీసుకొచ్చారు. బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. వారి మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. దీంతో గ్రామంలో విషాదం అలమకుంది.

నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

మాట్లాడుతున్న ఏపీవో కృష్ణసింగ్, అధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారు మూడు నెలలు లోపు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలని కడప అర్బన్ అభివృద్ధి అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణసింగ్ తెలిపారు. రాజంపేట మండలం బోయనపల్లి గ్రామ సచివాలయంలో ఊటుకూరు, పెద్దకారంపల్లి, బోయనపల్లి, తాళ్లపాక, మన్నూరు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజవర్గంలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం, ల్యాండ్ రెగ్యులైజేషన్ పథకానికి సంబంధించి మూడు నెలలు గడువు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు.

సచివాలయం.. గోడలకే పరిమితం

మండల పరిధిలోని కొత్తపేట, అప్పయ్యరాజుపేట, జాగువారిపల్లె సచివాలయాల పనులు నిలిచిపోయాయి. దీంతో పాత పంచాయతీ భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆ భవనాల్లో సరైన వసతులు లేక సిబ్బంది, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో 11 గ్రామ సచివాలయాలు ఉండగా ఎనిమిది మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన వాటికి చేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు పనులు మధ్యలోనే ఆపేశారు. ఈ కూటమి ప్రభుత్వంలో అయినా నిధులు మంజూరు చేసి వీటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పుల్లంపేట**

నిర్మించారు.. నిర్వహణ వదిలేశారు

గాలివీడు మండలం గోపనపల్లె కస్బాలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో వంట గది నిరుపయోగంగా మారింది. వంట గదిలో మధ్యాహ్న భోజనం చేయాలని నిబంధనలున్నప్పటికీ నిర్వాహకులు ఇంటిలోనే తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఇటీవల రూ. వేలు వెచ్చించి నిర్మించిన గది వృథాగా వదిలివేశారు. అక్కడ మంచినీటి వసతి, చుట్టూ ప్రహరీ ఉన్నా ఇంటి నుంచి భోజనం తీసుకొచ్చి విద్యార్థులకు పెడుతున్నారని ఉపాధ్యాయుడు నాగేశ్వరనాయక్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

విరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

మండల పరిధిలోని చెన్నరాజుపోడు పంచాయతీ, గాడివారిపల్లెకు వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభం విరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ విద్యుత్తు స్తంభం విరిగి ప్రమాదకరంగా మారిందని విద్యుత్తుశాఖ అధికారులకు చెప్పినా స్పందించడం లేదని గాడివారిపల్లె వాసులు వాపోతున్నారు. ఈ విషయంపై ఏఈ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి వెంటనే అక్కడ కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె**

IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION), RLY KODUR

E.P. No. 17/2018 in O.S. No. 6/2018

పడెదం క్రిష్టయ్య, తండ్రి రంగయ్య, డి.నెం.1/8, పొట్టి శ్రీరాములు వీధి, రైల్వేకోడూరు, కడప జిల్లా. ...డిక్రీ హోల్డర్

Vs

దండు సునీత, భర్త ఇరగలి పార్థసారథి & తండ్రి దండు మురుగేషన్‌రెడ్డి, డి.నెం.5-12-82, రామ్ నగర్, రైల్వేకోడూరు, కడప జిల్లా. ...జడ్జిమెంట్ డెటార్

నోటీసు

పై డిక్రీ హోల్డరు, జడ్జిమెంట్ డెటారు అయిన మీపై పై నెంబరు గల E.P.ని పై రాజశ్రీ కోర్టు నందు షెడ్యూలు దాఖలా మీ ఆస్తిని రాజశ్రీ కోర్టు నందు పబ్లిక్ వేలం వేసి అమ్మకం ద్వారా తనకు రావలసిన E.P. దాఖలా బాకీ మొత్తం వసూలు కొరకై దాఖలు చేసివున్నారు. ఈ విషయమై మీకు ఎటువంటి అభ్యంతరము ఉన్న యెడల **25.11.2025**వ తేదీన ఉ॥ 10.30 నిఁకు పై రాజశ్రీ కోర్టు నందు హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల ఈ కేసును రాజశ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించుదురు అని తెలియచేయడమైనది.

SCHEDULE

ITEM No.I: Mangalore tiled house bearing D.No.8/196 with Vacant site situated at Kadapa District, Pullampet Sub-District, Kodur Mandal, Kodur Village, Kodur Grama Panchayat, Kodur Village Lands, Sy.No.716-4, Ram Nagar Residential area, 8th ward. **Boundaries: East:** Vacant Site of Dandu Sunitha, **West:** Panchayat Road, **North:** 6 feet Sandhu Rastha, **South:** Tiled house and Vacant site of Dandu Sunitha. **Measurements:** Vacant Site: **East-West:** 26 1/4 feet (7.96 meters), **North-South:** 45 feet (13.65 meters) in 131 1/2 Square yards. **Mangalore Title House: East-West:** 18 feet, **North-South:** 45 feet in 810 Square feets consisting doors, almerahs, electrical fittings with house service connection No.2140. At present the Mangalore Tiled House in this Property was collapsed due old age and now it is only a vacant site. **D.Hr Value: Rs.1,00,000/-**

ITEM No.II: Mangalore tiled house bearing D.No.8/196 with vacant site situated at Kadapa District, Pullampet Sub-District, Kodur Mandal, Kodur Village, Kodur Grama Panchayat, Kodur Village Lands, Sy.No.716-4, Ram Nagar Residential area, 8th ward. **Boundaries: East:** Vacant Site of Dandu Sunitha, **West:** Panchayat Road, **North:** Tiled house and Vacant site of Dandu Sunitha, **South:** Panchayat Road. **Measurements:** Vacant Site: **East-West:** 26 1/4 feet (7.96 meters), **North-South:** 45 feet (13.65 meters) in 131 1/2 Square yards. **Mangalore Title House: East-West:** 18 feet, **North-South:** 45 feet in 810 Square feets consisting doors, almerahs, Electrical fittings with house service Connection No.2140. At present the Mangalore Tiled House in this property was collapsed due old age and now it is only a vacant site. **D.Hr Value: Rs.1,00,000/-**

By Order of the Court

ఎస్.మధుసూధనరావు, అడ్వకేట్, రైల్వేకోడూరు.

కరాటేలో మేటి.. వీరికి లేరెవరు సాటి

సుండుపల్లి, న్యూస్‌టుడే: శారీరక, మానసిక దృఢత్వంతో పాటు ఆత్మ రక్షణకు కరాటేలో శిక్షణ తీసుకుని పతకాలు సాధిస్తూ సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. చదువులోనూ రాణిస్తూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో సత్తా చాటుతున్నారు. అంకురిత దీక్షతో శిక్షణ తీసుకుంటున్నారు. సుండుపల్లెలోని మాధూరి పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థులు గత ఆగస్టు నెలలో కర్నూలులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని సత్తా చాటిన చిన్నారుల మనోగతం వారి మాటల్లోనే..

కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఉన్నత స్థానాలకు చేరుకుంటా

నా పేరు బి. నవదీప్. నేను 7వ తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శిక్షణలో చేరాను. తొలి సారిగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పసిడి పతకం సాధించడం చాల సంతోషంగా ఉంది. కరాటేలో మరింత సాధన చేసి ఉన్నత స్థానాలకు చేరుకుంటాను.

రోజూ సాధన

నా పేరు ఆర్.విజయ లక్ష్మి. నేను 7వ తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కరాటే శిక్షణలో చేరాను. శిక్షణా ఉపాధ్యాయుడి సూచనలతో మెలకవలు నేర్చుకుని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని వెండి పతకం సాధించాను. కరాటేలో రోజూ సాధన చేసి మరింత పట్టు సాధిస్తా.

వెనుకడుగు వేయకుండా

నా పేరు ఎన్. అనంత రామ్. 7వ తరగతి చదువుతున్నా. కరాటే మీద ఉన్న ఇష్టాన్ని చూసి తల్లిదండ్రులు శిక్షణలో చేర్పించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాను. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తాను. జీవితంలో వెనుకడుగు వేయకుండా ఎలా ఉండాలో కరాటేలో నేర్చుకున్నాను.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమ్మతులతో రాకపోకల పునరుద్ధరణ

సుండుపల్లి, న్యూస్‌టుడే: పెద్దినేని కాలువ గ్రామం రాచపల్లి- చిన్నబిడికి మధ్య ఉన్న లోలెవల్ వంతెనను పునరుద్ధరించారు. వై. ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయం నుంచి నీటిని విడుదల చేసినప్పుడు వెయ్యి క్యూసెక్కులు మించితే రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. ఈ ఏడాదిలో పలుమార్లు వరదలు రావడంతో ఈ వంతెన దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనిపై స్పందించిన రహదారుల శాఖ అధికారులు వెయ్యి క్యూసెక్కుల సామర్థ్యం నుంచి మూడు వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునేలా వంతెనను నిర్మించామని ఏఈఈ కుమార్‌బాబు తెలిపారు. వంతెన సామర్థ్యం పెంచి పునరుద్ధరించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాచపల్లి- చిన్నబిడికి లోలెవెల్ వంతెన

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం : మంత్రి కొలుసు


రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: రైతుల ఆదాయాన్ని పెంచి సాగు లాభదాయకంగా మార్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని నందిరాజుతోట రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం సాయం పంపిణీని ప్రారంభించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి రైతులకు నమూనా చెక్కు అందజేశారు. సేంద్రియ ఆహార ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. డ్రోన్ల పనితీరును రైతులు వివరించారు. మంత్రి కొలుసు మాట్లాడుతూ ప్రకృతి సేద్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సేద్యం వైపు వెళ్లి ఆదాయం పెంచుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 1,60,441 మంది రైతులకు రూ.107 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా కర్షకులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, డీఏవో అన్నపూర్ణ, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.

చిరుధాన్యాల చిత్రం.. చూపరులకు ఆనందం

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని కాపాడటంతో పాటు రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సయ్యద్ అక్తర్ హుసేన్ అన్నారు. బుధవారం నందిరాజుతోటలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగేలా సేంద్రియ పద్ధతుల్లో పండించిన చిరుధాన్యాలు, కూరగాయలను ప్రదర్శనగా ఉంచారు. సౌజన్య, లక్ష్మీప్రసన్న, రాజారత్నం, సురేష్ ఏర్పాటుచేసిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. **- న్యూస్‌టుడే, నందిరాజుతోట (బాపట్ల టౌన్)**

అసలే నిండుగా.. నిల్వ ఎలాగా?

■ గోదాముల్లో టన్నుల కొద్దీ పొగాకు ■ మార్కెట్లోకి వస్తున్న ఖరీఫ్ ధాన్యం

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలో ఏఎంసీలు:	08
మొత్తం గోదాములు:	66
నిల్వ సామర్థ్యం:	66,265 మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం మార్కెట్లోకి వస్తోంది. పౌరసరఫరాల సంస్థ ధాన్యం కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గోదాముల్లో పొగాకు నిల్వలు పేరుకుపోవడంతో ధాన్యం, బియ్యం నిల్వ చేయడానికి సమస్యలు తప్పవని అన్నదాతలు వాపోతున్నారు.

బాపట్ల గిడ్డంగుల సంస్థ గోదాములో పొగాకు నిల్వ

1.37 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం.. రైతుల నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా 13 వేల మెట్రిక్ టన్నులకు పైగా పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసింది. పర్చూరు, అద్దంకి, చీరాల ఏఎంసీలతో పాటు బాపట్ల, కర్లపాలెంలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో నిల్వ చేశారు. పొగాకు ప్రాసెసింగ్

ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ఇది పూర్తయితేనే గోదాములు ఖాళీ అవుతాయి. పౌరసరఫరాల సంస్థ 1.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు కేటాయించి మర ఆడించి బియ్యంగా మార్చుతారు. బియ్యం బస్తాలను గోదాములకు తరలించి నిల్వ చేయనున్నారు.

కొత్తవి నిర్మించాలి.. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో ప్రస్తుతం పొగాకు నిల్వలున్నాయి. బియ్యం బస్తాలు ఉంచడానికి సమస్య ఏర్పడనుంది. ధాన్యం నూర్పిడి చేసిన రైతుల్లో కొందరు వెంటనే విక్రయించకుండా ఏఎంసీ గోదాముల్లో నిల్వ చేసి.. మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయిస్తారు. డెల్టాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల గోదాములు నిండిపోతే సమీపంలోని పర్చూరు, చీరాల ఏఎంసీలకు ధాన్యాన్ని పంపిస్తారు. ప్రస్తుతం ఆ ఏఎంసీల గోదాముల్లో పొగాకు నిల్వలు ఉండటంతో ధాన్యం నిల్వ చేయడానికి వీలు లేకుండా ఉంది. కూచినపూడి ఏఎంసీకి కార్యాలయమున్నా గోదాములు లేవు. భూమి సేకరించి గోదాములు నిర్మిస్తే తీర గ్రామాల రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది. గత వైకాపా ప్రభుత్వంలో ఒకటీ నిర్మించలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా కొత్తవి నిర్మించి పంట ఉత్పత్తులు నిల్వ చేయడానికి అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీని వివరణ కోరగా ధాన్యం, బియ్యం వచ్చేలోగా గోదాముల నుంచి పొగాకు తరలిస్తామని, రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

యడ్లపాడు వద్ద ఉప్పువాగులో నీటి ప్రవాహం

నీటి రుచి వాగు పేరు మార్చింది

నక్క వాగు నుంచి చీలి వచ్చిన పాయను మండల కేంద్రం యడ్లపాడులో ఉప్పు వాగు అని స్థానికులు పిలుస్తారు. నాదెండ్ల సమీపంలో నక్క వాగు నుంచి ఓ పాయ చీలి యడ్లపాడు - తిమ్మాపురం మధ్యగా ప్రవహించి దింతెనపాడు వద్ద తిరిగి నక్క వాగులో కలుస్తుంది. వేసవిలో ప్రవాహం తగ్గినప్పుడు యడ్లపాడు పరిధిలో నేల స్వభావం కారణంగా వాగులో నీరు ఉప్పగా మారడంతో దానికి ఆ పేరు స్థిరపడింది. ఎగువ, దిగువ ప్రాంతాల్లో నీటి రుచిలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. పైగా ఆ ప్రాంతాల వారు నక్క వాగును యథాతథంగా పిలుస్తారు. **- న్యూస్‌టుడే, యడ్లపాడు**

వీరుల ఆరాధనోత్సవాలకు శ్రీకారం

వీరుల ఆలయంపై ఎర్రజెండా ఎగురవేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆచారవంతులు తమ కొణతాల(ఆయుధాలు)తో వీరుల ఆలయానికి చేరుకున్నారు. ఆలయ గొర్ల పూజారులు పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఇంటి నుంచి వీర గంధం తీసుకొచ్చి కొణతాలకు అలంకరించారు. అనంతరం కొణతాలతో ఆచారవంతులు చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో శంఖుతీర్థం తీసుకుని పీఠాధిపతితో కలిసి వీరుల దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం పీఠాధిపతి ఆలయంపై ఎర్రజెండా ఎగురవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియతో మొదటి రోజు రాచగావు కార్యక్రమం ముగిసింది.

బండ్లమ్మ ఆలయానికి ఐఎస్‌వో గుర్తింపు

ధ్రువపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, బాపట్ల, న్యూస్‌టుడే : ప్రముఖ శక్తి క్షేత్రం బండ్లమ్మ ఆలయానికి ఇంటర్నేషనల్ ఐఎస్‌వో 9001 సర్టిఫికెట్ రావడం బాపట్ల జిల్లాకే తలమానికమని ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు. హైమ్ అంతర్జాతీయ సంస్థ ప్రకటించిన ఐఎస్‌వో సర్టిఫికెట్ అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు పత్రం తన చేతుల మీదుగా ఆలయానికి ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. హైమ్ అంతర్జాతీయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య మాట్లాడుతూ ఆలయాల సమస్త వివరాలు తెలుసుకొని విచారణ జరిపిన తర్వాతే ఐఎస్‌వో గుర్తింపు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆధార్‌లో తప్పులు.. అపార్‌కు తిప్పలు!

చీరాల అర్బన్, వేటపాలెం: నూతన విద్యా విధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ)ని తీసుకొచ్చింది. ఆధార్ తరహాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి విద్యార్థికి 12 అంకెల గుర్తింపు సంఖ్య జారీ చేస్తోంది. ఈ ప్రక్రియ అన్ని పాఠశాలల్లో జరుగుతోంది. అయితే వచ్చిన చిక్కల్లా విద్యార్థిని పాఠశాలల్లో చేర్చే సమయంలో రాయించిన వివరాలు ఆధార్‌లోని వివరాలకు తేడా ఉన్నందున ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రధానంగా ఇంటి పేరు, పుట్టిన తేదీల్లో లోపాలు ఉండటంతో వీటిని సరిచేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు.. పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించడానికి అపార్ గుర్తింపు సంఖ్య కావాల్సి ఉంది. అది ఉంటేనే ఫీజు చెల్లించేందుకు వీలు కలుగుతుంది. ఈ సంవత్సరం జిల్లాలో పది పరీక్షలు రాసే వారి సంఖ్య 16,536 మంది ఉండగా వీరిలో 14,754 మందికి అపార్ సంఖ్య కేటాయించారు. 1,782 మంది అపార్ నమోదు కాకపోవడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.పురుషోత్తం దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటివరకు 93 శాతం వరకు అపార్ నమోదు జరిగిందని, చిన్న చిన్న సమస్యలతో వంద శాతం పూర్తి కాలేదన్నారు. జిల్లాలోని 83 పాఠశాలల్లో పిల్లల వేలి ముద్రలు నవీకరిస్తున్నామని, చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

జిల్లాలో నమోదు ఇలా..

ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థుల సంఖ్య:	1,63,923
ఇప్పటికి అపార్ నమోదు చేసుకున్న వారు:	1,54,036
ఇంటర్ విద్యార్థులు:	19,830
నమోదు:	13,473

నేర్పుగా అల్లేస్తాం.. ఒడుపుగా పట్టేస్తాం

మండల పరిధి ముత్తాయపాలెం, పల్లెపాలెం, ఆదర్శనగర్, రామ్‌నగర్ గ్రామాల్లోని ప్రతి ఇంట్లో బెండు వలల తయారీ నేర్పరులున్నారు. వీరి ప్రధాన వృత్తి చేపల వేట. వలల తయారీదారులు వాటిని వినియోగించుకోవడంతో పాటు నిజాంపట్నం, చీరాల మండలాల మత్స్యకారులకు అమ్ముతుంటారు. వల తయారీకి టంగునరం అవసరం. ఎలిం అనే చిన్న దబ్బనం లాంటి పరికరంతో వలను అల్లుతారు. తొలుత టంగునరం మూడు పోరలుగా కలిపి గార్వా తాడు, బెండ్లు కలిపి ఎలింతో కుడతారు. రెండు నుంచి మూడు కిలోల బరువు ఉండే వలను ఒక్కరైతే 15 రోజులు, ఇద్దరైతే వారంలో అల్లుతారు. వల రూ.8 నుంచి 9 వేల వరకు విక్రయిస్తారు. ముడి సరకుకు సుమారు రూ.4 వేల ఖర్చవుతుంది. మత్స్యకారులు బెండు వలలను 30 నుంచి 40 రోజుల పాటు చేపల వేటకు వినియోగిస్తారు. **- న్యూస్‌టుడే, ముత్తాయపాలెం (బాపట్ల టౌన్)**

సరిహద్దు గ్రామం.. లక్ష్మీపురం

పక్కపక్కనే పల్నాడు, బాపట్ల జిల్లాల హద్దులు తెలిపే బోర్డులు

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లక్ష్మీపురం రెండు జిల్లాలకు హద్దుగా ఉంది. గుంటూరు-కర్నూలు రాష్ట్ర రహదారి పక్కనే గ్రామం ఉంది. గ్రామాన్ని ఆనుకొని తంగేడుమల్లి మేజర్ కాలువ ఉంది. కాలువకు ఎడమ వైపు బాపట్ల, కుడి వైపు పల్నాడు జిల్లాలున్నాయి. జిల్లాల సరిహద్దు కావడంతో ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రముఖులు ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో రెండు జిల్లాల పోలీసులు ఇక్కడికి వచ్చి ప్రొటోకాల్ పాటించి రక్షణ కల్పిస్తారు. గ్రామంలోని రెండు ఇళ్లు బాపట్ల జిల్లా పరిధిలో.. సుమారు 150 గృహాలు పల్నాడు జిల్లా పరిధిలో ఉండటం గమనార్హం. **- న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు సందర్శనలో దొడ్లేరు పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

విహారం.. విజ్ఞానదాయకం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తరగతి గదిలో పాఠాల్లో చదివిన చారిత్రక, భౌగోళిక, పర్యాటక, ఆహ్లాదకర ప్రాంతాల్ని నేరుగా వీక్షిస్తే కలిగే అనుభూతి వేరుగా ఉంటుంది. విహారం విజ్ఞానదాయకమైతే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుంది. పుస్తకాలతో కుస్తీ కాసేపు పక్కనపెట్టి బాలలు విజ్ఞానదాయక ప్రాంతాలను వీక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 183, ఏపీ ఆదర్శ పాఠశాలలు 14 ఉండగా.. 45 విద్యాలయాల్ని పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. ఈ ఏడాది కొత్తగా పీఎంశ్రీ విద్యాలయాల్లోని విద్యార్థుల్ని విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఆరు నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభావంతులకు అవకాశం కల్పించనున్నారు. ❖ ఒక్కో విద్యాలయం నుంచి గరిష్ఠంగా 60 మందికి, కొన్ని పాఠశాలల్లో 49 మందికి అవకాశమిచ్చారు. విద్యార్థికి రూ.500 చొప్పున మంజూరు చేశారు. ❖ నాగార్జున సాగర్, ఎత్తిపోతల, కోటప్పకొండ, అమరావతి, ఉండవల్లి గుహలు, సంగం జాగర్లమూడికి విద్యార్థులను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ❖ జిల్లాలోని 35 పీఎంశ్రీ విద్యాలయాల్లోని 2,326 మంది విద్యార్థుల్ని విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లేందుకు రూ.11.63 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల విద్యార్థులు యాత్రలు పూర్తి చేశారు. ❖ ఈ నెల 20న సమ్మెటివ్-1 పరీక్షలు ముగియనున్నాయి. వెంటనే యాత్రలు ప్రారంభించి నెలాఖరులోపు పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ❖ పీఎంశ్రీ విద్యాలయాల విద్యార్థుల క్షేత్ర అవగాహన పర్యటనలు (విజ్ఞాన యాత్రలు) పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు డీఈవో చంద్రకళ, పీఎంశ్రీ పాఠశాలల జిల్లా సమన్వయకర్త పూర్ణ తెలిపారు.

చరిత్ర పుటల్లో.. పల్నాటి గురుతులెన్నో!

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

పల్నాడు అంటేనే ఠక్కున గుర్తుకొచ్చేది 12వ శతాబ్దం నాటి యుద్ధం.. బ్రహ్మానాయుడు, నాగమ్మల వీరోచిత పోరాటం.. పల్నాటి వీరుల తెగువ.. నేటికీ ఆ యుద్ధం గురించి కథలుగా చెబుతుంటారు.. ఆనాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఎన్నో కట్టడాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఆచారవంతులచే రక్షింపబడుతూ.. భావి తరాలకు ఇక్కడి ఔన్నత్యాన్ని, త్యాగనిరతిని తెలియజేస్తున్నాయి. నాటి ఘటనల్ని మననం చేసుకుంటూ ఏటా వీరారాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

వీరుల ఆలయం

పల్నాటి యుద్ధవీరుల ఆలయం 15వ శతాబ్దంలో మొఘలుల పాలనలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు యుద్ధానికి వెళుతూ మార్గ మధ్యలో కారంపూడిలోని నాగులేరు వాగు పక్కన సేదతీరుతుండగా.. పల్నాటి యుద్ధంలో అమరవీరులకు ప్రతిరూపాలైన లింగాలకు అపచారం జరిగింది. దానికి పరిహారంగా ఆయన సైన్యంలోని జకీర్, ఫరీద్ అనే యుద్ధవీరులు ఆలయాన్ని నిర్మించి.. ఆయుధాలు, లింగాలు భద్రపరిచారు.

రాళ్లే ప్రతిరూపాలు

మాచర్ల, గురజాల రాజ్యాల కోసం కత్తులు దూసుకున్న వీరనాయకులు రణభూమికి తరలివస్తూ, వారి కుటుంబాలకు తమ ఆనవాళ్లుగా లింగాలను (గుండ్రంగా ఉండేరాళ్లు) ఇచ్చేవారు. ఆ లింగాలే వీరులకు ప్రతిరూపాలుగా, వారి ఆయుధాలే దైవాలుగా నేటికీ పూజిస్తున్నారు.

తోట బజారు

తోట బజారు: బ్రహ్మనాయుడు కారంపూడిలో చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం జరిపిస్తున్న సమయంలో అంకాళమ్మ గుడి సమీపంలోని తోటలో మండపం ఏర్పాటు చేసుకుని ఉన్నారు. అందులో కూర్చొని ఆయన వైష్ణవానికి ప్రతీకలైన తిరునామాలను ధరించేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని తోట బజారుగా పిలుస్తున్నారు.

కన్నమదాసు మేడ

బ్రహ్మనాయుడి దత్తపుత్రుడు కన్నమదాసు హరిజనుడు కావడంతో ఆయనను యుద్ధంలోకి రానివ్వకూడదని షరతు పెట్టారు. దీంతో నాగులేటికి ఇవతల ఓ మేడ ఏర్పాటు చేసుకుని, దానిపై నుంచి కన్నమదాసు సైనికులకు సూచనలిచ్చారు. దానిని కన్నమదాసు మేడగా పిలుస్తున్నారు.

కోట బురుజులు..

పల్నాటి రాజ్యంలోకి వచ్చేవారిని గమనించేందుకు 12వ శతాబ్దంలో కారంపూడి, మాచర్లలలో కోట బురుజులు నిర్మించారు. మాచర్లలోని బురుజు కాలగర్భంలో కలిసి పోగా.. కారంపూడిలో కొంతమేర కనిపిస్తోంది.

శంఖుతీర్థ మండపం..

శంఖుతీర్థ మండపం.. వీరుల ఆలయ సమీపంలో శంఖుతీర్థ మండపం ఉంది. ఒకవేళ యుద్ధ క్షేత్రంలో మృత్యువాత పడితే.. వైకుంఠం చేరేలా వీర నాయకులు శంఖుతీర్థం తాగేవారు. యుద్ధానికి వెళ్తూ తీర్థం తీసుకునేవారు. ఈ మండపం ఇప్పటికీ దర్శించుకోవచ్చు.

1,200 మందికొక పోలింగ్ కేంద్రం

ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా చర్యలు

పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

బాపట్ల, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు సౌకర్యంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉంది. ఎక్కువమంది ఓటర్లతో పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని గుర్తించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు.. ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. నాలుగు నెలల కిందట నూతన పీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల విజ్ఞప్తులు పరిగణనలోకి తీసుకుని కొన్ని మార్పు, చేర్పులు చేపట్టారు.

కొత్తగా 171 పీఎస్‌ల ఏర్పాటు

నియోజక వర్గం	ప్రస్తుతం ఉన్నవి	ఏర్పాటు చేసేవి	మొత్తం
వేమూరు	233	04	237
రేపల్లె	264	35	299
బాపట్ల	202	79	281
పర్చూరు	295	09	304
అద్దంకి	298	16	314
చీరాల	218	28	246

❖ అధికారుల బృందం క్షేత్రస్థాయికి వెళ్లి ఓటర్లకు దగ్గరగా.. అన్ని వసతులు ఉన్నచోట పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,510 పీఎస్‌లు ఉండగా.. కొత్తగా 171 ఏర్పాటు చేయనున్నారు.

ఒకే ప్రాంతంలో ఉద్యోగావకాశం

సచివాలయ ఉద్యోగులకు స్పౌజ్ కోటాలో బదిలీలు

బాపట్ల, న్యూస్‌టుడే

భార్య ఒకచోట.. భర్త మరో చోట ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండటంతో పిల్లల పోషణ, వయోవృద్ధుల సంరక్షణ తదితరాలకు ఇబ్బందిగా ఉంటోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చాన్నాళ్లుగా ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు స్పౌజ్ కోటాలో అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతి ఇచ్చింది. తద్వారా భార్యాభర్త ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం దక్కనుంది. ఈ నెల 30వ తేదీకే బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది.

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ 2019 సెప్టెంబరులో అమల్లోకి వచ్చింది. 2022 జులైలో ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టారు. అదే ఏడాది చివర్లో స్పౌజ్ కోటాలో బదిలీలు చేపట్టారు. అప్పట్లో పరస్పర అంగీకారం మేరకు బదిలీలు నిర్వహించడంతో చాలామంది ఉన్నచోట నుంచి వేరే ప్రాంతానికి కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ స్పౌజ్ కోటాలో బదిలీలకు అవకాశం కల్పించలేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

జిల్లాలో గ్రామ సచివాలయాలు :	409
మొత్తం ఉద్యోగులు :	3,272
వార్డు సచివాలయాలు :	68
మొత్తం ఉద్యోగులు :	544

26న జడ్పీ ఆరో స్థాయీ సంఘ సమావేశం

గుంటూరు, న్యూస్‌టుడే : జిల్లా పరిషత్తు ఆరో స్థాయీ సంఘ సమావేశం ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో వి.జ్యోతిబసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఉపాధ్యక్షురాలు బత్తుల అనురాధ అధ్యక్షత వహిస్తారన్నారు.

CHEBROLU HANUMAIAH INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
Accredited by NAAC & AUTONOMOUS
Chandramoulipuram, Chowdavaram, Guntur – 522019, Andhra Pradesh.
Ph:7382008494, www.chips.ac.in
B. PHARMACY AND PHARM.D SPOT ADMISSIONS - 2025
Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions in I B.Pharmacy and I Pharm.D with all original certificates between 20-11-2025 to 23-11-2025. The vacant seats created to unreported candidates shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025.
PRINCIPAL

CHALAPATHI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(AUTONOMOUS)
Estd:2004
Chalapathi Nagar, Lam, GUNTUR-522 034
Ph: 0863-2524124, 2524125, www.chalapathipharmacy.in
CATEGORY-B / SPOT / NRI ADMISSIONS
I B.PHARMACY & I PHARM.D

S.No.	Course	EAPCET Code	Category-B Seats	NRI Seats
01	B.Pharmacy	CLPT	30	10
02	Pharm.D	CLPT	09	02

Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions for I B.Pharmacy and I Pharm.D with all original certificates on 21/11/2025. The vacant seats created by unreported candidates, shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025. Seats for Foreign Nationals/NRI are available as per PCi regulations
Principal

సివిల్స్ సర్వీసెస్ అధికారుల కార్ఖానా

బాపట్ల వ్యవసాయ కళాశాల

బాపట్ల వ్యవసాయ కళాశాల.. జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న విద్యా సంస్థ. 1945లో దక్షిణ భారతదేశంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఏర్పాటైన రెండో వ్యవసాయ కళాశాల. కళాశాలలో ఏజీ బీఎస్సీ, ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులు సివిల్స్ రాసి విజయాలు సాధిస్తున్నారు. ఇప్పటివరకు 120 మందికి పైగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులుగా ఎంపికై కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో సేవలందిస్తున్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు రావాడ ఎ.చంద్రశేఖర్ కేరళ డీజీపీగా, సి.శ్రీధర్ పీఎంవో సంయుక్త కార్యదర్శిగా, ఆరిజ్ అహ్మద్ అసోం సిబ్బంది విభాగం ముఖ్య కార్యదర్శిగా, వేణుగోపాల్‌రెడ్డి మహారాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ అదనపు చీఫ్ సెక్రటరీగా, కాంతిలాల్ దండే ఏపీ పర్యావరణ, అటవీ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్య కార్యదర్శిగా, చలపతిరావు ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా, మోహనరావు ఏపీలో ఐజీపీగా సేవలు అందిస్తున్నారు. ఏపీ మాజీ సీఎస్ అజేయ కల్లం, డీజీపీగా పని చేసిన మాలకొండయ్య కళాశాల పూర్వ విద్యార్థులే. **- న్యూస్‌టుడే, బాపట్ల**

జంట గ్రామాలకు జలసిరి

ఉబికి వస్తున్న నీరు

మండలంలోని జంట గ్రామాలు నర్సింగపాడు, త్రిపురాపురంలో పాతాళ గంగ పైపైకి వస్తోంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్ల నుంచి నీరు ఉప్పొంగుతోంది. దాదాపు 30 బోర్లకు సంబంధించి మోటారు ఆన్ చేయకుండానే నీరు ఉబికి వస్తోందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ప్రస్తుతం బోర్ల కింద వరి సాగు చేశారు. వస్తుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 7.50 మీటర్ల మేర భూగర్భ జలాల మట్టం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. నర్సింగపాడు పరిసరాల్లోని భూమి పొరల్లో తేడాల కారణంగా నీరు **- న్యూస్‌టుడే, నకరికల్లు**

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

● ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు-522 005
వివరాలకు: 7799102585, 8328360034
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ఈటీవీ భారత్
Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

పల్నాటి చరిత్రకు ప్రత్యేకత

ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి చరిత్రకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పల్నాటి వీరుల ఆరాధనోత్సవాల సందర్భంగా బుధవారం జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వీరుల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్సై వాసు, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చుండూరుకు ద్వితీయ స్థానం.. ప్రకాశం జిల్లా మద్దిరాలకు చెందిన శేషాద్రి ఎడ్ల జత 5051 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం శిరీషా జత రెండోస్థానం, కాకుమాను మండలం కొండబావారిపాలెం లక్ష్మి దీక్షిత జత మూడోస్థానం, పిడుగురాళ్ల మండలం పిన్నెల్లికి చెందిన మురళి ఎడ్ల జత నాలుగో స్థానంలో నిలిచాయి.

పింఛన్ అందాలి.. స్మైలీ నవ్వాలి..!

తల్లి లక్ష్మితో స్మైలీ

నందిరాజుతోట (బాపట్లటౌన్) న్యూస్‌టుడే : ఈస్ట్‌బాపట్ల పంచాయతీ హైదరపేటకు చెందిన నూతలపాటి స్మైలీ పుట్టుకతోనే పోలియో ఉంది. దానికి తోడు మానసికంగా, శారీరకంగా పరిపక్వత చెందలేదు. 12 ఏళ్ల స్మైలీకి ఏమీ తెలియదు. కూర్చునేందుకు కూడా ఒకరి సాయం అవసరం. బాలిక తల్లి లక్ష్మి దగ్గరుండి చూసుకోవాలి. చిన్నారి స్మైలీకి పింఛన్ రావటం లేదని నందిరాజుతోటలో బుధవారం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత కార్యక్రమంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు చిన్నారి పరిస్థితి తల్లి వివరించింది. చిన్నారి వేలిముద్రలు, ఐరిష్ పడటం లేదని టెక్నికల్‌గా పింఛన్ ఇవ్వటానికి వీలు కావటంలేదని గ్రామీణ, మండలస్థాయి అధికారులు నాటి కలెక్టర్‌కు తెలిపారు. పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినా మంజూరు కాలేదు. ఈనేపథ్యంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ దృష్టికి సమస్య వచ్చింది. చిన్నారి స్మైలీకి పింఛన్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

క్రీడాకారులతో ఎంఈవో వీరాంజనేయరావు

ఉల్లిపాలెం(నగరం), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 17 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక బుధవారం నిర్వహించారు. నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ క్రీడలో ప్రతిభ చూపిన 12 మంది బాలికలు, 12 మంది బాలుర జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు మన్నెం సాంబశివరావు తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వ్యాయామ ఉపాధ్యాయులు కుటుంబరావు, సాంబశివరావు, నరేంద్రగోపి, మానస, సురేంద్రలు సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

పురపరిపాలన శాఖ వినుకొండ పురపాలక సంఘం

"ఇ-ప్రొక్యూర్‌మెంట్" టెండరు నోటీసు

NIT.No.822/2024/ఇ1,తేది.19-11-2025

(1) పని పేరు: వినుకొండ పురపాలక సంఘ పరిధిలో 7 నెం.ల పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలువబడుచున్నవి. (2) 5 నెం.ల పనులకు సంబంధించి టెండర్లు స్వీకరణకు చివరి తేది/సమయం: 26.11.2025, సాయంత్రం 4.00 గం వరకు (3) 2 నెం.ల పనులకు సంబంధించి టెండర్లు స్వీకరణకు చివరి తేది/సమయం: 03.12.2025, సాయంత్రం 4.00 గం వరకు (4) సంబంధిత మునిసిపల్ కమీషనరు పేరు: శ్రీ యమ్.సుబాష్ చంద్రబోస్, కమీషనరు, వినుకొండ పురపాలక సంఘము, ఫోన్ నెం.08646-273656, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరు, వారి సెల్ నెం.7093403723 తదుపరి వివరములను http://tender.apeprocurement.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ సందు చూడపచ్చును.

సం/- కమీషనరు, వినుకొండ పురపాలక సంఘం.

వంద శాతం అక్షరాస్యతకు అందరూ కృషి చేయాలి

చినగంజాం, న్యూస్‌టుడే: జిల్లా వయోజన విద్య విభాగం ఆధ్వర్యంలో 'ఉల్లాస్'.. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉపాధి క్షేత్ర సహాయకులు, వాలంటీర్లకు చినగంజాం మండల పరిషత్ సమావేశపు భవనంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. వందశాతం అక్షరాస్యతకు అందరూ కృషి చేయాలని వయోజన విద్య జిల్లా పర్యవేక్షకులు కొండేటి మనోరంజన్‌బాబు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి పేర్కొన్నారు.

సర్వేలతో కుష్ఠు బాధితులను గుర్తించాలి

సంతరావూరు (చినగంజాం), న్యూస్‌టుడే: సర్వేలతో కుష్ఠు బాధితులను గుర్తించాలని జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ ప్రవీణ్ అన్నారు. సర్వేపై సంతరావూరు పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారిణి కీర్తిసరోజ్, సిబ్బంది యు.వెంకటరమణ, శ్రీధర్, వరదానం పాల్గొన్నారు.

బాలల స్నేహపూర్వక జిల్లాగా బాపట్ల

❖ చిన్నారులకు లేఖ రాసిన కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: బాలలపై లైంగిక వేధింపులు అరికట్టడానికి పటిష్ఠ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలో బాలలకు కలెక్టర్ బుధవారం లేఖ రాశారు. బాల్యదశ జీవితంలో చాలా ముఖ్యమైనదన్నారు. బాల్యం ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగుల్చుతుందన్నారు. బాలలు ఆటపాటలు, చదువులతోపాటు చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ భవిష్యత్తును నిర్మించుకునే సమయం అన్నారు. ఈ దశలో కొంత మంది బాలలు బాల్య వివాహం, లైంగిక వేధింపులకు బలి అవుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అమ్మాయి వివాహ వయస్సు 18 ఏళ్లు, అబ్బాయికి 21 సంవత్సరాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయటం, ప్రోత్సహించటం చట్టరీత్యా నేరమని, రూ.రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. పోక్సో చట్టం కింద శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధానికి చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబరు 1098కు లేదా మహిళా హెల్ప్‌లైన్ నంబరు 181కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. బాపట్ల జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లా మార్చటానికి అందరూ సహకారం అందించాలని కోరారు.

ఉపాధ్యాయిని సౌజన్యకు మంత్రి లోకేశ్ ప్రశంస

బాపట్ల, న్యూస్‌టుడే: వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల సమగ్ర విద్యా విజ్ఞాన వికాసానికి అంకితభావంతో పని చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మండల పరిధిలోని వృక్షనగర్ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని యాతం సౌజన్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. ఉపాధ్యాయినికి మంత్రి బుధవారం పంపిన సందేశంలో దీక్షా ప్లాట్ ఫాంలో ఈ-కంటెంట్ రూపకల్పన, టీచర్ హ్యాండ్ బుక్ రాయటం, ప్రశ్నపత్రాల తయారీ, శిక్షణ రిసోర్స్‌పర్సన్‌గా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్‌లో సౌజన్య భాగం కావటం చాలా సంతోషమన్నారు. ఎల్ఎన్, జాదూయి పిటారా కిట్టు ఉపయోగిస్తూ పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్న తీరు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అభినందించారు. వినూత్న విద్యా బోధన, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఎలా తయారు చేయాలి.. కిట్లు ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై వీడియోలు చేసి సౌజన్య టీఎల్ఎం యూట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేస్తున్నారు.

ప్రాంతీయ ఆసుపత్రుల్లో వేగంగా అభివృద్ధి పనులు

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చీరాల ప్రాంతీయ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులతో బాపట్ల, చీరాల వైద్య శాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి వారం ప్రగతి పనుల వివరాల నివేదిక పంపించాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ పనులు 2026 మే నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పురపాలక ఉన్నత పాఠశాలలో రూ.27.50 లక్షలతో అటిజం కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్వోబీ పనుల వేగవంతానికి ఆదేశం

బాపట్ల, న్యూస్‌టుడే: వాడరేవు - పిడుగురాళ్ల ఎన్‌హెచ్ 167ఏలో భాగంగా చీరాల వద్ద చేపట్టిన ఆర్వోబీ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రగతిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. గుంటూరు-నిజాంపట్నం జాతీయ రహదారి పనులు త్వరగా చేపట్టాలన్నారు. నిడుబ్రోలు నుంచి చందోలు వరకు నిర్మిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. రేపల్లె-నిజాంపట్నం, చందోలు-నిజాంపట్నం రహదారుల విస్తరణ పనులు నాణ్యంగా చేయాలన్నారు. గుంటూరు నుంచి నిడుబ్రోలు బైపాస్ మీదుగా బాపట్ల వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. సూర్యలంక బీచ్‌లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా జల వనరుల శాఖ కాలువను రూ.11 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నిజాంపట్నం మండలం దిండి వద్ద సమీకృత ఆక్వా పార్కు పనులు ప్రారంభించాలన్నారు. మత్స్య శాఖ డీడీ గాలిదేవుడు, ఆర్అండ్‌బీ డీఈ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడి ఆత్మహత్యాయత్నం

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొటపాడు గ్రామానికి చెందిన ఓ యువకుడు కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

వసూలు చేసిన ఫీజులు వెనక్కు

ఈపురుపాలెం(చీరాల గ్రామీణ), న్యూస్‌టుడే: చీరాల మండలం ఈపురుపాలెం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యార్థుల వద్ద వసూలు చేసిన ప్రవేశ రుసుమును జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వెనక్కు ఇచ్చారు. చీరాల ఎంఈవో టి.రమాదేవి గురువారం పాఠశాలను పరిశీలించారు. ప్రస్తుతం 136 మంది ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఉండగా రూ.2500, రూ.2000 చొప్పున వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించారు. అయితే వీరిలో కొందరు తీసుకోవడానికి నిరాకరించారు. తమ వద్ద అక్రమంగా వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో అందరికి ఫీజులు తిరిగి ఇస్తామని ఎంఈవో తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: నెల్లూరు నుంచి విజయవాడ వెళ్లే రైలు పట్టాలపై సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని యువకుడు చినగంజాం మండలం కడవకుదురు సమీపంలో రైలు నుంచి జారిపడి బుధవారం మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. మృతదేహంపై ఎరుపు రంగు టీషర్ట్, నలుపు ప్యాంటు ఉంది. మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. యువకుడు ఆచూకి తెలిసిన వారు వెంటనే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

అనుమానాస్పద స్థితిలో బేల్దారి..

వేటపాలెం, న్యూస్‌టుడే: యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన వేటపాలెంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వేస్టేషన్ రోడ్డులోని నాగేంద్ర స్వామి పుట్ట పక్కన ఉప్పుగుండూరుకు చెందిన బెల్లం హరిబాబు (35) దంపతులు అయిదు నెలల క్రితం అద్దెకు చేరారు. ఇతడు బేల్దారి పనుల చేస్తుంటాడు. భార్యాభర్తల మధ్య మధ్యాహ్నం నుంచి వివాదం జరుగుతోంది. మామ కూడా అక్కడే ఉన్నారు. సాయంత్రం హరిబాబు చనిపోయాడని స్వగ్రామం తీసుకెళ్తున్నారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో సమాచారం వారిని వెనక్కి రప్పించి మృతదేహాన్ని చీరాల గ్రామీణ ఇన్‌ఛార్జి, ఇంకొల్లు సీఐ కేవీ రమణయ్య, ఎస్సై జనార్ధన్ పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఎటువంటి గాయాలు లేవు. దీంతో కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే ఎలా మృతిచెందాడనే విషయం తెలుస్తోందని పోలీసులు భావిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

అనధికార విద్యుత్తు వినియోగిస్తే చర్యలు

వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

చీరాల, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు మీటరు ద్వారానే విద్యుత్తును వినియోగించాలని అనధికారికంగా వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఈఈ జాన్ థామస్ హెచ్చరించారు. గురువారం డివిజన్2 సెక్షన్ పరిధిలో అధికారులు పోల్ స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు. అదనపు లోడ్ వినియోగిస్తున్న వారిపై రూ.2.95 లక్షలు, మాల్‌ప్రాక్టీస్‌కు రూ.50వేలు అపరాధ రుసుం విధిచినట్లు ఏఈ బి.శంకర్ తెలిపారు. తెలిపారు. తనిఖీల్లో ఈఈడీపీఈ భాస్కరరావు, డీఈలు హరిప్రసాద్, పి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఆరుంబాక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ భావన, ఆర్డీవో రామలక్ష్మి, శివప్రసాద్

ఆరుంబాక (చెరుకుపలి (గ్రామీణ), న్యూస్‌టుడే: రైతులు దళారులకు నమ్మి మోసపోవద్దని జేసీ భావన అన్నారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆమె ఆరుంబాక రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభించారు. రైతుల కష్టానికి ప్రభుత్వం మద్దతు ధరను అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం విక్రయించిన వెంటనే ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, ఏడీఏ లక్ష్మి, ఏవో ఫరూక్, నేతలు అనగాని శివప్రసాద్, మత్తి భాస్కరరావు, మొఖమాటం రాధాకృష్ణమూర్తి, మల్లాది రామకృష్ణ, ఈవూరి దుర్గాప్రసాద్, మండవ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వణికించిన పేలుడు.. కేసు నమోదు

ధ్వంసమైన దుకాణం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: తీరంలో పేలుడు ఘటన కలకలం రేపింది. మండల కేంద్రం చెరుకుపల్లి కొత్తపేట వద్ద బుధవారం ఉదయం 8గంటలు దాటిన తరువాత జాతీయ రహదారి పక్కనే ఉన్న రేకుల దుకాణంలో పేలుడు సంభవించింది. స్థానికుడు గోపి రేకుల దుకాణం బయట బల్లపై కూరగాయలు ఉంచి విక్రయిస్తున్నాడు. దుకాణంలో దీపావళికి తెచ్చిన టపాకాయలను దుకాణంలో ఉంచాడు. ఉదయం దీపాలు వెలిగించి కడ్డీలు వెలిగించి ఉంచాడు. నిప్పురవ్వలు టపాకాయలపై పడి పేలుడు సంభవించింది. రేకుల దుకాణం ధ్వంసమైంది. సమీపంలోని భవనాల కిటికీలు పగిలిపోయాయి. భారీ శబ్దం వినిపించింది. గోపి, రోడ్డుపైన వెళుతున్న పాదచారుడికి రేకుల ముక్కలు తగిలి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న చెరుకుపల్లి ఎస్సై టి.అనిల్‌కుమార్ ఘటన స్థలికి చేరుకుని క్లూస్ టీంను రంపించారు. రేపల్లె గ్రామీణ సీఐ సురేష్‌బాబు ఘటన స్థలిని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించాయి. సమీపంలోని ఇంటి యజమాని కొమ్మూరి ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 9701893458.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

JOBS

Wanted Export Company Staff 1. Accountant, 2. Supervisor (10th Pass), 3. Security Guard. Contact: 73864 82800, 99082 14472.

Jayalakshmi Nexa Hiring for Autonagar, Guntur. Good Opertunity for Freshers/ Experienced Whatsapp: 91007 87054.

గుంటూరు జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వయసు 50 సం||లోపు. ఆకర్షణీయమైన జీతము. 90100 42973, 82478 14976.

అకౌంట్స్ మేనేజర్ కావలెను. బికాం.5 సం||లు. అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్‌వేయగలవారు kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరులోని Elite Infra ఆఫీసు నందు పనిచేయుటకు 5 సం||లు అనుభవం కలిగిన, కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్ట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆: 77997 51199.

గుంటూరులో ఎలక్ట్రిక్ స్కూటర్స్ ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు అశోక్ లేలాండ్ దోస్త్కు డ్రైవరు కావలెను. ✆: 99496 46703.

గుంటూరులో గల కాలేజి హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు 35 సంవత్సరాల పైబడిన లేడి వార్డెన్స్ మరియు బస్సు డ్రైవర్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164.

FACULTY/ TEACHERS

Faculty: Bio Chemistry - B.Sc., MSc&Nursing: B.Sc., M.Sc.&Employ: Inter, Degree, Computer. Age: 19-25, Con: Victoria Paramedical Institute, Gnt.✆: 0863-2222683, 98481 34028, 8332004478.

MEDICAL

Wanted Receptionist To Work In Dental Clinic. ✆ 6300569298

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

నగరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం పర్వదినాలను పురస్కరించుకుని మండలంలోని ఉల్లిపాలెం, నగరం, అల్లపర్రు, ఈదుపల్లి, పూడివాడ, ధూళిపూడి శివాలయాల్లో బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున మహిళలు ఆలయాల్లో నాగేంద్రుడు, శివలింగాకారాల్లో దీపాలు వెలిగించారు.

ఉల్లిపాలెంలో శివలింగాకారంలో దీపారాధన

అర్ధనారీశ్వరిగా బండ్లమ్మ దర్శనం

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ అమ్మవారు కార్తిక మాసం అమావాస్య కావటంతో బుధవారం 'అర్ధనారీశ్వరి'గా భక్తులకు దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ కార్తిక మాసం అమావాస్య కావటంతో ఇలా దర్శనమిస్తుందని, సాయంత్రం ఆలయంలో 82 అమావాస్య హోమం వైభవంగా నిర్వహించామన్నారు. ఆలయ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి కార్యక్రమాలను తిలకించారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? రేపల్లె పెదకూరగాయల మార్కెట్ పక్కన వ్యర్థాలను తొలగించక దుర్వాసన వస్తోంది. -**నాంచారయ్య, స్థానికుడు.** ✔ మార్కెట్ పక్కన ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపడతాం. -**శామ్యూల్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేపల్లె.** – రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

? భట్టిప్రోలు గుంటి పార్వతి అమ్మవారు దేవస్థానం సమీపంలో వీధి లైటు వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంది. వీధి లైటును వెలిగించండి. - **శ్రీనివాసరావు, భట్టిప్రోలు** ✔ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి లైటుకి మరమ్మతు చేయిస్తాం. - **నాయక్, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు.** –న్యూస్‌టుడే, భట్టిప్రోలు.

తాత్కాలిక భవనం.. సమస్యలు శాశ్వతం..!

బాపట్ల మహిళా డిగ్రీ కళాశాలలో వసతుల లేమి ★ పేద విద్యార్థులకు అందని నాణ్యమైన విద్య

బాపట్ల, న్యూస్‌టుడే

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్థాపించి 11 ఏళ్లు అవుతున్నా శాశ్వత భవనాలు మాత్రం నిర్మించలేదు. తాత్కాలిక భవనంలో అరకొర వసతుల మధ్య విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రయోగశాలలు ఏర్పాటు చేయకపోవడంతో తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందటం ఎండమావిగా మారింది. తరగతి గదుల కొరత కారణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టటానికి అవకాశం లేకుండా పోయింది.

తాత్కాలిక భవనంలో చదువుతున్న విద్యార్థినులు

రూ.5 కోట్లు మంజూరైనా..

బాపట్లకు 2014లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మంజూరైంది. సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఆవరణలో తాత్కాలిక భవనంలో కళాశాల ప్రారంభించారు. యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాలకు తరగతులు, ప్రయోగశాలల భవనాల నిర్మాణానికి కనీసం రెండెకరాల భూమి అవసరం. భవనాల నిర్మాణానికి కేంద్రం రూ. 5 కోట్లు మంజూరు చేసింది. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. ప్రజాప్రతినిధులను కలిశారు. భూమి మాత్రం లభించలేదు. కేవలం ఐదు చిన్న గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.

360 మంది విద్యార్థినులు

ప్రస్తుతం కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీఏ, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బైపీసీ కోర్సులు బోధిస్తున్నారు. ఒక్కో కోర్సులో 40 సీట్లు ఉన్నాయి. మొత్తం 360 మంది విద్యార్థినులు చదువుతున్నారు. అందరూ పేద కుటుంబాల వారే. కళాశాలకు భవనం లేకపోవటం వల్ల బీబీఏ, బీఎస్సీ కంప్యూటర్స్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులు, ఇతర కొత్త కోర్సులు ప్రారంభించటానికి అవకాశం లేకుండా పోయింది. యూజీసీ గ్రాంట్స్ నిధులు రావటం లేదు. కేవలం విద్యార్థినులు చెల్లిస్తున్న ఫీజులతోనే కళాశాలను నిర్వహించటం కష్టంగా మారింది. అధ్యాపకులు నిర్వహణ ఖర్చులు కొంత భరిస్తున్నారు. బీకాం కంప్యూటర్స్ కోర్సు బోధిస్తున్నా ల్యాబ్ సౌకర్యం లేదు.

భూమి కేటాయిస్తే భవనాల నిర్మాణం

విద్యార్థినులు సులభంగా వచ్చే ప్రాంతంలో కళాశాలకు కొత్త భవనాలు నిర్మించాల్సి ఉంది. భవనాల నిర్మాణానికి కేంద్ర నిధులు ఉన్నాయి. ఎమ్మెల్యే నరేంద్రవర్మతో పాటు పట్టణ ప్రముఖులు చొరవ తీసుకుని దాతల సహకారంతో రెండెకరాల భూమిని కళాశాలకు కేటాయిస్తే దశాబ్దానికి పైగా ఉన్న సమస్య పరిష్కారమవుతుంది. భవనాలు నిర్మిస్తే వసతులు మెరుగవుతాయి. యూజీసీ నుంచి నిధులు వస్తాయి. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందుతుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు తక్కువగా ఉన్న తరుణంలో బాపట్ల కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈవిషయంపై కళాశాల ప్రిన్సిపల్ నాగమణి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు లేకపోవటం ఇబ్బందిగా ఉందన్నారు. ఉపాధి నిచ్చే కొత్త కోర్సులు ప్రారంభించలేకపోతున్నామని, ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించామని చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానం అందించాలి

మాట్లాడుతున్న సబ్యసాచి శ్రీవాస్తవ్

బాపట్ల, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారానే వ్యవసాయ రంగం ప్రగతి సాధ్యమని సూర్యలంక వాయుసేనా కేంద్రం కమాండర్ గ్రూప్ కెప్టెన్ సబ్యసాచి శ్రీవాస్తవ్ అన్నారు. ఏజీ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో మరో హరిత విప్లవం రావాలన్నారు. సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్నదాతలకు అందించాలన్నారు. భూసారం, పోషకాలు అందించటం ద్వారా నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయ నిపుణులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలన్నారు. ఏడీ ప్రసూనరాణి, ఆచార్యులు శ్రీరేఖ, సుశీల, సంధ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమస్యలతో బలవన్మరణం

బాపట్ల, న్యూస్‌టుడే: వ్యక్తిగత సమస్యలతో గుడిపూడికి చెందిన వట్టికూటి సీతారామయ్య(65) పొలం వద్ద మంగళవారం అర్ధరాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడిని చికిత్స నిమిత్తం పొన్నూరులోని ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రమబద్ధీకరణకు చివరి అవకాశం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అనధికార భవన నిర్మాణాలు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు చివరి అవకాశం ఉందని రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. 1985 నుంచి 31.8.25 వరకు పురపాలక సంఘం పరిధిలో నిర్మించిన అనధికార నిర్మాణాలు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. 12.11.25 నుంచి 120 రోజుల్లో ఆన్‌లైన్లో లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు రిజిష్టర్డు దస్తావేజులు, సబ్‌రిజిస్ట్రారు జారీ చేసిన ఈసీ, మార్కెట్ వ్యాల్యూ కాపీ, బిల్డింగ్ ప్లాన్, బిల్డింగ్ ఫొటో, సంబంధిత పత్రాలతో ప్రాథమిక ఫీజు రూ.10 వేలు చెల్లించాలి. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారాయణం.. సకల శుభప్రదం

పూజలో పాల్గొన్న పెనుగొండ పీఠాధిపతి బాలస్వామి, నిర్వాహకులు

అమృతలూరు: లలితాసహస్రనామ పారాయణం సకల శుభప్రదమని పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) అన్నారు. గోవాడ శైవక్షేత్రంలో పవిత్ర కార్తిక అమావాస్యను పురస్కరించుకుని బుధవారం కోటిసహస్రనామార్చన, లలితాసహస్రనామ పారాయణం నిర్వహించారు. పూజల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. జగన్మాత, పరాశక్తి పరమేశ్వరి నామాలను సహస్రనామాలను పెద్దసంఖ్యలో మహిళలు పారాయణం చేయడం శుభదాయకమని అన్నారు. దాసరిసాహిత్య ప్రాజెక్టు గుంటూరు-కృష్ణ జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, ఉమారాణి దంపతుల సహకారంతో జరిగిన కార్యక్రమంలో హరే శ్రీనివాస భజన మండలి మహిళలు వందల సంఖ్యలో పాల్గొని పారాయణం చేశారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. అర్చకులు శ్రీనివాసశర్మ, శ్రీధర్‌శర్మ పూజాదికాలు జరిపారు. పొన్నపల్లి సత్యనారాయణ, జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

చుండూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ఆనంద బాబు తెలిపారు. మండల కేంద్రం చుండూరులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌పై రైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.14వేలు చొప్పున నగదు జమ అయిందన్నారు. రానున్న రోజుల్లో అన్నదాతలకు మరిన్ని ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతామన్నారు. మేలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గం మొత్తం మీద 27,965మంది రైతులకు రూ. 18.54కోట్ల లబ్ధి కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జె.పుణ్యకుమారి, డీసీ చైర్మన్ బి. శివారెడ్డి, తెదేపా నాయకులు యల్లారెడ్డి, వెంకటరెడ్డి, కోటిరెడ్డి, బీసీసెల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి (గ్రామీణ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా నిలిచి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళుతున్నాయని జేసీ భావన అన్నారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. నియోజకవర్గంలో 28,634 మంది రైతు లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రూ. 18.81కోట్ల నగదు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, ఏడీఏ ఎ.లక్ష్మి, తహసీల్దార్ పద్మావతి, ఏవో ఫరూక్, నేతలు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న జేసీ భావన, ఆర్డీవో రామలక్ష్మి తదితరులు



రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు మండలంలో 5,593 మంది రైతులకు రూ.2.77కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 4561 మంది రైతులకు 0.91కోట్లు సాయం పంపిణీ చేసినట్లు ఏవో పేర్కొన్నారు.

నగరం: మండలంలో 6,349 రైతులు లబ్ధి పొందారని ఎంపీడీవో బొర్రా శ్రీను, ఏవో రమేష్‌లు పేర్కొన్నారు.

పేటేరు, న్యూస్‌టుడే: రేపల్లె మండలంలో 7852 మంది రైతులకు లబ్ధి చేకూరిందని తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో రవిబాబు తెలిపారు.

వర్మీ కంపోస్టు తయారు చేయండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : తడి, పొడి చెత్త కేంద్రాల్లో తప్పనిసరిగా వర్మీ కంపోస్టును తయారు చేయాల్సిందేనని ఎంపీడీవో ఎస్వీ రమణ అన్నారు. గ్రామంలో ఉన్న వర్మీ కంపోస్టు షెడ్డును బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఆదాయం పెరగటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మండల పరిధిలో 12 గ్రామాల్లో షెడ్లు నిర్మించి ఉండగా, 9 నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వీటిలో ఐదు షెడ్లల్లో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారని, మిగిలిన షెడ్లల్లో జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సేకరించే చెత్తలో కావాల్సిన వాటిని విడదీసి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయబాబు, పంచాయతీ కార్యదర్శి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టెను పరిశీలిస్తున్న ఎంపీడీవో

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు

వేమూరు: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జంపని ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి బాలబాలికలు విజ్ఞాన యాత్రకు వెళ్లి వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు బదరీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నలుగురు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల బృందం ఉప్పలపాడులోని పక్షుల సంరక్షణ కేంద్రం, కోటప్పకొండను సదర్శించి మంచి అనుభూతిని పొందినట్లు వివరించారు. విజ్ఞాన యాత్రలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

కోటప్పకొండలో విద్యార్థులు

బాధితురాలికి సాయం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితురాలు హసీనాకు తెదేపా సీనియర్ నాయకుడు సయ్యద్ నిజాం రూ.20 వేలు నగదు, బియ్యం, సరుకులు అందజేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బాజీ, సలీమ్, అమీరా, అన్వార్‌బేగ్ పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రానికి అడుగులు

రేపల్లె అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2017లో అప్పటి తెదేపా నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసింది. రెండు అగ్నిమాపక శకటాలు నిలిపేలా, అధికారి, సిబ్బంది గదులతోపాటు కంట్రోల్ రూం, మరుగుదొడ్లు సమకూరతాయని సంబరపడ్డారు. అప్పట్లో పనులు చేపట్టిన గుత్తేదారుడు భవన నిర్మాణానికి పిల్లర్లు వేయించారు. 2019లో ఎన్నికల ప్రకటనతో పనులు ఆపేశారు. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తిగా నిలిచిన పనుల పూర్తికి చర్యలు చేపట్టింది. నూతన భవనం సమకూరితే ఇబ్బందులు తీరుతాయని సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

పిచికారి చేయకుంటే పంట దక్కదు

పంటలు కోత దశలో దోమల బెడదతో దెబ్బ తింటున్నాయి. దోమలు వరి పైర్లపై పడి దుబ్బులు సప్పరిస్తుండటంతో ఎన్ను వాలిపోతోంది. ఈ నేపథ్యంలో రైతులు వారం రోజుల్లో కోత కోసే పొలానికి సైతం మందులు పిచికారి చేస్తున్నారు. కాలువలకు నీళ్లు ఉద్ధృతంగా వస్తుండటంతో నీటితో పాటు దోమలు వస్తున్నట్లు రైతులు తెలిపారు. దోమకాటుకు గురైతే కంకి బిగవదని, ముందుజాగ్రత్తగా మందులు పిచికారి చేస్తున్నామని చెబుతున్నారు. - **న్యూస్‌టుడే, బాపట్లటౌన్**

స్మార్ట్‌గా మారిన శుభలేఖ

బంధువులు, మిత్రులను వివాహానికి ఆహ్వానిస్తూ అందజేస్తున్న శుభలేఖలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. బాపట్లలో ఐసీడీఎస్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న చీరాలకు చెందిన బెల్లం సురేంద్ర బాబు వివాహం ఈ నెల 22న జరగనుంది. శుభలేఖను స్మార్ట్ కార్డు సైజులో ముద్రించి పంపిణీ చేశారు. కార్డు ముందు వైపు వధూవరుల పేరు, వివాహ ఆహ్వానం, వెనుక ముహూర్త సమయం, కల్యాణ వేదిక పేర్లు ముద్రించారు. శుభలేఖ జేబులో పెట్టుకుని వెళ్లేలా డిజైన్ చేశారు. స్మార్ట్ శుభలేఖను అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. **- న్యూస్‌టుడే, బాపట్ల**

రోగాల భయం.. ఎలా అభయం..!

యజమానుల నిర్లక్ష్యం, యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి విషపురుగులు, దోమలు, పాములకు నిలయంగా మారాయి. రోగాలకు కారణమవుతున్నాయి. పిట్టలవానిపాలెం, జీఎన్ పాలెం, చందోలు, సంగుపాలెం గ్రామాల్లో పలుచోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి కంటే సిమెంట్ రోడ్డులు ఎత్తుగా ఉండటంతో వర్షం కురిసినప్పుడు నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోతోంది. దోమల బెడద ఎక్కువైంది. స్థల యజమానులు చర్యలు చేపట్టకపోవడం, పంచాయతీ వారు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగునీరు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చందోలు(పిట్టలవానిపాలెం)**

ఐఎంఏకు సీఎంఈ అవార్డు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రేపల్లె శాఖకు సీఎంఈ(కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్) రాష్ట్ర స్థాయి అవార్డు వరించిందని కార్యదర్శి వసంతం వీరరాఘవయ్య బుధవారం తెలిపారు. గుంటూరు, విజయవాడలోని ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో చేసిన కార్యక్రమాలు చేసినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఐఎంఏ ముందుంటుందని తెలిపారు.

తప్పిన ప్రమాదం.. వృద్ధుడికి గాయాలు

పొన్నపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: గాడిద అడ్డు రావడంతో డ్రైవర్ బ్రేక్ వేయగా వృద్ధుడికి గాయాలయ్యాయి. చెరుకుపల్లి నుంచి రేపల్లె వెళుతున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సులో గూడవల్లి వెళుతున్న ప్రయాణికుడు సుబ్బారావు ప్రమాదం సమయంలో ముందుకు పడి గాయపడగా గుళ్లపల్లిలో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించాడు. కొద్దిసేపు ఐసీయూలో ఉంచగా కొలుకున్నాడు. వృద్ధుడు కోలుకోవడంతో తిరిగి అదే బస్సులో ఇంటికి చేరుకున్నాడు.

అదాలత్‌లో 14 సమస్యల పరిష్కారం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల కేంద్రం చెరుకుపల్లి శివాలయం వద్ద శాస్త్రి కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యుత్తు అదాలత్‌లో 14 సమస్యలను పరిష్కరించినట్లు డీఈ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ ఆయా సమస్యలను అధికారులతో మాట్లాడి వాటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. సమస్యల పరిష్కారంతో వినియోగదారులు హర్షం తెలిపారు. ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ భాస్కరావు, డీఈ జి. భాస్కరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జీవితం ఆదర్శం

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఏవీవీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సత్యవతి అన్నారు. బాపట్ల గ్రంథాలయంలో బుధవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ప్రతిభ కనపరిచి ప్రయోజకులు కావాలన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శివాజిగణేశన్, ఉపాధ్యాయులు దుర్గా, భవాని పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు

కొల్లూరు: పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

అమృతలూరు: ముగ్గులు వేస్తున్న చిన్నారులు

కొల్లూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాంబాబు దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ప్రధానిగా ఆమె చేసిన సేవలను వక్తలు వివరించారు.

అమృతలూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో బాగంగా కూచిపూడి, ఇంటూరు, అమృతలూరు జిల్లా శాఖ గ్రంథాలయాల ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయాగ్రామాల ఉన్నతపాఠశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. గ్రంథాలయ బాధ్యులు రాఘవేంద్రరావు, శ్రీదేవి, సుధీర్ పర్యవేక్షించారు.

అలరించిన చిన్నారుల నీతి కథలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాలల ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నీతి కథలపై పోటీ నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 41 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు.. బహుమతులు గెలిచారు

బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ గిరిధర్ కుమార్, ప్రిన్సిపల్ రఘురామ్, సమన్వయకర్త సల్మా

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ రత్నమాల, వైస్ ప్రిన్సిపల్ షకీలా

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాని వీజీఆర్ఎం జూనియర్ కళాశాల, అక్షర విద్యాభవన్‌లో ప్రతిభా పాటవ పోటీలు బుధవారం నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో 8, 9, 10, ఇంటర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజ్ఞాని వీజీఆర్ఎం జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సాత్విక, ఇషాంత్ శ్రీకృష్ణ, బ్యూలారాణి ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ గిరిధర్ కుమార్, ప్రిన్సిపల్ రఘురామ్, సమన్వయకర్త సల్మా బహుమతులు ప్రదానం చేశారు. అక్షర విద్యాభవన్‌లో జరిగిన పోటీల్లో విద్యార్థులు బాలవర్షిణి, అనుశ్రీ, ముంతాజ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ రత్నమాల, వైస్ ప్రిన్సిపల్ షకీలా బహుమతులు అందజేశారు.

ఉపాధి కోల్పోతామని ఆవేదన

బాపట్ల, న్యూస్‌టుడే: సూర్యలంకలో దుకాణాలు నడుపుతూ జీవనం సాగిస్తున్న 50 కుటుంబాలను ఖాళీ చేయాలంటూ అడవి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనోపాధి దెబ్బ తింటుందని తహసీల్దారు సలీమాను వ్యాపారులు బుధవారం కలిసి విన్నవించారు. సూర్యలంకలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తయ్యాక అక్కడే దుకాణాలు ఏర్పాటు చేసుకోవటానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. తహసీల్దారు స్పందించి సమస్యను ఆర్డీవో ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

తుపాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఈపూరులంకలో మొంథా తుపాను వల్ల నష్టపోయిన సుమారు వంద పేద కుటుంబాలకు బుధవారం ఎన్‌డీఆర్ఎఫ్ ప్రతినిధులు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. వారికి సర్పంచి మేకతోటి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాసరి డేనియేల్, గేరా థామస్, ప్రభాత్ కుమార్, రమేష్, జీవన్ రాయ్ పాల్గొన్నారు.

గేటు వద్ద నిరీక్షణ.. ఆర్వోబీతోనే పరిష్కారం

కంకటపాలెం రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

పట్టణ శివారు కంకటపాలెం రైల్వే గేటు అరగంటకు పైగా మూసి ఉండటం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బాపట్ల నుంచి కంకటపాలెం, నరసాయపాలెం, పర్చూరుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. విజయవాడ-చెన్నై ప్రధాన రైల్వే మార్గం కావటం, మూడు రైల్వే ట్రాక్‌లు ఉండటంతో ప్రతి ఎనిమిది నుంచి పది నిమిషాలకు రైళ్లు వెళ్తున్నాయి. ఒకసారి గేటు పడితే మూడు నుంచి నాలుగు రైళ్లు వెళ్లే వరకు తెరవటం లేదు. ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలల బస్సులు సైతం 30 నుంచి 40 నిమిషాలు గేటు వద్ద నిలిచిపోతున్నాయి. ఆర్వోబీ నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రత్యేక చొరవ చూపి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్వోబీ నిర్మాణానికి అనుమతి, నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కంకటపాలెం(బాపట్ల)**

వార్షికోత్సవ శుభాకాంక్షలు
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
నిజాంపట్నం బ్రాంచి
వ్యాపార సంస్థలకు, రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిజాంపట్నం శాఖ నేడు 11 వసంతాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భముగా
BM శ్రీ కట్ల సత్యసాగర్ గార్కి, DBM శ్రీ J.సుష్మా గారికి మరియు బ్యాంకు సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు..

పొన్నాడ సుభాష్, శ్రీలక్ష్మి గణపతి ఐస్ ఇండస్ట్రీస్
యెండూరి రాజేష్, శ్రీ ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్
ఆలపాటి వెంకటకృష్ణారావు, నిజాంపట్నం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు
ఆలపాటి వెంకటశ్రీనివాసరావు (రత్తు), నిజాంపట్నం టౌన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు
కొపనాతి పోతురాజు, ప్రముఖ వ్యాపారవేత్త
ఆలపాటి లక్ష్మీ సాయిరామ్, వాసవి ఎంటర్‌ప్రైజెస్
ఆలపాటి వెంకటసుబ్బారావు, రిటైర్డ్ క్యాషియర్

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? మండల పరిధి వీరన్నపాలెంలో బాపట్ల రోడ్డు వైపు రోడ్డుపైనే చెత్తాచెదారం వేస్తున్నారు. - **స్థానికుడు, వీరన్నపాలెం** ✔ రెండ్రోజుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- పి. పినాకపాణి, పంచాయతీ కార్యదర్శి, వీరన్నపాలెం
– న్యూస్‌టుడే, పర్చూరు

? గంగవరంలో ప్రధాన రహదారి వద్ద తూములు పూడి మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. - **పార్థసారథి, గంగవరం** ✔ ప్రధాన కాలువకు అనుసంధానం జరిగే చోట సమస్య ఏర్పడింది. సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం.
- బాలాజీ, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, ఇంకొల్లు

ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హరిప్రసాద్

పర్చూరు, న్యూస్‌టుడే : అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పర్చూరుకు చెందిన మామిడిపాక హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ స్టేట్ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డుండి రాకేష్ నియామకపత్రాలను హరిప్రసాద్‌కు అందజేశారు.

దివ్యాంగ విద్యార్థినికి అధికారిణి చేయూత

జాండ్రపేట (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల మండలం జాండ్రపేటకు చెందిన దివ్యాంగ విద్యార్థిని వాసవికి ఎస్ఎస్ఏ ఇన్‌క్లూజివ్ జిల్లా సమన్వయకర్త జోత్స్న చేయూత అందించారు. కొంత కాలం క్రితం ఆమె ఇంటింట సర్వే కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా ఈ గ్రామంలోని కోట సంజీవ రెడ్డి ఇంటికి వెళ్లారు. ఇంట్లో సరిగ్గా నడవలేని ఈయన కుమార్తెని చూశారు. కుడి కాలు సరిగ్గా లేక పాఠశాలకు వెళ్లలేని స్థితిలో ఉండటంతో వెంటనే గుంటూరు ప్రభుత్వాసుపత్రిలోని తనకు తెలిసిన వైద్యుడ్ని సంప్రదించారు. అక్కడకు పంపి శస్త్ర చికిత్స జరిగేలా చొరవ తీసుకున్నారు. ఆపరేషన్ అనంతరం పూర్తిస్థాయిలో నడవడానికి ప్రత్యేక బూటు అవసరం కావడంతో అందుకోసం రూ.15 వేలు విరాళంగా అందించారు. తన కుమార్తె విద్యాభివృద్ధికి సహకరించిన అధికారిణికి తండ్రి సంజీవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పడిపూజ భజనకు హాజరైన మంత్రి

భజనలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

నాగులపాడు(అద్దంకి), న్యూస్‌టుడే : నాగులపాడులో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజ భజనకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. తెదేపా నేత పెంట్యాల రామాంజనేయులు అయ్యప్పదీక్ష స్వీకరించి బుధవారం రాత్రి గ్రామంలో పడిపూజ ఏర్పాటు చేశారు. సమీప గ్రామాల నుంచి దీక్షాపరులు పెద్దఎత్తున హాజరయ్యారు అయ్యప్ప నామస్మరణతో గ్రామం మార్మోగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి గొట్టిపాటి రవికుమార్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన పీఠానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట తెదేపా నేతలు ఉన్నారు.

అద్దంకి ఊర చెరువు అభివృద్ధికి అడుగులు!

అమృత్ 2.0 పథకం కింద రూ.5.10 కోట్లు ప్రకటించిన పురపాలక మంత్రి

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే

పట్టణ పరిధిలో సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలోని ఊర చెరువు అభివృద్ధికి అమృత్ 2.0 పథకం కింద రెండో విడత నిధులు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఇటీవల ప్రకటించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ పథకం కింద తొలివిడతలో రూ.1.13 కోట్లు విడుదల చేశారు. ఆయా నిధులతో చుట్టూ సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో మట్టి కట్ట ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనే పెద్దఎత్తున విమర్శలు వినిపించాయి. స్థానిక వైకాపా నాయకుల కోసమే కొంత భూమిని వదిలేసి మిగిలిన భూమిలోనే అమృత్ 2.0 పథకాన్ని అమలు చేస్తున్నట్లు విమర్శలు వచ్చాయి. ఈ పథకం రెండో విడతలో పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.5.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటనతో తిరిగి ఈ పథకం వెలుగులోకి వచ్చింది.

ఎన్టీఆర్ నగర్ వద్ద నిర్మించిన అడ్డుకట్ట, చెరువులో నీరు

సుందరీకరణ పనులు

ఎన్టీఆర్ నగర్‌కు అనుసంధానంగా ఉన్న ఊర చెరువులో నీరు నిలిపే అవకాశం ఉన్న 80ఎకరాల్లో అమృత్ 2.0 పథకం ద్వారా సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. కాలువ కట్ట చుట్టూ వాకింగ్ ట్రాక్, వర్షాల సమయంలో మట్టి జారిపోకుండా రాతి కత్తువ, నీటిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా, మొక్కలు నాటడం, విద్యుద్దీపాలంకరణ వంటి అధునాతన విధానాలతో అమృత్ 2.0 పనులు చేపట్టనున్నట్లు పురపాలక అధికారులు వెల్లడించారు. నిరంతరం నీరు నిలిచి ఉండటం వల్ల భూగర్భజలాలు తగ్గకుండా ఉంటాయని, ప్రజాప్రయోజనాలు నెరవేరుతాయని వారు వెల్లడిస్తున్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఏఈ జి. లోకేష్ తెలిపారు.

పొలాలకు వెళ్లాలంటే తిరిగి రావాల్సిందే

కొత్తరెడ్డిపాలెం- శాంతినగర్ మధ్య గండి పూడ్చేదెప్పుడో?

కొత్తరెడ్డిపాలెం- శాంతినగర్ మధ్య రహదారికి పడిన గండి

చక్రాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే : మొంథా తుపాన్ ప్రభావంతో చక్రాయపాలెం శివారు శాంతినగర్, శింగరకొండపాలెం శివారు కొత్తరెడ్డిపాలెం మధ్య రహదారికి గండి పడింది. మూడు వారాలు గడుస్తున్నా నేటికీ అధికార యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదని రైతులు వాపోతున్నారు. కొత్తరెడ్డిపాలెంలోని మాగాణి భూముల్లో కూలీ పనులు చేసుకునే వారికి దారి సదుపాయం లేకపోవటంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అలాగే కొత్తరెడ్డిపాలెనికి చెందిన కూలీలు ప్రతిరోజూ చిన్నకొత్తపల్లి శివారు శ్రీనివాసనగర్ వద్ద వ్యవసాయ భూముల్లో కూలీ పనులు నిర్వహిస్తుంటారు. వీరు పొలాలకు చేరుకోవాలంటే చుట్టూ పది కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. తద్వారా రవాణా భారం రైతు పైనే పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్‌కు చెందిన రైతు బోలె ఆదిశేషు ఎనిమిది ఎకరాల్లో మాగాణి సాగు చేశాడు. కౌలురైతుగా ఉన్న ఈయన పొలాలకు కాంప్లెక్స్ ఎరువు వేయాలంటే గండి నీళ్లలో నడిచి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. తక్షణం మరమ్మతులు జరిపించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ ఎల్.వెంకటేశ్వర్లును వివరణ కోరగా రూ.25 వేలతో మూడు పైపులతో శుక్రవారం నాటికి మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు.

ఉపన్యసించారు.. బహుమతులు సాధించారు

విజేతలతో ప్రధానాచార్యుడు శ్రీనివాసరావు

ఈపురుపాలెం(చీరాల అర్బన్), న్యూస్‌టుడే: ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు తెలుగు బ్రిలియంట్ హైస్కూల్లో బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా షేక్ జువేరా, బి.లావణ్య, సీహెచ్ భాగ్య లక్ష్మి సాధించారు. వీరికి ఈనాడు తరఫున పాఠశాల ప్రధానాచార్యుడు సీహెచ్ శ్రీనివాసరావు జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ జశ్వంత్, ఉపాధ్యాయులు సువర్ణ ఉన్నారు.

విద్యార్థులు అన్ని విషయాలు తెలుసుకోవాలి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో చీరాల ఉపవిద్యాధికారి గంగాధర్, తదితరులు

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు అన్ని విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చీరాల ఉప విద్యాధికారి డి.గంగాధర్ అన్నారు. పట్టణంలోని గొరకాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ చేసేందుకు హాజరయ్యారు. 'చరవాణి వల్ల లాభాలు, నష్టాలు' అనే అంశంపై విద్యార్థులు మాట్లాడారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జె.రవిచంద్ర, షేక్ నాగూర్ బాషా, షేక్ యాసిన్‌లకు బహుమతులు అందించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, అధికారులు

మార్టూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. రైతుల అభ్యున్నతిని కాంక్షించి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. మార్టూరు ఏఎంసీ ఆవరణలో బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన రెండో విడత నిధులను నియోజకవర్గంలోని రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఆరు మండలాల్లోని 37,861 మంది అన్నదాతలకు రూ.25.83 కోట్లు లబ్ధి చేకూరనున్నట్లు ఏలూరి తెలిపారు. అనంతరం మార్టూరు మండలం జొన్నతాళికి చెందిన రైతు ఏసునాయుడుకు 50 శాతం సబ్సిడీపై మంజూరైన మినీ ట్రాక్టర్‌ను ఏలూరి పంపిణీ చేశారు. అంతకుముందు ఏఎంసీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏలూరి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అపర్ణ, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్టూరు, పర్చూరు ఏడీఏలు సుదర్శనరాజు, ప్రవీణ, ఏవో లావణ్య, ఉద్యానాధికారి హనుమంత నాయక్, ఏఎంసీ ఛైర్మన్ వెంకటరావు, తహసీల్దారు ప్రశాంతి, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, నాయుడు హనుమంతరావు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవతో రైతులకు లబ్ధి

సంతమాగులూరు, బల్లికురవ, వేటపాలెం, ఇంకొల్లు, పర్చూరు, మేదరమెట్ల, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవతో రైతులకు లబ్ధి చేకూరుతున్నట్లు సంతమాగులూరు వ్యవసాయాధికారి సైదా, ఇంకొల్లు, బల్లికురవ, పర్చూరు తహసీల్దార్లు శ్రీనివాస్, రవి నాయక్, బ్రహ్మయ్య పేర్కొన్నారు. సంతమాగులూరు మండలంలో 8,871, వేటపాలెం మండలంలో 2,950 బల్లికురవ మండలంలో 9150, ఇంకొల్లు మండలంలో6,049 మందికి లబ్ధి చేకూరుతున్నట్లు వారు తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కొరిశపాడు మండలంలో 5361 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.2.68 కోట్లు, పీఎంకిసాన్ ద్వారా 4988 మంది రైతులకు రూ.2వేలు మొత్తం రూ.కోటి వారి ఖాతాల్లో జమచేసినట్లు నియోజకవర్గం ప్రత్యేక అధికారి, డిప్యూటీ సీఈవో బాలమ్మ తెలిపారు. చినగంజాం మండలంలో 4,810 మంది రైతులకు 3.15 కోట్ల నిధులు విడుదల బుధవారం అయినట్లు ఏవో చంద్రశేఖర్ తెలిపారు. అన్ని చోట్లా వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని రైతులు, అధికారులు, పార్టీ నాయకులు వీక్షించారు.

నేరుగా రైతుల ఖాతాల్లోకి నిధులు

మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బోయినవారిపాలెం (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధులు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ బోయినవారిపాలెంలో బుధవారం నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..చీరాల నియోజకవర్గ పరిధిలో 7368 రైతు కుటుంబాలకు రూ.4.60 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, డాక్టర్ సజ్జా హేమలత మాట్లాడుతూ..రైతులు ఆధునిక సాగు పద్ధతులను అమలు చేసి ఫలితాలు పొందాలన్నారు. ఏడీఏ రత్నకుమారి, ఏడీహెచ్ ఎస్.చిట్టిబాబు, తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పందిళ్లపల్లి: సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని తిలకిస్తున్న రైతులు, నాయకులు

విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు పెంపొందించేందుకు పోటీలు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు పెంపొందించేందుకు శింగరకొండ కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంటూరు సెయింట్ జోసఫ్స్ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్తంగా 'మేధ' పేరిట వెబినార్ నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు డాక్టర్ వి.హేమానాయక్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం కేఆర్‌కే కళాశాలలో విడుదల చేశారు. కృత్రిమ మేధస్సు మరియు జీవశాస్త్రంలో దాని ప్రయోజనాలు అనే అంశంపై ఈనెల 27న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలు జాతీయ స్థాయిలో డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు అందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

శింగరకొండపాలెంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు

శింగరకొండపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండపాలెంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమన్వయకర్త డాక్టర్ షర్మిలారాణి తెలిపారు. విశ్వవిద్యాలయం నుంచి అనుమతి రాగానే డిసెంబరు 1 నుంచి 7 వరకు వివిధ అంశాలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆమేరకు పంచాయతీ కార్యదర్శి చెన్నయ్యకు వివరాలు వెల్లడించి అనుమతి పొందారు.

పార్కింగ్ లేక.. ఆవరణలోనే

చీరాల ప్రభుత్వ వైద్యశాల జిల్లాలోనే పెద్దది. పాత భవనానికి అనుబంధంగా రూ.కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. అయితే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేయకపోవటతో వాహనాలు ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. రోగులను లోనికి తీసుకొచ్చే ఆటోలు, ఇతర వాహనాలు, సిబ్బంది వాహనాలు అన్ని ఎక్కడంటే అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వైద్యశాల ఆవరణలో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. అత్యవసర పరిస్థితిలో ఉన్న రోగులను తీసుకొచ్చే వాహనాలు లోనికి రావాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని, ఆవరణలో వాహనాలు నిలిపేచోట కుర్చీలు వేస్తే కూర్చునే అవకాశం ఉంటుందని రోగులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చీరాల**

హెచ్చరించినా.. లెక్కచేయని అక్రమార్కులు

ఎన్టీఆర్‌నగర్ వద్ద కాలువ ఒడ్డున నిర్మిస్తున్న కట్టడం

ఎన్టీఆర్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే : ఎన్టీఆర్‌నగర్ వద్ద ఊరచెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ ఒడ్డున అక్రమార్కుడు ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. మొంథా తుపాను సమయంలో ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించిన అధికార యంత్రాంగం ఈ నిర్మాణాన్ని తక్షణం నిలిపి వేయాలని సూచించారు. అయినప్పటికీ సంబంధిత అక్రమార్కుడు మూడు వారాల తరువాత ఏకంగా శాశ్వత ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో సెంటు భూమి విలువ రూ.లక్ష పైనే పలుకుతోంది. ప్రస్తుతం రెండు సెంట్ల భూమిలో నిర్మాణం చేపట్టారు. అద్దంకి మేజరు కాలువ నీరు ప్రవాహం పక్కనే ఇంటి నిర్మాణం, అదికూడా ఎలాంటి జాగ్రత్తలు లేకుండా చేపట్టారు. ఇప్పటికే ఊరచెరువులో ఇతరులు ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదని అటు పురపాలక అధికారులు ఇటు రెవెన్యూ అధికారులు అనేక పర్యాయాలు హెచ్చరికలు జారీచేశారు. అయినప్పటికీ అక్రమార్కుడు నేరుగా ఇంటి నిర్మాణం చేస్తుండటం విశేషం. ఈ విషయమై తహసీల్దార్ జీ.శ్రీచరణ్ మాట్లాడుతూ తక్షణం నిర్మాణ పనులు నిలిపివేస్తామన్నారు.

రోడ్డుపై మురుగు.. ఎలా వేయాలి అడుగు

శింగరకొండపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండపాలెం శ్రీకృష్ణుని విగ్రహం ఎదురు సిమెంటు రహదారిపై మురుగునీరు నిలవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దిగువకు కాలువ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా వివిధ కారణాలతో స్థానికులు అడ్డుకట్ట వేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య మాట్లాడుతూ తక్షణం మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయురాలు శ్రావణి

వేటపాలెం, న్యూస్‌టుడే: తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వేటపాలెం జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలోని కంచర్లవారిపాలెం జడ్పీ పాఠశాలలో జరిగిన ఎంపికల్లో అండర్-14లో ఎల్.వైష్ణవి, షేక్ నస్రీన్, అండర్-17లో పి.హిమబిందు, కె.గాయత్రి ప్రతిభ కనబరిచి అర్హత సాధించారన్నారు. వీరు ఈనెల 22 నుంచి 24 వరకు మచిలీపట్నం, కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామోపాధ్యాయులు శ్రావణి చెప్పారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. విద్యార్థులకు గాయాలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల- వేటపాలెం బైపాస్ రోడ్డులో ఎంవీఐ కార్యాలయం దాటిన తరువాత ముందుగా బుల్లెట్ వాహనంపై వెళుతున్న నాగచరణ్‌ని అదే మార్గంలో వెనుక నుంచి ద్విచక్రవాహనంపై పరీక్ష రాసేందుకు వెళుతున్న ముగ్గురు విద్యార్థుల తమ వాహనంతో బుల్లెట్‌ను వెనుక నుంచి బుధవారం ఢీకొట్టారు. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. చికిత్స కోసం ఏరియా వైద్యశాలలో చేరారు. ఈ మేరకు ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

హుండీల చోరీ

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని గంటలు, హుండీ అపహరించారు. అలాగే రహదారి పక్కన ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద కూడా హుండీను దొంగిలించారు. ఆ హుండీలోని నగదు తీసుకుని గ్రామ సమీపంలో పడేశారు. ఆలయ అర్చకులు రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి పూజలు నిర్వహించి ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి బుధవారం ఉదయం వచ్చేసరికి ఆలయ తలుపులు తెరిచి ఉన్నాయి, గమనించిన అర్చకులు గ్రామస్థులు సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగరాజు వచ్చి పరిశీలించారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

జె.పంగులూరు, న్యూస్‌టుడే: సహకార బ్యాంకు ఇంకొల్లు శాఖ సహకారంతో చందలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎడవల్లి చిరంజీవి కళాబృందంతో కళాజాతా బుధవారం చందలూరులో నిర్వహించారు. రైతులకు వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు, ధన వృద్ధి డిపాజిట్‌లపై అవగాహన కల్పించారు. ఇంకొల్లు సహకార బ్యాంకు మేనేజర్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పర్చూరు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఉప్పుటూరు హోమియో వైద్యుడు చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ప్రపంచ సీవోపీడీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

పట్టాలు కప్పక...ప్రమాదాన్ని గమనించక

పర్చూరు, న్యూస్‌టుడే : భవన నిర్మాణాలకు వాడే ఇసుక, కంకర తరలించే భారీ టిప్పర్లపై పట్టాలు కప్పకుండా తరలిస్తుండటంతో ప్రజలు, వాహన చోదకులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీరాల, బాపట్ల ప్రాంతాల్లో కంకర తరలించే టిప్పరు లారీలు ఎక్కడా భద్రతా ప్రమాణాలు పాటించటం లేదని ప్రజలు వాపోతున్నారు. వాహనాల్లో మోతాదుకు మించి తరలిస్తున్నారు. అధికారులు ఈ రాళ్లను తరలించే లారీలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజశేఖర్‌రాజుకు సత్కారం

మార్టూరు, న్యూస్‌టుడే: మానవ నాగరికతకు దర్పణం పట్టే నీటి విశిష్టతను ప్రజలకు తెలియజెప్పిన పొదిలి రాజశేఖర్ రాజుకు జాతీయస్థాయిలో పురస్కారం దక్కటం అభినందనీయమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎఫర్ట్ సంస్థల సంచాలకుడు వెంకటమోహనరావు కొనియాడారు. మార్టూరు ఎఫర్ట్ కార్యాలయంలో బుధవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నుంచి జాతీయ జల అవార్డు అందుకున్న రాజశేఖర్ రాజును ఘనంగా సత్కరించారు.

కనులపండువలా అయ్యప్ప నగరోత్సవం

నగరోత్సవంలో అయ్యప్ప భక్తులు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండల అయ్యప్ప భక్తుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇంకొల్లులో అయ్యప్పస్వామి నగరోత్సవం నిర్వహించారు. భీమలింగేశ్వరస్వామి ఆలయం నుంచి వందల సంఖ్యలో అయ్యప్పలు, ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. బాలికల కోలాటం అలరించింది. కేరళ నుంచి డోలు వాయిద్య కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

మల్లేశ్వర స్వామికి అభిషేకం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: నల్లగాంధీ బొమ్మ సమీపంలో ఉన్న గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామికి కార్తిక మాసం చివరి రోజైన బుధవారం వేదమంత్రోచ్ఛరణల మధ్య విభూదితో అభిషేకాన్ని నిర్వహించారు. దీన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

విభూదితో స్వామివారికి అభిషేకం

చిన్నారులతో పనిచేయిస్తే జైలుకే

చీరాల, న్యూస్‌టుడే : ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించిందని బడికెళ్లాల్సిన చిన్నారులను పనిలో పెట్టుకుంటే జైలుకెళతారని సహాయ కార్మికశాఖాధికారి సాయి జ్యోతి హెచ్చరించారు. గురువారం పట్టణంలో స్పెషల్ చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా పలు దుకాణాలు, మెకానిక్ షెడ్లు తదితర చోట్ల తనిఖీలు నిర్వహించారు. దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు.

ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసుకోవాలి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లును ఆదర్శ గ్రామంగా తయారు చేసుకోవాలని వెలుగు ప్రత్యేకాధికారి లక్ష్మణాచారి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వార్షిక ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లీగల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుస్థిర జీవనోపాధుల వైపు దృష్టి మళ్లించి ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు.

నెల ముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గోపాలపురం, కలవకూరు(అద్దంకి), న్యూస్‌టుడే : ఖరీఫ్‌లో పండించిన ధాన్యం పౌరసరఫరాల శాఖ ద్వారా నెల రోజుల ముందే కేంద్రాలు ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని కలవకూరు, గోపాలపురం వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. 17శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలని, గోతాలు, ఉచిత రవాణా సదుపాయం కల్పించినట్లు చెప్పారు. అయితే ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ పరికరం అమర్చుకోవాలన్నారు.

ఆక్రమణల తొలగింపు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్లలోని మిద్దెలడొంక రోడ్డులో మురుగు కాలువ నిర్మించనున్నారు. ఈ క్రమంలోనే కాలువ నిర్మాణానికి అడ్డుగా ఉన్న కట్టడాలను బుధవారం యంత్రాల సాయంతో తొలగించారు. ఈ రోడ్డులో తరచుగా మురుగు రోడ్డు మీద పారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ నిర్మాణంతో సమస్యకు పరిష్కారం లభిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రసన్నాంజనేయస్వామి హుండీ లెక్కింపు నేడు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం జరుగుతుందని ఆలయాధికారులు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, ఔత్సాహిక భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.

వాహనాల తనిఖీ

మార్టూరు, న్యూస్‌టుడే : చెన్నై- కొల్‌కతా జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఒంగోలు- గుంటూరు మధ్య ప్రయాణించే పలు ట్రావెల్ బస్సులు, లారీలను సోదాలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు ఎస్సై జీవీ చౌదరి చెప్పారు.

అవీ ఇవీ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పర్చూరు, కారంచేడు ఎస్సైలు జీవీ చౌదరి, షేక్.ఖాదర్‌బాషాలు తెలిపారు. బుధవారం పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో, కారంచేడు మండలం స్వర్ణ జడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తుపదార్థాల నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డ్రైనేజీల నిర్మాణాలకు స్థల పరిశీలన

పర్చూరు, న్యూస్‌టుడే : స్థానిక వై జంక్షన్ వద్ద నుంచి పర్చూరు వాగు వరకు నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీల నిర్మాణాలకు సంబంధించి బుధవారం రెవెన్యూ, ఆర్అండ్‌బీ, సర్వే శాఖ, పంచాయతీ అధికారులు స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ స్థల పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వీఆర్వో వై.శ్రీనివాసరావు, సర్వేయర్లు సుమంత్, నవీన్, పంచాయతీ కార్యదర్శి సామ్యేలు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి సమష్టి కృషి అవసరం

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకిలో శాఖా గ్రంథాలయం సొంత భవనం నిర్మాణం జరిగేలా అందరం కృషి చేయాలని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు ధూళిపాళ్ల వెంకటరత్నం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అద్దంకి గ్రంథాలయం వద్ద దివంగత ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం పర్యావరణ ప్రేమికుడు మన్నం త్రిమూర్తులు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు.

కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

పర్చూరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం బొమ్మల కూడలిలో వైకాపా నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంనిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ పత్రాలు నాయకులు ఆవిష్కరించారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

వలపర్ల(మార్టూరు), న్యూస్‌టుడే: వలపర్ల ఉర్దూ పాఠశాలను బుధవారం ఎంఈవో వస్రాం నాయక్, మండల అకడమిక్ ఫోరం సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలను పరిశీలించారు.

వీఆర్ఏల నూతన కమిటీ ఎంపిక

అభ్యుదయనగర్(అద్దంకి), న్యూస్‌టుడే: మండల వీఆర్ఏల నూతన కమిటీని బుధవారం ఎంపిక చేశారు. సుందరయ్య భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా జంద్రాజుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కనపర్తి స్వాములు, కోశాధికారిగా రుద్రు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా నరసింహారావుతో పాటు కమిటీ సభ్యుల్ని ఎంపిక చేశారు.

తెదేపా సీనియర్ నేత మృతికి నివాళి

మార్టూరు: సుదీర్ఘకాలం తెదేపా గ్రామ, మండల అధ్యక్షుడిగా ఉన్న సీనియర్ నేత, మార్టూరు వాసి బాచిన సంజీవరావు (63)అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. తెదేపా నేతలు ఆయన భౌతికకాయానికి నివాళర్పించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

అద్దంకి: విద్యుత్తు తీగలు బిగింపు కారణంగా గురువారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ దామోదరం తెలిపారు. వేలమూరిపాడు, రాజీవ్ కాలనీ, మధురానగర్, భిక్షాలు కాలనీ, ఒంగోలు రోడ్డుకు ఇరువైపులా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నారు పెంపకానికి సాగు నీరు ఇవ్వండి

చీరాల గ్రామీణం: తుపాను కారణంగా పంటలు తుడిచిపెట్టుకుపోవడంతో తిరిగి నారు పెంపకానికి సిద్ధమవుతున్న రైతులకు సాగు నీరు అందించాలని అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై అడగానికి వెళ్లగా..అధికారులు నార్లు ఎవరు పోయమన్నారు' అని నిలదీస్తున్నారని అన్నదాతలు వాపోయారు. నష్టపోయిన తాము తిరిగి రబీ సీజన్‌లో వరి పంట సాగు చేసి కొంతైనా పూడ్చుకోవాలని ఆలోచిస్తున్నామని, ఇందుకు అధికారులు సహకరించాలని కోరుతున్నారు.

(c) eenadu

ముత్యాల పందిరి.. మురిపెంగ కొలువుదీరి

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఉదయం ముత్యపుపందిరి వాహనసేవ జరిగింది. వాహనంపై ధనలక్ష్మీరూపంలో భక్తులకు అభయమిచ్చారు. ముద్దులొలికించే ముత్యాలు అలమేలుమంగకు ప్రీతిపాత్రమైనవి. స్వాతికార్తెలో వాన చినుకులు సాగరంలోని ముత్యపుచిప్పల్లో పడి మేలుముత్యంగా రూపొందుతాయని, ఏనుగుల కుంభస్థలాల్లో ఉంటాయని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి ముత్యాలను అమ్మవారి నవ్వులకు, చూపులకు, మాటలకు, సిగ్గులకు ప్రతీకలుగా అన్నమయ్య కీర్తించారు. తెల్లని చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అమ్మవారిని చూసేందుకు భక్తులు తిరుమాడ వీధుల్లో బారులు తీరారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయంలోని ముఖమండపంలో అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో వేడుకగా స్నపన తిరుమంజనం జరిగింది. అమ్మవారు రాత్రి సింహవాహనంపై యోగ నరసింహుడి అలంకరణలో దర్శనమిచ్చారు. ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. - న్యూస్‌టుడే, తిరుచానూరు

ఉత్సవాల్లో నేడు..

గురువారం ఉదయం కల్పవృక్ష, రాత్రి హనుమంత వాహన సేవలు జరగనున్నాయి.



రాష్ట్రపతి కాన్వాయ్ ట్రయల్ రన్

రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నుంచి రెండ్రోజుల పర్యటన సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆమె వాహన శ్రేణి ట్రయల్ రన్ నిర్వహించారు. బుధవారం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం చేరుకుని అక్కడ్నించి తిరుమల వరకు చేపట్టారు. ఈ మార్గంలోని కీలక పాయింట్లను, ట్రాఫిక్, భద్రతా డిస్ప్లేస్‌మెంట్, మొబిలైజేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థలను సమగ్రంగా తనిఖీ చేశారు.

ఆధ్యాత్మిక క్షేత్రం నుంచి అంతరిక్ష రంగం

రౌతుసూరమాలలో స్పేస్ సిటీకి భూముల కేటాయింపు

ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా ఉన్న తిరుపతి జిల్లాను అంతరిక్ష రంగంలోనూ అగ్రపథంలో నిలపాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. పరిశోధన, ఉపగ్రహాల తయారీ, అసెంబ్లింగ్ యూనిట్లు, విడిభాగాల తయారీ, తదితర పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 14న స్పేస్ సిటీకి శంకుస్థాపన చేశారు. తదనుగుణంగా జిల్లా యంత్రాంగం ఇప్పటికే భూముల సేకరణపై కసరత్తు ప్రారంభించింది. ఔత్సాహిక పెట్టుబడిదారులు యూనిట్ల స్థాపనకు ముందుకొస్తున్నారు. ఇవన్నీ వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చితే జిల్లా ఖ్యాతి మరింత పెరుగుతుంది.

లక్ష్యం.. 3వేల ఎకరాలు

జిల్లాల పునర్విభజనతో తిరుపతికి సముద్ర తీరము వచ్చింది. శ్రీహరికోటలోని షార్ జిల్లా పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలోనే స్పేస్ సిటీ ఏర్పాటుకు జిల్లా అనువుగా ఉంటుందని సీఎం చంద్రబాబు భావించారు. తొట్టంబేడు మండలం రౌతుసూరమాలను ఎంచుకున్నారు. తొలుత స్పేస్ సిటీకి 2,100 ఎకరాలు కేటాయించాలని అనుకున్నా భవిష్యత్తులో 3వేల ఎకరాలు అవసరమని అంచనా వేశారు. 4 బ్లాక్‌లుగా విభజించారు.

571 ఎకరాల్లో మౌలిక వసతులు

ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రాథమికంగా కొంత భూమి సేకరించాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. తొలుత 571.70 ఎకరాల్లో ప్రధాన, అంతర్గత రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ, తదితర మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడ్డాయి. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేసి పెట్టుబడిదారులకు అప్పగించాలని అనుకుంటున్నారు.

ఇప్పటికే 300 ఎకరాలు కావాలని

సీఐఐ భాగస్వామ్య సదస్సులో బెంగళూరుకు చెందిన ఓ సంస్థ 150 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. మరో సంస్థ 150 ఎకరాల్లో పరిశ్రమ స్థాపిస్తామని పేర్కొంది. ఇప్పటికే 300 ఎకరాలను ఆయా సంస్థలకు అప్పగించే పనిలో ఏపీఐఐసీ నిమగ్నమైంది. తక్కువ ఖర్చుతో రాకెట్లు, శాటిలైట్లను తయారు చేసే స్టార్టప్‌లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, దేశీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం స్పేస్ పాలసీ 4.0ను రూపొందించింది.

అన్నీ అనుకూలతలు

స్పేస్ సిటీకి అవసరమైన అన్ని అనుకూలతలు జిల్లాలో ఉన్నాయి. పరిశోధనలకు సహకారం అందించడానికి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నాయి. శ్రీహరికోట కూడా సమీపంలోనే ఉంది. పెట్టుబడిదారులు పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపుతున్నారు. అంతే వేగంగా వారికి భూములు కేటాయించనున్నాం.

-వెంకటేశ్వర్, కలెక్టర్

ఈనాడు- తిరుపతి

అదిరేలా.. అచ్చెరువొందేలా!

జిల్లాలో డిజిటల్ శుభాకాంక్షల ట్రెండ్

● తిరుపతికి చెందిన ఓ తల్లి.. తన కుమారుడి 15వ పుట్టినరోజును ప్రత్యేకంగా, అతడికి గుర్తుండిపోయేలా జరపాలనుకుంది. 'సర్‌ప్రైజ్ విషెస్' అని ఆన్‌లైన్‌లో వెతకగా.. వచ్చిన లిస్ట్‌లో సంబంధిత ఈవెంట్ నిర్వాహకులను సంప్రదించారు. వారు అనుకున్న తేదీన రెండు గంటల పాటు పది మంది కుటుంబ సభ్యులతో కలిసి బుక్ చేసుకున్నారు. ప్రత్యేక థియేటర్, కేక్, అతడి స్నేహితులను పిలిచి సర్‌ప్రైజ్ విష్ చేయించారు. ఆ సమయంలో అతని ముఖంలో వచ్చిన ఆనందం చూసి వెలకట్టలేనిదిగా వారు అనుభూతి పొందారు.

ఈనాడు డిజిటల్, తిరుపతి: భక్తికి, ఆధ్యాత్మికతకు కొలువైన తిరుపతి.. ఇప్పుడు ట్రెండీ టెక్నాలజీ, వినూత్న ఆకాంక్షలకు కూడా వేదికవుతోంది. మొన్నటివరకు హైదరాబాద్, విజయవాడ.. లాంటి మెట్రో నగరాలకే పరిమితమైన పెద్ద తెరపై (బిగ్ స్క్రీన్) శుభాకాంక్షలు చెప్పే సంస్కృతి, ఇప్పుడు తిరుపతి, చిత్తూరులోనూ ఊపందుకుంది. కేవలం పుట్టినరోజే కాక, ఉద్యోగ సాధన, నిశ్చితార్థం, ప్రేమ, వివాహ వార్షికోత్సవాలు, రూఫ్ టాప్ వేడుకలు.. ఇలాంటి వాటికి యువత ఆసక్తి కనబరుస్తున్నారు.

జ్ఞాపకాలు పదిలం

సాంకేతికత అందుబాటులోకి రావడంతో నగరంలో ఉన్న కొన్ని సినిమా థియేటర్లలో, ప్రత్యేకంగా వీటి కోసం ఏర్పాటు చేసిన సింగిల్ స్క్రీన్‌లలో కుటుంబ సభ్యులతో కలిసి ఆ మధుర క్షణాన్ని అద్భుతంగా పదిలపరుచుకుంటున్నారు. ఇలాంటివి నగరంలో పది వరకు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేకంగా డెకరేషన్ చేసిన రూఫ్‌టాప్, థియేటర్

రూఫ్‌టాప్ తిరుపతికే ప్రత్యేకం..

పుట్టిన రోజు, పెళ్లిరోజు, లవ్ ప్రపోజల్, ఫ్రెండ్‌షిప్.. ఇలా ఏదైనా సెలబ్రేట్ చేసుకునేందుకు మినీ థియేటర్ నుంచి ప్రత్యేక సింగిల్ స్క్రీన్.. లాంటి వాటితో పాటు తిరుపతిలో ప్రత్యేకంగా రూఫ్‌టాప్ కూడా ఉంది. ఇక్కడ రాత్రి 9 నుంచి 11 వరకు వేడుకలు చేసుకోవచ్చు. కేక్, డెకరేషన్, సౌండ్ సిస్టమ్, పది మంది సభ్యులకు ఎంట్రీ మొత్తం రూ. 6,500 వరకు ఉంటుంది.

ఈవెంట్‌ను బట్టి ధర

సాధారణంగా అర గంట, గంట, రెండు, మూడు గంటల ప్యాకేజీలుంటాయి. ఏడుగురు సభ్యుల నుంచి 30 మంది కలిసి వేడుకలు చేసుకునే వీలుంటుంది. టైం స్లాట్ ఆధారంగా.. వీటి ధర మినీ స్క్రీన్ అయితే రూ. 500 నుంచే ప్రారంభమవుతోంది.

శిల్పకళా.. భళా

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉద్యానవనంలో ఫల పుష్ప ప్రదర్శన, పలు స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప శిక్షణా సంస్థ ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్లో సుధా శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. నాలుగు దశల్లో ఉన్న శ్రీలక్ష్మీభూవరాహస్వామి ప్రతిమను భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. రూపొందించిన విధానాన్ని అక్కడున్న వారిని అడిగి తెలుసుకుంటున్నారు. - ఈనాడు, తిరుపతి

స్వర్ణమ్మ వేడుక.. వెలుగుల వేదిక

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన సువర్ణముఖి నదీ హారతుల మహోత్సవం కనులపండువగా జరిగింది. చతుర్వేద మంత్ర పఠనం పూర్ణ్యాక మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య హారతుల కైంకర్యాన్ని జరిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు ఛైర్మన్ కె.సాయిప్రసాద్, ఆలయ ఈవో బాపిరెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవ మూర్తికి సంకల్ప పూజలు

స్వర్ణముఖి నదికి హారతి

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి

కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో బుధవారం ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య దొరస్వామి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువత దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. - న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

వాట్సప్ కాల్ చేస్తారు.. మొత్తం దోచేస్తారు

అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఎస్పీ సుబ్బరాయుడు కేసు వివరాలు వెల్లడించారు. 'ఆగస్టు 26న మనీ లాండరింగ్ కేసు పేరుతో తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి వాట్సప్ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. రెండు మ్యూల్‌ఖాతాల్లో రూ. 80 లక్షలు జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాతాల్లోని రూ. 2.5 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. మిగిలిన రూ. 77.5 లక్షలు 14 రాష్ట్రాల్లోని ఇతరుల ఖాతాలకు.. గేమింగ్ యాప్ వినియోగదారుల ఖాతాలకు చేరినట్లు గుర్తించారు.

కంబోడియా వెళ్లి..: హైదరాబాద్‌కు చెందిన ఎం.కోటిబాబు ఓ ముఠా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆయన 2024 జనవరిలో కంబోడియాకు వెళ్లి సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌తో పనిచేశారు. ఇండియాకు వచ్చి క్రాంతికుమార్, పవన్‌కుమార్‌తోపాటు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్, కర్ణాటకకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గౌతమ్ ద్వారా భారీగా మ్యూల్ ఖాతాలను సేకరించారు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉండటంతో అరెస్టు చేశారు. మరో కీలక నిందితుడు హైదరాబాద్‌కు చెందిన మహమూద్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

విద్యార్థులకు రవాణా భత్యం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఆర్‌టీఈ నిబంధన ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 5,553 మంది విద్యార్థులకు మొదటి విడతగా రూ. 1.66 కోట్ల రవాణా భత్యం విడుదల చేశారు.

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

CODE: ANCP
ANNAMACHARYA COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

కొలువక్కడ.. ఉండేదిక్కడ

- విభజన జరిగి ఏడాదైనా విధుల్లో చేరని వైనం
- గాడిలో పడని ఎస్ఈ కార్యాలయ పాలన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగమంటే ఉన్నతాధికారుల ఆదేశానుసారం విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలి.. ఇక్కడేమో రూ.లక్షల్లో వేతనాలు, అలవెన్సులు పొందుతున్నారు.. అయినా కొందరు ఉద్యోగ బాధ్యతలు పక్కన పెట్టేసి నిబంధనలు వారికి అనుకూలంగా మార్చుకున్నారు.. అడిగేవారెవరు.. అంతా మా ఇష్టం.. అనే రీతిలో విద్యుత్తు శాఖలో కొందరు వ్యవహరిస్తున్నారు.

విభజన కాగితాల్లోనే..

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విద్యుత్తుశాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో ఉండేది. గతేడాది సెప్టెంబరు 25న చిత్తూరులో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయగా తొలి ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిపి 70-80 మంది వరకు కేటాయించారు. కేవలం జిల్లాస్థాయి అధికారులు, ఇంజినీర్లు మాత్రమే విధుల్లో చేరగా.. జేఏవో, సీనియర్, జూనియర్ సహాయకులతోపాటు ఒప్పంద ఉద్యోగులు నేటికీ బాధ్యతలు స్వీకరించలేదు. చిత్తూరుకు కేటాయించిన కొందరు శాశ్వత, ఒప్పంద ఉద్యోగులు సైతం తిరుపతిలో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

పైరవీలు, అధికారుల అండదండలతోనే..

కొందరు ఉద్యోగులు రాజకీయ పైరవీలు, ఉన్నతాధికారుల అండతో తిరుపతిలోనే పని చేస్తున్నారు. వీరికి అక్కడ నిర్దిష్టమైన పోస్టు, బాధ్యతలు లేకపోయినప్పటికీ విధులకు తిరుపతిలోనే హాజరవుతున్నట్లు నమోదు చేయడమే కాకుండా వేతనాలు పొందుతున్నారు. కొందరికి మెమోలు జారీ చేసినా ఉలుకూపలుకూ లేదని ఆశాఖ అధికారులే విమర్శిస్తున్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగులు అధిక పనిభారంతో అవస్థలు పడుతున్నారు.

చేరని ఉద్యోగుల వివరాలిలా..

- శాశ్వత ఉద్యోగులు: 18 మంది
- ఒప్పంద ఉద్యోగులు: 26

రెండుసార్లు లేఖలు రాశాం..

తక్షణమే విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేయాలని రెండుసార్లు ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. నేటివరకు స్పందన లేదు. ఉద్యోగుల కొరతతో పనులు ఆగిపోతున్నాయి.

- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

నేడు వైవీ సుబ్బారెడ్డిని విచారించనున్న సిట్

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): కల్తీ నెయ్యి సరఫరా కేసులో తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు, జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డిని గురువారం సిట్ అధికారులు విచారించనున్నారు. అనారోగ్య కారణాలతో తాను తిరుపతికి రాలేనని ఆయన స్పష్టం చేయడంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రశ్నించనున్నారు. సుబ్బారెడ్డికి తెలిసే కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని.. మైసూరు ల్యాబ్‌లో ఈవిషయం నిర్ధారణ అయిన తర్వాత కూడా సరఫరాదారులను కొనసాగించారని సిట్ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఆయనను ప్రశ్నిస్తే ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది? ఎంత మొత్తం నగదు చేతులు మారింది? అన్న విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

ఒకటి నుంచి జొన్నల పంపిణీ

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: చిరుధాన్యాల వినియోగం ప్రోత్సహించడంలో భాగంగా డిసెంబరు 1వ తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం, చక్కెరతో పాటు జొన్నలు పంపిణీ చేయనున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు తప్ప కార్డుదారులకు కందిపప్పునకు బదులుగా జొన్నలు పంపిణీ చేయనున్నారు. కార్డులో ఒకరికి ఐదు కిలో చొప్పున బియ్యం పంపిణీ చేస్తుండగా వాటి బదులుగా జొన్నలు తీసుకునే వెసులబాటు కల్పించినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలకృష్ణ తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

కల్తీ నెయ్యి కేసులో హవాలా లింకులు

దిల్లీ కేంద్రంగా అధికారుల ముమ్మర దర్యాప్తు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసి భోలేబాబా డెయిరీ నిర్వాహకులు తితిదే నుంచి రూ. 251.53 కోట్లు కొల్లగొట్టిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగం పెంచింది. ఇప్పటికే 12 రాష్ట్రాల్లో విచారణ చేసిన అధికారులు ఇప్పుడు దిల్లీ కేంద్రంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. భోలే బాబా డైరెక్టర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్‌లు.. ఈ సొమ్ములో కొంత మొత్తాన్ని కల్తీ నెయ్యి తయారీకి అవసరమైన రసాయనాలు సరఫరా చేసిన, వివిధ డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు చేసినట్లు నకిలీ రికార్డులు తయారు చేసిన కంపెనీలకు హవాలాలో చెల్లించారు. దాంతో ఎప్పుడెప్పుడు, ఎవరెవరికి ఎంత మొత్తం చెల్లించారు? ఏజెంట్లుగా ఎవరు వ్యవహరించారు? అనే విషయాన్ని తేల్చేందుకు దిల్లీలో ఉన్నారు. అక్కడి సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్, సుప్రీం, సుప్రీం ఇంక్ కార్పొరేషన్ల పాత్రపై ప్రధానంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

● చెన్నై కేంద్రంగా మరో బృందం దర్యాప్తు చేపట్టింది. దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ సమర్పించిన నెయ్యి నాణ్యత ల్యాబ్ రిపోర్టుల అంశంపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల 15 నాటికి మలి ఛార్జ్‌షీట్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టులో దాఖలు చేయనున్నారు. అందులో ఈ వివరాలన్నీ పొందుపరిచే అవకాశం ఉంది.

రూ.146 కోట్లకు నకిలీ ఇన్వాయిస్‌ల సృష్టి

రాజస్థాన్‌లోని బికనేర్‌కు చెందిన ఆశిష్ అగర్వాల్ కల్తీ నెయ్యి కేసులో ఏ 15గా ఉన్నారు. ఇతను పొమిల్ జైన్, విపిన్ జైన్‌కు సన్నిహితుడు. తిరుమలతోపాటు శ్రీకాళహస్తి, విజయవాడ, శ్రీశైలం తదితర ఆలయాలకు కల్తీ నెయ్యి భోలేబాబా డెయిరీ ప్రమేయంతో సరఫరా అవుతోందన్న సంగతి తెలిసినప్పటికీ నిందితులకు పూర్తిగా సహకరించారు. రాజస్థాన్, దిల్లీలోని తనకు చెందిన అగర్వాల్ ట్రేడింగ్ కంపెనీ, సుప్రీం, సుప్రీం ఇంక్, అగర్వాల్ అండ్ అగర్వాల్ సన్స్ సంస్థలతోపాటు మరికొన్ని కంపెనీల నుంచి రూ. 146 కోట్లకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించాడు. వీటి ఆధారంగా తాము వివిధ డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు చేసినట్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు తితిదేను బురిడీ కొట్టించారు. ఆశిష్ అగర్వాల్ ఖాళీ లారీలను బికనేర్, దిల్లీ నుంచి రూర్కీకి తిప్పించారు. ఈ వ్యవహారంలో నిందితుడికి పెద్దమొత్తంలో హవాలా ద్వారా నగదు ముట్టిందని సిట్ నిర్ధారించుకుంది. ఇప్పటికే ఈ కేసులో ఆశిష్ అగర్వాల్‌ను అరెస్టు చేశారు. తాజాగా కుట్ర మూలాలు ఛేదిస్తున్నారు.

MIOT HOSPITALS
OUTREACH CLINIC
TIRUPATI

MIOT హాస్పిటల్స్, చెన్నై నుంచి స్పెషలిస్ట్‌లు విచ్చేయుచున్నారు
@ MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్, తిరుపతి

డయాబెటిస్ & ఎండోక్రినాలజీ
రోగలక్షణాలు మరియు రుగ్మతలు: • మధుమేహ సమస్యలు • థైరాయిడ్ సమస్యలు • లిపిడ్ రుగ్మతలు • హైపర్ టెన్షన్ సమస్యలు • ఎదుగుదలకు సంబంధించిన రుగ్మతలు • ఇన్‌ఫెర్టిలిటీ (సంతానలేమి) • పాలీసిస్టిక్ ఒవారీ వ్యాధి (PCOD) • ఇతర నెలసరి రుగ్మతలు
Prof. Dr. S. Sridhar MD (Medicine), DM (Endocrinology), FRCP
HOD - Department of Diabetology & Endocrinology

న్యూరాలజీ
రోగ లక్షణాలు మరియు రుగ్మతలు: • స్ట్రోక్ / పక్షవాతం • తలనొప్పితో కూడిన వాంతులు • ఫిట్స్ / మూర్ఛ • ఆకస్మిక అంధత్వం • ముఖం / మెడ / వెనుక భాగాలలో నొప్పి • శరీర అవయవాల బలహీనత • చెవుల్లో శబ్దం / వినికిడి లోపం • డిప్రెషన్ • నిద్ర రుగ్మతలు • ఆందోళన • వణుకు/ అసాధారణ కదలికలు • పార్కిన్సన్స్ • మెదడు కణితులు
Dr. M Paraneetharan Marimuthu
MBBS, MCh (Neurosurgery), DNB (Neurosurgery), MRCS (Ed), Fellow of MicroNeurosurgery (Japan), Fellow of European board of Neurosurgery (FEBNS), European Spine Diploma, FRCS (Surgical Neurology)
Lead Neurosurgeon - Dept. of Neurosurgery

సంప్రదించవలసిన చిరునామా: MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్
D No 20-3-129/1, తిరుమల బైపాస్ రోడ్, శివజ్యోతి నగర్, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501
తేదీ మరియు సమయం: 22 నవంబర్ 2025 శనివారం (10am - 4pm)
కన్సల్టేషన్ ఫీజు: Rs. 400/-
అపాయింట్‌మెంట్‌ల కొరకు*: +91 70953 85111 +91 70953 85333
*ముందస్తు అపాయింట్‌మెంట్ తప్పనిసరి. ఒకవేళ అవసరం అనుకుంటే, దయచేసి ఇంతకు ముందు వైద్య రికార్డులను, తీసుకుని రావలసినదిగా మనవి
Email: tic@miotinternational.com | www.miotinternational.com

(c) eenadu

దేశానికి, ప్రజలకు ఏంచేయగలమో ఆలోచించాలి

విద్యార్థులతో ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రం.. దేశం.. ప్రజల అభివృద్ధి కోసం యువత పాటుపడాలని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుప్పం పర్యటనకు విచ్చేసిన నారా భువనేశ్వరి వర్సిటీ ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. వీసీ ఆచార్య దొరస్వామి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ శ్యామల, ఉడా ఛైర్మన్ సురేష్‌బాబు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భువనేశ్వరి

ముఖాముఖి ఇలా...

✷ సామాజిక సేవల్లో విజయవంతం కావాలంటే విద్యార్థులకు మీరిచ్చే సలహా - **ఉషారాణి, బీ.కాం**

భువనేశ్వరి: సాయం చేయాలనే ఆలోచన చాలా ముఖ్యం. సమాజానికి ఏది అవసరమో మన సామర్థ్యాన్ని బట్టి రూ.100 ఇచ్చినా సంతోషమే.

✷ గ్రామీణ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలంటే మీరు వారికి ఇచ్చే సూచన. - **ఎం.నయనా, బీ.కాం**

భువనేశ్వరి: ఎక్కడి నుంచి వచ్చినా చదువుపై ఆసక్తి ఉండాలి. సెల్‌ఫోన్లను అవసరం మేరకే ఉపయోగించుకోవాలి. లక్ష్యంపై గురిపెట్టి ముందుకెళ్తే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చు.

✷ సీఎం చంద్రబాబులో మీకు నచ్చిన నాయకత్వ లక్షణాలు ఏమిటి. - **శోభన విద్యార్థిని, మల్లానూరు**

భువనేశ్వరి: చంద్రబాబు గురించి నాకంటే మీకే బాగా తెలుసు. ఆయన నాయకత్వం అంటే చాలా ఇష్టం. ఆయనను చూసి ఇంకా నేర్చుకుంటున్నా.

✷ కుటుంబ విలువలు, నాయకత్వం, సేవ ఈ మూడింటి మధ్య సమతుల్యం ఎలా సాధించారు. - **బి.అక్షిత, బి.టెక్**

భువనేశ్వరి: స్త్రీ ఓ మహాశక్తి. అదే నేను నమ్ముతా. నేను ఏదైనా పనిచేయాలంటే చివరివరకు వెళ్తా. సమయపాలన పాటిస్తా.

సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు
డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, నేంద్రగుంట(వి& పో), పాకాల(మం), తిరుపతి(జి) - 517112
వివరాలకు: 90634 38851, 80087 05935
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions – The Lloyd Group Initiative
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science, www.mits.ac.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
FM Partner: ఈ FM
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

దివ్యాంగులకు అండగా ఉంటాం

దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: దివ్యాంగులకు అండగా ఉంటామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ భరోసానిచ్చారు. స్థానిక పీవీకేఎన్ కళాశాలలో బుధవారం అలిమ్‌కో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధుల కోసం సహాయ పరికరాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. వారు అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వారికి సాయం చేయాలని అధికారులకు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులకు పరికరాల కోసం కొలతలు తీసుకుని, వివరాలను అక్కడి సిబ్బంది నమోదు చేసుకున్నారు. త్వరలో పరికరాలు అందజేస్తామని చెప్పారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కోసలనగరం పారిశ్రామికవాడ ఏర్పాటే లక్ష్యం

విజయపురం: కోసలనగరంలో పారిశ్రామివాడ ఏర్పాటు చేయడమే లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం రూ. 67 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోసలనగరంలో పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యమన్నారు. అనంతరం భూ సేకరణలో భాగంగా రైతులు, ఏపీఐఐసీ అధికారులతో కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.14 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని, పంట తోటలు ఉంటే అదనంగా చెల్లిస్తామన్నారు. ఆర్డీవో అనుపమ, ఏఎంసీ ఛైర్మన్ రాజమ్మ, ఎంఎస్‌ఎంఈ బోర్డు డైరెక్టర్ చినబాబు పాల్గొన్నారు.

కోసలనగరంలో రోడ్డు శిలాఫలకం ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

రైతుల సేవే కూటమి ధ్యేయం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: రైతుల సేవే పరమావధిగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే థామస్ అన్నారు. జీడీనెల్లూరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని 66218 మంది రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రెండో విడతగా రూ.24.06 కోట్లు వర్చువల్ విధానంలో పంపిణీ చేశారు.

రైతులకు నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్

ఆత్మహత్యలు పరిష్కారం కావు: ఎస్పీ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: సమస్యలు ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడొద్దని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కిందట నేనూ మీలాగే ఇంజినీరింగ్ విద్యార్థినని, వెనక బెంచిలో కూర్చుని ఈ స్థాయికి ఎదిగానన్నారు. ఇటీవల నగరంలో విద్యార్థుల ఆత్మహత్యలతో వారి కుటుంబాలు ఎంత బాధపడుతున్నాయో గుర్తించాలన్నారు. కాలేజీలో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశామని, సమస్యలు క్లబ్‌లో చెప్పి సాయం పొందాలన్నారు. డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

ఎస్పీ తుషార్‌డూడి

కన్నపేగు కాదంది.. అవ్వ అక్కున చేర్చుకుంది

ఈ చిత్రంలో దివ్యాంగుల మధ్య అచేతనంగా నేలపై పడుకున్న 16 ఏళ్ల యువతి పేరు సుశీల. గుడిపాల మండలం చిత్తపార.. పుట్టిన వారంలోనే కాళ్లు చేతులు పనిచేయకపోవటంతో దివ్యాంగురాలైన తన తల్లి చిన్నారిని పోషించలేనని ఆసుపత్రిలోనే ఎవరికీ చెప్పకుండా వదిలి వెళ్లిపోయింది. దీంతో సుశీల అమ్మమ్మ రాము చేరదీసి కంటికిరెప్పలా కాపాడుకుంటోంది. కనీసం ఆకలి వేస్తుందని, దప్పిక తీర్చాలని చెప్పలేదు. అవ్వ రాము, తాత ధర్మగౌడు వృద్ధులు. ఈ ముగ్గురే ఆ ఇంట్లో ఉంటున్నారు. వందశాతం దివ్యాంగురాలైన సుశీలకు ప్రస్తుతం రూ.6 వేల పింఛను అందుతోందని, రూ.15 వేల పింఛను కోసం అధికారులకు విన్నవించేందుకు మనవరాలితో కలిసి అష్టకష్టాలు పడి బుధవారం చిత్తూరుకు చేరుకుంది. పీవీకేఎన్ కళాశాల మైదానంలో దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేసేందుకు ముందస్తుగా వివరాల నమోదు చేసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది తెలియని వృద్ధురాలు మనవరాలితో వచ్చి పింఛను కోసం అధికారుల వద్దకు తిరుగుతూ కనిపించింది. ఇది పింఛను పెంచే కార్యక్రమం కాదని తెలియటంతో ఉసూరుమంది. ఆ యువతికి వీల్‌ఛైర్ అవసరమని కూడా గుర్తించలేని దీనస్థితి వారిది. చివరకు అక్కడున్న తోటి దివ్యాంగులు సుశీలకు వీల్‌ఛైర్ లేదని తెలుసుకుని దరఖాస్తు చేయించారు. **-ఈనాడు, చిత్తూరు**

అధికారుల వద్ద తమ సమస్య విన్నవిస్తున్న సుశీల అమ్మమ్మ రాము

దివ్యాంగుల మధ్య అచేతనంగా నేలపై పడుకున్న 16 ఏళ్ల దివ్యాంగ యువతి సుశీల

ప్రభుత్వ ఖాజీల నియామకం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చిత్తూరు అర్బన్ మండల పరిధిలోని పలు మసీదులకు నగరానికి చెందిన ముగ్గురు ప్రభుత్వ ఖాజీలను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సి.హెచ్.శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు నగరానికి చెందిన మౌలానా షేక్ షబ్బీర్, షేక్ షమీఉల్లా, మహమ్మద్ అలియాస్ షరీఫ్‌ను నియమించారు.

జిల్లా అంతటా వర్షం

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. తవణంపల్లె మండలంలో 21.6 మి.మీటర్లు, రొంపిచెర్ల 18.4, వెదురుకుప్పం 17.2, పెనుమూరు 15.4, యాదమరి 14.8, కార్వేటినగరం 13.6, పూతలపట్టు, పాలసముద్రం 12.4 మి.మీటర్లు కురిసింది.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

చిత్తూరు(క్రీడలు), తవణంపల్లె, న్యూస్‌టుడే: ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్(ఐబీఆర్)లో తవణంపల్లె మండలం ఈదులగొడి గ్రామానికి చెందిన అనూష, రెడ్డిజగదీష్ కుమారుడు భువన్‌రెడ్డి పేరు నమోదైంది. రెండేళ్ల వయసు ఉన్న భువన్‌రెడ్డి.. కర్ణాటక రాష్ట్రం తుముకూరులోని గురుమందిర ఆలయంలో 450 మెట్లను 28 నిమిషాల 8 సెకన్లలో అధిరోహించాడు. ఈ దృశ్యాల్ని ఐబీఆర్ సంస్థ రికార్డుల్లో నమోదు చేసింది. ఆ సంస్థ నుంచి బాలుడి తల్లిదండ్రులకు రికార్డుకు సంబంధించి ధ్రువపత్రం ఇటీవల అందింది.

భువన్‌రెడ్డి

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో బంగారం చోరీ

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానికగేటుపుత్తూరు సత్యనారాయణ కాలనీలో నివసిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రయ్య భార్యాపిల్లలతో నాలుగు రోజుల కిందట బెంగళూరు వెళ్లారు. బుధవారం ఇంటికి రాగానే.. ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంట్లో ఉన్న 40 గ్రాముల బంగారం, రెండున్నర కిలోల వెండి అపహరణకు గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శేఖర్‌రెడ్డి తెలియజేశారు

సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు 15.25 ఎకరాలు

చిత్తూరు(మిట్టూరు): పీఎంకుసుమ్‌లో భాగంగా సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు గుడిపాల మండలం నారగల్లులో 15.25 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూమిని నెడ్‌క్యాప్‌కు అప్పగించిప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉచిత అంబులెన్స్ ప్రారంభం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో అభాగ్యులను ఆదుకునేందుకు ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభించామని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ భవనంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 'మన వార్డు మన బాధ్యత' అంశంపై చర్చించారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీ ఇన్‌ఛార్జి జహీర్ అబ్బాస్, రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాన్, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆసిఫ్, కార్యదర్శి తౌఫిక్, నాయకులు చాంద్‌బాషా, అన్వర్‌బాషా, ఫయాజ్ పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లాపంచాయతీ), న్యూస్‌టుడే: అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పోటీ పరీక్ష-2026కు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో https///apstdycircle.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 27న హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, 30న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు.

OFFICE OF THE PRINICPAL
SV MEDICAL COLLEGE : TIRUPATI
Rc.No. 2444/S1/Stores/2025 Dates: 17.11.2025.

TENDER NOTIFICATION

Sealed Tenders are invited for the supply of the following items for use in the Laboratories of SV Medical College, Tirupati for a period of (Two) 2 year for 2025-2026 and 2026-2027.

S.No.	Description
1	Chemicals, KITS, Reagents and Glass Ware Etc.,

The Tender document along with list of items should obtain from this office in any working day from 10.30am to 5.00 pm on payment (TDF) of Rs. 2000/- (Rupees Two Thousand only) for each Tender form by way of Demand Draft obtained from any Nationalized Bank in favour of the Principal, SV Medical College, Tirupati.
Sale of Tender forms from : 26-11-2025 to 03-12-2025
Last date for receipt of sealed Tenders : 10-12-2025 upto 5.00pm
Opening date of Sealed Tenders : 12-12-2025 at 11.30 AM in the chambers or the Principal, SV Medical College, Tirupati.
The sealed Tenders along with Demand Draft towards EMD for Rs.30000/- (Rupees Thirty Thousand Only) drawn in favour of the Principal, SV Medical College, Tirupati and other required documents like Firm License, Income Tax returns for 3 years, GST Regn. and block list details to be submitted to this office within the stipulated time.
Note: This office is not responsible for any postal delay.
website : https://svmctpt.edu.in/
Contact No: 9849903117 **Principal, SVMC, Tirupati.**
Sd/- **Dr. G.RAVI PRABHU,** MD.,
Principal, SV Medical College, TIRUPATI.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన తమిళ విద్యార్థులు

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు తమిళ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం స్వరూప తెలిపారు. పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో.. బాలుర విభాగంలో గిరీష్(9వ తరగతి), బాలికల విభాగంలో చారులత, ఢిల్లీరాణిలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు నవంబరు 27, 28, 29న పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ గోపీకృష్ణ తెలిపారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం ఆచారి, రమేష్, కస్తూరి, రేవతి, ఉదయ, ప్రభావతి అభినందించారు.

పురుగుమందు సీసాతో రైతుల నిరసన

కార్వేటినగరం, న్యూస్‌టుడే: రెవెన్యూ అధికారులు తమ తండ్రికి సంబంధించిన భూమిని తమ పేరిట మార్పు చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని అల్లాగుంటకు చెందిన రైతులు కరుణాకర్, అశోక్‌కుమార్ తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం పురుగుమందు సీసా చేబూని నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని అన్నూరు లెక్క దాఖలా సర్వే నంబరు 294-2, 294-6, 294-5, 216-15లో 4.72ఎకరాలు తమ తండ్రి పుష్పనాథన్ పేరుతో 1976లో డీకేటీ పట్టా ఇవ్వగా అందులో మామిడి మొక్కలు పెంచామన్నారు. 2022లో రెవెన్యూ అధికారులు తమ తండ్రి పేరిట ఉన్న డీకేటీ పట్టాను అల్లాగుంటలోని డానియేల్ పేరుతో మార్పు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ నాగరాజుతో మాట్లాడగా.. గతంలో రీసర్వేలో పేరు పొరపాటున మారిందని, విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి మార్పు చేస్తామని చెప్పారు.

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

గంగాధరనెల్లూరు: చిత్తూరు-పుత్తూరు ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ఎలమరాజుపల్లె సమీపంలో ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి(55) అక్కడికక్కడే మృతిచెందాడు. బెంగళూరు నుంచి సత్యవేడు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. సుమారు 55 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ శ్రీనివాసంతి కేసు నమోదు చేశారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో ఆత్మహత్యాయత్నం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: ముక్కళత్తూరు పంచాయతీ నాశంపల్లెకు చెందిన వడ్డీ వ్యాపారి గజేంద్ర వేధింపులు తాళలేక పాడిరైతు నరసింహులు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుమార్తె వివాహానికి గజేంద్ర నుంచి.. నరసింహులు రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. దాన్ని వెంటనే చెల్లించాలని బెదిరిస్తూ నరసింహులు పాడిఆవులను మంగళవారం వడ్డీదారుడి కుటుంబీకులు తీసుకెళ్లగా ఈ విషయమై అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసుల సమక్షంలోనే నరసింహులును.. వడ్డీ వ్యాపారి కుటుంబీకులు తీవ్రంగా దుర్భాషలాడటంతో మనస్తాపానికి గురయ్యాడు. అక్కడి నుంచి ఇంటికెళ్లి ఆ అవమానం భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుర్తించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసంతి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు అడిగితే ఇవ్వలేదని హత్య

రామ్మూర్తిరెడ్డి (పాత చిత్రం)

నిందితుడు రవి

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆకలిగా ఉంది.. భోజనానికి డబ్బు ఇవ్వమని అడిగితే ఇవ్వలేదనే కోపంతో ఓ వ్యక్తిని చాకుతో గొంతులో పొడిచి హత్య చేసిన ఘటన బుధవారం పుత్తూరు మండల పరిధిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. విద్యుత్తుశాఖలో కాంట్రాక్టు పనులు చేసే రామ్మూర్తి రెడ్డి(55), భార్య మంజుల పుత్తూరు శివజ్యోతినగర్‌లో ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం భార్యకు రోటీలు తీసుకెళ్లేందుకు శిరుగురాజు పాళెం పంచాయతీ పరిధిలోని రంజిత్ దాబాకు వెళ్లి తన ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు బయల్దేరాడు. రోడ్డు పక్కన ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని వాటిని అమ్ముకుని మద్యం తాగే తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కేశవరాజుకుప్పానికి చెందిన రవి(35).. జాతీయ రహదారిలోని గొల్లపల్లి క్రాస్ రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద రామ్మూర్తిరెడ్డిని ఆపాడు. ఆకలిగా ఉంది.. భోజనానికి డబ్బు ఇవ్వమని అడగ్గా దీనిపై వారి మధ్య వాగ్వాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. నగదు ఇవ్వకపోగా దుర్భాలాడాడనే కోపంతో రవి.. సంచిలోని చాకుతో రామ్మూర్తిరెడ్డి గొంతుపై పొడవడంతో తీవ్ర రక్తస్రావమై అతడు రోడ్డుపై పడిపోయాడు. 108లో పుత్తూరుకు తరలించేలోగా మృతిచెందాడు. నిందితుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ॥. దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం॥. 8008685569.

క్యాష్ బ్యాక్ వెంచర్ 25 అం॥ల ప్లాట్. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి బంపర్ ఆఫర్ (కొన్ని ప్లాట్లు మాత్రమే కలవు). Ph: 80086 15946

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

SLN మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నందు సూళ్లూరుపేట, నాయుడుపేట బ్రాంచీలలో పనిచేయుటకు మేనేజర్లు, అకౌంటెంట్లు, సిస్టం ఆపరేటర్లు, సైట్ ఇన్‌ఛార్జులు, డ్రైవర్లు కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి. Contact: ✆ 70975 25709.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

దుస్తులు అందజేస్తున్న ఈవో పెంచల కిశోర్

పారిశుద్ధ్య కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పద్మావతి ఏజెన్సీ తరఫున పనిచేసే 190 మంది పారిశుద్ధ్య సిబ్బందికి ఈవో పెంచల కిశోర్ బుధవారం ఏకరూప దుస్తులు, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో సామాన్య, అయ్యప్ప భక్తుల రద్దీ దృష్ట్యా పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈఈ వెంకట నారాయణ, ఏఈవోలు ధనంజయ, ఎస్వీ కృష్ణారెడ్డి, పద్మావతి ఏజెన్సీ ఇన్‌ఛార్జి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో కళా నివేదనలో భాగంగా చెన్నైకి చెందిన శ్రీభారత్ కళా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. ఈవో పెంచల కిశోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, పెనుమూరు: సమస్య: పెనుమూరు-చిత్తూరు మార్గంలో మోపిరెడ్డిపల్లె బస్టాపు వద్ద విద్యుత్తు స్తంభాలకు తీగలు అల్లుకున్నాయి. ప్రమాదం జరగక ముందే తీగలు తొలగించాలి. **-స్థానికులు**

సమాధానం: సిబ్బంది సహకారంతో వెంటనే తీగలు తొలగిస్తాం. **- తులసిప్రసాద్, ఏఈ, ట్రాన్స్‌కో**

కట్టమంచి యార్డులోనే దుకాణ సముదాయం

చిత్తూరు(వ్యవసాయం): నగర అభివృద్ధి, ప్రజల సౌకర్యార్థం ఒకే ప్రాంగణంలో కట్టమంచి మార్కెట్ యార్డులో త్వరలో విశాల దుకాణాల సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నామని మార్కెట్ కమిటీ అభివృద్ధితో పాటు రైతుల అవసరాలే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ర్యూన్సీ వెంకటేష్‌యాదవ్ అధ్యక్షతన బుధవారం కమిటీ తొలి సమావేశం కమిటీ కార్యాలయంలో జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కట్టమంచి యార్డులో ఉన్న మామిడి కాయల మండీలను మంగసముద్రం మార్కెట్‌కు తరలించనున్నామన్నారు. నగరంలోని రోడ్డు, ఫుట్ పాత్‌లలోని కూరగాయల విక్రయదారులు, చర్చివీధిలోని కూరగాయల, చేపల మార్కెట్లను కట్టమంచి మార్కెట్ యార్డుకు మార్చేందుకు చర్యలు చేపట్టనున్నామన్నారు.

వసతులు కల్పించాలని వినతి

చిత్తూరు(జిల్లా పంచాయతీ): సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో వసతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు వినాయకం, బాబు, మురళి, భాస్కర్, షణ్ముగం ఉన్నారు.

ఇందిరాగాంధీ జయంతి

నగరి, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నగరిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. టవర్ క్లాక్ వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అల్లాపిచ్చై, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బాబు, చిరంజీవిరెడ్డి, మండల అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి కామరాజు, విజయపురం మండల అధ్యక్షుడు సుధాకరరాజు పాల్గొన్నారు.

శివారు.. అభివృద్ధి బేజారు

చైతన్యగిరి కాలనీకి వెళ్లే రోడ్డు

బాలంబట్టులో మురుగు నీటి కాలువ

- కనీస వసతుల కొరత
- ఏళ్ల తరబడి వెంటాడుతున్న సమస్యలు
- అవస్థల్లో విలీన గ్రామాల ప్రజలు

- 14 డివిజన్: గాజులపల్లె, ఎస్సీబీ కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, చైతన్యగిరి కాలనీ, వేలూరు రోడ్డు, అరిశెడివీధి
- 22వ డివిజన్: తేనెబండ, శ్రీనివాస నగర్, బాలంబట్టు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

'పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలు' అన్నారు జాతిపిత మహాత్మాగాంధీ. అయితే ఆ పల్లె ప్రాంతాల అభివృద్ధి నేడు ఎవరికీ పట్టడంలేదు. పుష్కర కాలం క్రితం చిత్తూరు నగర శివారుల్లోని 14 గ్రామ పంచాయతీలను నగరపాలక సంస్థలో విలీనం చేశారు. 'పేరుకే నగరపాలక సంస్థ పరిధిగా ఉన్నా. ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.. కనీస వసతులను నాటి నుంచి నేటివరకు నగరపాలక సంస్థ అక్కడ కల్పించనేలేదు.. ఫలితంగా విలీన గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. నగరపాలక సంస్థకు ఏటా వివిధ రకాల పన్నులు చెల్లిస్తున్నా తమకు కనీస వసతులు అందుబాటులో లేవని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మరోవైపు గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో ఒకట్రెండు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ, కమ్యూనిటీ భవనం, తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టినప్పటికీ నేటికీ ప్రయోజనాన్ని పొందలేని పరిస్థితి నెలకొంది. 22వ డివిజన్ పరిధిలోని బాలంబట్టులోని వీధుల్లో ఎగుడుదిగుడుగా ఉన్న మట్టిరోడ్లపై వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. నివాసాల ఎదుట మురుగునీటి నిల్వ కారణంగా దోమలు, దుర్వాసనతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. దీనికి తోడు దోమకాటుతో పిల్లలకు జ్వరాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక 14వ డివిజన్‌లోని చైతన్యగిరి కాలనీలో డ్రైనేజీ కాలువ సదుపాయం లేక కాలనీ వాసులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరణ కోసం సక్రమంగా రావడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు ఉన్నా అవి అలంకారప్రాయమేనని చెబుతున్నారు. ఇలా అడుగడుగునా సమస్యలతో సతమతమవుతున్నామని వారు కన్నీటిపర్యంతమవుతున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అవి ఆచరణకు నోచుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

మా గ్రామంలో డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలి. రహదారులు సక్రమంగా లేవు. ఎగుడు దిగుడుగా ఉన్న మట్టిరోడ్లపైనే కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఫలితంగా నానా తంటాలు పడుతున్నాం. ఇక అత్యవసర సమయాల్లో గమ్యం చేరుకోవడం కష్టతరంగా ఉంటోంది.

- కుమార్, శ్రీనివాసనగర్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వెదురుకుప్పం: విద్యుదీకరణ పనుల నేపథ్యంలో వెదురుకుప్పం విద్యుత్తు ఉపకేంద్ర పరిధిలోని బ్రాహ్మణపల్లె, గుండుపల్లె ఫీడర్ల ద్వారా జరిగే 24 గంటల సరఫరాకు మూడ్రోజులు అంతరాయం కలగనుందని ఏఈ రియాజ్ అహ్మద్ బుధవారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం కలుగుతుందని, ఈ విషయంలో వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

మొగిలీశ్వరస్వామి ఆలయానికి జనరేటర్ ఏర్పాటు

బంగారుపాళ్యం : మొగిలీశ్వరస్వామి ఆలయానికి జనరేటర్ ఏర్పాటు చేశారని ఆలయ సిబ్బంది తెలిపారు. బెంగళూరు, చెన్నై ఆరు వరుసల రోడ్డు ఏర్పాటులో భాగంగా బలిజపల్లె వద్ద ఫ్లైవంతెన పనులతో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారుపాళ్యానికి చెందిన తెదేపా నాయకుడు మాధవ నాయుడు.. విద్యుత్తు శాఖ ఏఈ ప్రసన్నకు చెప్పగా ఆమె వెంటనే హైవే పనులు చేయిస్తున్న వారితో జనరేటర్ ఏర్పాటు చేయించారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
O.E.P.NO. 48 OF 2024 in O.S.NO. 162 OF 2016

Between
S. Raveendra Reddy ...D.Hr.
And:
1) D. Dowlath Basha,
2) Smt. K. Beejahan Baa @ K. Beejahan Bee ... J.Drs.

NOTICES TO THE JUDGEMENT DEBTORS 1 AND 2
1) D. Dowlath Basha,
Son of D.Rasool Sahib,
2) Smt. K Beejahan Baa @ K.Beejahan Bee
W/o D. Dowlath Basha,
Both are r/at Jodichinthala village, Dasarapalli panchayath, Gollapalli post, Yadamari mandal, Chittoor District A.P.
Sir/Madam,
Please take notice that the above E.P.No. 48 of 2024 in O.S.No. 162 of 2016 is posted to **04-12-2025** for your appearance before the said court. Please be present on the said date before the said court at **10-30 A.M.** either in person or through an Advocate and to raise objections if any, failing which the matter will be decided in your absence as ex-parte.
Hearing date: 04-12-2025

G.CHENNAKESAVULU NAIDU
Advocate,Chittoor,Cell:8341500024

బహుమతులు అందజేసిన వేదవ్యాస విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల హెచ్ఎం మంజుల

కల్యాణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేసిన హెచ్ఎం ఆనందబాబు

ప్రతిభ చూపి.. బహుమతులు సాధించి

పుత్తూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అంశంపై పట్టణంలోని వేదవ్యాస విద్యానికేతన్ ఆంగ్లమాధ్యమ పాఠశాల, కల్యాణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపన్యాస పోటీ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో యోహితాకృష్ణ, షాలిని, మహేష్, దీక్షిత, చంద్రశేఖర్, రాహుల్ నిలిచారు. వీరికి హెచ్ఎంలు మంజుల, ఆనందబాబు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శంకర్‌కుమార్, సంతోష్‌కుమార్, బాలాజీ, మునెమ్మ, రామకృష్ణయ్య, కాంచన, శ్రీలేఖ, నీరజ పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించండి

గంగాధరనెల్లూరు: అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ అఖిలపక్ష నేతలను కోరారు. బుధవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో వారితో సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దారు శ్రీనివాసులు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు.

ఘనంగా పురుషుల దినోత్సవం

యాదమరి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని బుధవారం కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్.ఎం లలిత ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు 17 మంది ఉపాధ్యాయులను సత్కరించి నూతన వస్త్రాలు, స్వీట్లు బహుమతిగా ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్నేహపూర్వక వాతావరణంలో పిల్లలకు చక్కని విద్యాబోధన జరుగుతుందని పేర్కొన్నారు.

తీగలపై తోరణంలా..

ఒకప్పుడు తాటిచెట్లు, కొబ్బరిచెట్లపై వేలాడే గిజిగాడి పిచ్చుక గూళ్లు కరెంటు తీగలపై పదుల సంఖ్యలో వరుస క్రమంలో కట్టి వేలాడుతూ చూపరులను ఆకట్టుకుంటుంది. అగరంపేట మార్గంలో ఓ రైతుకు చెందిన చెరకు తోటపై ఉన్న కరెంటు తీగలపై ఇలా వేలాడుతూ చూపరులను ఆకట్టుకుంటోంది. తమ పిల్లలకు ఎలాంటి హాని కలగకుండా గూళ్లను వరుస క్రమంలో కట్టింది. **- న్యూస్‌టుడే, నింద్ర**

నగరి: గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓలు

మహిళా సాధికారతతోనే ఆర్థికాభివృద్ధి

పుత్తూరు, న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని శాఖ గ్రంథాలయాధికారిణి మీనాకుమారి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని మరింత ఎదగాలన్నారు. సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** స్థానిక గ్రంథాలయానికి కరుణీకర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘ గౌరవాధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు షణ్ముగం పిళ్లై కథల పుస్తకాలు వితరణగా అందజేశారు. గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. **నగరి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశామని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, గ్రంథాలయాధికారి గురుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు: మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

చిత్తూరు(వ్యవసాయం): కూటమి ప్రభుత్వంతో అంతా మంచి జరుగుతోందని ఎమ్మెల్యే జగన్మోహన్ పేర్కొన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన' నిధులు రైతుల ఖాతాలకు జమ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల నుంచి త్వరలో కచ్చితంగా మామిడి బకాయిలు రైతులకు ఇప్పిస్తామన్నారు. నియోజకవర్గంలో 20,326 మంది రైతులకు రూ.7.46 కోట్ల అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మెగా చెక్కు రైతులకు అందజేశారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయరు రాజేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు చంద్రప్రకాష్, సురేంద్రకుమార్, సుబ్బానాయుడు, రఘు, మోహన్‌రాజ్, అట్లూరి శ్రీనివాసులు, చిట్టిబాబు, ప్రతాప్‌నాయుడు, బాలాజీనాయుడు, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ రమేష్‌నాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ర్యూన్సీ, ఏడీఏ ఉమ, ఏవోలు వేణుగోపాల్, సంగీత పాల్గొన్నారు. **యాదమరి, బంగారుపాళ్యం:** అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.22.65 కోట్ల అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధి నమూనా చెక్కును ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రైతులకు అందజేశారు. రాత్రి బంగారుపాళ్యం మండలం నల్లసిద్ధనపల్లెలో అయ్యప్పస్వామి అంబళ్ల పూజలో పాల్గొన్నారు. తెదేపా అధ్యక్షులు ధరణి, మురార్జీ యాదవ్, హరిబాబునాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ మణినాయుడు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ చిత్ర పాల్గొన్నారు. **పుత్తూరు:** నియోజకవర్గంలో 20,063 మంది రైతుల ఖాతాల్లోకి రూ.13.29 కోట్లు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మెగా చెక్కు రైతులకు అందజేశారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్, మాజీ ఎంపీపీ ఏలుమలై, వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షుడు గాలి జీవరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ఏడీఏ లక్ష్మీదేవి, ఏవోలు కోదండయ్య, విజయ్‌కుమార్, రజనీ, తులసీరామ్ పాల్గొన్నారు.



యాదమరి: అన్నదాత సుఖీభవ నమూనా చెక్కు రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్



పుత్తూరులో రైతులతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ఎల్.బి.ఐ. లోకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: తెలుగుయువత నాయకుడు ఎల్.బి.ఐ. లోకేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం నగరంలో ఘనంగా జరిగాయి. మురకంబట్టులో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహ కూడలి నుంచి మురకంబట్టు వరకు వాహనాల్లో ర్యాలీ నిర్వహించారు. జీజేఎం ట్రస్టు, ఎల్‌బీఐ అభయసాయి ట్రస్టు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మినరల్ నీటి ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మేయర్ అముద, ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎమ్మెల్యే జగన్మోహన్, లోకేష్‌రెడ్డి

హెచ్చరిక నోటీసు

ఇందుమూలంగా యావత్ ప్రజానీకానికి తెలియజేయడమేమనగా:

నా కక్షిదారులు అయిన శ్రీమతి సిగమని సునీత గారు క్రింద తెలిపిన షెడ్యూల్ ఆస్తిని గురించి వారి అమ్మ గారు అయిన (1) శ్రీమతి T.H. వైడూర్యం W/o లేట్ A. సిగమని, వారి తమ్ముడు అయిన (2) S. సుశీల్ కుమార్ S/o Late A. సిగమని మరియు సదరు కుమారుడు అయిన (3) S. రాహూల్ వారిపైన సునీత గారికి రావలసిన భాగాపారపు ఆస్తి గురించి IX అదనపు జిల్లా జడ్జి ఆఫ్ చిత్తూరు కోర్టులో కేసు నంబర్ O.S.No. 8 of 2021 దాఖలు చేసివున్నారు. పైన తెలిపిన IX అదనపు జిల్లా జడ్జి ఆఫ్ చిత్తూరు కోర్టులో పెండింగ్‌లో ఉంది ఈ దావాలో కనపరిచిన ప్రతివాదులు ఇతరులతో కుమ్మక్కై తప్పుడు రికార్డులు తయారు చేయాలని ప్రయత్నం చేస్తున్నట్లు నాకు తెలిసింది. సదరు ఆస్తి గురించి ఎవరైన ఎలాంటి లావాదేవీలు చేసిన అవి చెల్లనేరవు. కావున యావన్మందికి తెలియజేయడం అయినది.

A-SCHEDULE

Chittoor District–Chittoor Sub District–Chittoor Mandal–Chittoor Municipality–No.72 Chittoor Majara–Janakarapalli–S. No. 226- Vacant site

Within the following boundaries: East: Site of Jayakumar, Yuvaraj, Murali Mohan valli, West: House of Ester and Muniraj, North :Nagalamma temple, South: House of Suguna and Devadas, In this East to West: 18ft North to South: 50 ft

B-SCHEDULE

Item No.1

Chittoor District –Chittoor Sub District–Chittoor Mandal–Chittoor Municipality – No. 72 Chittoor Majara – Janakarapalli-S.No. 223/7 Ac. 0.86 cents in the an extent of Ac. 0.12 cents–in this terraced houses bearing D. Nos, 27-287 and 288.

Within the following boundaries: East: Janakarapalli Road, West: House site of Jamilabi, North: Pothambattu Road, South: Vacant site of Habbibunnisa, In this East to West : 60 ft North to South : 23 ft

Item No.2

Chittoor District–Chittoor Sub District–Chittoor Mandal–Chittoor Municipality–No. 72 Chittoor Majara– Janakarapalli- S.No. 223/7 Ac. 0.86 cents in the an extent of Ac. 0.12 cents–in this School bearing D.Nos, 27-286 and Vacant Site.

Within the following boundaries: East: Janakarapalli Road, West: House site of B.V. Reddy, North: Site of S. Habbibunnissa, South : Vacant site of Sigamani, In this East to West: 114 ft North to South : 30 ft. In this East to West: 55ft North to South: 17 ft School.

Item No.3

Chittoor District–Chittoor Sub District–Chittoor Mandal–Chittoor Municipality–No.72 Chittoor Majara– Janakarapalli - S.No. 223/7 Ac. 0.86 cents in the an extent of Ac. 0.12 cents – in this Vacant Site.

Within the following boundaries: East: Janakarapalli Road, West: House site of B.V. Reddy, North:Site of Sigamani, South: Vacant site of Munirathnam, In this East to West : 114 ft North to South : 30 ft

Item No.4

Chittoor District – Chittoor Sub District – Chittoor Mandal – Chittoor Municipality–No.72 Chittoor Majara – Janakarapalli - S.No. 223/7 Ac. 0.86 cents in the an extent of Ac. 0.12 cents – in this Vacant Site.

Within the following boundaries: East: Janakarapalli Road, West: House site of Jamilabi, North : House Site of Sigamani, South: House site of Sigamani, In this East to West : 60 ft North to South : 22ft

Item No.5

Chittoor District– Palamaner Sub District– Palamaner Mandal – Pathapeta- R.K. Street–D.No.11-367AB-in this two storage Building.

Within the following boundaries: East: House of Akbar Basha, West: House of Kuppamma, North: 4 ft Kalva, South : Road, In this East to West : 23 ft North to South : 38 ft

C-SCHEDULE

Item No.1

Chittoor District–Chittoor Sub District–Chittoor Mandal–Chittoor Municipality–No.72, Chittoor Majara–Janakarapalli - S.No.213/2 Ac. 2.75 cents in the an extent of Ac. 0.12 cents – Vacant Site.

Within the following boundaries: East: Land of S. Venkatesan @ Sundaresan, West: Land of Gurrappa setti, North: Land of Selvanadhan, South: Pothambattu Road.

Item No.2

Chittoor District–Chittoor Sub District–Chittoor Mandal – Chittoor Municipality–No.72 Chittoor Majara – Janakarapalli - S.No. 213/2 Ac. 2.75 cents in the an extent of Ac. 0.14 cents – Vacant Site.

Within the following boundaries: East: Sandhu dari of Selvanadhan, West: Land of Gurrappa setti, North: Land of Selvanadhan, South: Land of T.H. Vaiduryam

Sd/- (**M. Chandrasekhar,** Advocate, Chittoor)

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ పరిశీలన.. చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: మైసూరులోని ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్ బుధవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో సీనియర్ శాస్త్రవేత్త వినోద్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్స్, బ్లాక్ తయారీ అంశాలపై అవగాహన పొందారు. నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టనున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు.

ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల పనితీరు తనిఖీ.. పుత్తూరు: జిల్లాలో ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల పనితీరును తనిఖీ చేస్తున్నట్లు తిరుపతి జిల్లా సీపీవో రాజశేఖర్ పేర్కొన్నారు. పుత్తూరు విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రంను బుధవారం తనిఖీ చేశారు. ఏఎస్‌వోలు మునికృష్ణయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నగరి: డివిజన్ పరిధిలో రైతులు రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో అనుపమ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎంగా నమోదైనవారు పరస్పర అంగీకారంతో భూముల విస్తీర్ణం, సబ్ డివిజన్ చేసుకోవడానికి రీసర్వే ఒక అవకాశమని పేర్కొన్నారు

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

యాదమరి, న్యూస్‌టుడే: నూజివీడులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే ఎస్.జి.ఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలకు పీఈఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల పలమనేరులో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 12 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా.. పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన చేతన్, లలిత్ కల్యాణ్, కృతిన్ ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపల్ వై.వి.కృష్ణబాబు అభినందించారు.

పీఈటీ అరవింద్‌తో ఎంపికైన విద్యార్థులు

రెవెన్యూ చట్టాలపై అవగాహనకు శిక్షణ కలెక్టర్

పుత్తూరు, న్యూస్‌టుడే: శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువంశీ.. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. రెవెన్యూ అంశాలపై ఆయన ఇక్కడ శిక్షణ పొందనున్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లుతో డీకేటీ, అనాధీనం, అనాధీన పుంజ, చెరువు పోరంబోకు భూములు, 22(ఏ) భూములకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి ఆరా తీశారు. తహసీల్దార్‌గా నెల రోజులు శిక్షణ పొందనున్నారు. తదుపరి వీఆర్వో జయపాల్‌తో పాటు ఆ రెవెన్యూ పరిధిలో పర్యటించి రికార్డులు పరిశీలించారు.

ప్రత్యామ్నాయ దారి ఏర్పాటుకు నిరసన

పుత్తూరు: పట్టణ పరిధిలోని ఒంటిమిట్టకు.. రైల్వేశాఖ అధికారులు ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేసి వంతెన మరమ్మతులు చేపట్టాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. రైల్వే లెవల్ క్రాస్ వద్ద బుధవారం నిరసన తెలియజేసి ఆపై మాట్లాడారు. ఎల్‌సీ నంబరు 60 రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద కింద వంతెన ద్వారా రాకపోకలు సాగిస్తున్నామన్నారు. అయితే వంతెన వద్ద మరమ్మతులు చేపట్టాలని సామగ్రి తెచ్చారని, ఆయా పనులు చేపడితే గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందులేనన్నారు. గ్రామంలో 85-90 వయస్సు ఉన్నవారు 15 మంది ఉన్నారని, రెండ్రోజుల కోసారి వారు ఆస్పత్రికి వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదన్నారు. ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవని, ప్రత్యామ్నాయం చూపాకనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

తవణంపల్లె, న్యూస్‌టుడే: తెదేపా కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ రెండో విడతగా రైతుల ఖాతాల్లో రూ.7వేలు నగదు జమ చేసినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ తెలిపారు. జొన్నగొరకుల సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తెదేపా నాయకులు మధుకుమార్, జయపాల్, షబ్బీర్ రామచంద్ర పాల్గొన్నారు. ● **యాదమరి:** మండలంలో 600 మంది రైతులకు వివిధ కారణాలతో అన్నదాత సుఖీభవ పథకం అందడం లేదని పలువురు రైతులు ఎమ్మెల్యే మురళీమోహన్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే.. ఎంపీడీవో వీరేంద్ర, తహసీల్దారు పార్థసారథి, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి అర్హులందరికీ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చిత్రపటాల వద్ద కూటమి నాయకులు, రైతులు

హేమలతను సత్కరిస్తున్న కార్యదర్శి శర్మ

మహిళలు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: మహిళలు అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు వివిధ ఉద్యోగాలకు నిర్వహించే పోటీపరీక్షల పుస్తకాలు తప్పక చదవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, కళాశాల నిర్వాహకులు శైలజ, అతిథులు అరుణకుమారి, విమల, లక్ష్మి, పూర్వాణి, ఉప గ్రంథాలయాధికారి గజేంద్రబాబు, విశ్రాంత అధికారులు లలిత, మధుబాబు, పూర్ణిమ, సుల్తానాభాను, సరస్వతి, దేవీబాల, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగ నరసింహస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

పాలసముద్రం: ఏటా సంప్రదాయంగా తితిదే నుంచి షోళింగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పట్టువస్త్రాలు భక్తితో సమర్పించడం గొప్ప వరమని బెంగళూరు ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థ అధినేత రమేష్‌రాజు, ఆలయ ఛైర్మన్ రవిరాజు పేర్కొన్నారు. బుధవారం మండల సరిహద్దు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన షోళింగర్ యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తితిదే ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు అందజేశారు. తితిదే ఏఈవో గోపాల్‌నాయక్‌ను రమేష్‌రాజు, నందన హోటల్ ఛైర్మన్ రవిరాజు ఘనంగా సత్కరించారు. తితిదే ఆధ్వర్యంలో పాలసముద్రం మండలంలోని ఆలయాలు, కల్యాణ మండపాలను అభివృద్ధి చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించి మండల అభివృద్ధి విషయంపై ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తమన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

పాలసముద్రం: ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు క్లోరినేషన్ పైపుల ఏర్పాట్లు ఆయన స్వయంగా పరిశీలించారు.

పనులు కల్పించని సిబ్బందిపై చర్యలు

నింద్ర: ఉపాధి కూలీలకు పనులు కల్పించకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ రవికుమార్ హెచ్చరించారు. స్థానిక డీఎల్‌డీవో కార్యాలయావరణలో బుధవారం ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. ఏపీవో చంద్రశేఖర్, ఈసీ శ్రీధర్, సాంకేతిక సహాయకులు మోహన్, సుశీల, ఏసుదాసు, సీవోలు గిరీష్, సుధాకర్ పాల్గొన్నారు.



పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు గ్రామీణ: స్థానిక ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రికల్ వాహన సర్వీసు(3 నెలలు) కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి బుధవారం తెలిపారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చేసి 16-35 ఏళ్ల వారు అర్హులన్నారు. వివరాలకు 94940 80339 సంప్రదించాలన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ.. కుప్పం పట్టణం: వినికిడి సమస్య లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం దీన్ దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి యంత్రాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం వినికిడి యంత్రాల పంపిణీ కోసం నమోదు నిర్వహించారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి.. పలమనేరు: అన్నివర్గాల వారు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వాలు ఆశిస్తున్నాయని కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఆరోగ్యవంతమైన మహిళలు-బలమైన కుటుంబాలు అనే నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు.

సమస్య పరిష్కారం

పలమనేరు: కరిడిమడుగు, కూర్మాయి గ్రామాల్లో మురుగు కాలువల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. బుధవారం ఎంపీపీ రోజా అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో రూ.10 లక్షలతో పనులు దాదాపు పూర్తి చేసినట్లు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: పత్రపల్లెలో రక్షిత మంచినీటి ట్యాంకు శుభ్రం చేయాలి. **- మంజునాథ్, పత్రపల్లెతండా**

సమాధానం: గ్రామంలోని ట్యాంకును శుభ్రం చేయిస్తాం. **- నరసింహులు, కార్యదర్శి**

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని సుందరయ్యవీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన ప్రబలుతోంది. **- సురేష్**

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

సోమల, న్యూస్‌టుడే: సమస్య: తుగడంవారిపల్లె మార్గంలో గ్రామానికి నీరు సరఫరా అయ్యే బోరు పైపు నుంచి నీరు లీకవుతోంది. **- స్థానికులు**

సమాధానం: పరిశీలించి మరమ్మతు చేస్తాం. **- మునికుమార్, కార్యదర్శి**

మద్దనపల్లెలో పారిశుద్ధ్య చర్యలు

పుంగనూరు గ్రామీణ: మద్దనపల్లె గ్రామంలో మురుగు కాలువలను కార్యదర్శి ముజీబ్‌హుసేన్ పారిశుద్ధ్య కార్మికుల చేత కాలువలు శుభ్రం చేయించారు. ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో సమస్యపై వార్త రావడంతో అధికారులు ఆ మేరకు స్పందించారు.

స్పందనకు వందనం

మహిళలు స్వశక్తితో జీవించాలి

కుప్పం గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు వారి కాళ్లపై వారు నిలబడి స్వశక్తితో జీవించాలని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఎమినో హౌస్‌లో బుధవారం అలీప్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళా పారిశ్రామికవేత్తలతో ఆమె సమావేశమయ్యారు. అలీప్ సంస్థ వ్యవస్థాపకురాలు రమాదేవి నారా భువనేశ్వరికి చిత్రపటాన్ని బహూకరించారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో నారా భువనేశ్వరి

గుడుపల్లె, కుప్పం, రామకుప్పం, న్యూస్‌టుడే: నారా భువనేశ్వరి బుధవారం కుప్పంలో పర్యటన సందర్భంగా.. ఆమెకు తెదేపా నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ద్రవిడ వర్సిటీలో పర్యటన అనంతరం.. సాయంత్రం గుడుపల్లె మండలంలోని మల్లప్ప కొండకు చేరుకుని కార్తిక దీపారాధన పూజల్లో పాల్గొని మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

హారతి తీసుకుంటున్న నారా భువనేశ్వరి

విస్తరణ ప్రాంత వెతలు తీరేనా..?

☛ మౌలిక వసతులకు ప్రజలు ఎదురుచూపులు
☛ పట్టించుకోని అధికారులు

కుప్పం పట్టణం, పుంగనూరు, పలమనేరు, న్యూస్‌టుడే: పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకుంటున్న పురపాలికల్లో ప్రజలకు అవసరమైన వసతుల కల్పన ఎండమావులుగానే కన్పిస్తున్నాయి. పంచాయతీల నుంచి పురపాలికలుగా ఏర్పాటు చేస్తున్నా అభివృద్ధి పనుల విషయంలో ఆ స్థాయిలో అధికారులు స్పందించడంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. పంచాయతీలో కంటే పురపాలికలోకి చేరితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశ పడే ప్రజల అడియాశలవుతున్నాయి. కనీస వసతులు మెరుగుపడక ప్రజల అవస్థలు వర్ణనాతీతం.

పుంగనూరులో సిమెంటు రోడ్డుకు నోచుకోని చింతలవీధి

రోడ్లు.. కాలువలు లేవు

పుంగనూరులోని హిదాయత్ నగర్, భగత్‌సింగ్ కాలనీ, డిగ్రీ కళాశాల వెనుక, ఎన్జీవో కాలనీ, ప్రశాంత్ నగర్, చింతలవీధి, నక్కబండ వంటి ప్రాంతాలు విస్తరించాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఈ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఏర్పరచుకుంటున్నారు. దీంతో రోడ్లు, కాలువలు, తాగునీటి పైపు లైన్లు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సి ఉంది.

పలమనేరులో..

పలమనేరు పురపాలిక విస్తీర్ణం 17.76చ.కి.మీ. విస్తరణ ప్రాంతాలైన షికారీ కాలనీ, గడ్డూరు కాలనీ, కురప్పల్లె, గొబ్బిళ్ల కోటూరు ప్రాంతాల్లో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, కాలువలు, వీధిదీపాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం బురదమయం, వేసవి కాలం దుమ్ముధూళి. తాగునీటికి ఇబ్బందులే. కాలువలు లేక మురుగు నిల్వలు దర్శనమిస్తున్నాయి. ఈ వసతులను పూర్తిస్థాయిలో కల్పిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కుప్పం పురపాలికలో..

కుప్పం పురపాలక సంఘం వివిధ పంచాయతీల పరిధిలోని గ్రామాలతో కొత్తగా ఏర్పాటైంది. సుమారు 34.55చ.కి.మీ. విస్తరించింది. పంచాయతీల్లో ఉన్న సమస్యల్లో సింహభాగం నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. మున్సిపాలిటీ అయితే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్న ప్రజలు ఆశలు నెరవేరడంలేదని విమర్శలు విన్పిస్తున్నాయి. వంద కిలోమీటర్ల వరకు తారురోడ్లు, సిమెంటు రోడ్లు ఉన్నా 50 కి.మీ. మేర మట్టిరోడ్లే. చీగలపల్లె, నారాయణపురం, మోడల్‌కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, మునస్వామిపురం, పరమసముద్రం, బేవనపల్లె, చీలేపల్లె, షికారీ కాలనీ ప్రాంతాల్లో పైపులైన్లు, కాలువలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం

పురపాలికలో ప్రజలకు తాగునీరు, రోడ్లు, కాలువలు, వీధిదీపాలు వంటి వసతులు పూర్తిస్థాయిలో కల్పించడానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు విడుదల కానున్నాయి. త్వరితగతిన వసతులు సమకూరుస్తాం. **- మధుసూదనరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరావు, కమిషనర్లు పుంగనూరు, పలమనేరు, కుప్పం**

బహుమతి అందుకుంటున్న సంఘమిత్ర

మహిళలకు ముగ్గుల పోటీలు

చౌడేపల్లె: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో సంఘమిత్రలు పోటీపడ్డారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన సంఘమిత్రలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి సోమశేఖర్, ఏపీఎం సుబ్రహ్మణ్యం, సీసీలు రమేష్, సుగుణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.. పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లాలని ప్రిన్సిపల్ వెంకటేశులు సూచించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా శిక్షణ కలెక్టర్ నరేంద్రపాడల్ బోయకొండ గంగమ్మను బుధవారం దర్శించుకున్నారు. డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కరుణ కుమారి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈవో ఏకాంబరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ట్రైనీ కలెక్టర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని ఇస్తున్న ఈవో

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న సంస్థ సీఈవో డా.షైలా తల్లూరి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాలలో కడా, పీపుల్ ఫర్ అర్బన్, రూరల్ ఎడ్యుకేషన్(ప్యూర్) సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కెరీర్, ఉపాధి శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై సంస్థ సీఈవో డా.షైలా తల్లూరి విద్యార్థులకు అవగాహన కల్పించారు. 12 దేశాల్లో తమ సంస్థ యువత, మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు.

కూటమితోనే రైతులకు భరోసా

రామకుప్పం, న్యూస్‌టుడే: కూటమితోనే రైతులకు భరోసా దక్కుతోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తెదేపా మండల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

షాదీమహల్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక షాదీ మహల్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. పాలకవర్గ ఛైర్మన్‌గా సర్దార్ బాషా, సభ్యులుగా అబ్దుల్ గఫార్, ఫరూక్, మహద్దర్, షనాజ్‌తో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా ఛైర్మన్ డా.సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

శిబిరం విజయవంతం చేయండి

అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని

సదుం, న్యూస్‌టుడే: ఈ నెల 23న నిర్వహించే ప్రత్యేక ప్రతిభావంతుల పరికరాల ఎంపిక శిబిరాన్ని విజయవంతం చేయాలని పలమనేరు ఆర్డీవో భవాని తెలిపారు. బుధవారం సదుం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆర్డీవో భవాని పరిశీలించారు. శిబిరానికి హాజరయ్యే ప్రత్యేక ప్రతిభావంతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దారు ప్రమీల, ఎంఈవో దామోదర్, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు పాల్గొన్నారు.

బహుమతులు సాధించారు..!

▸ విజేతలతో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ▸ బహుమతులు సాధించిన కేజీబీవీ విద్యార్థులు

పలమనేరు, న్యూస్‌టుడే: గంగవరం మండలంలోని ప్రభుత్వ కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. బుధవారం చేపట్టిన పోటీలో 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అంశంపై వక్తృత్వ పోటీలో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సోనియా, కుల్‌సుమ్ ఫాతిమా(10వ తరగతి), 8వ తరగతి విద్యార్థి భవ్యశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. అలాగే కేజీబీవీ పాఠశాలకు చెందిన అమృతవర్షిణి, నందిని(9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, పూర్ణిమ(10వ తరగతి) తృతీయ బహుమతులు పొందారు.

జిల్లాస్థాయిలో విద్యార్థి ప్రతిభ

మహేష్

కల్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కల్లూరు హైస్కూల్ విద్యార్థి మహేష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, రెడ్డిప్రవీణ తెలిపారు. బీఎన్‌కండ్రిగలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థి మహేష్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జ్యోతిప్రసాద్ నాయక్

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పూజగానిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.జ్యోతిప్రసాద్ నాయక్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఉమాదేవి బుధవారం తెలిపారు. ఈ నెల 18న చౌడేపల్లె పుదిపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు కబడ్డీ సెలక్షన్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎం బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏనుగు జాడకోసమీ కాపలా..!

పంటలు పండించడం ఒక కష్టమైతే.. దాన్ని కాపాడుకోవడం అన్నదాతలకు మరింత కష్టతరంగా మారింది. మండలంలోని చెత్తపెంట గ్రామం కాలోపల్లె అడవికి అత్యంత సమీపంలో ఉంటుంది. ఇక్కడ రకరకాల పంటలను పండిస్తుంటారు. ఇక్కడ ఏనుగులు, అడవి పందులు దాడులూ అధికమే. పంటకు కాపలా ఉన్న సమయంలో నేల మీద ఉంటే ఏనుగుల తొక్కి ప్రాణాలు తీస్తాయని భయపడి చెట్ల మీద మంచె ఏర్పాటు చేసుకుని రైతన్నలు ఇలా కాపలా కాస్తున్నారు. **- న్యూస్‌టుడే, పలమనేరు**



డిజిటల్ లైబ్రరీ పిల్లర్లకే పరిమితం

నెల్లిపట్లలో వైకాపా ప్రభుత్వంలో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ పిల్లర్లకే పరిమితమైంది. భవన నిర్మాణం చేపట్టిన గుత్తేదారుకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పిల్లర్ల దశలోనే నిర్మాణ పనులు ఆగిపోయాయి. భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన పిల్లర్లకు పిచ్చిమొక్కల తీగలు అల్లుకుపోయాయి. ఇనుప కమ్మీలు వానకు తడిసి. . ఎండకు ఎండుతూ తప్పు పడుతున్నాయి. ప్రభుత్వ ఆశయం నెరవేరకపోగా నిధులు నిరుపయోగమయ్యాయి. **- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె**

గుంతలు.. ప్రయాణికుల వెతలు

మండలంలోని పుంగనూరు-మేలుందొడ్డి రోడ్డుపై అడుగుకో గుంత ఉండటంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పరిసర ప్రాంత ప్రజలు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో గుంతలు ఉన్నాయనే అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు చేపడుతామని తెలిపారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

ఆహ్లాదం మాటున ప్రమాదం

చుట్టూ పచ్చని చెట్లు, కొండలు, గుట్టల నడుమ ఉన్న ఈ క్వారీ గుంత చూడటానికి అందంగా ఉన్నా.. ప్రమాదం దాగుంది. చౌడేపల్లెలోని తిరుపతి-పుంగనూరు ప్రధాన రహదారి అంకాలమ్మ కొండలో క్వారీ తవ్వకాలతో ఏర్పడిన ఈ గుంత ఇటీవల వర్షాలకు నిండింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి యువకులు ఇక్కడికి వస్తుంటారు. కొందరు ఈత కూడా కొడుతుంటారు. అయితే ఇక్కడ లోతు ఎక్కువగా ఉందని తెలిపే ప్రమాద సూచికలు లేకపోవడం గమనార్హం. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారిణి లక్ష్మి

బైరెడ్డిపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా కార్యాలయానికి అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజులు.. వందశాతం ఉత్తీర్ణత

పుంగనూరు, న్యూస్‌టుడే: ఈ విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. నమూనా ప్రశ్నాపత్రాలతో సాధనతో పాటు విద్యార్థులకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అక్టోబరు నుంచి ప్రారంభమైన ఈ ప్రత్యేక తరగతులు మార్చి నెల రెండో వారం వరకు కొనసాగుతాయి. పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు పట్టణ, గ్రామీణ, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 50 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 2,414 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం ప్రకటించడంతో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు పునశ్చరణ నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా...

మండలం	ఉన్నత పాఠశాలలు	పదో తరగతి విద్యార్థుల సంఖ్య
పుంగనూరు	18	970
చౌడేపల్లె	10	424
సోమల	5	339
సదుం	5	245
పులిచెర్ల	5	292
రొంపిచెర్ల	8	292

మేలుపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతులు

మార్గదర్శకాలు ఇవీ

■ విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా ఎ.బీ.సీ.డీ గ్రేడ్లుగా విభజన ■ వెనుకబడిన వారిని సైతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయుల కృషి. ■ పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం. ■ అదనపు తరగతుల నిర్వహణ. ■ వార్షిక పరీక్షల తరహాలో నమూనా పరీక్షలు నిర్వహించి వారిలో భయాన్ని పోగొట్టడం.

ఉపాధ్యాయులపై పెరిగిన బాధ్యత

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు సంబంధించి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులపై బాధ్యత పెరిగింది. విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తున్నాం. **- సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు, మేలుపట్ల పురపాలక ఉన్నత పాఠశాల, పుంగనూరు**

పూర్వ విద్యార్థులకు ఘన సత్కారం

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల హైస్కూల్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని.. విద్యాభివృద్ధికి దివంగత బీవీరెడ్డి కుటుంబీకులు చేస్తున్న సహకారం మరువలేనిదని 1964-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తిరువెంగళంపిళ్లై, రెడ్డప్పనాయుడు, రమాదేవి, కృష్ణవేణి పేర్కొన్నారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు రూ.6.25లక్షలతో నిర్మించిన ప్రార్థన, సమావేశ మందిరాన్ని మాజీ ఎంపీపీ వారణాసి మధుసూదన్‌రెడ్డి సతీమణి సౌమినిరెడ్డి ప్రారంభించారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు, పూర్వ విద్యార్థులు పార్వతమ్మ, భాస్కరనాయుడు, చంద్రారెడ్డి, రామనాథం, ఎస్‌ఏ కరీమ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్థివ లింగ పూజలు

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ కోనేరులో బుధవారం పార్థివ లింగ పూజలను వైభవంగా నిర్వహించారు. కార్తికమాసం అమావాస్య కావడంతో పార్థివ లింగాలకు అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదాతలకు ఇచ్చిన మాట నెరవేర్చాం

▸ పలమనేరు: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ▸ కుప్పం పట్టణం: రైతులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ జీఎం రాజు

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఆదాయం లేకున్నా అన్నదాతలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, నాయకులు పేర్కొన్నారు. బుధవారం కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మెగా చెక్కులను రైతులకు అందించారు. **- న్యూస్‌టుడే బృందం**

▸ రొంపిచెర్ల: రైతులకు చెక్కు అందజేస్తున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి

▸ పుంగనూరు: మెగా చెక్కును అందిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ సమీపతి యాదవ్, నాయకులు

అడవిలో గుప్తనిధుల తవ్వకాలు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం మండలం గణేశ్‌పురం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా అడవిలో రహస్యంగా గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్నాడనే వదంతులు రావడంతో.. కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్‌తో పాటు పోలీసులు బుధవారం గణేశ్‌పురం అడవిలో పరిశీలించగా.. 20 అడుగుల లోతు తవ్విన ఓ గుంత బయటపడింది. ఈ వ్యవహారంపై అటు అటవీశాఖ.. ఇటు పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా.. గణేశ్‌పురం సమీప అడవిలో అక్రమంగా ఓ వ్యక్తి కొబ్బరిచెట్లు నాటాడని, రాతికూసాలు నాటి ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

రైలు కిందపడి యువతి ఆత్మహత్య

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: బెంగళూరు-చెన్నై ప్రధాన రైలు మార్గంలో కుప్పం మండలం ఆవుల నత్తం గేటు వద్ద బుధవారం రైలు కిందపడి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నై నుంచి బెంగళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు అడ్డుగా పట్టాల పైకి వచ్చి ఆత్మహత్యకు పాల్పడిందని లోకో పైలట్ సమాచారంతో రైల్వే పోలీసులు బుధవారం రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో ఆచూకీ తెలియ రాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. కుప్పం మండలం డి.అగ్రహారానికి చెందిన యువతిగా స్థానికులు అనుమానిస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి

పుంగనూరు గ్రామీణ: కుటుంబ కలహాలతో స్థానిక రహమత్ నగర్‌కు చెందిన దావూద్‌ఖాన్‌పై రిజ్వాన్, ఇమ్రాన్‌లు దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన దావూద్‌ఖాన్‌ను స్థానికులు పుంగనూరు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం పంచాయతీ కోటపల్లె, జూపల్లెవారిపల్లె, పాళెం గ్రామాల్లోని పంటలపై మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. పలువురి రైతులకు చెందిన మామిడి, వరి, బోరు పైపులు నాశనం చేసింది.

మహారాజరాజశ్రీ పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో
O.E.P.No.19/2024
DHR: కె.జ్యోతీశ్వర్ రెడ్డి
JDR: ఎన్.వెంకటరమణ
NOTICE TO JDR UNDER ORDER 21 RULE 34 C.P.C.
నందినాయుని వెంకటరమణ S/o ఎర్రప్ప ... 08-12-2025 ...
"కోర్టు ఉత్తర్వు మేరకు"
గల్లా శివశంకరనాయుడు బి.ఎ.ఎల్.ఎల్.బి. న్యాయవాది, బైస్ రోడ్డు, పుంగనూరు-517 247

(c) eenadu

గుడ్డు.. రికార్డు

రంగంపేట, న్యూస్‌టుడే: కోడిగుడ్డు రికార్డు ధరకు చేరింది. రెండురోజుల్లో కార్తికమాసం పూర్తి అవనుండగా ఈ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని కోళ్ల పరిశ్రమ అంచనా వేస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలో గుడ్డు ధర కోళ్ల ఫారం వద్ద ఒకటి రూ.6.38గా ఉంది. గతేడాది డిసెంబర్ 12న అత్యధికంగా రూ.6.30కు చేరి, అయిదు రోజులు అదే ధర కొనసాగింది. ఆ తర్వాత తగ్గింది. ఈసారి మాత్రం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మార్కెట్‌లో విడిగా రూ.7.50కు పైనే పలుకుతోంది. శీతాకాలం చలితీవ్రత పెరుగుతుండటంతో ఉత్తరాది రాష్ట్రాల్లో దీని వినియోగం పెరుగుతోంది. కార్తికం పూర్తయితే స్థానికంగానూ వినియోగం పెరగనుంది.

నవ సూత్రం.. జవసత్వం

నవ సార్వత్రిక సూత్రాలను పాటించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏడాది పొడవునా భూమిని పంటలతో కప్పి ఉంచాలి. నేలపై మొక్కలులేని సమయంలో పంట అవశేషాలతో కప్పి తేలికపాటి దుక్కులు దున్నాలి. పశువులను సాగులో భాగస్వామ్యం చేయడం, సొంత విత్తనాల వాడకం, జీవ ఉత్ప్రేరకాలు, కషాయాల వినియోగం తదితర 9 పద్ధతుల ద్వారా భూమి సారవంతంగా ఉండేలా చేయవచ్చని చెబుతున్నారు. బుధవారం ఐ.పోలవరం ఈ నమూనాను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే బుచ్చిబాబుకు వివరించారు. -న్యూస్‌టుడే, ఐ.పోలవరం

వసతి గృహాల్లో వణుకు
చలికి చిన్నారుల ఇబ్బందులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

వసతి గృహాల్లో సమస్యలతో విద్యార్థులు నిత్యం అసౌకర్యానికి గురవుతున్నారు. చలికాలం కావడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిద్రించే గదులతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో సమస్యలు వెంటాడుతున్నాయి. కొన్నిచోట్ల తాగునీటి ప్లాంట్లు పనిచేయడం లేదు. వసతి గృహాల చుట్టూ తుప్పలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయి.

పరిశీలన

రాజోలు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో ఇరుకు గదిలో పెట్టెలపై నిద్రిస్తున్న విద్యార్థులు

◗ అమలాపురంలోని మద్దాలవారిపేట ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం, ఎర్రవంతెన వద్ద బీసీ పాఠశాల బాలుర వసతి గృహం శిథిల స్థితిలో అద్దె భవనాల్లో ఉన్నాయి. వీటికి నెలకు రూ.45 వేలు అద్దె చెల్లిస్తున్నారు.

◗ ముమ్మిడివరంలోని బీసీ బాలుర వసతి గృహం శిథిల స్థితిలో ఉంది. 38 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లే ఉన్నాయి.

◗ ముమ్మిడివరం, గోడి, రాజోలులో బాలికలు, పి.గన్నవరం, ద్రాక్షారామ, గోడిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో అయిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒక్కోచోట 580 మంది చొప్పున 3,480 మంది ఉంటున్నారు. గోడి, రాజోలు గురుకులాల్లో మినహా.. ఎక్కడా మంచాలు లేవు.

వసతి గృహాలు-భవనాలు ఇలా..

శాఖ	సొంతం	అద్దె	విద్యార్థులు
ఎస్సీ	30	03	2900
బీసీ	08	13	859

రూ.3.50 కోట్లతో మరమ్మతులు

ఇటీవల 22 వసతి గృహాల మరమ్మతులకు రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. 19చోట్ల కిటికీలు, తలుపులు, మరుగుదొడ్లు, విద్యుత్తు తదితర పనులు చేశారు. మిగిలిన చోట్ల సమస్యలు అలాగే ఉన్నాయి.

మద్దాలవారిపేటలో వసతి గృహం కిటికీలు ఇలా..

సౌకర్యాల కల్పనకు చర్యలు

వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. శిథిల స్థితిలోని అద్దె భవనాల నుంచి మరో చోట వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల పర్యవేక్షణ అధికారి జి.రాజకుమారి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు. సీఎస్ఆర్ నిధులతోనూ సౌకర్యాల కల్పనకు అంచనాలు సిద్ధం చేసి నివేదించామని చెప్పారు.

గురుకుల పాఠశాలలు: 6 విద్యార్థులు: 3,480



ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు..? | అనువైన స్థలానికి తీసుకెళ్లాలా మనం ఏం చేయాలి..? | వంటికి బలమైన గాయమై గుండె బయటకు వచ్చేసింది.. ఆ సమయంలో ప్రాథమిక వైద్యం ఏమిటి..? | ప్రమాదాల్లో రక్తస్రావం ఎలా అరికట్టాలి..?

ఆ సమయంలో మీరే వైద్యులు

ఇలాంటి అంశాలపై విజయవాడకు చెందిన జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం సిబ్బంది బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించింది. లంకలగన్నవరం, మానేపల్లిలోని జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆగిన గుండె తిరిగి స్పందన తీసుకొచ్చేందుకు సీపీఆర్ ప్రక్రియ ఎలా చేయాలో చేసి చూపించారు. ప్రథమ చికిత్స పద్ధతుల గురించి వివరించారు. ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, కమాండర్ రాజేంద్ర కుమార్ సరోజ్ పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పి.గన్నవరం

పెద్దోళ్లకు ప్రత్యేక ఓపీ

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధుల కోసం ఈ నెల 23 నుంచి ప్రతి ఆదివారం ప్రత్యేకంగా జనరల్ మెడిసిన్ ఓపీ సేవలు ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ లావణ్యకుమారి తెలిపారు. సాధారణ పని దినాల్లో పెద్ద వయసువారు ఆసుపత్రిలో చికిత్సలు పొందేందుకు ఇబ్బందిపడుతున్నారని, పనుల నేపథ్యంలో వారి వెంట కుటుంబ సభ్యులు రాలేకపోవడం గమనించామన్నారు. వారికి ప్రత్యేకంగా ఓపీ నంబర్-4 బ్లాక్‌ను కేటాయించామన్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు సేవలు పొందవచ్చన్నారు. ఆ రోజుల్లో స్వచ్ఛందంగా సేవలందించేందుకు విశ్రాంత ప్రొఫెసర్లను ఆహ్వానించగా అంగీకారం తెలిపారన్నారు.

కనుపాపలకు..కన్నవారి మరణశాసనం

☛ అలమూరు మండలం చిలకలపాడుకు చెందిన కామరాజు బంధువులు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే కారణంతో గత నెల 15న తన ఇద్దరు కుమారులకు పురుగుమందు తాగించి, అనంతరం ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు.

☛ మలికిపురం మండలం లక్కవరానికి చెందిన దుర్గాప్రసాద్ ఈ నె 17న తన కుమార్తె, కుమారుడితో సహా వశిష్ట గోదావరిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

☛ మూడేళ్ల క్రితం ఓ తల్లి తన ఇద్దరు బిడ్డలను పలివెల వంతెనపై నుంచి ప్రధాన పంట కాలువలోనికి తోసి తర్వాత తానూ దూకి ప్రాణాలు తీసుకుంది.

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్: తల్లిదండ్రులే పిల్లలకు మరణశాసనం రాస్తున్నారు. వివిధ కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటూ తమ కలల ప్రపంచానికి, కన్నబిడ్డల బంగారు భవిష్యత్తుకు ముగింపు పలుకుతున్నారు. పసిపిల్లల పాలిట కన్నవారే కాల యముడిగా మారి కడతేరుస్తున్నారు.

ఎందుకిలా మారుతున్నారు..?

ఆర్థిక సంక్షోభం, తీవ్రమైన మానసిక ఒత్తిడి వల్ల కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాములేని పిల్లలు అనాథలవుతారని, తమలాగే ఇబ్బందుల పాలవుతారని, ముందుగా చిన్నారులను చంపి తర్వాత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది ఒక తీవ్రమైన రుగ్మత అని మానసిక నిపుణులు చెబుతున్నారు.

కారణాలేమైనా..

☛ భవిష్యత్తు అంధకారంగా కనిపించడం, బిడ్డలకు మంచి జీవితాన్ని ఇవ్వలేకపోతున్నామనే బాధతో కొందరు దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ☛ భార్యాభర్త, అత్తామామల మధ్య వివాదాలు ప్రభావం చూపించినప్పుడు కొందరు ప్రాణాలు తీసుకోవడంతోపాటు పిల్లలను చంపడం వంటి ఘటనలకు పాల్పడుతున్నారు. ☛ తీవ్రమైన కుటుంబ కలహాలు వంటివి పిల్లల పాలిట శాపంగా మారుతున్నాయి.

ఓటమిని తట్టుకునే శక్తి లేకనే..

భావోద్వేగాలను నియంత్రించుకునే శక్తి కోల్పోవడమే ఆత్మహత్యలకు కారణం. ఆందోళన, ఒత్తిడి లక్షణాలు ఉంటే నిపుణులు సహాయం తీసుకోవాలి. -డా.సౌమ్య, మానసిక వైద్య నిపుణురాలు

గత మూడేళ్లలో నమోదైన ఆత్మహత్యల కేసులు

ఏడాది	కుటుంబ కలహాలు	ఆరోగ్య సమస్యలు	ఇతర కారణాలు
2023	95	74	132
2024	100	58	68
2025	75	58	69

అభయారణ్యం.. భీతావహం
మారేడుమిల్లి సమీపంలో మరో ఎన్‌కౌంటర్

ఈనాడు, కాకినాడ, ఈనాడు డిజిటల్, పాడేరు; న్యూస్‌టుడే-రంపచోడవరం, చింతూరు

పచ్చని ప్రకృతి అందాల మారేడుమిల్లిలో తూటాలు గర్జిస్తున్నాయి. జిల్లెడి నెల్లూరు సమీపంలో ఎన్‌కౌంటర్ జరిగి 24 గంటలు గడవక ముందే.. బుధవారం తుపాకులు పేలాయి.

సురక్షిత ప్రాంతాలు వెతుక్కుంటూ..

ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్'తో పెరిగిన నిర్బంధాలు, అంతర్గత నేతృత్వంలో మావోయిస్టుల్లో కొందరు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతానికి వచ్చారు. మంగళ, బుధవారాలు వరుసగా ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం మావోయిస్టు అగ్రనేత హిడ్మా సహా ఆరుగురు మరణించగా... బుధవారం గుజ్జుమామిడివలస వద్ద మరో ఏడుగురు మృత్యువాత పడ్డారు.

ఎక్కడికక్కడ హైఅలర్ట్

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి మరికొందరు మావోయిస్టులు పారిపోయారన్న సమాచారంతో పోలీసులు అడవిని జల్లెడ పడుతున్నారు. 13 మంది మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మృతులతోపాటు వారి బంధువుల వివరాల నమోదులో నిమగ్నమయ్యారు. కాకినాడ, రాజమహేంద్రవరం జనరల్ ఆసుపత్రుల నుంచి ఫోరెన్సిక్ నిపుణులు ఉమామహేశ్వరరావు, రమేష్, ఉత్తమ్, ప్రశాంత్, వీరభద్రరావు రంపచోడవరం ఆసుపత్రికి వచ్చారు.

రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో మార్చురీ వద్ద పోలీసు బలగాలు

ఉమ్మడి జిల్లాలో సంచలనం

మావోయిస్టులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యక్షమవడం సంచలనం కలిగించింది. ఇద్దరు మహిళా మావోయిస్టులు అంకిత, అనూషలను సామర్లకోట మండలం కొప్పవరం వద్ద, సరోజ్ మండ్వీ అలియాస్ ఓడిసా రావులపాలెం గౌతమి వంతెన సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. హిడ్మా దళంలో క్రియాశీలక సభ్యులైన వీరు వివిధ ఆపరేషన్లలో పాల్గొన్నారు. సరోజ్ మండ్వీ సఖినేటిపల్లిలోని ఓ రొయ్యల చెరువులో కొన్నాళ్లుగా పనిచేస్తున్నట్లు తెలియడం చర్చకు తావిచ్చింది. ఇతనిది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రమైనా అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాకలో ఉంటున్నాడు.

పంట కాలువలిలా.. రబీ సాగు ఎలా..?

ఉమ్మడి జిల్లాలో వరి సాగు (లక్షల ఎకరాల్లో..) తూర్పు డెల్టా	మధ్య డెల్టా	ప్రధాన కాలువలు	పిల్ల కాలువలు
2.64	1.72	431 కి.మీ.	2,024 కి.మీ.

న్యూస్‌టుడే, పి.గన్నవరం

మరో 15 రోజుల్లో రబీ సీజన్ మొదలు కానుంది. ఇటీవల వచ్చిన మొంథా తుపాను, అంతకు ముందు వీచిన గాలులకు కాలువలో పడిపోయిన చెట్లను ఇంకా తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వీటితోపాటు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయాయి. వీటిని తొలగించేందుకు నిధుల సమస్య ఉందని కిందిస్థాయి ఇంజినీరింగ్ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా సాగునీటికి ఇబ్బంది ఉండదు. రబీ సాగుకు మాత్రం ప్రతి నీటిబొట్టును గణనచేసి ఎంతనీరు లభిస్తుందో ఆ మేరకు ఆయకట్టును అనుమతించేలా జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తుంటారు. వచ్చే రబీకి 90 టీఎంసీలకు పైగా నీరు లభిస్తుందని గణన చేశారు. మధ్య డెల్టాలో సుమారు 30 వేల ఎకరాలు శివారు ఆయకట్టుగా ఉంది. తూర్పు, మధ్య డెల్టాల్లో శివారు ఆయకట్టుకు ఫిబ్రవరి, మార్చిలో నీరందక రైతులు ఇబ్బందులు పడుతుంటారు. ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుండా వచ్చే 15 రోజుల్లోగా కాలువలను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది.

ఊడుమూడి వద్ద ప్రధాన కాలువలో పడిపోయిన చెట్టు వద్ద వ్యర్థాలు

తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం..

రబీ సాగుకు ఆటంకం లేకుండా ప్రధాన, పిల్ల కాలువలను శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే కొన్ని కాలువల్లో చెట్లు తొలగించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నిధులు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. మిగిలిన ప్రాంతాల్లోనూ కాలువల్లో చెట్లు, గుర్రపుడెక్క, తూడు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -కె.గోపీనాథ్, ఎస్ఈ, జలవనరుల శాఖ, ధవళేశ్వరం సర్కిల్

కేంద్ర కారాగారానికి 42 మంది మావోయిస్టులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం వద్ద బుధవారం రాత్రి క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. వివిధ జిల్లాల్లో కోర్టులు రిమాండ్ విధించిన మావోయిస్టులను భారీ సంఖ్యలో తీసుకురావడంతో పోలీసు, జైళ్లశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాకినాడ జిల్లా నుంచి ఇద్దరు, కోనసీమ నుంచి ఒకరు, ఏలూరు జిల్లా నుంచి 15 మందిని రాత్రి 8.30 గంటల్లోపు జైలుకు తరలించారు. విజయవాడ నుంచి 24 మందిని రెండు ప్రత్యేక బస్సుల్లో 10.30 గంటలకు తీసుకొచ్చారు. మొత్తం 42 మందిలో 15 మంది పురుషులు, 27 మహిళలు. మహిళా మావోయిస్టులను ప్రత్యేక కారాగారానికి తరలించారు. ఒకటో పట్టణ స్టేషన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు జైలు వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

బస్సును కేంద్ర కారాగారంలోకి పంపిస్తున్న పోలీసులు

నూతన ఆలోచనలు అవసరం

అమలాపురం గ్రామీణం: పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఎంతగానో సహాయపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె.సలీంబాషా పేర్కొన్నారు. పేరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 43 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఇన్‌ఛార్జులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. జిల్లా సైన్సు అధికారి జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అటల్ ల్యాబ్ కోఆర్డినేటర్ హేమ, శిక్షకులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న విశాఖ ఎంపీ భరత్, కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందరావు

అన్నదాతల ఆదాయం పెంచడమే లక్ష్యం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' పథకం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు సాగు సమయంలో అవసరమయ్యే పెట్టుబడి అందించడమే ప్రధాన లక్ష్యమని విశాఖపట్టణం ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. అమలాపురంలో ఈ పథకం రెండో విడత సాయం విడుదల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీ భరత్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు రైతులకు నమూనా చెక్కులను అందజేశారు. జిల్లాలో 1,34,439 మంది రైతులకు రూ.9.24 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. కుర్చీలు లేవని భాజపా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నల్లా పవన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఫ్లెక్సీలలో మంత్రి సుభాష్ ఫొటోలేదని, జనసేన నాయకులను ఆహ్వానించలేదని ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

వైనతేయ.. విహారమేదయా!

న్యూస్‌టుడే, మామిడికుదురు

కోనసీమ ప్రకృతి అందాలను ఎన్నిసార్లు చూసినా తనివితీరదు. అందుకే పర్యాటకులూ క్యూ కడుతుంటారు. అనేకచోట్ల అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో వారికి నిరాశే ఎదురవుతోంది. మామిడికుదురు మండలం వైనతేయ గోదావరి నదీపాయపై వారధిని ఆనుకుని పాశర్లపూడిబాడవ, సాగరతీరం చెంత ఆదిబౌద్ధ స్తూపానికి చేరువలో ఆధ్యాత్మిక వీక్షణ కోసం 2017లో రూ.60 లక్షల చొప్పున ఖర్చు చేసి పడవ విహార కేంద్రాలు నిర్మించారు. అటు అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయం వరకు, ఇటు ఆదిబౌద్ధ స్తూపాన్ని సందర్శించేలా వీటిని ఏర్పాటుచేశారు. విశ్రాంతి తీసుకునేందుకు సౌకర్యాలు లేక ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

ఆదుర్రులో నిరుపయోగంగా రిసార్ట్స్ →

కల్పించాల్సిన వసతులు

◗ ఆదుర్రు వద్ద నదీపాయలోకి నిర్మించిన చెక్క వంతెనకు సరైన రక్షణ లేక ఛిద్రమైంది. విహార కేంద్రాల పైకప్పులు, వాటి చుట్టూ ఉద్యానాలు దుస్థితిలో ఉన్నాయి. మెరుగుపరచాలి. ◗ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హౌస్ బోట్లు, విహార కేంద్రాలు, జలక్రీడలకు కార్యాచరణ చేపట్టాలి. ◗ కరవాక నుంచి అంతర్వేది వరకు 23 కి.మీ మేర సముద్ర తీరం విస్తరించింది. అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి ఆలయంతో పాటు దీప స్తంభం, సాగర సంగమ ప్రదేశానికి చేరుకుని ఆధ్యాత్మిక, ప్రకృతి అందాలను వీక్షించేలా ఏర్పాట్లు అవసరం. ◗ అంతర్వేదిలో ఎనిమిదేళ్ల క్రితం రూ.25 లక్షలతో నిర్మించిన రిసార్ట్‌లో కుటీరాలు కనుమరుగైపోయాయి.

కార్యాచరణ మొదలు

ఆదుర్రు, పాశర్లపూడిలో నిస్తేజంగా మారిన పడవ విహార కేంద్రాలను ఇటీవల పరిశీలించా. పూర్తిస్థాయిలో తీర్చిదిద్ది పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం రాగానే కార్యాచరణ మొదలవుతుంది. -గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్యే, పి.గన్నవరం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

రైతులకు అందుబాటులో సేవలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఉమ్మడి జిల్లాల డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. అమలాపురంలోని కె.అగ్రహారం డీసీసీబీ శాఖలో జిల్లాలో వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం అధ్యక్షులకు నాబార్డ్, ఆప్కాబ్ అనుసంధానంతో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. గత వైకాపా ప్రభుత్వం డీసీసీబీ నష్టాల్లో ముంచిందన్నారు. కూటమి ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టిందన్నారు.

మాట్లాడుతున్న ఛైర్మన్ తుమ్మల రామస్వామి



(c) eenadu

అరటిబొందతోనూ ఆదాయమే..

హైదరాబాద్ పంపేందుకు సిద్ధంచేసిన డొప్పలు

అరటిచెట్లకు గెలలు తయారైన తరువాత వాటిని చెట్ల నుంచి వేరు చేసి బొందలను తోటల్లోనే నరికివేయటం సాధారణంగా రైతులు చేస్తుంటారు. ఇప్పుడు కార్తికమాసం, పౌర్ణమి పూజల కారణంగా వీటికి తెలంగాణలో డిమాండ్ ఏర్పడటంతో అంబాజీపేట నుంచి వ్యాపారులు బస్సుల్లో పంపుతున్నారు. ఒక్కో బొంద రూ.40 నుంచి రూ.50 చొప్పున కొనుగోలు చేసి వ్యాపారులు హైదరాబాద్ పంపుతున్నారు. ఈ బొందలకు గిరాకీ పెరగడంతో కోనసీమవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

దేదీప్యం.. దీపస్తంభం

ద్రాక్షారామ సాక్షి వారి వీధిలో ఉన్న మహదేవుని ఆలయం వద్ద కార్తికమాసాన్ని పురస్కరించుకొని బుధవారం దీపోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన శివలింగాకృతి దీపస్తంభంపై దీపాలు పెట్టి భక్తులు వెలిగించారు. మాస శివరాత్రి సందర్భంగా ఉదయం, సాయంత్రం మహదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- న్యూస్‌టుడే, ద్రాక్షారామ

మడ అడవుల సంరక్షణే లక్ష్యం

పర్యాటక కేంద్రాన్ని సందర్శించిన అదనపు సీసీఎఫ్ శాంతి ప్రియ పాండే తదితరులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణతో పాటుగా మడ అడవుల సంరక్షణే లక్ష్యమని అదనపు సీసీఎఫ్ శాంతి ప్రియ పాండే అన్నారు. కోరింగ అభయారణ్యంలో హోప్ ఐలాండ్, చొల్లంగి పర్యాటక కేంద్రం, భైరవపాలెం ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. హోప్ ఐలాండ్‌లో తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు, మడ నర్సరీ, మొక్కల పెంపక ప్రదేశాలను పరిశీలించారు. బోటు షికార్ ప్రదేశంలో రూ.8 లక్షలతో నిర్మించిన టవర్ ఎక్కి పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెంలో పర్యటించారు. సీసీఎఫ్ బి.బి.ఎన్.మూర్తి, డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్.వరప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ, ఎఫ్‌బీవో ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

క్రికెటోత్సవానికి వేళాయె..

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
FM Partner TV Partner Digital Partner Organised by

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్ సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు కార్యాలయం, ఎన్‌హెచ్-16, హుకుంపేట, రాజమహేంద్రవరం-533107
వివరాలకు: 96666 31768
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఉప్పునీటి ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పరిశీలన

గొల్లపాలెంలో కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న సభ్యులు

మలికిపురం, న్యూస్‌టుడే: కేశనపల్లి తదితర తీర గ్రామాల్లో ఉప్పునీటి వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను కేంద్ర కోకొనట్ బోర్డు, ఉద్యాన శాఖ అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. జనసేన నాయకుడు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న డాక్టర్ యెనుముల వెంకటపతిరాజా పలు గ్రామాల్లో ఉప్పునీటి కారణంగా దెబ్బతింటున్న కొబ్బరి తోటలను కాపాడాలంటూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన కోకొనట్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఎంటమాలజీ విభాగం నుంచి మనోజ్‌పురి, కె.వి.చౌదరి (ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి), పాథాలజీ విభాగం నుంచి వై.మానస (అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి), స్థానిక ఉద్యాన శాఖ అధికారి శైలజ, ఇతర అధికారులతో కలిసి గొల్లపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, పడమటిపాలెం, శంకరగుప్తం, గొగ్గన్నమఠం తదితర తీర గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలించారు. ఐదారు సంవత్సరాలుగా శంకరగుప్తం మేజరు డ్రెయిన్‌లో ఉప్పు నీరు రివర్స్‌లో వచ్చి తోటల్లోకి చేరి రెండు వేల ఎకరాల్లో లక్షకుపైగా కొబ్బరి చెట్లు చనిపోయి నష్టపోయినట్లు రైతులు తెలిపారు. తమను ఆదుకోవాలని, తోటలను రక్షించాలని, డ్రెయిన్‌లో నీరు తోటల్లోకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారుల బృందాన్ని కోరారు. రైతులు ఆకుల చిన్నారావు, రాపాక కిరణ్, ముత్యాల ప్రసన్న(కన్నా), బైరా నాగరాజు, అడబాల ప్రసాద్, రాంబాబు, నానాజీ, వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, ఆచంట మాణిక్యం, అడ్డగళ్ల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో సినీ సందడి

మలికిపురం: తూర్పుపాలెంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రమేష్‌వర్మ నిర్మాణ సారథ్యంలో ఆర్.వి.ఫిల్మ్స్, నీలాద్రి ప్రొడక్షన్స్ బ్యానరుపై రేఖా వర్మ, శిరీషా కొర్రపాటి నిర్మాతలుగా 'కొక్కొరొకో' సినిమాను తెరకెక్కిస్తున్నారు. శ్రీనివాస్ వసంతల దర్శకుడిగా పరిచయమవుతున్నారని రమేశ్‌వర్మ చెప్పారు. సముద్రఖని, సునీల్, మురళీకృష్ణ, చైతన్యరావు కథానాయకులుగా తదితరులు నటిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులుగా తూర్పుపాలెంలోని రక్షితల్వ ఆడబాల వారి వీధిలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో పలు సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శివకోటి, తూర్పుపాలెం, గుడిమెళ్లంక, సఖినేటిపల్లి, రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నట్లు రమేశ్‌వర్మ తెలిపారు.

అడబాలవారివీధిలో సంక్రాంతి సందడి చిత్రీకరణ

కోనసీమలో పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ

శానపల్లిలంకలో ఎంపీ శ్రీభరత్‌కు హారతిస్తున్న బంధువులు

అయినవిల్లి, న్యూస్‌టుడే: కోనసీమ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోందని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఎంపీగా గెలుపొందిన తరువాత తొలిసారిగా బుధవారం ఆయన స్వగ్రామం ఎస్.మూలపొలం రాగా గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. దారిపొడవునా హారతులు ఇచ్చారు. శానపల్లిలంకలో ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అయినవిల్లిలో సిద్ధిగణపతి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా గెలుపొందే సమయానికి తన తాత మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి లేకపోవడడం తీరనిలోటన్నారు. నలుగురికీ మంచి చేయాలని ఆయన ఎప్పుడూ చెప్పేవారన్నారు. ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, నియోజకవర్గ భాజపా కన్వీనర్ చికురిమెల్లి వెంకటేశ్వరరావు, సర్పంచులు పంబల కుమారి, బొబ్బా ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపులో చేతివాటం

● రూ.60 వేలు చోరీ చేసిన సేవకుడి అరెస్టు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

యంత్రంపై నాణేలు, నోట్లు వేరు చేస్తున్న సిబ్బంది

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి హుండీల ఆదాయం లెక్కింపులో శ్రీవారి సేవకుడు ఒకరు చేతివాటం ప్రదర్శించి రూ.60 వేలు చోరీ చేయడంతో కలకలం రేగింది. బుధవారం మధ్యాహ్నం ద్రాక్షారామంకు చెందిన సేవకుల బృందంలో వాసంశెట్టి శ్రీనివాసరావు నగదు తస్కరించిన విషయాన్ని గమనించిన సెక్యూరిటీ గార్డు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దేవస్థానం ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

తరచూ చోరీ ఘటనలు..

కొన్ని నెలల క్రితం కూడా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి రూ. మూడు వేలు చోరీ చేస్తుండగా పట్టుబడ్డారు. ఒక సేవకురాలు రూ. వెయ్యి కట్ట పట్టుకెళ్లిపోతుండగా తనిఖీలో దొరికిపోయింది. 8 సంవత్సరాల క్రితం వాడపల్లి గ్రామానికి చెందిన ఒక భక్తురాలు నిలువుదోపిడీ మొక్కులో భాగంగా బంగారు సూత్రాల తాడు తదితరాలు హుండీలో వేశారు. లెక్కింపులో అవి కనిపించకపోవడంతో గ్రామంలో అలజడి రేగింది. సంబంధిత కుటుంబీకులు నిరసన వ్యక్తం చేసి దేవస్థానం సిబ్బందిని నిలదీశారు. ఒక భక్తురాలు బంగారు గాజు హుండీలో వేయాలని ఆలయం వద్ద ఉన్న గ్రామానికి చెందిన ఒక రాజకీయ నాయకుడుకి ఇవ్వగా, హుండీలో వేయకపోవడం గమనించిన కొంత మంది అతడిని పట్టుకున్నారు. సీసీ కెమెరాలు, వందలాది మంది సేవకుల నడుమ హుండీల ఆదాయం లెక్కింపు జరుగుతుండగా ఇలాంటి చోరీ సంఘటనలు బయటపడుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆదాయం రూ.1.59 కోట్లు

ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించగా 27 రోజులకుగాను రూ.1.59,44,749 నగదు, 15 గ్రాముల బంగారం, 910 గ్రాముల వెండి, 8 దేశాలకు చెందిన 35 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరినట్లు ఈవో తెలిపారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అపహరణ కేసులో యువకుడి అరెస్టు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి బాలిక(10)ను అపహరించి తర్వాత విడిచి పెట్టి పరారైన యువకుడు మట్టపర్తి సత్యమూర్తి (చంటి)ని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీఐ వీరబాబు, ఎస్సైలు శ్రీనివాస్, జోషి ఆ వివరాలు వెల్లడించారు. ఈ నెల 10న అతడు బాలికను అపహరించి ఆమె తండ్రి రమణను డబ్బులు డిమాండ్ చేశాడు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేశారు. తర్వాత రోజు పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారి పాలెంలో స్థానికులు గుర్తించడంతో బాలికను విడిచిపెట్టి నిందితుడు పరారయ్యాడు. అతడిని పోతవరంలో అదుపులోకి తీసుకుని ద్విచక్రవాహనం, రెండు చరవాణులు, బాలిక స్కూల్ బ్యాగు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు చెప్పారు.

నిందితుడు చంటితో సీఐ వీరబాబు, ఎస్సైలు శ్రీనివాస్, జోషి

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ
జె.ఎన్.టి.యు. యూనివర్సిటీ, కాకినాడ
మామిడి తోట ఫలసాయానికి ప్రకటన
ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్ విభాగం వారు కళాశాల ఆవరణలో ఉన్న మామిడి చెట్ల ఫలసాయమును కళాశాల నియమ నిబంధనలకు లోబడి అనుభవించు హక్కు కొరకు సీల్ వేసిన కొటేషన్లు ఆహ్వానించుచున్నారు. షెడ్యూల్ ధర రూ.2,500.00లు (అక్షరాలా రెండు వేల ఐదు వందల రూపాయలు) (జి.ఎస్.టితో కలిపి). జారీ చేయు ఆఖరి తేది ది.02-12-2025, దాఖలు చేయుటకు ఆఖరి తేది 03-12-2025 మధ్యాహ్నం గం.3.00ల వరకు. మిగతా వివరములు ఇంజినీరింగ్ విభాగం కార్యాలయం పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చును.
తేది: 19-11-2025 సం/- ప్రిన్సిపాల్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బండారులంక ఏడిబి బ్రాంచ్, బండారులంక, తూర్పు గోదావరి జిల్లా
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ బిష్ణు రామానుజన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం.70056 48443, ఆస్తి తనిఖీ కొరకు : 98666 57175

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)
SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఇ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీతలు/హామీదారులు: శ్రీ లక్ష్మి వెంకటేశ్వర జ్యూయలర్స్, ప్రొప్రయిటర్ : సింహాద్రి రామకృష్ణ కనక సత్యనారాయణ, డి.నెం. 2-1-37/2, మెయిన్ రోడ్డు, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా. హామీదారు: శ్రీ సింహాద్రి నాగ శరత్ చంద్రశేఖర్, తండ్రి : సన్యాసిరావు, డి.నెం. 11-424, బాపూజీ విద్యా నగర్ కాలనీ, కొంకపల్లి, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా. డిమాండ్ నోటీసు తేది: 03-02-2025
డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.01-02-2025 నాటికి రూ.43,14,576/- + భవిష్య వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

షెడ్యూల్ ఆస్తుల వివరములు
శ్రీ సింహాద్రి రామకృష్ణ కనక సత్యనారాయణ, తండ్రి : సన్యాసిరావు గారికి చెందిన ఆస్తి: తూర్పుగోదావరి జిల్లా, అమలాపురం మండలం, వినాయక గుడి వీధి ఏరియా, అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం ఎస్‌ఆర్‌ఓ వద్ద జిరాయితీ డ్రై ఆర్.ఎస్.నెం.394/6 లోని ఉత్తరం వైపు 21.88 చ॥గ॥ల భూమి విస్తీర్ణంలో గల ఆర్‌సిసి కమర్షియల్ షాప్ యావత్తు ఆస్తి హద్దులు: తూర్పు : కెవిఎస్‌ఎఫ్ రోడ్డు - 9'01", దక్షిణం : మేడిచర్ల త్రిమూర్తులు ధాబా, ఉమ్మడి గోడ - 21'-08", పడమర : కేదారిశెట్టి సూర్యనారాయణ షాపు ఉమ్మడి గోడ - 9'-01", ఉత్తరం : వినాయక గుడి వీధి, మున్సిపల్ సిమెంట్ రోడ్డు - 21'-08".
రిజర్వు ధర : రూ.30,45,600/- ధరావత్తు : రూ.3,04,560/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

శ్రీ సింహాద్రి నాగ శరత్ చంద్రశేఖర్, తండ్రి : సన్యాసిరావు & శ్రీ సింహాద్రి రామకృష్ణ కనక సత్యనారాయణ, తండ్రి : సన్యాసిరావు గార్లకు చెందిన ఆస్తి: తూర్పుగోదావరి జిల్లా, అమలాపురం మండలం, పేరూరు గ్రామం (కొంకపల్లి ఎవిఆర్ నగర్ ఏరియా), అమలాపురం ఎస్‌ఆర్‌ఓ వద్ద జిరాయితీ డ్రై ఆర్.ఎస్.నెం.697/2 లోని ఎ.0.03 సెంట్లు (145.2 చ॥గ॥లు) విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు ఆస్తి హద్దులు: తూర్పు : రోడ్డు, దక్షిణం : సింహాద్రి చంద్రవతి గారి ఇల్లు, పడమర : కడియం రాము గారి ఇల్లు, ఉత్తరం : రోడ్డు.
రిజర్వు ధర : రూ.31,36,500/- ధరావత్తు : రూ.3,13,650/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 20-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 1.00 గం॥ వరకు
ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:20-11-2025 నుండి 19-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇ-వేలం పోర్టల్ : https://www.bankeauctions.com మరియు శ్రీ ధరణికృష్ణ, మొబైల్ నెం: + 91-9948182222, హెల్ప్ లైన్ నెం.+ 91-120-4888888, హెల్ప్ లైన్ ఇ-మెయిల్ ఐడి: support@bankeauctions.com ను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
తేది: 19-11-2025 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: బండారులంక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చిన్నారి మృతదేహం లభ్యం

● లక్కవరంలో విషాదఛాయలు

మలికిపురం, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఒకేసారి తండ్రి, ఇద్దరు పిల్లల మృతదేహాలు బుధవారం ఇంటికి చేరడంతో లక్కవరంలో విషాదఛాయలు అలముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం హృదయవిదారకంగా మారింది. భర్త, పిల్లలు తనను అన్యాయం చేసి వెళ్లిపోయారంటూ దుర్గాప్రసాద్ భార్య నాగవేణి గుండెలవిసేలా రోదించడం స్థానికులను కంటతడి పెట్టించింది. సోమవారం యలమంచిలి మండలం చించినాడ వంతెనపై నుంచి గోదావరిలో దూకిన వారిలో తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్ (35), కుమారుడు మోహిత్ (14) మృతదేహాలు మంగళవారం సాయంత్రం లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి (9) మృతదేహం దిండి సమీపంలో బుధవారం సాయంత్రం లభ్యమైంది. మూడు మృతదేహాలకు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. అనంతరం సోంపల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. విశ్వేశ్వరాయపురంలోని ప్రైవేటు పాఠశాలలో మోహిత్ ఎనిమిదో తరగతి, జాహ్నవి నాలుగో తరగతి చదువుతున్నారు. పాలకొల్లు గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్న కారణంగా దుర్గాప్రసాద్ ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. దుర్గాప్రసాద్ తండ్రి సత్యనారాయణ, బావమరిది రేకపల్లి రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుండలేశ్వరంలో భక్తురాలి మృతి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కుండలేశ్వరుడిని దర్శించుకోవడానికి వచ్చిన ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందారు. భక్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన బొట్టా నిర్మల(66).. సోదరీమణులు సాయికుమారి, మాధవీలత, మరో మహిళతో కలిసి బుధవారం ఉదయం ఆలయాల దర్శనానికి వచ్చారు. ఉదయం పిఠాపురంలో కుక్కుటేశ్వరస్వామి దర్శనాంతరం సాయంత్రం కుండలేశ్వరం చేరుకున్నారు. దర్శనం అనంతరం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానిక యువకులు పీఎస్ఎన్‌రాజు, రవివర్మ మరికొంత మంది ఆమెకు సీపీఆర్ చేస్తూనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వాహనం వచ్చేసరికి మృతి చెందారు. తమకు కుండలేశ్వర క్షేత్ర మహత్మ్యం చెప్పి తీసుకువచ్చి ఇక్కడే ప్రాణాలు విడిచారని మిగతా ముగ్గురూ కన్నీరు మున్నీరయ్యారు. స్థానిక యువకులు అంబులెన్స్ ఏర్పాటు చేసి మృతదేహాన్ని స్వస్థలానికి పంపించారు.

సీపీఆర్ చేస్తున్న యువకుడు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	21,000
కురిడీ (వెయ్యింటికి): పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	18,000-19,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారం రేటు	111-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

EENADU eClassifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION
B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 99121 78237.
BPT/B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/Dialysis - Courses in Vijayawada - MGT/ Convener Quota. ✆ 79959 45835.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
తాళ్లపూడి, ఆంధ్రాబ్యాంక్ రోడ్ సూర్య ఇ.మీ. స్కూల్ ఎదురుగా 139/ 125.66/ 173.94/ 122.44/ 143.11 గ॥ స్థలం అమ్మకం. ✆ 83090 25067.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీ పెట్టుబడికి, గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. Contact Cell: 9949000033.

JOBS
WANTED STAFF: Ravindra High School, Exp. High School Teachers for English, Social, Science & Telugu, B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.
లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. ✆ 96667 14613.
★ టెలికాలర్స్ ★ కంప్యూటర్ ఆపరేటర్ (F) ★ ఆఫీస్ అసిస్టెంట్ (M) కావలెను. జీతం: 10,000 to 25,000/-. 2 వీలర్ లోన్స్, రాజమండ్రి, Contact Cell: 85006 44978, 93461 45948.
రాజమండ్రిలో ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు ★ చెఫ్స్ ★బిర్యానీ & చైనీస్ మాస్టర్ ★ వెయిటర్ ★ రిసెప్షనిస్ట్ ★ అకౌంటెంట్ కావలెను. Contact: 93462 97988.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-38 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

సుందరీకరణ పనుల పరిశీలన

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: టేకిశెట్టిపాలెంలో జరుగుతున్న కాలువల, ఏటిగట్టు సుందరీకరణ పనులను గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. 2026లో వచ్చే లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నాటికి కనువిందు చేసేలా తయారు చేస్తామని తెలిపారు.

మహిళలపై హింసను అరికట్టాలి

మలికిపురం, న్యూస్‌టుడే: సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. గుబ్బలపాలెం పంచాయతీలో దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మామిడికుదురు, న్యూస్‌టుడే: నగరం విద్యుత్తు ఉప కేంద్రంలో నిర్వహణ పనుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.రాంబాబు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు నేడు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని శ్రీసత్యసాయి సేవా మందిరంలో గురువారం ఉదయం 9 గంటలకు హోమియో, మధ్యాహ్నం 3 గంటలకు చర్మ, దంత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు తెలిపారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ. 10 - మ. 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

చెత్త తొలగింపు

ఆత్రేయపురం: రాజవరం గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి జాన మంగాయమ్మ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి శుభ్రం చేయించారు.

పంటబోదె ప్రక్షాళన

రావులపాలెం గ్రామీణం: గోపాలపురంలోని పంట బోదెల్లో పూడిక పెరిగిపోయి నీరు ముందుకు పారడంలేదని పంచాయతీ కార్యదర్శి సాయిపద్మావతి దృష్టికి తీసుకువెళ్లగా ఉపాధి సిబ్బందితో పూడిక తీయించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ఆత్రేయపురం: లొల్ల గ్రామంలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కాయల జగన్నాథం వద్ద ప్రస్తావించగా లైన్లకు మరమ్మతులు చేయించి దీపాలు వెలిగించారు.

పూడిక తీశారు..

రావులపాలెం పట్టణం: కొత్తకాలనీలో డ్రెయిన్ పూడిక పోవడంతో మురుగు ముందుకు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి తాడేపల్లి నాగమణి దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

పరిసరాలు శుభ్రం

రావులపాలెం గ్రామీణం: రావులపాడులో దోమలు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి దృష్టికి తీసుకువెళ్లగా నివారణకు మందులు చల్లించారు.

చలితో వణుకు.. కరవాయె కునుకు

• వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు

న్యూస్‌టుడే, బృందం

పరిశీలన

రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లోని గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లో సదుపాయాల్లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వీస్తున్న తీవ్రమైన చలిగాలులకు వణికిపోతున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమలతో సతమతమవుతున్నారు. నేలపైనే నిద్రిస్తున్నారు.

పనిచేయని గీజర్లు..

పి.గన్నవరం: నరేంద్రపురంలోని ఎస్సీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 475 మంది విద్యార్థులు చదువుతున్నారు. ● గదుల్లో కిటికీలు దెబ్బతిన్నాయి. వాటికున్న దోమతెరలు చిరిగిపోయాయి. ● విద్యార్థులు ప్లాస్టిక్ బరకాలు, దుప్పట్లు కట్టుకుంటున్నారు. వేడినీళ్ల కోసం ఏర్పాటు చేసిన గీజర్లు పనిచేయడం లేదు. ● మంచాలు ఏర్పాటు చేస్తామని పదేళ్ల క్రితమే ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కొన్ని ఫ్యాన్లు అరకొరగా పనిచేస్తున్నాయి. ● 'నాడు-నేడు' కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదు.

నరేంద్రపురం గురుకుల పాఠశాలలో చలిగాలి, దోమలు రాకుండా దుప్పటి కడుతున్న విద్యార్థులు

ఇరుకు గదిలో ఇక్కట్లు

రాజోలు: రాజోలులోని ప్రభుత్వ సామాజిక సంక్షేమ బాలుర వసతిగృహ భవనం శిథిలం కావడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ❖ నాలుగు గదులున్న ఈ భవనంలో 60 మంది విద్యార్థులు సర్దుకుంటున్నారు. ❖ ట్రంక్ పెట్టెలను వరండాలో పెట్టి వాటిపైనే పడుకుంటున్నారు. ❖ మూడు మరుగుదొడ్లు ఉండటంతో వరుసగా నిలబడి ఉపయోగించుకుంటున్నారు. ❖ తాగునీటి సదుపాయం లేదు. చలికి ఇబ్బంది పడుతూ చన్నీటి స్నానం చేస్తున్నారు. ❖ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థుల ఇబ్బందులు దృష్ట్యా వేరే భవనంలోకి మార్చాలని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు ఏఎస్‌డబ్ల్యూవో ఎస్.సత్యనారాయణను తెలిపారు.

మరుగుదొడ్డి వద్ద వరుసలో నిలిచి ఉన్న విద్యార్థులు

చన్నీటి స్నానం.. నేలపై నిద్ర

అంబాజీపేట: గంగలకుర్రులో ఉన్న సమీకృత బాలుర వసతిగృహంలో 101 మంది విద్యార్థులు ఉన్నారు. వేడినీళ్లు లేక చలిలో చన్నీటిస్నానంతో సతమతమవుతున్నారు. ● రూ.3 కోట్లతో నిర్మించిన వసతిగృహం భవనాన్ని ఇటీవల రూ.17 లక్షలతో ఆధునికీకరించారు. ● మంచాలు లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. ● కిటికీల మెష్‌లు ఊడిపోయాయి. ● వసతిగృహానికి ప్రహరీ లేకపోవటంతో పాములు, ఇతర విషపురుగుల బెడదతో ఇబ్బంది పడుతున్నారు.

గంగలకుర్రులో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

మామిడికుదురు బాలుర వసతిగృహంలో స్లాబు నుంచి నీరు కారి ఖాళీ చేసిన గది

నిర్లక్ష్యానికి నిదర్శనం

మామిడికుదురు: మామిడికుదురు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 82 మంది, బాలికల వసతి గృహంలో 80 మంది విద్యార్థులున్నారు. ▲ దాదాపు ఆరేడు నెలల క్రితం అక్కడి భవనాలకు తాత్కాలికంగా మరమ్మతులు చేయడంతో సమస్యలు మళ్లీ వెంటాడుతున్నాయి. ▲ బాలుర వసతి గృహంలో స్లాబు లీకేజీలను సక్రమంగా అరికట్టకపోవడంతో వర్షం పడితే నీరు కారుతోంది. విద్యార్థులు ఒక గదిని ఖాళీ చేశారు. ▲ కిటికీలు, గుమ్మాలకు వేసిన దోమతెరల వస్త్రాలు చిరిగిపోయాయి. ▲ ఆరుబయట వర్షం నీరు నిలిచిపోతోంది. ▲ బాలికల వసతి గృహానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. ఇటీవల [illegible] భవనం శిథిలం కావడంతో [illegible] ▲ దోమతెరల వస్త్రాలను [illegible] స్లాబు నుంచి నీరు లీకవ్వకుండా మరమ్మతులు చేయిస్తామని రాజోలు సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎస్.సత్యనారాయణ తెలిపారు.

అన్నదాత సుఖీభవతో రైతు ఆనందం

మామిడికుదురు, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా రెండో విడతగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేయడంతో వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండలంలోని కరవాకలో రైతులకు నమూనా చెక్కును బుధవారం ఆయన అందజేశారు. నియోజకవర్గంలో 23,293 మంది రైతులకు రూ.7 వేలు చొప్పున రూ.15.56 కోట్లు వారి ఖాతాల్లో జమ కానుందన్నారు. స్థానిక సునామీ కాలనీలో రూ.45 లక్షల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు, రూ.22.23 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన సంప్, 25 కేవీ విద్యుత్తు పరివర్తనాన్ని ఆయన ప్రారంభించారు. 20 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రూ.9.62 లక్షల పీఎంఎంఎస్‌వై నిధులతో 26 బోట్లకు కేటాయించిన జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను అందజేశారు. తెదేపా రాజోలు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య, గోదావరి మధ్యడెల్టా కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఏఎంసీ ఛైర్మన్ కేతా వెంకటలక్ష్మి, సర్పంచి సత్యనారాయణ, ఎంపీపీ వనజకుమారి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరరాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

కరవాకలో నమూనా చెక్కును అందజేస్తున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్



అయినవిల్లిలో మాట్లాడుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

రైతు సంక్షేమమే లక్ష్యం

కొత్తపేట: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలను రైతులతో కలిసి తెరపై వీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో 23,018 మంది రైతులకు మొత్తం రూ.15.26 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, కొత్తపేటలో సేంద్రియ ఉత్పత్తుల అమ్మకానికి రిటైల్ కౌంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్డీవో పి.శ్రీకర్, వ్యవసాయ అధికారి రామారావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

నమూనా చెక్కుల అందజేత

అయినవిల్లి: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలో 23,727 మంది రైతులకు రూ.11.86 కోట్లు, పీఎం కిసాన్ సాయం 21,753 మంది రైతులకు రూ.4.36 కోట్లు అందుతుందన్నారు. నమూనా చెక్కును రైతులకు అందజేశారు. సీఎం చంద్రబాబు ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సర్పంచి కాకర శ్రీనివాసరావు, ఏవో శోభ, వైస్ ఎంపీపీ అడపా నాగభూషణం పాల్గొన్నారు.

వెండి మామిడి తోరణాలు సమర్పిస్తున్న భక్తులు

వెండి మామిడి తోరణాల సమర్పణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామికి మామిడికుదురుకు చెందిన సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు వెండి మామిడి తోరణాలను బుధవారం సమర్పించారు. పూజా కార్యక్రమం అనంతరం వాటిని ఆలయ ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అర్చకులు దాత కుటుంబానికి వేదాశీర్వచనం పలికారు.

నిత్యాన్నదానానికి విరాళం

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి గుంటూరుకు చెందిన జొన్నలగడ్డ లలితాప్రసాద్ రూ.1,00,116 విరాళాన్ని బుధవారం ఆలయ అధికారులకు అందించారు. అర్చకస్వాములు వేదాశీర్వచనం చేయగా స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సీనియర్ అసిస్టెంట్ రాంబాబు అందజేసి అభినందించారు.

ఏటిగట్టును శుభ్రం చేయించరూ..

ఆత్రేయపురం నరసన్నపేట నుంచి కుమ్మరిపేట సమీపంలో ఉన్న పుష్కరాల రేవుకు వెళ్లే ఏటిగట్టు చెత్తాచెదారాలతో చిట్టడవిలా తయారైంది. కనీసం అటు ఇటూ నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. ఇలా ఉండటం వల్ల పరిసరాల్లో ఉన్న గృహాల్లోకి విష సర్పాలు కూడా చేరుతున్నాయి. ఈ విషయాన్ని హెడ్‌వర్క్స్ ఏఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లి శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం



నిలిచిన అన్న క్యాంటీన్ భవన నిర్మాణం

అంబాజీపేటలో 2018 చివరలో తెదేపా ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. గుత్తేదారు పునాదుల వరకు నిర్మించారు. అనంతరం వైకాపా ప్రభుత్వం రావటంతో నిలిపివేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి రవికుమార్‌ను వివరణ కోరగా నిధుల కోసం మరోసారి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

రహదారికి బీటలు.. రాకపోకలకు అవస్థలు

నందంపూడి వెళ్లే ప్రధాన సీసీ రహదారి బీటలు తీసింది. రాత్రి సమయాల్లో పలువురు వాహన చోదకులు గుంతల్లో పడి పడిపోతున్నారు. గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధికంగా తరలివస్తుంటారు. వేకువజామున రాకపోకలకు ప్రమాదాల బారిన పడుతున్నారు. సర్పంచి పితాని మంగాదేవిని వివరణ కోరగా రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు విడుదలయితే బాగుచేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

జిల్లా యూనిట్‌గా ప్రాంతాల అభివృద్ధి

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: జిల్లాను యూనిట్‌గా తీసుకొని అభివృద్ధి చేయలనే దానిపై ప్రభుత్వం ఆలోచిస్తోందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. ఆయన బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్ద రూ.1.16 కోట్లతో నిర్మించనున్న టెన్సెల్ షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొత్త 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. రూ.96 కోట్లతో ప్రతిపాదించిన ప్రసాద్ నిధుల గురించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాడపల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర బీసీ సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నాయకులు పాల్గొన్నారు. తొలుత ఎంపీ భరత్‌కు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచనం గావించారు. స్వామివారి జ్ఞాపికను ఈవో చక్రధరరావు, ఎమ్మెల్యే బండారు బహూకరించారు.

టెన్సెల్ షెడ్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ భరత్, ఎమ్మెల్యే బండారు తదితరులు

వేడుకగా వేమనరెడ్డి సంఘం వనసమారాధన

ఆలమూరు, న్యూస్‌టుడే: జొన్నాడలో వేమనరెడ్డి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తిక వనభోజనాలు జరిగాయి. వేమన విగ్రహానికి రెడ్డి సంఘం యూత్ సభ్యులు పూలమాలలు వేశారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, భాజపా నాయకుడు తమలంపూడి రామకృష్ణారెడ్డిని సంఘం నాయకులు సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

దేవస్థానం అభివృద్ధికి కృషిచేయాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు అన్నారు. తనను కలిసేందుకు బుధవారం మగటపల్లి వచ్చిన దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణను ఆయన సత్కరించారు. నాయకులు బొలిశెట్టి ఏసుబాబు, నామన కిరణ్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద భూమిపూజ

అంబాజీపేట: మాచవరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద రూ.మూడు లక్షలతో అభివృద్ధి పనులకు అధికారులు, నాయకులు బుధవారం భూమిపూజ చేశారు.

'సతీశ్ మృతిపై విచారణ జరిపించాలి'

మలికిపురం, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పరకామణి చోరీ కేసులో విజిలెన్స్ వింగ్ అధికారి సతీశ్‌కుమార్‌ను కుట్రపూరితంగా హత్య చేశారని, ఆయన మృతిపై సీబీఐ లేదా సీఐడీ దర్యాప్తు చేయాలని కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మలికిపురం గాంధీ బొమ్మల కూడలిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సతీశ్‌కుమార్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. నాయకులు వెల్ల మిథున్‌చక్రవర్తి, సఖినేటిపల్లి పెద్దిరాజు, గోడి వీరవెంకటసత్యనారాయణ, మానేపల్లి శ్రీనివాస్, వెల్ల బాలు, నాగవరపు తేజ, కొలుకూరి సాయి పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణాల నిర్వాహకులపై కేసు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కాత్యాయిని తెలిపారు. రావులపాలెం, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లిలో గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై దాడులు చేశామన్నారు. తహసీల్దారు ముక్తేశ్వరరావు ఎదుట నిందితులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మామిడికుదురులో ర్యాలీలో నినదిస్తున్న మహిళలు

శుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం

మామిడికుదురు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటిస్తే పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని నినదిస్తూ బుధవారం మామిడికుదురులో వెలుగు కార్యాలయం నుంచి డ్వాక్రా సంఘాల మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మరుగుదొడ్ల శుభ్రత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో డీపీఎం అన్నపూర్ణ, ఏపీఎం వెంకటరమణ, క్షేత్ర సమన్వయకర్తలు, వీవోఏలు పాల్గొన్నారు.

మలికిపురం: మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్డి వినియోగంపై అవగాహన కల్పించుకోవాలని ఏపీఎం షేక్ సయాద్ విజ్ఞప్తి చేశారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

ఆత్రేయపురం: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని ఆత్రేయపురం సహకార సంఘ అధ్యక్షుడు ముదునూరి రామభద్రిరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆత్రేయపురంలో విశ్రాంత ఉద్యోగి అల్లు రామకృష్ణ పురాతన నాణేలు, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం గ్రంథాలయ శాఖలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

కొత్తపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి ఎక్సైజ్ సీఐ కాత్యాయని పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు దేశభక్తి, జానపద గీతాల పోటీలు నిర్వహించారు.

నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, తదితరులు

ఇందిరాగాంధీ సేవలు ఎనలేనివి

మామిడికుదురు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి ఎనలేని సేవలు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా స్థానిక 216 జాతీయ రహదారి కూడలిలో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, నాయకులు నీతిపూడి బాలసత్యనారాయణ, వానరాశి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్లకు ప్రవేశాలు

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సింగిల్ మేజర్ ప్రోగ్రాంలో భాగంగా ఖాళీగా ఉన్న సీట్లకు తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ పి.సాయిబాబు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలలో పలు గ్రూపుల్లో ఉన్న ఖాళీ సీట్లకు ఈ నెల 20 వరకు ప్రవేశాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94409 76477, 94412 36120 చరవాణి నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి

రాజోలు, న్యూస్‌టుడే: పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పెంచాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని దళిత చైతన్య వేదిక నాయకులు అన్నారు. ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చుట్టుగుళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో పాలగుమ్మిలో కరపత్రాలు అందజేశారు. బత్తుల మురళీకృష్ణ, విప్పర్తి సాయిబాబు, శ్యాంబాబు, చిలకపాటి శ్రీధర్, లిఖితపూడి బుజ్జి, మట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో సఖినేటిపల్లి మండలంలో సేవలందించి కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం పొందిన తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావును మండల చౌకడిపోల డీలర్లు బుధవారం సన్మానించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, ఇతర నిత్యావసర సరకులను బాధితులు అందరికీ అందేలా చర్యలు తీసుకున్నారని అభినందించారు. డీటీ రాజు, కొమ్ముల ప్రసాద్, డీలర్లు పాల్గొన్నారు.

వీధులన్నీ చెత్తమయం

న్యూస్‌టుడే - రాజోలు

• కొలిక్కిరాని డంపింగ్ యార్డ్ సమస్య

రాజోలులో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏ వీధి చూసినా చెత్తమయంగా కనిపిస్తోంది. చెత్త తరలించే స్థలం లేక రహదారుల పక్కన గుట్టలుగా వేసేస్తున్నారు. అక్కడే నిప్పులు పెడుతుంటంతో స్థానికులు, ప్రయాణికులు కాలుష్యంతో సతమతం అవుతున్నారు. ఇరవై సంవత్సరాల క్రితం డంపింగ్ యార్డ్ కోసం స్థలాన్ని పరిశీలించగా సమీప నివాసితులు వ్యతిరేకించడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి పెట్టకపోవడంతో పరిష్కారం కాలేదు.

ఏటిగట్టు పక్కన వద్దనడంతో..

రాజోలులో నిత్యం సేకరించే వ్యర్థాలను ఇప్పటి వరకు వశిష్ఠ ఏటిగట్టు పక్కన వేసేవారు. ఏటుగట్టు రక్షణ పనుల నిమిత్తం అధికారులు అక్కడ వ్యర్థాలు వేయడాన్ని నిలిపివేశారు. పంచాయతీ సిబ్బంది వ్యర్థాలను రహదారుల పక్కన వేసేస్తున్నారు. ఇటీవల సోంపల్లి, శివకోటిలో వ్యర్థాలు వేయడాన్ని ఆయా గ్రామస్థులు అడ్డుకున్నారు. తాత్కాలికంగా కొద్ది రోజులు ఏటిగట్టు పక్కన వేసేందుకు ఆ శాఖాధికారులను ఒప్పించారు. ఇప్పుడు అక్కడ పనుల నిమిత్తం వారు కూడా చెత్త వేయొద్దనడంతో ఏంచేయాలో తెలియక పంచాయతీ అధికారులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాజోలులో ఓ వీధిలో పేరుకుపోయిన వ్యర్థాలు

త్వరలో పరిష్కారం..

డంపింగ్ యార్డ్ స్థలం కోసం అన్వేషిస్తున్నాం. జనావాసాలకు దూరంగా ఉండే స్థలాన్ని సేకరించి సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు చేస్తాం. అప్పటి వరకు ప్రత్యామ్నాయం చూస్తున్నాం.

- కె.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో, రాజోలు

శీల సమాధి ప్రజ్ఞ
శ్రద్ధాంజలి
మంచికి, ప్రేమకి, ఆత్మీయతకు ప్రతిరూపంగా నిలిచిన మీ మరణం మాకు తీరని లోటు.
ఫ్యామిలీ మెంబర్స్

కీ॥శే॥ తాడి శ్రీరామ మూర్తి గారు
భార్య
కీ॥శే॥ తాడి జయలక్ష్మి గారు
జననం: 14-04-1937 మరణం: 11-11-2025
మోరిపోలం
కార్యస్థలం: 20-11-2025 గురువారం మధ్యాహ్నం 12 గం.లకు నాగమ్మ నిలయం, మోరిపోలం, ఆదుర్రు విలేజ్, మామిడికుదురు మండలం, డా॥ అంబేద్కర్ కోనసీమ జిల్లా నందు జరుగును.
సహపంక్తి భోజనం కలదు.
ఫోన్: 94402 33669

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

క్రాపచింతలపూడిలో లక్షపత్రి పూజ

ఆలయంలో ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం: క్రాపచింతలపూడిలో ఉమా వల్లభేశ్వర స్వామి ఆలయంలో లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. పీవీఎస్ శాస్త్రి, ఆలయ అర్చకులు బాలం పూడి శ్రీరామచంద్రమూర్తి, సత్తిబాబు ఆధ్వర్యంలో లక్షపత్రి పూజను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. మాదాల నాగసత్యమంగామహలక్ష్మి, చింతల పూడి బాబూరావు, మాదాల పరంకుశం, నైనాలశెట్టి శ్రీను, ఏడిద శివ, రామాయణం రాంబాబు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - ..., ఉల్లిపాయలు - 100, చేమదుంప - 38, వంకాయలు నలుపు - 70, వంకాయలు తెలుపు - 43, కంద - 55, బీట్‌రూట్ - 54, క్యాబేజీ - 39, బెండకాయలు - 50, పచ్చిమిర్చి - 52, కాకరకాయ - 42, బీరకాయలు - 58, కాలీఫ్లవర్ - 28, క్యాప్సికం - 90, గుమ్మడి - 30, ముల్లంగి - 45, క్యాబేజీ - 38, క్యారెట్ - 60, దొండకాయలు - 60, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 25, గోరుచిక్కుడు - 45, దోసకాయలు - 35, చిక్కుడుకాయలు - 80, నిమ్మకాయలు - 30. ★ ఒక్కొక్కటి ధరలు: అనపకాయ - 30, పొట్లకాయ - 25, అరటికాయ - 6, మునగకాడ - 12, ఆకుకూరలు కట్ట - 10, కొత్తిమీర కట్ట - 30, కొబ్బరికాయ - 25.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948

అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166

కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

సమస్య: అమలాపురం గండువీధిలో దుమ్ము, ధూళి పేరుకుపోయాయి. గాలికి ఎగిరివచ్చిందని వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. -మామిడిశెట్టి రాంబాబు

సమస్య: ముమ్మిడివరంగేట్ ప్రధాన రహదారిపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. - సూరిబాబు, వ్యాపారి

సమస్య: నల్లవీధిలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నాం. -మధు

సమస్య: శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయం ఎదురుగా రహదారిపై చెత్త, ప్లాస్టిక్‌వ్యర్థాలు పేరుకుపోయాయి. వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - రవికుమార్

సమస్య: ప్రాంతీయ ఆసుపత్రి ఎదురుగా మురుగుకాలువలో వ్యర్థాలతో పూడుకుపోయింది. మురుగు ముందుకు కదలక దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. -వలవల శివరావు, వ్యాపారి.

పరిష్కారం: గండువీధి, ముమ్మిడివరంగేట్, నల్లవీధి, శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, ప్రాంతీయ ఆసుపత్రి సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వారు సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

వణికిస్తున్న సమస్యలు

వసతి గృహాల్లో సౌకర్యాల లేమి

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, ముమ్మిడివరం

పరిశీలన

ఎండాకాలంలో భరించలేని వేడిమి, వర్షాకాలంలో గోడలు, గదులకు చెమ్మ, శీతాకాలంలో సాయంత్రమైతే చలి తీవ్రతతో వసతి గృహాల్లోని పిల్లలు అవస్థలు పడుతున్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని వసతి గృహాలను పలు సమస్యలు వెంటాడుతున్నాయి. పరీక్షల సమీపిస్తున్న వేళ చదివేందుకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో పిల్లలు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

● ఎర్రవంతెన దిగువున నిర్మానుష్య ప్రాంతంలో రూ.48 వేల అద్దెకు పెంకుటింట్లో వెనకబడిన తరగతుల బాలుర వసతి గృహం నిర్వహిస్తున్నారు. చలికి బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు గడుపుతున్నారు. చుట్టూ ఖాళీ స్థలం, గజాలతో వరండా, చుట్టూ చెట్లతో శిథిల పెంకుటింటిలో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు 35 మంది పిల్లలు ఉన్నారు. సరైన తలుపులు, కిటికీలు దోమల మెష్‌లు లేవు. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని వాపోతున్నారు.

● కొంకాపల్లి బాలుర సాంఘిక సంక్షేమ వసతిగృహం సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం చేస్తామని చెప్పినా అది పూర్తి కార్యరూపం దాల్చలేదు. కొన్ని కిటికీలకు దోమల తెరలు చిరిగిపోయాయి. కొత్తగా కట్టిన మరుగుదొడ్లకు నీటి వసతి లేదు.

● మద్దులవారిపేట కళాశాల సాంఘిక సంక్షేమ వసతి గృహానికి రూ.45 వేలు అద్దె చెల్లిస్తున్నారు. మెష్ లేక దోమలతో విద్యార్థులు బాధపడుతున్నారు.

గురుకులంలో..

తాళ్లరేవు: చొల్లంగిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 380 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరంతా నేలపైనే నిద్రిస్తున్నారు. మంచాల సదుపాయం లేదు. హై ఓల్టేజ్ సమస్యతో ఫ్యాన్లు, లైట్లు, మోటార్లు దెబ్బ తింటున్నాయి. ఇక్కడి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వంట, భోజనశాలకు సంబంధించి భవనాల కిటికీలకు ఇనుప చట్రాలు లేవు. వంటశాల పై కప్పు బీటలు దేరింది. భోజన శాల వద్ద ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదు. ప్రహరీ 200 మీటర్లు కూలింది. ఇక్కడి సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని ప్రిన్సిపల్ ప్రశాంతి తెలిపారు.

బీసీ బాలుర వసతి గృహం

కాట్రేనికోన: కాట్రేనికోనలోని బీసీ బాలుర వసతిగృహంలో మండలంలోని తీరగ్రామాలకు చెందిన 22 మంది పిల్లలు ఉంటున్నారు. వీరికి ఇబీపీలు దుప్పట్లు, జంబుకానాలు అందించారు. వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. దోమలు కట్టకుండా దోమ తెరలు ఏర్పాటు చేయాలి. ఆర్వోప్లాంటు వద్ద స్విచ్‌బోర్డు పాడైంది.

కొంకాపల్లి బాలుర సాంఘికసంక్షేమ వసతిగృహంలో విరిగిపోయిన దోమమెష్ పరిస్థితి

ముమ్మిడివరంలోని బీసీ బాలుర వసతి గృహంలో నేలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

చొల్లంగిపేట గురుకులంలో పని చేయని ఆర్వో ప్లాంట్

సందేశాత్మక ముగ్గులు

యానాం: ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీ ఆకట్టుకుంది. మత్స్యశాఖ ఏడీ దడాల గొంతెయ్య, కొల్లు శ్రీవెంకట కృష్ణం రాజు పోటీల్ని పర్యవేక్షించారు.

కరపత్రాల ఆవిష్కరణ

అమలాపురం గ్రామీణం: ది అరిగెల బలరామమూర్తి సాహితీ కూటమి తృతీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 22న అంబాజీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను అమలాపురంలోని జిల్లా రవాణాధికారి కార్యాలయంలో డీటీవో దేవిశెట్టి శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. అరిగెల బలరామమూర్తి, బి.వి.వి.సత్యనారాయణ, ఎన్.నాగభూషణం, మారిశెట్టి మల్లేశ్వరరావు, కోటిపల్లి మల్లేశ్వరరావు, యం.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్‌ను ప్రారంభిస్తున్న విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే ఆనందరావు

ప్రజల ఆరోగ్యానికి కృషి: ఎంపీ

అమలాపురం పట్టణం: ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వ కృషి చేస్తోందని విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. అమలాపురం హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులో రూ.27 లక్షలతో ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లకు ఎంపీ, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, చిట్టా జగదీశ్వర్, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా పురస్కారాలు

అమలాపురం పట్టణం: ఉద్యోగ, వ్యాపారాలతో పాటు ఆరోగ్యం కాపాడుకునేందుకు ప్రతి కుటుంబం ప్రయత్నించాలని వాకర్స్ అంతర్జాతీయ జిల్లా 103 గవర్నర్ సప్పా నాగేశ్వరరావు తెలిపారు. అమలాపురంలో బుధవారం జిల్లాలోని వివిధ క్లబ్‌లకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గోకరకొండ నాగేంద్ర, బోణం సత్యవరప్రసాద్, పీఎస్ శర్మ, నాయుడు, జల్లి సుజాత, పుత్స కామేశ్వర్‌లకు అవార్డు ప్రదానం చేసి సత్కరించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ సందర్భంగా నియోజకవర్గ స్థాయి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 23,499 మంది రైతులకు రెండో విడత రూ.7 వేలు చొప్పున రూ.15.43 కోట్లు అందించినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, చిలువూరి సుబ్బరాజు, అర్థాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఐ.పోలవరంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

జనసేన కార్తీక వనసమారాధన

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎ.వేమవరం లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సమీపంలో అమలాపురం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మూడు మండలాల తోపాటు పట్టణంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బొక్కా చిన్ని, శ్రీనివాసరావు, చిన్ని పాల్గొన్నారు. సందడి వాతావరణం నెలకొంది.

కార్యక్రమంలో జనసేన నాయకులు

శెట్టిబలిజ.. కాట్రేనికోన: కాట్రేనికోన గ్రామ శెట్టిబలిజ కార్తీక వనసమారాధన బుధవారం స్థానిక వినాయక గుడి సమీపంలో ఘనంగా నిర్వహించారు. మహిళలంతా ఉసిరిచెట్టుకు పూజలర్పించారు. పిల్లలు సంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, ఆనందరావు, గుత్తుల సూరిబాబు,

కాట్రేనికోన: ఉసిరిచెట్టుకు పూజలు

విద్యార్థినికి అభినందన

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని హెచ్‌ఆర్‌ఐటీ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన 44వ షూటింగ్ బాల్ పోటీల్లో కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గెడ్డం మేఘన ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రం పొందడం పట్ల పలువురు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు గోవర్ధనగిరిరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ జయసు బాబ్జి ఆధ్వర్యంలో మేమనను సన్మానించారు.

సామాజిక తనిఖీపై అవగాహన

అంబాజీపేట, న్యూస్‌టుడే: సామాజిక తనిఖీలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించామని, వాటిని తక్షణమే సవరించి నివేదిక అందజేయాలని సమగ్ర శిక్ష డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ హెచ్.ఎం.లకు సూచించారు. మండల రిసోర్స్ భవనంలో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జిల్లాలోని ప్రాథమిక, జడ్పీ హైస్కూల్ హెచ్.ఎం.లకు, ఎస్ఎంసీ ఛైర్మన్లకు సామాజిక తనిఖీపై బుధవారం సమావేశం నిర్వహించారు.

నీరు నిలిచి అవస్థలు

కాట్రేనికోన మండలం కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల చెంతన ఉన్న సీసీ రోడ్డుపక్కన రోజుల తరబడి నీరు నిలిచిపోయింది. దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. రహదారికి బెర్మలు లేకపోవడంతో చిన్నపిల్లలు నడిచివెళ్లినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. నిల్వ నీటిని తొలగించి బెర్మలు నిర్మించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఆదమరిస్తే అంతే..!

అమలాపురంలోని 29వ వార్డులో బైపాస్ రహదారి రాయల్ పెట్రోలు బంకు వద్దకు వచ్చే రహదారిపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి కింద డ్రెయిన్ ఉంది. దీనిపై స్లాబ్‌కు పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. -న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

భవనం పూర్తయ్యేదెన్నడో..!

అమలాపురం మండలం సవరప్పాలెంలో గ్రంథాలయ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఈ నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తికాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రంథాలయాన్ని అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేందుకు మరిన్ని నిధులు సమకూర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

తూడు ఇలా.. నీరు పారేదెలా..

చల్లపల్లి- ఎస్.యానాం కొత్తకాలువ తూడు, గుర్రపు డెక్కతో మూసుకుపోయి అధ్వానంగా మారింది. ఈ పూడికలు ప్రవాహానికి ఆటంకంగా మారాయి. ఈ పంట కాలువపై ఎక్కువ మంది చేపల చెరువులు సాగు చేస్తున్నారు. అధికారులు కాలువలో తూడు తొలగించి ప్రవాహన్ని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఇలా వదిలేశారు..!

యానాంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం ప్రహరీ పక్క నుంచి యర్రాగార్డెన్, బెజవాడగార్డెన్లకు వెళ్లే మార్గంలో డ్రెయినేజీ పైన వేసిన ఇనుప పలక ఊచలు విరిగి వాహనచోదకులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉంది. నిత్యం వందల మంది ప్రధానంగా విద్యార్థులు రాకపోకలు సాగించే ఈ రహదారిలో పగిలిపోయిన ఇనుప పలక గురించి పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం పరిశీలించారు. తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజాపనులశాఖాధికారులను ఆదేశించారు. -న్యూస్‌టుడే, యానాం

సొంత మండలాల్లోనే కొనసాగించాలి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష 2011 నోటిఫికేషన్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికైన తమను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తామనడం దారుణమని సీఆర్‌పీలు.. డీఈఓ షేక్ సలీంబాషా, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. సొంత మండలాల్లోనే పనిచేసే విధంగా తమను ఎంపిక చేశారన్నారు. ఇతర జిల్లాలకు పంపిస్తే ప్రస్తుతం ఇస్తున్న నెల జీతం రూ.23,500 ఇంటి అద్దె, ఇతర అవసరాలకు ఎలా సరిపోతాయని పేర్కొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషాకు వినతిపత్రం అందిస్తున్న సీఆర్‌పీలు

పల్లంకుర్రులో రచ్చబండ

కాట్రేనికోన: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా కోటి సంతకాల సేకరణలో భాగంగా బుధవారం పల్లంకుర్రులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం తగదన్నారు. సర్పంచి నాతి అలివేణి, నాతి సత్యనారాయణ, కిషోర్, మునికుమారి పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యానాం వాసి దుర్మరణం

బిట్రగుంట, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జంక్షన్ నుంచి కాకినాడ పోర్టు వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు కదులు తుండగా దిగి యానాంకు చెందిన నూకరాజు(50) దుర్మరణం చెందారు. బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. నూకరాజు ఆరుగుర్ని వైద్యపరీక్షల నిమిత్తం చెన్నై తీసుకువెళ్లారు. స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు చెన్నైలో రైలు ఎక్కారు. స్లీపర్ బోగీ నుంచి జనరల్ బోగీలోని తనతో వచ్చిన వారి వద్దకు వెళ్లేందుకు బిట్రగుంలో రైలు ఆగక ముందే దిగడంతో చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు.

యాప్‌తో మోసాలకు అడ్డుకట్ట

యానాం, న్యూస్‌టుడే: ప్రతి వినియోగదారుడు ఔషధ ధరల్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకునేందుకు కేంద్ర ఔషధ ధరల నియంత్రణ మండలి 'ఫార్మా సాహి దామ్' యాప్‌ను ప్రవేశపెట్టిందని పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ అన్నారు. పుదుచ్చేరి ఔషధ ధరల పర్యవేక్షణ, వనరుల విభాగం ఈ యాప్‌పై బుధవారం స్థానిక ఎస్సార్కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించింది. ప్రాజెక్టు కోఆర్డినేటర్ షబ్నా, క్షేత్రస్థాయి తనిఖీ అధికారి అఫ్రీన్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.భాస్కరరెడ్డి, డాక్టర్ శాంతకుమార్, డాక్టర్ చెల్లే నరేష్, డాక్టర్ ఈ ఆనందకృష్ణ పాల్గొన్నారు.

వినతి పత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

సర్వే నిలుపుదల చేయాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ నిమిత్తం అమలాపురం పరిధిలో బైపాస్ రహదారి ఆనుకుని ఉన్న భూముల్లో అధికారులు చేపడుతున్న భూ సర్వేను నిలుపుదల చేయాలని సంబంధిత భూయజమానులు డిమాండ్ చేశారు. బుధవారం వారు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో తమ భూముల నుంచి బైపాస్ రహదారి విస్తరణ సమయంలో పరిహారం విషయంలో ఇబ్బందులకు గురి చేయకుండా అభివృద్ధికి తోడ్పాటు అందించామన్నారు. మిగిలిన భూములు విలువ పెరుగుతుందని ఆశపడ్డామని, మళ్లీ రైల్వే నిర్మాణం కోసం తమ భూములనే సర్వే చేయడం తగదన్నారు. రేఖపల్లి సోమశేఖరరావు, రంకిరెడ్డి సూర్యనారాయణ, శ్రీనివాసరావు, సత్తి ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఫిర్యాదు

అల్లవరం, న్యూస్‌టుడే: వైద్యుడు బాలరాజు తమను వేధింపులకు గురి చేస్తున్నారని గోడిలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే ఆనందరావుకు ఫిర్యాదు చేశారు. గతంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి దుర్గారావుదొరకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై జిల్లావైద్యారోగ్య శాఖ అధికారి దుర్గారావు దొర వివరణ కోరగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, విచారణ చేయించి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

22న చాగంటి ప్రవచన కార్యక్రమం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం జడ్పీ బాలుర పాఠశాలలో శనివారం నిర్వహించే చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కోరారు. అమలాపురం జడ్పీ బాలుర పాఠశాలలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ పాఠశాల ప్రారంభించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు.

సరుగుడు తోట పరిశీలన

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీరం వెంబడి పెరుగుడు భూముల్లో ఉన్న సర్వే తోటను కొంత మంది అనధికారికంగా నరికి తరలిస్తున్నారని గ్రామస్థులు ఆర్డీవో కె.మాధవికి ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ నరసింహారావు సిబ్బందితో కలిసి పరిశీలించారు. పూర్తి స్థాయి సర్వే చేపట్టి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

కాట్రేనికోన: ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకటాచలం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం శ్రీనివాసరాజు, నాగరాజు, డ్వాక్రా సంఘ సభ్యులు, ఏనిమేటర్లు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడాలని భాజపా జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ పేర్కొన్నారు. నడవపల్లిలో బుధవారం ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు కరపత్రాలు అందించారు. సూరిబాబు, దొమ్మేటి పల్లవి, వెంకటరావు, త్రినాథ్ వర్మ, రాజారావు, నాని సూర్య తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల పరిశీలన

రెండో స్థానంలో నిలిచిన యానాం

యానాం, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో చేపట్టిన ప్రత్యేక విస్తృత ఓటర్ల పరిశీలన యానాంలో చురుగ్గా జరుగుతోంది. 40,043 మంది ఓటర్లున్న యానాంలో 33మంది బీఎల్‌వోలు మరో 33 మంది సహాయకులతో ఇంటింటికి తిరిగి 37000 మందికి దరఖాస్తుల్ని పంపిణీ చేసినట్లు పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఓటర్లను చైతన్య పరచడానికి పరిశ్రమల కేంద్రం శిక్షకులతో పాటు, జాతీయ సేవాపథకం కార్యకర్తలను, రాజకీయ పార్టీల ఏజెంట్లను వినియోగిస్తున్నారు. బుధవారం నాటికి 14,564 మంది తమ వివరాలతో పత్రాలు అందజేశారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న 30 నియోజకవర్గాల్లో మన్నాడిపేట 42.99 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా యానాం 39.34 శాతం(14,564)తో ద్వితీయ స్థానంలో నిలిచింది. కేవలం 15.78 శాతంతో కామరాజనగర్ ఆఖరు స్థానానికి చేరుకుంది. పుదుచ్చేరి మొత్తం మీద 28 శాతం మంది ఓటర్లు తమ వివరాల్ని అధికారులకు అందజేశారు.

అంకిత్‌కుమార్

ఎన్నికల కమిషన్ దృష్టికి సమస్యలు

2002 ఓటర్ల జాబితా ప్రాతిపదికగా జరుగుతున్న ఈ పరిశీలనలో సరిహద్దు ఆంధ్రప్రదేశ్ జాబితా నుంచి వివరాలు సేకరణలో ఎదురౌతున్న ఇబ్బంది గురించి పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారి జవహర్, కలెక్టర్ కుళోత్తుంగన్‌ల దృష్టికి తీసుకెళ్లారు. 2002 ఓటర్ల జాబితా పోర్టల్లో ఓటర్లు ఏ నియోజకవర్గంలో ఏ వార్డులో ఉన్నది స్పష్టంగా తెలియజేసేలా మార్పు చేయాలని కోరారు. ఓటర్లు దరఖాస్తులు పూర్తి చేసి ఇవ్వాలని, ఫోటో అంటించడం తప్పనిసరి కాదని అంకిత్‌కుమార్ సూచించారు. నవంబరు 25 నాటికి ఓటర్ల నుంచి దరఖాస్తుల సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈలోగానే దీనిని పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. ఎస్ఐఆర్ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, ప్రతి నాలుగు గంటలకు జాబితాను అప్‌డేట్ చేస్తున్నామని పేర్కొన్నారు.

బరువు ఎత్తుతున్న బాలిక

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అమలాపురం గ్రామీణం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.కె.సలీంబాషా సూచించారు. ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల ఎంపికలను బుధవారం నిర్వహించారు. అండర్-17 బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

(c) eenadu

మండపేట

•మండపేట •రామచంద్రపురం

జ్యోతిర్లింగార్చన

రామచంద్రపురం: రామచంద్రపురం ముచ్చుమిల్లి రోడ్డు సాయిబాబా వారి ఆలయంలో ఆలయ అర్చకులు గాడేపల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జ్యోతిర్లింగార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు దీపాలను వెలిగించి శివునికి పూజలు, అభిషేకాలు చేశారు.

భోజనశాలల్లో తనిఖీలు

మండపేట: పట్టణంలో బేరకాస్ మండి భోజనశాలలో బుధవారం జిల్లా ఆహారభద్రత అధికారులు తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించారు. మటన్ బిర్యానిపై వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో తనిఖీ నిర్వహించినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు. రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించాలని, మాంసాహారం నిల్వ ఉంచితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతోపాటు పారిశుద్ధ్యం, పర్యావరణ కార్యదర్శులు ఆర్ రాజేంద్ర, వివి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆహారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

పామర్రు: గోదావరి తీరంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం జరిగింది. తితిదే ఆస్థాన పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో ప్రధానఅర్చకులు వెలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం(బాలు) నిర్వహణలో జరిగింది. ఉదయం నుంచి వినాయకపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, స్వామివారికి మహన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, శిఖరాగ్ర కుంభాభిషేకం జరిపారు. అనంతరం లక్ష మారేడు దళాలతో స్వామివారికి అర్చన, పార్వతీదేవికి సామూహిక కుంకుమార్చన జరిపించారు.

సోమేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఏకాదశ రుద్రాభిషేకం

మండపేట: కార్తిక మాసం చివరి రోజులు కావడంతో బుధవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్ప దీక్ష, శివదీక్ష చేపట్టిన మాలధారులు పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకుడు అయినవిల్లి విజయానంద్ ఆధ్వర్యంలో స్వామికి అలంకరణ చేపట్టారు.

ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

వసతి గృహాలు.. పీడిస్తున్న అసౌకర్యాలు

పరిశీలన

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాల్లో చలికాలంలో అనేక సమస్యలు విద్యార్థులను వెంటాడుతున్నాయి. రెండుచోట్లా భవనాలు పెచ్చులు ఊడిపోవడంతో బిక్కుబిక్కుమంటూ నిద్రిస్తున్నారు. దీంతో పాటు భవనాలు పాతవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మెస్‌లు సక్రమంగా లేకపోవడంతో చలికి వణుకుతూ దోమలతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మండపేట, రామచంద్రపురం

రాత్రీ పగలు బిక్కుబిక్కుమంటూ..

మండపేట న్యూకాలనీలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల నిద్రించే గది పైభాగంలో పెచ్చులు ఊడి పోవడంతో రాత్రి పగలు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. చింతూరు, యర్రంపేట, మారేడుమిల్లి వంటి ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన 42 మంది విద్యార్థులు మండపేట ఒకేషనల్ కళాశాలల్లో చదువుతున్నారు. ఈ వసతి గృహంలో అన్ని కలిపి 9 గదులు ఉండగా వీటిలో 5 గదులు పడుకునేందుకు వినియోగిస్తున్నారు. మిగిలిన వాటిలో కార్యాలయం, స్టోర్‌రూముగా వినియోగిస్తున్నారు. సుమారు 4 దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల వర్షాలకు శ్లాబు నీరు లీకై సిమెంటు పెచ్చులు ఊడి పడుతున్నాయి. మేడమెట్లపై గది పైభాగం మొత్తం కూలిపోవడంతో నీరు వరండాలోకి వస్తోంది. పడకగదులకు దోమల మెష్ లేకపోవడంతో దోమల బాధ ఎక్కువగా ఉంది.

పెచ్చులూడిపోతున్న వసతిగృహం

నిధులు సరిపోలేదు..

ఇటీవల రూ.1.20లక్షలతో చప్టా, గచ్చులు వంటి మరమ్మతులు చేసినప్పటికీ తగినన్ని నిధులు విడుదల చేయక మిగిలిన పనులు పూర్తి చేయలేదు.

– అనిల్‌కుమార్, వార్డెన్, మండపేట

భవనం శిథిలం..

ప్రహరీ పడిపోతుంది.. భవనం శిథిలావస్థకు చేరింది.. రామచంద్రపురం ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో 50 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులు, మరో 50 మంది కళాశాల స్థాయి విద్యార్థులు ఉంటున్నారు. భవనం లోపల గదుల్లో కిటికీలకు డోర్లు సరిగా లేవు, దోమలకు కట్టిన తెరలు చిరిగిపోయాయి. ప్రహరీకి పెద్ద రంధ్రం పడటంతో వెనుక భాగం నుంచి పిల్లలు బయటకు, లోపలకు తిరుగుతున్నారు. జక వంటగది నుంచి పెచ్చులూడి వర్షానికి నీటి చుక్కలు కారుతున్నాయి.

మెస్ చిరిగిన దృశ్యం

ప్రహరీకి రంధ్రం పడటంతో బయటకు వెళ్లి వస్తున్న విద్యార్థి

వేరే భవనానికి మారుస్తాం..

విద్యార్థులను వీలైనంత త్వరగా వేరే భవనానికి మారుస్తాం. భవనం అద్దెకు దొరకపోవడంతో ఆలస్యం అవుతుంది. సత్వరమే చర్యలు తీసుకుంటాం.

– కె.ఏడుకొండలు, వార్డెన్, రామచంద్రపురం

కోరం లేక వీగిన అవిశ్వాస తీర్మానం

✦ వైకాపాకి 14 మంది మద్దతు ఉందని చెప్పి 9 మంది హాజరు

✦ మండపేట ఎంపీపీగా వుండమట్ల వాసు కొనసాగింపు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట ఎంపీపీ వుండమట్ల వాసుపై వైకాపా ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం బుధవారం వీగిపోయింది. గత నెల 23న వైకాపా ఎంపీటీసీ సభ్యులు 14 మంది వాసు పార్టీ ఫిరాయించారని అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని తమకు 14 మంది ఎంపీటీసీల మద్దతు ఉందని రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు ఫిర్యాదు చేశారు. బుధవారం ప్రత్యేక మండల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్డీవో ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. మండపేట మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అత్యవసర సమావేశం ఆర్డీవో అధ్యక్షతన నిర్వహించారు. తెదేపా, వైకాపా కలిపి మొత్తం ఎంపీటీసీ సభ్యుల సంఖ్య 20 మంది ఉండగా వీరిలో సమావేశానికి 2/3 వంతు (11/20 మంది) సభ్యులు కోరం హాజరుకావాల్సి ఉంది. కాని సమావేశానికి వైకాపాకు చెందిన 9 మంది ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు వరకు వేచిచూసినా సభ్యులు రాకపోవడంతో కోరం లేదనే కారణంతో అవిశ్వాస తీర్మానం రద్దు చేస్తున్నట్టు ఆర్డీవో అఖిల ప్రకటించారు. ఎంపీపీ వుండమట్ల వాసునే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ● వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగిపోయి కొంత మంది సభ్యులు పార్టీ ఫిరాయించారన్నారు. మండపేట గ్రామీణ ఎస్సై వి.కిషోర్ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమావేశం అనంతరం బయటకు వస్తున్న ఆర్డీవో అఖిల, ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి

'వైకాపా కోటి సంతకాల సేకరణ దిగజారుడు చర్య'

రామచంద్రపురం: రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణపై రామచంద్రపురం కూటమి పార్టీ నాయకులు మండిపడ్డారు. బుధవారం ఉమ్మడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కేపీపీ ట్రస్టు ఛైర్మన్ సలాది నాయుడు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కంచుమర్తి బాబూరావు, శివాలయం ట్రస్టు బోర్డు ఛైర్మన్ గణేష్ శర్మ తదితరులు మీడియాతో మాట్లాడారు. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. వైకాపా నాయకులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, పిల్లి సూర్యప్రకాష్‌లు మరింత దిగజారిపోయి విద్యార్థులతో సంతకాలు సేకరణ చేయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గరికపాటి సూర్యనారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, తెదేపా మాజీ పట్టణ అధ్యక్షులు కడియాల రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

'వైద్యకళాశాలలపై ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి'

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌లు నిర్వహించారు. వైకాపా కార్యకర్తలతో కలిసి వి.ఎస్.ఎం కళాశాల వద్ద బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని ఎంపీ తెలిపారు. ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మండల వైకాపా కన్వీనర్ పోలినాటి వర ప్రసాద్, పెమ్మిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: వేగుళ్ల

రాయవరం, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం రాయవరంలో నియోజకవర్గ రైతాంగానికి 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' రెండో విడత రూ.12.42 కోట్ల సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లోని 18,229 మంది రైతులకు సొమ్ములు ఆయా ఖాతాల్లో జమ అవుతాయన్నారు. జమ అయ్యే అంశాల్లో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు. తొలుతగా పీఎం మోదీ, సీఎం చంద్రబాబు పాల్గొన్న సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను ఎమ్మెల్యే రైతులతో కలిసి డిజిటల్ తెరపై వీక్షించారు. సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండపేట ఏఎంసీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ప్రత్యేకాధికారి ఓ.రామకృష్ణ, రామచంద్రపురం వాటర్ డీసీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సహకార సంఘాల అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి, పిల్లి గణేష్, లొల్ల సర్పంచి చాట్రాతి జానకీ రాంబాబు, నాయకులు పరమహంస, వేణుగోపాలదొర, కర్రి వెంకటరెడ్డి(కృష్ణ), కాదాప్రభాకరరావు, మాజీ వైస్ ఎంపీపీ దేవు శ్రీను, రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రాయవరంలో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రైతు సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యత

పామర్రు: కె.గంగవరంలో బుధవారం అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు రైతులకు పంపిణీ చేసే కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు. నియోజకవర్గానికి రెండో విడతలో 24,092 మంది రైతులకు రూ.16.51కోట్లు విడుదలయ్యాయన్నారు. రామచంద్రపురంలో 7770, కె.గంగవరంలో 7458, కాజులూరులో 8864 మంది రైతులకు ఈ నిధులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, ఏడీఏ బి.నాగకుమార్, తహసీల్దార్ శ్రీరామ్, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు బలుసు శివప్రసాద్, డీసీలు సుబ్రహ్మణ్యం, కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

సిబిల్ స్కోర్ ఉంటేనే పీఎం స్వానిధి రుణాలు

మండపేట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి స్వానిధి పథకం చిరు వ్యాపారుల అభివృద్ధికి దోహద పడుతుందని మెప్మా సీఎంఎం సుజాత తెలిపారు. బుధవారం స్థానిక కెనరాబ్యాంకులో పీఎం స్వానిధి పథకం ద్వారా రుణాలు పొందేందుకు 126 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 60 సంవత్సరాల లోపు వారందరికి ఇది వర్తిస్తుందన్నారు. మొదటిసారి రూ.15వేలు, రెండోసారి రూ.25 వేలు, మూడోసారి రూ.50 వేలు వడ్డీలేని రుణం పొందవచ్చన్నారు. సిబిల్ స్కోర్ ఉన్నవారికి మాత్రమే బ్యాంకు రుణాలు మంజూరుచేస్తారని కెనరాబ్యాంకు మేనేజరు ఎన్ రవికుమార్ తెలిపారు. ప్రస్తుతం సేకరించిన దరఖాస్తులు పరిశీలించి త్వరలో రుణాలు మంజూరు చేయనున్నట్లు వివరించారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ టి వెంకటేష్, మెప్మా సీఓలు ఐకె రాంజీ, బి.వీరలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న బ్యాంకు అధికారులు

మొక్కలే ప్రకృతికి జీవం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మొక్కలే ప్రకృతికి జీవం పోస్తాయని.. ప్రతి మొక్క భవిష్యత్తులో మనకు నీడ, ఆక్సిజన్ అందిస్తాయని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ రాజు, కూటమి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక రత్నంపేట, లెప్రసీ కాలనీ సమీపాల్లో మొక్కలు నాటారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4లక్షలు మంజూరయ్యాయని వాటి ద్వారా హరితవనం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కేపీపీ ట్రస్టు ఛైర్మన్ సలాది నాయుడు, తెదేపా పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, వాసు, బాబూరావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న వాసంశెట్టి సత్యం

ఆడారు.. పాడారు.. ఆనందించారు

టగ్‌ఆఫ్ వార్‌లో రామచంద్రపురం కౌన్సిలర్లు-మున్సిపల్ అధికారులు

రామచంద్రపురం: రాజకీయ నాయకులు, కౌన్సిలర్లు, పురపాలక అధికారులు, సిబ్బంది రామచంద్రపురం ఎన్‌వీఆర్ ఫంక్షన్‌హాలు వేదికగా బుధవారం సమ్మేళనమయ్యారు. వాసంశెట్టి సత్యం, జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, వైకాపా కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాటలకు నృత్యాలు చేశారు. టగ్‌ఆఫ్ వార్ పోటీలు ఆడారు. కె.బాబూరావు, నానాజీ, చందమామ వాసు, శ్రీనివాస్, గోపాలకృష్ణ, కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు, డీఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రామచంద్రపురం: రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు అధ్యక్షతన బుధవారం స్థానిక తిలక్ మెమోరియల్ టౌన్‌హాల్ వద్ద న్యాయవాదుల వనసమారాధన జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్‌లు పాల్గొన్నారు.

పంక్తి భోజనాల్లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట మున్సిపల్ సిబ్బంది..

మండపేట: మండపేట శివారు లేఅవుట్‌లో పురపాలక సంఘ ఉద్యోగులు ఏర్పాటు చేసిన వనసమారాధనలో ఎమ్మెల్యే జోగేశ్వరరావు, సచివాలయ, పురపాలక సంఘం ఉద్యోగులు పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఆటపాటలతో అలరించారు. మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు, కౌన్సిలర్‌లు పాల్గొని పంక్తి భోజనాలు చేశారు.

తాపేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట గ్రామీణం: మండపేట మండలం తాపేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వనసమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. విద్యార్థులు చదువులో బాగా రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచి రాజేశ్వరి, ఉపసర్పంచి వీరాంజనేయులు, విజయభాస్కరరెడ్డి, హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

కాకినాడ జిల్లాలో కలపాలని పార్టీ సభ్యత్వానికి రాజీనామా

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని డిమాండు చేస్తూ రామచంద్రపురం తోటపేట గ్రామానికి చెందిన న్యాయవాది, జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు ఆళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన గత ఎన్నికల్లో కూటమి పార్టీ గెలుపునకు క్రియాశీలక పాత్ర పోషించారు. త్వరలో జిల్లా విలీనం కోసం జరిగే ఉద్యమంలో కీలక పాత్ర పోషించనున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు.

ఆళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు

తెదేపా పదవికి దొమ్మలపాటి...

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ తాను నియోజకవర్గ న్యాయ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు న్యాయవాది, రామచంద్రపురం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ బుధవారం విలేకరులకు వెల్లడించారు. 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాపురం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే చాలా కష్టాలు పడుతున్నారన్నారు. విలీనం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కేవలం పదవికే రాజీనామా చేస్తున్నట్లు.. పార్టీకి కాదని పేర్కొన్నారు.



దొమ్మలపాటి సత్యనారాయణ

తండ్రి పాడె మోసిన కుమార్తెలు..

మండపేట గ్రామీణం: కమ్యూనిస్టు కురువృద్ధుడు బండారు లక్ష్మణస్వామి అంతిమ యాత్ర జాతీయ, రాష్ట్ర వామపక్ష నాయకులు, ప్రజల సందర్శనార్థం ఏడిద గ్రామంలో ఆయన స్వగృహం వద్ద ఉంచి అనంతరం బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. బంధుమిత్రుల జోహార్లతో అంతిమయాత్ర కొనసాగింది. తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన రుణం కొంతైనా తీర్చుకోవాలనే ఉద్దేశంతో అంతిమయాత్రలో కుమార్తెలు సావిత్రి, యేసమ్మ, ప్రభ పాడె మోసారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త స్టాలిన్, కామన ప్రభాకరరావు, చల్లా రవికుమార్, ఏపీ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు చంద్రా నాయక్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, కమ్యూనిస్టు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పాడె మోస్తున్న బండారు కుమార్తెలు

కిశోర బాలికలకు అవగాహన సదస్సు

రాయవరం: బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండపేట ఐసీడీఎస్ పీవో యు.పూర్ణిమ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ నిర్వహించిన అవగాహన సదస్సులో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో ఎన్.కీర్తిస్పందన మాట్లాడుతూ స్త్రీ, పురుష లింగవివక్షత లేకుండా చిన్నారుల విద్యా వికాసానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకమైందన్నారు. ఐసీడీఎస్ సెక్టార్ పర్యవేక్షకులు సునీత,విష్ణు, ఈశ్వరీ తదితరులు వైద్యం, పౌష్టికాహార సమస్యలు, రక్తలేమి తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. వుండవిల్లి రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ భాస్కర్

ఫ్యాక్టరీ ధరలకే పశువుల మిశ్రమ దాణా

పామర్రు: దళారుల ప్రమేయం, అదనపు పన్నులు లాంటివి లేకుండా ఫ్యాక్టరీ నిర్ణయించిన ధరలకే పశువుల మిశ్రమ దాణా పంపిణీ చేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారి డా.జి.సురేష్‌బాబు చెప్పారు. కె.గంగవరం మండలం ఎర్రపోతవరం సొసైటీ వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో సుమారు 170 మంది పాడి రైతులకు దాణా అందించారు. 50కేజీల బస్తాధర రూ.1020లకు అందజేస్తున్నట్లు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు సాపిరెడ్డి విశ్వనాథ బాలాజీ, సర్పంచి పిల్లి రాంబాబు, శివల నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు ఎన్.సుబ్రహ్మణ్య చౌదరి, కూటమి నాయకులు రాయపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య పాల్గొన్నారు.

సొసైటీ వద్ద దాణా అందిస్తున్న అధికారులు

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేయాలి

రామచంద్రపురం: మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలని మావోయిస్టులతో వెంటనే శాంతి చర్చలు ప్రారంభించాలని పీడీఎస్‌యూ ఏఐకేఎంఎస్, పీవైఎల్ఐ, ఎఫ్‌టీయూ ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం ఆయా నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి టైగర్ జోన్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌పై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వి.భీమశంకరం, ఐఎఫ్టీయూ నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు స్పందించారు. భద్రతా బలగాలు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని ప్రకటించినా ఇది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అని వారు తెలిపారు. హిడ్మా సహా మరికొందరిని ముందుగానే అదుపులోకి తీసుకుని దఫదఫాలుగా చిత్రహింసలకు గురిచేసి చంపి తర్వాత ఎన్‌కౌంటర్‌గా చూపుతున్నారని వారు ఆరోపించారు. ఇంకా పోలీసుల అదుపులో 15 మంది ఉన్నారని సమాచారం వస్తుందన్నారు.

శంకుస్థాపనే మిగిలింది..!

సొంత గ్రంథాలయ భవన నిర్మాణంలో మీనమేషాలు

– న్యూస్‌టుడే, మండపేట

ప్రజల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి గ్రంథాలయాలు దోహదపడతాయి. అలాంటిది మండపేట పట్టణంలో శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి 6 ఏళ్ల దాటినా ఎటువంటి కదలిక లేదు. మరోవైపు పట్టణ ప్రజలకు డిజిటల్ గ్రంథాలయం కల కూడా నేటికీ నెరవేరడం లేదు. పోటీ పరీక్షలకు వెళ్లాలన్నా, మేధాశక్తి పెంచుకోవాలన్నా, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాల గురించి తెలుసుకోవాలన్నా గ్రంథాలయాలే మూలం.

దిష్టిబొమ్మలా డిజిటల్ గ్రంథాలయ శిలాఫలకం

గ్రంథాలు భద్రపరిచేందుకు అవకాశం లేక..

64 వేల జనాభా గల మండపేట పట్టణంలో జిల్లా శాఖా గ్రంథాలయాన్ని 1980లో అద్దెభవనంలో ఏర్పాటు చేశారు. పెరుగుతున్న పాఠకులకు అనుగుణంగా అద్దె భవనాలు మార్పు చేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో అక్కల వారి వీధిలో ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు సంబంధిత యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడంతో మరలా భవనం మార్చారు. ప్రస్తుతం ఈ-సేవా కేంద్రంగా ఉన్న ఏడిద రోడ్డులోని మున్సిపల్ భవనం పైఅంతస్తులో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా ఒకే హాలుగా ఏర్పాటు చేయడంతో గ్రంథాలు భద్రపరిచేందుకు అవకాశం లేకుండా పోయింది.

అద్దెభవనంలో మండపేట గ్రంథాలయం

నిర్వహణ అగమ్యగోచరం..

పురపాలక సంఘానికి రావలసిన గ్రంథాలయ సెస్ బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోయింది. మున్సిపాలిటీలు చెల్లించక పోవడంతో గ్రంథాలయాల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. అప్పట్లో బురుగుంట చెరువు వద్ద గల మున్సిపల్ స్థలంలో నూతన భవన నిర్మాణానికి 2017లో ప్రతిపాదన చేశారు. రూ.28.96లక్షల సెస్ బకాయితో అత్యాధునిక డిజిటల్ భవన నిర్మానాకికి 2018న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడంతో శిలాఫలకం దిష్టిబొమ్మగా మారింది.

ప్రతిపాదన లేదు..

ప్రస్తుతం భవనం నిర్మాణానికి ఎటువంటి ప్రతిపాదన లేదు. గతంలో ప్రతిపాదించిన స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి తీర్మానం జరిగింది. ప్రత్యామ్నాయంగా వేరో ప్రదేశంలో స్థల సేకరణ చేయాల్సి ఉంది.

– టీవీ రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్‌ఎం.బత్తిన రాజరాజేశ్వరి లక్ష్మీబాయి దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఓ విద్యార్థి ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ కంకటాల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు జ్యోతి, రమణబాయి, కృష్ణకుమారి, భ్రమరాంబ, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారపూడిలోని వేడుకల్లో ఉపాధ్యాయులు

ఇందిరాగాంధీకి నివాళి..

రాయవరం: మాచవరం శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి బుధవారం నిర్వహించారు. గ్రంథపాలకురాలు ప్రమీల ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి సర్పంచి కత్తుల సీతామహాలక్ష్మి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

(c) eenadu

నవ సూత్రం.. జవసత్వం

భూమిని సారవంతంగా ఉంచేందుకు ప్రకృతి సాగు ఎంతో ఉపకరిస్తుంది. నవ సార్వత్రిక సూత్రాలను పాటించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సజీవ వేరువ్యవస్థ సూత్రం ప్రకారం 9 పంటల ద్వారా భూమి సారవంతంగా ఉండేలా చేయవచ్చని వారు చెబుతున్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత సాయం విడుదల కార్యక్రమంలో భాగంగా నిడదవోలులో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. దీనిని మంత్రి కందుల దుర్గేష్, జేసీ మేఘా స్వరూప్ తదితరులు ఆసక్తిగా తిలకించారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

పెద్దోళ్లకు ప్రత్యేక వైద్యం

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులకోసం ఈ నెల 21 నుంచి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా జనరల్ మెడిసిన్ ఓపీ సేవలు ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ లావణ్యకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ పని దినాల్లో పెద్ద వయసువారు ఆసుపత్రిలో చికిత్సలు పొందేందుకు ఇబ్బందిపడుతున్నారని, పనుల నేపథ్యంలో వారి వెంట కుటుంబ సభ్యులు రాలేకపోవడం గమనించామన్నారు. దాంతో వారికి ప్రత్యేకంగా ఓపీ నంబర్-4 బ్లాక్‌ను కేటాయించనున్నారు. ఆ వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సేవలు పొందవచ్చన్నారు.

అభయారణ్యం.. భీతావహం

ఈనాడు, కాకినాడ, ఈనాడు డిజిటల్, పాడేరు; న్యూస్‌టుడే-రంపచోడవరం, చింతూరు, దేవీపట్నం

పచ్చని ప్రకృతి అందాలు, పర్యాటకుల సందడితో హోరెత్తే మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తూటాలు గర్జిస్తున్నాయి. మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగి 24 గంటలు గడవకముందే.. బుధవారం తెల్లవారుజామున అడవుల్లో మరోసారి తుపాకులు పేలాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా సహా రెండురోజుల్లో మొత్తం 13 మంది నేలకొరిగారు.

కాకినాడ కోర్టులో హాజరుపర్చేందుకు మహిళా మావోయిస్టులను తీసుకువస్తున్న పోలీసులు

వెతుక్కుంటూ..

ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్'తో పెరిగిన ఒత్తిళ్ల నేపథ్యంలో మావోయిస్టులు కొందరు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతానికి వచ్చారు. పోలీసులు అణువణువూ జల్లెడ పడుతున్నారు. మంగళ, బుధవారాల్లో ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం మావోయిస్టు నేత హిడ్మా సహా ఆరుగురు మరణించగా... బుధవారం గుజ్జుమామిడివలస వద్ద మరో ఏడుగురు మృత్యువాత పడ్డారు.

● మారేడుమిల్లి సమీపంలో ఎన్‌కౌంటర్‌తో కలకలం

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి మరికొందరు మావోయిస్టులు పారిపోయారన్న సమాచారంతో పోలీసులు జల్లెడ పడుతున్నారు.

ఎక్కడికక్కడ హైఅలర్ట్

13 మంది మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మృతులు, వారి బంధువుల వివరాల నమోదులో సిబ్బంది నిమగ్నమయ్యారు. జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలతో కాకినాడ, రాజమహేంద్రి జీజీహెచ్‌ల నుంచి ఫోరెన్సిక్ నిపుణులు ఉమామహేశ్వరరావు, రమేష్, ఉత్తమ్, ప్రశాంత్, వీరభద్రరావు ఈ ఆసుపత్రికి వచ్చారు.

రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో మార్చురీ వద్ద పోలీసు బలగాలు

ఉమ్మడి జిల్లాలో సంచలనం

తూర్పు కనుమల్లో సంచరించే మావోయిస్టులు ఉన్నట్టుండి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యక్షం కావడం సంచలనం కలిగించింది. ఇద్దరు మహిళా మావోయిస్టులు అంకిత, అనూషలను సామర్లకోట మండల కొప్పవరం వద్ద, సరోజ్ మండ్వీ అలియాస్ ఓండాను కోనసీమ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురూ హిడ్మా దళంలో క్రియాశీలక సభ్యులే. అందరూ ఆపరేషన్లలో పాల్గొన్నవారే. ముగ్గురి వయసు 25 నుంచి 30 ఏళ్లలోపే.

జన స్రవంతిలోకి ఎందుకొచ్చారో..

మావోయిస్టు సరోజ్ మండ్వీ అలియాస్ ఓండా కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలోని ఓ రొయ్యల చెరువులో కొన్నినెలలుగా పనిచేస్తున్నట్లు తెలియడం చర్చకు తావిచ్చింది. ఇతనిది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రమైనా ఏళ్ల క్రితం అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రాంతానికి వచ్చి ఉంటున్నాడు. ఇక్కడ నుంచే దళంలో సానుభూతి పరుడిగా చేరి కీలక సభ్యుడిగా ఎదిగాడు.

కేంద్ర కారాగారానికి 42 మంది మావోయిస్టులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం వద్ద బుధవారం రాత్రి క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. వివిధ జిల్లాల్లో కోర్టులు రిమాండ్ విధించిన మావోయిస్టులను భారీ సంఖ్యలో తీసుకురావడంతో పోలీసు, జైళ్లశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాకినాడ జిల్లా నుంచి ఇద్దరు, కోనసీమ నుంచి ఒకరు, ఏలూరు జిల్లా నుంచి 15 మందిని రాత్రి 8.30 గంటల్లోపు జైలుకు తరలించారు. విజయవాడ నుంచి 24 మందిని రెండు ప్రత్యేక బస్సుల్లో 10.30 గంటలకు తీసుకొచ్చారు. మొత్తం 42 మందిలో 15 మంది పురుషులు, 27 మహిళలు. మహిళా మావోయిస్టులను ప్రత్యేక కారాగారానికి తరలించారు. ఒకటో పట్టణ స్టేషన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు జైలు వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

విజయవాడ నుంచి మావోయిస్టులతో తీసుకొచ్చిన బస్సును కేంద్ర కారాగారంలోకి తరలిస్తున్న పోలీసులు

కర్షకులను క్షోభపెడితే మనుగడ ఉండదు

✦ 'అన్నదాత సుఖీభవ'లో మంత్రి రామానాయుడు వ్యాఖ్య

✦ జిల్లాలో 1,14,991 మందికి రూ.76.99 కోట్లు జమ

గోపాలపురం, న్యూస్‌టుడే: రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీకి మనుగడ ఉండదని, దానికి నిదర్శనం వైకాపా ప్రభుత్వమే అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అధ్యక్షతన జరిగిన 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' రెండో విడత సాయం విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో రైతులను దగా చేసిందన్నారు. భారీ ప్రాజెక్టులకు సంబంధించి గేట్లు పాడైనా వాటిని పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తుంగభద్ర, శ్రీశైలం, ధవళేశ్వరం ప్రాజెక్టుల మరమ్మతులు, నూతన గేట్ల ఏర్పాటుకు సుమారు రూ.400 కోట్లు కేటాయించిందన్నారు. వైకాపా హయాంలో కేవలం ఆ పార్టీ గుర్తు, వారి ఫోటోల కోసం కోట్లాది రూపాయలు వృథా చేశారన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో రెండో విడతలో 1,14,991 మంది రైతులకు రూ.76.99 కోట్లు జమ అవుతున్నాయన్నారు. రైతులు రసాయనాలు వినియోగం తగ్గించాలని సూచించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు.

రైతులకు నమూనా నగదు చెక్కును అందిస్తున్న మంత్రి రామానాయుడు, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే వెంకటరాజు

వణుకుతోంది బాల్యం..

తీవ్ర చలిగాలుల వేళ వసతిగృహాల్లో అవస్థలు

ఈనాడు పరిశీలన

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

శీతాకాలం.. చలిగాలులు వణికిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా అద్దె భవనాల్లోను, చాలీచాలని గదుల్లో నడుస్తున్న ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో ఆ ప్రభావం ఇప్పటికీ కనిపిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది కొరత కారణంగా నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది.

తూర్పులో పరిస్థితి

వసతి గృహాలు	మొత్తం	అద్దెభవనాల్లో ఉన్నవి	విద్యార్థులు
సాంఘిక సంక్షేమం	32	08	2,300
బీసీ సంక్షేమం	21	12	1,460
గిరిజన సంక్షేమం	10	06	1,975

అసౌకర్యాల నడుమ..

● కొన్ని వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. మరికొన్నింటిలో లేనే లేవు. ● మెస్‌లు, తలుపులు లేని కిటికీలు, తిరగని ఫ్యాన్లు, నిర్వహణ లేని మరుగుదొడ్లు, అపరిశుభ్ర వంటశాలలు దర్శనమిస్తున్నాయి.
● జిల్లాలో 26 హాస్టళ్లు దీర్ఘకాలంగా అద్దె భవనాల్లోని ఇరుకు గదుల్లో సాగుతున్నాయి.
● ఎక్కడా వేడి నీటి సౌకర్యం లేదు. ● స్కావెంజర్లు లేక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 2019కి ముందు ఒక్కో హాస్టల్‌కు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నిధులు ఇచ్చేది. వైకాపా వచ్చాక నిలిపేసింది. మరుగుదొడ్ల శుభ్రం.. చీపుర్లు, ఫినాయిల్, బ్లీచింగ్ తదితరాలకు సొంత డబ్బు వెచ్చించాల్సి వస్తోందని వార్డెన్లు చెబుతున్నారు.
● ప్రతి హాస్టల్‌కు వార్డెన్, వంట మనిషి(కుక్), సహాయకుడు(కమాటీ), వాచ్‌మెన్ ఉండాలి. చాలా హాస్టళ్లలో కుక్, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఇరుకు గదుల్లో సర్దుకుపోతూ ఇలా..

కిటికీలకు తలుపులేవీ

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలోని వసతి గృహం కిటికీలకు తలుపులు, మెస్‌లు లేవు. కొంతమంది విద్యార్థులు తలుపులకు అడ్డుగా చాపలను కట్టారు.

ఇదీ లెక్క

- 63.. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు
- 33.. వీటిలో ప్రీమెట్రిక్ విద్యార్థుల హాస్టళ్లు
- 30.. పోస్టుమెట్రిక్ విద్యార్థులు ఉంటున్నవి
- 5,735 మంది.. మొత్తంగా వీటిలో ఉంటున్నవారి సంఖ్య

ఒక ఊరు.. మూడు పంచాయతీలు..!

రెడ్డిచెరువు గ్రామం

మీకు తెలుసా?

ఇదేమిటంటారా..? మరదే రెడ్డిచెరువు ప్రత్యేకత. 110 గృహాలు, 325 మంది జనాభా, 238 మంది ఓటర్లున్న ఈ గ్రామం ఉండ్రాజవరం మండల పరిధిలో ఉంది. తూర్పు భాగం వడ్లూరు, పడమర వైపు సూర్యారావుపాలెం, ఉత్తర భాగం సత్యవాడ పంచాయతీల పరిధిలో ఉంటుంది. నిడదవోలు నియోజకవర్గంలోని అతితక్కువ జనాభాగల గ్రామం కూడా ఇదే. ఇక్కడి ఓటర్లు మూడు పంచాయతీల పరిధిలో ఉన్నారు. ఎన్నికల సమయంలో వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఎటు వెళ్లాలన్నా 2 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. సత్యవాడ నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రయాణ సౌకర్యం అంతంతే. వైద్యం అవసరమైతే తణుకు వెళ్లాలి. సమీప గ్రామంలోని డీలరు కొన్ని రోజులపాటు ఇక్కడి లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేస్తుంటారు. ప్రధాన రహదారి నిర్మించడంతో కొంత సమస్య తీరింది. నీటి తీరువా, ఇంటి పన్నులు సైతం దిక్కుల వారీగా కేటాయించిన గ్రామాలకు వెళ్లి చెల్లిస్తుంటారు. సమీపాన ఉన్న పసలపూడి గ్రామ కూడలికి వెళ్లి బస్సు ఎక్కుతుంటారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

ఇక పారదర్శకమైన ఓటర్ల జాబితా

ఎస్ఐఆర్‌లో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమగ్ర.. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించాలన్న భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) ఆదేశాలతో జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ చేపడుతున్నారు. ఇందులో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్‌స్థాయి అధికారుల(బీఎల్వోలు) ద్వారా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాల పరిశీలన జరుగుతోంది. బోగస్ ఓటర్లను గుర్తించేందుకు 2002 నాటి, ప్రస్తుత ఓటర్ల జాబితాలను సరిపోలుస్తూ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి, ధ్రువీకరించిన వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. 40 ఏళ్లు దాటిన వారి పేర్లు 2002 ఓటర్ల జాబితాలో ఉన్నాయా? లేదా? అని పరిశీలించి మ్యాపింగ్ చేస్తున్నారు. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్నవారిని స్థానికులుగా గుర్తించడంతోపాటు మిగిలిన వారిని వలస ఓటర్లుగా భావించి ఇతర కేంద్రాల్లో వారికి ఓటు హక్కు ఉందేమోనని ఆరా తీసున్నారు. పాత జాబితాలో పేరుండి ప్రస్తుత జాబితాలో లేని వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించడంతోపాటు మరణించిన, శాశ్వత వలసవెళ్లిన వారిని జాబితా నుంచి తొలగించనున్నారు.

జిల్లాలోని ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	2002	2025 (నవంబరు 11 నాటికి)
రాజమహేంద్రవరం అర్బన్	1,46,434	2,66,159
రాజమహేంద్రవరం గ్రామీణం	1,46,434	2,73520
అనపర్తి	1,79,848	2,26,535
రాజానగరం	1,64,834	2,16,600
కొవ్వూరు	1,63,754	1,84,324
నిడదవోలు	1,84,812	2,13,281
గోపాలపురం	1,78,868	2,43,110

పెరిగిన ఓటర్లు..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 2002 జాబితా ప్రకారం 11,64,984 మంది ఓటర్లు ఉండగా.. 2025 జాబితాలో ప్రస్తుత నెల వరకు 16,23,529 మంది ఉన్నారు. అంటే జిల్లాలో 4,58,545 మంది పెరిగారు. ఓటర్ల జాబితా సమగ్రత, కచ్చితత్వం, స్వచ్ఛీకరణకు ఎన్నికల కమిషన్ చేపట్టిన చర్యల్లో భాగంగా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.

రాజమహేంద్రవరంలో ఇంటి నంబర్ల వారీగా ఓటర్ల జాబితా వివరాల పరిశీలన చేస్తున్న బీఎల్వో

ఉద్యోగుల ఫిర్యాదుల దినోత్సవం రేపు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, వేగం, బాధ్యతాయుతమైన విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, దానిలో భాగంగా జిల్లా కలెక్టర్, ఆయా శాఖల అధికారులతో ప్రతి మూడో శుక్రవారం ఉద్యోగుల ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించాలని ఆదేశించిందని కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధానంలో భాగంగా ఉద్యోగులు వ్యక్తిగత సమస్యలు సహా అన్ని రకాల ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ లేదా శాఖాధిపతులకు నేరుగా సమర్పించవచ్చన్నారు. ప్రతి ఫిర్యాదు ప్రత్యేక ఐడీతో పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ప్రత్యేక ఐడీ, ఫోన్ నంబరు ద్వారా ఉద్యోగి తన ఫిర్యాదు పరిష్కార స్థితిని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.



అటు నిధులు.. ఇటు పరికరాలు

పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

బిక్కవోలు, అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్య, క్రీడలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గతంలో సరైన ప్రోత్సాహం లేదు. బడులకు పూర్తిస్థాయిలో విద్యా సామగ్రి సమకూర్చలేదు. ఇక క్రీడా పరికరాల సంగతి సరేసరి. కూటమి సర్కారు ఈ ఏడాది క్రీడా కిట్ల సరఫరాకు నగదు పెంచింది. గతంలో ఉన్నత పాఠశాలలకు రూ.10వేలు మాత్రమే ఇచ్చేది. ప్రస్తుతం నిధులు పెంచడంతో పాటు కిట్లు సైతం అందజేయనుంది.

జిల్లాలో లెక్క..

- ఉన్నత పాఠశాలలు 224
- ప్రాథమికోన్నత పాఠశాలలు 32
- ప్రాథమిక పాఠశాలలు 707
- కళాశాలలు 18
- వచ్చే క్రీడా నిధులు రూ.కోటికి పైగా

కోరుకున్న పరికరాలు..

అప్పట్లో ఒకే రకమైన సామగ్రి మూస ధోరణిలో పంపించేవారు. ఏటా ఇనుప గుళ్లు వంటివి వచ్చేవి. వాటిని చాలా తక్కువమంది వినియోగించేవారు. అవి నిరుపయోగంగా మారేవి. ఈసారి ప్రతి పాఠశాల నుంచి ప్రతిపాదనలు అడిగి, దాని బట్టి సరఫరా చేశారు. క్లస్టరు పాఠశాలలకు అక్కడి నుంచి ఆయా బడులకు చేరుతున్నాయి.

వాడపల్లి పాఠశాలకు పరికరాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గతంలో కంటే ఎక్కువగా..

● జిల్లాలో ప్రాథమిక, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు 981 ఉన్నాయి. ● గతంలో ఉన్నత పాఠశాలకే రూ.10వేలు ఇవ్వగా, కిందిస్థాయి బడులకు మరీ తక్కువగా ఇచ్చేవారు. ● ఇప్పుడు ఒక్కో ఉన్నత పాఠశాలకు రూ.25వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10వేలు, ప్రాథమిక పాఠశాలకు రూ.5వేలు చొప్పున నిధులు, క్రీడా పరికరాలు అందిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి..

జిల్లాలోని అన్ని పాఠశాలలకు వీటిని సరఫరా చేస్తున్నాం. విద్యార్థులు వినియోగించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ప్రభుత్వం కోరుకుంటోంది.

- సుభాషిణి, ఏపీసీ, తూర్పుగోదావరి జిల్లా

ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి

కంబాలచెరువు: కార్మికులంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో వ్యక్తిగత, ఉద్యోగ సంబంధిత వివరాలు నమోదు చేసుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఎన్ఆర్‌కేఆర్ స్పిన్నింగ్ మిల్లులో అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికశాఖ ఏసీ బీఎస్ఎం వల్లీ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు.. రికార్డు

కోళ్ల ఫారంలో ధర రూ.6.38

రంగంపేట, న్యూస్‌టుడే: కోడిగుడ్డు రికార్డు ధరకు చేరింది. రెండురోజుల్లో కార్తిక మాసం త్వరలోనే పూర్తి అవ్వనుండగా మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలో గుడ్డు ధర కోళ్ల ఫారం వద్ద ఒకటి రూ.6.38గా ఉంది. గతేడాది డిసెంబర్ 12న అత్యధికంగా రూ.6.30కు చేరి, అయిదు రోజులు అదే ధర కొనసాగింది. ఆ తర్వాత తగ్గింది. ఈసారి మాత్రం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మార్కెట్‌లో విడిగా రూ.7.50కు పైనే పలుకుతోంది. శీతాకాలంతో ఉత్తరాది రాష్ట్రాల్లో దీని వినియోగం పెరుగుతోంది. కార్తికం పూర్తయితే స్థానికంగానూ వినియోగం పెరగనుంది.

● ఉమ్మడి జిల్లా పరిధిలో గతంలో రోజుకు కోటి గుడ్లు ఉత్పత్తి అవ్వగా ప్రస్తుతం 70 లక్షలు కూడా ఉత్పత్తి కాని పరిస్థితి. ఈ తరుణంలో ధర పెరగడం ఆశాజనకం.

● దాణా అత్యధికంగా వినియోగించే మొక్కజొన్న ధర గతంలో కంటే కొంత తక్కువగా ఉండడం కోళ్ల పరిశ్రమకు కొంత ఊరట కలిగిస్తోంది. గతంలో రూ.23వేల పైనే ఉన్న మొక్కజొన్న ధర ప్రస్తుతం రూ.20వేలు ఉంది. మహారాష్ట్ర నుంచి దిగుమతి అయ్యే సోయా ధర మాత్రం ఇటీవల కాలంలో టన్నుకు రూ.4వేలపైగా పెరగడం కొంత నిరుత్సాహం కలిగిస్తోంది.



(c) eenadu

గతం ఘనం.. నేడు శిథిలం

కోరుకొండ ఎస్సీ బాలుర వసతి గృహం ఒకప్పుడు జిల్లాలోనే పేరు గాంచింది. ఇటు మెట్ట, అటు మన్యం ప్రాంతం నుంచి బాలురు ఎక్కువ మంది ఈ వసతి గృహంలో ఉండేందుకు ఆసక్తి చూపేవారు. వందల సంఖ్యల పిల్లలతో కళకళలాడిన ఈ వసతి గృహం ఇప్పుడు మూతపడింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో భవనం శిథిల స్థితికి చేరినా పట్టించుకోలేదు. కూలిపోవడానికి సిద్ధంగా ఉండడం, కిటికీలు లేకపోవడం, వర్షం వస్తే కారిపోవడం ఇలా అనేక సమస్యలతో పిల్లలు ఇబ్బంది పడేవారు. దీంతో పిల్లలు ఒక్కొక్కరుగా వెళ్లిపో యారు. నేడు మొత్తం ఖాళీ అయింది. - న్యూస్‌టుడే, కోరుకొండ

పర్యాటకం డీలా

మారేడుమిల్లిపై ఎన్‌కౌంటర్ల ప్రభావం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పర్యాటకంగా మారేడుమిల్లికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. రెండు రోజుల్లో వరస ఎన్‌కౌంటర్ల ప్రభావం పర్యాటక ప్రాంతాలపై పడింది. మారేడుమిల్లి రంపచోడవరంతోపాటు సందర్శనీయ ప్రదేశాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇజ్జులూరు, గుజ్జుమామిడివలస అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పుల ఘటనల్లో హిడ్మాతోపాటు 13 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేచోట భీతావహ వాతావరణం నెలకొనడంతో పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే వారంతా తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. ఇక్కడకు వచ్చే వారంతా ముందుగానే రిసార్టుల్లో గదులు, స్థానికంగా వాహనాలను బుక్ చేసుకుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది బుకింగ్‌లను రద్దు చేసుకుంటున్నారని రిసార్టు సిబ్బంది చెబుతున్నారు. ఈ ప్రభావం కొంతకాలం కొనసాగే అవకాశముంది.

నిర్మానుష్యంగా మారేడుమిల్లి రహదారి

క్రికెటోత్సవానికి వేళాయె..

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
FM Partner: ఈ FM Mee FM TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్ Digital Partner: ఈనాడు.నెట్, ఈటీవీ BHARAT Organised by ఈనాడు

ఈనాడు - హైదరాబాద్: కళాశాల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగాల్లో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన.. ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్ క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణ పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అబ్డామినల్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్ వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు కార్యాలయం, ఎన్‌హెచ్-16, హుకుంపేట, రాజమహేంద్రవరం-533107
వివరాలకు: 96666 31768
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

వి.ఎల్.పురం: ఉద్యోగ మేళాల నిర్వహణ ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. వికాస ఆధ్వర్యంలో ఈ నెల 23న అనపర్తిలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ద్వారా సుమారు 33 ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. టెక్నికల్, నాన్‌టెక్నికల్, ఐటీ, ఫార్మా హెల్త్‌కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ విభాగాల్లో సుమారు 1,200 ఉద్యోగాలు ఇచ్చేందుకు ఆయా కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, జిల్లావ్యాప్తంగా త్వరలో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. అందుకు నియోజకవర్గస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వికాస పీడీ లచ్చారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, వికాస అధికారులు

తల్లిని మించిన దైవం లేదు

ధవళేశ్వరం, మోరంపూడి: తల్లిని మించిన దైవం లేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పుట్టపర్తి నుంచి ప్రారంభించిన సేవా కార్యక్రమాలను ప్రపంచమంతా విస్తరించిన మహనీయుడని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా ధవళేశ్వరంలోని శ్రీసత్యసాయి గురుకులంలో బుధవారం మహిళా దినోత్సవం, మాతృపూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. బాబా చూపిన ప్రేమ, సేవ నేటి సమాజానికి ఆదర్శమన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. దక్షిణ మండల డీఎస్పీ భవ్య కిషోర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని పిల్లలకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్ సుందర్, ప్రిన్సిపల్ కె.గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి గురుకులంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సత్వర న్యాయమే లోక్‌అదాలత్ లక్ష్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వచ్చే నెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పోలీసు, రెవెన్యూశాఖల అధికారులతో బుధవారం రాజమహేంద్రవరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో బాధితులకు సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం తక్షణ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు త్వరితగిన న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఏఎస్పీ సుబ్బరాజు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

వాట్సప్ కాల్ చేస్తారు.. మొత్తం దోచేస్తారు

అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు, సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న ఎనిమిది మంది అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను పోలీసులు అరెస్టు చేసి, చరవాణులు స్వాధీనం చేసుకుని ఇద్దరి బ్యాంకు ఖాతాల నుంచి రూ.2.50 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో కేసు వివరాలను మీడియాకు వివరించారు. ఆగస్టు 26న మనీ లాండరింగ్ కేసు పేరుతో తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి వాట్సప్ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు బదిలీ చేయమని రెండు మ్యూల్(దొంగ పేర్లతో) బ్యాంకు ఖాతాల్లో రూ.80 లక్షలు జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించి బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాతాల్లో ఉన్న రూ.2.5 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. మిగిలిన రూ.77.5 లక్షల నగదు బాధితుడి ఖాతా నుంచి ఆ రెండు బ్యాంకు ఖాతాల ద్వారా 14 రాష్ట్రాల్లోని ఇతరుల ఖాతాలకు.. చివరకు గేమింగ్ యాప్ వినియోగదారుల ఖాతాలకు చేరినట్లు గుర్తించారు.

కంబోడియా వెళ్లి.. నెట్‌వర్క్‌తో పనిచేసి

మొదట అనంతపురం జిల్లాకు చెందిన క్రాంతికుమార్, పవన్‌కుమార్ మ్యూల్ ఖాతాలకు జమైనట్లు తెలుసుకుని దర్యాప్తు చేశారు. వీరి వెనుక హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు ఓ ముఠా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆయన 2024 జనవరిలో కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌తో కలిసి పనిచేశారు. ఆ సమయంలో ఆయన విదేశీ నెట్‌వర్క్‌తో సంబంధాలు పెంచుకున్నారు. తర్వాత ఇండియాకు వచ్చి క్రాంతికుమార్, పవన్‌కుమార్‌తోపాటు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గౌతమ్‌ల ద్వారా భారీ సంఖ్యలో మ్యూల్ ఖాతాలను సేకరించారు. ఆ వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సాక్ష్యాలు టెలిగ్రామ్ ద్వారా విదేశాలకు పంపుతూ.. ప్రతి లావాదేవీపై కమీషన్ పొందేవారు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉండటంతో అరెస్టు చేశారు. మరో కీలక నిందితుడు హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన మొహమ్మద్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

కొత్త యంత్రాల కొనుగోలుకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏడాదిగా దుస్తులు ఉతికే యంత్రం(వాషింగ్ మెషీన్) మరమ్మతులకు గురవడంతో దుప్పట్లు, శస్త్రచికిత్స సమయంలో వైద్యులు, సిబ్బంది వేసుకునే దుస్తులు, గౌన్లు చేతులతోనే ఉతికి ఆరేస్తున్నారు. దీనివల్ల వాటి శుభ్రత ప్రశ్నార్థకంగా మారడంతోపాటు ఒక పూటలో అయిపోయే పని రోజంతా సిబ్బంది చేయాల్సి వస్తోంది, అయినా అవి సరిగా ఆరడం లేదు. దీనిపై ఈ నెల 19న 'చేతులా.. యంత్రాలా..!' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురిత కావడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ బుధవారం స్పందించారు. జీజీహెచ్‌లోని దుస్తులు ఉతికే యంత్రాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అధిక నిధులు వెచ్చించి మరమ్మతులు చేసినా ఎక్కువ రోజులు పని చేస్తుందో లేదో తెలియని పరిస్థితి ఉండడంతో కొత్తవి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. అక్కడ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే చిన్న యంత్రాలు కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా చేస్తామని సూపరింటెండెంట్ వివరించారు.

జీజీహెచ్‌లో మరమ్మతులకు గురైన వాషింగ్ మెషిన్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ

తెలుగు విశ్వవిద్యాలయంలో దరఖాస్తులకు నేటివరకు గడువు

బొమ్మూరు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీశైలం, కూచిపూడి ప్రాంగణాల్లో పలు కోర్సులకు అపరాధ రుసుముతో కలిపి గురువారంలోగా దరఖాస్తు చేసుకోవాలని వీసీ డి.మునిరత్నం నాయుడు తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కన్వీనర్, సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ, బొమ్మూరు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చిరునామాకు పంపించాలన్నారు. ఇప్పటివరకు తెలుగు వర్సిటీలో ఎంఏ తెలుగుకు 4 దరఖాస్తులు, కూచిపూడిలో వివిధ కోర్సులకు 167, శ్రీశైలంలో ఎంఏ హిస్టరీ, ఆర్కియాలజీకి 9, పీహెచ్‌డీకి 20 దరఖాస్తులు వచ్చాయన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో..

జిల్లా మహిళల జట్టు ప్రథమం

విశాఖ క్రీడలు: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం రాత్రి గీతం డీమ్డ్ వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ముగిశాయి. పురుషుల విభాగంలో విశాఖ జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రథమ, విశాఖ జట్టు ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్-15 బాలుర విభాగంలో ఎన్టీఆర్, విశాఖ, బాలికల విభాగంలో ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల జట్లు వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు గీతం డీమ్డ్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖర్, శాప్ డైరెక్టర్ ఎండీ.రమేష్ కుమార్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.అప్పలరాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్‌కార్తీక్, ఏపీ టేబుల్‌టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మ, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎం.ఎం.పాత్రో, వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

విజేతలతో గీతం డీమ్డ్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖర్, శాప్ డైరెక్టర్ రమేష్‌కుమార్, తదితరులు

Office of the District Medical and Health Officer
East Godavari District, Rajamahendravaram
TENDER NOTIFICATION NO. SES/DBCS /2025 Dt.20-11-2025

TENDER NOTICE

SEALED TENDERS ARE INVITED From Standard Agencies/ REPUTED MANUFACTURERS / C&F AGENTS/DISTRIBUTERS /Registered Suppliers FOR THE SUPPLY OF SCHOOL CHILDREN SPECTACLES. THE SHORT TENDER SCHEDULE INCLUDED SPECIFICATIONS AND TERMS AND CONDITIONS WILL BE ISSUED ON PAYMENT OF Cost of Tender Application fee for Rs. 1000/- each Non Refundable and Tenders will be Submitted with EMD amount Rs.19000 /-) for each bidder /tender through DD from any Nationalized Bank in favour of District Medical and Health officer, E.G.Dt. and available in this office on the working days from 20-11-2025 to 26-11-2025 from 10.30 AM to 4.00 PM at DPM office UHC, Kambalapeta, Rajamahendravaram. All rights are reserved to cancel /modify the Tenders by DM&HO, Rajamahendravaram.

District Programme Manager, East Godavari District — District Medical & Health Officer, East Godavari District

యూనివర్సిటీ కాలేజీ అఫ్ ఇంజినీరింగ్, కాకినాడ
జె.ఎన్.టి. యూనివర్సిటీ, కాకినాడ

మామిడి తోట ఫలసాయానికి ప్రకటన

ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్ విభాగం వారు కళాశాల ఆవరణలో ఉన్న మామిడి చెట్ల ఫలసాయమును కళాశాల నియమ నిబంధనలకు లోబడి అనుభవించు హక్కు కొరకు సీల్ వేసిన కొటేషన్లు ఆహ్వానించుచున్నారు. షెడ్యూల్ ధర రూ.2,500.00లు (అక్షరాలా రెండు వేల ఐదు వందల రూపాయలు) (జి.ఎస్.టితో కలిపి). జారీ చేయు ఆఖరి తేది ది.02-12-2025, దాఖలు చేయుటకు ఆఖరి తేది 03-12-2025 మధ్యాహ్నం గం.3.00ల వరకు. మిగతా వివరములు ఇంజినీరింగ్ విభాగం కార్యాలయం పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చును.

తేది: 19-11-2025 సం/- ప్రిన్సిపాల్



అభినందనలు తెలియజేస్తున్న నారాయణ

మంత్రి నారాయణ అభినందనలు

టి.నగర్, న్యూస్‌టుడే: కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు- 2024లో జల్ సంచాయ్-జన్ భాగీదారీ విభాగం కింద రాజమహేంద్రవరం జాతీయ స్థాయిలో నాల్గవ ర్యాంకును సొంత చేసుకొంది. ఈ నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలో 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తి చేశామన్నారు. ఈ కేటగిరీ కింద లభించిన అవార్డుకు రూ 2 కోట్ల నగదు పురస్కారం లభిస్తుందన్నారు. రానున్న రోజుల్లో చేపట్టే పనులకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి భూదానం

✦ రూ.44 లక్షలతో సెంటున్నర కొనుగోలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయానికి రాజమహేంద్రవరానికి చెందిన గన్నమనేని శివరామకుమార్ భూదానం చేశారు. స్వామి క్షేత్రానికి పక్కన ఉత్తరం వైపు గోడకు ఆనుకుని ఉన్న సెంటున్నర స్థలం ఖరీదు రూ.44 లక్షలు. దానిని దాత కొనుగోలు చేసి స్వామివారికి ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. బుధవారం రిజిస్ట్రేషన్ చేయించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు, పాలకవర్గ ఛైర్మన్ చింతలపాటి బంగారాజు పాల్గొన్నారు.

నగదును ఎమ్మెల్యే రామాంజనేయులు చేతుల మీదుగా అందిస్తున్న దాత శివరామకుమార్

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	21,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	18,000-19,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	111-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్ట్	200-00
స్కిన్‌లెస్	228-00

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 99121 78237.

BPT/B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/Dialysis - Courses in Vijayawada - MGT/ Convener Quota. ✆ 79959 45835.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తాళ్లపూడి, ఆంధ్రాబ్యాంక్ రోడ్ సూర్య ఇ.మీ. స్కూల్ ఎదురుగా 139/ 125.66/ 173.94/ 122.44/ 143.11 గ॥ స్థలం అమ్మకం. ✆ 83090 25067.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే పేసింగ్ వెంచర్‌లో మీ పెట్టుబడికి, గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. Contact Cell: 9949000033.

JOBS

WANTED STAFF: Ravindra High School, Exp. High School Teachers for English, Social, Science & Telugu, B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

★ టెలికాలర్స్ ★ కంప్యూటర్ ఆపరేటర్ (F) ★ ఆఫీస్ అసిస్టెంట్ (M) కావలెను. జీతం: 10,000 to 25,000/-. 2 వీలర్ లోన్స్, రాజమండ్రి, Contact Cell: 85006 44978, 93461 45948.

రాజమండ్రిలో ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు ★ చెఫ్స్ ★బిర్యాని & చైనీస్ మాస్టర్ ★ వెయిటర్ ★ రిసెప్షనిస్ట్ ★ అకౌంటెంట్ కావలెను. Contact: 93462 97988.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-38 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

ఉచిత యోగా శిక్షణ తరగతులు

వి.ఎల్.పురం: స్మార్ట్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 30 వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గురువు బిక్కిన శివ తెలిపారు. అసోయేషన్ సభ్యులతో కలిసి స్థానిక ఏవీఏ రోడ్డులోని ఓఎన్జీసీ కాంట్రాక్టర్స్ హాలు వద్ద బుధవారం ఉచిత యోగా శిక్షణ ప్రచార ఫ్లెక్సీలు ఆవిష్కరించారు. ఓఎన్జీసీ కాంట్రాక్టర్స్ హాలులో ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. మొదటి 30 మంది సాధకులకు మాత్రమే ఉచిత శిక్షణకు అవకాశం ఉంటుందని, ఆసక్తిగల వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి అంతర్జాతీయ సదస్సు

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఉత్తమ పేపరుకు అవార్డులు, నగదు బహుమతులు, ఉత్తమ మౌఖిక, పోస్టర్ ప్రజెంటేషన్లకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు పాల్గొని పరిశోధన నైపుణ్యాన్ని అందిస్తారన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

బొజ్జిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

వి.ఎల్.పురం, టి.నగర్, న్యూస్‌టుడే: గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ బొజ్జిరెడ్డి అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం రాజమహేంద్రవరం వచ్చారు. స్థానిక ర.భ.శాఖ అతిథిగృహం వద్ద ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, గిరిజనుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. ఎస్టీ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గిరిజన నిరుద్యోగ యువత కోసం ఎస్టీ స్టీడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు టి.రాజేంద్రప్రసాద్, కె.చిరంజీవి, డి.యేసురత్నం, కుమార్‌బాబు, భాస్కర్ సమతం, గన్నయ్య, రామారావు, నారాయణ, గిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి చాలక.. అవస్థలు తొలగక..

నగరంలోని సంక్షేమ హాస్టళ్లలో దుస్థితి

పరిశీలన

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

రాజమహేంద్రవరం నగరంలో వెనుకబడిన తరగతులు(బీసీ), సాంఘిక(ఎస్సీ), గిరిజన(ఎస్టీ) సంక్షేమ వసతిగృహాలు 20 ఉన్నాయి. వీటిలో 2,666 మంది విద్యార్థులు ఉంటున్నారు. కొన్ని హాస్టళ్లకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. ఎస్సీ హాస్టళ్ల ఎనిమిదింటిలో రెండు, బీసీ హాస్టళ్ల ఆరింటిలో ఒకటి, ఎస్టీ హాస్టళ్ల ఆరింటిలో నాలుగు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు సర్దుకుపోవాల్సిన పరిస్థితి. మిగిలినవి సొంత భవనాల్లోనే కొనసాగుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో సదుపాయాలు లేవు. గదుల కిటికీలకు మెస్‌లు ఊడిపోవడంతో దోమల బెడద తప్పడం లేదని, గదుల్లో కొన్ని ఫ్యాను తిరగడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ అంతంత మాత్రంగా ఉండటంలో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వసతి గృహాల్లో కిందిస్థాయి సిబ్బంది సేవలు కీలకం. అన్ని హాస్టళ్లలోనూ రెగ్యులర్ కుక్, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. కొన్నిచోట్ల పొరుగుసేవల సిబ్బంది కూడా అరకొరగానే ఉండటం పెద్ద సమస్యగా మారింది. ఇక్కడి పలు వసతిగృహాలను పరిశీలించగా అనేక సమస్యలు దర్శనమిచ్చాయి.

వివరాలు ఇలా...

సంబంధిత శాఖ	వసతి గృహాలు	విద్యార్థుల సంఖ్య
బీసీ సంక్షేమం	06	638
సాంఘిక సంక్షేమం	08	930
గిరిజన సంక్షేమం	06	1,098

సమస్యలివి..

● స్థానిక రాజేంద్రనగర్‌లోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహం చాలా ఏళ్లుగా అద్దెభవనంలో నడుస్తోంది. గదులు ఇరుకుగా ఉండటం.. సర్దుకుపోవాల్సి రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కిటికీలకు మెష్‌లు లేకపోగా కొన్ని గదుల్లో కిటికీ తలుపులు ఊడిపోయి ఉండటంతో చలిగాలి, దోమలు లోపలికి రావడంతోపాటు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ కొన్ని గదుల్లో ఫ్యాన్లు తిరగడం లేదు. ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురై మూలకు చేరడంతో బయట నుంచి ఫిల్టర్ నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

రాజేంద్రనగర్ ఎస్సీ బాలుర వసతిగృహంలో మెష్, తలుపులు లేని కిటికీ

● స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్సీ విద్యార్థుల వసతి గృహంలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో మున్సిపల్ ట్యాప్ నీటినే కాచి చల్లార్చి పిల్లలకు అందిస్తున్నారు. చెంతనే ఉన్న పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో సిబ్బంది కొరత వల్ల నిర్వహణ అంతంత మాత్రంగా ఉంది.

● వై.జంక్షన్ వద్ద ఉన్న వసతిగృహ సముదాయ భవనంలో ఒక ప్రీమెట్రిక్, రెండు పోస్టుమెట్రిక్ వసతి గృహాలు నడుస్తున్నాయి. ఇక్కడా వసతి చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క గదిలో 15 మంది వరకు ఉండాల్సిన పరిస్థితి. సౌకర్యాల పరంగా కొంత వరకు మెరుగుపడినప్పటికీ మరుగుదొడ్లు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వో నీటి సౌకర్యంలేదు.

● తుమ్మలావ వద్ద ఉన్న కళాశాల విద్యార్థినుల బీసీ వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇరుకు గదులు, అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. గణేష్ చౌక్ వద్ద ఉన్న బీసీ బాలిక వసతి గృహం సొంతభవనంలో కొనసాగుతున్నప్పటికీ గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.

● రెండు కళాశాల బాలికల ఎస్టీ హాస్టళ్లలో వార్డెన్లు మినహా కిందస్థాయి రెగ్యులర్, పొరుగు సేవల సిబ్బంది లేరు. కొత్తగా మంజూరైన మరో రెండు కొత్త హాస్టళ్ల పరిస్థితి అలాగే ఉంది.

ఇరుకుగా హాస్టల్ గది

స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్‌లో 350 మంది విద్యార్థులు ఉండగా భవనం సరిపోక ఇబ్బంది పడుతున్నారు.

● లాలాచెరువు వద్ద ఉన్న ఎస్టీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతుండగా విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లను విద్యార్థులే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి. వంటకు ఇద్దరు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉండగా వాచ్‌మెన్ లేరు.

● ఆర్ట్స్‌కళాశాల వద్ద ఉన్న గిరిజన బాలికల వసతిగృహం సొంత భవనంలో కొనసాగుతున్నప్పటికీ ఏకంగా 470 మంది వరకు విద్యార్థినులు ఉంటున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ అదనపు గదుల నిర్మాణాలకు గతప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పెట్టినప్పటికీ మంజూరుకాలేదు.

మంత్రిని కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని హుకుంపేట మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన సూపరింటెండెంట్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

'పొరుగువారి హక్కులు'పై ప్రచారం

దేవీచౌక్, న్యూస్‌టుడే: 'పొరుగువారి హక్కులు' అనే అంశంపై జాతీయ స్థాయిలో పది రోజులపాటు ప్రచార ఉద్యమాన్ని ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ నగర అధ్యక్షుడు జహంగీర్ వెల్లడించారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొరుగువారితో మెరుగైన సంబంధాలను కొనసాగించడం, తద్వారా సామాజిక బంధాలను బలోపేతం చేయడం ఈ ప్రచార ఉద్యమ లక్ష్యమన్నారు. పొరుగువారి హక్కులకు ఇస్లాం అత్యధిక ప్రాముఖ్యతను ఇస్తుందని, ఇది శాంతియుత, సామరస్యపూర్వక సమాజానికి పునాదిగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కన్వీనర్ ఫరీదా, నగర కన్వీనర్ డాక్టర్ అల్లాఉద్దీన్ షరీఫ్, జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ షరీఫ్, ఇబ్రహీం, సభ్యులు పాల్గొన్నారు.

సత్తా చాటారు.. బహుమతులు సాధించారు..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో టౌన్ ఉన్నత పాఠశాల నిర్వాహకులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాసం పోటీలు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎ.సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను గుర్తించేందుకు 'ఈనాడు' చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. ఉపన్యాసం చెప్పటం అలవాటు చేసుకుంటే పదిమందిలో ధైర్యంగా మాట్లాడేతత్వం అలవడుతుందన్నారు. ఈ పోటీల్లో కె.శివజ్యోతి (8వ తరగతి), ఎ.తనుష్‌కుమార్ (9వ తరగతి), వి.శ్రీదేవి (7వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ప్రధానోపాధ్యాయుడు ఎ.సూరిబాబు విజేతలకు అందజేశారు. కె.కవిత, ఎం.వెంకటలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో ట్రిప్స్ స్కూలు యాజమాన్యం

ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉపన్యాసం పోటీలు జరిగాయి. ఎం.సంజన (10వ తరగతి), పి.చతుర్ అక్షయ్ (9వ తరగతి), బి.చతుర్య నారాయణ (8వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను పాఠశాల డైరెక్టర్లు బాలాత్రిపుర సుందరి, రూప గూడూరు విజేతలకు అందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఏని, యశోద వ్యవహరించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు హుకుంపేట, ఎస్సీ కాలనీ, డీ మార్ట్ ప్రాంతం, వంద పీట్ల రోడ్డు, కోనేరుపేట, వెంకటగిరి, గంగిరెడ్ల కాలనీ, జైహిందనగర్, బాబూజీనగర్, అరవిందనగర్, గణేష్‌నగర్, చైతన్యనగర్, ఆదర్శనగర్, రామకృష్ణనగర్, బాలాజీపేట, నాగిరెడ్డినగర్, కార్తికేయ నగర్, సావిత్రినగర్, ఈనాడు కార్యాలయ ప్రాంతం, డీఎస్‌ఆర్ నగర్, వరలక్ష్మికాలనీ, జనచైతన్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధైర్యంగా నిలుద్దాం..

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని నగరంలోని పలు పాఠశాలలో నిర్వహించారు. స్థానిక ఆనందనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎ.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధైర్యంగా నిలబడదాం అనే ఈ ఏడాది నినాదాన్ని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవాలన్నారు. ● టౌన్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఉపాధ్యాయులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కార్తిక మాసం సందర్భంగా సారంగధరమెట్టపై కొలువైన సారంగధరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్న సమారాధన జరిగింది. ఆలయ మేనేజర్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అపాయం..

రాజమహేంద్రవరం నగరంలోని వై జంక్షన్ నుంచి తిలిదే కల్యాణ మండపానికి వెళ్లే మార్గంలో ఎస్‌కేవీటీ కళాశాల గేటు ఎదురుగా కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. దీనిపై ఏర్పాటు చేసిన పలక గతంలో కూలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. అప్పట్లో తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పుడు మిగిలినవి అదే పరిస్థితికి చేరడంతో కల్వర్టుకు ఓ పెద్ద ఖాళీ దర్శనమిస్తోంది. ఆదమరపుగా పక్కకు వెళితే అందులో పడిపోవడం ఖాయం. కల్వర్టు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

వద్దన్నా వినరే..

ప్రమాదమని తెలిసినా కొంతమంది కొన్ని పనులు చేయడం మానడం లేదు. ఇది కూడా అటువంటి కోవకే చెందుతుంది. ఆగిన ఆటోను ఓ ద్విచక్రవాహనదారుడు కాలితో తోస్తున్న ఈ దృశ్యం జాతీయ రహదారిపై బుధవారం 'న్యూస్‌టుడే' కంటపడింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఇటువంటి వారికి కనువిప్పు కలగటం లేదు. తమతోపాటు ఇతరులను కూడా ప్రమాదాల్లోకి నెడుతున్నారు. – న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

మలుపులో ప్రమాదం

రాజమహేంద్రవరం నగరంలోని కంబాలచెరువు జంక్షన్ నుంచి కోరుకొండ వెళ్లే ప్రధాన రహదారిలో రామకృష్ణ మఠం ఎదురుగా నడక దారిలో డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన పలక తొలగి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వేల మంది ప్రయాణిస్తుంటారు. మలుపు దగ్గర పలక తొలగడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళలో గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

ఏడాదికే గుంతలమయం

రాజమహేంద్రవరం క్వారీ నుంచి లాలాచెరువు వెళ్లే మార్గం గుంతలమయంగా మారి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. అడుగడుగునా గుంతలు పడడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కిందటే ఈ రోడ్డు నిర్మించారు. అప్పుడే చాలాచోట్ల గుంతలు పడింది. మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

రాణి లక్ష్మీబాయి జయంతి

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బి.అంజనీకుమార్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ భవానీ, పి.తులసికుమార్, పి.వరప్రసాద్, డి.రాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో సేవలు

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సేవలో నిత్యం యంత్రాంగం అందుబాటులో ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం బైపాస్‌రోడ్డులో డీఎంహెచ్ స్కూల్‌ను ఆనుకొని ఉన్న 33, 57 సచివాలయాలను సందర్శించి దస్త్రాలను తనిఖీ చేశారు. ఎంత మంది సిబ్బంది ఉన్నారు, విధులు ఎవరెవరు నిర్వహిస్తున్నారనే వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

కోరుకొండ: హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భాజపా నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శివాలయం వద్ద బుధవారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మూడు నియోజకవర్గాల్లో రూ.కోట్లు ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.లక్ష విరాళం ప్రకటించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కంబాలను ఘనంగా సత్కరించారు.

ఇందిరాగాంధీ మహిళలకు ఆదర్శం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సీతంపేటలో ఇందిరాగాంధీ జయంతి వేడుక నిర్వహించారు. అతిథులుగా హాజరైన హైకోర్టు న్యాయవాది జి.వి.ఎస్.లక్ష్మీతులసి, డాక్టర్ హేమనళిని, డాక్టర్ రమేష్, గ్రంథాలయాధికారి డి.వెంకటరమణ తదితరులు ఇందిర చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అతిథులు, విద్యార్థులు జనగణమన గీతం ఆలపించారు. ● గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో తొలుత సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. గ్రంథాలయాధికారిణి జి.శ్రీదేవి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పి.వి.ఎస్.కృష్ణారావు, డాక్టర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు. * ఇన్నీస్‌పేటలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. విద్యార్థులు తయారు చేసిన హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువులను ప్రదర్శించారు. మాటూరి మంగతాయారు, బొబ్బ అరుణ, తోట సరస్వతీదేవి తదితరులు పాల్గొన్నారు. ● ఆల్కాట్ గార్డెన్స్‌లో ఇందిరాగాంధీ జయంతి వేడుక నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కొత్తపల్లి రమ్యశ్రీ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, జానపద గీతాల పోటీలు జరిగాయి.

సీతంపేట గ్రంథాలయంలో జనగణమన గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ నాయకుల నివాళి..

దేవీచౌక్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక జాంపేట వంతెన వద్దగల ఆమె విగ్రహానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధానిగా ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు, విప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని ప్రగతిపథంలో నడిపించాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, నాయకులు మార్టిన్ లూథర్, అరిగెల అరుణకుమారి, అడుసుమిల్లి రమేష్‌చౌదరి, దేవత సుధాకర్, కిషోర్‌కుమార్ జైన్, చింతాడ వెంకటేశ్వరరావు, బెజవాడ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జీఐఎస్‌తో ఖనిజాల అన్వేషణ

రాజానగరం: సివిల్, మైనింగ్ ఇంజినీరింగ్‌లో రిమోట్ సెన్సింగ్ ప్రాధాన్యం పెరిగిందని మైనింగ్ విభాగం అధిపతి డా.వై.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని సివిల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జీఐఎస్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖనిజాల అన్వేషణ, భూగర్భ జలాల అన్వేషణ, మ్యాపింగ్ వంటి వాటికి జీఐఎస్‌ను ఉపయోగిస్తున్నారన్నారు. ఇందులో యువతకు అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సివిల్ విభాగాధిపతి డా.పి.వి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'మనబడి'లో మంగారాణికి చోటు

మనబడి మాసపత్రికలో మంగారాణి పాఠాలు ప్రచురితమైన చిత్రం

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో వెలువడే మనబడి మాసపత్రికలో స్థానిక లాలాచెరువు నగరపాలక ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని మోటూరి మంగారాణికి చోటు దక్కింది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ అంశాలను ప్రచురించే మాసపత్రికలో మంగరాణి విద్యార్థుల కోసం చేసిన వివిధ కార్యక్రమాల గురించి వ్యాసం ప్రచురించారని డీఐ బి.దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చదువు పట్ల విద్యార్థులను ఆకర్షితులను చేయటం, యూట్యూబ్ ఛానెల్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించటం తదితర అంశాలతో ఈ వ్యాసం ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

కాలువలో ప్రైవేటు ఉద్యోగి మృతదేహం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఓ హోటల్ వద్ద కాలువలో ఒక వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా చిట్టాపూర్‌కు చెందిన తరుమల్లి చిన్నారావు(32) ఓ ఫెర్టిలైజర్ సంస్థ మార్కెటింగ్ విభాగంలో పని చేస్తున్నారు. మంగళవారం ఓ హోటల్ నాలుగో అంతస్తులో గది అద్దెకు తీసుకుని సహోద్యోగులతో రాత్రంతా పార్టీ చేసుకున్నారు. తర్వాత రోజు ఆయన మృతదేహం హోటల్ వద్ద కాలువలో లభ్యమైంది. మద్యం మత్తులో హోటల్ గది కిటికీ నుంచి కింద పడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ జరిగిందా..? ఇంకేమైనా కారణాలున్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం.. దైన్యం

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో దుస్థితి

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం, కోటగుమ్మం

అసలే చలికాలం.. ఆపై వ్యాధులు ముసురుతున్నాయి.. ముఖ్యంగా దగ్గు, జలుబు, జ్వరం, శ్వాసకోశ సమస్యలతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లోనూ రాజమహేంద్రవరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి. పెద్దాసుపత్రులపై భారం తగ్గించి స్థానికులకు మెరుగైన వైద్య సేవలందించే ఉద్దేశంతో ఏర్పాటైన ఈ కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఓపీ సేవలు సాయంత్రం అయిదు గంటల వరకు అందించాల్సి ఉన్నా మధ్యాహ్నానికే వైద్యులు వెళ్లిపోతుండగా సిబ్బందే చూసి పంపిస్తున్నారు. ఒక్కో యూపీహెచ్‌సీలో సుమారు 50-60 ఓపీ ఉంటున్నా సేవలు మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీలో ఖాళీగా మందులిచ్చే గది

మెరకవీధి యూపీహెచ్‌సీ వెనక ప్రహరీ లేక ఇలా..

ఇదీ పరిస్థితి..

రాజమహేంద్రవరం నగరంలో 11 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో కొన్నిచోట్ల ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, ఇతర సిబ్బంది కొరత వేధిస్తోంది. నిబంధనల ప్రకారం యూపీహెచ్‌సీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓపీ చూడాల్సి ఉంది. ఒకటి, రెండు యూపీహెచ్‌సీలు మినహా మిగతాచోట్ల మధ్యాహ్న సమయంలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. ఏదైనా ఓపీ వస్తే స్టాఫ్ నర్సులే చూసి మందులిచ్చి పంపేస్తున్నారు. ● బృహన్నలపేట యూపీహెచ్‌సీలో ఒక స్టాఫ్ నర్సు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో పరీక్షలు సరిగా జరగడం లేదు. మందులు సిబ్బందే ఇవ్వాల్సిన పరిస్థితి. ● అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీలో ఓ స్టాఫ్ నర్సు, నాలుగో తరగతి ఉద్యోగి లేరు. ● మెరకవీధి యూపీహెచ్‌సీలో ప్రహరీ నిర్మాణం లేక వెనకవైపు మార్కెట్ వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి ముందు మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాలు నిలిపివేస్తుండడంతో ఓపీ కోసం వచ్చే రోగులు, వైద్యులు, సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. ● కంబాలపేట, శంభునగర్ యూపీహెచ్‌సీల్లో ఫార్మాసిస్టులు కొరత కారణంగా మందులు నర్సులు, సిబ్బందే ఇవ్వాల్సిన పరిస్థితి. ప్రస్తుతం వ్యాధులు ముసురుతున్న నేపథ్యంలో యూపీహెచ్‌సీల్లో సమస్యలను పరిష్కరించి రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలందేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

బహిరంగ వేలం

తేది: 21-11-2025 (శుక్రవారం)

Veh. No.	Vehicle Description	Year
AP05TA9288	TATA 207 DI SINGLE CAB	2012
AP39TX0666	EICHER PRO 3019 BS6 FBT	2021
AP39UH8940	AL BADA DOST i4 BS6	2022
AP35AD1166	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP39SJ4247	NISSAN - MAGNITE XV ACENTA MT BS6	2022
AP39WB6027	GREAVES D 435 CITY BS6-P	2025

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

Vizag Auction తేది: 22-11-2025 (శనివారం)

AP39VD3335	AL 3525 BS6 FBT-T	2023

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., 1-438, NHAI దగ్గర, టోల్‌ప్లాజా, తర్లువాడ పంచాయతీ, ఆనందపురం మండలం, విశాఖపట్నం - 530052

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,

D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి

0883-2465088, 98499 81384

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

23న అనపర్తిలో మెగా ఉద్యోగమేళా

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 23న జరిగే మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. అనపర్తి మండలం రామవరంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 35 ఎంఎన్‌సీ సంస్థల్లో సుమారు 2,000 ఉద్యోగాల భర్తీ చేసేందుకు మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు మేళా ప్రారంభం అవుతుందన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు హుకుంపేట, ఎస్సీ కాలనీ, డీ మార్ట్ ప్రాంతం, వంద ఫీట్ల రోడ్డు, కోనేరుపేట, వెంకటగిరి, గంగిరెడ్ల కాలనీ, జైహింద్‌నగర్, బాబూజీనగర్, అరవిందనగర్, గణేష్‌నగర్, చైతన్యనగర్, ఆదర్శనగర్, రామకృష్ణనగర్, బాలాజీపేట, నాగిరెడ్డినగర్, కార్తికేయనగర్, సావిత్రినగర్, ఈనాడు కార్యాలయ ప్రాంతం, డీఎస్ఆర్ నగర్, వరలక్ష్మికాలనీ, జనచైతన్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: ధవళేశ్వరం: 91212 29057, ఉ. 10 - మ. 1 కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

వీధి దీపాలు లేక అంధకారం..

మోరంపూడి నుంచి శాటిలైట్ సిటీకి వెళ్లే రోడ్డులో, బీఆర్‌కే కల్యాణ మండపం ఎదురుగా సిమెంట్ రోడ్డు ప్రారంభం నుంచి పాముల గుడి వరకు వీధిదీపాలు లేవు. రాత్రివేళ చీకట్లోనే ప్రయాణం. మట్టి రోడ్డుకిరువైపులా కొబ్బరి తోటలు, తుప్పలు, చెత్తతో ఉంది. పాముల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పరిసర ప్రాంతాల్లో 150కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. అధికారులు స్పందించి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మోరంపూడి

తొలగని వ్యర్థాలు

ధవళేశ్వరం గ్రామంలో డ్రెయినేజీలను, రహదారులను తరచూ శుభ్రం చేయట్లేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు నీరు వెళ్లే ఊర డ్రెయిన్ బురదతో పూడిపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగు రోడ్డుపైకి వస్తోందని అంటున్నారు. కొన్నిచోట్ల వీధి దీపాలు రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, ధవళేశ్వరం

చలికి గజగజ.. వసతుల వెలవెల

శీతాకాలం నేపథ్యంలో ఇటీవల చలితీవ్రత పెరుగుతోంది. ఈ క్రమంలో వసతి గృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో పలు వసతి కేంద్రాలను 'న్యూస్‌టుడే' పరిశీలించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. **- న్యూస్‌టుడే, కడియం, రాజానగరం, అనపర్తి గ్రామీణం, కోరుకొండ**

పరిశీలన

మంచాలు తిరిగి రాలేదు..

కడియంలోని బీసీ బాలుర వసతి గృహంలో కొవిడ్ సమయంలో తరలించిన మంచాలు తిరిగి రాలేదని విద్యార్థులు చెబుతున్నారు. ఉన్న మూడు మంచాలపై కొందరు పడుకుంటే, మిగిలిన వారు నేలపైనే పడుకుంటున్నారు. స్నానపు గదుల వద్ద గడ్డి పెరగడంతో పాముల బెడద నెలకొంది. దోమ తెరలు లేవు. స్లాబు లీకేజీతో గదిలో నీరు కారుతోంది. 50 మంది విద్యార్థుల సామర్థ్యం ఉండగా, 13మందే ఉంటున్నారు. వార్డెన్ ఉదయం, సాయంత్రం వచ్చి వెళ్లిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కడియంలో కిటికీలకు దోమ తెరలు లేకుండా..

కొన్ని ప్రధాన సమస్యలు

- దోమతెరలు లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది.
- పలుచోట్ల పిల్లలు నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి.
- కొన్నిచోట్ల దుప్పట్లు ఇవ్వలేదు. పర్యవేక్షణ లేదు.
- ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు పడుకుంటున్నారు.
- దెబ్బతిన్న భవనాల్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది.
- చన్నీటి స్నానమే గతి.
- ఆర్వోప్లాంటు లేక తాగునీరు రోజూ బయట నుంచి తెచ్చుకుంటున్నారు.

వసతి ఇక్కడ... బస అక్కడ

కోరుకొండ బాలికల వసతి గృహంలో 45 మందికి 32 మంది మాత్రమే ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో నూతన భవనానికి ప్రతిపాదనలు చేశారు. పట్టించుకోకపోవడంతో ప్రస్తుత భవనం పూర్తిగా దెబ్బతింది. భోజన వసతి, చదువుకోవడం, కాలకృత్యాలు వంటివన్నీ పూర్తి చేసుకుని అవసరమైన రోజుల్లో దగ్గర్లోని మండల విద్యా వనరుల కేంద్రంలో తలదాచుకుంటున్నారు. అంతకుముందు కొంతకాలం స్థానిక సచివాలయం పైఅంతస్తులో రాత్రిపూట నిద్రించేవారు. కొత్త భవన నిర్మాణం మంజూరుకు ఆదేశాలు వచ్చాయని వార్డెన్ ప్రశాంతి తెలిపారు.

పెచ్చులూడిన వరండాలో చదువుకుంటున్న బాలికలు

విలీన గ్రామాల ఇబ్బందులు పరిష్కరించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం నియోజకవర్గంలో పలు గ్రామాలను రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనానికి ప్రతిపాదించారని, అవి అభివృద్ధికి నోచుకోవట్లేదని ఎమ్మెల్యే బలరామకృష్ణ పేర్కొన్నారు. గ్రామాల విలీన సమస్యను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను కోరారు. బుధవారం మంత్రి నారాయణను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ విలీన ప్రతిపాదిత గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికలు జరగక కేంద్ర నిధులు విడుదల కావట్లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారులు కావడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. సదరు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి, కనీస సదుపాయాలు కల్పించేలా ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రతిపాదిత విలీన గ్రామాల్లో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. గోదావరి పుష్కరాలకు నియోజకవర్గానికి నిధుల విడుదలలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఆయన విమర్శలే.. నాకు ఆశీస్సులు - నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, న్యూస్‌టుడే: 'ఆయన విమర్శలే.. నాకు ఆశీస్సులు, ఎమ్మెల్యే సీటు రాదన్నారు, వచ్చింది.. ఎమ్మెల్యేగా గెలవలేనన్నారు.. గెలిచాను. మళ్లీ నేను గెలవను అంటున్నారంటే.. తప్పకుండా గెలుస్తానని' ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పందలపాకలో జరిగిన కార్యక్రమంలో సత్తి సూర్యనారాయణరెడ్డిపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ జంగిల్ రాజ్ అంటూ తనను ఉద్దేశించి మాట్లాడినందుకు ధన్యవాదాలన్నారు. బిహార్ లాంటి రాష్ట్రానికి 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తితో తనను పోల్చడంతో జాతీయ స్థాయి నాయకుడిగా గుర్తించారన్నారు. వైకాపా హయాంలో జరిగిన సీఎంఆర్ అవకతవకలు అన్నీ ఇన్నీ కావన్నారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోని మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం ధాన్యం కొనుగోలును విమర్శిస్తున్నారని ఆక్షేపించారు.

ప్రకృతి సేద్యంతో ప్రజారోగ్యం

బిక్కవోలు, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యంతో ప్రజారోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రైతులంతా ప్రకృతి సేద్యం దిశగా అడుగులు వేయాలన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించి రెండో విడత నగదును పందలపాకలో జరిగిన కార్యక్రమంలో రైతుల ఖాతాల్లో జమ చేశారు. 24,591 మందికి దాదాపు రూ.17 కోట్లు అందుతాయన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించేందుకు నానో ఫెర్టిలైజర్స్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ ఎవరైనా అర్హులకు జమ కాకుంటే అధికారులను సంప్రదించాలన్నారు. ఈసారి అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా పథకం వర్తింపజేశారన్నారు. తెదేపా యువనేత నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, సర్పంచి పద్మావతి, ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ ఛైర్మన్ సూర్యకుమారి, మాజీ ఎంపీపీ వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆర్డీవో కృష్ణ నాయక్

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం

బొమ్మూరు, కడియం: అన్నదాతల శ్రేయస్సే కూటమి సర్కారు లక్ష్యమని తెదేపా రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. తొర్రేడు సహకార సంఘంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. అధిక గిట్టుబాటు ధరతో నియోజకవర్గంలో 934 మంది నుంచి 4,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. నియోజకవర్గంలో సుమారు 5,730 మందికి రూ.3.92 కోట్లు జమవుతుందన్నారు. నమూనా చెక్కును రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారులు కె.సూర్య రమేష్, రమేష్ బాబు, సొసైటీ ఛైర్మన్ దండమూడి బాపినీడు, మత్సేటి ప్రసాద్, కురుకురి కిశోర్, నారాయణ గౌడ్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, నాగం శివ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, అధికారులు

రాజానగరంలో రూ.17 కోట్లు జమ

కోరుకొండ, సీతానగరం: అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.17.58 కోట్లు విడుదల చేశారు. కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన అన్నదాత-సుఖీభవ పీఎం కిసాన్ రెండోవిడత పంపిణీ కార్యక్రమంలో సంబంధిత నిధుల చెక్కు నమూనాను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 26,227 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అన్ని హామీలు అమలు చేస్తుందన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ తనకాల నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కంటే కేశవరావు రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం గురించి వివరించారు. సీతానగరం మండలం కూనవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులతో ముచ్చటించారు.

కోరుకొండలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, తదితరులు

జీఐఎస్‌తో ఖనిజాల అన్వేషణ

రాజానగరం: సివిల్, మైనింగ్ ఇంజినీరింగ్‌లో రిమోట్ సెన్సింగ్ ప్రాధాన్యం పెరిగిందని మైనింగ్ విభాగం అధిపతి డా.వై.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని సివిల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జీఐఎస్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖనిజాల అన్వేషణ, భూగర్భ జలాల అన్వేషణ, మ్యాపింగ్ వంటి వాటికి జీఐఎస్‌ను ఉపయోగిస్తున్నారన్నారు. ఇందులో యువతకు అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సివిల్ విభాగాధిపతి డా.పి.వి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

బిక్కవోలు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొంకుదురు శాఖా గ్రంథాయలంలో మహిళా దినోత్సవం, మహిళా సాధికారతపై చర్చ నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ హాజరయ్యారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బాల పాల్గొన్నారు.

చెరువును కాపాడాలని వినతి

బిక్కవోలు, న్యూస్‌టుడే: పందలపాక పంచాయతీ చెరువును ఆక్రమణల బారి నుంచి కాపాడాలని జనసేన కార్యకర్తలు ఆర్డీవో కృష్ణనాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. చెరువు చుట్టుపక్కల వారు అందులో వ్యర్థాలు వేస్తూ దాని రూపు మార్చేస్తున్నారని అన్నారు. ఆక్రమణల బారినుంచి రక్షించాలని కోరారు. అందుకు గ్రామస్థులమంతా సహకారం అందిస్తామన్నారు. కొలతల ప్రకారం చెరువు విస్తీర్ణం సరి చూడాలన్నారు. లేకపోతే ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కడియం: గుర్తుతెలియని మృతదేహం కడియం పోలీసుస్టేషన్ పరిధిలో లభ్యమైంది. సీఐ వెంకటేశ్వరరావు వివరాల మేరకు ధవళేశ్వరం నుంచి కడియం వచ్చే కాలువలో వేమగిరి వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఉదా రంగు చీర, జాకెట్ ధరించిన సుమారు 30 నుంచి 40ఏళ్ల మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఆమె మెడలో నల్లపూసలు, పుస్తెలతాడు, చెవులకు దిద్దులు, చేతులకు గాజులు, కాళ్లకు మెట్టెలు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలకు కడియం పోలీసులను సంప్రదించాలని కోరారు.

రూ.30వేల జరిమానా

బిక్కవోలు, న్యూస్‌టుడే: అబ్కారీ శాఖ విధించిన బైండోవర్‌ను ఉల్లంఘించి సారా విక్రయించినందుకు రంగాపురం గ్రామానికి చెందిన యడారి రాంబాబుకు రూ.30వేలు జరిమానా విధించారు. తహసీల్దారు బీఎస్‌వీ కృష్ణ జరిమానా విధించినట్లు రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ అధికారి సుధ మంగళవారం తెలిపారు. గతంలో పట్టుకుంటే బైండోవర్ విధించినా విక్రయించారన్నారు.

22న నన్నయలో జాతీయ సైన్స్ సెమినార్

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫిజిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న జాతీయ సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. రీసెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ ఫిజిక్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను బుధవారం విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సెమినార్‌కు ముఖ్య వక్తలుగా బయోకాన్ బ్రిస్టల్ - మైనర్స్ స్క్విబ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ లీడ్ ఇన్వెస్టిగేటర్ డా.శ్రీనివాస్ కలిదిండి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ డా.ప్రతాప్ కొల్లు హాజరవుతారన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, ప్రిన్సిపల్ పి.విజయనిర్మల, జి.చంద్రకళ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

కోరుకొండ, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భాజపా నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శివాలయం వద్ద బుధవారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మూడు నియోజకవర్గాల్లో రూ.కోట్లు ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.లక్ష విరాళం ప్రకటించారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కంబాలను ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కణుపూరి విద్యార్థిని

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం కణుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అడబాల చిన్నారి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన అండర్- 14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో స్థానం సాధించింది. ఎంఈవోలు టి.కుశలవదొర, సుజాత, ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.నరసింహాద్రి, బి.వీరబాబు, కె.రమణ తదితరులు ఆమెను అభినందించారు.

కబడ్డీలో ఎంపికైన చిన్నారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలకు సాంకేతిక సాయం

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట బొప్పన సావిత్రమ్మ ఉన్నత పాఠశాలకు ఇంటర్నెట్ సౌకర్యం కోసం రూ.16 వేలు, రెండు సీసీ కెమెరాలను బుధవారం అందజేశారు. దాత బొప్పన అప్పారావు వీటిని సమకూర్చారు. అనంతరం బడిలో ఎల్‌సీడీను ప్రారంభించి మాట్లాడారు. తగిన సదుపాయాలు కల్పిస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు మూర్తి, సిబ్బంది రమణ, కురుమళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

రాజానగరం: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని రాజానగరంలోని వడయార్ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ డా.వై.ఎ.వడయార్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పండ్లు, మిఠాయిలు పంచారు. పార్టీ జిల్లా కార్యదర్శి మట్టాడి రాజేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లేటి కృపానందం, మహిళా నాయకులు కె.రాహేలు, సత్యవతి, జాన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

222 మందికి ఉచిత వైద్య పరీక్షలు

రాజానగరం: జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ సంఘం, స్కూల్ ఆఫ్ ఫార్మసీ గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దంతాలు, నేత్ర, రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు చేశారు. సుమారు 222 మంది పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు తనూజ, నీరజ, డీన్ డా.ఎం.డి.ధనరాజు, డా.డి.కవిత, షేక్‌మీరా పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

వి.ఎల్.పురం : స్మార్ట్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 30 వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గురువు బిక్కిన శివ బుధవారం తెలిపారు. ఏవీఏ రోడ్డులోని ఓఎన్జీసీ కాంట్రాక్టర్స్ హాలులో ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. మొదటి 30 మంది సాధకులకు మాత్రమే ఉచిత శిక్షణకు అవకాశం ఉంటుందని తెలిపారు.

పరిసరాలు శుభ్రం..

ఈనాడు కథనానికి స్పందన

హుకుంపేట ఉన్నత పాఠశాల వద్ద చెత్త వేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. పక్కనే చెత్త రిక్షా పెడుతుండటంతో పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ సమస్యపై 'ఈనాడు'లో బుధవారం 'వ్యర్థాలు తొలగించరేం' శీర్షికన వార్త ప్రచురితమైంది. కార్యదర్శి కాశీ వెంటనే స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తీయించి శుభ్రం చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, హుకుంపేట

పట్టించుకోకుంటే ప్రమాదమే..

కొంతమూరు బ్రాహ్మణ అగ్రహారంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఒరిగింది. తీగలు కిందకు వేలాడుతున్నాయి. గాలికి ఒకదానికి మరొకటి తలిగి ప్రమాదాలకు అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కొంతమూరు

తలుపులు లేకుంటే ఎలా..?

రాజానగరంలోని బాలుర వసతిగృహం అపరిశుభ్రంగా ఉంది. మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేవు. వసతిగృహం ఆవరణలో టైల్స్ విరిగిపోయి, ప్రమాదకరంగా ఉన్నాయి. స్లాబు పెచ్చులుగా రాలిపోయి, ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. విద్యుత్తు స్విచ్ బోర్డుల మేకులు ఊడిపోయాయి. తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. – న్యూస్‌టుడే, రాజానగరం

నడకదారిలో చిక్కులు

రాజమహేంద్రవరం నగరంలోని కంబాలచెరువు జంక్షన్ నుంచి కోరుకొండ వెళ్లే ప్రధాన రహదారిలో రామకృష్ణ మఠం ఎదురుగా నడకదారిలో డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన పలక తొలగి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వేల మంది ప్రయాణిస్తుంటారు. మలుపు దగ్గర పలక తొలగడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళలో గుర్తించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

బహిరంగ వేలం

తేది: 21-11-2025 (శుక్రవారం)

Veh. No.	Vehicle Description	Year
AP05TA9288	TATA 207 DI SINGLE CAB	2012
AP39TX0666	EICHER PRO 3019 BS6 FBT	2021
AP39UH8940	AL BADA DOST i4 BS6	2022
AP35AD1166	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP39SJ4247	NISSAN - MAGNITE XV ACENTA MT BS6	2022
AP39WB6027	GREAVES D 435 CITY BS6-P	2025

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

Vizag Auction తేది: 22-11-2025 (శనివారం)

AP39VD3335	AL 3525 BS6 FBT-T	2023

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., 1-438, NHAI దగ్గర, టోల్‌ప్లాజా, తర్లువాడ పంచాయతీ, ఆనందపురం మండలం, విశాఖపట్నం - 530052

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd.,

D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి

0883-2465088, 98499 81384

కంకర తేలి.. గుంతలు పడి

బొమ్మూరు నుంచి జీపీఆర్ రోడ్డు మీదుగా పాతబొమ్మూరు వెళ్లాలంటే వాహనచోదకులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వేసిన కొన్ని నెలలకే గుంతలు పడ్డాయి. వర్షాకాలంలో పూర్తి కంకరరాళ్లు పైకి తేలి గుంతల్లో నీరు చేరింది. పాతబొమ్మూరు వెళ్లే వారు పంచాయతీ కార్యాలయం రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. చుట్టుపక్కల రోడ్లు బాగానే ఉన్నా నాణ్యతా లోపంతోనే పాడైందని స్థానికులు అంటున్నారు. ఇదే మార్గంలో సచివాలయం సమీపంలో రోడ్డు పరిస్థితి ఇలాగే ఉందని వ్యాపారులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో రాలేకపోతున్నామని వాపోతున్నారు. దీనిపై ర.భ.శాఖ అధికారులను సంప్రదించగా నిధుల కొరత కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు.
– న్యూస్‌టుడే, బొమ్మూరు

పేదింటి బిడ్డకు కొండంత అండ

కడియం, న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థుల పాలిట కల్పవల్లిగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాలక్ష్మి పథకం రూపుదిద్దుకుంది. పిల్లలు బాగా చదివి ఉన్నతస్థితికి చేరాలని ప్రతి తల్లిదండ్రుల ఆకాంక్ష. ఆర్థిక కారణాలతో చదువును కొనసాగించ లేని పరిస్థితి. వీరి ఆశలకు ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం విద్యాలక్ష్మి పేరిట అవకాశం కల్పిస్తోంది. ఎలాంటి పూచీకత్తులు, హామీదారులు లేని బ్యాంకు రుణ సదుపాయాన్ని అందిస్తూ భరోసా ఇస్తోంది.

మీ కోసం

దరఖాస్తు ఇలా..

● ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకునేందుకు https://pmvidyalaxmi.co.in అని టైపు చేసి ఎంటర్ బటన్ నొక్కాలి. ● విద్యాలక్ష్మి పోర్టల్ తెరుచుకుంటోంది. ● స్టూడెంట్ లాగిన్ అన్న చోట క్లిక్ చేసి క్రియేట్ న్యూ అకౌంట్ ఎంచుకోవాలి. ● కొత్తగా విద్యార్థి పేరిట రిజిస్ట్రేషన్‌కు పేరు, చరవాణి నంబరు, ఈ-మెయిల్ ఐడీ, నమోదు చేసి పాస్‌వార్డ్‌ను ఎంచుకుని సబ్మిట్ నొక్కాలి. ● అనంతరం విద్యార్థి పూర్వ, ప్రస్తుత చదువు వివరాలు నింపాలి. ● విద్యార్థి పది, ఇంటర్, డిగ్రీ, మార్కుల జాబితాలు, స్టడీ సర్టిఫికెట్లు, ప్రస్తుతం చదవాలనుకుంటున్న కోర్సుకు సంబంధించి కళాశాల ఫీజు వివరాలు, ఆదాయ ధ్రువపత్రం, తల్లిదండ్రుల, విద్యార్థి పాన్‌కార్డుల వివరాలు నమోదు చేయాలి.

రుణం మంజూరు ఇలా..

ఇంజినీరింగ్, వైద్య వృత్తి కోర్సులు, డిగ్రీ చదివే విద్యార్థులు అర్హులు. కుటుంబ ఆదాయం రూ.నాలుగు లక్షలకు మించరాదు. ఒకరికి ఒకసారి మాత్రమే అవకాశం. దరఖాస్తుకు తుది గడువంటూ లేదు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తును, అందులో పేర్కొన్న బ్యాంకు అధికారులకు సమర్పించాలి. కళాశాల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తారు. రూ.7.5లక్షల వరకు రుణం పొందొచ్చు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ

సంక్షిప్త టెండర్ నోటీస్ నెం.01/2025 **తేది: 19-11-2025**

ఎంజిఎన్ఆర్ఈజిఎస్ (MGNREGS) కార్యక్రమము క్రింద గోకవరం మండలములోని 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ గ్రామ పంచాయతీలలో చేపట్టవలసిన అన్నిరకాల మెటీరియల్ పనుల కొరకు పదార్థాలు/నైపుణ్యం కలిగిన మరియు అర్ధ నైపుణ్యం కలిగిన కార్మికులు/యంత్రాలు సరఫరా చేయుటకు మూసివేసిన టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. సదరు టెండర్లు, పైన తెలిపినవి సరఫరా చేయుటకు రేట్లు నిర్ధారణ కొరకు మాత్రమే, కావున ఆసక్తి కలిగిన వారిని ఆహ్వానించడమైనది.

టెండర్ షెడ్యూల్ జారీ తేదీలు: 27-11-2025 నుండి 03-12-2025, సాయంత్రం 05.00 గంటల వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయము, గోకవరం మండలం.

బిడ్ సమర్పణకు చివరి తేది : 04-12-2025 మధ్యాహ్నం 03.00 గంటలకు

టెండర్లు తెరవడం : 04-12-2025 సాయంత్రం 04.00 గంటలకు

టెండర్ షెడ్యూల్ ధర : రూ.2,000/-

టెండర్ ఆమోదించే అధికారి ఏదైనా టెండర్ లేదా అన్ని టెండర్లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కును కలిగి ఉంటారు. ఒడంబడిక ఇవ్వక ముందే ఎప్పుడైనా టెండర్ ప్రక్రియను రద్దుచేసే అధికారం ఆయనకు ఉంది. ఈ చర్య వల్ల ప్రభావిత బిడ్డర్ లేదా బిడ్డర్లపై ఎటువంటి బాధ్యత లేదా వారికి ఆ నిర్ణయానికి గల కారణాలు తెలియజేయాల్సిన బాధ్యత టెండర్ ఆమోదించే అధికారికి ఉండదు. సదరు నిర్ధారించిన రేట్లకు భవిష్యత్తులో టెండరు నందు పాల్గొనని వారు ఎవరైనా పదార్థాలు / నైపుణ్యం కలిగిన మరియు అర్ధ నైపుణ్యం కలిగిన కార్మికులు / యంత్రాలు సరఫరా చేస్తాము అని అంగీకరించినట్లయితే వారిని కూడా సరఫరా చేయుటకు పరిగణించబడే అధికారం టెండరు ఆమోదించే అధికారి కలిగియుంటారు.

స్థలం : గోకవరం, **మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు ప్రోగ్రాం అధికారి**

తేది: 19-11-2025. MGNREGS, మండల ప్రజా పరిషత్, గోకవరం

(c) eenadu

కొవ్వూరు
●కొవ్వూరు ●నిడదవోలు ●గోపాలపురం

పూజలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఏకాహం

ఉండ్రాజవరం: తాడిపర్రులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద ఏకాహం, సీతారాములకు ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధనలు చేశారు. రెవెన్యూశాఖ అధికారుల వన సమారాధన ఉండ్రాజవరంలో నిర్వహించారు.

విదేశీ వస్తువుల వాడకం తగ్గించాలి

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

దేవరపల్లి: స్వదేశీ వస్తువుల వాడకం పెంచాలని, విదేశీ వస్తువుల వినియోగం తగ్గించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా యర్నగూడెం నియోజక వర్గ స్థాయిలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు స్వదేశీ వస్తువుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆర్.శ్రీనివాస్, సత్తిబాబు, కాశీ, సుమన్‌బాబు, జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

చరవాణి ప్రభావంపై మాట్లాడుతున్న విద్యార్థిని

ఉపన్యాసంతో మెప్పించారు

విజేతలతో ప్యూపిల్ ట్రీ పాఠశాల ప్రిన్సిపల్ బ్రాహ్మణి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పశివేదలలోని ప్యూపిల్ ట్రీ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలను బుధవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు ఉత్సాహ వాతావరణంలో జరిగాయి. 7, 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొని చక్కగా ఉపన్యసించి ప్రతిభ కనబరిచారు. కె.సంజన (10వ తరగతి), ఎం.కోమలి (7వ తరగతి), కె.అమృత (7వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ప్రిన్సిపల్ యు.బ్రాహ్మణి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం కొరవడి.. అవస్థల జడి

అధ్వాన స్థితిలో వసతి గృహాలు

పరిశీలన

ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు మౌలిక వసతుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన తలుపులు, మెష్‌లు లేని కిటికీలతో దోమలు పెరిగి జ్వరాల బారిన పడుతున్నారు. చన్నీళ్ల స్నానాలతో వణుకుతున్నారు. సురక్షిత తాగు నీరు లేక అల్లాడుతున్నారు.


దెబ్బతిన్న ఉండ్రాజవరం ఎస్సీ వసతి గృహం స్లాబు

వర్షం వస్తే పరుగులే..

ఉండ్రాజవరం: స్థానిక ఎస్సీ వసతి గృహం భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో వర్షాల సమయంలో ఉన్నతపాఠశాల గదుల్లోకి విద్యార్థులు పరుగులు తీస్తున్నారు. రహదారికి లోతులో ఈ భవనం ఉండటం వల్ల తరచూ ముంపునకు గురవుతోంది. కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని సంక్షేమాధికారి ప్రసాదు తెలిపారు.

వేడి నీరు ఉండదు..

గోపాలపురం: గోపాలపురం ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలం కావడంతో ఉన్న 18 మంది విద్యార్థులకు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఓ ప్రైవేటు భవనంలోకి తరలించారు. విద్యుత్తు దీపాలు లేక భవనం పరిసరాలు అంధకారమయం అవుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. స్నానానికి, తాగడానికి వేడినీరు కల్పించాలని కోరుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మి తెలిపారు.

మెష్‌లు లేని కిటికీ..

తాగునీరు బయటే..

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం శిథిలమైన నేపథ్యంలో రెండేళ్లుగా అద్దె భవనంలో 31 మంది విద్యార్థులతో నడుపుతున్నారు. సొంత స్థలంలో కొత్త భవనం కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. నీటి శుద్ధి యంత్రం లేనందున బోరు, బయటి నుంచి తెచ్చే ఆర్వో నీటిని డబ్బాలలో పెడుతున్నారు.

నీటి కోసం ఉంచిన డబ్బా

చలికి వణికిపోతున్నారు..

నల్లజర్ల: నల్లజర్లలోని బాలుర ఆనంద నిలయం శిథిలావస్థలకు చేరడంతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. దీంతో ఉన్న 37 మంది విద్యార్థులను సమీపంలోని మండల పరిషత్తు పాఠశాలకు జూన్‌లో తరలించారు. ఆ పాఠశాల్లో ఉన్న కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో దోమలతో, చలితో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమందికే కప్పుకోవడానికి దుప్పట్లు ఉన్నాయని, అందరికీ అందించాలని బాలురు కోరుతున్నారు.

ఆర్వోబీ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

రేవు ధ్వంసంపై ఆందోళన

నిడదవోలు: నిడదవోలులో ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా శివాలయం, స్నానాల రేవు ధ్వంసం కావటం పట్ల స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఆలయ పరిసరాల్లో నిర్మాణ పనులు నిలిపివేయాలని, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు అక్కడకు వచ్చి స్థానికులతో చర్చించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: ఆహార ప్రాధాన్యత కలిగిన వ్యాపారాలను మహిళలు చేపట్టాలని, వ్యాపార వేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం వాణీధరరావు అన్నారు. బుధవారం తాళ్లపూడిలోని వెలుగు కేంద్రం వద్ద మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. పరిశ్రమల ఐపీవో సూర్యప్రకాశ్, వెలుగు ఏపీఎం మంగాయమ్మ పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు

నిడదవోలు: సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని బుధవారం నిడదవోలులోని రాయిపేటలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతినిధులు జి.రామారావు, కె.గోపాలస్వామి, ఎ.నరసింహం, బి.అప్పారావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేస్తున్న బాబా భక్తులు

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధికారి ముళ్లపూడి వెంకటరమణ అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా పాలంగి సొసైటీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఆయనతో పాటు సొసైటీ అధ్యక్షుడు కర్రి నరసన్న జెండాను ఆవిష్కరించారు. మెగా వైద్య శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.

మత్స్యకారుల వ్యాపారాభివృద్ధికి కృషి

నిడదవోలు, న్యూస్‌టుడే: మత్స్యకారుల వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని నిడదవోలు మండలం కోరుమామిడిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కోరుమామిడి మత్స్యకారుల సొసైటీ సభ్యులకు రూ.2.54 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

నిడదవోలులో చెక్కు ప్రదర్శిస్తున్న మంత్రి దుర్గేష్, జేసీ మేఘా స్వరూప్

నిడదవోలు, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' రెండో విడత సాయం అందజేత కార్యక్రమంలో భాగంగా నిడదవోలులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 19,368 మంది రైతులకు రూ.12.94 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం రైతులను దగా చేసిందని విమర్శించారు. జేసీ మేఘా స్వరూప్, పురపాలకసంఘ కమిషనర్ కృష్ణవేణి, అగ్రికల్చర్ ఏడీ శ్రీనివాసు, రైతులు పాల్గొన్నారు. ✦ పసలపూడిలో నిర్వహించిన సమావేశంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడారు. సింహాద్రి రామకృష్ణ, బలుసు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైకాపా రైతు సంక్షేమాన్ని మరిచింది: ముప్పిడి

చాగల్లు: కొవ్వూరు నియోజకవర్గంలో 14,884 మంది రైతుల ఖాతాల్లోకి రూ.9.98 కోట్లు జమ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. చాగల్లు మండలం నెలటూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని మరిచిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల కష్టాలు తీర్చిందన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడారు. నాయకులు హరిబాబు, శివరామకృష్ణ, నారాయుడు, చిన్ని, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పంట విత్తనాల ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేక తెరపైన ప్రధాని ప్రసంగాన్ని రైతులు వీక్షించారు.

చాగల్లు: చెక్కును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో రాణి సుస్మిత తదితరులు

గోపాలపురం నియోజకవర్గానికి అధికం..

గోపాలపురం: జిల్లాలో ఏ నియోజకవర్గానికి అందని సాయం గోపాలపురానికి అందిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. నియోజకవర్గంలో 33,133 మంది రైతులకు సుమారు రూ.22 కోట్ల సాయం జమ చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో సీఎం చంద్రబాబుతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామానాయుడు తనకు సహాయంగా ఉన్నారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు మాధవరావు, మల్లికార్జునరావు, సేంద్రియ వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పసలపూడిలో మాట్లాడుతున్న శేషారావు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498
ఉ 10 - మ 1 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

నిత్యం వెలుగులు

సమస్య: మండల ప్రజాపరిషత్తు ఆదర్శ ప్రాథమిక పాఠశాల వీధిలో ఉన్న విద్యుత్తు దీపం కొన్ని రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతోంది. - స్థానికులు

సమాధానం: విద్యుత్తు దీపానికి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. - కిశోర్, పంచాయతీ కార్యదర్శి, నల్లజర్ల

- న్యూస్‌టుడే, నల్లజర్ల

పువ్వులు పోయే.. కూరగాయలు వచ్చే

సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు హాజరైన అతిథులకు పువ్వులు, ఆకులు, ప్లాస్టిక్ వస్తువులతో తయారు చేసిన పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికేవారు. ప్రస్తుతం ఆ పద్ధతి మారుతోంది. కూరగాయలతో తయారు చేసిన బుట్టలను అందించడం పరిపాటిగా మారుతోంది. బుధవారం గౌరీపట్నంలో జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు పలు రకాల కాయగూరలతో తయారు చేసిన బుట్టలను అందించారు.

- న్యూస్‌టుడే, గోపాలపురం

ఆత్మస్థైర్యమే మహిళలకు ఆయుధం

కొవ్వూరు గ్రంథాలయంలో రంగవల్లులను ప్రదర్శిస్తూ..

తాళ్లపూడి: రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, నల్లజర్ల, న్యూస్‌టుడే: మహిళలకు ఆత్మ స్థైర్యమే ఆయుధమని పురపాలక ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలను బుధవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.సుగుణకుమారి అధ్యక్షత వహించారు. ✦ తాళ్లపూడిలోని విద్యార్థినులకు గ్రంథపాలకుడు నరేష్ ఆధ్వర్యంలో ముగ్గులు, కుర్చీల పోటీలు జరిగాయి. ✦ నల్లజర్లలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు సుశీల, శ్రీరామ్, ఏ.వి.రమణ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి ఇందిరా గాంధీ

కొవ్వూరు పట్టణం, నిడదవోలు, న్యూస్‌టుడే: తొలి మహిళా ప్రధాని, ఉక్కు మహిళగా ఇందిరాగాంధీ సంస్కరణలు ఆదర్శనీయమని కొవ్వూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బచ్చు బుజ్జిబాబు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పట్టణంలో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర రహదారి పక్కన ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ◆ ఇందిరా గాంధీ ఆదర్శమూర్తి అని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. నిడదవోలులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడవరపు భద్రందొర, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలులో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పంచాయతీ కార్యదర్శి అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం సభ్యులు

చెరువు గట్టుపై నిర్మాణాలు వద్దని నిరసన

గోపాలపురం, న్యూస్‌టుడే: సగ్గొండ పంచాయతీ పరిధిలో తమకు కేటాయించిన చెరువు గట్టుపై ఆలయ నిర్మాణం కోసం తీర్మానం చేయవద్దంటూ రజక సంఘ సభ్యులు గోపాలపురం సచివాలయం వద్ద బుధవారం బైఠాయించారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేయడం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో ఆ సంఘ వృత్తిదారులు సచివాలయ సిబ్బందిని కార్యాలయం లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో గ్రామ సర్పంచి యండపల్లి శేఖర్‌బాబు విధులకు ఆటంకం కల్పిస్తున్నారంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై మనోహర్ సిబ్బందితో చేరుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ సర్పంచి, రజక సంఘ నాయకులు కె.ఏడుకొండలు, పోశయ్య, సుబ్రహ్మణ్యం, ఇతరులతో ఎస్సై మాట్లాడారు. సంఘ నాయకులు కార్యదర్శి వి.అరుణకుమారికి వారి సమస్యను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు.

ఆసుపత్రి అనుమతులపై చర్చకు సిద్ధం: దుర్గేష్

నిడదవోలు: నిడదవోలు 100 పడకల ఆసుపత్రి అనుమతుల విషయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ఇతర వైకాపా నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేయాలంటే కేవలం పరిపాలనా అనుమతులు సరిపోవని, వైకాపా వారే అనుమతులు తెచ్చామనడానికి ఆధారాలు చూపించాలని సవాలు విసిరారు. మిడిమిడి జ్ఞానంతో వారు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకున్న అనుమానాలు తీర్చటానికి ఏ వేదికపై అయినా చర్చకు సిద్ధమన్నారు.

కుష్ఠు లక్షణాలపై సర్వే

నల్లజర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో 30వ తేదీ వరకు కుష్ఠు కేసుల గుర్తింపు సర్వేను నిర్వహిస్తున్నట్లు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.గంగాధరరావు పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులందరికి శరీరంపై స్పర్శ లేని మచ్చల గురించి, చేతులు, కాళ్లు తిమ్మిర్లు, వేళ్ల వంకర్లపోవడం లక్షణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. లక్షణాలున్నవారిని గుర్తించి వైద్యం అందిస్తారన్నారు. బుధవారం ఘంటావారిగూడెంలో ఈ సర్వే నిర్వహించారు. సీహెచ్‌వో వెంకటశాస్త్రి, ఏఎన్ఎం సువర్ణకుమారి, సుధ, సుబ్బారావు, శ్రీరామమూర్తి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి సన్నిధానం.. భక్తులకు అన్నదానం

తాళ్లపూడి వద్ద గోదావరి గట్టు వద్ద ఉన్న పురాతన శివాలయం గౌతమేశ్వర, రమా సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన బుధవారం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, తాళ్లపూడి

స్వచ్ఛ గ్రామాల సంకల్పాన్ని నెరవేర్చాలి

కొవ్వూరు పట్టణం, ఉండ్రాజవరం: స్వచ్ఛ గ్రామాల సంకల్పాన్ని నెరవేర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం కీలకమని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ అన్నారు. కొవ్వూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో టీబీవీ రమణ, కె.బాలనాగు గ్రామాల అభివృద్ధి, స్వచ్ఛత, పచ్చదనం వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు, పరిష్కార మార్గాలను తెలిపారు. ఆర్థిక సంఘం, సాధారణ నిధుల వినియోగం, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. జడ్పీటీసీ సభ్యురాలు బి.వెంకటలక్ష్మి, ప్రజాప్రతినిధులు, సిబ్బంది హాజరయ్యారు. ◆ పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని జిల్లా రిసోర్స్‌పర్సన్ ప్రసంగిరాజు అన్నారు. ఉండ్రాజవరంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

సేవాగుణంతో పనిచేయాలి

నల్లజర్ల, న్యూస్‌టుడే: సేవాగుణాన్ని అలవరచుకోవాలని జాతీయ సేవా శిబిరం (ఎన్ఎస్ఎస్) కార్యదర్శి సి.పి.విజ్జి పేర్కొన్నారు. ఉద్యాన వర్సిటీ (వెంకట్రామన్నగూడెం) ఆధ్వర్యంలో కవులూరు, తిమ్మన్నపాలెం గ్రామాల్లో విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేశారు. దురాజి, ఉమా కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో విద్యార్థులు

గంజాయి పట్టివేత?

నల్లజర్ల: మండలంలోని వీరవల్లిటోల్‌ప్లాజా వద్ద బుధవారం ఉదయం సుమారు 140 కిలోల గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పాడేరు వైపు నుంచి హైదరాబాద్‌కు పండ్లు తీసుకెళ్తున్న వాహనాన్ని టోల్‌ప్లాజా వద్ద ఆర్ఎస్ఎం హైవే పోలీసులు, నల్లజర్ల పోలీసులు తనిఖీ చేయగా గంజాయి దొరకడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. నల్లజర్ల సీ.ఐ.రాంబాబును వివరణ కోరగా ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు.

వేర్వేరు ఘటనల్లో పంట చేలు దగ్ధం

కొవ్వూరు పట్టణం: రెండు వేర్వేరు ఘటనల్లో బుధవారం మధ్యాహ్నం పంట పొలాలు దగ్ధమయ్యాయి. కొవ్వూరు మండలం దొమ్మేరు సావరానికి చెందిన గుంటూరు వెంకట సుబ్రహ్మణ్యానికి చెందిన 20 సెంట్ల పొలంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నిప్పు రవ్వలు వచ్చి పంట కాలిపోయింది. ఆ శాఖాధికారులు సరఫరాను నిలిపివేశారు. ✦ దొమ్మేరు పెట్రోలు బంకు సమీపంలోని పొలంలో చెత్తకు నిప్పు పెట్టడంతో పైడిమర్ల శ్యామూల్, కలగర శ్రీనివాసరావుకు చెందిన పొలాల్లోకి మంట వ్యాపించి కొంత మేర పంట దగ్ధమైంది. దొమ్మేరుసావరం అగ్నిమాపక సిబ్బంది, రైతులు కలసి మంటలను అదుపు చేశారు. దీంతో రైతు సేవా కేంద్రానికి సమాచారం ఇవ్వగా వీఆర్వోలు వచ్చి పంటలను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. తహసీల్దారు ఎం.దుర్గాప్రసాద్‌ను అడగ్గా ఈ-పంట నమోదు, బీమా అంశాల ఆధారంగా పరిహారం అందుతుందన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల: సుస్థిర అభివృద్ధి లక్ష్యంలో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపసర్పంచులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గోపాలపురం, దేవరపల్లి మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీడీవోలు రాజ్‌మనోహర్, నాగార్జునరావు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు హాజరై పంచాయతీల అభివృద్ధికి చేయాల్సిన పలు పనులపై మాట్లాడారు. ◗ స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని నల్లజర్ల ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో మొక్కల సంరక్షణ, పెంపకం వంటి వాటిపై పంచాయతీల ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలన్నారు. ఈవోపీఆర్డీ సింహాద్రిరావు పాల్గొన్నారు.

దేవరపల్లిలో గాంధీజీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎంపీపీ దుర్గారావు, సర్పంచులు

కుడికాలువ దుస్థితి మారేదెప్పుడో?

ఎర్రకాలువ నీటికోసం రైతన్నల ఎదురుచూపు

నల్లజర్ల, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కాలువలు పూడికపోవడం, ఉన్న కాలువలను పట్టించుకోకపోడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు సాగయ్యే విధంగా ఎర్రకాలువ కుడికాలువ నిర్మాణానికి 2003 సంవత్సరంలో అప్పట్లో సీఎం చంద్రబాబునాయుడు బీజం వేశారు. మండలాల వారీగా నల్లజర్లలో 12,325, జంగారెడ్డిగూడెంలో 3,640, కామవరపుకోటలో 353, కొయ్యలగూడెంలో 1,018, ద్వారకాతిరుమలలో 1,164, ఉంగుటూరులో 1,194 ఎకరాలు సాగయ్యే విధంగా అంచనాలు రూపొందించారు. 2006 ఈ కాలువలోకి నీరు విడుదల చేశారు. కొన్ని ప్రదేశాల్లో గట్లు గండికొట్టడంతో పూర్తిగా నిలుపుదల చేశారు. అప్పటి నుంచి దీని గురించి పట్టించుకోకపోవడంతో రైతన్నలు ఎర్రకాలువ నీరు కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ కాలువ సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపి నీటిని విడుదల చేసేలా చూడాలని కోరుతున్నారు.

పలుచోట్ల పూడిక పోయి...

★ కొంగువారిగూడెం ప్రాజెక్టు నుంచి 11కి.మీ దూరంలో ఉన్న తూర్పు యడవల్లి గిరిమ్మ చెరువులో ఎర్రకాలువ నీరు కలుస్తుంది. అక్కడి నుంచి పలు మండలాల మీదుగా నల్లజర్ల మండలంలోని ముసుళ్లకుంట వరకు 45 కి.మీ.మేర ముఖ్య కాలువ విస్తరించి ఉంది. ★ ఉప కాలువలను ఏలూరుజిల్లా ఉంగుటూరు మండలం వరకు విస్తరించేలా ప్రతిపాదించారు. ★ తూర్పు యడవల్లి వద్ద పంపింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి ఎర్రకాలువ కుడికాలువ వద్ద మరో 5 వేల ఎకరాలకు సాగు నీరందేలా ఏర్పాట్లు చేశారు. ★ గత కొంతకాలంగా ఈ ఎర్రకాలువ కుడికాలువను పట్టించుకోకపోవడంతో అనేక చోట్ల మట్టి పూడిపోయింది. ★ చాలా చోట్ల పిచ్చిమొక్కలు పెరిగి, మరికొన్ని చోట్ల గట్లు గండిపడ్డాయి. ★ పంపింగ్ వ్యవస్థ ఉపయోగించకపోవడంతో పంపులు తుప్పుపట్టాయి. ★ ఉపకాలువల నిర్మాణం, పూడికతీత పనులు, ఆక్రమణల తొలగింపు చేపడితే దాదాపు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

ముసుళ్లకుంట కాలువలో తుప్పలు పెరిగి ఇలా..

భూగర్భ జలాలు పెరుగుతాయి..

గండ్లు పడుతున్నాయని నీటి విడుదల ఆపేశారు. నల్లజర్ల అటవీ ప్రాంతంలో ములదిమ్మ వద్ద తరచూ గట్టు గండిపడుతోంది. నీరు కిందభాగం నుంచి ఊటగా మారి పంటపొలాల్లోకి వెళ్తోంది. కాలువలోకి నీరు వస్తే భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి.

- కొయ్యలమూడి రాజేశ్, రైతు, ముసుళ్లకుంట

(c) eenadu

ఈనాడు ఏలూరు
గురువారం నవంబరు 20, 2025

నాన్నా.. తీసుకెళ్లావా.. తిరిగి రాని లోకానికి..!

నా తల్లి అన్నావ్..
నా బంగారు కొండవన్నావ్..
నా గుండెంతా నువ్వేనన్నావ్..

రా.. అమ్మా..
రా.. బయటకు వెళ్దామంటే..
భలే భలే..
మా నాన్నతో వెళ్తున్నా..
అన్ని చూపిస్తాడు..
అడిగినవన్నీ కొనిస్తాడు..
ఆనందంగా ఇంటికి తీసుకొస్తాడని..
అనుకున్నా..

కానీ..
అదేంటి నాన్న..
అలా చేశావ్..
అడగనంత దూరానికి..
తిరిగి రాని లోకానికి తీసుకెళ్లిపోయావు..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం చించినాడ వంతెన పైనుంచి గోదావరిలో ఇద్దరు పిల్లలతో దూకిన తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్(35), కుమారుడు మోహిత్ (14)ల మృతదేహాలు మంగళవారం సాయంత్రం లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి (9) మృతదేహం దిండి సమీపంలో బుధవారం సాయంత్రం దొరికింది. పాలకొల్లు గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరానికి చెందిన దుర్గాప్రసాద్, భార్య నాగవేణికి మధ్య కొంత కాలంగా తగాదాలు ఉన్నాయి. ఈ కారణంగా దుర్గాప్రసాద్ ఈ ఘాతుకం చేసి ఉంటాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీనిపై దుర్గాప్రసాద్ తండ్రి సత్యనారాయణ, బావమరిది రమేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురి మృతదేహాలకు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించనున్నట్లు వివరించారు.

ఆ వేంకన్న వైద్య చలవ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే

ఆపద మొక్కులవాడు ద్వారకా తిరుమల చిన్న వేంకన్నను దర్శించుకుంటే భక్తుల కష్టాలు తీరతాయనేది నమ్మకం. ఆ స్వామి చలవతో నడుస్తున్న విర్డ్ ఆసుపత్రి ఆధునిక వైద్యాలయంగా రోగులకు పునర్జన్మనిస్తోంది.

● పోలియో బాధితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రారంభమైన ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో సామాన్యులకు అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. అత్యాధునిక పరికరాలతో ఏడు ఆపరేషన్ థియేటర్లు, ల్యాబొరేటరీ, ఎక్స్‌రే విభాగం సమకూర్చారు. ఇక్కడ ఓపీ ఉచితం.

ఇప్పటి వరకు వైద్య పరీక్షలు **3,18,400**
శస్త్రచికిత్సలు **8,400**
కాలిపర్స్ అందుకున్న దివ్యాంగులు **3000**

ఆర్థోపెడిక్

● ట్రామా, యాక్సిడెంట్ కేసులు. ● మోకాలు, తుంటి, మోచెయ్యి, భుజం మార్పిడి శస్త్రచికిత్సలు ● కీహోల్ సర్జరీ (మోకాలు, తుంటి, మోచెయ్యి, భుజం ● వెన్నెముక (మెడ, నడుము) సమస్యలకు చికిత్సలు, సర్జరీలు ● పోలియో, సెరిబ్రల్ పాల్సీ, అంగవైకల్యం వైద్య సేవలు

రోగులను పరీక్షిస్తున్న ప్రముఖ వైద్యుడు భాస్కరానంద్

కృత్రిమ అవయవాలు

● ఏలూరు గుప్తా ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు కాలిపర్స్ ● ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు పోగొట్టుకున్న వారికి 3డీ సాంకేతికతతో కృత్రిమ అవయవాలు ● అత్యాధునిక వసతులతో 16 పడకల ఫిజియోథెరపీ విభాగం

దేశ, విదేశాల నుంచి వస్తోన్న శస్త్రచికిత్సల నిపుణులు. ఇక్కడ ఆర్థోపెడిక్ విభాగంలో రోగులకు ఉచిత సేవలు అందిస్తున్నారు.

12 మంది

జనరల్ సర్జరీ

● గాల్ బ్లాడర్‌లో రాళ్లు, హెర్నియా, హైడ్రోసెల్, గర్భసంచిలో గడ్డలు, 24గంటల నొప్పి, పేగు పూత, పైల్స్, ఫిస్టులా, ఫిషర్, థైరాయిడ్ వంటి సమస్యలకు శస్త్రచికిత్సలు చేస్తారు. (లాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తారు).

నెఫ్రాలజీ, యూరాలజీ

● కిడ్నీలో రాళ్లు ప్రోస్టేట్ ఎన్లార్జ్‌మెంట్ సమస్యలకు ఎండోస్కోపీ లేజర్ చికిత్స. ● మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లకు చికిత్స. తదితర వాటికి...

చెవి, ముక్కు, గొంతు సర్జరీలు

● చెవిలో చీము, చెవుడుకు మైక్రోస్కోపిక్ ● సైనోసైటిస్‌కి ఎండోస్కోపి ● ట్రాన్సిల్స్, ఎడినాయిడ్స్.

మరిన్ని సేవలు

ఆర్థోపెడిక్స్, యూరాలజీలో ఎన్టీఆర్ వైద్య సేవ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లు అందుబాటులో ఉన్నాయి. డయాలసిస్ సేవలు అందుతున్నాయి. వైద్యం కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు ఉచిత భోజనం సదుపాయం, అత్యావసర సేవలకు అంబులెన్స్ ఉన్నాయి.

- ఎస్.వి.సుధాకర్, ఆసుపత్రి ఛైర్మన్

నాడు కొండగా.. నేడు పండగా

'అక్కడ సేద్యమంటే కొండను తవ్వి ఎలుకను పట్టడమే' అన్నారంతా. నేడు ఆ రాళ్ల భూమిలోనే రతనాలు పండిస్తున్నారు ఆదివాసీ రైతు వేలేరుపాడు మండలం వసంతవాడకు చెందిన పరమేశ్వరరావు. ఈయనకున్న ఎకరా భూమిలో సగం వరి సాగు చేస్తున్నారు.

మరో సగం రాళ్లు నిండిన గుట్ట. కనీసం మట్టి కానరాని ఆ భూమిలో కుటుంబ సభ్యుల సహకారంతో రాళ్లను కొంతమేర తొలగించి పత్తి పండించి ఏడు క్వింటాళ్లు దిగుబడి తీస్తున్నారు. కొండపై తెల్ల బంగారంలా పత్తి పంట కనిపించడంతో అటుగా వెళ్లే వారంతా రైతు పరమేశ్వరరావును ప్రశంసిస్తున్నారు.

- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ

ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటా : మంత్రి

డ్రోన్లను పరిశీలిస్తున్న నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ అద్భుత కార్యక్రమని, రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ముదినేపల్లిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన జిల్లాస్థాయి అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాట్సప్‌ను ఉపయోగించి సాంకేతికంగా రైతులు ఎక్కడైనా పంటను అమ్ముకొనే అవకాశం కల్పించామన్నారు. 50 వేల టార్పాలిన్లు రైతులకు పూర్తి రాయితీపై ఇస్తున్నామని, ఏ సమస్య వచ్చినా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా తాను అందుబాటులో ఉంటానని అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని కాలువలను రూ.3 కోట్లతో ప్రక్షాళన చేశామన్నారు. అంతకుముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, రాయితీ డ్రోన్‌లను పరిశీలించారు. డిజిటల్ స్క్రీన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలను వారు రైతులతో కలిసి వీక్షించారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఢిల్లీరావు, కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి జిల్లాలో 1,60,968 మంది రైతులకు రూ.106.23 కోట్ల చెక్కును అందించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఏడీఏ జి.వెంకటమణి పాల్గొన్నారు.

క్షీరపురి.. ఆధ్యాత్మిక ఝురి..

కుమారస్వామి తన ఆయుధంతో తారకాసురుని కంఠంలో అమృత లింగాన్ని ఛేదించగా అయిదు ముక్కలుగా పడిపోయిందని పురాణ ఇతిహాసం. అందులోని ఒక భాగాన్ని క్షీరపురి(పాలకొల్లు)లో విష్ణుమూర్తి ప్రతిష్ఠించారు. రెండోది ద్రాక్షారామంలో దక్షుడు, మూడోది సామర్లకోటలో కుమార భీమేశ్వరున్ని కుమారస్వామి, నాలుగోది భీమవరంలో చంద్రుడు సోమేశ్వరుడిని, అయిదో భాగాన్ని ఇంద్రుడు అమరావతిలో అమరేశ్వరుడిని ప్రతిష్ఠించారు. పాలకొల్లులో శివలింగాన్ని త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు పునఃప్రతిష్ఠించి పూజించడంతో క్షీరారామలింగేశ్వరస్వామి క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పట్టణంలో ఎటునుంచి చూసినా గోపురం కనువిందు చేస్తోంది. **- ఈనాడు, పాలకొల్లు**

విద్యుద్దీప కాంతుల్లో దేదీప్యమానంగా ఆలయం

ఉదయం నుంచీ ఉత్కంఠ

భారీ బందోబస్తుతో న్యాయస్థానానికి తరలింపు

మహిళా పోలీసుస్టేషన్ నుంచి మావోయిస్టులను కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరులో 15 మంది మావోయిస్టులను బుధవారం ఉదయం నుంచి కోర్టుకు తీసుకువెళ్లే వరకు ఉత్కంఠ కొనసాగింది. ఎస్పీ కార్యాలయం వెనుక మహిళా పోలీసుస్టేషన్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వారిని అక్కడే ఉంచారు. తర్వాత రెండు వాహనాల్లో న్యాయస్థానానికి తరలించారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు కోటేశ్వరరావు, అశోక్‌కుమార్, విల్సన్, శుభాష్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య పరీక్షలు, స్టేట్‌మెంట్‌ల నమోదు కొంత ఆలస్యం కావటంతో 2 గంటల సమయంలో కోర్టుకు తీసుకువెళ్లారు. అప్పటికే న్యాయమూర్తి భోజన విరామం కోసం వెళ్లటంతో మావోయిస్టులను మళ్లీ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో రెండో సారి కోర్టుకు తరలించారు. మావోయిస్టులు అందరూ 30 నుంచి 35 ఏళ్ల లోపు వారే.

అందరూ కీలక నేతలే: మావోయిస్టులందరూ కీలకమైనవారేనని, వీరిలో కొందరిపై రివార్డులు ఉన్నాయని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. 13 మంది డివిజన్ కమాండర్ స్థాయికి చెందినవారు. వీరి కింద ఒక్కొక్కరి వద్దే 10 నుంచి 15 మంది అనుచరగణం ఉంటారని అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఎస్పీ తెలిపారు.

ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సమక్షంలో తరలింపు

45 నిమిషాల్లో ఆపరేషన్ ముగించాం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: 'నిఘా వర్గాలు స్పష్టమైన సమాచారాన్ని ఇచ్చాయి. మేము పట్టుకోబోయేది మావోయిస్టుల కీలక నేతలనని తెలుసు. వారి వద్ద ఆయుధాలు ఉంటాయని ఎదురుదాడికి దిగే అవకాశం ఉందని గుర్తించి అత్యంత పకడ్బందీగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాం. వారికి అవకాశం ఇవ్వకుండా ఒక్కసారిగా చుట్టుముట్టి 45 నిమిషాల్లో ముగించాం' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పేర్కొన్నారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బంది లేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టంగా అన్నీ పరిశీలించాకే ఈ ఆపరేషన్ చేశామన్నారు. పట్టుబడిన మావోయిస్టులందరూ అగ్రనేత హిడ్మా కింద పనిచేసిన వాళ్లేనని, ఆయనతో మంచి సంబంధాలున్నాయని, హిడ్మా గతంలో చేసిన అనేక దాడుల్లో వీళ్లు పాల్గొన్నారన్నారు. గ్రీనుసిటీలో పనికి వచ్చిన వారిగా ఇంటిని అద్దెకు తీసుకున్నారని, ఆ ఇల్లు ఎవరిది అనే దానిపై లోతుగా విచారణ చేస్తున్నామని చెప్పారు.

హైలెస్సో.. హైలెస్సా

బాలలు.. జల క్రీడల్లో మెరికలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో పుట్టినా.. జాతీయ స్థాయిలో మెరవాలని తపిస్తున్నారు. బాలురకు దీటుగా జల క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు జంగారెడ్డిగూడెం మండలం చక్రదేవరపల్లి బాలికలు. వీరంతా కొంగువారిగూడెంలోని ఎర్ర కాలువ వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షకులు కృష్ణమూర్తి, రాజేశ్ వద్ద రోయింగ్, కనోయింగ్, కయాకింగ్ క్రీడల్లో శిక్షణ తీసుకుంటూ మెరికలుగా దూసుకెళ్తున్నారు. జల క్రీడలకు వారంతా సన్నద్ధమవుతున్న తీరు.. భవిష్యత్తు లక్ష్యాలను 'న్యూస్‌టుడే' ఆవిష్కరించింది.

శిక్షణలో విద్యార్థినులు

వైద్యురాలిని అవుతా

ఆరేళ్లుగా రోయింగ్ శిక్షణ పొందుతున్నా. 2023లో విజయవాడ పున్నమి ఘాట్‌లో రాష్ట్ర స్థాయి, పుణెలో జాతీయ స్థాయి ఇండోర్ పోటీల్లో పాల్గొన్నా. 2024లో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించా. వైద్యురాలు కావాలన్నది నా కల. **- ప్రేమకుమారి**

బంగారు పతకమే లక్ష్యం

చిన్నప్పటి నుంచి జల క్రీడలను చూస్తుండటంతో ఆసక్తి పెరిగింది. తల్లిదండ్రులకు విషయం చెప్పా. వారి ప్రోత్సాహంతోనే ఏడాదిగా రోయింగ్‌లో తర్ఫీదు పొందుతున్నా. జాతీయ స్థాయి జల క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు పతకం తీసుకురావాలన్నదే నా లక్ష్యం. **- హైడీ రోజలిన్**

ప్రభుత్వ కొలువు నా కల

2019 నుంచి కయాకింగ్ నేర్చుకుంటున్నా. 2023లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. జాతీయ స్థాయిలో ఆడేందుకు కఠోర శిక్షణ తీసుకుంటున్నా. ప్రభుత్వ కొలువు సాధించాలన్నదే నా కల. **- త్రివేణి**

గోదారి జనానికి.. సత్యసాయి జలప్రసాదం

7.50 లక్షల మంది దాహం తీరుస్తున్న పథకం

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే

పోలవరం మండలం పట్టిసీమ పరిధిలోని కన్నాపురం కూడలిలో గోదావరిపై సత్యసాయి మంచినీటి పథకానికి 2003-04లో శ్రీకారం చుట్టారు. గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా తూర్పు గోదావరి జిల్లా పరిధి గోపాలపురం మండలం హుకుంపేట వద్ద నిర్మించిన ఫిల్టర్‌బెడ్‌ల్లోకి నీటిని పైపుల ద్వారా తరలిస్తున్నారు. అక్కడ శుద్ధి చేసిన తర్వాత 150 కిలోమీటర్ల పైబడి పైపులైన్ల ద్వారా మెట్ట ప్రాంత ప్రజలకు అందిస్తున్నారు.

నాడు: గోదావరి పక్కనే ఉన్నా.. తాగేందుకు చుక్కనీరు అందని పరిస్థితి. వేసవిలో వాగులు, చెలమల్లో నీరే దిక్కు. కొన్ని చోట్ల అడుగంటిన బోర్ల నుంచి వచ్చే శుద్ధ నీరు తాగి దాహార్తి తీర్చుకోవాల్సిన దుస్థితి.

నేడు: భగవాన్ సత్యసాయి పుణ్యమా అని స్వయంగా ఏజెన్సీ గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేసిన పథకం నేడు లక్షలాది మంది దాహార్తి తీరుస్తోంది.

పథకం పేరు: సత్యసాయి మంచినీటి పథకం
ప్రారంభం: 2006 | **నిర్మాణ వ్యయం:** రూ.160 కోట్లు
నియోజకవర్గాలు: పోలవరం, గోపాలపురం, చింతలపూడి, కొవ్వూరు
మండలాలు: 17 | **గ్రామాలు:** 250
లబ్ధి పొందే ప్రజలు: 7.50 లక్షలు
పంపిణీ లక్ష్యం: రోజుకు 2 కోట్ల లీటర్లు | **పనిచేసే సిబ్బంది:** 110

చేగొండపల్లిలో ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజనులు

అల్లిక.. కొత్త కళ ఇక

● లేసు పార్కుకు పూర్వవైభవం ● అబలకు చేతి నిండా ఉపాధి

● అనగనగా నరసాపురం లేసు పార్కు.. ఒకప్పుడు ఇక్కడ మహిళల చేతి అల్లికలకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉండేది. కొత్తగా నేర్చుకునే వారికి శిక్షణ ఇచ్చేవారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం ఉండేది.

● కానీ గత అయిదేళ్లు శిక్షణ లేదు.. ఉపాధి ఊసు లేదు. నరసాపురం లేసుకు ప్రాణం పోసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలు: పశ్చిమ, కోనసీమ అంబేడ్కర్
గ్రామాలు: 250
మహిళలు: 95 వేల మంది
ఎగుమతిదారులు 50

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే

నరసాపురంలోని సీతారాంపురంలో కేంద్ర జౌళి శాఖ నేతృత్వంలో కేంద్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా లేసు పార్కును ఏర్పాటు చేశారు. దీనికి అనుసంధానంగా 51 సొసైటీలు, అలంకృతి మినీ లేసుపార్కుల పేరిట భవనాలు నిర్మించారు. ఆధునిక కుట్టు యంత్రాల కొనుగోలు, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ ప్రారంభించారు. కానీ వైకాపా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో మహిళలు శిక్షణకు నోచుకోలేదు. ఉపాధికి ధోకా పడింది.

ఎన్నో గుర్తింపులు

● గతేడాది జులైలో భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ - జీఐ) దక్కింది.
● జులైలో కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి అవార్డును సొంతం చేసుకుంది.

శిక్షణ, ఉపాధి..

నాబార్డుతో కలిసి అధునాతన డిజైన్లలో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు, వ్యక్తిగత నైపుణ్యం పెంచేందుకు, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు ఒక ఎన్జీవో ద్వారా అయిదేళ్లు ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికే నాబార్డు బృందం రెండు నెలల్లో మూడు సార్లు లేసు పార్కును సందర్శించి అక్కడి ఉత్పత్తులను పరిశీలించింది.

చేతితో దుస్తులు అల్లుతున్న మహిళలు

సీఎస్ఆర్ నిధులు..

కలెక్టర్ చదలవాడ నాగరాణి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.4 లక్షల రుణాలు అందించారు. 200 మంది హస్తకళాకారులను గుర్తించి దారాలను అందించి వివిధ రకాల ఉత్పత్తులను చేసి ఎగ్జిబిషన్లకు తరలించి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అల్లికలు వేగవంతం అవుతాయని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు.

కొలువు కలలకు వెలుగులద్దారు

పోటీ పరీక్షలకు దిక్సూచి.. గ్రంథాలయాలు

గ్రంథాలయాలు.. కొలువుల నిలయాలుగా మారుతున్నాయి. పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి గ్రామీణ యువతకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. కలిదిండి, కోరుకొల్లు శాఖా గ్రంథాలయాలకు క్రమం తప్పకుండా వెళ్లి.. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించిన యువతపై ప్రత్యేక కథనం.

-న్యూస్‌టుడే, కలిదిండి

నాకు నేస్తమైంది.. 'బీటెక్ చేశాను. పోలీసు కావాలన్నది నా లక్ష్యం. దీనిని సాధించడం కోసం ఉదయం, సాయంత్రం గ్రంథాలయం తెరిచి ఉన్నంతసేపూ అక్కడే చదివాను. 2022 నోటిఫికేషన్ ద్వారా కానిస్టేబుల్ ఉద్యోగం పొందాను' అని వివరించారు వెంకటాపురానికి చెందిన కరేటి నాగబాబు.

డిగ్రీ నుంచి వెళ్లా.. 'డిగ్రీలో చేరిన తొలి ఏడాది నుంచే గ్రంథాలయానికి వెళ్లడం మొదలుపెట్టా. 2022లో డిగ్రీ పూర్తయ్యింది. అదే ఏడాది విడుదలైన నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యానని' కలిదిండి మండలం వెంకటాపురానికి చెందిన ఇంటి శివనాగరాజు.

అదే గురువైంది.. 'గ్రంథాలయమే నాకు గురువు. 2017లో డిగ్రీ పూర్తయిన తర్వాత ఏలూరులో ప్రైవేటు ఉద్యోగంలో చేరా. రోజూ సాయంత్రం, సెలవు రోజుల్లో గ్రంథాలయానికి వెళ్లి చదువుకోవడం వల్ల 2022 నోటిఫికేషన్ ద్వారా కానిస్టేబుల్ కొలువు సాధించగలిగా అని' చెబుతున్నారు వెంకటాపురానికి చెందిన కరేటి నాగ సత్యనారాయణ.

నేను, మా చెల్లి.. చెల్లెలు ప్రశాంతి, నేను కోరుకొల్లు గ్రంథాలయంలో చదువుకుని.. 2019 బ్యాచ్‌లో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యాం. ప్రశాంతి గుడివాడ శివారు పెదపారుపూడిలో, నేను విజయవాడ సిటీలో చేరాం. గ్రూప్స్ కొట్టాలనే లక్ష్యంతో కొలువు వదిలేసి గ్రంథాలయంలోనే చదువుకుంటున్నా' అంటున్నారు కైకలూరు మండలం వేమవరప్పాడుకు బోడావుల ప్రకాశ్.

గట్టు తవ్వేసి.. గుట్టుగా తరలించేసి!

భీమడోలు మండలం సూరప్పగూడెం ఐస్ ప్లాంటు పక్కనున్న జాతీయ రహదారి గట్టును అక్రమంగా గుట్టుగా తవ్వేస్తున్నారు. ఓ రైతు పొలంలోని మట్టితో పాటు గట్టును సైతం తవ్వుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి వంతెనకు దన్నుగా ఉన్న మన్ను తొలగిస్తే.. పటిష్ఠత కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు రమాదేవికి ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, మట్టి తవ్వకాలు జరగకుండా వీఆర్వోలతో నిఘా ఏర్పాటు చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

– న్యూస్‌టుడే, భీమడోలు

(c) eenadu

వాలీబాల్ వైద్య విద్యార్థుల జట్టు ఎంపిక

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఆశ్రం వైద్య కళాశాలలో డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైద్య విద్యార్థుల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ వైద్య కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. అంతకుముందు కళాశాల ప్రధానాచార్యుడు చేబ్రోలు శ్రీనివాస్, సీఈవో కె.హనుమంతరావు ప్రారంభించి మాట్లాడారు. ఎంపిక కమిటీ సభ్యులుగా ఇ.త్రిమూర్తులు, ఎ.ఆంజనేయులు, శ్రీనివాస్, నల్లయ్య, శ్రీనివాసరాజు వ్యవహరించారు. డిసెంబరు 15 నుంచి 19 వరకు చెన్నై వేదికగా నిర్వహించే దక్షిణ భారత యూనివర్సిటీ మహిళల వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున క్రీడాకారులు పాల్గొంటారని శ్రీనివాసరాజు తెలిపారు.

జట్టు సభ్యులు వీరే.. ఎన్.యామిని, కేజేఎల్ఎస్ అనీల, ఎం.వేద కృష్ణ, డి.సృజనావర్మ, ఎం.ఎం.హేమలత, బి.సాయి జ్యోతిర్మయి, టి.గ్రీష్మ, ఎన్.సుమేధ, ఎస్కే చరిస్మా, బీఎన్‌జీజీ అన్నపూర్ణాదేవి, ఎస్కే అఫ్రీన్, ఎ.భార్గవి, జి.సిరి, కె.నవ్య గీతిక.

స్టాండ్‌బై.. కె.నాగ శ్రీవల్లి, డి.సంజనా, ఎం.శివ జ్యోత్స్న, కె.నికిత, ఎస్.శ్రీనిజ, ఇ.వినుషా

అండర్ 14, 17 జట్లకు ఎంపికైన నూజివీడు చిన్నోళ్లు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే

☛ ఎస్‌జీఎఫ్‌కు అండర్ 17 క్రికెట్ జట్టుకు నూజివీడుకు చెందిన బోట్ల సహస్ర మాల్యాద్రి, మహిళ విభాగంలో కోట అక్షయ బ్యాటర్లుగా ఎంపికయ్యారు. ఈ ఎంపికలు మంగళవారం గుంటూరు జిల్లా కుంచనపల్లిలో జరిగాయి.

సహస్ర మాల్యాద్రి, అక్షయ

☛ రాష్ట్ర స్థాయి అండర్ 14 క్రికెట్ పోటీకి నూజివీడు ఓ ప్రయివేటు పాఠశాలకు చెందిన ఇస్లావత్ చైతన్య నాయక్ ఎంపికయ్యారు. ఉమ్మడి కృష్ణా జిల్లా తరపున అండర్ 14 విభాగంలో స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పీడీఎస్ బియ్యం అవకతవకలకు పాల్పడితే చర్యలు: మంత్రి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పీడీఎస్ బియ్యం అవకతవకలకు పాల్పడిన వారు ఎంతటివారైనా చర్యలు తప్పక తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో జరిగిన కుంభకోణంలో ఎవరినీ వదిలి పెట్టేది లేదన్నారు. రూ.5.48 కోట్లు పీడీఎస్ బియ్యం దారి మళ్లిన సంఘటనపై కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే కొంతమంది కారకులపై చర్యలు తీసుకున్నామని, కమిటీ నివేదిక రాగానే మిగిలిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,752 చౌకధరల దుకాణాల ద్వారా ప్రతి నెలా 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేస్తున్నామని, గతంలో వ్యాన్ ద్వారా గంట, అరగంట మాత్రమే పంపిణీ చేశారన్నారు. సంస్కరణల్లో భాగంగా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, తక్కువ ధరకు నాణ్యమైన సరకులు, కేంద్రం అందిస్తున్న భారత్ బ్రాండ్, గిరిజన సంస్థ ఉత్పత్తులు ఎల్లవేళలా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల సహకారంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సంక్షేమ వసతి గృహాలకు ఫైన్ రకం బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలోనే రేషన్ దుకాణాల ద్వారా కచ్చితంగా నాణ్యమైన బియ్యం అందిస్తామని వివరించారు.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
TV Partner — Digital Partner — Organised by

ఈనాడు - హైదరాబాద్: కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్ క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అబ్డామినల్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

నమోదు కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా: ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు కార్యాలయం, తాడేపల్లిగూడెం - 534411
వివరాలకు: 99592 24506
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌కు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

పోలింగ్ కేంద్రాలపై అధ్యయనం: కలెక్టర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఓటరు అనుకూలతలు దృష్టిలో పెట్టుకుని..జిల్లాలోని పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం ఓటర్ల జాబితాపై అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గాలవారీగా సమావేశమై మాట్లాడారు. ఏడు నియోజకవర్గాల్లో ఇప్పటికే 1,744 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. అయిదు పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, 23 కేంద్రాల స్థానం మార్పు, 137 కొత్త కేంద్రాలకు ప్రతిపాదనలు అందాయన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

గౌ॥ శ్రీ P. సాల్మన్‌రాజు గారు
పర్యవేక్షక ఇంజినీర్ (ఆపరేషన్స్), A.P.E.P.D.C.L., ఏలూరు

"మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు" గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డ్ తీసుకొని ఇప్పుడు రాష్ట్రానికి గౌరవ ప్రధాన మంత్రి పథకం కింద సోలార్ ప్యానల ఏర్పాటు చేయడంలో ఏలూరు జిల్లా ఎస్.ఇ గౌ॥ శ్రీ P. సాల్మన్‌రాజు గారు ముందు వరుసలో ఉండటం మన ఏలూరు జిల్లాకు గర్వకారణం. ఈ అవార్డ్ వారికి కొత్త కాదు. అవార్డ్ లే ఆయన ఎక్కడ పనిచేసినా వారి దగ్గరకు వస్తాయి. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వచ్చిన సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్.ఇ శ్రీ P. సాల్మన్‌రాజు గార్కి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ..

P. వెంకటనారాయణ, రిటైర్డ్ లైన్‌మేన్ జంగారెడ్డిగూడెం
Y. రాజేంద్రప్రసాద్, లైన్‌మేన్, పెంటపాడు
G. రామకృష్ణ, లైన్‌మేన్
N. సురేష్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

మేనల్లుడిపై పైశాచికం

- వేడి గరిటెతో వాతలు పెట్టిన మామ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: దసరా సెలవులకు ఇంటికొచ్చిన 11 ఏళ్ల మేనల్లుడిపై మామ పైశాచికంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చేబ్రోలు పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన బాలుడు పెంటపాడులోని ఓ వసతి గృహంలో ఉంటూ అయిదో తరగతి చదువుతున్నాడు. బాలుడి మేనమామ 23 ఏళ్ల చిన్నమిల్లి కుమార్‌రాజు ఓ పరిశ్రమంలో పని చేస్తూ నాచుగుంట- వెంకట్రామన్నగూడెం మధ్య నివాసముంటున్నాడు. దసరా సెలవులకు బాలుడిని తన ఇంటికి తీసుకెళ్లి ఇద్దరూ భవానీ దీక్ష తీసుకున్నారు. సెలవులు పూర్తయిన కొన్ని రోజుల తర్వాత బాలుడిని వసతి గృహానికి తీసుకెళ్లాడు. తలపై గాయం ఉండటంతో ఏమైందని మేనమామను వసతి గృహ పర్యవేక్షకుడు ప్రశ్నించారు. ప్రమాదం జరగడంతో గాయమైందని బదులిచ్చాడు. గాయం మానడానికి పత్యం చేయాలని.. కొన్నాళ్లు ఇంటి నుంచి తీసుకొస్తానని చెప్పాడు.

పొంతనల్లేని సమాధానంతో..

తర్వాతి రోజు బాలుడు బడికొచ్చినప్పుడు కాలుపైనా కాలిన గాయాలుండటంతో కుమార్‌రాజును ఉపాధ్యాయులు ప్రశ్నించడంతో పొంతనల్లేని సమాధానాలిచ్చాడు. కొన్ని రోజులుగా బాధితుడిని ఉదయం పాఠశాలకు తీసుకొచ్చి సాయంత్రం ఇంటికి తీసుకెళ్లేవాడు. విషయం విద్యార్థి సహచరుల ద్వారా మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్త తెలియడంతో.. ఆమె సెక్టారు పర్యవేక్షకురాలి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె పెంటపాడు పోలీసులకు సమాచారం తీసుకెళ్లారు. ఆ ప్రాంతం వెంకట్రామన్నగూడెం పరిధిలోకి రావడంతో తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీసులకు విషయం తీసుకెళ్లారు. చివరకు నాచుగుంట పరిధి కావడంతో చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కుమార్ రాజును అదుపులోకి తీసుకున్నారు.

బాలుడి కాలుపై గాయం

మంచంపై మూత్రం పోశాడని.. మంచంపై మూత్రం పోశాడని బాలుడిపై మేమమామ కర్కశంగా ప్రవర్తించాడు. గరిటెను బాగా వేడి చేసి శరీరంపై ఎక్కడి పడితే అక్కడ వాతలు పెట్టాడు. ముఖంపై కొరికేయడంతో పంటి ఆనవాళ్లున్నాయి. దాదాపు బాలుడిని చంపే ప్రయత్నం చేశాడు. లైంగిక దాడికి కూడా పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

రైతు కుటుంబాల్లో సంతోషం: ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల కుటుంబాల్లో సంతోషం వెల్లి విరుస్తోందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తోందన్నారు. 'అన్నదాత సుఖీభవ'లో భాగంగా ఒక్కో రైతు ఖాతాలో ఏడాదికి రూ.20 వేల చొప్పున నగదు జమ చేస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హనుమాన్‌గూడెంలో రిలే దీక్షలో రైతులు

సీడ్ ఆర్గనైజర్‌పై కఠిన చర్యలకు రైతుల డిమాండ్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మోసగించిన మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ చిలకా అప్పారావు నుంచి సొమ్ములు వెంటనే ఇప్పించాలని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత మొక్కజొన్న రైతులు కోరారు. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెంలో సీడ్ ఆర్గనైజర్ ఇంటి ముందు బాధిత మొక్కజొన్న రైతులు బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ సీడ్ ఆర్గనైజర్ అప్పారావు చేతిలో రైతులు మోసపోయారని, వారికి న్యాయం చేయాలని కోరారు. మొక్కజొన్న రైతులకు దాదాపు రూ.15 లక్షలపైగా సొమ్ములు ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. న్యాయం చేయక పోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: వ్యక్తిగత కక్షల నేపథ్యంలో.. ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారి కథనం మేరకు.. గుండుగొలనుకు చెందిన నిట్టా నాగరాజుతో అదే గ్రామానికి చెందిన గొల్ల గౌతమ్, కాలి రాజకుమార్, బొంతు శివకుమార్, సిరికోటి సురేంద్రవర్మకు పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నాగరాజుపై బీరు సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని స్థానికులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. నాగరాజు ఫిర్యాదు మేరకు బుధవారం హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సీఐ తీరుపై ఉన్నతాధికారుల ఆగ్రహం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అధికారుల అనుమతుల్లేకుండా ఇతర రాష్ట్రంలో కుల సంఘ భోజనాలకెళ్లి.. అక్కడ దర్జాగా ఉపన్యాసాలిచ్చిన ఓ సీఐ తీరుపై పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహంగా ఉన్నారు. సీఐ అక్కడ హల్‌చల్ చేస్తున్న వీడియో సైతం పోలీసుల వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో.. ఆయనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సీఐ విధులకు చాలా రోజులుగా రావడం లేదని.. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాడని ఓ నిర్ణయానికి వచ్చారు. ఆయనపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

సోమేశ్వరునికి భూదానం

రూ. 44 లక్షలతో సెంటున్నర కొనుగోలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయానికి రాజమహేంద్రవరానికి చెందిన గన్నమనేని శివరామకుమార్ భూదానం చేశారు. స్వామివారి క్షేత్రానికి పక్కన ఉత్తరం వైపు గోడకు ఆనుకుని ఉన్న సెంటున్నర స్థలం ఖరీదు రూ. 44 లక్షలు. దానిని కొనుగోలు చేసి స్వామివారికి ఇచ్చేందుకు ఆయన ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఇందులో భాగంగా బుధవారం రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణంరాజు, పాలకవర్గ ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామాంజనేయులు చేతుల మీదుగా నగదు అందిస్తున్న దాతలు

ఉత్తరాయణం వరకూ అఖండ జ్యోతి

ఆచంట, న్యూస్‌టుడే: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం అఖండ అన్నసమారాధన జరగనుంది. వేల సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయ నూతన కమిటీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం పాడ్యమి పోలి స్వర్గంతో ఆలయంలో కార్తికమాస పూజలు సమాప్తమయినా.. ఇక్కడ అఖండ జ్యోతి ఉత్తరాయణ పుణ్యకాలం వరకూ.. అంటే మరో రెండు నెలలకు పైగా వెలుగుతుంది. ఇప్పటికే భక్తులు సమర్పించిన వెయ్యి కిలోలకు పైగా ఆవు నెయ్యి సిద్ధంగా ఉంది.

రాజ్యాంగాన్ని గౌరవిద్దాం.. అనుసరిద్దాం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించి, అనుసరించాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాజ్యాంగం విశిష్టత, ఆవశ్యకతపై జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో రత్నప్రసాద్ మాట్లాడుతూ.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, సమాజ శ్రేయస్సుకు రక్షణ కల్పించేందుకు రాజ్యాంగమే కారణమన్నారు. సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబు, న్యాయవాది రత్నరాజు పాల్గొన్నారు.

మళ్లీ పాత వ్యూహాలకు పోలీసులు పదును

విలీన మండలాల్లో ఠాణాలకు అదనపు భద్రత

కుక్కునూరు, న్యూస్‌టుడే: మావోయిస్టుల వ్యూహాలకు పోలీసులు ఆదిలోనే చెక్ పెట్టగలిగారు. అబుజ్‌మడ్ ప్రాంతంలో ఆపరేషన్ కగార్ ప్రారంభం కావటంతో వారు ప్రత్యామ్నాయంగా పొరుగున ఉన్న ఆంధ్రా వైపు కదిలే అవకాశాలను ముందే పసిగట్టారు. వారి అంచనాలు నిజమయ్యాయి. ప్రశాంతతకు మారుపేరైన గోదావరి జిల్లాలను షెల్టర్ జోన్‌గా ఏర్పాటు చేసుకొని, ఇక్కడ గుట్టుగా కాలం గడిపేయవచ్చన్న మావోల అంచనాలను పోలీసులు తల్లకిందులు చేశారు. జిల్లాలో ప్రధానంగా విలీన మండలాలు, మన్యం ప్రాంతంలోకి వారు చొరబడవచ్చనే అనుమానాలు ఉండేవి. కానీ ఏకంగా జిల్లా కేంద్రంలోనే మకాం వేయటం ఆశ్చర్యపరిచింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఏర్పడిన పరిణామాలతో మావోలు షెల్టర్ కోసం జిల్లాలోని విలీన మండలాల్లోకి ప్రవేశిస్తారనే అనుమానాలతో ఇక్కడ పోలీసు స్టేషన్లకు అదనపు భద్రత కల్పించారు. కుక్కునూరు, వేలేరుపాడు పోలీసుస్టేషన్లలో ఏపీఎస్పీ పోలీసులతో క్యాంపులు ఏర్పాటు చేశారు. గతంలో మావోయిస్టు ప్రభావం ఉన్న సమయంలో ఈ క్యాంపులు ఉండేవి. తర్వాత తీసేశారు. మళ్లీ ఇటీవల ఆ క్యాంపులను తిరిగి ఏర్పాటు చేశారు. ఇదంతా మావోయిస్టులు ఈ ప్రాంతం వైపు కదిలే అవకాశాలను పసిగట్టి చేపట్టిన చర్యలే.

గతంలో విస్తృత కార్యకలాపాలు.. విలీన మండలాల్లో ఒకప్పుడు మావోయిస్టుల విస్తృత కార్యకలాపాలు ఉండేవి. 2005లో కుక్కునూరు పోలీసు స్టేషన్ పేల్చేశారు. పోలవరం ప్రాజెక్టుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో అప్పటి అధికార కాంగ్రెస్ నాయకుడు మండవ రామిరెడ్డిని పట్టపగలు ప్రధాన రహదారిపై కాల్చి చంపారు. కుక్కునూరు మండలం రెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 9 మంది నక్సల్స్ మరణించారు. ఉప్పేరు సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో మావోయిస్టు మృతిచెందాడు. వేలేరుపాడు మండలంలోని గుళ్లవాయి సమీపంలో 2009లో పోలవరం పునరావాస కాలనీలోని గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని పేల్చివేశారు. ఈ మండలాలు ఏపీలో విలీనం కాకముందు జరిగిన ఘటనలు ఇవి. విభజన తర్వాత కూడా నక్సల్స్ ఉనికి అప్పుడప్పుడు బయటపడేది. గోడ పత్రాలు, కరపత్రాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ ఉనికిని చాటుకొనేవారు.

☛ అప్పట్లో నక్సల్స్ చర్యలు పోలీసులకు సవాల్‌గా మారటంతో, వారిని ఎదుర్కొనేందుకు అనేక వ్యూహాలను పాటించారు. ప్రధానంగా సరిహద్దుల్లోని తెలంగాణ పోలీసులతో సమన్వయంగా వ్యవహరించారు. ఎప్పటికప్పుడు బోర్డర్ సమావేశాలు నిర్వహించి, నక్సల్స్ కదలికలపై సమాచారం ఇచ్చిపుచ్చుకొనేవారు. బాంబు స్క్వాడ్‌లు కల్వర్టులు, రహదారులు తనిఖీ చేసేవి. అడవుల్లో కూబింగ్ నిర్వహించేవారు. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఆదివాసీ గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే, సమాచారం వచ్చేలా వేగులను నియమించుకునేవారు. ఇలాంటి వ్యూహాలను అమలు పరచి, నక్సల్స్ కార్యకలాపాలను నిర్వీర్యం చేశారు. మళ్లీ ఆ వ్యూహాలకు పదును పెట్టాల్సిన పరిస్థితులు కనబడుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 9912178237.

BPT/B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/Dialysis - Courses in Vijayawada - MGT./Convener Quota. ✆ 7995945835.

REAL ESTATE

PLOT FOR SALE

తణుకు, వేమవరం 10వ వార్డులో, చిట్టూరి బాపినీడు గారి ఇంటి వెనుక లేఔట్‌లో తూర్పున పంటకాలువ ఉన్న N/E కార్నర్ ఈశాన్య ప్లాట్ (నెం.42) 253 చ॥గజాలు అమ్మకానికి కలదు. మున్సిపాలిటీ వారిచే క్రమబద్ధీకరణ చేయించడమైనది. ✆ 8639 779 569.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033

JOBS

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 - 29000. వ: 18-35. ✆: 7730958410.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల్ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.38 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు

సర్పంచుల పాత్ర కీలకం

శిక్షణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు

భీమడోలు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిధుల వినియోగం, ఆదాయ పెంపు, శుభ్రత-పచ్చదనం తదితర అంశాలపై సర్పంచులు, కార్యదర్శులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షకుడు పి.రత్నాకర్ పాల్గొని పలు అంశాలపై సూచనలు చేశారు.

మూడేళ్లు.. ముప్పుతిప్పలు!

➠ సాగని రహదారి పనులు ➠ అవస్థలు పడుతున్న చోదకులు

కంకర తేలిన తాళ్లగోకవరం రోడ్డు

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం వేగివాడ నుంచి తాళ్లగోకవరానికెళ్లే జిల్లా పరిషత్తు రహదారి అధ్వానంగా తయారైంది. 2003లో రూ.96 లక్షలతో రోడ్డు నిర్మించేందుకు గుత్తేదారులు ముందుకొచ్చారు. రహదారి నిర్మాణంలో భాగంగా గుత్తేదారు కంకర వేసి చదును చేశారు. ఈ పనులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో.. పనులను అర్ధాంతరంగా వదిలేశారు. తారు వేయకపోవడంతో కంకర లేచిపోతోంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచిపోయి వాహనదారులకు నరకం చూపుతున్నాయి.

రూ.96 లక్షలు వెనక్కి.. గుత్తేదారు పనులు చేపట్టకపోవడంతో..రూ.96 లక్షల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. విధిలేని పరిస్థితుల్లో అధ్వాన రహదారిపైనే చోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. నెల కిందట నామమాత్రంగా గోతులు పూడ్చగా.. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్డు మళ్లీ దెబ్బతింది. ఇకనైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. 'అధ్వాన రహదారి స్థితి, ప్రజలపై ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల కాగానే, పనులను ప్రారంభించి.. సత్వరం పూర్తయ్యేలా చూస్తాం' అని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: పత్సమట్ల

దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఏకరవు పెట్టారు. వాటిని పరిష్కరించాలంటూ వినతి పత్రాలు అందజేశారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, బియ్యం కార్డులు, భూ సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన తదితరాలపై 580 వినతులు అందాయి. వాటన్నింటిని విన్న ధర్మరాజు.. త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తామున్నది ప్రజలకు సేవలందించేందుకేనని.. వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఆయన పేర్కొన్నారు.

సాధన చేద్దాం.. ఫలితాలు సాధిద్దాం!

● 'పది' విద్యార్థులపై దృష్టి ● పాఠశాలల్లో అభ్యసన స్థాయి సమీక్షలు

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. 'పది' పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు ప్రతి ఒక్కరూ శ్రమిస్తుంటారు. వారికి ఉపాధ్యాయులూ తోడ్పాటునందిస్తారు. ఈ ఏడాది 'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు విద్యా శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణ సాధించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థుల అభ్యసన స్థాయిపై సమీక్షలు చేపట్టారు.

వంద రోజుల కార్యాచరణ

'పది' విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గంలోని 33 ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8.30 నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 3.30 నుంచి 5.30 గంటల మధ్య అదనపు తరగతులు కొనసాగిస్తున్నారు. రోజుకో పాఠ్యాంశంపై తరగతులు నిర్వహిస్తూ.. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ఎస్ఏ-1 పరీక్ష ఫలితాలు ఆధారంగా విద్యలో వెనకబడిన పిల్లలను గుర్తించి.. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. డిసెంబరు 1 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నారు.

నియోజకవర్గ వివరాలిలా..

మండలం	ఉన్నత పాఠశాలలు	పది విద్యార్థులు
భీమడోలు	7	600
ఉంగుటూరు	10	563
నిడమర్రు	7	339
గణపవరం	7	516

తల్లిదండ్రులకూ బాధ్యత

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు తల్లిదండ్రులూ బాధ్యత తీసుకోవాలని విద్యా శాఖాధికారులు సూచిస్తున్నారు. పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడంలో వారిని భాగస్వాములు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్ల వద్ద చదివించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. ఇది మెరుగైన ఫలితాల సాధనకు దోహదపడుతుంది. పది పరీక్షలకు అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం' అని ఎంఈవో-2 ఎ.భాస్కరకుమార్ తెలిపారు.

కొవ్వలి విద్యార్థుల ప్రతిభ

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో 13 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్ఎన్ వీజీ శర్మ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది బుధవారం అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

పెదవేగి, న్యూస్‌టుడే: ? పెదవేగి- బాదరాల మార్గం మధ్యలోని చెరువు గట్టుపై పలుచోట్ల రోడ్డు గోతులు పడింది. ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ దారిలో ద్విచక్ర వాహనదారులు తరచూ అదుపుతప్పి పడి గాయాలపాలవుతున్నారు. **- నరేశ్, స్థానికుడు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. రోడ్డును పరిశీలించి.. వీలైనంత త్వరగా గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీకర్, ర.భ.శా. డీఈ ఏలూరు**

ఎట్టకేలకు మూత వేశారు

ఈనాడు కథనానికి స్పందన

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రమాదకర మురుగుదొడ్డి గొయ్యిపై మూతవేశారు. 'మూస్తారా.. వదిలేస్తారా' శీర్షికన ఈ నెల 17న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఎంఈవో శేషగిరిరావు స్పందించారు. గొయ్యిపై కొత్త సిమెంటు దిమ్మె ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు.

కర్షకులకు అన్నివిధాలా అండ: బడేటి

ఏలూరు: చెక్కు అందజేస్తున్న చంటి తదితరులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్షకులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక సుంకర రామారావు సచివాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు రూ.69.86 లక్షల నమూనా చెక్కు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, సొసైటీ ఛైర్మన్ కోనేరు వంశీకృష్ణ, ఏవో సంధ్య, నాయకులు మాణిక్యాలరావు, చిన్ని అర్జున్, శివ, రైతులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: స్థానిక విడిది కార్యాలయంలో 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' నగదు విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో 18,794 మంది రైతులు రూ.12.55 కోట్ల మేర లబ్ధి పొందినట్లు చెప్పారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి బండారు సింధు, ఏడీఏ ఉషారాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు: దెందులూరులోని బుధవారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. తొలుత రైతులకు నమూనా చెక్కు అందజేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని 19,950 మంది రైతుల ఖాతాలకు రూ.13.06 కోట్లు జమైనట్లు చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: చింతమనేని

మాట్లాడుతున్న ప్రభాకర్

దెందులూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందజేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల ప్రగతి, ప్రజా సంక్షేమం, స్వచ్ఛత సుందరీకరణకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా గ్రామీణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ ఎంపీడీవోలు, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, గరిక మాలలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి, గణనాథుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఈవో సీహెచ్ చిననాగేశ్వరరావు పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజనంపై శ్రద్ధ

నిడమర్రు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో-2 వై. శేషగిరిరావు సూచించారు. పెదనిండ్రకొలను ప్రాథమిక పాఠశాల-1ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పకడ్బందీగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

స్వీయ సామర్థ్యాలు పెంచుకోండి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు స్వీయ సామర్థ్యాలు పెంచుకోవాలని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి కె.సాయి రోహిత్ అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలూ పొందాలన్నారు.

అతివల సాధికారతతో ప్రగతి

ఏలూరు: విజేతలతో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

భీమడోలు, న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే ప్రగతి సాధ్యమవుతుందని భీమడోలు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎన్.సునీత అన్నారు. భీమడోలు, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో మహిళా సాధికారతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. బాలికలు, యువతుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మహిళా పోలీసులను సత్కరించారు. గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్, డి.ఎన్.బి.అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: స్థానిక బాలల గ్రంథాలయంలో మహిళా సాధికారితపై చర్చ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి శోభ పర్యవేక్షించారు.

ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత: కలెక్టర్

తాళం సీళ్లను పరిశీలిస్తున్న వెట్రిసెల్వి తదితరులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం గోదాము వద్ద సీసీ కెమెరాలు, ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లు, ఇతరత్రా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత కల్పించినట్లు తెలిపారు.

కూల్చివేతలో తాత్సారం

గణపవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని పాత భవనం శిథిల దశకు చేరింది. దాన్ని తొలగించడంలో అధికారులు తాత్సారం ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో నూతన భవనాలు వినియోగంలోకి రెండేళ్లవుతున్నా.. పాత వాటిని మాత్రం కూల్చలేకపోతున్నారు. పాత భవనం పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, గణపవరం**

దుమ్ము కొట్టుకుపోవడమే!

పెదవేగి మండలం లక్ష్మీపురం సమీప పోలవరం కుడి కాలువపై నిర్మించిన వంతెనపై మట్టి, ఇసుక పేరుకుపోయాయి. వారధిపై కొందరు ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళుతూ అదుపుతప్పి పడిపోతున్నారు. పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండటంతో సమస్య నెలకొంటోందని, దీన్ని పరిష్కరించాలని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదవేగి(పెదపాడు)**

అల్లుకుపోయిన నిర్లక్ష్యం

నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో రైతు సేవా కేంద్రం నిర్మాణ పనులు పునాది దశ దాటలేదు. గత ప్రభుత్వ హయాంలో పునాది వేసిన గుత్తేదారుకు బిల్లులు ఇవ్వకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. నిర్వహణను విస్మరించడంతో పునాదులు, పిల్లర్లకు పాదులు, ఆకులు అల్లుకుపోయాయి. **- న్యూస్‌టుడే, నిడమర్రు**

ఎందుకీ తుప్పు

పెదపాడు మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలిస్తున్నారు. వాటిని నెలలుగా ఎక్కడికక్కడ వదిలేస్తుండటంతో వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ ఎందుకూ పనిరాకుండా తుప్పు పడుతున్నాయి. ఈ వాహనాలను వేలం వేస్తే కనీసం ప్రభుత్వానికి ఆదాయమైనా వస్తుందని, ఆ దిశగా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదపాడు**

నిర్వహణ నీరుగారి

ఏలూరు నగరం పుష్పలీలానగర్ అయిదో రోడ్డులో దెబ్బతిన్న పైపులైను మరమ్మతులకు గుంత తవ్వి వదిలేశారు. దాన్ని పూడ్చకపోవడంతో.. వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్తొస్తుంటారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తంగెళ్లమూడి(ఏలూరు)**

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిద్దాం

మాట్లాడుతున్న అపర్ణ

ఏలూరు విద్యా విభాగం, వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అపర్ణ జూట్ క్రియేషన్స్ అధినేత డి.అపర్ణ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో బుధవారం మహిళా పారిశ్రామికవేత్తల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అతివలు మార్కెటింగ్ విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అప్పుడే పరిశ్రమల నిర్వహణ సులభమవుతుందని చెప్పారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తేయాలి: వ్యకాసం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొల్లేరుపై ఆంక్షలు ఎత్తేయాలని.. రైతులు, పేదలపై అటవీ శాఖాధికారుల వేధింపులు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అన్నేభవనంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు ముత్యాలమ్మ అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. ఉంగుటూరు నియోజకవర్గంలో కొల్లేరు ఆనుకొని ఉన్న అడవికొలను, పెదనిండ్రకొలను, తోకపల్లి, భైనేపల్లితో పాటు పలు గ్రామాల్లో మూడు వేల ఎకరాలకు పైగా కొల్లేరు భూముల్లో వరి సాగు మాత్రమే చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేనివిధంగా అటవీ శాఖాధికారులు రబీ సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లొద్దంటూ ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. ఆయా గ్రామాల్లో పేదలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. నాయకులు జీవరత్నం, ఎ.రవి, వెంకట్రావు, మహంకాళిరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కాంతార-2
అంబిక మినీ	ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్
సాయిబాలాజీ	శివ
బాలాజీ	నువ్వు వస్తానంటే నేనొద్దంటానా
సత్యనారాయణ స్క్రీన్ 1	కాంత
సత్యనారాయణ స్క్రీన్ 2	గోపి గాళ్ల గోవా ట్రిప్
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	జిగ్రీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సంతాన ప్రాప్తిరస్తు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	లవ్ ఓటీపీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కాంత
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	సంతాన ప్రాప్తిరస్తు
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కాంత

ఇందిర హయాంలోనే దేశాభివృద్ధి

ఏలూరు: చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి, దివంగత ఇందిరా గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజనాల రామమోహనరావు, చంద్రశేఖర్ పుష్పాంజలి ఘటించారు. ఇందిరాగాంధీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లోనూ దూసుకెళ్లిందని గుర్తుచేశారు.

పెదవేగి: స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. విద్యార్థినులకు కుర్చీలాట, పరుగు, చదరంగం పోటీలు జరిగాయి. తహసీల్దారు భ్రమరాంబ, ఎస్సై రామకృష్ణ, గ్రంథ పాలకుడు గంగాధరరావు పిల్లలనుద్దేశించి మాట్లాడారు.

మాజీ సర్పంచి మృతికి సంతాపం

సత్యవతి(పాత చిత్రం)

ఉంగుటూరు, న్యూస్‌టుడే: అక్కుపల్లిగోకవరం మాజీ సర్పంచి మిద్దే సత్యవతి(80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈమె 2001-2006 మధ్య కాలంలో సర్పంచిగా గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించారు. సత్యవతి మృతికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతుకు వెన్ను.. ఆర్థిక దన్ను

'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' సాయం విడుదల

ఏలూరు ఆర్ఆర్ పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: రబీ ప్రారంభానికి ముందే రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్'లో భాగంగా రెండో విడత నగదు జమను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. తమ ఖాతాల్లో నగదు జమవడంతో రైతులు హర్షిస్తున్నారు. సూపర్-6 అమలులో భాగంగా ఏటా ఒక్కో రైతుకు రూ.20 వేలు అందిస్తోంది. ఇప్పటికే తొలి విడతగా ఆగస్టులో రూ.7 వేలు, రెండో విడతగా బుధవారం నుంచి మరో రూ.7 వేలు జమ చేస్తోంది.

40 వేలు.. రూ.27 కోట్లు.. ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో 40,906 మంది రైతులకు రూ.27.07 కోట్లు మంజూరయ్యాయి. అన్నదాత సుఖీభవలో రూ.20.45 కోట్లు విడుదల కాగా, పీఎం కిసాన్ సాయం రూ.6.62 కోట్లు మంజూరైంది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పండగ వాతావరణంలో కార్యక్రమం ప్రారంభించారు.

నగదు జమ వివరాలిలా (రూ.కోట్లలో)

మండలం	మొత్తం రైతులు	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్	మొత్తం
ఉంగుటూరు	8,111	4.06	1.26	5.32
భీమడోలు	3,589	1.79	0.66	2.45
నిడమర్రు	2,210	1.11	0.48	1.59
గణపవరం	4,884	2.44	0.75	3.19
ఏలూరు	2,162	1.08	0.38	1.46
దెందులూరు	5,905	2.95	0.96	3.91
పెదవేగి	9,285	4.64	1.35	5.99
పెదపాడు	4,760	2.38	0.78	3.16

విద్యుదాఘాతంతో ఉద్యోగి దుర్మరణం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఉద్యోగి మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక చాణక్యపురి కాలనీకి చెందిన చంద్రకా రమేశ్(32) నగరపాలక సంస్థలో పొరుగు సేవల విధానంలో పని చేస్తున్నారు. ఈయన అశోక్‌నగర్‌లోని శ్మశానవాటిక పరిసరాలను బుధవారం పొక్లెయిన్‌తో శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సహచరులు సర్వజన ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ భానుప్రతాప్, ఇతర అధికారులు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

పెదపాడు, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడేనికి చెందిన పిడుగు వికాస్(30)కు బాల్యం నుంచే మెదడులో ఎదుగుదల లేదు. మతిస్థిమితం సరిగా లేని ఆయన్ను సెప్టెంబరు 4న తాళ్లమూడిలోని ఓ వసతి గృహంలో చేర్చేందుకు తీసుకొచ్చారు. వికాస్ కుటుంబ సభ్యులు నిర్వాహకులతో మాట్లాడుతుండగా.. వసతి గృహంలో ఉండలేనని వికాస్ బయటకు పారిపోయారు. అప్పట్నుంచి అతడి జాడ లేకపోవడంతో.. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శారదా సతీశ్ తెలిపారు.

శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

పెదవేగి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-1 ప్రభాకర్‌రావు సూచించారు. ఈ నెల 26 వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. అక్కడ విద్యార్థుల వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీటి శుద్ధి యంత్రం వితరణ

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: అడవికొలను ప్రాథమిక పాఠశాల-1 పాఠశాలకు విర్‌బాగ్ కంపెనీ నీటి శుద్ధి యంత్రాన్ని వితరణ చేసింది. రూ.40 వేలు విలువైన యంత్రాన్ని కంపెనీ ప్రతినిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు బుధవారం అందజేశారు. సర్పంచి వెంకటేశ్వరరావు, తెదేపా నాయకుడు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్రాలపై కార్యశాల

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సెయింట్ థెరిసా కళాశాలలో 'గణితశాస్త్రాలు, సాంకేతికతలో ఉద్భవిస్తున్న ధోరణులు'పై బుధవారం కార్యశాల నిర్వహించారు. శివనాడార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ ప్రతినిధి ప్రియాంక గ్రోవర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విశ్లేషణాత్మక చట్రాలపై ఆధారపడే మ్యాట్రిక్స్‌పై అవగాహన కల్పించారు.

WANTED
M.Sc. మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, B.Sc. నర్సింగ్ టీచింగ్ స్టాఫ్ కావలెను
అర్హత, అనుభవం గల వార్కి ఆకర్షణీయమైన జీతం
అపోలో పారా మెడికల్ కాలేజ్
రైతు భరోసా కేంద్రం వద్ద వట్లూరు, ఏలూరు
☎ 94922 70129, 94925 35129

దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం, పవర్‌పేట, ఏలూరు
ఏలూరు నగరం, పవర్‌పేటలో వేంచేసియున్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానములో దసరా సందర్భంగా అమ్మవారికి భక్తులచే సమర్పించబడిన చీరలు, జాకెట్ ముక్కలు 23-11-2025వ తేదీ, ఆదివారం మ॥ 3.00 గం॥లకు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.
ఇట్లు: ఛైర్మన్ & ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి

శ్రద్ధాంజలి
మా కుటుంబ మార్గదర్శకులు, గ్రామ అభివృద్ధి ప్రదాత, శ్రీ తుమ్మూరి కృష్ణారావు గారు ది. 17-11-2025 తేదీన స్వర్గస్తులైనారని తెలియచేయుటకు చింతిస్తున్నాము. కావున అందరికీ తెలియపరచడమైనది.
శ్రీ తుమ్మూరి కృష్ణారావు గారు
Ex. సర్పంచ్, D.గోపవరం
భార్య: తుమ్మూరి వెంకట నారాయణమ్మ
సర్పంచ్, దేవరగోపవరం
మరియు కుటుంబ సభ్యులు

పోలవరం

•పోలవరం • చింతలపూడి

ఘనంగా సత్యసాయి శతజయంతి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలు కొయ్యలగూడెంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులు సుప్రభాతం అనంతరం ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి హారతులు సమర్పించారు.

గుంతలు పూడ్చే పనులు ప్రారంభం

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ఏటిగట్టు సెంటర్ వరకు ర.భ.శాఖ ప్రధాన రహదారిపై గుంతల్లో వెట్‌మిక్స్ వేసి పూడ్చే పనులు బుధవారం ప్రారంభించారు. ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'గుంతలు.. చోదకులకు చింతలు' శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ర.భ.శాఖ అధికారులు స్పందించారు. గుంతల్లో వెట్‌మిక్స్ వేసి వదిలివేయకుండా అధికారులు తారు వేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీగా శబరిమల బయలుదేరిన అయ్యప్పలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం, పట్టిసీమ, గూటాల గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు గత కొన్ని రోజులుగా చేపట్టిన దీక్షలు పూర్తిచేసుకుని బుధవారం శబరిమల బయలుదేరారు. పోలవరం బీసీ కాలనీ, పట్టిసీమ వినాయకుడి ఆలయాల్లో, గూటాల ఆంజనేయస్వామి ఆలయం వద్ద అయ్యప్ప స్వాములు ఇరుముడులు కట్టుకున్నారు. పూజ కార్యక్రమంలో పాల్గొన్న బంధు, మిత్రులతో ఆలయాలు కిటకిటలాడాయి.

ప్రత్యేక అలంకరణ.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: అంకాలగూడెంలోని ఉమా సమేత భోగలింగేశ్వరుడికి తెల్లవారుజామున అభిషేకాల అనంతరం కర్జూరాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వెలగపాడులోని విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా ఆ విద్యుత్తు ఉపకేంద్రం పరిధి గ్రామాల్లో గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం విద్యుత్తు ఈఈ పీర్‌అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛత నత్తనడక..!

జీతాలు ఇవ్వలేదని కార్మికుల ఆవేదన

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల దేవస్థానంలో పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు గుత్తేదారు గత నెల జీతాలు ఇంకా ఇవ్వలేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేయడానికి కావాల్సిన పరికరాలు, పారిశుద్ధ్య సామగ్రి పూర్తిస్థాయిలో అందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. శ్రీవారి క్షేత్రంలో పలు చోట్ల అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది.

అన్ని పనులు చేసేలా.. దేవస్థానంలో పారిశుద్ధ్య పనులు, గదుల నిర్వహణ, విద్యుత్తు ఉపకరణాల నిర్వహణ, ప్లంబింగ్, అగ్నిమాపక పరికరాల నిర్వహణ, దుస్తులు శుభ్రం చేయడం వంటి పనులను టెండర్ ద్వారా తిరుపతి పద్మావతి హాస్పిటాలిటీ అండ్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ దక్కించుకుంది. కావాల్సిన పరికరాలు, సామగ్రి, మ్యాన్ పవర్, నిర్వహణ పూర్తి బాధ్యత ఆ సంస్థదే. ఆ సంస్థ అక్టోబరు 1 నుంచి ఆయా పనులను పూర్తిస్థాయిలో చేపట్టింది. దాని ద్వారా 18 మంది సూపర్ వైజర్లతో కలిపి మొత్తం 200 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇందుకు దేవస్థానం నెలకు సుమారు రూ.54 లక్షలు ఇస్తోంది.

కొండపైన శివాలయం ఎదురుగా రోడ్డుపై దర్శనమిస్తున్న చెత్త

జీతాల బిల్లులు పెట్టలేదు.. గతంలో మంగళగిరి 7 హిల్స్ మేనేజ్‌మెంట్ సమయంలో నలుగురు సూపర్ వైజర్లతో కలిపి మొత్తం 132మంది కార్మికులు పనిచేసేవారు. ఇందుకు దేవస్థానం నెలకు రూ.18.28 లక్షలు మాత్రమే చెల్లించేది. అయితే ప్రస్తుతం కాంట్రాక్ట్ మారి మ్యాన్ పవర్ పెరిగినా నిర్వహణలో ఎటువంటి మార్పు రాలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

గత నెల జీతాలు కార్మికులకు ఇంకా చెల్లించలేదు. దీని వల్ల ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ కూడా చెల్లించడం ఆలస్యమైందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి దేవాలయంతోపాటు శ్రీవారి ఉపాలయాల పరిసరాలు పలు చోట్ల అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కార్మికుల జీతాలకు సంబంధించి ఇంకా బిల్లు పెట్టలేదని ఆలయ అధికారులు చెబుతున్నారు.

డార్మిటరీలో మరమ్మతులకు గురైన ట్యాప్

ఈ విషయంపై పద్మావతి హాస్పిటాలిటీ అండ్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ మేనేజర్ ప్రవరాక్య మాట్లాడుతూ కార్మికులు సక్రమంగా బ్యాంక్ అకౌంట్లు ఇంకా ఇవ్వలేదని, కొందరికి ఆధార్‌కు ఫోన్ నంబర్లు లింక్ కాకపోవడంతో ఒక నెల జీతం ఆలస్యమైందని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో జీతాలు చెల్లిస్తామని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందని వెల్లడించారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ? బైపాస్ వద్ద అశ్వారావుపేట రోడ్డులో తుప్పలు బాగా పెరిగి రోడ్డు పైకి వచ్చాయి. - **వెంకట్రావు, జంగారెడ్డిగూడెం**
✔ చర్యలు తీసుకుంటాం. - **కె.వి.రమణ, కమిషనర్**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? పాతబస్టాండ్ నుంచి ఆశ్రం వీధికి వెళ్లే రహదారి మొత్తం ఆక్రమణకు గురైంది. దీనివల్ల రహదారి ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. - **ఆదిశేషు**
✔ ఆక్రమణలు గుర్తించి తొలగిస్తాం. చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రేవతిరాణి

సంక్షేమంతోపాటు అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

చింతలపూడి, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను అందించడంతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' రెండో విడత నిధుల విడుదల సందర్భంగా చింతలపూడి ఏఎంసీ ఆవరణలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 36,818 మంది రైతులకు రూ.24.26 కోట్లు జమ కానున్నాయన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కలిపి రూ.7 వేలు జమ చేస్తున్నామన్నారు. రైతులకు ఏ కారణం చేతైనా నిధులు జమకాకపోతే కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. తండ్రి మరణించిన వారసులకు ఈ పథకం ద్వారా నగదు అందజేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎడ్లబండి ఎక్కి, ప్రదర్శనగా సభాస్థలి వద్దకు తరలివచ్చారు. ఏఎంసీ ఛైర్మన్ చీదరాల దుర్గా పార్వతి, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

చింతలపూడిలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. శ్రీనివాసపురం రైతు సేవా కేంద్రం వద్ద జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీతో కలిసి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నగదు జమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా చెక్కులను వీరు పంపిణీ చేశారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నదాత పీఎం కిసాన్ కార్యక్రమాన్ని మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. బయ్యనగూడెం సొసైటీ వద్ద జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పోశారావు మాట్లాడుతూ అన్నదాత కార్యక్రమంలో మండలంలోని 8304 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ మేరకు లబ్ధిదారుల ఖాతాలకు రూ.5.52 కోట్లు జమ అవుతుందని చెప్పారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, సొసైటీ అధ్యక్షుడు మద్దు బాలాజీ గోళ్లరావు తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత తోడ్పాటు అందిస్తున్నాయని ఐటీడీఏ పీవో రాములు నాయక్ తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద రెండో విడత రైతుల ఖాతాల్లోకి సొమ్ములు జమ చేయడాన్ని మండల స్థాయిలో బుట్టాయగూడెంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ.4.14 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: రెండో విడత రైతుల ఖాతాల్లోకి సొమ్ముల జమ కార్యక్రమాన్ని జీలుగుమిల్లిలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్ బుధవారం ప్రారంభించారు. కేబీరోడ్డు ఏఎంసీ ఛైర్మన్ బుజ్జి బాబు, భాజపా జిల్లా నాయకుడు చాట్రాతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్టిసీమలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పోలవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 5,002 మంది రైతులకు రూ.2.50 కోట్లు, పీఎం కిసాన్ రూ.80 లక్షలు రైతుల ఖాతాలకు జమవుతాయని చెప్పారు.

ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత: కలెక్టర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం గోదాము వద్ద సీసీ కెమెరాలు, ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లు, ఇతరత్రా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత కల్పించినట్లు తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం దిన పత్రికల్లో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గర్భకోశ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

పోలవరం, న్యూస్‌టుడే: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు ముత్రు నాయిక్ అన్నారు. రేపల్లెవాడ పశువైద్యశాల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. పశువైద్య సహాయ సంచాలకులు రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక కిడ్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అన్న అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చరవాణి ప్రభావాన్ని విద్యార్థులు చక్కగా వివరించారు. పి.సాయిశ్రీ, కె.హర్షిత, కె.దేవి శ్రీలక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ కోరా రేవతి రాణి బహుమతులు అందజేశారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో రాములు నాయక్ తెలిపారు. ఐటీడీఏలోని తన చాంబర్‌లో బుధవారం గిరిజన దర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. పలువురు నిర్వాసితులు, ఆదివాసీలు ఆయనను కలిసి సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. మొత్తం 13 అర్జీలు అందాయని ఐటీడీఏ అధికారులు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ అవసరం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ప్రస్తుత న్యాయమూర్తి చేత సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ కోరారు. బుట్టాయగూడెంలోని రామనర్సయ్య భవనంలో బుధవారం నిర్వహించిన రౌండు టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

వారం నుంచి కదలని వ్యర్థాల ట్రాక్టర్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలో వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించే ఒక ట్రాక్టర్ మరమ్మతులకు వచ్చి వారం దాటుతున్నా.. పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రక్కు నిండా ఉన్న వ్యర్థాలతోనే పురపాలక కార్యాలయం పాత భవనాల వద్ద ఉంచారు. పట్టణంలో సేకరించిన వ్యర్థాలను కాంపాక్టర్లతోపాటు 4 ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. మరమ్మతులకు గురైన ఈ ట్రాక్టర్‌ను అలాగే వదిలేయడం వల్ల పలు ప్రాంతాల్లో సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఈ పరిస్థితిపై పురపాలక కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ త్వరలోనే బాగు చేయిస్తామని చెప్పారు.

ఆదమరిస్తే అంతే..!

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి శివారు పాలకేంద్రం సమీపంలో ప్రధాన రహదారి వెంబడి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వాహనాలు వస్తే తప్పించడానికి నానా అవస్థలు పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో మరింత అవస్థలు పడుతున్నామని ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీకర్ మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

పొగాకు వేలం మరో రోజు పొడిగింపు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలో వర్జీనియా పొగాకు వేలం బుధవారంతో ముగించాల్సి ఉండగా ఇంకా బేళ్లు వస్తుండటంతో మరో రోజుకు పొడిగించారు. ఉదయం మొదలు సాయంత్రం 6గంటలు వరకు నిరంతరంగా రెండు వేలకు పైగా వేలం నిర్వహించారు. ఇంకా చాలా వరకు బేళ్లు వేలం కేంద్రంలో మిగిలే ఉన్నాయి. ఇంకా వేలం కేంద్రంలోకి వెళ్లే దారిలేక పొగాకు బేళ్లతో ఉన్న ట్రాక్టర్లను కిలో మీటరును దాటి జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపివేసి అమ్మకాల కోసం రైతులు వేచి చూస్తున్నారు. దాదాపు వెయ్యికి పైగానే ఇంకా రైతుల వద్ద ఉండిపోయినట్లు పొగాకు బోర్డు సిబ్బంది భావిస్తున్నారు. గురువారం కూడా వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు వేలం నిర్వహణాధికారిణి గ్రేస్ మార్గరెట్ పేర్కొన్నారు.

జాతీయ రహదారికి ఇరువైపులా బేళ్లతో నిలిపిన ట్రాక్టర్లు

అందరి సహకారంతో హరిత గ్రామాలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజల సహకారంతోనే స్వచ్ఛ, హరిత గ్రామాల సాధన సాకారం అవుతుందని ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా స్వచ్ఛ, హరిత గ్రామాల సాధనపై మూడు రోజుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా తొలి రోజు కార్యక్రమంలో పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు. 20న పంచాయతీకి ఇద్దరు చొప్పున స్వయం సహాయక సంఘాల మహిళలకు, వీవోలకు, 21న కన్నాపురంలోని సంపద కేంద్రం వద్ద హరిత రాయబారులు, పారిశుద్ధ్య సిబ్బంది, రిసోర్సుపర్సన్లకు శిక్షణ ఉంటుందని ఎంపీడీవో వివరించారు.

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ సురక్ష యాప్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా చెల్లింపులు చేయవచ్చునని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ నాగప్రభుకుమార్ తెలిపారు. మద్యం కొనుగోలు చేసేవారు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి ఏసీ బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దాని నాణ్యత, తయారీ తదితరాల గురించి తెలుసుకోవచ్చునన్నారు. యాప్ అమలు చేయని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎక్సైజ్ స్టేషన్ రికార్డులు పరిశీలిస్తున్న నాగప్రభుకుమార్

జంగారెడ్డిగూడెం ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు, పోలవరం ఇన్‌స్పెక్టర్ వీర బ్రహ్మం పాల్గొన్నారు.

సీసాలు స్వాధీనం.. చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గొలుసు దుకాణాలపై దాడులు చేసినట్లు సీఐ అశోక్ బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడిలో గొలుసు దుకాణం నిర్వహిస్తున్న సురేశ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడు పాత నిందితుడు కావడంతో చింతలపూడి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్య తలరాత మార్చే ఆయుధం

చింతలపూడి, న్యూస్‌టుడే: విద్య తలరాతను మార్చే ఆయుధం అని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు తప్పనిసరిగా చదివించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. ఈ నెల 26న సచివాలయంలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి లింగపాలెం మండలం వేములపల్లికి చెందిన వంశిక ఎంపిక కావడంతో ఎమ్మెల్యే బుధవారం విద్యార్థిని తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

చింతలపూడి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్.ఆశ అన్నారు. పట్టణంలోని పది పరీక్షా కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో బెంచీలు, కుర్చీలు, ప్రహరీ ఇతర మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల అపార్ ఐడీలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు.

వసతి గృహానికి భవనాలు నిర్మించాలని వినతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో శిథిలస్థితిలో ఉన్న పాత భవనాలను తొలగించి, కొత్తగా మంజూరైన భవనాలను నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.భూషణం కోరారు. ఈ మేరకు ఐటీడీఏలో బుధవారం పీవో రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

అక్రమ వలసలు అరికట్టాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలోకి గిరిజనేతరుల అక్రమ వలసలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు ఆయన నేతృత్వంలో ఐటీడీఏలో పీవో రాములు నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

బయటకు పోతున్న చెరువు నీరు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడు సమీపంలోని రాజు చెరువు నుంచి నీరు వృథాగా బయటకు పోతోంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తూముల వద్ద తలుపులు పైకి లేపి, నీరు బయటకు పోయేలా పొక్లెయిన్‌ను వినియోగించి మట్టిని తవ్వినట్లు ఆ పక్కనే రహదారి వెంట కన్నాపురం వెళ్తున్న వాహన చోదకులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ విషయమై చిన్నతరహా నీటి వనరుల శాఖ కొయ్యలగూడెం ఏఈ రాహుల్ భాస్కర్ దృష్టికి తీసుకురాగా సిబ్బందిని పంపి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

PASSPORT MISSING
I, PATAPATI SAI NARASIMHA NIKITH VARMA, S/o. Srinivasa Raju, R/o. D.No.4-74, Thimmapuram Village, Dwarakatirumala Mandal, Eluru District, A.P. I am residing in above address, recently i lost my passport with bearing no.V0510797 lost by me on 11-11-2025 while I am moving from My house to Bhimadole Junction for getting Xerox. So if anybody finds it kindly inform to above address.
Ph : 77022 98910

కోడి పందేలపై దాడి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: ములగలంపల్లి శివారున బుధవారం కోడిపందేల నిర్వహణపై ఎస్సై క్రాంతికుమార్ నేతృత్వంలో పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,020 నగదు, రెండేసి కోడిపుంజులు, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో జూద శిబిరంపై దాడి చేసి రూ.5,450 స్వాధీనం చేసుకొని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ప్రతి గ్రామాన్ని స్థానికులతో కలిసి పంచాయతీ సిబ్బంది శుభ్రంగా ఉంచుకునేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జి.మణికుమారి అన్నారు. టి.నరసాపురంలో బుధవారం పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు పచ్చదనం - పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

మాట్లాడుతున్న మణికుమారి

దుకాణాలు ముందుకొస్తున్నాయి

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వేలేరుపాడులో రోజురోజుకూ దుకాణాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. అంబేడ్కర్ కూడలి వద్ద కూరగాయలు, ఫ్యాన్సీ దుకాణాలు పోటాపోటీగా ముందుకొస్తున్నాయి. కొనుగోలుదారులు వారి వాహనాలు షాపుల ముందు రహదారిపై నిలుపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. భూదేవిపేట కూరగాయల దుకాణం వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు సైతం అక్కడ తిప్పలేకపోతున్నామని చోదకులు వాపోతున్నారు.

చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కేతవరం గ్రామానికి చెందిన అగ్నిపర్తి పురుషోత్తం ఇంట్లో బంగారు నగలు, వెండి వస్తువులతోపాటు కొంత నగదు చోరీపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలం వెళ్లారు. వారు తిరిగి సాయంత్రం వచ్చేసరికి తాళం పగులగొట్టి బీరువాలోని బంగారు నగలు, వెండి వస్తువులతోపాటు నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు వేలిముద్ర నిపుణులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి దుర్మరణం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం పద్మావారిగూడెం సమీపాన అల్లికాలువ వద్ద బుట్టాయగూడెం - కన్నాపురం ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామ సచివాలయ ఉద్యోగి దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే మండలం రెడ్డిగణపవరం పంచాయతీ బండార్లగూడేనికి చెందిన పూనెం రామారావు(36) పోలవరం-3 గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ఆయన తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తూ.. అల్లికాలువ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొన్నట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య రామలక్ష్మి బుట్టాయగూడెంలో హోంగార్డుగా పనిచేస్తున్నారు. వీరికి ఏడాది లోపు వయసు కుమార్తె ఉంది. ఘటనపై ఎస్సై దుర్గామహేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అమృతమూర్తికి
అశ్రునివాళి

కీ॥శే॥ శ్రీ చిత్తపూరి రామకృష్ణారావు గారు
జంగారెడ్డిగూడెం, జననం: 9-9-1951, మరణం: 8-11-2025

మీరు మాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలు
మా భవిష్యత్తును నిర్మించిన మీ కృషి
మా మనస్సులో ఎప్పటికీ నిలిచే ఉంటాయి.
కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి
మా భవితకు బంగారు బాటలు వేసి
అనంతలోకాలకు వెళ్ళిన మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: రామామణి
కుమారులు: అప్పలరాజు, సోమశేఖర్, సోభన్‌బాబు
కోడళ్ళు: మాధవి, శ్రీదేవి, వెంకటలక్ష్మి
కుమార్తె: చుండూరు విశాలి
అల్లుడు: అప్పారావు
మనుమలు, మనుమరాండ్రు: సాయినమ్రత, జైసాయి అభిషేక్, బాలఅనుదీప్, పూజశ్రీ, షణ్ముఖి, ఈశ్వర్, జ్యోతీశ్వర్

పెదకార్యం: ఈ రోజు ది. 20-11-2025 గురువారం జంగారెడ్డిగూడెం, బోసు బొమ్మ సెంటర్‌లో మా స్వగృహము నందు జరుపబడును.

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

నమోదు పరిశీలిస్తున్న ఎంఈవో, ఎంఈవో

ముసునూరు, న్యూస్‌టుడే: ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఏసుబాబు, ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. బుధవారం ముసునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ఆయా పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నూతన ఆధార్, ఆధార్ నవీకరణ, పేర్లు, చిరునామాల్లో మార్పులు, చేర్పులు వంటి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు తొలగించడమే ధ్యేయం

సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఎస్టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) లక్ష్యమని ఆ సంఘ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.సరసింహారావు, మండల అధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు తెలిపారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదును బుధవారం ఆగిరిపల్లి మండలంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సురేశ్, షేక్ అబ్దుల్ హక్, తాడి ప్రసాద్, ఎస్‌వి విఠల్, అంకం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యేలకు జ్ఞాపిక అందిస్తున్న కాపు సంఘం ప్రతినిధులు

కైకలూరు, న్యూస్‌టుడే: ఐక్యతతోనే అధిక బలం చేకూరుతుందని, సమాజాభివృద్ధిలో కాపులంతా భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బడేటి రాధాకృష్ణయ్య, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 20వ వార్షిక కాపు వన సమారాధన కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలో కాపు కల్యాణ మండపానికి భూమి కేటాయించి నిర్మాణానికి సహకరిస్తానని ఎమ్మెల్యే కామినేని తెలిపారు. నిర్వాహకులు ఎమ్మెల్యేలను జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ సందీప్, ఏపీఎంఐపీ డైరెక్టర్ చనమల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాగులు పొంగితే.. రాకపోకలకు ఇక్కట్లే

నూజివీడు రూరల్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలో లోలెవల్ వంతెనలతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలకు ప్రధాన రహదారులపై ఉన్న కాజ్‌వేలు, లోలెవల్ వంతెనలు ఏళ్ల తరబడి విస్తరణకు, మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాటి మీద వరద నీరు ప్రవహించి ప్రజలు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. వరద ఉద్ధృతి తెలియక అత్యవసర పరిస్థితుల్లో వాటిని దాటే ప్రయత్నంలో చాలామంది ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వీటిపై హైలెవల్ వంతెనలు నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయని తెలిసినా ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల నుంచి నూజివీడు వచ్చే విద్యార్థులకు వరదల సమయంలో అవస్థలు తప్పడం లేదు.

ముసునూరు-సింహాద్రిపురం దారిలో రాములేరు వాగు (పాతచిత్రం)

నూజివీడు నియోజకవర్గంలో ఇలా..

➤ ముసునూరు నుంచి నూజివీడు వెళ్లే సింహాద్రిపురం వద్ద రాములేరు వాగు, వలసపల్లి వద్ద కాళంగి వాగు ముసునూరు, వలసపల్లి మధ్యలో సంధ్యపు వాగు, రమణక్కపేటలో ఎర్రవాగు, అక్కిరెడ్డిగూడెం దారిలో సంధ్యపు వాగు, లోపూడిలో ఉప్పాగు వాగులు తక్కువ ఎత్తులో ఉండటంతో చిన్నపాటి వర్షానికి వరద నీరు రహదారిపైకి ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. వరదలు ఇచ్చిన సమయంలో సుమారు 20 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➤ నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి సాయిబాబా ఆలయం వద్ద ఉన్న రాములేరు వాగు వంతెనపై నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. రెండు నెలల కిందట కురిసిన భారీ వర్షానికి తుక్కులూరు వద్ద ఉన్న రాములేరు వాగు వంతెన పైకి నీరు చేరి గ్రామానికి చెందిన ఓ యువతి కాలి నడకన వాగు దాటే క్రమంలో కాలు జారి వాగులో కొట్టుకుపోయి మృతి చెందింది.

➤ ఆగిరిపల్లి-గన్నవరం రహదారిలో తోటపల్లి సమీపం వద్ద కుంపినీ వాగు వద్ద వంతెన లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆగిరిపల్లి-నూగొండపల్లి గ్రామాల మధ్యలో ఉన్న వాగు వరదల సమయంలో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

➤ చాట్రాయి మండలంలో కోటపాడు-పోతునూరు, చీపురుగూడెం, మల్లాయిగూడెం, పోలవరం, యడవల్లి గ్రామాల మధ్య కాజ్‌వేలపై వరద నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతాయి. ఏడాది క్రితం తుమ్మగూడెం, మర్లపాలెం గ్రామాల పెద్ద చెరువు వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో వాగు దాటే క్రమంలో ఓ వ్యక్తి వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. కోటపాడు-పోతునూరు మధ్య కాజ్‌వే అసంపూర్తిగా ఉండటంతో ఆ ప్రదేశంలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ వరదలు వచ్చినప్పుడు వాహనాలు వెళ్లే సమయంలో బోల్తా పడుతున్నాయి.

నివేదిక పంపాం

ప్రమాదకరంగా ఉన్న వంతెనల నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదికను పంపాం. వంతెనల నిర్మాణానికి ఆదేశాలూ రాలేదు. - బాబూరావు, ఆర్‌అండ్‌బీ డీఈఈ

13న కైకలూరులో జాతీయ లోక్‌అదాలత్

న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మి

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరులో వచ్చే నెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎస్ లక్ష్మి సూచించారు. కైకలూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీయే రాజ మార్గమని, నెలల తరబడి న్యాయ స్థానం చుట్టూ తిరగకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఎక్కువ మంది కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా న్యాయవాదులు ప్రోత్సహించాలని కోరారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కని మార్గమని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కేసులతో సమయం, డబ్బు వృథా అవుతాయని, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భూ సమస్యలు, వాహన ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్ వంటి కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

అన్నదాత సుఖీభవతో ఆర్థిక తోడ్పాటు

చంద్రబాబు, మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: రైతుల కష్టాల్లో ఆదుకుని చేయూతనివ్వడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు గద్దె రమేశ్ అన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ముసునూరులో ఏవో కార్యాలయం వద్ద నాయకులు రైతులను సన్మానించారు. చంద్రబాబు, ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏవో చాముండేశ్వరి మాట్లాడుతూ.. మండలంలో 8,205 మంది రైతులకు అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు రూ.5.48 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. తోట శ్రీనివాసరావు, గార్లపాటి నరసింహారావు, దేవినేని శ్రీధర్, కొండేటి బాబీ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని బత్తులవారిగూడెంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినందుకు పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ముసునూరు రాజా, సర్పంచి లక్ష్మీకాంతమ్మ, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్ద పీట

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ ఛైర్మన్ వెంకట గురుమూర్తి తెలిపారు. బుధవారం నూజివీడు మండలంలోని రావిచర్లలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల జమ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.శిరీష, సర్పంచి కాపా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.శివనాగమణి, నియోజకవర్గ పరిశీలకుడు వి.శ్రీనివాస్, భాజపా మండల అధ్యక్షుడు వై.రాము, బీసీఎల్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జనసైనికుల కృషి అభినందనీయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గురజలో నూతనంగా ప్రారంభించిన జనసేన పార్టీ కార్యాలయాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పరిశీలించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామ స్థాయిలో జన సైనికులు స్వచ్ఛందంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్థానిక ఎన్నికల్లో మరింత బలోపేతం కావాలని సూచించారు. జన సైనికులు ఆయనను శాలువాతో సత్కరించారు. పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, వీరంకి వెంకయ్య, పోతల కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను సత్కరించిన కార్యకర్తలు

ధూమపానంతో యువత భవిత చిత్తు

ప్రతిభ చాటిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న రమణ, దేవమణి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ధూమపానంతో యువత ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందని జోనల్ కోఆర్డినేటర్ ఎస్.దేవమణి తెలిపారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బుధవారం 'ధూమపానం.. ఆరోగ్యంపై ప్రభావం' అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధూమపానంతో క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, ఇది శరీరంలోని ప్రతి అవయవంపై ప్రభావం చూపుతుందని, రోగ నిరోధక వ్యవస్థను బలహీన పరుస్తుందని, మీ రూపాన్ని, ఆర్థిక స్థితిని ప్రభావితం చేస్తుందని తెలిపారు. ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లి, న్యూస్‌టుడే: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, బాల్యం నుంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మానసిక వికాస కేంద్రం కోఆర్డినేటర్ ఎం.లీలావతి సూచించారు. మండవల్లి, భైరవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో నవ జీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సర్పంచులు మెండా ఝాన్సీ, నీలపాల రాధా నాగేంద్ర చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.

గ్రామాభివృద్ధిలో దాతల సహకారం అవసరం: కామినేని

గురజలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో, మౌలిక వసతుల కల్పనలో దాతల సహకారం అవసరమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పెనుమల్లి శివారు సింగరం పాలెంలో నాయకులు బొర్రా చలమయ్య ఆర్థిక సహకారంతో నిర్మించిన సీసీ రహదారిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గురజ, సంకర్షణపురంలో నరేగా నిధులతో నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. నాయకులు శోభనాద్రిచౌదరి, కోమటి శోభనబాబు, ఏఎస్ బాబు, కృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం.. కైకలూరు, న్యూస్‌టుడే: సత్యసాయి సేవాసమితి నిర్వహించే సేవా కార్యక్రమాలు ఎందరో సమాజ సేవకులకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని సత్యసాయి సేవా క్రమంలో బుధవారం శ్రీ సత్యసాయి శత జయంతి మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కలిగి పేదలకు అండగా ఉంటూ సమాజంలో మార్పునకు నాంది పలకాలనే సత్య సాయిబాబా ఆకాంక్షించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యాంజలి విద్యా సంస్థల అధినేత జమీల్ అహ్మద్ సత్యసాయిపై రచించి గానం చేసిన పాట ఆవిష్కరించారు. రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టరు నల్లగోపుల చలపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భోగేశ్వరా పాహిమాం

కలిదిండి, న్యూస్‌టుడే: 'పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర పాహిమాం.. రక్షమాం' అంటూ భక్తులు వేడుకున్నారు. స్వామివారికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేశారు.

శివునికి అన్నాభిషేకం.. గురజ(ముదినేపల్లి), న్యూస్‌టుడే: కార్తిక మాస వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. నెల రోజులుగా శివాలయాల్లో శివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు. బుధవారం గురజలోని గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి ఆలయాల్లో స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు.

సూచనలు చేస్తున్న పరీక్షల విభాగ అదనపు కమిషనర్ ఆశ

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని పరీక్షల విభాగ అదనపు కమిషనర్ ఆశ సూచించారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్.ఎఫ్.ఎస్. ఉన్నత పాఠశాల, ఎస్వీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను, అక్కడి వసతులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం అన్నారు. పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ప్రత్యేక తరగతుల్లో.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపిన వ్యక్తిపై కేసు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తిపై రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ ఎస్.ఐ. లక్ష్మణబాబు కథనం ప్రకారం.. తిరువూరు మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన వంగూరు అంజారావు మీర్జాపురం వద్ద మద్యం తాగి వాహనం నడుపుతుంటే పట్టుకుని కేసు నమోదు చేశారు.

గేదె చోరీ ఘటనలో నిందితుల అరెస్టు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గేదె చోరీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్ అయిన ఘటన ఆగిరిపల్లి మండలంలో చోటు చేసుకుంది. అడవినెక్కలానికి చెందిన మాదల జనార్దన రావు గేదెల షెడ్డు నుంచి ఇటీవల ఒక గేదె అపహరణకు గురైంది. ఆయన ఆగిరిపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం బేతపూడికి చెందిన కోసూరి భగవాన్ నారాయణ, రాజమండ్రికి చెందిన బత్తుల దుర్గాప్రసాద్, షేక్ మహ్మద్ అలీలను నిందితులుగా గుర్తించి వారి నుంచి గేదెను స్వాధీనం చేసుకుని యజమానికి అందజేశారు.

కాలువలో ప్రైవేటు ఉద్యోగి మృతదేహం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఓ హోటల్ వద్ద కాలువలో ఒక వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన తరుమల్లి చిన్నారావు(32) ఓ ఫెర్టిలైజర్ సంస్థ మార్కెటింగ్ విభాగంలో పని చేస్తున్నారు. మంగళవారం ఓ హోటల్ నాలుగో అంతస్తులో గది అద్దెకు తీసుకుని సహోద్యోగులతో రాత్రంతా పార్టీ చేసుకున్నారు. తర్వాత రోజు ఆయన మృతదేహం హోటల్ వద్ద కాలువలో లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జరిగిందా..? ఇంకేమైనా కారణాలున్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతన్నకు నూర్పిడి పోటు

పెరిగిన కోత ఖర్చులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఖరీఫ్ వరి కోతలు, నూర్పిడిలో రైతన్నలు తీరిక లేకుండా ఉన్నారు. ఈ ఏడాది సాగులో పెట్టుబడి వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. యూరియా, ఎరువులు లభించక అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట దెబ్బతినగా కాపాడుకున్న పంటను కోస్తున్నారు. వర్షం, పెనుగాలులతో నేలకొరగడంతో కోతకు సమయం ఎక్కువగా పడుతుంది. యంత్రాల కొరతతో గతంలో కంటే కోత ఖర్చులు రెట్టింపవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినపాలపర్రులో యంత్రంతో..

కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఖరీఫ్‌లో 22,827 ఎకరాల్లో వరిసాగు చేశారు. అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 14,523 ఎకరాల్లో చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు 3,500 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. గత పదిహేనురోజులుగా కోతలు ప్రారంభించారు. ఏటా 70 శాతం యంత్రాలతో, 30 శాతం కూలీలతో కోతలు కోసేవారు. ఈ ఏడాది కూలీల కొరత, కూలిధరలు పెరగడంతో వారంతా యంత్రాలపైనే ఆధారపడ్డారు.

ఎకరాకు రూ.3,500

ఏటా వరికోతలకు తూర్పుగోదావరి జిల్లా, గుంటూరు, నెల్లూరు, తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో కోత యంత్రాలు వచ్చేవి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఇంకా కోతలు పూర్తికాకపోవడంతో పూర్తిస్థాయిలో యంత్రాలు రాలేదు. దీంతో వీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. గతంలో కోతకు ఎకరానికి రూ.2 వేల నుంచి రూ.2,900 తీసుకునేవారు. గంటలో ఎకరం పూర్తయ్యేది. ప్రస్తుతం ఎకరానికి రూ.3 వేల నుంచి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు అధిక సంఖ్యలో పైరు నేలకొరగడంతో ఎకరంకోతకు గంటన్నర సమయం పడుతోంది.

చేనులో నీరుండటంతో పెరిగిన వ్యయం

తుపాను, ఈదురు గాలుల ప్రభావంతో నాలుగెకరాల వరిపైరు నేలవాలింది. గంటకు రూ.3,500 చెల్లించి యంత్రంతో కోత కోయించా. పైరుపడిపోవడంతో పాటు చేనులో నీరు ఉండటంతో అదనంగా మరో రూ.3 వేలు ఖర్చయింది. అంటే రూ.17 వేలు చెల్లించాల్సి వచ్చింది.

- శ్రీనివాసరావు, రైతు, పెదపాలపర్రు

వాతావరణ మార్పులతో ఆందోళన

పంట కోతకు వచ్చి యంత్రాలు కోసం పదిరోజులుగా ప్రయత్నిస్తున్నా. ఇప్పటి వరకు దొరకలేదు. మరో పక్క వాతావరణంలో మార్పులు వస్తుండటంతో పంట ఇంటికి చేరుతుందో లేదో తెలియక భయాందోళనకు గురవుతున్నాం.

- మట్లపూడి రాంబాబు, రైతు, దేవపూడి

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు: డీఎంహెచ్‌వో

పరిశీలిస్తున్న అమృతం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్యాధికారిణి డా.పి.జె.అమృతం స్పష్టం చేశారు. ఆగిరిపల్లి పీహెచ్‌సీని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఔషధాలు, వ్యాక్సిన్ల నిల్వలు, రక్త పరీక్ష పరికరాలు, రసాయనాలు, రికార్డులు, సిబ్బంది హాజరు, ఆసుపత్రిలోని రోగుల వసతులు పరిశీలించారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో త్వరలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రయోగశాల సేవలు మెరుగు పరచాలని, ఇమ్యునైజేషన్ సకాలంలో పూర్తి చేయాలని, ఎల్‌సీడీసీ, ఎస్‌ఏఏఎన్‌ఎస్ సర్వేలపై సూచనలు చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారి డా.జె.జగన్మోహనరావు పాల్గొన్నారు.

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తేయాలి: వ్య.కా.సం.

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొల్లేరుపై ఆంక్షలు ఎత్తేయాలని.. రైతులు, పేదలపై అటవీ శాఖాధికారుల వేధింపులు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అన్నేభవనంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు ముత్యాలమ్మ అధ్యక్షత వహించారు. నాయకులు జీవరత్నం, ఎ.రవి, వెంకట్రావు, మహంకాళిరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కలిసి రండి

మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఆర్‌టీవీ దుర్గ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గ్రంథాలయం అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని నూజివీడు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆర్టీవీ దుర్గ తెలిపారు. బుధవారం నూజివీడులో జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాల సందర్భంగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి పథంలో మహిళ అనే అంశంపై శారద విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.రాధిక, విశ్రాంత డీసీటీవో బి.బాలకోటేశ్వరి ఎస్.పద్మజ, రోజా, వై.కృష్ణవేణి, భవాని చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సత్కరించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, విశ్రాంత దేవాదాయ శాఖ అధికారి రాజా రామ్మోహనరావు తదితరులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

★ చిత్రలేఖనం సీనియర్ విభాగం పోటీల్లో ప్రథమ స్థానం కె.అభిలాష్, ద్వితీయ స్థానం ఎ.రూహిత, తృతీయ స్థానం పి.జాన్సన్, ప్రోత్సాహక బహుమతిని టి.అనూష బ్లెస్సీ, జూనియర్స్ విభాగంలో వరుసగా ప్రవల్లిక, పి.శామ్యూల్, కె.హన హర్షిత, పి.హన్సిల్ నోయల్, వక్తృత్వపోటీల్లో సీనియర్స్ విభాగంలో కె.మోక్షిత, కె.గీతికాలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఇ.మంజులరాణి, జూనియర్స్ విభాగంలో ఆర్.లేఖన, ఎం.హన్విత్ రెడ్డి, ఐ.ఈక్షిత, టి.బెంజిమన్, వ్యాసరచన పోటీలు సీనియర్స్‌లో సీహెచ్ సాహితి, పి.హేమ తులసి, కె.చైత్ర, బి.అప్సర కుమారి, ఎ.స్నేహిత పరదేశి, జూనియర్స్ విభాగంలో పీపీఎస్ కుముదవల్లి, పి.లేఖ్యశ్రీ, ఆరుష్ పాణిగ్రాహి, ఆర్.ఈశ్వర్‌రావులు విజేతలుగా నిలిచారని గ్రంథాలయ అధికారి తెలిపారు. వీరందరికి గురువారం ఉదయం మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

మాట్లాడుతున్న ఎస్సై శుభశేఖర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలమని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ఆగిరిపల్లిలో దుకాణాలను ఎస్సై బుధవారం పరిశీలించి సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. గృహాలు, దుకాణాలు, ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు జరిగినప్పుడు సాంకేతికత ఆధారంగా త్వరగా కేసులను ఛేదించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కనీసం 3 నెలల వీడియో ఫుటేజ్ ఉండేటట్లు చూడాలని ఆయన సూచించారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్ మంజునాథ్

జాతీయ స్థాయి తైక్వాండో, ఈత పోటీలకు ఎంపిక

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం తాడేపల్లి చొప్పరమెట్లలోని డాక్టర్ కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాల విద్యార్థులు స్విమ్మింగ్, తైక్వాండోలో జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ మంజునాథ్ తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో డి.గౌతమ్ కృష్ణ, హరి రుద్ర, కార్తికేయ, మోక్షకరణ్, రుద్వేద్ సత్తా చాటి డిసెంబర్ నెలలో కర్ణాటకలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థులు డి.ప్రశాంత్, జె.సందీప్ రెడ్డి ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు, కోచ్‌లను ఛైర్మన్ డా.కొసరాజు కోటేశ్వరరావు, డీన్ రఘురామ్ అభినందించారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయంలో బుధవారం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మాట్లాడుతూ ఉక్కు మహిళ అయిన ఇందిరా గాంధీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చనుబండలో బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించగా మహిళా పోలీస్ జి.విజయలక్ష్మి, గ్రంథాలయాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

చనుబండలో ముగ్గుల పోటీలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, కళలపై దృష్టి పెట్టడం ద్వారా ఉజ్వల భవిత సాధ్య పడుతుందని ఉపాధ్యాయిని డి.విజయదుర్గ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆగిరిపల్లిలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. సాహితీ మిత్రుడు వెంకటనారాయణ, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు కూటమి నాయకులు రామచంద్రారావు, కేకే బాబు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన అవసరం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధిపై ప్రజలు అవగాహన కల్గి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అమృతం జాన్ తెలిపారు. బుధవారం గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మీర్జాపురంలో కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వే, ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వచ్చే న్యుమోనియా వ్యాధి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అమృతం జాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శరీరంపై మచ్చలు ఉంటే పరీక్షించుకోవాలని ఆమె సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ వి.ధనమ్మ, ఏఎన్‌ఎం నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలముగా గ్రామ ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా. ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, లోపూడి పంచాయతీ, బాసవరప్పాడు గ్రామంలో వేంచేసియున్న **శ్రీ భద్రాద్రి సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానమును** హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోనికి చేర్చి, చట్టం 30/87 నందలి సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుట మరియు సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ చేయుటకు గాను పై దేవాలయము కమిటీ మరియు అర్చకుల అభ్యర్థన మేరకు నిర్ణయించుట జరిగినది.

కావున యిందు విషయమై మీకు ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి పది రోజుల్లో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్, దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయవలెను.

సం/- **ఆలయ ధర్మకర్త,** శ్రీ భద్రాద్రి సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము
బాసవరప్పాడు గ్రామం, లోపూడి పంచాయతీ, ముసునూరు మండలం, ఏలూరు జిలా

(c) eenadu

రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో మార్చురీ వద్ద పోలీసు బలగాలు

అభయారణ్యం.. భీతావహం

● మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్లతో కలకలం

ఈనాడు, కాకినాడ, ఈనాడు డిజిటల్, పాడేరు: ప్రకృతి అందాలు, పర్యాటకులతో సందడిగా ఉండే మారేడుమిల్లిలో తూటాలు గర్జిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఒక ఎన్‌కౌంటర్ జరిగి 24 గంటలు గడవకముందే.. బుధవారం తెల్లవారి మరోసారి తుపాకులు పేలాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా సహా రెండురోజుల్లో మొత్తం 13 మంది నేలకొరిగారు.

వెతుక్కుంటూ..

ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టులు ఏఓబీకి వచ్చారు. మంగళ, బుధవారాలు ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం అగ్రనేత హిడ్మా సహా ఆరుగురు.. బుధవారం గుజ్జుమామిడివలస వద్ద ఏడుగురు మృత్యువాత పడ్డారు.

మహిళా మావోయిస్టులను కాకినాడ కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఆసుపత్రిలో ఉంచారు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో కాకినాడ, రాజమహేంద్రి జీజీహెచ్‌ల నుంచి ఫోరెన్సిక్ నిపుణులు ఉమామహేశ్వరరావు, రమేష్, ఉత్తమ్, ప్రశాంత్, వీరభద్రరావు ఇక్కడికి వచ్చారు.

ఉమ్మడి జిల్లాలో సంచలనం

తూర్పు కనుమల్లో సంచరించే మావోయిస్టులు ఉన్నట్టుండి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యక్షమవడం సంచలనం కలిగించింది. ఇద్దరు మహిళా మావోయిస్టులు అంకిత, అనూషలను సామర్లకోట మండలం కొప్పవరం వద్ద, సరోజ్ మండ్వి అలియాస్ ఓండాను రావులపాలెం గౌతమి వంతెన సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా ముగ్గురు హిడ్మా దళంలో క్రియాశీలక సభ్యులేనని తేలింది. అందరూ ఆయుధాలు పట్టినవారే, ఆపరేషన్లలో పాల్గొన్నవారే. ముగ్గురి వయసు 25 నుంచి 30 ఏళ్లలోపే.

జన ప్రవంతిలోకి ఎందుకొచ్చారో..

మావోయిస్టు సరోజ్ మండ్వి అలియాస్ ఓండా కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలోని ఓ రొయ్యల చెరువు వద్ద కొన్ని నెలలుగా పనిచేస్తున్నట్టు తెలియడం చర్చకు తావిచ్చింది. ఇతనిది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం. ఏళ్ల క్రితం అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రాంతానికి వచ్చి ఉంటున్నాడు. అక్కడి నుంచే దళంలో సానుభూతిపరుడిగా చేరి కీలక సభ్యుడిగా ఎదిగాడు.

కేంద్ర కారాగారానికి 42 మంది మావోయిస్టులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం వద్ద బుధవారం రాత్రి క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. వివిధ జిల్లాల్లో కోర్టులు రిమాండ్ విధించిన మావోయిస్టులను భారీ సంఖ్యలో తీసుకురావడంతో పోలీసు, జైళ్లశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాకినాడ జిల్లా నుంచి ఇద్దరు, కోనసీమ నుంచి ఒకరు, ఏలూరు జిల్లా నుంచి 15 మందిని రాత్రి 8.30 గంటల్లోపు జైలుకు తరలించారు. విజయవాడ నుంచి 24 మందిని రెండు ప్రత్యేక బస్సుల్లో 10.30 గంటలకు తీసుకొచ్చారు. మొత్తం 42 మందిలో 15 మంది పురుషులు, 27 మంది మహిళలు. మహిళా మావోయిస్టులను ప్రత్యేక కారాగారానికి తరలించారు. ఒకటో పట్టణ స్టేషన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు జైలు వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

విజయవాడ నుంచి మావోయిస్టులను తీసుకొచ్చిన బస్సును కేంద్ర కారాగారంలోకి పంపిస్తున్న పోలీసులు

నేలపైనే శయనం..

కాకినాడలోని ఓ ప్రైవేటు భవనంలో నడుస్తున్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు చల్లని గచ్చుపైనే దుప్పట్లు పరిచి నిద్రించాల్సిన దుస్థితి వేధిస్తోంది.

చన్నీళ్లతోనే స్నానం..

పిఠాపురంలోని ప్రభుత్వ సాంఘిక బాలుర హాస్టల్లో 120 మంది విద్యార్థులు చన్నీళ్లతో ఉదయాన్నే స్నానం చేయలేకపోతున్నామని వాపోతున్నారు.

భవనమే భయం..

పెద్దాపురంలోని ఎస్సీ జూనియర్ కళాశాల స్థాయి వసతి గృహ సముదాయ భవనం స్లాబు పెచ్చులూడి ఎప్పుడు మీద పడుతుందో తెలియని భయం నెలకొంది.

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం, పిఠాపురం, పెద్దాపురం

తప్పదా.. బాల్యం బాధపడక..!

దూరాభారం పేద పిల్లల చదువుకు అడ్డు కాకూడదు. సమయానికి ఆహారం తిని.. సౌకర్యంగా చదివి.. దేశ ఉత్తమ పౌరులుగా వారు ఎదగాలి. ఉన్నతోద్యోగులుగా స్థిరపడాలనేది వసతి గృహాల లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నాయి. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఏటా యాతన తప్పడం లేదు. క్షేత్ర స్థాయిలో వసతి గృహాలను పరిశీలించగా విద్యార్థులు అనుభవిస్తున్న ఇబ్బందులు చలింపజేశాయి. మీ పిల్లలైతే ఇలానే వ్యవహరిస్తారా.. అని పలువురు తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. చర్యలు కోరుతున్నారు.

ఇవీ జిల్లా గణాంకాలు..
- వసతి గృహాలు: 33
- బాలురవి: 20
- బాలికలవి: 13
- అద్దె భవనాల్లో నిర్వహించేవి: 11
- సొంత భవనాలున్నవి: 22
- విద్యార్థుల సంఖ్య: 2,783
- బాలురు: 1568
- బాలికలు: 1215

ఎక్కడ..: సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలు

ఈనాడు పరిశీలన

చర్యలేంటే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వసతి గృహ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. జిల్లాకు రూ.కోటి మేర రావడంతో ప్రభుత్వ భవనాల్లో నడిచేవాటికి మరమ్మతులు చేశారు. చలికాలానికి నెల ముందే విద్యార్థులకు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు.

ఇబ్బందులేంటే..

● హాస్టళ్లలో తలుపులు, కిటికీలు సరిగా లేక చలికి వణికిపోతున్నారు. ● పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పి దోమల ఉద్ధృతితో సరిగా నిద్రించలేని దుస్థితి. ● ప్రైవేటు భవనాల్లో సౌకర్యాల మెరుగు గురించి వాటి యజమానులు పట్టించుకోవడం లేదు. ● ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల్లో మంచాలు, పరుపులు లేక విద్యార్థులు దాదాపు అన్నిచోట్లా నేలపైనే పడుకోవాల్సివస్తోంది. ● చాలాచోట్ల వేడి నీళ్ల సదుపాయం లేక పిల్లలు చన్నీళ్లతోనే చలిలో స్నానాలు చేస్తున్నారు. ● కాస్మెటిక్ ఛార్జీలు సరిగా అందడం లేదని వాపోతున్నారు. ● ప్రత్యామ్నాయంగా కిట్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినా.. అమలు కావడం లేదు.

పారిశ్రామికమే భూమిక..

ఈనాడు, కాకినాడ: నూతన పాలసీతో కూటమి ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం కుదిరింది. కాకినాడ జిల్లాలో ఉన్న పరిశ్రమల విస్తరణ, కొత్తగా ఏర్పాటుకు కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. తగిన భూమి చూపిస్తేచాలంటున్నాయి. ప్రస్తుతం కావాల్సిందల్లా భూ బ్యాంకు.

భూముల వివరాలు పరిశీలిస్తున్న ఏపీఐఐసీ అధికారులు

జిల్లాలో ఏర్పాటుకు వివిధ సంస్థల ఆసక్తి

తమకూ కేటాయించాలని..

● కోరమాండల్ సంస్థ ఎరువుల తయారీ పరిశ్రమ విస్తరణకు రైల్వేలైన్ పరిసరాల్లో 200 ఎకరాలు అడుగుతోంది. ● రెడ్ ఎర్త్ వే సైడ్ ఎమినిటీస్ ప్రైవేటు లిమిటెడ్, సిద్ధిఖా హాస్పిటాలిటీ ప్రై.. లిమిటెడ్‌వారు తుని మండలం తేటగుంట, కిర్లంపూడిలోని జగపతినగరం వద్ద అయిదేసి ఎకరాలు కోరుతున్నారు. ఇస్తే రెస్టారెంట్లు, ఛార్జింగ్ స్టేషన్లు, రిక్రియేషన్ పాయింట్లు పెడతారు.

● ప్రజ్ఞా ఛార్జ్‌టెక్ కంపెనీ కాకినాడ పరిసరాల్లో 70 ఎకరాలిస్తే ఛార్జర్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమ నెలకొల్పుతానంటోంది.

● పెద్దాపురం వద్ద 25 ఎకరాలిస్తే ఫైబర్, ప్లాస్టిక్ పునర్వినియోగ యూనిట్ పెడతామని పారిశ్రామికవేత్త వీవీవీ సత్యనారాయణ ఆసక్తి చూపిస్తున్నారు.

● వాకలపూడి వద్ద ప్లాస్టిక్ రీసైక్లింగ్, ఇంజిన్ స్పేర్ పార్టులు, సర్వీసింగ్ సెంటర్లకోసం ఇద్దరు ఔత్సాహికులు అయిదేసి ఎకరాలు అడిగారు.

● ఆర్కా బయోసైన్స్, హైదరాబాద్ కంపెనీ తొండంగి పరిధి కోనలో అయిదెకరాలు.. కియోన్ బ్లెండర్స్ ఇండస్ట్రీస్ కాకినాడ వద్ద 30 ఎకరాలు అడుగుతున్నాయి.

పరిశీలిస్తున్నాం..

పరిశ్రమల ఏర్పాటుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. వారు కోరిన చోట భూముల లభ్యతపై పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ, అసైన్డ్ భూములు జిల్లాలో తక్కువ. కలెక్టర్ సూచన మేరకు భూ బ్యాంకు ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నాం.

– రమణారెడ్డి, ఏపీఐఐసీ, జెడ్ఎం, కాకినాడ

జిల్లాలో ఇప్పటివరకు ఉన్న పరిశ్రమలు

ఎంఎస్ఎంఈలు	13,725
పెట్టుబడి	రూ.600 కోట్లు
ఉపాధి	సుమారు 53 వేల మందికి
మధ్య, పెద్దతరహా పరిశ్రమలు	61
పెట్టుబడి	రూ.38,800 కోట్లు
ఉపాధి	38,500 మందికి
పురోగతి, విస్తరణలో ఉన్న కంపెనీలు	7
పెట్టుబడి	రూ. 13,400 కోట్లు
ఉపాధి అవకాశాలు	3,600 మందికి

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే చినరాజప్ప, ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రాజశేఖరం

రైతులను అన్నివిధాలా ఆదుకుంటున్నాం

మంత్రి నారాయణ

సామర్లకోట, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణ అన్నారు. బుధవారం సామర్లకోట పట్టణంలోని సూర్య ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులపట్ల నిర్లక్ష్యధోరణి అవలంబించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో వారి ఖాతాలో నగదు వేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో విడత నిధులు రైతుల ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పురపాలిక ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మణి కుమారి, నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇంతగా వెనకేసుకొస్తే ఎలా?

ఆడపిల్ల అడిగితే ఏదైనా చేయడం అందరికీ ఇష్టమే. కానీ.. మారాం చేస్తున్నారనో... మాట వినడం లేదనో.. మరీ వారిని వెనకేసుకురావడం మాత్రం తగదని ఈ చిత్రం చూసిన పలువురు పేర్కొన్నారు. ఒక్క క్షణం చేతులు వదిలేసినా... గుండం కారణంగా కుదుపు వచ్చినా గట్టిగా ఉండే రహదారిపై పడితే చిన్నారి పరిస్థితి ఏంటో ఓసారి ఆలోచించాలని, పైగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్తుండడం అస్సలు బాలేదని అంటున్నారు. కాకినాడలో బుధవారం కనిపించిందీ చిత్రం.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

కాలువలపై కన్ను కబ్జాకు ఎవరో దన్ను

– న్యూస్‌టుడే, పిఠాపురం, కాకినాడ గ్రామీణం

పంట కాలువల వెంట గట్లు కబ్జాకు గురవుతున్నాయి. ఎక్కడికక్కడే వాటిని ఆక్రమించి భవనాలు నిర్మించేస్తుండడంతో వెడల్పు తగ్గిపోయి సాగునీరు పొలాలకు సక్రమంగా పారడం లేదు. అధికంగా వచ్చేప్పుడు పొలాల ముంపు సమస్యకూడా తలెత్తుతోంది. కొన్నేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కర్షకులు కన్నెర్ర చేస్తున్నారు. పిఠాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో పరిశీలిస్తే.. ఆక్రమణలు, అక్రమ కట్టడాలు కనిపించాయి.

తిమ్మాపురం మారుతీనగర్‌లో కాలువను కబ్జా చేసి కట్టిన భవనం

● కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలో ముఖ్యమైన పంట కాలువలు కబ్జా చేసేస్తున్నారు. ఇక్కడ స్థలం విలువ అధికంగా ఉండడంతో ఆక్రమించి భవనాలు కడుతున్నారు. దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పిఠాపురం బ్రాంచి కెనాల్ ద్వారా 1,440 హెక్టార్లలో పంటకు నీరు అందిస్తున్నారు. ముఖ్యంగా తిమ్మాపురం, ఇంద్రపాలెం, తమ్మవరం, రమణయ్య పేట, పండూరు, కాకినాడ అర్బన్ అచ్యుతాపురం తదితర ప్రాంతాల మీదుగా ఈ కాలువ వ్యవస్థ ఉంది. కాలువ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. జలవనరులశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

● కొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి నుంచి ఉప్పాడ మెయిన్‌రోడ్డు వెంట ఉన్న రెండు కిలోమీటర్ల పీబీసీ పంట కాలువను కొందరు అక్కడక్కడా ఆక్రమించేశారు. దాంతో రైతులు సాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. వరద నీరు సముద్రంలోకి వెళ్లే ఈ కాలువ మూసుకుపోవడంతో పొలాలు, ఇళ్లకు ముంపు తప్పడం లేదు.

● పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు, పీబీసీ జలాశయాల పరిధిలో చిన్న, పెద్ద కాలువలు 100 కిలోమీటర్ల వరకు ఉంటాయి. కాలువలపై ఆధారపడి ఏటా 17 వేల హెక్టార్లలో వరి పంట పండుతుంది. జాతీయ రహదారికి ఇరువైపులా పొలాలను లేఅవుట్లు చేసి ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి, జలవనరుల శాఖ స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వాసుపత్రి నుంచి కాకినాడవైపు వెళ్లే మార్గంలో కాలువలు ఆనుకుని దుకాణాలు వెలిశాయి. భీమ్‌నగర్, రాపర్తికూడలి, వైజంక్షన్ సమీపంలో కాలువ మొత్తం మూసేశారు. పట్టణంలోని మంగాయమ్మరావుపేట నుంచి బొజ్జావారి తోట వరకు ఏలేరు కాలువను ఆక్రమించేశారు. దాంతో పట్టణ వీధులు ముంపునకు గురవుతున్నాయి.

పిఠాపురం పరిధిలో మూసేసిన పంట కాలువ

చర్యలు తీసుకుంటున్నాం..

కాలువల ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడుతున్నాం. జిల్లా స్థాయిలో వాచ్‌డాగ్ కమిటీ పర్యవేక్షిస్తోంది. రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణలో కబ్జాలు అరికడుతున్నాం.

– సంతోష్‌కుమార్, డీఈ, వరప్రసాద్, ఏఈ

రహదారుల బాగుకు నిధులొచ్చాయ్..!

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని ర.భ.శాఖ రహదారుల వార్షిక మరమ్మతుల్లో భాగంగా గుంతల పూడ్చివేతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.70 కోట్లు విడుదల చేసింది. కాకినాడ, పెద్దాపురం డివిజన్‌ల పరిధిలో గుంతల పూడ్చివేత పనులకు అధికారులు చర్యలు చేపట్టారు. తుపాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న రహదారులపై గోతులు పూడ్చివేసేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలో పలు రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి నాబార్డు నుంచి పెద్దఎత్తున నిధులు మంజూరయ్యాయి. వీటికి టెండర్లు పిలిచి, ఒప్పందం చేసుకుంటున్నారు. ఎస్ఈ జి.కంఠను 'న్యూస్‌టుడే' సంప్రదించగా గతేడాది జిల్లాలో రూ.10.98 కోట్లతో రహదారులకు మరమ్మతులు చేశామన్నారు. వాటికి రూ.6 కోట్ల వరకు ప్రభుత్వం బిల్లులిచ్చిందన్నారు. కాకినాడ-సామర్లకోట, సామర్లకోట-వేట్లపాలెం కెనాల్ రోడ్డు మరమ్మతులు దాదాపు పూర్తి చేశామన్నారు.

పిల్లలకు గుండె పరీక్ష

మసీదు సెంటర్(కాకినాడ): జిల్లాలోని 18 ఏళ్ల లోపు వయసు కలిగిన పిల్లలకు ఉచితంగా గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డా.నరసింహనాయక్ బుధవారం తెలిపారు. పరీక్షలు ఈ నెల 21న కాకినాడ జీజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే విజయవాడకు చెందిన ఇండో బ్రిటిష్ ఆసుపత్రి సహకారంతో ఉచితంగానే శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు వారి పరిధిలో అలాంటి వారుంటే సిఫార్సు చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డా.అరుణ కోరారు.

పెద్దలకు ప్రత్యేక ఓపీ

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులకోసం ఈ నెల 23 నుంచి ప్రతి ఆదివారం ప్రత్యేకంగా జనరల్ మెడిసిన్ ఓపీ సేవలు ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ లావణ్యకుమారి బుధవారం తెలిపారు. సాధారణ పని దినాల్లో పెద్ద వయసువారు ఆసుపత్రిలో చికిత్సలు పొందేందుకు ఇబ్బందిపడుతున్నారని, వారి వెంట కుటుంబ సభ్యులూ రాకపోవడం గమనించామన్నారు. దాంతో వారికి ప్రత్యేకంగా ఓపీ నంబర్-4 బ్లాక్‌ను కేటాయించామన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సేవలు పొందవచ్చన్నారు. ఆయా రోజుల్లో స్వచ్ఛందంగా సేవలందించేందుకు విశ్రాంత ప్రొఫెసర్లను ఆహ్వానించగా అంగీకారం తెలిపారన్నారు.

కోటి వెలుగుల కోవెల

గొల్లప్రోలులోని ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తికమాస పూజల్లో భాగంగా బుధవారం రాత్రి కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. అల్లంరాజు ప్రదీప్‌శర్మ, వేద పండితులు పూజలు నిర్వహించారు. 108 ధమరుకాలు కోటి వత్తుల కుందులను వెలిగించారు. 108 జంటలుగా దంపతులు పాల్గొన్నారు. ఎస్సై రామకృష్ణ, ఆలయ కమిటీ ఛైర్మన్ పెదబాబి పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పంట.. పట్టు జారుతోంది..!

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

రెండేళ్లుగా పట్టు పురుగులు గూళ్లు కట్టక పంట తొలగించాల్సిరావడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో 1150 ఎకరాల్లో మల్బరీ తోటలు సాగు చేసి 250 షెడ్లలో పట్టు పురుగులు పెంచుతున్నారు. గతేడాది మాదిరిగానే ఆగస్టు 20వ తేదీ నుంచి అక్టోబరు నెలాఖరు వరకు పట్టు పురుగులు గూళ్లు కట్టని పరిస్థితులు ఏర్పడ్డాయి. మేత పూర్తి స్థాయిలో తిన్నా.. పురుగులు చివరి దశలో నెమ్మదిగా కదులుతూ, రంగుమారి చనిపోతున్నాయి. గూళ్లు కట్టకపోవడంతో రైతులు చేసేదిలేక షెడ్ల నుంచి పంటను తొలగిస్తున్నారు.

చేబ్రోలులో షెడ్డులో నుంచి తొలగిస్తున్న పట్టు పురుగులు

గూడు కట్టక పారేసిన పట్టు పురుగులు

రైతులు చెబుతున్న కారణమిదీ..

మల్బరీ తోటలకు, పట్టు పురుగుల షెడ్లకు పక్కనే ఉన్న పత్తి చేలపై పురుగుమందులు చల్లుతుండడం, ఆ ప్రభావం పట్టు పురుగులపై పడుతోందని రైతులు వాపోతున్నారు. వరి పొలాలతో ఈ సమస్య రాలేదని చెబుతున్నారు.

వివరాలు (రూ.కోట్లలో)..

సంవత్సరం	రైతులు	నష్టం
2024	99	1.50
2025	67	1.23

పరిశోధన చేస్తున్నాం..

మల్బరీ తోటల పక్కనున్న పంటలపై అధిక గాఢత కలిగిన పురుగు మందులు పిచికారీ చేసే సమయంలోనే ఇక్కడి పట్టు పురుగులు గూళ్లు కట్టడం లేదు. రైతుల ఫిర్యాదుతో సమగ్రంగా పరిశోధన చేస్తున్నాం. మైసూర్‌కు చెందిన శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించారు.

– డాక్టర్ భువనేశ్వరి, శాస్త్రవేత్త

MANAGEMENT-ADMISSIONS 2025-2026
❖1st Year of 3 Year LL.B.
❖1st Year of 5 Year B.A. LL.B.
CONTACT ON OR BEFORE 21-11-2025
P.S.R. LAW COLLEGE
TURANGI, KAKINADA-16
Call: 0884-2376654, 8639809250

ఎటువంటి కోత లేకుండా లేజర్ చికిత్స
Dr. Nitin Rimmalapudi, M.S.
Laser & Laparoscopic Surgeon
అపాయింటుమెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం
APEX HOSPITALS LASER CENTRE
ప్రకాష్ నగర్, రాజమండ్రి | 0883-2449191

అమృతమూర్తికి అశ్రునివాళి



మా అందరికీ ఆత్మీయత, అనురాగాలను పంచి, మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి, మాకు ఆదర్శమూర్తిగా నిలిచిన మీరు మా నుండి భౌతికంగా దూరమవడం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...

స్వ॥శే॥ శ్రీ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు గారు
B.E.(Mech.) MISTE
Retd. Principal & Joint Director
Dept. of Technical Education
జననం : 01-01-1942 మరణం: 18-11-2025

భార్య : తమ్మిశెట్టి విజయలక్ష్మి
కుమారులు: తమ్మిశెట్టి సత్యవల్లీ శ్రీనివాస్; Dr. తమ్మిశెట్టి వరాహ సత్యసాయిరాం
కోడళ్లు: పద్మావతి; Dr. లలిత నాగప్రియ
కుమార్తె: రాసాబత్తుల చిరంజీవి
అల్లుడు: సూర్యనారాయణ
మనుమలు, మనుమరాండ్రు మరియు కుటుంబసభ్యులు

అంత్యక్రియలు: ది. 20-11-2025 గురువారం ఉ॥ 10 గం॥ల నుండి కాకినాడ, RTC బస్టాండ్ వెనుక, విజ్జపురెడ్డి హిందూ శ్మశాన వాటిక నందు జరుగును. ఫోన్: 79810 96345

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

ముఖ్యఅతిథులతో పతకాలు సాధించిన క్రీడాకారులు

ఉత్సాహంగా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆది కవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ వెయిట్‌లిఫ్టింగ్ మెన్, ఉమెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ డా.కందుల ఆంజనేయులు ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను డీసీపీ డీఎస్‌డీవో సతీష్‌కుమార్ ప్రారంభించారు. పీఆర్ కళాశాల నుంచి రెండు జట్లు పాల్గొనగా ఉమెన్స్ 8 పతకాలు, మెన్స్ 8 పతకాలు సాధించి 28 పాయింట్లతో రెండు జట్లు ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నాయి. రత్నాకరరావు, రమేష్‌బాబు, డా.ఎంబీఎస్ మూర్తి పాల్గొన్నారు.

అనుమతి లేని భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

గొల్లప్రోలు: అనుమతిలేకుండా కట్టిన, ప్లాను ఉల్లంఘించి కట్టిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు గొల్లప్రోలు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. 1985 జనవరి 1 నుంచి ఈఏడాది ఆగస్టు 31 లోగా నిర్మించిన భవనాలకు మాత్రమే ఈపథకం వర్తిస్తుందన్నారు. వచ్చే ఏడాది మార్చి 11 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, ప్రాథమిక రుసుము రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుచేయని భవనాల యజమానులకు జరిమానాలు విధించడంతోపాటు భవిష్యత్తులో పైఅంతస్తు నిర్మాణానికి అనుమతి ఇవ్వరన్నారు.

యూనివర్సిటీ కాలేజీ అఫ్ ఇంజినీరింగ్, కాకినాడ
జె.ఎన్.టి. యూనివర్సిటీ, కాకినాడ

మామిడి తోట ఫలసాయానికి ప్రకటన

ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్ విభాగం వారు కళాశాల ఆవరణలో ఉన్న మామిడి చెట్ల ఫలసాయమును కళాశాల నియమ నిబంధనలకు లోబడి అనుభవించు హక్కు కొరకు సీల్ వేసిన కొటేషన్లు ఆహ్వానించుచున్నారు. షెడ్యూల్ ధర రూ.2,500.00లు (అక్షరాలా రెండు వేల ఐదు వందల రూపాయలు) (జి.ఎస్.టతో కలిపి). జారీ చేయు ఆఖరి తేది ది.02-12-2025, దాఖలు చేయుటకు ఆఖరి తేది 03-12-2025 మధ్యాహ్నం గం.3.00ల వరకు. మిగతా వివరములు ఇంజినీరింగ్ విభాగం కార్యాలయం పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చును.

తేది: 19-11-2025 సం/- ప్రిన్సిపాల్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: డి.నెం: 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి వీధి, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101.

స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్) (గౌరవనీయులైన ఎన్.సి.ఎల్.టి చెన్నై ఆదేశాల మేరకు 09.11.2022న సి.పి.నెం: 69-76 ఆఫ్ 2022 [illegible]

ఋణగ్రహీత మరియు హామీదారుల ముఖ్య పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయిపున్న మొత్తం
1. బళ్ల రాంబాబు [illegible] 2. బళ్ల [illegible] 3. [illegible]	ఋణ ఖాతా నెం. MNDP1TF2403300005 ద్వారా రూ. 45,69,619/- [illegible] డిమాండ్ నోటీసు తేది: 01-08-2025

[illegible]

ఉత్తరం: 50.9 అడుగులు లేఅవుట్ కాంపౌండ్ గోడ.
ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమంతటికి ఇందుమూలంగా హెచ్చరిక చేయునది ఏమనగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క అధీకృత అధికారి పైన తెలిపిన స్థిరాస్తి చట్టబద్ధ స్వాధీన చేపట్టినందున, ఈ నోటీసు అందిన తర్వాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగానైనా లావాదేవీ జరపడం ద్వారా బదిలీ చేయడం / అన్యాక్రాంతం చేయరాదు.

తేది: 17.11.2025 అధీకృత అధికారి
ప్రదేశం: రాజమండ్రి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

క్రికెటోత్సవానికి వేళాయె..

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు కార్యాలయం, ఎన్‌హెచ్-16, హుకుంపేట, రాజమహేంద్రవరం-533107
వివరాలకు: 96666 31768
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
FM Partner TV Partner Digital Partner Organised by

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

పరిశోధనలకు గొప్ప అవకాశం

గాంధీనగర్, న్యూస్‌టుడే: పరిశోధన రంగంలో జేఎన్‌టీయూకేతో కలిసి ఐఈఈఈ-ఈబీఎస్‌సీవోలు పనిచేయడం విద్యార్థులు, అధ్యాపకులకు గొప్ప అవకాశమని వీసీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం భవిష్యత్తులో ఉత్తమ నైపుణ్యాలు అంశంపై ఈసీఈ గ్యాలరీ హాల్లో కార్యశాల నిర్వహించారు. రిజిస్ట్రార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థాగత ర్యాంకింగ్‌ల మెరుగు, పరిశోధనల ప్రభావాలను వివరించారు. ఐఈఈఈ ప్రతినిధి కొల్లిన్ డ్మెల్లో, ఈబీఎస్‌సీవో తరఫున వినోద్‌కావ్, మంజునాథ్, ధనుకుమార్, శ్రీనివాస కుమార్ సాంకేతిక అంశాలను వివరించారు. యూసీఈకే ప్రిన్సిపల్ మోహనరావు, ఈసీఈ హెచ్‌వోడీ లీలాకుమార్ పాల్గొన్నారు.

కార్యశాలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్ తదితరులు

అనుమానిత ప్రదేశాలు, వ్యక్తులపై నిఘా

జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా అనుమానిత వ్యక్తులు, రహస్య ప్రదేశాలపై నిఘా ఉంచినట్లు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లు తెలిస్తే సమాచారం అందించాలని ప్రజలకు సూచిస్తున్నారు. గ్రామ శివారుల్లో ఉన్న భవనాల్లో నివాసం ఉంటున్న వారి సమాచారం సేకరిస్తున్నారు. తెలియని వ్యక్తులు, ఇతర రాష్ట్రాల నుంచి ఎవరైనా వచ్చి ఇల్లు అద్దెకు అడిగితే తమకు సమాచారం అందించాలని పోలీసులు హెచ్చరికలు చేస్తున్నారు. ఇటీవల జగనన్న కాలనీలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆరుగురు వ్యక్తులు, రెండు వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరు ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ ప్రాంతాల నుంచి వచ్చి రోడ్ల పక్కన ఉన్న పశువులను రాత్రిపూట దొంగిలించి వాహనాల్లో తరలించుకుపోతున్నట్లుగా సమాచారం. విషయాన్ని తెలుసుకున్న సీఐ సిబ్బందితో నిఘా ఉంచి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు కస్టడీలో ఉంచినట్లు తెలుస్తోంది.

జగ్గంపేట జగనన్నకాలనీలో డ్రోన్‌తో పరిశీలన

అతి వేగం.. లేదు కళ్లెం

● ట్రావెల్ బస్సులకు వేగ నియంత్రణ తప్పనిసరి

గండేపల్లి, తొండంగి, శంఖవరం, న్యూస్‌టుడే: సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవాలని, సులభతరమైన ప్రయాణమని ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తే ప్రాణాలమీదకు తెస్తున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. హైవేపై అతి వేగం తోటి వాహనదారుల, ప్రయాణికుల ప్రాణాలు బలిగొంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కువ ప్రమాదాలు బస్సుల అతివేగం, నిద్ర మత్తుకు తోడు హైవేల నిర్వహణలోపం వల్లనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో చోటుచేసుకున్న ఘటనలివీ..

- జూన్ 12న రాజమహేంద్రవరం- విశాఖపట్నం వైపుగా వెళ్తున్న బస్సు గండేపల్లి మండలం పరిణయ ఫంక్షన్ హాలు వద్ద టైరు పేలింది. 50 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.
- సెప్టెంబర్ 9న రాజమహేంద్రవరం వైపు నుంచి వేగంగా వచ్చిన ట్రావెల్ బస్సు తాళ్లూరు దాబాల వద్ద మల్లేపల్లి గ్రామానికి చెందిన మదపాటి సూరిబాబును ఢీ కొట్టడంతో ఘటనాస్థలంలో మృతి.
- ఆగస్టు 28న విశాఖపట్నం వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు మల్లేపల్లి వద్ద ముందు వెళ్తున్న కంటెయినర్‌ను బలంగా ఢీ కొట్టింది. నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి.
- రెండు నెలల కిందట విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు కత్తిపూడి సమీపానికి వచ్చేసరికి ద్విచక్రవాహనదారుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు.
- 2024లో రాజమహేంద్రవరం- విశాఖ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు కత్తిపూడి వంతెన వద్ద ముందు వెళ్తున్న బస్సును ఢీ కొట్టింది. ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి.

జగ్గంపేటలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పరిష్కార మార్గాలివీ..

ట్రావెల్ బస్సులు పరిమిత వేగంతో ప్రయాణించాలి ● ప్రతి బస్సుకు ఇద్దరు చోదకులు ఉండాలి. నాలుగు గంటలకోసారి డ్రైవర్లు మారాలి. డ్రైవింగ్ లో చరవాణులు వాడరాదు. మూడు నెలలకోసారి నేత్ర పరీక్షలు చేయించుకోవాలి. ● బస్సుకు సరిపడా ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకోవాలి. ప్రతి బస్సుకు అత్యవసర ద్వారం ఉండాలి. ● కూడళ్ల వద్ద వాహనం నెమ్మదిగా పోవాలి. బస్సులో సుత్తి తదితర పరికరాలు అందుబాటులో ఉంచాలి. ప్రమాదాలు సంభవించే సమయంలో అలారం మోగే చర్యలు ఉండాలి. వేగ నియంత్రణ చేసే విధంగా లాకింగ్ ఉండాలి.
– ప్రసాద్, ఆర్టీవో, పెద్దాపురం

ఇఫీ జ్యూరీ సభ్యుడిగా నామన

రామదాసునాయుడు

కరప: గోవాలో ఈనెల 20 నుంచి 28 వరకు జరిగే భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేడుక (ఇఫీ) హాకథాన్/ఏఐ ఫిలిం విభాగం జ్యూరీ సభ్యుడిగా కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురుకు చెందిన దర్శక, నిర్మాత నామన రామదాసు నాయుడు నియమితులయ్యారు. కేంద్ర, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు ఆయన అందుకున్నారు. దాదాపు 40 ఏళ్లుగా సినీ, టీవీ రంగాల్లో ఆయన దర్శక, నిర్మాతగా రాణిస్తున్నారు. గతంలో ఏపీ నంది అవార్డుల కమిటీ జ్యూరీ సభ్యుడిగా, అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం కమిటీ సభ్యుడిగా, ఏపీ చలన చిత్ర అభివృద్ధి సంస్థ సభ్యుడిగా సేవలు అందించారు.

బాలల హక్కులు కాపాడుతాం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ర్యాలీని అసిస్టెంట్ కలెక్టర్ మనీషా జెండాఊపి ప్రారంభించారు. బాలల హక్కులు కాపాడుతామని, నేటి బాలలే రేపటి పౌరులని, వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలలతో భిక్షాటన తదితరాలను అరికట్టాలని ప్లకార్డులు ప్రదర్శించారు. దాడుల నిరోధానికి హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబరు 1098, 112లకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మి, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారిణిలు శోభారాణి, లల్లి, జిల్లా బాలల పరిరక్షణాధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, చిత్రంలో అధికారులు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్, న్యూస్‌టుడే: వెబ్ డెవలపర్, క్లౌడ్ కంప్యూటింగ్ విత్ అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి విభాగం అధికారి గోపీకృష్ణ బుధవారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శిక్షణ ఉంటుందని, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని, వివరాలకు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ శివరామకృష్ణను సంప్రదించాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా క్వారీ నిర్వహణ చేపట్టాలి

రౌతులపూడి, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్వారీ నిర్వహణ చేపట్టి అభివృద్ధికి సహకరించాలని పలువురు కోరారు. క్వారీ నిర్వహణకు ఎస్కే టెర్రా మైన్స్, మినరల్స్ తరఫున బాట్లంకి స్వామి కిరణ్‌పాల్ చేసుకున్న దరఖాస్తుపై రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాల శివారున బుధవారం ఈఈ శంకర్రావు ఆధ్వర్యంలో పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఎస్.పైడిపాల, తిరుపతమ్మపేట, ములగపూడి, డి.పైడిపాలల్లో నల్లరాయి క్వారీల నిర్వహణ కార్యాచరణను హుబర్ట్ ఎన్విరో కేర్ సిస్టమ్స్ ప్రతినిధి సురేంద్ర సభలో తెలియజేశారు. క్వారీ లారీల రవాణాకు ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉపప్రణాళికా ప్రాంత అభివృద్ధికి సహకరించాలని స్థానికులు కోరారు. తిరుపతమ్మపేటలో సర్వే నంబరు 90లో క్వారీ నిర్వహించబోయేది ఏ ప్రాంతమో మ్యాపులో చూపాలని మండల సాధకుడు రెడ్డి బుల్లిఅబ్బాయితో సహ పలువురు అధికారులను అడిగారు. సీఎస్సార్‌లో భాగంగా సోలార్ దీపాల ఏర్పాటు, ఆసుపత్రిలో మరుగుదొడ్ల నిర్మాణం, ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు రూ.9 లక్షలు, ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు రూ.1.5 లక్షలు ఖర్చు చేస్తామని సభలో వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు గొల్లు చిన్నదివాణం, తహసీల్దారు ఎస్వీనరేష్, ఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు

మహిళ మృతిపై విచారణ పూర్తి

మసీదు సెంటర్(కాకినాడ): హెర్నియాకు శస్త్రచికిత్స చేసిన కొద్దిసేపటికే జీజీహెచ్‌లో పిఠాపురం రథాలపేటకు చెందిన కవిత (20) ఈనెల 15న మృతిచెందడంపై బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రి వైద్యాధికారులు ముగ్గురితో విచారణ కమిటీని నియమించారు. ఎనస్తీషియా హెచ్‌వోడీ డా.ప్రసన్నకుమార్, సర్జరీ హెచ్‌వోడీ డా.నరేష్, సీఎస్ఆర్ఎంవో డా.కోమల సర్జరీచేసిన వైద్యులు, సిబ్బందిని విచారించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. శస్త్రచికిత్స సమయంలో ఆమె మానసిక ఆందోళనకు గురైందని, ఆ కారణంగా చనిపోయి ఉండొచ్చని విచారణ బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

నిర్బంధంలోని మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలి

గాంధీనగర్: అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్లను భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఖండిస్తోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. కాకినాడ, ఏలూరు, విజయవాడల్లో నిర్బంధంలోకి తీసుకున్న మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలని ఆర్‌సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు.

జీజీహెచ్‌లో 15 ఏళ్ల గర్భిణి

మసీదు సెంటర్(కాకినాడ): యు.కొత్తపల్లి మండలంలోని సుబ్బంపేటకు చెందిన 15 ఏళ్ల బాలికకు వివాహం కాలేదు. ప్రస్తుతం ఆమె రెండు నెలల గర్భిణి. దాంతో బుధవారం జీజీహెచ్‌లోని గైనిక్ వార్డులో చేర్చారు. సంబంధిత వైద్యులు జీజీహెచ్ అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మెడికో లీగల్ కేసు నమోదు చేశారు. తెలిసిన వ్యక్తి ఆమెను మాయమాటలతో మోసం చేసినట్లు సమాచారం.

ద్విచక్ర వాహనాల చోరుడికి ఆరు నెలల జైలు

మసీదుసెంటర్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో అదనపు జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి డి.శ్రీదేవి బుధవారం తీర్పు చెప్పారని కాకినాడ ఒకటో పట్టణ సీఐ నాగదుర్గారావు తెలిపారు. పిఠాపురానికి చెందిన కె.లోవరాజు ప్రస్తుతం సర్పవరంలో నివాసం ఉంటున్నాడు. ఇతను 2025లో కాకినాడ జీజీహెచ్‌లోని పలుచోట్ల నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు ఏడు కేసులు నమోదు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	21,000
కురిడీ (వెయ్యింటికి): పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	18,000-19,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	111-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

EENADU e Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION
B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 99121 78237.
BPT/B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/Dialysis - Courses in Vijayawada - MGT/ Convener Quota. ✆ 79959 45835.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
తాళ్లపూడి, ఆంధ్రాబ్యాంక్ రోడ్ సూర్య ఇ.మీ. స్కూల్ ఎదురుగా 139/ 125.66/ 173.94/ 122.44/ 143.11 గ॥ స్థలం అమ్మకం. ✆ 83090 25067.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీ పెట్టుబడికి, గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. Contact Cell: 9949000033.

JOBS
WANTED STAFF: Ravindra High School, Exp. High School Teachers for English, Social, Science & Telugu, B.Tech. Graduates eligible. Sal: 20K to 22K, Location: Madiki, Vemagiri. ✆ 95334 31103, 91105 67164.
లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.
★ టెలికాలర్స్ ★ కంప్యూటర్ ఆపరేటర్ (F) ★ ఆఫీస్ అసిస్టెంట్ (M) కావలెను. జీతం: 10,000 to 25,000/-. 2 వీలర్ లోన్స్, రాజమండ్రి, Contact Cell: 85006 44978, 93461 45948.
రాజమండ్రిలో ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు ★ చెఫ్స్ ★బిర్యాని & చైనీస్ మాస్టర్ ★ వెయిటర్ ★ రిసెప్షనిస్ట్ ★ అకౌంటెంట్ కావలెను. Contact: 93462 97988.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-38 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- కాంత, ప్రిడేటర్, బాహుబలి ది ఎపిక్, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- కాంత, ఆర్యన్, మాస్ జాతర, లక్ష్మి- శివ, సత్యగౌరి- గోపీ గళ్ల గోవా ట్రిప్, తిరుమల- సంతాన ప్రాప్తిరస్తు, సిలాండ్స్1- జటాధర, సిలాండ్స్ 2- జిగ్రీస్, శ్రీప్రియ- మాస్ జాతర, పద్మప్రియ- ది గర్ల్‌ఫ్రెండ్, సూర్య1(వాకలపూడి)- మాస్ జాతర, సూర్య 2- జటాధర.

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా- 27, వంకాయలు- 66, 68, 70, 80, బెండకాయలు- 60, పచ్చిమిర్చి- 38, 45, కాకరకాయ- 50, బీర- 60, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 36, క్యారెట్- 60, దొండకాయలు- 66, బంగాళాదుంప- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుళ్లు- 36, దోసకాయలు- 38, చిక్కుళ్లు- 96, 110, చేమదుంపలు- 30, 34, బీట్‌రూట్- 50, కీరదోస- 40, బీన్స్‌కాయలు- 50, అల్లం- 70, క్యాప్సికం- 86, బొప్పాయి- 60, పెండలందుంపలు- 35, 38, ఒకటి చొప్పున ఆనపకాయ- 35, 40, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 6, 8, మునగకాడ- 12, 13, మామిడికాయ- 12, 15, నిమ్మకాయలు(డజన్) - 24, 30.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వీధి దీపం వెలిగింది..

కాకినాడ శాంతినగర్ సంజీవ్‌రావునగర్‌లోని మూడు రోడ్ల కూడలి వద్ద వీధి దీపం వెలగడం లేదు. రాత్రి చీకటి కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను నగరపాలక సంస్థ ఏఈ అర్జున్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

స్పందనకు సంతసం

చెత్త తరలించడం లేదు..

మూడో డివిజన్ పరిధి సురేష్‌నగర్ ఉద్యానం వెనకవైపు నడక దారిలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నెలరోజులైనా వాటిని తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చెట్ల కొమ్మలు తొలగించండి..

గొడారిగుంట సచివాలయం దారిలో చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వేలాడుతున్నాయి. రాకపోకల సమయంలో కొమ్మలు తగిలి గాయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పోషణ వాటికలు.. ఆరోగ్య కేంద్రాలు

- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మాతాశిశు సంరక్షణకోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు పాఠాలు నేర్పించడంతో పాటు పోషక విలువలు సమృద్ధిగా ఉండే ఆహారం అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక ఆహార పదార్థాలు అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ అంగన్‌వాడీ ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లోనే పోషణ వాటికలు ఏర్పాటు చేసి ఆకు కూరలు, కూరగాయలు సాగుచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతూ ఇందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది.

నగరంలోని కొత్తకాకినాడ కేంద్రంలో సాగు చేస్తున్న ఆకుకూరలు

సేంద్రియ పద్ధతిలో పండిస్తూ..

అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు విద్యాబుద్ధులు చేర్పించడంతో పాటు పోషకాలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో వండిన మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఇటీవల వ్యవసాయంలో రసాయనాల వాడకం అధికం కావడంతో ఆకుకూరలు విషతుల్యమవుతున్నాయి. ఇటీవల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను సేంద్రియ విధానంలో సాగు చేసేలా చర్యలు చేపట్టారు. తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకు కూరలతోపాటు అరటి, బెండ, టమాటా, వంకాయ వంటివి పండిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం ఇలా..

అర్బన్‌లో కేంద్రాలు	253
పోషణ వాటికలు ఉన్నవి	17
ఒక్కో కేంద్రానికి నిధులు	రూ.10 వేలు
ప్రస్తుతం అమలు చేస్తున్న కేంద్రాలు	17
గర్భిణులు	1952
బాలింతలు	2001
మూడేళ్లలోపు పిల్లలు	10,105
3-6 ఏళ్ల చిన్నారులు	7305

మరిన్ని కేంద్రాల్లో..

స్థలాలు అనువుగా ఉన్న కేంద్రాల్లో మొదటి విడతగా ఏర్పాటు చేసిన పోషణ వాటికలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని కేంద్రాల్లో వాటికలు ఏర్పాటు చేస్తాం. విటమిన్లు అందించే పండ్ల మొక్కలతోపాటు ఔషధ గుణాలున్న మొక్కలు పెంచేలా చర్యలు చేపడతాం. - ఎ.జ్యోతి, సీడీపీవో, అర్బన్ ప్రాజెక్టు

23న యూనియన్ ఎన్నికలు

మసీదు సెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్ కాకినాడ శాఖ ఎన్నికలు, జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని సంఘ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వామిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సాయిసత్యనారాయణ, గిరిబాబు ఇతర సభ్యులు హాజరవుతారన్నారు. జిల్లా యూనియన్ సభ్యులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో వైద్యఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని, పరిష్కారాలకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఎన్నికలకు సంబంధించి ఈ నెల 22లోపు నామినేషన్ వేయాలన్నారు. ఎన్నికల అధికారిగా పీవీవీ సుబ్బారావు(రాష్ట్ర కార్యదర్శి)ను నియమించారన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు రండి

గాంధీనగర్: గుంటూరులో జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరుకావాలని జేఎన్‌టీయూకే ఉపకులపతి ప్రసాద్‌కు విశ్వసాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు తురగా సూర్యారావు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాసు ఆదేశాలతో వీసీని ఆహ్వానించామని సూర్యారావు తెలిపారు.

ఘనంగా పురుషుల దినోత్సవం

కాకినాడ నగరం: అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని బుధవారం జగన్నాథపురం పరదేశమ్మపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయినిల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు నార సంచులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయినిలు కనకమహాలక్ష్మి, చంద్రకళ, జ్యోతిర్మయి, రాజేశ్వరి, వనజ తదితరులు పాల్గొన్నారు.

మహిళల విద్యతో ఒక తరానికి మేలు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

గాంధీనగర్: ఒక మహిళ విద్యావంతురాలైతే ఒక తరానికి మేలు చేకూరుతుందని, మహిళలకు అవకాశమిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం

కాకినాడ కలెక్టరేట్: భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు కొనియాడారు. బుధవారం జగన్నాథపురంలో ఇందిరమ్మ జయంతిని కాకినాడ నగర నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి చెక్కా నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పబ్బినీడి కృష్ణ, మొయ్యేటి సూర్యప్రకాశరావు, తాళ్లూరి రాజు, దవులూరి లలిత, పోలిశెట్టి శ్రీనివాస్, తుమ్మలపల్లి చిన్న, జి.వీరేంద్ర, శేరు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌నగర్‌లో కార్తిక వన సమారాధన

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ మూడో డివిజన్ పరిధి సురేష్‌నగర్ ఉద్యానంలోని ధ్యాన మందిరంలో బుధవారం కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. సురేష్‌నగర్, శాస్త్రినగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లాయర్ బుజ్జి, కార్యదర్శి ఎన్ వీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో వన భోజనాలు ఏర్పాటు చేశారు. మహిళలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మాట్లాడుతున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

సనాతన ధర్మ పరిరక్షణ యాత్ర ప్రారంభం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ కోరుతూ కాకినాడకు చెందిన కోడి సీతారామయ్య పాదయాత్ర తలపెట్టారు. కాకినాడ నుంచి అన్నవరం వరకు 200 మందితో చేస్తున్న యాత్రకు కాకినాడలో బుధవారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు స్వాగతం పలికారు.

ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర పరిధిలో ఆస్తి, నీటిపన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ సుధాకర్ తెలిపారు. వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నామని, ఇందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం సహకరించాలని కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, నోడల్ అధికారులు, ఇతర సిబ్బందితో సుధాకర్ సమీక్ష నిర్వహించారు. ఉపకమిషనర్ కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. పాత, కొత్త పన్ను బకాయిలు కలిపి రూ.40 కోట్ల వరకు పేరుకుపోయాయన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

కార్యక్రమంలో కొండబాబు, చిత్రంలో నాయకులు, రైతులు

కాకినాడ నగరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల జమ కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. అర్బన్ పరిధిలో రైతులనుద్దేశించి కొండబాబు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రైతులను అన్నివిధాలా మోసగించిందన్నారు. ఆగస్టు నెలతో కలిపి ఇప్పటికి రూ.14 వేలు రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కించుకుందన్నారు. బచ్చు శేఖర్, బడేటి దేవి, మల్లిపూడి వీరు తదితరులు మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పీఎం, సీఎంల ప్రసంగాలు వినేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. తహసీల్దార్ జితేంద్ర, ఉప తహసీల్దార్ కృష్ణకుమారి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూడిక తీయించారు..

మసీదుసెంటర్: కాకినాడ సూర్యారావుపేటలోని భారతమాత సెంటర్ వద్ద రహదారి పక్కన కాలువలో మురుగు కదలకుండా ఉంది. దాంతో దుర్వాసన వ్యాప్తిచెందడంతోపాటు దోమలు వ్యాప్తిచెంది వ్యాధుల బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో మురుగు పారేదెలా..? శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

ఈనాడు కథనాలకు స్పందన

ప్రమాదం తప్పించారు..

మసీదు సెంటర్: కాకినాడ పల్లంరాజునగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి ఉన్న ఫ్యూజు బాక్సుకు మూత లేకపోవడంతో తీగలు బయటకు కనిపిస్తూ చేతికి అందే ఎత్తులో ప్రమాదంగా ఉన్నాయి. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో అపాయం తప్పించండి.. శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు మూత ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు కాకినాడ జిల్లా, కాకినాడ పట్టణం, RR నగర్, డో.నెం. 70-10-1 A/12, కాపురస్తులు పినిశెట్టి రంగారావు గారి కుమారుడు భాస్కర రావు గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి ఇచ్చుచున్న పబ్లిక్ నోటీసు.

జ్యోతుల వెంకటరావు వగైరాలు గుంటముక్కల జోగిరాజు గారికి కాకినాడ సూర్యారావుపేట గ్రామం స.నెం.346రు దాఖలా ఎ 4.00 సెంట్లు భూమిని ది.22-12-1937 తేదీన ద.నెం.4413/1937రుగా రిజిష్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా విక్రయించి యున్నారు. జ్యోతుల వెంకటరావు వగైరాలు ది.03-01-1938 తేదీన ద.నెం.15/1938రు రీత్యా ఎ 3.00 సెంట్ల భూమిని గుత్తుల శేషయ్య అతని కుమారులు అప్పన్న గార్లకు విక్రయించియున్నారు.

గుంటముక్కల జోగిరాజు గారి అనంతరం వారి కుమారులు చక్రం, రమణారావు, వారి సంతతి ది.26-08-1989వ తేదీన గుంటముక్కల చక్రం గారి పేరిట ఎ 3.17 సెంట్ల భూమికి జనరల్ పవర్ వ్రాయించి ద.నెం.368/1989రుగా రిజిష్టర్ చేయించియున్నారు. సదరు ఎ 3.17 సెంట్ల మరియు గుత్తుల శేషయ్య గారి అనంతరం వారి వారసులు తమ తాలూకు ఎ 0.64 సెంట్ల భూమిన్నీ మొత్తం ఎ 3.81 సెంట్ల భూమిని ఇతరుల భూమితో కలిపి LP No.101/89 రు గా ఇండ్ల స్థలములుగా విభజించగా అందలి ప్లాట్ నెం.205రు దాఖలా 375 చ.గల స్థలమును గుంటముక్కల జోగిరాజు, గుత్తుల శేషయ్య గారల వారసుల వద్ద నుండి వెంపటి వెంకటేశ్వర్ గారు ది.06-01-1990 తేదీన కాకినాడ రిజిస్ట్రార్ వారి ఆఫీస్ నందు ద.నెం.111/1990రుగా రిజిస్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా క్రయం పొందియున్నారు.

దరిమిలా వెంపటి వెంకటేశ్వర్ గారు ది.31-05-1998తేదీన కాలం చేయగా వారి భార్య బాప పరలక్ష్మి, కుమార్తె రాజ్యలక్ష్మి, కుమారుడు కృష్ణ చైతన్య గారల వద్ద నుండి సదరు ప్లాటును బడే ఎల్లాజీరావు గారు ది.27-03-1999 తేదీన ద.నెం.1854/1999రుగా రిజిస్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా క్రయం పొంది అప్పటి నుండి సంపూర్ణ హక్కులతో అనుభవిస్తూ యున్నారు. దరిమిలా వెంపటి వెంకటేశ్వర్ గారి తల్లి అయిన కనక దుర్గ గారు కూడా ఇప్పటికి 25 సంవత్సరాల క్రితం కాలం చేసియున్నారు. బడే ఎల్లాజీరావు గారి వద్ద నుండి సదరు ఆస్తిని క్రయం పొందుటకు ఏర్పరచుకొని యున్నారు.

కావున సదరు క్రయ వ్యవహారం పట్లనూ, బడే ఎల్లాజీరావు గారికి సదరు ఆస్తి పట్ల గల హక్కుల పట్లనూ ఎవరికి ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ, ఈ నోటీసు ప్రచురణ తేదీ లగాయతు 10 రోజులు లోగా మాకు తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. లేని యెడల మా క్లయింటు సదరు ఆస్తిని నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా భావించి తన పేరిట గాని, తన వారి పేరిట గాని క్రయం పొందెదరు. తదుపరి ఎట్టి క్లయములు మా క్లయింటును బైండు చేయజాలవు. సదరు ఆస్తి పట్ల చెల్లనేరవు.

షెడ్యూలు: తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ సబ్-రిజిస్ట్రార్ ఏరియా, ప్రస్తుతం సర్పవరం సబ్-రిజిస్ట్రార్ ఏరియా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, బ్లాక్ నెం.70, వార్డు నెం.30, శశికాంత్ నగర్, LP No.101/89 రు నందలి, ప్లాట్ నెం.205రు దాఖలా 375 చ.గల స్థలముకు హద్దులు కొలతలు వివరం. తూర్పు: 75' ప్లాట్ నెం.206రు స్థలం. దక్షిణం: 45' లేఅవుట్ ప్లాన్ దాఖలా రోడ్డు. పడమర: 75' ప్లాట్ నెం.204రు స్థలం. ఉత్తరం: 45' ప్లాట్ నెం.196రు స్థలం. సదరు హద్దుల మధ్యస్థమైన 375 చ.గల స్థలం అందలి సర్వం సహా..

పేపకాయల రామకృష్ణ,
మల్లిపూడి సత్యనారాయణ, మాగాపు చైతన్య కుమార్, అడ్వకేట్స్
కాకినాడ. ది.19-11-2025 మెహర్ భవన్, రామారావుపేట, కాకినాడ. సెల్: 9440178750

డ్రెయిన్ నిర్మించారు.. రక్షణ గోడ మరిచారు

కొండయ్యపాలెం ఫైవంతెన శారదాంబగుడి సమీపంలో ఉన్న చీడీలపొర ప్రధాన డ్రెయిన్‌కు రక్షణ గోడ ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 500 మీటర్ల పొడవున ఉన్న దీని పక్కనే రహదారి ఉంది. దానికి ఆనుకుని వందల గృహాలున్నాయి. చిన్నపిల్లలు ఆడుకునే సమయంలో పొరపాటున ఈ డ్రెయిన్ వద్దకు వెళితే పడిపోయే ప్రమాదం ఉంది. పశువులకు ఇక్కడ రక్షణ లేకుండా పోతోంది. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

దారంటే అందరిదీ కదా..?

కాకినాడ శాంతినగర్‌లోని శ్రీఅగస్త్య పాఠశాల దారిలో ఉన్న మూడురోడ్ల కూడలి వద్ద బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారు. ఇసుక రోడ్డుపైకి చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మలుపు కావడంతో వాహనదారులు పడిపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

ప్రజారోగ్యానికి పొగేల..

నగరంలో పలు చోట్ల కొందరు పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను తరలించకుండా ఎక్కడికక్కడే తగులబెడుతుండడంతో పొగతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాకినాడ పళ్లంరాజునగర్ ప్రధాన మార్గంలోని లక్ష్మీనగర్ వద్ద బుధవారం ఉదయం నాలుగైదుచోట్ల చెత్తకు నిప్పంటించడంతో భారీగా పొగ అలముకొంది. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఈ దీపం.. వెలగదా..

కాకినాడ శ్రీనగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన ఉన్న వీధి దీపం వెలగడం లేదు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ దారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఇలా చాలా ప్రాంతాల్లో సమస్య ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మసీద్‌సెంటర్

వైద్యుల సలహాతోనే యాంటీబయాటిక్స్ వాడండి

మసీదు సెంటర్(కాకినాడ): చికిత్సల్లో భాగంగా యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా, వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి సూచించారు. బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అవేర్‌నెస్ వీక్ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డా.లావణ్యకుమారి మాట్లాడుతూ ప్రజల్లో బాధ్యతాయుతమైన మందుల వినియోగంపై అవగాహన పెంచడం ఈ ర్యాలీ లక్ష్యమన్నారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డా. కోమల, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో డా. లావణ్యకుమారి తదితరులు

వేడుక సేవలో భాగం కావాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రతి వేడుక సమాజ సేవలో భాగం కావాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా.చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. హెల్త్‌అవేర్ సభ్యురాలు బాలాత్రిపుర సుందరి కుమార్తె సాయి జయమాధురి పుట్టినరోజు వేడుకలను స్థానిక భాస్కర్‌నగరలోని పరివర్తన అనాథ ఆశ్రమంలో బుధవారం జరుపుకొన్నారు. 60 మంది పిల్లలకు నూతన దుస్తులు బహూకరించారు.

చిన్నారులతో జయమాధురి, చిత్రంలో వెంకటేశ్వరరావు

మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం

మసీదసెంటర్, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బుధవారం కాకినాడ గ్రామీణంలో చోటుచేసుకుంది. రేపూరుకు చెందిన 23 ఏళ్ల యువతి ఇంటర్‌తో చదువు మానేసింది. ఇంట్లో పనులు చేయడం లేదని, చరవాణితోనే ఉంటోందని తండ్రి మందలించడంతో అధిక మోతాదులో మాత్రలు మింగింది. అస్వస్థతకు గురవ్వడంతో బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఉదాసీనత వద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వీధి శునకాలు, గోవులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో ఎలాంటి ఉదాసీనత వహించొద్దని సిటిజన్స్ ఇనీషియేటివ్ కార్యదర్శి దువ్వూరి సుబ్రహ్మణ్యం కోరారు. ఆ మేరకు ఆయన బుధవారం భాజపా నాయకులు మాలకొండయ్య, యార్లగడ్డ రామ్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని వీధి శునకాలకు శాశ్వత ఆశ్రయ గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. గోవులకు సంరక్షణ గృహాలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. సిమ్లా మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో వీధి శునకాలకు మున్సిపల్ క్యూఆర్ కోడ్, జీపీఎస్ అమర్చాలన్నారు.

విద్య, వైద్యానికి ఆర్థిక సాయం

ఉపకరణాలు అందిస్తున్న శ్రీనివాసరెడ్డి, బాదం బాలకృష్ణ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్(1978) ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులకు రూ.55 వేల ఉపకార వేతనాలు, రెటీనా వ్యాధితో బాధపడుతున్న కె.గోపాలరెడ్డికి రూ.25 వేల మందులు, జి.సత్యనారాయణకు రూ.50 వేల విలువైన వినికిడి యంత్రాలు, మహిళకు కుట్టుమిషన్‌ను రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి ఎం.శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ట్రస్టు ప్రెసిడెంట్ బాదం బాలకృష్ణ సేవలను ప్రశంసించారు.

అబాకస్ పోటీలో ప్రతిభ

సాంబమూర్తినగర్: కాకినాడ జగన్నాథపురంలోని నారాయణ ఇ-టెక్నో పాఠశాలకు చెందిన కర్రి నగేష్ అబాకస్ పోటీలో ప్రతిభ చాటాడు. ఈ నెల 16న చెన్నైలో ఎస్ఐపీ అబాకస్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన పోటీలో 3వ రన్నరప్‌గా నిలిచాడని ప్రిన్సిపల్ వీరభద్రరావు తెలిపారు. మొత్తం 5700 మంది పోటీలో పాల్గొన్నారన్నారు. పాఠశాలల ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ కోఆర్డినేటర్ సుంకర మూర్తి విద్యార్థిని అభినందించారు.

నగేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

శివారు కాలనీ.. సమస్యలు ఏలనీ..

న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

ఆకర్షణీయ నగరం కాకినాడ శివారు మూడో డివిజన్ పరిధిలోని శంతనపురి కాలనీ, వాడపేట ప్రాంతాల ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. సుమారు వెయ్యి మందికిపైగా జనాభా కలిగిన ఈ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది. మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, కల్వర్టులు దెబ్బతినడం, రహదారులు కుచించుకుపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్గత రహదారులుసైతం సరిగా లేవు. కానీ.. నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యే మురుగు పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారినపడుతున్నామని వాపోతున్నారు. తాగునీటి కుళాయిలు సరిగా లేవని, కొన్ని వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని చెబుతున్నారు.

శంతనపురి కాలనీ ప్రధాన రహదారిలో శిథిలమైన స్లాబురాళ్లు

ఉద్యానాలున్నా.. ఉల్లాసం కరవు..

ఇక కాలనీల్లో రెండు నగరపాలిక ఉద్యాన స్థలాలున్నాయి. ఒక ఉద్యానంలో ఆట పరికరాలు పూర్తిగా విరిగిపోయాయి. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి కళావిహీనంగా ఉంది. కొందరు ఆకతాయిలు పగలు, రాత్రిళ్లు తేడా లేకుండా ఉద్యానంలో మద్యం తాగి సీసాలు అక్కడే పడేస్తున్నారు. మరొక ఉద్యాన స్థలం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. పిచ్చిమొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయి. ద్వారం వద్ద చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉద్యాన స్థలంలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం

ఉచిత వినికిడి మరియు మాట సంబంధిత సమస్యలకు

అనుభవజ్ఞులైన డాక్టర్లచే పరీక్షలు

డా॥ కనుమూరి బాలకిరణ్, M.S. (ENT)
తమిళనాడు గోల్డ్ మెడలిస్ట్

ది.20-11-2025 నుండి 22-11-2025 వరకు
టైమింగ్స్: ఉ॥ 9 గం॥ల నుండి 1 వరకు మరియు సా॥ 5 గం॥ల నుండి 8 గం॥ల వరకు
ముందుగా పేరు నమోదు చేసుకోవలెను

- వినికిడి సంబంధిత సమస్యలకు డా॥ బాల కిరణ్ గారిచే ఉచిత కన్సల్టేషన్
- ఉచితంగా వినికిడి పరీక్షలు చేసి వినికిడి మిషన్ల ట్రయిల్స్ ఇవ్వబడును
- మాట మరియు స్వర సంబంధిత సమస్యలకు స్పీచ్ పాథాలజిస్ట్‌చే సలహాలు, సూచనలు
- మీరు ఉపయోగిస్తున్న పాత వినికిడి మిషన్లు ప్రోగ్రామింగ్ చేయబడును

శ్రీ బాల చెవి, ముక్కు, గొంతు హాస్పటల్
సెలెక్టెడ్ వినికిడి పరికరాల మోడల్స్‌పై 30-40% డిస్కౌంట్
చందన బ్రదర్స్ వెనుక, దంటు వారి వీధి, కాకినాడ. ఫోన్: 0884-2385499, 95733 36399

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ మండలం, కాకినాడ నగరం మెయిన్ రోడ్డు నందుగల శ్రీ తమ్మన వెంకటరత్నం సత్రం సంపూర్ణ హక్కుభుక్తములో గల D.No.28-1-53 & 54లో ఈ క్రింది ఉదహరించిన షాపులను లీజుకు ఇచ్చుటకు ది.05-12-2025 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు సదరు సత్రం వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షములో వ్యవస్థాపక ధర్మకర్తవారిచే బహిరంగ వేలము జరుపబడును.

వ. నెం.	షాపు నెం.	కొలతలు అడుగులలో	ప్రథమ ధరావతు	పాట తేది సమయం	పాట కాలపరిమితి
1	GF-3	10'X18'	50,000/-	05-12-2025 (శుక్రవారం) ఉ.10 గం.లకు	షాపు అప్పగించిన తేదీ నుండి 3 సం.ల కాలపరిమితికి
2	GF-6	10'X18'	50,000/-		

ముఖ్య షరతులు: 1) ఈ వేలం G.O.Ms.No.379 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంటు తేది. 11-03-2003ను అనుసరించి హిందూ దేవదాయ ధర్మదాయశాఖ ఉన్నతాధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ వారిచే నిర్వహించబడుచున్నది. దేవదాయ ధర్మదాయశాఖ హిందూ సంస్థ అయి ఉన్నందున హిందువులు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. ఈ వేలం మూడు సంవత్సరములకు మాత్రమే నిర్వహించబడును. 2) పాటలో పాల్గొను పాటదారులు పాట ఖరారైన వెంటనే ప్రథమ దరావతుతో కలిపి ఒక సంవత్సరం పాట సొమ్ము (పాడిన సొమ్ము)అడ్వాన్సుగా చెల్లించవలెను. 3) సీల్డ్ టెండరు వేయువారు సత్రము పనివేళలయందు టెండరు షెడ్యూలు తీసుకుని సీల్డ్ టెండర్లు ది.05-12-2025 ఉదయం 9 గంటల లోపులో ఇవ్వవలెను. టెండరు షెడ్యూలు ఖరీదు రూ. 200/-లు. 4) మిగిలిన పాట షరతులు, ఇతర వివరములు సత్రం ఆఫీసు పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కాకినాడ,
ది. 13-11-2025.
తమ్మన వెంకట సత్తిరాజు
వ్యవస్థాపక ధర్మకర్త, (73824 34133)

(c) eenadu

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

వైభవంగా రుద్ర సహిత చండీహోమం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులోని ఉమారామలింగేశ్వరస్వామివారి దేవస్థానం (శివాలయం)లో రుద్ర సహిత చండీహోమం వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులతో ప్రత్యేక పూజలు బుధవారం చేశారు. ఉదయం 6 గంటల నుంచి గణపతిపూజ, మండపారాధన, పారాయణం అనంతరం హోమం చేశారు. ఆలయకమిటీ ఛైర్మన్ గొల్లపల్లి పెద బాబి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంద్రపాలెం షష్ఠి ఏర్పాట్లపై సమీక్ష

సర్పవరం: ఇంద్రపాలెం గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 26న నిర్వహించే షష్ఠి మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు చెప్పారు. ఆలయ ఈవో జోగా సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామస్థులతో ఏర్పాట్లపై చర్చించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున త్వరగా దర్శనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాలు పార్కింగ్‌పై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.

మానసిక ప్రశాంతతకు వన సమారాధనలు దోహదం

కాజులూరు, న్యూస్‌టుడే: వనసమారాధనలు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని జిల్లా డ్వామా పీడీ అదపా వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం గొల్లపాలెం జిల్లా పరిషత్తు మామిడి తోటలో ఉద్యోగులు వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదపా వెంకటలక్ష్మి పాల్గొన్నారు. జిల్లాలో నిర్వహించిన క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుసేన్‌ను సత్కరించారు. పలువురికి మెమెంటోలు అందజేశారు. డీఎల్‌పీవో అన్నామణి, ఎంపీడీవో జె.రాంబాబు, గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ శ్రీనివాసరావు, ఏఈ పద్మరూప, పీఆర్‌జేఈ శంకర్, ఎంఈవో డేవిడ్, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ శ్రీనివాసులుకు వినతి అందజేస్తున్న స్థానికులు

దారికి మరమ్మతులు చేపట్టాలి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే : గొల్లప్రోలు పట్టణ మధ్యలో సూర్యుడు చెరువుగట్టుపై ఉన్న నడక దారి (వాకింగ్ ట్రాక్) వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ స్థానికులు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసులుకు బుధవారం వినతిపత్రం అందజేసి సమస్యలు విన్నవించారు. నడకదారిపై పిచ్చిమొక్కలు తొలగించి, విద్యుత్తు సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈమేరకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు.

జయంతి కార్యక్రమంలో కాలనీవాసులు

వీరవనిత ఝాన్సీలక్ష్మి

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ నగరం 2వ డివిజన్ దుర్గా విద్యుత్తునగర్ ఝాన్సీ లక్ష్మీబాయి ఉద్యానంలో కాలనీ సంఘం అధ్యక్షుడు గన్ని కృష్ణమూర్తి, కార్యదర్శి కొలగాని మూర్తి ఆధ్వర్యంలో వీరవనిత ఝాన్సీ జయంతి వేడుక నిర్వహించారు. జాతీయజెండా ఎగురవేసి జాతీయ గీతాలు ఆలపించారు. పలువురు చిన్నారులు ఝాన్సీలక్ష్మీబాయి, సుభాష్‌చంద్రబోస్ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

అసౌకర్యాల నడుమ వసతి గృహాలు

పరిశీలన

పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లోని బాలుర, బాలికల వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెద్దాపురంలోని ఎస్సీ జూనియర్ కళాశాల వసతి గృహంలో కిటికీల పరిస్థితి ఇది..

పెచ్చులు ఊడిపోయి..

పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలోని స్థానిక సుధాకాలనీకి శివారులో ఉన్న ఎస్సీ బాలుర జూనియర్ కళాశాలస్థాయి వసతి గృహం అధ్వానంగా దర్శనమిస్తోంది. గదుల్లో స్లాబ్ పెచ్చులు, కిటికీల తలుపులు ఊడిపోతున్నాయి. సుమారు 63 మంది విద్యార్థులు ఉంటారు. ● స్థానిక రామారావుపేటలోని బీసీ బాలికల వసతి గృహంలో సుమారు 50 వరకు విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నా.. కిటికీలకు దోమ తెరలు లేకపోవడంతో రాత్రుళ్లు విపరీతంగా దోమలు వస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారు.

చలికి తట్టుకోలేకపోతున్నారు

పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ సాంఘిక బాలుర వసతి గృహంలో 120 మంది విద్యార్థులున్నారు. మంచాలు లేక పోవడంతో ట్రంకుపెట్టెలపై జంఖానా వేసుకుని పడుకుంటున్నారు. దీంతో కింద నుంచి చల్లదనం వల్ల నిద్రపోలేక పోతున్నామని వాపోతున్నారు. కొందరు విద్యార్థులు పుస్తకాలు, దుస్తులు దాచుకునేందుకు ఇచ్చిన ఇనుప పెట్టెలపై పడుకుంటున్నారు. చదువుకునేందుకు గదులు లేవు. దీంతో ప్రతిరోజూ స్టడీ అవర్ ఆరుబయట వరండాలో జరుగుతుండడంతో చలికి తట్టుకోలేకపోతున్నారు.

పిఠాపురం వసతి గృహంలో చలిలో ఆరుబయట చదువుతున్న విద్యార్థులు

చేబ్రోలులోని కళాశాల బాలుర వసతి గృహంలో చాపలపై పడుకున్న విద్యార్థులు

చాపలపైనే నిద్ర

గొల్లప్రోలు: చేబ్రోలులోని కళాశాల బాలుర వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఆర్వోప్లాంటు లేక బోరు నీటిని తాగుతున్నారు. మంచాలు, దుప్పట్లు వంటివాటిని ప్రభుత్వపరంగా సరఫరా చేయలేదు. దీంతో చాపలపైనే విద్యార్థులు నిద్రిస్తున్నారు. గీజర్ లేక చన్నీటితోనే స్నానాలు చేస్తున్నారు. 139 మంది విద్యార్థులకుగాను 112 మంది హాజరులో ఉన్నట్లు వసతిగృహ అధికారి గంగాధర్ తెలిపారు. ● చేబ్రోలులోని కళాశాల బాలికల వసతిగృహంలో గతంలో రోటరీక్లబ్ అందించిన పరుపులపై విద్యార్థులు నిద్రిస్తున్నారు. రాత్రిపూట విద్యుత్తు సరఫరా నిలిచిపోతే అంధకార పరిస్థితులు నెలకొంటున్నాయి. 61 మంది విద్యార్థులకుగాను 48 మంది హాజరులో ఉన్నట్లు వసతిగృహ అధికారిణి కామేశ్వరి తెలిపారు.

రైతులకు రూ.6.86 కోట్ల సాయం

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలోని 10,047 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం రెండో విడత ఆర్థిక సాయంగా రూ.6.86 కోట్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. సర్పవరం జంక్షన్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రైతులకు చెక్కులు అందించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంపీపీ అనంతలక్ష్మి, ఎంపీడీవో సతీష్, ఏవోఏలు సత్యనారాయణ, సత్య, కార్పొరేషన్ డైరెక్టర్లు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ప్రకాష్‌గౌడ్, అప్పారావు, తెదేపా కోఆర్డినేటర్ వెంకట ప్రభాకర్, భాజపా పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు

సర్పవరం, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే పంతం నానాజీ చెప్పారు. రమణయ్యపేట ఏపీఎస్పీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్యవోలు శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం పీఎంశ్రీ నిధులు రూ.1.10 కోట్లతో నిర్మించిన భవనం, సైన్స్ ప్రయోగశాలలు, క్రీడా మైదానాన్ని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్ సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆ యూనిట్ హెడ్ కె.జగన్నాథన్‌తో కలిసి ప్రారంభించారు. తెలుగు ఉపాధ్యాయురాలు రామలక్ష్మి రూ.20 వేల విలువైన క్రీడా దుస్తులను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

పిఠాపురం, న్యూస్‌టుడే: అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పిఠాపురం అంబేడ్కర్ భవన్‌లో అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధులను విడుదల చేసే కార్యక్రమం ఏడీఏ స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 23,105 మంది రైతులకు రూ.15.02 కోట్లు ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పేరుతో రూ.15వేలు ఇచ్చేవారని, దానిని కూటమి ప్రభుత్వం రూ.5వేలు పెంచి రూ.20వేలు అందిస్తుందని పేర్కొన్నారు. జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఓదూరి కిషోర్, జ్యోతుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వాకపల్లి దేవి, ఏలేరు ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు ఊటా ఆదివిష్ణు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల అప్పారావు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వర్మ, తదితరులు

అమ్మవారికి పూజలు

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయం సమీపంలో ఉన్నత మడుగులమ్మ అమ్మవారిని పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, రైతు సంఘం నాయకులు కార్తిక మాసం సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా
ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య : చేబ్రోలులోని మల్లవరం రోడ్డు కూడలిలో చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

పరిష్కారం : పంచాయతీ కార్యదర్శి రాజు సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: స్థానిక వక్కలంకవారి వీధిలో మురుగు కాలువ శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద అధికంగా ఉంది. - రాజేశ్వరరావు, పెద్దాపురం

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలపగా కాలువలు శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: పిఠాపురంలోని బొజ్జా వారితోటలో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు రోడ్లపై చేరుతోంది. -రాంబాబు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆయా ప్రాంతాల్లో కాలువల్లో పూడికలు తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: ఉప్పాడ పంచాయతీ సూరాడపేటలో వీధి కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయి. - స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

పొగతో ఉక్కిరిబిక్కిరి

గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఎస్సీ పేటకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను తగలబెడుతూ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దట్టమైన పొగ రావడంతో సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీకి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. చెత్త తగలబెట్టకుండా పర్యవేక్షిస్తామని ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

రాకపోకలకు ఇక్కట్లు

పిఠాపురంలోని ఇందిరానగర్ వంతెన నుంచి మిరపకాయల వీధికి వెళ్లే మార్గంలో డ్రెయినేజీపై ఇటీవల కల్వర్టు నిర్మించి తవ్విన మట్టిని పక్కనే పడేశారు. దీంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. వాహన చోదకులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

గొల్లప్రోలులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు బుధవారం చేపట్టారు. ప్రధాన రహదారిపై జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి పోలీసు స్టేషన్ వరకూ పనులను నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు పనులను పర్యవేక్షించారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్, సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక అభివృద్ధి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పిల్లలను విద్యావంతులుగా తయారు చేస్తేనే అభివృద్ధి సాధ్యమని విశ్రాంత ఉపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు అన్నారు. నీలపల్లి శ్రీరామ్‌నగర్‌లో శెట్టిబలిజ కార్తిక వన సమారాధన మహోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడారు. మహిళలు, బాలికలకు ఆటల పోటీలను నిర్వహించారు. పిల్లి సత్తిబాబు, కాలా సత్తిబాబు, రెడ్డి సతీష్, సంఘ పెద్దలు పాల్గొన్నారు

రైతు సేవాకేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతుధర

ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్

కాజులూరు, న్యూస్‌టుడే: రైతు సేవాకేంద్రాల్లో విక్రయిస్తేనే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. బుధవారం కాజులూరు, చేదువాడ, శీల గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అమ్మిన ధాన్యానికి సమయానుకూల చెల్లింపులతో పాటు రైతుల బ్యాంకు ఖాతాలకే నేరుగా డబ్బు బదిలీ అవుతుందన్నారు. రెవెన్యూ అధికారులు ఆదినారాయణ, సుబ్బారెడ్డి, శివకుమార్, వరలక్ష్మి, సాయి పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ‘చేయూత’

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని రెండు నిరుపేద కుటుంబాలకు రూ.25 వేల ఆర్థికసాయం, నిత్యావసర సరకులను చేయూత సంస్థ ప్రతినిధులు అందజేశారు. దివ్యాంగుని కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం, నెలరోజులకు సరిపడే నిత్యావసర సరకులు, బియ్యం అందించడంతోపాటు చిన్నారి విద్యా బాధ్యతను తీసుకున్నారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రసవ సమయంలో తల్లిని కోల్పోయిన చిన్నారికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటు వైద్య చికిత్స నిమిత్తం పూర్తి సహకారం అందిస్తామని చేయూత సంస్థ వ్యవస్థాపకుడు రవికుమార్ ప్రకటించారు. జనసేన నియోజకవర్గ కమిటీ సమన్వయకర్త ఓదూరి కిషోర్, అల్లం దొరబాబు, మురళీమోహన్, గోవింద్, స్వామి, రవి, కామరాజు, లోవబాబు, సింహాద్రి అప్పన్న పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై ఆవంత్స ముద్ర

పిఠాపురం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంపై ప్రముఖ వజ్రాయుధ కవి, సాహితీవేత్త దివంగత ఆవంత్స సోమసుందర్ తనదైన ముద్ర వేసుకున్నారని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు అన్నారు. బుధవారం పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఆవంత్స సోమసుందర్ 101వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కాశీ విశ్వనాథం, అధ్యాపకులు శోభన్ బాబు, హుస్సేన్ మెయిద్దీన్, శారద, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులేటర్ నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న వేగేశ్న భాస్కరరాజు

తాళ్లరేవు: పంట కాలువపై రెగ్యులేటర్ నిర్మాణానికి రైతులంతా సహకరించాలని తాళ్లరేవు డీసీ ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు కోరారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో పంట కాలువపై రెగ్యులేటర్ నిర్మాణంపై రైతుల అభిప్రాయ సేకరణపై అవగాహన సదస్సు జలవనరుల శాఖ జేఈ అనూష అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. పత్తిగొంది వద్ద రెగ్యులేటర్ నిర్మించి తలుపులు పెట్టడంతో ఇబ్బందులు ఏర్పడుతాయని కొందరు, దీనివల్ల నీరు పూర్తిస్థాయిలో అందుతుందని మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మరోసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. నీలపల్లి, పి.మల్లవరం, పోలేకుర్రు నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పూజలు.. హోమాలు

తాళ్లరేవు: కేశవపురంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, పాతకోరంగిలో కురంగేశ్వరస్వామి, పటవలలో అన్నపూర్ణ సమేత వీరేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు లక్షపత్రి పూజలు, రుద్ర హోమం, శాంతి హోమం, అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. జ్యోతిలింగార్చన మహోత్సవం జరిగింది.

గ్రంథాలయాల్లో ఇందిరాగాంధీ జయంతి

పిఠాపురం: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం న్యూస్‌టుడే: నేటి సమాజంలో మహిళలు, బాలికలు మాజీ ప్రధానమంత్రి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.డి.ఉమేషల్మా తెలిపారు. బుధవారం పిఠాపురం ప్రభుత్వ శాఖ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ● సామర్లకోట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి రత్నమణి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ● పెద్దాపురంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సామర్లకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు సామర్లకోట పట్టణంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పీఎం శ్రీ మున్సిపల్ ఉన్నతపాఠశాల విద్యార్థులు అండర్17 కబడ్డీ పోటీలో.. కె.అభిరాం, అండర్14 ఖోఖోలో జి. వర్షిణి, బాలుర విభాగంలో డి. గౌతమ్‌కుమార్ ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్14 కబడ్డీ విభాగంలో ఎం వెంకటశ్రీరామ్ ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అండర్17 కబడ్డీ పోటీలో కె అరుణ, సీహెచ్ ఏంజిల్, విరోనిక, అండర్14 కబడ్డీ విభాగంలో జే లోవకుమారి, కే అఖిల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు సాయిరామకృష్ణ, శ్రీదేవి, విజయలక్ష్మి అభినందించారు.

పెద్దాపురం: పెద్దాపురం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. కట్టమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.లక్ష్మి అండర్ 17 కబడ్డీ విభాగంలో, ఆర్బీకొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఈసరపు రమణ, పంపన వినయ్‌లు అథ్లెటిక్స్ హేమర్‌త్రోలో ఎంపికవ్వడం పట్ల పాఠశాలల హెచ్ఎం మీనా మాధురి, టి.సత్యవాణి, ఛాత్రోపాధ్యాయులు వరసాధనం, కామిరెడ్డి సుబ్రహ్మణ్యం అభినందించారు.

పెదపూడి: పెదపూడి గాంధీ స్మారకోన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు యు.ఉదయ్ కుమార్ బుధవారం తెలిపారు. అండర్-14 విభాగంలో కె.రితిక సత్యసాయిశ్రీ, ఎస్.నవ్య, ఐ.రామవీరదుర్గా శివ త్వరలో మచిలీపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-17 విభాగంలో జె.లక్ష్మీదుర్గ, ఎం.బాల సత్యశ్రీ, ఎస్.దేవిశ్రీప్రియ కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, పిఠాపురం వారి కోర్టులో

EP No.22/2024 OS No.301/2021

Between:
Nimmalapudi Apparao ... Decree Holder
And
Gollapalli Satyanarayana ... J.Dr

ఇందలి పై నెంబరు అమలు గ్రంథమున ఈ దిగువనుదహరించిన షెడ్యూల్ ఆస్తికి మహారాజశ్రీ పై కోర్టువారి ఎదుట ది.01-12-2025న ఉదయం 10.30 ని॥లకు వేలం పాట నిర్వహించబడును. కావున సదరు వేలం పాటనందు లోకులెవరైననూ పాల్గొనవచ్చును. ఇతర వివరములకు D.Hr అడ్వకేట్ గారిని గాని, పిఠాపురం కోర్టువారి నాజరు గారి ఆఫీసునందు గాని సంప్రదించవచ్చును.

షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, గొల్లప్రోలు మండలం, పిఠాపురం సబ్ డివిజన్, దుర్గాడ గ్రామపంచాయతీ, దుర్గాడ గ్రామం, జిరాయితీ పల్లం, S.No: 412/2, ఎ.1-60 1/2 సెంట్లు. **తూర్పు:** పుంత, **పడమర:** గొల్లపల్లి మంగాదేవి గారి భూమి; **దక్షిణం:** కసిరెడ్డి అమ్మిరాజు గారి భూమి; **ఉత్తరం:** పుంత.
సమస్త ఈజిమెంట్ హక్కులతో సహా...

D.Hr Value: **Rs.15,00,000/-**
Amina Value: **Rs.32,00,000/-**

N.S.R.N.Chowdary, MA, B.L., Advocate
#10-7-34, Dhanyam Raju Apartments
Ramaraopeta, Kakinada - 533 001
Cell: 98482 22565

పిఠాపురం,
ది.18-11-2025.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు కాకినాడ జిల్లా, కాకినాడ పట్టణం, RR నగర్, డో.నెం. 70-10-1 A/12, కాపురస్తులు **పినిశెట్టి రంగారావు గారి కుమారుడు భాస్కర రావు గారు** మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి ఇచ్చుచున్న పబ్లిక్ నోటీసు.

జ్యోతుల వెంకటరావు వగైరాలు గుంటముక్కల జోగిరాజు గారికి కాకినాడ సూర్యారావుపేట గ్రామం స.నెం.346రు దాఖలా ఎ 4.00 సెంట్లు భూమిని ది.22-12-1937 తేదీన ద.నెం.4413/1937రుగా రిజిష్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా విక్రయించి యున్నారు. జ్యోతుల వెంకటరావు వగైరాలు ది.03-01-1938 తేదీన ద.నెం.15/1938రు రీత్యా ఎ 3.00 సెంట్ల భూమిని గుత్తుల శేషయ్య అతని కుమారులు అప్పన్న గార్లకు విక్రయించియున్నారు.

గుంటముక్కల జోగిరాజు గారి అనంతరం వారి కుమారులు చక్రం, రమణారావు, వారి సంతతి ది.26-08-1989వ తేదీన గుంటముక్కల చక్రం గారి పేరిట ఎ 3.17 సెంట్ల భూమికి జనరల్ పవర్ వ్రాయించి ద.నెం.368/1989రుగా రిజిష్టర్ చేయించియున్నారు. సదరు ఎ 3.17 సెంట్లు మరియు గుత్తుల శేషయ్య గారి అనంతరం వారి వారసులు తమ తాలూకు ఎ 0.64 సెంట్ల భూమిన్నీ మొత్తం ఎ 3.81 సెంట్ల భూమిని ఇతరుల భూమితో కలిపి LP No.101/89 రు గా ఇండ్ల స్థలములుగా విభజించగా అందలి ప్లాట్ నెం.205రు దాఖలా 375 చ.గల స్థలమును గుంటముక్కల జోగిరాజు, గుత్తుల శేషయ్య గారల వారసుల వద్ద నుండి వెంపటి వెంకటేశ్వర్ గారు ది.06-01-1990 తేదీన కాకినాడ రిజిస్ట్రార్ వారి ఆఫీస్ నందు ద.నెం.111/1990రుగా రిజిష్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా క్రయం పొందియున్నారు.

దరిమిలా వెంపటి వెంకటేశ్వర్ గారు ది.31-05-1998తేదీన కాలం చేయగా వారి భార్య బాప వరలక్ష్మి, కుమార్తె రాజ్యలక్ష్మి, కుమారుడు కృష్ణ చైతన్య గారల వద్ద నుండి సదరు ప్లాటును ఐడే ఎల్లాజిరావు గారు ది.27-03-1999 తేదీన ద.నెం.1854/1999రుగా రిజిష్టర్ కాబడిన క్రయదస్తావేజు రీత్యా క్రయం పొంది అప్పటి నుండి సంపూర్ణ హక్కులతో అనుభవిస్తూ యున్నారు. దరిమిలా వెంపటి వెంకటేశ్వర్ గారి తల్లి అయిన కనక దుర్గ గారు కూడా ఇప్పటికి 25 సంవత్సరాల క్రితం కాలం చేసియున్నారు. ఐడే ఎల్లాజిరావు గారి వద్ద నుండి సదరు ఆస్తిని క్రయం పొందుటకు ఏర్పరచుకొని యున్నారు.

కావున సదరు క్రయ వ్యవహారం పట్లనూ, ఐడే ఎల్లాజిరావు గారికి సదరు ఆస్తి పట్ల గల హక్కుల పట్లనూ ఎవరికి ఎట్టి అక్షేపణలు ఉన్ననూ, ఈ నోటీసు ప్రచురణ తేదీ లగాయతు 10 రోజులు లోగా మాకు తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. లేని యెడల మా క్లయింటు సదరు ఆస్తిని నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా భావించి తన పేరిట గాని, తన వారి పేరిట గాని క్రయం పొందెదరు. తదుపరి ఎట్టి క్లయములు మా క్లయింటును బైండు చేయజాలవు. సదరు ఆస్తి పట్ల చెల్లనేరవు.

షెడ్యూలు: తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ సబ్-రిజిస్ట్రార్ ఏరియా, ప్రస్తుతం సర్పవరం సబ్-రిజిస్ట్రార్ ఏరియా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, బ్లాక్ నెం.70, వార్డు నెం.30, శశికాంత్ నగర్, LP No.101/89 రు నందలి, ప్లాట్ నెం.205రు దాఖలా 375 చ.గల స్థలముకు హద్దులు కొలతలు వివరం. **తూర్పు:** 75' ప్లాట్ నెం.206రు స్థలం. **దక్షిణం:** 45' లేఅవుట్ ప్లాన్ దాఖలా రోడ్డు. **పడమర:** 75' ప్లాట్ నెం.204రు స్థలం. **ఉత్తరం:** 45' ప్లాట్ నెం.196రు స్థలం. సదరు హద్దుల మధ్యస్థమైన 375 చ.గల స్థలం అందలి సర్వం సహా..

పేపకాయల రామకృష్ణ,
మల్లిపూడి సత్యనారాయణ, మాగాపు చైతన్య కుమార్, అడ్వకేట్స్
మెహర్ భవన్, రామారావుపేట, కాకినాడ. సెల్: 9440178750

కాకినాడ.
ది.19-11-2025

50వ వార్షికోత్సవం మహాకుంభాభిషేకం
శ్రీశ్రీశ్రీ మంగళాంబికా సమేత శ్రీ ఆదికుంభేశ్వర స్వామివారి ఆలయం
వద్ద ఒక కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు 20-11-2025 గురువారం
50వ వార్షికోత్సవం మహాకుంభాభిషేకం
కావున భక్తులందరూ విచ్చేసి ఈ మహా కుంభాభిషేక కార్యక్రమములో పాల్గొని తరించ ప్రార్థన.
మీ.. సలాది శ్రీనువాసుబాబు, B.Sc., LLB
ఏపీ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ మెంబర్
సీనియర్ జనసేన నాయకులు కాకినాడ రూరల్, RSS స్టేట్ మెంబర్

ఉచిత వినికిడి మరియు మాట సంబంధిత సమస్యలకు
అనుభవజ్ఞులైన డాక్టర్లచే పరీక్షలు
డా॥ కనుమూరి బాలకిరణ్, M.S. (ENT)
తమిళనాడు గోల్డ్ మెడలిస్ట్
ది.20-11-2025 నుండి 22-11-2025 వరకు
టైమింగ్స్: ఉ॥ 9 గం॥ల నుండి 1 వరకు మరియు సా॥ 5 గం॥ల నుండి 8 గం॥ల వరకు
ముందుగా పేరు నమోదు చేసుకోవలెను
♦ వినికిడి సంబంధిత సమస్యలకు డా॥ బాల కిరణ్ గారిచే ఉచిత కన్సల్టేషన్
♦ ఉచితంగా వినికిడి పరీక్షలు చేసి వినికిడి మిషన్ల ట్రయిల్స్ ఇవ్వబడును
♦ మాట మరియు స్వర సంబంధిత సమస్యలకు స్పీచ్ పాథాలజిస్ట్‌చే సలహాలు, సూచనలు
♦ మీరు ఉపయోగిస్తున్న పాత వినికిడి మిషన్లు ప్రోగ్రామింగ్ చేయబడును
శ్రీ బాల
చెవి, ముక్కు, గొంతు హాస్పటల్
సెలెక్టెడ్ వినికిడి పరికరాల మోడల్స్‌పై 30-40% డిస్కౌంట్
చందన బ్రదర్స్ వెనుక, దంటు వారి వీధి, కాకినాడ. ఫోన్: 0884-2385499, 95733 36399

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా / Union Bank of India

సూర్యారావుపేట బ్రాంచి, టౌన్ హాల్ స్ట్రీట్, కాకినాడ
కాకినాడ జిల్లా, ఎ.పి- 533 001

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 6(2)/8(6) క్రింద ఆస్తులు అమ్మకం గురించి తెలియజేస్తూ ఋణగ్రహీతలకు ప్రకటన (30 రోజుల అమ్మకపు ప్రకటన)

టు: ఋణగ్రహీత : మెస్సర్స్ యామిని పేపర్ ప్రొడక్ట్స్(ప్రొప్రైటర్: గుడిమెట్ల రాధ) ప్లాట్ నెం. 41, ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ ఏరియా, రమణయ్యపేట, కాకినాడ - 533 005. 2)కో-అప్లికెంట్ : గుడిమెట్ల రాధ మరణించినందున వారి చట్టరీత్యావారసులు భర్త: జి.వి.జి.ఎస్.లక్ష్మణ్ రెడ్డి,(గుడిమెట్ల వెంకట గౌరి శంకర్ లక్ష్మణ్ రెడ్డి మరియు ఇతరులు) చిరునామ : డి.నెం. 4-964, ఈశ్వర కాలనీ, తూరంగి, కాకినాడ - 533 016 3)హామీదారు/కో-అప్లికెంట్ :గుడిమెట్ల వెంకట గౌరి శంకర్ లక్ష్మణ్ రెడ్డి , చిరునామ : డి.నెం. 4-964,ఈశ్వర కాలనీ, తూరంగి, కాకినాడ - 533 016

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ యొక్క 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు బకాయివున్న మొత్తాన్ని రాబట్టుకొనుట కొరకు క్రింది తెలిపిన ఆస్తుల అమ్మకం.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారము అందులో నిర్దేశించిన సమయంలోగా బకాయిలను చెల్లించవలసినదిగా సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సెక్షన్ 13(2) క్రింద **06.05.2025** తేదీ గల డిమాండ్ నోటీసు ద్వారా మిమ్మల్ని కోరినారు. నిర్ణీత వ్యవధిలోగా మీరు నోటీసులో పేర్కొన్న బకాయిలనుచెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 6(2)/8(6)తో చదవబడే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అధీకృత అధికారి సెక్యూర్డ్ ఆస్తులను **17.07.2025** తేదీన స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తులను స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయిలను చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులు విక్రయించుట తప్పనిసరి అవుతుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించవలసిన సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

ఆస్తులు బ్యాంక్‌కు అంగీకారయోగ్యమైన నియమ నిబంధనలకు లోబడి ప్రైవేట్ అమ్మకం లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కోరుట ద్వారా ఎవరికైనా ఆస్తులు విక్రయించు ప్రతిపాదన ఏదైనా మీకు ఉంటే మాకు తెలియజేయవలెను. విఫలమైనచో ఎటువంటి ప్రతిపాదన మీకు ఏదీ లేనట్లుగా భావించబడును మరియు మేము ఇ-వేలం ద్వారా ఆస్తుల విక్రయంతో ముందుకు సాగుతాము.

కాబట్టి, మీరు బ్యాంక్‌కు డిమాండ్ నోటీసు నాటికి చెల్లించాల్సిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు సేల్ నోటీసును ప్రచురించే తేదీకి ముందు బ్యాంక్ చేసిన ఖర్చులతో కలిపి చెల్లిస్తే ఆస్తులు అమ్మకం కోసం తదుపరి చర్య తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8)లో నిర్దేశించిన విధంగా మీరు మీ ఆస్తులు తిరిగి పొందవచ్చు.

తనఖావుంచిన ఆస్తి వివరములు

తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా) , కాకినాడ రూరల్, తూరంగి గ్రామం, కాకినాడ యస్.ఆర్.ఓ, డి.నెం.9-464, ఆర్.యస్.నెం.160/6, యస్.నెం.135/4, మొత్తం 245 చ॥గ॥లలో ఖాళీ స్థలం మరియు అందలి నిర్మించిన రెసిడెన్షియల్ భవనము **గుడిమెట్ల రాధ, భర్త: గుడిమెట్ల వెంకట గౌరి శంకర్ లక్ష్మణ్ రెడ్డి గారికి** సంబంధించిన యావదాస్తి **ఈ దిగువ హద్దులలో: తూర్పు** : 30.00 అ॥ బోరుసు హరగోపాల్ గారి స్థలము. **పడమర** : 30.00 అ॥ రోడ్డు, **ఉత్తరం** : 73.06 అ॥ దోమ వెంకన్న గారి ఇల్లు **దక్షిణం** :73.06 అ॥ అమ్మకందారుని యొక్క మిగిలిన ఆస్తి డి.నెం.9-464.

Cersai Asset ID: 200092743154 Sec ID: 400090625532

తేది :01.11.2025
ప్రదేశం : కాకినాడ

సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

(c) eenadu

తుని
•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

పనులకు నీళ్లే అడ్డంకి..!

తుని గ్రామీణం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం కాలువ పనులకు ఆ నీరు అడ్డంకిగా మారింది. తుని మండల పరిధిలోని లోవకొత్తూరు గ్రామ సమీపంలో పోలవరం కాలువలోకి ఇటీవల కురిసిన వర్షాలకు కాలువ నీటితో నిండింది. సీసీ లైనింగ్ పనులు చేపట్టేందుకు అవకాశం లేక పోవడంతో నీళ్లను ఇంజన్లతో తోడి సమీపంలోని చెరువులకు మళ్లిస్తున్నారు. పనులు మందకొడిగా సాగుతున్నాయి.

విద్యార్థుల ఒబ్బిడి.. అలంకరణగా మారిందిలా..

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: చూసేందుకు గోడపై ఏర్పాటు చేసిన మొక్కల కుండీలుగా కనిపిస్తున్నప్పటికీ ఇవి మాత్రం విద్యార్థులు రోజూ వాడే నీటి మగ్గులే. జగన్నాథగిరి ఏపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ఉదయం వాడిన అనంతరం నీటి మగ్గులను పాఠశాల గ్రిల్స్ వద్ద ఇలా ఒబ్బిడిగా పెడుతున్నారు. దీంతో సందర్శకులకు ఇవి అందంగా కనిపిస్తున్నాయి.

జగన్నాథగిరి గురుకుల విద్యార్థులు భద్రపరుచుకున్న నీటి మగ్గులు

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం

శంఖవరం, న్యూస్‌టుడే: అన్నవరం శబరిమల అయ్యప్పస్వామికి బుధవారం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం, పడిమెట్లకు పూజలు జరిగాయి. గురుస్వామి కుసుమంచి శ్రీనివాసరావు మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్నాభిషేకం చేస్తున్న వేదపండితులు

నేడు మహాకుంభాభిషేకం

కత్తిపూడిలోని విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి మహాకుంభాభిషేకం జరుగుతుందన్నారు.

వారాహి మాతకు కుంకుమపూజలు

తొండంగి, న్యూస్‌టుడే: మండలంలోని గోపాలపట్నం గ్రామ శివారు యద్ద కోటేశ్వరరావు స్థలంలో వారాహి మాత శివ రుద్ర మహాయాగం పూజల్లో భాగంగా బుధవారం వారాహి దీక్షా పీఠం పవనానందస్వామి పర్యవేక్షణలో కుంకుమ పూజలు జరిగాయి. నాయకులు యద్ద సూరిబాబు, యద్ద బుజ్జి, పి.సుబ్రహ్మణ్యం, గోపాలపట్నం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిక

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో తెదేపాలోకి వైకాపా నాయకులు చేరారు. తొండంగి మండలం శృంగవక్షం గ్రామ మాజీ సర్పంచి కుమ్మరి నాగేశ్వరావు, అమృత్తి నూకరాజు తదితరులు తమ అనుచరులతో కలిసి బుధవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో యనమలను కలిసి పార్టీలోకి చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

యనమల సమక్షంలో పార్టీలోకి చేరిన వైకాపా నాయకులు

అమ్మో చలి.. రక్షణ ఏదీ మరి..!

చలి పంజా విసురుతోంది. వసతి గృహాల్లో అరకొర వసతుల మధ్య బాలికలు, బాలురు వణుకుతున్నారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు వసతి గృహాలను పరిశీలనలో సమస్యలు వెలుగుచూశాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలన

చదువు, నిద్ర ఒకే గదిలో..

తుని గ్రామీణం: జగన్నాథగిరి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వసతి గదుల కొరతతో చదువు, నిద్ర ఒకే గదిలో కొనసాగుతోంది. తరగతి గదుల పైకప్పు (సీలింగ్) పెచ్చులూడిపోయింది. ● వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణం తుప్పలతో నిండి ఉంది. మరుగు దొడ్ల నిర్వహణ అస్తవ్యస్తం. ● అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు నేలపైనే నిద్రపోతున్నారు. జ్యోతిరావు పులే బాలుర ఆశ్రమ పాఠశాల ప్రైవేటు భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతుంది.

కిటికీలకు రెక్కలు లేవాయె..

కిటికీలకు అద్దాలకు బదులు ప్లాస్టిక్ తెరలు

గండేపల్లి: నీలాద్రిరావుపేట శివారున ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రైవేట్ భవనంలో నెలకు రూ.47 వేలు అద్దె చెల్లిస్తూ నిర్వహిస్తున్నారు. ఇక్కడ 80 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉన్నారు. కిటికీలకు రెక్కలు లేకపోవడంతో చలికి వణుకుతున్నారు. రాత్రివేళ దోమల దాడి. వీటి కట్టడికి తెరలు కట్టారు. అవి ఊడిపోయి, చిరిగిపోయి ఉన్నాయి. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి దోమతెరలు, దుప్పట్లు తెచ్చుకున్నారు. వార్డెన్ శంకర్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపామన్నారు.

అద్దె భవనాల్లో అరకొర వసతులు

జగ్గంపేట గ్రామీణం: చలితీవ్రత పెరుగుతుండడం, మంచాలు లేకపోవడంతో రాజపూడి, కాట్రావులపల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహాల్లో విద్యార్థులు వణికిపోతూ నేలపైనే పడుకుంటున్నారు. ● జగ్గంపేటలో ఎస్సీ బాలుర, రామవరంలోని ఎస్టీ బాలికల వసతిగృహాలు శిథిలస్థితికి చేరుకోవడంతో వాటిని ప్రైవేటు భవనాల్లోకి తరలించారు. రాజపూడి వసతిగృహంలో కిటికీలు పాడవడం, అమర్చిన దోమతెరలు చిరిగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రాజపూడి ఎస్సీ వసతిగృహంలో నేలపై నిద్ర

తుని: ఎస్సీ బాలికల వసతి గృహంలో గదులు లేక వరండాలో మంచాలు ఇలా..

వసతిగృహాల్లో బిక్కుబిక్కుమంటూ..

తుని: తుని పట్టణంలోని వీరవరపుపేటలో ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహంలో 70 మంది విద్యార్థులు ఉన్నారు. 1992లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో పూర్వ పాత ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక వసతి కల్పించారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి పాత భవనానికే రావాల్సి వస్తోంది. గీజర్లు లేక రోజూ చల్లటి నీటితోనే స్నానాలు చేస్తున్నారు. కొత్తభవనం పనులు పునాదుల వద్ద ఆగాయి. వసతిగృహ సంక్షేమాధికారిణి పి.వాణిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. ● బాడుకోటలో ఉన్న బీసీ బాలికల వసతి గృహంలో 118 మంది విద్యనభ్యసిస్తున్నారు. పక్కనే అద్దె భవనంలో కొనసాగుతోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపోవడం లేదు. స్లాబు పెచ్చులూడుతోంది. ఆర్వోప్లాంటు పనిచేయకపోవడంతో మూలకు చేర్చారు. మేడపైన షెడ్డువేసి పిల్లలను ఉంచుతుండటంతో చలికి వణుకుతున్నారు. బ్యాంకు కాలనీ,కొత్తపేటల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

సమన్వయంతో సేవలందించండి

ఈనాడు కథనానికి స్పందన

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మేలైన సేవలందించాలని ఇన్‌ఛార్జి డీసీహెచ్ఎస్ మహేశ్వరరావు ఆదేశించారు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్ సౌమ్య, గతంలో డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన స్వప్న ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడం తెలిసిందే. 'వివాదాలకు నిలయం..' శీర్షికన ఈనాడులో బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ డీసీహెచ్ఎస్‌కి ఆదేశాలిచ్చారు. డీసీహెచ్ఎస్ మహేశ్వరరావు ప్రత్తిపాడు ఆసుపత్రికి వచ్చి వివరాలు రాబట్టారు. కలిసి పనిచేసి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి అంశాన్ని రచ్చ చేయొద్దని సిబ్బందికి సూచించారు.

సిబ్బందికి ఆదేశాలిస్తున్న డీసీహెచ్ఎస్ మహేశ్వరరావు

రైతుల ఖాతాల్లో సొమ్ము జమ

ప్రత్తిపాడు, తొండంగి, గండేపల్లి, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన కూటమి నాయకులు బుధవారం పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధుల బదలాయింపు కార్యక్రమాన్ని దూర దృశ్య విధానంలో వీక్షించారు. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు బద్ది రామారావు, డి.శేషారావు, పీహెచ్‌సీ కమిటీ డైరెక్టర్ వెలుగుల నాని, నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 31634 మంది రైతుల ఖాతాల్లో రూ. 20.84 కోట్లను జమ చేశారని అధికారులు వెల్లడించారు. ● అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలతో పేద, మధ్యతరగతి రైతులకు మేలు జరుగుతుందని తుని డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్ అన్నారు. తొండంగి ఎంపీడీవో కార్యాలయంలో ఏడీఏ చంద్రశేఖర్, ఏవో పద్మశ్రీ, ఎంపీడీవో సాయి నవీన్, ఏఈవో సతీష్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాత సుఖీభవ పథకం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం జరిగింది. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ 27,617 మంది రైతులకు రూ.18.9 కోట్లు ప్రభుత్వం జమ చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి,కోడ వెంకటరమణ అధికారులతో కలిసి చెక్కును రైతులకు అందజేశారు. ● జగ్గంపేట నియోజకవర్గంలో 30,820 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులను కూటమి ప్రభుత్వం వేసిందని జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు అన్నారు. మురారిలో నాయకుడు జ్యోతి వసంత్ ఆధ్వర్యంలో చెక్కు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.

మురారిలో రైతులకు చెక్కు అందజేస్తున్న నాయకులు, అధికారులు

ప్రత్తిపాడులో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు



తొండంగిలో రైతులకు చెక్కు అందిస్తున్న కూటమి నాయకులు

అనర్గళంగా ఉపన్యసించారు.. విజేతలుగా నిలిచారు

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

తుని, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని శ్రీవిద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు బుధవారం జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై పిల్లలు ఉత్సాహంగా ఉపన్యసించారు. ఉపాధ్యాయులే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో కె.చైత్రశ్రీ (8వ తరగతి), పి.తన్మయి (7వ తరగతి), వి.శివదుర్గ (8వ తరగతి) వరుసగా మొదటి మూడు స్థానాలను సాధించారు. ఈనాడు సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను విజేతలకు ప్రిన్సిపల్ ఎం.వేణిప్రియ అందజేశారు.

ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలు

యథేచ్ఛగా హైవేపై దమ్ముచక్రాల ట్రాక్టర్లు

జాతీయ రహదారి నిర్వహణ, రోడ్ల నిర్మాణాలకు ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. పర్యవేక్షణ, అవగాహన లేక మండల కేంద్రమైన గండేపల్లి హైవేపై దమ్ము ట్రాక్టర్లు ఇనుప చక్రాలతో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో నూతన లేయర్లు వేసినప్పటికి రోడ్లు గుంతలు పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత హైవే సిబ్బంది చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

నీటి వృథాను అరికట్టరూ..!

సోమవరం గ్రామం దళితపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో పైపు నుంచి రోజూ తాగునీరు వృథాగా పోతుంది. ఈ బడిని మూసేసి నాలుగేళ్లు అయ్యింది. కాలనీవాసులకు ట్యాంకు నిర్మించలేదు. దీంతో కాలనీలో వీధుల వెంబడి తాగునీటి కొళాయి పైపులకు బోరునీటిని అనుసంధానం చేసి వదిలేశారు. నివాసితులు కొళాయిలు వాడుకున్నప్పుడు తప్ప మిగిలిన సమయాల్లో పాఠశాల ఆవరణలో ఉన్న అదనపు పైపు ద్వారా నీరు కిందికి పారుతూనే ఉటుంది. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి నీటి వృధాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కిర్లంపూడి

ప్రధాన రహదారిలో ప్రయాణమంటే హడల్..!

జగపతినగరం- ప్రత్తిపాడు వెళ్లే ర.భ. ప్రధాన రహదారి మొత్తం గోతులమయంగా మారింది. క్వారీ లారీలు, పాఠశాల బస్సులను తప్పించుకునేందుకు ద్విచక్రవాహనదారులు గోతుల్లో పడి గాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గోతులను పూడ్చారు. మళ్లీ కొద్ది నెలలకే గోతులు ఏర్పడ్డాయి. దీనిపై ర.భ.శాఖ డీఈఈ రాఘవరావును వివరణ కోరగా.. దివిలి నుంచి ప్రత్తిపాడు వరకు గోతులను పూడ్చేందుకు రూ. రెండు కోట్లతో టెండర్లు పిలిచామని త్వరలోనే పనులు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, కిర్లంపూడి

పరుగు పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

తొండంగి: అద్దరిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పిక్కి జగదీష్ రాష్ట్ర స్థాయి పరుగు పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం దుర్గాకుమారి బుధవారం తెలిపారు. మంగళవారం కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పరుగు పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం లక్ష్యమని జగదీష్ తెలిపారు.

జగదీష్‌తో వ్యాయామ ఉపాధ్యాయుడు

త్రుటిలో తప్పిన ప్రమాదం

గండేపల్లి, న్యూస్‌టుడే: హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. హైవేపై సిబ్బంది తెలిపిన వివరాలివీ.. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపుగా పరిశ్రమల్లో ఉపయోగించే పెద్ద పెద్ద లావుగా ఉన్న ఐరన్ ముక్కల లోడుతో భారీ లారీ వెళ్తోంది. జడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాలు ఏదురుగా వచ్చేసరికి ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో లారీ సడన్ బ్రేక్ వేసింది. ఈ ప్రమాదంలో లారీపై ఉన్న ఐరన్ ముక్కలు క్యాబిన్ ముందుకు వెళ్లి హైవేపై పడ్డాయి.

లారీపై నుంచి హైవేపై పడ్డ ముక్కలు

అపరిచిత వ్యక్తులతో చాటింగ్‌లొద్దు..

గండేపల్లి, న్యూస్‌టుడే: ఇరవై ఏళ్లు రాకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని కాకినాడ ఈగల్‌టీం అధికారి కె.ఆంజనేయులు అన్నారు. మల్లేపల్లి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తుపానీయాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్‌లు చేయడం, ఫోన్‌లు మాట్లాడడం వలన ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ సలీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనలో విద్యార్థులు

రూ.10 లక్షల బీమా పరిహారం అందజేత

గండేపల్లి, న్యూస్‌టుడే: ఎస్బీఐ బీమా కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తుందని తుని ప్రాంతీయ మేనేజర్ డి.ప్రసాదరావు అన్నారు. గండేపల్లి ఎస్బీఐలో బుధవారం మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రాంతీయ మేనేజర్ ప్రసాదరావు మాట్లాడుతూ.. మురారి గ్రామానికి చెందిన పాకలపాటి సత్యవతి(40) ఏప్రిల్ నెలలో గండేపల్లి ఎస్బీఐలో పొదుపు ఖాతాను తెరిచారు. ఖాతాతోపాటు బీమా కింద రూ.500 చెల్లించారు. జూన్ 11 న మురారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందారు. దీంతో బుధవారం సత్యవతి భర్త వీరబాబుకు రూ.10 లక్షల చెక్కును బ్యాంకు అధికారులు అందజేశారు. బ్యాంకు ప్రతినిధులు రాజశేఖర్, శ్రీనివాస్, సురేఖ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐ నుంచి చెక్కును అందుకుంటున్న వీరబాబు

కార్తిక వన సమారాధనలో సందడి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: జగన్నాథగిరి మామిడితోటలో బుధవారం వెలమకొత్తూరు గ్రామ పంచాయతీ పెద్దలు నిర్వహించిన కార్తిక వన సమారాధన ఒక ప్రత్యేకతను చాటుకుంది. గ్రామ పెద్దలు, అతిథులు యువతకు భవిష్యత్తుకు బంగారుబాట వేసుకునేందుకు సూచనలివ్వగా నిర్వాహకులు చిన్నారులకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, రాంబాబురాజు, సుర్ల లోవరాజు, రొంగల అబ్బు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

బాలల భద్రతకు ప్రాధాన్యం

ఏలేశ్వరం: బాలల భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్, పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులను తప్పుదోవ పట్టించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సాదే రాంబాబు, తమ్మా మల్లేష్, భవానీ ప్రసాద్, టి.సాయిసునీత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రత్తిపాడు విద్యార్థులు

ప్రత్తిపాడు:రెడ్నం రామ్మూర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం సీహెచ్ జాన్ ప్రసాద్ బుధవారం చెప్పారు. వాలీబాల్ రాష్ట్ర జట్టుకి అభిరామ్ జిల్లా నుంచి ఎంపికయ్యాడు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యం, ఆదాయం

కోటనందూరు: వినియోగదారులకు ఆరోగ్యం రైతులకు లాభాలు సేంద్రియ సాగుతో సాధ్యమవుతుందని ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. కె.కొత్తాం గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల నిర్వహణ

ఏలేశ్వరం: ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకే ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎంపీడీవో రవికుమార్ వర్మ అన్నారు. తూర్పులక్ష్మీపురంలో బుధవారం స్వామిత్వ గ్రామసభ జరిగింది. సభలో పది అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

సత్రం అభివృద్ధికి కృషి చేయాలి

రౌతులపూడి: కత్తిపూడిలోని రాజా వత్సవాయి బుచ్చి సీతాయమ్మ మహరాణి బహద్దర్ ధర్మ సత్రం ఛైర్‌పర్సన్ సోమరౌతు చంద్రమౌళిని బుధవారం సత్కరించారు. జిల్లా ఎంపీపీల సమాఖ్య అధ్యక్షుడు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తన అనుచరులతో కలిసి బలరామపురంలో చంద్రమౌళికి అభినందనలు తెలిపారు. సత్రం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

తుని పట్టణం: వాకర్స్ హెల్త్‌క్లబ్‌కు జిల్లా ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అమలాపురంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లో క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి నుంచి తుని ప్రతినిధులు చదరం శివాజీ,కుందెం సత్యనారాయణ, అందుకున్నారు.

అంతరిక్ష పరిశోధనపై అవగాహన

తుని: విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని ఫిజిక్స్ అధ్యాపకుడు జె.సాదయ్య అన్నారు. దుర్గాదాస్ వీధిలో ఉన్న శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు నాసా గురించి తెలియజేసేలా పుస్తకం, పెన్ను, టీషర్ట్‌తో ఉన్న కిట్లను పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

తుని పట్టణం: రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రోటరీ హాల్లో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, వర్షపునీటిని ఒడిసి పట్టుకోవడం వంటి అంశాలకు అద్దంపట్టేలా ప్రాజెక్టులు రూపొందించారు. పి.నాగిరెడ్డి, ప్రసన్న కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

తుని: సుప్రీంకోర్టు ఆదేశాలతో వీధికుక్కల నియంత్రణకు పురపాలక అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో శునకాలు రాకుండా గేట్లు, ఫెన్సింగ్ వేయాలని సచివాలయ సిబ్బంది నోటీసులు అందజేస్తున్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రత్తిపాడు, తుని: శక్తివంతమైన మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ ఖ్యాతిగాంచారని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను అన్నారు. ఇందిర జయంతి సందర్భంగా ప్రత్తిపాడులో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● తుని పట్టణంలోని జీఎన్‌టీరోడ్డులో ఇందిరాగాంధీ విగ్రహానికి గేలం శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళి అర్పించారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: సోమవరం గ్రామంలో హైవేపై ఈనెల 8న కారు ఢీ కొని మృతి చెందిన ఐదు కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మరోతు శివగణేష్ డిమాండ్ చేశారు. దళిత కుటుంబ సభ్యులను బుధవారం శివగణేష్ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఈప్రమాదంలో మూడు కుటుంబాల వారు ఇంటి పెద్దదిక్కును కోల్పోయారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు.లేకుంటే ఉద్యమిస్తామన్నారు.

మాట్లాడుతున్న శివగణేష్

మృతుల కుటుంబాలకు సాయం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: సోమవరంలో 8న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి పేర్కొన్నారు. ప్రమాదంలో తాపీ మేస్త్రి కాకాడ రాజు మృత్యువాత పడ్డారు. ఎమ్మెల్యేలు నెహ్రూ, సత్యప్రభ సహకారంతో సమకూరిన రూ.5 లక్షల నగదును రాజు కుటుంబసభ్యులకు బుధవారం కౌన్సిలర్లు అందజేశారు.

ఏలేశ్వరంలో బాధిత కుటుంబీకులకు నగదు అందజేస్తున్న కౌన్సిలర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
తుని బ్రాంచి (00942), బెల్లపు వీధి, తుని, కాకినాడ జిల్లా

స్వాధీనత ప్రకటన (స్థిరాస్థి కొరకు)

(ANNEXURE IX)

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తుని బ్రాంచ్, కాకినాడ జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత: **మెస్సర్స్.భాను కృష్ణ కాయిర్ పై ఇండస్ట్రీస్, ప్రొ: శ్రీ తమరాన రామకృష్ణ**, తండ్రి: సింహాచలం, డోర్ నెం.5-42, వెలమ కొత్తూరు, తుని మండలం-533 401 వారు డి.**30-08-2025** నాటికి **టర్మ్ లోన్ అకౌంట్ నెం.39234219520** చెల్లించవలసిన బకాయి **రూ.2,81,867/-** (అక్షరాల రెండు లక్షల ఎనభై ఒక్క వేల ఎనిమిది వందల అరవై ఏడు రూపాయలు మాత్రమే) + తేదీ: **31-08-2025** నుండి పైన తెలిపిన సొమ్ము పై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు మొదలగునవి నోటీసు తేదీ నుండి 60 రోజుల లోగా చెల్లించవలసినదిగా తేదీ: **30-08-2025**న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

ఋణగ్రహీత మిగిలిన బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టం సెక్షన్ 13 (4) కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 మరియు 9 ప్రకారం దిగువ పేర్కొన్న ఆస్తిని తేది.**13-11-2025**న ప్రతీకాత్మకమైన స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా డి.**30-08-2025** నాటికి **టర్మ్ లోన్ అకౌంట్ నెం.39234219520** చెల్లించవలసిన బకాయి **రూ.2,81,867/-** (అక్షరాల రెండు లక్షల ఎనభై ఒక్క వేల ఎనిమిది వందల అరవై ఏడు రూపాయలు మాత్రమే) పైన తెలిపిన సొమ్ముపై కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు (డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఏమైనా చెల్లించిన బకాయి తగ్గించబడును) **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తుని బ్రాంచ్** వారి ఛార్జికి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్థి వివరములు

తుని యస్.ఆర్.ఓ.లో చేరిన రిజిష్టర్డ్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం.6462/2019, తేదీ: 26-07-2019 శ్రీ తమరాన రామకృష్ణ, తండ్రి: సింహాచలం గారికి చెందిన ఆస్థి.

తూర్పు గోదావరి జిల్లా, తుని సబ్-రిజిస్ట్రీ, తుని మండలం, కొత్తూరు గ్రామం, తుని పట్టణం దగ్గర, కొత్తూరు పంచాయతీ, సర్వే నెం.228, ఎ.0.75 సెంట్లు=0.303 హెక్టార్లు కాయిర్ ఇండస్ట్రీ షెడ్‌తో సహా పొడి భూమికి హద్దులు: **తూర్పు**: పడిశిల అప్పారావు గారికి చెందిన భూమి **దక్షిణం**: దరఖాస్తు దారుని భూమి **పడమర**: రోడ్ **ఉత్తరం**: పుంత

అన్ని సులభతరమైన, సాధారణ హక్కులతో సహా

తేదీ: 13-11-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: తుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science (www.mits.ac.in)
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Organised by: ఈనాడు

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు, మునగాలపాడు
కర్నూలు - 518004
వివరాలకు: 8008551771
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.



సుదర్శన మంత్రం.. సర్వలోక సుభిక్షం

సుదర్శన మంత్రంతో అహోబిల గిరులు మార్మోగాయి. లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా అహోబిలం ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచారు.
– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

అక్రమాలకు సహకారం.. గుదిబండలా గోదాం

■ అనువుగానిచోట నిర్మించి అంటగట్టిన గత వైకాపా సర్కారు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గత ఐదేళ్ల వైకాపా పాలనలో సహకార వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. బహుళ ప్రయోజన గోదాములను బలవంతంగా సహకార సంఘాలకు అప్పగించడంతో.. కొంతమేర లాభాల్లో ఉన్న సంఘాలు సైతం పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయాయి. కొందరు వైకాపా పెద్దలకు లబ్ధి చేకూర్చేందుకు నిర్మించిన ఈ గోదాములకు చేసిన ఖర్చుల అసలు, వడ్డీ చెల్లించలేని పరిస్థితి. అప్పులు తీర్చేందుకు కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

కల్లూరు సహకార సంఘం పరిధిలోని జగన్నాథగట్టు సమీపంలో రూ.45 లక్షలతో నిర్మిస్తున్న 500 టన్నుల సామర్థ్యం గల గోదాం మూడేళ్లకు పైగా అసంపూర్తిగా ఉంది.

201 మంజూరు.. వంద అప్పగింత

గత ప్రభుత్వంలో ఓ వైకాపా నేతకు ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా గోదాముల నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 500, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన 201 బహుళ ప్రయోజన గోదాములు మంజూరు చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు రుణాలతో 500 టన్నుల గోదాముకు రూ.45 లక్షలు, వెయ్యి టన్నుల గోదాముకు రూ.80 లక్షలు చొప్పున కేటాయించారు. ఇందుకోసం సహకార బ్యాంకు ద్వారా సుమారు రూ.70 కోట్ల రుణం మంజూరు చేశారు. ఇప్పటి వరకు కర్నూలు 22, నంద్యాల జిల్లాలో 95 నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కర్నూలులో 21, నంద్యాల జిల్లాలో 79 చొప్పున మొత్తం వంద గోదాములను మార్కెటింగ్ శాఖ ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగించింది.

వాడకున్నా.. వడ్డీతో సహా చెల్లించాలి

సహకార సంఘాలు స్వాధీనం చేసుకున్న గోదాములకు సంబంధించి మొదటి రెండేళ్లు వడ్డీ రూపంలో 500 టన్నుల గోదాముకు ఏడాదికి రూ.1.80 లక్షలు, వెయ్యి టన్నుల గోదాముకు రూ.3.60 లక్షల చొప్పున చెల్లింపులు చేయాలి. ఆ తర్వాత ఏడాదికి రూ.9 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు ఐదేళ్ల పాటు రుణం చెల్లించాలి. గోదాముల వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోయినా రూ.లక్షల్లో అసలు, వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రాథమిక సహకార సంఘాలకు భారంగా మారింది. అప్పులు చేసి మరీ వడ్డీలు, రుణ చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని సంఘాల అధ్యక్షులు, సీఈవోలు వాపోతున్నారు. దీంతో సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినియోగానికి దూరం

నంద్యాల జిల్లాలో 79 బహుళ ప్రయోజన గోదాములను సంఘాలకు అప్పగించారు. వీటిలో 8 గోదాములు మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. కర్నూలులో 21కి గాను ఒక్కటి కూడా వినియోగంలోకి రాలేదు. ఉమ్మడి జిల్లాలో సంఘాలకు అప్పగించిన వాటిలో 92 గోదాములు నిరుపయోగంగా మారాయి. వాటిని అద్దెకు ఇస్తామంటున్నా. తీసుకునేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంది. గ్రామాలకు దూరంగా.. ఎలాంటి రవాణా సౌకర్యం లేని కొండలు, గుట్టలు, లోతట్టు ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. దీంతో వాటిలో పంట ఉత్పత్తులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు ఎవరూ ముందుకురావడం లేదు.

పెచ్చుమీరిన ప్రమాదం

పైకప్పు పెచ్చులూడి కుప్పకూలే స్థితిలో ఉన్న ఈ భవనం కర్నూలు కలెక్టరేట్ సముదాయంలోని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కార్యాలయం. గత ప్రభుత్వంలో రూ.8 కోట్లకు పైగా వ్యయం చేసి కలెక్టరేట్ భవన సముదాయానికి మరమ్మతులు చేపట్టారు. ఈ భవనాన్ని మాత్రం విస్మరించారు. దీంతో దీని గోడలు, పైకప్పు దెబ్బతిని నెర్రెలు చీలాయి. పైకప్పు పలుచోట్ల పెచ్చులూడిపోయి ఊచలు కనిపిస్తున్నాయి. కార్యాలయంలోని అన్ని గదుల్లోనూ ఇదే పరిస్థితి. భూముల రికార్డులున్న గది మొత్తం శిథిలమైంది.
– ఈనాడు, కర్నూలు

ఉల్లి నష్టాలపై అధ్యయనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉల్లిపంట నష్టంపై అధ్యయనానికి కేంద్ర బృందం సభ్యులు బుధవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. కేంద్ర ఉద్యాన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డా.బి.జె.బ్రహ్మ ఆధ్వర్యంలో బృందం సభ్యులు మనోజ్, రాజీవ్ కుమార్, హేమంగ్ భార్గవ్, శరవణన్‌లు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు విక్రయానికి తెచ్చిన ఉల్లి దిగుబడులను పరిశీలించారు.

సబ్జెక్టు ఖాళీ.. విద్యార్థి కంగాళీ

పది పరీక్షలపై ప్రభావం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:

- బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు మహేశ్వరరెడ్డి ప్యాపిలి ఎంఈవో-1గా అదనపు బాధ్యతలపై వెళ్లారు.. ఆ పాఠశాలలో ప్రస్తుతం గణిత ఉపాధ్యాయుడు లేరు. . ఆరు నెలలుగా లెక్కలు చెప్పే వారు కరవయ్యారు.
- ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు పదో తరగతి విద్యార్థులకు గ్రహపాటుగా మారింది. ఈసారి ఎట్టి పరిస్థితిలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. చాలా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడం ఆటంకంగా మారింది.

బదిలీలు తెచ్చిన తంటా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా పరిషత్తు, మున్సిపాలిటీ, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 34,544 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఈ నెలాఖరులోపు సిలబస్ పూర్తి చేసి డిసెంబరు నుంచి రోజువారీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. చాలా చోట్ల సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లాలో నాలుగు వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఎక్కువ మంది కర్నూలు జిల్లాకు వెళ్లారు.. చాలా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

--- ఉమ్మడి జిల్లాలో 250 హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కర్నూలులో 214, నంద్యాలలో 36 జడ్పీ హైస్కూళ్లలో హిందీ చెప్పే వారు కరవయ్యారు. కొన్ని పాఠశాలల్లో సగం పాఠాలు కూడా పూర్తి కాలేదు.

వంద రోజుల ప్రణాళికపై నీలినీడలు

గతేడాది పదో తరగతి పరీక్షల్లో వందరోజుల ప్రణాళిక సత్ఫలితాలు ఇచ్చింది. ఈ ఏడాది మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎఫ్ఏ-1, 2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీలుగా విభజించాలని సూచించారు. ఎఫ్ఏ-1, 2, ఎస్ఏ-1 పరీక్షల్లో వెనుకబడిన వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాల్సి ఉంది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేకపోవడంతో వంద రోజుల ప్రణాళిక అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సర్దుబాటు.. గ్రహపాటు

క్షేత్రస్థాయిలో అవసరాల దృష్ట్యా ప్రభుత్వం ఎంఈవోల భర్తీకి కొన్ని సడలింపులు ఇచ్చింది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. డిప్యుటేషన్ల కోసం జూనియర్లూ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొన్ని చోట్ల డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు బదిలీ అయిన ఉపాధ్యాయుల పోస్టులు చూపకపోవడంతో కొంతమంది ఇంకా రిలీవ్ కాలేదు.

కొత్తిమీర కట్టలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వినూత్నంగా 'సాగు'తే నష్టాలు ఇట్టే అధిగమించొచ్చని ఓ యువ రైతు నిరూపించారు. ఉల్లి సాగులో నష్టం వచ్చిందని.. దిగాలు చెందకుండా కొత్తిమీర సాగు చేసి రెండు నెలల్లోనే లాభాల బాటలో పయనించారు. ఎమ్మిగనూరు మండలం గుడేకల్‌కు చెందిన శ్రీనివాసులు నాలుగు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. అధిక వర్షాల కారణంగా పంట దెబ్బతిని రూ.3 లక్షలు నష్టపోయారు. దాన్ని అధిగమించేందుకు కొత్తిమీర సాగు చేశారు. ఎకరం సాగుకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టారు. నెలకే కోతకు వచ్చింది. టోకున వ్యాపారులు ఎకరం రూ.1.75 లక్షలకు కొన్నారు. వెంటనే మరో ఎకరంలో వేశారు. ఈసారి రూ.24వేల పెట్టుబడి పెట్టారు. మళ్లీ టోకున ఎకరంలో వేసిన వ్యాపారులకు రూ.1.73 లక్షలకు విక్రయించారు. ఇలా రెండు నెలల్లో రూ.3 లక్షలు ఆర్జించారు. వ్యాపారులే కూలీలతో కోయించి హైదరాబాద్, కర్ణాటక ప్రాంతంలోని పట్టణాల్లోని మార్కెట్లకు తీసుకెళ్లారు.

రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 21వ తేదీ నుంచి డిసెంబరు 20 వరకు డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వీసీ వెంకటబసవ రావు బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

- 3వ సెమిస్టర్‌లో రెగ్యులర్ కింద 7,555 మంది, సప్లిమెంటరీలో 5,595 మంది, 5వ సెమిస్టర్‌లో రెగ్యులర్ కింద 6,520 మంది, సప్లిమెంటరీలో 2,717 మంది పరీక్ష రాయనున్నారు.
- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

కబడ్డీ.. కబడ్డీ..

పేదింటి బిడ్డలు.. కష్టాలు దగ్గరుండి చూశారు.. ఆటలపై వారికున్న ఆసక్తిని గమనించి గురువులు సానబెడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 40 మంది బాలురు, బాలికలు అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరికి డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులంతా కలిసి రూ. 2 లక్షలు, దాతల నుంచి మరో రూ.2 లక్షలు సేకరించి ప్రత్యేక మ్యాట్‌ను దిల్లీ నుంచి తెప్పించారు. దానిపై నిత్యం ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటల పాటు మెలకువలు నేర్పిస్తున్నారు. స్థానిక ఫిజికల్ డైరెక్టర్లు సుధాకర్, లక్ష్మణదాసు, శేఖర్, సుజాతల సమక్షంలో ప్రత్యేక సాధన చేస్తున్నారు. అండర్-14 విభాగంలో బాలురు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మచిలీపట్నంలో, అండర్-17 విభాగంలో బాలికలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు కర్నూలు జిల్లా జొహరాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. "హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా.. శిక్షణను సద్వినియోగం చేసుకొంటున్నట్లు" భూమిక, డోన్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. జాతీయస్థాయిలో రాణించడమే.. తన ముందున్న లక్ష్యమని" మనీష పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

లాభాల ఎర.. ఖాతాలకు కత్తెర

కర్నూలు నేరవిభాగం, ఆదోని నేరవిభాగం న్యూస్‌టుడే : తక్కువ సమయంలో.. రెట్టింపు లాభాలు వస్తాయంటూ సామాజిక మాధ్యమాల వేదికగా సైబర్‌నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరతీశారు. చాలామంది వాటిని నమ్మి నిలువునా మోసపోతున్నారు. పెట్టిన పెట్టుబడికి ఎన్నో రెట్లు లాభాలొస్తాయని చెప్పగానే గుడ్డిగా నమ్మి రూ.కోట్ల కష్టార్జితాన్ని సైబర్‌నేరగాళ్ల చేతుల్లో పెడుతున్నారు.

★ సైబర్‌నేరగాళ్లు వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పెడితే అధిక లాభాలొస్తాయని సమాచారం పంపుతున్నారు. వారు పంపే లింకులను క్లిక్ చేసిన వారికి సలహాలు ఇచ్చి నమ్మకం పెంచుతారు. తర్వాత సైబర్‌నేరగాళ్లు తమ వాట్సప్ గ్రూప్‌లలో సభ్యులుగా చేర్చుకుని పెట్టుబడి పెట్టాలని సూచిస్తారు. చిన్న మొత్తాలు పెడితే మొదట లాభాలొచ్చినట్లు సమాచారం పంపుతారు. పెద్దమొత్తాలు పెట్టుబడి పెట్టిన వారికి మాత్రం అధిక లాభాలొచ్చినట్లు తెరపై భారీ మొత్తాన్ని చూపి దానిని విత్‌డ్రా చేసుకునేందుకు కొంత మొత్తం పంపాలని చెబుతున్నారు.

విద్యావంతులే బాధితులు

ఈ ఏడాది ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసానికి గురైన 17 మంది బాధితులు రూ.8 కోట్లపైనే డబ్బు పోగొట్టుకున్నట్లు తెలిసింది. కర్నూలుకు చెందిన ఒక వ్యక్తి ఏకంగా దాదాపు రూ.4 కోట్లు మోసపోయారు. బాధితుల్లో ఎక్కువశాతం విద్యావంతులే కావడం గమనార్హం.

1930కు ఫోన్ చేయండి

పెట్టుబడి పెట్టే సంస్థలకు చట్టబద్ధత ఉందోలేదో నిర్ధారించుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. షేర్లలో పెట్టుబడి డీమాట్ అకౌంట్స్ ద్వారానే జరుగుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను క్లిక్ చేసి వారు సూచించిన యాప్‌లో పెట్టుబడి పెట్టవద్దంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలంటే నమ్మవద్దని.. ఇది పక్కా మోసమని గ్రహించాలంటున్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

గుడ్డిగా నమ్మేస్తున్నారు

- కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ పెట్టుబడితో భారీ లాభాలు వస్తాయన్న మోసగాళ్ల మాటలు నమ్మి రూ.1.42 కోట్లు పెట్టుబడి పెట్టారు. మూడు నెలల పాటు నెలకు రూ.1.35 లక్షలు చొప్పున ఇచ్చిన వారు తర్వాత దుకాణం ఎత్తేశారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రకటన చూసి రూ.58.24 లక్షలు పెట్టుబడి పెట్టారు. సైబర్ నేరగాళ్లు అధిక లాభాలొచ్చినట్లు తెరపై పెద్ద మొత్తం కనిపించేలా మోసపూరిత సమాచారం పంపారు. దాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు కమీషన్, ట్యాక్స్ పేరుతో మరికొంత డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో ఇది మోసమని తెలుసుకున్న ఆయన పోలీసులను ఆశ్రయించారు.

ఆరని మక్కలు.. అన్నదాతకు చిక్కులు

మొక్కజొన్న సాగుచేసిన రైతులు దిగుబడులను విక్రయించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారులు ముంచేస్తున్నారు. తేమశాతం సాకుగా చూపి చాలా తక్కువ ధరకు అడుగుతున్నారు. క్వింటా రూ.1400- 1700 మధ్య కొంటున్నారు. దీంతో దిగుబడులను ఆరబెట్టేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రహదారులు, ఖాళీ స్థలాల్లో ఆరబోసి కుటుంబ సభ్యులంతా రేయింబవళ్లు వాటికి కాపలాగా ఉంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనాలని వారు కోరుతున్నారు. కర్నూలు గ్రామీణ మండలం మిలటరీ కాలనీ వద్ద రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నలను చిత్రంలో చూడొచ్చు.
– ఈనాడు, కర్నూలు

CODE: ANCP
ANNAMACHARYA COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్టీ 5% అదనం
ప్రకటనల కొరకు 99899 97628

(c) eenadu

పనులు పూర్తయ్యేనా.. గొంతు తడిపేనా

కర్నూలు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.20 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. దీనికోసం సుంకేసుల బ్యారేజీ పంపుహౌస్ నిర్మించి మోటార్ల సాయంతో పైపులైన్ ద్వారా అశోక్‌నగర్ పంపుహౌస్‌కు తరలించేందుకు నిర్మాణ పనులు ఆరంభించారు. ఇది అందుబాటులోకి వస్తే నగరవాసులకు తాగునీటి సమస్య లేకుండా పోతుంది. ఈ పనులు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తికాలేదు. పైపులైన్లు ఆగిపోయాయి, పంపుహౌస్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేయించాలని పురప్రజలు కోరుతున్నారు. – ఈనాడు, కర్నూలు.

మురుగు కూపం.. దుర్గంధ భరితం

పచ్చని మైదానాన్ని తలపిస్తున్న ఈ ప్రదేశం పచ్చిక అనుకుంటే పొరపాటే. ఇది కర్నూలు మండలం నిడ్జూరు గ్రామం నడిబొడ్డున రహదారికి చేర్చి ఉన్న ఓ మురికి కుంట. చాలా రోజులుగా ఇలానే ఉంది. చుట్టుపక్కల కాల్వల నుంచి వచ్చిన మురుగంతా ఇక్కడకు చేరుతోంది. కానీ ఇక్కడ నుంచి బయటకు మళ్లించే మార్గం లేకపోవడంతో పచ్చగా మారి ప్రమాదకరంగా మారింది. దీంతో దోమలు వ్యాపించి గ్రామస్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – ఈనాడు, కర్నూలు.

రద్దీ నిత్యం.. పడితే ప్రమాదం

నంద్యాల పట్టణంలో శ్రీనివాస సెంటర్, సంజీవనగర్ గేట్ దారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో అధిక లోడుతో ట్రాక్టర్ రాళ్లను ఇలా ప్రమాదకరంగా తరలిస్తున్నారు. గుంతలు, వేగ నియంత్రికలు ఉన్నాయి. ట్రాక్టర్ పైనుంచి రాళ్లు కింద పడితే రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

స్వచ్ఛ సంకల్పాన్ని కట్టిపడేశారు

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛ సంకల్పం కల నెరవేరడం లేదు. పలుచోట్ల స్వచ్ఛ సంకల్పం రిక్షాలు మూలకు చేరాయి. పనిచేయని వాటికి మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపడుతున్నాయి. హొళగుంద మండలం నెరణికి గ్రామంలో స్వచ్ఛ సంకల్పం రిక్షాకు వృషభాన్ని కట్టేశారు. గ్రామంలో స్వచ్ఛత పనులు చేపట్టకపోవడంతో ప్రధాన రహదారి, వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. సంబంధిత అధికారులు పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

ముందే వచ్చిన ముంజలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాధారణంగా తాటి చెట్లకు ముంజలు డిసెంబర్, జనవరిలో అధికంగా కాస్తాయి. కానీ ఈ ఏడాది అధిక వర్షాలతో వంకలు, వాగుల సమీపంలో ఉన్న తాటి చెట్లకు కాపు ముందే వచ్చింది. పెద్దకడుబూరు పరిధిలోని మేకడోణ, నౌలేకల్, ఎమ్మిగనూరు మండలం ఎస్.నాగలాపురం, పార్లపల్లి తదితర గ్రామాల్లో వాగులు పారుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న తాటి చెట్లకు కాపు కాశాయి. వీటిని కోసి వ్యాపారులు అమ్ముతున్నారు. ఆదోని-రాయచూరు రహదారిలో ఉన్న పెద్దతుంబలం రోడ్డులో తాటి ముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. డజన్ రూ.100కు విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారిపై వెళ్లే రాయచూరు, బళ్లారి, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాలకు చెందిన వాహనదారులు ముంజలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు నెలల ముందు కాసినట్లు వ్యాపారులు తెలిపారు.

తాటి కాయల నుంచి ముంజలు తీస్తున్న యువకుడు

వెలుగోడును ఆక్రముంచారు

- రూ.వంద కోట్ల భూములు అన్యాక్రాంతం
- యథేచ్ఛగా రాళ్లవాగు కబ్జా

ఈనాడు, నంద్యాల, న్యూస్‌టుడే, వెలుగోడు

అక్టోబరు చివర్లో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు వెలుగోడు పట్టణాన్ని ముంచేశాయి. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో సహా పలు ప్రాంతాల్లో మూడడుగులకు పైగా నీరు ప్రవహించింది. కొన్ని గంటలపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. వెలుగోడు చరిత్రలో ఇప్పటివరకు కనీసం ఎన్నడూ ఈ రీతిలో వరదలు ముంచెత్తడం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. దీనంతటికీ ప్రధాన కారణం.. పట్టణంలో ప్రవహించే రాళ్లవాగులో ఆక్రమణలే. ప్రధాన రహదారి చెంతనే ఉన్న ఈ వాగులో రెండు దశాబ్దాలుగా పెద్దగా నీరు పారిన దాఖలాల్లేవు. దీంతో ఆక్రమార్కుల కన్ను వాగు స్థలాలపై పడింది. పలువురు నాయకులు యథేచ్ఛగా ఆక్రమించి.. తప్పుడు సర్వే నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

రాళ్లవాగు భూమిలో నిర్మించిన సీసీ రహదారి

2 కి.మీలు.. వందకు పైగా నిర్మాణాలు

వెలుగోడు మీదుగా రాళ్లవాగు సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రవహించి మంచినీళ్ల వాగులో కలుస్తుంది. ఈ రెండు కిలోమీటర్ల పరిధిలోని విలువైన భూముల్లో వందకు పైగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కొందరు తెలివిగా ఆలయాలు నిర్మించారు. వాటి పక్కనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఆలయాలు ఉంటే కట్టడాల జోలికి అధికారులు రారన్న ఉద్దేశంతో గుళ్లు కట్టారని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల సహకారం

అక్రమార్కులకు వివిధ శాఖల అధికారులు తమవంతు సహకరించారు. ఆక్రమించిన స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లకు రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు సీసీ రహదారులు ఏర్పాటు చేశారు. ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్తుశాఖ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. వసతులు కల్పిస్తుండటంతో మరికొందరు ముందుకొచ్చి వాగు భూములను వాటాలేసుకున్నారు.

అధికారులకు కాసుల వర్షం

అక్రమార్కులు కొందరు పంచాయతీ అధికారులకు భారీగా ముడుపులు ఇచ్చి భవన నిర్మాణానికి అనుమతులు పొందుతున్నారు. ఆస్తిపన్ను వేయించుకుని సక్రమం చేయించుకుంటున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఓ అధికారిణి అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించారు. ఆమె బదిలీపై వెళ్లిన వెంటనే అనుమతులు ఇచ్చేయడం గమనార్హం.

పొంచి ఉన్న ముంపు ముప్పు

- ఆక్రమణలకు గురైన వాగు భూముల విలువ రూ.వంద కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. అంతటి విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా జల వనరులశాఖ అధికారులు చోద్యం చూశారు. వాగుతో పాటు బఫర్‌జోన్‌లో కూడా ఎలాంటి నిర్మాణాలు జరగకుండా కాపాడాల్సిన అధికారులే ఆక్రమార్కులకు కొమ్ముకాశారు. వాగులో ఆక్రమణలను తొలగించకపోతే భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి గ్రామంలోని వేలాది ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- వాగు భూములను సమగ్రంగా సర్వే చేయించి హద్దులు గుర్తిస్తే ఆక్రమణలు పూర్తిస్థాయిలో వెలుగు చూస్తాయి. ఎంత మొత్తం ఆక్రమణకు గురైంది? ఆక్రమిత భూముల్లో ఏఏ నిర్మాణాలున్నాయి తేల్చి చర్యలు చేపట్టాలని వెలుగోడు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

కన్యాకుమారికి యువకుల సైకిల్ యాత్ర

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వయసుతో సంబంధం లేకుండా శారీరక, మానసిక ఉల్లాసం కోసం సయ్యద్ అబ్దుల్లా, పుర్ ఖాన్ కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేపట్టారు. యాత్ర బుధవారం వెల్దుర్తికి చేరింది. సయ్యద్ అబ్దుల్లా, పుర్ ఖాన్ హైదరాబాద్ వాసులు. పుర్ ఖాన్ కశ్మీర్ నుంచి కన్యాకుమారికి, సయ్యద్ అబ్దుల్లా హైదరాబాద్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేపట్టారు. హైదరాబాద్ నుంచి సుమారు 1300 కి.మీ. దూరం ఉన్న కన్యాకుమారికి వారం రోజుల వ్యవధిలో చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. ఆరోగ్యంగా ఉండటమే అన్ని ప్రయోజనాలకు మూలమన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.

సైకిల్ యాత్ర చేపట్టిన సయ్యద్ అబ్దుల్లా, పుర్‌ఖాన్

ప్రతిభకు ఉపకారం.. భవితకు ప్రోత్సాహం

డిసెంబరు 7న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యను ప్రోత్సహించి ఆర్థిక సాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాల పరీక్ష(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్- ఎన్‌ఎంఎంఎస్)ను ఏటా నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చాటిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సాయం పొందవచ్చు.

పెరిగిన కర్నూలు.. తగ్గిన నంద్యాల

గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8,575 దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం 8,059 మంది ముందుకొచ్చారు. కర్నూలు జిల్లాలో 4,127, నంద్యాల జిల్లాలో 3,932 దరఖాస్తు చేసుకున్నారు. ఈ సారి కర్నూలు జిల్లా నుంచి ఎక్కువ దరఖాస్తులు రాగా.. నంద్యాల జిల్లా నుంచి గతేడాది కంటే తక్కువ దరఖాస్తులు రావడం గమనార్హం.

39 కేంద్రాల్లో నిర్వహణ

ఉమ్మడి జిల్లాలో 39 పరీక్ష కేంద్రాల్లో డిసెంబరు 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష 3 గంటల పాటు నిర్వహిస్తారు. రెండు విభాగాల్లో మొత్తం 180 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 90 మార్కులకు మెంటల్ ఎబిలిటీ టెస్టు, మరో 90 మార్కులకు స్కాలస్టిక్ ఎబిలిటీ టెస్టు(ఏడు, ఎనిమిది తరగతుల్లో గణితం, సామాన్య, సాంఘికశాస్త్రం) సబ్జెక్టుల్లో బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నలను ఇస్తుంటారు.

విశ్లేషణ సామర్థ్యం ఉండాలి - డా.టి.సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులు పాఠ్యాంశ సంబంధమైన జ్ఞానంతో పాటు మానసిక విశ్లేషణ నైపుణ్యాన్ని పెంపొందించే అంశాలను సాధన చేయాలి. ఎస్‌ఏటీ, ఎమ్‌ఏటీ రెండింటిలోనూ మంచి మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనాలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కువ సాధనతో మెంటల్ ఎబిలిటీపై అవగాహన కలిగి ఉండాలి.

మాక్ టెస్టులతో ఉపయోగం - బి.వెంకటేశ్వరరెడ్డి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు

సాంఘిక శాస్త్రంలో 35 ప్రశ్నలు వస్తాయి. వీటి నుంచి మంచి మార్కులు పొందేందుకు సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకోవాలి. ప్రతి యూనిట్‌లోని ప్రధానాంశాలను గుర్తుంచుకోవాలి. ప్రధాన తేదీలు, సంఘటనలు, రాజ్యాంగ నిబంధనలు వంటి వాటిని ప్రత్యేక దృష్టితో చదవాలి. సాధన కోసం పూర్వ ప్రశ్నపత్రాలను, మాక్ టెస్టులను, క్విజ్‌లను ఉపయోగించుకుంటే మంచిది.

తార్కిక ఆలోచన ముఖ్యం - ఎ.లక్ష్మీకాంతరెడ్డి, గణిత ఉపాధ్యాయుడు



ఏడు, ఎనిమిది తరగతులకు సంబంధించిన గణితశాస్త్రంలోని సంఖ్యలు, పరిక్రియలు, ఆకారాలు, నమూనాలు, పరిమాణం, బీజగణితం, క్యాలిక్యులస్ తదితరాలపై విశ్లేషణ, వాస్తవ జీవితంలో గణిత ఉపయోగాలు వంటి అంశాలపై పూర్తి విశ్లేషణను, అవగాహనను కలిగి క్షుణ్ణంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు.

సిలబస్‌పై అవగాహన తప్పనిసరి - పి.చిన్నరవినాయక్, సైన్స్ ఉపాధ్యాయుడు

సామాన్య శాస్త్రానికి సంబంధించిన 35 ప్రశ్నల్లో మంచి మార్కులు సాధించేందుకు 7, 8 తరగతులకు సంబంధించిన ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల్లోని కణనిర్మాణం, విధులు, ప్రత్యుత్పత్తి, సూక్ష్మజీవులు, మానవ శరీర వ్యవస్థ, పర్యావరణం వంటి అంశాలు గురించి క్షుణ్ణంగా అవగాహన చేసుకుంటూ చదవాలి.

అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండ

రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా కలెక్టర్

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలు అన్నారు. మండలంలోని ఆర్.కొంతలపాడులో బుధవారం 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' 2వ విడత నిధుల విడుదల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,72,757 మంది రైతులకు రూ.181.51 కోట్లు లబ్ధి చేకూర్చిందన్నారు. రైతులు గతేడాది కంటే ఈసారి ఎక్కువగా ఉల్లి పంటను వేశారని.. పంట వేసేటప్పుడు శాస్త్రీయ పరీక్షలు చేసి మంచి విత్తనాలను వాడటం లేదన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయారని.. అలా కాకుండా ఎత్తు మడులు వేసి ఉంటే పంట నాశనమయ్యేది కాదన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది అందించే సూచనలు రైతులంతా పాటించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 11 పత్తి మిల్లులను ఏర్పాటు చేశామన్నారు.

సాధన నిత్యం.. పతకాలు సొంతం

☛ క్రీడల్లో రాణిస్తున్న బాలికలు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు ఖోఖోలో రాణిస్తున్నారు. తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సూచనలతో సత్తా చాటుతున్నారు. మండల స్థాయి నుంచి విజయాలు సాధిస్తూ.. రాష్ట్ర స్థాయి వరకూ దూసుకెళ్లారు. ఈ నెలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడమే తమ లక్ష్యమని చెబుతున్నారు ఆత్మకూరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

శివకీర్తి

ఆత్మకూరు పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన రాజు, సుమలత కుమార్తె శివకీర్తి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్ ప్రోత్సాహంతో ఖోఖో క్రీడలో రాణిస్తోంది. అండర్-17 విభాగంలో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గతేడాది అక్టోబరులో జరిగిన మండలస్థాయి ఖోఖో పోటీల్లో రాణించడంతో జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. గతేడాది నవంబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. అనంతరం అనకాపల్లిలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. సీనియర్ విభాగంలో గతేడాది డిసెంబరులో కర్నూలులో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ ఏడాది సెప్టెంబరులో గన్నవరంలో జరిగిన సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. ఈనెల 22, 23వ తేదీల్లో విజయనగరంలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

ఖేలో ఇండియా జాతీయస్థాయిలో..

హారిక

ఆత్మకూరు పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన స్వాములు, వెంకట లక్ష్మి కుమార్తె హారిక. ఎనిమిదో తరగతి చదువుతూ వ్యాయామ ఉపాధ్యాయుడు మహబూబ్ సూచనలతో 'ఖోఖో'లో సత్తా చాటుతోంది. గతేడాది సెప్టెంబరు 21వ తేదీన ఆత్మకూరు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో గెలిచింది. సెప్టెంబరు 27న ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గస్థాయి పోటీల్లో ఆడింది. అక్టోబరులో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. గతేడాది నవంబరులో ప్రకాశం జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. అండర్-14 విభాగంలో కోయంబత్తూరులో జరిగిన ఖేలో ఇండియా సౌత్‌జోన్ టోర్నమెంటు జాతీయస్థాయి లీగ్ మ్యాచ్‌లో పాల్గొంది. సీనియర్ విభాగంలో గతేడాది డిసెంబరులో ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ ఏడాది అక్టోబరులో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సీనియర్ విభాగంలో మండలస్థాయి, నవంబరులో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈనెల 28, 29, 30వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

స్పర్శ దర్శనం, రూ.300 టికెట్లపై ఉచితంగా లడ్డూలు

- శ్రీశైలం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దర్శనానికి వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాలు ఇవ్వాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. కమాండ్ కంట్రోల్ హాల్‌లో బుధవారం ధర్మకర్తల మండలి ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులు సమావేశమయ్యారు. 14 అంశాలను అజెండాలో పెట్టి చర్చించారు. 11 అంశాలను ఆమోదించినట్లు ఛైర్మన్ వెల్లడించారు. 2 అంశాలు వాయిదా వేసి, ఒక అంశాన్ని తిరస్కరించినట్లు చెప్పారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. రూ.500 స్పర్శ దర్శనం టికెట్‌పై 100 గ్రాముల రెండు లడ్డూలు, రూ.300 టికెట్‌పై 100 గ్రాముల ఒక లడ్డూను ఉచితంగా భక్తులకు ఇవ్వాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానున్నట్లు వెల్లడించారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని కొలనుభారతి అమ్మవారి ఆలయాన్ని శ్రీశైల దేవస్థానం దత్తత తీసుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీశైలం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. స్థానిక చెంచులకు నెలలో ఒక రోజు శ్రీమల్లికార్జునస్వామి స్పర్శ దర్శనానికి ఉచితంగా అనుమతించనున్నట్లు చెప్పారు. కేంద్ర విచారణ కార్యాలయంలో గదులు, దర్శనం టిక్కెట్ల వివరాలు తెలిసే విధంగా డిజిటల్ డిస్‌ప్లేలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భక్తుల ఫిర్యాదుల లేఖలు వేసేందుకు సీఆర్‌ఓ కార్యాలయం వద్ద బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

శ్రీగిరిలో సమావేశమైన ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు

కబడ్డీ జట్టు సారథిగా హొళగుంద విద్యార్థిని

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

హొళగుంద, న్యూస్‌టుడే: కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి కర్నూలు జిల్లా అండర్-17 బాలికల జట్టు సారథిగా హొళగుంద విద్యార్థిని భూమిక ఎంపికైంది. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఈ విద్యార్థిని 9వ తరగతి చదువుతోంది. ప్రధానోపాధ్యాయుడు కబీర్, ఉపాధ్యాయులు బాలికను అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: మదిరె జడ్పీ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రంగన్న తెలిపారు. నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో సోమలింగ, అలేఖ్య, అండర్-17 విభాగంలో ఉషావాణి అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

పెద్దహరివాణం మండలం ఏర్పాటుకు దీక్షలు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలంలోని పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తూ.. ఆదోని పట్టణంలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నారు. ఈ దీక్షకు ఆదోని జనసేన పార్టీ నాయకులు గాజుల రాజశేఖర్, శ్రీనివాసులు, మలిశెట్టి రేణువర్మ, తాహెర్‌వలి, పులిరాజు, విక్రమ్, ప్రకాశ్, వెంకటేశులు మద్దతు తెలిపారు. తెదేపా సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, నాయకులు సైతం దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

రిలే దీక్షలకు మద్దతు తెలుపుతున్న జనసేన నాయకులు

రోడ్డు ప్రమాదాలు అరికట్టండి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా రహదారుల్లోని బ్లాక్ స్పాట్లలో రోడ్డు ప్రమాదాల నివారణకు నెల రోజుల్లోగా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి ఆర్‌అండ్‌బీ, హైవే అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసు శాఖ ప్రతిపాదించిన ఆర్‌అండ్‌బీ, హైవే అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ దారుల్లో రెండు మూడు నెలలకోసారి చెట్ల పొదలను తొలగించాలన్నారు. పెద్దపాడు- హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని కమిషనర్ విశ్వనాథ్‌ను ఆదేశించారు. ఆటోల్లో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు.

లారీ చోదకుడిపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన అజయ్‌పై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 18వ తేదీ స్థానిక కల్లూరు మహావీర్‌నగర్ ఎదుట 44వ నంబరు జాతీయ రహదారిపై ఆయన లారీతో ఢీ కొనడంతో కర్నూలుకు చెందిన రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు మృతి చెందారు. ఇంతియాజ్ అనే వ్యక్తి గాయపడ్డారు. లారీ చోదకుడు వాహనం వదిలి పరారయ్యాడు. పోలీసులు వాహనాన్ని నడిపింది అజయ్‌గా గుర్తించారు. అతివేగంతో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపాడని క్షతగాత్రుడు ఇంతియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్సురుద్దీన్ తెలిపారు.

CREATIVE EDUCATIONAL SOCIETY'S COLLEGE OF PHARMACY
NH-44, CHINNATEKUR, KURNOOL. A.P. - 518218
SPOT ADMISSIONS ON 22-11-2025
for left over seats of D.Pharm Course (AY 2025-26)
as per norms. Eligible Candidates Can Attend with all Necessary Certificates. Contact: 8142233361/454
SECRETARY

EENADU Classifieds
BUSINESS SERVICES
BUSINESS OFFER
మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647
JOBS
ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:7659988728
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నిర్మాణాలు పునరుద్ధరించుకోవాలి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో బీపీఎస్(బిల్డింగ్ పెనలైజేషన్ స్కీం)ను క్షేత్రస్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారి బాలమద్దయ్య తెలిపారు. పురపాలక కౌన్సిల్ హాల్‌లో ఇన్‌ఛార్జి కమిషనర్ నాసీర్‌హుసేన్ ఆధ్వర్యంలో బీపీఎస్ పథకంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ నెల 12న ఉత్తర్వులు వచ్చాయని, 120 రోజుల్లోపు దరఖాస్తు చేసుకొని, అనధికారిక, అనుమతుల్లేని నిర్మాణాలను పునరుద్ధరించుకోవాలన్నారు. గడువు దాటితే.. అనుమతుల్లేని వాటిని కూల్చివేతతో పాటు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు వంటి కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో ఎల్టీపీలు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి, విజయవంతం చేద్దామన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు కుష్ఠు వ్యాధి గురించి తెలుసుకోవాలని, సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పత్తికొండలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగో సచివాలయ పరిధిలోని 15వ వార్డులో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ సాయిబాబా, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణం కిలిచినపేటలోని పంచయ్యస్వామి మఠం సమీపంలోని వైవీధిలో మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. కొత్తగా కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలి. **- రామలింగయ్యస్వామి, ఆదోని**

✔: ఆ ప్రాంతంలో పర్యటించి, సమస్య పరిశీలించి.. పరిష్కరిస్తాం. **- నాసీర్‌హుసేన్, ఇన్‌ఛార్జి కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: చందోలి గ్రామంలోని బీసీ కాలనీతో పాటు, పాఠశాలకు వెళ్లే దారిలో నిత్యం మురుగు పారుతోంది. కాల్వలోకి మళ్లించి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. **- కాలనీవాసులు, చందోలి**

✔: పారిశుద్ధ్య పనులు చేపట్టి మురుగు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి**

అందని శుద్ధజలం.. యంత్రాలు నిష్ఫలం

◆ పాఠశాలల్లో వృథాగా ట్యాంకులు ◆ విద్యార్థులకు తప్పని నీటి కష్టాలు

పదే పదే అదే కథ

ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 750 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో గత ప్రభుత్వం నాడు- నేడు పథకం కింద సుమారు రూ.5 లక్షలు వెచ్చించి శుద్ధజల యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కొన్ని నెలలు మాత్రమే ఈ యంత్రం పనిచేసినా అప్పటి నుంచి చిన్న చిన్న మరమ్మతులకు గురవుతూనే ఉంది. ప్రస్తుతం పనిచేయడం లేదు. ఆదోని నియోజకవర్గం పరిధిలోని పట్టణ, మండలంలో 47 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శుద్ధజల యంత్రాలు ఏర్పాటు చేశారు.

పరిశీలన

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని శుద్ధజల యంత్రాలు చాలా వరకు పని చేయడంలేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ యంత్రాలు నిష్ఫలంగా మారాయి. మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ఫలితంగా విద్యార్థులకు శుద్ధజలం అందటం లేదు. విద్యార్థులకు శుద్ధజలం అందించాలనే లక్ష్యం బాగానే ఉన్నా.. అమలులో మాత్రం అప్పటి ప్రభుత్వం వైఫల్యం చెందింది. ప్రారంభంలో ఈ యంత్రాల నిర్వహణ కోసం కర్నూలు నగరం నుంచి సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసినా.. కొన్ని రోజులకు కొత్త సమస్య తలెత్తేది. బ్యాటరీ సమస్య, లీకేజీ, విద్యుత్తు సరఫరా.. తదితర సమస్యల కారణంగా సగానికి పైగా పాఠశాలల్లో ఈ యంత్రాలు పని చేయడంలేదు. ప్రస్తుతం సగానికి పైగా యంత్రాలు పనిచేయకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ఫలితంగా విద్యార్థులకు శుద్ధ జలం అందడంలేదు. ఆయా పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాల తీరును 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

నిర్వహణలేక మూలకు

పత్తికొండ, మద్దికెర, పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్దికెరలోని బాలుర ఉన్నత పాఠశాలలో 334 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శుద్ధజల యంత్రం పనిచేయడం లేదు. ఇక్కడ బోరున్నా అందుకు అవసరమైన విద్యుత్తు సౌకర్యం లేదు. దీంతో ఇక్కడ ఐదేళ్లుగా అది నిరుపయోగంగానే ఉంది. విద్యార్థులకు బోరు నీరే దిక్కవుతోంది. ఇక్కడ అవసరమైన త్రీఫేస్ విద్యుత్తు సౌకర్యం కల్పించలేదని దుస్థితి. అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

కొత్తలోనే పనిచేసి..

ఆలూరు, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం కొక్కరచేడు ప్రాథమిక పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులు ఉన్నారు. నిర్వహణ లేక మూలకు చేరాయి. కొన్ని రోజులు మాత్రం పనిచేరింది ఆ తర్వాత మూలకు చేరింది. ఆలూరు నియోజకవర్గంలో 88 పాఠశాలలకు శుద్ధజల యంత్రాలు అందించగా.. అందులో 46 పాఠశాలల్లో పనిచేయడం లేదు.

నిరుపయోగమే..

శ్రీరంగాపురం(వెల్దుర్తి), న్యూస్‌టుడే: శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. రూ.5లక్షలతో పాఠశాలలో శుద్ధజల యంత్రం ఏర్పాటు చేశారు. కొంతకాలంగా పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. విద్యార్థులు పాఠశాల ఎదుట ఉన్న నీటిపథకం వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. దెబ్బతిన్న శుద్ధజల పరికరం మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శుద్ధజలం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచి, అధికారులు

ప్రజలకు అందుబాటులో తాగునీరు

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి ప్రజలకు రూ.2 శుద్ధమైన 20 లీటర్ల తాగునీటిని అందిస్తామని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి మూలింటి రాధమ్మ, ఎంపీడీవో గీతావాణి, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, ఉప సర్పంచి వెంకటేశ్వరమ్మ, వార్డు సభ్యులు ఆలీబాషా, మహేష్, శ్రీదేవి, వెంకటరాముడు, హంపయ్య, కృష్ణమూర్తి, మాజీ కేడీసీసీ డైరెక్టర్ రాఘవేంద్ర, నాయకులు కేశవరెడ్డి, తిప్పయ్య, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు నేడు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం అమావాస్య సందర్భంగా మార్కెట్ యార్డు అధికారులు స్థానిక సెలవు ప్రకటించారు. రైతులు గుర్తించి పంట దిగుబడులు అమ్మకానికి తీసుకురావొద్దని సూచించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని వెల్దుర్తి, నార్లాపురం, అల్లుగుండు, మల్లెపల్లి, చెరుకులపాడు, కొసనాపల్లి, బింగిదొడ్డి, మదార్‌పురం గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు సిబ్బంది తెలిపారు. ప్రజలు సహకరించాలని వారు కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని-ఇస్వీ రైల్వే స్టేషన్ల మధ్య ఎల్‌సీ గేటు సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వర్ తెలిపారు. 50 నుంచి 60 సంవత్సరాల వయసు ఉంటుందని, కుడి చేతిపై కేసీ ఎన్టీఆర్ అనే పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడి వద్ద ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన ఓపీ కాగితం ఉందని.. అందులో నరసన్న అనే పేరు రాసి ఉందన్నారు. మృతదేహం వద్ద మాత్రలు లభ్యమయ్యాయన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాణసంచా దుకాణాలపై దాడులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పూలబజారులో గుట్టుచప్పుడు కాకుండా బాణసంచా విక్రయిస్తున్న దుకాణాలపై ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో మణికంఠ దుకాణంలో సుమారు రూ.40వేలు విలువ చేసే బాణసంచా నిల్వలను అధికారులు సీజ్ చేశారు.

రహదారులకు మహర్దశ

హొళగుంద, న్యూస్‌టుడే: చాలా ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రహదారులకు మహర్దశ వచ్చిందని తెదేపా మండల కన్వీనర్ తిప్పయ్య, తెదేపా టౌన్ అధ్యక్షుడు అయ్యప్ప స్వామి, పంపాపతి, దుర్గయ్య, అబ్దుల్ సుభాన్, వీరన్న గౌడ పేర్కొన్నారు. స్థానిక వాల్మీకి కూడలి వద్ద జరుగుతున్న సీసీ రహదారి పనులు పరిశీలించారు. ఢణాపురం రహదారి పనులు త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముద్దన్నగౌడు, తిక్కస్వామి, మోయిన్, వలి, జనసేన అశోక్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా పనులు పూర్తి చేయాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: మండలంలో హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందేదాక పోరాటం ఆగదని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, కార్యదర్శి ఆనందబాబు హెచ్చరించారు. పి.కోటకొండ నుంచి చెల్లెలచెలిమల, బంటుపల్లి, గుడిమిరాళ్ల, గుండ్లకొండ, నేలతలమర్రి, దేవనకొండకు బైకు యాత్ర చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు భారీగా పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక జర్నలిస్టు కాలనీలోని అయ్యప్పస్వామి, కేదారేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన వ్యాపారవేత్త మల్లేశ్వరరెడ్డి బుధవారం రూ.35వేల విరాళం అందించారు. ఆలయంలో కొలువైన అయ్యప్పస్వామికి వెండి తోరణం, కేదారేశ్వరస్వామి ఆలయ ముఖ మండప నిర్మాణానికి వీటిని వినియోగించాలని ఆలయ కమిటీ వారికి సూచించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గోపినాథ్‌నాయుడు, చిరంజీవి, మధు ఆయనను సన్మానించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆదోని: చెక్కు అందజేస్తున్న కూటమి నాయకులు, అధికారులు

పెద్దతుంబళం(ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సుఖీభవ-పీఎం కిసాన్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఏపీ సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కురవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు అన్నారు. పెద్దతుంబళం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమం ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది.

జి.ఎర్రగుడి(తుగ్గలి), న్యూస్‌టుడే: జి.ఎర్రగుడి గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేశారు.

మాట్లాడుతున్న ఆలూరు తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి

తుగ్గలి: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తదితరులు

ఆలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రైతులకు మేలు చేకూరుతుందని ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. ఆలూరు వ్యవసాయ కార్యాలయం వద్ద బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో 63,317 మంది అన్నదాతలు లబ్ధి పొందనున్నారన్నారు.

అన్నాభిషేకం చేస్తున్న శివస్వాములు

జలకంఠేశ్వరుడికి అన్నాభిషేకం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలో వెలసిన జలకంఠేశ్వరుడికి బుధవారం శివస్వాములు, అయ్యప్పస్వాములు అన్నాభిషేకం చేశారు. ఉదయం స్వామికి జలాభిషేకం, బిల్వార్చన, ఆకు పూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

IN THE COURT OF FIRST ADDL. CIVIL JUDGE (Sr. Div.) - CUM-MACT-V AT BELLARY

MVC No. 61/2024

Between:
Sri Madeeha Anjum ..**Petitioners**
And
Sri Dharwad Wasim Akram and Others ..**Respondents**

COURT NOTICE

To
R-2: Smt. Sagili Lakshmi Devei, Policy Holder of the Maxi-Cab bearing Regn. No: AP-07/TC-2407 Resident of House No: 1-18, Mandalur Main Road, Mandalur, Kurnool District. Andhra Pradesh (Vide Policy No: 10003/31/23/337565 Valid from 13-01-2023 to 12-01-2024.

Whereas the petitioner has filed the above claim petition against you and other respondents for seeking compensation took place on 08-10-2023 at about 16.45 hours infront of Sri Venkateshwara Granites Shop, Thirumala Nagar, Adoni Town.

You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the case or who shall be instructed and able to answer all such questions on the 5-2-26 at about 11.00 A.M. in the morning to show cause against the application filed by the petitioner in the above cases failing which the said application will be heard and dtermined exparte.

Given under my hand and the seal of the court this 19th Day of November 2025

By Order of the Court
Sd/- Sheristhedar,
First Addl. Civil Judge (Sr. Div.) - CUM-MACT-V at Bellary

Noor Mohammed
Advocate for Petitioners

పథకం నీరుగారింది

మద్దికెర మండలం బొజ్జనాయునిపేట గ్రామంలో 300 జనాభా ఉంది. తాగునీటి అవసరాలు తీర్చేందుకు గతంలో ఏర్పాటు చేసిన నీటి పథకం మూలన చేరి ముళ్ల పొదల్లో కలిసిపోయింది. నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈ పథకం ఉందన్న విషయాన్నే స్థానికులు మరచిపోయారు. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, బొజ్జనాయునిపేట (మద్దికెర)

అమృతాపురం.. వీధుల్లో విషం

హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామ పంచాయతీ మజరా గ్రామం అమృతాపురం గ్రామాలోకి వెళ్లే ప్రధాన దారిలోనే మురుగు స్వాగతం పలుకుతోంది. గ్రామంలో సరైన మురుగు కాల్వలు లేక ప్రధాన దారిపై చేరుతోంది. దుర్వాసన రావడంతో పాటు దోమలు, ఈగలు ప్రబలుతున్నాయి. గ్రామస్థులను రోగాలు చుట్టుముడుతునాన్నాయి. మురుగు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హాలహర్వి

బాలికలను శక్తిమంతం చేయాలి

చిప్పగిరి, న్యూస్‌టుడే: బాలికలను అన్ని రంగాల్లో శక్తిమంతం చేయాల్సిన అవసరం ఉందని జీసీడీవో స్నేహలత, విద్యాధికారిణి శావిత్రమ్మ అభిప్రాయపడ్డారు. చిప్పగిరి కస్తూర్బా విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాక్సిస్ ఇన్‌ఛార్జి నిర్వాహకులు వీణ, అరవింద, అమరిన్ బేగం, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపల్ సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

అనారోగ్యంతో జవాన్ మృతి

నాగార్జున (పాతచిత్రం)

మద్దికెర, న్యూస్‌టుడే: అనారోగ్యం బారిన పడిన జవాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మద్దికెరకు చెందిన నాగార్జున ఇండియా- టిబెట్ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్నారు. కామెర్ల వ్యాధితో పాటు, డెంగీ జ్వరం సోకడంతో సెలవుపై వచ్చి ఈ నెల 16న బళ్లారిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య భారతి, నాలుగేళ్ల కుమార్తె శ్రావ్య ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి 44వ జాతీయ రహదారి సమీపంలోని హనుమాన్ కూడలిలోని అంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమద్ వ్రతం నిర్వహిస్తున్నట్లు 51 అడుగుల హనుమాన్ విగ్రహ వ్యవస్థాపకులు రామాంజనేయులు తెలిపారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహిళా సాధికారిక కార్యక్రమం చేపట్టినట్లు గ్రంథాలయాధికారిణి తోటమ్మ తెలిపారు. ఉత్తమ సేవలు అందిస్తున్న వెల్దుర్తి బీసీ సంక్షేమశాఖ బాలికల వసతిగృహ వార్డెన్ గిరిజాదేవిని సన్మానించారు. మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీల ప్రజా ప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీవో కొండయ్య, పరిపాలనా అధికారిణి స్వర్ణలత తెలిపారు.

ఆలూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కృష్ణ డిమాండు చేశారు. ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో మద్దిలేటి స్వామికి బుధవారం వినతి పత్రం అందించారు.

పల్లె కబుర్లు

ఆర్ఎస్ పెండేకల్లు (తుగ్గలి), న్యూస్‌టుడే: సహకార వారోత్సవాలు సందర్భంగా కర్నూలు జిల్లా కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు మారెల్ల సహకార సంఘం సీఈవో మనోహర్ నాయుడు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారన్నారు.

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: జొన్నగిరి గ్రామంలో రామలింగేశ్వర స్వామిదేవాలయంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త గోపి, సభ్యులు సురేష్, బసవరాజు తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మిద్దె రవి, వెంకటేష్, మల్లికార్జున, బాలన్న, గ్రామ సర్పంచి ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది.. అధికారులు రారు

◆ తూతూ మంత్రంగా నిర్వహణ ◆ భాగస్వాములు కాని ఇతర శాఖలు

హాలహర్వి, ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి.. రైతులకు తగిన సూచనలు ఇవ్వడం.. రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం.. అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కల్పించడం.. ఇవన్నీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి మండలంలో మంగళవారం, బుధవారం రెండు గ్రామాల చొప్పున వారంలో నాలుగు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. దీనికి వ్యవసాయాధికారులతో పాటు, ఉద్యాన శాఖ, బిందు సేద్యం, పశుసంవర్ధకశాఖ, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు సైతం పాల్గొనాలి. ఇందులో రైతులకు సలహాలు, సూచనలు అందించాలి. ఇవేవీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

ఇదీ పరిస్థితి..

ఆలూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసింది. ప్రకృతి ప్రకోపం కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు దక్కని పరిస్థితి. రబీ సీజన్‌లోనైనా దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో సాగు ప్రారంభించారు. పంటల సాగులో కర్షకులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా.. క్షేత్రస్థాయిలోనే సలహాలు, సూచనలు అందించేలా కార్యక్రమం చేపట్టాలని భావించి రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోంది. మంగళవారం, బుధవారంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉదయం ఒక గ్రామంలో పొలంలో పంటలను పరిశీలించి, రైతులతో సమావేశం జరపాలి. మధ్యాహ్నం మరో గ్రామాన్ని సందర్శించాలి. ఈ కార్యక్రమం నవంబరు 4వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 18వ తేదీ వరకు జరిపేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

హలహర్విలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి

జరుగుతోందిలా..

అధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదు. రైతులకు సలహాలు, సూచనలు అదడం లేదు. కార్యక్రమాన్ని అధికారులు తూతూ మంత్రంగా జరిపించేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కేవలం ఫొటోలకు ఫోజులిచ్చేందుకే పరిమితమవుతున్నారు. ఫలితంగా ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

బుధవారం ఇలా హాజరు

- హాలహర్వి మండలంలో మండల వ్యవసాయాధికారి మాత్రమే పాల్గొన్నారు
- ఆస్పరి మండలంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు హాజరయ్యారు.
- హొళగుంద, చిప్పగిరి మండలాల్లో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.
- దేవనకొండ మండలంలో వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులు, ఆలూరు మండలంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశుసంవర్ధక, ప్రకృతి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

విద్యుత్తు సమస్యలుంటే ఫోన్ చేయండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, వాలిన తీగలు, లోవోల్టేజీ, ఒరిగిన స్తంభాలు, సమస్యలు ఉంటే నేరుగా అధికారులకు సమస్యలు విన్నవించవచ్చు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రజలు ఇళ్ల మీద వాలిన తీగలు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర విద్యుత్తు సమస్యలపై నేరుగా విద్యుత్తు ఈఈ, డీఈఈ, ఏఈలు సమాధానం ఇస్తారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల ప్రజలు సమస్యలు విన్నవించవచ్చని కోరారు.

తేదీ: 20.11.2025 గురువారం
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు
చరవాణి నంబరు: 80085 73824, 94405 93490

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,810

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,810 మధ్యస్థ ధర రూ.5,809 కనిష్ఠ ధర రూ.4,545లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,780 మధ్యస్థ ధర రూ.5,500 కనిష్ఠ ధర రూ.5,360 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794
కోసిగి 9550434095

నందవరం, న్యూస్‌టుడే: ?: కనకవీడు గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. రోజు వారీగా శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయండి. -రామాంజనేయులు, గ్రామస్థుడు

✔: గ్రామంలో రోజువారీగా శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తాం. -పుల్లయ్య, ఎంపీడీవో నందవరం

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

రైతును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రామ వేంద్రచౌదరి అన్నారు. బుధవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ కార్యక్రమం తెరపై ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు తిలకించేలా ఏర్పాటు చేశారు. అనంతరం చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తి, పప్పుధాన్యాలలో విత్తనోత్పత్తి, అధిక సాంద్రతలో పత్తి సాగు చేసిన ఉత్తమ రైతులను సన్మానించారు. కేవీకే సమన్వయకర్త మాట్లాడుతూ రబీలో మిరప, వేరుసెనగ, శనగ, మొక్కజొన్న పంటల్లో చేపట్టాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రీచందన, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దాహం తీర్చే గాజులదిన్నె

■ 16 గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ వరమిచ్చినా గత వైకాపా ప్రభుత్వం జనం గొంతు తడిపేందుకు మోకాలొడ్డింది. గాజులదిన్నె తాగునీటి పథకం పనులు అటకెక్కాయి. నిధుల మళ్లింపుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పథకం పనులు నిలిచిపోయి నిరుపయోగంగా మారాయి. ఫలితంగా 16 గ్రామాల్లో జనం దాహంతో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకానికి జలజీవన్ మిషన్ నిధులు మళ్లించి మరో రెండు గ్రామాలకు ఈ పథకాన్ని అనుసంధానం చేసి పనులు వేగవంతం చేశారు. వచ్చే వేసవి నాటికల్లా గ్రామాల్లో తాగునీటి సరఫరా చేసి ప్రజల దాహం తీర్చనుందని అధికారులు చెబుతున్నారు.

గాజులదిన్నె జలాశయంపై నిర్మించిన ఇన్‌టేక్‌వెల్

రూ.19.50 కోట్లతో పనులు

గోనెగండ్ల మండలంలో 13 గ్రామాలతో పాటు ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు గాజులదిన్నె జలాశయం వద్ద రూ.19.50 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టారు. ఇది వరకే 11 గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం కులుమాల, గాజులదిన్నె, పిల్లిగుండ్ల కైరవాడి గ్రామాలకు తాగునీటి పైపులైను పనులు జరుగుతున్నాయి. మొత్తం 52 కిమీ పొడవున పైపులైన్ పనులు 3 కిమీ పూర్తి చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి చెప్పారు. తాగునీటి పథకం పూర్తయితే 41,161 మంది జనాభాకు దాహం తీరుతుందని చెప్పారు. వేసవి నాటికి పైపులైను పనులు పూర్తి చేసి గ్రామాలకు తాగునీటి సరఫరా అయ్యే విధంగా నిర్మాణ పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి పథకం వివరాలు

పథకం: గాజులదిన్నె తాగునీటి మల్టీ విలేజ్ స్కీం	గ్రామాలు: 16
ఆధారపడిన మండలాలు: గోనెగండ్ల, ఎమ్మిగనూరు	పైపులైను పొడవు: 52 కిమీ
	పూర్తయిన పైపులైను పనులు: 3కిమీ
	జనాభా: 41,161 మందికి లబ్ధి

ప్రారంభమైన పనులు

తాగునీటి పథకం పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. సుమారు ఆరు నెలలుగా గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఆగిపోయిన తాగునీటి పథకం పనులపై గతనెల 5న తేదీన 'ఈనాడు'లో 'పైపులు దాటని పనులు' శీర్షిక వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు, ఎమ్మెల్యే స్పందించారు. తాగునీటి ట్యాంకు నిర్మాణంతో పాటు గ్రామాలకు తాగునీటి పథకం పనులు చేపట్టారు. పనులు ఊపందుకోవడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి కాలం నాటికి పనులు పూర్తి
-జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు.

గాజులదిన్నె ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న గోనెగండ్ల మండలంలోని చాలా గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. వారి అవస్థలు గుర్తించి 2014లో తాగునీటి పథకాన్ని తీసుకొచ్చి 40శాతం మేరకు పనులు చేపడితే వైకాపా నాయకులు పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. అధికారంలోకి వచ్చిన తక్షణమే నిధులు విడుదల చేయించి కొత్త రూపం తీసుకొచ్చాం. వేసవి నాటికల్లా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నా. పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద యువతకు, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్రోన్ ఆపరేటర్, అఫిషియల్ డెవలప్‌మెంట్ వంటి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 21వ తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతి, యువకులు నేరుగా కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దుకాణాల సముదాయానికి భూమి పూజ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కమిషన్, వ్యాపార దుకాణాలకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేశారు. రూ.2.74కోట్లతో కోసిగి రహదారిలో 20 వ్యాపార దుకాణాలు, 20కమిషన్ దుకాణాలు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఛైర్మన్ మల్లయ్య, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం

◆ ఈనాడు ఆధ్వర్యంలో వైద్యశిబిరం, అవగాహన కార్యక్రమం

సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు, కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి రోగాల బారిన పడకుండా ఉండాలంటే చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.నాగరాజు అన్నారు. సగానికిపైగా రోగాలబారిన పడటానికి తాగునీరే కారణమన్నారు. బుధవారం కోడుమూరు పట్టణంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెపోటుకు గురైన వ్యక్తులను కాపాడే సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు 578 మంది విద్యార్థులు చదువుతుండగా.. 481 మంది హాజరయ్యారు. దాదాపు 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆశాజ్యోతి, బోధనా సిబ్బంది మాదన్న, హేలీ, రాధ, వత్సల, సీనియర్ నర్సింగ్ అధికారి లక్ష్మీ, అడల్సెన్స్ కౌన్సెలరు స్వేత, ఎంఎన్‌వో అంపయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మెగా చెక్కును అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

కౌతాళం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రాలయం తెదేపా బాధ్యుడు రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం కౌతాళంలో నిర్వహించిన పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాఘవేంద్రరెడ్డి, తెదేపా మండలాధ్యక్షుడు సురేష్‌నాయుడు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో 41,992 మంది రైతు కుటుంబాలకు రూ.27.616 కోట్లు రైతుల ఖాతాలో జమకానుందని అన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి అన్నదాతలకు రూ.20వేలు ఇస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాజపా బాధ్యుడు విష్ణువర్దన్ రెడ్డి, జనసేన బాధ్యుడు లక్ష్మణ్, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు, బోయమారెప్ప, అడివప్పగౌడు, టీబీపీ ఛైర్మన్ టిప్పుసుల్తాన్, పట్టాభి, కురువ వీరేష్, సతీష్‌నాయుడు, మార్కెటు యార్డు ఛైర్మన్ నర్సారెడ్డి, తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శేషాద్రి, జనసేన మండల బాధ్యుడు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల అభివృద్ధే ధ్యేయం: బీవీ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం దైవందిన్నెలో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 38,318 మంది రైతులకు రూ.25.78కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. కూరగాయలు, విత్తనాల స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.మహమ్మద్‌ఖాద్రీ, తహసీల్దారు శేషఫణి, ఏవోలు శివశంకర్, హేమలత, మార్కెట్ వైస్ ఛైర్మన్ బోయ అంజిని పాల్గొన్నారు.

పార్టీలో చేరేవారికి సముచిత న్యాయం

ఎమ్మెల్యే బీవీ సమక్షంలో తెదేపాలోకి చేరిన వైకాపా నాయకులు

ఎమ్మిగనూరు, గోనెగండ్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రావడంతో అందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో బుధవారం గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామానికి చెందిన వైకాపా నేతలు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. కొత్తగా పార్టీలో చేరే ప్రతి ఒక్కరికీ సముచిత న్యాయం చేస్తామన్నారు. వైకాపా ఎంపీటీసీ నాగరాజు, మాజీ ఎంపీటీసీ బందేనవాజ్, నాయకులు ప్రహ్లాదతో పాటు 50 మంది తెదేపాలో చేరారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, రమణచౌదరి, బేతాళబడేసాబ్, రామాంజనేయులు, తిమ్మారెడ్డి, మురళీనాయుడు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని అవస్థలు

పాఠశాలలో తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతంలో ఉన్న పబ్లిక్ కుళాయి దగ్గరకు వెళ్లి అవస్థలు పడుతూ దాహం తీర్చుకుంటున్నారు. కోసిగి మండలంలోని చిన్న భూంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 420 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో నీటి వసతి లేకపోవడంతో ప్రతిరోజు విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, ఇతర అవసరాల కోసం 150 మీటర్ల దూరంలో ఉన్న కుళాయి దగ్గరికి వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కోసిగి

ఈవో లేక నిత్యం ఇబ్బందులు

కోడుమూరు మేజరు గ్రామపంచాయతీకి ఉన్న ఈవో బదిలీపై వెళ్లారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి ఈవో లేకపోవడంతో కోడుమూరు మండల పరిషత్తు కార్యాలయంలోని ఈవోఆర్డీ.. ఇన్‌ఛార్జి ఈవోగా కొనసాగుతున్నారు. ఉన్నతాధికారి లేకపోవడంతో గత నాలుగు నెలలుగా ఇబ్బందులు తప్పడం లేదు. మండల పరిషత్తు పరిధిలోని గ్రామాలు, మరోవైపు మేజరు గ్రామపంచాయతీ విధులు రెండు ఈవో ఆర్డీ చూసుకోవాల్సి ఉంది. దీంతో వారంలో ఒకసారి కూడా రాలేని పరిస్థితి నెలకొంది. శాశ్వత ఈవో నియమించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కోడుమూరు

విరిగిన స్తంభం తొలగించండి

నగర పంచాయతీలోని తూర్పు బీసీ కాలనీ చివరి వీధిలో రహదారి పక్కనే విరిగిపోయి వేలాడుతున్న స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఎప్పుడు పడుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విరిగిన స్తంభం స్థానంలో పక్కనే కొత్తది ఏర్పాటు చేశారు. కానీ పాతది తొలగించలేదు. సంబంధిత అధికారులు స్పందించి విరిగిన స్తంభంను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

మందులకు మంట పెట్టి

రోగులకు పంపిణీ చేయాల్సిన విలువైన మందులను గ్రామ శివారులో కాల్చివేశారు. గోనెగండ్ల మండలంలోని నెరుడుప్పల గ్రామ పంచాయతీలో సుమారు 4వేల జనాభా ఉంది. పంచాయతీలో మజరా గ్రామమైన పిల్లిగుండ్లలో ప్రజలు సీజనల్ వ్యాధుల్లో బాధపడుతున్నారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి సకాలంలో మందులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలకు ప్రతినెలా మందులు పంపిణీ చేస్తోంది. కానీ వాటిని రోగులకు పంపిణీ చేయకుండా విలువైన మందులను పంపిణీ చేసినట్లు దస్త్రాల్లో చూపి.. గ్రామ శివారులో దహనం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

సంక్షిప్త సమాచారం

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని ఓ పురాతన గృహంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఎలాంటి నష్టం జరగలేదు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంపై సర్పంచులు, కార్యదర్శులు, ఉపసర్పంచులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో రాణెమ్మ పాల్గొన్నారు.

కోసిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆదిఆంధ్ర పాఠశాల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు మల్లిఖార్జున, కృష్ణమూర్తిలు ఎంఈవో బాలయ్యకు వినతిపత్రం అందజేశారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: ఉపాధి పనుల్లో లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఏపీడీ లోకేశ్వర్ పేర్కొన్నారు. సి.బెళగల్‌లో ఏపీవో రామన్న అధ్యక్షతన నిర్వహించిన డ్వామా సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: పట్టణాల్లోని వీధి వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించి, వారి జీవనోపాధి మెరుగు పర్చాలన్నదే పీఎం స్వనిధి లక్ష్యం అని ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ పవన్ అన్నారు. స్వనిధి సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలో ఐదు మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమాధికారి భాస్కర్ అన్నారు. సి.బెళగల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కౌతాళం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని కామవరం గ్రామానికి చెందిన వివాహిత కనిపించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.6.48కోట్లు జమైనట్లు ఏవో మల్లేషు కుమార్ తెలిపారు.

గోనెగండ్ల,న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాలను స్వచ్ఛహరిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. బుధవారం గోనెగండ్ల ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛ హరిత గ్రామాల ఏర్పాటుపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో ప్రజలకు కలిగే ప్రయోజనాలను విద్యార్థి దశ నుంచే గుర్తించాలని ఎంఈవో జ్యోతి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలకు హాజరయ్యారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోనే మహిళా సాధికారిత సాధ్యమని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయరాణి అన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: దేశానికి మహిళా శక్తి ఎంతో అవసరమని సీడీపీవో రాజేశ్వరి అన్నారు. మంత్రాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండు చేశారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి.

ఘనంగా ముర్తుజా ఖాద్రి వలి ఉరుసు

గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తూ..

కౌతాళం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో కొండపై వెలసిన సయ్యద్ షా ముర్తుజా ఖాద్రి వలి ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దర్గా ధర్మకర్తల ఇంటి నుంచి తెల్లవారుజామున గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉరుసు సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక పాతెహా నిర్వహించారు.

దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యలు

సి.బెళగల్, గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా సి.బెళగల్ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ప్రాంతీయ పార్టీ నాయకుడు జె.మోహన్ అన్నారు. బుధవారం ఆయన జీపుజాతాకు శ్రీకారం చుట్టారు. ఈ జీపుజాత పలుకుదొడ్డి, సంగాల, తిమ్మందొడ్డి, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, పోలకల్ గ్రామానికి చేరింది. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అక్బరు, సుంకన్న, వెంకన్న,వెంకట్, చంద్రశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

పదిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని గురుకుల విద్యాలయాల కోఆర్డినేటరు శ్రీదేవి పేర్కొన్నారు. సి.బెళగల్ గురుకుల వసతిగృహాన్ని బుధవారం రాత్రి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు రాత్రి విధుల్లో ఉపాధ్యాయుల బోధనపై ఆరాతీశారు. వంటగదుల్లో, వసతిగృహాల్లో పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీరు, రోడ్లు, కాల్వల శుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. సోమప్పనగర్‌లో బుధవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కొత్తగా 15వ ఆర్థిక సంఘం నిధులు కింద కొన్ని పనులు చేపట్టామన్నారు. కొన్ని రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

వీరశైవులు ఐకమత్యంగా ఉండాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వీరశైవులు ఐకమత్యంగా ఉండి ఆచార, సంప్రదాయాలను పాటించాలని వీరశైవ లింగాయతి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్రగౌడ్ అన్నారు. బుధవారం వీరశైవ కల్యాణ మంటపంలో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ ఛైర్మన్ పురుషోత్తంగౌడ్, పొంపాపతిస్వామి, రుద్రమునిస్వామి, నాగయ్యస్వామి, వీరశైవ సంఘం నాయకులు నాగరాజుగౌడ్, ఈశ్వరప్ప, మూర్తి, ఈరన్న, పరమేశప్ప, చంద్రశేఖర్, గూళ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీరశైవ లింగాయతి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్రగౌడ్

అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటు

జ్యోతి వెలిగిస్తున్న రెడ్ల సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సమాజంలో అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మిగనూరు రెడ్ల సంఘం నాయకులు చెన్నారెడ్డి అన్నారు. రెడ్ల సంఘం వనభోజన కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని వెల్ఫేర్ కాలనీలోని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ కోసం 1.30 ఎకరాల స్థలం ఉందని నిర్మాణానికి అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, రెడ్ల సంఘం నాయకులు రఘునాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, సీతారామిరెడ్డి, నరవ రమాకాంత్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపద్మనాభ తీర్థుల మధ్యారాధన

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలో నవవృందావన గడ్డలో కొలువైన శ్రీపద్మనాభ తీర్థుల మధ్యారాధన ఉత్సవాల్లో శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీపాదరాజమఠం పీఠాధిపతి సుజయనిధి తీర్థులతో కలసి బుధవారం స్వామి బృందావనానికి విశేష పంచామృతం నిర్వహించి, పుష్పాలతో అలకరించి, మంగళహారతులు ఇచ్చారు.

పారిశుద్ధ్య కార్మికుల రక్షణ అందరి బాధ్యత

నందవరం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు సైలెన్సర్‌లో నిప్పురవ్వలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్సు సైలెన్సర్‌లో స్వల్పంగా మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కోసిగి-ఎమ్మిగనూరు బస్సు దాదాపు 50మందికిపైగా ప్రయాణికులతో వస్తోంది. స్థానిక సోమప్ప నగర్ సమీపంలో బస్సు కింది భాగంలో మంటలు వచ్చాయి. డ్రైవర్ చూసి వెంటనే బస్సును నిలిపివేశారు. బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురై కిందికి దిగిపోయారు. ఇదే విషయమై డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు దృష్టికి తీసుకెళ్లగా సైలెన్సర్‌లో చిన్నపాటి నిప్పురవ్వలు వచ్చాయని.. ఎలాంటి ప్రమాదం లేదన్నారు. అలాగే ఎమ్మిగనూరు-కోసిగి వెళ్లే బస్సులో దాదాపు 130 మంది ప్రయాణికులు ఎక్కడంతో ఆన్‌కాల్ డ్రైవర్ బస్సును బస్టాండు సమీపంలో వదిలేసి వెళ్లారు. దీంతో అధికారులు మరో డ్రైవర్‌ను పిలిపించి బస్సు కోసిగికి పంపారు.

పత్తి కొనుగోలు కేంద్రంలో రైతుల ఆందోళన

రైతులు, కొనుగోలుదారులకు సర్దిచెబుతున్న తహసీల్దారు వెంకటేశ్‌నాయక్

కోడుమూరు, గూడూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని పెంచికలపాడు మంజీత్ కాటన్ మిల్లులో మరోసారి పత్తి రైతులు ఆందోళన చేశారు. రైతులు పెద్దమొత్తంలో పత్తి తీసుకొస్తుండటంతో వంకలు పెట్టి మరీ పత్తి రేటును కుదిస్తున్నారని తరచూ రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. బుధవారం పలు ప్రాంతాల నుంచి రైతులు పత్తి తీసుకొచ్చారు. కొనుగోలుకు సీసీఐ వారు అంగీకరించక పోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. సమస్యను కొనుగోలుదారుడు రాష్ట్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టరు, ఆర్డీవోలను ఆదేశించారు. హుటాహుటిన రాత్రి 7గంటల సమయంలో గూడూరు తహసీల్దారు వెంకటేశ్‌నాయక్ పెంచికలపాడులోని మంజీత్ పత్తి కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు. ఇరు వర్గాలకు సర్దిచెప్పి పత్తి కొనుగోలు జరిగేలా చూశారు. ఇటీవల ఇదే పత్తి కొనుగోలు కేంద్రంలో ధరల విషయంతో రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసి ఎంపీ నాగరాజు జోక్యం చేసుకోవడంతో సమస్య తీరింది.

ధరలకు రెక్కలు.. కొనేవారికి చుక్కలు

■ కూరగాయలు కొనలేని పరిస్థితి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలో కొద్ది రోజులుగా కూరగాయల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో పలు రకాల కూరగాయలు కిలో రూ.50 నుంచి రూ.80 వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో ప్రస్తుత ధరలకు మహిళలు కిలో కూరగాయాలు కొనే చోట అర కిలోతో సరిపెడుతున్నారు. మరోవైపు కార్తిక మాసం కావడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరలు ఇలాగే ఉంటే ఏం కొనాలన్నా ఆలోచించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

■ పంటలకు తెగుళ్లు సోకి

ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరి కూరగాయలు, ఆకుకూరలు పంటల దిగుబడులు తగ్గాయని, భూమిలో తేమ శాతం తగ్గకపోవడంతో పంటలకు తెగుళ్లు సోకి పాడయ్యాయి. దీనివల్ల ధరలకు రెక్కలొచ్చాయని వ్యాపారులు అంటున్నారు.

ప్రస్తుతం ధరలు ఇలా

రకం	కిలో... రూ.లలో
పచ్చిమిర్చి	80
కాకరకాయ	80
వంకాయ	60
క్యాలీఫ్లవర్	80
క్యారెట్	80
బీన్స్	120

☛ గూడూరు మండల పరిధిలో కూరగాయల పంటలు సాగు పెద్దగా లేకపోవడంతో ఇతర జిల్లాలు నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. రవాణా ఖర్చులు అధికం కావడంతో ధరలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. ఈ భారం వినియోగదారులపై పడటంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగాయని అంటున్నారు.

☛ టమాటా రేటు అందుబాటులోనే ఉన్నా అధిక వర్షాల కారణంగా పంటకు తెగులు, మచ్చలు సోకి పండు నాణ్యత తగ్గింది.

మార్కెట్‌లో కూరగాయలు కొంటున్న ప్రజలు

అర కిలోతో సరిపెడుతున్నాం
శ్రీనువాసులు
మారందొడ్డి, స్థానికుడు

మార్కెట్‌కు రూ.500 తీసుకొని వెళ్తే వారం రోజులకు సరిపడా కూరగాయాలు వచ్చేవి. ప్రస్తుతం చిన్న సంచికి సరిపడా కూడా కూరగాయలు రావడం లేదు. వంటలు రుచిగా ఉండాలంటే మంచి కూరగాయలు ఉండాల్సిందే. కూరగాయలు లేనిదే ఏ వంట చేయలేం. గతంలో కిలో కూరగాయలు కొనే వాడిని. ప్రస్తుతం అర కిలోతో సరిపెడుతున్నాం. ధరలు తగ్గుతాయనే ఆశతో వారానికి రెండు సార్లు కూరగాయలు కొంటున్నా.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

ఉద్యోగికి ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న అధికారులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉద్యోగులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో రామాంజనేయులు అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్, కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. సహకార సంఘాల ఉద్యోగులు తదితరులు రక్తదానం చేశారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: గురువారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి నగర్, సోమప్పకాలనీ, ఎన్‌సీసీ క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం డీ2 సెక్షన్ ఏడీఈ చంద్రమోహన్ వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ?: గురు రాఘవేంద్రనగర్, నిర్మల్‌నగర్‌లలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి పెరిగిపోతున్నాయి. వెంటనే మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లించాలి. **- గోపాల్, స్థానికుడు**

?: శరీన్‌నగర్‌లో కుక్కల బెడద ఉంది. వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. **- స్థానికులు**

✔: ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక అధికారులు**

వాణిజ్య కేంద్రం.. రద్దీతో నరకం

గాయత్రీఎస్టేట్‌లో స్తంభించిపోయిన ట్రాఫిక్

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలు నగరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య కూడలి సమీపంలోని గాయత్రి ఎస్టేట్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిని అనుకుని ఉండే కాలనీ కావడంతో వాణిజ్య కేంద్రంగా మారింది. 50కి పైనే చిన్న, పెద్ద ఆసుపత్రులు, క్లినిక్‌లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, బ్యాంకులు, చిట్‌ఫండ్, ఇతర వ్యాపార కేంద్రాలు, ఓ ప్రైవేటు కళాశాల ఉన్నాయి. వేలాది మంది ప్రజలు ఆసుపత్రుల కోసం ఇక్కడకు వస్తుంటారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు కాలనీ జనం, వాహనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది.

వాహనాలు నిలిపే చోటేది?

బహుళ అంతస్తుల్లో కొనసాగుతున్న ఆసుపత్రులు, వాణిజ్య కేంద్రాలకు సరైన పార్కింగ్ స్థలాలు లేవు. ప్రధానంగా ఐదు అంతస్తు భవనాల్లో కొనసాగుతున్న పేరుమోసిన ఆసుపత్రులకు సైతం పార్కింగ్ లేకపోవటం గమనార్హం. దీంతో అక్కడకు వచ్చే వారు వాహనాలను రోడ్ల పక్కనే నిలుపుతున్నారు. పెద్ద వాహనాలు నిలిపిన సమయాల్లో రహదారి మరింత ఇరుకుగా మారి సమస్య తీవ్రమవుతోంది. రద్దీలో చిక్కుకున్న వారు బయటపడాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. రోగులు, వృద్ధులు వాయు, శబ్ద కాలుష్యంతో నరకం అనుభవిస్తారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనం వెళ్లలేని పరిస్థితి. సంబంధిత శాఖలు సమన్వయంతో సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పొగ.. ఆరోగ్యానికి పగ

★ నగరంలో పలు చోట్ల చెత్త, వ్యర్థాలకు నిప్పు

★ పర్యావరణానికి తప్పని ముప్పు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరం రోజురోజుకూ కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. నిత్యం ఏదో ఒక చోట తగలబడుతున్న చెత్త, వ్యర్థాలు ప్రజారోగ్యానికి సంకటంగా మారుతున్నాయి. జాతీయ రహదారులను ఆనుకొని ఉండే కాలువల పక్కన చెత్త, వ్యర్థాలను కాలుస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను మాత్రం తొలగించడం లేదు. దీని వల్ల ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికారులు సైతం నిర్లక్ష్యం వహిస్తుండటంతో నగరం నిత్యం పొగ మయమవుతోందని పురవాసులు వాపోతున్నారు.

ఇష్టారాజ్యంగా కాల్చివేత

కర్నూలు నగరపాలక పరిధిలో సుమారు 1079 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారు. వీరితో పాటు అదనంగా డీ షీల్ట్ వర్కర్లు 200 మంది వరకు పనిచేస్తున్నారు. రోజు నగరంలో 225 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. దీనిని డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. అయితే ఖాళీ స్థలాల్లో మాత్రం చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇవి కాలువల్లోకి చేరి మురుగు పారుదలకు సమస్య ఏర్పడుతోంది. పలు సందర్భాల్లో చెత్తకు నిప్పు పెడుతున్నారు. ఫలితంగా జనం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రహదారులు, నది సమీప ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను కాల్చివేస్తున్నారు.

ఈ చిత్రం కల్లూరు పట్టణం రాఘవేంద్రనగర్ సమీపంలోనిది. సర్వీసు రోడ్డును ఆనుకుని పాద బాట ఉంది. దాని పక్కన ఖాళీ స్థలంలో చెత్త, వ్యర్థాలను పారేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. వాటికి నిప్పు పెడుతుండటంతో అటుగా వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు.

పట్టణంలోని హంద్రీ నది సమీపంలోనిది ఈ చిత్రం. నది సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. పొగ సైతం విపరీతంగా వ్యాపిస్తోంది. దీంతో వంతెనపై రాకపోకలు సాగించే వారికి అవస్థలు తప్పడం లేదు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

- చెత్తకు నిప్పు పెట్టడం వల్ల వాయు కాలుష్యం జరిగి పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. అగ్నిప్రమాదాలు జరగడంతో ఒక్కోసారి ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తుంది.
- విష వాయువులు గాలిలో కలిసిపోతాయి. దీంతో శ్వాసకోశ, చర్మ ఇతర ఆరోగ్య పరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్ కారణంగా మెదడు, గుండెకు నష్టం కలుగుతుంది.
- వ్యర్థాలు మండించడం వల్ల భూగర్భ జలాలు సైతం కలుషితం అవుతాయి.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ.. పంట పొలాల్లో కొందరు విత్తనాలతో గంజాయి సాగు చేస్తున్నారని.. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గుర్తించి పోలీసుశాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకున్నట్లు గుర్తించే డ్రగ్ అడిక్షన్ కిట్లను తెప్పించాలని డీఎంహెచ్ఓ డా.భాస్కర్‌ను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ విశ్వనాథ్, డీటీసీ శాంత కుమారి, ఈగల్ ఎస్సై సుజన్‌కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

ఎండుమిర్చి గరిష్ఠ ధర రూ.13,608

కర్నూలు మార్కెట్: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో వివిధ పంట ఉత్పత్తుల ధరలు ఇలా ఉన్నాయి. మార్కెట్‌కు 33 క్వింటాళ్ల ఎండుమిర్చి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.4,599, మధ్యస్త ధర రూ.5,689, గరిష్ఠ ధర రూ.13,608 పలికింది. వేరుసెనగకాయలు గరిష్ఠ ధర రూ.7,000, ఆముదాలు రూ.5,789, మొక్కజొన్నలు రూ.1,769, కందులు రూ.6,297, శనగలు రూ.3,339, మినుములు రూ.4,409కు వ్యాపారులు కొన్నారు.

రహదారులే పశువుల అవాసాలు

పట్టణంలో పశువులు రోడ్డుపైనే సంచరిస్తున్నాయి. కొత్తబస్టాండు సమీపంలోని పుచ్చలపల్లి సుందరయ్య జంక్షన్ నుంచి ఇందిరాగాంధీ నగర్, సీతారాం నగర్, ఇల్లూరు నగర్, అశోక్ నగర్ పంపోహౌసుకు వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం పశువులు నడిరోడ్డుపైనే ఉంటున్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బంది కలగడమే కాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. నగరపాలక యంత్రాంగం పశువుల యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నిర్లక్ష్యానికి ఏడాదిన్నర

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలవుతున్నా కల్లూరు మండలం చిన్నటేకూరులో రైతు సేవా కేంద్రం పేరు మారలేదు. నేటికీ డా. వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రంగానే కొనసాగుతోంది. ఈ కేంద్రంపై నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రం దర్శనమిస్తోంది. గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. అయితే చిన్నటేకూరులో కనిపిస్తున్న కార్యాలయం బోర్డు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కానవస్తోంది. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి

మాట్లాడుతున్న ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.వెంకటేశ్వర్లు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: సర్వజన వైద్యశాలలో వివిధ విభాగాల్లో చేరిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. తన ఛాంబర్‌లో బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సర్వజన వైద్యశాలలో పరిపాలన పనితీరు మరింత వేగవంతం కావడంపై దృష్టి పెట్టాలన్నారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడాల్సి ఉందన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రిలో జరుగుతున్న పార్కింగ్ స్థలాల అభివృద్ధి పనులను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డా. నాగేశ్వరరావు, డా.లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ప్రత్యేక భవనానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డా. గోవిందరెడ్డి తదితరులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ కార్యాలయంలో తలసేమియా బాధితులకు ప్రత్యేక వైద్యసేవల కోసం ఏర్పాటు చేయాల్సిన భవనం కోసం బుధవారం మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా తలసేమియా బాధితులు సుమారు వెయ్యి మంది వరకు ఉన్నారని.. వారికి వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి కోసం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక భవనం నిర్మాణంతో పాటు ఆధునిక సౌకర్యాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. భవనం నిర్మాణానికి మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ సహకారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డా. కె.వి.సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, దాశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపన్యసించారు.. బహుమతులు పట్టారు

విజేతలతో ఉపాధ్యాయులు

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపన్యాస పోటీల్లో పాల్గొనడంతో వాక్పటిమతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలో ఉన్న ఇందిరాగాంధీ మెమోరియల్ పురపాలక పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం 'సెల్ ఫోన్ వినియోగం' అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చరవాణులకు ఆకర్షితులు అయితే మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. కంటి చూపు మందగించడంతోపాటు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలైన ఫిరోజ్, వైష్ణవి, అనురాధకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని.. అందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను భేషరతుగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఓర్వకల్లులోని పొదుపు భవనం ఆవరణలో బుధవారం అన్నదాత సుఖీభవ రెండో విడత చెక్కును అందజేశారు. ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, కల్లూరు మండలాలకు చెందిన 27,378 మంది రైతులకు గాను రూ.22.08 కోట్ల మెగా చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనతికాలంలోనే రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత దక్కించుకుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. తితిదే పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పార్వతమ్మ, ఏడీఏ రాజశేఖర్, తహసీల్దారు విద్యాసాగర్, ఎంపీడీవో నాగఅనసూయ పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే జైలుశిక్ష

కర్నూలు నేరవిభాగం: మద్యం మత్తులో వాహనాలు నడిపితే నెలరోజుల పాటు జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ 17 వరకు 8051 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలి

చిన్నటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలని డీపీవో భాస్కర్ ఆదేశించారు. కల్లూరు మండల పరిధి చిన్నటేకూరు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని టి.ఎన్. గ్రంథాలయ అధ్యక్షుడు కె.ప్రభాకర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక ముజఫర్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేసినట్లు తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ తెలిపారు. 'డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా బి.క్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థినులు అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని శక్తి టీమ్ సభ్యుడు విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె ఉన్నత పాఠశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, సామాజిక మాధ్యమాల ప్రభావం తదితర వాటితో పాటు శక్తి యాప్ గురించి తెలుసుకుని ఉండాలన్నారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: స్వామిత్వ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశించారు. అమరావతి నుంచి బుధవారం నిర్వహించిన వీసీలో డీపీవో భాస్కర్, డీఎల్‌పీవో తిమ్మక్క, డీఎల్‌డీవో రమణా రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగఅనసూయ అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులకు బుధవారం పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించటంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణకు సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామైక్య సంఘం సభ్యులు, స్వయం సహాయక సంఘం సభ్యులు హాజరయ్యారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

పూజలో పాల్గొన్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక పార్క్‌రోడ్ సమీపంలోని గోశాల కేంద్రంలో బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు శశిధర శర్మ కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించారు. కార్తికమాసం సందర్భంగా గత నెల రోజులుగా గోశాల కేంద్రంలో ప్రతిరోజు శివపూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహిస్తున్నామని గోశాల కేంద్రం నిర్వాహకులు టీఎస్ విజయకుమార్ తెలిపారు. అలాగే స్థానిక వెంకట రమణ కాలనీలో బుధవారం రాత్రి మాతృ మండలి ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేసి, వాటిలో దీపాలు అమర్చి వెలిగించారు. కార్యక్రమాల్లో ఈ.పద్మావతి, స్వప్నసారథి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తికపూజ

కర్నూలు నేరవిభాగం: కార్తికమాసాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పూజ, వనభోజన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఉసిరి చెట్టుకు పూజ చేశారు. పరిపాలన విభాగం, పోలీసు ఉద్యోగులతో కలిసి ఉసిరిచెట్టు కింద భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, డీఐజీ కార్యాలయ మేనేజరు రత్న ప్రకాశ్, డీపీఓ ఏఓ విజయలక్ష్మీ, రెండో పటాలము ఏఓ దేవి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

గోశాల కేంద్రంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గ్రంథాలయాలు చరిత్రకు నిలయాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: గ్రంథాలయాలు చరిత్రకు నిలయాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఉద్యోగాలతోపాటు వ్యాపారంలో పోటీ పడుతుండడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సెక్రటరీ పెద్దక్క, సహాయ గ్రంథాలయ అధికారి గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో మహిళల పాత్ర కీలకం

పూజలో పాల్గొన్న మహిళలు... సత్యసాయి మందిరంలో అలంకరణలో దేవతామూర్తులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక సత్యసాయి మందిరంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లాకుల జ్ఞానేశ్వరి మహిళలతో త్రిశక్తి పూజలు చేయించారు. సత్యసాయి శతనామావళి, లలితాస్తోత్రం పఠించారు. అనంతరం భజనలు నిర్వహించారు. మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సాయి సరోజ మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సంస్థల్లో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని, అన్ని విభాగాల్లో తమ వంతు సేవలు అందిస్తున్నారన్నారు. సాయిబాబా వందేళ్ల పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం జ్ఞానేశ్వరిని సమితి మహిళా ప్రతినిధులు సంధ్య, శారద, మాలతి తదితరులు సత్కరించారు.

పెండింగ్ బిల్లులపై స్పష్టత అవసరం

ఇంజినీర్లతో సమీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్(జేజేఎం) పెండింగ్ బిల్లులపై స్పష్టత వచ్చేంత వరకు గుత్తేదారులు పెండింగ్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు కోరారు. కర్నూలులోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఎస్ఈ మనోహర్ ఇంజినీర్లతో సమీక్షించారు. ప్రధానంగా జేజేఎం బిల్లులు నిలిచిపోవడంతో పనులు జరగడం లేదని, గుత్తేదారులకు ఎన్నిసార్లు చెబుతున్నా పనులు చేయడం లేదని ఇంజినీర్లు ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో రూ.22.70 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇంటింటికి మరుగుదొడ్ల నిర్మాణంలో మొక్కుబడిగా విధులు నిర్వహిస్తే జీతాలు నిలిపివేస్తామని ఎంఆర్‌సీలను ఎస్ఈ హెచ్చరించారు. ఏఈఈ, డీఈలతో సమన్వయం చేసుకుని లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌డివిజన్ పరిధిలో సంబంధిత డీఈఈలు ఎప్పటికప్పుడు ఏఈలతో సమావేశమై మండల, గ్రామ స్థాయి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

జాతీయ స్థాయిపై గురిపెట్టి

★ తైక్వాండోలో రాణిస్తున్న క్రీడాకారులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: వార్షిక క్రీడల్లో భాగంగా తైక్వాండో జిల్లా క్రీడాకారులు ఒక అంకం పూర్తి చేశారు. రాబోయే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలపై దృష్టి పెట్టారు. అసోసియేషన్ నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి మరింత ఆత్మవిశ్వాసం నింపుకొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకమే లక్ష్యంగా మరింత సాధన చేస్తున్నారు. వీరిపై న్యూస్‌టుడే అందిస్తున్న కథనం.

ఇర్ఫాన్.. ధనాధన్

నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఇర్ఫాన్ అహమ్మద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు నసీమున్నిసా, ఖలీల్ అహమ్మద్. తండ్రి వృత్తిరీత్యా వడ్రంగి. ఆరేళ్లుగా తైక్వాండో సాధన చేస్తున్నారు. ఈయన 2023 మే నెలలో నంద్యాలలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17.. 48 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలిచారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కర్నూలులో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జూనియర్ బాలుర విభాగంలో స్వర్ణం అందుకున్నారు. సెప్టెంబర్‌లో కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్-19 పోటీల్లో 68 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించారు. మే నెలలో ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారు. జాతీయ స్థాయిలో పతకం సాధించడమే లక్ష్యమంటున్నారు ఇర్ఫాన్.

రేవంత్ జోష్‌కి తిరుగులేదు

నగరంలో నివాసముంటున్న రేవంత్ ఇంటర్మీడియట్ మొదటి ఏడాది చదువుతున్నారు. తల్లిదండ్రులు సంగీత, రాముడు. తండ్రి టైలర్. రేవంత్ 2023 ఆగస్టు నెలలో బెంగళూరులో జరిగిన ఓపెన్ జాతీయస్థాయి పోటీల్లో అండర్-17 (59 కేజీల విభాగం)లో స్వర్ణ పతకం గెలుచుకున్నారు. 2024 సెప్టెంబర్‌లో తిరుపతిలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో గుంటూరులో నిర్వహించిన జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో 59 కేజీల విభాగంలో కాంస్యం గెలిచారు. ఈ నెలలో ఏలూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 పోటీల్లో 73 కేజీల విభాగంలో కాంస్య పతకం అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడమే తన లక్ష్యమని, అది నిరంతర సాధనతో సాధ్యమవుతుందని తెలిపారు.

అమాయకులపై పోలీసుల వేధింపులు అరికట్టాలి

అదనపు ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదుల ప్రజా కూటమి నాయకులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: అమాయకులపై పోలీసుల వేధింపులు అరికట్టాలని న్యాయవాదుల ప్రజా కూటమి రాష్ట్ర కన్వీనర్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, మరికొందరు నాయకులు కోరారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరాను కలిసి వినతిపత్రం సమర్పించారు. నిందితులను రోజుల తరబడి అక్రమ నిర్బంధం చేసి హింసించే పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్ల సత్ప్రవర్తనతో మెలిగిన వారిపై రౌడీషీట్లు తొలగించాలన్నారు. అమాయకులపై అక్రమ కేసులు నమోదు చేయకుండా పూర్తిస్థాయి విచారణ చేయాలని కోరారు. పోలీసుస్టేషన్‌లో న్యాయవాదులు, ప్రజలపై దురుసు ప్రవర్తన కట్టడి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి రాష్ట్ర కో కన్వీనర్ ముప్పసాని గాలిరాజు, జిల్లా కన్వీనర్ గోతం శేఖర్, బోయ శివ, రాఘవేంద్రప్రసాద్, వాసుదేవ, తిమ్మప్ప, ఉపేంద్రనాథ్, బాలాజీరెడ్డి, వినోద్‌కుమార్, వెంకటరాముడు పాల్గొన్నారు.

సేవల పర్యవేక్షణ తప్పనిసరి

కర్నూలు నగరపాలకసంస్థ : నగరంలోని వార్డు సచివాలయాల్లో ప్రజలకు పారదర్శకంగా సేవలందించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఇటీవల నియమించిన నోడల్, సహాయ నోడల్ అధికారులదేనని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ అన్నారు. బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నోడల్, సహాయ నోడల్ అధికారులకు కేటాయించిన సచివాలయాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

27-07-2025 తేదీన బలపాలపల్లె నుండి పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజి, కర్నూలుకు RTC బస్సులో వస్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. డాక్యుమెంట్ నెం: 4189/1985 సర్వేనెం. 84, దిన్నెదేవరపాడు, ప్లాట్ నెం: 31 చెంచు నాగన్న అనే పేరుగల డాక్యుమెంట్ పోయినది. కావున ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు సంప్రదించండి.

వళ్లూరు చెంచు నాగన్న
H.No: 4-243, బలపాలపల్లె గ్రామం,
బేతంచెర్ల మండలం, నంద్యాల జిల్లా.
Cell No: 80191 62753

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Organised by: ఈనాడు

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. . సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, మునగాలపాడు
కర్నూలు - 518004
వివరాలకు: 8008551771
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.



సుదర్శన మంత్రం.. సర్వలోక సుభిక్షం

సుదర్శన మంత్రంతో అహోబిల గిరులు మార్మోగాయి. లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

వెలుగోడును ఆక్రముంచారు

- రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం
- యథేచ్ఛగా రాళ్లవాగు కబ్జా

పరిశీలన

ఈనాడు, నంద్యాల, న్యూస్‌టుడే, వెలుగోడు

అక్టోబరు చివర్లో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు వెలుగోడు పట్టణాన్ని ముంచేశాయి. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌తో సహా పలు ప్రాంతాల్లో మూడడుగులకు పైగా నీరు ప్రవహించింది. కొన్ని గంటలపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. వెలుగోడు చరిత్రలో ఇప్పటివరకు కనీవిని ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. దీనంతటికీ ప్రధాన కారణం.. పట్టణంలో ప్రవహించే రాళ్లవాగులో ఆక్రమణలే. ప్రధాన రహదారి చెంతనే ఉన్న ఈ వాగులో రెండు దశాబ్దాలుగా పెద్దగా నీరు పారిన దాఖలాల్లేవు. దీంతో అక్రమార్కుల కన్ను వాగు స్థలాలపై పడింది. పలువురు నాయకులు యథేచ్ఛగా ఆక్రమించి.. తప్పుడు సర్వే నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

రాళ్లవాగు భూమిలో నిర్మించిన సీసీ రహదారి

2 కి.మీలు.. వందకు పైగా నిర్మాణాలు

వెలుగోడు మీదుగా రాళ్లవాగు సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రవహించి మంచినీళ్ల వాగులో కలుస్తుంది. ఈ రెండు కిలోమీటర్ల పరిధిలోని విలువైన భూముల్లో వందకు పైగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కొందరు తెలివిగా ఆలయాలు నిర్మించారు. వాటి పక్కనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఆలయాలు ఉంటే కట్టడాల జోలికి అధికారులు రారన్న ఉద్దేశంతో గుళ్లు కట్టారని స్థానికులు చెబుతున్నారు.

శాఖల సహకారం

అక్రమార్కులకు వివిధ శాఖల అధికారులు తమవంతు సహకరించారు. ఆక్రమించిన స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లకు రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు సీసీ రహదారులు ఏర్పాటు చేశారు. ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్తుశాఖ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. వసతులు కల్పిస్తుండటంతో మరికొందరు ముందుకొచ్చి వాగు భూములను వాటాలేసుకున్నారు.

అధికారులకు కాసుల వర్షం

అక్రమార్కులు కొందరు పంచాయతీ అధికారులకు భారీగా ముడుపులు ఇచ్చి భవన నిర్మాణానికి అనుమతులు పొందుతున్నారు. ఆస్తిపన్ను వేయించుకుని సక్రమం చేయించుకుంటున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారిణి అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించారు. ఆమె బదిలీపై వెళ్లిన వెంటనే అనుమతులు ఇచ్చేయడం గమనార్హం.

పొంచి ఉన్న ముంపు ముప్పు

- ఆక్రమణలకు గురైన వాగు భూముల విలువ రూ.వంద కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. అంతటి విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా జలవనరులశాఖ అధికారులు చోద్యం చూశారు. వాగుతో పాటు బఫర్‌జోన్‌లో కూడా ఎలాంటి నిర్మాణాలు జరగకుండా కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాశారు. వాగులో ఆక్రమణలను తొలగించకపోతే భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి గ్రామంలోని వేలాది ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- వాగు భూములను సమగ్రంగా సర్వే చేయించి హద్దులు గుర్తిస్తే ఆక్రమణలు పూర్తిస్థాయిలో వెలుగు చూస్తాయి. ఎంత మొత్తం ఆక్రమణకు గురైంది? ఆక్రమిత భూముల్లో ఏఏ నిర్మాణాలున్నాయి తేల్చి చర్యలు చేపట్టాలని వెలుగోడు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం బేతంచెర్ల మండలం ఎంబాయి గ్రామంలో 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరయాదవ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రైతు బాగుంటే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. తాగు, సాగు నీరు అందించేందుకు రూ.200 కోట్లు మంజూరు చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు.

మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఆర్థిక మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

అన్నదాతకు రూ.139.71 కోట్లు

నంద్యాల పట్టణం, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద రైతుల ఖాతాలకు డబ్బులు జమ య్యాయి. ఇందులో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.103.03 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ.36.68 కోట్లు జమయ్యాయి. మొత్తం రూ.139.71 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు.

నియోజకవర్గం	రైతులు	అన్నదాత సుఖీభవ (రూ.కోట్లు)	పీఎం కిసాన్ (రూ.కోట్లు)
నంద్యాల	24,499	6.48	2.31
నందికొట్కూరు	69,613	18.37	6.57
శ్రీశైలం	47,877	12.51	4.57
డోన్	65,629	17.51	6.12
పాణ్యం	24,544	6.35	2.37
ఆళ్లగడ్డ	75,208	21.49	7.64
బనగానపల్లి	40,664	20.33	7.10

ముఖం చాటేస్తే కుదరదిక

వైద్యారోగ్యశాఖలో పనిచేసే శాశ్వత, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల హాజరులో పారదర్శకతకు పెద్దపీట వేసేలా ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదులో కచ్చితత్వం లేదని.. ముఖ ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి తీసుకొచ్చారు. దానికీ కొందరు మస్కా కొడుతున్నారు. చరవాణుల్లో ఆధార్, చరవాణి నంబర్లతో ఎఫ్ఆర్ఎస్ ఐడీ సృష్టించుకొని ఎక్కడి నుంచైనా హాజరు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నిసార్లు హాజరు వేయకుండానే వేతనాలు తీసుకుంటున్నారు.

మరో అవకాశం ఉండదు

- ఇక నుంచి వేతనాలు తీసుకునే సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఎఫ్ఆర్ఎస్ అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈనెల 20వ తేదీ లోపు అనుసంధానం చేసుకోకుంటే మరో అవకాశం ఉండదని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఉద్యోగులందరూ తమ వివరాల్ని ఎఫ్ఆర్ఎస్‌తో అనుసంధానం చేసుకుంటున్నారు. ఇక విధులకు డుమ్మా కొడితే వేతనంలో కోత తప్పదంటున్నారు.
- ప్రతినెల 15వ తేదీ నుంచి వచ్చేనెల 16 వరకు హాజరును వేతనానికి పరిగణలోకి తీసుకుంటారు. రోజుకు మూడుసార్లు ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఉదయం, సాయంత్రం తప్పనిసరి, రెండుసార్లు నమోదు చేయకుంటే ఆ రోజు ఉద్యోగానికి గైర్హాజరైనట్లుగా గుర్తిస్తారు.

ఆరోగ్య కేంద్రాలు	ప్రాథమిక	పట్టణ	ఉద్యోగులు
	53	19	1,861

– న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

CODE: ANCP
ANNAMACHARYA COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

కబడ్డీ.. కబడ్డీ..

పేదింటి బిడ్డలు.. కష్టాలు దగ్గరుండి చూశారు.. ఆటలపై వారికున్న ఆసక్తిని గమనించి గురువులు సానబెడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 40 మంది బాలురు, బాలికలు అండర్-14, 17 విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరికి డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులంతా కలిసి రూ. 2 లక్షలు, దాతల నుంచి మరో రూ.2 లక్షలు సేకరించి ప్రత్యేక మ్యాట్‌ను దిల్లీ నుంచి తెప్పించారు. దానిపై నిత్యం ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటల పాటు మెలకువలు నేర్పిస్తున్నారు. స్థానిక ఫిజికల్ డైరెక్టర్లు సుధాకర్, లక్ష్మణదాసు, శేఖర్, సుజాతల సమక్షంలో ప్రత్యేక సాధన చేస్తున్నారు. అండర్-14 విభాగంలో బాలురు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మచిలీపట్నంలో, అండర్-17 విభాగంలో బాలికలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు కర్నూలు జిల్లా జొహరాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. "హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా.. శిక్షణను సద్వినియోగం చేసుకొంటున్నట్లు" భూమిక, డోన్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. జాతీయస్థాయిలో రాణించడమే.. తన ముందున్న లక్ష్యమని" మనీష పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

కల్లాల్లో కన్నీటి రాసులు

- ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు
- రైతులను దగా చేస్తున్న దళారులు

పంట	మొక్కజొన్న	వరి
సాగైంది (ఎకరాలు)	1,83,344	1,81,030
దిగుబడి (టన్నులు)	3,63,515	4,08,953

కాలం 'వరి'ంచింది.. కాల్వలు నిండుగా ప్రవహించాయి.. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున మొక్కజొన్న, 30 సంచుల చొప్పున వరి ధాన్యం దిగుబడులొచ్చాయి. చేతికొచ్చిన పంటను మొంథా తుపాను వెన్ను విరిచింది. ఉన్న పంట అమ్ముకోవడానికి రైతులు కల్లాల్లో నిరీక్షిస్తున్నారు.. జిల్లాలో ఎక్కడ చూసినా మక్క, ధాన్యం రాసులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు దోచుకొంటున్నారు.
– న్యూస్‌టుడే, పాణ్యం, నంద్యాల వ్యవసాయం

"13 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా.. కొంత పంటను విక్రయించా. ధర పతనం కావడంతో మరికొంత కొంత నిల్వ చేశా. గతేడాది మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాలుకు రూ.2,225 ఉండగా.. ఈ ఏడాది రూ.2400గా నిర్ణయించారు. మద్దతు ధర పెంచినట్లు ప్రచారం చేసినా.. రైతుకు దక్కుతోంది రూ.1700 మాత్రమే.. ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోవడం దారుణమని" గడివేములకు చెందిన మాబాషా ఆందోళన వ్యక్తం చేశారు.

అన్నదాతకు తీరని నష్టం

- మొక్కజొన్నకు కేంద్రం మద్దతు ధర క్వింటాకు రూ.2,400గా నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో రూ.1300 నుంచి రూ.1700 పలుకుతోంది. మొంథా తుపాను సమయంలో 40 శాతం కోతలు పూర్తయ్యాయి. దళారుల దోపిడీ అధికమైంది. క్వింటాకు రూ.700 చొప్పున రైతులు నష్టపోతున్నారు.
- ఏ-గ్రేడ్ వరి ధాన్యం క్వింటాకు రూ.2,389 మద్దతు ధరగా నిర్ణయించింది. దళారులకు 77 కిలోల సంచి కేవలం రూ.1500 విక్రయిస్తున్నారు. అంటే క్వింటాకు రూ.1950 దక్కుతోంది. దీంతో ఒక క్వింటాపై రూ.440 కోల్పోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోళ్లు ఎప్పుడో..

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. వారం రోజులుగా ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. తక్కువ ధరకు విక్రయించలేక కొందరు కల్లాల్లోనే నిల్వ చేసుకుంటున్నారు. మరికొందరు నిల్వకు అవకాశం లేకపోవడం, వాతావరణంలో మార్పులు రావడంతో వచ్చిన ధరకే విక్రయించి నష్టపోతున్నారు. జిల్లాలో మొక్కజొన్న కోతలు 70 శాతం పూర్తయ్యాయి. కొనుగోలు కేంద్రాలపై స్పష్టత కరవైంది. అసలు కొనుగోలు చేస్తారో లేదో కూడా తెలియని దుస్థితి నెలకొంది. "కొనుగోళ్ల అంశాన్ని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. ఆర్థిక శాఖ వద్ద దస్త్రం ఉంది.. త్వరలోనే ప్రారంభిస్తామని" మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు.

సబ్జెక్టు ఖాళీ.. విద్యార్థి కంగాళీ

- పదో తరగతి పరీక్షలపై ప్రభావం

బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు మహేశ్వరరెడ్డి ప్యాపిలి ఎంఈవో-1గా అదనపు బాధ్యతలపై వెళ్లారు.. ఆ పాఠశాలలో ప్రస్తుతం గణిత ఉపాధ్యాయుడు లేరు.. ఆరు నెలలుగా లెక్కలు చెప్పే వారు కరవయ్యారు.

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు పదో తరగతి విద్యార్థులకు గ్రహపాటుగా మారింది. ఈసారి ఎట్టి పరిస్థితిలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. చాలా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడం ఆటంకంగా మారింది.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ప్రత్యేక తరగతిలో విద్యార్థులు

బదిలీలు తెచ్చిన తంటా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా పరిషత్తు, మున్సిపాలిటీ, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 34,544 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఈ నెలాఖరులోపు సిలబస్ పూర్తి చేసి డిసెంబరు నుంచి రోజువారీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. చాలా చోట్ల సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లాలో నాలుగు వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఎక్కువ మంది కర్నూలు జిల్లాకు వెళ్లారు.. చాలా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

సబ్జెక్టు	నంద్యాల	కర్నూలు
భౌతికశాస్త్రం	4	6
జీవశాస్త్రం	5	4
హిందీ	36	214
సాంఘికశాస్త్రం	6	3

వంద రోజుల ప్రణాళికపై నీలినీడలు

గతేడాది పదో తరగతి పరీక్షల్లో వందరోజుల ప్రణాళిక సత్ఫలితాలు ఇచ్చింది. ఈ ఏడాది మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎఫ్ఏ-1, 2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీలుగా విభజించాలని సూచించారు. ఎఫ్ఏ-1, 2, ఎస్ఏ-1 పరీక్షలో వెనుకబడిన వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాల్సి ఉంది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేకపోవడంతో వంద రోజుల ప్రణాళిక అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సర్దుబాటు గ్రహపాటు

క్షేత్రస్థాయిలో అవసరాల దృష్ట్యా ప్రభుత్వం ఎంఈవోల భర్తీకి కొన్ని సడలింపులు ఇచ్చింది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. డిప్యూటేషన్ల కోసం జూనియర్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మరి కొన్ని చోట్ల డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు బదిలీ అయిన ఉపాధ్యాయుల పోస్టులు చూపకపోవడంతో కొంతమంది ఇంకా రిలీవ్ కాలేదు.

పూర్తికాని పాఠాలు

- ఉమ్మడి జిల్లాలో 250 హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కర్నూలులో 214, నంద్యాలలో 36 జడ్పీ హైస్కూళ్లలో హిందీ చెప్పే వారు కరవయ్యారు. కొన్ని పాఠశాలల్లో సగం పాఠాలు కూడా పూర్తి కాలేదు.
- నంద్యాల జిల్లాలోని 68 హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తోంది. చాగలమర్రి, జూపాడుబంగ్లా, కోవెలకుంట్ల, అయ్యలూరు పాఠశాలల్లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కొరత ఉంది. నందికొట్కూరు, పోలూరు జడ్పీ పాఠశాలల్లో బయాలజీ టీచర్లు, వీరారెడ్డిపల్లె, జూపాడుబంగ్లా, గాజులపల్లె, పోలూరులలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు లేరు. నంద్యాల పట్టణంలో వైఎస్సార్ నగర్, టెక్కె హైస్కూల్‌లలో తెలుగు ఉపాధ్యాయులు లేరు. ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో, బనగానపల్లి బాలికల జడ్పీ పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులు లేరు.

పనులు పూర్తయ్యేనా.. గొంతు తడిపేనా

కర్నూలు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.20 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. దీనికోసం సుంకేసుల బ్యారేజీ పంపుహౌస్ నిర్మించి మోటార్ల సాయంతో పైపులైన్ ద్వారా అశోక్‌నగర్ పంపుహౌస్‌కు తరలించేందుకు నిర్మాణ పనులు ఆరంభించారు. ఇది అందుబాటులోకి వస్తే నగరవాసులకు తాగునీటి సమస్య లేకుండా పోతుంది. ఈ పనులు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తికాలేదు. పైపులైన్లు ఆగిపోయాయి, పంపుహౌస్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేయించాలని పురప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, కర్నూలు.

మురుగు కూపం.. దుర్గంధ భరితం

పచ్చని మైదానాన్ని తలపిస్తున్న ఈ ప్రదేశం పచ్చిక అనుకుంటే పొరపాటే. ఇది కర్నూలు మండలం నిడ్జూరు గ్రామం నడిబొడ్డున రహదారికి చేర్చి ఉన్న ఓ మురికి కుంట. చాలా రోజులుగా ఇలానే ఉంది. చుట్టుపక్కల కాల్వల నుంచి వచ్చిన మురుగంతా ఇక్కడకు చేరుతోంది. కానీ ఇక్కడ నుంచి బయటకు మళ్లించే మార్గం లేకపోవడంతో పచ్చగా మారి ప్రమాదకరంగా మారింది. దీంతో దోమలు వ్యాపించి గ్రామస్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - ఈనాడు, కర్నూలు.

రద్దీ నిత్యం.. పడితే ప్రమాదం

నంద్యాల పట్టణంలో శ్రీనివాస సెంటర్, సంజీవనగర్ గేట్ దారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో అధిక లోడుతో ట్రాక్టర్ రాళ్లను ఇలా ప్రమాదకరంగా తరలిస్తున్నారు. గుంతలు, వేగ నియంత్రికలు ఉన్నాయి. ట్రాక్టర్ పైనుంచి రాళ్లు కింద పడితే రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

స్వచ్ఛ సంకల్పాన్ని కట్టిపడేశారు

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛ సంకల్పం కల నెరవేరడం లేదు. పలుచోట్ల స్వచ్ఛ సంకల్పం రిక్షాలు మూలకు చేరాయి. పనిచేయని వాటికి మరమ్మతులు చేయకపోవడంతో తుప్పుపడుతున్నాయి. హొళగుంద మండలం నెరణికి గ్రామంలో స్వచ్ఛ సంకల్పం రిక్షాకు వృషభాన్ని కట్టేశారు. గ్రామంలో స్వచ్ఛత పనులు చేపట్టకపోవడంతో ప్రధాన రహదారి, వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. సంబంధిత అధికారులు పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హొళగుంద

ముందే వచ్చిన ముంజలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సాధారణంగా తాటి చెట్లకు ముంజలు డిసెంబరు, జనవరిలో అధికంగా కాస్తాయి. కానీ ఈ ఏడాది అధిక వర్షాలతో వంకలు, వాగుల సమీపంలో ఉన్న తాటి చెట్లకు కాపు ముందే వచ్చింది. పెద్దకడబూరు పరిధిలోని మేకడోణ, నౌలేకల్, ఎమ్మిగనూరు మండలం ఎస్‌.నాగలాపురం, పార్లపల్లి తదితర గ్రామాల్లో వాగులు పారుతున్నాయి. ఈ ప్రాంతంలోని ఉన్న తాటి చెట్లకు కాపు కాశాయి. వీటిని కొని వ్యాపారులు అమ్ముతున్నారు. ఆదోని-రాయచూరు రహదారిలో ఉన్న పెద్దతుంబలం రోడ్డులో తాటి ముంజలు వ్యాపారం జోరుగా సాగుతుంది. డజన్ రూ.100కు విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారిపై వెళ్లే రాయచూరు, బళ్లారి, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాలకు చెందిన వాహనదారులు ముంజలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు నెలల ముందు కాసినట్లు వ్యాపారులు తెలిపారు.

తాటి కాయల నుంచి ముంజలు తీస్తున్న యువకుడు

అక్రమాలకు సహకారం.. గుదిబండలా గోదాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో సహకార వ్యవస్థ చిన్నాభిన్నమైంది. బహుళ ప్రయోజన గోదాములను బలవంతంగా సహకార సంఘాలకు అప్పగించడంతో.. కొండమీద లాభాల్లో ఉన్న సంఘాలు సైతం పీకల్లోతు నష్టాల్లోకి కూరుకుపోయాయి. కొందరు వైకాపా పెద్దలకు లబ్ధి చేకూర్చేందుకు నిర్మించిన ఈ గోదాములకు చేసిన ఖర్చులు అసలు, వడ్డీ చెల్లించలేని పరిస్థితి. అప్పులు తీర్చేందుకు కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ఉలిందకొండ హైవే పరిధిలోని చిన్నటేకూరు గ్రామం వద్ద రూ.90 లక్షలు వెచ్చించి 500 టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాములు రెండేళ్లు దాటినా వినియోగంలోకి తీసుకురాలేదు

201 మంజూరు.. వంద అప్పగింత

గత ప్రభుత్వంలో ఓ వైకాపా నేతకు ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గోదాముల నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 99 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 500, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన 201 బహుళ ప్రయోజన గోదాములు మంజూరు చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు రుణాలతో 500 టన్నుల గోదాముకు రూ.45 లక్షలు, వెయ్యి టన్నుల గోదాముకు రూ.80 లక్షల ఖర్చు కేటాయించారు. ఇందుకోసం సహకార బ్యాంకు ద్వారా సుమారు రూ.70 కోట్ల రుణం మంజూరు చేశారు. ఇప్పటి వరకు కర్నూలు 22, నంద్యాల జిల్లాలో 95 నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కర్నూలులో 21, నంద్యాల జిల్లాలో 79 చొప్పున మొత్తం వంద గోదాములను మార్కెటింగ్ శాఖ ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగించింది.

వినియోగానికి దూరం

నంద్యాల జిల్లాలో 79 బహుళ ప్రయోజన గోదాములను సంఘాలకు అప్పగించారు. వీటిలో 8 గోదాములు మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. కర్నూలులో 21కి గాను ఒక్కటీ కూడా వినియోగంలోకి రాలేదు. ఉమ్మడి జిల్లాలో సంఘాలకు అప్పగించిన వాటిలో 92 గోదాములు నిరుపయోగంగా మారాయి. వాటిని అద్దెకు ఇస్తామంటున్నా.. తీసుకునేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంది. గ్రామాలకు దూరంగా.. ఎలాంటి రవాణా సౌకర్యం లేని కొండలు, గుట్టలు, లోతట్టు ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. దీంతో వాటిలో పంట ఉత్పత్తులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు ఎవరూ ముందుకురావడం లేదు.

వాడకున్నా.. వడ్డీతో సహా చెల్లించాలి

సహకార సంఘాలు స్వాధీనం చేసుకున్న గోదాములకు సంబంధించి మొదటి రెండేళ్ల వడ్డీ రూపంలో 500 టన్నుల గోదాముకు ఏడాదికి రూ.1.80 లక్షలు, వెయ్యి టన్నుల గోదాముకు రూ.3.60 లక్షల చొప్పున చెల్లించాల్సి వచ్చేది. ఆ తర్వాత ఏడాదికి రూ.9 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు వడ్డీతో పాటు రుణం చెల్లించాలి. గోదాముల వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోయినా రూ.లక్షల్లో అసలు, వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రాథమిక సహకార సంఘాలకు భారంగా మారింది. అప్పులు చేసి మరీ వడ్డీలు, రుణ చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని సంఘాల అధ్యక్షులు, సీఈవోలు వాపోతున్నారు. దీంతో సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతల సంక్షేమానికి తోడ్పాటు

జిళ్లెల్ల(గోస్పాడు), న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మండలంలోని జిళ్లెల్లలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పాల్గొని నంద్యాల నియోజకవర్గానికి 12,953 మంది రైతులకు రూ.8.78 కోట్ల చెక్కు అందజేశారు. ఏపీ స్వస్తిక్, తెదేపా మండల బాధ్యుడు తులసేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

కన్యాకుమారికి సైకిల్ యాత్ర

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వయసుతో సంబంధం లేకుండా శారీరక, మానసిక ఉల్లాసం కోసం సయ్యద్ అబ్బుల్లా, పుర్ ఖాన్ కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేపట్టారు. యాత్ర బుధవారం వెల్దుర్తికి చేరింది. సయ్యద్ అబ్బుల్లా, పుర్‌ఖాన్ హైదరాబాద్ వాసులు. పుర్‌ఖాన్ కశ్మీర్ నుంచి కన్యాకుమారికి, సయ్యద్ అబ్బుల్లా హైదరాబాద్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర చేపట్టారు. హైదరాబాద్ నుంచి సుమారు 1300 కి.మీ. దూరం ఉన్న కన్యాకుమారికి వారం రోజుల వ్యవధిలో చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. ఆరోగ్యంగా ఉండటమే అన్ని ప్రయోజనాలకు మూలమన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.

సైకిల్ యాత్ర చేపట్టిన సయ్యద్ అబ్బుల్లా, పుర్‌ఖాన్

కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలోని టీసీజీ కాటన్ మిల్లులో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు నాగరాజు, నాగప్రసాద్, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కార్మికులు బుధవారం కాటన్ తీస్తున్న యంత్రం నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కార్మికులు బయటకు వచ్చి అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది యంత్రాలతో హుటాహుటిన చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు 400 బోరేలు అంటుకున్నాయని, వాటి విలువ రూ.80లక్షలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిన్నారులకు పోషకాహారం అందించాలి

ఎంబాయి(బేతంచెర్ల), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం బేతంచెర్ల మండలం ఎంబాయి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలలు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవల గురించి

చిన్నారితో ముచ్చటిస్తున్న కలెక్టర్ రాజకుమారి

అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు సంపూర్ణ పోషణలో భాగంగా గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సూపర్‌వైజరు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం.. భవితకు ప్రోత్సాహం

డిసెంబరు 7న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యను ప్రోత్సహించి ఆర్థిక సాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాల పరీక్ష(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్- ఎన్‌ఎంఎంఎస్)ను ఏటా నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చాటిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సాయం పొందవచ్చు.

పెరిగిన కర్నూలు.. తగ్గిన నంద్యాల

గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8,575 దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం 8,059 మంది ముందుకొచ్చారు. కర్నూలు జిల్లాలో 4,127, నంద్యాల జిల్లాలో 3,932 దరఖాస్తు చేసుకున్నారు. ఈ సారి కర్నూలు జిల్లా నుంచి ఎక్కువ దరఖాస్తులు రాగా.. నంద్యాల జిల్లా నుంచి గతేడాది కంటే తక్కువ దరఖాస్తులు రావడం గమనార్హం.

39 కేంద్రాల్లో నిర్వహణ

ఉమ్మడి జిల్లాలో 39 పరీక్ష కేంద్రాల్లో డిసెంబరు 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష 3 గంటల పాటు నిర్వహిస్తారు. రెండు విభాగాల్లో మొత్తం 180 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 90 మార్కులకు మెంటల్ ఎబిలిటీ టెస్టు, మరో 90 మార్కులకు స్కాలస్టిక్ ఎబిలిటీ టెస్టు(ఏడు, ఎనిమిది తరగతుల్లో గణితం, సామాన్య, సాంఘికశాస్త్రం) సబ్జెక్టుల్లో బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నలను ఇస్తుంటారు.

విశ్లేషణ సామర్థ్యం ఉండాలి - డా.టి.సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులు పాఠ్యాంశ సంబంధమైన జ్ఞానంతో పాటు మానసిక విశ్లేషణ నైపుణ్యాన్ని పెంపొందించే అంశాలను సాధన చేయాలి. ఎస్ఏటీ, ఎమ్ఏటీ రెండింటిలోనూ మంచి మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనాలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కువ సాధనతో మెంటల్ ఎబిలిటీపై అవగాహన కలిగి ఉండాలి.

మాక్ టెస్టులతో ఉపయోగం - బి.వెంకటేశ్వరరెడ్డి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు

సాంఘిక శాస్త్రంలో 35 ప్రశ్నలు వస్తాయి. వీటి నుంచి మంచి మార్కులు పొందేందుకు సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకోవాలి. ప్రతి యూనిట్‌లోని ప్రధానాంశాలను గుర్తుంచుకోవాలి. ప్రధాన తేదీలు, సంఘటనలు, రాజ్యాంగ నిబంధనలు వంటి వాటిని ప్రత్యేక దృష్టితో చదవాలి. సాధన కోసం పూర్వ ప్రశ్నపత్రాలను, మాక్ టెస్టులను, క్విజ్‌లను ఉపయోగించుకుంటే మంచిది.

తార్కిక ఆలోచన ముఖ్యం - ఎ.లక్ష్మీకాంతరెడ్డి, గణిత ఉపాధ్యాయుడు

ఏడు, ఎనిమిది తరగతులకు సంబంధించిన గణితశాస్త్రంలోని సంఖ్యలు, పరిక్రియలు, ఆకారాలు, నమూనాలు, పరిమాణం, బీజగణితం, క్యాలిక్యులస్ తదితరాలపై విశ్లేషణ, వాస్తవ జీవితంలో గణిత ఉపయోగాలు వంటి అంశాలపై పూర్తి విశ్లేషణను, అవగాహనను కలిగి క్షుణ్ణంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు.

సిలబస్‌పై అవగాహన తప్పనిసరి - పి.చిన్నరవినాయక్, సైన్స్ ఉపాధ్యాయుడు

సామాన్య శాస్త్రానికి సంబంధించిన 35 ప్రశ్నల్లో మంచి మార్కులు సాధించేందుకు 7, 8 తరగతులకు సంబంధించిన ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల్లోని కణనిర్మాణం, విధులు, ప్రత్యుత్పత్తి, సూక్ష్మజీవులు, మానవ శరీర వ్యవస్థ, పర్యావరణం వంటి అంశాలు గురించి క్షుణ్ణంగా అవగాహన చేసుకుంటూ చదవాలి.

సాధన నిత్యం.. పతకాలు సొంతం

☛ క్రీడల్లో రాణిస్తున్న బాలికలు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు ఖోఖోలో రాణిస్తున్నారు. తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం, సూచనలతో సత్తా చాటుతున్నారు. మండల స్థాయి నుంచి విజయాలు సాధిస్తూ.. రాష్ట్ర స్థాయి వరకూ దూసుకెళ్లారు. ఈ నెలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడమే తమ లక్ష్యమని చెబుతున్నారు ఆత్మకూరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

శివకీర్తి

ఆత్మకూరు పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన రాజు, సుమలత కుమార్తె శివకీర్తి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్ ప్రోత్సాహంతో ఖోఖో క్రీడలో రాణిస్తోంది. అండర్-17 విభాగంలో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గతేడాది అక్టోబరులో జరిగిన మండలస్థాయి ఖోఖో పోటీల్లో రాణించడంతో జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. గతేడాది నవంబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. అనంతరం అనకాపల్లిలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. సీనియర్ విభాగంలో గతేడాది డిసెంబరులో కర్నూలులో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ ఏడాది సెప్టెంబరులో గన్నవరంలో జరిగిన సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. ఈనెల 22, 23వ తేదీల్లో విజయనగరంలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

ఖేలో ఇండియా జాతీయస్థాయిలో..

హారిక

ఆత్మకూరు పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన స్వాములు, వెంకట లక్ష్మి కుమార్తె హారిక. ఎనిమిదో తరగతి చదువుతూ వ్యాయామ ఉపాధ్యాయుడు మహబూబ్ సూచనలతో 'ఖోఖో'లో సత్తా చాటుతోంది. గతేడాది సెప్టెంబరు 21వ తేదీన ఆత్మకూరు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో గెలిచింది. సెప్టెంబరు 27న ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గస్థాయి పోటీల్లో ఆడింది. అక్టోబరులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. గతేడాది నవంబరులో ప్రకాశం జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. అండర్-14 విభాగంలో కోయంబత్తూరులో జరిగిన ఖేలో ఇండియా సౌత్‌జోన్ టోర్నమెంటు జాతీయస్థాయి లీగ్ మ్యాచ్‌లో పాల్గొంది. సీనియర్ విభాగంలో గతేడాది డిసెంబరులో ప్రకాశం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఈ ఏడాది అక్టోబరులో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సీనియర్ విభాగంలో మండలస్థాయి, నవంబరులో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈనెల 28, 29, 30వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతోంది.

వైభవంగా లక్ష కుంకుమార్చన, శాంతికల్యాణం

మహానంది, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందిలో కార్తికమాసం అమావాస్యను పురస్కరించుకొని కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు లక్ష కుంకుమార్చన, శాంతికల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో వేదపండితులు రవిశంకర అవధాని, వైద్యనాథ శివాచార్య, నాగేశ్వరశర్మ, శాంతారామ్‌భట్ ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాభిషేకాలు, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శాంతికల్యాణం నిర్వహించారు. ఇందులో గణపతి పూజ, కంకణధారణ, మాంగల్యధారణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

శాంతికల్యాణంలో దాతలు, పండితులు

స్పర్శ దర్శనం, రూ.300 టికెట్లపై ఉచితంగా లడ్డూలు

● శ్రీశైలం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దర్శనానికి వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాలు ఇవ్వాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. కమాండ్ కంట్రోల్ హాల్‌లో బుధవారం ధర్మకర్తల మండలి ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులు సమావేశమయ్యారు. 14 అంశాలను అజెండాలో పెట్టి చర్చించారు. 11 అంశాలను ఆమోదించినట్లు ఛైర్మన్ వెల్లడించారు. 2 అంశాలు వాయిదా వేసి, ఒక అంశాన్ని తిరస్కరించినట్లు చెప్పారు. ఛైర్మన్ మాట్లాడుతూ..రూ.500 స్పర్శ దర్శనం టికెట్‌పై 100 గ్రాముల రెండు లడ్డూలు, రూ.300 టికెట్‌పై 100 గ్రాముల ఒక లడ్డూను ఉచితంగా భక్తులకు ఇవ్వాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానున్నట్లు వెల్లడించారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని కొలనుభారతి అమ్మవారి ఆలయాన్ని శ్రీశైల దేవస్థానం దత్తత తీసుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీశైలం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. స్థానిక చెంచులకు నెలలో ఒక రోజు శ్రీమల్లికార్జునస్వామి స్పర్శ దర్శనానికి ఉచితంగా అనుమతించనున్నట్లు చెప్పారు. కేంద్ర విచారణ కార్యాలయంలో గదులు, దర్శనం టిక్కెట్ల వివరాలు తెలిసే విధంగా డిజిటల్ డిస్‌ప్లేలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భక్తుల ఫిర్యాదుల లేఖలు వేసేందుకు సీఆర్‌ఓ కార్యాలయం వద్ద బాక్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

శ్రీగిరిలో సమావేశమైన ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి సూచించారు. పట్టణం శివారులోని శ్రీకాళీ ప్రసాద ఆశ్రిత ఆశ్రయంలో పల్లె ప్రియాంక సేవా సమితి అధ్యక్షుడు, విశ్రాంత జిల్లా న్యాయవాది మోహన్‌రావు సౌజన్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహనతోపాటు ఉచిత న్యాయ సలహాలు, న్యాయవాది ఏర్పాటు గురించి వివరించారు. కార్యక్రమంలో నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి, జూనియర్ సివిల్ జడ్జి దివ్య, ఆత్మకూరు రెవెన్యూ అధికారి నాగజ్యోతి, పురపాలక కమిషనర్ బేబి, ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

దొర్నిపాడు బాధితులకు న్యాయం చేస్తాం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: 'హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్సియల్ సొల్యూషన్స్' సంస్థ చేతిలో మోసపోయిన బాధితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం ఎమ్మెల్యేతో పాటు ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్‌కుమార్ జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోసగించిన సంస్థ నిర్వాహకుల నుంచి ప్రస్తుతానికి రూ.15 కోట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు త్వరలో వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు సైతం వెనుకాడదన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, డీఎస్పీ

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:7659988728

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

CREATIVE EDUCATIONAL SOCIETY'S
COLLEGE OF PHARMACY
NH-44, CHINNATEKUR, KURNOOL. A.P. - 518218
SPOT ADMISSIONS ON 22-11-2025
for left over seats of D.Pharm Course (AY 2025-26)
as per norms. Eligible Candidates Can Attend with all Necessary Certificates. Contact: 8142233361/454
SECRETARY

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

☛ మరొకరికి తీవ్ర గాయాలు

మహానంది, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సీతారామాపురం గ్రామ సమీపంలోని నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన మూగ వెంకటకృష్ణ (22) నందివర్గం మండలం నందవరం గ్రామానికి చెందిన తిమ్మయ్య, సుభాష్ ముగ్గురు ద్విచక్రవాహనంపై నంద్యాల రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. సుభాష్‌ను రైలు ఎక్కించి తిరుగు ప్రయాణం అయ్యారు. లక్ష్మీరెడ్డి ట్రాక్టర్ ద్వారా రహదారిపై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఆ యువకులకు ఎదురుగా వస్తున్న పెద్ద వాహనం వెలుతురుకు దారి కనిపించలేదు. దాంతో ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో మూగ వెంకటకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. తిమ్మయ్య గాయపడగా.. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మహానంది ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మూగ వెంకటకృష్ణ (పాత చిత్రం)

(c) eenadu

నంద్యాల
•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

ప్రతిజ్ఞ చేయిస్తున్న పురపాలక కమిషనర్ శేషన్న

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలమని పురపాలక కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా హరిజన్‌పేట పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మరుగుదొడ్లు లేనివారి నుంచి దరఖాస్తులు తీసుకుని సహకరిస్తామన్నారు. న్యాప్‌కిన్స్‌ను కాల్చివేసే మిషన్‌ను పాఠశాలకు అందజేస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు మురళీధర్, లక్ష్మీనారాయణశర్మ, శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

పగిడ్యాల: స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సుమిత్రమ్మ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులకు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. రోడ్ల వెంబడి చెత్త వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ నాగేంద్రకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఎంసీహెచ్‌ రోడ్డులో కాల్వలు శుభ్రం చేయడం లేదు. - సాయిచేతన్, స్థానికుడు

?: పట్టణంలోని తెలుగుపేట, మాల్‌దార్‌పేటలో వీధుల్లో చెత్త పేరుకుపోయింది. - సుబ్బారావు, రహీం, స్థానికులు

✔: కాల్వలు శుభ్రం చేయిస్తాం. చెత్త తొలగిస్తాం. - లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని మురుగు కాల్వల్లో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. - మస్తాన్, స్థానికుడు.

✔: కాల్వల్లో పూడిక తొలగిస్తాం. - జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ?: కాలనీల్లో పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథా అవుతోంది. - కరీం, స్థానికుడు.

✔: లీకేజీని మరమ్మతులు చేయిస్తాం. - షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.

మిడుతూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని తలముడిపి గ్రామంలో బీసీ కాలనీలో రహదారిపై మురుగు నిలుస్తుంది. - మురళి, కాలనీవాసి.

✔: మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. - కరీం, గ్రామ కార్యదర్శి.

?: మండలంలోని కడుమూరు గ్రామంలో ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో చెత్తాచెదారంతో దుర్వాసన వస్తోంది. - మధు గౌడ్, గ్రామస్థుడు.

✔: చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - కల్యాణ్ సింగ్, కార్యదర్శి.

పోటీలో పాల్గొని.. బహుమతులు గెలిచి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సునీల్ కుమారి అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ(ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో లహరి, ద్వితీయ స్థానంలో ప్రభావతి, తృతీయ స్థానంలో స్పందన నిలిచింది. వారికి అధ్యాపకులు దర్గావలి, వసంత, భాగ్యమ్మ బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థిని

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం గుడిపాటిగడ్డలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో కార్తిక మాస చివరి బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేషమైన పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రత్యేక అలంకరణలో స్వామివారు→

సరకుల్లో తేడాలు.. సేవల్లో లోపాలు

★ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులు

నరసింహనగర్ కేంద్రంలో బాలసంజీవని కిట్, గుడ్లు తీసుకున్న లబ్ధిదారులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర సేవలతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నంద్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 295 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు, బాలింతలు దాదాపు 4వేల మంది ఉన్నారు. వీరికి నెలనెలా టీహెచ్‌ఆర్(టేక్ హోమ్ రేషన్) ద్వారా బాల సంజీవని కిట్లను అందజేస్తారు. కానీ, కొన్ని కేంద్రాల్లో వీటి పంపిణీ సరిగా జరగడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఐజీవల ఓ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల లెక్కింపు సరకుల్లో తేడాలు రావడంతో నంద్యాల ప్రాజెక్టు సీడీపీవో రూ.40 వేలు జరిమానా విధించారు.

● నవంబరులో గర్భిణులకు 85శాతం, బాలింతలకు 74శాతం మేర సరకులు పంపిణీ చేశారు.

● ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన ఫేస్ రికగ్నిషన్ యాప్ సరిగా పనిచేయక పలుమార్లు తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

పరిశీలన

● గుడ్లు నెలకు రెండు విడతల్లో 25 ఇవ్వాలి. కొన్ని కేంద్రాల్లో 24 మాత్రమే ఇస్తున్నారు.

● గుడ్ల సైజు చిన్నగా ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారు. మొదటి విడతలో 13 ఇచ్చారు. రెండో విడతలో ఇంకా కొన్ని చోట్ల 12 ఇవ్వాల్సి ఉంది.

● చిన్నారులకు శనివారం కేంద్రంలో మెనూ ప్రకారం అన్నం, సాంబారు పెట్టారు.

● పాఠ్యపుస్తకాల నుంచి పాఠాలు చెప్పడం లేదు. పాటలు, రైమ్స్ వంటివి మాత్రమే నేర్పిస్తున్నారు.

నెలకు సరిపడా ఒకేసారి పంపిణీ

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లో 287 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో సుమారు 2,800 మంది బాలింతలు, 2500 మంది గర్భిణులున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రతినెల గర్భిణులు, బాలింతలకు వస్తువులు అందుతున్నా.. వాటిని తినలేకపోతున్నారన్న ఆరోపణలున్నాయి.

● ఖర్జూరాలు కొన్నిసార్లు బూజు పట్టి, చిక్కి కాలం చెల్లినట్లు ఉంటున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.

● ప్రతి నెల మూడు కిలోల బియ్యం ఇస్తున్నారు. సన్నబియ్యం ఇస్తామని చెప్పి దొడ్డువి ఇస్తున్నారంటున్నారు.

● గతంలో పాలు లీటరు ప్యాకెట్ ఇవ్వడంతో వృథా అయ్యేవని, ప్రస్తుతం 180 ఎంఎల్ ఇస్తుండటంతో వినియోగించుకోవడం జరుగుతుందన్నారు.

● 15 రోజులకోసారి ఇవ్వాల్సినవి.. నెలకు సరిపడా ఒక్కసారిగా ఇచ్చేసి సిబ్బంది చేతులు దులిపేసుకుంటున్నారు. గుడ్లు మాత్రం 15 రోజులకు ఒక్కసారి అందజేస్తున్నారు.

● ఈ విషయమై అంగన్‌వాడీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా ఖర్జూరాలు గతంలో పచ్చివి ఇచ్చేవని, ప్రస్తుతం ఒట్టి ఖర్జూరాలు ఇవ్వడంతో వారు అపోహ పడుతున్నారన్నారు. చిక్కీలకు అడుగు భాగాన పిండి అతుక్కుపోవడంతో కాలం చెల్లినవిగా భావిస్తున్నారని, రుచికరమైనవే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కేంద్రానికి వచ్చి ఒకేసారి ఇవ్వమంటేనే వారికి ఇచ్చి సంతకాలు తీసుకుంటున్నామన్నారు.

నందికొట్కూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు

కార్యాలయం వద్ద అధికారులు, ఉద్యోగులు

గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యం

తిమ్మాపురం(మహానంది), న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛతే మనందరి లక్ష్యమని ఎంపీడీవో మహబూబ్ దౌల పేర్కొన్నారు. మండలంలోని ఎం.తిమ్మాపురంలోని గ్రామ సచివాలయంలో బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లపై సర్పంచులు, ఉపసర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీపీఆర్‌సీ స్వర్ణకుమార్, డిప్యూటీ ఎంపీడీవో భార్గవీలత, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాసరెడ్డి, బుక్కాపురం సర్పంచి కందుల వరలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ప్రయోజనకర పనులు

మహానంది, న్యూస్‌టుడే: సమాజానికి ప్రయోజనకర పనులు చేపట్టి మంచి ఖ్యాతిని పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ రామాంజనేయులు పేర్కొన్నారు. మహానందిలో బుధవారం ఏపీ సహకార సంఘం, రెడ్‌క్రాస్ సహకారంతో సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో మహానంది మండలంలోని గోపవరం, తిమ్మాపురం సింగిల్ విండో ఛైర్మన్లు గంగవరపు ఉమామహేశ్వరరెడ్డి, నూలు చిన్నపాండురంగయ్యతోపాటు ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు.

మరమ్మతులు చేయరు.. గుంత పూడ్చరు

పట్టణంలోని నంద్యాల రహదారిలో జిన్ను పుల్లయ్య వీధికి వెళ్లే దారిలో వాల్వు గుంత ప్రమాదకరంగా మారింది. వాల్వు మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి దాదాపు నెల రోజులైనా పూడ్చలేదు. కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి కావటం, గుంత సమీపంలో హోటళ్లు ఉండటంతో వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికులు గుంతకు రెండు కర్రలు అడ్డుగా పెట్టారు. అధికారులు మరమ్మతులు చేసి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

కంకర తేలి.. అధ్వానంగా మారి

పాములపాడు నుంచి చెలిమిల్ల వెళ్లే దారి 2 కి.మీ మేర కంకర తేలి అధ్వానంగా మారింది. ఆ దారిలో చెలిమిల్ల, లింగాల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలానికి ప్రజలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. దారంతా కంకర తేలడంతో ఆ మార్గంలో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి బీటీ రహదారిని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

వ్యర్థాలు పేరుకుపోయి.. ప్రవాహానికి అడ్డుపడి

నంద్యాల పట్టణం విశ్వనగర్‌లో వంతెన వద్ద చామకాల్వలో ఎండిపోయిన చెట్లు, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇవి కాల్వలో మురుగు ప్రవాహానికి అడ్డుగా ఉన్నాయి. వీటిని తొలగిస్తే మురుగు సాఫీగా ముందుకు ప్రవహిస్తుంది. అధిక వర్షాలు కురిసినప్పుడు వరద ముంపు తగ్గుతుంది. అధికారులు చర్యలు చేపట్టి కాల్వలో వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల రైతుగనరం

ధర లేని ఉల్లి.. ట్రాక్టర్‌తో పంట దున్ని

మద్దతు ధర లేకపోవడంతో ఉల్లి పంటను ట్రాక్టర్‌తో దున్నినట్లు భూపనపాడు గ్రామానికి చెందిన పీవై సురేంద్ర అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు ఎకరాల్లో రూ.4 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి ఉల్లి పంటను సాగు చేయగా.. మద్దతు ధర లేకపోవడంతో కోసిన కూలీలు కూడా రాని దుస్థితి ఏర్పడిందన్నారు. దీంతో కళ్ల ముందే పంటను దున్నాల్సి వచ్చిందని వాపోయారు. - న్యూస్‌టుడే, పాణ్యం గ్రామీణం

సంక్షిప్త సమాచారం

నంద్యాల పట్టణ: పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న పాల్గొన్నారు. పింగలి సూరన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

నంద్యాల గ్రామీణం: జిల్లాలో జాతీయ రహదారి వెంట రెండు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ సుధాకర్‌రావు ఆదేశించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న శిరివెళ్ల, తమ్మరాజుల పల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శులతో డీపీవో మాట్లాడి ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

నంద్యాల రైతునగరం: తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలో ఈనెల 23వ తేదీన జరిగే మాలల బహిరంగ సభను జయప్రదం చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దేవా డిమాండు చేశారు. కార్యాలయ ఆవరణలో కరపత్రాలు ఆవిష్కరించారు.

వెలుగోడు: మండల కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పర్యావరణాన్ని పరిరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం అంశాలపై పంచాయతీరాజ్ సంస్థకు ఎన్నికైన స్వయం సహాయక సంఘాలు, ప్రజా ప్రతినిధులు, క్లాప్ మిత్ర, షెడ్ మిత్ర, కార్యదర్శులకు ఎంపీడీవో మధుసుదన్‌రెడ్డి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

గడివేముల: గడివేములలో గ్రామసర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతి కార్యదర్శులకు ఎంపీడీవో వాసుదేవగుప్తా శిక్షణ ఇచ్చారు.

నందికొట్కూరు: నైతిక విలువలు కూడిన జీవనాన్ని సాగించాలని బ్యాంకు మేనేజరు రియాజ్‌బాషా తెలిపారు. దామగట్లలో నందికొట్కూరు ఏపీజీబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం: సుగాలిమెట్ట పరిధిలోని ఆదర్శపాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించినట్లు నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీ తెలిపారు.

పాణ్యం గ్రామీణం: గాయత్రీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థులు వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించినట్లు కరస్పాండెంట్ సురేష్ తెలిపారు.

పాణ్యం గ్రామీణం: వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఆధ్వర్యంలో పాణ్యంలోని వైకాపా కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.

నంద్యాల గాంధీచౌక్: ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాలలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏబీవీపీ నంద్యాల బాగ్ కన్వీనర్ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు.

ఆత్మకూరు: అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మౌలాబి ఎంపికైనట్లు బుధవారం ప్రిన్సిపల్ సుంకన్న తెలిపారు. విద్యార్థిని అభినందించారు.

ఉపకారాగారం ఆకస్మిక తనిఖీ

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉపకారాగారం, ప్రత్యేక అవసరాలు గల పిల్లల బడిని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి లీలావెంకట శేషాద్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడున్న వసతులు గురించి తెలుసుకొని ఉచిత న్యాయ సలహాలు, టోల్ ఫ్రీ నంబరు గురించి ఖైదీలకు తెలియజేశారు. నందికొట్కూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు శోభారాణి, దివ్య, విశ్రాంత జిల్లా జడ్జి మోహన్‌రావు పాల్గొన్నారు.

పర్యవేక్షకుడితో మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకట శేషాద్రి

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు వినతి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ విగ్రహాన్ని నంద్యాల పురపాలక కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయాలని ఎస్‌డీపీఐ జిల్లా కార్యదర్శి ఏజాస్ హుస్సేన్, అసెంబ్లీ అధ్యక్షుడు హనీఫ్ డిమాండు చేశారు. నంద్యాల పురపాలక కార్యాలయంలో బుధవారం కమిషనర్ శేషన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి ఫరూక్ గతంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పినా.. చేయించలేదని విమర్శించారు.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పిల్లలను చట్టప్రకారం దత్తత తీసుకోవాలని డీసీపీయూ కౌన్సిలర్ సునీల్ అన్నారు. ప్రత్యేక దత్తత మాసం సందర్భంగా నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో బుధవారం జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, ఆర్పీఎఫ్ పోలీసులు కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టప్రకారం దత్తత తీసుకోకుంటే 3నుంచి 7ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఆర్పీఎఫ్ సీఐ రవీంద్ర, ఎస్సై కుమారి, సామాజిక కార్యకర్త ఓబులమ్మ, ఓఆర్‌డబ్ల్యూ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : రోగులు వైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటిబయోటిక్ మందులు వాడాలని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. మల్లీశ్వరి తెలిపారు. మైక్రోబయాలజీ అవగాహన సదస్సులో భాగంగా బుధవారం ఆసుపత్రి ఆవరణలో అవగాహన ర్యాలీతోపాటు నటన, నృత్యం రూపంలో రోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. యాంటిబయోటిక్ మందులు ఇష్టానుసారంగా వినియోగించవద్దన్నారు. మైక్రో బయోలజీ వైద్యులు డా. సచిన్ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది

మహిళలు ఆర్థికంగా బలపడాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా సహకార అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. 72వ సహకార వారోత్సవాల సందర్భంగా వివేకానంద ఆడిటోరియంలో శిల్పా మహిళా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లా అధికారులు మహిళా ఛైర్‌పర్సన్ నాగినిరెడ్డి, సహకార అధికారులు రుక్సానా బేగం తదితరులు పాల్గొన్నారు.

'అర్హులైన దివ్యాంగులకు అన్యాయం'

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరుగుతోందని ఏపీ డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీపీ మస్తాన్ వలి అన్నారు. డిసెంబర్ 3న జరిగే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఏర్పాట్ల గురించి చర్చించేందుకు కర్నూలులో ఉమ్మడి జిల్లాల దివ్యాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ రయిస్ ఫాతిమాను ఏపీ డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులకు ఇవ్వనున్న త్రిచక్ర స్కూటర్ కోసం దరఖాస్తు తేదీని పది రోజులకు పెంచాలని కోరారు. నాగరాజు, వెంకటేష్, అనిల్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రయిస్ ఫాతిమాకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

మహానందీశునికి పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి జనసేన నాయకులు, రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వర్ధన్ మార్కండేయబాబు బుధవారం దైవదర్శనార్థమై వచ్చారు. ఆయన గంగాకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు విశేష అభిషేకాలు, అర్చనల పూజలు చేశారు. ఆయనకు మహానంది మండల జనసేన అధ్యక్షుడు మారెడ్డి రామయ్య, నాయకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆయనకు జ్ఞాపికను బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

కార్తిక అమావాస్య పూజలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయిబాబా ఆలయంలోని శివాలయంలో శివలింగానికి బుధవారం అన్నంతో అలంకరణ చేశారు. మహిళా భక్తులు కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయం నిర్వాహకులు రాజశేఖర్, శేషయ్య, పూజారులు శేషు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి అన్నంతో అలంకరణ→

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. 10బొల్లవరం గ్రామంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంతో నియోజకవర్గంలో 36,734 మంది రైతులకు 24.94 కోట్ల నిధుల చెక్కును విడుదల చేశారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రసాదరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు దేవుల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు గ్రామీణం: చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

గడివేముల: మండలంలోని రైతులకు రూ. 4.43 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. 6,469 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతున్నట్లు చెప్పారు. పథకానికి సంబంధించిన మెగా చెక్కును బుధవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఓర్వకల్లులో రైతులకు అందించినట్లు పేర్కొన్నారు.

మహానంది: మహానందిలోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో మండల వ్యవసాయాధికారి బీ.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 4,200 మంది రైతన్నలకు రూ.2.48 కోట్ల నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలాధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్వినీ హాజరైయ్యారు.

ఆత్మకూరు: వ్యవసాయ సహాయ సంచాలకులు హేమలత ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ రైతు సంబర సభ నిర్వహించారు. నియోజకవర్గంలో 25,018 మంది రైతులకు రూ.17.08కోట్లు మంజూరైనట్లు మార్కెట్‌యార్డు ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.

బండిఆత్మకూరు: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో అన్నదాత సుఖీభవ రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు లాయర్ కృష్ణారెడ్డి, ఏవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గడివేముల: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న రైతులు

వంతెనకు మరమ్మతు పనులు చేయాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల నందమూరినగర్ వెళ్లే దారిలో కుందూ వంతెనకు మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అన్నారు. పట్టణంలోని నందమూరినగర్‌కు వెళ్లే దారిలో ఉన్న కుందూ వంతెనను బుధవారం సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించి ఆందోళన చేపట్టింది. వారు మాట్లాడుతూ..కుంగిపోతున్న వంతెనకు మరమ్మతులు చేయించాలన్న కలెక్టర్ ఆదేశాలను పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బి.శ్రీనివాసులు, మురళీధర్, నాగరాముడు, బి.శ్రీనివాసులు, హుస్సేన్‌సా తదితరులు పాల్గొన్నారు.

కుందూ వంతెనపై ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించండి

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలని జిల్లా ఉప వైద్యాధికారి డా.శారదబాయి సూచించారు. గడివేముల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం సందర్శించారు. కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న సర్వేపై ఆరా తీశారు. రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి, వారిని పీహెచ్‌సీ వైద్యుల వద్దకు తీసుకురావాలని తెలిపారు. వైద్యాధికారి డా.షా ఆలంబాషా, సిబ్బంది మార్గరేట్, సర్వేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డా.శారదబాయి

మద్యం మత్తులో హల్‌చల్

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కౌలూరు గ్రామ సచివాయలంలో తలారి ఆంజనేయులు హల్‌చల్ చేశాడు. బుధవారం ఉదయం మద్యం తాగి సచివాలయానికి వచ్చి పనుల నిమిత్తం వచ్చిన శివరామయ్యపై దాడికి ప్రయత్నించడంతో స్థానికులతో కలిసి తహసీల్దారు కార్యాలయంలో అప్పగించారు. దీనిపై ఉప తహసీల్దారు శివశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారించి చర్యలు చేపడుతామని ఉప తహసీల్దారు పేర్కొన్నారు.

'కౌలు రైతులకు అన్యాయం'

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు అన్యాయం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కౌలు రైతులకు నయాపైసా వేయకుండా మొండి చేయి చూపిందన్నారు. జిల్లాలో అర్హులైన 16,500 మంది కౌలు రైతులకు నిధులు విడుదల చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. జిల్లాలో ఎక్కడా పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమన్నారు.

నాట్య మయూరి.. రాణిస్తున్న చిన్నారి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: చిన్నప్పటి నుంచే నృత్యమంటే ఇష్టం. తల్లిదండ్రులూ ప్రోత్సహిస్తున్నారు. కూచిపూడిలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటూ తనదైన శైలిలో రాణిస్తోంది. ఎక్కడ ప్రదర్శనలు జరిగినా పాల్గొని.. నృత్యంతో అందరినీ ఆకట్టుకుంటూ.. ప్రశంసలు పొందుతోంది నాగవెంకట సాయి పల్లవి.

● నంద్యాల పట్టణం సాయిబాబానగర్‌కు చెందిన నాగశ్రీనివాసులు, రమ దంపతుల కుమార్తె నాగవెంకట సాయి పల్లవి. ప్రస్తుతం 3వ తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచి చదువుతోపాటు నృత్యమంటే ఆసక్తి. దీంతో తల్లిదండ్రులు కుమార్తెకు నృత్యం నేర్పించాలని స్థానికంగా గురువు సురేష్ వద్ద కూచిపూడిలో శిక్షణ ఇప్పించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా సాధన చేస్తూ మెలకువలు నేర్చుకుంటోంది. ఆయా ఆలయాలు, ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు అందుకుంటోంది.

బహుమతులు.. పురస్కారాలు

● 2023 నంద్యాలలో దసరా, దీపావళి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో బహుమతి.

● 2024 నంద్యాలలో నిర్వహించిన నృత్య పోటీల్లో బహుమతి

● 2025 గణేష్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీల్లో బహుమతి.

● 2025 దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన నృత్యప్రదర్శనతో ఆకట్టుకుంది.

● ఈనెలలో శ్రీశైలంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో విజయం.

● ఈనెలలో అహోబిలంలో అంతర్జాతీయ నృత్య పోటీల్లో మొదటి బహుమతి.

నాట్యంలో గుర్తింపు తెచ్చుకోవాలి

- నాగవెంకట సాయి పల్లవి

నాట్యమంటే చాలా ఇష్టం. నిత్యం సాధన చేస్తున్నా.. ఇప్పటికే పలు ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నా.. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలి.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

మెనూ తప్పనిసరిగా పాటించాలి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని మండల విద్యాశాఖ అధికారి స్వరూప సూచించారు. పట్టణంలోని రవ్వలకొండ ఆదర్శ పాఠశాలలో బుధవారం ఆమె మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డుల్లో మార్పులకు అవకాశం

సంజామల, న్యూస్‌టుడే: ఆధార్ కార్డుల్లోని విద్యార్థుల వివరాల్లో మార్పులకు అవకాశం ఉందని ఎంపీడీవో సల్మాన్ పేర్కొన్నారు. సంజామల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం విద్యార్థుల ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో విడతల వారీగా ఆధార్ నమోదు కేంద్రాలను కొనసాగిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

ప్యాపిలి, న్యూస్‌టుడే: మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెద్దపూదెళ్ల, చిన్నపూదెళ్ల, కొత్తబురుజు గ్రామాల పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని కోటకందుకూరు గ్రామంలో శుద్ధజల కేంద్రం వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. - **షరీఫ్, కోటకందుకూరు.**

✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- నూర్జహాన్, ఎంపీడీవో.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని వీరారెడ్డిపల్లె గ్రామంలోని కేసీ ఉప కాలువలో గుర్రపు డెక్క తొలగించాలి. **- నారాయణమ్మ.**

✔: గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసశర్మ, డిప్యూటీ ఎంపీడీవో, శిరివెళ్ల.**

సంజామల, న్యూస్‌టుడే: ?: ముదిగేడు గ్రామంలోని ప్రధాన కాలువలో మురుగు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. **- వెంకటేశ్వర్లు, ముదిగేడు.**

✔: పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, ముదిగేడు.**

అవుకు, న్యూస్‌టుడే: ?: సుంకేసుల గ్రామంలో ఏడాది కాలంగా వీధి దీపాలు వెలగడంలేదు. **-సుబ్బయ్య సుంకేసుల.**

✔: ఎక్కడెక్కడ దీపాలు వెలగడం లేదో మరమ్మతులు చేయిస్తాం. **- వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి.**

ప్యాపిలి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని బీసీ కాలనీ వీధిలో నీటి ట్యాంకు వద్ద మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. **- రాజేశ్వరి, కాలనీవాసి.**

✔: సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **-లక్ష్మీదేవి, సర్పంచి.**

?: మండలంలోని ఏనుగుమర్రి గ్రామ సమీపంలో రహదారి పక్కన చెత్త వేయడంతో దుర్వాసన వస్తోంది. **- కిరణ్‌కుమార్, గ్రామస్థుడు.**

✔: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీవో.**

సమావేశాలకు రాని వారు ప్రజలకేం మేలు చేస్తారు?

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: 'పురపాలికలో వైకాపా కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడం లేదని, ఇలాంటి వారు ప్రజలకేం మేలు చేస్తారని' ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. బుధవారం పురపాలిక కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి వైకాపా కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి వారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తారని, ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఆళ్లగడ్డ పురపాలిక అభివృద్ధికి ఇప్పటికే రూ.15 కోట్ల నిధులు తెచ్చానన్నారు. రహదారుల అభివృద్ధితో పాటు, పార్కును సైతం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఖనిజాభివృద్ధి నిధులు మరో రూ.2 కోట్లు ఆళ్లగడ్డకు కేటాయించేలా జిల్లా కలెక్టర్‌ను కోరానన్నారు. ఆళ్లగడ్డకు 50 పడకల ఆసుపత్రిని తెచ్చానని, వచ్చే నెల 16వ తేదీన దాన్ని ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ డా.రామలింగారెడ్డి, వైస్‌ఛైర్మన్ నాయబ్ రసూల్, కమిషనర్ పి.కిశోర్ పాల్గొన్నారు.

ధాన్యం ఆరబోత.. కష్టాల కలబోత

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ ఏడాది మొక్కజొన్న సాగు చేసిన రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. భారీ వర్షాల ప్రభావంతో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోయాయి. గిట్టుబాటు ధర కూడా పడిపోవడంతో రైతన్నలు నష్టాలు చవిచూస్తున్నారు. చేతికి వచ్చిన పంటలను వానల ధాటికి కోయకుండా వదిలేసిన రైతులు ఇపుడు ముమ్మరంగా కోస్తున్నారు. వాటిని ఆరేసేందుకు కల్లాలు లేకపోవడంతో రోడ్లను ఆశ్రయిస్తున్నారు.

ఎస్.లింగందిన్నె రహదారిలో ఆరేసిన దిగుబడులు

అదనంగా భారం

సమీప ప్రాంతాల్లోని దారులన్నీ దిగుబడులతో నిండటంతో స్థలం లేక రైతులు ఆరబోతకు అవస్థలు పడుతున్నారు. కి.మీ మేర దిగుబడులను తరలించి సుదూరాన ఉన్న రోడ్లపై ఆరేస్తున్నారు. ఇందుకు రవాణా ఖర్చులకు రూ.వేలు అదనపు వ్యయ భారం మోస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు, పాతకందుకూరు, ఓబులంపల్లె గ్రామాలకు చెందిన రైతులు ఆరేసేందుకు స్థలాలు లేకపోవడంతో రహదారుల వెంట ఆరేసుకున్నారు. రేయింబవళ్లు దిగుబడుల వద్ద కాపలా కాస్తున్నారు.

వారం రోజులవుతోంది

-చిన్న లింగారెడ్డి, ఓబులంపల్లె

మాది ఓబులంపల్లె. తొమ్మిది ఎకరాల్లో మొక్కజొన్న వేశా. ఆరేసేందుకు స్థలం లేకపోవడంతో 8 కి.మీ. దూరాన ఉన్న ఆళ్లగడ్డకు వచ్చాం. ఎస్.లింగందిన్నె రహదారిలోని సర్వీస్ రోడ్డుపై ఆరేసుకున్నాం. వారం రోజుల నుంచి దిగుబడులను కాసుకుంటూ కూర్చున్నా. మా గ్రామానికి సమీపంలో ఆళ్లగడ్డ, అహోబిలం రహదారి ఉన్నప్పటికీ స్థలం చిక్కలేదు. దీంతో దూరం రాకతప్పలేదు. గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలకు అమ్ముకోవాల్సి వచ్చింది. దిగుబడులు ఆరేసేందుకు ప్రభుత్వం కల్లాలు ఏర్పాటు చేయాలి.

ట్రాక్టరుకు రూ.1200 అదనం – హరి, కోటకందుకూరు

నేను పదెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న వేశాను. మా గ్రామ మెట్ట వద్ద సర్వీస్ రోడ్డు ఉంది. కాని స్థలం లేదు. దీంతో ట్రాక్టర్లలో దిగుబడులను 8 కి.మీ మేర ప్రయాణించి ఎస్.లింగందిన్నె గ్రామానికి వెళ్లే రహదారిలో ఆరబోసుకున్నాను. ఒక్కో ట్రాక్టర్ దిగుబడి తరలించేందుకు రూ.1200 అయ్యింది. పది ట్రాక్టర్ల దిగుబడులు రావడంతో రూ.12వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి మరింత పెరిగింది. ఇపుడున్న గిట్టుబాటు ధరకు అమ్మితే పెట్టుబడులు కూడా రాని దుస్థితి.

రహదారి గుంత.. ప్రమాద చింత

రుద్రవరం మండలంలోని ఆర్.నాగులవరం గ్రామంలో ప్రధాన రహదారి ఆనుకుని నీటి పైపులైన్ నిర్మాణం కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. మహానంది నుంచి అహోబిలం పుణ్యక్షేత్రానికి ఈ దారిపై నుంచే వాహనాలు వెళ్తుంటాయి. రాత్రి సమయంలో వాహనాలు ఎదురెదురుగా వాహనాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.-న్యూస్‌టుడే, ఆర్.నాగులవరం(రుద్రవరం)

కదలని ఆటో.. తొలగని చెత్త

డోన్ పట్టణం మున్సిపల్ పరిధిలోని వీధుల్లో ఇంటింటి చెత్త సేకరించేందుకు మినీ ఆటోలు మరమ్మతులకు గురయ్యాయి. రెండు వారాలు కావస్తున్నా మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోలేదు. పాతపేట, కొండపేట కాలనీలకు చెందిన రెండు మినీ ఆటోలు నిరుపయోగంగా పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఉంచేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పుర ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

నిలువ నీడ.. తాగునీరు కరవాయె

బేతంచెర్ల పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో 1, 2వ ప్లాట్‌ఫాంలలో దీర్ఘకాలంగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇక్కడి నుంచి బెంగళూరు, విజయవాడ, గుంటూరు, డోన్, హైదరాబాద్, నంద్యాల తదితర ప్రాంతాలకు నిత్యం అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. ప్లాట్‌ఫాంపై కనీసం పైకప్పు లేకపోవడంతో వర్షానికి తడుస్తూ, ఎండకు తాళలేక అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్లు, బెంచీలు, తాగునీరు వసతులు లేకుండా పోయాయని వాపోతున్నారు. - న్యూస్‌టుడే, బేతంచెర్ల

ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం స్ఫూర్తిదాయకం

డోన్ పట్టణం: కార్యక్రమంలో పాల్గొన్న భాజపా నాయకులు

ఆళ్లగడ్డ, డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆమెకు ఘన నివాళి అర్పించారు. ప్రజ్ఞ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత జిల్లా జడ్జి కాశీభట్ల శివప్రసాదశాస్త్రి ఝాన్సీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లింగన్న, ఉపాధ్యాయులు ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు. డోన్ పట్టణంలోని భాజపా కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్ అధ్యక్షతన ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వీరేష్‌బాబు, రవికుమార్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఓబులంపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ఓబులంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు సిద్ధార్థ సాఫ్ట్‌బాల్, కుషాల్ బేస్‌బాల్, పదో తరగతి విద్యార్థి యశ్వంత్ బేస్‌బాల్ క్రీడల్లో జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎంపికయ్యారన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, లోకేశ్వరి, ఎలీన, రామకృష్ణ, అబ్దుల్‌కలాం, చంద్ర పాల్గొన్నారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి తాజ్‌బాబా ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18న నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో పోటీలకు ఎంపిక సాధించారన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కొత్త సిలబస్‌కు అనుగుణంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎంసెట్, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్, ప్రాక్టికల్ రికార్డు మ్యానువల్ పుస్తకాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వచ్చాయని కళాశాల ప్రిన్సిపల్ ఓ.కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పుస్తకాలను బుధవారం కళాశాలలో ప్రథమ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఓబుళరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను సరఫరా చేసినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ మెటీరియల్ ఐఐటీ, జేఈఈ, ఎంసెట్, నీట్ ఇతర పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు.

ప్రతిభను గుర్తించేందుకు పోటీలు దోహదం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పోటీలు దోహదం చేస్తాయని ప్రిన్సిపల్ సిస్టర్ గీత అన్నారు. కోవెలకుంట్లలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు బుధవారం నిర్వహించడం జరిగింది. పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని దునియా మొదటి స్థానం, ఏడో తరగతి విద్యార్థిని సుధేశ్న ద్వితీయ స్థానం, వర్ణిత తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, రామయ్య, సుబ్బారావు, స్నేహ, మోహన్‌రావు, రిజ్వానా, ఓబులేసు, సుమంత్ పాల్గొన్నారు.

పోటీలకు హాజరైన విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

అన్నదాత సంక్షేమమే లక్ష్యం


ఉయ్యాలవాడ: చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ తదితరులు

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: కేసీ కాల్వకు అనుబంధంగా ఉన్న హరివరం ఛానల్ పరిధిలో ఉప కాల్వలు ఏర్పాటు చేసి 4,500 ఎకరాలకు సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమ నిధుల ఆవిష్కరణలో భాగంగా బుధవారం ఉయ్యాలవాడలో ఏర్పాటైన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి రెండో విడతగా అన్నదాత సుఖీభవ పథకం కింద 42,981 మంది రైతులకు రూ.29.13 కోట్లు నిధులు వారి బ్యాంకుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. తెదేపా మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖరరెడ్డి, ఉయ్యాలవాడ కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్నవెంకటసుబ్బయ్య, రూపనగుడి నీటి సంఘం అధ్యక్షుడు కర్నాటి మహేశ్వరరెడ్డి, ఉయ్యాలవాడ సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల కళ్లల్లో ఆనందం కలుగుతుందని భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గానికి చెందిన 35,011 మంది లబ్ధిదారులకు రూ.23.63 కోట్లు ప్రభుత్వం జమచేసిందని తెలిపారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన రైతులకు వరంగా మారిందని బనగానపల్లి మార్కెట్‌యార్డు ఛైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ పేర్కొన్నారు. కేవీకేలో బుధవారం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నగదు బదిలీ కార్యక్రమం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయ విధానాలను పాటించాలన్నారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.ధనలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు భూషన్న పాల్గొన్నారు.

డోన్ పట్టణం: కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమసుందర్‌రెడ్డి

బనగానపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

సంక్షిప్త సమాచారం

ఖాదరఖాదర(శిరివెళ్ల), న్యూస్‌టుడే: ముందస్తు నిర్ధారణతోనే క్యాన్సర్ నివారణ సాధ్యమౌతుందని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ముఖేష్‌కుమార్, ఆంజనేయులునాయక్ పేర్కొన్నారు. గ్రామంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం సంచార వైద్యశిబిరంలో గ్రామస్థులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు.

గుంపప్రమాన్‌దిన్నె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప పేర్కొన్నారు. స్థానిక సచివాలయాన్ని ఎంపీడీవో బుధవారం తనిఖీ చేసి సకాలంలో ఇంటి పన్నులు, కుళాయి ఇతర పన్నులు వసూలు చేయాలన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారిందని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ అన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలం వ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధులను బుధవారం రైతుల ఖాతాల్లో జమైందని ఏవో ప్రమీల పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.4.49 కోట్ల మేరకు సొమ్ము జమ చేసిందన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని భారతీ విద్యామందిరం పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు ఆధ్వర్యంలో బాలలకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: కుష్ఠురహిత గ్రామాలుగా మలచడానికి ప్రజలు సహకరించాలని అహోబిలం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.స్వాతి పేర్కొన్నారు. బాచాపురం గ్రామంలో కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కోటపాడు (శిరివెళ్ల), న్యూస్‌టుడే: స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకారం అందించాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీమనోహర్ తెలిపారు. గ్రామంలో స్వామిత్వ సర్వే పూర్తయిందని సర్వే బృందానికి అవసరమైన ధ్రువపత్రాల నకళ్లను సచివాలయంలో అందించాలని సూచించారు.

సమష్టి కృషితో స్వచ్ఛత సాకారం

ఆళ్లగడ్డ గ్రామీణం: మహనీయుల చిత్రపటాలకు పూలదండ వేస్తున్న ఎంపీడీవో నూర్జహాన్, సిబ్బంది

ఆళ్లగడ్డ గ్రామీణం, బేతంచెర్ల, చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా మలచాలని ఎంపీడీవో నూర్జహాన్ పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆర్‌జీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఎల్‌ఎస్‌డీజీ లక్ష్యాల్లో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ఉన్న సమస్యలను అధిగమించి శుభ్రత నెలకొనేలా చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్యాన్ని నివారించవచ్చని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బనగానపల్లి గ్రామీణం, సంజామల, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకారంతోనే గ్రామాలను పరిశుభ్రంగా మార్చవచ్చని బనగానపల్లి, సంజామల, కోవెలకుంట్ల ఎంపీడీవోలు నాగరాజు, సాల్మన్, వరప్రసాదరావులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు పర్యావరణ పరిరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా అమలు చేయటంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో సర్పంచులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులతో ఏర్పాటైన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వృథాగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు.

అహోబిలంలో ఎమ్మెల్సీ అనురాధ

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అనురాధ

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ అనురాధ దర్శించుకున్నారు. ఎగువ, దిగువ ఆలయాల్లోని స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దిగువ అహోబిలంలో స్వాతి సుదర్శన హోమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెను అతిథి మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. అహోబిలం పార్వేటోత్సవానికి యునెస్కో గుర్తింపు కోసం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని గుంటూరు జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ హరిబాబునాయుడు దర్శించుకున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా జరిగింది. వందలాది దీక్షాపరులు కార్యక్రమంలో భజనలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. వకుళానదీ తీరం నుంచి ఈ యాత్ర సాగింది. దారి పొడవునా ప్రజలు స్వామివార్లకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అవుకు, న్యూస్‌టుడే: అవుకులో బుధవారం నిర్వహించిన అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఘనంగా ముగిసింది. నిర్వాహకుడు వెంకటరమణనాయక్ ఆధ్వర్యంలో ట్రాక్టరుపై స్వామివారి చిత్రపటాన్ని ఉంచి వీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు కొవ్వూరి మద్దయ్య, మద్దిలేటి గౌడు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు.

బేతంచెర్ల: అయ్యప్పలకు భిక్ష పెడుతున్న నిర్వాహకులు

అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ జనవరి 10వ తేదీ వరకు అయ్యప్ప భక్తులకు దేవాలయంలో భిక్ష ఉంటుందన్నారు.

కోటకందుకూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామ సమీపంలో బంగారుపాడులో యోగానంద లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆళ్లగడ్డ: గ్రామోత్సవంలో అయ్యప్ప భక్తులు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, హోమం, అభిషేకం, గ్రామోత్సవం, పడి పూజ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు భారీగా తరలిరావాలన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

మాట్లాడుతున్న గంగుల బ్రిజేంద్రరెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓ వైపు దిగుబడి రాక, మరోవైపు ధర లేక మొక్కజొన్న రైతులు విపరీతంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం మాత్రం రైతుల నుంచి ఇంత వరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంలో కీలక పాత్ర తమదేనన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 50 పడకల ఆసుపత్రి తొలిదశ నిర్మాణం రూ.3కోట్లతో పూర్తి చేశామని, 2024 ఫిబ్రవరిలో రెండో దశకు కూడా రూ.8 కోట్ల నాబార్డు నిధులతో గుత్తేదారుతో ఒప్పందం కుదిరిందన్నారు.

ఇష్టపడి చదువుకుంటేనే భవిత

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: సర్కారు బడులు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవడం ద్వారానే ఉత్తమ ఫలితాలను సాధించగలరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఇంద్రావతి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. విద్యార్థినుల సమస్యలు, పరిష్కారాలపై అవగాహన కల్పించారు.

ప్రహరీలు లేవు.. పాట్లు పట్టవు

బనగానపల్లి గ్రామీణం, కోవెలకుంట్ల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. బనగానపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు కనీస ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు భయం భయంగా తరగతులకు హాజరవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలకు రక్షణ కరవు

పాఠశాలలకు రక్షణ గోడలు లేకపోవడంతో ఆవరణంలోని మొక్కలు, సామగ్రికి రక్షణ లేకుండా పోతోంది. పశువులు, విషకీటకాలు వచ్చేస్తుండటంతో తరగతుల నిర్వహణకు అంతరాయం ఏర్పడుతోంది. మధ్యాహ్న భోజన సమయంలో పందుల, కుక్కలు లోపలికి వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రాంగణాలు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

సమస్యలు ఎక్కడెక్కడంటే..

★ బనగానపల్లి మండలం రామతీర్థం గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సెలవుల్లో పశువులకు నిలయంగా మారుతోంది. చెర్లోకొత్తూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

చెర్లోకొత్తూరు ఎంపీపీ పాఠశాలలో ఆగిన ప్రహరీ పనులు

★ కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం ప్రాథమిక పాఠశాల, పెట్నికోట, గొర్విమానుపల్లె గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలకు ప్రహరీలు లేవు.

★ కోవెలకుంట్ల పట్టణంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలకు నెలవుగా మారింది.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

★ ఉయ్యాలవాడ మండలంలోని హరివరం ఉన్నత పాఠశాలకు రక్షణ గోడలు లేకపోవడంతో ఇటీవల కుందూనీరు పాఠశాలలోకి చేరింది. దీంతో విష పురుగుల సంచారం అధికమైంది.

★ రుద్రవరం మండలంలోని నర్సాపురం ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువుల సంచారంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకంబలూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గ్రామ శివారులో ఉండటంతో ఆకతాయిల బెడద ఎక్కువైంది.

★ సంజామల మండలంలోని నొస్సం ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సమస్యలు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం పాఠశాలల్లోని సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

(c) eenadu

లక్ష్మీపురం.. సరిహద్దు గ్రామం

పక్కపక్కనే పల్నాడు, బాపట్ల జిల్లాల హద్దులు తెలిపే బోర్డులు

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లక్ష్మీపురం రెండు జిల్లాలకు హద్దుగా ఉంది. గుంటూరు- కర్నూలు రాష్ట్ర రహదారి పక్కనే గ్రామం ఉంది. గ్రామాన్ని ఆనుకుని ఉంగిడిమల్లి మేజర్ కాలువ ఉంది. కాలువకు ఎడమ వైపు బాపట్ల, కుడి వైపు పల్నాడు జిల్లాలున్నాయి. జిల్లాల సరిహద్దు కావడంతో ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రముఖులు ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో రెండు జిల్లాల పోలీసులు ఇక్కడికి వచ్చి ప్రోటోకాల్ పాటించి రక్షణ కల్పిస్తారు. గ్రామంలోని రెండు ఇళ్లు బాపట్ల జిల్లా పరిధిలో.. సుమారు 150 గృహాలు పల్నాడు జిల్లా పరిధిలో ఉండటం గమనార్హం. - న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

సమైక్యతను చాటుతాం

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నరసరావుపేటలో బుధవారం ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ కృతికా శుక్లా సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ కళాశాలల విద్యార్థులు హాజరై ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. - న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్



చెక్కు అందజేస్తున్న రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, కలెక్టర్

17 నెలల్లో హామీలన్నీ నెరవేర్చాం: మంత్రి

గుడిపూడి (సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో తప్పిదాలను కప్పిపుచ్చుతూ, అబద్ధాలతో ప్రజలను నమ్మించేందుకు వైకాపా నాయకులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సత్తెనపల్లి మండలం గుడిపూడిలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నగదు విడుదల కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లాలో 2.40 లక్షల మంది రైతులకు రూ.158.91 కోట్ల చెక్కు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 36,752 మంది రైతులకు రూ.24.07 కోట్ల చెక్కును మంత్రి రవి కుమార్ రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన 17 నెలల్లోనే హామీలన్నీ నెరవేర్చామన్నారు. రూ.270 కోట్లతో నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామన్నారు. విద్యుత్తు ఛార్జీలను తగ్గించామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టరు కృతికా శుక్లా, డీఏవో జగ్గారావు, ఇన్‌ఛార్జి ఆర్డీవో మురళీకృష్ణ, యార్డు ఛైర్‌పర్సన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లో.. పల్నాటి గురుతులెన్నో!

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

పల్నాడు అంటేనే రక్తసిక్తంగా గుర్తుకొచ్చేది 12వ శతాబ్దం నాటి యుద్ధం.. బ్రహ్మనాయుడు, నాగమ్మల వీరోచిత పోరాటం.. పల్నాటి వీరుల తెగువ.. నేటికీ ఆ యుద్ధం గురించి కథలుగా చెబుతుంటారు. ఆనాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఎన్నో కట్టడాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఆచారవంతులు తరతరాలుగా.. భావి తరాలకు ఇక్కడి ఔన్నత్యాన్ని, త్యాగనిరతిని తెలియజేస్తున్నారు. నాటి మహనీయుల మననం చేసుకుంటూ ఏటా వీరారాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

వీరుల ఆలయం

పల్నాటి యుద్ధవీరుల ఆలయం 15వ శతాబ్దంలో ముస్లింల పాలనలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు యుద్ధానికి వెళుతూ మార్గ మధ్యలో కారంపూడిలోని నాగులేరు వాగు పక్కన సేదతీరుతుండగా.. పల్నాటి యుద్ధంలో అమరవీరులకు ప్రతిరూపాలైన లింగాలకు అపచారం జరిగింది. దానికి పరిహారంగా ఆయన సైన్యంలోని జకీర్, ఫరీద్ అనే యుద్ధవీరులు ఆలయాన్ని నిర్మించి.. ఆయుధాలు, లింగాలు భద్రపరిచారు.

రాళ్లే ప్రతిరూపాలు

మాచర్ల, గురజాల రాజ్యాల కోసం కత్తులు దూసుకున్న వీరనాయకులు రణభూమికి తరలివచ్చి, వారి వటువులకు తమ ఆనవాళ్లుగా లింగాలను (గుండ్రంగా ఉండేరాళ్లు) ఇచ్చేవారు. ఆ లింగాలే వీరులకు ప్రతిరూపాలుగా, వారి ఆయుధాలే దైవాలుగా నేటికీ పూజిస్తున్నారు.

కన్నమదాసు మేడ

బ్రహ్మనాయుడి దత్తపుత్రుడు కన్నమదాసు హరిజనుడు కావడంతో ఆయనను యుద్ధంలోకి రానివ్వకుండా శపథం పెట్టారు. దీంతో నాగులేటి ఇవతల ఓ మేడ ఏర్పాటు చేసుకుని, దానిపై నుంచి కన్నమదాసు సైన్యానికి సూచనలిచ్చారు. దానిని కన్నమదాసు మేడగా పిలుస్తున్నారు.

తోట బజారు

తోట బజారు: బ్రహ్మనాయుడు కారంపూడిలో చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం జరిపిస్తున్న సమయంలో అంకాళమ్మ గుడి సమీపంలోని తోటలో మండపం ఏర్పాటు చేసుకుని ఉన్నారు. అందులో కూర్చుని ఆయన వైష్ణవానికి ప్రతీకలైన తిరునామాలను ధరించేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని తోట బజారుగా పిలుస్తున్నారు.

కోట

బురుజులు: పల్నాటి రాజ్యంలోకి వచ్చేవారిని గమనించేందుకు 12వ శతాబ్దంలో కారంపూడి, మాచర్లలలో కోట బురుజులు నిర్మించారు. మాచర్లలోని బురుజు కాలగర్భంలో కలిసి పోగా.. కారంపూడిలో కొంతమేర కనిపిస్తోంది.

శంఖుతీర్థ

మండపం: వీరుల ఆలయ సమీపంలో శంఖుతీర్థ మండపం ఉంది. ఒకవేళ యుద్ధ క్షేత్రంలో మృత్యువాత పడితే.. వైకుంఠం చేరేలా వీర నాయకులు శంఖుతీర్థం తాగేవారు. యుద్ధానికి వెళ్తూ తీర్థం తీసుకునేవారు. ఈ మండపం ఇప్పటికీ దర్శించుకోవచ్చు.

1,200 మందికొక పోలింగ్ కేంద్రం

ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా చర్యలు

పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నరసరావుపేట, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు సౌకర్యంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతి 1,500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉంది. ఎక్కువమంది ఓటర్లతో పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని గుర్తించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు.. ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. నాలుగు నెలల కిందట నూతన పీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల విజ్ఞప్తులు పరిగణనలోకి తీసుకుని కొన్ని మార్పు, చేర్పులు చేపట్టారు.

కొత్తగా 183 పీఎస్‌ల ఏర్పాటు

నియోజక వర్గం	ప్రస్తుతం ఉన్నవి	ఏర్పాటు చేసేవి	మొత్తం
పెదకూరపాడు	266	14	280
చిలకలూరిపేట	242	34	276
నరసరావుపేట	248	36	284
సత్తెనపల్లి	274	24	298
వినుకొండ	299	28	327
గురజాల	304	24	328
మాచర్ల	299	23	322

❖ అధికారుల బృందం క్షేత్రస్థాయికి వెళ్లి ఓటర్లకు దగ్గరగా.. అన్ని వసతులు ఉన్నచోట పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,932 పీఎస్‌లు ఉండగా.. కొత్తగా 183 ఏర్పాటు చేయనున్నారు.

వీరుల ఆరాధనోత్సవాలకు శ్రీకారం

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆచారవంతులు తమ కొణతాల(ఆయుధాలు)తో వీరుల ఆలయానికి చేరుకున్నారు. ఆలయ గొర్ల పూజారులు పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఇంటి నుంచి వీర గంధం తీసుకొచ్చి కొణతాలకు అలంకరించారు. అనంతరం కొణతాలతో ఆచారవంతులు చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ ఆలయాల్లో శంఖుతీర్థం తీసుకుని పీఠాధిపతితో కలిసి వీరుల దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం పీఠాధిపతి ఆలయంపై ఎర్రజెండా ఎగురవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియతో మొదటి రోజు రాచగావు కార్యక్రమం ముగిసింది.

వీరుల ఆలయంపై ఎర్రజెండా ఎగురవేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

సివిల్స్ సర్వీసెస్ అధికారుల కార్ఖానా

బాపట్ల వ్యవసాయ కళాశాల.. జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న విద్యా సంస్థ. 1945లో దక్షిణ భారతదేశంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఏర్పాటైన రెండో వ్యవసాయ కళాశాల. కళాశాలలో ఏజీ బీఎస్సీ, ఎమ్మెస్సీ చదివిన విద్యార్థులు సివిల్స్ రాసి విజయాలు సాధిస్తున్నారు. ఇప్పటివరకు 120 మందికి పైగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులుగా ఎంపికై కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో సేవలందిస్తున్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు రావాడ ఎ. చంద్రశేఖర్ కేరళ డీజీపీగా, సి. శ్రీధర్ పీఎంవో సంయుక్త కార్యదర్శిగా, ఆరిజ్ అహ్మద్ అసోం సిబ్బంది విభాగం ముఖ్య కార్యదర్శిగా, వేణుగోపాల్‌రెడ్డి మహారాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ అదనపు చీఫ్ సెక్రటరీగా, కాంతిలాల్ దండే ఏపీ పర్యావరణ, అటవీ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్య కార్యదర్శిగా, చలపతిరావు ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా, మోహనరావు ఏపీలో ఐజీపీగా సేవలు అందిస్తున్నారు. ఏపీ మాజీ సీఎస్ అజేయ కల్లం, డీజీపీగా పని చేసిన మాలకొండయ్య కళాశాల పూర్వ విద్యార్థులే. - న్యూస్‌టుడే, బాపట్ల

రుణం చెల్లించగలమా?

పునరాలోచనలో డిజిలక్ష్ములు

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

పట్టణాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు పౌరసేవలు అందించాలని ప్రభుత్వం డిజిలక్ష్మిలకు రూపకల్పన చేసింది. మీ-సేవ, ఈ-సేవ, కామన్ సర్వీస్ సెంటర్ల తరహాలో వీటిని ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చని తెలిసి విద్యావంతులైన పొదుపు మహిళలు వాటి ఏర్పాటుకు ముందుకొచ్చారు. సమాఖ్యకు ఒకరు చొప్పున డిజిలక్ష్మిల ఎంపిక చేశారు. తీరా కేంద్రాలు ఏర్పాటు చేయబోయే సమయంలో వారు ఆలోచనలో పడ్డారు.

డిజిలక్ష్మి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తుంది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.2.90 లక్షల వరకు రుణం ఇప్పిస్తారు. ఈఎంఐల రూపంలో వాటిని చెల్లించాల్సి ఉంటుంది. అయితే తీసుకున్న రుణానికి సంబంధించి ఈఎంఐలు చెల్లించగలమా అనే సందేహం వారిలో తలెత్తి.. ముందు చూపినంతగా ఇప్పుడు ఆసక్తి చూపించట్లేదు. స్థలం కూడా ఒక సమస్యగా మారుతోంది. స్వయం ఉపాధి రాయితీ రుణం ఇప్పిస్తే భారం ఉండదనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నట్లు మెప్మా అధికారులు చెబుతున్నారు.

డిజిలక్ష్మి కేంద్రం

☛ అధిక సంఖ్యలో వీటిని ఏర్పాటు చేస్తే ఆశించిన మేరకు ఆదాయం రాదనే అభిప్రాయం డిజిలక్ష్ముల్లో ఉంది. సత్తెనపల్లి లాంటి పట్టణంలో 32 కేంద్రాలు నడవవని ఐదారు ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెబుతున్నారు.

☛ జిల్లాకు ఒకటి చొప్పున నమూనా కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశాలొచ్చినా నరసరావుపేటలో ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు.

నిర్దేశిత లక్ష్యం మేరకు డిజిలక్ష్మి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా టీఎంసీలు తెలిపారు.

పట్టణం	ఎంపికైన మహిళలు
చిలకలూరిపేట	65
మాచర్ల	32
నరసరావుపేట	77
పిడుగురాళ్ల	35
సత్తెనపల్లి	32
వినుకొండ	42
గురజాల	13
దాచేపల్లి	23

విహారం.. విజ్ఞానదాయకం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు సందర్శనలో దొడ్లేరు పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

సత్తెనపల్లి, శావల్యాపురం, న్యూస్‌టుడే: తరగతి గదిలో పాఠాల్లో చదివిన చారిత్రక, భౌగోళిక, పర్యాటక, ఆహ్లాదకర ప్రాంతాల్ని నేరుగా వీక్షిస్తే కలిగే అనుభూతి వేరుగా ఉంటుంది. విహారం విజ్ఞానదాయకమైతే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుంది. పుస్తకాలతో కుస్తీ కాసేపు పక్కనపెట్టి బాలలు విజ్ఞానదాయక ప్రాంతాలను వీక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి.

జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 183, ఏపీ ఆదర్శ పాఠశాలలు 14 ఉండగా.. 45 విద్యాలయాల్ని పీఎంశ్రీ పథకానికి ఎంపిక చేశారు. ఈ ఏడాది కొత్తగా పీఎంశ్రీ విద్యాలయాల్లోని విద్యార్థుల్ని విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఆరు నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభావంతులకు అవకాశం కల్పించనున్నారు.

❖ ఒక్కో విద్యాలయం నుంచి గరిష్ఠంగా 60 మందికి, కొన్ని పాఠశాలల్లో 49 మందికి అవకాశమిచ్చారు. విద్యార్థికి రూ.500 చొప్పున మంజూరు చేశారు.

❖ నాగార్జునసాగర్, ఎత్తిపోతల, కోటప్పకొండ, అమరావతి, ఉండవల్లి గుహలు, సంగం జాగర్లమూడికి విద్యార్థులను తీసుకెళ్లాల్సి ఉంటుంది.

❖ జిల్లాలోని 35 పీఎంశ్రీ విద్యాలయాల్లోని 2,326 మంది విద్యార్థుల్ని విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లేందుకు రూ.11.63 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల విద్యార్థులు యాత్రలు పూర్తి చేశారు.

❖ ఈ నెల 20న సమ్మెటివ్-1 పరీక్షలు ముగియనున్నాయి. వెంటనే యాత్రలు ప్రారంభించి నెలాఖరులోపు పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

❖ పీఎంశ్రీ విద్యాలయాల విద్యార్థుల క్షేత్ర అవగాహన పర్యటనలు (విజ్ఞాన యాత్రలు) పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు డీఈవో చంద్రకళ, పీఎంశ్రీ పాఠశాలల జిల్లా సమన్వయకర్త పూర్ణ తెలిపారు.

నీటి రుచి వాగు పేరు మార్చింది

నక్క వాగు నుంచి చీలి వచ్చిన పాయను మండల కేంద్రం యడ్లపాడులో ఉప్పు వాగు అని స్థానికులు పిలుస్తారు. నాదెండ్ల సమీపంలో నక్క వాగు నుంచి ఓ పాయ చీలి యడ్లపాడు - తిమ్మాపురం మధ్యగా ప్రవహించి దింతెనపాడు వద్ద తిరిగి నక్క వాగులో కలుస్తుంది. వేసవిలో ప్రవాహం తగ్గినప్పుడు యడ్లపాడు పరిధిలో నేల స్వభావం కారణంగా వాగులో నీరు ఉప్పగా మారడంతో దానికి ఆ పేరు స్థిరపడింది. ఎగువ, దిగువ ప్రాంతాల్లో నీటి రుచిలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. పైగా ఆ ప్రాంతాల వారు నక్క వాగును యథాతథంగా పిలుస్తారు. - న్యూస్‌టుడే, యడ్లపాడు

రొంపిచర్లలో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు

మొక్కజొన్నకే జై!

రబీలో 50 వేల ఎకరాల్లో సాగు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

మిర్చి, పత్తి పంటలు ఆశాజనకంగా లేకపోవడం, శనగకు మద్దతు ధర లభించకపోవడంతో జిల్లా రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది కంటే ఈసారి రబీలో సింహభాగం పంట సాగు చేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలోనే పంట వేయాల్సి ఉండగా తుపాను ప్రభావానికి కురిసిన వర్షాలకు కాస్త ఆలస్యమైంది. గత వారం నుంచి విత్తనాలు విత్తుతున్నారు. రబీలో సాధారణ విస్తీర్ణం 27,065 ఎకరాలు కాగా.. ఈసారి 50 వేల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

❖ జిల్లా రైతులు ఇప్పటికే పెద్ద ఎత్తున విత్తనాలు కొనుగోలు చేశారు.

మద్దతు ధర క్వింటాకు రూ.2400

కేంద్ర ప్రభుత్వం 2025-26 సీజన్‌కు మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,400 మద్దతు ధర ప్రకటించింది. ఖరీఫ్ దిగుబడులకు తొలినాళ్లలో మంచి ధర దక్కింది. ఏపీ, తెలంగాణలో ఒకేసారి దిగుబడులు రావడంతో ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.2 వేలకు కొనుగోలు చేస్తున్నారని ఓ రైతు తెలిపారు.

మొక్కజొన్నకు చీడపీడల బెడద తక్కువ ఉండటంతో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.2 వేల నుంచి రూ.2,200 వరకు ధర లభిస్తోంది. ఈ క్రమంలో వాణిజ్య పంటలు సాగుచేసే రైతులకు మొక్కజొన్న ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది.

10 లక్షల మందికి ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం మంజూరు

నరసరావుపేట అర్బన్: జిల్లాలో డ్రైవింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతి 10 లక్షల మందికి ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం మంజూరు చేస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి సంజీవకుమార్ తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద వీటి ఏర్పాటుకు అనుమతులు ఇస్తామన్నారు. ఆసక్తి గల ఎన్జీవో సంస్థలు ఈ నెల 25లోగా డీపీఆర్‌తో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు డీటీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

CHEBROLU HANUMAIAH INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
Accredited by NAAC & AUTONOMOUS
Chandramoulipuram, Chowdavaram, Guntur – 522019, Andhra Pradesh.
Ph:7382008494, www.chips.ac.in
B. PHARMACY AND PHARM.D SPOT ADMISSIONS - 2025
Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions in I B.Pharmacy and I Pharm.D with all original certificates between 20-11-2025 to 23-11-2025. The vacant seats created to unreported candidates shall be filled-up as per guidelines of APSCHE & Convenor APEAPCET-2025.
PRINCIPAL

చెరువు కాదు.. మృత్యు కుంట

నీళ్లు నిండుగా ఉండటం చూసి ఏదో చెరువనుకుంటే పొరపాటే.. ఇది మట్టి అక్రమ తవ్వకాలతో ఏర్పడ్డ కుంట. గత నెలలో మొంథా తుపాను ధాటికి కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. కోటప్పకొండ వద్ద ఎన్నెస్పీ కాలువ పక్కన ఏకంగా పదడుగుల మేర మట్టిని తవ్వేయడంతో భారీ గోతులు ఏర్పడి నీరు నిలిచి మృత్యు కుంటలా మారింది. ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ఊడిజర్లలో డెంగీ ఛాయలు

వారం రోజులుగా అదుపులోకి రాని జ్వరాలు

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఊడిజర్ల ఎస్సీ కాలనీలో జ్వరాలు అదుపులోకి రావడం లేదు. ఈ నెల 11 నుంచి ఇప్పటి వరకు 13 మంది జ్వరాల బారినపడగా, వారిలో ఏడుగురికి డెంగీ సోకినట్లు ప్రాథమిక వైద్య పరీక్షల్లో వెల్లడైంది. ఈ నెల 11, 13 తేదీల్లో జ్వర పీడితుల్లో ఇద్దరికి డెంగీ పాజిటివ్‌గా తేలడంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కాలనీలో శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఇంటింటా సర్వే నిర్వహిస్తూ జ్వర పీడితులను గుర్తించి వారిని పరీక్షలు, చికిత్సల నిమిత్తం పీహెచ్‌సీకి పంపుతున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో మురుగు కాలువల్లో పూడిక తీయించి నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. దోమల నివారణ మందులు చల్లించారు. అయినా ఫలితం లేదు. బుధవారం అయిదుగురికి జ్వరాలు సోకాగా.. పరీక్షల నిమిత్తం కొచ్చెర్ల పీహెచ్‌సీకి పంపించారు.

● కాలనీలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నా కింది స్థాయి సిబ్బంది వచ్చి మాత్రలు ఇస్తున్నారు తప్ప వైద్యులు వచ్చి పరీక్షలు చేయడం లేదు. ప్రాథమిక పరీక్షల్లో పలువురికి డెంగీ లక్షణాలు బయట పడుతున్నా ఎలిసా పరీక్షలు చేయించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రవి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.రవి ఊడిజర్ల ఎస్సీ కాలనీని బుధవారం సందర్శించారు. వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఇంటింటా క్రమం తప్పకుండా జ్వరాల సర్వే నిర్వహించి బాధితుల్ని ఆసుపత్రికి పంపాలన్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి జాగ్రత్తలు చెప్పారు. ఎఫ్‌డీపీ నోడల్ అధికారి హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేవీకి తాత్కాలిక భవనాలు కేటాయించేది ఎప్పుడు?

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: రొంపిచర్ల కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి ప్రత్యామ్నాయ స్థలం ఎప్పుడు చూస్తారు.. తాత్కాలిక భవనాలు ఇంత వరకు ఎందుకు కేటాయించలేదని కేంద్రీయ విద్యాలయ సంస్థల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ కలెక్టర్ కృతికా శుక్లాకు లేఖ రాశారు. విద్యాలయాన్ని 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభించాలని అనుకోవడం లేదా అని ప్రశ్నించారు. ఆలస్యం చేస్తే విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. తాత్కాలిక భవనానికి 5 కిలోమీటర్ల దూరంలో శాశ్వత భవన నిర్మాణానికి స్థలం చూడాలని.. అదీ ఐదెకరాల విస్తీర్ణం ఉండాలని నిబంధన పెట్టారు. వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచే విద్యా సంవత్సర ప్రవేశాల ప్రక్రియ జరుగుతుందని.. త్వరగా తాత్కాలిక భవనాలను చూడాలని సూచించారు.

CHALAPATHI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
(AUTONOMOUS)
Estd:2004
Chalapathi Nagar, Lam, GUNTUR-522 034
Ph: 0863-2524124, 2524125, www.chalapathipharmacy.in
CATEGORY-B / SPOT / NRI ADMISSIONS
I B.PHARMACY & I PHARM.D

S.No.	Course	EAPCET Code	Category-B Seats	NRI Seats
01	B.Pharmacy	CLPT	30	10
02	Pharm.D	CLPT	09	02

Eligible candidates who have not taken admission in any other college so far may attend Spot Admissions for I **B.Pharmacy** and **I Pharm.D** with all original certificates on **21/11/2025.** The vacant seats created by unreported candidates, shall be filled-up as per guidelines of APSCHE & Convenor **APEAPCET-2025.** Seats for Foreign Nationals/NRI are available as per PCi regulations
Principal

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

● ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ వందగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరిలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయి మ్యాచ్లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. ఉమ్మడి క్రికెట్ జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు, గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా: ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు-522 005 వివరాలకు: 7799102585, 8328360034

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions – The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
TV Partner: ETV Andhra Pradesh
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Organised by ఈనాడు ఈవెంట్స్

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

పల్నాటి చరిత్రకు ప్రత్యేకత

ఎద్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి చరిత్రకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పల్నాటి వీరుల ఆరాధనోత్సవాల సందర్భంగా బుధవారం జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వీరుల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఉత్సవాలను రాష్ట్ర పండగగా జరుపుతున్నట్లు తెలిపారు. డీసీసీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్సై వాసు, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాకు ప్రథమస్థానం

ప్రకాశం జిల్లా మద్దిరాలకు చెందిన శేషాద్రి ఎడ్ల జత 5051 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం ఎడ్ల జత రెండోస్థానం, కారుమంచి మండలం కొండ బాబాపాలెం లక్ష్మీ దీక్షిత జత మూడోస్థానం, పిడుగురాళ్ల మండలం పిన్నెల్లికి చెందిన మురళి ఎడ్ల జత నాలుగో స్థానంలో నిలిచాయి.

బ్యాంకర్లు ప్రజల వద్దకు వెళ్లాలి: ఎంపీ

ఎస్‌బీఐ రుణ వితరణలో రూ.118 కోట్లు పంపిణీ

డ్వాక్రా మహిళలకు చెక్కు ఇస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రుణాలు కోరుతూ బ్యాంకర్ల వద్దకు రావడమే సహజమని అర్థికాభివృద్ధి సాధనకు ప్రజల వద్దకే బ్యాంకర్లు వెళ్లి రుణాలు అందజేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో స్టేట్‌బ్యాంకు ఆధ్వర్యంలో రూ.118 కోట్ల రుణ వితరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలని చెబుతుంటారని మహిళలకు రుణ సాయం అందిస్తే అభివృద్ధి చెందుతారన్నారు. నియోజకవర్గస్థాయిలో బ్యాంకర్ల సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపీ ఆలోచనల మేరకు నియోజకవర్గ స్థాయిలో కేంద్రప్రభుత్వ కార్యక్రమాలు, రాయితీలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే అరవిందబాబు, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎస్‌బీఐ డీజీఎం సురేష్‌బాబు, ఆర్ఎం రవికుమార్, జేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నేతలు సయ్యద్ జిలానీ, కొమటినేని శోభారాణి, డీఆర్‌డీఏ అధికారులు ఉన్నారు.

పోలీసుల అదుపులో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, వైకాపా నాయకుడు పల్లపాటి గురుప్రభుదాసు ఉరఫ్ వెల్దుర్తి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఓ కేసు వాయిదా నిమిత్తం మాచర్ల వచ్చిన అతడిని కోర్టు వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇతనిపై పలు కేసులు నమోదయ్యాయి. గత వైకాపా ప్రభుత్వంలో 2020లో ఎంపీటీసీ ఎన్నికల సమయంలో బోదిలవీడు గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ నామినేషన్ పత్రాలను చించివేసి, ఆమెను అడ్డుకున్న కేసులో నిందితుడు. అలాగే 2023లో గొట్టిపాళ్ల గ్రామంలో సత్తెమ్మ బోనాల జాతరలో తెదేపా నాయకులపై దాడి, మాచర్లలోని తెదేపా కార్యాలయానికి నిప్పు పెట్టిన కేసులో, గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కారంపూడిలో వైకాపా నాయకుల దమనకాండలోనూ ఇతను నిందితుడు.

ప్రభుత్వ కళాశాల నిర్వహణపై అభిప్రాయ సేకరణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్‌బీటీ ఎన్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంశం రోజుకో మలుపు తిరుగుతోంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కళాశాల ఆస్తులను త్రికోటేశ్వర సొసైటీకి అప్పగించాలని ఇటీవల ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ ప్రక్రియ విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే డిగ్రీ తొలి ఏడాది విద్యార్థులను వేరే కళాశాలలకు తరలించారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ పొలిటికల్ సైన్సు విద్యార్థులు 75మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణ అంశమై ఆర్జేడీ డాక్టర్ పి.కళావతి విద్యార్థుల అభిప్రాయాలు బుధవారం సేకరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ విద్యార్థులు వినుకొండ, మాచర్ల, గుంటూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తామని, ఐచ్ఛికాలు ఎంచుకోవాలని సూచించారు. వసతిగృహ సౌకర్యం కల్పిస్తామని విద్యాభ్యాసం కొనసాగించాలని పేర్కొన్నారు. ఆస్తుల గుర్తింపు వివరాలు కమిషనర్‌కు తెలియజేస్తామని వారి నిర్ణయం మేరకే చర్యలు ఉంటాయని చెప్పారు. ఆస్తులు అప్పగించినా కళాశాల కొనసాగించేందుకు ఇబ్బంది ఏమిటన్న విలేకరుల ప్రశ్నకు ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావాలని ఎవరూ కోరడం లేదని బదులిచ్చారు. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మేధావులు స్పందించాల్సి ఉందని తమ పరిధిలోని అంశం కాదన్నారు.

కొనసాగించాల్సిందేనని పట్టు.. ఈ సందర్భంగా విద్యార్థులు విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాల కొనసాగించాలని కోరారు. ప్రాంగణాన్ని మార్చినా తమకు ఇబ్బంది లేదని, వేరే ఊళ్లకు వెళ్లి చదువుకునే పరిస్థితి లేదని తెలిపారు. ఇప్పటికే కలెక్టర్, ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రజాప్రతినిధులను కలిసి తమ కళాశాల కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ఉద్యమాలకు వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు సాతులూరు విద్యార్థిని

మోహనలక్ష్మి

సాతులూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: సంధ్యాల జిల్లా అహోబిలంలో ఈనెల 26న జరిగే రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు నాదెండ్ల మండలం సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సిద్ధబత్తుని మోహనలక్ష్మి ఎంపికైంది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం కొర్రపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా బేస్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగం నుంచి ప్రతిభ చాటి ఈమె రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

30లోగా సర్వే పూర్తి చేయండి

ఆసుపత్రిలో డాక్టర్ ప్రభాకర్‌తో మాట్లాడుతున్న జిల్లా కుష్ఠు, లెప్రసీ అధికారి మాధవీలత

యడ్లపాడు, న్యూస్‌టుడే: ఆరోగ్య సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారు వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా కుష్ఠు, క్షయ నివారణ విభాగం అధికారి డాక్టర్ మాధవీలత అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా కుష్ఠు, క్షయ విభాగ అధికారి యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. వైద్యాధికారి పి.ప్రభాకర్, హెచ్‌ఈవో ప్రభాకరరావుతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వే ద్వారా గుర్తించిన అనుమానితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయాలన్నారు. ఈనెల 30 లోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే తనిఖీల్లో భాగంగా గ్రామంలో సర్వే నిర్వహించిన కొందరి ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వో పున్నారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

'పది'లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: రానున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో చంద్రకళ అన్నారు. మండలంలోని యల్లమంద, కోటప్పకొండ జడ్పీ పాఠశాలలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సబ్జెక్టుల వారీగా పరీక్షల్లో మార్కులు ఎలా వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులు అన్ని ఉన్నత పాఠశాలలు నిబంధనల ప్రకారం వసూలు చేసి నామినల్ రోల్స్ తయారు చేసే విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. పుట్టుమచ్చల నమోదులో జాగ్రత్తలు పాటించాలన్నారు. అపార్ ఐడీని అనుసరించి ఎటువంటి తప్పులు లేకుండా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో పల్నాడు జిల్లా విద్యార్థులు రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచారని, ఈ ఏడాదిలో కూడా అదే స్థాయిలో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురపరిపాలన శాఖ వినుకొండ పురపాలక సంఘం

"ఈ-ప్రొక్యూర్‌మెంట్" టెండరు నోటీసు

NIT.No.822/2024/ఇ1,తేది.19-11-2025

(1) పని పేరు: వినుకొండ పురపాలక సంఘ పరిధిలో 7 నెం.ల పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలువబడుచున్నవి. (2) 5 నెం.ల పనులకు సంబంధించిన బిడ్లు స్వీకరణకు చివరి తేది/సమయము. 26.11.2025, సాయంత్రం 4.00 గం వరకు (3) 2 నెం.ల పనులకు సంబంధించిన టెండర్లు స్వీకరణకు చివరి తేది/సమయము.03.12.2025, సాయంత్రం 4.00 గం వరకు (4) సంబంధిత మునిసిపల్ ఇంజినీరు పేరు: శ్రీ ఎమ్.సుబ్బన్ వంద్లకోర్, కమిషనరు, వినుకొండ పురపాలక సంఘము, ఫోన్ నెం.08646-273656, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరు, వారి సెల్ నెం.7093403723 తదుపరి వివరములను http://tender.apeprocurement.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ నందు చూడవచ్చును.

సం/- కమిషనరు, వినుకొండ పురపాలక సంఘం.

రూ.10 లక్షలు విలువ చేసే శ్రీగంధం చెట్ల నరికివేత

చెట్లను నరికిన ఆనవాళ్లు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: బంగారం, నగదు, వాహనాల దొంగతనాల గురించి తరచూ వింటుంటాం. కానీ దొంగలు పంథా మార్చుకొని ఓ రైతు సాగు చేసిన శ్రీ గంధం చెట్లను నరుక్కుని వెళ్లిన ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. రూ.లక్షలు విలువ చేసే శ్రీ గంధం చెట్లను నరికి దుంగలు ఎత్తుకెళ్లిన సంఘటన రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. సుబ్బయ్యపాలెం గ్రామానికి చెందిన ఇంటూరి చిన వెంకట్రావు, ఇంటూరి ప్రసాద్ అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కన ఉన్న 7.5 ఎకరాల్లో 12 ఏళ్ల క్రితం ఎర్రచందనం, శ్రీ గంధం మొక్కలు వేశారు. బుధవారం చినవెంకట్రావు తన పొలానికి వెళ్లగా లోపల మొక్కలు నరికిన ఆనవాళ్లు కనిపించటంతో తన అన్న కుమారుడు ఇంటూరి ప్రసాద్, గ్రామస్థులకు సమాచారం అందించాడు. వారు పొలం మొత్తం పరిశీలించగా సుమారు 4 ఎకరాల్లో చెట్లకు గాట్లు పెట్టినట్లు, 40 చెట్లు నరికి వేసినట్లు గుర్తించారు. నరికిన చెట్లను అక్కడే ముక్కలు చేయటంతో పాటు తాట తీసి ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన శ్రీగంధం చెట్ల విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. దీనిపై రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై మణికృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి బాధిత రైతులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తేమ శాతం నిబంధనతో తిరస్కరించొద్దు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనుగోళ్లు చేయడంతోపాటు తేమశాతం అధికంగా ఉందన్న నెపంతో పత్తి రైతుల సరకును తిరస్కరించవద్దని కలెక్టరు కృతికా శుక్లా స్పష్టం చేశారు. సత్తెనపల్లిలోని లక్ష్మీ కాటన్ ట్రేడింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్ల తీరును కలెక్టరు బుధవారం పరిశీలించారు. కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పత్తి తేమ శాతాన్ని పరికరం ద్వారా గమనించారు. కొనుగోళ్ల తీరుపై కలెక్టరు వద్ద రైతులు అసంతృప్తి చెందారు. తేమ ఎంత ఉన్నప్పటికీ ఆ మేరకు ధర నిర్ణయించి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో రవాణా, కూలీ ఛార్జీలు అదనపు భారంగా మారుతాయన్నారు. సీసీఐ ఉన్నతాధికారుల వైఖరితో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో కొనుగోలుదారు నయీమ్‌కు కలెక్టరు కొన్ని సూచనలు చేశారు. స్లాట్ బుకింగ్ తేదీ కాకుండా తర్వాత రోజున సరకు తెచ్చినప్పటికీ కొనుగోలు చేయాలని ఆదేశించారు. జాప్యం లేకుండా చూడాలన్నారు. క్రోసూరు యార్డుకు కేటాయించిన మిల్లును సత్వరమే తెరిపించి కొనుగోళ్లు జరిగేలా పర్యవేక్షించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇన్‌ఛార్జి ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దారు చక్రవర్తి, యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, యార్డు ఛైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి పాల్గొన్నారు.

పత్తి రైతుకు కన్నీరే మిగిలింది

రొటోవేటర్‌తో పంటను తొలగిస్తున్న రైతు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పత్తి పంటను అధిక వర్షాలు దెబ్బతీశాయి. అరకొరగా వచ్చిన దిగుబడి నాణ్యత లేదంటూ కొనుగోలు చేయకపోవడంతో కడుపు మండిన రైతు పంటను తొలగించారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన షేక్ మాబు మూడెకరాల పొలం కౌలుకు తీసుకుని పత్తి పంట వేశారు. ఎకరాకు రూ.15 వేలు చొప్పున రూ.45 వేలు కౌలు చెల్లించారు. సాగు, ఎరువులు, మందులకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. మొంథా తుపాను కారణంగా అధిక వర్షాలు కురవడంతో కాయలోకి నీరు చేరి పత్తి దిగుబడి తగ్గింది. ఉన్న కొద్ది పత్తిని తీయించగా.. మూడెకరాల్లో మొదటి తీత 11 క్వింటాళ్లు వచ్చింది. కూలీలకు రూ.30 వేల వరకు వెచ్చించారు. పత్తిని విక్రయించేందుకు సత్తెనపల్లిలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి వెళితే, పత్తి నాణ్యతగా లేదని వెనక్కి పంపించారు. చేసేది లేక సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ.5700 చొప్పున విక్రయించారు. రూ.1.50 లక్షల పెట్టుబడికి రూ.65 వేలు మాత్రమే రాబడి వచ్చిందని ఆవేదన చెందిన కౌలు రైతు బుధవారం పొలంలోని పంటను రొటోవేటర్‌తో తొలగించారు.

టిప్పర్ కిందపడి మహిళ మృతి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొన్ని మహిళ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి ఐదులాంతర్ల సెంటర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక అచ్చంపేట రోడ్డులోని శివాలయం సమీపంలో కోటపాటి కృష్ణకుమారి(59) నివాసముంటున్నారు. చాన్నాళ్ల కిందట ఆమె భర్త మృతి చెందగా ఇంటికి పెద్ద దిక్కుగా కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఆమె చిన్న కుమారుడు వెంకటరావు ఆర్టీసీలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన డ్యూటీల విషయంలో బస్సు యజమాని, ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలని కుమారుడు కోరడంతో కృష్ణకుమారి అతడి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో స్పీడ్‌బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి టిప్పర్‌ను తగిలింది. దీంతో ఆమె టిప్పర్ కిందపడి మృతి చెందారు. వెంకటరావు ఎడమవైపు పడటంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

దేశసేవకు అగ్నిపథ్ సదవకాశం

మాట్లాడుతున్న యాకుబ్ అలీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్: ఇంటర్ పూర్తవగానే మంచి జీతంతో పాటు దేశానికి సేవచేసే అవకాశం ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోందని.. సేవ చేయాలనుకున్న యువతకు అగ్నిపథ్ సదవకాశమని 12 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్ కమాండింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ అలీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో భారత వాయుసేనలో అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. యువకుల సందేహాలను నివృత్తి చేశారు.

దేశ సమైక్యతకు పటేల్ కృషి నిరుపమానం

నరసరావుపేట అర్బన్: దేశాన్ని సువిశాల భారతావనిగా మార్చేందుకు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చేసిన కృషి నిరుపమానమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కొనియాడారు. పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఐక్యత ర్యాలీని కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పటేల్ చూపిన ధైర్యసాహసాలు యువతకు ఆదర్శప్రాయమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు యువత ముందుకు రావాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో మధులత, ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ, మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 9701893458.

MARRIAGE SERVICES

వనజారావు క్విక్ మ్యారేజెస్ నందు అన్ని కులముల వారికి సంబంధములు కుదర్చబడును. లక్ష్మీపురం, గుంటూరు. సెల్: 98666 33988.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT. వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 91540 85588, 91549 35588

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 400 గజాలలో గల 10000+ S.ft. విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. Ph: 99662 28370.

JOBS

Wanted Export Company Staff 1. Accountant, 2. Supervisor (10th Pass), 3. Security Guard. Contact: 73864 82800, 99082 14472.

Jayalakshmi Nexa Hiring for Autonagar, Guntur. Good Opertunity for Freshers/ Experienced Whatsapp: 91007 87054.

గుంటూరు జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వయసు 50 సం||లోపు. ఆకర్షణీయమైన జీతము. 90100 42973, 82478 14976.

అకౌంట్స్ మేనేజర్ కావలెను. బికాం,5 సం||లు. అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్, GST రిటన్స్‌వేయగలవారు kamathamjob@gmail.comకు పంపగలరు.

గుంటూరులోని Elite Infra ఆఫీసు నందు పనిచేయుటకు 5 సం||లు అనుభవం కలిగిన, కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్ట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆: 77997 51199.

గుంటూరులో ఎలక్ట్రిక్ స్కూటర్స్ ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు అశోక్ లేలాండ్ దోస్త్ డ్రైవరు కావలెను. ✆: 99496 46703.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గుంటూరులో గల కాలేజ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు 35 సంవత్సరాల పైబడిన లేడి వార్డెన్స్ మరియు బస్సు డ్రైవర్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164.

FACULTY/ TEACHERS

Faculty: Bio Chemistry - B.Sc., MSc&Nursing: B.Sc., M.Sc.&Employ: Inter, Degree, Computer. Age: 19-25, Con: Victoria Paramedical Institute, Gnt. ✆: 0863-2222683, 98481 34028, 8332004478.

MEDICAL

Wanted Receptionist To Work In Dental Clinic. ✆ 6300569298

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

నరసరావుపేట
•నరసరావుపేట •వినుకొండ •చిలకలూరిపేట

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు అన్నారు. పట్టణంలోని 11, 12, 13 వార్డు సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టీని పరిశీలించారు. కొందరు వార్డు కార్యదర్శులు బయోమెట్రిక్ నమోదు చేసిన హాజరు పట్టీలో సంతకాలు చేయకపోవటాన్ని గుర్తించారు. వారు ఎక్కడికి వెళ్లారని అక్కడున్న సిబ్బందిని అడిగితే క్షేత్రస్థాయిలో విధులకు వెళ్లారని చెప్పడంతో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకల్లా అందరూ సచివాలయాలకు రావాలని ఆదేశించారు.

గ్రామ సమాఖ్యల పాత్ర కీలకం

అమీన్‌సాహెబ్‌పాలెం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనలో గ్రామ సమాఖ్యల పాత్ర కీలకమని డీఆర్‌డీఏ ఏపీడీ రాజా ప్రతాప్ అన్నారు. మహిళా సాధికారత, స్వయం సహాయక బృందాల బలోపేతమే లక్ష్యంగా నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెంలో గ్రామ సమాఖ్యలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. గ్రామ సమాఖ్యల పరిధిలో భాగంగా స్వయం సహాయక సంఘాల నుంచి తీసుకునే తీర్మానాలు, రికార్డుల నిర్వహణ, సమావేశాల నిర్వహించడంపై అవగాహన కల్పించారు. ఎంసీఎల్ఎఫ్ (మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్) ఉద్దేశం, సంఘాలలో ఆర్థిక క్రమశిక్షణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విద్య తదితర అంశాలపై గ్రామ సమాఖ్యలు చొరవ తీసుకోవాలని సూచించారు. మహిళలు సమాజంలో కీలక భాగస్వాములుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో వైఎస్సార్ కాలనీ సమీపంలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. **- రామకృష్ణ**
✔ పరిశీలించి విద్యుత్తు స్తంభాలకు మరమ్మతులు చేయిస్తాం. **- లావణ్య, ఏఈ, విద్యుత్తు శాఖ**
- న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? నరసరావుపేట పట్టణం మొదటి గేటు వద్ద ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యతో సకాలంలో కార్యాలయాలకు వెళ్లలేకపోతున్నాం. **- రమేష్‌కుమార్, ఉద్యోగి**
✔ ఆ ప్రాంతంలో రోజూ ఓ కానిస్టేబుల్ ఉంటున్నారు. ఇకపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటాం. **- లోకనాథం, సీఐ, ట్రాఫిక్**
- న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

క్రీడల్లోనూ ఆదర్శమే

రొంపిచర్ల, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంత విద్యార్థులైనా చదువులో చురుకుదనం.. ఆటల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. అన్నింటా విజయాలు సొంతం చేసుకుంటున్నారు. క్రీడల్లో నిత్యం సాధన చేస్తూ పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పుట్టిన ఊరు, చదువుతున్న పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తెస్తున్నారు. ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. భావి జీవితానికి లక్ష్యాలు ఏర్పరుచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్న వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థుల మనోగతం ఇలా..

ఆటలతోనే భవిత

మాది నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామం. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-17 చదరంగం పోటీలలో మండల, డివిజన్ స్థాయిలో రాణించా. నా ఆట తీరు చూసి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. క్రీడలతో మంచిభవిత ఉంటుందని నమ్ముతున్నా. **- శాంభవి**

కబడ్డీలో చిచ్చర పిడుగు

మాది విప్పర్ల. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో రాణించా. నా ఆట తీరు చూసి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో జరిగే పోటీల్లో రాణించి పతకాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకొస్తా. క్రీడా కోటాలో ఉన్నత చదువు లక్ష్యం. **- విష్ణుప్రియ**

పోలీసు ఉద్యోగం సాధిస్తా

మాది రొంపిచర్ల. గత నెలలో నిర్వహించిన పోటీల్లో జావెలిన్‌త్రోలో మండల, జిల్లా స్థాయిలో విజేతగా నిలిచా. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను అక్కడ ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో సత్తా చాటి క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధించాలన్నదే ధ్యేయం. **- జి.వేణుమాధవ్**

జాతీయ జట్టుకు ఆడటమే లక్ష్యం

మాది రొంపిచర్ల మండలం ఎడ్వర్డుపేట. చిన్నతనం నుంచి కబడ్డీ అంటే ఇష్టం. వ్యాయామ ఉపాధ్యాయుడు వీరాంజనేయులు వద్ద శిక్షణ తీసుకుంటున్నా. గత నెలలో పల్నాడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచాం. త్వరలో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నా. జాతీయ జట్టులో ఆడాలన్నదే నా లక్ష్యం. **- కె.ఝాన్సీరాణి**

రొంపిచర్ల: గోగులపాడులో అలంకరించిన అయ్యప్ప

చిలకలూరిపేట: పసుమర్రు తాండవేశ్వరుడు

నూజండ్ల: రవ్వారం రామలింగేశ్వరస్వామి

భక్తిప్రపత్తులతో కార్తిక పూజలు

రొంపిచర్ల, చిలకలూరిపేట గ్రామీణ, నూజండ్ల, న్యూస్‌టుడే: కార్తిక మాసం ముగింపు సందర్భంగా దేవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూజండ్ల, అప్పాపురం, రవ్వారం, సమీప పాడు తదితర ఆలయాల్లో స్వామిని అలంకరించారు. ఓంకారం, లింగాకారంలో మహిళలు దీపాలు వెలిగించారు. ఏకాహం భజనలు చేశారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు తాండవేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. శివలింగం, త్రిశూలం ఆకృతుల్లో వెలిగించిన దీపాలు ఆకట్టుకున్నాయి. రొంపిచర్ల మండలం గోగులపాడులో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. అరటి బోదెలతో చేసిన మండపం, మెట్లు ఆకట్టుకున్నాయి.

చిన్నారులకు పాటల పోటీలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం కనపర్రు, బుక్కాపురం, ఎండుగుంపాలెం, ఇర్లపాడు, అమీన్‌సాహెబ్ పాలెం గ్రామాల్లో 17 అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకున్న హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులకు బుధవారం పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మండలంలో విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం, వెంకుపాలెం, జాలలపాలెం గ్రామాల్లో 11 కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతు, ఆధునికీకరణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు వినుకొండ రూరల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

చిలకలూరిపేట గ్రామీణ: పసుమర్రు, గణపవరం గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం పర్యటిస్తారు. పసుమర్రులో రెండు పాఠశాలల ప్రహరీ, బ్రహ్మంగారి గుడి దగ్గర నుంచి జెడ్‌పీ బావి వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. గణపవరంలో రూ.32లక్షలతో మరమ్మతులు నిర్వహించిన ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించనున్నట్లు తెదేపా సమన్వయకర్త వెల్లాని సదాశివరావు తెలిపారు.

బుచ్చిపాపన్నపాలెంలో పశు వైద్యశిబిరం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం గురువారం నిర్వహిస్తున్నారు. గుంటూరు, చేబ్రోలు డీఎల్‌డీఏ నుంచి నిష్ణాతులైన 8మంది వైద్యుల బృందం పరీక్షలు నిర్వహిస్తారని కర్షకులు పశు వైద్యశాల వైద్యుడు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి తెలిపారు.

23న ఆర్టీసీ కార్మికులకు కంటి పరీక్షలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23న చిలకలూరిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. దానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం మార్కెట్‌యార్డులో ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి, సామాజికవేత్త కంచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలి



కార్యక్రమంలో చీఫ్ విప్ ఆంజనేయులు, వ్యవసాయాధికారులు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి.. సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. బొల్లాపలి మండలంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ యోజన కింద నిధుల విడుదల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నియోజకవర్గంలో 45 వేల రైతు కుటుంబాలకు రూ 31.04 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ప్రభుత్వ ప్రోత్సాహం అందుకోవాలని సూచించారు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెసల వెంకట నారాయణ, ఏడీఏ రవికుమార్, తహసీల్దారు సుధాకర్, ఎంపీడీవో మాధురి, ఏవో అంకారావు తదితరులు పాల్గొన్నారు.

సాగు విధానాల మార్పుతోనే లబ్ధి

రైతులతో కలిసి చెక్కు చూపుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, తదితరులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : సాగు విధానాల మార్పుతోనే రైతులకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మార్కెట్‌యార్డులో బుధవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 21,669 మంది రైతులకు మంజూరైన రూ. 14.13కోట్లకు నమూనా చెక్కు విడుదల చేశారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, సాగులో సాంకేతిక వినియోగం, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అయిదు అంశాలను రైతులు అమలు చేసినప్పుడే రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రగతిబాట పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి తిరుపతిరాయుడు, యార్డు ఛైర్మన్ ఎస్‌కే కరీముల్లా, పురపాలక ఛైర్మన్ ఎస్‌కే రఫాని, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, తెలుగురైతు జిల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి, అంబటి సోంబాబు, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, భాజపా నాయకుడు మల్లెల శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల బతుకులు మారాలి

నమూనా చెక్కుతో ఎమ్మెల్యే అరవిందబాబు, రైతులు, అధికారులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వ్యవసాయం లాభసాటి కావాలి.. అన్నదాతల బతుకులు మారాలి అన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు అన్నారు. రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో రాష్ట్ర గంథ్రాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 20,463 మంది రైతులకు పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ కింద రూ. 13.30 కోట్లు విడుదల చేశామన్నారు. తొలుత ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటల ఉత్పత్తులు, డ్రోన్ పనితీరు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లామత్స్యశాఖ అధికారి సంజీవరావు, డీఏవో కార్యాలయ ఏడీఏ హనుమంతరావు, యార్డు ఛైర్మన్ మొండితోక రాణి, ఏవోలు శివలలిత, శాంతి, జిల్లా, మండల తెదేపా నేతలు, సొసైటీల ఛైర్మన్లు, డీసీ కమిటీల ఛైర్మన్లు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేద్దాం

రొంపిచర్ల, ఈపూరు, న్యూస్‌టుడే: సహకార వ్యవస్థ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సహకార శాఖ డివిజనల్ అధికారి స్వర్ణ చిన రామిరెడ్డి కోరారు. సహకార వారోత్సవాల సందర్భంగా బుధవారం రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెం సహకార సంఘ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి సహకార ప్రతిజ్ఞ చేశారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ఛైర్‌పర్సన్ ఇంటూరి ప్రసాద్ కోరారు. ఈపూరులో ఛైర్‌పర్సన్ విడపలపాటి హనుమయ్య పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పరిధిలోని రైతులకు సరసమైన ధరలకే ఎరువులు, పురుగు మందులు, పశువుల దాణా అందజేస్తున్నామని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టరు రాపర్ల జగ్గారావు, కోపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇఫ్కో జిల్లా మేనేజరు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు చింత ఎప్పటికి తీరేనో!

నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ వద్ద కొన్ని రోజులుగా మురుగు పేరుకుపోయింది. ఆ ప్రాంతం నీటికుంటను తలపిస్తోంది. దోమలకు ఆవాసంగా మారింది. ఈ దారిలో నిత్యం 200మంది ద్విచక్రవాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలో రెండు ప్రైవేటు పాఠశాలలకు సుమారు 100మంది విద్యార్థులు వెళ్తుంటారు. ఇక్కడ మురుగు పారేందుకు చర్యలు చేపట్టాలని అపార్ట్‌మెంట్ వాసులు కోరుతున్నారు. ఈ సమస్యను పారిశుద్ధ్య అధికారిణి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి నీరు నిలబడకుండా చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**

ప్రసంగాలతో ఆకట్టుకున్నారు

ఉత్సాహంగా 'ఈనాడు' ప్రతిభ పాటవ పోటీలు

విజేత బాలికలతో హెచ్‌ఎం సుబ్బారావు, ఇన్‌ఛార్జి జ్యోతి, ఉపాధ్యాయులు

నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

సెల్‌ఫోన్‌ను అవసరానికి మించి వాడితే అనారోగ్యంతో పాటు మానసిక ఆందోళన పెరుగుతుందని విద్యార్థులు పేర్కొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో చక్కగా ప్రసంగించారు. తమ మాటలతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. సెల్‌ఫోన్ వినియోగంపై పరిమితి పాటించాలని, విద్యాపరంగా పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు దోహదపడేలా ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. నరసరావుపేటలోని పీఎన్‌సీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు కాసు హరిణి, షేక్ జుబేదా (10వ తరగతి), షేక్ యాసిన్ (8వ తరగతి) ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు సుభాష్‌చంద్రబోస్ బహుమతులు అందించి అభినందించారు. ఉపాధ్యాయినులు నాగశ్రీ, లక్ష్మీజ్యోతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

◆ చిలకలూరిపేట ప్రసన్నలక్ష్మి విద్యాలయంలో విద్యార్థినులు ఎస్‌కే సాదియా కౌసర్ (10వ తరగతి), ఎస్. నవ్యసాయి, బి.దేవి ప్రియబాయి (9వ తరగతి)వరుసగా తొలి మూడు స్థాయిల్లో నిలిచి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. హెచ్.ఎం ఎ.సుబ్బారావు, ఇన్‌ఛార్జి ఎ.జ్యోతి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే రిహానా, వి.భవాని పాల్గొన్నారు.

◆ చిలకలూరిపేట జీవీఐటీ పాఠశాలలో విద్యార్థినులు మాచవరపు ప్రణవి (10వ తరగతి), ఉప్పాల భవ్యశ్రీ (9వ తరగతి), గ్రంధి లిఖిత (10వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ దేవులపల్లి ఫణికుమార్, ఇన్‌ఛార్జి కేసీహెచ్ పద్మజ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయినులు

సత్తా చాటిన బాలికలతో ప్రిన్సిపల్ ఫణికుమార్, ఇన్‌ఛార్జి పద్మజ

నరసరావుపేట అర్బన్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని విద్యార్థులు పేర్కొన్నారు. పట్టణంలోని భావనా జూనియర్ కళాశాలలో బుధవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధతో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను చక్కగా వివరించారు. పోటీలో రాణించిన సీనియర్ ఇంటర్ విద్యార్థినులు సౌమ్య, చంద్రిక, జెస్సీప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఆర్.రామచంద్రారెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అధ్యాపకురాలు విజయనిర్మల పాల్గొన్నారు.

విద్యార్థినులతో ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి

సత్యసాయి శత జయంతి వేడుకలు

నగర సంకీర్తనలో సత్యసాయి భక్తులు

వినుకొండ, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు మహిళా దినోత్సవం సందర్భంగా ఉదయం నగర సంకీర్తన నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ పేరుతో పేదలకు అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ హాజరై అభినందించారు. సాయంత్రం కొత్తపేటలోని సత్యసాయి మందిరంలో భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 23 వరకు ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సాయి తెలిపారు.

సాగులో సాంకేతికతతో అధిక దిగుబడి

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో సాంకేతికత వినియోగంతో తక్కువ ఖర్చుతో రైతులు అధిక దిగుబడి సాధించి మంచి ఆదాయం పొందవచ్చని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. బొల్లాపల్లి మండలం గంగులపాలెంలో రైతులు పురుగుమందు పిచికారీకి ప్రభుత్వం అందించిన రాయితీతో కొనుగోలు చేసిన డ్రోన్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో కీలకమైన సస్యరక్షణ చర్యలకు ఇబ్బంది లేకుండా డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసి తక్కువ శ్రమ, ఖర్చుతో వ్యవసాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓ రైతు సాగు చేసిన పచ్చిమిర్చి పంటను పరిశీలించారు. నీటి వసతి ఉన్న రైతులు నిమ్మ, దానిమ్మ, పూలు, తీగ జాతి కూరగాయలు సాగు చేసి మంచి ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, ఏవో అంకారావు, ఉద్యానశాఖాధికారి నబీరసూల్, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఈకేవైసీ తప్పనిసరి

నూజండ్ల, న్యూస్‌టుడే: ఉపాధి పథకంలో జాబ్ కార్డులున్న వారికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఎంపీడీవో ఉమాదేవి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 22న ఆయా పంచాయతీల వద్ద జాబ్‌కార్డుల జాబితా ప్రకటించడంతో పాటు తొలగించిన వారి వివరాలు తెలియజేయాలన్నారు. ఏపీవో ఆంజనేయరాజు, జేఈ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

బాధితులకు అండగా ఉంటా

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. జాలలపాలెం ఎస్సీ కాలనీలో కూల్చివేతల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

వైకాపా పాలనలో కార్మికులకు అన్యాయం

వినుకొండ, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అంగలకుదురు ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని వివిధ కూడళ్లలో బుధవారం కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. వైకాపా హయాంలో కార్మికులకు అన్యాయం జరిగిందని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు ఉన్నారు.

నోటీసు

మహారాజశ్రీ నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు నందు.

ఇ.పి.నెం.4/2024 ఇన్ ఎ.ఓ.పి. 1333/2022.

బిట్వీన్:

మెస్సర్స్ ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ ఆథరైజ్డ్ పర్సన్ అండ్ రీజినల్ లీగల్ మేనేజర్ మోదుకూరి ప్రవీణ్ ఆనంద్ బాబు. గుంటూరు. ...డి. హెచ్. ఆర్.

అండ్

తన్నీరు లక్ష్మీనారాయణ అండ్ అనదర్ ....జె.డి.ఆర్

టు,

జె.డి.ఆర్ నెం-1: తన్నీరు లక్ష్మీనారాయణ, తండ్రి కోటేశ్వరరావు,డోర్ నెం.2-252, ఉప్పల పాడు గ్రామం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో 1వ జె.డి.ఆర్. అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ నోటీసు నిమిత్తం ఈ పేపర్ ప్రకటనకు ఆర్డర్ వేసినారు. కావున వాయిదా తేదీ **26-11-2025** న **ఉ.గం.10-30ని.**లకు మీరు కానీ, మీతరపున అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందువిచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది. వాయిదా తేది :**26-11-2025.**

వలివేటి నాగేశ్వరరావు, డి. హెచ్.ఆర్ తరపు న్యాయవాది, కన్నా వారి తోట 5వలైను, గుంటూరు, సెల్.

చిగురుపాటి మృతి పార్టీకి తీరని లోటు



ఆదినారాయణ (పాతచిత్రం)

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలో పరగటిచర్లకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు చిగురుపాటి ఆదినారాయణ (86) అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీలో స్థానికంగా కీలక పాత్ర పోషించే ఆయన 23ఏళ్ల పాటు గ్రామ సర్పంచిగా పనిచేశారు. రొంపిచర్ల మండల పరిషత్తు అధ్యక్షుడిగా, జడ్పీటీసీ సభ్యుడిగా, నరసరావుపేట మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా ప్రజలు, రైతులకు సేవలందించారు. గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పలువురు ప్రముఖులు అన్నారు. ఆయన పార్థివ దేహానికి గోనుగుంట్ల పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసరావు, రంగారావు, దొప్పలపూడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

చిలకలూరిపేట: చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు

నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట పట్టణం, రొంపిచర్ల, యడ్లపాడు, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తే సాధికారత సాధించవచ్చని వక్తలు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. నరసరావుపేటలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు అర్పించారు. రంగోలి పోటీలు నిర్వహించారు. యడ్లపాడులో మహిళల హక్కులు, భద్రత, మహిళా శక్తి యాప్ గురించి వివరించారు. రొంపిచర్ల, సంతగుడిపాడు, చిలకలూరిపేట పట్టణంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చిలకలూరిపేట గ్రామీణ, వినుకొండ, నూజండ్ల, న్యూస్‌టుడే : పరిశుభ్రతపైనే మనిషి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని వక్తలు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన జరగకుండా విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. చిలకలూరిపేట మండలం పోతవరం కస్తూర్బాగాంధీ విద్యాలయం, వినుకొండ ఎస్సీ సంక్షేమ గురుకుల పాఠశాల, నూజండ్ల మండలం పెద్దవరం పాఠశాలలో బుధవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సత్కరించి అభినందించారు.

ఇళ్ల మధ్య గోదాము ఏర్పాటుకు అనుమతించొద్దు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ఇళ్ల మధ్య గోదాము ఏర్పాటుకు అనుమతించవద్దని మహిళలు కమిషనర్ శ్రీహరిబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో 11వ వార్డు వేలూరు రోడ్డులోని కబేళా బజారులో ఇళ్ల మధ్య వడ్ల గోదాము నిర్మాణం జరుగుతుందని, ఇది పూర్తయితే దుమ్ముతో పాటు ఎలుకలు, పాములు, విష పురుగులు సంచరిస్తూ ప్రమాదకరంగా మారుతుందన్నారు. మహ్మద్ సుహానా, షేక్ మాలిన్, షేక్ ముంతాజ్, పఠాన్ ఖైరున్, షేక్ షరీఫ్, నాగూర్‌బీ షేక్ ముబీనా, పఠాన్ మహబూబీ తదితరులు వినతిపత్రం అందజేసినవారిలో ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతికి నివాళి

నూజండ్ల, న్యూస్‌టుడే: నూజండ్ల ఆదర్శ పాఠశాల కాపలాదారుగా పనిచేసి గత ఏడాది ఉద్యోగ విరమణ చేసిన ఏసుపాదం (59) బుధవారం మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఏపీ మోడల్ స్కూల్ అటెండర్లు, వాచ్‌మేన్ అసోషియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మంతునాయక్, వినుకొండ పేరయ్య, శివకుమారి తదితరులు అతని మృతికి నివాళులు అర్పించారు. వారి కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

10మంది జూదరులపై కేసులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: లింగారావుపాలెంలో కోతముక్క ఆడుతున్న వారిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,240 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

శ్రద్ధాంజలి

శ్రీ చిగురుపాటి ఆదినారాయణ గారు
పరగటిచర్ల, రొంపిచర్ల మండలం
పరగటిచర్ల మాజీ సర్పంచ్, రొంపిచర్ల మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, రొంపిచర్ల మండల జడ్పీటిసి మాజీ సభ్యులు, నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్‌గా విశిష్ట సేవలందించిన
శ్రీ చిగురుపాటి ఆదినారాయణ గారు
ది. 19-11-2025 బుధవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతించుచున్నాము.

అంత్యక్రియలు :
ది.21-11-2025, శుక్రవారం ఉదయం గం.10.00లకు పరగటిచర్ల గ్రామంలో జరుగును. కావున తెలియపరచడమైనది.
- కుటుంబ సభ్యులు సెల్ : 9963294624

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

సర్వేతో భూ వివాదాలు పరిష్కారం

పాకాలపాడులో సర్వే తీరును పరిశీలిస్తున్న డీడీ తోయజాక్షరావు

పాకాలపాడు (సత్తెనపల్లి గ్రామీణ): దస్త్రాలను అనుసంధానించడం ద్వారా భూ హద్దుల విషయంలో ఇబ్బందులు లేకుండా రైతుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ గుంటూరు ఉప సంచాలకుడు వి.తోయజాక్షరావు అన్నారు. పాకాలపాడులో రీసర్వే జరుగుతున్న తీరును బుధవారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. దస్త్రాల్లో నమోదైన అంశాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను గమనించారు. జిల్లా సర్వే అధికారి భానుశ్రీ, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివశ్రీనివాసులు, మండల సర్వేయరు విజయ్‌కుమార్, ఆర్ఐ జోసెఫ్‌బాబు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి దీపోత్సవం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా స్థానిక మహారాజావీధిలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో దీపోత్సవం నిర్వహించారు. నాగార్జుననగర్, రఘురామ్‌నగర్, నాగన్నకుంటలోని ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

భక్తాంజనేయస్వామి

కార్తిక దీపాల వెలుగు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? అచ్చంపేట మండలం మాదిపాడు సమీపంలోని సత్యెమ్మతల్లి దేవస్థానానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలి. - **సుబ్బారావు, మాదిపాడు** ✔ ఈ ఏడాది జనవరి నుంచి సర్వీసును ఆలయం వరకు నడిపాం. ప్రయాణికుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. - **విజయ కుమార్, డిపో మేనేజరు, సత్తెనపల్లి** - న్యూస్‌టుడే, అచ్చంపేట

? బల్లుపాలెం గ్రామంలోని కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **బాలాజీ నాయక్, స్థానికుడు** ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **రవికుమార్, కార్యదర్శి** - న్యూస్‌టుడే, దాచేపల్లి

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు [illegible] అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు.

యువ సైన్యం.. సేవతో మమేకం

పెదకూరపాడు, న్యూస్‌టుడే

సమాజంలోని వివిధ సమస్యలను పరిశీలించి, సమస్యలను అవగాహన చేసుకొని.. పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నారు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులు. ఇంటర్, డిగ్రీ చదువుతూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పెదకూరపాడులోని కాకతీయ ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు కొందరు ఎన్ఎస్ఎస్‌లో చేరారు. 10 యూనిట్ల వాలంటీర్లు యువ సేవా సైన్యంగా మారి పల్లెబాట పట్టారు. ఓటు వినియోగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పారిశుద్ధ్యం, స్వచ్ఛ భారత్‌పై గ్రామీణుల్లో చైతన్యం నింపుతున్నారు. ప్రస్తుతం లగడపాడు, కన్నెగండ్ల గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

కన్నెగండ్ల ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్క నాటుతున్న విద్యార్థులు

అవగాహనతో అభివృద్ధి

పల్లెల్లో నేటికీ నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు పోలేదు. అవే వారిని అభివృద్ధికి దూరం చేస్తున్నాయి. వీటిపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యం. శిబిరంలో భాగంగా ఆరోగ్య సూత్రాలు, పరిసరాల శుభ్రత గురించి వివరించాం. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశాం. - **ప్రసన్నకుమార్**

గర్వంగా ఉంది

పది మందికి ఉపయోగపడే పని చేయడం గర్వంగా ఉంది. ఎప్పుడూ తరగతి గదుల్లోనే కాకుండా ప్రజలతో మమేకమైతే ఎన్నో విషయాలు తెలుస్తాయి. పల్లె ప్రగతికి యువత ముఖ్యపాత్ర ఉండాలన్నదే ధ్యేయం. ఎన్ఎస్ఎస్ ద్వారా పల్లెలకు వెళ్లి అవగాహన కల్పిస్తాం. - **జబీద**

పేదలకు అండగా ఉంటా

విద్యార్థి దశ నుంచే ప్రతి సామాజిక సేవ చేయడం అలవర్చుకోవాలి. పాఠాలే కాకుండా సమాజంలోని విషయాలు తెలుసుకోవాలి. గ్రామాల్లో పేదలు, అనాథలు ఉన్నారు. వారికి అండగా ఉంటా. - **దేవర్ష్ రాజు**

24న క్రోసూరులో జాబ్‌మేళా

క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మారావు తెలిపారు. 10 నుంచి పీజీ, బీటెక్ తదితర విద్యార్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాల సందర్శన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని లెనిన్‌నగర్‌లో ఉన్న కార్మిక పాఠశాలను చైల్డ్ లేబర్ ఆఫీసర్ ఖాజా సాంబశివరావు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. బడి మానేసిన చిన్నపిల్లలను పనుల్లో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ జాయింట్ డైరెక్టర్ పుష్పలత, లత, దయామని తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

మాచవరం: ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన-2026లో భాగంగా బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు రిసోర్సు పర్సన్‌గా వ్యవహరించారు. ఆర్డీవో మురళీకృష్ణ పరిశీలించి, పలు సూచనలు చేశారు. తహసీల్దారు నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బెల్లంకొండ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. షేక్ మహమ్మద్ ఖాసిం నివసిస్తున్న అద్దె ఇంట్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారి మంటలు చెలరేగాయి. ఇరుగుపొరుగు వారు గుర్తించి ఇంట్లో ఉన్న భార్యభర్తలను బయటకు తీసుకువచ్చారు. ఇంట్లోని వస్తువులు, దుస్తులు కాలిపోయాయి.

పత్తిని ఆరబెట్టాలి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రైతులు పత్తిని ఆరబెట్టుకొని తీసుకురావాలని డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత చెప్పారు. బుధవారం పట్టణంలో పత్తి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఏడు కొనుగోలు కేంద్రాలు ద్వారా పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పత్తిని తీసిన తరువాత బాగా ఆరబెట్టితే రైతులకు మంచి ధర వస్తుందని చెప్పారు.

విద్యాకేంద్రం జూనియర్ కళాశాలలో..

బహుమతులు అందుకుంటున్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

చక్కటి ఉపన్యాసం.. తెచ్చింది బహుమానం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: చక్కటి ఉపన్యాసంతో విద్యార్థులు ప్రతిభ చాటారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యాకేంద్రం జూనియర్ కళాశాల విద్యార్థులకు 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జి.స్వర్ణకుమారి (ఇంటర్ ద్వితీయ), ఎం.మహాలక్ష్మి నరసింహ, పి.మోహన్ (ప్రథమ సంవత్సరం) వరుసగా మొదటి మూడు బహుమతులు గెల్చుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్ మౌలాలి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే నాగార్జున నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు షేక్ దక్షిణాది కౌసర్ (తొమ్మిదో తరగతి), చేపూరి కీర్తనరెడ్డి (ఎనిమిదో తరగతి), పడాల రాజేశ్వరిదేవి (ఏడో తరగతి) వరుసగా మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కె. విశ్వనాథం ప్రోత్సాహక బహుమతులు అందించారు.

21న రైల్వే గేటు మూసివేత

పెదకూరపాడు: ట్రాక్ మరమ్మతుల కారణంగా మూడు రోజులపాటు పెదకూరపాడు రైల్వే గేటు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు. 21వ తేదీ నుంచి 24 సాయంత్రం వరకు గేటు మూసేస్తామని, వాహన చోదకులు ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లాలని సూచించారు.

ప్రమాద బీమా సొమ్ము అందజేత

వెల్దుర్తి: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెదేపా కార్యకర్తలకు బీమా పరిహారం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలో బొదిలవీడు గ్రామానికి చెందిన కార్యకర్త శ్రీనివాసరావు కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

లాభసాటి వ్యవసాయమే ధ్యేయం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: వ్యవసాయం లాభసాటిగా చేయాలన్న ఆలోచన చేస్తున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని పనిచేస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ,- పీఎం కిసాన్ పథకం ద్వారా 35,676 మంది లబ్ధిదారులకు రూ.23.26 కోట్ల లబ్ధి చేకూరినట్లు చెప్పారు. అనంతరం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ తురకా వీరస్వామి, మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖరరెడ్డి భాజపా జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశి, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాతలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

టిడ్కో గృహాలను మార్చిలో ఇస్తాం: పట్టణ శివారులో నిర్మాణం జరిగే టిడ్కో గృహాలను వచ్చే ఏడాది మార్చిలో లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే యరపతినేని చెప్పారు. బుధవారం టిడ్కో గృహాలను అధికారులతో కలిసి పరిశీలించారు.

పెదకూరపాడు: రైతుల సంక్షేమం, ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం పెదకూరపాడు మండలం గారపాడులో అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజకవర్గంలోని 41,149 మంది రైతులకు రూ.27.03 కోట్ల చెక్కును సహకార సంఘం ఛైర్మన్ రత్నకుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం పత్తి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అన్నదాతలతో మాటామంతి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

కారంపూడి: కూటమి ప్రభుత్వం రైతన్నకు అండగా ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. నియోజకవర్గంలో 38,923 మంది రైతులకు రూ.26.8 కోట్ల చెక్కును అందజేశారు.

సందడిగా వన సమారాధన

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని నీలేశ్వరపాలెం నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం శ్రీకృష్ణదేవరాయ మండల కాపు సంఘం వన సమారాధన కార్యక్రమం సందడిగా జరిగింది. కాపులు పూజలు చేసి, సహపంక్తి భోజనాలు చేశారు. మండల కాపు సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ నాగేశ్వరరావు, అనిల్, శ్రీనివాసరావు, వీరబాబు, ప్రసాద్, రామ్మోహన్, చెంచయ్య తదితరులు మాట్లాడారు.

దుర్గి: ఆత్మకూరు సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో బుధవారం గ్రామస్థులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. గ్రామస్థులు వృద్ధులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

అచ్చంపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తోందని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. బుధవారం నీలేశ్వరపాలెంలో మండల నాయీబ్రాహ్మణ సంఘం వన సమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘ సభ్యులు రంగారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా బుర్రి

మాచవరం: ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా బుర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా రాంబాబు, ఆర్థిక కార్యదర్శిగా సకినాల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఎన్నుకున్నారు.

సాగర్ ఎమ్మెల్యే పర్యటన

మాచర్ల(కారంపూడి): తెలంగాణ రాష్ట్రం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి బుధవారం మాచర్ల మండలం తాళ్లపల్లిలో పర్యటించారు. కాంగ్రెస్ నేత లింగమ్మ(90) వృద్ధాప్యంతో మృతి చెందగా.. ఆమెకు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

రోడ్డు బాగోక.. రాకపోకలు సాగక

13వ వార్డు సచివాలయం, ప్రజారోగ్యశాఖ కార్యాలయం, పొట్టి శ్రీరాములు పార్కుకు అనుకుని ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. పార్కుకు పడమర వైపున ఉన్న వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు పూర్తి చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా తటాకాన్ని తలపిస్తోంది. శాశ్వత రోడ్డు నిర్మాణం పూర్తిచేసి తమ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

ఏటీఎం కేంద్రం మూత

పంచారామ క్షేత్రం అమరావతి ప్రధాన వీధిలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం కొన్ని రోజులుగా మూత పడటంతో ఖాతాదారులు, పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటీఎం యంత్రం మరమ్మతులకు గురైంది. దీంతో నగదు కావాల్సిన వారు ధరణికోటలోని బ్రాంచి వద్ద ఏటీఎం కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. బ్యాంకు అధికారులు స్పందించి ప్రధానవీధిలో ఏటీఎంను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

కవిత్వంతో చైతన్యం

మోక్ష గీతికకు బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయుడు రవికుమార్

దాచేపల్లి, న్యూస్‌టుడే: కవిత్వం మనుషులను కలుపుతుందని, మేల్కొలుపుతుందని, చైతన్యం నింపుతుందని తెలుగు ఉపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. గ్రంథాలయాల్లో పఠనాసక్తి పెంచే కార్యక్రమాలు జరగాలన్నారు. దాచేపల్లి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందడిగా సాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రవికుమార్, వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బాల్యంలో పుస్తకాలతో స్నేహం చేస్తే భవిష్యత్తు బంగారు బాట అవుతుందన్నారు. 'నాకు నచ్చిన కవిత' అంశంపై నిర్వహించిన పోటీల్లో జడ్పీ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మోక్ష గీతిక మొదటి బహుమతి అందుకుంది. గ్రంథాలయాధికారి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

అయిదు దుకాణాలపై కేసు

క్రోసూరు (అచ్చంపేట): క్రోసూరు మండలం పీసపాడు, హస్నాబాద్, క్రోసూరులోని వివిధ దుకాణాల్లో తూనికలు కొలతలశాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ జాన్‌సైదా ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అయిదు దుకాణాల్లో తూకాల్లో తేడాలు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అచ్చంపేటలో శీతలపానీయాల దుకాణాల్లో తేడాలు పరిశీలించామన్నారు.

ఆటో ఫైనాన్స్ నిర్వాహకులపై కేసు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఫైనాన్స్‌లో ఆటోలు కొనుగోలు చేసి ఈఎంఐలు పూర్తిగా చెల్లించినా ఎన్‌వోసీ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడమే కాకుండా అదనపు డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఖాళీ చెక్కులను బౌన్స్ చేస్తామని బెదిరిస్తున్నారని అందిన ఫిర్యాదుపై నిర్వాహకులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మెకానిక్ షేక్ కరీం పాఠశాలలు, కళాశాలలకు టాటా మ్యాజిక్ వ్యాన్లను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 10 టాటా మ్యాజిక్ వాహనాలను ఫైనాన్స్‌పై కొనుగోలు చేసి, ఈఎంఐలు పూర్తిగా చెల్లించాడు. లోన్ క్లియర్ అయినట్లు ఆర్టీవోకు సమాచారం ఇవ్వకపోవడమే కాకుండా ఆయన వద్దకు ఫైనాన్స్ నిర్వాహకులు రాకుండా తనను మోసం చేశారని ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు అరుణ, శివశంకర్ ఆటో ఫైనాన్స్‌ల నిర్వాహకులు శ్రీను, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డిలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నాగమల్లేశ్వరరావు చెప్పారు.

పురుషులు త్యాగజీవులు

రెంటచింతల, న్యూస్‌టుడే: కుటుంబం కోసం జీవితాన్ని త్యాగం చేసేది పురుషులేనని ఎస్టీయూ మండలాధ్యక్షురాలు బేబిరాణి తెలిపారు. ప్రపంచ పురుషుల దినోత్సవం సందర్భంగా రెంటచింతలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్ని కష్టాలు వచ్చినా భార్య, పిల్లలతో చిరునవ్వు చిందిస్తూ మాట్లాడేది కూడా పురుషుడే అన్నారు. అనంతరం ఎంఈఓ-2 శివనాగేశ్వరరావుతోపాటు పలువురు ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు.

ఎంఈఓ-2 శివనాగేశ్వరరావుకు బహుమతి అందజేస్తున్న బేబిరాణి

పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణ పరిశుభ్రత, తడిచెత్తను పునర్వినియోగించడంలో భాగంగా మిద్దె, పెరటి తోటల పెంపకాన్ని మహిళలు చేపట్టే విధంగా మెప్మా రిసోర్సు పర్సన్లు ప్రోత్సహించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ శిక్షకులు తిరుపతిరావు, హరీష్, జిల్లా సమన్వయకర్తలు శివపార్వతి, గోపి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం మెప్మా రిసోర్సు పర్సన్లకు హోమ్ కంపోస్టింగ్ విధానాలు, పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చడంలో వారి భాగస్వామ్యంపై శిక్షణ ఇచ్చారు.

శిక్షణలో మెప్మా రిసోర్సు పర్సన్లు

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఆదిపరాశక్తి అమ్మవారి ఉపాసకులు శ్రీనిత్య విద్యానంద భారతిస్వామి అన్నారు. స్థానిక కాల భైరవ పీఠం ఆధ్వర్యంలో పట్టణంలోని శరభయ్య గుప్తా హైందవోన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత అయిదు రోజులుగా నిర్వహిస్తున్న శనీశ్వర పాశుపత రుద్ర మహాయాగం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. మహాయాగంతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని, అన్నిరంగాల్లో ప్రజలు అభివృద్ధి సాధిస్తారన్నారు. 27 గుండాలతో హోమాలు, విఘ్నేశ్వర పూజ, గోపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పూజలు చేశారు.

మహాయాగం నిర్వహిస్తున్న శ్రీనిత్య విద్యానంద భారతిస్వామి

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు నందు...

E.P No; 89/2025 In O.S No; 180/2023

Between;
బాధం శివారెడ్డి ...DHR
V/s
బొడ్డు తిరుపతి రెడ్డి S/o రామచంద్రారెడ్డి నరసింగపాడు గ్రామం నకరికల్లు మండలం పల్నాడు జిల్లా జెడిఆర్

ఈ దిగువ షెడ్యూలు దాఖలస్థిరాస్తిని అనగా ఐటెం నెం.1 మరియు ఐటెం నెం.2 లను పై కోర్టు వారి ఎదుట ది. 18-12-2025 న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల లోపు బహిరంగముగా వేలం వేయబడును. పై వేలంలో పాడదలిచిన వారు పైకోర్టు వారి ఎదుట హాజరై పాడుకొనవచ్చును.

షెడ్యూలు:- పల్నాడు జిల్లా నరసరావుపేట D.R, పిడుగురాళ్ళ S.R నకరికల్లు మండలం, గుండ్లపల్లి గ్రామ పంచాయతీ లిమిట్స్,

ఐటెం నెం.1) గుండ్లపల్లి గ్రామ D.No;411-2 an Extent of Ac; 5-41 Cents, in which an Extent of Ac; 2.41 Cents of Land కు హద్దులు. **తూర్పు;** అవుల సాంబశివారెడ్డి మరియు ఎండి ఆయేషా ఖాన్, **దక్షిణం;** కెనాల్ పంట కాల్వ, **పడమర;** పేరం సర్సిరెడ్డి గారి భూమి హద్దు, **ఉత్తరం;** పందసపు రామారావు, బాదం వెంకటరెడ్డి గారి భూమి హద్దు.

డి హెచ్ ఆర్ విలువ రూ 4,00,000 లక్షలు
అమీనా విలువ రూ 15,00,000 లక్షలు

ఐటెం నెంబర్ 2 గుండ్లపల్లి గ్రామ డి నెంబర్ 408-B1,an Extent of Ac; 2-12 Cents of land in which an Extent of Ac 1-06 Cents of land కు హద్దులు. **తూర్పు;** రెస్పాండెంట్‌కు చెందిన భూమి హద్దు. **దక్షిణం;** బొడ్డు రామచంద్రా రెడ్డి గారి భూమి హద్దు. **పడమర:** పమ్మి అప్పిరెడ్డి గారి భూమి హద్దు. **ఉత్తరం;** ఏటి కెనాల్

డి.హెచ్.ఆర్. విలువ : రూ. 3,00,000/-
అమీనా విలువ : రూ. 6,50,000/-

వేలం తేదీ. 18-12-2025 ఫరదర్ హియరింగ్ ది. 24-12-2025
శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం.

ఇట్లు : కొల్లిపల్లి కిరణ్ తేజ, DHR తరపు న్యాయవాది, నరసరావుపేట, పల్నాడు జిల్లా. Cell No; 98850 47505

ముగ్గులు వేసి.. బొమ్మలు గీసి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: చిన్నారులు ముగ్గులు వేశారు.. బొమ్మలు గీశారు.. ఉత్సాహంగా ప్రతిభా పోటీల్లో పాల్గొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం వారోత్సవాల్లో భాగంగా రంగవల్లులు, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి రమేష్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి: చిత్రలేఖనం పోటీలో విద్యార్థులు

పిడుగురాళ్ల: స్థానిక శ్రీనివాసకాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం మహిళా సాధికారతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

దుర్గి: స్థానిక గ్రంథాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో సుగుణ, గ్రంథాలయాధికారి వేణుగోపి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, క్రోసూరు: అచ్చంపేట, క్రోసూరులోని శాఖాగ్రంథాలయాల్లో చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. అధికారులు నాగరాజు, వీరాంజమ్మ పర్యవేక్షించారు.

గురజాల గ్రామీణ: గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, ఖోఖో, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేలా!

లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే

తంగెడ, రైల్వేస్టేషన్‌రోడ్డు (దాచేపల్లి), న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో స్థలం ఉండి, ఇళ్లు లేని పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల మంజూరుకు గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇచ్చారు. అర్హులు స్థానిక సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను కలిసి ధ్రువపత్రాలను అందించాలి.

భట్రుపాలెం గ్రామంలో సర్వే చేస్తున్న డీఈ బాలాజీనాయక్, సిబ్బంది

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని వారికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. పాత నివాసాలు, పునాదులు, పెంకుటిళ్లు, పూరిళ్లు ఉన్నవారు కూడా అర్హులు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్థల ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. గతంలో ఇల్లు మంజూరు కాని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మండలంలో ఇప్పటికే 1300 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 250 మంది అర్హులుగా గుర్తించి ఇళ్లు మంజూరు చేశారు. మిగతా 1050 మంది స్థల ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే అధికారులు పరిశీలిస్తారు. మరికొందరి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఆర్థిక సాయం ఇలా..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధిదారుకు రూ.1.80 లక్షలు మంజూరు చేస్తారు. ఇంటి నిర్మాణానికి రూ.1.50 వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డికి రూ.12 వేలు, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18 వేలు అందజేస్తారు.

❖ ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసిన తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి సర్వే చేపట్టి, యాప్‌లో వివరాలు పొందుపరుస్తారన్నారు.

జూదరుల అరెస్టు..

క్రోసూరు (అచ్చంపేట): క్రోసూరులోని కన్నాకాలనీ సమీపంలో పొలాల్లో జూదం ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నట్లు ఎస్సై రవిబాబు తెలిపారు.

బహిరంగ వేలం పాట

ముప్పాళ్ళ మండలము, కుందురువారిపాలెం మరియు గోళ్ళపాడు ఉమ్మడి మైనర్ ఇరిగేషన్ చెరువు నందు **1435, 1436** ఫసలీలకు అనగా 2 సంవత్సరములకు గాను చేపలు వేసి, పెంచి, పట్టుకొనుటకు **ది. 22-11-2025 శనివారం మధ్యాహ్నం 3 గం॥లకు** కుందురువారిపాలెం గ్రామంలోని కళ్యాణ మండపం నందు బహిరంగ వేలం పాట నిర్వహించబడును. ఈ బహిరంగ వేలం పాట నందు పాల్గొనదలచినవారు **డిపాజిట్ సొమ్ము రూ. 50,000/-లను** చెల్లించి పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. పూర్తి వివరముల కొరకు గ్రామ పంచాయితీ కార్యదర్శి వారిని పని దినములలో కార్యాలయము నందు సంప్రదించగలరు.

ఇట్లు
పంచాయితీ కార్యదర్శులు
కుందురువారిపాలెం మరియు గోళ్ళపాడు

(c) eenadu

విజ్ఞానం వెలుగొందేలా.. విజయం వరించేలా

ఒక్క పిలుపుతో దాతలు కదిలారు..
పాఠకులకు అండగా నిలుస్తామని ముందుకొచ్చారు..
మీరు చదవండి.. వెనుక మేమున్నామని భరోసానిచ్చారు..
వందలాది మంది యువత, నిరుద్యోగులకు పుస్తకాలు దరిచేర్చారు.

ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో తాజా మెటీరియల్ లేక పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతతోపాటు మిగిలిన వర్గాలు ఇబ్బంది పడుతున్నాయి. **గ్రంథాలయ వారోత్సవాల వేళ** వారికి అండగా నిలిచేందుకు 'ఈనాడు' సంకల్పించింది. 'న్యూస్‌టుడే' బృంద సభ్యుల చొరవతో నగరం, పట్టణాల్లో గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాలు అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. శాఖల వారీగా అవసరాలను తెలుసుకుని బుధవారం సమకూర్చారు. బ్యాంకింగ్, రైల్వే, డీఎస్సీ, ఎన్నై, ఎస్ఎస్‌సీ, గ్రూప్స్, సివిల్స్ తదితర పుస్తకాలను అందించారు. పాఠకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు మీతోడు

సాలూరు నవోదయ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గ్రంథాలయాలకు పుస్తకాల అందజేత
'ఈనాడు' పిలుపుతో కదిలిన దాతలు

సాలూరు పట్టణంలో నవోదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి 1991లో స్థానికంగా పలు విద్యాలయాల్లో చదివిన పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.12,500 విలువైన 79 పుస్తకాలు అందించారు. బైండింగ్‌కు రూ.2 వేలు, వాటర్ ప్యూరిఫైయర్ అందిస్తామని ఎన్.అశోక్, ఆర్.సతీష్, శ్రీను తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు

- మరింత మంది దాతల సాయం 6 లో..

సేవల్లో రాజమార్గం.. ఆపదలో అభయహస్తం

- న్యూస్‌టుడే, డెంకాడ

జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు టోల్‌ప్లాజాల వద్ద ఫాస్టాగ్‌తో ఫీజును వసూలు చేస్తుంటారు. ప్రయాణం చేసే వాహన దారులకు టోల్ రుసుము వసూలు చేసే యాజమాన్యాలు కొన్ని సౌకర్యాలు కల్పించాలి. అత్యవసర పరిస్థితుల్లో సేవలు వినియోగించుకోవడంపై చోదకులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఎస్‌వోఎస్ పెట్టెలు..

జాతీయ రహదారులపై ప్రతి 2, 3 కి.మీ దూరంలో ఎస్‌వోఎస్ పెట్టెలు ఉంటాయి. ఏవైనా ప్రమాదాలు, తక్షణ సాయం కోసం ఈ పెట్టెపై ఉండే బటన్ నొక్కి చెబితే వెంటనే టోల్ సిబ్బంది చేరుకుని సాయం అందిస్తారు.

అప్‌లోడ్ చేస్తే రివార్డులు

జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో అత్యవసరాలు ఏర్పడితే పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సదుపాయాలను హైవే అధికారులు కల్పిస్తున్నారు. ఇవి అపరిశుభ్రంగా ఉంటే ఫొటో తీసి 'రాజమార్గ్ యాత్ర' యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డులు సైతం పొందవచ్చు. ★ చోదకుల కోసం అక్కివరం కూడలి, రణస్థలం సమీపంలో విశ్రాంతి గదులు నిర్మించారు. వాహనాలు నిలిపేందుకు అక్కివరం కూడలి సమీపంలో ట్రక్కు బే త్వరలో అందుబాటులోకి రానుంది.

జాతీయ రహదారిపై నాతవలస టోల్‌గేట్

ఉమ్మడి జిల్లాలోని టోల్‌గేట్లు

- చెన్నై-కోల్‌కతా(నాతవలస, విజయనగరం)
- విశాఖపట్నం-రాయపూర్(జొన్నాడ, విజయనగరం)
- విజయనగరం-పార్వతీపురం(మానాపురం, గజపతినగరం)
- సబ్బవరం-రాయపూర్, ఎక్స్‌ప్రెస్ హైవే (జామి వద్ద, ఇంకా ప్రారంభం కాలేదు)
- గజపతినగరం-బొబ్బిలి (ఇంకా ప్రారంభం కాలేదు)
- టోల్‌గేట్ల నుంచి వెళ్లే వాహనాలు: రోజుకు సుమారు 50 వేలు

పార్కింగ్, విశ్రాంతికి..

వాహనాల పార్కింగ్, డ్రైవర్ల విశ్రాంతి తీసుకునేందుకు స్థలాలు ఉండాలి. ఇంధన స్టేషన్లు, వాహన మరమ్మతు దుకాణాలు సమీపంలోనే ఉండాలి. నగదు జమ, ఉపసంహరణకు ఏటీఎం యంత్రాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

15 నిమిషాల్లో అత్యవసర సేవలు

ప్రయాణికులకు తాగునీరు, ఇతరత్రా సేవలతోపాటు ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందిస్తారు. టోల్‌ప్లాజా వద్ద ఉన్న అంబులెన్స్ 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటుంది. జాతీయ రహదారిలో వాహనదారుల సేవలపై అవగాహన కల్పిస్తున్నామని ఎన్‌హెచ్-16 ఇన్సిడెంట్ మేనేజర్ పి.రామస్వామి చెప్పారు.

1033కి కాల్ చేస్తే..

రహదారిపై వాహనం ఆగిపోతే.. నెట్టడానికి ఎక్కడి నుంచో ఎవరినో పిలవాల్సిన అవసరం ఉండదు. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు కాల్ చేస్తే తక్షణ సాయం అందుతుంది. పోలీసు సేవల కోసం 112 నంబరును సంప్రదించాలి. ఇలా విజయనగరం జిల్లాలో ప్రతినెలా 10-15 కాల్స్‌కు సమాధానం ఇస్తున్నారు.

రీసర్వేపై అభ్యంతరాలకు అవకాశం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రీసర్వేపై అభ్యంతరాలుంటే 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని, సరిచేస్తారని కలెక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. బుధవారం సాలూరు మండలంలోని బోరబంద పంచాయతీలో జరిగిన సభలో మాట్లాడారు. అన్ని సచివాలయాల్లో సర్వే వివరాలున్నాయని చెప్పారు. పరిశీలించి, ఇబ్బందులుంటే వెంటనే చెప్పాలన్నారు. అనంతరం పత్తి రైతులతో మాట్లాడారు. దిగుబడి, ఖర్చు, ఆదాయం, కొనుగోళ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, సర్వే‌లాండ్స్ అండ్ రికార్డ్స్ డీడీ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి తహసీల్దారు నరేశ్, ఎంపీడీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అన్నివిధాలా సాయం

నమూనా చెక్కు అందిస్తున్న సంధ్యారాణి, కలెక్టర్ తదితరులు

పాచిపెంట, న్యూస్‌టుడే: పంట పెట్టుబడికి రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలను అమలు చేస్తున్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. పాచిపెంటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు నమూనా చెక్కు అందించారు. జిల్లాలో 1,22,269 మంది అన్నదాతలకు రూ.83.37 కోట్ల మేర లబ్ధి కలగనుందన్నారు. సాలూరు నియోజకవర్గం పరిధిలో 31,531 మందికి రూ.21.37 కోట్లు జమ కానుందన్నారు. ఇప్పటికే 24 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. అన్నివిధాలా అండగా నిలుస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రభాకరరావు మాట్లాడుతూ.. రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణతో జిల్లా ఆ శాఖ సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ, ఎంపీపీ ప్రమీల, సబ్‌కలెక్టరు వైశాలి, జిల్లా వ్యవసాయాధికారిణి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత బాటన నడిచారు

ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

విద్యార్థినుల శాస్త్రీయ నృత్యం

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'మేరా యువ భారత్' ఐక్యత ర్యాలీ జిల్లా కేంద్రంలో బుధవారం ఉత్సాహంగా సాగింది. ఎంపీ సత్యనారాయణ, కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి జెండా ఊపి.. ఈ ర్యాలీని ప్రారంభించారు. ఉక్కు మనిషి, జాతి సమైక్యత పితామహుడు పటేల్ అని ఎంపీ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ సాగింది. అంతకుముందు ఆర్సీఎం పాఠశాల సమీపంలో పటేల్ చిత్రపటానికి ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే విజయచంద్ర, సబ్ కలెక్టర్ వైశాలి.. నివాళులర్పించారు. శాస్త్రీయ నృత్యాలు, కోలాటంతో విద్యార్థులు అలరించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. - న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

నాగావళిలో తోడు దొంగలు

అధికార, ప్రతిపక్ష నేతల ఇసుక దందా
అక్రమ తవ్వకాలకు పథక రచన

పార్వతీపురం, కొమరాడ, న్యూస్‌టుడే: విశాఖ కేంద్రంగా ఇసుక అమ్మకాల దందాకు అధికార, ప్రతిపక్ష పార్టీలు తెరలేపేందుకు సిద్ధం అవుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో గత వైకాపా ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరించిన మాజీ మంత్రి తమ్ముడు, మన్యం జిల్లాలోని అధికార పక్షానికి చెందిన నాయకులు కలిసి కొమరాడ మండలం నాగావళి నదిలో ఇసుక తవ్వకాలకు పథక రచన చేశారు. మీరు లాడ్జిల్లో విశ్రమించండి, కార్యం మేం పూర్తి చేస్తామంటూ అధికార పార్టీ నేతలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వైకాపా నేత బంధువు పార్వతీపురం పట్టణంలో ఒక లాడ్జిలో మకాం వేసి, ఇసుక తరలింపునకు 'స్కెచ్' గీస్తున్నారు.

రామభద్రపురం సమీపంలోని నది ఒడ్డున ఇసుక నిల్వలు

పెద్ద తలకాయల ప్రమేయంతో..

కొమరాడ మండలం చోళపదం, రామభద్రపురం కేంద్రాలుగా గత ప్రభుత్వంలో రెండు కంపెనీలు ఇసుకను తోడేసుకున్న విషయం విదితమే. ఆ రెండు కంపెనీలకు గనుల శాఖ నోటీసులు కూడా జారీ చేసింది. ఇప్పుడు అదే ఒరవడితో అంతా ఏకమై.. చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కొమరాడ మండలానికి చెందిన ఒక వ్యక్తిని తెరమీదకు ఉమ్మడి (పార్టీల) వ్యక్తిగా తీసుకువచ్చి అతని చుట్టూ ఇసుక వ్యాపార లావాదేవీలను అధికార, ప్రతిపక్ష నాయకులు నిర్వహించేలా కార్యాచరణను రూపొందించుకున్నారు. పెద్ద తలకాయలు మధ్యవర్తిత్వం ఉండడంతో అధికారులు ఏం చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. నదిలో ఇసుక తవ్వకం, లారీల్లో లోడు చేయడానికి యంత్రాలు దిగాయి. దీని కోసం నది ఒడ్డున ర్యాంపుల ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి.

చూసీచూడనట్లు ఉండమంటూ..

ఇసుక తవ్వకాలు అధికారికంగా చేపట్టే దశ అంతటి లభ్యత సామర్థ్యం ఉన్న రేవులు నాగావళిలో లేవు. కొరిశిలలో లక్ష క్యూబిక్ మీటర్ల మేర ఇసుక లభిస్తుందని అంచనా వేసినా, అది కూడా తెరమరుగైపోయింది. వైకాపా హయాంలో మాత్రం ఇసుక లభ్యతతో సంబంధం లేకుండానే యథేచ్ఛగా విశాఖ పట్టణం తరలించుకుపోయి లక్షలు మించిన ఆదాయాన్ని కంపెనీలు పొందాయి. ఆ సమయంలో ఎవరు అడ్డుకున్నా.. పెద్ద తలకాయలు కల్పించుకుని, సాఫీగా పని చేసేవారు. అప్పటి అనుభవం ఉన్న వైకాపా నేత బంధువులు ఇప్పుడు తెరవెనక ఉండి, అధికార పార్టీ నాయకులను ముందుపెట్టి నడిపించే ప్రయత్నం ప్రారంభించారు. చూసీచూడనట్లు ఉండండి అంటూ అధికారులకు సంకేతాలు ఇస్తున్నారు. మదుపు పెట్టే వ్యక్తులు మాత్రం నాలుగు గోడలు దాటి ముందుకు రావడంలేదు. కానీ మొత్తం కార్యక్రమం వారి కనుసన్నల్లోనే జరుగుతోందనే ప్రచారం ఉంది.

ఎవరికీ అనుమతులు లేవు: కొమరాడ మండలంలో ఎక్కడా ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఎవరు సేకరించినా, చర్యలు తీసుకుంటాం. - సత్యనారాయణ, తహసీల్దారు

రంగులు భళా.. లోపలంతా డొల్ల

- మేడిపండు చందంగా ఆసుపత్రి ఆధునికీకరణ
- రోగులకు తప్పని అవస్థలు

మన్యం ప్రజల వైద్యానికి గుండెకాయలాంటి జిల్లా ఆసుపత్రికి వెళ్లిన రోగులను అసౌకర్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఓ పక్క నాలుగేళ్ల క్రితం చేపట్టిన కొత్త భవన నిర్మాణం పూర్తికాలేదు. పడకల సంఖ్యకే ఒక్కోదానిపై ఇద్దరు, ముగ్గురికి వైద్యం అందిస్తున్నారు. మరోవైపు రూ.3 కోట్లతో చేపట్టిన పాత భవనం ఆధునికీకరణ పనులు అస్తవ్యస్తంగా జరగడంతో రోగులు గదుల్లో ఉండలేని దుస్థితి. భవనానికి ఆకర్షణీయంగా రంగులు వేశారే తప్పా.. లోపలంతా డొల్లే. - న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

డ్రైనేజీ పనులు పూర్తికాక గదుల వెనుక భాగంలో అధ్వానంగా..

కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయకపోవడంతో వస్త్రాలు కట్టుకున్న రోగులు

చల్ల గాలికి వణకాల్సిందే..!

జిల్లా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 100 పడకల స్థాయిని 150కు పెంచారు. అదనపు 50 పడకల నిర్వహణకు నాబార్డు నిధులు రూ.21 కోట్లు మంజూరు కాగా, రూ.3 కోట్లు పాత భవనం ఆధునికీకరణకు కేటాయించారు. నాలుగేళ్ల క్రితం ఈ పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తికాలేదు. పైన రంగులు వేసి అయ్యింది అనిపించారు. కిటికీలకు తలుపులు బిగించలేదు. చల్లగాలికి రోగులు వణుకుతున్నారు. మురుగు వ్యవస్థను సరిచేయలేదు. ఆసుపత్రి వెనుక వైపు వాడుక నీరు ఎక్కడికక్కడే ఉండిపోవడం, పైపులు లీకవుతూ పరిసరాలు దుర్గంధభరితంగా ఉన్నాయి. మ్యాన్ హోల్స్‌కు సరైన మూతలు లేక దుర్గంధం వ్యాపిస్తోంది. రోగులు, వారి సహాయకులు ప్రశాంతంగా గాలి పీల్చుకోలేని పరిస్థితి.

- రోజుకు ఓపీ: 850-1,000
- ఇన్‌పేషెంట్లు: 250-300 (సాధారణ రోజులు), 380 మందికిపైగా.. (సీజనల్ వ్యాధుల కాలంలో..)
- ఆధునికీకరణ లోపాలు: కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయలేదు, పేమెంటు వార్డుల మరుగుదొడ్ల తలుపులు నాణ్యత లోపంతో పాడైపోతున్నాయి. మురుగు వ్యవస్థ అధ్వానంగా ఉన్నా.. సరిచేయకుండా వదిలేశారు.

సరిచేయిస్తాం: ఆధునికీకరణ పనుల్లో ఎక్కడైనా లోపం ఉంటే గుత్తేదారుతో మాట్లాడి, సరిచేయిస్తాం. డ్రైనేజీ, ఇతర పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం. - ప్రసన్నకుమార్, డీఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

జీడితోట తాకట్టు.. రోడ్డేయడానికి ఒట్టు!

కాశాయివలస గ్రామానికి రహదారి ఏర్పాటు

సాలూరు మండలం కురుకుట్టి పంచాయతీ దిగువ కాశాయివలస గ్రామస్థులు సొంతంగా రహదారి వేసుకుంటున్నారు. కురుకుట్టికి దాదాపు కిలోమీటరున్నర దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లాలంటే గెడ్డ దాటాల్సిందే. దీంతో పక్కా రోడ్డు నిర్మించాలని ఏళ్ల నుంచి కోరుతున్నారు. 2024 ఎన్నికల ముందు అప్పటి ఉపముఖ్యమంత్రి రాజన్నదొర రూ.1.52 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో స్థానికులంతా ముందుకొచ్చారు.

రూ.2 లక్షలతో..: గ్రామంలో ఉమ్మడి ఆస్తిగా ఉన్న 3 ఎకరాల జీడితోటను తాకట్టు పెట్టి రూ.2లక్షలు తీసుకున్నారు. ఆ నగదుతో దాదాపు వారం రోజులుగా రోడ్డు పనులు చేస్తున్నారు. ఎంతమంది నాయకుల వద్దకు వెళ్లినా తమకు న్యాయం జరగలేదని, దీంతో శ్రమదానం చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

కాంతి రేఖలు.. ఉపాధికి బాటలు

ఉమ్మడి జిల్లాకు పరిశ్రమల కళ
● రూ.వేల కోట్లతో పెట్టుబడులు

ఉమ్మడి విజయనగరం జిల్లా ముఖచిత్రం మారనుంది. భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పన దిశగా అడుగు పడనుంది. పారిశ్రామిక, ఆతిథ్య, ఆహార శుద్ధి రంగాల్లో వెలుగు కనిపించనుందని నిపుణుల్లో అభిప్రాయం వ్యక్తం అవుతోంది. విశాఖలో ఇటీవల రెండు రోజులపాటు నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. అంచనాలకు మించి పెట్టుబడులతో నెలకొల్పనున్న వివిధ పరిశ్రమలతో ఉద్యోగాలు లభిస్తాయని నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. - ఈనాడు, విజయనగరం


మరుపల్లిలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏపీఐఐసీ సిద్ధం చేసిన భూములు

రూ.256 కోట్లు.. మూడు ప్లాంట్లు

వంగర మండలం అరసాడలో పీవీపీ సంస్థ రూ.102 కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్‌ప్లాంటు ఏర్పాటు చేయనుంది. వారం క్రితం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా దీనికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా విజయనగరం జిల్లాలో ఎస్2ఎస్ రెన్యూవబుల్ గ్యాస్ ప్రై.లి. రూ.121 కోట్లతో, గంట్యాడ మండలం తాటిపూడి వద్ద శ్రీ వీరాంజనేయ గ్రీన్ ఎనర్జీ సంస్థలు రూ.33 కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మూడింటితో వెయ్యి మందికిపైగా ఉపాధి లభించనుంది. ఈ ప్లాంట్లకు అవసరమైన గడ్డి పెంచి ఇచ్చేందుకు ముందుకొస్తే ఆ ప్రాంత రైతులు, కూలీలకు మేలు జరగనుంది.

ఒప్పందం కుదిరింది

శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో రూ.10 వేల కోట్లు చొప్పున పెట్టుబడితో ఏఎం గ్రీన్ (ఇండియా) ప్రైవేటు కంపెనీ బయోఫ్యూయల్ రిఫైనరీలు నెలకొల్పేందుకు ప్రభుత్వంతో తాజాగా ఒప్పందం కుదిరింది. సుమారు రెండు వేల మందికి ఉపాధి దొరుకుతుంది. కొత్తవలస మండలం చినరావుపల్లిలో 172.84 ఎకరాల్లో పతంజలి ఫుడ్ అండ్ హెర్బల్ పార్కు ఏర్పాటుకు 2017లోనే ఆ సంస్థ ముందుకొచ్చి, వెనకంజ వేసింది. నాలుగు రోజుల క్రితం రూ.370 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 800 మందికి ఉపాధి కల్పించనుంది.

● ఎస్.కోట మండలం బొడ్డవరలో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు లిమిటెడ్ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.531.36 కోట్లతో 1166.43 ఎకరాల్లో వివిధ పరిశ్రమలు నెలకొల్పనుంది. సుమారు 45 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఈ సంస్థ పేర్కొంది. ● పార్వతీపురం మన్యం జిల్లాలో ఈజీఎం ఎల్ఎల్‌పీ సంస్థ రూ.15 కోట్లతో హోటల్ కమ్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ● మరుపల్లిలో అన్నుమి స్పేస్ కార్పొరేషన్ రూ.600 కోట్లతో ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. 1,650 మందికి ఉపాధి లభిస్తుంది. ● గుర్ల మండలం కెల్ల పరిధిలో ఎస్ఎస్ఎల్ కంపెనీ రూ.8,570 కోట్లతో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ముందుకొచ్చింది. దీనికి 1,068 ఎకరాలు అప్పగించేందుకు అంగీకరిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రత్యక్షంగా వెయ్యి, పరోక్షంగా నాలుగు వేల మందికిపైగా ఉపాధి కలగనుంది.

RAGHU COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi, Affiliated to Andhra University, VSP)
Dakamarri, Bheemili (M), Visakhapatnam - 531162, A.P
Ph. 08922-248014, 15 Email Id: raghucollegeofpharmacy@rediffmail.com

B.PHARMACY SPOT ADMISSIONS (CAT-A) AP EAPCET-2025

Candidates qualified in **AP EAPCET-2025** and have not taken admission in any institution are eligible for Spot Admissions. If **AP EAPCET-2025** qualified candidates are not available, the candidates having percentage of aggregate marks in qualifying examination or its equivalent as per the eligibility criteria by the Chairman/Convener, **APSCHE, AP EAPCET-2025 (Admissions)** will be considered.
The interested candidates may attend the Institutional Spot Admissions in our college on **20-11-2025 (Thursday) at 10.00 AM** along with all original certificates and requisite fee.
The vacant seats will be filled as per the guidelines of Chairman/Convener, **APSCHE, AP EAPCET-2025** Admissions and the admitted candidates are not eligible for tuition fee reimbursement.
For details Contact: 08922-248014,15
14-11-2025 Mob: 9177779084, 9490302033 Principal

మహాప్రాణ దీపం.. శివమ్.. శివమ్

అలంకరణలో శివలింగం

సాలూరు పట్టణంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో కార్తిక దీపోత్సవం బుధవారం వైభవంగా సాగింది. ముందుగా ఆలయంలోని శివలింగానికి పూజలు చేశారు. వందలాది మంది మహిళా భక్తులు ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. ఆ కాంతుల్లో శివలింగం, త్రిశూలం, ఢమరుకం తదితర ఆకారాలు వెలుగులీనాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంత్రి సంధ్యారాణి ప్రత్యేక పూజలు చేసి, దీపాలు వెలిగించారు. - న్యూస్‌టుడే, సాలూరు

కామాక్షి అమ్మవారి ఆలయంలో దీపోత్సవం

నువ్వు అలాగే ఉండు.. నేను క్లిక్‌మనిపిస్తా

కార్తికమాసం సందర్భంగా సాలూరు మండలం శిఖపరువు జలపాతం బుధవారం సందర్శకులతో కళకళలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్నా, పెద్దా అంతా కలిసి జలపాతంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ప్రకృతి అందాలను చరవాణుల్లో బంధించారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
లీగల్ ప్రకటనలు
అంత్యక్రియలు,
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జీఎస్‌టీ 5% అదనం
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతారు. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
Organised by: ఈనాడు

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, పెదపాడు విలేజ్, శ్రీకాకుళం - 532 401
వివరాలకు: 90634 38852
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

పోటీలో నిలిచేలా.. జీవితంలో గెలిచేలా

పుస్తకాలు అందజేస్తున్న కిశోర్ తదితరులు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోరిన పుస్తకాలను అందించేందుకు ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్, పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరావు, చంద్రమౌళి ముందుకొచ్చారు. రూ.7,500 విలువైన పుస్తకాలను సమకూర్చారు. ఈ గ్రంథాలయంలో 40 మంది వరకు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వారికి ఉపయుక్తంగా ఉంటాయని గ్రంథాలయ పాలనాధికారిణి కృష్ణవేణి చెప్పారు. 'ఈనాడు' కృషిని నిరుద్యోగ యువతీ, యువకులు అభినందించారు.

రాజాం పట్టణంలో..



పుస్తకాలు ఇస్తున్న రోటరీ అధ్యక్షుడు జి.పాపారావు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయానికి స్థానిక రోటరీ అధ్యక్షుడు గట్టి పాపారావు రూ.2,530 విలువైన పుస్తకాలను సమకూర్చారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి అమర్‌నాథ్‌కు వీటిని అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గజపతినగరంలో..

గ్రంథాలయాధికారిణి స్వప్నకు అందిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీదేవి

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరంలోని శాఖా గ్రంథాలయానికి రోజూ 90 మంది వరకు నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సంబంధించిన సమాచారం చదివేందుకు వస్తున్నారు. వారికి అనుకూలంగా డీఎస్సీ, ఆర్ఆర్‌బీ, కానిస్టేబుల్.. తదితర పరీక్షలకు సంబంధించిన రూ.5,400 విలువచేసే పుస్తకాలను మాజీ ఎంపీపీ, తెదేపా మండలాధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి స్థానిక గ్రంథాలయాధికారిణి స్వప్నకు అందించారు. గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

విజయనగరంలో..

విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయానికి రూ.5 వేల విలువ చేసే పుస్తకాలను దాతలు అందించారు.

500 మందికి ఉపయోగం..

500 మంది ఉపయోగించుకునే గ్రంథాలయ అధికారిణి లక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి కూనలి, సూర్యనారాయణ దంపతులను అభినందించారు. సముద్రాల గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాల సేకరణకు ఆధునిక సాంకేతికత

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాల సేకరణకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. బుధవారం పార్వతీపురంలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద క్రైమ్ స్పాట్స్ క్లూస్ టీం వాహనాలను ఆయన ప్రారంభించారు. ఘటనాస్థలాల్లో ప్రత్యేక ఆధారాలను సేకరించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ప్రజల భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కోసం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామన్నారు. ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, సోషల్ మీడియా ఐసీ శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐ రాంబాబు, ఎస్బీ, డీసీఆర్బీ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయం వద్ద వాహనాలను ప్రారంభించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ట్రోఫీతో భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

జాతీయ స్థాయిలో భామిని విద్యార్థుల సత్తా

భామిని, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ గంగాదేవి తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 వరకు ఒడిశాలో జరిగిన 4వ నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో ఖోఖోలో చంద్రిక, లావణ్య, సన్నిహిత, శ్రీవల్లి మొదటి స్థానంలో నిలిచారన్నారు. కృష్ణవేణి 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. బుధవారం వారిని అభినందించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

న్యాయవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చేనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. విజయనగరంలోని న్యాయస్థానంలో బుధవారం పోలీసులు, రెవెన్యూ, అబ్కారీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. ఇరువర్గాల సమ్మతితో కేసులను రాజీ చేయాలన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి లక్ష్మీకుమారి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత, చిత్రంలో న్యాయమూర్తి లక్ష్మీకుమారి

అత్యవసర వైద్యానికి అడుగులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో త్వరలో అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాంతీయాసుపత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు రూ.23 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రెండు అంతస్తుల భవన సముదాయం నిర్మించనున్నారు. ఈ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య బృందంతో 24 గంటలు సేవలు అందనున్నాయి. వచ్చే ఏడాది చివరి నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సూపరింటెండెంట్ చిరంజీవి తెలిపారు.

382 ఆర్ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోళ్లు

వేపాడ, న్యూస్‌టుడే: జిల్లాలోని 261 క్లస్టర్ల పరిధిలో ఉన్న 382 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు తెలిపారు. వేపాడ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే లలితకుమారి, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి పాల్గొని స్టాళ్లను పరిశీలించారు. జేడీ మాట్లాడుతూ సాధారణ రకం క్వింటాకు రూ.2,369, ఫైన్ రకం రూ.2,389గా మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. మొంథా తుపాను కారణంగా జిల్లాలో 783 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. రూ.2 కోట్ల పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక అందజేశామన్నారు. మండల ప్రత్యేకాధికారి పి.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దారు రాములమ్మ, వ్యవసాయాధికారిణి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీసీఎంఎస్ ఛైర్మన్

రుణ లక్ష్యం రూ.6 వేల కోట్లు

బలిజిపేట, న్యూస్‌టుడే: రీజియన్ పరిధిలోని పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని వ్యవసాయదారులు, డ్వాక్రా మహిళలు, వ్యాపారవర్గాలకు ఈ ఆర్థిక సంవత్సరాంతం లోగా రూ.6 వేల కోట్ల రుణాలను ఇచ్చేందుకు లక్ష్యం పెట్టుకున్నామని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ హెడ్ పైడి రాజా చెప్పారు. బలిజిపేటలోని బ్యాంకు శాఖలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రాంతీయ పరిధిలోని 70 వేల మంది రైతులకు వ్యవసాయ రుణాల కింద రూ.600 కోట్లు అందజేశామన్నారు. డ్రోన్ల కొనుగోలుకు 22 మందికి మంజూరు చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసి లెవీ బియ్యం తరలించేందుకు మరో రూ.150 కోట్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మిల్లర్ల నుంచి పది శాతం నగదు వసూలు చేయించి, ఎలక్ట్రానిక్ బ్యాంకు గ్యారెంటీ పత్రాలు అందజేస్తామన్నారు. అయిదు శాతం నగదు చెల్లించేందుకు అనుమతినివ్వాలని మిల్లర్లు కోరుతున్నారని, ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట బలిజిపేట బ్యాంకు మేనేజర్ తాపస్‌కుమార్ సేథీ ఉన్నారు.

మాట్లాడుతున్న యూబీఐ ప్రాంతీయ హెడ్ రాజా, బీఎం సేథీ

ఈ చక్రం.. దిగుబడుల సూత్రం

వీరఘట్టంలోని మార్కెట్ యార్డులో పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం ఉద్యోగులు బుధవారం వేసిన సార్వత్రిక సూత్రం చక్రం ఆకట్టుకుంది. ఏపే విత్తనాలు వాడాలి, ఎలాంటి ఎరువులు వినియోగించాలో తెలియజేసినట్లు ఆ విభాగం జిల్లా ప్రబంధకుడు శ్రావణ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం

మణికంఠకు మహా పడిపూజ

ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసాకాలనీలో శ్రీమణికంఠ ధర్మశాస్త్ర పీఠంలో అయ్యప్ప స్వాములు పంబా విళక్కు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాలతో శివరామరాజు కోనేరు వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

వేలిముద్ర.. వేసి వెళ్లు

మావోయిస్టుల కదలికలు, దిల్లీ పేలుళ్ల ఘటనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రద్దీ ప్రాంతాల్లో తిరిగే ప్రజల నుంచి గత రెండు రోజులుగా వేలిముద్రలు సేకరించే ప్రక్రియను ముమ్మరం చేసింది. ఎంఎస్‌సీడీ(మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్) పరికరంతో వేలిముద్రలు సేకరిస్తోంది. దేశంలో ఏ మూల కేసు నమోదైనా ఇందులో తెలిసిపోతుంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధితో పాటు, రద్దీ ప్రాంతాల్లో, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించేందుకు ఈ పరికరాన్ని వాడుతున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బుధవారం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పలువురి ముద్రలు తీసుకున్నామన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

వేలిముద్రలు సేకరిస్తున్న సీసీఎస్ పోలీసులు

EENADU e Classifieds

HOME NEEDS | PEOPLE CARE

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడిబారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్య? ✆ 7675873377.

OLD AGE HOME

SVS Old Age Home, VZM AC/Non AC రూమ్స్ డే & నైట్ ఆయా, నర్సింగ్ ఇంటివద్దకే ఫిజియోథెరపీ సేవలు, రుచికరమైన భోజనం ✆ 9440435006, 9347978375

JOBS

పరవాడ, అచ్యుతాపురం, పైడిభీమవరం, HYD, ఫార్మాకంపెనీలో (B.Sc, M.Sc, బి.టెక్, డిప్లమో, ITI, MBA (Fin.&HR) ✆ 8341177761, 8019647888.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

పనితనమే కొలమానం

ఈనాడు, విజయనగరం: తెదేపా ఎమ్మెల్యేల పనితీరుపై ఆ పార్టీ నాయకత్వం దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో అత్యధిక శాతం మందిపై శ్రేణుల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోందని గ్రహించింది. తొలిసారి శాసనసభలో అడుగుపెట్టినవారు సైతం మెరుగుపర్చుకోవడం లేదని నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారంతో అప్రమత్తమైంది. భవిష్యత్తులో వారి పనితనమే కొలమానంగా వివిధ పదవులు, బాధ్యతలు అప్పగించాలని యోచిస్తోంది. ఈమేరకు శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక బృందం పర్యటించనుంది.

అమలులో వెనుకబాటు..

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కొందరు వెనుకబడ్డారని పార్టీ కేంద్ర కార్యాలయానికి అందిన సమాచారంతో అధినేత విశ్లేషించారు. బాధిత వ్యక్తులు, కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మంది ఎమ్మెల్యేల్లో జనసేన సభ్యురాలు మినహా ఎనిమిది మందిలో సగం మంది పనితీరుపై అధినేత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. శుక్రవారం నుంచి రెండు, మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించే పరిశీలకులు వివిధ వర్గాల నుంచి సేకరించిన సమాచారంతో నాయకత్వానికి నివేదించనున్నారు. ఆ తర్వాత దాని ఆధారంగా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	127	224	234

వ్యాన్ ఢీకొని పాల వ్యాపారి దుర్మరణం

గరివిడి/రాజాం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన గరివిడి మండలంలో జరిగింది. ఎస్సై లోకేశ్వరరావు వివరాల ప్రకారం.. రాజాం పట్టణంలోని తెలగవీధికి చెందిన జె.వెంకటరమణ(40), ఎస్.హరీష్ ద్విచక్ర వాహనంపై బుధవారం రాజాం నుంచి చీపురుపల్లి వస్తుండగా బీజే.పాలెం సమీపంలోని నర్సరీ వద్ద వెనుక వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న వెంకటరమణ బలంగా కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న హరీష్ స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయాడు. వ్యాన్ చోదకుడి నిర్లక్ష్యం, అతివేగమే ఈ ఘటనకు కారణమని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీఐ శంకరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందడంతో భార్య మంగ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు.

ఘటనాస్థలంలో ఎస్.హరీష్

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కురుపాం మండలం గుమ్మ గ్రామానికి చెందిన జి.హరిప్రసాద్(32) బుధవారం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా.. జనసేన నాయకుడు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హరిప్రసాద్ నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హరిప్రసాద్ (పాతచిత్రం)

కుదమలో చెరకు పంట దగ్ధం

జియ్యమ్మవలస: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అగ్ని ప్రమాదం గంటల వ్యవధిలోనే దగ్ధం చేసింది. కుదమ పంచాయతీ సమీపంలో పి.బుచ్చిశెట్టి, పి.సింహాద్రి, సత్తి, పి.రాము, పి.సీతారాం, పి.తిరుపతిరావు, పి.నీలమ్మ, జగ్గిశెట్టి, పెంటశెట్టి, ఒమ్మ అప్పిశెట్టి, పి.సింహాచలం, పి.గౌరమ్మ, ఎం.ధనుంజయ, ఎం.వెంకటనాయుడు, పల్ల ఉదయ్, జి.సూరినాయుడు, ఎస్.లక్ష్మి, ఎం.మోహన, పి.లక్ష్మి, పి.సాయిరాం, పి.నారాయణరావు, వై.శ్రీను, పి.సురేష్ తదితరులు చెరకు తోటలు వేశారు. బుధవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సుమారు 30 నుంచి 40 ఎకరాల మేర పంట కాలిపోయిందని వారు తెలిపారు. పార్వతీపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి కొంతమేర మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

కాలిపోయిన పంట

పార్టీ నాయకుడ్ని.. నన్నే పొమ్మంటావా

ఘోషాలో సెక్యూరిటీ గార్డుపై దాడి

విజయనగరం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని ఘోషాసుపత్రిలో ఓ సెక్యూరిటీ గార్డుపై దాడి జరిగింది. చికిత్స పొందుతున్న నవజాత శిశువును చూసేందుకు వచ్చిన రోగి సహాయకుడు విచక్షణ కోల్పోయి వ్యవహరించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బాధితుడి వివరాల ప్రకారం.. రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల మధ్య బయట నుంచి వచ్చేవారిని గదుల్లోకి అనుమతిస్తారు. బుధవారం ఎస్ఎన్‌సీయూ వార్డులోకి వెళ్లేందుకు ఓ వ్యక్తి వచ్చాడు. అప్పటికే సమయం అయిపోవడంతో సెక్యూరిటీ గార్డు సురేష్ లోపలికి వెళ్లొద్దని సూచించాడు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో కోపోద్రిక్తుడైన సదరు వ్యక్తి దాడి చేశాడు. తానో పార్టీ నాయకుడినంటూ విరుచుకుపడ్డాడు. తననే అడ్డుకుంటావా అని చెంపపై కొట్టాడు. మిగిలిన సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. పోలీసులు చేరుకుని ఇద్దరినీ స్టేషన్‌కు తరలించారు. అయితే కేసు నమోదు చేయలేదు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి, ఫిర్యాదు చేస్తానని బాధితుడు తిరిగి వెళ్లిపోయాడు.

ఇద్దరి మధ్య ఘర్షణ

ఆసుపత్రిలో ఉద్యోగాల పేరిట వసూళ్లు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: ఘోషాసుపత్రిలో సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ కార్మికుల పోస్టులు ఇప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. బాధితులు, నగదు తీసుకున్న వ్యక్తికి మధ్య గొడవ జరగడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో ఆసుపత్రిలో పనిచేసేవాడినని, ప్రస్తుతం తన కుటుంబ సభ్యులు అక్కడే విధులు నిర్వహిస్తున్నారని సదరు వ్యక్తి గ్రామీణ ప్రాంతానికి చెందిన కొంతమందిని నమ్మించాడు. వివిధ విభాగాల్లో ఉద్యోగాలు వేయిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల వరకు తీసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం అతడు స్పందించకపోయేసరికి బాధితుల్లో ఇద్దరు అందరి ముందు నిలదీశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఫిర్యాదు రాలేదని సూపరింటెండెంటు అల్లు పద్మజ తెలిపారు. ఏ ఉద్యోగమైనా ప్రకటన ఇస్తామని, ఎవరూ మోసపోవద్దని సూచించారు.

(c) eenadu

పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని విడుదల చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పాలకొండ గ్రామీణం: పట్టణంలోని వెంకమ్మపేట జంగాలచెరువుని ఆనుకుని ఉన్న శివాలయాల విశిష్టతను వివరిస్తూ పట్టణానికి చెందిన భాసూరు శివశంకర ప్రసాద్ పుస్తకాన్ని రచించారు. పాలకొండ పంచ శివలింగ వైభవం శివ క్షేత్ర దర్శనం పేరిట ఈ ఆలయాల చారిత్రిక నేపథ్యాన్ని వివరిస్తూ రచించిన పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు.

గ్రంథాలయాల్లో పోటీలు

సీతంపేట, పాలకొండ, బలిజిపేట: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు స్థానిక గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు తెలిపారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. బలిజిపేటలో విద్యార్థులకు ఖోఖో, పరుగు, రింగ్ ఆట తదితర పోటీలను నిర్వహించారు.

సీతంపేట: పోటీల్లో విద్యార్థులు

మన్యంలో అప్రమత్తం

వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై, సిబ్బంది

సీతంపేట, భామిని, కొమరాడ, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. సీతంపేట మన్యంలో స్థానిక ఎస్సై వై.అమ్మనరావు, దోనుబాయి ఎస్సై మస్తాన్ ఆధ్వర్యంలో, బీజేపురం కూడలి వద్ద జియ్యమ్మవలస ఎస్సై ఎన్.ప్రశాంత్ కుమార్, కొమరాడ లో ఎస్సై నీలకంఠం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. భామిని చెక్‌పోస్టు వద్ద నిరంతర నిఘా ఉందని ఎస్సై అప్పారావు వివరించారు.

రక్షిత నీరు.. ఇదీ తీరు!

బందలుప్పి పంచాయతీ గొల్లవీధి కూడలిలో ట్యాపులేక రక్షిత నీరు వృథాగా పోతోంది. ఇక్కడ కుళాయి దిమ్మ కట్టలేదు. భూగర్భం నుంచి ఓ పైపు పైకి వదిలారు. నీరు సరఫరా సమయంలో ఈ పైపునుంచే నివాసితులు పట్టుకుంటున్నారు. తర్వాత ఆపేందుకు ట్యాప్ సదుపాయం లేక జలం కాలువలోకి పోతోంది. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాజు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం, కురుపాం గ్రామీణం: ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎ.విజయశాంతి తెలిపారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం, ధర్మలక్ష్మీపురం, మొండెంఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ, పాలకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆమె పరిశీలించారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ యాప్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పట్టుతప్పితే ప్రమాదమే!

స్త్రీ శక్తి పథకంతో మహిళా ప్రయాణికులు పెరగడం.. కార్తిక మాసం.. వెరసి బస్సుల్లో రద్దీ పెరుగుతోంది. సరిపడా సర్వీసులు లేక పలువురు ఇలా వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోంది. పార్వతీపురం నుంచి పాలకొండ వెళ్లే సర్వీసులో బుధవారం కనిపించిన పరిస్థితి ఇది. సర్వీసులు సంఖ్య పెంచాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

నేడు విద్యుత్తుకు అంతరాయం

జియ్యమ్మవలస: కుదమ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో గురువారం సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శంకరరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు గౌరీపురం, చినమరువ, పెదమరువ, సింగనాపురం, చింతలబెలగాం, ఇటిక, కేదీవలస, నీముకవలస, జీబీవలస తదితర గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

వ్యర్థాల నిర్వహణతో స్వచ్ఛ పార్వతీపురం

పార్వతీపురం పురపాలక: స్వచ్ఛ పార్వతీపురం కోసం వ్యర్థాల నిర్వహణ ప్రక్రియ సమర్థంగా నిర్వహించాలని పుర కమిషనరు జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం చెత్త నుంచి సంపద సృష్టిపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ వ్యవహరించిన ఎల్.వెంకటేశ్వరరావు.. వ్యర్థాలు వేరుచేసే విధానం, ప్రయోజనాలను వివరించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

గుమ్మలక్ష్మీపురం: అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం అన్నారు. భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి బుధవారం నిర్వహించారు. వారు అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు జమ్మయ్య, స్వరూప, సత్యారావు, చిన్నారావు, కృష్ణారావు ఉన్నారు.

ఇరుముడుల సందడి

పార్వతీపురం గ్రామీణం: వందల సంఖ్యలో స్వాములు శబరిమలకు పయనమయ్యారు. నర్సిపురం అయ్యప్ప మందిరంలో 60 మంది దీక్షాధారులకు నాగేశ్వర గురుస్వామి ఇరుముడులు కట్టారు. బుజ్జిస్వామి నేతృత్వంలో 30 మంది ఇరుముడులతో బయలు దేరారు.

విద్యుత్తు బకాయిలు.. రూ.474 కోట్లు

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో విద్యుత్తు బకాయిలు సుమారు రూ.474 కోట్లు ఉన్నట్లు ఏఎస్‌ఈ మల్లికార్జునరావు తెలిపారు. పి.లేవిడి విద్యుత్తు ఉప కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. 1500 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఏఈలు రవికుమార్, కృష్ణారావు ఉన్నారు.

జాబ్‌కార్డులు మంజూరు చేయలేదు

వీరఘట్టం: 81 కుటుంబాలు జాబ్‌కార్డుల కోసం 5 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదని కొండవీడికి చెందిన మహిళలు బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో బి.వెంకటరమణకి వినతిపత్రం అందజేశారు.

సమర్థంగా వర్క్‌షాప్ నిర్వహించాలి

గరుగుబిల్లి: అటల్ టింకరింగ్ వర్క్‌షాప్ సమర్థంగా నిర్వహించాలని రాష్ట్ర సమగ్రశిక్ష పర్యవేక్షకుడు జి.సుధాకర్‌రావు అన్నారు. బుధవారం గరుగుబిల్లి బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో వర్క్‌షాప్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ ఎ.రజని, సైన్సు అధికారి జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

అవగాహనతోనే బోద నిర్మూలన

బలిజిపేట గ్రామీణం: పైలేరియా ప్రభావిత గ్రామాల్లో ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉంటే వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి అన్నారు. పెదపెంకిలో రక్తపూత సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో 303 మంది రక్తపూత సేకరించినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనిముట్లు అందించాలి

సాలూరు: పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు అందించాలని సాలూరు పురపాలిక కార్మికులు కోరారు. బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ వినతిపత్రం అందించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

సాలూరు గ్రామీణం: శివరాంపురం పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఛైర్మన్ కె.సూర్యనారాయణ ప్రారంభించారు.

డీసీసీబీ విశ్రాంత మేనేజర్ మృతి

పాలకొండ గ్రామీణం: పాలకొండ మురళీమోహన్ నగర్‌కు చెందిన విశ్రాంత డీసీసీబీ మేనేజర్ ముంజి శివన్నాయుడు(80) బుధవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఈయన బాధపడుతున్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

కురుపాం గ్రామీణం: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కేవీకేలు కృషిచేస్తున్నాయని కేవీకే సమన్వయకర్త ఎస్.రఘు అన్నారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద గిరిజన రైతులకు వ్యవసాయ పరికరాలను బుధవారం పంపిణీ చేశారు.

మహిళలకు సముచిత స్థానం

సీతానగరం: పార్టీ కోసం కష్టపడిన ప్రతి మహిళకు సముచిత స్థానం ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. మండలంలోని జోగింపేట గ్రామ పరిసరాల్లోని తోటలో ఎమ్మెల్యే సతీమణి అనూష కార్తీక వనసమారాధన నిర్వహించగా హాజరయ్యారు.

మండలానికో గ్రామం.. అభివృద్ధి పథం

న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

గ్రామాలను సమస్యల రహితంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత మండలానికో గ్రామాన్ని ఎంపిక చేస్తున్నారు. ఇలా ఎంపిక చేసిన గ్రామాన్ని మిగిలిన వాటికి ఆదర్శంగా నిలవాలని సంకల్పించారు. ఈ బాధ్యతను మండల ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రస్తుతం జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 15 గ్రామాల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు.

పాలకొండ మండలంలో సిరికొండతో పాటు సాలూరు నియోజకవర్గంలో పాచిపెంట మండలంలో పి.కోనవలస, సాలూరు మండలంలో దత్తివలస, మక్కువ మండలంలో ఆలసభద్రలను ఎంపికచేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అక్కడి యువత సహకారంతో మార్పు తీసుకువచ్చేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి, అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇలా చేయాలని..

సిరికొండ గ్రామస్థులతో సమావేశమైన అధికారులు

స్వచ్ఛభారత్‌లో భాగంగా సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దనున్నారు. మురుగు లేకుండా చర్యలు, మొక్కల పెంపకం, ఇంటింటికీ తాగునీరు, పాలిథిన్, ప్లాస్టిక్ నిషేధం, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల కల్పన, అక్షరాస్యత పెంపు, ఉపాధిహామీ పథకంలో భాగంగా వంద రోజుల పని, రుణాల సద్వినియోగం, వృత్తిగత పరిశుభ్రత, వైద్య సదుపాయాలు, మహిళల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించి వృద్ధి వైపు అడుగులు వేయనున్నారు.

రూపుమారనున్న సిరికొండ

పాలకొండ మండలంలో సిరికొండ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇప్పటికే గ్రామస్థులతో సమావేశం నిర్వహించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి ఒక గ్రామాన్ని వృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకుగాను అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– ఎస్.మన్మథరావు, మండల ప్రత్యేకాధికారి

ప్రణాళికతో ముందుకు సాగితేనే ఆర్థికాభివృద్ధి

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన ప్రజలు, యువత సరైన ప్రణాళికతో ముందుకు సాగితేనే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం 20 గిరిజన ఉప ప్రణాళిక మండలాల యువతీ, యువకులు, మహిళా సంఘ, వీడీవీకే సభ్యులకు ప్రభుత్వ పథకాలు, జీవనోపాధులపై కార్యశాల నిర్వహించారు. రుణాల మంజూరుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆసక్తి, అవకాశాలు ఉన్న రంగాల్లో పరిశ్రమలు స్థాపించాలన్నారు. తెదేపా పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, సుధారాణి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

మట్టి తవ్వకాల పరిశీలన

కురుపాం గ్రామీణం: కురుపాం మండలం మంతినివలస సమీపంలోని గుట్టల వద్ద మట్టిని తవ్వేస్తున్నారు. ఈ సమస్యపై ఈనాడులో గుట్టగా..గుట్టలుమాయంగా అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో తహసీల్దార్ కె.జయ స్పందించి చర్యలు తీసుకున్నారు. అక్రమంగా మట్టిని తవ్వి, తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీసు కస్టడీలో ఉంచామన్నారు.

సీతానగరం: ఇప్పలవలస, నిడగల్లు రెవెన్యూ గ్రామాల్లోని మెట్టల అక్రమ తవ్వకాలను తహసీల్దార్ ప్రసన్న కుమార్ పరిశీలించారు. 'ఈనాడు'లో బుధవారం వెలువడిన కథనానికి స్పందిస్తూ ఆయా ప్రాంతాలను సిబ్బందితో కలిసి సందర్శించారు. ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని చెప్పారు.

పోషకాహారంతో ఆరోగ్యం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే : సూక్ష్మ పోషకాహారం చిన్నారుల ఎదుగుదలకు దోహదపడుతుందని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ అన్నారు. ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సీడీపీవోలు, పర్యవేక్షకులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రజాభిప్రాయం మేరకే ప్రాజెక్టు

సాలూరు: ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు ప్రారంభించమని గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. మక్కువ మండలం దుగ్గేరు పంచాయతీలో ఓ ప్రైవేటు కంపెనీ ప్రతిపాదించిన 2 వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు మంత్రికి వినతిపత్రం అందించారు.

బాలల హక్కులపై అవగాహన

కలెక్టరేట్ ప్రాంగణం : బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగితే మేధస్సు పెంపొందుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శిశుసంక్షేమ శాఖ బాలల పరిరక్షణ విభాగ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విభాగ అధికారి ఎ.సత్యనారాయణ మాట్లాడారు. బాలల హక్కులతో పాటు దత్తత స్వీకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం లక్ష్మణరావు, ఐసీడీఎస్ సిబ్బంది ఎ.నాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవం

సీతంపేట: శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం ఆలయ అర్చకుడు కిరణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

కొమరాడ: గుమ్మలక్ష్మీపురంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ఎంపికైన తిమ్మక యుగంధర్‌ని ప్రభుత్వ విప్ జగదీశ్వరి అభినందించారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ, నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా విద్యుత్తుశాఖ అధికారి మల్లికార్జునరావు సిబ్బందికి సూచించారు. బుధవారం కురుపాం సబ్ స్టేషన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు.

అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం అండ

నమూనా చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం గ్రామీణం, వీరఘట్టం, పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం కురుపాంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నగదు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడీ శారద, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, రాష్ట్ర తూర్పుకాపు, వెలమ, ట్రైకార్ డైరెక్టర్లు శేఖర్ పాత్రుడు, మధుసూదనరావు, లావణ్య, ఏఎంసీ ఛైర్మన్ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : అధికారులు బాధ్యతలు విస్మరిస్తున్నారని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్టం మార్కెట్‌యార్డులో పీఎమ్ కిసాన్-అన్నదాత సుఖీభవ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటు చేసిన స్టాల్‌ను, ధాన్యం విక్రయాలు ప్రారంభించారు. రైతులకు యూరియా, డీఏపీ పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో రవాణా, లేబర్ ఛార్జీలు, గోనె సంచుల డబ్బులు రైతులకు అందలేదని, ఆ సొమ్ము ఒక వైకాపా నాయకుని చేతికి వెళ్లాయని చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. తెదేపా పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పడాల భూదేవి, నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం గ్రామీణం: రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి, అన్నదాతల సాయానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. అడ్డాపుశీలలో నియోజకవర్గ పరిధిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు, అధికారులు మాట్లాడారు. భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ నాయుడు, తహసీల్దారు సురేష్, ఎంపీడీవో సత్యం, వ్యవసాయాధికారి అశోక్, మండల స్థానిక తెదేపా కూటమి నాయకులు పాల్గొన్నారు మండలంలోని బందలుప్పికి చెందిన సీనియర్ తెదేపా నాయకుడు కె.గంగులు మృతి తీరని లోటని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. బుధవారం బందలుప్పిలో మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబాన్ని ఓదార్చారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

దుర్వాసన భరించలేక..దుర్భాషలు వినలేక!

గరుగుబిల్లి గ్రామీణం: ఉద్యాన క్షేత్రాన్ని పాడుచేయవద్దని కళాశాల విద్యార్థులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. పరిసర ప్రాంతాల్లో స్థానికులు మలవిసర్జన చేయడం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోయారు. కాలకృత్యాల కోసం వచ్చేవారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొంతమంది దుర్భాషలాడి వివాదానికి దిగడంతో ఫలితం లేక విద్యార్థులు, ప్రొఫెసర్లు వెనుదిరిగారు.

బ్యాంకు గ్యారంటీలకు ముందుకురండి

బలిజిపేట: ధాన్యం వ్యాపారాన్ని సాగించేందుకు మండలంలోని 22 మంది రైసు మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను సమర్పించి వ్యాపారాభివృద్ధికి సహకరించాలని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ ముఖ్యఅధికారి పైడి రాజా, బలిజిపేట బ్రాంచి మేనేజర్ తాపస్‌కుమార్ సేథీ కోరారు. బలిజిపేట యూనియన్ బ్రాంచిలో బుధవారం మండలంలోని రైసుమిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

సామాజిక బాధ్యత అవసరం

ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు

కొమరాడ, న్యూస్‌టుడే: గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే సామాజిక బాధ్యతను అందరూ పాటించాలని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎంపీడీవో రమేష్, ఎంఈవో, ఆర్‌డబ్ల్యూఎస్ సహాయ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉండాలని స్థానిక ఎంపీడీవో బి.బి.మిశ్ర, డిప్యూటీ ఎంపీడీవో బి.రామకృష్ణ అన్నారు. సీతంపేట ఉపాధి కార్యాలయంలో బుధవారం థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ గ్రామ పంచాయతీ అనే అంశంపై 53 పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టిపెట్టాలి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు రైల్వే స్టేషన్లలో నిఘా పెంచి మాదకద్రవ్యాల రవాణాను అరికట్టాలని రైల్వే డీఎస్పీ రామచంద్రరావు అన్నారు. పార్వతీపురం రైల్వే పోలీసు ఠాణా (జీఆర్పీ)ను బుధవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలందించారు. దూరప్రాంతాలకు వెళ్లే రైళ్లలో తనిఖీలు చేపట్టాలన్నారు. వలసదారులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయితో పాటు పేలుడు పదార్థాలు రవాణా చేస్తున్న వ్యక్తులపై నిఘా పెంచాలన్నారు. చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఐ రవి కుమార్, ఎస్ఐ బాలాజీరావు ఆయన వెంట ఉన్నారు.

సూచనలిస్తున్న డీఎస్పీ రామచంద్రరావు

సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

సీమంతాలు చేస్తున్న చినమేరంగి సత్యసాయి సేవాసమితి సభ్యులు

జియ్యమ్మవలస: శ్రీ భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలో చినమేరంగి సత్యసాయి సేవాసమితి కన్వీనరు ఎన్.రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం చేపట్టారు. మహిళలకు సామూహిక సీమంతాలు చేశారు. బాలవికాస్ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. జోనల్ కన్వీనరు తిరుపతినాయుడు, యూత్ కోఆర్డినేటర్ శ్రీధర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొండ గ్రామీణం: పాలకొండ సత్యసాయి మందిరంలో బుధవారం సామూహిక లక్ష్మీ కుబేర వ్రత పూజలు ఘనంగా జరిగాయి.

పార్వతీపురం గ్రామీణం: వైకేఎం నగర్ సాయి మందిరంలో కార్తిక పూజలు బుధవారం వేడుకగా సాగాయి. సేవకులు సాయిగీతార్చన చేశారు.



॥ఓం శ్రీ మాత్రే నమః॥ ॥ఓం శ్రీ పోలమాంబ దేవియై నమః॥

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ పోలమాంబ అమ్మవారి దేవస్థానం

శంబర (గ్రామం.), మక్కువ (మం.), పార్వతీపురం మన్యం జిల్లా

ఆర్.సి.నెం. 2/2025 తే: 19.11.2025

ఇ - ప్రొక్యూర్మెంట్ మరియు టెండరు కం బహిరంగ వేలం ప్రకటన

శ్రీ అమ్మవారి దేవస్థానములో జరుగు జాతర సందర్భముగా తే 01-01-2026 ది నుండి తే 31-03-2026 ది వరకు అనుభవించు హక్కు కొరకు ఇందుతో పేర్కొనిన ఇ-ప్రొక్యూర్మెంట్ కం టెండర్ మరియు టెండరు కం - బహిరంగ వేలములు తే 03-12-2025 దీ బుధవారం ఉదయం గం॥ 11.00 ని॥ల నుండి శ్రీ అమ్మవారి చదురుగుడి మండపం నందు నిర్వహించబడును.

క్రమ సంఖ్య	వివరము	కాల పరిమితి	ప్రథమ ధరావత్తు మొత్తము రూ॥
	ఇ-ప్రొక్యూర్మెంట్ - కం - టెండరు		
1.	రసవర్గములు సరఫరా	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 50,000.00

పై 1 వ లైసెన్సు హక్కుకు మాత్రమే ఇ-ప్రొక్యూర్మెంటు ద్వారా ఇ బిడ్ కోరబడుచున్నవి. www.eprocurement.gov.in ద్వారా లాగిన్ ap endowments marketing నందు తే: 20.11.2025 దీ ఉదయం గం. 10.00 ని.ల నుండి తే: 01.12.2025 దీ సాయంత్రం గం.3.00 ని. వరకు బిడ్ సమర్పించవచ్చును. టెక్నికల్ బిడ్‌తో తే 02.12.2025 ఉదయం గం. 10:00 లకు మరియు ప్రైస్ బిడ్ తే: 03.12.2025 దీ ఉదయం గం.11.00 ల నుండి.

క్రమ సంఖ్య	వివరము	కాల పరిమితి	ప్రథమ ధరావత్తు మొత్తము రూ॥
	టెండరు - కం - బహిరంగ వేలం		
2.	చీరలు, రవికలు, రాగి మరియు ఇత్తడి ప్రోగుచేసుకొని తీసుకుపోయే హక్కునకు.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 50,000.00
3.	కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొని తీసుకుపోయే హక్కునకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 50,000.00
4.	తలనీలాలు ప్రోగు చేసుకొని తీసుకుపోయే హక్కునకు.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 50,000.00
5.	శ్రీ అమ్మవారి లామినేషన్ ఫోటోలు అమ్ముకొనుటకు.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 10,000.00
6.	వనంగుడి వద్ద దీపాలు పెట్టుకొని అమ్ముకునే హక్కునకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 10,000.00
7.	చదురు గుడికి, పరిసర ప్రాంతములలో విద్యుత్ అలంకరణ, జనరేటర్లు, ఎల్.ఈ.డి లైట్స్, ఆర్చ్ గేటులు పెద్దవి. సౌండ్ సిస్టంలు, ఏర్పాటు చేయుట.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 5,000.00
8.	వనం గుడికి, పరిసర ప్రాంతములలో విద్యుత్ అలంకరణ, జనరేటర్లు, ఎల్.ఈ.డి లైట్స్ ఆర్చ్ గేటులు పెద్దవి, సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేయుట	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 5,000.00
9.	చదురు గుడి వద్ద ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం క్యూ లైన్‌లు నిర్మించుటకు సాంస్కృతిక నాటకములకు, ఇతర కార్యకలాపములకు జాక్ స్టేజిలు వాటర్ ప్రూఫ్ టెంట్లు, పెండాల్స్ ఏర్పాటు చేయుట	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 5,000.00
10.	వనం గుడి వద్ద ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం క్యూ - లైన్‌లు నిర్మించుటకు, సాంస్కృతిక నాటకములకు, ఇతర కార్యకలాపములకు జాక్ స్టేజిలు వాటర్ ప్రూఫ్ టెంట్లు, పెండాల్స్ ఏర్పాటు చేయుట.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 5,000.00
11.	వంట పాత్రలు సప్లయి చేయుట	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
12.	చదురు గుడి, వనం గుడి షామియానాలు సప్లయి చేయుట, పెండల్స్, స్టేజీ ఏర్పాటు చేయుట	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
13.	లడ్డు పులిహోర, టీ, టిఫిన్ భోజనములు తయారు చేయుటకు లేబరు ఛార్జీల కొరకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
14.	సి.సి. కెమెరాలు తాత్కాలికముగా అమర్చుట.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
15.	మూడు దేవాలయములకు, విగ్రహములకు, అమ్మవారి గద్దెలకు, సిరిమాను రథంనకు రంగులు వేయుటకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
16.	పూలదండలు మరియు పూల డెకరేషన్లు చేయుట .	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
17.	శానిటేషన్ మెటీరియల్ సప్లయి చేయుట.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
18.	కూరగాయలు సప్లయ్ చేయుటకు.	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
19.	పాలు, పెరుగు సప్లయ్ చేయుటకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
20.	అమ్మవారి శేష వస్త్రములు, కండువాలు, శాలువాలు, జాకెట్ పీస్‌లు సప్లయ్ చేయుటకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00
21.	ఉత్సవములు జరుగు మూడు నెలలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా అవసరమగు మ్యాన్-పవర్ సిబ్బందిని సప్లయ్ చేయుటకు	తే : 01.01.2026 దీ నుండి తే : 31.03.2026 దీ వరకు	రూ. 3,000.00

ముఖ్య షరతులు: 1. పై లైసెన్సు హక్కులకు పేపరు టెండరు దాఖలు చేయువారు తే: 20.11.2025 ది నుండి తే: 02.12.2025 ది వరకు దేవస్థాన కార్యాలయం వద్ద వ.నెం. 2 నుండి 6 వరకు రూ.1000/-, వ. నెం.7 నుండి 21 వరకు రూ. 500/-, చెల్లించి టెండరు షెడ్యూలు పొందవచ్చును. టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొనేవారు The Executive Officer, Sri Polamamba Ammavari Devasthanam, Sambara వారి పేరున ధరావత్తు సొమ్ముకు డి.డి. తీసుకొని దేవస్థానము వారు ఏర్పాటుచేసిన టెండర్ బాక్సు నందు తే 03-12-2025దిన బహిరంగ వేలము పాటకు ముందు ఉదయం గం॥ 10.00ల లోపు వేయవలెను. 2. టెండరు కం బహిరంగ వేలము నందు పాల్గొను పాటదారుడు వారి యొక్క సాల్వెన్సీ సర్టిఫికేట్, పాస్ పోర్టు సైజ్ ఫొటో మరియు ఐ.డి. మరియు అడ్రసు ప్రూఫ్‌గా రేషన్ కార్డు మరియు ఆధార్ కార్డు జిరాక్స్‌ను పాట ప్రారంభమునకు ముందుగా అధికారులకు చూపించి జెరాక్సులను అధికారులకు ఇవ్వవలెను. అట్లు లేని యెడల వారి వద్ద నుండి ధరావత్తు స్వీకరించబడదు. 3. పాటదారుడు పాట ముగిసిన వెంటనే పాట మొత్తం సొమ్మును వెంటనే చెల్లించవలెను. 4. టెండరు కం బహిరంగ వేలము నందు పాల్గొను పాటదారుడు హిందువులై ఉండవలెను. 5. పాట కాలమందు అవసరమైన కొన్ని షరతులు విధించుటకు తగు మార్పులు చేయుటకు, ఏ కారణము చేతనైనను పాటలు ఆపుచేయుటకు గాని, పొడిగించుటకు గాని, దేవస్థానము కార్యనిర్వహణాధికారి వారికి అధికారము కలదు. కావున షరతులు నిశితముగా గమనించి టెండరు కమ్ బహిరంగ వేలంలో పాల్గొనవలెను, ఇతర షరతులు, వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవలెను.

స్థలం: శంబర — గుమస్తా — సం/- బి.శ్రీనివాస్

తే: 19.11.2025. — సెల్ నెం: 9989174262 — కార్యనిర్వహణాధికారి, సెల్: 9701270410

గమనిక: 1. సాలూరు పట్టణం నుండి శంబర గ్రామమునకు 18 కి.మీ. ఉండును, బస్సు సౌకర్యం కలదు.
2. పార్వతీపురం నుండి చినభోగిలి, మక్కువ మీదుగా శంబరకు బస్సు సౌకర్యం కలదు.
3. బొబ్బిలి నుండి మక్కువ మీదుగా శంబరకు బస్సు సౌకర్యం కలదు.

(c) eenadu

కొలువుదీరిన శాస్త్రవేత్తలు

శాస్త్రవేత్తల చిత్రపటాలతో కనిపిస్తున్న వీరందరూ చీమకుర్తి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు. వీరందరూ వివిధ రకాల ఆవిష్కరణలు చేసిన 50 మంది శాస్త్రవేత్తల చిత్రపటాలతో ప్రదర్శన నిర్వహించడంతో పాఠశాలలో బుధవారం సందడి నెలకొంది. పాఠశాల విద్యార్థులకు సైన్సుపై ఆసక్తి కలిగించేందుకు భౌతికశాస్త్రం ఉపాధ్యాయిని షేక్ మీరాబి బెంగళూరు నుంచి శాస్త్రవేత్తల చిత్రపటాలను తెప్పించి ఇలా విద్యార్థులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు నరసింహారావు, శివాజీ, హెచ్.ఎం.మోహన్‌నరసింహం, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, చీమకుర్తి

కూత అదిరింది

కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 14, 19 కబడ్డీ పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు, 70 మంది వ్యాయామోపాధ్యాయులు పాల్గొనగా, పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ సందర్భంగా ప్రత్యర్థి జట్టుపై ఆధిపత్యం సాధించడానికి ఇరు జట్లు ఇలా పోటీ పడుతూ కనిపించాయి. – న్యూస్‌టుడే, కనిగిరి

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం 6లో..

రైలొచ్చేవరకు ఆపుకోవాల్సిందే!

చిత్రంలో కనిపిస్తున్నవి ఒంగోలు రైలునిలయంలోని ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు. ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఎలాగనే కనీస ఆలోచన కూడా లేకుండా రైలునిలయం అధికారులు ఇలా తాళాలేసేశారు. ప్రత్యేకించి రాత్రివేళ ప్రయాణాల్లో అత్యవసరమై మరుగుదొడ్లు వాడుకునే ఆస్కారం కూడా లేకుండా మూసేయడంతో ప్రయాణికులు తమ రైలొచ్చాదాకా వేచిచూడాల్సిందే. అత్యవసరమైతే అప్పటిదాకా ఉగ్గపట్టుకుని ఉండాల్సిందే.
– న్యూస్‌టుడే, ఒంగోలు

ఉపాధికి ఉండాలోయ్ పునాది!

- స్కిల్ హబ్ సెంటర్లలో యువతకు శిక్షణ
- ప్రతి నియోజకవర్గంలో కేంద్రాల నిర్వహణ

కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉన్నత విద్యాభ్యాసం చేయలేక ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీతో చదువు ఆపేసిన వారికి కొద్దిపాటి శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్) కొండంత అండగా నిలుస్తున్నాయి. ఉచితంగా శిక్షణ పొందే అవకాశం కల్పించడమే కాకుండా వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తుండడం యువతకు సువర్ణావకాశమే. –ఈనాడు, ఒంగోలు

స్కిల్ హబ్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

గత ఆర్థిక సంవత్సరంలో శిక్షణ పొందినవారు

జిల్లాలోని పది స్కిల్ హబ్స్‌లో అభ్యర్థుల సంఖ్య: 1,002	డిగ్రీ కళాశాలల్లోని స్కిల్ సెంటర్లలో శిక్షణార్థులు: 3,656

ఉద్యోగ మేళాల నిర్వహణ: 54...
ఎంపికైనవారు: 2,124

ఆసక్తి మేరకు శిక్షణ

పరిశ్రమల అవసరాలకు తగినట్లు అభ్యర్థులను ఆయా కేంద్రాల్లో తీర్చిదిద్దుతున్నాం. ఏ రంగంపై ఆసక్తి ఉందో గుర్తించి తదనుగుణంగా శిక్షణనిస్తున్నాం. జిల్లా కేంద్రంతోపాటు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ఉద్యోగార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – రవితేజ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

పదోతరగతి పూర్తయితే చాలు...

పదోతరగతి పూర్తయిన అనంతరం ఇంటర్మీడియట్ గానీ, డిప్లొమా గానీ చేసినవాళ్లు, డిగ్రీ, బీటెక్ కోర్సులు మధ్యలోనే ఆపేసినవారు ఇక్కడ స్కిల్ హబ్స్‌లో శిక్షణ పొందవచ్చు. బేసిక్ కంప్యూటర్ కోర్సులు, ట్యాలీతోపాటు పలు వృత్తుల్లో శిక్షణ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో మూడు, నియోజకవర్గానికి ఒకటి చొప్పున మరో ఏడు కేంద్రాలు నడుస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో ఉచిత శిక్షణ పొందవచ్చు.

డిగ్రీ చదువుతూనే..

డిగ్రీ పూర్తయిన అనంతరం కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని ఉద్యోగం చేపట్టడం పాత పద్ధతి. ప్రస్తుతం డిగ్రీ చదువుతూనే పట్టుపెంచుకునేవిధంగా డిగ్రీ కళాశాలల్లో ఉపాధి నైపుణ్య కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్రాల్లో ఏఐ ఫండమెంటల్స్, ట్యాలీ విత్ జీఎస్టీ, డిజిటల్ మార్కెటింగ్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. జిల్లా పరిధిలోని 24 డిగ్రీ కళాశాలల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి.

చేరడం ఎలా?

జిల్లాకు చెందిన విద్యార్థులు ఎవరైనా ఆయా కేంద్రాల పరిధిలో శిక్షణ పొందవచ్చు. నైపుణ్య పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి. ఏయే నైపుణ్య కేంద్రాల్లో ఏయే కోర్సులు అందు బాటులో ఉన్నాయి. కొత్త బ్యాచ్ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలుసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సరిపోతుంది.

విద్యార్థులకు విహార యాత్రలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విహార యాత్రలు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా అవసరమైన నిధులు, మార్గదర్శకాలు విడుదల చేశారు. పీఎం స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయనున్నారు. నాన్ పీఎం స్కూల్స్ విద్యార్థులకు సంబంధించిన మార్గదర్శకాలు బుధవారం జారీ చేశారు. నాన్ పీఎం పాఠశాల విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో యాత్రకు రూ.2.92 లక్షలు కేటాయించారు. జిల్లాలోని 38 మండలాల్లో ఎంపిక చేసిన 131 మంది విద్యార్థులు, 14 మంది గైడ్ టీచర్లు, అకడమిక్ మానిటరింగ్ అధికారితో కలిపి 146 మందికి అవకాశం కల్పించారు. ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున కేటాయించారు. సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. సమ్మేటివ్ పరీక్షలు అయ్యాక డిసెంబరులో యాత్ర ఉంటుందని సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు తెలిపారు.

బోగస్ సంఘాలతో దారుణాలు

జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అక్రమాలకు నిలయంగా మారింది. ఏం చేసినా.. ఎలాంటి చర్యల్లేకపోవడంతో మెప్మా సిబ్బంది బరితెగించారు. బోగస్ రుణాల పేరిట రూ.కోట్లు స్వాహా చేసినా ఒక్కరిపైనా ఇప్పటి వరకు చర్యలు లేకపోవడం గమనార్హం. రోజుకో ఇలాంటి లీలలు బయటపడుతున్నాయి.
–ఈనాడు, ఒంగోలు

పోలీసులకు ఫిర్యాదు చేసి బయటకు వస్తున్న మెప్మా పీడీ శ్రీహరి

మెప్మాలో రూ.కోట్లు స్వాహా

గత కొన్నేళ్లుగా బోగస్ పొదుపు సంఘాలు సృష్టించి రూ.కోట్ల రుణాలు మెప్మా సిబ్బంది, బ్యాంకర్లు కలిసి కాజేశారు. ఖాళీ పత్రాలపై తక్షణం అప్పు తీర్చాలని చర్యలు తప్పవని అమాయక మహిళలకు నోటీసులు రావడంతో విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి పీఏ ఇష్టానుసారం సంఘాలు సృష్టించి రూ.కోట్ల రుణాలు కొల్లగొట్టినట్లు బాహాటంగానే చెబుతున్నారు. ఒంగోలు నగరానికి చెందిన కొందరు నాయకుల భార్యల బ్యాంకు ఖాతాల్లో బోగస్ సంఘాలకు సంబంధించిన రుణాల నగదు జమ చేసినట్లు ప్రచారం సాగుతోంది. రుణాలు స్వాహా చేయడంపై ఇప్పటికే ఫిర్యాదులు వెల్లువెత్తినా ఇప్పటి వరకు ఎవరి బాధ్యులనే దానిపై కనీసం విచారణ చేపట్టకపోవడం గమనార్హం.

మార్టును ముంచేశారు

పొదుపు మహిళలు తలా కొంత పెట్టుబడి పెట్టి ఒంగోలులో మహిళా మార్టు ఏర్పాటు చేశారు. రూ.70 లక్షల పెట్టుబడితో మార్టు ప్రారంభించిన మొత్తం ఖాళీ చేశారు. దీనిపై పొదుపు మహిళలు ఫిర్యాదు చేయడంతో ఆఖరికి కట్ట తెరిచి నెల రోజుల కిందట విచారణ చేపట్టారు. తాజాగా గురువారం కూడా విచారణ కొనసాగనుంది.

సిబ్బంది చెలరేగిపోతున్నారు

పొదుపు సంఘాల పనులు చూసే రిసోర్స్‌పర్సన్స్ (ఆర్పీ), మెప్మా సిబ్బంది నీకింత.. నాకింత.. అన్నట్లు పంచుకుంటున్నారు. బోగస్ రుణాల విషయంలో ఆర్పీలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే, కార్యాలయ అధికారులు దీన్ని అవకాశంగా తీసుకుని వారిని బెదిరించి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, ఇప్పటి వరకు ఆర్పీలను ఎవరిని సస్పెండ్ చేసింది లేదు.

పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయితీ

చెక్కులు ట్యాంపర్ చేసి రూ. లక్షలు స్వాహా చేసిన ఆరోపణలపై కార్యాలయ సిబ్బంది సునీల్‌పై కేసు నమోదైంది. రెండు చెక్కులు ట్యాంపర్ చేసి నగదు డ్రా చేయడంలో కార్యాలయ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అధికారులు, సిబ్బందికి నగదు పంపకాల్లో తేడాలు రావడంతోనే పంచాయితీ పోలీసుస్టేషన్‌కు చేరిందని చెబుతున్నారు.

ఎస్పీకి ఫిర్యాదు చేశాం

బోగస్ సంఘాల పేరుతో రుణాలు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేశాం. బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా కోరాం. పొదుపు రుణాలకు సంబంధించి ఎంతెంత రుణాలు ఇచ్చారని దానిపై బ్యాంకర్ల నుంచి వివరాలు కోరాం. బ్యాంకు అధికారుల పాత్రపై ఆయా సంస్థల విజిలెన్స్‌తో విచారణ జరిపించాల్సిందిగా విన్నవించాం. – శ్రీహరి, మెప్మా పీడీ

కార్తికం..దేదీప్యం!

కార్తిక అమావాస్యను పురస్కరించుకుని తాళ్లూరు మండలం మాదలవారిపాలెంలో బుధవారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని 11 లక్షల ఒత్తులతో దీపాలు వెలిగించారు. ఆ చిత్రమే ఇది.
- న్యూస్‌టుడే, తాళ్లూరు

21న దివ్యాంగులకు ఎల్ఎల్ఆర్ శిబిరం

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందించే మూడు చక్రాల మోటారు వాహనాల మంజూరు నిమిత్తం ఎల్ఎల్ఆర్ ప్రక్రియను సులభతరం చేసేందుకు స్థానిక ప్రకాశం భవన్‌లో ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక ఎల్ఎల్ఆర్ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త, డీటీసీ సుశీల తెలిపారు. 'ఈనాడు'లో బుధవారం 'దివ్యాంగులకు మామూలే' శీర్షికన ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండి, 70 శాతం, ఆపైన అంగ వైకల్యంతోపాటు పదోతరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆధార్, ఓటరు ఐడీ లేదా పాస్‌పోర్టు జెరాక్స్ పత్రాలతోపాటు, సదరం ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని వారు ప్రకటనలో కోరారు.

నవోదయ హాల్ టిక్కెట్లు విడుదల

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం 2026-27 విద్యాసంవత్సరం ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లు విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ సి.శివరాం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబర్ 13న పరీక్ష జరుగుతుందన్నారు. హాల్‌టిక్కెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏదైనా సందేహాలుంటే కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పొగాకు అంటే పాపాయి లెక్క!

ఇతర పంటలతో పోలిస్తే పొగాకు సాగు భిన్నం. అది, పాది మిత్రమాలా ఉండే నేలల్లో మాత్రమే నాట్లు వేయాల్సి ఉంటుంది. ఇందులో ఏ తేడా వచ్చినా మొక్క నిలవదు. నాటేందుకు సైతం సాగర్ జలాలు లేదంటే స్వచ్ఛమైన జలాలే వినియోగిస్తారు. ఏ స్థాయిలోనూ పంటకు ఉప్పు, ఫ్లోరైడ్ నీటిని వినియోగించరు. ఏదైనా సమస్య తలెత్తితే అధికారులు సూచించిన పరువుసు మాత్రమే వినియోగిస్తారు. లేదంటే దిగుబడి, నాణ్యత దెబ్బతింటుంది. ఈ కారణంగానే సాగుదారు పంట చేతికొచ్చే వరకు పాపాయిలా సంరక్షిస్తుంటారు. మద్దిపాడు మండలం తెల్లబాడు గ్రామంలో ఓ రైతు తనకున్న ఆయిదెకరాల్లో ప్రత్యేక ట్యాంకరుతో శుద్ధ జలాలు తెప్పించి కూలీలతో ఇలా పొగ నాట్లు వేయిస్తున్నారు. ఆ చిత్రమే ఇది. – ఈనాడు, ఒంగోలు

పారా ఒలింపిక్స్ పోటీలకు ఎంపికలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: దివ్యాంగ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పారా ఒలింపిక్స్ పోటీలకు పంపించేందుకు ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఆదెలక్ష్మి తెలిపారు. ఈ నెల 27 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. మండల, జిల్లాస్థాయి, అనంతరం రాష్ట్రస్థాయి, తరువాత జాతీయ స్థాయిలో ఎంపికలు జరుగుతాయి. ఇందుకు జిల్లాకు రూ.లక్ష నిధులు కేటాయించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

పరిమళిస్తున్న మానవత్వం!

పేదలకు అండగా నిలుస్తూ మేమున్నామని భరోసానిస్తున్నారు పొదిలి మానవత సేవాసంస్థ సభ్యులు. దాతల సహకారంతో శాంతి రథం, అయిదు ఫ్రీజర్ బాక్సులు కొనుగోలు చేసిన సభ్యులు పేదల అంత్యక్రియలకు ఉచితంగా అందజేస్తున్నారు. నిరు పేదల అంతిమ సంస్కారాలకు ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేస్తున్నారు. ఇలా గత రెండేళ్లలో 120 మందికిపైగా సాయమందించారు. అనాథ శవాలకు సంస్థ సభ్యులే వారి సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు పదులసంఖ్యలో అంత్య క్రియలు చేశారు. –న్యూస్‌టుడే, పొదిలి

ఆపదలో ఆపన్న హస్తం

పొదిలి నుంచి ఇతర ప్రాంతాలకు అత్యవసర వైద్యసేవల నిమిత్తం ఉచిత అంబులెన్స్ సేవలు కొనసాగిస్తున్నారు. పేదలు, యాచకులు, దివ్యాంగులకు దుప్పట్లు, నిత్యావసర సరకులు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే చిన్నారులకు పోషకాహారం పంపిణీ చేస్తున్నారు. ప్రధానంగా స్థానికంగా నిర్వహించే శుభకార్యాల్లో మిగిలిన భోజనాన్ని సేకరించి ఆకలితో అలమటించేవారికి అందిస్తూ వారి కడుపు నింపుతున్నారు. వేసవిలో ప్రయాణికులకు తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటుచేసి దాహార్తి తీరుస్తున్నారు. పేదలకు ఆపన్నహస్తం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సంస్థ ప్రతినిధులు కాటూరి వెంకటనారాయణబాబు, వెలిశెట్టి వెంకటేశ్వర్లు, ఎం.పార్థసారధి, కె.యల్లమందారెడ్డి, కె.సుబ్బారెడ్డి, చిరంజీవి, పి.శ్రీనివాసులు, అశోక్, నాగేశ్వరరావు చెబుతున్నారు.

కాలువలపై కన్నేసేవారేరీ?

జలవనరులశాఖలో లస్కర్ల కొరత

సాగర్ కాలువ

జలవనరులశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది కొరత సమస్యగా మారింది. సాగర్ ప్రాజెక్టు, గుండ్లకమ్మ జలాశయం పరిధిలోని కాలువల పర్యవేక్షణకు పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. సాగర్ ఆయకట్టు పరిధిలో 65.35 కిలోమీటర్ల మేర కాలువలుండగా, వర్క్ ఇన్‌స్పెక్టర్లు 64 మందికి 30 మంది, లస్కర్లు 378 మందికి 50 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో గేట్లు ఎత్తడం, దించడం, వాటికి గ్రీస్ పెట్టడం, కాలువల్లో నీరు దారిమళ్లించకుండా నిఘా ఉంచడం, స్థలాల ఆక్రమణకు గురైతే అధికారులకు సమాచారం ఇవ్వడం వంటి పనులకు అంతరాయం కలుగుతోంది. గుండ్లకమ్మ జలాశయం కుడి, ఎడమ కాలువల పరిధిలో 80 మంది లస్కర్లు అవసరం కాగా, ప్రస్తుతం రోజువారి వేతనంతో పది మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇటీవల ఒంగోలు నగరంలోని రంగారాయుడు చెరువు ఎదుట ఒక విల్లా వెనుక ఎన్ఎస్పీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం ఆలస్యంగా తెలిసి పనులు నిలిపివేయించారు. భారీవర్షాల సమయంలో పోస్టల్ కాలనీ వద్ద కాలువకు వ్యర్థాలు అడ్డుపడి కట్టతెగి నీరు వృథా అయింది. –న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: గృహ విద్యుత్తు వినియోగదారులు విద్యుత్తు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు కూటమి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. కిలో వాట్‌కు 50 శాతం రాయితీ ఇస్తోంది. ముందు మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు గడువు ఇవ్వగా.. పెద్దగా స్పందన లేకపోవడంతో డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించింది. ఇప్పటి వరకు 48,703 మంది 80,739 కిలోవాట్ల అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. తద్వారా విద్యుత్తు సంస్థకు రూ.9,94,54,160 ఆదాయం సమకూరింది.

రాయితీ ఇలా..

అదనపు లోడు	అసలు (రూ.లలో)	రాయితీ (రూ.లలో)
1	2,250	1,250
2	4,450	2,450
3	6,650	3,650
4	8,850	4,850
5	11,050	6,050

అదనపు లోడు(కిలోవాట్లలో)

మొంథా మొక్కజొన్నను ముంచేసింది!

మొంథా తుపాను మొక్కజొన్న రైతులను నిండా ముంచేసింది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలు రోజులతరబడి నీటిలో నానిపోవడంతో నేలమీదే మొలకెత్తాయి. తాళ్లూరు మండలం శివరాంపురం గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణకు చెందిన 4.7 ఎకరాల్లో సాగు చేస్తున్న పంటంతా వర్షపు నీటిలో నాని ఇలా ఎండిపోయింది. పొలంలోనే కంకులు మొలకెత్తాయి.
–ఈనాడు, ఒంగోలు న్యూస్‌టుడే, తాళ్లూరు

జిల్లాలో గత కొన్నేళ్లుగా లోటు వర్షపాతంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతంలో పశ్చిమ ప్రకాశంలో మాత్రమే ఉన్న తాగునీటి సమస్య ప్రస్తుతం కోస్తా తీర ప్రాంత మండలాల్లోనూ నెలకొంది. తద్వారా సురక్షిత జలాలు కరవయ్యాయి. పైగా కొత్తపట్నం తీర ప్రాంతంలో రొయ్యల చెరువుల సాగు, హెచరీల నిర్వహణతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. వ్యవసాయ బోర్లతోపాటు అనాధికార బోర్ల ద్వారా విచ్చలవిడిగా నీటిని తోడేస్తుండడంతో ఇప్పటికే తాగునీటి సమస్య నెలకొంది. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రం కానున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు భావిస్తున్నారు. –న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

సంద్రం తీర్చనుంది దాహం!

సూపర్ ఆర్వో ప్లాంటుకు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు

పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించాయి. ఈ క్రమంలో సముద్ర తీరంలోని ఉప్పునీటిని మంచినీటిగా మార్చే ప్రాజెక్టు మరోసారి తెరపైకి వచ్చింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్ట నున్నాయి. జిల్లాలో తొలివిడతగా కొత్తపట్నం మండలంలో సూపర్ ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసేందుకు 2021లో గత ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదించారు. అప్పట్లో ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం రూ.35 కోట్లతో అంచనా వేశారు. అనంతరం నిధుల మంజూరు ఊసే లేదు. తాజాగా కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద నిధులు కేటాయించేందుకు పచ్చజెండా ఊపింది.

తీరానికి 500 మీటర్ల దూరంలో...

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతో పాటు కొత్తపట్నం మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించే క్రమంలో గుండ్లకమ్మ నీటిని సరఫరా చేసేందుకు గతంలో వాటర్‌గ్రిడ్ కింద ప్రతిపాదించారు. అన్ని గ్రామాలకు మధ్యగా ఉండేలా గవండ్లపాలెంలో రిజర్వాయరు నిర్మించేందుకు ప్రణాళిక చేశారు. సహజంగా సముద్రపు ఒడ్డున సుమారు 5 మీటర్ల లోతు వరకు మంచినీరు లభిస్తోంది. ఆర్వో ప్లాంటు నిర్వహణకు సరిపడా నీటి అవసరాల నిమిత్తం 20 మీటర్ల లోతున బోరు వేయనున్నారు. దీంతో అక్కడ లభ్యమయ్యే ఉప్పునీటిని మంచినీటిగా మార్చేందుకు ప్లాంటు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకు జిల్లా అధికారులు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. మార్గదర్శకాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున నిధులు కేటాయించాలి. సముద్ర తీరానికి 500 మీటర్ల దూరంలో ప్లాంటుతో పాటు రిజర్వాయరు నిర్మించేందుకు ప్రతిపాదించారు.

నాలుగేళ్లు తరువాత...

సుమారు నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలోని పోర్టబుల్ కొవిడ్ కేర్ యూనిట్ గదులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. కొవిడ్ రెండో దశ తీవ్రత సమయంలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ద్వారా రూ.7 కోట్లు వెచ్చించి 100 పడకలతో పోర్టబుల్ కొవిడ్ కేర్ సెంటర్ నిర్మించారు. తాజాగా నర్సింగ్ కళాశాలకు కొన్ని, జీజీహెచ్ కార్యాలయాలకు మరికొన్ని గదులు కేటాయించారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ మరమ్మతులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. –న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

SHAIDA MOULA LAW COLLEGE
Approved by APSCHE, BCI & Affiliated to Andhra Kesari University,
Darsi (V) (M), Prakasam Dt, 523 247, A.P Ph: 96039 94212, 98489 85128
E-Mail:shaidamoulalawcollege@gmail.com

ADMISSIONS UNDER (MANAGEMENT) CAT "B" QUOTA INTO LAW COURSES - 2025-26

S. No.	Course	Seats Available under Management Quota
01.	B.A.LL.B., 3 Yrs	12
2.	BB.A LL.B 5 Yrs	12

Last Date for Submission for applicaton: 21.11.2025 (For Management Quota: 21-11-2025)

The above said Admissions will be made as per the Guidelines issued by the Convener LAWCET 2025 & APSCHE vide GO.Ms.No.64 Dt.26.05.2006, GO.Ms.No.250, Dt.27.10.2008, and all subsequent amendments and the guidelines issued by Convener, LAWCET-2025 and APSCHE on dt.17.11.2025. Applications can be had from the office.

Dt:18.11.2025 Sd/- PRINCIPAL

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: QIS EDUCATIONAL INSTITUTIONS ONGOLE
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
Organised by: ఈనాడు

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్లు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్ల లోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).

● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్ సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు యూనిట్ కార్యాలయం, పేర్నమిట్ట గ్రామం, సంతనూతలపాడు మం 523 225
వివరాలకు: 800 8000 235, 91770 44423
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ప్రయోగం దూరం.. ప్రతిభకు ఆటంకం

◗ పాఠశాలల్లో వృథాగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)లను ఏర్పాటు చేసింది. వాటి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు సృజనాత్మకతకు దూరమవుతున్నారు. –న్యూస్‌టుడే, కంభం

కంభంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ పరికరాలను చూస్తున్న ఎంఈవో శ్రీనివాసులు, తదితరులు

దుమ్ము పడుతున్న పరికరాలు

కేంద్రప్రభుత్వం ఒక్కో ల్యాబ్‌కు రూ.12 లక్షల ఖర్చు చేసి ఏర్పాటు చేసింది. ఏటీఎల్ ప్రతినిధులు మెంటార్లకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మేర ఖర్చు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వక పోవడంతో ల్యాబ్‌లను తెరిచే పరిస్థితి ఉండటంలేదు. దీంతో దుమ్ముపట్టి పోతున్నాయి. ◗ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణపై దృష్టి పెట్టింది. బోధకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది.

23 పాఠశాలల్లో ఏర్పాటు

జిల్లాలో 2019 నుంచి పలు విడతల్లో 23 పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తూ శాస్త్ర ఆవిష్కరణలతో వారిని రోబోటిక్ పరిశోధన వైపు మళ్లించారు. టింకరింగ్ ల్యాబ్‌లు ప్రారంభించిన కొద్ది నెలల పాటు ప్రైవేటు సంస్థల నుంచి ఏటీఎల్ ప్రతినిధులు వచ్చి రోబోటిక్ పరికరాలపై విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ల్యాబ్‌లను పట్టించుకునే వారు కరవయ్యారు. దీంతో లక్ష్యం దూరమవుతోంది.

ఈ 24 నుంచి శిక్షణ

ఏటీఎల్ ల్యాబ్‌ల నిర్వహణ చూసే ఉపాధ్యాయులకు ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఒంగోలులోని నెక్స్‌జెన్ పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నాం. ఉపాధ్యాయుల బదిలీలు జరగడంతో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధన అందిస్తారు. ప్రయోగాలు చేస్తారు. శిక్షణ తర్వాత లీప్ యాప్‌లో నెల వారీగా చేసిన పనుల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. – బి.రమేష్, జిల్లా సైన్సు అధికారి, ఒంగోలు

బాలల చట్టాలపై అవగాహన కల్పించాలి

దర్శి, న్యూస్‌టుడే: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారిణి సువర్ణ అన్నారు. జాతీయ దత్తత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం దర్శిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల దత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల అభివృద్ధి అధికారిణి పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సువర్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు అవగాహన పెంచే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీలక్ష్మి దత్తతకు సంబంధించిన అంశాలను వివరించారు. జిల్లా న్యాయ పర్యవేక్షణ అధికారి రత్నప్రసాద్ చట్టాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 బాలబాలికలకు కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రథమ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరావు, ఎస్వోలు సుభాషిణి, సునీత, ఇందిర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి సువర్ణ

ఉద్యోగ నైపుణ్యాల పెంపుతోనే అవకాశాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలపై యువత దృష్టి సారించాలని డీఆర్డీఏ పీడీ టి.నారాయణ సూచించారు. డీడీయూ-జీకేవై-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో... యువతకు ఉద్యోగ అవకాశాలపై టీటీడీసీ భవన్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. 18-35 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు వారి అర్హత, ఆసక్తికి అనుగుణమైన కోర్సులతో పాటు... భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పలు కేంద్రాల్లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. కొత్తగా శిక్షణ నిమిత్తం చేరిన అభ్యర్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. సమావేశంలో జేడీఎం శ్రీనివాసరావు, శిక్షకులు శ్రీనివాసరావు, ప్రభాకరరావు, అజయ్‌కుమార్, హిమాంబి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ నారాయణ

22న ఉపాధి కూలీలకు గ్రామసభలు

ఒంగోలు గ్రామీణం: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ తెలిపారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజలకు అవసరమైన సేవలను గ్రామ స్థాయిలోనే అందించడం దీని ఉద్దేశమన్నారు. కొత్త ఉపాధి కార్డులకు దరఖాస్తుల స్వీకరణ, నూతన పనులకు అర్జీలు, ఈకేవైసీ నమోదు వంటివి చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తాళ్లూరు: బొద్దికూరపాడులో ఓ రెస్టారెంట్ వద్ద మంగళవారం జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. గ్రామంలో వెంకారెడ్డి రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నాగార్జునరెడ్డి మరో వ్యక్తి శివారెడ్డితో కలిసి రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ ఆహార పదార్థాలు తినే సందర్భంగా వివాదం రేకెత్తింది. ఘటనలో గాయాలపాలైన వెంకారెడ్డి ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో, నాగార్జునరెడ్డి దర్శిలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నారు.

తొలి గంట... రోగుల ప్రాణాలకు రక్ష

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రికి వచ్చిన వారిని గోల్డెన్ అవర్‌లో కాపాడే నైపుణ్యం సాధించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో బ్రెయిన్ స్ట్రోక్‌పై బుధవారం నిర్వహించిన కార్యశాలలో మాట్లాడారు. బాధితులు వచ్చే సరికే అన్ని రకాల వనరులు సిద్ధం చేసుకుని.. గంట వ్యవధిలో అవసరమైన పరీక్షలు పూర్తిచేసి చికిత్స ప్రారంభించాలన్నారు. వైద్యుల సమన్వయంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు, వచ్చేందుకు కారణాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. న్యూరాలజీ వైద్యులు, సహాయ ఆచార్యులు ఎస్.హరి, నటరాజ... ఎపిడమాలజీ ఆఫ్ స్ట్రోక్ అంశంపై ప్రసంగించారు. సమస్యను ముందుగానే గుర్తించడం, జీవనశైలిలో మార్పులు, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా మరణాలు అరికట్టవచ్చన్నారు. అత్యవసర చికిత్సలకు సంబంధించి ప్రామాణిక వైద్య విధానాలను తెలియజేశారు. న్యూరో ఇమేజింగ్ పాత్రపై వైద్యులు లక్ష్మీనరసింహస్వామి, శస్త్రచికిత్సలపై డాక్టర్ శరత్ తదితరులు మాట్లాడారు.

జ్యోతి వెలిగించి కార్యశాలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల పరిశీలన

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి నిర్మాణ పనులను మేఘ సంస్థ ఎండీ పీవీ కృష్ణారెడ్డి పరిశీలించారు. మండలంలోని ఉప్పలపాడు వద్ద 260 మీటర్ల సొరంగం నిర్మాణ పనులను చూశారు. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనుల పురోగతి తదితర వివరాలను ఇంజినీర్లు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కలిసి రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

మద్దిపూడి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రెండో విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం మద్దిపూడిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య, కలెక్టర్ రాజాబాబు, ప్రజా ప్రతినిధులు

● జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి, మారిటైం బోర్డు ఛైర్మన్ తన దృష్టికి తీసుకొచ్చారని వాటిని సత్వరమే జాయింట్ కలెక్టర్‌తో పరిష్కరించేలా చూస్తామన్నారు.

● రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గంలో దాదాపు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసుకోవటం జరిగిందన్నారు.

● ముందుగా మంత్రి స్వామి, దామచర్ల సత్యలు స్థానిక బస్టాండు కూడలిలో ఎన్టీ.రామారావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రైతులు ఏర్పాటుచేసిన ట్రాక్టర్లను స్వయంగా నడుపుతూ రైతులతో ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో జేడీఏ శ్రీనివాసరావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కళావతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే ఇంటిపన్ను వసూళ్లు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా చేయాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని డీఎల్‌డీవో, డిప్యూటీ ఎంపీడీవోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పన్ను వసూళ్లలో పారదర్శకతకు ప్రభుత్వం 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌ను అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. ఎక్కడైనా పన్నులను నగదు రూపంలో వసూలు చేసినా, రసీదు ఇచ్చినా సదరు గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముద్రించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.100/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

సమష్టిగా సాగితేనే రాజ్యాధికారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ భావజాలంతో సామాజికవర్గమంతా ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన మాల వారి ఆత్మీయ వన భోజన మహోత్సవంలో మాట్లాడారు. రాష్ట్రంలో మాల సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జాతి జాగృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అవమానాలు తప్పడం లేదన్నారు. దౌర్జన్యాలు, సాంఘిక బహిష్కరణలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ విద్యావంతులై చైతన్యంతో సాగితేనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. నాయకులు జైభీమ్ నాగేశ్వరరావు, ఉప్పులేటి దేవీప్రసాద్, బాలబోయిన సుదర్శన్, హర్ష ప్రీతమ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

చెల్లని చెక్కు కేసులో జైలు

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఒంగోలు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కోమలవల్లి... బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన బి.సుధాకరరావు తన అవసరాల నిమిత్తం... నగరానికే చెందిన ఎ.ఆనందరావు వద్ద దశలవారీగా రూ.8 లక్షల రుణం తీసుకున్నారు. బాకీ చెల్లింపు నిమిత్తం రూ.8.50 లక్షలకు మూడు చెక్కులు ఇచ్చారు. ఖాతాలో తగినంత మొత్తం లేక అవి చెల్లలేదు. లాయరు నోటీసు ద్వారా విషయం తెలియజేసినా తగిన స్పందన లేకపోవడంతో కోర్టులో ఫిర్యాదు చేశారు. విచారించిన న్యాయమూర్తి... నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు, రూ.8.60 లక్షల జరిమానా విధించారు. ఇందులో రూ.8.50 లక్షలను ఫిర్యాదికి పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

మెప్మాలో చెక్కుల గోల్‌మాల్ కలకలం!

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మెప్మాలో చెక్కుల గోల్‌మాల్ కేసులో ఒంగోలు ఒకటో పట్టణ పోలీసులు బుధవారం ఒకరిని అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమ కార్యాలయంలో పనిచేసే కె.సునీల్‌కుమార్ అనే వ్యక్తి.. తన ఛాంబర్‌లోని చెక్కులు అపహరించి రూ.4.35 లక్షలు కాజేసినట్లు మెప్మా పీడీ శ్రీహరి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం అతడిని విచారించారు. కొంత మొత్తం రికవరీ చేసినట్లు సమాచారం. మిగిలిన మొత్తం త్వరలోనే జమ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. కార్యాలయంలో అంతర్గత వివాదాల నేపథ్యంలోనే ఈ వ్యవహారం చోటుచేసుకున్నట్లు సమాచారం.

427 మద్యం సీసాల ధ్వంసం

దర్శి, న్యూస్‌టుడే: దర్శి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టు దుకాణాలలో పట్టుబడిన మద్యాన్ని బుధవారం ధ్వంసం చేసారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.ఆయేషాబేగం సమక్షంలో 180 ఎం.ఎల్. పరిమాణం కలిగిన 427 మద్యం సీసాలను (79.86 లీటర్లు) ధ్వంసం చేశారు. అనంతరం దర్శి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రికార్డులను పరిశీలించి వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కేసులు పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుకున్న మద్యాన్ని పారబోస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం, సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

మొగళ్లపల్లె సర్పంచి అనుమానాస్పద మృతి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మొగళ్లపల్లె సర్పంచి కర్నాటి వెంకటేశ్వరరెడ్డి (50) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం వెంకటేశ్వర రెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వీరభద్రాపురం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన మృతదేహం గ్రామ శివార్లలో పడి ఉండగా కొందరు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ అజయ్‌కుమార్ వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సర్పంచి కుమారుడు అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తండ్రి మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు.



వెంకటేశ్వరరెడ్డి (పాత చిత్రం)

నగరపాలక సంస్థ కార్యాలయము, ఒంగోలు

వేలం నోటీసు తేది: 19.11.2025

ఈ కార్యాలయపు వేలం నోటీసు ఆర్.ఓ.సి నెం. 2806/2022-A1. తేది: 16.10.2025 మేరకు తేది: 11.11.2025 ఉ 11.గం॥లకు జరుగవలసిన షాపు రూముల బహిరంగవేలమును తేది: 25.11.2025న ఉ.11.00 గం॥లకు నగరపాలక సంస్థ కార్యాలయములో నిర్వహించబడునని తెలియజేయడమైనది.

సం/- కమిషనర్, ఒంగోలు నగరపాలక సంస్థ

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9701112824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008535779

కాలువలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

◗ బిడ్డతో సహా రక్షించిన దర్శి ఎస్సై

దర్శి, న్యూస్‌టుడే: భర్తతో గొడవపడి క్షణికావేశంలో రెండు సంవత్సరాల బాలుడితో కలిసి సాగరు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మహిళను ఎస్సై, స్థానికులు కాపాడారు. ఈ సంఘటన దర్శి కురిచేడు రోడ్డులో సాగరు ప్రధాన కాలువలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు దర్శి మండలం మారెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ ఇంట్లో గొడవపడి కుమారుడితో సహా వచ్చి సాగరు కాలువలో దూకింది. సమీపంలోని స్థానికులు కొందరు గమనించి కాలువలో దూకిన మహిళను కాపాడే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎస్సై మురళి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మహిళను, ఆమె బిడ్డను ఒడ్డుకు చేర్చారు. దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బిడ్డ పరిస్థితి విషమంగా ఉండటంతో తొలుత దర్శిలో ప్రైవేట్ వైద్యశాలకు అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కాలువలో దూకిన మహిళను పోలీసులు విచారిస్తున్నారు. సకాలంలో స్పందించి తల్లిని, బిడ్డను కాపాడిన ఎస్సైని ప్రజలు అభినందించారు.

మహిళకు చెందిన బిడ్డను వైద్యశాలకు తరలిస్తున్న ఎస్సై మురళి, స్థానికులు

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.ఫార్మసీ, Bachelor of Physiotherapy (BPT), B.Sc, నర్సింగ్, GNM నర్సింగ్, మేనేజ్‌మెంట్ సీట్లకై: 98669 39320, 70134 48102

DISTANCE EDUCATION

వన్ సిట్టింగ్ డిగ్రీ, B.Tech, MBA, MCA, M.Sc, నర్సింగ్ కోర్సులకు గుజరాత్, సిక్కిం, అరుణాచల ప్రదేశ్‌లో ప్రముఖ యూనివర్సిటీల నుండి ఇప్పించబడును. ఒంగోలు 7093621555

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Gummalla Pitchaiah S/o Gummalla Kotaiah, Qualification: M, Pharma, Ph.D., M.B.A., shall hence forth be known as Gummalla Radha Prashanth S/o Gummalla Kotaiah.

JOBS

ఒంగోలు, త్రోవగుంట ఆటోనగర్ ఎదురు హీరోస్పేర్ పార్ట్స్ డిస్ట్రిబ్యూటర్ ఆఫీసునందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ స్టాఫ్ కావలెను.. 9154882189, 9154882192.

ఒంగోలులోని చైతన్యహైస్కూల్ (E.M)లో నర్సరీ to X వరకు బోధించుటకు టీచర్స్, ఆయాలు, డ్రైవర్లు కావలెను. 9177014253, 7780779680.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:9703971968

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

ఇళ్ల స్థలాలు అందజేయరూ!

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: పదవీ విరమణ పొందిన తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి మాజీ సైనికులు విన్నవించారు. విశ్రాంత సైనికుల యూనియన్ ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిశారు. తమకు సొంత ఇళ్లు లేక ఎక్కడెక్కడో నివసిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పరిశీలించి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి వారికి భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యేకు అర్జీ ఇస్తున్న మాజీ సైనికులు

విద్యార్థులకు ఆటల పోటీలు

రాచర్ల, న్యూస్‌టుడే : స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు రంగవల్లులు, స్కిప్పింగ్, మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20న బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, రంగారెడ్డి, బాషా, సత్య, ఖాదర్‌బీ, రాణి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓం సాయి వికాస్ విద్యానికేతన్‌లో బుధవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి తరం బాలికలు లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు లక్ష్మీబాయి వేషధారణలో ప్రత్యేకంగా అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.రాధారాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలైన విద్యార్థులతో కరస్పాండెంట్ పద్మజ, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా 'ఈనాడు' ఉపన్యాస పోటీలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నలంద పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో 125 మంది హాజరయ్యారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. ప్రథమ బహుమతిని 9వ తరగతి చదివే కె.మహేష్, ద్వితీయ బహుమతిని 7వ తరగతి చదివే ఎస్.జాయ్‌షారున్, తృతీయ బహుమతిని 9వ తరగతి చదివే కిశోర్‌కుమార్ గెలుచుకున్నారు. వీరికి 'ఈనాడు' ఆధ్వర్యంలో అందజేసిన బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ పద్మజ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మేకల రామకృష్ణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి సాయి చంద్రహాసరెడ్డి, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, శ్రీరాములు, నాగరాజు, రెహమాన్, డేవిడ్, ప్రశాంతి, అమల పాల్గొన్నారు.

వైద్యుల కొరత..రోగుల కలత

❖ పొదిలి పెద్దాసుపత్రిలో తప్పని కష్టాలు

న్యూస్‌టుడే, పొదిలి :

పశ్చిమ ప్రాంతంలో కీలక పట్టణమైన పొదిలిలో పూర్తిస్థాయి వైద్య సేవలన్నవి అందని ద్రాక్షగానే మిగిలాయి. స్థానిక సామాజిక వైద్యశాలలో సౌకర్యాలు కల్పించకపోవడంతో ఈ దుస్థితి ఎదురవుతోంది. పేరుకు 30 పడకల ఆసుపత్రి అయినా సేవలు నామమాత్రమే. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల నుంచి పొదిలి ఆసుపత్రికి రోజుకు సరాసరిన 150 మంది రోగులు వస్తుంటారు. ఈ ప్రాంతంలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా క్షతగాత్రులను ముందుగా తరలించేది ఇక్కడికే. అయితే ఆసుపత్రిలో సివిల్ సర్జన్, చిన్నపిల్లల, మత్తు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనరల్ మెడిసన్ వైద్యులు మెడికల్ లీవ్‌పై వెళ్లారు. చిన్నపిల్లల వైద్యులు రిమ్స్ నుంచి డిప్యుటేషన్‌పై వారానికి మూడు రోజులు వస్తున్నారు. దీనికితోడు స్టాఫ్ నర్సుల కొరత ఉంది. ఆసుపత్రిలో కొత్తగా ఎక్స్‌రే మిషన్ వచ్చినా పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. ఎక్స్‌రే తీసేందుకు అనువైన బల్ల, ప్రింటర్ లేవు. ఒక్కోసారి ఫిజియోథెరపీలో పని చేసే మల్టీ రిహాబిలిటేషన్ సిబ్బంది సైతం ఓపీ చూడాల్సి వస్తోంది.

పొదిలి సీహెచ్‌సీలో రోగులకు చికిత్స

ఓపీ వద్దా నీడ కరవే

అన్నింటికీ ఒంగోలే !

పొదిలి చుట్టుపక్కల మండలాల్లో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా క్షతగాత్రులను ఇక్కడి సీహెచ్‌సీకి తరలిస్తుంటారు. సర్జన్ లేకపోవడంతో..ఒంగోలుకు సిఫారసు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గర్భిణుల పరిస్థితి మరింత దయనీయం. జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచితే నరకమే. తక్షణం వైద్యుల కొరత తీర్చి..సౌకర్యాలు మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలకు స్థల పరిశీలన

కంభం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో డిగ్రీ కాలేజీకి కేటాయించిన స్థలాన్ని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆ భూమికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ కిరణ్ ఆయనకు వివరించారు. హైస్కూల్‌కు ఉన్న భూమిలో ఒక ఎకరం స్థలాన్ని డిగ్రీ కళాశాలకు బదలాయిస్తూ ప్రతిపాదనలు పంపించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు రాజేష్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి

ప్రభుత్వ వైద్యశాలకు కుర్చీల అందజేత

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగుల సహాయార్థం స్థానిక సూర్యా విద్యానికేతన్ అధినేత డి.జి.బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ పద్మ రూ.50 వేల విలువ చేసే వెయిటింగ్ కుర్చీలను అందజేశారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ఆదాం, ఆర్ఎంవో కె.రమణారెడ్డి, డా.సింధు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు కుర్చీలు అందజేస్తున్న దాతలు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

పొదిలి, న్యూస్‌టుడే:

?: పొదిలి విశ్వనాథపురం, కొత్తూరులోని పలు వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.
– సుబ్బారావు, పొదిలి.

✓:రెండుసార్లు కుక్కలను పట్టించి కు.ని.శస్త్రచికిత్సలు చేయించాము. నిర్మూలనకు చర్యలు చేపడతాము.. – ఎ.మారుతీరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొదిలి.

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని ప్రధాన రహదారి డివైడర్‌పై వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. చర్యలు చేపట్టాలి.
–సుబ్బారాయుడు, స్థానికుడు

✓: రోడ్డుపక్కన చెత్తాచెదారం పడేస్తున్న దుకాణదారులను ఇప్పటికే హెచ్చరించాం. మరోసారి పరిశీలించి తగిన చర్యలు చేపడతాం:
–రామసుబ్బయ్య, పీఏస్

పొగాకు నారు యాజమాన్యంపై శిక్షణ

పొదిలి, న్యూస్‌టుడే: పొగాకు రైతులు నాట్ల సమయంలో ఎరువుల యాజమాన్యం పాటించాలని పొదిలి వేలం కేంద్రం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ చెప్పారు. బుధవారం రామాపురం గ్రామంలో రైతులకు నారు మడుల యాజమాన్యం, నాట్లు, ఎరువుల వినియోగంపై నిర్వహించిన సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పొగాకు నారు, పంటపై మాగుడు , నారుకుళ్లు తెగుళ్లు ఆశించకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 20 గ్రాములు, ప్లాంటామైసిన్ మందును ఒక గ్రాము నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అమిస్టర్ మందును పది మిలీ. పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ, జీపీఐ మేనేజర్లు జి.వెంకట్రావు, ఎండీ సమయుద్దీన్, క్షేత్ర సాంకేతిక సహాయకులు ఎస్కే తస్లీమ్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేలం కేంద్రం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్

రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు

పొదిలి, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నిధులు పొదిలి మండలంలోని 8,436 మంది రైతులకు రూ.5.47 కోట్లు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి డి.శ్రీనివాసులరెడ్డి చెప్పారు. బుధవారం రైతుసేవా కేంద్రాల్లో సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: బీఎల్వోలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎన్నికల విధులపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తర్లుపాడు, పొదిలి మండలాల్లో బీఎల్వోల పనితీరు ఆశాజనకంగా లేదన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ

రాచర్ల, న్యూస్‌టుడే : యడవల్లి పంచాయతీలో బుధవారం ఉపాధి హామీ పనుల గుర్తింపు సభ నిర్వహించారు. 2026-27 సంవత్సరానికి సంబంధించిన పనుల పటం ఏర్పాటుచేసి గుర్తించారు. ఆమోదించిన పనులకు గ్రామసభ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మమ్మ, ఏపీవో మహాలక్ష్మి, కార్యదర్శి సరస్వతి, ఈసీ నాగేశ్వరరావు, టీఏ శ్రీనివాసులు, ఎఫ్ఏ లక్ష్మీనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పనుల గుర్తింపు పటం వద్ద అధికారులు, గ్రామస్థులు

సమాజాభివృద్ధిలో పురుషులు కీలకం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: సమాజం, దేశ నిర్మాణం, అభివృద్ధిలో పురుషుల పాత్ర ముఖ్యమైనదని ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి అన్నారు. బేస్తవారపేటలోని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం పాఠశాలలోని పురుష ఉపాధ్యాయులకు మహిళా ఉపాధ్యాయినులు మంచినీటి సీసాలు బహూకరించారు.

తప్పని అవస్థల ప్రయాణం

ఎదురాళ్లపాడు నుంచి గనివినపాడు వెళ్లే రహదారిలో తారు లేచి కంకర తేలి అధ్వానంగా మారింది. గజ్జల కొండ వెళ్లేందుకు ఇది దగ్గరి దారి కావడంతో పలు గ్రామాల వారు ఈ మార్గం మీదనే రాకపోకలు సాగిస్తుంటారు. ఏళ్లుగా నిర్వహణ సరిగా లేకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు రహదారి అంచులు సైతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే,కొనకనమిట్ల

రూ.లక్షలు వెచ్చించి..అసంపూర్తిగా వదిలేసి..

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం :

యర్రగొండపాలెంలోని పుల్లలచెరువు ప్రధాన రహదారి పక్కన రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. గత వైకాపా ప్రభుత్వం రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్ర నిర్మాణం చేపట్టింది. దాని పక్కనే ప్రభుత్వ హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని రూ.17.5 లక్షలతో చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇవి అసంపూర్తిగా మిగిలిపోయాయి. వాటికి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయలేదు. ఫ్లోరింగ్, బయట బండపరుపు పనులు చేయకుండా గుత్తేదారులు వదిలేశారు. దీంతో రెండేళ్లుగా ఇవి ఉత్సవ విగ్రహాల్లా మిగిలాయి. నిర్వహణ పట్టించుకోకపోవడంతో నానాటికీ శిథిలమవుతున్నాయి. వై.పాలెం పంచాయతీరాజ్ పరిధిలో ఇలా అసంపూర్తిగా మిగిలిపోయిన భవనాలు దాదాపు పది వరకూ ఉన్నాయి. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ రవీంద్రారెడ్డిని సంప్రదించగా..గత ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు ఆపివేశారన్నారు. దీనిపై కొత్త ప్రభుత్వానికి నివేదించామన్నారు.

తలుపులు, కిటికీలు లేని రైతు భరోసా భవనం

అసంపూర్తిగా హెల్త్ సెంటర్

21న విద్యుత్తు సమస్యలపై అదాలత్

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలోని వినియోగదారులకు ఈ నెల 21న స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో విద్యుత్తు వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ కిశోర్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు అదాలత్ సీజీ ఆర్ఎఫ్ ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మాన్యుయేల్ హాజరవుతారని తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా తెలియజేస్తే సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు.

ఇళ్ల మధ్యే మురుగు తటాకం

బేస్తవారపేట అంకాలమ్మ గుడి సమీపంలో జనావాసాల మధ్య మురుగునీరంతా చేరి తటాకంలా మారింది. మురుగు వెళ్లేందుకు కాలువలు లేవు. దీంతో గృహాల్లోని వాడుక నీరంతా అక్కడ చేరి దుర్వాసన వస్తోంది. మురుగు పోయేలా పక్కా కాలువలు నిర్మించాలని, ఆ ప్రాంతాన్ని మట్టితో పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే,బేస్తవారపేట

తాగు, సాగునీటి సరఫరా పునరుద్ధరించండి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: గుండ్లకమ్మ నుంచి సప్లైఛానల్ ద్వారా మార్కాపురం చెరువుకు నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇరిగేషన్ డీఈఈ డి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం చెరువు అలుగు ద్వారా బోడపాడు గ్రామ చెరువుకు నీరు నింపడానికి అవకాశం ఉందన్నారు. నీరు వచ్చే మార్గాన్ని గేట్లతో మూసి వేయడంతో ప్రస్తుతం చెరువుకు సరఫరా ఆగిపోయిందన్నారు. నీరు వచ్చే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు డి.సోమయ్య, అడివయ్య, బోడపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.

డీఈఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

పోషకాహారంతో పాల ఉత్పత్తి పెంపు

యర్రగొండపాలెం పట్టణం: పట్టణంలోని కొలుకుల రోడ్డులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన పాల ఉత్పత్తిపై రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిన్నబాలునాయక్ మాట్లాడుతూ పశువులకు పోషకాహారం అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పశు వైద్యుడు శివారెడ్డి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ మంత్రునాయక్ పాల్గొన్నారు.

పైపులైను పగిలి నీరంతా వృథా

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలోని పెద్దమసీదు ఎదురుగా ఉన్న ఒంగోలు - పొదిలి ప్రధాన రహదారి పక్కనే తాగునీటి పైపులైను పగిలి నీరు వృథా అవుతోంది. కొత్తూరు ప్రాంతానికి నీరు వదిలినప్పుడు ఈ లైనులో నీరు లీకై రోడ్డు అంచుల్లో పారుతున్నాయి. దీనివల్ల వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పొదిలిలో ఆయా ప్రాంతాల్లో వారానికి ఒక్కరోజు మాత్రమే తాగునీరు సరఫరా చేసే పరిస్థితి ఉంది. అంత విలువైన నీటిని వృథా కాకుండా వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రుణ వసూళ్లలో అలసత్వం సహించం

మార్కాపురం గ్రామీణం: గ్రామాల్లో మొండి బకాయిలను తక్షణమే రికవరీ చేయించాలని స్త్రీనిధి డీజీఎం ఉమామహేశ్వరరావు వీవోఏలను ఆదేశించారు. పట్టణంలోని డ్వాక్రాబజారులోని సమావేశపు హాలులో బుధవారం ఆయన వెలుగు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కాపురం మండల పరిధిలో రూ.30 లక్షల మేర మొండి బకాయిలున్నాయని, వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. రుణ వసూళ్ల లక్ష్యం సాధిస్తే మండలంలోని మహిళా సంఘాలకు రూ.15 కోట్ల వరకు కొత్త రుణాలు అందించేందుకు వీలుపడుతుందన్నారు. ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో నవంబరు 25 తేదీ నాటికి లక్ష్యం పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఏజీఎం ఉదయ్‌కుమార్, క్లస్టరు ప్రత్యేకాధికారి డీపీఎం (నాన్‌ఫామ్) డి.దానం, సీసీలు నాగయ్య, మనోకుమారి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీజీఎం ఉమామహేశ్వరరావు

గాయపడిన యువకుడి మృతి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పెద్దదోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులో తుమ్మలబైలు సమీపంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడు బుధవారం ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం..కనిగిరికి చెందిన మాల కొండయ్య(26), ఖాజావలీ స్నేహితులు. వారిద్దరూ మంగళవారం ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళ్లి వస్తుండగా..తుమ్మల బైలు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ దుర్ఘటనలో ఖాజావలీ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ మాలకొండయ్యను నంద్యాల జిల్లా సున్నిపెంట వైద్యశాలకు తరలించి అక్కడ ప్రాథమిక చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం బుధవారం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

ఇంటికి నిప్పంటించిన దుండగులు

పొదిలి, న్యూస్‌టుడే: తాను ఇంట్లో లేని సమయంలో దుండగులు నిప్పు పెట్టారని పొదిలి పిచ్చిరెడ్డికాలనీకి చెందిన నజరతమ్మ వాపోయారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను వెలుగు కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నానని రెండు రోజుల క్రితం కార్యాలయానికి వెళ్లినప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి నిప్పు పెట్టారన్నారు. దీంతో ఇంట్లో సామగ్రి కాలిబూడిదైందన్నారు. కొంత నగదు మాయమైనట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేమన తెలిపారు.

బడ్డీ కొట్లో చోరీ..: పొదిలి పొగాకుబోర్డు సమీపంలోని ఓ బడ్డీకొట్టులో మంగళవారం రాత్రి దొంగలు పడి సిగరెట్లు, ఫ్రిజ్‌లో ఉన్న వస్తువులు చోరీ చేశారని బాధితురాలు రాధ వాపోయారు. ఈ బడ్డీ దుకాణంతోనే దివ్యాంగుడైన కుమారుడిని పోషిస్తున్నానన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

రైతన్న సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : రైతులు ప్రకృతి సాగు చేపట్టడం వల్ల ఆర్థిక ప్రయోజనం పొందొచ్చని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమన్నారు. నియోజకవర్గంలోని 37,649 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా రూ.18.82 కోట్లు, పీఎం కిసాన్ పథకం ద్వారా 32,762 మందికి రూ.6.55 కోట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, గిద్దలూరు ఇన్‌ఛార్జ్ ఏడీఏ కె.రాజశ్రీ, తహసీల్దారు ఎం.ఆంజనేయరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు బాలయ్య, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం పట్టణం: రైతు సంక్షేమానికే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలుచేస్తోందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్‌బాబు అన్నారు. గురిజేపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వై.పాలెం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 39274 మంది రైతులకు చేయూత అందుతుందన్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఏడీఏ వెంకటరమణ, ఉద్యాన అధికారి ఆదిరెడ్డి, తెదేపా నాయకులు చేకూరి సుబ్బారావు, వెంగళరెడ్డి పాల్గొన్నారు.



రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, అధికారులు, నాయకులు

తర్లుపాడు: ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నా రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. తర్లుపాడులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.32.07 కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం జమచేసిందన్నారు. తర్లుపాడు మండలానికి రెండు డ్రోన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా వైపాలెం నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్‌బాబు

తర్లుపాడు : డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

N.S COLLEGE OF PHARMACY
(Affiliated to Andhra Kesari University, Ongole) Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam District, AP - 523 320
SPOT & CAT- B ADMISSIONS
A Few seats are available in B. Pharmacy 4 Years Course
Spot & CAT-B Admissions on : 18.11.2025.
For Admissions Contact: 91540 49566, 95025 40700
N.S.College Of Pharmacy, Secretary & Correspondent

N.S.LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole) Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), A.P. 523 320
CAT-B ADMISSIONS
A few seats are available in 3 and 5 years LL.B course
CAT-B Admissions on: 18.11.2025
For Admissions contact: 86884 42544, 95025 40700
N.S.LAW COLLEGE, Secretary & Correspondent

City Union Bank Limited

College Road, MARKAPUR Branch. Ph.No: 91500 63100

JEWEL LOAN AUCTION NOTICE

It is hereby informed that the under mentioned borrowers have availed Jewel Loan in our Branch, the details of which are furnished below. As the said accounts are overdue, notices have been served to these persons demanding the closure of the accounts. Despite our reminders, the following Jewel Loan accounts have not been closed and the pledged jewels have not been redeemed. Hence, it is hereby informed that the said borrowers are advised to close the said accounts immediately. Failing which, the jewels pledged to the bank as security for the respective loan accounts will be auctioned in public by the branch at its premises on 26.11.2025 at 1.00 p.m. or some other dates which is convenient to the bank without giving further notice regarding date of auction, to collect the entire amount including the interest to be charged in the account, along with expenses, if any, in connection with postages, paper publication & other misc. expenses.
It is further informed that this notice is also applicable for the legal heirs of the borrower in case the borrower is deceased. Also it is applicable for those borrowers who have not received the notice of reminders till date, for closure of the overdue accounts.
In case, any surplus amount available from the sale proceeds of the auction conducted would be adjusted to other dues if any to the bank by the borrower or by the guarantor. On the other hand, in case of any shortage of amount to close the Jewel Loan account due to decrease in sale value of jewels or some other reasons, appropriate legal action would be initiated against the borrower and/or guarantor for the recovery of the loan amounts.
In case of any part payment made in the account after this notice is served and still it is not closed, the bank reserve the right to auction such jewels also.
It is informed that the Bank has the absolute right to cancel/postpone the date of auction without any prior notice and that the bank has the right to refrain from auctioning of certain jewels of JL accounts.

S. No	Jewel Loan No.	Date of Loan availed	Name and address of the borrower	Weight of Jewels in grams
1.	502112156002111	02.11.2023	Thangirala Samson S/o Pedda Devaiah D.No. 1-65 Jagannadhapuram Prakasam, AP 523 371	5.00

Place: Markapur
Date: 19.11.2025
Sd/- Branch Manager

Note: 1. The bidders should bring their PAN details and ensure KYC compliance as per RBI norms.
2. The successful bidder has to pay the bid amount immediately, otherwise their EMD will be forfeited.

(c) eenadu

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

ప్రసంగం మెచ్చే.. బహుమతి వరించే

● 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పాకల జడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం సింగరాయకొండ మండలం పాకల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై 7,8,9,10 తరగతుల విద్యార్థులకు పోటీ నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థిని [illegible] ప్రథమ, 10వ తరగతి విద్యార్థిని జి.సహస్ర ద్వితీయ, 10వ తరగతి విద్యార్థి కె.ప్రణవశ్రీ గౌతమ్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు విజయానంద్, వెంకటేశ్వర్లు, ప్రసాదరెడ్డి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుమలరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నిధుల జమ

జరుగుమల్లి: పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలలో భాగంగా మండలంలో అర్హులైన 5,250 మంది రైతులకు రెండో విడత కింద నిధులు ఖాతాల్లో జమచేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి శాలీవిక్రమ్ తెలిపారు. ● హనుమంతునిపాడు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదలపై టీవీల్లో విడుదలైన పీఎం సందేశాన్ని మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో రైతులు బుధవారం వీక్షించారు. దీనికింద రూ.1.17 కోట్లు విడుదలయ్యాయని ఏవో గోపీకృష్ణ తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆధునిక బోధన పద్ధతులపై శిక్షణ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం విద్యాశాఖ అధికారి నాగేంద్రవదన్ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు టీచర్ టూల్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి మాస్టర్ ట్రైనీస్‌గా బిట్రగుంట కేజీబీవీ పాఠశాల స్రవంతి, మస్తాన్ వ్యవహరించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రానివ్వం

● 'ఈనాడు' 'ఫోన్ ఇన్'లో కనిగిరి ఆర్టీసీ డీఎం సయానాబేగం

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని కనిగిరి ఆర్టీసీ డిపో మేనేజరు మహమ్మద్ సయానాబేగం అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రయాణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు నేరుగా డీఎంతో మాట్లాడారు. ఆ వివరాలు.. - న్యూస్‌టుడే, కనిగిరి

?: కనిగిరి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రాత్రి వేళ సరిగ్గా లైట్లు వెలగడం లేదు. పట్టించుకోండి.
- కె. నాగేశ్వరరావు, కనిగిరి

?: పిసిపల్లి మండలం పమిడిపల్లికి బస్సును నడపండి.
- వి.సుబ్బారావు, పడమటిపల్లి

?: పామూరు నుంచి తిరుమలకు బస్సు నడపాలి.
- ప్రసాద్‌రెడ్డి, పామూరు

?: పామూరు నుంచి మార్కాపురానికి నేరుగా బస్సులను ఏర్పాటు చేయాలి.
- కిరణ్, పామూరు

?: కనిగిరి నుంచి తాళ్లూరు, గుడిపాడు, కొత్తపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సాయంత్రం కనిగిరి నుంచి 5 గంటలకు వెళ్లేలా ఏర్పాటు చేయాలి.
- శ్రీవిద్య, ఇంటర్ విద్యార్థిని, తాళ్లూరు.

?: పామూరు- సీఎస్‌పురం, సీతారామపురంలకు సర్వీసు తిప్పాలి.
- ఎన్.నరసింహారావు (పామూరు). షేక్ నాగూర్ (సి.ఎస్.పురం).

?: కనిగిరి నుంచి తిరుపతి, శ్రీశైలం, మాలకొండకు నెలలో రెండు సార్లు బస్సులను ప్రత్యేకంగా నడపాలి.
- లక్ష్మణరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కనిగిరి

?: కనిగిరి నుంచి సీయస్‌పురం మండలం బోయమడుగుల, వెంకటాయచెరువుకు బస్సును నడపాలి.
- ఆవుల వెంకటేశ్వర్లు (వెంకటాయచెరువు), యనమల రమణారెడ్డి (బోయమడుగుల).

చార్ట్‌ను పరిశీలిస్తున్న డీఎం సయానాబేగం

✓: తప్పనిసరిగా ఆయా ప్రాంతాలకు మా కంట్రోలర్‌ను పంపి అక్కడ పరిస్థితులపై అంచనా వేస్తాం. అవసరమైన బస్సులు నడుపుతాం. కీలక విషయాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

☛ అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీలో ప్రజా ప్రతినిధులు



రైతులతో కలిసి చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

వెలిగండ్ల, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పీఎం కిసాన్ పథకం, అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల రైతులకు రూ. 28.42 కోట్లు నిధులు రైతుల బ్యాంకుల ఖాతాలో జమ అవుతాయన్నారు. అనంతరం రైతులో 'ముఖాముఖి' కార్యక్రమంలో పాల్గొని వారితో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ షేక్ జైనులాబ్దిన్, వ్యవసాయాధికారిణి శిల్ప, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి..

వెలిగండ్ల: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కొందరు ప్రజా ప్రతినిధులు మండలంలోని సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు వై.భారతి, సుగుణ, ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ వాసు, ఏవో శిల్ప పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న దర్శి తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి

ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నారు..

కురిచేడు: రైతుల పురోగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని దర్శి తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని పొట్లపాడు గ్రామంలో బుధవారం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకిచ్చిన ప్రతి మాటను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. కార్యక్రమంలో కురిచేడు మండల అధికారులతోపాటు దర్శి ఏడీఏ బాలాజీనాయక్, ఏవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో విద్యాభివృద్ధిని పెంచాలి

తాళ్లూరు: పిల్లల్లో విద్యాభివృద్ధి పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాలను ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకరరావులు తెలియజేశారు. స్థానిక వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించండి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రజలు ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని, తద్వారా పంచాయతీల్లో అవినీతి అరికట్టి అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని డీపీవో వెంకటేశ్వరరావు అన్నారు. కనుమళ్ల గ్రామంలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించి పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో జయమణి, ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శి శాంతి, పీఏసీఎస్ అధ్యక్షుడు భైరపునేని మోహనరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాలు

దర్శి, న్యూస్‌టుడే: విజ్ఞానం పెంచుకోవటానికి గ్రంథాలయాలను వినియోగించుకోవాలని హెచ్‌ఎం నర్సిరెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రంథపాలకురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లావణ్య, ఎలిసమ్మ, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది

కార్యక్రమంలో పాల్గొన్న ఏవో, అధ్యాపకులు, విద్యార్థులు

డిజిటల్ వ్యవసాయంపై అవగాహన అవసరం

సి.ఎస్.పురం: డిజిటల్ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏవో పి.మధుబాబు అన్నారు. కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బుధవారం శీలంవారిపల్లిలో డిజిటల్ వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో పి.శ్రీనివాసులు, వీపీఏ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ బాధ్యులు డాక్టర్ పి. స్టెఫీ పాల్గొన్నారు.

తడి పొడి చెత్త సేకరణ తప్పనిసరి

పీసీపల్లి, న్యూస్‌టుడే: ప్రతి రోజూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను కార్మికులు విధిగా సేకరించాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని గుదేవారిపాలెంలో సర్పంచి శాంసన్‌తో కలిసి చెత్త సేకరణ పరిశీలించి మాట్లాడారు.

సైబర్ సెక్యూరిటీపై ఉచిత శిక్షణ

కొండపి గ్రామీణం: కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలో స్కిల్ హబ్ ద్వారా సైబర్ సెక్యూరిటీపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు, స్కిల్ హబ్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ షేక్ ఫిరోజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4 నెలల పాటు ఉచితంగా శిక్షణ కల్పిస్తుందన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

మల్లవరంలో గోశాలను సందర్శించి మెలకువలు తెలియజేస్తున్న జేడీ వెంకటేశ్వరరావు

తాళ్లూరు, న్యూస్‌టుడే: పాడి రైతుల ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు విధాలుగా ప్రోత్సాహకాలు అందజేస్తుందని జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లూరులోని పశు వైద్యశాలను బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా మద్దిపాడు మండలంలోని మల్లవరం సమీపానున్న గోశాలను సందర్శించి అక్కడి పరిస్థితులు, వసతులను గమనించారు. నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లూరులో జేడీ విలేకర్లతో మాట్లాడారు. పశు వైద్యాధికారి డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

కురిచేడు, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తానని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గంధం కోటి అన్నారు. బుధవారం కురిచేడు గ్రామంలోని శివాలయంలో నాయీ బ్రాహ్మణ కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. దీన్లో కురిచేడు నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడుగా గంధం కోటిని, గౌరవ అధ్యక్షులుగా బల్లిపల్లి ఏడుకొండలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక

విద్యార్థినికి షీల్డు అందజేసి అభినందిస్తున్న రమణారెడ్డి

తాళ్లూరు: తాళ్లూరులోని సరస్వతి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఉల్లి జస్వంత్‌రాయ్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైంది. శింగరాయకొండ మండలం పాకలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని ఉత్తమ ప్రతిభను కనబర్చడంతో జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాజట్టు తరపున ఆడుతుందని పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు బిజ్జం వికాస్ తెలియజేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో బాలికకు సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవీ.రమణారెడ్డి బహుమతి అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు వి.శ్రీరామమూర్తి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామంలో వీధిదీపాలు ఆరు నెలలుగా నిత్యం వెలుగుతున్నాయి. కాలువల్లో ముురుగు, చెత్త నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వెంటనే చర్యలు తీసుకోగలరు.
- వెంకటరావు, సింగరాయకొండ.

✓: త్వరలో విద్యుత్తు స్తంభాలకు స్విచ్‌లు అమర్చి రాత్రి పూట మాత్రమే వెలిగేలా చూస్తాం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. - శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి.

?: తాళ్లూరు మండలంలోని రామభద్రాపురానికి రామతీర్థ జలాశయ పథకం ద్వారా మంచినీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ప్రతి రెండు రోజులకోసారి రావాల్సి ఉండగా నియమితంగా ఎప్పుడు సరఫరా అవుతుందో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులు చొరవచూపి సత్వరం సమస్యను పరిష్కరించాలి.
- వెంకటేశ్వర్లు, రామారావు, తాళ్లూరు.

✓: వెంటనే అక్కడి సమస్యపై విచారిస్తాం. త్వరితగతిన మంచినీరు సరఫరా చేయించి సమస్య పరిష్కరిస్తాం.
- వాలి, ఏఈ, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం.

?: మండలంలోని పన్నూరు ఎస్సీ కాలనీలో తాగునీరు పూర్తిస్థాయిలో రాకపోవటంతో నీటికి ఇబ్బందిగా ఉంటుంది.
- కోటేష్, మర్రిపూడి.

✓: ఎస్సీ కాలనీలో అవసరమైన ప్రదేశాల్లో ట్యాంక్‌ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తిచేసి నీరందిస్తాం. - జైపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామం వద్ద సాగర్ పైప్ లైన్ దెబ్బతిని నీరంతా వృథాగా పోతోంది. దీంతో మండల కేంద్రానికి నీరు అరకొరగా వస్తోంది. చర్యలు తీసుకోగలరు.
- ఉస్తేల గోపి, కొండారెడ్డిపల్లి

✓: గుత్తేదారుకు సమాచారం ఇచ్చి వెంటనే చర్యలు తీసుకుని మరమ్మతులు చేయిస్తాం.
- శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం, తాళ్లూరు, మర్రిపూడి, హనుమంతునిపాడు

రసాయన ఎరువుల వాడకం తగ్గించండి

దర్శి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని, రసాయన ఎరువుల వాడకం తగ్గించి లాభసాటి వ్యవసాయం చేయాలని కేవీకే కోఆర్డినేటర్ డా.రమేష్ అన్నారు. దర్శి కేవీకేలో బుధవారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ప్రధాని ఆశయాలకు అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టాలని సూచించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.వరప్రసాదరావు, ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.రవీంద్రబాబు వ్యవసాయంలో రైతులు అవలంబించవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, మానస, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోఆర్డినేటర్ డా.రమేష్

రూ.కోట్లిచ్చినా.. రోడ్డు వేయలే..

న్యూస్‌టుడే, ముండ్లమూరు:

రెడ్డినగర్ నుంచి బసవాపురం వరకు ఉన్న రోడ్డుకు 2 కిలోమీటర్ల దూరం మేర భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులకు గత తెదేపా హయాంలో రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారులు కొంత మేర పనులు చేశారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

వైకాపా పాలనలో పట్టించుకున్న వారు లేరు

వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత రివర్స్ టెండర్‌తో పనులు నిలిచిపోయాయి. వైకాపా పాలనలో పట్టించుకున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు లేరు. వర్షాలకు, భారీ వాహనాల రాకపోకలకు మూడు అడుగుల మేర గుంతలు పడ్డాయి. ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పాఠశాల వాహనాలు, ఆటోలు నడిపే వారు గ్రామంలోకి రావడానికి ఇష్టపడటం లేదు. రోడ్డు నిర్మాణం చేపడితే ఇబ్బందులు తొలగిపోతాయి. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◗ ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ పీఐయూ ఏఈ శంకరరావును వివరణ కోరగా నివేదికలు ఉన్నతాధికారులకు పంపించామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గ్యాస్ సిలిండర్ల విక్రేతపై కేసు నమోదు

కురిచేడు, న్యూస్‌టుడే: అక్రమంగా గ్యాస్ సిలిండర్ల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి వద్ద ఎనిమిది సిలిండర్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం కురిచేడులో చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కురిచేడు గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా గ్యాస్ సిలిండర్లను తీసుకువచ్చి స్థానికంగా అమ్మకాలు జరుపుతున్నాడనే సమాచారంతో కురిచేడుకు వచ్చారు. అతని ఇంట్లో తనిఖీలు చేయగా భారత్ గ్యాస్ కంపెనీకి చెందిన ఎనిమిది సిలిండర్లు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాక్రిష్ణ మాట్లాడుతూ.. అక్రమంగా గ్యాస్ సిలిండర్ల వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డేవిడ్‌రాజ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ముకుందహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనభోజనాలు

ఇస్కాన్ ప్రతినిధి రూపేష్ ప్రభుతో, కాపు సంఘం నాయకులు, భరతనాట్యం కళాకారులు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి మండలంలోని నందనమారెళ్ల బాలకోటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో బుధవారం కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వన భోజనాల గురించి ఇస్కాన్ ప్రతినిధి రూపేష్ ప్రభు మాట్లాడారు. చెన్నై నుంచి వచ్చిన కళాకారులు భరతనాట్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి, కాపు సంఘం నాయకులు డా. కోమల్‌కుమార్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, పసుపులేటి అరుణోదర్ పాల్గొన్నారు.

భైరవకోనలో దీపాలంకరణ

దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోనలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. త్రిముఖ దుర్గాంబ, కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో 1001 దీపాలను భక్తులు వెలిగించారు. కార్యక్రమంలో మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ జి.వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు. ◗ భైరవకోనను కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యేని అర్చకులు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

టంగుటూరు: ప్రధాన రోడ్లు, రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. టంగుటూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రాగాయకుంట సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిసరాల్లో పరిశుభ్రం చేయించారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని అక్షర కాలేజీలో బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆమె వీరత్వం, దేశభక్తి గురించి నాయకులు వివరించారు.

ఆక్రమిత స్థల పరిశీలన

దొనకొండ: దొనకొండలోని నాలుగు రోడ్ల కూడలిలోని ఆక్రమిస్తున్న ఆర్ అండ్ బీ స్థలాన్ని తహసీల్దార్ రమాదేవి బుధవారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఆర్ అండ్ బీ స్థలంలో కంచె ఏర్పాటు చేశారని సమాచారం రావటంతో ఆమె పరిశీలించి ఆర్ అండ్ బీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd., Ongole-II Branch, Prakasam District issue the following notice to the general public.

My client intends to grant loan to the applicant 1. Shaik Hussain Bi, W/o Masthan, 2. Shaik Masthan, S/o. Masthan, both are residing at 1-131/A, Main Road, Kondepi, Prakasam District, Andhra Pradesh, submitted the documents to create the same as security for the Trade Finance. On careful scrutiny of the documents. I have submitted my legal opinion as follows for the property as security by way of registered mortgage. As such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes, etc., shall be informed to the below address within 7 days from the date of this notice. Otherwise later objection will not bind my client in this regard.

SCHEDULE

Schedule-A (as per Doc.No.153/2025 belongs to Shaif Hussain Bi)
Prakasam District Registration, Singarayakonda Sub Registration, Kondapi mandal, Kondapi Grama Panchayat and Kondapi Gadiyaram Kandrika Village Sy.No. 82/1, 10th ward, Near Door No.10-130, out of an extent of Ac. 0.39 cents or 1887.6 sq.yards, as per plan Plot No.9 covering an extent of 194.81 sq.yards or 163.640 sq.meters of vacant site bounded by:- **East:** 14 feet wide Bazar - this side 28.8 feet, **South:** Site in plot no.10- this side 63 feet, **West:** Bazar - this side 27 feet, **North:** Site in plot no.8 - this side 63 feet.

Schedule-B (as per Doc.No. 4036/2021 belongs to Shaik Masthan)
Prakasam District Registration, Singarayakonda Sub Registration, Kondapi mandal, Kondapi Grama Panchayat and Kondapi Gadiyaram Kandrika Village Sy.No. 82/1, 10th ward, Near Door No.10-43, out of an extent of Ac. 4.42 cents, as per plan Plot No. 50 covering an extent of 144.42 sq.yards or 2,984 sq.links of vacant site bounded by:- **East:** Site in plot no.51 - this side 32 feet, **South:** Site in plot no. 49 belongs to Doppalapudi Himabindu and Chintalapudi Venkayamma - this side 92 1/2 feet, **West:** 18 feet wide bazar - this side 32 feet, **North:** Site in plot no. 55 - this side 94 feet.

Sd/- **M.S.S. PRASAD**
Advocate & Legal Advisor, AP/3706/2023
Shriram Finance Ltd., Ongole

పబ్లిక్- నోటీస్

ఇందుములముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయినటువంటి సింగరాయకొండ గ్రామనివాసి **కాకునూరి బ్రహ్మయ్య గారి కుమారులు 1. కాకునూరి చంద్రశేఖర రావు, 2. కాకునూరి రమేష్** అనువారలకు కరేడు గ్రామ కాపరస్థుడు ఉలవపాడు మండల నివాసి అయిన సుంకర విజయ గోపాల్ రెడ్డి తండ్రి రామలింగారెడ్డి నగదు తీసుకుని బాకీ అయి ఉన్నాడు. ఆ బాకీలో భాగంగా నా క్లయింటు అయినటువంటి చంద్రశేఖర రావు మరియు రమేష్ అనువారలు సదరు విజయగోపాల్ రెడ్డిపై కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు దావాలు వేసినారు. సదరు గోపాల్ రెడ్డి స్థిర ఆస్తి అయినటువంటి సరస్వతి కళ్యాణ మండపముపై దావా వేసి సదరు ఆస్తిని కోర్టు ద్వారా జప్తు చేపించి ఉన్నారు. సదరు సుంకర విజయ గోపాల్ రెడ్డి సరస్వతి కళ్యాణ మండపమును కోర్టు వారు జప్తు చేసి ఉన్న విషయమును దాచిపెట్టి, మధ్యపెట్టి కోర్టువారి జప్తులో ఉన్న ఆస్తిని మోసపూరితంగా ఇతరులకు అమ్మ జూపుతున్నట్టు మా క్లయింటు ద్వారా మాకు తెలియ వచ్చినది. కావున సదరు ఆస్తిని (సరస్వతి కళ్యాణ మండపము) అందులో ఉన్నటువంటి రూములను ఎవ్వరూ కొనకూడదని ఇందుమూలముగా తెలియ పర్చడమైనది. దీనికి విరుద్ధముగా ఎవరైనా సదరు ఆస్తిని కొనుగోలు చేసిన యెడల అట్టివారికి దానిపై ఎటువంటి హక్కులూ సంక్రమించబడవని ఇందుములముగా తెలియపర్చడమైనది. అట్టి వారిపై నా క్లయింటు తీసుకొను చర్యలకు వారు పూర్తి భాధ్యత వహించవలసి ఉంటుంది.

ఆస్థి షెడ్యూలు: ప్రకాశం జిల్లా- ఒంగోలు డి.రి.- సింగరాయకొండ స.రి.- సింగరాయకొండ మండలం- సోమరాజుపల్లి మజారా- సింగరాయకొండ ఆర్.యస్. గ్రామ పంచాయతీ - సోమరాజుపల్లి గ్రామ సర్వే నెం.605 ఎ2ఎ-సింగరాయకొండ ఆర్.యస్. విలేజ్ - 7వ బ్లాకు, పట్టాభి వారి వీధి - సరస్వతి కళ్యాణ మండపమునకు హద్దులు **తూర్పు:** ఆర్.టి.సి. బస్టాండునకు పోవు పంచాయతీ రోడ్డు **దక్షిణం:** గ్రామ పంచాయతీ బజారు **పడమర:** పద్మభూని భాస్కరుని చంద్రశేఖర్ మరియు ఇతరుల ఇళ్ల స్థలాలు **ఉత్తరం:** నరసింహారావు మరియు ఆదెమ్మల స్థలాలకు రాకపోకల కొరకు వదలబడిన స్థలం.

చిరునామా: D.No. 3-10B, H.P గ్యాస్ ఆఫీసు ప్రక్కన మూలగుంటపాడు (గ్రా/పం), సింగరాయకొండ (మం), ప్రకాశం జిల్లా, సెల్: 9848150966

ఇట్లు/-: కొమ్మన మల్లికార్జునరావు, (B.Com., B.L)
అల్లడి శ్రీకాంత్, (B.A., LLB)
బక్కమంతల నాగరాజు, (B.A., LLB)
యనమల హర్షవర్ధనయాదవ్, (B.A., LLB)
అడ్వకేట్స్

పౌష్టికాహారంతోనే ఆరోగ్య భాగ్యం

● 'ఈనాడు.. ఈటీవీ' వైద్య శిబిరంలో వైద్యులు

మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యాధికారిణి డా. ప్రియర్శానంద

న్యూస్‌టుడే, కనిగిరి

'ఆరోగ్యమే మహా భాగ్యమని' ప్రభుత్వ వైద్యాధికారిణి డా.తాడిపర్తి ప్రియర్శానంద పేర్కొన్నారు. బుధవారం 'ఈనాడు- ఈటీవీ.. వైద్య ఆరోగ్య శాఖ'ల సంయుక్త ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని సమీకృత బాలికల వసతి గృహ సముదాయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 3వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థినులు వైద్య సేవలను వినియోగించుకున్నారు.

రక్తహీనత లేకుండా చూసుకోవాలి : ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ బాలికలు తరచూ వచ్చే వ్యక్తిగత సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలనీ, రక్త హీనత లేకుండా చూసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ఒత్తిడిని అధిగమించాలంటే ఈ వయస్సులోనే శక్తి అవసరమన్నారు. బాలికలు మహిళా డాక్టర్లకు ఆరోగ్య సమస్యలు తెలియ జేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ : యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.ప్రియర్శానంద, ఫార్మసీ అధికారిణి కాపుగంటి శైలజ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.రమణారెడ్డి, సంక్షేమాధికారిణి జయంతి, ఆనందనిలయం సంక్షేమాధికారి జి.మురళీ, హెల్త్ అసిస్టెంట్ తిరుతయ్య, స్టాఫ్ నర్సు దీపిక, ఎల్‌జీఎస్ డి.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరానికి హాజరైన విద్యార్థినులు

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

బాధిత కుటుంబానికి బీమా పరిహారం

నారాయణమ్మకు చెక్కు అందజేస్తున్న పార్టీ నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ముక్తినూతలపాడుకు చెందిన మొలకలపల్లి వెంకటేశ్వర్లు మృతి చెందారు. తెదేపా సభ్యత్వం ఉండడంతో ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5 లక్షలను... ఆయన భార్య నారాయణమ్మకు బుధవారం అందజేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, పార్టీ నగర అధ్యక్షుడు బండారు మదన్, నాయకులు రామాంజనేయులు, రాయపాటి బాబూరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల సాధనకు కృషి

చీమకుర్తి, న్యూస్‌టుడే: గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో పి.శ్రీధర్‌రావు కోరారు. కె.వి.పాలెంలో ఇంటింటి చెత్త సేకరణను బుధవారం పరిశీలించారు. కాలువలు, నీటి ట్యాంకులు, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. సర్పంచి బి.శ్రీనివాసరావు, నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు పాలడుగు వెంకట నారాయణ, కారదర్శి, ఎం.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

పాలపర్తి ప్రమీల W/o మోహనరావు, D.No. 35-3-42, జక్రయ్యనగర్, శర్మకాలేజి ఎదురు, ఒంగోలు. ప్రకాశం జిల్లా. డాక్యుమెంట్ నెం. 1388/2006 పై వివరములు గల డాక్యుమెంటు పోయినది. దొరికిన వారు క్రింది నంబరుకు సంప్రదించగలరు. సెల్: 7981559356

రైతు కళ్లల్లో ఆనందమే లక్ష్యం

రైతులకు చెక్కు అందజేస్తున్న పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ సీతారామయ్య, ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. కొప్పోలులో బుధవారం నిర్వహించిన ఒంగోలు నియోజకవర్గ స్థాయి 'పీఎం కిసాన్... అన్నదాత-సుఖీభవ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు మూడు విడతల్లో ఏటా రూ.20 వేల సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. సకాలంలో ఎరువుల సరఫరాతో పాటు పాడి రైతులకు దాణా అందజేసినట్లు వివరించారు. మార్కెట్ సంక్షోభం నేపథ్యంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి 9,260 మంది రైతులకు మంజూరైన రూ.6.15 కోట్ల మొత్తానికి సంబంధించిన చెక్కు అందజేశారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకటరావు, మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, తహసీల్దార్ మధుసూదనరావు, ఏవోలు రమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అన్ని విధాలా అండ

చెక్కు అందజేస్తున్న ఏఎంసీ ఛైర్‌పర్సన్ రాజేశ్వరి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సాగు ఖర్చులకు ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం రైతులకు 'అన్నదాత సుఖీభవ' సాయం అందజేస్తున్నట్లు ఏఎంసీ ఛైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్ తెలిపారు. మైనంపాడులో బుధవారం నిర్వహించిన సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం రైతుల ఖాతాలకు రెండోసారి రూ.7 వేలు చొప్పున నగదు జమ చేసినట్లు తెలిపారు. మొత్తం 27,036 మంది రైతులకు రూ.18.48 కోట్లు జమ అయినట్లు ఏడీఏ బి.రమేష్‌బాబు తెలిపారు. ఇంకా నగదు పడని వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జ్యోతి, డీసీ ఛైర్మన్ నల్లూరి కృష్ణారావు, తెదేపా మండలాధ్యక్షులు మద్దినేని హరిబాబు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, రైతు నాయకులు ఆళ్ల సుబ్బారావు, నువ్వుల మీరయ్య, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే గేటు కష్టాలకు చెల్లు!

● అగ్రహారంలో చురుగ్గా అండర్‌పాస్ పనులు

నగరంలో ఏళ్లుగా కొనసాగుతున్న అగ్రహారం రైల్వే గేటు సమస్యకు త్వరలో తెరపడనుంది. ఇక్కడి లెవెల్ క్రాసింగ్ స్థానంలో అండర్‌పాస్ ఏర్పాటుకు నిర్ణయించి... ఇప్పటికే కొంతమేర పనులు చేశారు. చివరి అంకమైన వంతెన నిర్మాణానికి తాజాగా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఈ నెల 25 నుంచి రైల్వేగేటు మూసివేతకు నిర్ణయించారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

అగ్రహారం రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

రాకపోకలు నిలిపివేత...

రూ.20 కోట్లతో రైల్వేశాఖ ఈ నిర్మాణం చేపడుతోంది. ఆ ప్రాంతంలో ప్రత్యామ్నాయంగా మురుగు కాలువ ఏర్పాటు చేయాల్సి రావడంతో నగర పాలక సంస్థ వారు రూ.40 లక్షలతో పూర్తి చేశారు. దీంతో రైల్వేశాఖ పనుల్లో వేగం పుంజుకుంది. ప్రస్తుతం పట్టాల కింద గడ్డర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాక్ కింద పనులు చేయాల్సి రావడంతో ఈ నెల 25 నుంచి ఇటుగా రాకపోకలు నిలిపివేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేశారు. రెండు నెలలు పాటు ఇవి కొనసాగే అవకాశం ఉంది. అప్పటివరకు సంఘమిత్ర ఆసుపత్రి అవతల కొత్త బైపాస్ పక్కగా కాలనీలకు వెళ్లాల్సి ఉంటుంది. లేదంటే కొప్పోలు మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

తీరనున్న ఇక్కట్లు...

గత ఏడాది మూడో ట్రాక్ నిర్మించాక రైళ్ల రాకపోకలు పెరిగాయి. దీంతో ఇక్కడ గేటు దాటేందుకు అరగంట సమయం పడుతోంది. గేటు అవతల బాలాజీనగర్‌లో ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండడంతో... విద్యార్థులు, వైద్యం కోసం వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవ చూపడంతో అండర్‌పాస్ మంజూరైంది. స్థానికంగా చేపట్టాల్సిన పనులు పూర్తి చేయడంతో వంతెన పనులు ఊపందుకున్నాయి. ఇది పూర్తయితే అగ్రహారంతో పాటు అటుగా ఉన్న ఏడు కాలనీలకు రవాణా కష్టాలు తీరతాయి.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతే ధ్యేయం

జెండా ఎగురవేస్తున్న సొసైటీ ఛైర్‌పర్సన్ విజయమ్మ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రైతు అభ్యున్నతే ధ్యేయంగా త్రీమెన్ కమిటీ కృషి చేస్తున్నట్లు సిండికేట్ రైతు సహకార సొసైటీ ఛైర్‌పర్సన్ కూకట్ల విజయమ్మ తెలిపారు. సహకార వారోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడులోని కార్యాలయంలో బుధవారం జెండా ఆవిష్కరించారు. ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంపునకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యాలయం ఎదుట కల్వర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రుద్రవరం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శరత్‌బాబు, సొసైటీ ఇన్‌ఛార్జి ఎండీ గోగినేని హేమంత్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లవరపు రామకృష్ణారెడ్డి, పెరుగు రాము, ఒంగోలు కో-ఆపరేటివ్ సహాయ రిజిస్ట్రార్ నర్రా సురేంద్రబాబు, నాయకుడు తిరుపతిస్వామి, ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత

సంతనూతలపాడు: పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని వీకేఎన్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత అట్లూరి రామారావు పేర్కొన్నారు. మైనంపాడు, చిలకపాడు, ఎనికపాడు, మద్దులూరు జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి నేషనల్ మీన్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరవుతున్న యాభై మంది పిల్లలకు బుధవారం... అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు జె.కోటేశ్వరరావు, ఎంఈఎఫ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు టి.ఆల్ఫ్రెడ్, గుంటూరు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక చేయూత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంతపేటలోని శివం శరణాలయంలో శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు బౌద్ధహిన్ చేతులమీదుగా అయిదు నిరుపేద కుటుంబాలకు రూ.40 వేల ఆర్థికసాయం, బియ్యం పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా సేవలు కొనసాగించడం అభినందనీయమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సంస్థ నిర్వాహకుడు గొల్లపూడి శ్రీహరి జన్మదినోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మండువ మురళీకృష్ణ, నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి.రమాదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

శాశ్వత ప్రయోజన పనులకు ప్రాధాన్యం

మ్యాప్ ఆధారంగా అవగాహన కల్పిస్తున్న పీడీ జోసెఫ్‌కుమార్

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో జల సంరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ తెలిపారు. దొడ్డవరప్పాడు పంచాయతీలో సర్పంచి బెజవాడ రాము అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఉపాధి పనుల అంచనా బడ్జెట్ గ్రామసభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. శాశ్వతంగా ప్రయోజనం చేకూర్చే పనులు చేపట్టాలని సూచించారు. కూలీలందరికీ పని కల్పించడంతో పాటు పూర్తిస్థాయి వేతనం వచ్చేలా చూడాలన్నారు. ఏపీడీ బసవ సుబ్బారావు, ఉపసర్పంచి ముళ్లూరి మురళి, ఏపీవో ధనుంజయవర్మ, క్షేత్ర, సాంకేతిక సహాయకులు హనుమాన్ ప్రసాద్, స్వాతి, అరుణ పాల్గొన్నారు. గ్రామంలోని వనరులు, చేపట్టాల్సిన పనులకు సంబంధించిన మ్యాప్‌ను రంగవల్లి రూపంలో తీర్చిదిద్ది అవగాహన కల్పించారు.

హాకీ క్రీడాకారులకు సామగ్రి పంపిణీ

సామగ్రి అందుకున్న విద్యార్థులతో దాత, ఉపాధ్యాయులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని తెదేపా నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు పేర్కొన్నారు. ఎండ్లూరు ప్రాథమికోన్నత పాఠశాల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు... 20 జతల క్రీడా దుస్తులు, పరికరాలు, ప్రయాణ ఖర్చులు అందజేశారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. బాగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు శేషిరెడ్డి, పీఎస్‌సీఎస్ ఛైర్మన్ వంకాయలపాటి ప్రియాంక, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కె.రాము, హాకీ అసోసియేషన్ జిల్లా జాయింట్ కార్యదర్శి తిరుమలశెట్టి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం... ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ కిషోర్ మెరుగైన బోధనా పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు తులసి, పద్మావతి శిక్షణ లక్ష్యాలను వివరించారు. 25 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి అందజేసిన సరకులతో బ్యాంకు అధికారులు

కెనరా బ్యాంకు వేడుకలు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు వ్యవస్థాపకులు అమ్మెంబాళ్ సుబ్బారావు పాయ్ 173వ జయంతిని నగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎం రాఘవేంద్ర కేకు కోశారు. బొమ్మరిల్లు అనాథాశ్రమానికి నిత్యావసర సరకులు అందజేశారు. వ్యవస్థాపకుల స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. డీఎంలు రమేష్, శ్రీనివాసులు, లీలాప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు... ఆరు పంకాలు, ఎనిమిది ట్యూబ్‌లైట్లను బుధవారం అందజేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణి, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు అశోక్, విజయ్ వినయ్, నాగాచారి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు శ్లాఘనీయం

ఉప్పుగుండూరులో ఇందిరమ్మ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర గ్రంథాలయంలో మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో... సాహితీ, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న వారిని తేళ్ల అరుణ చేతులమీదుగా సత్కరించారు. సంపూర్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ● మద్దిపాడు కళా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ సేవలను వక్తలు కొనియాడారు. చుండూరి రంగారావును సత్కరించారు. ● సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**

కల్లు దుకాణం కార్మికుడిపై దాడి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ రోడ్డులోని కల్లు దుకాణంలో పనిచేస్తున్న కార్మికుడు యామవరపు ఆంజనేయులుపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం దాడి చేశారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు... దుకాణం వద్ద వాహనం నిలపగా ఆయన అభ్యంతరం తెలిపారు. దీంతో ఇటుకరాయితో దాడి చేశారు. తీవ్రగాయాలు కావడంతో బాధితుడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

హెచ్చరిక

మా క్లయింటు కొల్లా పాపయ్యగారి కుమారుడు కొల్లా ఆంజనేయులు, చదలవాడ గ్రామం అనువారు మాకిచ్చిన సంజాయిషీ మేరకు తెలియజేయునది

మా క్లయింటు చదలవాడ గ్రామ సర్వే నెం 364/1రు నంబరు గలయ 1.94 సెంట్ల భూమి గురించి ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో ఒ.యస్.నెం. 54/2025రున గూడూరి రాంబాబు, విన్నకోట సత్యన్నారాయణ మరియు మాలెంపాటి కృష్ణారావు అనువారల పై దాఖలు చేయగా, సదరు భూమి కోర్టు వివాదములో ఉన్నది. ఎవరైన క్రయవిక్రయాలు ద్వారా కొనుగోలు చేసిన యెడల ఎలాంటి హక్కులు పొందబోరని పైదావా తీర్మానము నకు లోబడి ఉండునని యావన్మందికి తెలియజేయడమైనది.

సం/- అడుసుమల్లి రామయ్య
అడ్వకేట్, ఒంగోలు

ఒంగోలు
19.11.2025

కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కలెక్టర్ పి.రాజాబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అంశాలు చర్చించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మధుసూదనరావు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు సత్యసాయి శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పడి భజన

చీమకుర్తి, న్యూస్‌టుడే: దేవరంపాడులో బుధవారం రాత్రి... అయ్యప్ప పడిభజన వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పూజాదికాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు. ● చీమకుర్తిలో కె.లక్ష్మారెడ్డి దంపతులు నిర్వహించిన వేడుకలో జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **మద్దిపాడు:** ఘడియాపూడి పునరావాస కాలనీకి వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళ రాకపోకలకు సమస్యగా ఉంది.
- ఎం.సుబ్రహ్మణ్యం

✓: పంచాయతీ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.
- చెన్నారెడ్డి, విద్యుత్తు ఏఈ

?: మద్దిపాడు: గుండ్లకమ్మ నుంచి వచ్చే పైపులైను బస్టాండ్ కూడలిలో దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. ఎగువ ప్రాంతాలకు సరఫరా అందడం లేదు. **- వి.నాగరాజు**

✓: వెంటనే మరమ్మతులు చేపట్టి వృథాను అరికడతాం.
- నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

తవ్వారు... జాగ్రత్తలు మరిచారు!

నగరంలోని కమ్మపాలెం వై జంక్షన్ వద్ద పరిస్థితి ఇది. దెబ్బతిన్న పైపులైను బాగు చేసేందుకు భారీ గుంత తవ్వారు. ఇంతవరకు బాగానే ఉన్నా... ఎటువంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ ఇటుగా రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు





(c) eenadu

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆత్మకూరులో జరిగిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో 1,95,866 మంది రైతులకు సంబంధించిన రూ. 130.20 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రెండో విడత నిధులు జమ చేసినట్లు వివరించారు. సోమశిల హైలెవల్ కాలువ పూర్తికి, ఆత్మకూరులో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి కృషి చేస్తామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా.. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేశారని వివరించారు. జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు మంత్రి పురపాలక కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆర్డీవో పావని, జేడీఏ సత్యవాణి, కిమ్స్ ఈడీ గిరినాయుడు, అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాగుదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జేసీ తదితరులు

కడగండ్లు మిగిలి.. తోటలు తొలగించి

గుడ్లూరు మండలంలో గత పదేళ్లుగా లాభాలు కురిపించిన జైవాన్‌జామ.. ప్రస్తుతం రైతులను నష్టాలపాలు చేస్తోంది. ఇక్కడ సుమారు 600 ఎకరాల్లో ఈ రకం సాగవుతుండగా.. ఇటీవల 'పండు ఈగ' ధాటికి దిగుబడులు తగ్గాయి. కాయలు సరిగా ఉండటం లేదు. దీంతో సాగు కష్టంగా భావించిన రైతులు రెండు రోజులుగా ఉప్పుటేరు సమీపంలోని తోటలను తొలగిస్తున్నారు. – న్యూస్‌టుడే, గుడ్లూరు

సేవా సిరి.. నాట్లకు సరి

ప్రభుత్వం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న సందర్భంగా బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకులో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రేబాలలో ఆర్‌ఎస్‌కే వద్దకు వెళ్లి మాట్లాడారు. సమీపంలోని స్థానిక పొలాల్లో పనులు చేస్తున్న మహిళలకు వెళ్లి.. వారితో కలిసి వరినాట్లు వేశారు. సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. – న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

నీటికి చిక్కులు.. విద్యార్థులు దిక్కులు

వలేటివారిపాలెం మండలం కలవళ్ల ప్రాథమిక పాఠశాలకు అందించిన శుద్ధజల పరికరమిది. ఇచ్చిన కొన్ని రోజులకే మరమ్మతులకు గురవడంతో ఇలా ఒక మూలకు చేర్చారు. విద్యార్థులకు డబ్బానీరే దిక్కవుతోంది. ఇక్కడ 47 మంది విద్యార్థులు ఉన్నారు. ఎంఈవో-2 మల్లికార్జునరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. – న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

గన్ లైసెన్స్ రిజిస్టర్ ఎక్కడ!

కలెక్టరేట్ ఉద్యోగుల తీరుపై ఆడిట్ బృందం అసంతృప్తి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్ సిబ్బంది ఆడిట్ బృందానికి చుక్కలు చూపిస్తోంది. విజయవాడ నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన ఆడిట్ బృందం నెల్లూరు చేరుకుంది. విభాగాల వారీగా ఫైళ్లను పరిశీలించి నివేదిక తయారు చేయనుంది. ఆ క్రమంలో వారు ఏ ఫైల్ అడిగినా స్థానిక ఉద్యోగుల నుంచి కనిపించడం లేదన్న సమాధానం వస్తుండటంతో తలలు పట్టుకుంటున్నారు. కలెక్టరేట్‌లోని ఉద్యోగులు తమకు సహకరించడం లేదని ఫిర్యాదు సైతం చేసినట్లు తెలిసింది.

కనిపించడం లేదని...

గన్ లైసెన్స్ రిజిస్టర్‌ను ఆడిట్ అధికారులు అడగగా... కనిపించడం లేదని చెప్పినట్లు తెలిసింది. అత్యంత ప్రధానమైన రిజిస్టర్ విషయంలో ఈ తీరున సమాధానం రావడంతో విస్తుబోయినట్లు సమాచారం.

ప్రతి ఫైల్ ఇస్తాం

సాధారణ ఆడిట్ జరుగుతోంది. సదరు బృందం నవరత్నాలపై ఆడిట్ చేస్తామని లేఖ ఇచ్చారు. ఇక్కడకు వచ్చిన తర్వాత మిగతా అన్ని విభాగాలు కూడా చూస్తామన్నారు. గన్ లైసెన్సుల రిజిస్టర్ ఉంటుంది. అంతా ఆన్‌లైన్ కాబట్టి ఎక్కడకీ పోదు. వారు అడిగిన ప్రతి ఫైల్ ఇస్తున్నాం. – విజయకుమార్, డీఆర్వో

ప్రయాణికుల సేవే ధ్యేయం!

ఈనాడు మీతోడు

నెల్లూరు (రవాణా), న్యూస్‌టుడే: ప్రయాణికుల సేవే మా తొలి ప్రాధాన్యం. ప్రయాణంలో వారికి ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి (ఆర్ఎం) షేక్ షమీమ్ స్పష్టం చేశారు. 'ఈనాడు'- మీతోడులో భాగంగా బుధవారం జిల్లా ప్రజారవాణాశాఖ అధికారితో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. ప్రయాణికుల సమస్యలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. కొన్నింటికి అప్పటికప్పుడే పరిష్కారాలు సూచించారు.

'ఈనాడు-ఫోన్‌ఇన్'లో జిల్లా ప్రజారవాణా అధికారి షమీమ్

? బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో సాధారణ ప్రయాణికులు కూర్చుంటున్నారు. – దర్గా బాబు(కొమ్మి), సనావుల్లా(నెల్లూరు), బాలాజీ(పొన్నపూడి పెద్దపాలెం)
✓ సమస్య పునరావృతం కాకుండా చూస్తాం.

? చేజర్ల- ఏటూరు మధ్య ఉదయం 7.30 గంటలకు బస్సు వెళుతోంది. ఈ సమయం అనుకూలంగా లేదు.
✓ మార్చేందుకు చర్యలు తీసుకుంటాం.

? కావలి నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు వారానికి మూడు సార్లే తిప్పలో ఆగుతోంది. అన్ని రోజులు ఆగేలా చూడగలరు. – శివప్రసాద్, తిప్ప
✓ కావలి డీఎంతో మాట్లాడతాం.

? రామతీర్థం నుంచి నెల్లూరుకు సాయంత్రం 4.05 గంటలకు బస్సు బయలుదేరేలా చూడండి. – కుమార్, ఉపాధ్యాయుడు
✓ ఆ మేరకు మార్పు చేస్తాం.

? నెల్లూరు ప్రధాన బస్టాండులో గ్రామీణ బస్సులు నిలిపే ప్రాంతంలోని మరుగుదొడ్ల నుంచి తీవ్ర దుర్గంధం వస్తోంది. – వెంకట్(మూలాపేట, నెల్లూరు)
✓ రాకుండా చర్యలు తీసుకుంటాం.

? విడవలూరు నుంచి రాత్రి 7 గంటలకు అలగానిపాడుకు నైట్ అవుట్ సర్వీసు ఏర్పాటు చేయగలరు. – మల్లికార్జున, వేణుగోపాల్ (అలగానిపాడు)
✓ డిపో మేనేజర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

? నెల్లూరు- పామూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు సంగం వద్ద పాయింట్ ఏర్పాటు చేయాలి. – అమర్నాథ్(సంగం)
✓ వెంటనే ఏర్పాటు చేస్తాం.

? పులివెందుల- విజయవాడ సర్వీసులో కందుకూరుకు రిజర్వేషన్ లభించడం లేదు. ఒంగోలు నుంచి చేయించుకుంటున్నాం. – కిషోర్(కందుకూరు)
✓ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తాం.

సమస్య: ఉదయగిరి డిపో పరిధిలో చెర్లోపల్లి- అయ్యవారిపల్లెకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపాలని అర్జీ ఇచ్చినా.. స్పందన లేదు. – కె. వెంకటేశ్వరరావు, చెర్లోపల్లి
ఆర్ఎం: పరిశీలనలో ఉంది. త్వరలో పరిష్కరిస్తాం.

? గతంలో ఉదయం 9:30 గంటలకు చేజర్ల నుంచి నెల్లూరుకు బస్సు ఉండేది. ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. – హరికృష్ణ, చేజర్ల
✓ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

? నెల్లూరు నుంచి అల్లూరుకు తగినన్ని బస్సులు లేక ఇబ్బంది పడుతున్నాం. వెంకటాచలం మండలం పుంజులూరుపాడుకు నెల్లూరు నుంచి బస్సులు నడపాలి. – వెంగయ్య(అల్లూరు), పెంచలయ్య(పుంజులూరుపాడు)
✓ త్వరలో కొత్త బస్సులు వస్తాయి. రాగానే నడుపుతాం.

కృష్ణుడి విగ్రహం చోరీ

గంటల వ్యవధిలోనే నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ సోమయ్య

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: కృష్ణుడి పంచలోహ విగ్రహం చోరీకాగా.. గంటల వ్యవధిలోనే పోలీసులు రికవరీ చేశారు. నెల్లూరులోని సంతపేట పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య ఆ వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం ఓ దుండగుడు కామాటి వీధిలోని సంతాన బాల గోపాలకృష్ణ స్వామి మందిరంలోకి చొరబడి గర్భ గుడిలోని ఉత్సవ విగ్రహం, ఇత్తడి గంట ఎత్తుకెళ్లాడు. అర్చన చేసేందుకు వచ్చిన పూజారి రఘునందన్ విగ్రహం, ఇత్తడి గంట కనిపించకపోవడంతో ఛైర్మన్ భాస్కర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఫిర్యాదుతో సంతపేట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సోమయ్య కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నార్తురాజుపాలేనికి చెందిన పాత నేరస్థుడు వెంకయ్య ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కోటమిట్టకు చెందిన షేక్ షఫీకి విగ్రహం విక్రయించినట్లు వెల్లడించారు. అతన్ని కూడా అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నెల్లూరు కారాగారానికి నలుగురు మావోయిస్టులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: 'ఆపరేషన్ కగార్'లో భాగంగా మంగళవారం విజయవాడలో పోలీసులు అరెస్టు చేసిన 27 మంది మావోయిస్టుల్లో నలుగురిని నెల్లూరులోని జిల్లా కేంద్ర కారాగారానికి తీసుకురానున్నారు. విజయవాడ పడమట పోలీసుస్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా డిసెంబరు 3వ తేదీ వరకు వీరికి రిమాండ్ విధించి.. నెల్లూరుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో వీరిని ఇక్కడికి బుధవారం రాత్రికి తీసుకురానున్నారు. ఈ మేరకు కేంద్ర కారాగారానికి సమాచారం అందింది. వీరి పేర్లు తెలియరాలేదు.

జిల్లావ్యాప్తంగా.. పోలీసుల తనిఖీ

నెల్లూరు (నేర విభాగం): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా తనిఖీ చేపట్టారు. అన్ని కూడళ్లు, జాతీయ రహదారుల నిష్క్రమణ, ప్రవేశమార్గాల్లో 40 ప్రదేశాల్లో 1536 వాహనాలను తనిఖీ చేశారు. 36 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి 15 వాహనాలు సీజ్ చేశారు. 187 ఎంవీ యాక్ట్ కేసులు నమోదు చేసి, రూ. 1,39,685 జరిమానా విధించారు. 84 లాడ్జీల్లో సోదా చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్, డయల్ 112కు గాని తెలియజేయాలని ఎస్పీ అజిత వేజెండ్ల సూచించారు.

కన్నోళ్ల ఆశలకు ఉరితాడు

ప్రణీత (పాతచిత్రం)

నవోదయలో పదో తరగతి విద్యార్థిని బలవన్మరణం

న్యూస్‌టుడే, మర్రిపాడు: అల్లారు ముద్దుగా పెరిగిన బిడ్డ.. ఉపాధ్యాయుడైన తండ్రి ప్రేరణతో ఇటు చదువులో.. అటు క్రీడల్లోనూ రాణిస్తోంది. అంతా సంతోషంగా గడిచిపోతున్న సమయంలో.. ఏం కష్టమొచ్చిందో.. తాను చదువుతున్న చోటే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. రాత్రి ఫోన్‌లో తమతో సంతోషంగా మాట్లాడిన కుమార్తె.. విగతజీవిగా ఉరితాడుకు వేలాడుతుండటం చూసి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.

పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... కావలి మండలం అడవిరాజుపాళేనికి చెందిన రవికుమార్- అంజమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె ప్రణీత(14) కృష్ణాపురంలోని నవోదయలో చదువుతూ వసతిగృహంలో ఉంటోంది. తండ్రి కొండాపురం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. మైగ్రేషన్ విధానంలో భాగంగా గత ఏడాది హరియాణా వెళ్లొచ్చిన ప్రణీత.. బాగా చదివి ఐఏఎస్ అవుతానని తల్లిదండ్రులకు చాలాసార్లు చెప్పింది. మంగళవారం రాత్రి 8 గంటలకు ఒకసారి, 10.20కి మరోసారి తండ్రికి ఫోన్ చేసి మాట్లాడింది. రేపు పరీక్ష ఉంది నాన్న అని చెప్పగా.. ఆల్‌ది బెస్ట్ చెప్పారు. కాగా, బుధవారం తెల్లవారుజామున మెట్లకు ఉండే కమ్మీలకు ఉరేసుకున్న స్థితిలో వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని దించి పంచనామా అనంతరం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుమార్తె మృతిపై అనుమానం

కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని ప్రణీత తండ్రి రవికుమార్ తెలిపారు. తన బిడ్డది పిరికితనంతో ఇలా చేసుకునే మనస్తత్వం కాదని, చాలా ధైర్యవంతురాలని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. ఉరితాడుకు ఉన్న ముడులు నా కుమార్తె వేసుకోలేదని, సిబ్బంది వసతిగృహంలో ఉంటున్న విద్యార్థినులు, కేర్‌టేకర్‌పై అనుమానం ఉందన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఇక్కడి చదివే విద్యార్థినులు అవమానిస్తుంటారని నా దృష్టికి తెచ్చినా. . పట్టించుకోకుండా చదువుకోరా అని పలుమార్లు చెప్పానంటూ రోదించారు.

టెండర్ వద్దు.. కట్టబెడదాం!

రక్షణ గోడ నిర్మాణంలో ఇరిగేషన్ అధికారుల అత్యుత్సాహం

ఈనాడు, నెల్లూరు: ఏకంగా రూ. 197 కోట్ల విలువైన పని. పెన్నా వంతెనకు దిగువన నిర్మించే రక్షణ గోడ మిగిలిన భాగం పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా. . వైకాపా ప్రభుత్వంలో మొదటి భాగాన్ని దక్కించుకున్న గుత్తేదారుడికే అప్పనంగా కట్టబెట్టేందుకు అధికారులు అత్యుత్సాహం చూపుతుండటమే వివాదాస్పదమవుతోంది. ఓ సారి ప్రతిపాదనలు పంపగా కూటమి ప్రభుత్వం నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. అయినప్పటికీ తాజాగా రాష్ట్ర స్థాయి నుంచి ఇద్దరు అధికారులు వచ్చి పరిశీలించడం.. మళ్లీ పాత గుత్తేదారుడికే దక్కేలా ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భగత్‌సింగ్ కాలనీ దగ్గర పెన్నా నదిలో నిర్మిస్తున్న కాంక్రీట్ రక్షణ గోడ

1.40 కి.మీ.. రూ. 197.31 కోట్లు

పెన్నా బ్యారేజీ దిగువన ఉన్న వంతెన నుంచి భగత్ సింగ్ కాలనీ వరకు 2.058 కి.మీ. పొడవు ఉండగా.. ప్రభుత్వం తొలుత మట్టికట్టకు నిధులు విడుదల చేసింది. అవి మొత్తం గోడకు సరిపోకపోవడంతో.. 630 మీటర్లకే టెండర్లు పిలిచి.. అప్పగించారు. మిగిలిన 1.428 కి.మీ.ల పూర్తికి రూ. 197.31 కోట్లవుతుందని అంచనా వేశారు. టెండర్లు పిలవకుండా అప్పగించాలన్న నిర్ణయమే వివాదాస్పదమైంది. మొదట తీసుకున్నవే ఇంకా జరుగుతుండగా. . కొత్తగా పనులు అప్పగించడం ఏమిటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మితిమీరిన రాజకీయ జోక్యంతో పాటు పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయన్న ప్రచారం జరుగుతోంది.

● ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్ వివరణ కోరగా.. బ్యారేజీకి దిగువన నిర్మిస్తున్న రక్షణ గోడ. . మిగిలిన భాగం పూర్తికి ప్రతిపాదనలు పంపిన మాట వాస్తవమేనన్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారమే పంపించామని.. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విషయం ఏమిటంటే...

2020, 2021లో వరుసగా పెన్నా నదికి వరదలు రావడంతో నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీ, జనార్దన్‌రెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన నాటి సీఎం మట్టికట్ట నిర్మాణానికి రూ. 100 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి 2021లోనే టెండర్లు పిలవగా.. ఓ గుత్తేదారు 13.37 శాతం తక్కువకు దక్కించుకున్నారు. వైకాపా నాయకులు అనుకున్న వ్యక్తికి టెండర్ దక్కకపోవడంతో.. నాటి ఓ ప్రజాప్రతినిధి టెండరు రద్దు చేయించారు. ఆ స్థానంలో కాంక్రీట్ రక్షణ గోడ నిర్మాణానికి టెండర్లు పిలిచి.. తాము అనుకున్న వారికి అదనపు ధరకు పని దక్కేలా చర్యలు తీసుకున్నారు.

అమీబా భయం.. వైద్యశాఖ అప్రమత్తం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేరళలో అమీబా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటం.. పలువురు మృతి చెందారన్న వార్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వైద్య విభాగం దీనిపై హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఆదేశాలిచ్చింది. దాంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అయ్యప్ప మాలాధరులకు జాగ్రత్తలు తెలిపే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో అయ్యప్ప దీక్షధారులు రెండు లక్షలకుపైగా ఉంటారు. వీరంతా స్వామి దర్శనానికి వెళుతుంటారు. ఆ రాష్ట్రంలో పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు. కలుషిత నీటిలో స్నానం చేసే సమయంలో వైరస్ శ్వాసనాళంలోకి ప్రవేశించి వ్యాధికి కారణమవుతుందని చెబుతున్నారు. జ్వరం, వాంతులు, తల తిరగడం, తలనొప్పి, మానసిక గందరగోళానికి గురవడం, మూర్ఛ తదితర లక్షణాలు కనిపిస్తాయని, అత్యవసరంగా చికిత్స అవసరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లా వైద్య నిఘా విభాగం అధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. కేరళకు వెళ్లి వచ్చిన వారు అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు.

Ph: 0861 - 2322433

V.R.LAW COLLEGE

A.C. Subbareddy Buildings, Pogathota, Nellore-524001, A.P.
Recognized by Bar Council of India, New Delhi
Affiliated to Vikrama Simhapuri University, Nellore, A.P.

LL.B., Category-B (MANAGEMENT QUOTA)
Admission Notification 2025-26

All Eligible candidates (who passed Intermediate/Degree and/or qualified in LAWCET-2025) interested in applying for 3 Year LL.B / 5 Year B.A., LL.B. course under Category-B (Management Quota) according to the information given below may submit their application under Management Quota on 21-11-2025 only between 09:00 A.M to 02:00 PM. the application may be downloaded from the website at the following link:
https://vrlaw.college/app/admission

Course	Total Vacancies
3 Year LL.B	60
5 Year B.A.,LL.B	24

Note : The applicants should fill the online application and submit the printed application along with photocopies of the required documents in the V.R. Law College Office between 09:00 A.M to 02:00 PM on 21-11-2025

Sri MOGILI VENKATESWARLU, I.A.S.,
Joint Collector and Special Officer,
V.R. Colleges and High School Committee, Nellore.

వెలుగుల మాటున చీకట్లు

విద్యుత్తు సేవలపై ఐవీఆర్ఎస్ సర్వే

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్యుత్తు)

విద్యుత్తు వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సేవలు, సిబ్బంది పనితీరుపై సర్వే నిర్వహిస్తోంది. ఐవీఆర్ఎస్ ద్వారా వినియోగదారుల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకుని.. వచ్చిన సమాధానాల ఆధారంగా చర్యలు చేపడుతోంది. వాటి ఆధారంగా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలకు ఉపక్రమిస్తోంది.

15 మండలాల్లో తీవ్ర అసంతృప్తి

ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు నిర్వహించిన సర్వేలో.. జిల్లాలోని 15 మండలాల్లో సేవలు అధ్వానంగా ఉన్నట్లు తేలింది. దాంతో ఇటీవల ఏపీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్‌తో జరిగిన వీక్షణ సమీక్షలో.. సీఎండీ జిల్లాలోని పరిస్థితులను వివరించారు. నెల్లూరు గ్రామీణం, ముత్తుకూరు, ఉదయగిరి, సీతారామపురం, అల్లూరు, తోటపల్లిగూడూరు తదితర మండలాల్లో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు.



అడిగిన ప్రశ్నలు

ప్రశ్న	అందుతుంది	అందడం లేదు
? నిరంతరాయంగా సరఫరా జరుగుతుందా	72	28
? సరైన ఓల్టేజీ విద్యుత్తు అందుతోందా	69	31
? సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా	75	25

● అందుతుంది ● అందడం లేదు

చర్యలు తీసుకుంటున్నాం

సేవలు అందించడంలో వెనుకబడిన మండలాలపై దృష్టి సారించాం. సకాలంలో స్పందించని సిబ్బందిని గుర్తించి.. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. – కె.రాఘవేంద్రం, జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈ

ఒకరికి ఒకరై కష్టంలో తోడై

జిల్లాలో తొలి విడతలో నాలుగు జీఆర్సీ కేంద్రాలు

గుడ్లూరులోని జీఆర్సీ కేంద్రం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: అతివలు ఎదుర్కొనే వివిధ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్ల(జీఆర్సీ) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తొలి విడతగా నాలుగు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. స్వయం సహాయక సంఘాల సభ్యులే ఈ కేంద్రాలకు ప్రతినిధులుగా వ్యవహరించనున్నారు. తొలుత గుడ్లూరు. . తర్వాత కోవూరు, పొదలకూరు, వెంకటాచలంలో ప్రారంభం కానున్నాయి.

ఏర్పాటు ఇలా..

ప్రతి మండలంలో గ్రామ సమాఖ్యల నుంచి ఇద్దరి చొప్పున ఎంపిక చేసి.. గ్రామస్థాయిలో కమిటీలను నియమిస్తారు. వీటి నుంచి ముగ్గురు లేదా అయిదుగురితో మండల కమిటీని ఎంపిక చేస్తారు. వీరే జీఆర్సీ ప్రతినిధులుగా కొనసాగుతారు. మండల కమిటీ వారానికి ఒకసారి సమావేశమై గ్రామ కమిటీల ద్వారా గుర్తించిన బాధితుల ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యలపై దృష్టి సారిస్తుంది. తగు చేయూత అందిస్తుంది. అవసరమైతే బాధితులతో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం.. న్యాయవాదిని నియమించుకోవడం వంటి పనులను జీఆర్సీ ప్రతినిధులు చేయాల్సి ఉంటుంది.

రూ. 5 లక్షల కేటాయింపు

ఒక్కో కేంద్రం ఏర్పాటు.. నిర్వహణకు ప్రభుత్వం రూ. అయిదు లక్షలు విడుదల చేయనుంది. వెలుగు కార్యాలయాల్లో సరిపడా గదులు, సదుపాయాలు ఉంటే.. అక్కడే కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. లేదంటే అద్దెకు తీసుకుంటారు. ● దీనిపై డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి ఒక జీఆర్సీ కేంద్రం ఉండేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వీటి ద్వారా మహిళలు ఎదుర్కొనే సమస్యలపై సంఘటితంగా పోరాడేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

కీలక దారి.. ప్రమాదాల దరి

కోవూరు జాతీయ రహదారి ముఖద్వారం నుంచి ఇనమడుగు కూడలి వరకు రహదారిపై కొన్ని రోజుల నుంచి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోవూరు

రామతీర్థంలో లక్ష దీపోత్సవం

విడవలూరు మండలం రామతీర్థంలోని కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా లక్ష దీపోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆలయ ఛైర్మన్, తదితరులు పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, విడవలూరు

సేవల్లో జాప్యం.. రైతులకు దైన్యం..!

గత పాలనలో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించింది... ఆర్బీకేల ద్వారా అంతా బాగుందంటూ హడావుడి చేశారే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ శాఖలోనూ మార్పులకు శ్రీకారం చుట్టింది. కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, ఆత్మకూరు, నెల్లూరు గ్రామీణం నియోజకవర్గాల పరిధిలో సిబ్బంది కొన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉండడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మూసి ఉంటున్నాయి. సలహాలు సూచనలు అందించేలా చూడాలని రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, పొదలకూరు, విడవలూరు, తోటపల్లిగూడూరు, పొదలకూరు రూరల్, కలువాయి

ఇనుకుర్తిలోని పశువైద్యశాల భవనంలో ఆర్‌ఎస్‌కే

● పొదలకూరు మండలంలో 21 కేంద్రాలుండగా కేవలం 11 మాత్రమే పక్కా భవనాల్లో నడుస్తున్నాయి. చిట్టేపల్లి సమీపంలో నిర్మించిన భవనానికి తాళాలు తీయలేదు. ప్రభగిరిపట్నం, పొదలకూరు-1, 3 కేంద్రాల్లో పని చేయడం లేదు. ఇనుకుర్తి ప్రధాన రహదారిలోని ఉన్న పశువైద్యశాల భవనంలోనే అయిదేళ్లుగా ఆర్‌ఎస్‌కే నిర్వహిస్తున్నారు.

టి.పి.గూడూరు మండలంలో 12 కేంద్రాలున్నాయి. వెంకన్నపాలెంలో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. వసతులు సరిగా లేక సిబ్బంది కొరతతో ఇక్కడ అందుబాటులో ఉండడం లేదు. ఎరువులు తీసుకోవాలన్నా.. ఏదైనా సమస్య ఉన్నా పది కిలోమీటర్ల దూరంలోని సౌత్‌ఆములూరుకు వెళ్లాల్సి వస్తోంది. కియోస్క్ యంత్రాలు మూలన పడేశారు. సిబ్బంది కొరతతో కేంద్రాలకు తలుపులు వేసి ఉండడంతో రైతులు వెనుదిరుగుతున్నారు.

వెంకన్నపాలెంలో అద్దె భవనంలో..

● కోవూరు మండలంలో ఎనిమిది కేంద్రాలు ఉండగా అవి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు పూర్తికాలేదు. విడవలూరు మండలంలో 13 రైతు సేవా కేంద్రాలు ఉండగా తుమ్మగుంటలో మాత్రమే సొంత భవనంలో ఉంది. కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు. గ్రామాల్లో సచివాలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో కొన్ని నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల వర్షాకాలంలో ఉరుస్తున్నాయి, విద్యుత్తు సరఫరా, మరుగుదొడ్లు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. పార్లపల్లి ఆర్‌ఎస్‌కే అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.

● జిల్లాకు మారుమూల ప్రాంతాలైన రాపూరు, సైదాపురం మండలాల్లో కేంద్రాల నిర్వహణ అధ్వానంగా ఉంది. కలిచేడు, తురిమెర్ల, చాగణం, గిద్దలూరు, ఊటుకూరు, చీకవోలు, తెగచర్ల, గోనుపల్లె, పెనుబర్తి, గిలకపాడు, పంగిలి గ్రామాల్లోని కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిత్యం గూడూరు, నెల్లూరు నుంచి వస్తూ సరిగా తీయడం లేదు. కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి పరిధిలో రైతులు యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. ఒక లోడ్ మాత్రమే రావడంతో సరిపోలేదని అన్నదాతలు చెబుతున్నారు. ఏవో కళారాణి మాట్లాడుతూ త్వరలో మిగతావారికి అందజేస్తామన్నారు.

పునరావాసానికి సరే.. భూముల వరకైతే ఇవ్వం

చెన్నాయపాలెం వాసులు

కావలి, న్యూస్‌టుడే: తమ ఇళ్లను ఇక్కడే ఉంచి భూముల వరకే సేకరిస్తామంటే ఒప్పుకోనేది లేదని కావలి మండలం చెన్నాయపాలెం గ్రామ రైతులు స్పష్టం చేశారు. పునరావాస ప్రాంతానికి తరలించే ప్యాకేజీకి అయితే సహకరిస్తామన్నారు. బుధవారం జిల్లా సంయుక్త కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు గ్రామంలో భూసేకరణపై నిర్వహించిన సభలో తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఎకరాకు రూ.20 లక్షల ధర అంటే ఎట్టి పరిస్థితుల్లోనూ గిట్టుబాటు కాదన్నారు. బీపీసీఎల్ కంపెనీ వచ్చాక తాము స్థానికంగా నివసించాలంటే కష్టతరమన్నారు. ముందుగానే పునరావాస విధానంలోకి తమ గ్రామాన్ని మార్చాలంటూ డిమాండ్ చేశారు. అందరూ పంటలసాగుతోపాటు సముద్రంలో చేపలవేటకు వెళుతున్నారన్నారు. ఆ కంపెనీ వచ్చాక ఉపాధికి గండిపడుతుందన్నారు. తమ భూములు సేకరించకుండానే గోడ నిర్మించేందుకు సదరు కంపెనీ ప్రణాళిక రూపొందించుకోవడాన్ని ఉద్దేశించి తప్పుబట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సమావేశంలో ఏపీ మారిటైంబోర్డు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎన్.రాజశేఖర్, ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, గ్రామ నాయకులు ప్రసాద్‌యాదవ్, శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలో జేసీ తదితరులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గణిత ఉపాధ్యాయుడు

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రామాయపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు కేదరి కొండలరావు యోగా పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ నెల 12 నుంచి నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రథమ స్థానం సాధించడంతో విజయవాడలో గురువారం నుంచి జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, గ్రామస్థులు అభినందించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.11,835
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.94,680
వెండి గ్రాము :	రూ.165.80

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	126
లేయర్	125
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	252
లేయర్ మాంసం	212

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకొని, కష్టపడి చదవడంతో పాటు, క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగాలని వీసీ అల్లం శ్రీనివాసరావు సూచించారు. వీఎస్‌యూలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ... కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సంస్కారవంతమైన ప్రవర్తన అలవరచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వీసీ, ఆచార్యులు

● వెస్ట్‌జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ముందస్తు రిపబ్లిక్ డే పరేడ్ శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు స్నేహ భవాని, చంద్రిక, యుగంధర్ రెడ్డిలను వీసీ అభినందించారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా స్ఫూర్తి, ఐకమత్యం వంటి విలువలు పెంపొందిస్తాయని వీసీ తెలిపారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలకు పరిపాలనా కార్యాలయం: డి.నెం.3-6-478,4వ అంతస్తు, ఆనంద్ ఎస్టేట్ లిబర్టీ రోడ్డు, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029, వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము : డి.నెం. 14/16, 1వ అంతస్తు, ఐసిఎస్ రోడ్డు, గూడూరు, తిరుపతి జిల్లా - 524101

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పుసకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ సందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది. బ్రాంచ్ కార్యాలయము: గూడూరు**

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌ఎఫ్‌ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌ఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) **కవిత గొట్టిపాటి** తండ్రి ప్రసాద్, డి.నెం.27/5/143, బాలాజి నగర్, ఎన్.టి.ఆర్.నగర్, నెల్లూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా - 524002
2) **గొట్టిపాటి చంద్రకళ** భర్త ప్రసాద్, డి.నెం.27/5/143, బాలాజి నగర్, ఎన్.టి.ఆర్.నగర్, నెల్లూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా - 524002
3) **మాలేపాటి శాంతి,** భర్త వెంకటరామానాయుడు, డి.నెం.27-2-875, మిల్క్‌బూత్ సెంటర్, ఎం.వి.ఆర్. మ్యాచింగ్ సెంటర్, బాలాజి నగర్, నెల్లూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఎన్‌పిఏ తేది: **31.12.2020** డిమాండ్ నోటీసు తేది: **16.10.2025**
ఋణ మొత్తం రూ.6,00,000 (ఆరు లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: **GUDRBTF1905140013**
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.20,92,772/- (ఇరవై లక్షల తొంభై రెండు వేల ఏడు వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

గొట్టిపాటి కవిత తండ్రి ప్రసాద్ పేరున పత్రం నెం. **2416/2019, తేది: 11.06.2019** ప్రకారం **ఆస్తి వివరములు:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి సబ్ జిల్లా, కావలి మండలం, ముసునూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామలెక్కదాఖలా రైల్వే ట్రాక్‌కు పడమర వైపు, కోదండరామ నగర్ లేఔట్, సర్వేనెం.783లోని ప్లాటు నెం.27 యొక్క విస్తీర్ణం 30 1/2 అంకణములు, లేదా 244 చ.గ. లేదా 203 చ.మీ. హద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: ప్లాటునెం.26 స్థలం, ఉత్తరం: ప్లాటు నెం.28 స్థలం, దక్షిణం: రోడ్డు. ఈ హద్దుల మధ్య స్థలం యొక్క విస్తీర్ణం 30 1/2 అంకణములు లేదా 244 చ.గ. లేదా 203 చ.మీ., దారి హక్కు మరియు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియ జేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం:గూడూరు

సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

క్రికెటోత్సవానికి వేళాయె...

దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: RAO'S EDUCATIONAL INSTITUTIONS
TV Partner: ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
Organised by: ఈనాడు ఉత్సాహం క్లబ్

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్ల లోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు యూనిట్ కార్యాలయం, చెముడుగుంట గ్రామం, వెంకటాచలం మండలం, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా.
వివరాలకు: 91549 90998
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

రంగనాథస్వామి ఆలయ కమిటీ సభ్యుల రాజీనామా

నెల్లూరు(బారకాసు), న్యూస్‌టుడే: నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం ప్రస్తుత కమిటీలోని తొమ్మిదిమంది సభ్యులు రాజీనామా సమర్పించారు. వీటిని తక్షణం ఆమోదించాలని రాష్ట్ర అధికారులు ఆదేశాలివ్వగా.. వెంటనే ఆమోదించారు. డిసెంబరు 22వరకు పదవీకాలం ఉన్నప్పటికీ ముందుగానే రాజీనామాలు సమర్పించారు.

ఇంటర్ పరీక్షలకు 54 వేల మంది సిద్ధం

సంగం: జిల్లా వ్యాప్తంగా 54 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమవుతున్నారని ఆర్‌ఐవో వరప్రసాద్ బుధవారం తెలిపారు. సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్, బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థుల తరగతులు పరిశీలించారు. అనంతరం ఆర్‌ఐవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. పరీక్షలకు అవసరమైన కేంద్రాల ఎంపిక, పరిశీలన చేసే క్రమంలో జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తున్నామన్నారు. ప్రధానాచార్యులు సుమతి, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌ఐవో వరప్రసాద్

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి సుజాత

అనంతసాగరం, న్యూస్‌టుడే: వైద్యసేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా వైద్యాధికారిణి సుజాత అన్నారు. అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాల పరిధిలోని గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలోని వ్యాధి నిరోధక టీకాల విభాగాన్ని క్షుణ్నంగా తనిఖీ చేసి ఐఎల్ఆర్ రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎల్సీడీసీ సర్వేలో ప్రతి కుటుంబానికి ఒకరి చొప్పున పాల్గొనేలా చూడాలని సూచించారు. వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, అశోక్, శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొదలకూరు-రాపూరు మార్గంలో రాకపోకల పునరుద్ధరణ

పొదలకూరు: పొదలకూరు మండలం దుగ్గంటరాజుపాళెం సమీపంలో మంగళవారం సాయంత్రం కూలిన కల్వర్టును యుద్ధ ప్రాతిపదికన ర.భ శాఖ అధికారులు పనులు చేపట్టారు. బుధవారం ఉదయం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కల్వర్టు కూలడంతో పొదలకూరు నుంచి రాపూరు, రాజంపేట వైపు వెళ్లాల్సిన వాహనాలను డేగపూడి క్రాస్ రోడ్డునుంచి సైదాపురం మీదుగా రాపూరు వైపు మళ్లించారు. రాపూరు, రాజంపేట వైపునుంచి నెల్లూరుకు రావాల్సిన వాహనాలు కండలేరు డ్యాం రోడ్డు మీదుగా ఆదూరుపల్లి, పొదలకూరుకు వచ్చి నెల్లూరు వైపు వెళ్లాయి. ఆర్అండ్‌బి ఎస్ఈ రామకృష్ణప్రసాద్ పైపులు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. ఈఈ వేణుగోపాల్ మాట్లాడుతూ కల్వర్టు నిర్మించేందుకు రూ.28 లక్షలు, డైవర్షన్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విషయం తెలుసుకొని ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులులేకుండా చూడాలని సూచించారు.

పూర్తయిన రోడ్డు పనులు

సీబీఐతో దర్యాప్తు చేయించాలి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: తితిదే పరకామణి కేసులో పని చేసిన ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మోచెర్ల మధు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి వెనుక ఒత్తిడి, బెదిరింపులు, మానసిక వేధింపులు ఉన్నాయా అనే కోణంలో విచారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సుందరరాజు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా.. సేవలు మెండుగా

న్యూస్‌టుడే, టి.పి.గూడూరు, బుచ్చి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో గుర్తించలేని వైకల్యాలను గుర్తించడానికి ఎన్‌సీఈఆర్టీ 'ప్రశస్త్' పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించింది.. శారీరక, మానసిక వైకల్యం ఉన్నవారి గురించి సులువుగా తెలుసుకోవచ్చు.. పలు రకాల వైకల్యాలు ఎదుర్కొంటున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. వీరిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరముంది.

ఏదైనా అనుమానిత వైకల్యాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఉపాధ్యాయులదే బాధ్యత

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను పార్ట్-1లో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పేరు, సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అయ్యాక నమోదు చేయాలి. లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులను పార్ట్-2 కింద ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే వారు పరిశీలిస్తారు.

గుర్తిస్తారిలా..

వైకల్యాలున్న పిల్లలను ధ్రువీకరించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యం మెరుగుపరచడం, అశాస్త్రీయ నిర్ధారణ, లేబులింగ్ నుంచి రక్షణ, పిల్లల పరిస్థితి గురించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థుల సమగ్ర విద్యను ప్రోత్సహించడం దీని లక్ష్యంగా చెబుతున్నారు. విద్యార్థుల్లో వినడం, చదవడం, మాట్లాడటం, శబ్ద గ్రహణంతో పాటు చెప్పిన దాన్ని పదేపదే చెప్పమనడం, రోజువారి పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టత లేని చేతిరాత, రివర్స్‌గా రాయడం,

జిల్లాలో భవిత కేంద్రాలు	38
ఉపాధ్యాయులు	74
ఫిజియోథెరపీ వైద్యులు	7
నమోదైన విద్యార్థులు	719
విభిన్న ప్రతిభావంతులు	3367

విద్యార్థుల మానసిక, శారీరక సమస్యలు సులువుగా గుర్తింపు

గణితం చిహ్నాలు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడడం, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తిగా లేకపోవడం, చూపు ఎలా ఉంది, రంగులు గుర్తిస్తున్నారా, నల్లబల్ల సరిగా కనిపిస్తుందా తదితర అంశాలకు సంబంధించి ప్రశ్నలు సర్వేలో ఉంటాయి. విద్యార్థుల్లో ముందుగానే గుర్తించి అవసరమైన చికిత్స అందించనున్నారు.

● సహిత విద్య జిల్లా సమన్వయకర్త **ప్రసాద్‌రావు** మాట్లాడుతూ.. ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వంద శాతం నమోదు చేసేలా చూసామన్నారు. వీటిని ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యాశాఖ సూచించిన ప్రశ్నల ఆధారంగా విద్యార్థుల వైకల్యాలను నమోదు చేయాలని పేర్కొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

Ready to Occupy FLATS FOR SALE
నెల్లూరు చిల్డ్రన్స్‌పార్క్ రోడ్ సాయిబాబా గుడి ఎదురు వీధిలో 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు.
91777 51401
99892 92211

నెల్లూరు జిల్లాలో ప్రముఖ ఫైనాన్స్ నందు పనిచేయడానికి కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (పు), టెలికాలర్ కావలెను (స్త్రీ), Address: B.V.నగర్. ✆ 7997997080

రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో 9.30-2pm వరకు ఒకరు,10-6.30 వరకు పనిచేయుటకు ఇద్దరు, కొంత కంప్యూటర్ నాలెడ్జ్ గల స్త్రీలు కావలెను. ✆ 7207000444

FACULTY/ TEACHERS

A Well Known Coaching Centre at B.V.Nagar Requires Teachers for Study Hour-1(Morning), Math-1 & Biology-1. ✆ 99599 22164

JOBS

వింజమూరు జి-డిజిటల్ షోరూంలో పనిచేయుటకు Sales స్టాఫ్ కావలెను Male, Age 19-35 Yrs, Qly-Inter/డిగ్రీ, వింజమూరు, Ph-97058 26033

Spices Company నందు పనిచేయుటకు అనుభవం కల్గిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను, అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు. Cell: 97049 48491

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్నంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కావలి
• కావలి • ఉదయగిరి • కందుకూరు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పతకాలు సాధించిన క్రీడాకారులు

కందుకూరు పట్టణం: కాకినాడలో ఈనెల 15, 16 తేదీల్లో ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారని మాస్టర్ ఎస్.కె.అబ్దుల్‌సలాం తెలిపారు. బాల, బాలికల విభాగంలో కాంస్య పతకాలు, క్యాడెట్ విభాగంలో రజత పతకాలు సాధించారని తెలిపారు. త్వరలో పంజాబ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

కందుకూరు పట్టణం: కందుకూరు కోర్టు భవనాల సముదాయంలో డిసెంబరు 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని సీనియర్‌సివిల్‌జడ్జి ఎం.శోభ తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో రెవెన్యూ, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్, పోలీసు అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: కావలి పట్టణంలోని మహేంద్ర లేఅవుట్, జేబీ కళాశాల సిబ్బంది నివాసాల వద్ద పందుల బెడద అధికంగా ఉంది. – శ్రీరామ్
సమాధానం: సమస్య మా దృష్టికి రాలేదు. చర్యలు తీసుకుంటాం. – శ్రావణ్‌కుమార్, కమిషనర్, పురపాలకం – న్యూస్‌టుడే, కావలి

? కంపచెట్లు ఏపుగా పెరగడంతో పొట్టిపల్లి నుంచి ఇస్కుదామెర్లకు వెళ్లే పంచాయతీ రోడ్డుపై రాకపోకలు చేయాలంటే అవస్థలు పడుతున్నాం. – రాజేష్, గ్రామస్థుడు
✓ సంబంధిత అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తాం. – శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో – న్యూస్‌టుడే, కొండాపురం

? దుత్తలూరు పంచాయతీ లక్ష్మీపురంలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుని మురుగు ముందుకు కదలడం లేదు. – జమీర్, స్థానికుడు
✓ సిబ్బందికి తెలిపి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. – నజీముల్లా, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, దుత్తలూరు

? పట్టణంలోని ట్రంకురోడ్డులోవాహనాల రద్దీతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. – ఈశ్వరయ్య
✓ ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తాం. – జమాల్‌వలీ, ఎస్సై, కావలి

?ఉలవపాడులోని కొత్తరైల్వే రోడ్డులో మురుగు కాలువలో నీరు పేరుకుపోయింది. – శ్రీకాంత్
✓ పారిశుద్ధ్య సిబ్బందికి తెలిపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాను. –వీరయ్య, పంచాయతీ కార్యదర్శి– న్యూస్‌టుడే, ఉలవపాడు

? కావలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రైవేట్‌సర్వీసుల్నినిలుపుతున్నారు. ఇబ్బందులు ఎదురవుతున్నాయి.–చంద్రకుమార్
✓ ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటాం. – జమాల్‌వలీ, ఎస్సై – న్యూస్‌టుడే, కావలి

? కావలి రవాణాశాఖ అధికారి కార్యాలయంలో సజావుగా దరఖాస్తు చేసుకున్నా, జాప్యం చేస్తున్నారు. –టంకాల సురేష్, ట్రంకురోడ్డు
✓ఈ విషయం నా దృష్టికి రాలేదు. దరఖాస్తుదారు పత్రాలన్నీ తీసుకుని నన్ను సంప్రదించవచ్చు. ఆలస్యం లేకుండా పరిష్కరిస్తాం.
– టి.సుందరరావు, ఆర్టీవో – న్యూస్‌టుడే, కావలి

ఉపన్యాసంలో మెప్పించి.. బహుమతి సాధించి

కావలి, కందుకూరు పట్టణాల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో పలు కళాశాలలు, పాఠశాలలో బుధవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు', పాఠశాల బాలబాలికలకు.. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోను ప్రభావం' అనే అంశాలపై ఉపన్యాస పోటీలు జరిగాయి. – న్యూస్‌టుడే, కావలి, కందుకూరు

కందుకూరు పట్టణంలోని కందుకూరి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎ.వైశాలి, జి.మహేశ్వరి, పి.జశ్వంత్ విజేతలుగా నిలవగా.. పాఠశాల హెచ్‌ఎం డి.బాలబ్రహ్మం, కరస్పాండెంట్ పి.వేణుగోపాల్, డీన్ టి.పద్మావతి బహుమతులు అందజేశారు.

బహుమతులిస్తున్న కందుకూరి పబ్లిక్ పాఠశాల ఉపాధ్యాయులు

బహుమతులిస్తున్న ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల అధ్యాపకులు

కందుకూరు పట్టణంలో ఉన్న బీఆర్.ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాలలో పోటీలు నిర్వహించగా.. ఎం.శ్రీనిధి, పి.శ్రావ్య, కె.దీక్షిత విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల డైరెక్టర్ బి.నరేంద్ర, ప్రిన్సిపల్ ఇర్ఫాన్, డీన్ షాహుల్ బహుమతులు అందజేశారు.

పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా ఎస్.చందన, బి.దినహ్, ఎస్.వర్షితలు నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కే.కోటేశ్వరరావు బహుమతులు అందజేశారు.

కావలి శ్రీనివాస జూనియర్ కళాశాలలో బహుమతులు పంపిణీ

కావలి స్నేహ కళాశాలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు

కావలి పట్టణంలోని స్నేహ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా కె.భవ్యశ్రీ, పి.అఖిల, యూ.వెంకయ్యలు నిలిచారు. వారికి ప్రిన్సిపల్ తిరుపతి బహుమతులు పంపిణీ చేశారు.

వసూళ్లలో నిర్లక్ష్యం.. రుణాలందక సతమతం

న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

వలేటివారిపాలెం మండల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు 'స్త్రీ నిధి' రుణాలను అందుకోలేకపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో మూడేళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.

మండలంలో 21 పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 1098 పొదుపు సంఘాల్లో 10,949 మంది సభ్యులు ఉన్నారు. నాలుగు క్లస్టర్లు(అంకభూపాలపురం, వలేటివారిపాలెం, పోకూరు, శింగమనేనిపల్లె)గా విభజించగా మొత్తం 31 గ్రామసంఘాలు ఉన్నాయి. 2022వరకు స్త్రీనిధి రుణాలు అందాయి. పలు గ్రామాల్లో సభ్యులు రుణాలు పొంది తిరిగి చెల్లించలేదు.

ఆ పథకాలకు దూరం

గ్రామ సంఘాల ద్వారా సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలకు 11శాతం వడ్డీతో మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంది. దీనికి అర్హత సాధిస్తే ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాల కింద కేవలం నాలుగు శాతం వడ్డీకి పిల్లల చదువుకు, వివాహాల నిమిత్తం రూ.లక్ష వరకు రుణం పొందేందుకు అవకాశాలుంటాయి.

రూ.47 లక్షల మేర బకాయిలు

31 గ్రామ సంఘాల్లో.. 12 సంఘాల పరిధిలో సుమారు రూ.47లక్షలు మేర బకాయిలు పేరుకుపోయాయి. సభ్యులు తీసుకున్న రుణాలు కట్టించేందుకు గ్రామస్థాయిలో వీవోఏలు, ఆపై క్లస్టర్, మండలస్థాయిలో సీసీలు, ఏపీఎంలు బాధ్యత తీసుకోవాల్సి ఉంది. వారు రికవరీ చేయడంలో నిర్లక్ష్యంగా ఉండడంతో మూడేళ్లుగా మిగిలిన సభ్యులు పథకానికి దూరమయ్యారు.

ఆరు శాతమే రికవరీ

స్త్రీనిధికి తిరిగి అర్హత సాధించాలంటే సంఘాలు తీసుకున్న నగదులో 75 శాతం చెల్లించాల్సి ఉంది. కానీ వీవోఏలు గతంలో ఆ దిశగా కృషి చేయలేదు. దీంతో మండలస్థాయిలో రికవరీ కేవలం ఆరు శాతమే ఉండడంతో జిల్లా సమైక్య అధికారులు మూడేళ్లుగా ఈ రుణాలను మండలానికి కేటాయించడం లేదు. దీంతో మిగిలిన పొదుపు సంఘం మహిళలు సతమతవుతున్నారు. అధికారులు స్పందించి స్త్రీనిధి ద్వారా నగదు అందించాలని వారు కోరుతున్నారు. మరోపక్క సభ్యులలో పలువురు గ్రామాల్లో లేకపోవడంతో ఎవరి నుంచి రాబట్టాలో తెలియడం లేదని కొత్తగా విధుల్లోకి చేరిన వీవోఏలు అంటున్నారు.

చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి

రాజు, ప్రాంతీయ స్త్రీనిధి మేనేజరు, కందుకూరు

స్త్రీనిధి రుణాలకు సంబంధించి వాయిదాలను సకాలంలో చెల్లించకపోవడం వల్ల వడ్డీ భారంగా మారుతోంది. రుణాలు పొందిన మహిళలకు అవగాహన కల్పించి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంను సూచించాం. రికవరీ 75శాతం ఉంటేనే మండలానికి అర్హత వస్తుంది.

అధికారుల తీరుపై ఎంపీపీ అసంతృప్తి

లింగసముద్రం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కాకపోవడంపై ఎంపీపీ పెన్నా శ్రీనివాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణలపై అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ●

దుత్తలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు బుధవారం పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించగా 17 పంచాయతీల నుంచి సర్పంచులు ఉప సర్పంచులు 34 మంది శిక్షణకు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఏడు మంది సర్పంచులు మాత్రమే హాజరవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ

వలేటివారిపాలెం: విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు పోకూరు గ్రామ సచివాలయ కార్యదర్శికి మెమో జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో వై.శంకరరావు తెలిపారు. బుధవారం పోకూరు గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరు కాకపోవడాన్ని గుర్తించి మెమో జారీకి చర్యలు తీసుకున్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిణి డిప్యుటేషన్‌పై బదిలీ

సీతారామపురం: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణిగా పని చేస్తున్న స్వప్న డిప్యుటేషన్‌పై మహిమలూరు పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఇటీవల గుండెపోటుకు గురైన మారుబోయిన వెంకటరమణ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు అందుబాటులో లేక ఆయన మృతిచెందారు. ఈమేరకు 'ఈనాడు'లో వైద్యుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో వైద్యాధికారిణిని బదిలీ చేశారు. అనంతసాగరం మండలం బొమ్మవరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్ర ఇక్కడ నియమితులయ్యారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పూజల్లో పాల్గొన్న భక్తులు

దగదర్తి, న్యూస్‌టుడే: దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పితృతర్పణాలు, రామలింగేశ్వరుని మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దుర్గాభవాని అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కావలి: పాతూరు శివాలయంలోని కోనేరులో మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. పట్టణంలోని వెంగళరావునగర్, చెరువుకట్ట, ముసునూరు, కస్పాపురం, మేళ్ల ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

కొండాపురం: భీమవరప్పాడులో కృష్ణ మందిరం మూడో వార్షికోత్సవం సందర్భంగా విడవలూరి వెంకయ్య ఆధ్వర్యంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కావలి: కోనేరులో కార్తిక దీపాలు వదులుతున్న మహిళలు

తెదేపా కార్యకర్తకు బీమా అందజేత

సీతారామపురం: గుండుపల్లికి చెందిన తెదేపా కార్యకర్త నల్లమేకల వెంగయ్య ఇటీవల మృతిచెందారు. ఆయన భార్య రమణమ్మకు బుధవారం తెదేపా నాయకులు పార్టీ తరఫున రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. నాయకులు సుమన్, వికాస్‌బాబు పాల్గొన్నారు.

స్తంభం శిథిలం.. కూలితే విషాదం

యర్రబల్లిపాలెంలోని పోలేరమ్మతల్లి ఆలయ సమీపంలో విద్యుత్తు స్తంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉంది. అడుగు భాగంలో పూర్తిగా దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. సమీప గృహాల వారు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. డిస్కం ఏఈ నాగూర్‌వలి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
–న్యూస్‌టుడే,వింజమూరు

ఇసుక కొరత.. పెరిగిన ధర

ఇటీవల వర్షాలు కురవటంతో మన్నేరు, ఉప్పుటేర్లలో వరదనీరు రావటంతో ఇసుక కొరత నెలకొంది. ప్రధానంగా కందుకూరు మండలంలోని మాచవరం, దొండపాడు, గుడ్లూరు మండలంలోని గుండ్లపాలెం, లింగసముద్రం మండలంలోని విఆర్‌కోట సమీపంలోని మన్నేరులో ఇసుక అందుబాటులో ఉండగా గతంలో ఒక ట్రక్కు ఇసుక రూ.1200 ఉండేది. ప్రస్తుతం రూ.2వేలకు పైగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కందుకూరు

బిల్లులు రాక.. నిర్మాణం కాక

మండలంలోని చెన్నాయపాలెం గ్రామ సచివాలయానికి చెందిన మరుగుదొడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. సకాలంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు ఆపేశారు. దాంతో నిరుపయోగంగా మారాయి. అధికారులకు సంబంధించిన నిర్మాణాలూ.. అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో చేవూరి శ్రీదేవి మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగానైనా పూర్తి చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కావలి

రోడ్డు ధ్వంసం.. ఆదమరిస్తే ప్రమాదం

బోగోలు పెద్దపంచాయతీ రాజావీధిలో రోడ్డు ధ్వంసమై అధ్వానంగా ఉంది. ఇరుకు రహదారి కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో పంచాయతీ, బ్యాంకు కార్యాలయం, పాఠశాల ఉంది. నిత్యం రద్దీగా ఉంటుంది. ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, బిట్రగుంట

త్వరలో గేటుకు మరమ్మతులు

చైన్లను పరిశీలిస్తున్న ఎస్ఈ వరలక్ష్మి

లింగసముద్రం, న్యూస్‌టుడే: త్వరలో కొత్త స్పిల్‌వేలోని అయిదో నంబరు గేటుకు మరమ్మతులు చేయిస్తామని జలవనరులశాఖ ఎస్ఈ వరలక్ష్మి అన్నారు. బుధవారం రాళ్లపాడు జలాశయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ప్రాజెక్టులో నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం చైన్ల ఆపరేటింగ్ తీసుకొన్న చర్యలను గురించి ప్రాజెక్టు అధికారులు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 15 మంది డీఈలకు ప్రాజెక్టు డిజైన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సన్నద్ధతతో ఉత్తమ ఫలితాలు

ఉదయగిరి: వచ్చే ఏడాది జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్, ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా ఇంటర్ విద్య వృత్తి విద్యాశాఖాధికారి బి.వి.కృష్ణారెడ్డి, జిల్లా అకడమిక్ గైడెన్స్ మానిటరింగ్ ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు విశ్వనాథరావుపేటలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల దృష్ట్యా గురువారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డిస్కం ఏఈ జడరాయ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అరవపాళెం, విశ్వనాథరావుపేట, ఇబ్రహీంపేట, బేతనీపేట, రామస్వామిపాళెం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వివరించారు.

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సీటీఆర్ఐ-కేవీకేలో పీఎంకిసాన్- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడతకు సంబంధించి జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మెగా చెక్కును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో 32వేల మంది రైతులకు రూ.21.46కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. వీధివ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా స్మార్ట్ బజారు ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలోని కోటారెడ్డినగర్ కూడలి నుంచి ఓవీ రోడ్డు వరకు రూ.75లక్షలతో ప్రతిపాదించిన వరద నీటి కాలువ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కావలి: నియోజకవర్గ పరిధిలో రెండోవిడతలో భాగంగా రూ.11.93 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయని కావలి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. కలిగిరి: రైతు శ్రేయస్సే లక్ష్యంగా వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. వెలగపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 45,275 మంది రైతులకు రెండో విడత కింద రూ.31.69 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు.

మెగా చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కావలిలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్, తదితరులు.. చెక్కును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

ఉదయగిరి, న్యూస్‌టుడే: మద్యం తాగిన యువకుడు మంగళవారం రాత్రి ఆటో తీసుకుని హల్‌చల్ చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా పూటుగా మద్యం తాగి వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఉన్న మెకానిక్ షెడ్ దగ్గర నిలిపి ఉన్న ఆటో వాహనాన్ని నడుపుతూ 167-బీజీ జాతీయ రహదారిపై సీతారామపురం మార్గం వైపు వెళ్లి తిరిగి ఆర్టీసీ డిపో మీదుగా పట్టణంలోకి ప్రవేశించాడు. శివాలయం వద్ద అయ్యప్ప మాలధారులు ఊరేగింపుగా వెళ్తుండగా. . వారిపైకి దూసుకెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ నిలిపి ఉన్న కారును ఢీకొట్టడంతో అప్రమత్తమైన వారు పక్కకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. తిరిగి సమీపంలో ఉన్న డీజే వాహనాన్ని ఢీకొట్టాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి మహబూబ్‌బాషాను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గేదెను ఢీకొని ఒకరికి గాయాలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: గేదెను ఢీకొని ద్విచక్రవాహనదారునికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి ఉదయగిరి- సీతారామపురం మార్గంలో 167బీజీ రహదారిపై జరిగింది. స్థానికుల వివరాల మేరకు పట్టణానికి చెందిన మైదుకూరు శ్రీనివాసులు పనినిమిత్తం వైఎస్సార్ కడప జిల్లా కృష్ణంపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. గడ్డంవారిపల్లి- సర్వరాబాదు గ్రామాల మధ్య అకస్మాత్తుగా గేదె అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడ్డారు. ఆయన తలకు తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ వీధికి చెందిన యువతి అదృశ్యమైందని బుధవారం తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. వారి కథనం మేరకు ఈ నెల 13వ తేదీన బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద విచారించారు. ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడి

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని టెంకాయచెట్లపాలెంలో బుధవారం జూద స్థావరం నిర్వహిస్తుండగా దాడి చేసి ముగ్గురును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.68,350నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఫోర్జరీ కేసులో నలుగురి అరెస్ట్

ఈనాడు నల్గొండ, న్యూస్‌టుడే, చౌటుప్పల్‌గ్రామీణం: భూమిని పొందేందుకు ఫోర్జరీకి పాల్పడిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్ బుధవారం వెల్లడించారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో సర్వేనం. 42లో తెల్లపాటి భూషయ్య పేరిట 3.05 ఎకరాల భూమి ఉంది. దీన్ని కాజేయాలని భారాస మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్‌గౌడ్.. వరికుంటపాడు మండలం గువ్వాడికి చెందిన భోగినేని మోహన్‌రావుతో కలిసి కుట్ర పన్నారు. భూషయ్య సాదాబైనామా కింద 1994లో మోహన్‌రావుకు విక్రయించినట్లు పత్రాలు సృష్టించి పట్టా పొందారు. 2022లో నిరంజన్‌గౌడ్ తనపేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. స్థానికుడైన పక్కీరు ప్రభాకర్‌రెడ్డి... రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేపట్టారు. అక్రమ పద్ధతిలో భూమిని పొందినట్లు తేల్చారు. ప్రస్తుత తహసీల్దార్ వీరాబాయి ఫిర్యాదు చేయడంతో మోహన్‌రావు, నిరంజన్‌గౌడ్, రెవెన్యూ అధికారి రాజేశ్, అత్తాపురం నరేందర్‌రెడ్డిలను అరెస్టు చేసికోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రైలు నుంచి పడి.. యానాం వాసి దుర్మరణం

బిట్రగుంట, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జంక్షన్ నుంచి కాకినాడ పోర్టు వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి రన్నింగ్‌లో దిగుతుండగా అదే రైలు కింద పడి యానాంకు చెందిన నూకరాజు(50) దుర్మరణం చెందారు. బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. సేకరించిన సమాచారం మేరకు వివరాలు ఇలా.. యానాంకు చెందిన నూకరాజు ఆరుగుర్ని వైద్యపరీక్షల నిమిత్తం చెన్నైకి తీసుకువెళ్లారు. స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు చెన్నైలో సర్కారు ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. స్లీపర్ బోగీలో ఉన్న నూకరాజు జనరల్ బోగీలో ఉన్న తనతో వచ్చిన వారి వద్దకు వెళ్లేందుకు రైలు ఆగకముందే బిట్రగుంటలో దిగారు. ఆకస్మికంగా రైలు చక్రాల కింద పడి తల, చెయ్యి తెగిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. రైల్వే రక్షకదళం, ట్రాఫిక్ విభాగానికి చెందిన సిబ్బంది మృతదేహాన్ని ప్లాట్‌ఫారం మీదకు చేర్చారు. కావలి జీఆర్పీ ఎస్సై వెంకట్రావు సిబ్బంది పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

GENERAL NOTICE

నా క్లయింట్ అయిన సందిరెడ్డి హరిశ్చంద్ర ప్రసాద్ S/o వేణుగోపాల చౌదరి, దక్కనూరు గ్రామం, వరికుంటపాడు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాస్తవ్యులు యావన్మందికి తెలుపుకోవడము ఏమనగా:- తేది 12-11-2025న అతను దక్కనూరు నుండి వరికుంటపాడుకు వెళ్తున్న సందర్భమున ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 13325/2023 మంగళగిరి సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీస్‌కు సంబంధించిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన దస్తావేజును మోటారు సైకిల్‌లో పోవుచుండగా పోగొట్టుకున్నారు. తదుపరి వెంటనే మీసేవ ద్వారా పోలీస్‌స్టేషన్ వరికుంటపాడు వారికి సమాచారము ఇవ్వడము జరిగింది. సదరు నా క్లయింట్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో మాకు గానీ లేక సదరు పోలీస్‌స్టేషన్ వారికి గానీ అందచేయవలసినదిగా కోరడమైనది.

కల్లూరి తిరుపతయ్య, M.A., M.Ed., M.Phil., L.L.B., Advocate, Pamuru - 523108, Prakasam (Dist.) Cell: 98491 62421, 94404 83426, 9440056035

దేశ నిర్మాణంలో యువతదే కీలకపాత్ర

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థినులు

బిట్రగుంట, న్యూస్‌టుడే: దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి అన్నారు. బుధవారం బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల(+2)లో జాతీయ సమైక్యతా దినోత్సం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఝాన్సీ లక్ష్మీబాయ్, ఇందిరాగాంధీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వంటి ఎందరో మహిళలు దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జి.గంగాధర్, ఎన్జీవో ప్రతినిధి శైలజ, ఏపీఎంఎస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దారులు అధ్వానం.. రాకపోకలకు సంకటం

న్యూస్‌టుడే, లింగసముద్రం

అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడి, రాళ్లు తేలి ప్రమాదాలకు కారకాలుగా నిలుస్తున్నాయి. మరోపక్క పరిసర ప్రాంతాల ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తోంది. లింగసముద్రం, అన్నేబోయినపల్లి, పెదపవని, విశ్వనాథపురం తదితర గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

వర్షం వస్తే ఇళ్లలోకే నీరు..

పెదపవని, అన్నేబోయినపల్లి, మొగిలిచర్ల, లింగసముద్రం గ్రామాల్లోని సిమెంట్ రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు జంపాలవారిపాలెం బీసీ కాలనీలో రోడ్లు జలమయమయ్యాయి. ప్రజలు రెండు రోజుల పాటు ఇళ్ల నుంచి బయటకు వచ్చే వీలు లేక అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్లు ఎత్తు పెంచి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర తేలిన విశ్వనాథపురం- గంగపాలెం రహదారి

● విశ్వనాథపురం-గంగపాలెం మధ్య ఉన్న మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో రెండు గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

కె.శ్రీనివాసులు, ఎంపీడీవో, లింగసముద్రం

రోడ్ల అభివృద్ధితో పాటు తరతర సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పరిష్కారానికి కృషి చేస్తాం.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించడం లేదా..!

కోవూరు పట్టణం, కోవూరు గ్రామీణం, జనమడుగు సెక్షన్ పరిధిలో విద్యుత్తు సరఫరాలో సమస్యలు ఉన్నాయా...? లైనులు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారా..? నియంత్రికల మరమ్మతులు చేయడం లేదా..? స్థానిక సిబ్బంది చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా..? ఇంకా పలు సమస్యలు నేరుగా కోవూరు డీఈ ట్రాన్స్‌కో దృష్టికి తీసుకురావచ్చు. ఇందుకోసం 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఈతో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వినియోగదారులు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులను దిగువ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయొచ్చు. – న్యూస్‌టుడే, కోవూరు

ఈనాడు మీతోడు
తేదీ: 21-11-2025 (శుక్రవారం)
సమయం: మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య
ఫోన్ నంబర్: 94408 12010

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

క్రీడాకారులకు అభినందనలు

నెల్లూరు (విద్య): విద్యుత్తు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇటీవల నిర్వహించిన ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీల్లో విజేతలను ఎస్‌ఈ రాఘవేంద్రం అభినందించారు. బుధవారం వీరు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని ట్రోఫీలు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషాద్రి బాలచంద్ర, శ్రీధర్, సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, క్రీడా కార్యదర్శి వేలు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : అనంతసాగరం మండలం సోమశిలలోని మత్స్యకార కాలనీలో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలగడం లేదు. –సతీశ్, గ్రామస్థుడు
సమాధానం : కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. –తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? అనంతసాగరం మండల కేంద్రంలోని ప్రభుత్వ కాలనీల్లో సక్రమంగా తాగునీరు రావడం లేదు. అవస్థలు పడుతున్నామని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. – షౌకత్, స్థానికుడు
✓ సమస్య మా దృష్టికి రాలేదు. సిబ్బందికి చెప్పి పరిశీలించి చర్యలు చేపడతాం. – ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి

? ఏఎస్‌పేట మండలం గుడిపాడులోని ఎస్టీ కాలనీలో సైడు కాలువలు లేక రోడ్డు దుర్గంధమయంగా మారింది. – శంకరయ్య, స్థానికులు
✓ పంచాయితీలో తీర్మానం అనంతరం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. – మునిరత్నం, డిప్యూటీ ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరిగాయి. దీనికి తోడు ఎలాంటి సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. –హరిబాబు
✓ పరిశీలించి మలుపుల వద్ద సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.– రమేష్, పంచాయతీరాజ్ ఏఈ

? మర్రిపాడు మండల పరిధిలోని కృష్ణాపురంలో పలు చోట్ల వీధిదీపాలు మరమ్మతులకు గురయ్యాయి. వీధుల్లో అంధకారం నెలకొంది. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. – కృష్ణ, స్థానికుడు
✓ వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. – వెంగళ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు మండలం డేగపూడి నుంచి సైదాపురం వైపు వెళ్లాలంటే గుంతల రహదారిపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం గుంతలైనా పూడ్చాలి. – మల్లికార్జున్, స్థానికుడు
✓ నిధులు మంజూరైన వెంటనే పూర్తి చేయిస్తాం. –శ్రీనివాసులు, ర.భ ఏ.ఈ

? సంగం మండల పరిధిలోని తరుణవాయి-తలుపూరుపాడు గ్రామాల మధ్య వనంతోపు వాగు కాజ్‌వే దాటేందుకు నిరంతరం నీటి ప్రవాహంతో ఇబ్బందిగా ఉంది. వంతెన నిర్మిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. –పెంచల ప్రసాద్, తరుణవాయి
✓ పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. – అన్వేష్‌రెడ్డి, ర.భ ఏఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని డేగపూడిలో విద్యుత్తు దీపాలు పది రోజులుగా వెలగడం లేదు. రాత్రి సమయాల్లో అంధకారం నెలకొంది. – చంద్ర, స్థానికుడు
✓ పరిశీలించి సిబ్బందితో సరిచేయిస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో

ప్రతిభ చూపారు... బహుమతి సాధించారు

మనుబోలు, ఏఎస్‌పేట, పొదలకూరు న్యూస్‌టుడే: మనుబోలు, ఏఎస్‌పేట, పొదలకూరుల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభ పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న బాలికలతో హెచ్‌ఎం వసంతకుమారి

ఏఎస్‌పేట: విజేతలతో ఉపాధ్యాయులు

● మనుబోలు బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థినులు వైష్ణవి (ప్రథమ), శ్రీనిధి (ద్వితీయ), రిషిత(తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి బహుమతులు అందజేశారు.

● ఏఎస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 9వతరగతి విద్యార్థిని చరిత (ప్రథమ), సుజిత (ద్వితీయ), వర్షిత (తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్‌ఎం రుక్మిణి, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సంజీవయ్య, చెన్నకేశవులు, శ్రీనివాసులు బహుమతులను పంపిణీ చేశారు.

● పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో దీక్షిక (ప్రథమ), గిరిబాబు(ద్వితీయ), ధనుష్ (తృతీయ) స్థానాలు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు గిరీశ్ బహుమతులు అందజేశారు.

విజేతలతో ప్రధానోపాధ్యాయుడు గిరీశ్

శిథిలావస్థలో సర్కారు భవనాలు..!

ఈ చిత్రంలో కనిపిస్తున్న పాఠశాల భవనం మండలంలోని అబ్బిసాహెబ్ కండ్రిగలోనిది. గతంలో ఇక్కడ 40కి పైగా విద్యార్థులుండేవారు. గ్రామంలోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం, ప్రభుత్వ పాఠశాలలో చేరే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో ప్రభుత్వ పాఠశాలను మూసివేసింది. అక్కడ రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రెండు పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

వెంకటాచలం మండలంలోని చవటపాళెంలోని ప్రభుత్వ కల్యాణ మండపం. గ్రామంలోని ప్రజలు చిన్న శుభకార్యం చేసుకోవాలన్నా అనువైన భవనం లేక బయట ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఏడేళ్ల క్రితం తెదేపా హయాంలో రూ.28లక్షలతో గ్రామంలోనే మండపాన్ని నిర్మించారు. లోపల అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భవన నిర్వహణ పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం భవనం, లోపల సీలింగ్‌తోపాటు అన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. భవనం కూడా క్రమంగా శిథిలమవుతుంది. నేటికి ఒక్క సారి కూడా వినియోగించలేదు.

న్యూస్‌టుడే, వెంకటాచలం

గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ప్రభుత్వ భవనాలు సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లోని పలు చోట్ల అలంకారప్రాయంగా మారాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాల భవనాలు, మరికొన్ని ప్రాంతాల్లో కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. నిర్వహణ లేకపోవటమే ఇందుకు ప్రధాన కారణం. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

వెంకటాచలం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజావసరాల కోసం గతంలో ప్రభుత్వాలు పలు భవనాలు నిర్మించాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు ప్రజలు విన్నవించినా వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారి, లక్షల ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి. ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేయడంతో విద్యార్థుల సంఖ్య తగ్గి మండలంలోని అబ్బిసాహెబ్ కండ్రిగ, కనుపూరు, వెంకటాచలం, సర్వేపల్లి తదితర చోట్ల పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. కందలపాడు, పాలిచెర్లపాడు, చవటపాళెం తదితర చోట్ల సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు అలంకారప్రాయంగా మారాయి. వీటిని ఉపయోగించక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

చాలా చోట్ల అసంపూర్తిగా...

కొన్ని గ్రామాల్లో ఉన్న భవనాలు అలంకార ప్రాయంగా ఉంటే మరి కొన్ని చోట్ల నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా ఉన్నాయి. వెంకటాచలంలో భవిత కేంద్రం, పాఠశాల భవనాలతో పాటు మండలంలోని కంటేపల్లి, తిరుమలమ్మపాళెం, చెముడుగుంట తదితర గ్రామాల్లో సామాజిక భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాలు స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. పాలకులు, అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తెచ్చి, అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

మర్రిపాడు : కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని ప్రణీత (14) వసతి గృహంలోని మెట్ల కమ్మీలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడంపై అనుమానాలున్నాయని బుధవారం విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. వారిని పోలీసులు, విద్యాలయం సిబ్బంది లోపలికి అనుమతించకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. నవోదయ మెయిన్ గేటు వద్ద సిబ్బంది, పోలీసుల తీరుపై నిరసన చేపట్టారు. విద్యార్థి మృతి పట్ల పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పోలీసులతో విద్యార్థి సంఘాల నాయకుల వాగ్వాదం

క్రీడాపోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

ముత్తుకూరు, వెంకటాచలం, ఆత్మకూరు, న్యూస్‌టుడే: ముత్తుకూరు మండలం అదాని విద్యామందిర్ విద్యార్థి ఆనంద్ జాతీయ స్థాయి కబడీ పోటీలకు ఎంపికయ్యారు. వినుకొండలో జరిగిన ఎస్‌జీఎఫ్ స్కూల్ అండర్-19 కబడీ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. దీంతో జాతీయ జట్టుకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. ● వెంకటాచలం మండలంలోని గొలగమూడి ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు మహేశ్వరి, లక్ష్మీలు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కడప జిల్లా పులివెందులలో ఈనెల 21 నుంచి 24 వరకు జరగనున్న అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొననున్నారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ కామేశ్వరి, పీడీ షబిక, ఉపాధ్యాయులు అభినందించారు. ● ఆత్మకూరు మండలం బట్టేపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐశ్వర్య కుస్తీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించారు. అండర్-17, 46 కేజీల విభాగంలో రాణించడంతో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా ఇంటింటా సర్వే

మరుపూరులో వివరాలు నమోదు చేస్తున్న వైద్యాధికారి

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

కుష్ఠు నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాధితులను గుర్తించేందుకు నెలాఖరువరకు ఇంటింటా సర్వే చేస్తున్నారు... వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించేందుకు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో సోమవారం నుంచి ముమ్మరంగా కొనసాగుతోంది. వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. ● జిల్లా పరిధిలో మొత్తం 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 2 ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలతో పాటు సహాయకులు సర్వేలో పాల్గొని వివరాలు సేకరిస్తున్నారు. లక్షణాలు గుర్తించడంతో పాటు వారిలో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. బాధితులకు క్రమం తప్పకుండా చికిత్స అందిస్తారు. ● మహమ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో ప్రస్తుతం సర్వే కొనసాగుతోందన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలన్నారు.

సేవాభావంతో విధులు నిర్వహించాలి

కొడవలూరు, న్యూస్‌టుడే: గండవరం పీఏసీఎస్, ఉదయకళేశ్వరస్వామి దేవస్థానాల పాలకవర్గాల సభ్యులు సేవాభావంతో విధులు నిర్వహించాలని కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. కొడవలూరు మండలంలోని గండవరం గ్రామంలో గండవరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా సిద్దార్థరెడ్డి, డైరెక్టర్లుగా సుధాకర్, సుబ్బులమ్మ, ప్రముఖశైవాలయం ఉదయకళేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా మాలకొండయ్య, మరో 11 మంది పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం, రూ.70 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం బుధవారం రాత్రి జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సొంతనిధులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్లాంట్, 9, 10 తరగతుల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సర్పంచి రాజకుమారి, తెదేపా మండల అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయం

తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు నుంచి పాపిరెడ్డిపాలెం మీదుగా తోటపల్లిగూడూరు గ్రామానికి వెళ్లే రోడ్డు గతుకులమయంగా మారింది. అడుగడుగున గుంతలు ఉండటంతో రాకపోకవలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు మూడు గ్రామాల వారికి ఈ మార్గమే ఆధారం. మండల కేంద్రానికి ఈ రోడ్డు మార్గంలోనే నిత్యం స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

శిథిలావస్థలో మురుగు కాలువలు

కోవూరు పట్టణంలోని బజారు కూడలిలో వడ్డిపాలెంలో డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగు నీరు కదలడంలేదు. దుర్వాసన వస్తోందని, దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని పలువురు విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

బజారు కూడలి వద్ద చెత్తమయం

కోవూరు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోయింది. కొన్ని రోజులుగా చెత్త తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో చెత్త కొన్ని రోజులుగా తొలగించకపోవడంతో వాహనాలు రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పరిశీలించి తొలగించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

పొంచి ఉన్న ప్రమాదం

కోవూరు పట్టణంలోని బజారు కూడలి సమీపంలో మటన్ మార్కెట్ వద్ద విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. చుట్టూ ఎలాంటి కంచె ఏర్పాటు చేయలేదు. చేతికందే ఎత్తులో ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదని వాపోతున్నారు. అధికారులు పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

నాణ్యత లోపం.. ప్రయాణికులకు శాపం

మర్రిపాడు మండల పరిధిలోని ఏర్పేడు-నకిరేకల్ జాతీయ రహదారిపై 15 కిలో మీటర్ల మేర రోడ్డు పొడవునా గుంతలు పడి, ప్రమాదకరంగా మారడంతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. నాణ్యత లోపించడంతో తారు పైకి లేచి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపై గుంతలు పూడ్చడంలో గుత్తేదారు నాణ్యతకు పాతరేయడంతో ఈ పరిస్థితి నెలకొందని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.– న్యూస్‌టుడే, మర్రిపాడు

శివపార్వతుల కల్యాణోత్సవం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: కార్తిక మాసం చివరిరోజు సందర్భంగా మైపాడులోని అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. బుధవారం రుద్రాభిషేకం, చండీహోమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కొత్తూరులోని లలితా మహేశ్వరి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్ నియామకం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో కొన్ని నెలల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డాక్టరు పద్మావతి పనిచేస్తూ బదిలీపై అల్లూరుకు వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జులతో కొనసాగుతోంది. రెగ్యులర్ గైనకాలజిస్టు పోస్టును బుధవారం ఇందీవరి నియామకంతో భర్తీ చేశారు. వైద్యులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

నియోజకవర్గ సమస్యలు ప్రస్తావిస్తా..

సంగం, న్యూస్‌టుడే: ఆత్మకూరు నియోజకవర్గ సమస్యలపై ఈనెల 26న జరిగే మాక్ అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు తరుణవాయి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని పల్లవి బుధవారం తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఎంపికైన పల్లవిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

అన్నం సేవలు ఎనలేనివి

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే : అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి అన్నం శ్రీనివాసులు అని నెల్లూరు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. నరుకూరులో ఇటీవల మృతి చెందిన భాజపా సీనియర్ నాయకులు అన్నం శ్రీనివాసులు సంతాపసభ బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, భాజపా నాయకులు సురేంద్రరెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రజల భద్రతకు కూటమి పాలనలో పెద్దపీట

తోటపల్లిగూడూరు: రైతుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, తోటపల్లిగూడూరు, కలువాయి, న్యూస్‌టుడే: ప్రజల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బుచ్చి పురపాలక పరిధిలో అగ్నిమాపక కేంద్రం శంకుస్థాపన, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్, వవ్వేరు బ్యాంకులో అఖిల భారత సహకార వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. రేబాలలో రైతులతో ముఖాముఖి, నార్తురాజుపాళెంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ బుచ్చిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు రూ.2.5కోట్లు మంజూరు చేశారన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ తొలి విడతగా 25న 285 మంది లబ్ధిదారులకు గృహాలు అందజేస్తున్నామని చెప్పారు. వవ్వేరు బ్యాంకు రూ.145 కోట్ల టర్నోవర్ సాధించడం అభినందనీయమన్నారు. నార్తురాజుపాళెంలో ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ పరిధిలో సాగుదారులకు రూ.11 కోట్లు ఖాతాల్లో జమైందన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభదాయకం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే అన్నదాత సుఖీభవ లక్ష్యమన్నారు. ఛైర్‌పర్సన్ సుప్రజ, వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ దొడ్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తోటపల్లిగూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు చెక్కును అందజేశారు. సర్వేపల్లిలో 28వేల మంది రైతులు ఏడాదికి రూ.19.57 కోట్లు అందుకోనున్నట్లు చెప్పారు. తెదేపా నాయకులు బొమ్మి సురేంద్ర, సురేష్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు. ● వెంకటగిరి నియోజకవర్గంలో 30,990 మంది రైతులకు రూ.20 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కలువాయి మండల కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ముందుగా రైతుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తెదేపా నాయకులు రఘురామిరెడ్డి, భాజపా నాయకులు నరసింహప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు మనోహర్, పలువురు పాల్గొన్నారు.

కలువాయిలో : చెక్కు ఇస్తున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సత్యసాయి శత జయంతి మహోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చిరెడ్డిపాళెం పురపాలకసంఘంలో భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు భక్తబృందం ప్రత్యేకంగా భక్తులకు ఆహ్వానాలందించారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెం పురపాలకసంఘంలో రామకృష్ణానగర్‌లో మహాగణపతి గాయత్రీ మాత సమేత భగవాన్ సత్యసాయి సుందరేశ్వర నిలయం భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారి జన్మదిన వేడుకలు ఈనెల 23వ నుంచి జరగనున్నాయి. స్థానిక భక్త బృందం ఇళ్లకు వెళ్లి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈనెల 23న ఉదయం జరిగే కార్యక్రమానికి భక్తులు తప్పనిసరిగా రావాలని కోరారు.

నగదు సాయం.. సాగుదారుల హర్షం

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. కేంద్రం రూ.2వేలు, రాష్ట్రం రూ.5వేలు చొప్పున ఒక్కో రైతుకు రూ.7 వేలు ఖాతాల్లో పడ్డాయి. కోవూరు నియోజకవర్గ పరిధిలో 29,338 మంది రైతులకు రూ.10.95 కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి. ● కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకోవడం కోసం పంట వేసే ముందు పెట్టుబడి సాయం అందించడమే ముఖ్య లక్ష్యంగా ఏర్పాటుచేసిన పీఎం కిసాన్- రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో వేశారు. రైతులు దళారుల చేతిలో దెబ్బతినకుండా, పిల్లల చదువుల కోసం ఉంచుకున్న నగదు పెట్టుబడి పెట్టకుండా కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయమందిస్తోంది.

కోవూరు నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారుల వివరాలు (రూ.లక్షల్లో)

మండలం	అన్నదాత సుఖీభవ		పీఎం కిసాన్	
	రైతులు	మొత్తం	రైతులు	మొత్తం
కోవూరు	2288	114.4	1552	31.04
కొడవలూరు	4156	207.8	2743	54.86
విడవలూరు	4143	207.2	2754	55.08
బుచ్చిరెడ్డిపాళెం	3244	162.2	2699	53.98
ఇందుకూరుపేట	3107	155.4	2653	53.06

బుచ్చి సమీపంలో పైరుకు పిచికారీ చేస్తున్న రైతు

ప్రస్తుతం తొలిపంట వేసే చిన్న, సన్నకారు రైతులకు దుక్కిలు, విత్తనాలు, ఎరువులకు ఈ నగదు ఉపయోగపడనున్నాయి. కోవూరు ఏడీఏ అనిత మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు నగదు జమవుతాయన్నారు. ఎవరికైనా పడకుంటే రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

తాగునీరు కలుషితం.. పట్టించుకోని యంత్రాంగం

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయం నుంచి ఆత్మకూరు ప్రాంత వాసులకు తాగునీటి కోసం గతంలో ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి, అప్పటి ఆర్థిక శాఖా మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి చొరవతో రూ.66 కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేశారు. కొన్ని నెలల నుంచి సోమశిలలోని ఎస్సీ కాలనీ ప్రధాన రోడ్డులో పైపులైన్ మరమ్మతులకు గురై లీకేజీల కారణంగా రోడ్లపై నీరు నిలుస్తోంది. కొన్ని నెలలుగా సోమశిల ప్రధాన రహదారి మార్గంలో పైపులైన్ నుంచి నీరు లీకేజీల రూపంలో వృథా అవుతున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నీరంతా రోడ్డుపై నిలవడంతో స్థానికంగా నివసించే వివిధ కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నబ్బాయి మాట్లాడుతూ... లీకేజీ సమస్యపై ఆత్మకూరు పురపాలక అధికారులకు తెలియజేశామన్నారు. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన లీకేజిని అరికట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

సోమశిల ప్రధాన మార్గం వద్ద లీకేజీతో నిలిచిన నీరు

తీరం వెళ్లే మార్గం కూలడానికి సిద్ధం

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం నుంచి బీచ్ వెళ్లే దారిలోని బకింగ్ హాం కాలువపై నిర్మించిన రక్షణ గోడ ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. సమీపంలో పరిశ్రమలు ఉండడంతో నిత్యం టిప్పర్లు, లారీల వంటివి వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినపుడు ఏ కొంచెం అదుపు తప్పినా కాలువలో పడే అవకాశం ఉండటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, ముత్తుకూరు

విద్యతోనే బంగారు భవిత

విడవలూరు, ఆత్మకూరు, చేజర్ల, ఏఎస్‌పేట, ముత్తుకూరు, న్యూస్‌టుడే: విద్య నేర్చుకుంటేనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చునని విడవలూరు, ఎంపీడీవో నగేష్ కుమారి అన్నారు. విడవలూరులో జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె బుధవారం పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ తరచూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు, గ్రంథాలయాధికారిణి నిరూప పాల్గొన్నారు. ఆత్మకూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చేజర్ల లైబ్రేరియన్ కల్పన తెలిపారు. ఏఎస్‌పేట శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు.

PASSPORT LOST

I, DARA VIJAY KUMAR, S/o DARA DASARADHA, residing at D.No.B-5-53,Sivalayam Street, Buchireddy palem Village and Mandal, SPSR Nellore District - 524305, Andhra Pradesh, India. hereby declare that my Original Passport bearing No.S7104260 valid from 09-10-2018 to 08-10-2028 was lost by me while obtaining xerox at Buchireddypalem on 29-10-2025. If found, kindly return it to the above address.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వం నిషేధించిందని నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి స్పష్టంచేశారు. బుధవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో వైద్యఆరోగ్య శాఖ రూపొందించిన పొగాకు ఉత్పత్తులతో కలిగే నష్టాలను వివరించే గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని.. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. 18 ఏళ్ల లోపు వారికి సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అధికారి డాక్టర్ కనకాద్రి, హాసిని తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేస్తున్న సీఎం: కోటంరెడ్డి



చెక్కు చూపుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం విధానాలతో రాష్ట్రం దివాలా తీయగా.. చంద్రబాబు సమర్థ పాలనతో పరిస్థితులను చక్కదిద్దారని గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. వేరెవరైనా ముఖ్యమంత్రి అయి ఉంటే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని నగరంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమర్థమైన నాయకత్వంతో చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నారన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయకుమార్, నెల్లూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, నృసింహకొండ ఆలయ ఛైర్మన్ అచ్యుత్ శంకర్‌రెడ్డి, ఆత్మ పీడీ శారద, డీపీడీ మురళి, ఏడీఏ శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి నాగమోహన్‌రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తూ.కొ. దాడులు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే : నగరంలోని బుజబుజనెల్లూరు మిట్ట మీద ప్రాంతంలో పలు ఫ్యాన్సీ, ఫల సరకుల దుకాణాలు, రైస్ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ కాటాల లైసెన్సు పునరుద్ధరణ చేయని రెండు దుకాణాలకు జరిమానాలు విధించారు. దాడుల్లో తూ.కొ. ఇన్‌స్పెక్టర్ రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో ట్రాఫిక్ చిక్కుముళ్లు విప్పుతాం

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

ఫోనులో సమాధానమిస్తున్న సౌత్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి

ఈనాడు మీతోడు

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలు గుర్తించాం. వాటి పరిష్కారానికి ప్రణాళికలు రచించామని.. నగర సౌత్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. 'ఈనాడు- మీతోడు'లో భాగంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలపై ఆయనతో ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

సమస్య: నగరంలో ఆటోవాలాలు ఛార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు. తగ్గేలా చర్యలు తీసుకోండి.
– సురేష్, పొదలకూరు రోడ్డు

సీఐ: అది మా పరిధిలో ఉండదు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

స: మినీబైపాసు రోడ్డు నుంచి పడారుపల్లికి వెళ్లే దారిలో కారు మెకానిక్ దుకాణం నిర్వాహకులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.
– ఈశ్వర్ రెడ్డి, పడారుపల్లి

సీఐ: సిబ్బందిని పంపి రోడ్డు మార్జిన్ లోపలే వాహనాలు నిలిపేలా చర్యలు చేపడతాం.

స: ఆర్టీసీ బస్టాండు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చర్యలు తీసుకోండి.
– రాఘవేంద్ర, నెల్లూరు

సీఐ: ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

'ఈనాడు' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

స: నగరంలోని ద్విచక్ర వాహనదారులు కొందరు వింత సైలెన్సర్లు బిగించి తిరుగుతూ భారీ శబ్దాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చర్యలు తీసుకోండి. – వెంకటేష్, అయ్యప్పగుడి

సీఐ: నగరవ్యాప్తంగా ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. త్వరలో మరో డ్రైవ్ చేపడతాం.

స: నగరంలో పలు ప్రాంతాల్లో రోడ్లపై హోర్డింగులు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని తొలగించాలి. – రమేష్, వేదాయపాలెం

సీఐ: త్వరలో వాటిని తొలగిస్తాం. అనధికారికంగా రోడ్లపై హోర్డింగులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

స: సిటీ బస్సులు మితిమీరిన వేగంతో వెళ్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ ఆపి ట్రాఫిక్‌కు కారణమవుతున్నాయి. – రజాక్, నెల్లూరు

సీఐ: బస్సుల యాజమాన్యాలతో సమావేశమవుతాం. డ్రైవర్లకు సూచనలు చేస్తాం.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లూరు(మార్కెట్ సెంటర్): మహిళలు అన్ని రంగాల్లో పురోగమిస్తున్నారని రిటైర్డు గ్రంథ పాలకురాలు ఆమంచర్ల రేవతి పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో దివంగత ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, ఉప గ్రంథ పాలకురాలు సునీత పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: గుర్రాలమడుగు సంఘంలో చెత్త తీసుకెళ్లే వారు రావడం లేదు. కాలువలో వ్యర్థాలను కూడా తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. – మురళి, స్థానికుడు

సమాధానం: ప్రతి రోజూ చెత్త తొలగించేలా చర్యలు చేపడతాం. కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

? వేదాయపాలెం చైతన్యపురి జేకే కాలనీలో కుక్కలు విపరీతంగా ఉన్నాయి. రెండు రోజుల క్రితం పిల్లలను కరిచాయి. – జేకేఎం రెడ్డి, స్థానికుడు

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

డీకే కళాశాలలో షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ యోజనలో భాగంగా షార్ట్ టర్మ్ కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్, సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా అనలిస్టు కోర్సుల్లో శిక్షణ ఇస్తామని వివరించారు. పదోతరగతి చదివిన యువతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 8639867407 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా: ఎస్ఈ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.రాఘవేంద్రం ఆదేశించారు. బుధవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. స్మార్ట్‌మీటర్లపై అపోహను తొలగించాలన్నారు. సమస్యలపై వచ్చే ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, అకౌంట్స్ అధికారి పి.మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సునీల్, కిరణ్ పాల్గొన్నారు. విద్యుత్తు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇటీవల నిర్వహించిన ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీల్లో విజేతలను ఎస్ఈ రాఘవేంద్రం అభినందించారు. బుధవారం వీరు ఆయన్ను కలిశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషాద్రి బాలచంద్ర, శ్రీధర్, సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, క్రీడా కార్యదర్శి వేలు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైమ్ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సి.ప్రభావతమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండలేరు గురుకులంలో సివిక్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఆదూరుపల్లిలో సోషల్ పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బహుమతులు అందుకుంటున్న విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు

బహుమతులతో విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కే స్కూల్ విద్యార్థులు

ఉపన్యసించి.. బహుమతులు గెలిచి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని బీవీనగర్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వీటిలో భాగంగా కృత్రిమ మేధ(ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులపై ఉపన్యాస పోటీలు జరగ్గా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పి.అక్షిత, కె.చరిష్మ, ఎం.నాగరిషిత విజేతలుగా నిలిచారు. వీరికి ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, కృష్ణమోహన్, శివసాకేత్, ప్రిన్సిపల్ శ్రీదేవి బహుమతులు అందజేశారు. ● నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కే స్కూల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వీటిలో పి.మేథస్ రామన్, వి.ప్రద్వేష్, ఓ.తరుణ్‌రెడ్డి వరుస స్థానాల్లో నిలిచారు. వీరికి ఆ పాఠశాల డైరెక్టర్ శివసాకేత్, ప్రిన్సిపల్ రఘురామ్, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

ఎస్ఎఫ్ఐ మహాసభల గోడపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు (విద్య): నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్న జిల్లా మహాసభల గోడపత్రాలను ఆవిష్కరించారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి.విక్రమ్, నెల్లూరు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అక్రమ్, జి.విష్ణు, జిల్లా కమిటీ సభ్యులు యగ్నేష్, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక మాస ముగింపు పూజలు

పూజల్లో పాల్గొన్న భక్తులు

నెల్లూరు(జడ్పీ) : కార్తిక మాస ముగింపు పూజలు బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకగా జరిగాయి. రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరి, మీనాక్షితాయి ఆలయంలో ఈ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కోవూరు జనార్దనరెడ్డి, శివ దీక్ష భక్త కమిటీ స్థాపకుడు ఆల్తూరు గిరీష్‌రెడ్డితోపాటు ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. మూలాపేటలో మూలస్థానేశ్వర ఆలయంలో ఆకాశ దీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూల అలంకరణ చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అర్చకులతోపాటు ఆలయ ఈవో అరవభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, గిరీష్, లతారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి

విద్యార్థినులు లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సునీత మాట్లాడుతూ కుటుంబాన్ని నడపడంలో యువత ఆమెను మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ప్రొఫెసర్ మధుమతి, హిస్టరీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ కె.శ్రావణ్‌కుమార్, ఏవీఎస్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇటు వస్తే కాటేస్తా!

నగరంలోని ఆచారి వీధి పాత జడ్పీ కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే ఉన్నా దీనికి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. చేతికి అందే ఎత్తులో ఉంది. దీంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.
– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

తటాకమా.. రహదారా!

నగరంలోని మూలాపేట పోలీసు కాలనీ రోడ్డు తటాకాన్ని తలపిస్తోంది. రెండు వారాలుగా ఉన్న వర్షపు నీటితో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఉండడంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు

నగరంలోని పొదలకూరు రోడ్డులోని ఎస్పీ బంగ్లా ఎదురుగా ప్రధాన పైపులైనుకు లీకు పడడంతో మరమ్మతులకు గుంత తీశారు. పూర్తయ్యాక పూడ్చకుండా వదిలేశారు. గత రాత్రి గేదె ఇందులో పడిపోగా.. స్థానికులు అతి కష్టం మీద బయటకు తీసి కర్రలు అడ్డుగా పెట్టారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

ఏటీఎంకు వెళ్లేదెలాగబ్బా!

పొదలకూరు రోడ్డులోని యూనియన్ బ్యాంకు ఏటీఎంలోకి వెళ్లేందుకు ఖాతాదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆరు నెలల క్రితం రోడ్డు వెడల్పులో భాగంగా దీని ముందు మెట్లను తొలగించారు. అక్కడి వరకు రోడ్డు వేయలేదు. దీంతో ఏటీఎంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

ఆరు నెలలుగా నీరు వృథా

వేదాయపాలెం చైతన్యపురి కాలనీలోని సోల్క అపార్టుమెంటు ముందు తాగునీటి పైపులైను లీకవుతోంది. ఆరు నెలలుగా లీకవుతోంది. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు (నేర విభాగం): ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నెల్లూరు వేదాయపాలెం రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే పోలీసులుమృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు (నేర విభాగం) : అదనపు కట్నం కోసం భర్త, కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని నాలుగో మైలు ప్రాంతానికి చెందిన జమీద్, హమీదాకు గతేడాది పెద్దలు వివాహం చేశారు. కొన్నాళ్లుగా కట్నం తీసుకురావాలని భర్త, అతని తల్లి హుమేదా, తండ్రి మస్తాన్, బంధువులు బీబీజాన్ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. గర్భిణిగా ఉన్న హమీదా వేధింపులు తాళలేక పుట్టింటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల సహకారంతో బాధితురాలు నెల్లూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తుడి బంగారు గొలుసు అపహరణ

తిరుపతి(నేరవిభాగం): తిరుమలవచ్చిన భక్తుడి బంగారు గొలుసును కొందరు కాజేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీధర్ కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఇతని కుటుంబం నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటోంది. వారితో కలిసి శ్రీధర్ ఇటీవల తిరుమల వచ్చారు. దర్శనానంతరం కుటుంబ సభ్యులు నెల్లూరుకు వెళ్లారు. శ్రీధర్ బళ్లారికి వెళ్లేందుకు విశ్రాంతి తీసుకున్న హోటల్ నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్లేందుకు రాపిడోను బుక్ చేసుకున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతని మెడలోని బంగారు గొలుసు కాజేశారు.

తెరపై ఈనాడు

ఎం.1 సినిమాస్.: స్క్రీన్. 1 శివ(తెలుగు), నువ్వొస్తానంటే నేనొద్దంటానా (తెలుగు) స్క్రీన్ .2.కాంత(తెలుగు) స్క్రీన్..3.ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), నువ్వొస్తానంటే నేనొద్దంటానా (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1..దేదే ప్యార్ దే 2 (హిందీ) స్క్రీన్ 2..ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), సీత ప్రయాణం కృష్ణతో, (తెలుగు), స్పైడర్ మ్యాన్ 2 (ఇంగ్లిష్) స్క్రీన్ 3..జిగ్రీస్ (తెలుగు), ది రన్నింగ్ మాన్ (ఇంగ్లిష్) స్క్రీన్.4..శివ (తెలుగు) స్క్రీన్.5 కాంత (తెలుగు)

పీఠాధిపతి రాక

పూజలు చేస్తున్న ఈషా ప్రియ తీర్థస్వామి

నెల్లూరు (దర్గామిట్ట), న్యూస్‌టుడే: నెల్లూరుకు ఉడుపి పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామి బుధవారం దర్గామిట్టలోని కాంతినగర్‌లో శివకేశవ దేవస్థానానికి రాగా ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు స్వాగతం పలికారు. పూజలు నిర్వహించారు. పలువురు భక్తులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ డి.పెంచలయ్య ఆధ్వర్యంలో భక్త బృందం ఏర్పాట్లు చేసింది.

నెల్లూరు (మార్కెట్ సెంటర్): నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనృసింహ స్వామిని ఉడుపి పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గోపి, స్వామీజీ శిష్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మినీబైపాస్ రోడ్డులో అన్నమయ్య కూడలి ప్రధాన మార్గంలో పర్యటించారు. ఎన్టీఆర్ పార్కులో క్రీడా పరికరాలు, మరుగుదొడ్లు, తాగునీరు, మొక్కల పెంపకం, వాకింగ్ ట్రాక్ తదితర వాటిని పరిశీలించారు. కర్నాలమిట్ట, జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, వైవీఎం, సీబీనగర్ మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో కమిషనర్ వైవో నందన్‌ను కలిసి ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తహసీన్, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సుల వసూళ్లను వేగవంతం చేయాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ): బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు సంబంధించిన ఉత్పత్తులు వాడకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. బుధవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌సెంటరులో పారిశుద్ధ్య విభాగం అధికారులు, కార్యదర్శులత సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్, టీపీఆర్‌వో వాసుబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. సచివాలయ శానిటేషన్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీల సహకారంతో కమిషనర్ వైవో నందన్ నేతృత్వంలో ఇటీవల మృతి చెందిన షేక్ ముజాహిద్ అలీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. బుధవారం కార్యాలయంలో ముజాహిద్ అలీ కుటుంబానికి రూ.85,500 అందించారు.

ఘనంగా ఇందిరమ్మ జయంతి

నినాదాలు చేస్తున్న నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట), న్యూస్‌టుడే: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం నిర్వహించాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్ద విగ్రహానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఇందిరాగాంధీ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలసుధాకర్, ఫయాజ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగింపు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని వేదాయపాలెం త్యాగరాజనగర్‌లో ఓ ఇంటికి సంబంధించిన తాగునీటి కుళాయి కనెక్షన్‌ను బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు తొలగించారు. నగరపాలకసంస్థకు ఇంటి పన్ను రూ.1,01,750, కుళాయి పన్ను రూ.12 వేలు చెల్లించకపోవడంతో దీన్ని తొలగించినట్లు ఆర్ఐ శీనయ్య తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శి తేజస్విని, ఫిట్టర్ రంగరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అరుణ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

విజయవాడ నేరవార్తలు : ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో నిడిగుంట అరుణ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. గత నెల 13న విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు ఆమెపై మోసం కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఆమెను పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ అరుణ ఒకటో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి కేసు విచారణను గురువారానికి వాయిదా వేశారు. బెయిల్ పిటిషన్‌పై గురువారం ఉత్తర్వులు ఇస్తామని న్యాయస్థానం ప్రకటించింది.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు (విద్య): నగరంలోని తెలుగు గంగ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఎం.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీనగర్, సంజయ్ గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మేమున్నామని.. సేవలు చేస్తామని

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

కుటుంబ సభ్యులు.. బంధువుల సహకారంతో పలువురు సమాజ సేవ చేస్తున్నారు. తమవంతుగా సామాజికాభివృద్ధికి పాటుపడుతున్నారు. అనాథలు, దివ్యాంగులు, పేద విద్యార్థులు, రోగులు, వయోవృద్ధులు, నిరాశ్రయులకు అండగా నిలుస్తున్నారు. కష్టాల్లో ఉన్నపుడు చేయూత ఇస్తున్నారు. మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు.

నగరంలోని మూలాపేటకు చెందిన బాబీభగత్, అమృత్‌కుమార్ అనే యువకులు ఆపన్నులకు అండగా నిలవాలని 2020లో 'సింహపురి చైతన్య వేదిక' సంస్థను స్థాపించారు. ఇద్దరు యువకులతో ప్రారంభమైన ఆ వేదిక నేడు 200 మందికి చేరింది. నిరుపేదలు, పేద విద్యార్థులకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కులమతాల కతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, ఇతర శుభకార్యాలను పేదల మధ్య చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 220 సమస్యలను పరిష్కరించారు.

పదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న యువకులు

సేవలు ఇలా.. ● నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండే పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సహకారం అందిస్తున్నారు. ఏడాది ఎన్ఎంఎంఎస్ సంబంధించిన రూ.500 విలువైన మెటీరియల్‌ను ప్రతి విద్యార్థికి ఉచితంగా అందిస్తున్నారు. ● జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. ● విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాలల యజమానులను ఒప్పించి వాటిని ఇప్పిస్తున్నారు. ● మంచుకాలంలో చలికి ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఏటా దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. ● అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం చేస్తున్నారు.

శ్వాస కోశ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నారాయణ వైద్యులు

నెల్లూరు (మార్కెట్ సెంటర్): శ్వాసకోశ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారతాయని నారాయణ వైద్య విద్యాసంస్థల డీన్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సీవోపీడీ దినోత్సవం సందర్భంగా బుధవారం నారాయణ మెడికల్ కళాశాలలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ హరీష్, శ్వాసకోశ వ్యాధుల విభాగాధిపతి ప్రసన్నపూర్ణ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మిలిటరీ మద్యం స్వాధీనం

నెల్లూరు (నేర విభాగం) బీవీ నగర్ మిలిటరీ మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మాజీసైనికోద్యోగుల కార్డులతో మద్యాన్ని తీసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అతని దగ్గర 20కి పైగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

బహిరంగ వేలం
నవంబర్ నెల తేది : 20-11-2025

Vehicle No.	Description	Year
AP39NS4351	DZIRE VXI BS6 PETROL 5 SEATER	2021

గమనిక : పైన తెలిపిన వాహనముల యొక్క రుణగ్రహీత(లు) / హామీదారులు మా యందు ఋణం పొంది వాహనము కొనుగోలుచేసి ఋణము చెల్లించనందువలన పలుమార్లు నోటీసులను పంపడమైనది. కాని ఖాతరు చేయనందువలన పలుమార్లు నోటీసు పంపడమైనది. కాని ఖాతరు చేయనందున పై వాహనములను వేలము ద్వారా విక్రయించి ఋణము రాబట్టుకొనుటకు కంపెనీ నిర్ణయించుచడమైనది. షరతులు వర్తిస్తాయి. వేలము జరుగు ప్రదేశం : శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, వెంకటాచలం, సర్వేపల్లి రోడ్డు, రైల్వేగేట్ దగ్గర, నెల్లూరు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
డి.నెం.53-54, శ్రీనగర్‌కాలనీ, శ్రీనివాస కాంప్లెక్స్, మాగుంట లేఔట్, దర్గామిట్ట షోరూం దగ్గర, నెల్లూరు. ఫోన్ : 9849981316, 9849981418.

RAO'S COLLEGE OF PHARMACY
NELLORE (A.P)
(Approved by PCI & Affiliated to SBTET, Vijayawada)
Estd: 2004 Web: raospharmacy.com Counselling Code: RAOS
D.PHARMACY Spot Admissions - 2025 - 26
The eligible candidates are invited for spot admission into 1st Year D.Pharmacy course (2025-26) along with all original certificates and necessary fee on 20-11-2025 at 10.00 AM in the institutions. The eligibility and admission will be made as per the guidelines of Convener D.Pharmacy

COURSE	INTAKE	SPOT
D.PHARMACY	66	65

Contact: 98481 85702 & 98481 85703 - PRINCIPAL

(c) eenadu

ఈనాడు
శ్రీ సత్యసాయి
గురువారం నవంబరు 20, 2025

కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం : మంత్రి



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, పరిటాల శ్రీరామ్, మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం గొట్లూరు గ్రామంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రితోపాటు ఎంపీ బీకే పార్థసారథి, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 38,933 మంది రైతులకు రూ.26.29 కోట్ల మెగా చెక్కును వారు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రైతులను గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని, లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలన్నారు. ఆతర్వాత పరిటాల శ్రీరామ్, మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. జేడీఏ రామునాయక్, ఏడీఏ లక్ష్మానాయక్, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ అరుణశ్రీ, వైస్‌ఛైర్మన్ అయ్యప్ప, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, జడ్పీ మాజీ ఛైర్మన్ ఓబిరెడ్డి, గొట్లూరు సొసైటీ ఛైర్మన్ రామాంజనేయులు, తెదేపా నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరి, శ్రీనివాసులు, భాజపా మండల అధ్యక్షుడు గొట్లూరు చంద్ర పాల్గొన్నారు.

★ ఉమ్మడి జిల్లాలో పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం 5,40,682 మంది రైతులకు రూ.367.68 కోట్లు నిధులు మంజూరు చేశారు.

నేడు అంతర్జాతీయ యువజన సదస్సు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలో గురువారం అంతర్జాతీయ యువజన సదస్సు జరగనుంది. ఉదయం 8 గంటలకు వేదపఠనంతో వేడుకలు ప్రారంభం అవుతాయి. వేడుకల్లో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, రాష్ట్ర మంత్రులు జనార్దన్‌రెడ్డి, దుర్గేష్ పాల్గొననున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా ఉత్సవాలు

● ప్రజాప్రతినిధులు, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

ఈనాడు, అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఎక్కడా లోటు లేకుండా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. మంగళవారం వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన ఆయన జిల్లా మంత్రి సవిత, ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 23 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇప్పటికే నిధులు విడుదల చేసి పుట్టపర్తిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించినట్లు తెలుస్తోంది.

టమాటా కిలో రూ.47

అనంతపురం (వ్యవసాయం) : అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్లో టమాటా ధరలు ఊరిస్తున్నాయి. మూడ్రోజులుగా టమాటా కిలో రూ.40 లోపలే పలికింది. బుధవారం కిలో రూ.47లకు పెరగడంతో అన్నదాతల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు 2,145 టన్నులు వచ్చాయి. మొదటి రకం కిలో రూ.47, రెండో రకం రూ.33, మూడో రకం రూ.27 చొప్పున పలికింది. 15 కిలోల బుట్ట ధర మొదటి రకం రూ.705, రెండో రకం రూ.495, మూడో రకం రూ.405 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రూప్‌కుమార్ తెలిపారు.

ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి పయ్యావుల, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బాలికకు సుకన్య యోజన పత్రం అందజేస్తున్న మోదీ, చిత్రంలో సీఎం, సచిన్ తెందూల్కర్, ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ట్రస్టు సభ్యుడు చక్రవర్తి

శతజయంతి వేడుకల్లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

సత్యసాయి జీవితమే.. వసుధైక కుటుంబం

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పుట్టపర్తి: సత్యవాక్కు, ప్రేమతత్వం, సేవామార్గాలతో ప్రపంచాన్ని గెలవాలనే శ్రీసత్యసాయిబాబా బోధనలను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. బాబాతో తమకున్న అనుబంధాన్ని, అనుభవాలను భక్తులతో పంచుకున్నారు. సత్యం మాట్లాడటమే సత్యసాయిబాబాకు మనం ఇచ్చే నిజమైన కానుక అని చెప్పుకొచ్చారు. దేశ, విదేశాల్లో కోట్లాది మంది భక్తులను సంపాదించుకున్న ఆయన జీవితమే ఒక వసుధైక కుటుంబమని స్పష్టం చేశారు. బాబా మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన బోధనలు ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజకీయ, క్రీడలు, సినీ ప్రముఖులు ముఖ్యఅతిథులుగా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించిన సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సామాన్యుడి నుంచి ప్రధాని వరకు ప్రతిఒక్కరూ సాయి నామస్మరణతో పులకించిపోయారు. ఉత్సవాలకు హాజరైన వేలాది మందితో పుట్టపర్తి పురవీధులు పులకించిపోయాయి.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న సీఎం, డిప్యూటీ సీఎం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సాయికుల్వంత్ మందిరంలో ఉన్న సత్యసాయి మహాసమాధిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ సాదర స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసశర్మ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు దర్శించుకున్నారు.

కనువిందుగా సాంస్కృతిక ప్రదర్శనలు

హిల్‌వ్యూ స్టేడియంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

హిల్‌వ్యూ స్టేడియంలో విద్యార్థుల వేదమంత్రాలు ఆలాపనతో కార్యక్రమం ప్రారంభం కాగా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ స్వాగత ఉపన్యాసం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు నిర్వహించిన సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలు ముఖ్య అతిథులు, భక్తులను అలరించాయి.

భక్తిగీతాలు ఆలపిస్తున్న సుధా రఘునాథన్, నవీన్,

డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

పుట్టపర్తి శ్వేతశోభితం..

వేడుకల్లో భాగంగా రెండోరోజు దేశ విదేశాల నుంచి భక్తులు ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. అత్యధిక శాతం తెల్లటి వస్త్రాలు, టోపీలు ధరించి హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతం శ్వేతవర్ణ శోభితంలా మారిపోయింది. సూర్యుడి కిరణాలు తెల్లటి వస్త్రాలపై పడి మరింత మెరిసిపోయాయి. సేవాదళ్ మార్గనిర్దేశంలో భక్తులు అత్యంత క్రమశిక్షణతో ప్రశాంతి నిలయం నుంచి స్టేడియంకు చేరుకున్నారు. వేదికపై ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి చిత్రపటానికి మంగళహారతి ఇచ్చి కార్యక్రమాన్ని ముగించారు.

స్టేడియంలో భక్తజనం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాయి విద్యార్థుల సంగీత కచేరి

సాయికుల్వంత్ మందిరంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్ బృందం నాదశక్తి అనే విశిష్ట సంగీత సమర్పణ అందరినీ ఆకట్టుకుంది. సత్యసాయి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారని, అన్ని రంగాల్లో ఇచ్చిన గౌరవాన్ని, శక్తిని, గుర్తు చేసుకుంటూ మహిళభక్తి, మాతృత్వం విలువల బోధన, ఇవి అన్నీ సాయి బోధనల్లో అంతర్లీనంగా ఉన్నాయని గుర్తు చేశారు. వేలాది మంది భక్తులతో మందిరం కిటకిటలాడింది. సంగీత బృందాన్ని రత్నాకర్ సతీమణి హిమవాహిని సత్కరించారు.



బైవోల్టిన్ గూళ్లతో మార్కెట్ కళకళ

హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్‌కు బుధవారం బైవోల్టిన్ రకం అత్యధికంగా రావడంతో క్రయవిక్రయాలు, రైతులు, రీలర్లతో కళకళలాడింది. మొత్తం 6,329 కిలోల గూళ్లను 62 మంది రైతులు తీసుకొని వచ్చారు. గరిష్ఠం రూ.825, కనిష్ఠం రూ.577, సగటు కిలో రూ.757లు పలికింది. తమకు ప్రభుత్వం ప్రోత్సాహక మొత్తం అందించడం లేదని ఈ నెల 12న పట్టు రైతులు తాము పండించిన పట్టుగూళ్లను కర్ణాటకకు తరలించి, సామూహికంగా నిరసన తెలిపారు. ఆ రోజు ఎప్పుడూ లేనివిధంగా మార్కెట్ బోసిపోయిన విషయం తెలిసిందే. బుధవారం పెద్దఎత్తున పట్టు గూళ్లు రావడంతో మార్కెట్ అధికారులు, రీలర్లు హర్షం చేశారు. గిట్టుబాటు ధర లభించిందని రైతులూ ఆనందపడ్డారు. **- న్యూస్‌టుడే, హిందూపురం**

అక్రమ రవాణాకు అడ్డుకట్టేది?

యథేచ్ఛగా తరలిపోతున్న ఇసుక

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. పట్టపగలే పొక్లెయిన్లతో యథేచ్ఛగా తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమానికి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. చిత్రావతి నది చుట్టూ ఉన్న ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల పరిధిలో వాగుల నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా వ్యాపారులు ఇసుక దందా కొనసాగిస్తున్నారు.

చిత్రావతి నుంచి ట్రాక్టరులో తరలిస్తున్న ఇసుక

బిల్లులు ఉండవు.. తనిఖీలు లేవు

పీసీరేవు, సీసీరేవులో ఇసుక రీచ్‌లు కొనసాగుతున్నాయి. ఇక్కడి నుంచి ఒకే అనుమతితో పలుమార్లు, అసలు అనుమతులు లేకుండానే అనేకసార్లు టిప్పర్లతో రవాణా చేస్తున్నారు. చిత్రావతి, మద్దిలేరు వాగు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండానే ఇసుక అక్రమంగా తరలిపోతోంది. గత సెప్టెంబరు 13వ తేదీ చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను ముదిగుబ్బ పోలీసులు తనిఖీ చేసి బిల్లులు లేవని గుర్తించి సీజ్ చేశారు. ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసినప్పుడు మాత్రమే ఇలాంటివి బయటపడుతున్నాయి. రాళ్లఅనంతపురం క్రాస్ నుంచి బత్తలపల్లి వైపు చెక్‌పోస్టు ఉన్నా ముదిగుబ్బ వైపు చెక్‌పోస్టులు లేవు. దీంతో ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారు. ఇసుక రీచ్‌ల నుంచి రోజుకు 50 టిప్పర్లకుపైగా, వాగుల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక తీసుకెళ్తున్నాయి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నిరంతర తవ్వకం.. నిబంధనలు ఉల్లంఘన

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పథకాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా నిరంతరం తవ్వకాలు జరిపి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఉప్పలపాడు, పీసీరేవు, సీసీరేవుల్లో నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జర్, భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి వేల టన్నుల ఇసుక తరలించుకుపోయి అక్రమార్జనకు తెగబడ్డారు. పరిమితికి మించి తవ్వడం వల్ల భూగర్భజలాలు తగ్గి నది, వాగులపై ఆధారపడి పంటలు పండించే పరిస్థితులు కానరావడం లేదు. ఇప్పటికీ ఒకే ప్రాంతంలోనే తవ్వకాలు జరుగుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

నిఘా ఉంచుతాం

- ఓబులరెడ్డి, ఇన్‌ఛార్జి మైన్స్‌ఏడీ, పుట్టపర్తి

ఇసుక అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచుతాం. టిప్పర్లలో ఇసుక తరలించాలంటే బిల్లులు తప్పనిసరిగా ఉండాలి. నిత్యం తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం.

సాయీశ్వరునికి నృత్య నీరాజనం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో భాగంగా నృత్యకళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను అలరించింది. బుధవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ పుట్టపర్తి శిల్పారామంలో సంధ్యామూర్తి శిష్య బృందం నాగేంద్రహారాయ, శివతాండవం, సుందరమూర్తి, కళింగ నర్తన వంటి అంశాలను ఇతివృత్తంగా నాట్యాన్ని ప్రదర్శించారు.

CODE: ANCP
ANNAMACHARYA COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

ఆందోళనకర రీతిలో ఆంత్రాక్స్ విజృంభణ

● 9 గ్రామాల్లో 28 గొర్రెల మృత్యువాత
● పశుసంవర్ధక శాఖ అప్రమత్తం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. గొర్రె మూతి, ముక్కు నుంచి నురుగుతో కూడిన నల్లని గడ్డకట్టిన రక్తం బయటకు వస్తోంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు చూడటానికి బాగానే ఉంటాయి. ఉదయం లేచేసరికి చనిపోవడంతో కాపర్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 28 గొర్రెలు వ్యాధి బారిన పడి చనిపోవడం గుర్తించారు.

● ఉమ్మడి జిల్లాలో ఆంత్రాక్స్ వ్యాధి విజృంభించింది. నాలుగు నెలల్లో తొమ్మిది గ్రామాల్లో 28 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో 2, విడపనకల్లు మండలం పెంచలపాడులో 2, కూడేరు మండలం పి.యాలేరులో 10, ఆత్మకూరు మండలం శింగంపల్లి, శింగంపల్లి తాండాలో 3, కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లిలో 2, తాడిపత్రి మండలం గంగదేవపల్లిలో ఒకటి చొప్పున మృత్యువాత పడ్డాయి.

● శ్రీసత్యసాయి జిల్లాలో కనగానపల్లి మండలంలో కోనేటిపాలెంలో 6, బత్తలపల్లి మండలం దంపెట్లలో 2 చొప్పున చనిపోయాయి.

గొర్రెకు టీకా వేస్తున్న సిబ్బంది

69,973 గొర్రెలకు..

గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాధి సోకడంతో పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. ఆయా మండలాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. కాపర్లకు అవగాహన కల్పించడంతోపాటు 69,973 గొర్రెలకు టీకాలు వేశారు. అనంతపురం జిల్లాలో ఆరు గ్రామాల్లో 35,473, శ్రీసత్యసాయి జిల్లాలో రెండు గ్రామాల్లో 34,500 గొర్రెలకు టీకాలు వేశారు.

వ్యాధి నిర్ధారణ అయితే..

ఆంత్రాక్స్ వ్యాధి నిర్ధారణ అయితే గొర్రె శరీరాన్ని పోస్టుమార్టం చేయకూడదు. చనిపోయిన గొర్రెలను కాల్చివేయాలి. లేకపోతే గుంత తీసి సున్నం చల్లి పూడ్చేయాలి. మందలో చనిపోతే ఆ ఊరు చుట్టు 5 కిలోమీటర్ల మేర గొర్రెలకు టీకాలు వేయాలి. 3-5 ఏళ్లు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి. వ్యాధి సోకిన జీవాలు తిన్న గడ్డిని, దాణాను కాల్చివేయాలి. చర్మం, ఉన్ని, మాంసం, కొమ్ములు వినియోగించకూడదు.

ఉచితంగా టీకాలు

- డాక్టర్ రవిబాబు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఉమ్మడి జిల్లా)

ఆంత్రాక్స్ వ్యాధి గడ్డి తినే జంతువుల్లో బాసిల్లస్ ఆంత్రాక్స్ అను స్పోర్స్ ఏర్పరిచే బ్యాక్టీరియాతో వస్తుంది. నివారణకు టీకా ఉంది. ఈ ఏడాది 60 లక్షల డోసులు జిల్లాకు వచ్చాయి. గొర్రెలకు ప్రతి ఏటా సెప్టెంబరులో శాఖ ద్వారా ఉచితంగా టీకాలు వేస్తున్నాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. లక్షణాలు కనిపిస్తే పశువైద్యులకు తప్పనిసరిగా తెలపాలి.

తత్కాల్ టికెట్ల జారీలో మతలబు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు జంక్షన్‌లో రైలు ప్రయాణానికి సంబంధించిన తత్కాల్ రైల్వే టికెట్ల జారీలో వివాదాలకు దారి తీస్తోంది. స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ఉదయం అర గంట మాత్రమే టికెట్లు విక్రయిస్తారు. ప్రధానంగా ఏసీ టికెట్లు ఉదయం 10 గంటలకు, స్లీపర్ టికెట్లు 11 గంటలకు విక్రయిస్తారు. వీటికి ఉండే డిమాండ్ కారణంగా కొందరు దళారులు కాసులపంట పండించుకుంటున్నారు. కొందరు క్యూలైన్లలో నిలబడలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. దీనికి గాను దళారులకు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా ఇస్తున్నారు.

దబాయిస్తూ.. టికెట్లు తీసుకుంటూ!

ఎవరు ముందు టికెట్ బుకింగ్ కౌంటరులోకి చేతులు పెడతారో వారికి అధికారులు టికెట్లు ఇవ్వాల్సి ఉంది. దీంతో కొందరు రాత్రే వెళ్లి క్యూలైన్లలో ఉదయం వరకు కూర్చోవడం, నిద్రపోవడం జరుగుతోంది. ఇలా కొందరు ఇబ్బంది పడుతుంటే దళారులు రాత్రే రిజర్వేషన్ ఫారాలను బుకింగ్ కౌంటరు వద్ద పెట్టి వెళ్లిపోతారు. ఉదయం టికెట్లు ఇచ్చే సమయానికి క్యూలైన్ వద్దకు వచ్చి తాము రాత్రే ఫారాలను కౌంటరు వద్ద ఉంచామని దబాయించి టిక్కెట్లను తీసుకుంటున్నారు. రాత్రంతా క్యూలైన్‌లో నిల్చున్నవారికి అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. రైల్వే పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రిజర్వేషన్ కౌంటర్‌లో ఉన్న ఉద్యోగులు సైతం దళారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణను అడుగగా క్యూలైన్‌లో ఉన్న వారు మాత్రమే టికెట్లను పొందేవిధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైల్వే డివిజన్ : గుంతకల్లు
రైళ్ల సంఖ్య : 120
కౌంటర్లు : 02
రోజూ వారి రిజర్వేషన్లు : 1500
తత్కాల్ టికెట్ల జారీ సమయం : అర గంట

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

రొద్దం: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కంచిసముద్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు **నరేశ్** ఎంపికయ్యారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అఖిల భారత సివిల్ సర్వీసు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆయన సత్తాచాటారు. 400 మీటర్ల పరుగులో ప్రథమ, 100 మీటర్లలో ద్వితీయ స్థానంలో నిలిచారు. త్వరలో బిహార్‌లోని పట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నారు. ఆయనను తోటి ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు అభినందించారు.

గుర్తించు.. వ్యాధిని నివారించు!

క్షేత్రస్థాయిలో కుష్ఠు బాధితులపై సర్వే

తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

కుష్ఠు వ్యాధిని నివారించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా బాధితులను గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30 వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లాలోని 1,520 మంది ఆశా కార్యకర్తలతోపాటు ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కుష్ఠు నివారణ అధికారితోపాటు ఆరుగురు పారా మెడికల్ అధికారులు, డీఎన్ఎంవోతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సర్వేను పర్యవేక్షిస్తున్నారు. నివేదికల ఆధారంగా బాధితులకు చికిత్స అందించడానికి వైద్య సిబ్బంది సమాయత్తం అవుతున్నారు.

ప్రారంభంలో గుర్తిస్తే పూర్తిగా నయం

సిబ్బంది గ్రామాల్లో రోజుకు 30 నుంచి 40 గృహాలు సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించి.. కుష్ఠు లక్షణాలపై ఆరా తీస్తున్నారు. అనుమానం ఉంటే వెంటనే పరిశీలించి వారికి అవగాహన కల్పిస్తున్నారు. పరీక్షల అనంతరం బాధితులు తేలితే వారికి ఆరు నెలలు, 12 నెలల కోర్సు మందులు వాడాలని వివరిస్తున్నారు. బాధితుల పేర్లు నమోదు చేసి నిరంతరం పర్యవేక్షణతో పాటు ఔషధాలను సామాజిక, పీహెచ్‌సీల్లో ఉచితంగా అందిస్తున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కుష్ఠు లక్షణాలు ప్రారంభ దశలోనే గుర్తించి తగు చర్యలు తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు. వైకల్యం ఉంటే ప్రభుత్వం ప్రతి నెలా రూ.6 వేలు పింఛను అందజేయడంతోపాటు చికిత్సలు అందిస్తారు. జిల్లాలో గతంలో 48 మంది రోగులు ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈనెల 18 వరకు 27 మంది కుష్ఠుతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు

ప్రధాని మోదీ పుట్టపర్తి పర్యటన విజయవంతం

విమానాశ్రయంలో ప్రధాని మోదీకి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, పుట్టపర్తిపట్టణం: శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి పర్యటనను ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులు విజయవంతం చేశారు. ప్రధానితోపాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో 3 వేల మందితో బందోబస్తు కల్పించారు. ప్రశాంతి నిలయం నుంచి హిల్‌వ్యూ స్టేడియం వరకు వచ్చి, వెళ్లే భక్తుల కోసం రెండువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బస్టాండును తాత్కాలికంగా కర్ణాటకనాగేపల్లి, పడమర ద్వారం, ఆర్డీవో కార్యాలయం ప్రాంతాలకు తరలించారు. ప్రధాని మోదీ ప్రశాంతి నిలయం లోపలికి వచ్చేటప్పుడు, బయటకు వెళ్లే సమయంలో ప్రజలు, భక్తులు ఆయన్ను చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అవకాశం కల్పించారు. భద్రత చర్యలను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్వయంగా పర్యవేక్షించారు.

వినియోగదారులను మోసగించిన కేసులో ఒకరి అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వాహనాల కొనుగోలు కోసం వినియోగదారులు కట్టిన డబ్బులు పక్కదారి పట్టించి మోసగించిన కేసులో రాజేశ్‌ను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గుత్తి రోడ్డులోని ఓ మోటార్ వాహనాల షోరూం యాజమాన్యం వినియోగదారుల నుంచి అడ్వాన్సులు, మరికొందరు వాహనాల ధర మొత్తాలను చెల్లించారు. అందుకోసం కొందరు ఫైనాన్స్, బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన సొమ్మును వాహన కంపెనీకి చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారు. అయితే డబ్బులు చెల్లించినా వాహనాలు డెలివరీ ఇవ్వకపోవడంతో షోరూం యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో వారి నుంచి సరైన సమాధానం లేకపోవడంతో బాధితులు కొందరు ఆరు నెలల క్రితం వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. షోరూం యజమానుల్లో ఒకరైన రాజేశ్‌ను అరెస్టు చేసి జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు నిందితునికి రిమాండ్ విధించింది. సుమారు 40 మంది దాకా బాధితులు డబ్బులు చెల్లించి మోసపోయారని తెలిసింది.

వాలీబాల్‌లో ధర్మవరం, అనంతపురం జట్ల గెలుపు

వాలీబాల్ అండర్-14 బాలుర జట్టు ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల అండర్-14 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం కొత్తవూరు జూనియర్ కళాశాల మైదానంలో జరిగాయి. బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. బాలుర విభాగం పోటీల్లో ధర్మవరం డివిజన్ జట్టు విజేతగా, పెనుకొండ జట్టు రెండోస్థానం సాధించింది. బాలికల విభాగంలో జిల్లా ఛాంపియన్‌గా అనంతపురం డివిజన్, రన్నరప్‌గా పెనుకొండ డివిజన్ జట్టు నిలిచాయి. రెండు విభాగాల్లో పెనుకొండ జట్లు గట్టి పోరాట పటిమను ప్రదర్శించాయి. రెండు విభాగాల్లోనూ పెనుకొండ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. అండర్-14 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జట్లను ఆర్డీటీ మైదానంలో ఎంపిక చేశారు. ప్రతిభ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని పర్యవేక్షణలో జరిగాయి. పీడీలు ప్రవీణ్‌బాబు, రమేష్, మహేష్, వెంకటేష్, రాజశేఖర్, సిరాజుద్దీన్, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు సంజీవ రాయుడు, సుజాత జట్లను ఎంపిక చేశారు.

ఎంపికైన జట్ల వివరాలు..

వాలీబాల్ బాలురు జట్టు: చరణ్‌నాయక్, శ్రీకాంత్, మణికంఠ, సాకేత్, బాబాఫకృద్దీన్, అఖిల్‌సాయి, భరత్, ముఖేష్, స్కంద, చరణ్, ధీరజ్‌రెడ్డి

బాలికల జట్టు: నిహారిక, అఫ్రీన్, మోక్షిత, అమీనా, అవంతి, శరణ్య, తస్మియా, సింధు, వర్షిత, లావణ్య, చైత్ర, హర్షిత

బేస్‌బాల్ బాలికల జట్టు: స్వాతి, లాస్య, అను, స్వాతి, ఇంతియాగ్, లిఖిత, పూజిత, సౌమ్యశ్రీ, ఝాన్సీ, మౌనిక, లోకేశ్వరి, అఫ్సనా, శ్రీలత, విజయలక్ష్మి, అక్షయ, పవిత్ర

బాలుర జట్టు: రాకేష్, గోకుల్, వరుణ్, కొసినాయక్, అశోక్ చక్రవర్తి, వరుణ్ కుమార్, రోహిత్ కుమార్, చరణ్ నాయక్, బద్రీనాథ్, చైతన్య కుమార్, నరేష్, హర్షవర్ధన్, సంతోష్, అరుణ్, బన్నీ, చేతన్‌రెడ్డి.

సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు: సందీప్, రాజు, వెంకటేష్, ఉమేష్ చంద్ర, చైతన్య, నితిన్‌నాని, శివప్రసాద్, హరిసాత్విక్, ప్రవీణ్, భానుప్రభాస్, సాకేత్, ఓంకార్‌శివ, సంజయ్, మారుతి అభిరామ్.

క్రికెటోత్సవానికి వేళాయె...

దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science

TV Partner: ETV ఆంధ్రప్రదేశ్

Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat

Organised by: ఈనాడు

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు కార్యాలయం,
ఈవెంట్స్ డిపార్ట్‌మెంట్, బెంగళూరు హైవే,
రాప్తాడు, అనంతపురం - 515001
వివరాలకు: 80080 01704

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ జ్యువెలరీ/ప్రైవేట్‌లో తాకట్టు ఉన్నవి మా వద్దకు విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిప్పింగ్ గోల్డ్ ట్రేడింగ్ కు|| ✆ 7382114647

JOBS

Mypatta కంపెనీలో నైట్ షిఫ్ట్ (4.00 PM to 12.00 AM) కోసం అభ్యాసులు కావాలి. ఇంటర్ ఏదైనా డిగ్రీ చదువుతున్నవారు/ డిగ్రీ పూర్తిచేసినవారు ఫ్రెషర్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే చాలు. అభ్యర్థులందరూ అర్హులే. Cell: 9000098636.

MARKETING/ SALES

ప్రముఖ ఆయిల్ మరియు మసాలా కంపెనీకి Sales Executive కావలెను. సంప్రదించండి: 9032963185.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనకర్తలు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తలను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అటువంటి చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి ఉంది.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో.. ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.. అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం.. ఉద్యోగాల భర్తీ.. ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు.. ఇలా.. షాపులు, ఫ్లాట్లు అద్దెకు ఇచ్చేందుకు..

వివరాలకు: 8008709784

పంచముఖ రూపా.. బుగ్గరామలింగేశ్వరా

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని ప్రసిద్ధ బుగ్గరామలింగేశ్వరుని ఆలయంలో కార్తికమాస పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం పంచముఖ రూపంలో స్వామిని అలంకరించారు.

ప్రత్యేక ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం తెలిపారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్, ప్రైమరీ ఉపాధ్యాయుల పోస్టులు, తాత్కాలిక స్పీచ్ థెరపిస్ట్ పోస్టులు అర్హులతో భర్తీ చేస్తామన్నారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ పోస్టులు తిరుపతి, అనంతపురం, కడప, చిత్తూరు పాఠశాలల్లో ఒక్కొక్కటి చొప్పున, తమిళనాడులోని తిరుత్తణిలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక ఉపాధ్యాయుల పోస్టులు తిరుపతి, చిత్తూరులో ఒక్కటి చొప్పున, తిరుత్తణిలో మూడు, కడపలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ పోస్టులకు బీఎడ్ (ఎంఆర్ అండ్ ఐడీ), ప్రాథమిక ఉపాధ్యాయ పోస్టులకు డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్ అండ్ ఐడీ) పూర్తి చేసి ఉండాలి. రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉన్న ఉపాధ్యాయులకు కోర్సు పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులు. తాత్కాలిక విధానంలో భర్తీ చేసే స్పీచ్ థెరపిస్ట్ పోస్టులు తిరుపతి, అనంతపురం, చిత్తూరు, తిరుత్తణి, తిరుపతి ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో ఒక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. అభ్యర్థులు డిప్లొమా ఇన్ హియరింగ్, లాంగ్వేజ్, స్పీచ్, బీఎస్సీ (ఎ.ఎస్.ఎల్‌సీ) చేసిన వారు అర్హులు. అభ్యర్థులు దరఖాస్తులను ప్రధాన కార్యదర్శి, రాష్ట్రీయ సేవాసమితి, అన్నమయ్య మార్గ్, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి చిరునామాకు పదిరోజుల్లోగా పంపాలని సూచించారు. వివరాలకు 0877-2242404 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India (A Government of India Undertaking)

అసెట్ రికవరీ శాఖ - తిరుపతి

ఈ-మెయిల్: arb.tirupathi@unionbankofindia.bank, ఫోన్: 8328565422.

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

[illegible]

రిజర్వు ధర: రూ.1,17,00,000/-, ఇఎండి: రూ.11,70,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,20,000/-

రిజర్వు ధర: రూ.19,50,000/-, ఇఎండి: రూ.1,95,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.30,000/-

ఇ-వేలం తేదీ మరియు సమయం: 11-12-2025

ఇ-వేలం వెబ్‌సైట్ https://baanknet.com

[illegible]

తేదీ: 14.11.2025, ప్రదేశం: తిరుపతి — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వాట్సాప్ కాల్ చేస్తారు.. మొత్తం దోచేస్తారు

అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న ఎనిమిది మంది అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి బ్యాంకు ఖాతాల నుంచి రూ.2.5 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో కేసు వివరాలకు ఆయన మీడియా వివరించారు. 'ఆగస్టు 26న మనీ లాండరింగ్ కేసు పేరుతో తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి వాట్సప్ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు బదిలీ చేయమని రెండు మ్యూల్(దొంగ పేర్లతో) బ్యాంకు ఖాతాల్లో రూ.80 లక్షలు జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించి బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాతాల్లో ఉన్న రూ.2.5 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. మిగిలిన రూ.77.5 లక్షల నగదు బాధితుడి ఖాతా నుంచి ఆ రెండు బ్యాంకు ఖాతాల ద్వారా 14 రాష్ట్రాల్లోని ఇతరుల ఖాతాలకు.. చివరకు గేమింగ్ యాప్ వినియోగదారుల ఖాతాలకు చేరినట్లు గుర్తించారు.

కంబోడియా వెళ్లి.. నెట్‌వర్క్‌తో పనిచేసి

మొదట అనంతపురం జిల్లాకు చెందిన క్రాంతికుమార్, పవన్‌కుమార్ మ్యూల్ ఖాతాలకు జమైనట్లు తెలుసుకుని దర్యాప్తు చేశారు. వీరి వెనుక హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు ఓ ముఠా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆయన 2024 జనవరిలో కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌తో కలిసి పనిచేశారు. ఆ సమయంలో ఆయన విదేశీ నెట్‌వర్క్‌తో సంబంధాలు పెంచుకున్నారు. తర్వాత ఇండియాకు వచ్చి క్రాంతికుమార్, పవన్‌కుమార్‌తో పాటు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గౌతమ్‌ల ద్వారా భారీ సంఖ్యలో మ్యూల్ ఖాతాలను సేకరించారు. ఆ వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సాక్ష్యాలు టెలిగ్రామ్ ద్వారా విదేశాలకు పంపుతూ.. ప్రతి లావాదేవీపై కమీషన్ పొందేవారు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉండటంతో అరెస్టు చేశారు. మరో కీలక నిందితుడు హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన మోహమ్మద్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

● **గొలుసులు కాజేసింది బావారియా గ్యాంగే:** అక్టోబరు 4వ తేదీ తిరుపతి తూర్పు, అలిపిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు గంటల కాలంలో ఐదుగురు మహిళల మెడలోని బంగారు గొలుసులు కాజేసింది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బావారియా గ్యాంగ్ సభ్యులని ఎస్పీ తెలిపారు. తిరుపతికి రైల్లో వచ్చి ఒక ద్విచక్ర వాహనం దొంగతనం చేసి వరుసగా గొలుసులు కాజేసిన ఘటనపై కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి గుర్ముఖ్(53)ని అరెస్టు చేసినట్లు తెలిపారు. జయరాం, మోహన్ అనే మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ప్రకటించారు.

త్వరితగతిన బీటీపీ పనులు పూర్తి: ఎస్ఈ

పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ రాజస్వరూప్ కుమార్, అవినాష్ తదితరులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: నిర్దేశించుకున్న లక్ష్యంలోపు బైరవానితిప్ప కాలువ పూర్తయ్యేలా పనులు శరవేగంగా సాగుతున్నాయని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజస్వరూప్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామ సమీపంలో కొనసాగుతున్న బైరవానితిప్ప(బీటీపీ) ప్రాజెక్టు కాలువ పనులను ఎమ్మెల్యే మేనల్లుడు దేవినేని అవినాష్‌తో కలిసి ఎస్ఈ రాజస్వరూప్‌కుమార్, జేఈ సుదర్శన్ పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్‌కు కాలువ పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తం కాలువ 93.65 కిలో మీటర్లు కాగా ఇప్పటి వరకు సుమారు 40 కిలో మీటర్లు పూర్తిచేశామన్నారు. కాలువ కింద సుమారు 200లకు పైగా బ్రిడ్జిలు నిర్మించాల్సి వస్తోందన్నారు.

ప్రమాదవశాత్తు కింద పడి రైతు మృతి

గార్లదిన్నె: మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు రామకృష్ణారెడ్డి(60) ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. పురుగుమందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

శతాధిక వృద్ధుడి కన్నుమూత



అక్కులప్ప

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని గోనిపేట గ్రామానికి చెందిన ఎగువింటి అక్కులప్ప (105) అనే శతాధిక వృద్ధుడు వయోభారంతో బుధవారం వేకువజామున మరణించారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు ఉదయం గ్రామానికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన సర్పంచి నాగరాజు కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగరాజు, జయప్పను పరామర్శించారు. కార్యక్రమాల్లో తెదేపా పట్టణ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు రంగస్వామియాదవ్, సుబ్రహ్మణ్యం, చెన్నరాయుడు, న్యాయవాది అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

జూడోలో రజతం కైవసం

పతకంతో విక్రాంత్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి విక్రాంత్ సత్తాచాటి రజత పతకం సాధించాడని పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం పీడీ మాట్లాడుతూ జాతీయస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రం నుంచి విక్రాంత్ ప్రాతినిధ్యం వహించాడు. 45 కేజీల విభాగంలో పోటీపడిన విక్రాంత్ త్రుటిలో బంగారు పతకం కోల్పోయి రెండో స్థానంలో నిలిచి రజతంతో సరిపెట్టుకున్నాడు. పాఠశాల అధ్యాపకులు, గ్రామస్థులు విక్రాంత్‌ను అభినందించారు.

డిసెంబరు 13, 14న ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్

ధర్మవరం, న్యూస్‌టుడే: యువర్స్ ఫౌండేషన్, హైబ్రో చెస్ అకాడమీ ఆధ్వర్యంలో డా. ఎస్.నాగమణి మెమోరియల్ ఆల్‌ఇండియా చెస్ టోర్నమెంట్‌ను డిసెంబరు 13, 14 తేదీల్లో ధర్మవరం పట్టణంలోని కొత్తపేట సీతారామాంజనేయ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని టోర్నమెంట్ గౌరవాధ్యక్షుడు డా. బి.వి.సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం యువర్స్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో టోర్నమెంట్ వివరాలను ఆయన వెల్లడించారు. ప్రవేశ రుసుము రూ.1,200 ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తామన్నారు. మొత్తం రూ.1.25 లక్షల నగదు బహుమతులను విజేతలకు అందిస్తామన్నారు. సమావేశంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాషా, ఈశ్వరప్ప, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, జయరామ్, నైకె శ్రీనివాసులు, టోర్నమెంట్ డైరెక్టర్ జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

వైకాపా నేతలపై ఎమ్మెల్యే ఆగ్రహం

మడకశిర, న్యూస్‌టుడే: హిందూపురం వైకాపా సమన్వయకర్త దీపికారెడ్డి భర్త వేణుగోపాల్‌రెడ్డి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు మండిపడ్డారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పలువురు బాలకృష్ణ అభిమానులు వేణుగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను జీర్ణించుకోలేక వైకాపా కార్యాలయంపై దాడికి పాల్పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో తెదేపా ప్రధాన కార్యాలయం, చంద్రబాబు నివాసాలపై కొందరు వైకాపా నాయకులు మారణాయుధాలతో దాడి చేశారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ దాన్ని ఖండించకపోగా, వెటకారంగా మాట్లాడారని గుర్తుచేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: ఫళారం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **-నరసింహప్ప, స్థానికుడు**
సమాధానం: వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **-సతీష్‌బాబు, సర్పంచి, దేవరహట్టి**
సమస్య: దాసరపల్లి ఎస్సీ కాలనీలో రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. **-హనుమంతరాయప్ప**
సమాధానం: హరిత రాయబారులను పంపించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **-గౌరమ్మ, సర్పంచి, కరికెర,** –న్యూస్‌టుడే, గుడిబండ

దోమల బెడద నివారణ చర్యలు

హిందూపురం గ్రామీణం: మణేసముద్రంలో దోమల బెడద తీవ్రంగా ఉందంటూ 16న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైన సమస్యపై సర్పంచి ఉషారాణి స్పందించారు. బుధవారం పారిశుద్ధ్య సిబ్బందిని గ్రామానికి పంపించి పరిసరాలు, మురుగు కాలువలను శుభ్రం చేయించి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. పంచాయతీ కేంద్రం కగ్గల్లులో ఈఓ ఆర్డీ శివకుమార్ పంచాయతీ సిబ్బందిని పురమాయించి కాలువలను శుభ్రం చేయించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సంపద కేంద్రాలపై నిర్లక్ష్యమేల?

కానరాని వర్మీకంపోస్టు తయారీ.. రోడ్ల పక్కనే చెత్త కుప్పలు

శిరివరంలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

లేపాక్షి, హిందూపురం, పరిగి, న్యూస్‌టుడే: హిందూపురం నియోజకవర్గంలోని మూడు, పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి మండలాల్లోని పలు గ్రామాల్లో సంపద కేంద్రాల నిర్వహణపై నిర్లక్ష్యం చోటుచేసుకుంది. ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తున్నా రహదారుల వెంబడి పోస్తుండడంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

● హిందూపురం నియోజకవర్గంలో సుమారు 36, పరిగిలో 12 సంపద కేంద్రాలు ఉన్నాయి.

పంచాయతీలపై భారం

సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఆయా పంచాయతీలకు భారంగా మారింది. ఒక్కో పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు ఇద్దరు నుంచి నలుగురు ఉంటున్నారు. వీరికి నెలకు రూ.6వేలు వేతనంగా ఇస్తున్నారు. సంపద తయారీ కేంద్రాల్లో ప్రత్యేకించి కార్మికులను ఏర్పాటు చేసి నిత్యం పొడి, తడి చెత్తను విభజించాలి. తడి చెత్తతో ఎరువు తయారుచేసేలా నిత్యం పర్యవేక్షించాలి. కార్మికులను నియమించి ఈ పనులు చేయించడానికి పంచాయతీలకు భారంగా మారింది.

ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున గతంలో మంజూరు చేశారు. ప్రారంభంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసినా, తర్వాత వీటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

● ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన షెడ్లలో తడి చెత్త నుంచి వానపాముల ఎరువు తయారు చేయాల్సి ఉన్నా, ఈ ప్రక్రియ కొనసాగడం లేదు.

● గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు ఆటోలు, రిక్షాల ద్వారా ఇంటింటి నుంచి చెత్తను సేకరించి ఊరి చివర రహదారుల పక్కన పడేస్తున్నారు. మరికొందరు సంపద కేంద్రాల బయట గుట్టగా పోయిస్తున్నారు.

● ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించి వచ్చిన ఆదాయం పంచాయతీలకు జమ చేయాల్సి ఉన్నా, ఎక్కడా జరగడం లేదు.

● లేపాక్షి మండలం చోళసముద్రం, బిసలమానేపల్లి, కొండూరు, శిరివరం, కోడిపల్లి, కల్లూరు, నాయనిపల్లి, హిందూపురం మండలం పూలకుంట, చౌళూరు, కిరికెర, తూముకుంట, చిలమత్తూరు మండలం వీరాపురం, టేకులోడు, కొడికొండ, కోడూరు, పరిగి మండలం కొడిగెనహళ్లి, ఊటకూరు తదితర పంచాయతీల్లో సంపద కేంద్రాలు వినియోగంలో లేవు. గ్రీన్ అంబాసిడర్లు చెత్తను ఈ కేంద్రాలకు తరలించి ఎరువు తయారు చేసేలా చర్యలు చేపట్టాలి.

గాడిలో పెడతాం

గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను గాడిలో పెడతాం. వీటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయించాల్సి ఉంది. ఆవరణలో మొక్కలు నాటిస్తాం. తడి, పొడి చెత్త విభజన చేయించి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయిస్తాం. **-నరసింహమూర్తి, రెడ్డెప్ప, ఎంపీడీవోలు లేపాక్షి, పరిగి**

బ్రహ్మోత్సవాల ప్రచార రథం ప్రారంభం

ప్రసిద్ధి చెందిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 30 నుంచి డిసెంబరు 8 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికలు విడుదల చేసి, ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు

హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

హిందూపురం అర్బన్ (ఇందిరానగర్), న్యూస్‌టుడే: పట్టణంలోని బెంగళూరు రోడ్డు ఇందిరానగర్‌లో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో కార్తిక మాసం చివరిరోజు పురస్కరించుకుని బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన పూల రథంలో అమ్మవారిని ఉంచి భక్తుల నామస్మరణల నడుమ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం చేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యాంగిర దేవి పూజ, హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు నైపుణ్యాలు తప్పనిసరి

నాసా కిట్లు అందుకున్న విద్యార్థులతో రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి శాస్త్ర, వైజ్ఞానిక విభాగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉత్తమ అవకాశాలు దక్కుతాయని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ తెలిపారు. బెంగళూరు రోడ్డులోని చైతన్య స్కూల్‌లో చదువుతున్న 17మంది విద్యార్థులు నాసా ప్రోగ్రామ్‌కు ఎంపికైన సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని చదివితే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించి నాసా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు, నాసా ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి, జోనల్ సమన్వయకర్త తిరుమలేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం

అమ్మెంబల్ సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

రొద్దం, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు 120వ వ్యవస్థాపక దినోత్సవం, ఫౌండర్ అమ్మెంబల్ సుబ్బారావు పాయ్ జయంతి బుధవారం మండల జరిగింది. స్థానిక బ్యాంకు సీనియర్ మేనేజర్ గంగాధర్ ఆధ్వర్యంలో సిబ్బంది సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు బ్యాంకు ఖాతాదారులతో సిబ్బంది సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడారు. అమ్మెంబల్ సుబ్బారావు పాయ్ గొప్ప సామాజిక సంస్కర్త, దక్షిణ కన్నడ జిల్లా వాసుల అభివృద్ధి కోసం ఆనాడు స్థాపించిన కెనరా బ్యాంకు నేడు దేశవ్యాప్తంగా సేవలందిస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సురేశ్, అధికారి సన్ని, ఖాతాదారులు, మాజీ సర్పంచి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులకు రూ.4.5లక్షల విరాళం

రొళ్ల మండలం జీరిగేపల్లిలో వెలసిన అమ్మజి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ప్రహరీ, అదనపు గదుల నిర్మాణానికి గుడిబండ మండలం మందలపల్లి గ్రామానికి చెందిన దాతలు రూ.4.5 లక్షలు కమిటీ సభ్యులకు విరాళంగా సభ్యులకు అందజేశారు. ఆలయం కొత్త సొబగులు సంతరించుకుంటున్న నేపథ్యంలో అమ్మవారిని కొలిచే భక్తులకు ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. **-న్యూస్‌టుడే, రొళ్ల**

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు అర్హత

పెనుకొండ: క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మంత్రి సవిత తదితరులు

పెనుకొండ, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి హైజంప్, లాంగ్‌జంప్ పోటీల్లో స్థానిక ఎంజేపీ పాఠశాల విద్యార్థులు కె.దివాకర్, కె.సంతోష్‌కుమార్ సత్తాచాటి రాష్ట్రస్థాయి అర్హత సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వారిద్దరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభచూపి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయిని అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

పరిగి, న్యూస్‌టుడే: మండలంలోని శాసనకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని శాలిని రాష్ట్రస్థాయి హ్యామర్‌త్రో పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి అండర్-17 విభాగంలో చక్కటి ఆటతీరుతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీరామమూర్తి, పీడీ లోకేశ్వర తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటాలంటూ శాలినిని అభినందించారు.

పరిగి: హ్యామర్‌త్రో పోటీలకు ఎంపికైన శాలినితో ప్రధానోపాధ్యాయుడు శ్రీరామమూర్తి, పీడీ లోకేశ్వర

మడకశిర గ్రామీణం: భరత్‌కుమార్‌తో ప్రిన్సిపల్ శివరామ్, పీఈటీ అంజలి తదితరులు

మడకశిర గ్రామీణం: మండలంలోని గుండుమల ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి కె.భరత్‌కుమార్ జిల్లాస్థాయి డిస్కస్‌త్రో, షాట్‌పుట్ పోటీల్లో వరుసగా ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23, 24 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థి తలపడనున్నట్లు ప్రిన్సిపల్ శివరామ్, పీఈటీ అంజలి తెలిపారు.

హిందూపురం గ్రామీణం: అండర్-17 విభాగంలో హ్యామర్‌త్రో రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని మలుగూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని పద్మావతి, పీడీ రమేశ్‌బాబు తెలిపారు. అనంతపురంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పది, తొమ్మిదో తరగతి విద్యార్థులు రషీదా, మహేంద్రరెడ్డి ప్రతిభ చూపి స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో విజయవాడలో జరిగే పోటీల్లో విజయం సాధించాలని అభిలషించారు.



రషీదా మహేంద్రరెడ్డి

ఇందిరాగాంధీకి ఘన నివాళి

ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

గోరంట్ల, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గోరంట్ల లైబ్రరీలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయిని పద్మావతి ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె వీరవనితలు రాణి రుద్రమాదేవి, ఝాన్సీలక్ష్మీబాయి, సరోజినినాయుడు తదితరుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఆదినారాయణ, అధికారి శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి విశేషపూజలు

పుష్పాలంకారంలో మణికంఠుడు

పాండురంగనగర్ (హిందూపురం అర్బన్), న్యూస్‌టుడే: స్థానిక పాండురంగనగర్‌లోని అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామికి విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మాలధారులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం ఆలయ ఆవరణలో మాలధారులకు ఉచితంగా అల్పాహారం పెట్టారు. ఈ కార్యక్రమం 41 రోజుల పాటు కొనసాగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలచంద్ర, కార్యదర్శి వరప్రసాద్, కోశాధికారి రమేశ్ తదితరులు తెలిపారు.

బకాయిల సాధనకు పోరాటమే శరణ్యం

మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం కార్యదర్శి పెద్దన్న

పట్టు రైతుల సంఘం సమావేశంలో నాయకులు

హిందూపురం, న్యూస్‌టుడే: బైవోల్టిన్ పట్టు రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు సాధించుకోవాలంటే దశల వారీగా నిరసనలు చేపట్టాల్సిందేనని రైతు, పట్టురైతుల సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక పట్టుగూళ్ల మార్కెట్‌లో బుధవారం జిల్లా కర్షకుల, పట్టు రైతుల సంఘాల సమావేశం జరిగింది. హాజరైన జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి, కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా పట్టురైతుల సంఘం అధ్యక్షుడు సోమ్‌కుమార్, కార్యదర్శి సిద్ధారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వాలు పట్టురైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక మొత్తంతో పాటు రాయితీలు పెంచాలన్నారు. ఇప్పటివరకు బకాయిలు ఇవ్వకుండా జాప్యం చేయడంతో పంట పెట్టుబడి పెరిగిపోతోందని, ధరలు గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వానికి పలు దఫాలు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. నెల రోజుల్లో ఈ అంశంపై ప్రతి తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసనలు చేపడతామన్నారు. రెండు మాసాల్లో శాసన సభ్యులందరికీ వినతిపత్రాలు ఇస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

రైతు బాంధవుడు చంద్రబాబు

గుడిబండ: రైతులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు

గుడిబండ, న్యూస్‌టుడే: అన్నదాతలను అన్నివిధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు బాంధవుడని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. మండలంలోని దేవరహట్టి చిత్రశేఖర్ తోటలో బుధవారం సాయంత్రం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద కర్షకులకు చెక్కు అందజేసి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ ధరల స్థిరీకరణ పేరిట హామీలు గుప్పించి రైతులను ముంచారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రెండో విడత కింద కర్షకులకు ఒక్కొక్కరికి రూ.7వేలు వారి ఖాతాలకు జమ చేశారన్నారు. 43,300 మంది రైతుల కుటుంబాలకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రూ.29.22 కోట్లు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద నియోజకవర్గంలోని 42,503 మంది రైతుల ఖాతాలకు రూ.28.73 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. అనంతరం వెంకటరెడ్డిపల్లిలో అధికారులు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ కార్యాలయ సమీపంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు లబ్ధిదారులకు చెక్కులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు ఇస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అహర్నిశలు శ్రమిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు వీరయ్య, ఉప ఎంపీపీ బయప్ప, రాష్ట్ర ఎస్సీ, వడ్డెర కార్పొరేషన్ల డైరెక్టర్లు గంగాధర్, శ్రీదేవి, చిలమత్తూరు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షురాలు చెన్నమ్మ, తెదేపా మండల నాయకులు అంజినప్ప, నందీశప్ప, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

తెదేపా అనుబంధ కమిటీల అధ్యక్షుల నియామకం

చిలమత్తూరు: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చిలమత్తూరు మండల తెదేపా అనుబంధ కమిటీల అధ్యక్షులను బుధవారం నియమించారు. తెలుగు యువత అధ్యక్షుడిగా మురళీమోహన్, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, బీసీ సెల్ అధ్యక్షుడిగా అంజి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వెంకట్రాముడు, మైనార్టీ అధ్యక్షుడిగా గౌస్‌బాషా, టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడిగా హరీష్ నియమితులైన వారిలో ఉన్నారు.

అపరిశుభ్రతను పట్టించుకోరా?

పట్టణంలోని లక్ష్మీపురం రామభజన మందిరం వెనుక నున్న కృష్ణాలేఅవుట్ కాలనీలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం మురుగునీరు అపరిశుభ్రంగా మారింది. ఈ కాలనీలోని గృహాల నుంచి వచ్చే వాడుక, మురుగు నీరు కాలువ ద్వారా ఇక్కడికి చేరి నిల్వ ఉంటోంది. భరించలేని దుర్వాసనకు తోడు దోమలు పెరిగి విషజ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకొంటామన్నారు. – న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

తాగునీరు సరఫరా చేయరూ..

మండలంలోని మద్దనకుంటలో శ్రీరామిరెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన కుళాయిలు నిరుపయోగంగా మారాయి. వాటికి తాగునీరు సరఫరా చేయకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు శుద్ధి జల కేంద్రాల నుంచి తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు బాగా కురిసి సమృద్ధిగా నీరున్నా తమకు చేరడం లేదని మండిపడుతున్నారు. దీనిపై ఎస్‌ఆర్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సత్యప్రకాశ్‌ను వివరణ కోరగా, త్వరలో కుళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, గుడిబండ

ముద్దిరెడ్డిపల్లిలో సమస్యలతో సావాసం

మండల పరిధి పి.నరసాపురం పంచాయతీ ఎన్.ముద్దిరెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీలో ఐదేళ్లుగా సమస్యలు తిష్ఠ వేశాయి. కాలనీ ఏర్పాటై 30 ఏళ్లు పైనే అవుతోంది. ఇక్కడ మొత్తం 46 కుటుంబాలు నివసిస్తున్నా కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. రాత్రివేళల్లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. పంచాయతీ సర్పంచి, అధికారులు స్పందించి వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ ఎంపీడీవో విజయభాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, పరిగి

రైతు బిడ్డలు.. క్రీడల్లో దిట్టలు

గోరంట్ల, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లోని వ్యవసాయ కుటుంబాల్లో పుట్టిన చిన్నారులు క్రీడల్లో రాణిస్తున్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో తమ ప్రతిభతో విజయాలు సొంతం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ తమ సత్తాచాటి విజయాలను అందుకోవడానికి సిద్ధమవుతున్నారు. హ్యాండ్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆ చిన్నారులే.. గోరంట్ల మండలంలోని గోరంట్ల, పాలసముద్రం ఉన్నత పాఠశాలలకు చెందిన తేజ, జగన్‌మోహన్‌రెడ్డి, భవితలు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్రసాద్, రామాంజులు, వ్యాయామ ఉపాధ్యాయులు అజీంబాషా, ప్రమథ గంగరాజు పర్యవేక్షణలో సాధన చేస్తున్నారు. విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ప్రభుత్వ ఉద్యోగమే ఆశయం

బేస్‌బాల్ అండర్-17లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. ఈ నెల చివరి వారంలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి సిద్ధం అవుతున్నా. రాష్ట్రస్థాయిలో రాణించి, క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా ఆశయం.
-భవిత, 9వ తరగతి, వెలిదడకల, జడ్పీ ఉన్నత పాఠశాల, పాలసముద్రం

జాతీయ స్థాయిలో రాణించాలి

మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు కళావతి, రాము వ్యవసాయ కూలీలు. కష్టపడి నన్ను చదివిస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయిలో ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. పల్నాడు జిల్లాలో డిసెంబరు మొదటి వారంలో జరిగే పోటీల్లో విజయం సాధించాలని సాధన చేస్తున్నా. పీడీ అజీంబాషా మెలకువలు నేర్పుతున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై రాణించాలన్నదే నా ధ్యేయం.
-తేజ, 9వతరగతి, కె.రాగిమాకులపల్లి, బాలుర ఉన్నత పాఠశాల, గోరంట్ల

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

నేను పాలసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. బేస్‌బాల్ అండర్-17 పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఈనెల 27 నుంచి 29 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి సాధన చేస్తున్నా. చదువుతోపాటు బేస్‌బాల్‌లో రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నదే నా లక్ష్యం. **- జగన్‌మోహన్‌రెడ్డి, కళ్లగేరి**

ఏడేళ్ల నిరీక్షణకు తెర

పీహెచ్‌సీకి కొత్త శోభ

రంగులతో ఆకట్టుకుంటున్న ఆసుపత్రి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం కొత్త రంగులతో మెరిసిపోతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో ఏడేళ్లుగా రంగులు వెలిసిపోయి అధ్వానంగా మారింది. 30 ఏళ్ల క్రితం ఇక్కడి గాంధీనగర్‌లో అప్పటి ప్రభుత్వం పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించింది. అసౌకర్యాల నడుమ రోగులు, గర్భిణులు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద మౌలిక వసతుల కల్పనకు రూ.40లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. కడప జిల్లాకు చెందిన గుత్తేదారు భవనం పైకప్పు, మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు విద్యుత్తు వైరింగ్, పంకాలు, స్విచ్ బోర్డులు, దీపాలు వేశారు. పాత జాతీయ రహదారి నుంచి ఆసుపత్రి లోపలి వరకు 60 మీటర్లకుపైగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన భవనానికి రంగులు వేయకుండా వదిలేశారు. ఏడేళ్లు అవుతున్నా జిల్లా వైద్య ఆరోగ్యాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే.

మంత్రి సవితకు వినతి: ఇటీవల కొత్త ప్రజారోగ్య యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర మంత్రి సవితకు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమస్యలు ఏకరవు పెట్టారు. కొత్త భవనం కావాలని కోరారు. ఈక్రమంలో ఉన్నత అధికారులు స్పందించారు. స్థానిక వైద్యాధికారులు ఓంకార్, ఆయేషా తస్నీమ్, పర్యవేక్షకులు రత్నమ్మ, రవీంద్ర పర్యవేక్షణలో భవనానికి కొత్త రంగులు వేయించారు. గోడలపై ఆరోగ్య సూత్రాలు, గర్భిణుల ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన చిత్రాలు వేయిస్తున్నారు. దీనిపై మండలవాసులు, రోగులు, గర్భిణులు హర్షం వ్యక్తం చేశారు.

CHANGE OF NAME
I, **S.SOMASEKHAR** (New Name), S/o S.SANJIVAPPA, # 3-34, Kothapalli (V), Magecheruvu, Somandepalli (M), Sri Satyasai (Dist), A.P. Have changed my name from **SHANKAR** (Old Name) to **S.SOMASEKHAR** (New Name). Hence forth, I Will be called as **S.SOMASEKHAR** for all purposes.

CHANGE OF NAME
I, **BELLAM NISHANTH CHOWDARY** (New Name), S/o B.PRASAD, # 1-162, Konapuram (V), Penukonda (M), Sri Satyasai (Dist), A.P. Have Changed My Name From **CHINNA** (Old Name) to **BELLAM NISHANTH CHOWDARY** (New Name), And Date of Birth From **01-01-2010** (Old Date) to **07-11-2010** (New Date). Hence forth, I Will be called as **BELLAM NISHANTH CHOWDARY** (New Name) and **07-11-2010** (New DOB) for all purposes

(c) eenadu

విద్యార్థుల చిత్రకళా నైపుణ్యం భళా

చిత్రాలతో విద్యార్థులు

నంబులపూలకుంట, గాండ్లపెంట, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చక్కటి చిత్రాలు గీశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేశారు. మహిళ సాధికారతలో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి జరిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు ఫరియాభాను, శాంతమ్మ, ఉపాధ్యాయులు రుక్సానా, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో పట్టణానికి చెందిన మానస నృత్య కళాకేంద్రం కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాల్లో 25 మంది కళాకారులు పాల్గొని నృత్య అభినయంతో భక్తులను అలరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు కళాకారులను అభినందించి, సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: తలుపుల మండలం బండ్లపల్లి పంచాయతీ పల్లావాండ్లపల్లిలో పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోతుంది. మరమ్మతులు చేయించాలి. **- గ్రామస్థులు**
సమాధానం: మరమ్మతులు చేపడతాం.
- తహసీన్, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, తలుపుల

సమస్య: నల్లచెరువు మండలం కె.పూలకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీ దగ్గర తాగునీటి పైపులైను, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు కోసం తవ్విన గుంతలు, కాలువలను అలాగే వదిలేశారు. రాత్రివేళ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతలను పూడ్చివేయాలి. **- భరత్‌కుమార్, బాబాఫక్రుద్దీన్**
సమాధానం: స్తంభాలు, పైపులైన్లు ఏర్పాటు చేసి గుంతలు పూడ్చివేయిస్తాం.

సమస్య: కె.పూలకుంటలోని ప్రభుత్వ పాఠశాల ఎదుట రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేయాలి. **- రామాంజనేయులు, మల్లికార్జున**
సమాధానం: గుంతలు పూడ్చివేస్తాం.

సమస్య: కె.పూలకుంట గ్రామంలోని పలు వీధుల్లో దీపాలు లేవు. వెంటనే ఏర్పాటు చేయాలి. **- ఆదెప్ప, రామ్మోహన్**
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- వెంకటేష్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, నల్లచెరువు

శత జయంతి ఉత్సవం.. జనం పరవశం

ప్రశాంతి నిలయం వద్ద భక్తజన సందోహం

కదిరి, పెనుకొండ, బుక్కపట్నం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ పుట్టపర్తికి విచ్చేశారు. విమానాశ్రయం నుంచి ప్రధానితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలిసి ఒకే వాహనంలో మహా సమాధి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా నిలిచి ఉన్న ప్రజలు వారికి చేతులెత్తి నమస్కరించారు. ఇందుకు ప్రధాని అభివాదం చేస్తూ కాన్వాయ్‌లో ముందుకెళ్లారు. బాబా మహా సమాధి దర్శనానికి ప్రధాని, సీఎం వెళ్లటంతో ఎక్కడి జనాన్ని అక్కడే ఆపేశారు. తిరిగి హిల్‌వ్యూ స్టేడియంకు వారు రావటంతో జనం ఉత్సాహంతో భారత్‌మాతాకి జై, నరేంద్ర మోదీకి జై అంటూ నినాదాలు చేస్తూ సభాప్రాంగణం వైపు పరుగులు తీశారు. వృద్ధులు పోటీ పడలేక ఓవైపు నేలపైనే సేదదీరారు.

మోదీని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ప్రధానికి ఘన స్వాగతం

పుట్టపర్తి: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సత్యసాయి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం 9.50 గంటలకు ప్రత్యేక విమానంలో దిల్లీ నుంచి పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ప్రభుత్వ కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, పరిటాల సునీత, ఎంఎస్‌రాజు, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రశాంతినిలయం చేరుకున్నారు.

వేడుకకు తరలివస్తున్న ఒడిశా భక్తులు

అడ్డంకులు దాటుతూ.. భక్తి చాటుతూ

కదిరి, పెనుకొండ, బుక్కపట్నం, న్యూస్‌టుడే: అడ్డంకులు అధిగమిస్తూ బాబా భక్తులు భక్తిభావాన్ని చాటుకున్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు వచ్చిన భక్తులు పాట్లుపడుతూ బాబా మహాసమాధి దర్శనానికి వెళ్లటమే ఇందుకు నిదర్శనం. జయంత్యుత్సవాలకు ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికారులు భారీ బందోబస్తు, సౌకర్యాలు కల్పించారు. భద్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన బారికేడ్ల దారిని ఖాళీగా పెట్టి, ఆవతలివైపునే వెళ్లాలనడంతో జనం ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల నోళ్లు తెరచుకున్న డ్రైనేజీలు, రాళ్లను, సిమెంటు రింగులను ఎక్కిదిగుతూ మహాసమాధిని దర్శించుకున్నారు. వృద్ధులు సైతం వయోభారాన్ని లెక్కచేయకుండా అక్కడక్కడ సేదతీరుతూ ముందుకు సాగారు.

సాయికుల్వంత్ మందిరంలో మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్

పుట్టపర్తిలో ప్రధాని కాన్వాయ్.. రోడ్డుకిరువైపులా భక్తులు

గోదానం పత్రం అందిస్తున్న మోదీ

ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థుల సత్తా

విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ నాగార్జున

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాధన ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులు ఉపన్యసించారు. ఎ.ఫైజాఅంజుమ్ ఎనిమిదో తరగతి, ఎస్.ఉదయ్‌కుమార్ పదో తరగతి, కె.నవనీత తొమ్మిదో తరగతి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ నాగార్జున చేతులమీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నాగరాజు, భువనేశ్వరిదేవి, రఫియా, శైలజ పాల్గొన్నారు.

పుస్తక పఠనం మంచి అలవాటు

మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణమోహన్

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: పుస్తక పఠనం మంచి అలవాటు అని, ప్రతి పుస్తకం ఓ గొప్ప మలుపును తీసుకువస్తుందని ఎంఈవో కృష్ణమోహన్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలు జరిగాయి. తాడిమర్రి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాషపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. అనంతరం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు శీనానాయక్, అంజలీ సౌభాగ్యవతి, హెచ్‌ఎం అరుణ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

కనగానపల్లి, న్యూస్‌టుడే: సత్ప్రవర్తనతో చదివినప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించడం సాధ్యమవుతుందని గ్రంథాలయ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతిని సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఇందిరాగాంధీకి నివాళి

చెన్నేకొత్తపల్లి: దేశ ప్రగతిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కృషి ఎనలేనిదని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా, సీకేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓబుళమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రాయితీపై ఉలవల పంపిణీ

నల్లమాడ, న్యూస్‌టుడే: స్థానిక ఆర్‌ఎస్‌కేలో మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌హాక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది నారాయణస్వామి, శిరీష బుధవారం రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు. కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. తెదేపా మండల కన్వీనర్ శంకర్, బలిరెడ్డి, రామచంద్ర, బాబావలి పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

తనకల్లు, న్యూస్‌టుడే: వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ తీగలను ఎత్తుకెళ్లిన ఘటనలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం ఎద్దులవారిపల్లికి చెందిన కన్నెమడుగు శంకరప్ప అనే నిందితున్ని బుధవారం రిమాండ్‌కు తరలించారు. రాచువారిపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి, తనకల్లుకి చెందిన శివారెడ్డి, మియాసాబ్‌లకు చెందిన కేబుల్ తీగలను శంకరప్ప ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం ఓరుగంటివీధిలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి యజమాని అమృతవల్లి ఈనెల 12న ఇంటికి తాళం వేసి మదనపల్లి వెళ్లారు. బుధవారం వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. దొంగలు బీరువాలోని ఒకటిన్నర తులం బంగారం, వెండి వస్తువులు, రూ.1.10 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పుట్టపర్తి అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సాస్కీ పథకం నుంచి రూ.35 కోట్లు నిధులు కేటాయించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుట్టపర్తికి వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అమడగూరు, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓడీసీ తదితర ప్రాంతాల నుంచి పుట్టపర్తికి చేరే రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రహదారుల పనుల ప్రారంభోత్సవానికి రావాలని ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

పవన్‌కల్యాణ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి

- పుట్టపర్తిలో అంతర్జాతీయ స్థాయిలో స్టేడియం ఏర్పాటుకు సహకారం అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాజీ క్రికెటర్ సచిన్‌టెండూల్కర్‌ను కలిసి కోరారు.
- విమానాశ్రయం అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: దేశానికి సేవ చేయడమంటే జన్మభూమి రుణం తీర్చుకున్నట్లేనని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ (రాయలసీమ రేంజ్) కల్నల్ అలోక్ త్రిపాఠి తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులతో సమావేశమయ్యారు. వారితో కల్నల్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్ణయించేది యువతేనని, నాయకత్వ లక్షణాలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. జీవితంలో అత్యున్నత స్థానాలను అధిరోహించేందుకు ఎన్‌సీసీ చక్కగా ఉపయోగపడుతుందని, అందులో చేరాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కమాండింగ్ అధికారులు మానీష్ సుబ్బా, రోద్రీజ్, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులతో కల్నల్ అలోక్ త్రిపాఠి

రైతుల కళ్లలో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, అధికారులు, నాయకులు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో బటన్ నొక్కితే కొందరికి మాత్రమే లబ్ధి చేకూరిందని, కూటమి ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండిలో రెండో విడత పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 51,487 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వల్ల రూ. 35.98 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం ప్రధాని చేతుల మీదుగా సత్కారం అందుకున్న బత్తలపల్లి మండలం రాఘవంపల్లికి చెందిన మహిళా రైతు గంగమ్మను సత్కరించారు. రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు. ఏడీఓ అల్తాఫ్ అలీ ఖాన్, ఏఓ మురళీకృష్ణ, తెదేపా మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, దామాజిపల్లి సొసైటీ అధ్యక్షుడు నరసింహులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబిలేశు, తెలుగు మహిళా కార్యదర్శి రామసుబ్బమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

కదిరి: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం రెండో విడత అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం విడుదల కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 44,981 మంది రైతులకు మంజూరైన రూ.3,020 లక్షల చెక్కును నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నిసా, స్వచ్ఛంధ్రా మిషన్ డైరెక్టరు పర్వీన్‌భాను, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, నాయకులు బహువుద్దీన్, రమణ, శంకర, ఉమాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలంలోని పోతులకుంట గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, అధికారులు హాజరయ్యారు. నియోజకవర్గంలో 44,348 మంది రైతుల ఖాతాలకు రూ.29.95 కోట్లు జమ అవుతాయన్నారు. ప్రభుత్వ రాయితీతో మంజూరైన బిందు, తుంపర, డ్రోన్, ఇతర పరికరాలను ఎమ్మెల్యే రైతులకు అందించారు.

కదిరి: చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, ఇతర నాయకులు

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె

రహదారిపై మురుగు.. పరుగు

గాండ్లపెంట మండలం జీనులకుంట మార్గంలో ఉన్న కాలువ చెత్తతో నిండటంతో మురుగు పొంగి రహదారిపై పారుతుంది. స్థానికులు, ఆయా గ్రామాల ప్రజలు మురుగు తొక్కుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాలువ శుభ్రం చేయించి రహదారిపై మురుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయాన్ని పంచాయతీ కార్యదర్శి శివమూర్తి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి శుభ్రం చేయిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, గాండ్లపెంట**

అడుగుకో గుంత.. ప్రయాణికుల చింత

ఇటీవల కురిసిన వర్షాలతో కదిరి- హిందూపురం ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. పట్టణంలోని టవర్‌క్లాక్ నుంచి వీవర్స్‌కాలనీ సమీపంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వరకు అడుగడుగునా గుంతలు పడ్డాయి. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సమస్యను జాతీయరహదారుల ఏఈ సుజిత దృష్టికి తీసుకెళ్లగా గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కదిరి పట్టణం**

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ప్రవల్లికతో హెచ్‌ఎం, పీఈటీ

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండలంలోని కొడవండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రవల్లిక రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు బుధవారం ప్రధానోపాధ్యాయుడు రామానాయుడు, పీఈటీ శాంతలింగం తెలిపారు. ఇటీవల రాప్తాడులో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో జరిగిన ఖోఖోపోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ నెల 23వ తేదీన విజయనగరంలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. ముదిగుబ్బలోని పీవీఎస్ పాఠశాలలో చదువుతున్న సునీల్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ వెంగమనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ జ్యోతియాదవ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

జాతీయస్థాయి టెన్నిస్ పోటీలకు శివకృష్ణ

ధర్మవరం: పట్టణానికి చెందిన బి.శివకృష్ణ సివిల్ సర్వీసెస్ లాన్‌టెన్నిస్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో బుధవారం జరిగిన ఈ పోటీల్లో ఆయన తృతీయ స్థానంలో నిలిచి గుజరాత్‌లో డిసెంబర్ 16 నుంచి జరిగే పోటీలకు ఎంపికయ్యారు. శివకృష్ణ కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన్ను హెచ్‌ఎం మంజులావాణి, ధర్మవరం కళాజ్యోతి అధ్యక్షుడు నారాయణప్ప, కార్యదర్శి రామకృష్ణ అభినందించారు.

22న లక్ష్మీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నంబులపూలకుంట: తిమ్మమ్మమర్రిమాను సమీపంలో ఓబుళదేవరగుట్టలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 22న లక్ష్మీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇద్దరి దురాశ.. అందరికీ తప్పని ప్రయాస

ఆర్డీవో పరిశీలించినా పరిష్కారానికి నోచుకోని రోడ్డు సమస్య

నాలుగేళ్లుగా స్తంభించిన రోడ్డు మార్గమిదే

కొత్తచెరువు, న్యూస్‌టుడే: పూర్వం నుంచి ఉన్న దారిని పొలంలో కలుపుకోవాలనే ఇద్దరి రైతుల దురాశ.. ఈమార్గంలో పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. నాలుగేళ్ల క్రితం ఇద్దరు రైతులు పూర్వం నుంచి ఉన్న మార్గాన్ని మూసివేయడంతో 6 కిలోమీటర్ల దూరం చుట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని కొత్తచెరువు మండలం చెన్నరాజుపల్లి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పూర్వం నుంచి సర్వే నంబరు 614లో రోడ్డు మార్గం ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఉన్నూరమ్మ అనే రైతు సర్వే నంబరు 614లో 2.95 ఎకరాల్లో రోడ్డుకు వదిలిన భూమిని విక్రయించారు. ఆతరువాత ఇదే సర్వే నంబరులో మిగిలిన భూమిని కొనుగోలు చేసిన ఇద్దరు రైతులు దారిని పొలంలో కలుపుకోవాలనే దురాలోచన సమస్యకు దారితీసింది. గత వైకాపా ప్రభుత్వం హయాంలో రాజకీయ అండదండలతో రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు వేసి బంద్ చేయడం గ్రామ సమస్యగా మారింది.

పరిసర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

బండ్లపల్లి పంచాయతీలోని చెన్నరాజుపల్లి గ్రామానికి తూర్పువైపు వందలాది ఎకరాల వ్యవసాయ పొలాలకు మార్గం లేక నాలుగేళ్లుగా రైతులకు పాట్లు పడుతున్నారు. ప్రతి వారం పరిసర గ్రామాల నుంచి అమాసమ్మ దేవాలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదని భక్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన పశువులు, గొర్రెల పెంపకం దారులు రోజూ ఆరు కిలోమీటర్లు దూరం చుట్టుకుని వెళ్లడం ఎంతో కష్టంగా ఉందని వాపోతున్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు దగ్గర దారి మూసివేయడంతో చుట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఏడాది కిందట ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించినా సమస్య పరిష్కరించకపోగా ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారు.

తారురోడ్డు నిర్మాణానికి అడ్డంకి

గోరంట్ల ప్రధాన రహదారి నుంచి పుట్టపర్తి మండలం రాచువారిపల్లి, చెన్నరాజుపల్లి మీదుగా బండ్లపల్లి వరకూ కోట్ల రూపాయలు వెచ్చించి తారు రోడ్డు నిర్మిస్తున్నారు. సర్వే నంబరు 614 వరకూ తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. సమస్య ప్రదేశంలోనే వంగపేరు నదిపై రూ.3.87 కోట్లతో వంతెన నిర్మాణం పనులు కూడా జరుగుతున్నాయి.

పొలాలకు ఎలా వెళ్లాలి

వ్యవసాయమే జీవనాధారం. 20 ఏళ్ల కిందట రెండెకరాల భూమి కొన్నాను. పొలానికి వెళ్లే దారిని నాలుగేళ్ల కిందట బంద్ చేశారు. గ్రామానికి చెందిన వందలాది మంది రైతులకు వ్యవసాయ భూములున్నాయి. దీంతో పొలానికి వెళ్లాలంటే 6 కిలోమీటర్లు చుట్టుకుని వెళుతున్నాం. పూర్వం నుంచి ఉన్న రోడ్డును బంద్ చేసినా అధికారులు చూసి వెళుతున్నారేగాని పరిష్కారం చేయడం లేదు. **- వెంకటరాముడు, రైతు, చెన్నరాజుపల్లి**

రైతులకు నిధుల విడుదలపై హర్షం

నల్లమాడ, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం నిధుల విడుదలపై మండల తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా స్థానిక సత్యమ్మ గుడి సన్నిధిలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వంలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ నాగేనాయక్, మాజీ డైరెక్టరు నరసింహులు, డా. నాగభూషణనాయుడు, లక్ష్మన్న, పూల రామయ్య, బాబావలి పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

కనగానపల్లి: కూటమి ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తోందని మార్కెట్ యార్డు ఛైర్మెన్ సుధాకర్ నాయుడు, మండల కన్వీనర్ యాతం పోతలయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు రమణ పొలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు రైతులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు.

చిన్నారి అదృశ్యంపై ఫిర్యాదు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన రాధమ్మ, రెడ్డెప్పల కుమార్తె చిన్నారి అదృశ్యంపై ఎన్పీకుంట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ కిశోర్‌రెడ్డికి ఛైల్డ్‌లైన్ రక్షణ సభ్యులు నాగలక్ష్మి, సీడీపీఓ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు. . గత నెల 17న చిన్నారి తండ్రి రెడ్డెప్ప పసికందును వెలిగల్లు జలాశయం సమీపంలో వదిలివెళ్లాడు. స్థానికులు గమనించి ఎన్పీకుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారిని అన్నమయ్య జిల్లా గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో ఎన్పీకుంట ఎస్ఐ వలిబాషా అప్పగించారు. ఆ తర్వాత వివరాలు సేకరించి చిన్నారిని అమ్మమ్మ గంగాదేవి, తల్లి రాధమ్మకు అప్పగించారు. తండ్రి ప్రవర్తన సరిగా లేకపోవడంతో చిన్నారిని పుట్టపర్తిలోని సంరక్షణ నిలయానికి తరలించారు. మూడు రోజులకే అమ్మమ్మ, తల్లి అధికారులకు నచ్చజెప్పి పాపను తీసుకొచ్చారు. అయితే తల్లిదండ్రుల పవర్తన సరిగా లేకపోవడంతో ఈ నెల 15న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది తనిఖీకి వెళ్లారు. పాపను అప్పగిస్తామని అమ్మమ్మ చెప్పడంతో సిబ్బంది సంరక్షణ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఈమేరకు బుధవారం అధికారులు ఎన్పీకుంటకు వచ్చారు. పాపకు ఆరోగ్యం సరిగా లేకుంటే మంగళవారం రాయచోటికి తీసుకెళ్లామని, అక్కడ గుర్తుతెలియని మహిళ తమను ఏమార్చి పాపను తీసుకెళ్లి పోయినట్లు అమ్మమ్మ గంగాదేవి తెలిపింది. ఈ విషయంపై ఐసీడీఎస్ అధికారులు బుధవారం ఎన్పీకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

(c) eenadu

ఆదుకొనండయ్యా..!

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. చాలా మండలాల్లో పంట కోత కోసేశారు. దాన్ని దాచుకునే దారి లేక కొందరు రైతులు తక్కువ ధరకే దళారులకు విక్రయించేస్తున్నారు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలను తెరవాలని రైతులు కోరుతున్నారు. కొత్తూరు మండలం కలిగాం గ్రామంలోని ఓ కల్లంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యాన్ని చిత్రంలో చూడొచ్చు. – న్యూటుడే, కొత్తూరు

వద్దనుకుంటే రండి.. ఊయలలో వేయండి

జన్మనిచ్చిన తర్వాత చాలా మంది అభం శుభం తెలియని పసికందులను అనాథల మాదిరిగా వదిలేస్తుంటారు. అలా చేయకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆసుపత్రుల్లో ఊయలను సిద్ధం చేసింది. ఎవరైనా పిల్లల్ని కని వద్దనుకుంటే అందులో వేయాలని జిల్లా బాలల రక్షణ విభాగం ప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. దత్తత అవగాహన మాసోత్సవాల సందర్భంగా నరసన్నపేట ప్రాంతీయాసుపత్రిలో బుధవారం ఆరోగ్య సిబ్బందికి కార్యక్రమం గురించి వివరించారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

పెట్టుబడి వల.. చిక్కితే విలవిల..!

● యాప్‌లో లాభాల పేరుతో సైబర్ మోసాలు

★ ఎచ్చెర్లకు చెందిన ఓ యువకుడు యాప్‌లో రూ.20 వేలు పెట్టుబడి పెడితే గంటలోపే అతనికి ఖాతాకు రూ.7,400 జమయ్యాయి. ఆ తర్వాత తన స్నేహితులతోనూ పెట్టుబడి పెట్టించగా.. వారిలో ఇద్దరికి మాత్రమే రూ.14,800 తిరిగి వచ్చాయి. మరో రెండు గంటల్లో మిగిలిన వారికి జమ అవుతాయని ఫోన్ వచ్చింది. దీంతో అత్యాశకు పోయి తన సోదరుడికి ఫోన్ చేసి మరో రూ.లక్ష జమ చేయించాడు. కాసేపటి తర్వాత యాప్ పని చేయకపోవడంతో మోసపోయామని తెలిసి లబోదిబోమన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో చెలరేగుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పంపి వల విసురుతున్నారు. ప్రముఖ కంపెనీల పేరు చెప్పి... ఫలానా యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారు. చెప్పినట్లు గానే మొదట్లో అధిక మొత్తాన్ని వడ్డీగా జమ చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు పెట్టుబడి పెట్టేలా ఆకర్షిస్తున్నారు. కొందరు అత్యాశతో వారి ఉచ్చులో పడి రూ.లక్షలు అప్పగించేస్తున్నారు. తేరుకునేలోగా కేటుగాళ్లు మాయమైపోతున్నారు.

★ శ్రీకాకుళం నగరానికి చెందిన కొందరు విశ్రాంత ఉద్యోగులకు ఉదయపు నడక సమయంలో ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఫలానా యాప్‌లో పెట్టుబడి పెడితే వడ్డీ బాగా వస్తుందని వారిని నమ్మించాడు. వారితో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి మరింత దగ్గరయ్యాడు. అతని మాటలు నమ్మి కొందరు ఆ యాప్‌లో రూ.లక్షలు డిపాజిట్ చేశారు. మరుసటి రోజు నుంచి ఆ వ్యక్తి మైదానానికి రాకపోవడంతో పాటు వాట్సాప్ గ్రూప్ నుంచి సభ్యులందర్నీ ఏక కాలంలో తొలగించి మాయమయ్యాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

● జిల్లాలో వాట్సాప్ గ్రూప్‌లో చేరి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన విశ్రాంత ఉద్యోగుల సంఖ్య: 120 మందికిపైగా

● వారి నుంచి కొట్టేసిన సొమ్ము: సుమారు రూ.2 కోట్లు

యువత, వృద్ధులే అధికం..

ఇలాంటి మోసాలకు గురవుతున్న వారిలో ఎక్కువ మంది యువత, వృద్ధులే ఉంటున్నారు. ఉద్యోగ విరమణతో ప్రశాంత జీవనం సాగిస్తున్న వారిపై ఈ తరహా మోసాలతో పిడుగు పడినట్లవుతోంది. అత్యాశకు పోయి ఎంతో మంది మానసిక వేదనకు గురవుతున్నారు. చాలా మంది ఫిర్యాదు చేసేందుకు సైతం ముందుకు రాకుండా లోలోపల మదనపడిపోతున్నారు.

1930కు ఫిర్యాదు చేయండి..

యాప్‌ల్లో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయం వస్తుందని అత్యాశకు పోవద్దు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు. అటువంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి. జిల్లాలో ఎవరైనా ఆ విధంగా మోసపోతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫిర్యాదు చేయండి.

– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

సాగు విధానాలు మారితేనే కొబ్బరికి మంచి రోజులు..!

అంబాజీపేట ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ముత్యాల నాయుడు

– న్యూస్‌టుడే, సోంపేట

'జిల్లాలో కొబ్బరి సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. నాణ్యత, పరిమాణం బాగుంటాయి. అందుకే ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున ఎగుమతులు జరుగుతుంటాయి. కొంతకాలంగా తుపాన్లు, చీడపీడలు, ఇతర సమస్యలతో ఉద్దానం కొబ్బరి సీమ ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. నష్టాల నుంచి బయట పడాలన్నా.. కొబ్బరి రైతులకు మంచి రోజులు రావాలన్నా సాగు, యాజమాన్య విధానాల్లో మార్పు రావాలి' అని అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రం అధిపతి, ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు పేర్కొన్నారు. రైతులు చేపట్టాల్సిన చర్యలు, కొత్త సాగు విధానాలను ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు.

కవిటి ఉద్దానంలో చీడపీడలు ఆశించిన కొబ్బరి తోట

జిల్లాలో కొబ్బరి తోటల విస్తీర్ణం: 40 వేల ఎకరాలు

ఏటా జరిగే లావాదేవీలు: రూ.600 కోట్లకుపైగానే

తుపాన్లను తట్టుకునే పొట్టి రకాలు..

ఉద్దానం ప్రాంతమైన ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఎక్కువ తోటలున్నాయి. ఆయా తోట్ల ఈస్టు కోస్టు టాల్(ఈసీటీ) రకాలు ఎక్కువగా పెంచుతారు. అవి పొడవుగా ఉండటంతో తుపాన్ల వేళ నష్టాలు జరుగుతున్నాయి. హైబ్రిడ్, తుపాన్లను తట్టుకునే పొట్టి రకాల మొక్కలు నాటుకుంటే నష్టతీవ్రత తగ్గుతుంది. గంగ, వైశాలియ గంగ, వశిష్ఠ గంగ వంటివి కూడా సాగు చేయొచ్చు. కొత్త రకాల సాగుకు జిల్లాలో పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో అంచెలంచెలుగా పాత చెట్లు తొలగిస్తే సమస్యలు అధిగమించొచ్చు.

నిపుణుల మాట

అంతర పంటల సాగుతో ఆదాయం..

కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగు ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. అరటి, కోకో, కంద, పసుపు, కూరగాయలు ఇతర పంటలు సాగుకు జిల్లా తోటలు అనువుగా ఉన్నాయి. సంబంధిత పంటలకు డిమాండ్ కూడా ఉండటంతో దిగుబడులు తగ్గినా, చీడపీడలు, ఇతర సమస్యలు ఏర్పడినప్పుడు రైతులకు అంతర పంటలు ఆదుకునే అవకాశం ఉంటుంది.

నివారణ చర్యలు అత్యవసరం..

నవంబరు, డిసెంబరు నెలల్లో దోమ ఆశించే పరిస్థితి ఉండటంతో ముందుగానే సమగ్ర యాజమాన్య పద్ధతి ద్వారా నివారణ చర్యలు చేపట్టాలి. దోమ రాకుండా అడ్డుకోవడానికి వేప నూనె కొబ్బరి ఆకుల అడుగు భాగం తడిసేలా పిచికారీ చేయాలి. ఎస్‌ఓరియా శిలీంద్రం 5 గ్రాముల నీటిలో కలిపి ఆకులపై చల్లాలి, చెట్టుకు రౌండ్‌గా పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి. నల్లముట్టి పురుగుతో చెట్లు కాలిపోయిన మాదిరిగా తయారవుతాయి. అలాంటప్పుడు ఎండిన ఆకులను తొలగించి గొనియోడశ మిత్ర పురుగులను పది శాతం చెట్లకు విడిచి పెట్టి సిఫార్సు చేసిన ఎరువులు వినియోగిస్తే చీడపీడలను నివారించొచ్చు.

మిస్సమ్మ బంగ్లా కథ.. కొలిక్కి వచ్చేనా..?

● పరాధీనంలో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే టెక్కలి

అది రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి. టెక్కలి నడిబొడ్డున ఉంది. దశాబ్దాల కిందట పరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు చేపట్టాల్సిన చర్యల విషయంలో వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. అడ్డగోలుగా సాగిన వ్యవహారంలో కనీసం అప్పటి అధికారులు ప్రభుత్వం తరఫున కౌంటరు వేయకుండా వ్యూహాత్మకంగా తప్పిదాలు చేస్తూ వచ్చారు. కూటమి సర్కారు దృష్టి సారించి సంరక్షించే దిశగా అడుగులు వేయాలని అంతా కోరుతున్నారు.

టెక్కలిలోని మిస్సమ్మ బంగ్లా భూమి

ఆచరణలో పెడితేనే..

మొత్తం 2.81 ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఇటీవల రెండుగా విభజించారు. 1.05 ఎకరాల్లోని నిర్మాణాలు, ఖాళీ స్థలాలను గుర్తించారు. 2019లో అక్కడ 15ఏళ్ల ముందు జరిగిన నిర్మాణాలను క్రమబద్ధీకరించనున్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి వాటిపై సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే కార్యాచరణ పూర్తి చేశారు. దాన్ని వీలైనంత త్వరగా ఆచరణలో పెడితే బాగుంటుందని అంతా భావిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

★ టెక్కలి పాత బస్టాండు, చెక్కబాలన్ రహదారి మధ్యలో సర్వే నంబరు 395/3లో 2.81 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1978లో కెనడియన్ బాప్టిస్టు ఓవర్సీస్ మిషన్ బోర్డు రిజిస్ట్రేషన్ సంఖ్య 2991/1973, 2081/1973 లతో 1.75 ఎకరాలు ఉత్తర విశాఖ సర్వోదయ సహకార సమితి రిజిస్ట్రేషన్ చేసుకుంది.

22ఏ లోని ఈ స్థలం నుంచి 1.05 ఎకరాల్లో 45 మంది పట్టాలు విభజించి ఇళ్లు నిర్మించుకున్నారు. 26 గృహాలు, ఆరు దుకాణాలు, 13 ఖాళీ స్థలాలు అక్కడ ఉన్నాయి. అవి కాకుండా 2000లో టెక్కలికి చెందిన ఓ వ్యాపారి ఏడాది కాలానికి గోదాంను అద్దెకు తీసుకున్నారు. 2019లో ఆయన ఖాళీ చేయకపోవడంతో అధికారులు దాన్ని సీజ్ చేయగా.. సదరు వ్యాపారి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

★ ఉత్తర విశాఖ సర్వోదయ సమితికి చెందిన ఖాళీగా ఉన్నందున దానిపై 22ఏ అధికారం తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. దాన్ని న్యాయస్థానం తోసిపుచ్చింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక మరో సారి రిట్ పిటిషన్ వేశారు. అయితే దీనిపై అధికారులు ఇప్పటి వరకు కౌంటరు కూడా వేయలేదు.

★ ఈ రెండు దస్త్రాల్లోనూ సర్వే నంబరు లేదు. ఇదే స్థలంలో 27 సెంట్ల విస్తీర్ణంలో భారతీయ స్టేట్ బ్యాంకు భవనాన్ని అద్దెకు తీసుకుంది. 1995 నుంచి 2000 వరకు నెలకు రూ. 5 వేలు చొప్పున అద్దె చెల్లించిన ఎస్‌బీఐ కోర్టు వివాదాలతో 25 ఏళ్లుగా ఎవరికీ అద్దె చెల్లించట్లేదు.

చర్యలు తీసుకుంటాం..

రెవెన్యూ దస్త్రాల్లో సర్వే నంబరు 395/3లోని 2.81 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉంది. సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ నిర్మాణాలు చేపట్టిన వారికి క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నిస్తాం. మిగిలిన 1.75 ఎకరాలు ప్రభుత్వ పరం చేసేందుకు అన్ని ఆధారాలున్నాయి. దాన్ని స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేస్తాం. – ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

ఉలిక్కిపడిన ఉద్దానం

● మావోయిస్టు జోగారావు మృతితో విషాదఛాయలు

బాతుపురంలో జోగారావు ఇంటి వద్దకు చేరుకున్న ప్రజాసంఘాల నాయకులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, వజ్రపుకొత్తూరు, నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉద్దానం ఉలిక్కిపడింది. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు, ఏవోబీ ఇన్‌ఛార్జి... మెట్టూరు జోగారావు (51) అలియాస్ టెక్ శంకర్ మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు బంధువులు, ప్రజాసంఘాల నాయకులు రంపచోడవరం బయలుదేరి వెళ్లారు.

విద్యార్థి దశ నుంచే పోరాటాలు..

జోగారావు కామయ్య, చిన్నపిల్లమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా... తల్లి ఇటీవల మరణించారు. బాల్యం నుంచే తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ విద్యాభ్యాసం చేశారు. అక్కుపల్లి ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివారు. విద్యార్థి దశ నుంచే పోరాట తెగువ చూపే వారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈయన పదో తరగతి పూర్తి చేసే సమయానికి ఉద్దానంలో పోరాట ప్రభావం జోరుగా సాగుతుండేది. అప్పట్లో సీపీఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ పార్టీ కార్యకలాపాలకు ఆకర్షితులయ్యారు. 16 ఏళ్ల వయసులోనే ఉద్యమ బాటపట్టారు. ఒకసారి అరెస్టు అయ్యి జైలుకెళ్లారు. మళ్లీ దళంలో చేరి ఉన్నతస్థాయికి ఎదిగారు. ఈయనపై మందస మండలంలో 3 కేసులు నమోదయ్యాయి.

బొప్పాయికి తెగులు.. రైతుకు దిగులు

– న్యూస్‌టుడే, లావేరు

వందల ఎకరాల్లో కుళ్లిన పంట

మరికొద్ది రోజుల్లో పంట చేతికి అందివస్తుందనే సమయానికి బొప్పాయి రైతులకు నిరాశే మిగిలింది. కళ్లెదుటే తెగుళ్లు సోకి చెట్లు ఎండిపోయి, కాయలు రాలిపోతుంటే వారి గుండె బరువెక్కిపోతోంది. ఇటీవల వచ్చిన మొంథా తుపాను వారిని నిండా ముంచేసింది. భారీ వర్షాలకు తెగుళ్లు విజృంభించడంతో వాణిజ్య పంటలు సర్వనాశనం అవుతున్నాయి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

పండించే మండలాలు: లావేరు, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల, గార, పొందూరు, నరసన్నపేట, పోలాకి.

సాగు విస్తీర్ణం: సుమారు 1,000 ఎకరాలు

నష్టం అంచనా: 400 ఎకరాలకుపైగా

కారణం: రింగ్ వైరస్ వ్యాప్తి

ఏమవుతోందంటే..

★ చెట్ల ఆకులు ఎండిపోయి.. కాయలు సగం పండి రాలిపోతున్నాయి.

★ కాయల్లో పురుగులు ఉంటున్నాయి.

★ తెగులు సోకిన వారంలో చెట్లన్నీ చనిపోతున్నాయి.

★ కుళ్లిన పంటను తొలగించడానికి సుమారు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం..

తెగుళ్లు సోకిన బొప్పాయి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. వాటికి పరిహారం ఉండదు. తుపాన్ల ప్రభావంతో నష్టపోతేనే పరిహారం వర్తిస్తుంది. రింగు వైరస్ వ్యాప్తి కారణంగా బొప్పాయికి నష్టం వస్తోంది. నివారణకు పంట చుట్టూ బంతిపూల తోటలు వేయాలి. అధికారుల సూచన మేరకు ఎరువులు, పురుగుమందులు వాడాలి.

– ఆర్.వరప్రసాద్, ఉద్యానశాఖాధికారి శ్రీకాకుళం

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నరసన్నపేటలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల నేపథ్యంలో జరిగిన రైతు సంబర సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. కౌలు రైతులతో పాటు మరికొంత మంది అర్హులైన వారికి మూడో విడతలో ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలు పాటించి రబీ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం రైతులకు రబీ విత్తన కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర కనీస వేతన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ తెదేపా కన్వీనరు బగ్గు అర్చన, వ్యవసాయ శాఖ జేడీ మనోహర్, డీడీ త్రినాథస్వామి పాల్గొన్నారు.

రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే రమణమూర్తి

ఆన్‌లైన్‌లోనే పన్ను బకాయిల నోటీసులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అన్ని పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలకు సంబంధించి ఆస్తి యజమానులకు ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు పంపాలని డీపీవో కె.భారతీసౌజన్య బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. చెల్లింపుదారులకు వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం పంపాలని ఆదేశించారు. క్యూఆర్ కోడ్ స్కాన్, యూపీఐ ద్వారా వసూలు చేయాలని సూచించారు. నిబంధనల్లో ఏ ఒక్కటి ఉల్లంఘించినా డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై జిల్లాలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు.

అరుదైన నాణేలు.. సేకరిస్తున్నారీ రైతు..!

నరసన్నపేట మండలం బడ్డవానిపేటకు చెందిన రైతు పండి కృష్ణారావుకు దేశ, విదేశాలకు చెందిన అరుదైన నాణేలు, కరెన్సీ నోట్లను సేకరించడం అంటే చాలా ఇష్టం. ఇప్పటి వరకు శ్రీలంక, భూటాన్, సింగపూర్, మలేసియా, యు.ఎస్, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా, చైనా, పలు అరబ్ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లతో పాటు వివిధ నాణేలను సేకరిస్తూ అందర్నీ అబ్బురపరుస్తున్నారు. 1818 నాటి శ్రీరామపట్టాభిషేకం ముద్రణతో ఉన్న నాణేలు కూడా ఈయన వద్ద ఉన్నాయి. కాణి, పరక, పైసా, పావలా, అర్ధరూపాయి, రూపాయి, రెండు, మూడు, అయిదు రూపాయల కాయిన్లు వేల సంఖ్యలో సేకరించారు. ప్రపంచంలోని అన్ని దేశాల నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణే తన ధ్యేయమని, అందుకు స్నేహితులు, సన్నిహితుల సహకారం మరువలేనిదని కృష్ణారావు చెబుతున్నారు.

పండి కృష్ణారావు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: మహిళలు లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ కళామందిరంలో బుధవారం పోష్ యాక్ట్‌పై డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సమన్వయంతో నిర్వహించిన కార్యశాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'ఇటీవల గృహహింసకు సంబంధించి ఫిర్యాదులు అందుతున్నాయి. మహిళా ఉద్యోగులు, కార్మికులు ఎక్కువగా ఉండే పని ప్రదేశాల్లో అంతర్గత కమిటీల నియామకం, పటిష్ఠ నిర్వహణపై కలెక్టర్‌తో మాట్లాడతాం. వేధింపులను సమర్థంగా ఎదుర్కోవాలంటే బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలి' అని స్పష్టం చేశారు. ఐసీసీల విషయమై కార్మిక శాఖ ఉప కమిషనర్ దినేష్‌కుమార్, వన్‌స్టాప్ కేంద్ర అధికారిణి హిమబిందుతో మాట్లాడారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి లైంగికపరమైన వేధింపులు అడ్డంకి కాకూడదన్నారు. అనంతరం సురక్షిత గ్రామ కార్యక్రమం పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. బెజ్జిపురం మహిళలు తయారు చేస్తున్న గోగునార ఉత్పత్తులను పరిశీలించారు. మహిళా పోలీసు స్టేషన్ ఎస్సై నారీమణి, స్థానిక ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సురేఖ, ఐసీడీఎస్ పీడీ విమల, మహిళా కమిషన్ సలహాదారు రావూరి సూయిజ్, బెజ్జిపురం మనోవికాస కేంద్రం అధ్యక్షుడు ప్రసాదరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

RAGHU COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi, Affiliated to Andhra University, VSP)
Dakamarri, Bheemili (M), Visakhapatnam - 531162, A.P
Ph. 08922-248014, 15 Email Id: raghucollegeofpharmacy@rediffmail.com
B.PHARMACY SPOT ADMISSIONS (CAT-A) AP EAPCET-2025
Candidates qualified in AP EAPCET-2025 and have not taken admission in any institution are eligible for Spot Admissions. If AP EAPCET-2025 qualified candidates are not available, the candidates having percentage of aggregate marks in qualifying examination or its equivalent as per the eligibility criteria by the Chairman/Convener, APSCHE, AP EAPCET-2025 (Admissions) will be considered.
The interested candidates may attend the Institutional Spot Admissions in our college on 20-11-2025 (Thursday) at 10.00 AM along with all original certificates and requisite fee.
The vacant seats will be filled as per the guidelines of Chairman/Convener, APSCHE, AP EAPCET-2025 Admissions and the admitted candidates are not eligible for tuition fee reimbursement.
For details Contact: 08922-248014,15
14-11-2025 Mob: 9177779084, 9490302033 Principal

ముందే గుర్తిద్దాం.. ముప్పు తప్పిద్దాం..!

జిల్లాలో కుష్ఠు కట్టడికి 'ఎల్‌సీడీసీ' ప్రారంభం

చాపకింద నీరులా విస్తరించే కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తూ పూర్తిగా నయం చేయొచ్చని వైద్యులు చెబుతున్నారు. దీని కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)ను ప్రారంభించింది. అందులో భాగంగా వైద్య సిబ్బందికి ఇంటింటికి వెళ్లి అనుమానిత లక్షణాలతో బాధపడేవారిని గుర్తిస్తున్నారు.

– న్యూస్‌టుడే, బలగ (శ్రీకాకుళం)

★ జిల్లావ్యాప్తంగా 4.68 లక్షల ఇళ్లలో సర్వే చేసేందుకు ఆశా కార్యకర్త, వాలంటీర్లతో 2,234 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

★ రోజుకు 25 గృహాల చొప్పున 14 రోజుల పాటు వివరాలు సేకరించి వైద్యాధికారులకు నివేదిస్తారు.

★ అనుమానిత లక్షణాలున్నవారిని పరీక్షించి వ్యాధి నిర్ధారణ జరిగితే తక్షణమే చికిత్స ప్రారంభిస్తారు. దీనిపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ అందజేశారు.

నరసన్నపేట మండలం బొరిగివలసలో సర్వే చేస్తున్న సిబ్బంది

సంవత్సరం	కేసులు
2020–21	198
2021–22	166
2022–23	206
2023–24	237
2024–25	187

వ్యాధి లక్షణాలివీ..

★ ఒంటిపై తెల్లటి లేదా ఎర్రటి మచ్చలు ★ చర్మం ఉబ్బెత్తుగా ఉండటం ★ చెవులు, వీపుపై నొప్పి లేని బొడిపెలు ★ కనుబొమ్మలు, రెప్పలు రాలిపోవడం, మూతపడటం ★ ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం ★ కాళ్లు, చేతులకు తిమ్మిర్లు ★ అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం ★ కాళ్లకు చెప్పులు జారిపోవడం ★ చేతులు, కాళ్లకు బొబ్బలు, వేళ్లు వంకర్లు తిరగడం

ఆలస్యం చేయకూడదు..

అనుమానిత లక్షణాలున్నవారు వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందికి ఆలస్యం చేయకుండా సమాచారం తెలియజేయాలి. వ్యాధి నిర్ధారణ జరిగితే మల్టీ డ్రగ్ థెరపీ(యం.డి.టి) మందులు వాడితే పూర్తిగా నయమైపోతుంది. ప్రస్తుతం జిల్లాలో 138 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. రోగి వస్తువులు, దుస్తులు, సామగ్రి వేరుగా వినియోగించాలి. రోగనిరోధక శక్తి పెరగడానికి పోషకాహారం తీసుకోవాలి. – డా. తాడేల శ్రీకాంత్, జిల్లా అదనపు వైద్యాధికారి(డీఎల్ఏటీ)

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

క్రికెటోత్సవానికి వేళాయె...

దరఖాస్తుల ప్రక్రియ షురూ

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
Organised by: ఈనాడు యువతరం క్లబ్

ఈనాడు, హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. . సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు, పెదపాడు విలేజ్
శ్రీకాకుళం - 532 401
వివరాలకు:
90634 38852
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

కాస్మోపాలిటన్ క్లబ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన కాస్మోపాలిటన్ క్లబ్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం క్లబ్‌ను పరిశీలించారు. గతంలో నిర్వహణ తీరును క్లబ్ కార్యదర్శి సురంగి మోహనరావును అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ సరిగా లేకపోవడంతోనే శిథిలావస్థకు చేరిందని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన రహదారిని ఆనుకుని క్లబ్ ఉండటంతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించి ఆదాయం సమకూర్చొచ్చని తెలిపారు. క్లబ్ అభివృద్ధికి సంబంధించి తగిన ప్రతిపాదనలతో సభ్యులు కలెక్టరేట్‌లో కలవాలని సూచించారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్ తదితరులు

బలవంతపు భూసేకరణ తగదు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఉద్దానంలో కార్గో విమానాశ్రయం, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో థర్మల్ విద్యుత్కేంద్రం ఏర్పాటు పేరిట బలవంతపు భూసేకరణ చేస్తోందని.. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా చేపట్టడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.ప్రభాకర్ విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో బుధవారం ఆ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎర్రజెండాలకు ఆదరణ పెరిగిందని వ్యాఖ్యానించారు. దేశంలో పేదరికం లేని రాష్ట్రంగా కేరళను ఐక్యరాజ్యసమితి ప్రకటించడం వామపక్ష పార్టీలు, అభిమానులకు, ప్రజాతంత్ర శక్తులకు గర్వకారణమన్నారు.

సైకిల్ యాత్రతో యువతకు సందేశం

యువతలో సామాజిక చైతన్యం కల్పించేందుకే సైకిల్ యాత్ర చేపట్టినట్లు హరియాణాకు చెందిన యువకుడు దీపక్‌శర్మ అన్నారు. ఈ ఏడాది మే 25న యాత్ర ప్రారంభించగా.. బుధవారం నరసన్నపేట మండలం జమ్ము కూడలి వద్దకు ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. రోజూ 50 కి.మీ. మేర ప్రయాణిస్తున్నానని, ఇప్పటి వరకు 7,500 కి.మీ. యాత్ర సాగిందన్నారు. వచ్చే ఏడాది మే 25 వరకు కొనసాగిస్తానని వెల్లడించారు. యువతకు దేశ సంప్రదాయాలు, రక్షణ తదితర అంశాలపై చైతన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట

పశువైద్యం..దైవాధీనం

సిబ్బంది కొరతతో పోషకులకు తప్పని ఇబ్బందులు

● ఇచ్ఛాపురం మండలం డొంకూరులో 2018లో పశువైద్యశాల నిర్మించారు. ఇక్కడ పని చేస్తున్న వైద్యుడు నెలలో ఒకరోజు వచ్చి గ్రామంలో తిరిగి వెళ్తుండే వారని స్థానిక రైతులు తెలిపారు. రెండేళ్లుగా రావడం లేదని చెప్పారు. పశువైద్యశాల శిథిలావస్థకు చేరడంతో మూతపడిందన్నారు. ఈదుపురం, కొళిగాం గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.


ఇచ్ఛాపురం మండలం డొంకూరులో మూతపడిన పశువైద్యశాల

● జిల్లావ్యాప్తంగా 61 గ్రామీణ లైవ్ స్టాక్ కేంద్రాలు, 77 వెటర్నరీ డిస్పెన్సరీలు, 15 వెటర్నరీ ఆసుపత్రులు, ప్రయోగశాల, పాలిక్లినిక్ ఉన్నాయి.

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

జిల్లాలో మూగజీవాలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక పోషకులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలుచోట్ల పశుసంవర్ధక శాఖ అధికారులు ఉద్యోగ విరమణ పొందారు. ఆయా ఖాళీలు భర్తీ చేయలేదు. మరోవైపు క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండక పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇటీవల అత్యవసర వైద్యం కోసం 10 నుంచి 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చిందని పోషకులు ఆవేదన వ్యక్తం చేశారు.

జీవాలు	సంఖ్య (లక్షల్లో..)
ఆవులు, ఎద్దులు	3.41
గొర్రెలు	6.40
మేకలు	3.24
ఇతర జీవాలు	10

క్యాడర్	పోస్టులు	పనిచేస్తున్న వారు
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు	85	65
వెటర్నరీ అసిస్టెంట్లు	55	26

ఒడిశా వెళ్తున్నాం..

ఇచ్ఛాపురం మండలం పరిధి కొళిగాంలో పశువుల ఆసుపత్రి ఎప్పుడూ మూసే ఉంటుంది. 5 పంచాయతీలకు ఇదే ఆధారం. పశువులకు వ్యాధులు సోకితే ఒడిశాలోని నాటు వైద్యులను సంప్రదిస్తున్నాం. ఖాళీలను భర్తీ చేసి సమస్య పరిష్కరించాలి.

- టి.దుర్యోధనరెడ్డి, రైతు, బెన్నుగానిపేట

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

గ్రామాల్లో పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ సర్దుబాటు చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. త్వరలోనే ఖాళీలున్నచోట పశువైద్యాధికారులను నియమించి సమస్యలు పరిష్కరిస్తాం.

- రాజగోపాల్, జేడి, పశుసంవర్ధక శాఖ, శ్రీకాకుళం

శక్తి సదన్‌కు తల్లీకుమార్తెలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురానికి చెందిన తల్లీకుమార్తెలు భాగ్యలక్ష్మి, మౌనికలకు బుధవారం జిల్లా బాలల రక్షణ అధికారులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కుమార్తెను బయటకు పంపితే ఏమవుతుందోనని రెండేళ్లుగా తల్లి గృహనిర్బంధంలో ఉంచగా న్యాయమూర్తి, ఐసీడీఎస్, పోలీసు అధికారుల సమక్షంలో బయటకు తీసుకొచ్చిన విషయం విదితమే. జిల్లా కేంద్రంలోని బాలల గృహంలో సంబంధిత అధికారులు వారితో మాట్లాడగా ఇద్దరం ఒకే చోట ఉంటామని స్పష్టం చేశారు. ఎచ్చెర్లలోని శక్తి సదన్‌కు తరలించామని అధికారులు తెలిపారు.

నేడు పుస్తక మహోత్సవం ముగింపు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నగరపాలక సంస్థ క్రీడా మైదానంలో 9 రోజులుగా నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవం గురువారం ముగియనుంది. తొలిసారి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పుస్తకావిష్కరణలు, సాహిత్య సదస్సులు ఆసక్తికరంగా సాగాయి. ఉత్తరాంధ్ర కవులు, రచయితల కవితా పఠనం, ఉత్తరాంధ్ర కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజ్ఞాన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. పిల్లలు, పెద్దలు, భాషాభిమానులు, పుస్తకప్రియులతో ప్రాంగణం కళకళలాడింది. బుధవారం నాటికి సుమారు రూ.13 లక్షల మేర పుస్తకాల అమ్మకాలు జరిగాయని నిర్వాహక ప్రతినిధులు తెలిపారు.

కళా పూర్ణోదయంలో లయతరంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జాతీయోద్యమంలో కళింగాంధ్రుల పాత్ర కీలకం

కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై నెట్టిమి రమణ ఆధ్వర్యంలో 'జాతీయోద్యమంలో కళింగాంధ్ర' అంశంపై సాహితీ సదస్సు నిర్వహించారు. సాహితీ స్రవంతి, సిక్కోలు పుస్తక మహోత్సవం కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షోపన్యాసం చేశారు. కళింగాంధ్రలో వివిధ ఉద్యమాలు, పోరాట వీరులు, రచయితల గురించి వివరించారు. రచయిత కర్నేన జనార్దనరావు మాట్లాడుతూ కళింగాంధ్రులు జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. తారకేశ్వరరావు, రచయిత జె.శరత్‌బాబు ప్రసంగించారు. మండ శ్రీనివాసరావు రచించిన 'కళా పూర్ణోదయంలో లయతరంగం' పుస్తకాన్ని ఆవిష్కరించగా భమిడిపాటి గౌరీశంకర్ పరిచయం చేశారు. రచయిత కె.వినోద్ రాసిన 'స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు' పుస్తకాన్ని ఎల్.జితేందర్‌రెడ్డి, అరుణ్‌బవేరా రచించిన 'ఇలాంటి ఓ ప్రయాణం' పుస్తకాన్ని శ్రీనివాస్ పరిచయం చేశారు. అనంతరం కవులు, రచయితల కవితాపఠనం, ముళ్లపూడి రామచంద్రరావు సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకంలో కాటి సీను ప్రదర్శన, సింధు శ్రీహర్షితల బృందం శాస్త్రీయ నృత్యప్రదర్శనలు జరిగాయి. సాంస్కృతిక ప్రదర్శనల నిర్వాహక ప్రతినిధి సుధాకరరావు, కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, పలువురు ప్రముఖులు కవులు, కళాకారులను సత్కరించారు.

సింధు శ్రీహర్షిత నృత్యప్రదర్శన

మాట్లాడుతున్న గోవిందరావు

నిరసన తెలిపితే నిర్బంధిస్తారా..?

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కార్గో విమానాశ్రయం తమ ప్రాంతంలో వద్దని నిరసన తెలుపుతున్న ప్రజలపై నిర్బంధం విధించడం సరికాదని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. కాశీబుగ్గలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కార్గో విమానాశ్రయం పేరిట ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా ప్రత్యేకంగా కార్గో విమానాశ్రయం లేదని, ఉద్దానంలోనే ఏర్పాటు చేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మాధవరావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు పాల్గొన్నారు.

28 కిలోల గంజాయితో ఒడిశా వాసి అరెస్టు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఒడిశాలో కొనుగోలు చేసిన 28 కిలోల గంజాయిని ఇచ్ఛాపురం మీదుగా ముంబయికి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. పట్టణ ఎస్సై ఎం.ముకుందరావుతో కలిసి సీఐ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. ఒడిశా మోహన బ్లాక్ బాపూజీనగర్ ప్రాంతానికి చెందిన అమిలైసా పాణి, ఒడిశాలో గంజాయి వ్యాపారం చేస్తున్న ధరమ్‌బీర్‌నాయక్ (బీరజ్)తో కలిసి గంజాయిని కొనుగోలు చేశారు. అక్కడ నుంచి ఇతర మార్గాల్లో ఇచ్ఛాపురం రైలు నిలయానికి చేరుకుని, ప్లాట్‌ఫాంకు కొద్ది దూరంలో వేచి ఉన్నారు. బీరజ్ టికెట్ కోసం వెళ్లగా, అదే సమయంలో పాణిని గమనించిన ఎస్సై అతని వద్ద ఉన్న సంచులు తనిఖీ చేశారు. గంజాయితోపాటు అతని చరవాణిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీరజ్ తప్పించుకున్నాడు. సరకును ముంబయిలోని ఇంగేల్ రామేశ్వర్ అనే వ్యాపారికి అందించడానికి తీసుకెళ్తున్నారని, ముగ్గురిపైనా కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

పురపరిపాలన శాఖ పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం

టెండరు నోటీసు

రేఖా నం. 38/2023/E1/BOQ No's 1087-1089 (7th call), 1096, 1098, 1113, 1115, 1123, 1129, 1130, 1146-1147, 1151-1152, 1158 (6th call), 1177-1214 (1st call) తే 20/11/2025 దీ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు సాధారణ నిధులతో చేపట్టు పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

పనుల సంఖ్య : 53 అంచనా విలువ రూ.204.35 లక్షలు

Bid Document Download start Date & Time -	20.11.2025	11.00 AM
Bid Document Download End Date & Time -	04.12.2025	03.00 PM
Bid Submission Closing Date & Time -	04.12.2025	03.30 PM
Bid Document Open Date & Time -	04.12.2025	04.30 PM

మిగతా వివరములకు ఆఫీసు పని వేళలలో తెలుసుకొనవచ్చును మరియు అంతర్జాలములో https://tender.apeprocurement.gov.in

సం/- ఇ.శ్రీనివాసులు
కమిషనరు, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

పోలీసుల అదుపులో వంతెన నిర్మాణ సామగ్రి చోరీ కేసు నిందితులు

సంతకవిటి, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా సంతకవిటి మండలం వాల్తేరు వద్ద వంతెన నిర్మాణ సామగ్రి చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. వంతెన నిర్మాణ పనులకు సంబంధించి రూ.48 వేల విలువైన 16 బ్యాటరీలు, 20 సెంటరింగ్ సీట్లు గత నెల 21న చోరీకి గురయ్యాయి. సిరిపురం పంచాయతీకి చెందిన పి.ప్రసాద్, జి.సంతోష్, కె.ప్రసాద్, ఓ బాలుడు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నారు. బుధవారం శేషాద్రిపురం కూడలిలో వారిని పోలీసులు పట్టుకున్నారు. బ్యాటరీలు, సెంటరింగ్ సీట్లు స్వాధీనం చేసుకున్నారు. లావేరు మండలంలో నాలుగు ఆంప్లిఫైయర్లు దొంగతనం చేసి, ఆమదాలవలసలో ఓ ఎలక్ట్రీషియన్‌కు విక్రయించినట్లు అంగీకరించారు. నిందితులను రాజాం కోర్టుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్రాయిలర్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

రూ.150 లాక్కొన్నాడని.. ప్రాణం తీశాడు!

మద్యం మత్తులో ఘాతుకం

ఈనాడు, విశాఖపట్నం: ఇద్దరి మధ్య రూ.150 కోసం జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. డైమండ్ పార్కులో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఒడిశాకు చెందిన టి.చిరంజీవి (35) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఒడిశాకు చెందిన చిరంజీవి విశాఖలో ఉంటున్నాడు. భార్యతో మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎచ్చెర్లకు చెందిన లక్ష్మణ్‌రెడ్డి, చిరంజీవి మధ్య కొంతకాలంగా స్నేహం కుదిరింది. వీరిద్దరూ తెలుగుతల్లి పైవంతెన కింద ఉంటూ, దాతలిచ్చే ఆహారం తీసుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. బుధవారం డైమండ్ పార్కులో ఇద్దరి మధ్య రూ.150 విషయంలో గొడవ మొదలైంది. ఆ తరువాత ఇద్దరూ కలిసి మద్యం తాగారు. ఈ సమయంలో 'నా జేబులో డబ్బులు లాక్కొంటావా?' అంటూ లక్ష్మణ్‌రెడ్డి పక్కనే ఉన్న కర్రతో బలంగా చిరంజీవి తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిరంజీవిపై గోపాలపట్నం, టూటౌన్ పరిధిలో పలు దొంగతనం కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు లక్ష్మణ్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

పెట్రోల్ ధరకు డీజిల్ విక్రయాలు..!

చాపరలో ఓ బంక్ నిర్వాహకుల మోసం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: చాపరలో ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకుల ఘరానా మోసం బుధవారం వెలుగు చూసింది. జలకలింగపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డీజిల్ కొనుగోలు చేసేందుకు 40 లీటర్ల డబ్బాతో వెళ్లారు. రూ.3800 ఆయిల్ కొనుగోలు చేయగా.. డబ్బా నిండకపోవడంతో అనుమానంతో అదనంగా మరో రూ.200 డీజిల్ తీసుకున్నారు. 35 లీటర్ల మాత్రమే కనిపించడంతో నిర్వాహకులను ప్రశ్నించాడు. వారు దురుసుగా సమాధానం ఇవ్వడంతో బాధితుడితో పాటు స్థానికులు అక్కడకు చేరుకున్నారు. కొలతల్లో తేడా గుర్తించారు. సమస్యను వెంటనే పోలీస్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావడంతో మండల రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పెట్రోల్ బంకు నిర్వాహకుడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో విషయాన్ని తూనికలు, కొలతల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా. . జిల్లా అధికారిణి పి.చిన్నమ్మి అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొలతల్లో లోపం లేకపోయినా.. పెట్రోల్ ధరకు డీజిల్ విక్రయించినట్లు గుర్తించారు. సమస్యపై ఇండియన్ ఆయిల్ సేల్స్ అధికారికి ఫిర్యాదు చేయడంతో.. ఆయన సైతం అక్కడికి చేరుకుని వ్యత్యాసం గుర్తించారు. రెవెన్యూ అధికారులు, బాధితుడు, బంకు నిర్వాహకులు, అధికారుల నుంచి నివేదికలను తీసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు తహసీల్దార్ పాపారావు, సీఎస్ డీటీ కుమారి పేర్కొన్నారు. వారి నుంచి ఆదేశాలు వచ్చినంత వరకు సదరు బంక్‌లో విక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారిణి చిన్నమ్మి

అప్పు.. ఇచ్చేదెప్పుడు?

11 నెలలుగా పురుష పొదుపు సంఘ సభ్యుల ఎదురుచూపులు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వివిధ రంగాలు, వ్యాపారాల ఆధారంగా జీవనం సాగిస్తున్న పురుషులకు తోడ్పాటు అందించడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక పథకం రూపొందించింది. ఇప్పటివరకు మహిళలకే పరిమితమైన పొదుపు సంఘాలను పురుషులకూ వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేసింది. మహిళా సంఘాల మాదిరిగా పొదుపు చేస్తే బ్యాంకులు రుణాలిచ్చి వారి వ్యాపారాభివృద్ధికి ఆర్థికంగా చేయూత అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

శ్రీకాకుళంలో సమావేశమైన పురుష పొదుపు సంఘ సభ్యులు

ఇదీ పరిస్థితి

● ఈ ఏడాది జనవరిలో జిల్లాలో 140 పురుష పొదుపు సంఘాలు ఏర్పడ్డాయి. ఒక్కో సంఘంలో ఐదుగురు సభ్యులున్నారు. నెలకు రూ.100 నుంచి రూ.200 వరకు బ్యాంకు ఖాతాలలో పొదుపు చేస్తున్నారు.

● స్వయం సహాయక సంఘాలన్నీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో ఉన్నాయి.

● పురుషుల్లో ప్రధానంగా అసంఘటిత రంగంలో పని చేస్తున్న వారు పొదుపు చేసేలా ప్రోత్సహించాలని కార్యాచరణ రూపొందించారు.

● ప్రతి నెలా మెప్మా సిబ్బంది పర్యవేక్షణలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తే వ్యాపారాభివృద్ధి చేసుకోవచ్చనే యోచనలో సభ్యులున్నారు.

పురపాలక సంఘం	పురుష పొదుపు సంఘాలు	సభ్యులు
ఇచ్ఛాపురం	6	30
ఆమదాలవలస	11	55
పలాస-కాశీబుగ్గ	34	170
శ్రీకాకుళం నగరపాలకసంస్థ	89	445

మార్గదర్శకాలు రాలేదు..

బ్యాంకు రుణాల మంజూరు విషయమై ప్రభుత్వ నుంచి మార్గదర్శకాలు రాలేదు. వచ్చే నెలలో రావొచ్చని సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళిక రూపొందిస్తాం. సంఘాల బలోపేతానికి సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– ఎన్.వెంకటరావు, ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా, శ్రీకాకుళం

ఎయిడ్స్ నియంత్రణ ఉద్యోగుల సంఘ కార్యవర్గ ఎన్నిక

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల సంఘం శ్రీకాకుళం శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ వెంకటరమణమూర్తి, జి.బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య నూతన కమిటీని అభినందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యక్షురాలిగా పల్లి శైలజ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బి.సాయిరాం,కోశాధికారిగా ఆర్.భూపతిరావు, సహాయ కార్యదర్శిగా ఎం.కోటేశ్వరరావు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

EENADU Classifieds

HOME NEEDS

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడిబారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్యా? ✆ 7675873377.

PEOPLE CARE

OLD AGE HOME

SVS Old Age Home, VZM AC/Non AC రూమ్స్ డే & నైట్ ఆయా, నర్సింగ్ ఇంటివద్దకే ఫిజియోథెరపీ సేవలు, రుచికరమైన భోజనం ✆ 9440435006, 9347978375

JOBS

RK సోలార్ టెక్ సొల్యూషన్స్ (ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్స్), శ్రీకాకుళం నందు ఇంటి వద్దనే ఉండి నెలకు 30 వేలు రూ. పైబడి సంపాదించే అవకాశం కలదు. (మహిళలకు మాత్రమే) ✆ 8985834777, 8919884223, 7981829449.

శ్రీకాకుళంలో ఆఫీసు నందు టెలీకాలర్స్, ఆఫీస్ ఇన్‌ఛార్జ్, మార్కెటింగ్ కొరకు M/F కావలెను. జీతం 10 నుండి 20వేలు వరకు. Cont:7670877376.

డెస్టినేషన్ హాలీడే ఇన్ న్యూబ్రిడ్జ్ రోడ్, శ్రీకాకుళంలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), రిసెప్షనిస్ట్ (F) కావలెను. సంప్ర|| ✆ 8977211596.

వెల్డర్ కావలెను శ్రీకాకుళం టౌన్‌లో ప్రముఖ స్వచ్ఛందసేవా సంస్థకు డైలీ Rs.1000/-+ భోజనం కలదు ఆసక్తిగలవారు సంప్ర: 9440370558

పరవాడ, అచ్యుతాపురం, పైడిభీమవరం, HYD, ఫార్మాకంపెనీలో (B.Sc, M.Sc, బి.టెక్, డిప్లమో, ITI, MBA (Fin.&HR) ✆ 8341177761, 8019647888.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

తెరచాటు నిర్మాణాలు

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

కాశీబుగ్గలో మూడు రోడ్ల కూడలి నుంచి కేదీ రాయి చెరువు ప్రాంతం వరకు పలు చోట్ల తెరచాటు నిర్మాణాలు జరుగుతున్నాయి. రైల్వే పై వంతెన నిర్మాణానికి మూడు రోడ్ల కూడలి నుంచి రైల్వే గేటు వరకు ఉన్న కట్టడాలను అధికారులు తొలగించారు. అందులో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించారు. గతంలో తొలగించిన భవనాలూ ఇటీవల అధికారులు తొలగించారు. తాజాగా వంతెన నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి.

● ఇంతలో వంతెన నిర్మాణానికి మార్కింగ్ వేసిన స్థలాన్ని వదిలేసి మిగిలిన భాగాల్లో కొంతమంది తెరచాటుగా కట్టడాలు ప్రారంభించారు. ఈ విషయాన్ని కొద్ది రోజుల కిందట స్థానికులు గుర్తించి అధికారులకు తెలియజేయగా.. కట్టడాలు చేపట్టకూడదని రెవెన్యూ యంత్రాంగం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజులు నిలుపుదల చేసి తాజాగా ఖాళీ స్థలాలను ఆక్రమించి పనులు చేస్తున్నారు.

● మూడు రోడ్ల కూడలిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన స్థలంలో సైతం కట్టడాలు జరుగుతున్నాయి. కేదీ రాయి చెరువు ప్రాంతంలో జిరాయితీ పొక్లెయిన్‌తో చదును చేశారు. కాశీబుగ్గ ప్రాంతంలో గజం స్థలానికి కూడా డిమాండ్ ఉంది. ఈ క్రమంలో రైల్వే వంతెన నిర్మాణ ప్రాంతంలో ఖాళీగా కనిపిస్తున్న చిన్నపాటి స్థలం సైతం ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు.

● దీనిపై తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని, నిర్మాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాశీబుగ్గలోని మూడు రహదారుల కూడలిలో చేపట్టిన నిర్మాణం

ఊటనీటిలోనే రాకపోకలు

పలాస పట్టణ శివారు అన్నపూర్ణ ఆశ్రమ ప్రాంతం లోతట్టుగా ఉండటంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. ఎల్లమ్మ దేవాలయం, కాపు వీధుల కూడలి మీదుగా అన్నపూర్ణ ఆశ్రమం వీధి విస్తరించి ఉంది. శివారు ప్రాంతంలో ఇళ్లనిర్మాణం పూర్తిచేసుకుని నివసిస్తున్న వారికి కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. 'అన్నపూర్ణ ఆశ్రమం ప్రాంతంలో కాలువ పనులు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణం సైతం చేపడతాం. నిధుల లభ్యతను బట్టి పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామ'ని పలాస-కాశీబుగ్గ పుర ఏఈ కిరణ్‌కుమార్ అన్నారు. - న్యూస్‌టుడే, పలాస

10 మందిపై బైండోవర్ కేసులు

కవిటి మండలంలో 10 మంది మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఇచ్ఛాపురం ఆబ్కారీ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కవిటి తహసీల్దార్ కార్యాలయానికి వారిని తీసుకొచ్చి తహసీల్దార్ బి.మురళీమోహన్‌రావుతో బైండోవర్ నమోదు చేశారు. ప్రజారోగ్యానికి హాని చేసే నాటుసారా అమ్మడం, మద్యం బెల్టు దుకాణాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ నాటుసారా అమ్మకాలు, బెల్టు దుకాణాలు నిర్వహిస్తే రూ. లక్ష వరకు జరిమానా విధిస్తామని తహసీల్దార్, సీఐ పేర్కొన్నారు. సారా అమ్మకాలపై 14405 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పల్లెల్లో స్వచ్ఛత.. పచ్చదనం

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, కాశీబుగ్గ

పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్' పేరిట నెల రోజులపాటు ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు జిల్లా నుంచి 30 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు(మండలానికి ఒకరు)కు శిక్షణ ఇచ్చారు.

నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన గ్రామాలు

మండలం	గ్రామం
కవిటి	కవిటి
ఇచ్ఛాపురం	తేలుకుంచి
కంచిలి	పెద్ద కొజ్జిరియా
సోంపేట	సోంపేట
పలాస	అల్లుకోల
మందస	కొంకడాపుట్టి
వజ్రపుకొత్తూరు	దేవునల్తాడ

కవిటిలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

మండలానికి ఓ పంచాయతీ నమూనా

శిక్షణ తీసుకున్న మండలస్థాయి అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంచుకుని పచ్చదనం, పరిశుభ్రత, ఇతర అంశాల్లో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతారు. దాన్ని ఆదర్శంగా చూపి మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాలి. కార్యాచరణకు పంచాయతీల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అవసరమైన పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిపై పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి, పచ్చదనం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రతి మండల స్థాయి అధికారి వారంలో ఒక గ్రామాన్ని పర్యవేక్షించాలి.

శిక్షణ ఇచ్చాం

ఎంపిక చేసిన ఆదర్శ పంచాయతీలో కార్యదర్శులకు శిక్షణ ఇచ్చాం. ఆయా పంచాయతీల్లో హరిత రాయబారులంతా ఎంపిక చేసిన గ్రామానికి చేరుకుని ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తారు. సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇస్తారు. అనంతరం ఈ విధానాన్ని అన్ని గ్రామాలకు వర్తింపజేస్తాం. - ఎల్.త్రినాథ్, ఎంపీడీవో, కవిటి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

?: కస్పాగొడవీధి నుంచి కృష్ణసాగర్‌కు వెళ్లే మార్గం పనికిరాని మొక్కలతో నిండిపోయింది. - పి.రామయ్య, ఇచ్ఛాపురం ● పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - పి.ఉపేంద్రకుమార్, ఎంహెచ్‌వో, ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: ఆదివారం సంత వద్ద వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. - ఎస్.జగదీష్, దుకాణదారుడు ●: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - తులసయ్య, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

?: కవిటి మండలం కొజ్జిరియాలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - గ్రామస్థులు ●: ప్రతి వారం శుభ్రం చేస్తున్నాం, పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - బి.హరికృష్ణ, కార్యదర్శి, కొజ్జిరియా - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఆక్రమణల గుర్తింపు.. మందస, న్యూస్‌టుడే: కొంకడాపుట్టి చెరువు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. చెరువు ఆక్రమణలపై కూటమి కార్యకర్తలు ఎమ్మెల్యే గౌతు శిరీష, తహసీల్దారు శ్రీకాంత్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. తహసీల్దారు ఆదేశం మేరకు సర్వేయరు బాబూరావు, సిబ్బంది బుధవారం చెరువు ఆక్రమణలను గుర్తించి, త్వరలో తొలగిస్తామని తెలిపారు.

ఇరుకు రోడ్డు.. మరింత ప్రమాదకరంగా

దినవారీ బజారు వద్ద చిరువ్యాపారులు రోడ్డుపై అంగళ్లు పెట్టడంతో ఇరుకుగా ఉన్న రహదారి మరింత ప్రమాదకరంగా మారింది. భారీ వాహనం వస్తే, రోడ్డుపై వెళ్తున్న వారు తప్పుకొనేందుకూ అవకాశం లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇద్దరు సైకిలిస్టులు ఇక్కడే కన్నుమూశారు. పుర అధికారులతో చర్చించి, పరిష్కార చర్యలు చేపడతామని సీఐ చిన్నంనాయుడు తెలిపారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మురుగుతో అవస్థలు

లండారిపుట్టుగలో పారిశుద్ధ్య లోపంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. మంచినీటి ట్యాంకు వద్ద మురుగునీరు నిల్వ ఉండటంతో చుట్టు పక్కల నివాసితులు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసును వివరణ కోరగా పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చల్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వృథా నీరు.. ఇదేం తీరు

వజ్రపుకొత్తూరులో వెలుగు కార్యాలయం సమీపంలో మంచినీటి పథకం సరఫరా పైపులైను లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతుంది. కొన్ని నెలలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో పరిసర ప్రాంతం చిత్తడిగా తయారవుతోంది. అటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి మరమ్మతులు చేపడతామని గ్రామీణ మంచినీటి సరఫరా పథకం జేఈ సతీష్ తెలిపారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

రాకపోకలెలా..!

కవిటి చింతామణి ఆలయం నుంచి ఇద్దివానిపాలెం చేరుకునే రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా ఉన్నతాధికారులకు తెలియజేశామని, నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పరిశీలించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

తేలుకుంచిలో సాగునీటి పంట కాలువల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పంట కాలువల్లో నీరు పారడం లేదు. దీనిపై మంగళవారం 'మురుగు కదలదు.. నీరు పారదు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పంచాయతీ కార్యదర్శి కల్యాణ స్పందించారు. వ్యర్థాలు తొలగించారు.- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

● పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో అక్రమంగా చేస్తున్న కట్టడాలపై పురాధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమ నిర్మాణాలపై 'ఈనాడు' పలు కథనాలు ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించారు. పలాస లేబర్‌కాలనీలో పునాదులు వేసిన ప్రాంతాన్ని, సూదికొండ హుద్‌హుద్ ఇళ్ల వద్ద అక్రమంగా చేపడుతున్న కట్టడాలను బుధవారం తొలగించారు. - న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ

అన్నదాతల ఆనందమే కూటమి లక్ష్యం

కంచిలి, మందస, న్యూస్‌టుడే: అందరికీ అన్నం పెట్టే అన్నదాతల ఆనందమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.

నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్, దాసరి రాజు

బుధవారం కంచిలి మార్కెట్ యార్డు ఆవరణలో ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయిలో రెండో విడత అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అశోక్ ప్రారంభించారు. నియోజకవర్గానికి సంబంధించి 30,634 మంది రైతులకు రూ.19.72 కోట్లు నిధులు జమ చేసినట్లు ప్రభుత్వ విప్ తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు రబీకి సంబంధించి ప్రభుత్వ రాయితీ విత్తనాలు అందజేయడంతోపాటు మట్టి నమూనా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ బాధ్యుడు దాసరి రాజు, మండల ప్రత్యేకాధికారి సుధాకర్, ఏడీఏ భవానీ శంకరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మందస మండలం భోగాపురంలో కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష పాల్గొన్నారు. పలాస నియోజకవర్గానికి సంబంధించి 29,748 మంది రైతులకు రూ.19.59 కోట్లు నిధులు జమ చేసినట్లు ఆమె తెలిపారు. ఆర్డీవో వెంకటేశ్, ఏడీఏ రామారావు, ఏవో నాగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంతెన రహదారితో అభివృద్ధి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ఉప్పుటేరు వంతెన రహదారి ఏర్పాటుతో గ్రామం మరింత ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, రహదారి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. నువ్వలరేవు-మంచినీళ్లపేట ఉప్పుటేరు మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం సుమారు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో భారీ వంతెన నిర్మించింది. కొన్ని ఇళ్లు తొలగించాల్సి రావడంతో నువ్వలరేవు వైపు ఉన్న వంతెన అనుసంధాన రహదారి పనులు నిలిచిపోయాయి. దీనిపై 'ఈనాడు'లో సెప్టెంబరు 17న 'ఇంకెంత కాలం.. ఎన్నాళ్లీ భారం' తోపాటు పలు కథనాలు ప్రచురించడంతో

నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష, ఆర్డీవో వెంకటేశ్

ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ మేరకు బుధవారం నువ్వలరేవు వంతెన రహదారితో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులతో స్థానిక బృందావతి ఆలయంలో పలాస ఆర్డీవో వెంకటేశ్‌తో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి మాట్లాడారు. రహదారి కారణంగా నష్టపోయిన వారికి రెట్టింపు ఇంటి స్థలంతోపాటు రూ.3 లక్షల మేర నిర్మాణ వ్యయం కింద పరిహారం ఇవ్వనున్నట్లు ఆర్డీవో చెప్పారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామానికి ఆనుకొని నిర్వాసితులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. సర్పంచి పూర్ణ, తహసీల్దార్ సీతారామయ్య, ఆర్అండ్‌బీ శాఖ జేఈ జగదీష్, నాయకులు విఠల్, వసంతస్వామి, సురేష్ చౌదరి, హేమబాబుచౌదరి, సాంబమూర్తి, పాపారావు, రామకృష్ణ, శశి, సూరి, సర్వే బృందం పాల్గొన్నారు.

బోధనోపకరణాల వినియోగంపై శిక్షణ

ఇచ్ఛాపురం, కంచిలి గ్రామీణం, కవిటి గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాఠ్యాంశాల బోధన ఉండాలని ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం అన్నారు. ఇచ్ఛాపురం మండల, పట్టణ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పుర బాలికోన్నత పాఠశాల ఆవరణలో బోధనోపకరణాల వినియోగంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డి.వైకుంఠరావును సత్కరించారు. ● కంచిలి మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ జి.చంద్రభూషణ్ పాల్గొన్నారు. ● కవిటిలో ఎంఈవోలు ధనంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ మాట్లాడి పలు సూచనలు చేశారు. డీఆర్‌పీలుగా ఈశ్వరాచారి, సురేష్ కుమార్ పాత్ర్ వ్యవహరించారు. ● సోంపేట జిల్లా ఉన్నత పరిషత్తు పాఠశాలలో ఎంఈవో జోరాడు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్సు పర్సన్లు హరికృష్ణ, కూర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైకుంఠరావును సత్కరిస్తున్న ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కంచిలి గ్రామీణం, కవిటి గ్రామీణం: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ చంద్రభూషణ్ సూచించారు. బుధవారం ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత, కవిటి మండలంలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలు కవిటి, బొరివంక, రాజపురం, ఆర్.బెలగాం కేంద్రాలను పరిశీలించారు. ఆదర్శ పాఠశాలకు చెందిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు, ధనంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలు పరిశీలిస్తున్న జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ చంద్రభూషణ్

వైద్యశిబిరానికి స్పందన

మందస, న్యూస్‌టుడే: ఉమాగిరిలో ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. మందస వైద్యులు భారతి, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా సత్యసాయి శతజయంత్యుత్సవాలు

ఇచ్ఛాపురం సత్యసాయి ధ్యానమందిరంలో సాయిబాబా శతజయంతి వారోత్సవ పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది మహిళలు దీపార్చన చేసి, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ● పలాస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ నారాయణులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సాయంత్రం భజన అనంతరం ఎవర్‌గ్రీన్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కాశీబుగ్గ ప్రశాంతి సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ బస్టాండ్, వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక గ్రామంలో దుప్పట్లు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం

పలాసలో చిన్నారుల నృత్యం

ఇచ్ఛాపురంలో మహిళల పారాయణం

పందుల బీభత్సం.. చివరికి నష్టం

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఖరీఫ్ సీజన్ రాగానే అన్నదాతలకు బెంగ పట్టుకుంటుంది. ఏటా అతివృష్టి లేదా అనావృష్టితో ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు తుపానులు, చీడ పీడలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ తరుణంలో అడవి పందులు బెడద మరింత ఆందోళనకు గురి చేస్తోంది. పొలాల్లో పదుల సంఖ్యలో పందులు చొరబడి బీభత్సం సృష్టించి కోత దశకు చేరిన పంటను ధ్వంసం చేస్తున్నాయి.

దోమ తెరలు, చీరలే రక్షణ కంచెలు

ఈ ప్రాంత రైతులకు వరి పంట పండించడం కంటే అడవి పందుల నుంచి కాపాడుకోవడమే కష్టంగా మారింది. వీటి నుంచి పంటను రక్షించుకునేందుకు దోమ తెరలు, చీరలు, గోనెలు, వలలు కట్టడంతోపాటు బాణసంచాకు వెలిగిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో పొలాల వద్దనే పందిర్లు వేసి రాత్రి వేళ ప్రమాదకర పరిస్థితిలో పహారా కాస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పలాస నియోజకవర్గంలోని పరిసర కొండ ప్రాంతాల్లో అడవి పందులు సంచారం అధికంగా ఉంది. ఏటా ఆయా ప్రాంతాల్లో ఇవి స్వైర విహారం చేయడంతో వందల ఎకరాల్లో వరి పంట నష్టపోతున్నామని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం సీతాపురం, పెద్దబొడ్డపాడు, బెండి, మహదేవిపురం, బట్టుపాడు, కొండవూరు, నారాయణపురం, కూర్మనాథపురం, చినవంక, చినడోకులపాడు, తాడివాడ, శారదాపురం, గుల్లలపాడు, మందస మండలం మకరజోల, కుంటికోట, అచ్యుతాపురం, వీరగున్నమ్మపురం, పిడిమందస, మధ్య, దేవుపురం, మహాదేవపురం, డిమిరియా, హరిపురం, పలాస మండలం లొత్తూరు, కంట్రగడ, పెదంచల, పినంచల ప్రాంతాల్లో పందుల బెడద అధికంగా ఉంది.

తాడివాడ సమీపంలో వలతో కట్టిన కంచె

★ వజ్రపుకొత్తూరు మండలం సీతాపురానికి చెందిన రైతు తమ్మినేని సింహాద్రి నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పుడు రాత్రింబవళ్లు పొలాల వద్దనే ఉండాల్సి వస్తుందని, అయినా అడవి పందుల నుంచి పంటను రక్షించుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. మరింత నష్టం వాటిల్లకుండా ముందస్తుగా కోతలు చేపడుతున్నట్లు తెలిపారు. పెద్దబొడ్డపాడుకు చెందిన దుంపల దేవదాసు మూడు ఎకరాల మేర వరి పండిస్తున్నారు. ఈయనది ఇదే పరిస్థితి.

అవగాహన కల్పిస్తాం.. అడవి పందుల సంచార గ్రామాలను సందర్శించి, ప్రత్యామ్నాయ జాగ్రత్తలు తీసుకోవడంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. వీటికి ప్రత్యేకంగా నివారణ చర్యలంటూ ఏమి లేవు. ప్రధానంగా అటవీ జంతువుల ఆవాస ప్రాంతాలైన వనాలు, కొండలను అందరూ పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉంది.
- మురళీకృష్ణనాయుడు, అటవీ రేంజర్, కాశీబుగ్గ

విద్యార్థులపై ప్రేమ, ఓర్పు చూపాలి

పలాస పట్టణం, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాల విద్యార్థుల మనసులు సున్నితమైనవని, వారికి శిక్షణ దిశగా ప్రేరణ కలిగించేందుకు ఎంతో ప్రేమ, ఓర్పు చూపాలని యూనిసెఫ్ ప్రాంతీయ సమన్వయకర్త శేషగిరి మధుసూదన్ ప్రేరణ మిత్రలకు సూచించారు. ప్రేరణమిత్ర పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండురోజుల కార్యశాల బుధవారం ప్రారంభమైంది. ఇందులో ఆయన మాట్లాడుతూ కళాశాల పైలట్ ప్రాజెక్టుగా ఎంపికవ్వడం అభినందనీయమని, ఈ నేపథ్యంలో చిన్నారుల మేధో వికాసం పెంచడంలో మీరు మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షత వహించగా, ప్రేరణమిత్ర ప్రణాళిక, శిక్షణ అధికారి కల్పన, శిక్షణ ఫౌండేషన్ సమన్వయకర్త రమ, ప్రతినిధులు అప్పారావు, ప్రియాంక, ఎంఈవో సత్యం, ప్రాజెక్టుకు ఎంపికైన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మధుసూదన్

ధాన్యం కొనుగోలు సక్రమంగా చేపట్టండి

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని చినంచల ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు పలాస ఏవో పోలారావును కోరారు. పలాస మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని, ప్రక్రియ ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఉప ఎంపీపీ శ్రీరాములు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ కార్యాలయానికి వెళ్తే ఎందుకు వస్తున్నారని సిబ్బంది విసుక్కుంటున్నారని, ప్రజా ప్రతినిధులంటే లెక్క లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి అటవీ శాఖాధికారులు గైర్హాజరయ్యారు. ఎంపీడీవో వసంతకుమార్, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు, పంచాయతీరాజ్ శాఖ సాంకేతిక సహాయకుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఉప ఎంపీపీ శ్రీరాములు

వైద్యసేవలు మెరుగుపరచాలని వినతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైద్యసేవలు మెరుగుపరచాలని, మౌలిక సదుపాయాలు కల్పించి, పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని ప్రభుత్వ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్‌ను కోరినట్లు సీడాప్ మాజీ అధ్యక్షుడు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అమరావతిలో కార్యదర్శి కార్యాలయంలో ఆయనను బుధవారం కలుసుకుని ఇచ్ఛాపురం, బారువ, కవిటి ప్రాంతాల సమస్యలపై వినతి పత్రం అందించారు. సౌరబ్‌గౌర్ సానుకూల స్పందన తెలిపారని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వివరించారు.

టెట్ మినహాయించాలి.. వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్(1938)శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు భుజంగరావు డిమాండు చేశారు. బుధవారం అక్కుపల్లి పాఠశాల కాంపెక్స్ పరిధిలో పలు పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

కంచిలి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. కంచిలి ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రెల్ల కామరాజు, పామిన బాసంతి, నల్లాన రవి, ఎర్రడిల్లేశ్వరరావు, నాగరత్నంలను బుధవారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు జగన్, పీఎంసీ ఛైర్మన్ భీష్మ, జగదీష్ పట్నాయక్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలపై ఫిర్యాదు

వజ్రపుకొత్తూరు, హరిపురం (మందస), న్యూస్‌టుడే: దశాబ్దాలుగా ఈ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీపై సోంపేటలో రైతుల భూములు తీసుకున్నారని అసత్య ఆరోపణలు చేస్తున్న మందస మండలం బేతాళపురానికి చెందిన బత్తిని లక్ష్మీనారాయణపై బుధవారం తెదేపా మండల మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు నాయకులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ● ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు గుప్పించడం వైకాపా నాయకులు, కార్యకర్తలకే చెల్లుతుందని కళింగ కార్పొరేషన్ డైరెక్టరు బి.దుర్యోధనరావు ఎద్దేవా చేశారు. గౌతు కుటుంబంపై వైకాపా కార్యకర్త బేతాళపురానికి చెందిన బి.లక్ష్మణరావు మంగళవారం చేసిన తప్పుడు ఆరోపణలను ఆయన ఖండించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గొండ్యాలపుట్టుగలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రమేష్ కుటుంబానికి కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. బుధవారం రూ.66,666, రూ.5 వేలు విలువ చేసే నిత్యావసర సరకులను రమేష్ భార్య మోహినికి అందజేశారు.

ఉద్దానం రాయపాడు రోడ్డుకు మోక్షం

వజ్రపుకొత్తూరు గ్రామీణం: వజ్రపుకొత్తూరు మండలం ఎన్‌పీ రోడ్డు నుంచి ఉద్దానం రాయపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.కోటి నిధులు మంజూరు కాగా బుధవారం పంచాయతీకి చెందిన కూటమి నాయకులు అఖిల్, అప్పారావు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. నారాయణస్వామి, సత్యం పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బంగారం, విలువైన వస్తువులు చోరీలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంచిలి ఎస్సై పారినాయుడు సూచించారు. ఈ మేరకు ఎంఎస్‌పల్లిలో బుధవారం చోరీలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బంగారం ధరించి ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. యువకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

టెక్కలిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా స్థానిక ఇందిరా కూడలిలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధుసూదనరావు, సీనియర్ నాయకులు పొట్నూరు ఆనందరావు, టీబీజీ గుప్త, చింతాడ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: స్థానిక అన్న క్యాంటీన్‌ను ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకుముందు గంగరాం పంచాయతీలో స్వామిత్వ సర్వే కార్యక్రమంలో భాగంగా జరిగిన గ్రామసభలో ఎంపీడీవో పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

సారవకోట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు సంబంధించి మండలంలో సర్వే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. కొమ్ముసరియాపల్లిలో సర్పంచి గొంటి లక్ష్మణరావుతో కలిసి సిబ్బంది బుధవారం వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఈ వైకుంఠరావు మాట్లాడుతూ.. అర్హత ఉండి గతంలో దరఖాస్తు చేయని వారు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అధికారులకు వివరాలు తెలియజేయాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



టెక్కలి పట్టణం: రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు, అధికారులు, నేతలు

టెక్కలి పట్టణం, పాతపట్నం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. బుధవారం టెక్కలిలోని ఓ కల్యాణమండపంలో జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత పెట్టుబడిసాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన గోవిందరాజులు, రమేష్, పినకాన అజయ్‌కుమార్, ఎల్.ఎల్. నాయుడు, హనుమంతు రామకృష్ణ పాల్గొన్నారు. ★ పాతపట్నంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు. రైతులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు భోజనం చేశారు.

పాతపట్నంలో కార్యక్రమానికి హాజరైన రైతులు

కుక్కల బెడద.. పాములతో దడ

– న్యూస్‌టుడే, సారవకోట, నరసన్నపేట, జలుమూరు, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రజలు పాములు, కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు ఆనుకుని కొండలు, పంట పొలాలు, తోటలు ఉండటంతో పాముల సంచారం అధికంగా ఉంటోంది. కొన్ని గ్రామాల్లో ఇళ్లల్లోకి విష సర్పాలు ప్రవేశిస్తున్నాయి. వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్లే వారు తరచూ పాముకాట్లకు గురవుతున్నారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రులకు తరలిస్తున్నా.. పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. సారవకోట మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన కృష్ణారావు ఇటీవల పొలంలో ఎరువు వేస్తుండగా పాము కాటు వేయడంతో ప్రాణాలు కోల్పోయారు.

సారవకోట ప్రధాన మార్గంలో సంచరిస్తున్న శునకాలు

ఏడాదిలో కేసుల వివరాలు

మండలం	పంచాయతీలు	ఆసుపత్రులు	కుక్కకాటు	పాముకాటు
సారవకోట	35	3	505	81
నరసన్నపేట	34	3	1,272	684
జలుమూరు	40	3	157	15
పోలాకి	31	2	15	1

ఒంటరిగా వెళ్లాలంటే వణుకు

ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఒంటరిగా వెళ్లాలంటే స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి సంఖ్య తగ్గించడానికి ప్రభుత్వం దృష్టి సారించినప్పటికీ ఫలితం అంతంతమాత్రమే కనిపిస్తోంది. మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడే పడేస్తుండటంతో వీటిని తింటూ వృద్ధులు, మహిళలు, పిల్లల పైకి విరుచుకుపడుతున్నాయి. నరసన్నపేట మండలం ఉర్లాంలో ఇటీవల ఒకే రోజు 10 మంది కుక్క కాటు బారిన పడ్డారు.

అశ్రద్ధ వద్దు

పాము, కుక్కకాటు బారిన పడిన వారు అశ్రద్ధ చేయకుండా ఆసుపత్రుల్లో చేరి వైద్యసేవలు పొందాలి. నాటు వైద్యం జోలికి పోవద్దు. ఈ విధానం సరికాదు. ఎంత తొందరగా ఆసుపత్రికి వస్తే అంత మంచిది. మందులు అందుబాటులో ఉన్నాయి. - తాడేల శ్రీకాంత్, జిల్లా అదనపు వైద్యాధికారి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం వల్లభరాయపాడు పంచాయతీ మణిగాం గ్రామంలోని మెట్టపై కొందరు రాత్రివేళల్లో తవ్వకాలు జరిపి, అక్రమంగా కంకర తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి. - శోభన్‌బాబు, స్థానికుడు

● సమస్యను వీఆర్వో, ఆర్ఐలకు తెలియజేస్తాం. రాత్రిపూట నిఘా పెంచి, అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - పి.సోమేశ్వరరావు, తహసీల్దారు, నందిగాం – న్యూస్‌టుడే, నందిగాం

జీఎస్టీపై అవగాహన అవసరం

నరసన్నపేట, న్యూస్‌టుడే: జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పద్మావతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ సీహెచ్.దుర్గా ప్రసాద్ సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీవో రాము, అధ్యాపకులు రమణ మూర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

దారి విస్తరణ.. అనుసంధానం విస్మరణ

టెక్కలిలో ఇటీవల నిర్మించిన భవానీనగర్- అయ్యప్పనగర్ రహదారి నుంచి వీధుల్లోకి వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు. రూ.2 కోట్ల అంచనాతో 40 అడుగుల మేర రోడ్డు విస్తరించి కాలువలు ఏర్పాటుచేశారు. అనుసంధానం చేయక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సమస్యపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ అంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. త్వరలో పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

చుక్కనీరు కానరాదు.. చేను తడవదు

నందిగాం మండలం దిమిలాడ గ్రామంలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నల్ల చెరువు ద్వారా 600 ఎకరాలకు సాగునీరందుతోంది. కాసారంలో గుర్రపుడెక్క, పనికిరాని మొక్కలు పేరుకుపోవడంతో అధ్వానంగా మారింది. మదుములు ద్వారా నీరు పారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైతే తక్షణమే తటాకాన్ని బాగు చేయిస్తామని వంశధార శాఖ డీఈ శ్రీధర్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యర్థాలు వేసేందుకు మూడు చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. వీటిని కొన్ని సంవత్సరాలుగా వినియోగించడం లేదు. చెత్తను ఆసుపత్రి వెనక భాగంలో నిల్వ చేసి, కాల్చి వేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు సందర్శనకు వస్తున్నా.. దీని గురించి పట్టించుకోవడం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఆసుపత్రి కార్యనిర్వహణాధికారి రవికుమార్ చెప్పారు. – న్యూస్‌టుడే, పోలాకి

నిరుపయోగం.. శ్రద్ధ పెడితే వినియోగం

కొత్తూరు మండలం కలిగాంలో పంచాయతీ భవనం నిరుపయోగంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరింది. గ్రామం మధ్యలో ప్రజలకు అందుబాటులో ఉండేలా గతంలో దీన్ని నిర్మించారు. నిర్వహణను గాలికొదిలేయడంతో అధ్వానంగా మారింది. బాగుచేసి ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

పాఠశాల పక్కనే ప్రమాదం..!

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ మంచాలపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల పక్కనే విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. రక్షణ కంచె లేకుండా అందినంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సిబ్బందికి తెలియజేసి రక్షణ చర్యలు చేపడతామని స్పష్టంచేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఆకట్టుకున్న ఐవోసీఎల్ మాక్‌డ్రిల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వివిధ శాఖల సమన్వయంతో బుధవారం నిర్వహించిన ఫైర్ మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. తలగాం సమీపంలోని పోర్టు రహదారిలో అగ్నిమాపక, వైద్యఆరోగ్య, రెవెన్యూ శాఖలతో కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. పెట్రోలియం ఉత్పత్తులను అధిక పీడనంతో రవాణా చేసే సమయంలో ప్రమాదాలు జరిగితే చేపట్టే చర్యలను వివరించారు. మంటలు ఆర్పడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించి తరలించడాన్ని ప్రదర్శన రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ డీజీఎం సాయికిశోర్, మేనేజర్లు దిలీప్ కోట, లక్ష్మీనారాయణ రెడ్డి, గణేష్‌బాబు, సింధూర, మూలపేట పోర్టు ఏఈ భానోజీరావు, వైస్ ఎంపీపీ రమేష్, కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యురాలు గాయత్రి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

కార్మికుడి మృతదేహం అప్పగింత

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండలం జలకలింగుపురం గ్రామానికి చెందిన గ్రానైట్ కార్మికుడు రాణ కర్రెన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు బుధవారం అప్పగించారు. సోమవారం సాయంత్రం క్వారీలో అస్వస్థతకు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు మృతిచెందాడని, పరిహారం అందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు టెక్కలి జిల్లా ఆసుపత్రి ఎదుట మంగళవారం బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల జోక్యంతో ఎట్టకేలకు యాజమాన్యం స్పందించి చర్చలు జరపడం, పరిహారంపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో సమస్యకు పరిష్కారం లభించింది.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

కలిగాంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తూరు, జలుమూరు, న్యూస్‌టుడే: కొత్తూరు మండలంలోని కలిగాం గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజ బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు పిన్నింటి ప్రసాదరావు, పోలినాయుడు, అచ్యుతరావు, మునకాల అప్పలరాజు ఆధ్వర్యంలో అభిషేకాలు, అష్టోత్తర పూజ, భజనలు చేపట్టారు. కలిగాం, పారాపురం, కొత్తూరు, ఓంద్రుజోల ప్రజలు పాల్గొన్నారు. ★ జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామంలో గురుస్వాములు తర్రశిమ్మయ్య, బైరి ఆదినారాయణ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన కార్యక్రమాలు చేపట్టారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి

జలుమూరు, న్యూస్‌టుడే: ప్రతి పంచాయతీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో చిన్నమ్మడు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

పోలాకి, న్యూస్‌టుడే: గుప్పిడిపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. దీనికి ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష (టెట్) నిర్వహిస్తామనడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమం చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నేత జి. శ్రీనివాసరావు, ఇతరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి సత్యసాయి మందిరంలో బుధవారం శత జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 40 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. తెదేపా నరసన్నపేట నియోజకవర్గ కన్వీనర్ బగ్గు అర్చన, సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలాకిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు

చంగుడి రహదారి పనులు ప్రారంభం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం చంగుడి రహదారి పనులు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పాతపట్నం నుంచి సరాళి వరకు కంకర వేసి వదిలేయడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పనులు పూర్తి చేయాలని ఇటీవల ఆందోళన చేయడంతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవ తీసుకుని గుత్తేదారుతో మాట్లాడారు. దీంతో చర్యలు తీసుకున్నారు.

బోధనా విధానం మెరుగుపడాలి

హిరమండలం, న్యూస్‌టుడే: బోధనా విధానం మరింత మెరుగు పడాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. బుధవారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కోర్స్ డైరెక్టర్ ఎస్.దాలయ్య, కాంప్లెక్స్ అధ్యక్షుడు కేశవరావు, రిసోర్సు పర్సన్‌లు సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

హిరమండలం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో కాశీప్రసాదరావు అన్నారు. బుధవారం హిరమండలంలో ఆయన మాట్లాడుతూ.. ఈకేవైసీ పూర్తయితేనే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందుతాయని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

తెదేపా నేత మృతికి సంతాపం

నందిగాం, న్యూస్‌టుడే: పెద్దబాణాపురం మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నేత, వంశధార వజ్రపుకొత్తూరు డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ అధ్యక్షుడు పైల దీనబంధునాయుడు బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నాయకులు పినకాన అజయకుమార్, మల్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖరరావు సంతాపం తెలిపారు.

సందడిగా వన భోజనాలు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: కార్తిక మాసం నేపథ్యంలో గ్రామాల్లో వన భోజనాలు సందడిగా జరుగుతున్నాయి. మండలంలోని చింతలబడవంజలో శ్రీకోదండరామాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి దొంకలబడవంజ, కవిటి, కొత్తపేట, కుసుమలపాడు, చిట్టిమండలం, తురకపేట గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీలే లక్ష్యం

జలుమూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్వర్ణ పంచాయతీలే మనందరి లక్ష్యం కావాలని ఎంపీడీవో చిన్నమ్మడు అన్నారు. టెక్కలిపాడులో చెత్త సేకరించే విధానాన్ని బుధవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణపై మహిళలకు అవగాహన కల్పించారు. సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సందడిగా పురుషుల దినోత్సవం

కొత్తూరు, న్యూస్‌టుడే: కుటుంబ పోషణలో పురుషులది ప్రత్యేక పాత్ర అని పలువురు మహిళా ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంటి బాధ్యతలు మోస్తున్న పురుషులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అండగా పీఏసీఎస్‌లు

అఖిల భారత సహకార వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండల కేంద్రంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు బుధవారం ఘనంగా చేపట్టారు. తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు అందిస్తున్నట్లు మండల పీఏసీఎస్ అధ్యక్షుడు కూచెట్టి కాంతారావు తెలిపారు. తెదేపా నాయకులు కింజరాపు హరిప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, గోవిందరాజులు, రెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం కాగువాడలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. వర్మీ కంపోస్టు తయారీ జరిగేలా చూడాలని కార్యదర్శికి సూచించారు. వీధుల్లో పర్యటించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి, సర్పంచి నల్లి జగదీశ్వరరావు ఉన్నారు.

మల్లన్న సేవలో ప్రముఖులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి క్షేత్రాన్ని పలువురు ప్రముఖులు బుధవారం సందర్శించారు. శ్రీకాకుళం అదనపు సివిల్ జడ్జి పి.భాస్కరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఎల్.ఎల్.నాయుడు, కింజరాపు హరివరప్రసాద్ ఉన్నారు.

సామర్థ్యాల మెరుగుకు కృషి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో డి.తులసీరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా రెండురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కోర్సు డైరెక్టర్‌గా డి.చిన్నారావు, మాస్టర్ ట్రైనీలుగా బి.నేతాజీ, ఎన్.సురేష్ వ్యవహరించారు.

సేంద్రియ బాట.. లాభాల పంట

– న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట, నరసన్నపేట, పోలాకి

రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించి పంటలు పండిస్తున్న ప్రస్తుత రోజుల్లో ప్రకృతి విధానంలో సాగు చేపడుతూ అతివలు ముందడుగు వేస్తున్నారు. బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని వాటిని పెట్టుబడులుగా వినియోగించి ఆదాయం పొందుతున్నారు. ఇంటిలోని వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి ఉపయోగిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్న నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన స్వయంశక్తి సంఘాల సభ్యుల గురించి ప్రత్యేక కథనం.

ఆరోగ్యకరమైన సమాజం కోసం

పోలాకి మండలంలో అంబీరుపేట, తోటాడ, గొల్లలవలస, గాతలవలస గ్రామాల్లో 20 ఎకరాల్లో, జలుమూరు మండలం రాణా, ఎలమంచిలి, రావిపాడు ప్రాంతాల్లో 15 ఎకరాల్లో సేంద్రియ విధానంలో మహిళలు సాగు చేపడుతున్నారు. నరసన్నపేటలో తామారపల్లి, ఈదలవలస, కోమర్తి గ్రామాల్లో 20 ఎకరాల్లో, సారవకోట మండలం తొగిరి, రామచంద్రాపురం, బుడితి, పద్మాపురం ప్రాంతాల్లో 15 ఎకరాల్లో మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

దశాబ్ద కాలంగా సాగు

35 సెంట్ల విస్తీర్ణంలో ఆరేళ్లుగా సేంద్రియ విధానంలో బెండ, చిక్కుడు, వంగ వంటి కూరగాయలు సాగు చేస్తున్నాం. వర్మీ కంపోస్టు, వేపనూనె, కషాయాలతో చీడ పీడల బారి నుంచి కాపాడుతున్నాం. పెట్టుబడి కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాం. రెండు నెలలకు ఒకసారి పంట చేతికి వస్తుంది. ఒక విడతలో సుమారు రూ.35 వేల వరకు ఆదాయం వస్తుంది.

- సడగాన సింహాద్రమ్మ, తొగిరి, సారవకోట మండలం

ఇతరులను ప్రోత్సహిస్తూ..

ప్రకృతి విధానంలో ఐదేళ్లుగా కూరగాయలు పండిస్తున్నాం. 25 సెంట్ల విస్తీర్ణంలో బెండ, కాకర, మిర్చి వంటి పంటలు సాగు చేస్తున్నాం. అధికారుల సూచనలు పాటిస్తూ.. వేపనూనె, పశువుల వ్యర్థాలు ఎక్కువగా వినియోగిస్తున్నాం. స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకున్నాను. పెట్టుబడి పోనూ ఒక విడతలో రూ.30 వేలకు పైగా ఆదాయం వస్తుంది.

- గొద్దు శ్యామల, తామరాపల్లి, నరసన్నపేట మండలం

రుణ సదుపాయం కల్పిస్తున్నాం: సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని స్వయం శక్తి సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి గరిష్ఠంగా రూ.50 వేల వరకు రుణం అందిస్తున్నాం. ప్రకృతి విధానంలో పండించిన ఉత్పత్తులకు డిమాండ్ ఉండటంతో లాభాలు వస్తున్నాయి.

- హేమసుందరరావు, అప్పలసూర్యనారాయణ, శ్రీనివాసబాబా, సుశీల, వెలుగు ఏపీఎంలు

కాటాలకు సీళ్లు తప్పనిసరి

ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ బలరామకృష్ణ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కాటాలకు సీళ్లు తప్పనిసరని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ అన్నారు. టెక్కలిలోని పలు దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ కాటాలకు ఏడాదికోసారి, సాధారణ కాటాలకు రెండేళ్లకోసారి సీళ్లు వేయించుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే సరకులు విక్రయించాలని సూచించారు. ఎటువంటి తేడాలు, మోసాలు జరిగినా వినియోగదారులు తమను సంప్రదించాలని చెప్పారు. ఆయన వెంట సాంకేతిక సహాయకుడు డి.నర్సింహం ఉన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పోలాకి, జలుమూరు, న్యూస్‌టుడే: పోలాకి మండల పరిధిలోని పిన్నింటిపేట విద్యుత్తు ఉప కేంద్రంలో ఈ నెల 21న నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. గుప్పిడిపేట, పిన్నింటిపేట, కోడూరు, బొద్దాం, చినకొవిరిపేట, గుల్లవానిపేట గ్రామాల వారు సహకరించాలని పేర్కొన్నారు. ★ జలుమూరు మండలం చల్లవానిపేట, బుడితి విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత శాఖ ఏఈ సూర్యారావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. జోనంకి, అబ్బాయిపేట, గంగాధరపేట, తలతరియా, లింగాలపాడు, ఊడికలపాడు గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

(c) eenadu

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

శిథిలమైనా పట్టదా..?

ఆమదాలవలస మండలం వంజంగి పశువైద్యశాల శిథిలం కావడంతో రైతులు, వైద్యాధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే వైద్యశాల పూర్తిగా కారిపోయి దస్త్రాలు, మందులు అన్నీ పాడవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని జడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

తెరపై ఈనాడు

● మారుతి: లవ్ ఓటీపీ, నువ్వొస్తానంటే నేనొద్దంటానా ● కిన్నెర : సంతాన ప్రాప్తిరస్తు ● కీర్తన : ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో ● కీర్తిక: ది గర్ల్‌ఫ్రెండ్ ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): కాంత ● సూర్యమహల్: శివ ● సన్‌మ్యాక్స్ : జిగ్రీస్ ● సరస్వతి : మాస్ జాతర – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

సమస్య: కొత్తకోటవారివీధి, పాతినవారివీధి, గణేష్‌నగర్‌లలో రహదారిపై వాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – మోహనరావు, ఆమదాలవలస

సమాధానం: చర్యలు తీసుకుంటాం. – జాన్సన్, పుర ఏఈ, ఆమదాలవలస

? తిమ్మాపురం, ఎన్టీఆర్‌కాలనీ, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశంపేట్లలో తాగునీరు ట్యాంకర్లు వారానికి ఒక్కసారి మాత్రమే వస్తోంది. – హరనాథ్, స్థానికుడు ● రోజూ తాగునీటి ట్యాంకర్ వచ్చేలా చర్యలు తీసుకుంటాం. – టి.రవి, పుర కమిషనర్ – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

? శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరం రెల్లివీధిలో నిర్మించి సామాజిక మరుగుదొడ్డి నిర్వహణ లేక అపరిశుభ్రంగా తయారైంది. స్థానికులు ఆరుబయట మలవిసర్జన చేయాల్సి వస్తోంది. – టి.రామారావు, హయాతీనగరం, పెద్దరెల్లివీధి ● మరుగుదొడ్డిని అందుబాటులోకి తీసుకొస్తాం. – పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం

కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం ‘పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ’ పథకం రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కూనరవి కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస గ్రామీణం, గార (బూరవెల్లి)



ఎచ్చెర్ల: అన్నదాతలకు చెక్కు అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఈశ్వరరావు



బూర్జ: పెద్దపేటలో డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణ, కూటమి నాయకులు

గార: ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని సెల్‌ఫోన్‌లో చూపుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

రేపు నెహ్రూ యువకేంద్రంలో ఉద్యోగ మేళా

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా మోడల్ కెరీర్ సెంటర్ (ఉపాధి కల్పన కార్యాలయం) ఆధ్వర్యంలో 21న శ్రీకాకుళం నెహ్రూ యువకేంద్రంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారిణి కె.సుధ ఓ ప్రకటనలో తెలిపారు. పది, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివి.. 20 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. రెండు ప్రైవేటు కంపెనీల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్ ఉద్యోగాలకు సంబంధించి 50 ఖాళీలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలను www.nsc.gov.in లో ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

రాత్రి వెలగవు.. పగలు ఆరవు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నగరంలో అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

శ్రీకాకుళం నగరంలో వీధి దీపాల నిర్వహణ కొన్నేళ్లుగా అస్తవ్యస్తంగా తయారైంది. మరమ్మతులకు గురైన వీధి దీపాలను పునరుద్ధరించేందుకు నగరపాలక సంస్థలో అవసరమైన విడి పరికరాలు లేకపోవడంతో నెలల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీపాలు నిర్దిష్ట సమయంలో వెలుగుతూ, ఆగిపోవాల్సి ఉండగా చాలా ప్రాంతాల్లో పగటి పూట వెలుగుతూ విద్యుత్తు దుబారా జరుగుతోంది. వీటిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

● నగరపాలక పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఒకటి నుంచి 5 వరకు వీధి దీపాలు నెలలు తరబడి పనిచేయడం లేదు. మరి కొన్ని చోట్ల పగటిపూట వెలుగుతూ నగరపాలక సంస్థకు విద్యుత్తు బిల్లుల రూపంలో అదనపు భారం పడుతోంది.

● గతంలో వీధి దీపాలను కొనుగోలు చేయడంలో విడిభాగాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేవి. అవసరమైన చోట్ల ఏర్పాటు చేసి నిర్వహణ చేపట్టి సకాలంలో మరమ్మతులు పూర్తిచేసేవారు. కొత్తగా ఏర్పడిన కాలనీల్లోని శివారు ప్రాంతాలకు వీధి దీపాలు ఏర్పాటు చేసేవారు. ఏడేళ్ల కిందట వరకు ఈ బాధ్యతలు ఈఈఎస్‌ఎల్ సంస్థ నిర్వహించేది. గత వైకాపా ప్రభుత్వం ఆ సంస్థతో ఒప్పందం రద్దు చేసుకోవడంతో అప్పటి నుంచి నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుంది.

బైరివానిపేటలో పగలు వెలుగుతున్న వీధి దీపం

● గత ఐదేళ్లలో కేవలం నగరపాలక సంస్థ సుమారు రూ.10 లక్షల మేర మాత్రమే విడిభాగాలు కొనుగోలు చేసింది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో విడిభాగాలు, కొత్త దీపాలు లేకపోవడంతో మరమ్మతులు చేపట్టేందుకు ఆస్కారం ఉండటం లేదు. నిర్దిష్ట సమయంలో వీధి దీపాలు వాటంతట అవే వెలిగి, ఆరిపోయే సాంకేతిక పరిజ్ఞానం గల కమాండ్ కంట్రోల్ సిస్టం పరికరాలు పూర్తిగా పాడైపోయాయి.

విడిభాగాల కొనుగోలుకు చర్యలు... వీధి దీపాల నిర్వహణకు అవసరమైన విడిభాగాలు కొనుగోలుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం అవకాశం ఉన్న చోట్ల మరమ్మతులు చేయిస్తున్నాం. దీనిపై పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నాం. – పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

● డివిజన్లు: 50 ● జనాభా: 1.85 లక్షలు ● కుటుంబాలు: 55,471 ● వీధి దీపాలు: 1,836 ● పని చేయనవి: 250 పైగా

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

బాతువ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

జి.సిగడాం, న్యూస్‌టుడే: అధునాతన సౌకర్యాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి కె.అనిత అన్నారు. జి.సిగడాం మండలం బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రంలో రెడ్డిస్ సంస్థ సహకారంతో కొత్త ప్రయోగశాల పరికరాలు, శుద్ధిచేసిన తాగునీరు, రోగ నిర్ధారణ తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రెడ్డిస్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎందుకు నిర్మించారో?

సరుబుజ్జిలి మండలం పెద్దపాలెం గ్రామంలో పశువులు, మూగజీవాలు దాహార్తిని తీర్చేందుకు ఉపాధి పనుల్లో భాగంగా నీటి తొట్టెను నిర్మించారు. కొన్ని నెలలుగా అందులో నీటిని నిల్వ చేయకపోవడంతో తొట్టె వృథాగా ఉంది. ఈ విషయాన్ని ఎంపీడీవో ఎం.పావని వద్ద ప్రస్తావించగా పరిశీలించి నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

మురుగు ఇట్లా.. నడిచేదెట్లా?

జి.సిగడాం మండలం మదుపాం గ్రామంలోని ప్రధాన వీధిలో మురుగు రోడ్డుపై నిలిచిపోవడంతో నడవడానికి సైతం వీలు లేని పరిస్థితి నెలకొంది. పాదచారులు, వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో నెలలు తరబడి పూడిక తీయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని, దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణ వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

రహదారిపై పశువుల తిష్ఠ

శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద పశువుల సంచారంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద మూగజీవాలు తిష్ఠ వేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

గుంతల గండం..

పొందూరు నుంచి లక్ష్మింపేట గ్రామానికి వెళ్లే రహదారి అడుగుకొక గుంతతో అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గుంతలతోపాటు మలుపులు ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ పీటీ రాజుతో ప్రస్తావించగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు

వృథాగా వదిలేశారు..

ఆమదాలవలస పుర పరిధిలో ఇంటింటికీ తాగునీరు అందించే ఉద్దేశంతో 2021లో వైకాపా ప్రభుత్వం రూ.78 కోట్లతో జలజీవన్ పనులు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి పైపులు తీసుకొచ్చి పార్వతీశంపేట, తాండ్రసి మెట్ట, చింతాడ, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో పోగులుగా వేసి ఉంచారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచాయి. అప్పటి నుంచి పైపులు ముళ్ల పొదలు మధ్యలో అలాగే ఉన్నాయి. మరి కొన్ని చోరీకి గురయ్యాయి దీనిపై పుర కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

శిక్షా కాలంలో సత్ప్రవర్తన అలవర్చుకోండి

గార (అంపోలు): కారాగారంలో ముద్దాయిలు, ఖైదీలు తమ శిక్షా కాలంలో సత్ప్రవర్తన అలవర్చుకొని అనంతరం సమాజంలో ఉత్తమంగా మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. గార మండలం అంపోలులో జిల్లా కేంద్ర కారాగారాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. జైలర్ దివాకర్‌నాయుడు, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన విత్తనాల ఎంపిక అవసరం

ఆమదాలవలస పట్టణం: ఉద్యాన వ్యవసాయంలో నాణ్యమైన విత్తనాల ఎంపిక ప్రధానమని శాస్త్రవేత్త వి.హరికుమార్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో కూరగాయల నారు పెంపకం శిక్షణ చివరి రోజు కార్యక్రమంలో రైతులకు ఉద్యాన పంటలపై క్షేత్రస్థాయిలో యువరైతులకు అవగాహన కల్పించారు.

వాకర్స్‌క్లబ్ అభినందన

శ్రీకాకుళం సాంస్కృతికం: దేశ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర చేపట్టిన హరియాణాకు చెందిన దీపక్‌శర్మను స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు అభినందించారు. నగరంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో దీపక్‌శర్మకు సత్కారం చేశారు.

నైతిక విలువలు పాటించండి

శ్రీకాకుళం గ్రామీణం: విద్యా వ్యవస్థలో నైతిక విలువలు పెంపొందించాలని సత్యసాయి విద్యాజ్యోతి కార్యక్రమం జిల్లా సమన్వయకర్త ఎం.జనార్దనరావు అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేట వద్ద గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో ‘విద్యా వ్యవస్థ నైతిక విలువలు’ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి నివాళి

శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెల్ల సురేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు కేవీఎల్ఎస్ ఈశ్వరి, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త బొత్స వెంకటరమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

పీహెచ్‌డీ ప్రదానం

పొందూరు : పెనుబర్తి గ్రామానికి చెందిన తమ్మినైన గోవిందరావుకు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. 5జీ మొబైల్ అప్లికేషన్ల కోసం ఎలక్ట్రోమాగ్నెటిక్ బ్యాండ్ గ్యాప్(ఈబీజీ) నిర్మాణాన్ని ఉపయోగించి ఫోర్-పోర్ట్ మిమో యాంటెన్నా పనితీరు లక్షణాలపై చేసిన పరిశోధనలకుగాను పీహెచ్‌డీ అందుకున్నారు. ప్రస్తుతం ఈయన విజయనగరంలో ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిసరాలు శుభ్రం

ఎచ్చెర్ల : ధర్మవరంలో కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాలు శుభ్రం చేశారు. అసోసియేట్ డీన్ ఎల్.నారంన్నాయుడు పాల్గొన్నారు.

ధీర వనిత ఝాన్సీలక్ష్మీబాయి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి జయంతి సందర్భంగా నగరంలోని గాంధీ మందిరంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: సుడా ఆధ్వర్యంలో నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పార్కు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, ఇంజినీరు కె.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే

శ్రీకాకుళం అర్బన్: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజను బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలోని రహదారులు భవనాల శాఖ అతిథి గృహంలో ఆమెకు శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వైభవంగా సత్యసాయి జయంత్యుత్సవాలు

పాత శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీలో పల్లకి ఉత్సవం నిర్వహిస్తున్న మహిళలు

శ్రీకాకుళం సాంస్కృతికం, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సత్య సాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని పలు సత్యసాయి మందిరాలు, భజన మండళ్లలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. హయాతీనగరంలోని సత్యసాయి మందిరంలో కుంకుమ పూజలు జరిగాయి. పాలకొండ రోడ్డులోని పెద్ద మందిరంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. న్యూకాలనీ మందిరంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. బ్యాంకర్స్, హడ్కో, ఏపీహెచ్‌బీ, డీసీసీబీ కాలనీలు, భారతీ నగర్‌లోని సత్యసాయి మందిరాల్లో జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పొందూరు మండలం లోలుగులో గర్భిణులకు సీమంతాలు చేశారు.

న్యూకాలనీ సత్యసాయి మందిరంలో సామూహిక సత్యసాయి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలంలో గెడ్డకంచరాం, చెట్టుపొదిలాం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ యోగేశ్వరరావు తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగింపు పనుల కారణంగా గెడ్డకంచరాం, నడిమివలస, సేతుభీమవరం, ఎందువ, బాతువ, చెట్టుపొదిలాం, వెలగాడ, దేవరవలస తదితర గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్ఎస్ఎన్ స్వామి తెలిపారు. కళాశాలలో బీఏ(పొలిటికల్ సైన్సు), బీఏ(హిస్టరీ), బీకాం(కంప్యూటర్స్) గ్రూపుల్లో మిగులు సీట్లు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందాలనుకునేవారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాల పనివేళల్లో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 95152 25991, 95055 04447, 63011 83553 సంప్రదించాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆమదాలవలస మండలం సైలాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షురాలు మాధవి

బూర్జ, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టరు ఆనెపు రామకృష్ణలు పేర్కొన్నారు. బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ సర్పంచి ఆనెపు వరలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ● రైతులు ధాన్యం విక్రయించిన 24 గంటలో ఖాతాలో జబ్బులు జమ అవుతాయని కృష్ణాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షురాలు సిమ్మ మాధవి అన్నారు. ఆమదాలవలస మండలం సైలాడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

జి.సిగడాం, న్యూస్‌టుడే: బ్యాంకు లింకేజీ రుణాలను గ్రామైక్య సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు లింకేజీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో బ్యాంకర్లు, గ్రామైక్య సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జి.సిగడాం యూనియన్ బ్యాంకు మేనేజర్ శాంతన్‌బారక్, వెలుగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాలు సక్రమంగా ఉపయోగించండి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు సంబంధించిన దస్త్రాలను సక్రమంగా ఉపయోగించాలని పెద్దపాడులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసదేవి సూచించారు. రెండో విడత విడుదలయ్యే నిధులకు దరఖాస్తు చేసే విధానాన్ని వివరించారు. గురుకుల పాఠశాలలో బుధవారం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఇన్‌ఛార్జిలకు కార్యశాల నిర్వహించారు. డీఈవో రవికుమార్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సమన్వయ అధికారిణి యశోదలక్ష్మి, ఏపీసీ శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కేంద్ర గ్రంథాలయంలో ముగ్గులు వేస్తున్న బాలికలు

ఆమదాలవలస పట్టణం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి కోటేశ్వరరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గులు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆమదాలవలస మండలం ధర్మవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయంలో జరిగి కార్యక్రమంలో రంగవల్లుల పోటీలు జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి వీవీజీఎస్ శంకర్‌రావు, గ్రంథాలయాధికారి భాస్కర్‌రాజా, వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు పాల్గొన్నారు.

రేషన్ అందించండి మహాప్రభో

రేషన్ బియ్యం అందలేదని చెబుతున్న వృద్ధులు

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం కప్పరాం రేషన్ డిపో డీలరుపై గతంలో 6(ఎ) కేసు నమోదై ఆయన సస్పెండ్ కావడంతో గ్రామంలో 65 రేషన్ కార్డుదారులు నాలుగు నెలలు నుంచి మదుపాం డిపో నుంచి రేషన్ సరకులు తెచ్చుకుంటున్నారు. గ్రామానికి చెందిన 15 మంది వృద్ధులు, దివ్యాంగులు సుమారు 2 కిలోమీటర్లు నానాపాట్లు పడి ఈ నెల రేషన్ కోసం వెళ్లినా బియ్యం అందలేదని వాపోతున్నారు. గ్రామంలో రేషన్ డిపో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సీఎస్ డీటీ మధు వద్ద ప్రస్తావించగా వచ్చేనెల నుంచి రేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణానికి డీపీఆర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయానికి నూతన భవనం నిర్మించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం రెండంతస్తుల్లో ఉన్న కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో దీని స్థానంలో కొత్త భవనం నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. పైభాగంలో సౌర విద్యుత్తు ప్యానల్, కింది అంతస్తులో వాణిజ్య సముదాయం, రెండు అంతస్తుల్లో కార్యాలయం నిర్వాహణకు అనువుగా భవనం నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ ఆమోదం తెలపడంతో అధికారులు చర్యలు చేపట్టారు. భవన నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించడానికి అర్హత, ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. డీపీఆర్‌కు ఆమోదం లభించిన తర్వాత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు తెలిపారు.

పల్లెల్లో పచ్చదనం, శుభ్రతకు శ్రీకారం

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం

● రేపటి నుంచి క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ పేరుతో అవగాహన కార్యక్రమాలు

గ్రామ పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ పేరుతో ఈ నెల 21 నుంచి రోజుల పాటు ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇందుకు నియోజకవర్గంలో ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు ఇటీవల శిక్షణ ఇచ్చారు.

● శిక్షణ పొందిన అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని పచ్చదనం, పరిశుభ్రత, ఇతర అంశాల్లో దాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతారు. దాన్ని ఉదాహరణగా చూపి మిగిలిన గ్రామాలను తీర్చిదిద్దాలి. కార్యచరణకు పంచాయతీల నుంచి ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

సరుబుజ్జిలి మండలంలో ఎంపికైన షళంత్రి గ్రామం

● అవసరమైన పంచాయతీల్లో తాత్కాలిక పద్ధతిపై పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి పచ్చదనం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రతి మండల స్థాయి అధికారి వారి పరిధిలో వారంలో ఒక గ్రామానికి పర్యవేక్షణకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆమదాలవలస నియోజకవర్గ వివరాలు

మండలం	ఎంపిక చేసిన గ్రామం
సరుబుజ్జిలి	షళంత్రి
ఆమదాలవలస	బెలమాం
పొందూరు	కొంచాడ
బూర్జ	బూర్జ

గ్రామాలను అభివృద్ధి చేస్తాం.. పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలపై ఇటీవల అధికారులకు శిక్షణ ఇచ్చాం. సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇస్తాం. హరిత రాయబారులంతా ఎంపిక చేసిన గ్రామానికి పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తారు. దశలవారీగా అన్ని గ్రామాలకు కార్యక్రమాలు చేపడతాం.
– ఎం.పావని, ఆర్.వెంకటరావు, వాసుదేవరావు, తిరుపతిరావు, నాలుగు మండలాల ఎంపీడీవోలు

SRI VENKATESWARA COLLEGE OF PHARMACY
ETCHERLA, SRIKAKULAM-532410
(Affiliated to AU, Vsp and Approved by PCI, New Delhi)
Accredited with NAAC "A" Grade
ADMISSION NOTIFICATION FOR CATEGORY B (NON-NRI) & UNFILLED NRI QUOTA SEATS FOR ACADEMIC YEAR 2025-26
Applications are invited from the eligible candidates for admission into 1st year B.Pharm & Pharm.D under Category-B (Non-NRI) and Unfilled NRI quota seats for the academic year 2025-26 as follows:
Course:B.Pharm no.of Category-B (Non-NRI) & Unfilled NRI quota seats: 30
Course:Pharm.D no.of Category-B (Non-NRI) & Unfilled NRI quota seats: 09
Eligibility: 1) Category-B (Management) quota candidates who have passed the Intermediate (MPC/Bi.P.C) examination with not less than 45% of marks in the prescribed group.
2) Last date for submission of filled in applications to the college on or before 23.11.2025. Admissions will be made as per the guidelines of APSCHE.
For details contact: 9912342120, 9866806625, 9440149708 PRINCIPAL

SRI VENKATESWARA COLLEGE OF PHARMACY
ETCHERLA, SRIKAKULAM-532410
(Affiliated to AU, Vsp and Approved by AICTE & PCI, New Delhi)
Accredited with NAAC "A" Grade
Contact No. s: 9912342120, 9866806625
SPOT ADMISSION INTO 1st B.PHARM & 1st PHARM.D (2025-26)
Institutional Spot Admission EAPCET-2025 (M.P.C/Bi.P.C)
Applications are invited from Eligible candidates (EAPCET-2025 Qualified / Intermediate (M.P.C/Bi.P.C) passed with 45% and above [for OC candidates] with 40% & above [for BC/SC/ST candidates] in group subjects to fill up left over vacancy seats in 1st year B.Pharm and Pharm.D courses. The applicants should attend to the college on or before 23.11.25 with all original certificates at the time of admission.
Left over seats B.Pharmacy: 11+ EWS:05, Pharm.D: 06+01(EWS)
PRINCIPAL

(c) eenadu

ముత్యాల పందిరి.. మురిపెంగ కొలువుదీరి

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఉదయం ముత్యపుపందిరి వాహనసేవ జరిగింది. వాహనంపై ధనలక్ష్మీరూపంలో భక్తులకు అభయమిచ్చారు. ముద్దులొలికించే ముత్యాలు అలమేలుమంగకు ప్రీతిపాత్రమైనవి. స్వాతికార్తెలో వాన చినుకులు సాగరంలోని ముత్యపుచిప్పల్లో పడి మేలుముత్యంగా రూపొందుతాయని, ఏనుగుల కుంభస్థలాల్లో ఉంటాయని పురాణాలు చెబుతున్నాయి. అటువంటి ముత్యాలను అమ్మవారి నవ్వులకు, చూపులకు, మాటలకు, సిగ్గులకు ప్రతీకలుగా అన్నమయ్య కీర్తించారు. తెల్లని చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అమ్మవారిని చూసేందుకు భక్తులు తిరుమాడ వీధుల్లో బారులు తీరారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయంలోని ముఖమండపంలో అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో వేడుకగా స్నపన తిరుమంజనం జరిగింది. అమ్మవారు రాత్రి సింహవాహనంపై యోగ నరసింహుడి అలంకరణలో దర్శనమిచ్చారు. ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. **– న్యూస్‌టుడే, తిరుచానూరు**

ఉత్సవాల్లో నేడు..

గురువారం ఉదయం కల్పవృక్ష, రాత్రి హనుమంత వాహన సేవలు జరగనున్నాయి.

రాష్ట్రపతి కాన్వాయ్ ట్రయల్ రన్



రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నుంచి రెండ్రోజుల పర్యటన సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆమె వాహన శ్రేణి ట్రయల్ రన్ నిర్వహించారు. బుధవారం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం చేరుకుని అక్కడ్నించి తిరుమల వరకు చేపట్టారు. ఈ మార్గంలోని కీలక పాయింట్లను, ట్రాఫిక్, భద్రతా డిప్లాయ్‌మెంట్, మొబిలైజేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థలను సమగ్రంగా తనిఖీ చేశారు.

ఆధ్యాత్మిక క్షేత్రం నుంచి అంతరిక్ష రంగం

రౌతుసూరమాలలో స్పేస్ సిటీకి భూముల కేటాయింపు

ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా ఉన్న తిరుపతి జిల్లాను అంతరిక్ష రంగంలోనూ అగ్రపథంలో నిలపాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. పరిశోధన, ఉపగ్రహ తయారీ, అసెంబ్లింగ్ యూనిట్లు, డిజిటాబాల తయారీ, తదితర పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 14న స్పేస్ సిటీకి శంకుస్థాపన చేశారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికే భూముల సేకరణపై కసరత్తు ప్రారంభించింది. ఔత్సాహిక పెట్టుబడిదారులు యూనిట్ల స్థాపనకు ముందుకొస్తున్నారు. ఇవన్నీ వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చితే జిల్లా ఖ్యాతి మరింత పెరుగుతుంది.

లక్ష్యం.. 3వేల ఎకరాలు

జిల్లా పునర్విభజనతో తిరుపతికి సముద్ర తీరం వచ్చింది. శ్రీహరికోటలోని షార్ జిల్లా పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో స్పేస్ సిటీ ఏర్పాటుకు జిల్లా అనువుగా ఉంటుందని సీఎం చంద్రబాబు భావించారు. తొట్టంబేడు మండలం రౌతుసూరమాల ఎంపిక చేశారు. తొలుత స్పేస్ సిటీకి 2,100 ఎకరాలు కేటాయించాలని అనుకున్నా భవిష్యత్తులో 3వేల ఎకరాలు అవసరమని అంచనా వేశారు. 4 బ్లాకులుగా విభజించారు.

571 ఎకరాల్లో మౌలిక వసతులు

ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రాథమికంగా కొంత భూమి సేకరించాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. తొలుత 571.70 ఎకరాల్లో ప్రధాన, అంతర్గత రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ, తదితర మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడ్డాయి. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేసి పెట్టుబడిదారులకు అప్పగించాలని అనుకుంటున్నారు.

ఇప్పటికే 300 ఎకరాలు కావాలని

సీఐఐ భాగస్వామ్య సదస్సులో బెంగళూరుకు చెందిన ఓ సంస్థ 150 ఎకరాల్లో పరిశ్రమ స్థాపనకు ప్రతిపాదించింది. మరో సంస్థ 150 ఎకరాల్లో పరిశ్రమ స్థాపిస్తామని పేర్కొంది. ఇప్పటికే 300 ఎకరాలను ఆయా సంస్థలకు అప్పగించే పనిలో ఏపీఐఐసీ నిమగ్నమైంది. తక్కువ ఖర్చుతో రాకెట్లు, శాటిలైట్లను తయారు చేసే స్టార్టప్‌లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, దేశీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం స్పేస్ పాలసీ 4.0ను రూపొందించింది.

అన్నీ అనుకూలతలు

స్పేస్ సిటీకి అవసరమైన అన్ని అనుకూలతలు జిల్లాలో ఉన్నాయి. పరిశోధనలకు సహకారం అందించడానికి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నాయి. శ్రీహరికోట కూడా సమీపంలోనే ఉంది. పెట్టుబడిదారులు పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపుతున్నారు. అంతే వేగంగా వారికి భూములు కేటాయించనున్నాం.
–వెంకటేశ్వర్, కలెక్టర్

ఈనాడు- తిరుపతి

అదిరేలా.. అచ్చెరువొందేలా!

జిల్లాలో డిజిటల్ శుభాకాంక్షల ట్రెండ్

● తిరుపతికి చెందిన ఓ తల్లి.. తన కుమారుడి 15వ పుట్టినరోజును ప్రత్యేకంగా, అతడికి గుర్తుండిపోయేలా జరపాలనుకుంది. 'సర్‌ప్రైజ్ విషెస్' అని ఆన్‌లైన్‌లో వెతకగా.. వచ్చిన లిస్ట్‌లో సంబంధిత ఈవెంట్ నిర్వాహకులను సంప్రదించారు. వారు అనుకున్న తేదీన రెండు గంటల పాటు పది మంది కుటుంబ సభ్యులతో కలిసి బుక్ చేసుకున్నారు. ప్రత్యేక థియేటర్, కేక్, అతడి స్నేహితులను పిలిచి సర్‌ప్రైజ్ విష్ చేయించారు. ఆ సమయంలో అతని ముఖంలో వచ్చిన ఆనందం చూసి వెలకట్టలేనిదిగా వారు అనుభూతి పొందారు.

ఈనాడు డిజిటల్, తిరుపతి: భక్తికి, ఆధ్యాత్మికతకు కొలువైన తిరుపతి.. ఇప్పుడు ట్రెండీ టెక్నాలజీ, వినూత్న ఆకాంక్షలకు కూడా వేదికవుతోంది. మొన్నటివరకు హైదరాబాద్, విజయవాడ.. లాంటి మెట్రో నగరాలకే పరిమితమైన పెద్ద తెరపై (బిగ్ స్క్రీన్) శుభాకాంక్షలు చెప్పే సంస్కృతి, ఇప్పుడు తిరుపతి, చిత్తూరులోనూ ఊపందుకుంది. కేవలం పుట్టినరోజే కాక, ఉద్యోగ సాధన, నిశ్చితార్థం, ప్రేమ, వివాహ వార్షికోత్సవాలు, రూఫ్ టాప్ వేడుకలు.. ఇలాంటి వాటికి యువత ఆసక్తి కనబరుస్తున్నారు.

జ్ఞాపకాలు పదిలం

సాంకేతికత అందుబాటులోకి రావడంతో నగరంలో ఉన్న కొన్ని సినిమా థియేటర్లలో, ప్రత్యేకంగా వీటి కోసం ఏర్పాటు చేసిన సింగిల్ స్క్రీన్‌లలో కుటుంబ సభ్యులతో కలిసి ఆ మధుర క్షణాన్ని అద్భుతంగా పదిలపరుచుకుంటున్నారు. ఇలాంటివి నగరంలో పది వరకు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేకంగా సిద్ధం చేసిన రూఫ్‌టాప్ థియేటర్

తిరుపతికే ప్రత్యేకం..

పుట్టిన రోజు, పెళ్లిరోజు, లవ్ ప్రపోజల్, ఫ్రెండ్‌షిప్.. ఇలా ఏదైనా సెలబ్రేట్ చేసుకునేందుకు మినీ థియేటర్ నుంచి ప్రత్యేక సింగిల్ స్క్రీన్.. లాంటి వాటితో పాటు తిరుపతిలో ప్రత్యేంగా రూఫ్‌టాప్ కూడా ఉంది. ఇక్కడ రాత్రి 9 నుంచి 11 వరకు వేడుకలు చేసుకోవచ్చు. కేక్, డెకరేషన్, సౌండ్ సిస్టమ్, పది మంది సభ్యులకు ఎంట్రీ మొత్తం రూ. 6,500 వరకు ఉంటుంది.

ఈవెంట్‌ను బట్టి ధర

సాధారణంగా అర గంట, గంట, రెండు, మూడు గంటల ప్యాకేజీలుంటాయి. ఏడుగురు సభ్యుల నుంచి 30 మంది కలిసి వేడుకలు చేసుకునే వీలుంటుంది. టైం స్లాట్ ఆధారంగా.. వీటి ధర మినీ స్క్రీన్ అయితే రూ. 500 నుంచే ప్రారంభమవుతోంది.

శిల్పకళా.. భళా

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉద్యానవనంలో ఫల పుష్ప ప్రదర్శన, పలు స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప శిక్షణా సంస్థ ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్లో సుధా శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. నాలుగు దశల్లో ఉన్న శ్రీలక్ష్మీభూవరాహస్వామి ప్రతిమను భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. రూపొందించిన విధానాన్ని అక్కడున్న వారిని అడిగి తెలుసుకుంటున్నారు. **– ఈనాడు, తిరుపతి**

స్వర్ణమ్మ వేడుక.. వెలుగుల వేదిక

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన సువర్ణముఖి నదీ హారతుల మహోత్సవం కనులపండువగా జరిగింది. చతుర్వేద మంత్ర పఠనం పూర్తయ్యాక మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య హారతుల కైంకర్యాన్ని జరిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు ఛైర్మన్ కె.సాయిప్రసాద్, ఆలయ ఈవో బాపిరెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవ మూర్తికి సంకల్ప పూజలు

స్వర్ణముఖి నదికి హారతి

యువత దేశాభివృద్ధికి పాటుపడాలి

కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో బుధవారం ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య దొరస్వామి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువత దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. **– న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ**

వాట్సప్ కాల్ చేస్తారు.. మొత్తం దోచేస్తారు

అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఎస్పీ సుబ్బరాయుడు కేసు వివరాలు వెల్లడించారు. 'ఆగస్టు 26న మనీ లాండరింగ్ కేసు పేరుతో తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి వాట్సప్ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. రెండు మ్యూల్‌ఖాతాల్లో రూ. 80 లక్షలు జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాతాల్లోని రూ. 2.5 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. మిగిలిన రూ. 77.5 లక్షలు 14 రాష్ట్రాల్లోని ఇతరుల ఖాతాలకు.. గేమింగ్ యాప్ వినియోగదారుల ఖాతాలకు చేరినట్లు గుర్తించారు.

కంబోడియా వెళ్లి..: హైదరాబాద్‌కు చెందిన ఎం.కోటిబాబు ఓ ముఠా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆయన 2024 జనవరిలో కంబోడియాకు వెళ్లి సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌తో పనిచేశారు. ఇండియాకు వచ్చి క్రాంతికుమార్, పవన్‌కుమార్‌తోపాటు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్, కర్ణాటకకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గౌతమ్ ద్వారా భారీగా మ్యూల్ ఖాతాలను సేకరించారు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉండటంతో అరెస్టు చేశారు. మరో కీలక నిందితుడు హైదరాబాద్‌కు చెందిన మహమూద్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

విద్యార్థులకు రవాణా భత్యం

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఆర్‌టీఈ నిబంధన ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 6,752 మంది విద్యార్థులకు రూ. 2.20 కోట్ల రవాణా భత్యం విడుదల చేశారు.

104FM Tirupati
ఈఎఫ్‌ఎం కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

కొలువక్కడ.. ఉండేదిక్కడ

● విభజన జరిగి ఏడాదైనా విధుల్లో చేరని వైనం
● గాడిలో పడని ఎస్ఈ కార్యాలయ పాలన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగమంటే ఉన్నతాధికారుల ఆదేశానుసారం విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలి.. ఇక్కడేమో రూ.లక్షల్లో వేతనాలు, అలవెన్సులు పొందుతున్నారు.. అయినా కొందరు ఉద్యోగ బాధ్యతలు పక్కన పెట్టేసి నిబంధనలు వారికి అనుకూలంగా మార్చుకున్నారు.. అడిగేవారెవరు.. అంతా మా ఇష్టం.. అనే రీతిలో విద్యుత్తు శాఖలో కొందరు వ్యవహరిస్తున్నారు.

పైరవీలు, అధికారుల అండదండలతోనే..

కొందరు ఉద్యోగులు రాజకీయ పైరవీలు, ఉన్నతాధికారుల అండతో తిరుపతిలోనే పని చేస్తున్నారు. వీరికి అక్కడ నిర్దిష్టమైన పోస్టు, బాధ్యతలు లేకపోయినప్పటికీ విధులకు తిరుపతిలోనే హాజరవుతున్నట్లు నమోదు చేయడమే కాకుండా వేతనాలు పొందుతున్నారు. కొందరికి మెమోలు జారీ చేసినా ఉలుకూపలుకూ లేదని ఆశాఖ అధికారులే విమర్శిస్తున్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగులు అధిక పనిభారంతో అవస్థలు పడుతున్నారు.

చేరని ఉద్యోగుల వివరాలిలా..
● శాశ్వత ఉద్యోగులు: 18 మంది
● ఒప్పంద ఉద్యోగులు: 26

విభజన కాగితాల్లోనే..

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విద్యుత్తుశాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో ఉండేది. గతేడాది సెప్టెంబరు 25న చిత్తూరులో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయగా తొలి ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిపి 70-80 మంది వరకు కేటాయించారు. కేవలం జిల్లాస్థాయి అధికారులు, ఇంజినీర్లు మాత్రమే విధుల్లో చేరగా.. జేఏవో, సీనియర్, జూనియర్ సహాయకులతోపాటు ఒప్పంద ఉద్యోగులు నేటికీ బాధ్యతలు స్వీకరించలేదు. చిత్తూరుకు కేటాయించిన కొందరు శాశ్వత, ఒప్పంద ఉద్యోగులు సైతం తిరుపతిలో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

రెండుసార్లు లేఖలు రాశాం..

తక్షణమే విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేయాలని రెండుసార్లు ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. నేటివరకు స్పందన లేదు. ఉద్యోగుల కొరతతో పనులు ఆగిపోతున్నాయి.
– ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

నేడు వైవీ సుబ్బారెడ్డిని విచారించనున్న సిట్

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): కల్తీ నెయ్యి సరఫరా కేసులో తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు, జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డిని గురువారం సిట్ అధికారులు విచారించనున్నారు. అనారోగ్య కారణాలతో తాను తిరుపతికి రాలేనని ఆయన స్పష్టం చేయడంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రశ్నించనున్నారు. సుబ్బారెడ్డికి తెలిసే కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని.. మైసూరు ల్యాబ్‌లో ఈవిషయం నిర్ధారణ అయిన తర్వాత కూడా సరఫరాదారులను కొనసాగించారని సిట్ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఆయనను ప్రశ్నిస్తే ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది? ఎంత మొత్తం నగదు చేతులు మారింది? అన్న విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

ఒకటి నుంచి జొన్నల పంపిణీ

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: చిరుధాన్యాల వినియోగం ప్రోత్సహించడంలో భాగంగా డిసెంబరు 1వ తేదీ నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం, చక్కెరతో పాటు జొన్నలు పంపిణీ చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు తప్ప కార్డుదారులకు కందిపప్పునకు బదులుగా జొన్నలు పంపిణీ చేయనున్నారు. కార్డులో ఒకరికి ఐదు కిలో చొప్పున బియ్యం పంపిణీ చేస్తుండగా వాటి బదులుగా జొన్నలు తీసుకునే వెసులబాటు కల్పించినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలకృష్ణ తెలిపారు.

CODE: ANCP
ANNAMACHARYA COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into **1st year B.Pharmacy** and **Pharm.D** Courses who have not taken admission in any college can attend for the **Spot** and **Category-B** admissions on or before **24.11.2025** at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

కల్తీ నెయ్యి కేసులో హవాలా లింకులు

దిల్లీ కేంద్రంగా సిట్ అధికారుల ముమ్మర దర్యాప్తు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసి భోలేబాబా డెయిరీ నిర్వాహకులు తితిదే నుంచి రూ. 251.53 కోట్లు కొల్లగొట్టిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగం పెంచింది. ఇప్పటికే 12 రాష్ట్రాల్లో విచారణ చేసిన అధికారులు ఇప్పుడు దిల్లీ కేంద్రంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. భోలేబాబా డైరెక్టర్లు విపిన్ జైన్, పొమిల్ జైన్‌లు.. ఈ సొమ్ములో కొంత మొత్తాన్ని కల్తీ నెయ్యి తయారీకి అవసరమైన రసాయనాలు సరఫరా చేసిన, వివిధ డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు చేసినట్లు నకిలీ రికార్డులు తయారు చేసిన కంపెనీలకు హవాలాలో చెల్లించారు. దాంతో ఎప్పుడెప్పుడు, ఎవరెవరికి ఎంత మొత్తం చెల్లించారు? ఏజెంట్లుగా ఎవరు వ్యవహరించారు? అనే విషయాన్ని తేల్చేందుకు దిల్లీలో ఉన్నారు. అక్కడి సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్, సుప్రీం, సుప్రీం ఇంక్ కార్పొరేషన్ల పాత్రపై ప్రధానంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

● చెన్నై కేంద్రంగా మరో బృందం దర్యాప్తు చేపట్టింది. దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ సమర్పించిన నెయ్యి నాణ్యత ల్యాబ్ రిపోర్టుల అంశంపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల 15 నాటికి మలి ఛార్జ్‌షీట్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టులో దాఖలు చేయనున్నారు. అందులో ఈ వివరాలన్నీ పొందుపరిచే అవకాశం ఉంది.

రూ.146 కోట్లకు నకిలీ ఇన్వాయిస్‌ల సృష్టి

రాజస్థాన్‌లోని బికనేర్‌కు చెందిన ఆశిష్ అగర్వాల్ కల్తీ నెయ్యి కేసులో ఏ 15గా ఉన్నారు. ఇతను పొమిల్ జైన్, విపిన్ జైన్‌కు సన్నిహితుడు. తిరుమలతోపాటు శ్రీకాళహస్తి, విజయవాడ, శ్రీశైలం తదితర ఆలయాలకు కల్తీ నెయ్యి భోలేబాబా డెయిరీ ప్రమేయంతో సరఫరా అవుతోందన్న సంగతి తెలిసినప్పటికీ నిందితులకు పూర్తిగా సహకరించారు. రాజస్థాన్, దిల్లీలోని తనకు చెందిన అగర్వాల్ ట్రేడింగ్ కంపెనీ, సుప్రీం, సుప్రీం ఇంక్, అగర్వాల్ అండ్ అగర్వాల్ సన్స్ సంస్థలతోపాటు మరికొన్ని కంపెనీల నుంచి రూ. 146 కోట్లకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించాడు. వీటి ఆధారంగా తాము వివిధ డెయిరీల నుంచి నెయ్యి కొనుగోలు చేసినట్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు తితిదేను బురిడీ కొట్టించారు. ఆశిష్ అగర్వాల్ ఖాళీ లారీలను బికనేర్, దిల్లీ నుంచి రూర్కీకి తిప్పించారు. ఈ వ్యవహారంలో నిందితుడికి పెద్దమొత్తంలో హవాలా ద్వారా నగదు ముట్టిందని సిట్ నిర్ధారించుకుంది. ఇప్పటికే ఈ కేసులో ఆశిష్ అగర్వాల్‌ను అరెస్టు చేశారు. తాజాగా కుట్ర మూలాలు ఛేదిస్తున్నారు.

MIOT HOSPITALS
OUTREACH CLINIC
TIRUPATI
MIOT హాస్పిటల్స్, చెన్నై నుంచి స్పెషలిస్ట్‌లు విచ్చేయుచున్నారు
@ MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్, తిరుపతి
డయాబెటిస్ & ఎండోక్రినాలజీ
రోగలక్షణాలు మరియు రుగ్మతలు: • మధుమేహ సమస్యలు • థైరాయిడ్ సమస్యలు • లిపిడ్ రుగ్మతలు • హైపర్ టెన్షన్ సమస్యలు • ఎదుగుదలకు సంబంధించిన రుగ్మతలు • ఇన్‌ఫెర్టిలిటీ (సంతానలేమి) • పాలీసిస్టిక్ ఒవారీ వ్యాధి (PCOD) • ఇతర నెలసరి రుగ్మతలు
Prof. Dr. S. Sridhar MD (Medicine), DM (Endocrinology), FRCP
HOD - Department of Diabetology & Endocrinology
న్యూరాలజీ
రోగ లక్షణాలు మరియు రుగ్మతలు: • స్ట్రోక్ / పక్షవాతం • తలనొప్పితో కూడిన వాంతులు • ఫిట్స్ / మూర్ఛ • ఆకస్మిక అంధత్వం • ముఖం / మెడ / వెనుక భాగాలలో నొప్పి • శరీర అవయవాల బలహీనత • చెవుల్లో శబ్దం / వినికిడి లోపం • డిప్రెషన్ • నిద్ర రుగ్మతలు • ఆందోళన • వణుకు/ అసాధారణ కదలికలు • పార్కిన్సన్స్ • మెదడు కణితులు
Dr. M Paraneetharan Marimuthu
MBBS, MCh (Neurosurgery), DNB (Neurosurgery), MRCS (Ed), Fellow of MicroNeurosurgery (Japan), Fellow of European board of Neurosurgery (FEBNS), European Spine Diploma, FRCS (Surgical Neurology)
Lead Neurosurgeon - Dept. of Neurosurgery
సంప్రదించవలసిన చిరునామా: MIOT హాస్పిటల్స్ అవుట్రీచ్ క్లినిక్
D No 20-3-129/1, తిరుమల బైపాస్ రోడ్, శివజ్యోతి నగర్, తిరుపతి, తిరుపతి జిల్లా - 517501
తేదీ మరియు సమయం: 22 నవంబర్ 2025 శనివారం (10am - 4pm)
కన్సల్టేషన్ ఫీజు: Rs. 400/-
అపాయింట్‌మెంట్ల కొరకు*: +91 70953 85111 +91 70953 85333
*ముందస్తు అపాయింట్‌మెంట్ తప్పనిసరి. ఒకవేళ అవసరం అనుకుంటే, దయచేసి ఇంతకు ముందు వైద్య రికార్డులను, తీసుకుని రావలసినదిగా మనవి
Email: tic@miotinternational.com | www.miotinternational.com

(c) eenadu

రిజిస్ట్రేషన్ శాఖలో విచారణాధికారుల నియామకం

తిరుపతి(నేరవిభాగం): తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో డీఆర్ కిరణ్‌కుమార్‌తోపాటు ఇతరులపై వచ్చిన ఆరోపణల కేసు విచారణ బాధ్యతను తాజాగా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునకు, తిరుపతి రూరల్ సబ్ రిజిస్ట్రార్ విద్యాసాగర్‌రెడ్డితోపాటు మరో ముగ్గురిపై కేసు విచారణ బాధ్యతను చిత్తూరు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబుకు అప్పగించారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలకు పరిపాలనా కార్యాలయం: డి.నెం.3-6-478,4వ అంతస్తు, ఆనంద్ ఎస్టేట్ లిబర్టీ రోడ్డు, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029. వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము: డి.నెం.9/113, మిద్దెపైన, పార్కు వీధి, సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా - 524121

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032** నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది. **బ్రాంచ్ కార్యాలయము: సూళ్లూరుపేట**

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌ఎఫ్‌ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌ఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) **దారా సురేష్,** తండ్రి డి.రమణయ్య, బేరిపేట (గ్రామం), నాయుడుపేట మండలం, తిరుపతి జిల్లా - 524126
2) **దారా ఝాన్సీ** భర్త డి.సురేష్, మంగపతి నాయుడు నగర్, నాయుడుపేట గ్రామం & మండలం, తిరుపతి జిల్లా - 524126
3) **షేక్ అమానుల్లా,** ఎస్.కె.బాబు, డి.నెం.136, పాత శివాలయం వీధి, నాయుడుపేట గ్రామం & మండలం, నెల్లూరు జిల్లా - 524126

ఎన్‌పిఏ తేది: 07.08.2023 డిమాండ్ నోటీసు తేది: 15.10.2025
ఋణ మొత్తం రూ.15,00,000 (పదహైదు లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: SLRPTTF2212310006
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ23,73,082/- (ఇరవై మూడు లక్షల డెబ్బై మూడు వేల ఎనభై రెండు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

దారా సురేష్ తండ్రి డి.రమణయ్య, పేరున పత్రం నెం. 58/2023, తేది: 05.01.2023 ప్రకారం ఆస్తి వివరములు: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నాయుడుపేట సబ్ జిల్లా, నాయుడుపేట మండలం, మేనకూరు గ్రామ పంచాయతీ, కోనేటి రాజుపాలెం గ్రామలెక్కదాఖలా సర్వేనెం.45/1బి మరియు 45/1సి లోని ప్లాటు నెం.16 విస్తీర్ణం 338 చ.గ. ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: 18అ. వెడల్పు గల రోడ్డు - 43 అ. పడమర: 18అ. వెడల్పు గల రోడ్డు - 43 అ. ఉత్తరం: ప్లాటు నెం.17 -70.9అ. దక్షిణం: 18అ. వెడల్పు గల రోడ్డు - 70.9 అ. ఈ హద్దుల మధ్య స్థలం విస్తీర్ణం 3042 చ.అ. లేదా 338. చ.గ.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియ జేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: సూళ్లూరుపేట సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలకు పరిపాలనా కార్యాలయం: డి.నెం.3-6-478,4వ అంతస్తు, ఆనంద్ ఎస్టేట్ లిబర్టీ రోడ్డు, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029. వెబ్‌సైట్: www.shriramfinance.in.
బ్రాంచ్ కార్యాలయము: డి.నెం.8-3, 1వ అంతస్తు, బోడా కాంప్లెక్స్, రాజా వీధి, వెంకటగిరి - 524132

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్-13(2) క్రింద డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేది: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032** నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది. **బ్రాంచ్ కార్యాలయము: వెంకటగిరి**

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌ఎఫ్‌ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌ఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు / తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) **బుగ్గ శ్రీకాంత్,** తండ్రి రామ్మూర్తి, డి.నెం.27-45, జెట్టిపాళెం (గ్రామం), వెంకటగిరి మండలం, తిరుపతి జిల్లా - 524132
2) **బుగ్గ రామ్మూర్తి** తండ్రి వెంకటసుబ్బయ్య (లేట్), డి.నెం.27-45, జెట్టిపాళెం (గ్రామం), వెంకటగిరి మండలం, తిరుపతి జిల్లా - 524132
3) **వెలుమూరి వాణి,** భర్త వి.వరప్రసాద్, డి.నెం.28-5-318, ప్రశాంతి నగర్, మైపాడు రోడ్డు, నెల్లూరు నెల్లూరు జిల్లా - 524002
4) **వడ్డమూడి మోహన** భర్త వి.విజయకుమార్, డి..నెం.23-376,సాలి వీధి, వెంకటగిరి గ్రామం & మండలం, తిరుపతి జిల్లా - 524132
5) **కోడవరం కుమార్** తండ్రి మునెయ్య, డి.నెం.2628, పీర్లాతిపేట గ్రామం, వెంకటగిరి మండలం, తిరుపతి జిల్లా - 524132

ఎన్‌పిఏ తేది: 07.06.2022 డిమాండ్ నోటీసు తేది: 15.10.2025
ఋణ మొత్తం రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే)
అగ్రిమెంటు నెం: VENKGTF2012310006
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.23,30,320/- (ఇరవై మూడు లక్షల ముప్పై వేల మూడు వందల ఇరవై రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

బుగ్గ రామ్మూర్తి తండ్రి వెంకటసుబ్బయ్య (లేట్) పేరున పత్రం నెం. 811/2021, తేది: 24.02.2021 ప్రకారం ఆస్తి వివరములు: చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, శ్రీకాళహస్తి సబ్ జిల్లా, పెద్ద కనపర్తి గ్రామలెక్కదాఖలా, అసెస్‌మెంట్ నెం.184, ప్రస్తుతం రీసర్వే గ్రామకంఠం సర్వే నెం.131/2 లో ప్రస్తుతం స్థలం విస్తీర్ణం 288.88 చ.గ. మరియు 900 చ.అ. ఆర్.సి.సి. హద్దులు: తూర్పు: అంగన్‌వాడీ కేంద్రం, పడమర: వంతాయల అంకయ్య, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: టి.నాగరాజు, ఈ హద్దుల మధ్య స్థలం విస్తీర్ణం 288.88 చ.గ. మరియు 900 చ.అ. ఆర్.సి.సి.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: వెంకటగిరి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరపున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, నేంద్రగుంట(వి& పో), పాకాల(మం), తిరుపతి(జి) - 517112
వివరాలకు: 90634 38851, 80087 05935
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
FM Partner: Mee FM
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

తితిదే పెద్దమర్యాద.. తిరుమల : వ్యాసరాజ పీఠాధిపతి శ్రీవిద్యాశ్రీశ తీర్థ స్వామీజీకి బుధవారం తితిదే పెద్ద మర్యాద చేసింది. పీఠాధిపతికి తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Bhramaramba Sametha Sri Santha Kalahastheswara Swamy Temple,
Thimmanaidupalem (V), Kota(M), Tirupati District

e-Procurement Tender
NIT.NO.P/COE/1312/2025, Dt: 27/10/2025

E-Tenders are invited through the e-Procurement portal for **Construction of Prakaram wall to Temple.** Interested bidders may visit the officia website **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria, and submission guidelines. **Trustee**

OFFICE OF THE PRINICPAL SV MEDICAL COLLEGE : TIRUPATI
Rc.No. 2444/S1/Stores/2025 Dates: 17.11.2025.

TENDER NOTIFICATION

Sealed Tenders are invited for the supply of the following items for use in the Laboratories of SV Medical College, Tirupati for a period of (Two) 2 year for 2025-2026 and 2026-2027.

S.No.	Description
1	Chemicals, KITS, Reagents and Glass Ware Etc.,

The Tender document along with list of items should obtain from this office in any working day from 10.30am to 5.00 pm on payment **(TDF) of Rs. 2000/- (Rupees Two Thousand only)** for each Tender form by way of Demand Draft obtained from any Nationalized Bank in favour of the Principal, SV Medical College, Tirupati.
Sale of Tender forms from : 26-11-2025 to 03-12-2025
Last date for receipt of sealed Tenders : 10-12-2025 upto 5.00pm
Opening date of Sealed Tenders : 12-12-2025 at 11.30 AM in the chambers or the Principal, SV Medical College, Tirupati.
The sealed Tenders along with Demand Draft towards EMD for Rs.30000/- (Rupees Thirty Thousand Only) drawn in favour of the Principal, SV Medical College, Tirupati and other required documents like Firm License, Income Tax returns for 3 years, GST Regn. and block list details to be submitted to this office within the stipulated time.
Note: This office is not responsible for any postal delay.
website : https://svmctpt.edu.in/
Contact No: 9849903117 **Principal, SVMC, Tirupati.**
Sd/- **Dr. G.RAVI PRABHU,** MD., Principal, SV Medical College, TIRUPATI.

OFFICE OF THE DISTRICT MEDICAL & HEALTH OFFICER, TIRUPATI.
Rc.No:05/SCESP/DBCS/TPT. Dated: 19.11.2025.

SHORT TENDER NOTIFICATION

The sealed tenders are invited from the standard agencies manufactures and registered suppliers for supply of SPECTACLES with the following specification to DPM, DBCS, Tirupati.

SPECTACLES QUALITY SPECIFICATIONS
1. Frame:TR-90/Polycarbonate Full Frame with spring (Boys & Girls with different colours)
2. Lenses:CR-39(Plastic Lenses)
3. Frame Size(s):32/34/36/38/40/42/44/46.
4. Cleaning Cloth with good quality for cleaning the lens.
5. Hard case fixed with sticker on front side of the frame box as following.

The tender application forms will be issued from : 21.11.2025 to 24.11.2025.
Last date to submit filled application is on : 24.11.2025 before 1.00pm
Date of Opening of Tenders : 25.11.2025.

Cost of Tenders application is Rs.1000/-(Rupees One Thousand only) each by CASH.EMD amount will be Rs.5000/-Five Thousand Rupees Only (NON-REFUNDABLE) per Bidder to be paid through Demand Draft in Favour of **THE DISTRICT MEDICAL & HEALTH OFFICER, TIRUPATI.** While submitting for the Tender .No Correspondence will be entertained in this Regard. The District Procurement Committee decision is final in deciding the spectacles as for the standards. For Further details contact DPM, DBCS, and Tirupati. Mobile: 9390112344, 9966030609

Sd/-DM&HO, Tirupati. **Sd/-Joint Collector & Chairman, DPC, Tirupati.**

SBI భారతీయ స్టేట్ బ్యాంక్ గూడూరు మెయిన్ బ్రాంచ్ -00843 గూడూరు, తిరుపతి జిల్లా
అధీకృత అధికారి: పి.ఎస్.రాజు, మొబైల్: 9440072599. బ్రాంచ్ ఈ-మెయిల్ ఐడి: sbi.00843@sbi.co.in

స్వాధీనం చేసుకున్న బస్సు యొక్క ఇ-వేలం బహిరంగ ప్రకటన

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారు మా బ్యాంక్ నుండి వాహనము కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యంను పొంది వున్నారు. బ్యాంకునకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమముగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనమును స్వాధీనము చేసుకొని **"యధాతథ స్థితిలో"** ఈ వేలం ద్వారా **తేది.06.12.2025**న అమ్ముటకు నిర్ణయించినారు. వాహనము లోను తాలూకా అసలు బకాయి సొమ్ము మరియు ఇతర ఖర్చులను రాబట్టుకొనుటకై ఈ క్రింది తెలిపిన వాహనమును ఇ-వేలమునకు బిడ్స్ ఆహ్వానించడమైనది.

ఋణగ్రహీత పేరు / చిరునామా & ఖాతా నెం.	బస్సు నెం./ రిజిస్ట్రేషన్ నెం./ మోడల్ వివరాలు	రిజర్వు ధర / ధరావతు / బిడ్ పెంపుదల	ఈ-వేలం తేది&సమయం
శ్రీమతి కలపాటి ప్రతిమ, భర్త: సర్వేష్, డోర్ నెం.1-465-45, ఇందిర నగర్, రామాలయం వీధి ఎదురుగా, గూడూరు, తిరుపతి జిల్లా **లోన్ ఖాతా నెం.: 41470669117**	VE COMMERCIAL VEHICLES LTD, EICHER6016 N CWC / AP39UK8255 / 2022	రూ.13,27,500/- + 18% GST ధరావత్తు రూ.1,32,750/- బిడ్ పెంపుదల రూ.10,000/-	తేది. 06.12.2025 మ.12.00 గంటల నుండి మ.1.00 గంటల వరకు

నియమ నిబంధనలు: 1) వాహనములు రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడవు. 2) గెలుపొందిన బిడ్డరు అమ్మకం మొత్తంలో 15% శాతాన్ని వెంటనే డిపాజిట్ చేయవలెను మరియు మిగిలిన 75% మొత్తాన్ని విక్రయ తేదీ నుండి 7 రోజులలోగా చెల్లించవలెను. ఆసక్తి గల బిడ్డర్లు బిడ్స్‌ను తేది.05.12.2025 లోగా సమర్పించవలెను. 3) వేలంను రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు బ్యాంకుకు హక్కు కలదు. 4) గెలుపొందిన బిడ్డరు వాహనము రిజిస్ట్రేషన్ చేసుకోవలెను. వాహనము గెలుపొందిన బిడ్డరుకు మాత్రమే అప్పగించబడును మరియు గెలుపొందిన బిడ్డరు పేరున మాత్రమే పేరు మార్చబడును. 5) వాహనము పార్కింగ్ యార్డ్ అద్దెను గెలుపొందిన బిడ్డరు తప్పనిసరిగా చెల్లించవలెను. 6) ఆసక్తి గల బిడ్డర్లు వేలం తేదికి మూడు రోజుల ముందుగా పైన తెలిపిన బ్రౌజర్‌లో https://ebkray.in/baankenet.com నందు లేదా URL: https: //ebkray.in/baankenet.com/eauction-psb/x-login నందు ఎవరికి వారే రిజిస్ట్రేషన్ లేదా నమోదు చేసుకొనవలెను. 7) ఆసక్తి గల బిడ్డర్లు పైన తెలిపిన వెబ్‌సైట్‌లోని "Buyer / Guide for Login & Registration" విభాగంలో అందించిన వీడియోలు/ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకొని చూడవలసినదిగా సూచించడమైనది. 8) అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన URL: https://ebkray.in లేదా baanknet.com నందు వేలం తేదిని పరిశీలించి, యస్‌బిఐ బ్యాంకు ఎంచుకుని, నియమ నిబంధనలు అనుమతించి పాల్గొనవలెను. 9) తదుపరి వివరముల కొరకు: 1) ఎస్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ మేనేజర్, మొబైల్: 94925 82477, 2) పి.రవీంద్ర రెడ్డి, రిసొల్యూషన్ ఏజెంట్: మొబైల్: 99482 26336

తేది: 18.11.2025, ప్రదేశం: గూడూరు సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తితిదే ఛైర్మన్‌కు విరాళం డీడీ అందిస్తున్న దాత మురళీ వెంకటసుబ్బు తదితరులు

తిరుమల: తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళీ వెంకటసుబ్బు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి బుధవారం దాత విరాళం డీడీ సమర్పించారు.

రెండు విడతల్లో రూ.211 కోట్ల లబ్ధి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: అన్నదాతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలోని కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి రైతులకు రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము చెక్కును ఆవిష్కరించారు. రెండు విడతలు కలిపి రూ.211 కోట్లు రైతుల ఖాతాలకు జమచేసినట్లు ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో రూ.18 కోట్లు ఖాతాలకు జమచేసినట్లు పేర్కొన్నారు. ఆర్డీవో కిరణ్మయి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, జేడీఏ ఎస్.ప్రసాద్‌రావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం షణ్ముఖం తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలియదా?

■ నెయ్యి కల్తీ కేసులో చిన్న అప్పన్నను మూడోరోజు ప్రశ్నించిన సిట్

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): 'ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేస్తోందని ఎప్పటి నుంచి తెలుసు? ఆ సంస్థకు టెండరు దక్కేలా ఎవరైనా సహకరించారా? తిరుమల లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వినియోగంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలియదా? మొదటే మీ దృష్టికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులకు చెప్పి ఉంటే అప్పటికైనా నియంత్రించేవారు కదా?' అంటూ తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను సిట్ అధికారులు ప్రశ్నించారు. కల్తీ గురించి తనకు తెలియదని, ఇతర వివరాలు అప్పటి ప్రొక్యూర్‌మెంట్ అధికారులకే తెలుస్తాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. మూడో రోజు బుధవారం ఆయనను తిరుపతిలోని సిట్ కార్యాలయంలో విచారించారు. అంతకుముందు తూర్పు పోలీసు స్టేషన్ నుంచి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాక విచారించారు. పలు ప్రశ్నలకు చిన్న అప్పన్న ముక్తసరిగా సమాధానాలిచ్చినట్లు తెలుస్తోంది. వైవీ సుబ్బారెడ్డితో ఉన్న పరిచయం నేపథ్యంలోనే అడపాదడపా తిరుమలకు వచ్చి వెళ్లేవాడినే తప్ప ఇక్కడి వ్యవహారాలతో సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. 'అటువంటప్పుడు భోలేబాబా డెయిరీపై తితిదే మాజీ ఛైర్మన్‌కు ఎందుకు ఫిర్యాదు చేశారు? కల్తీ నెయ్యి తిరుమలకు వస్తోందన్న సంగతి తెలిసీ ఎందుకు మిన్నకుండిపోయార'ని అడగ్గా చిన్న అప్పన్న మౌనం వహించినట్లు తెలుస్తోంది. 2021-24 మధ్య తగరపువలసలో 5, లంకెలపాలెంలో 8, రుషికొండలో ఒక ఫ్లాటు ఎలా కొన్నారని, ఆ డబ్బులు ఎలా వచ్చాయని అడగ్గా సొంత సంపాదనతోనే వాటిని కొన్నానని చెప్పినట్లు సమాచారం.

రుయా ఆసుపత్రిలో చిన్న అప్పన్నకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

డబ్బులు అడిగితే ఇవ్వలేదని హత్య

రామ్మూర్తిరెడ్డి (పాత చిత్రం)

నిందితుడు రవి

పుత్తూరు, న్యూస్‌టుడే: ఆకలిగా ఉంది.. భోజనానికి డబ్బు ఇవ్వమని అడిగితే ఇవ్వలేదనే కోపంతో ఓ వ్యక్తిని చాకుతో గొంతులో పొడిచి హత్య చేసిన ఘటన బుధవారం పుత్తూరు మండల పరిధిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. విద్యుత్తు శాఖలో కాంట్రాక్టు పనులు చేసే రామ్మూర్తిరెడ్డి(55), భార్య మంజుల పుత్తూరు శివజ్యోతినగర్‌లో ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం భార్యకు రొటీలు తీసుకెళ్లేందుకు శిరుగురాజు పాళెం పంచాయతీ పరిధిలోని రంజిత్ దాబాకు వెళ్లారు. అనంతరం ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు బయల్దేరారు. రోడ్డు పక్కన ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుని వాటిని అమ్ముకుని జీవించే తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కేశవరాజుకుప్పానికి చెందిన రవి (35).. జాతీయ రహదారిలోని గొల్లపల్లి క్రాస్ రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద రామ్మూర్తిరెడ్డిని ఆపాడు. ఆకలిగా ఉంది.. భోజనానికి డబ్బు ఇవ్వమని అడగ్గా దీనిపై వారి మధ్య వాగ్వాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. నగదు ఇవ్వకపోగా దుర్భాలాడాడనే కోపంతో రవి.. సంచిలోని చాకుతో రామ్మూర్తిరెడ్డి గొంతుపై పొడవడంతో తీవ్ర రక్తస్రావమై అతడు రోడ్డుపై పడిపోయాడు. 108లో పుత్తూరుకు తరలించేలోగా మృతి చెందాడు. నిందితుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

అప్పులు తీర్చలేక అధ్యాపకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక.. ఈ విషయంగా భార్యతో ఏర్పడ్డ మనస్పర్థలతో జీవితంపై విరక్తి చెందిన అధ్యాపకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిరుపతి తూర్పు పీఎస్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం తుముకూరుకు చెందిన సతీష్‌కుమార్ (48) అక్కడి యూనివర్సిటీలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొత్త ఇల్లు నిర్మించారు. అనుకున్న దానికన్నా ఎక్కువ కావడంతో అప్పుల పాలయ్యారు. ఈ విషయంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య మాట్లాడకుండా ఉంది. మనస్తాపానికి గురైన సతీష్‌కుమార్ ఈనెల 17వ తేదీ ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. తిరుపతి బస్టాండు సమీపంలోని లాడ్జిలో దిగారు. సోమవారం ఉదయం తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి తిరిగి వచ్చి.. ఫ్యానుకు ఉరేసుకున్నారు. లాడ్జి నిర్వాహకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతని చరవాణి ద్వారా కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. భర్త కోసం భార్య యమున చుట్టుపక్కల వెతికి తిరుపతికి వచ్చినట్లు తెలుసుకుని బుధవారం ఉదయం ఇక్కడికి చేరుకుంది. భర్త మృతదేహాన్ని చూసి భార్య బోరున విలపించింది. వీరికి ఓ కుమార్తె ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) తిరుపతి, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం, తిరుత్తణి(తమిళనాడు)లో వివిధ ఖాళీలు ఉన్నాయని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించగలరని ఆయన సూచించారు.

EENADU Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ॥. దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం॥. 8008685569.

క్యాష్ బ్యాక్ వెంచర్ 25 అం॥ల ప్లాట్. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి బంపర్ ఆఫర్ (కొన్ని ప్లాట్లు మాత్రమే కలవు). Ph: 80086 15946

JOBS

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

SLN మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నందు సూళ్లూరుపేట, నాయుడుపేట బ్రాంచీలలో పనిచేయుటకు మేనేజర్లు, అకౌంటెంట్లు, సిస్టం ఆపరేటర్లు, సైట్ ఇన్‌ఛార్జ్‌లు, డ్రైవర్లు కావలెను. ఆసక్తిగల వారు సంప్రదించండి. Contact: ✆ 70975 25709.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

నేనే అదనపు కమిషనర్

త్వరలో వస్తానంటూ పూర్వపు అధికారి హడావుడి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పనిచేసిన చరణ్ తేజ్ రెడ్డిని మాతృశాఖకు బదిలీ చేసి నెలలు గడుస్తున్నా తానే నగరపాలిక అదనపు కమిషనర్ అంటూ, త్వరలో తిరిగి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపడతానంటూ పదేపదే ఉద్యోగుల వద్ద ప్రస్తావిస్తూ హడావుడి చేస్తుండటం నగరపాలిక సంస్థ కార్యాలయంలో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. దీంతో ఆయన ఛాంబర్ ముందు ఉన్న బోర్డును సైతం తొలగించేందుకు నగరపాలక సిబ్బంది సాహసించడం లేదు.

ఛాంబర్ వద్ద ఆయన పేరుతో బోర్డు

వైకాపా నేతల సిఫార్సుతో వచ్చి

కడప జిల్లాకు చెందిన చరణ్ తేజ్ రెడ్డి ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో పని చేస్తుండగా... వైకాపా పాలనలో అప్పటి ముఖ్య నేతల సిఫార్సుతో హోదాకు మించిన అదనపు కమిషనర్ పదవికి డిప్యుటేషన్‌పై వచ్చారు. తిరుపతి నగరపాలక సంస్థ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ఆయన తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేవారు. వైకాపా హయాంలో ఆయన్ను ప్రశ్నించే ధైర్యం లేక ఉద్యోగులు, సిబ్బంది మౌనంగా భరించారు.

మాజీ మంత్రి పీఏ పోటీ

నగరపాలిక కల్పించిన కొన్ని సౌకర్యాలు సైతం ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన ఛాంబర్ వద్ద బోర్డు కూడా తొలగించకూడదని ఆదేశించినట్లు చెబుతున్నారు. బోర్డు తొలగింపు, ఆయన స్థానంలో ఇంకొకరిని నియమించకపోవడంతో అనుమానాలకు బలం చేకూరి ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు మాజీ మంత్రి రోజా అనధికారిక వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన పూర్వపు సెట్విన్ సీఈవో డా.మురళి కృష్ణారెడ్డి సైతం అదనపు కమిషనర్ పదవి కోసం కూటమి నేతల సిఫార్సు పొంది.. ఉత్తర్వుల కోసం రాజధానిలో తిష్ఠ వేసినట్లు సమాచారం.

ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనను మాతృ సంస్థకు సాగనంపడం ఖాయమని భావించినప్పటికీ కూటమి ప్రభుత్వంలోనూ ఆయన కొనసాగారు. కూటమి నేతలు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి నగరపాలికలో సుపరిపాలన కోసం చరణ్ తేజ్ రెడ్డి బదిలీ తప్పనిసరి అని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో ఫిబ్రవరి 7న ఆయనను మాతృశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు ఖాతరు చేయకుండా చరణ్ తేజ రెడ్డి యథావిధిగా కొనసాగారు. ఆగస్టు 25న తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి నారాయణ చరణ్ తేజ్ రెడ్డి విధి నిర్వహణలో ఉండడాన్ని గమనించి తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశించడంతో ఆయన్ను అదనపు కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించారు. అయితే ఆయన తిరిగి అదనపు కమిషనర్ పోస్టు కోసం ప్రయత్నాలు ప్రారంభించారని, త్వరలో విధులకు హాజరవుతారని ప్రచారం సాగుతుండటంతో ఉద్యోగులు కలవరపడుతున్నారు.

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

శ్రీవారి సేవలో పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని బుధవారం ఉదయం బ్రేక్‌లో పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ రాజవేలు దర్శించుకున్నారు. ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ అనురాధ, ఉపాధ్యాయులు

విజేతలతో వెంకటగిరి హైస్కూల్ కరస్పాండెంట్ కళావతి, హెచ్‌ఎం జయసింహ

ఆధునిక విద్యాబోధనతో శాస్త్రీయ పరిజ్ఞానం

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: అధునాతన పద్ధతుల్లో విద్యాబోధన ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందుతుందని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్, కొమండూరు విద్యాసంస్థల అధినేత కె.ఎస్.వాసు, వెంకటగిరి హైస్కూల్ డైరెక్టర్ వి.కళావతి పేర్కొన్నారు. ఈ రెండు పాఠశాలల్లో బుధవారం 'ఈనాడు- ఈటీవీ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో 7, 8, 9, 10 తరగతి విద్యార్థులకు 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్లో పి.కెన్విక్‌రెడ్డి(ప్రథమ), ఎ.బానాజ్ రెడ్డి(ద్వితీయ), పి.శ్రీజ(తృతీయ), వెంకటగిరి హైస్కూల్లో జి.అశ్విత(ప్రథమ), జి.స్నేహలత(ద్వితీయ), ఎ.దీపిక(తృతీయ) గెలుపొందారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

సకల కళావల్లభ అవార్డు ప్రదానం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన సామాజికవేత్త ఎలమంచిలి ప్రవీణ్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. విజయవాడ వేదికగా అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వైద్యవిద్య, క్రీడ, సినిమా, కళ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వ్యాపార రంగాల్లో 30 సంవత్సరాలుగా ప్రవీణ్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా 'సకల కళావల్లభ అవార్డు'ను ప్రదానం చేశారు. విజయవాడ 1వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దేవ్ నరసింహారావు, సర్వే ల్యాండ్, రికార్డ్స్ సంయుక్త సంచాలకులు సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రవీణ్

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమినరీ పోటీ పరీక్ష-2026కు సంబంధించి ఉచిత వసతితో కూడిన శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత వసతితో కూడిన శిక్షణ ఉంటుందన్నారు. ఇందులో ఎస్సీ 240, ఎస్టీ 100, ఇతర వర్గాలకు మొత్తం 340 సీట్లు ఉన్నాయని, అర్హులు apstdycircle.apcfss.in ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతులకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ ప్రసాదరావు, నేతలు

కూటమి ప్రభుత్వం రైతుల పక్షం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం రాయలచెరువు సమీపంలోని సురావారిపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హాజరై నియోజకవర్గంలోని 26,062 మంది రైతులకు రూ.17.61 కోట్ల మెగా చెక్కు అందించారు. ఎంపీ ప్రసాదరావు మాట్లాడుతూ రాయలచెరువును మినీ డ్యామ్‌గా చేయడానికి ఎమ్మెల్యే నాని తనతో చర్చించారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, కూటమి నేతలు తిరుమలరెడ్డి, జనార్దన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యంనాయుడు త్రైమాసిక కార్యక్రమం బుధవారం గడ్డంవారిపల్లిలో నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, సతీమణి సుధారెడ్డి, తెదేపా నాయకులు హాజరయ్యారు. సుబ్రహ్మణ్యంనాయుడు చిత్రపటానికి నివాళి అర్పించారు.

కైలాసధామం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్వర్ణముఖినది ఒడ్డున నిర్మిస్తున్న కైలాసధామం నిర్మాణానికి తిరుపతి కాకర్స్ అసోసియేషన్ రూ.లక్ష విరాళం ప్రకటించింది. ఈ మేరకు చెక్కును బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నానికి అసోషియేషన్ సభ్యులు అందించారు.

భావితరాలకు బాలాజీ డివిజన్ అవసరం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి బాలాజీ డివిజన్ ఏర్పాటు నినాదం భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు బుధవారం ఎమ్మెల్యే నానిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అఖిలాండం అపరిశుభ్రం

శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరం వెలిగించి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే అఖిలాండం ముందు భాగంలో సరిగా శుభ్రం చేయకపోవడంతో చెత్త నిల్వలున్నాయి. దుర్వాసన వస్తోంది. చెట్లను కత్తిరించి అలాగే వదిలేశారు. దీనిపై సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, తిరుమల

ప్రమాదకరంగా ఇనుప చువ్వలు

కరకంబాడి నుంచి రేణిగుంట బైపాస్ కూడలికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే వంతెనపై బయటికి కనిపిస్తున్న ఇనుపచువ్వల కారణంగా ప్రమాదం పొంచి ఉంది. అనుకోని సంఘటన జరగక ముందే సంబంధిత అధికారులు పర్యవేక్షించి మరమ్మతు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు. -ఈనాడు, తిరుపతి

నిఘా నేలచూపులు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు నిత్యం వేల సంఖ్యలో భక్తులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నేర నియంత్రణకు బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెల బస్టాండ్లో తగినన్ని సీసీ కెమెరాలు అందుబాటులో లేవు. అరకొరగా ఉన్నవి బూజు పట్టి.. దుమ్ముకొట్టుకుపోయాయి. సంబంధిత అధికారులు పరిశీలించి పర్యవేక్షించాలని ప్రయాణికులు కోరుతున్నారు. -ఈనాడు, తిరుపతి

ఇదేమి రోడ్డు 'మాస్టర్'

స్థానిక అన్నమయ్య మాస్టర్‌ప్లాన్ రహదారి కూడలి నుంచి వినాయకసాగర్ కరకంబాడి రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయమైంది. రాళ్లు తేలి అధ్వానంగా కనిపిస్తోంది. అభివృద్ధి పనుల కోసం అక్కడక్కడ తవ్వి యథావిధిగా రహదారి ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. -ఈనాడు, తిరుపతి

IN THE COURT OF THE 4th ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): CHITTOOR
I.A.No.785 of 2024
O.S. No. 63 of 2024
Between:-
D.Omprakash ... Petitioner
And:-
1.E.Jayachandra Naidu (Plaintiff)
2.M.Manohar (defendant)
... Respondents
NOTICE TO THE 2nd RESPONDENT / DEFENDANT
To,
M.Manohar S/O M.Doraswamy Naidu R/o Utlavari Palli Village, Pakala Mandal, Tirupati District, A.P
Sir,
Please take notice that the petitioner filed the above petition to implead him as a party in the above suit, filed against you for execution of sale deed basing sale agreement, you are here by summoned to appear before the above said court on 28-11-2025 at 10-30 A.M in person or by pleader duly instructed and able answer to all material questions relating to the said case, failing which the matter will be decided against you as per law.
Sd/-V.R.RAMAKRISHNA
Advocate,Chittoor,Cell:9440206050

పట్టువస్త్రాలతో పద్మశాలి సంఘం నాయకులు

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారికి బుధవారం పద్మశాలి సంఘం నాయకులు పట్టువస్త్రాలు సమర్పించారు. పసుపు మండపం నుంచి అమ్మవారి ఆలయం వరకు పెద్ద సంఖ్యలో పద్మశాలి సంఘం నాయకులు పట్టువస్త్రాలు, గాజులు, పూజా సామగ్రితో ఊరేగింపుగా చేరుకుని ఆలయ అధికారులకు అందజేశారు.

ఐదు గొడుగుల కానుక.. బుధవారం చెన్నైకు చెందిన హిందూ ధర్మార్థ సమితి ట్రస్టు ఐదు గొడుగులను అమ్మవారికి కానుకగా అందజేసింది. అమ్మవారి ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు గొడుగులను ఆ ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఆర్ గోపాల్‌జీ అందజేశారు.

తిరుమలలో అనుమతుల్లేకుండా గ్యాస్ సరఫరా

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో అనుమతుల్లేకుండానే ఓ ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ గ్యాస్ సిలిండర్లను తిరుమలకు తెస్తోంది. తిరుమలలో గ్యాస్ బండలను ప్రభుత్వ సంస్థలైన హెచ్‌పీ, ఇండియన్, భారత్ గ్యాస్ సంస్థలు సరఫరా చేస్తుంటాయి. అయితే గత వైకాపా ప్రభుత్వంలో కొందరు ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలకు గ్యాస్ బండల సరఫరా చేపట్టారు. అందులో గోగ్యాస్ అనుమతులు లేకుండానే తిరుమలకు గ్యాస్ సరఫరా చేస్తోంది. వైకాపా ప్రభుత్వంలోని కొందరు పెద్దల సహకారంతో అప్పటి అధికారులను పక్కదోవ పట్టించి ఈ ప్రైవేటు ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్‌బండలను తిరుమలకు తరలిస్తోంది. దీనిపై ఇటీవల తితిదే రెవెన్యూ విభాగం, ఆరోగ్యశాఖ పరిశీలన చేయగా గోగ్యాస్‌కు తిరుమలకు అనుమతులు ఇవ్వలేదని గుర్తించారు. ప్రస్తుతం ఫిర్యాదులు అందడంతో అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం

తిరుమల: మొదటి ఘాట్‌రోడ్డులోని అలిపిరి నడకమార్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొని భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి(తితిదే): శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం 66,966 మంది దర్శించుకున్నారు. రూ.4.19 కోట్ల హుండీ కానుకలు లభించాయి. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద 10 వేల టోకెన్లు జారీ చేశారు.

'మీ డబ్బు- మీహక్కు' గోడప్రతుల ఆవిష్కరణ

తిరుపతి (కలెక్టరేట్): మీ డబ్బు- మీహక్కు అనే నినాదంతో దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ మౌర్యతో కలిసి ఆయన మీ డబ్బు-మీహక్కు గోడప్రతులను ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రవికుమార్, ఏఎల్డీఎం మధుసూదన్, కలెక్టరేట్ యూనియన్ బ్యాంకు మేనేజర్ చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం

తిరుపతి(నగరపాలిక): తిరుపతిలో బహిరంగ మలమూత్ర విసర్జన నియంత్రణకు పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని కమిషనర్ మౌర్య అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు అందాలి

తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు అందాలని వక్తలు పేర్కొన్నారు. ఎస్వీయూలో 'అభివృద్ధి భారతం వైపు జ్ఞానాన్ని ప్రజాస్వామీకరించడం' అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయ సదస్సు బుధవారం ముగిసింది. ఇందులో తొమ్మిది తీర్మానాలను ప్రకటించారు.

IN THE COURT OF THE 4th ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION): CHITTOOR
I.A.No.786 of 2024
O.S. No. 63 of 2024
Between:-
M.Krishnamoorthy ... Petitioner
And:-
1.E.Jayachandra Naidu (Plaintiff)
2.M.Manohar (defendant)
... Respondents
NOTICE TO THE 2nd RESPONDENT/DEFENDANT
To,
M.Manohar S/O M.Doraswamy Naidu R/o Utlavari Palli Village, Pakala Mandal, Tirupati District, A.P
Sir,
Please take notice that the petitioner filed the above petition to implead him as a party in the above suit, filed against you for execution of sale deed basing sale agreement, you are here by summoned to appear before the above said court on 28-11-2025 at 10-30 A.M in person or by pleader duly instructed and able answer to all material questions relating to the said case, failing which the matter will be decided against you as per law.
Sd/-V.R.RAMAKRISHNA
Advocate,Chittoor,Cell:9440206050

ఉపముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: సత్యసాయి జిల్లా పుట్టపర్తి సాయిబాబా శతజయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం అతిథి గృహంలో ప్రత్యేకంగా కలిశారు. తిరుపతి అభివృద్ధి, నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు.

ఆర్కాట్ కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఆర్టీసీ మంగళం డిపో ఎంప్లాయీస్ యూనియన్ నూతన గౌరవ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణప్రసాద్‌ను డిపో గౌరవ అధ్యక్షుడిగా ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అరుణ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వృద్ధుడి నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. గత నెల 13న విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు ఆమెపై మోసం కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఆమెను పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ అరుణ ఒకటో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఇరుపక్షాల న్యాయవాదులు తమ తమ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి కేసు విచారణను గురువారానికి వాయిదా వేశారు. బెయిల్ పిటిషన్‌పై నేడు (గురువారం) ఉత్తర్వులు ఇస్తామని న్యాయస్థానం ప్రకటించింది.



గొలుసులు కాజేసింది బవేరియా గ్యాంగే

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: అక్టోబరు 4వ తేదీ తిరుపతి తూర్పు, అలిపిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు గంటల కాలంలో ఐదుగురు మహిళల మెడలోని బంగారు గొలుసులు కాజేసింది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బవేరియా గ్యాంగ్ సభ్యులని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతికి రైల్లో వచ్చి ఒక ద్విచక్ర వాహనం దొంగతనం చేసి వరుసగా గొలుసులు కాజేసిన ఘటనపై కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి గుర్ముఖ్(53)ని అరెస్టు చేసినట్లు తెలిపారు. జయరాం, మోహన్ అనే మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు ప్రకటించారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరి అరెస్టు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: నాయుడుపేట సమీపంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద బుధవారం ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు చేపట్టిన వాహన తనిఖీల్లో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. నిందితులు తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.

భక్తుడి బంగారు గొలుసు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తుడి మెడలోని బంగారు గొలుసును కొందరు కాజేశారు. అలిపిరి పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీధర్ కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. ఇతని కుటుంబం నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటోంది. వారితో కలిసి శ్రీధర్ ఇటీవల తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం కుటుంబ సభ్యులు నెల్లూరుకు వెళ్లిపోయారు. శ్రీధర్ బళ్లారికి వెళ్లేందుకు విశ్రాంతి తీసుకున్న హోటల్ నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్లేందుకు రాపిడోను బుక్ చేసుకున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అతని మెడలోని బంగారు గొలుసు కాజేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో వర్షపునీరు

స్థానిక బాలాజీ కాలనీలోని నగరపాలక సంస్థ పాఠశాలలో వర్షపునీరు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చాలాకాలంగా మురుగు కాలువ రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షపునీటితోపాటు ఊట నీరు పాఠశాల వరండా, తరగతి గదుల్లోకి చేరుతోంది. విద్యార్థులు గదిలో జారి పడే అవకాశాలు ఉన్నాయి.

-న్యూస్‌టుడే, తిరుపతి(విద్య)

పశువైద్య వర్సిటీలో వసతిగృహ దినోత్సవం

తిరుపతి(పశువైద్య వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర పశువైద్య వర్సిటీ వసతి గృహ దినోత్సవం(హాస్టల్ డే) బుధవారం ఘనంగా నిర్వహించారు. పశువైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలకు వీసీ రమణ, రిజిస్ట్రార్ విను ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కారు లోపలికి చొచ్చుకెళ్లిన రెయిలింగ్

అదుపుతప్పిన కారు: ముగ్గురికి తీవ్ర గాయాలు

పాకాల, న్యూస్‌టుడే: చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లి వద్ద బుధవారం తెల్లవారుజామున ఓ కారు అదుపుతప్పి ఎడమవైపున ఉన్న రెయిలింగ్ పైకి దూసుకెళ్లింది. రెయిలింగ్ ఊచలు కారు ఇంజిన్‌ను చీల్చుకుంటూ సరాసరి డ్రైవర్‌పైకి చొచ్చుకొచ్చేశాయి. కారు నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తూ ఏయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారులో ఉన్న పదిపుట్లబైలుకు చెందిన ఉదయ్‌కుమార్, విక్రం, పాకాలకు చెందిన బద్రి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అతి కష్టం మీద బయటకు తీసి చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాకాల పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.



శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

అభిషేక వేళలపై తర్జన భర్జన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభిషేక వేళలపై అర్చకులు, అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. సాధారణంగా ఇక్కడి ఆలయంలో ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరచి 6 గంటలకు ప్రథమ కాలం, 7 గంటలకు ద్వితీయ కాలాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కార్తిక మాసం సందర్భంగా ఆలయాన్ని ఉదయం 4 గంటలకు తెరవడంతో పాటు 5, 6 గంటలకు ప్రథమ, ద్వితీయ కాలాభిషేకాలు జరుపుతున్నారు. కార్తిక మాసం పూర్తయినా ఇదే వేళలు కొనసాగించాలని ఆలయ అధికారులు భావిస్తున్నారు. అర్చక, సిబ్బంది వర్గం దీన్ని వ్యతిరేకిస్తోంది. అయితే భక్తుల సౌకర్యార్థం ఇతర ఆలయాల్లో అభిషేక సమయాలు మార్పు చేశారని, అలాగే ఇక్కడ మార్పు చేయాలన్న భావనతో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు గోవర్ధనపురం విద్యార్థి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కే.శ్రావ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. తిరుపతిలో ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మొహిద్దీన్ తెలిపారు. పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థినిని బుధవారం ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలెక్టర్‌కు సత్కారం

కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సత్కరిస్తున్న అధికారులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: పాపానాయుడుపేట-గుడిమల్లం బైపాస్ రహదారికి రూ.2.30కోట్లు నిధులు మంజూరు కావడంతో ఆలయ అధికారులు బుధవారం కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌ను సన్మానించారు. ఈవో రామచంద్రారెడ్డి, మాజీ ఛైర్మన్ గిరినాయుడు కలెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి అభివృద్ధికి కృషి చేయడం ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. ఆలయాభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహిళా రైతును సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గంలోని 27,847 రైతు కుటుంబాలకు రూ.18,63,87000 విలువైన చెక్కును పంపిణీ చేశారు. ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవో సాగరికరెడ్డి, సురేంద్రరెడ్డి, మమతారెడ్డి, సునీల్‌కుమార్, మండల తెదేపా అధ్యక్షులు నాగరాజునాయుడు, మునిరాజానాయుడు, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: సన్నిధివీధిలో నడక మార్గంలో నిర్మిస్తున్న డివైడర్ పనితీరుపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరా తీశారు. నది హారతుల ఏర్పాట్ల విషయమై బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఏడుగంగల జాతరకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

వరదపాళెం.. వంతెన శిథిలం

ప్రమాదకరంగా మారిన కాలువపై రాకపోకలను పర్యవేక్షిస్తున్న పోలీసులు(పాతచిత్రం)

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ప్రతిఏటా వర్షాల కారణంగా పట్టణ ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. భారీ వర్షాలకు వరద నీటి ప్రవాహంతో ముంపునకు గురవుతోంది. కాలువల గుండా ప్రవహించాల్సిన వరద నీరు రహదారులపై మళ్లి ఇళ్లు, కాలనీలు, దుకాణాలు జలమయంలో చిక్కుకుంటున్నాయి. కాలువలో నీరు రహదారులపై ప్రవహిస్తుండటంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించడమే కాకుండా పరిసర ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.

ప్రతి ఏటా కన్నీటి కష్టాలు

చిన్నబోయిన కాలువ

వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలో శ్రీకాళహస్తి-తడ రహదారి మార్గంలో ప్రవహిస్తున్న మారేడు కాలువ ప్రతి ఏటా వరదలకు ప్రాణ సంకటంగా మారుతోంది. పదేళ్ల కిందటి వరకు భారీ వర్షాలు, వరదలు వస్తే తప్ప ఈ కాలువ వల్ల ఎటువంటి సమస్య తలెత్తలేదు. అయితే కాలువ చుట్టూ ఆక్రమణలకు గురికావడం, కాలువ కుచించుకు పోవడంతో వరదనీటి ప్రవాహానికి నీరు పట్టణం వైపుగా మళ్లి రహదారులు జలమయమై చెరువులను తలపిస్తోంది. ఫలితంగా కాలువ గుండా ప్రవహించాల్సిన వరదనీరు శ్రీకాళహస్తి-తడ రహదారిపైకి మళ్లుతోంది.

కాలనీలు జలమయం

వరదల కారణంగా పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరుతోంది. కాలనీలు జలమయమై ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఇలా నిత్యం వరదలకు ఈ కాలువ ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ కాలువపై వంతెన ఏర్పాటు చేయాలనే నినాదం ప్రజల్లో క్రమేణా పెరుగుతోంది. కాలువ పక్కన ఆక్రమణలను తొలగించి, వంతెనను ఆధునికీకరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

కాలువపై గల వంతెన శిథిలం కావడంతో ప్రతిఏటా వర్షాలకు రహదారి కోతకు గురై రాకపోకలు స్తంభిస్తున్నాయి. దీంతో వాహన చోదకులకు దినదిన గండంగా మారుతోంది. పలు వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోయి కదలని పరిస్థితి నెలకొంది. దీంతో వరదల సమయంలో వంతెనపై ప్రవాహ ఉద్ధృతి కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తూ, రాకపోకలను నియంత్రిస్తూ పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సమస్య: సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట ఎస్సీకాలనీలో విద్యుద్దీపాలు వెలగడం లేదు. చుట్టూ పంట పొలాలు ఉండటంతో పాముల బెడద తీవ్రంగా ఉంది. **- వసంతకుమార్**

సమాధానం: వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- దుడ్డువేణుగోపాల్, సర్పంచి**

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: పాలమంగలం కొత్త ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- తులసి**

సమాధానం: గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే సీసీరోడ్డు నిర్మాణాన్ని చేపడతాం. **- సాయిరవి, సర్పంచి**

నాగలాపురం: సమస్య: నాగలాపురం వీకేఎంవీధిలో మురుగునీటి కాలువల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో కాలువల్లో మురుగు నిలిచి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. **- కన్నప్ప**

సమాధానం: రెండు రోజుల్లో కాలువల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయిస్తాం. **- చిన్నదురైసుధ, సర్పంచి**

భద్రావతీ వీధిలో పారిశుద్ధ్యం పునరుద్ధరణ

స్పందనకు వందనం

నాగలాపురం, న్యూస్‌టుడే: స్థానిక భద్రావతీ వీధిలో కాలువలు, రహదారులను పంచాయతీ సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. ఇక్కడ రహదారిపైనే చెత్తా చెదారాలు పేరుకుపోయి స్థానికులు పడుతున్న అవస్థలపై ఈనెల 17వ తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి సిబ్బందిని రప్పించి చెత్తా చెదారాలను ట్రాక్టర్లలో తరలించారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సందడిగా సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు బుధవారం సందడిగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించి విద్యార్థులతో కలిసి కాసేపు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన 300 మంది విద్యార్థులు అండర్ 14 విభాగంలో పోటీ పడ్డారు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థులను ఈ నెల 27-29తేదీల్లో పశ్చిమగోదావరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పీడీలు తెలిపారు. డీవైఈవో మహేశ్వరరావు, ఎంఈవోలు హేమమాలిని, యుగంధరరాజు, ప్రధానోపాధ్యాయులు గిరిప్రకాష్, పీడీలు రమాదేవి, స్వర్ణ, బాబులు పాల్గొన్నారు.

సత్యవేడు: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీఆర్‌కండ్రిగ సమీపంలో బలహీనంగా ఉన్న వంతెనను పరిశీలించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో లాడ్జీల్లో తనిఖీలు

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంటలోని పలు లాడ్జీల్లో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ద్రౌపదిముర్ము తిరుచానూరు, తిరుమల పర్యటన నిమిత్తం పోలీసులు ఇప్పటికే పలు భద్రత చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం రేణిగుంటలోని ప్రతి లాడ్జీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతి గదిలోని వారిని విచారించి వారి వివరాలను అడిగి తెలుసుకుని సామగ్రిని పరిశీలించారు. సీసీ కెమెరాలు, భద్రతా పరికరాలను పరిశీలించారు. ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

రేణిగుంట: రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. బుధవారం మండలంలోని మర్రిగుంటలో రాస్, మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. రాస్ కేవీకే పశువైద్య నిపుణురాలు డాక్టర్ అనూష మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాస్ అధికారులు రవి, రామాంజనేయులు, శంకరయ్య, జ్యోతి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటాలి

జీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: విద్యతోపాటు, పోటీతత్వం, ఆత్మస్థైర్యం పెంచే క్రీడల్లోనూ ప్రతిభ చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ జ్యోతి, తెదేపా నాయకుడు సుధాకర్‌నాయుడు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. ఎస్సై హరిప్రసాద్, స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కిషోర్‌కుమార్, భార్గవి, బంధింకుమార్ పాల్గొన్నారు.

పారదర్శకతకే మన డబ్బులు-మన లెక్కలు

పిచ్చాటూరు: వెలుగు స్వయం సహాయక సంఘాలలో జరిగే ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకతను పెంచడానికే మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎం చంద్రకళ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో మహిళలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

వంగనారును అందజేస్తున్న సుగుణమ్మ, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రైతులు అధిక ఆదాయం పొందాలి

రేణిగుంట: రాస్ కేవీకే శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి రైతులు అధిక ఆదాయం పొందాలని రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ శాఖ ఛైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. బుధవారం దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం కిసాన్ నిధులు విడుదల, ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. అనంతరం రైతులకు వేరుశనగ విత్తనాలు, విత్తన శుద్ధి మందు, మిరప, అంటు కట్టిన వంగనారును అందజేశారు. రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు సుధాకర్, దివ్య, రాముకుమార్, అనూష, దివ్యసుధ తదితరులు పాల్గొన్నారు.

రాఘవను అభినందిస్తున్న క్రీడాకారులు

జాతీయస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపిక

వరదయ్యపాళెం: కాంబాక్కం సచివాలయ సర్వేయరు రాఘవ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో రెండోసారి సత్తాచాటి ఛాంపియన్‌గా నిలిచారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ లాన్‌టెన్నిస్ పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రతిభచాటి రాష్ట్రస్థాయిలో ఛాంపియన్‌గా నిలిచాడు. గుజరాత్‌లో డిసెంబరు 16వ తేదీన జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. రాఘవను టెన్నిస్ జట్టు సభ్యులు, జిల్లా, రాష్ట్ర క్రీడాశాఖ అధికారులు, క్రీడా నిర్వాహకులు అభినందించారు.

చేతిపంపు.. అలసత్వ తుప్పు

మండలంలోని పూడి ఎస్సీ కాలనీలోని చేతిపంపు తుప్పు పట్టి విరిగిపోయేలా ఉండటమే అధికారుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. తాగునీటి పథకాలకు అధికారులు ప్రాధాన్యమిస్తూ చేతి పంపుల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో అధ్వానంగా తయారైంది. ఏళ్లతరబడి మరమ్మతులకు నోచుకోక పోవడంతో విద్యుత్తు సౌకర్యం లేనప్పుడు తాగునీటికి తంటాలు పడాల్సివస్తోందని స్థానికులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

యూపీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లాపంచాయతీ), న్యూస్‌టుడే: అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పోటీ పరీక్ష-2026కు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని మూడు కేంద్రాల ద్వారా మొత్తం 340 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నామని చెప్పారు. ఇందులో ఎస్సీలకు 80%, ఎస్టీలకు 6%, బీసీలకు 10%, ఓసీలకు 4%, దివ్యాంగులకు 3,% మొత్తంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. విజయవాడకు 120, తిరుపతికి 120, విశాఖకు 100 సీట్లు కేటాయించారని, డిగ్రీ ఉత్తీర్ణతతో కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించని వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో https///apstdycircle.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 27న హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, 30న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు.

నిర్మాణం పూర్తికాకనే.. శిథిలం

సత్యవేడులో నిర్మించ తలపెట్టిన షాదీమహల్ ఎన్నోఏళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. దీని నిర్మాణానికి 2003లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆత్మ కార్యాలయం సమీపంలో కొంత స్థలాన్ని కేటాయించి రూ.ఐదు లక్షల నిధులు మంజూరు చేసింది. అనంతరం ప్రభుత్వం మారడంతో 2004లో రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సత్యవేడు పర్యటనకు వచ్చిన నాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి షాదీమహల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 2016లో నాటి ఎమ్మెల్యే తలారి ఆదిత్య రూ.10లక్షలు అందించారు. తదనంతరం వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని చిత్రపటానికి గ్రంథాలయాధికారి హరిప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవో బాబయ్య, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్యలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు

పాఠశాల బస్సును ప్రారంభిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకునే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు డీఈవో కేవీఎన్ కుమార్ బుధవారం నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరు, పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు సుమారు పది కి.మీ ప్రయాణించి పాఠశాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానోపాధ్యాయులు ఆనంద్ సమస్యను ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే బస్సు సౌకర్యం కల్పించడంతో డీఈవో ప్రారంభించి విద్యార్థులతో కలిసి ప్రయాణించారు. ఎంఈవోలు ప్రేమలత, దయాకర్‌రావు, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

బాధితులకు గ్యాస్‌స్టవ్‌ల పంపిణీ

గ్యాస్‌స్టవ్‌లను పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని రాయల చెరువు కట్టకు గండి పడి నిరాశ్రయులైన కళత్తూరు గ్రామస్థులకు నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి సహకారంతో లక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 500 కుటుంబాలకు గ్యాస్‌స్టవ్‌లను అందజేశారు. రాయలచెరువుకు గండి పడి నిరాశ్రయులైన వారికి తమవంతు సాయం చేయాలని స్వచ్ఛంద సంస్థ వారిని సాయం అందించాలన్న శంకర్‌రెడ్డి అభ్యర్థన మేరకు సంస్థ యాజమాన్యం పంపిణీ చేసింది. లక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సాయిరాం, త్రిపుర, జిల్లా తెదేపా అధ్యక్షుడు నరసింహయాదవ్, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియదవ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, మండల అధ్యక్షుడు రామాంజినాయుడు, నాయకులు, పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిమజ్జనోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తిక మాస ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాలను పురస్కరించుకుని బుధవారం లక్ష బిల్వ, కుంకుమార్చనల ద్వారా వచ్చిన బిల్వ పత్రాలు, కుంకుమల నిర్మాల్యాలను ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ముక్కంటి ఆలయం నుంచి సువర్ణముఖి నది స్నానఘట్టాల వరకు వీటిని ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు జరిపారు. ● శ్రీకాళహస్తీశ్వరాలయంలో అష్టోత్తర శత కలశాభిషేక వేడుకలు ఆద్యంతం ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసంలో ప్రత్యేకంగా ప్రారంభమైన లక్ష బిల్వ కుంకుమార్చనల ముగింపు సందర్భంగా బుధవారం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద యాగ కలశాలను ఏర్పాటు చేసి సంకల్ప పూజలు నిర్వహించారు.

లక్ష బిల్వ, కుంకుమార్చనల సందర్భంగా వచ్చిన నిర్మాల్యాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుస్తక పఠనం.. మేధోశక్తికి దోహదం

తొట్టంబేడు: నిరంతరం గ్రంథాలయాలను సందర్శించి, పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మేధోశక్తికి దోహదపడుతుందని గ్రంథాలయాధికారి హరికృష్ణ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం తొట్టంబేడు జడ్పీ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు జాతీయ నేతల పుస్తకాలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు మోహన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు చిత్రలేఖనం పోటీలు

నారాయణవనం: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలను బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మనోహరి, సులోచన, ఉపాధ్యాయులు కవిత, రాజ్యలక్ష్మి గ్రంథాలయాధికారి జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మహిళా దినోత్సవ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రంథాలయ ఆవరణకు సమీపంలోని క్రీడా మైదానంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆచార్యురాలు మాలతి, గ్రంథాలయాధికారిణి లావణ్య పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. శ్రీకాళహస్తి: పట్టణంలోని సన్నిధివీధిలో అనధికారికంగా రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న దుకాణాన్ని పురపాలక సంఘ అధికారులు తొలగించారు. అధికారుల తీరుకు దుకాణ నిర్వాహకులు బుధవారం ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడం చర్చనీయాంశమైంది. కమిషనర్ ఆదేశాలతో పురపాలక సంఘ అధికారులు జేసీబీ సాయంతో దుకాణాన్ని తొలగించారు. ఆ సమయంలో దుకాణ నిర్వాహకులు సిరి అధికారుల తీరుతో మనస్థాపానికి గురై దుకాణంలో ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకునేందుకు ప్రయత్నించింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రకాష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ఆమెను నిలువరించారు.

అర్చకుడిపై భక్తుల ఫిర్యాదు.. శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చిన అయ్యప్ప భక్తులు విధి నిర్వహణలో ఉన్న అర్చకునిపై ఫిర్యాదు చేశారు. ఆలయంలో బుధవారం దైవ దర్శనార్థం తాము వెళ్తుంటే తమ పర్సు కింద పడిపోయిందని, అక్కడున్న అర్చకుడు తీసుకున్నట్లు భక్తులు ఆరోపించారు. ఈ విషయమై భద్రతా సిబ్బంది నిఘా కెమెరాలను పరిశీలించారు. అధికారుల సూచనలతో అర్చకులు భక్తులకు డబ్బులు సర్దుబాటు చేసి పంపారు.

ప్రకృతి వ్యవసాయం.. పర్యావరణానికి శ్రీకారం

క్షేత్రస్థాయి పర్యటనలో ఐఐటీ విద్యార్థులు

పంట పొలాల్లో పర్యటిస్తున్న ఐఐటీ విద్యార్థులు

ఖాళీ కొబ్బరి బోండాలను కుండీలుగా మార్చుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి(గ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: నూతన సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించడంతో పాటు సమాజంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టారు తిరుపతి ఐఐటీలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు. సెలవు రోజుల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేస్తూ వివిధ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వృత్తులు, పంటల సాగు వంటివాటితో పాటు అక్కడ నెలకొన్న సమస్యలను తెలుసుకుంటున్నారు. దీంతో నిత్యం ఐఐటీ ప్రాంగణంలోని తరగతి గదులు, పరిశోధన కేంద్రాలు, పుస్తకాలకే పరిమితమయ్యే విద్యార్థులకు సమాజంలోని స్థితిగతుల గురించి అవగాహన ఏర్పడుతుంది.

పొలంబాటలో యువత

పంటల సాగులో రైతులు పడుతున్న అవస్థలు గురించి తెలుసుకునేందుకు ఐఐటీ విద్యార్థులు యువరైతులుగా మారుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటిస్తూ మల్బరీ, మామిడి, వరి, వేరుశెనగ, చెరకు వంటి పంటలను పరిశీలిస్తున్నారు. రైతులతో కలిసి వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతూ అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు, క్రిమిసంహారక మందులతో కలిగే నష్టాలపై అవగాహన పెంపొందిస్తుండటమే కాకుండా అధిక ఆదాయాలతో ఉత్పత్తులను విక్రయించే విధానం గురించి తెలియజేస్తుండటం గమనార్హం.

వ్యర్థాలతో అందమైన పరికరాలు

ప్రధాన రహదారుల వెంబడి కొబ్బరి బోండాల దుకాణాలు ఉండటంతో ఎటుచూసినా ఖాళీ టెంకాయల గుట్టలు దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి చినుకుపడినా వాటిల్లో నీరు చేరి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఐఐటీ విద్యార్థులు ఖాళీ కొబ్బరి బోండాల్లో నాణ్యమైన మట్టిని నింపి వివిధ రకాల పూల మొక్కల విత్తనాలు వేయడంతో అవి కొద్దిరోజులకు అందమైన పూలకుండీలుగా దర్శనమిస్తున్నాయి. ఇదే విధంగా వివిధ రకాల ప్లాస్టిక్, చిత్తు పేపర్లతో బొమ్మలు చేయడం, మురుగు నీటిని శుద్ధిచేసి పూల మొక్కలు, తోటలకు వినియోగించేలా చేస్తున్నారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం

ప్రతిఏటా వర్షా కాలంలో విద్యార్థులు ఉద్యమంలా మొక్కలు నాటేందుకు సంకల్పిస్తున్నారు. ఐఐటీ ప్రాంగణంలోని అంతర్గత రోడ్ల పక్కన, గ్రామీణ ప్రాంతాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటుతూ వాటి సంరక్షణ బాధ్యతను వహిస్తున్నారు. దీంతో పల్లెలో పచ్చదనం సంతరించుకుంటోంది.

LOSS OF PASSPORT
I, SHAIK PARVEEN,
W/o SHAIK SHABBER,
Residing at D.No:1-752,
NTR Nagar, Srikalahasti Town,
Tirupati District, A.P
I have loss my Passport bearing
No.N5261974 Issued on
30-11-2015 and date of expiry
on 29-11-2025 on 06-09-2025.
While I am travelling my house
to RTC Busstand in Srikalahasti,
Near Big Mosque street
purchasing fruits.
If any one found please
Contact my
Ph.No: 8985782732

SRI ESHWAR REDDY COLLEGE OF LAW
(Affiliated to S.V.University, Tirupati) #S.No.47/1A, Anjimedu,
Yerpedu Mandal-517619, Tirupati Dist. A.P.. Cell: 9291598721
3 years & 5 Years LL.B, 3 Years LLB Hons., 2 Years LLM(Constitution & Legal Order) Course Admission Notification 2025-26
(Under Management Quota B-Category)

Course	Intake	B-Category
3 Year LL.B	300	60
3 Year LL.B Hons	180	36
5 Year LL.B	120	24
2 Year LLM Course (Constitution & Legal Order)	20	04

Applications are available in the college office and also can be down loaded from the website www.erlawcollege.com. Filled applications with all necessary enclosures should be submitted in the college office on or before 21.11.2025. Admissions are purely on merit basis as prescribed by the Govt. of Andhra Pradesh and APSCHE,Andhra Pradesh as per the guidelines issued by the Convener, APLAWCET /PGLCET-2025.For admission procedure, rules and regulations please visit https://www.erlawcollege.com, www.apsche.org and https://lawcetcatb.ucanapply.com/
For Further Details Contact AO: 9052222308 PRINCIPAL

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

తొలగని రంగులు

పట్టణంలోని పుదూరు సమీపంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలోని మురుగు శుద్ధి ప్లాంటుకు గత ప్రభుత్వంలో వేసిన వైకాపా రంగులు నేటికీ దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం మారినా పురపాలిక అధికారులు తొలగించకుండా వాటిని అలానే ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలకు ఉన్న రాజకీయ పార్టీల రంగులు అన్నీ తొలగించినప్పటికీ ఇక్కడ ఇంకా కనిపిస్తున్నాయి. - న్యూస్‌టుడే, నాయుడుపేట

ఓవైపు చెత్త.. మరోవైపు దుర్వాసన

జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలను తడకుర్తి పంచాయతీ చెత్త సమస్య వెంటాడుతోంది. అనధికారికంగా సాగుతున్న డంపింగ్ యార్డును మరోచోటుకు తరలించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. తడ, తడకుర్తి పంచాయతీల్లో రోజూ 10 టన్నుల చెత్త పోగు పడుతోంది. స్థలం సరిపోక పోవడంతో ఇలా జాతీయ రహదారిపై వేస్తున్నారు. - న్యూస్‌టుడే, తడ

పొదల చాటున దాగిన ప్రమాదం

మండలంలోని పెద్ద ఉలసావడవ వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. సూచిక బోర్డు లేకపోవడంతో పాటు ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

మరమ్మతులకు నెలరోజులు

మండలంలోని నూకలపాళెం గ్రామం వద్ద ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న తాగునీటి పంపు నెలరోజుల కిందట మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులు తాగునీరు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థులు కూడా ఇదే పంపు నీటిని దైనందిన అవసరాలకు వినియోగిస్తుంటారు. చేతిపంపునకు మరమ్మతులు చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

నిఘా నేత్రాలకు మరమ్మతులు
నాయుడుపేట పట్టణం: పురపాలిక పరిధిలోని సీసీ కెమెరాలను పోలీసు అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. నిఘా నేత్రాలకు గంతలు అనే ఈనాడు కథనానికి స్పందించి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.

తీరంలో అమావాస్య పూజలు
వాకాడు, న్యూస్‌టుడే: గత 12 ఏళ్లగా కార్తిక మాసం చివరి రోజున కార్తిక అమావాస్య సందర్భంగా తూపిలిపాళెం తీరాన చేపట్టే పార్థివ శివలింగానికి బుధవారం సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. శివలింగాన్ని సముద్రంలో నిమజ్జనం చేశారు. తీరంలో మహిళలు స్నానాలు ఆచరించి కార్తిక దీపాలను వెలిగించారు.

పార్థివ శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సర్వే చేశారు.. లోసుగులు గుర్తించారు
✦ ఆస్తిపన్ను వసూలుపై నాయుడుపేటలో పైలట్ ప్రాజెక్టు

పురపాలిక కార్యాలయం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో నాయుడుపేట, చిలకలూరిపేట పురపాలక సంఘాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మూడు నెలలుగా సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలో ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు వివరాలను పుర, ఇతర సిబ్బందితో సర్వే చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వేలో పన్ను చెల్లించకుండా ఉన్న భవనాలను గుర్తించారు.

వివరాలిలా..
పురపాలక సంఘం నాయుడుపేట
అసెస్‌మెంట్లు 12968
వార్డులు 25
జనాభా 65 వేలు
ఏడాదికి రాబడి రూ.10 కోట్లు పైగానే
సర్వే తర్వాత రాబడి 1.10 కోట్లు

ఆరు నెలలకు రూ.1.10 కోట్ల రాబడి
పురపాలిక పరిధిలోని 155 ఇళ్ల యజమానులు పన్ను కట్టడం లేదు. అన్ని వసతులు పొంది పన్ను చెల్లించకుండా ఆదాయానికి గండి కొడుతున్నారు. తాజా సర్వేలో వీరి నుంచి ఆరు నెలలకు రూ.8 లక్షలు వసూలు చేశారు. ఇక 1986 నాటి ఇళ్లపై రెండు, మూడో అంతస్తులు నిర్మించి వాటికి పన్ను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నవి సర్వేలో వెలుగుచూశాయి. వీరు ఒక అంతస్తుకు నామమాత్రంగా పన్ను చెల్లించి మిగిలిన వాటికి పన్ను చెల్లించడం లేదు. వీటిని గుర్తించి పన్ను వేయడంతో ఆరు నెలలకు రూ. 1.10కోట్లు రాబడి వచ్చింది. ఇలా మొత్తం ఏడాదికి పురపాలికకు రూ.2. 20 కోట్లు ఆదాయం రానుంది.

గండి కొట్టారిలా
వైకాపా అయిదేళ్ల పాలనలో కొత్త భవనాలపై మరో అంతస్తు నిర్మాణం చేపట్టగా అంతస్తుకు రూ. 50 వేలు చొప్పున డిమాండు చేసి తీసుకొని అనుమతులు లేకుండా కట్టుకోమని చెప్పేవారు. ఇలా వైకాపా నాయకులు పుర రాబడికి గండి కొట్టారు. పన్నులు చెల్లించడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానాల్లో ఉండే నాయుడుపేట పురపాలికలోనూ పక్కదారి పట్టేలా చేశారు. ప్రాపర్టీ పన్ను, ఇతర అవినీతితోనే ఒక సచివాలయం సిబ్బందిని గతంలో విధుల నుంచి తొలగించారు.

లక్ష్యం దిశగా అడుగులు
ఇక్కడి ఫలితాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో సర్వే చేయనున్నారు. సర్వే చేసిన తీరును శాటిలైట్ పద్ధతిలో పర్యవేక్షణ చేశారు. ఈ విషయమై కమిషనర్ ఎస్కే.ఫజులుల్లా మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేయడంతో పురపాలికకు ఏడాదికి అదనంగా రూ.2 కోట్లు ఆదాయం వచ్చింది.

మేమున్నాం.. మీకు తోడుగా..
గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

వాకాడు, న్యూస్‌టుడే: సమస్య: వాకాడు అశోక స్తంభం వద్ద గత వారం రోజులుగా కేబుల్ రోడ్డుపై అడ్డంగా పడి ఉంది. దీంతో వాహనదారులు, పాదచారులు గాయపడుతున్నారు. - బాషా, తూపిలిపాళెం
సమాధానం: కేబుల్ తీగను తొలగించేలా చర్యలు చేపడతాం. - ఇక్బాల్, తహసీల్దార్
గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని సమాజబస్తు ప్రాంతంలో కాలువలో పూడికలు తొలగించక మురుగు సాఫీగా వెళ్లడం లేదు. - శరత్, గూడూరు
సమాధానం: కాలువల్లో సిబ్బందితో పూడికలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వర్లు, కమిషనర్
నాయుడుపేట, న్యూస్‌టుడే: సమస్య: కొనేటిరాయాపురం సమీపంలో రహదారికి ఇరువైపులా చెత్తను వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. - స్థానికులు
సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేస్తాం. - వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి
సమస్య: పట్టణంలోని ముకుంబీరా గడి వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికులు
సమాధానం: పరిశీలించి వీధి దీపాలు తక్షణమే వెలిగేలా చేస్తాం. - ఫజులుల్లా, కమిషనర్

'మేమూ వరి నాట్లు వేస్తాం'

పెళ్లకూరు, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతి నుంచి నాయుడుపేటకు వెళ్తూ మార్గం మధ్యలో పెళ్లకూరు మండలం దిగువచావాలి గ్రామం సమీపంలోని పొలాల వద్ద ఆగారు. వరినాట్లు వేస్తున్న వారి వద్దకు వెళ్లి 'నేను కూడా వరినాట్లు వేసి చూపిస్తా' అని పొలాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పోటీపడి వరి నాట్లు వేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'రైతులకు అండగా కూటమి ప్రభుత్వం'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ద్వారా మంజూరైన రెండో విడత నిధుల చెక్కును బుధవారం రైతులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 22 వేల మందికి పైగా రైతులకు రూ.14.80 కోట్లకుపైగా నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఏడీఏ గోపీనాయక్, తహసీల్దార్ ప్రసాద్ తెదేపా నేతలు బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, గుండాల లీలావతి, కొండూరు వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి పాల్గొన్నారు.

ఉపన్యాసం ఇచ్చారు.. బహుమతులు పట్టారు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు రెండో పట్టణం సాయి ఉషోదయ నగర్‌లోని శ్రీ జీవీఎస్ శంకరయ్య మెమోరియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వ్యక్తృత్వ పోటీలు జరిగాయి. 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలుగా ఎస్.కె.సోహైల్‌జమీర్, పి.జస్సిక, పి.తన్విత్‌రెడ్డి నిలిచారు. కరస్పాండెంట్ జి.వి.పవన్‌కుమార్, ప్రిన్సిపల్ రాము చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

కూరగాయల సాగుతో ఉపాధి

రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: కూరగాయల సాగుతో మంచి ఉపాధి లభిస్తుందని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ అన్నారు. బుధవారం కేవీకేలో పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల కార్యక్రమంపై ప్రత్యక్ష ప్రసారం చేపట్టారు. రబీలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు రాజీవన, విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ అధికారులు సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఈ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్తు ఈఈ కార్యాలయంలో మంగళవారం అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. ఎస్ఈ మాట్లాడుతూ అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈఈ శ్రీనివాసులు, డీఈలు వరప్రసాద్‌రెడ్డి, శేఖర్, శీనయ్య, ఏఏవో శ్రీలత, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, అనీల్, మురళీ, జగదీష్‌లు పాల్గొన్నారు.

ఆదిశంకర ఛైర్మన్ పెంచలయ్యకి అవార్డు

అవార్డు అందుకుంటున్న వంకి పెంచలయ్య

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదిశంకర డీమ్డ్-టూ-బి యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్యకి ప్రతిష్ఠాత్మకమైన పవర్ టూ ఎంపవర్ లీడర్ అవార్డును అందుకున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయపురలో జరిగిన ఇంటర్నేషనల్ లీడర్ షిప్ కాన్‌క్లేవ్-2025లో గ్లోబల్ లీడర్‌షిప్ ఫోరం సంస్థవారు అవార్డు అందించారు. విద్యారంగంలో రూపాంతరాత్మక ఆలోచనలు, ఉన్నత ప్రమాణాల నాయకత్వం, సమాజ అభివృద్ధికి చేస్తున్న నిరంతర సేవలు గుర్తించి అవార్డు అందించినట్లు చెప్పారు.

వీరనారిని ఆదర్శంగా తీసుకోవాలి

ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయిని యువతులు ఆదర్శంగా తీసుకోవాలని జనసేన నేత మోహన్ తెలిపారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని, ఆమె చిత్రపటానికి బుధవారం నివాళులు అర్పించారు. భాస్కర్, నవీన్, విజయ్, సాయికిరణ్, కార్తీక్, మోహన్, లతీఫ్, మణి పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లికార్జున్, శివచరణ్, కీర్తన, మేఘన పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి ఇందిరా గాంధీ
గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పేద, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పట్టణంలోని లయోలా కళాశాల ప్రాంగణంలో బుధవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని, ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. పూల చంద్రశేఖర్, రామకృష్ణరావు, వేమయ్య, వెంకటసుబ్బరాజు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

కళాకారుల ప్రదర్శన

వెంకటగిరి, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వామి 16వ అఖండ జ్యోతి కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పట్టణ వీధుల్లో ఘనంగా స్వామివారి నగరోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం రాజా వీధిలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గణపతి హోమ పూజలు నిర్వహించి, అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి సకలాభిషేకాలు చేశారు. రాత్రి కాశీ విశ్వనాథ స్వామి ఆలయం వద్ద అఖండ జ్యోతి కార్యక్రమం చేపట్టారు. స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు.

పర్యవేక్షణ కొరవడి.. ఆక్రమణకు పాల్పడి
❖ రహదారి మార్జిన్లపై కబ్జాదారుల కన్ను

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని జాతీయ, ర.భ శాఖలకు చెందిన ప్రధాన రహదారులు అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. ఇటీవల కాలంలో భారీగా రహదారుల మార్జిన్ స్థలాలను కబ్జా చేసి, వాణిజ్య గదులు, పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. నాయుడుపేట వాణిజ్య, పారిశ్రామిక కూడలి ప్రాంతంలో కావడంతో ఇక్కడ స్థలాలకు డిమాండ్ ఉంది, వ్యాపారానికి అనువుగా ఉంటుందనే అక్రమార్కులు ఆక్రమణకు పాల్పడుతున్నారు. దీంతో రహదారుల మార్జిన్లు ఇరువైపులా కుదించుకు పోతున్నాయి. వాహనదారులు సాఫీగా రాకపోకలు సాగించే అవకాశం లేకుండా పోయింది.

ఆక్రమణకు గురైనవి
కి.మీలలో
ర.భ రోడ్ల పరిధి : 14
జాతీయ రహదారులు : 17
ఆక్రమణలు ఉన్నవి: 21

ఇక్కడే అధికం
ఆర్టీసీ బస్టాండ్- పుదూరు సమీపంలో ఉన్న పాత ఎన్‌డీఏ రహదారి, మాలయ్యకోట రోడ్డు కూడలి - బట్టివిడత కాలనీ కూడలి వరకు, ఎన్‌హెచ్ 71 - గాంధీ మందిరం వరకు, ఆర్టీసీ బస్టాండ్ - విన్నమాల గ్రామం వైపుగా పాత ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే ప్రధాన ర.భ శాఖ రోడ్లు 60 మీటర్ల ఉండాలి. కానీ ఆక్రమణల కారణంగా 30 మీటర్లకు తగ్గిపోయింది. ఎల్.ఏ సాగరం సమీపంలో వెంకటగిరి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను ఏడాది క్రితం ర.భ శాఖ ఏపీపీఐ అధికారులు తొలగించినప్పటికీ మళ్లీ రాజకీయ నాయకుల జోక్యంతో మళ్లీ వెలిశాయి. విన్నమాల రోడ్డును పూర్తిగా ఆక్రమించడంతో ఆటోలు కూడా ఈ మార్గంలో సాఫీగా వెళ్లలేని పరిస్థితి.

బట్టివిడత కాలనీలో రహదారి స్థలంలో నిర్మించిన గదులు

నిర్మించి.. అద్దెకు ఇచ్చి
ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం - తుమ్మూరు వరకు పట్టణం మధ్యలో ఉన్న జాతీయ రహదారి మార్జిన్ స్థలాలను పోటాపోటీగా ఆక్రమించి ఇరువైపులా వాణిజ్య గదులు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. ఎన్‌హెచ్ ఏఐ అధికారులు దీనిపై స్పందించడం లేదు. రహదారుల ఆక్రమణలపై డీఈ పరమేశ్వరితో ప్రస్తావించగా ర.భ శాఖ రోడ్లను విస్తీర్ణం సమయంలో ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి
గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మమ్మ తెలిపారు. పురపాలిక పరిధిలోని నెల్లటూరు, చెన్నూరులో ఎల్సీడీసీ సర్వేను బుధవారం ఇంటింటికి వెళ్లి చేశారు. చెన్నూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, సూపర్‌వైజర్ మస్తానయ్య పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ
డక్కిలి, న్యూస్‌టుడే: వెంకటగిరి తహసీల్దారు ఎస్వీ నరసింహారావుకు డక్కిలి బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. సత్యసాయి జిల్లాలో ప్రధాని పర్యటన నిమిత్తం జిల్లాలోని అయిదుగురు తహసీల్దార్లకు ఈ నెల 23 వరకు అక్కడ విధులను కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు. వీరిలో డక్కిలి తహసీల్దారు శ్రీనివాసులు కూడా ఉన్నారు.

యూపీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ
చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పోటీ పరీక్ష-2026కు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని మూడు కేంద్రాల ద్వారా మొత్తం 340 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నామని చెప్పారు. ఇందులో ఎస్సీలకు 80%, ఎస్టీలకు 6% , బీసీలకు 10%, ఓసీలకు 4%, దివ్యాంగులకు 3,% మొత్తంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. విజయవాడకు 120, తిరుపతికి 120, విశాఖకు 100 సీట్లు కేటాయించారని, డిగ్రీ ఉత్తీర్ణతతో కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించని వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో https///apstdy-circle.apcfss.in వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 27న హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, 30న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరి అరెస్టు
తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: నాయుడుపేట సమీపంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద బుధవారం ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు చేపట్టిన వాహన తనిఖీల్లో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. నిందితులు తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తికి గాయాలు
బాలాయపల్లి, న్యూస్‌టుడే: అంబలపూడిలో బుధవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో సముద్రాల చంద్రయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఆయన తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తుండగా టైర్లు బురదలో కూరుకుపోవడంతో ట్రాక్టర్‌ను ముందుకు తీసే క్రమంలో బోల్తాపడింది. ఇరుక్కుపోయిన చంద్రయ్యను గ్రామస్థులు వెలికి తీసి 108 వాహనంలో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

నియంత్రికల్లో రాగి అపహరణ
బాలాయపల్లి, న్యూస్‌టుడే: పల్లిపాడు, మన్నూరు పొలాల్లోని మోటార్లకు అమర్చిన విద్యుత్తు నియంత్రికలు రెండింటిని ధ్వంసం చేసి దుండగులు రాగి తీగను అపహరించారు. ఈ ఘటనలపై స్థానిక డిస్కం ఏఈ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై మాల్యాద్రి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సదస్సు విజయవంతం చేయండి
గూడూరు పట్టణం: కడపలో 30న నిర్వహించే ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని ఏపీబీసీయూ నాయకులు శ్రీరాములు తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం గోడప్రతులను విడుదల చేశారు. మునిరత్నం నాయుడు, నారాయణ, రాజా పాల్గొన్నారు

విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టాలి
వెంకటగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవి శంకర్ అన్నారు. బుధవారం బుసపాళెం గ్రామంలో ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత చర్యలు చేపట్టి, అనంతరం మొక్కలు నాటారు.

ఆర్థిక సాయం.. నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: లోతువానిగుంటలో పూరిల్లు మంటల్లో దగ్ధమైన బాధిత కుటుంబానికి బుధవారం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి, నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ రూ.10వేలు అందించారు. కూటమి నాయకులు దుస్తులు, నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు.

యంత్రాలు నామమాత్రం.. సేవలు తూతూమంత్రం
✦ రైతుసేవా కేంద్రాల్లో ఇదీ పరిస్థితి

ఆర్ఎస్‌కేలో మూలకు చేరిన కియోస్క్ యంత్రం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలని, కాలానుగుణంగా పంట సాగులో మెలకువలపై అవగాహన కల్పించేందుకు వైకాపా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు పలుచోట్ల మూలకి చేరాయి. దీంతో వీటి సేవలు తూతూ మంత్రంగా మారాయి. అన్నదాతలు స్వయంగా తమకు అవసరమైన రాయితీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కియోస్క్ యంత్రంలో నమోదు చేసుకునేలా వీటిని ఏర్పాటుచేశారు. కొంతకాలం సాఫీగానే సాగిన కియోస్క్ సేవలు ప్రస్తుతం అనేక చోట్ల చతికిలపడ్డాయి.

వినియోగానికి దూరం
ప్రస్తుతం రబీ సీజన్ మొదలైంది. ముమ్మురంగా అన్నీ ప్రాంతాల్లో వరి సాగుకి అన్నదాతలు సిద్ధం అవుతున్నారు. గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ పరిధిలో గూడూరు, చిల్లకూరు, ఓజిలి, వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, నాయుడుపేట, పెళ్లకూరు, చిట్టమూరు, కోట, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో మొత్తం 160 రైతు సేవా కేంద్రాల్లో పేరుకు మాత్రమే ఉన్నా వినియోగించడం లేదు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి. పైగా సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

మొబైల్ ద్వారా అందిస్తాం
ప్రస్తుతం సిబ్బంది మొబైల్ ఫోన్‌లో యాప్ ద్వారా వివరాలు నమోదు చేసి, అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తాం.
- గోపీనాయక్, ఏడీఏ, గూడూరు

తాతల తరాల నాటి ఊడలమర్రి

కూచవాడ పంచాయతీలోని పొలాల్లో తాతల తరాల నాటి భారీ ఊడలమర్రి ఉంది. స్థానికుల సమాచారం మేరకు 200 ఏళ్ల ముందు నుంచే ఇక్కడ ఊడల మర్రి ఉంది. నరసాలమ్మ విగ్రహానికి పూజలు చేస్తారు. పక్కనే రామలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ మర్రిపై కొమ్మల నుంచి వేళ్లు నేలలోకి చెట్టుకు పిల్లర్లు వేసినట్లుగా చక్కగా స్తంభాలు లాగా పాతుకుపోయాయి. చెట్టు కాండం భాగం దెబ్బతింటున్నా వేళ్లు మాత్రం కిందకు చొచ్చుకుపోయి మరింత బలపడుతున్నాయి. పచ్చదనం చుట్టుపక్కలకు విస్తరిస్తోంది. – న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

బహిరంగ వేలం
నవంబర్ నెల తేది : 20-11-2025

Vehicle No.	Description	Year
AP39EE3092	SWIF DZIRE	2020
AP07CL3610	ETIOS 4D GD	2015
AP39ML4503	ETIOS 4D GD	2017

గమనిక : పైన తెలిపిన వాహనముల యొక్క రుణగ్రహీత(లు) / హామీదారులు మా యందు ఋణం పొంది వాహనము కొనుగోలుచేసి ఋణము చెల్లించనందువలన పలుమార్లు నోటీసులను పంపడమైనది. కాని ఖాతరు చేయనందువలన పలుమార్లు నోటీసు పంపడమైనది. కాని ఖాతరు చేయనందున పై వాహనములను వేలము ద్వారా విక్రయించి ఋణము రాబట్టుకొనుటకు కంపెనీ నిర్ణయించడమైనది. షరతులు వర్తిస్తాయి.
వేలము జరుగు ప్రదేశం : శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, వెంకటాచలం, సర్వేపల్లి రోడ్డు, రైల్వేగేట్ దగ్గర, నెల్లూరు
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
డి.నెం.53-54, శ్రీనగర్‌కాలనీ, శ్రీనివాస కాంప్లెక్స్, మాగుంట లేఔట్, దర్గామిట్ట షోరూం దగ్గర, నెల్లూరు, ఫోన్ : 9849981316, 9849981418.

(c) eenadu

ఈనాడు విశాఖపట్నం

గురువారం 20 నవంబరు 2025

గుండెల్లో భక్తి... కొండల్లో కాంతి

అనంత పద్మనాభ స్వామి వారి కొండ మెట్ల దీపోత్సవం బుధవారం వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, పద్మనాభం

కదిలితే.. కాల్చేస్తా!

ఈ చిత్రం చూస్తుంటే... నగరంలోకి అనుమానితులు ప్రవేశించారా? భద్రతా సిబ్బంది తనిఖీల్లో వారు పట్టుబడ్డారా? కదలొద్దంటూ తుపాకీ గురిపెట్టారా? అనే సందేహాలు కలుగుతున్నాయా? పూర్తి విషయాలు తెలియాలంటే.. 'ఆకట్టుకున్న నమూనా విన్యాసాలు'.. 6లో చదవాలి

అద్భుత 'వనం'.. నగరానికి వరం..!

- 2వేల అరుదైన మొక్కల సంరక్షణ
- డాల్ఫిన్ నేచర్ కన్జర్వేటివ్ సంస్థ కృషి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అరుదైన మొక్కలకు కేంద్రంగా విరాజిల్లుతోంది నగరంలోని జీవ వైవిధ్య ఉద్యానవనం. 2వేలకుపైగా మొక్కలను ఇక్కడ సంరక్షిస్తున్నారు. రాక్షస బల్లుల (డైనోసార్స్) కాలం నాటి వృక్షాలు, గాలిని శుద్ధి చేసేవి, నీటిలో పెరిగేవి, రాత్రి వేళల్లో అధిక ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు ఇక్కడ ఉండటం విశేషం. పెదవాల్తేరు రాణి చంద్రమణి దేవి (ఆర్సీడీ) ఆసుపత్రిలో 2001లో డాల్ఫిన్ నేచర్ కన్జర్వేటివ్ సంస్థ ఏర్పడింది. సంస్థ ఆధ్వర్యంలో జీవ వైవిధ్య ఉద్యాన వనం ఏర్పాటుకు రాణి చంద్రమణి దేవి 2002లో 3 ఎకరాల స్థలం కేటాయించారు. అంతరించి పోతున్న మొక్కలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో వాటిని దేశ విదేశాల నుంచి సేకరించి ఇక్కడ సంరక్షిస్తున్నారు.

విద్యార్థులకు అధ్యయన కేంద్రంగా..: 2013లో వుడా, ఆర్సీడీ ఆసుపత్రి సహకారం అందించడంతో ఉద్యానవనం ఒక రూపురేఖలు సంతరించుకుంది. గత వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచనల మేరకు నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి ఉద్యాన వనాన్ని విద్యార్థులకు అధ్యయన కేంద్రంగా తీర్చి దిద్దారు. ఫలితంగా నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బోటనీ విద్యార్థులు ఈ వనాన్ని సందర్శిస్తున్నారు. విదేశీ పర్యాటకులు కూడా సందర్శించి అబ్బుర పడుతున్నారు.

పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యాన వనం... అందులోని అరుదైన మొక్కలు

12జాతులకు చెందిన మొక్కలు..: ఈ వనంలో 12 జాతులకు చెందిన 2వేల మొక్కలున్నాయి. వివిధ దేశాలు, హిమాలయాలు, తదితర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వీటిని సేకరించారు. శీతల వాతావరణంలో పెరిగే మొక్కల కోసం తక్కువ ఉష్ణోగ్రతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని కోసం షేడ్ నెట్స్ ఏర్పాటు చేశారు. వాతావరణం పొడిబారకుండా నిత్యం తేమ ఉండేలా స్ప్రింక్లర్లు అమర్చారు.

ఏటా రూ.10లక్షల వ్యయం: ఉద్యానవనం నిర్వహణకు ఏటా రూ.10 లక్షల వరకు వ్యయమవుతోంది. ఇటీవల వీఎంఆర్డీఏ వాకింగ్ ట్రాక్, డ్రిప్ ఇరిగేషన్, కంచె, విద్యుత్తు సౌకర్యం కల్పించింది. వివిధ సంస్థల సభ్యులు, విద్యార్థులు విరాళాలు అందజేస్తున్నారు. '2026లో రజతోత్సవాన్ని పురస్కరించుకుని ప్రయోగశాల, సెమినార్‌హాల్, సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటు చేస్తున్నాం' అని నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి తెలిపారు.

ముఖ్యమైన కొన్ని మొక్కలు ఇలా..

సుగంధ ద్రవ్యాలు:	100
ఔషధ	200
అటవీ	500
ఆర్కిడ్స్	50
ఎడారి	500
కీటక సంహార:	10
గాలిలో తేలియాడేవి:	10
నీటిలో పెరిగేవి:	50
రాక్షస బల్లుల కాలం నాటివి:	100
దేవతా వృక్షాలు:	100

నల్లబ్యాడ్జీలతో ఉక్కు ఉద్యోగుల నిరసన

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : కార్మికుల జీతాలను లక్ష్యాలతో ముడిపెట్టి ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని బుధవారం ఉక్కు కర్మాగారంలో అన్ని విభాగాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులనుద్దేశించి అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, పి.వి.రమణమూర్తి, జె.అయోధ్యరామ్ మాట్లాడారు. చట్ట వ్యతిరేక ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఇదే అంశంపై గురువారం బాలచెరువు గేటు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

MANAGEMENT ADMISSIONS 2025-26

1st Year of 5 Yrs. B.A., LL.B.
Ist Year of 3 Yrs. LL.B. &
Ist Year of 2 Yrs. LL.M. Courses
CONTACT ON OR BEFORE 21.11.2025
N.B.M. LAW COLLEGE
SEETHAMMADHARA, VISAKHAPATNAM-13
0891-2535613, 9949432979

మార్గశిరం.. శుభకరం..!

రేపటి నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి మాసోత్సవాలు

న్యూస్‌టుడే, వన్‌టౌన్

భక్తుల పాలిట కొంగుబంగారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాఖపట్నం పాతనగరంలోని బురుజుపేటలో ఉన్న ఆలయంలో ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు ఉత్సవాలు జరగనున్నాయి.

అంచనా.. మూడు లక్షలు: ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 3 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల దర్శనాలు సాఫీగా సాగేందుకు వీలుగా క్యూలైన్లు, ఇతరత్రా ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రెండుసార్లు ఆలయ సమన్వయ కమిటీతో సమావేశమై పలు అంశాలపై సూచనలు చేశారు.

అలంకరణలో అమ్మవారు

టికెట్ ధరలు	ప్రత్యేక దర్శనం:	విశిష్ట దర్శనం:	శీఘ్ర దర్శనం:
	రూ.500	రూ.200	రూ.100

పంచామృతాభిషేకం : రూ. 10,000 (గురువారం తొలి గంటలో..)

పంచామృతాభిషేకం: రూ. 3,000 (సాధారణ రోజుల్లో)

అర్ధరాత్రి నుంచే...!

■ మార్గశిర మాసోత్సవాల్లో రోజూ శ్రీచక్ర నవవర్ణార్చన, లక్ష్మీహోమం, విశేష కుంకుమ పూజలు, వేదపారాయణం, సప్తశతీ పారాయణం, మహా విద్యాపారాయణం పూజలు ఉంటాయి. ■ గురువారాల్లో (బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత) 12.01 గంటలకు అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఆయా పూజాధికాలు పూర్తయిన తర్వాత నుంచే భక్తుల దర్శనాలకు అనుమతి ఇస్తారు.

■ భక్తులు మండల దీక్ష (41 రోజులు), మాసదీక్ష (31), అర్ధ మండల దీక్షలు (21) చేపట్టి, అమ్మవారికి ఇరుముళ్లు సమర్పిస్తుంటారు.

గత మూడేళ్ల మార్గశిర మాసంలో ఆదాయం (రూ. కోట్లలో..)



'కళ' వరించే.. కల ఫలించే..!

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కళా రంగంలో 50 ఏళ్లు దాటిన వ్యక్తుల అభిరుచులు, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి ముంబయికి చెందిన ఖయాల్ సంస్థ ఏటా '50 ఆబో 50' పేరిట పోటీలు నిర్వహిస్తుంటుంది. ఈనెల 15, 16 తేదీల్లో ముంబయిలోని గోరేగావ్‌లో ఈ పోటీలు జరిగాయి. ఇందులో నగరంలోని కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతానికి చెందిన సువర్ణ దత్తు(55) పాల్గొని కూచిపూడి నృత్యం కేటగిరీలో టాప్-10లో నిలిచారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు నృత్యం, సంగీతం, యోగా, వంట చేయడం, పాటలు పాడటం అంశాల్లో గ్రాండ్ ఫినాలే పోటీలు నిర్వహించారు. కూచిపూడి నృత్యంలో సువర్ణ దత్తు టాప్-10లో నిలిచారు. ఆమెకు నిర్వాహకులు జ్ఞాపికతోపాటు రూ. 10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. 'చిన్న వయసులో కూచిపూడి నేర్చుకోవాలని అనుకున్నా.. సాధ్యపడలేదు. పెళ్లయిన తర్వాత పిల్లలు, వారి చదువులతో తీరిక దొరకలేదు. చివరికి 38ఏళ్ల వయసులో కూచిపూడి నృత్యం నేర్చుకున్నా. ఆ కళను నలుగురికి పంచాలనే ఉద్దేశంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నా. 50ఏళ్లు దాటిన వ్యక్తుల్లో ప్రతిభను బయటకు తీయడానికి ఖయాల్ సంస్థ పోటీలు నిర్వహిస్తుందని తెలుసుకుని దరఖాస్తు చేశా. పోటీల్లో పాల్గొని, నాలో కళను ప్రదర్శించడం గొప్ప అనుభూతిని ఇచ్చింది' అని సువర్ణ దత్తు తెలిపారు.

కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న సువర్ణ దత్తు

క్రికెటోత్సవానికి **వేళాయె** వివరాలు 6లో

NYAYA VIDYA PARISHAD LAW COLLEGE
Approved by BCI & Affiliated to Andhra University
Law College Junction, 100ft Road, PM Palem, Opp. International Cricket Stadium.
Founder Late Sri Alwardas
Spot Admissions For CAT-B
3 Yrs LLB 10+2+3 Educational Qualification
5 Yrs LLB 10+2 Educational Qualification
Last Date for Admissions: 21-11-2025
12 Acres-Capmus Advantages
• Moot Court • Auditorium
• Digital Library & 4000+ Books • Amphitheater
• Seminar Hall • Indoor & Outdoor Sports
For More Details Contact Call: 9701200024
(or) Visit www.nvplawcollege.com

బుజ్జాయిల అభి'రుచి'కే ఓటు..

గాజువాక, న్యూస్‌టుడే : బుడి బుడి అడుగుల బుజ్జాయిలు తినే ఆహారం అటు రుచితో పాటు.. ఇటు పోషకాలు కూడా మెండుగా ఉండాలి. అందుకే పోషణ్ అభియాన్ పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాలతో కూడిన 'బాలామృతం' అందిస్తున్నారు. రకరకాల వంటలను తయారు చేసి చిన్నారులకు తినిపిస్తున్నారు.

★ బాలామృతం పేరుతో ప్రభుత్వం ప్రతినెలా ఒక్కో చిన్నారికి రెండున్నర కిలోల బరువున్న పోషకాల మిళితమైన పిండి ప్యాకెట్లు ఇస్తోంది. ఇంతవరకు దీన్ని వేడి, చల్లటి నీటిలో జావలాగ కలిపి పిల్లలకు తినిపించేవారు. ఈ జావ తాగడానికి పిల్లలు అయిష్టత చూపిస్తుండటంతో ఈ పిండితోనే పిల్లల అభిరుచికి తగ్గట్టు కొత్త వంటకాలవైపు దృష్టి పెట్టారు.

బాలామృతంతో చేసిన వంటకాలు

జీవీఎంసీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు : 409	చిన్నారుల సంఖ్య:4,050 (సుమారు)

దోశలు.. హల్వా: బాలామృతం పిండితో ఇప్పుడు కేక్, ఇడ్లీ, హల్వా, పాయసం, బిస్కెట్లు, దోశ, లడ్డూ, చపాతీ.. తదితర పదార్థాలను తయారు చేసి పిల్లలకు అందిస్తున్నారు. వీటిని పిల్లలు ఎంతో ఇష్టంగా తింటున్నారని ఐసీడీఎస్ పీడీ నీలవేణి తెలిపారు. రుచితో పాటు పోషకాలు కూడా అందుతున్నాయన్నారు. ముందు వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. అవి రుచిగా ఉండటంతో ఇప్పుడు వాటిని పిల్లలకు అందిస్తున్నారు.

రూ. 150 లాక్కొన్నాడని.. ప్రాణం తీశాడు!

మద్యం మత్తులో ఘాతుకం

ఈనాడు-విశాఖపట్నం: ఇద్దరి మధ్య రూ.150ల కోసం జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. డైమండ్ పార్కులో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఒడిశాకు చెందిన టి.చిరంజీవి (35) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఒడిశాకు చెందిన చిరంజీవి విశాఖలో ఉంటున్నాడు. భార్యతో మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల చెందిన లక్ష్మణ్‌రెడ్డి, చిరంజీవి మధ్య కొంతకాలంగా స్నేహం కుదిరింది. వీరిద్దరూ తెలుగుతల్లి పైవంతెన కింద ఉంటూ, దాతలిచ్చే ఆహారం తీసుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. బుధవారం డైమండ్ పార్కులో ఇద్దరి మధ్య రూ.150ల విషయంలో గొడవ మొదలైంది. ఆ తరువాత ఇద్దరూ కలిసి మద్యం తాగారు. ఈ సమయంలో 'నా జేబులో డబ్బులు లాక్కొంటావా' అంటూ లక్ష్మణ్‌రెడ్డి పక్కనే ఉన్న కర్రతో బలంగా చిరంజీవి తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిరంజీవిపై గోపాలపట్నం, టూటౌన్ పరిధిలో పలు దొంగతనం కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిధి ఎవరిదంటూ..: హత్య జరిగిన చోటు ద్వారకా, నాలుగో పట్టణ స్టేషన్ సరిహద్దుల్లో ఉండటంతో కేసు ఎవరు నమోదు చేయాలనేదానిపై తర్జనభర్జన సాగింది. డైమండ్ పార్కు వద్ద సాయిరాం పార్లర్ వైపు నాలుగో పట్టణ స్టేషన్, మరో వైపు ద్వారకా స్టేషన్ పరిధిలోకి వస్తాయి. హత్య పార్కులో బెంచిపై జరగడంతో మీ పరిధంటే మీపరిధని పోలీసు సిబ్బంది మధ్య చర్చ సాగింది. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నాల్గవ పట్టణ పరిధిగా నిర్ణయించడంతో ఆ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు లక్ష్మణ్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

కన్నీటి సుడుల్లో.. మానవత్వపు వెలుగులు..!

విశాలాక్షినగర్, ఎండాడ- న్యూస్‌టుడే : కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు మరణించి తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ ఆ కుటుంబ సభ్యులు ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపడానికి ముందుకొచ్చి ఔదార్యం చాటుకున్నారు. రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ సమన్వయకర్త, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గొల్లల ఎండాడకు చెందిన **బొబ్బిలి రమేష్** (51) ఆటో డ్రైవర్‌గా పనిచేసేవారు. ఆయనకు భార్య వరలక్ష్మి (45), కుమారులు రూపేష్(25), దినేష్ (23) ఉన్నారు. ఈ నెల 10వ తేదీన రమేష్ ఇంటి రెండో అంతస్తు పిట్టగోడపై కూర్చుని ఉండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అధిక రక్తస్రావం కావడంతో ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక పోవడంతో వెంకోజీపాలెంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతని ప్రాణం నిలిపేందుకు ఆసుపత్రి వైద్యులు శ్రమించినా ఫలితం లేకపోవడంతో ఈనెల 17న బ్రెయిన్ డెడ్ అయినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతరం వారికి అవయవదానంపై అవగాహన కల్పించగా మానవత్వం చూపి ముందుకు వచ్చారు. కాలేయం, రెండు మూత్రపిండాలు, రెండు కార్నియాలు సేకరించి ఆసుపత్రులకు కేటాయించారు. అవయవదానానికి ముందుకొచ్చిన రమేష్ కుటుంబ సభ్యులకు వైద్య బృందం కృతజ్ఞతలు తెలిపింది.

కాఫీ రైతుకు కమ్మని కబురు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గిరిజన రైతుల సంక్షేమం నిమిత్తం కాఫీ గింజల సేకరణ ధరలు పెంచామని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) వైస్ ఛైర్మన్, ఎండీ కల్పనాకుమారి తెలిపారు. బుధవారం బీచ్‌రోడ్డులోని జీసీసీ ప్రధాన కార్యాలయంలో.. 2025-26 ఏడాదిలో 'కాఫీ' కొనుగోలు ధరను నిర్ణయించేందుకు అపెక్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కల్పనా కుమారి మాట్లాడుతూ పెంచిన ధరలపై ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. జీసీసీ సిబ్బంది గిరిజన ప్రాంతాల్లోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి రైతుల నుంచి ఎలక్ట్రానిక్ కాటా ద్వారా కచ్చితమైన తూకంతో సేకరిస్తారన్నారు. అనంతరం 24గంటల్లో నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే 70130 70990 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ భార్గవి, పాడేరు ఐటీడీఏ పీవో శ్రీపూజ, బెంగళూరు కాఫీ బోర్డు ఆఫ్ ఇండియా ప్రతినిధి ప్రదీప్‌బాబు, జీసీసీ జీఎం(కాఫీ) ఉమాదేవి, సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీ ధర ఇలా (రూ.లలో)

రకం	ప్రస్తుతం	పెంచాక
అరబికా పార్చిమెంట్	400	450
అరబికా చెర్రీ	250	270
రొబస్టా చెర్రీ	160	170

RAGHU COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi, Affiliated to Andhra University, VSP)
Dakamarri, Bheemili (M), Visakhapatnam - 531162, A.P
Ph. 08922-248014, 15 Email Id: raghucollegeofpharmacy@rediffmail.com

B.PHARMACY SPOT ADMISSIONS (CAT-A) AP EAPCET-2025

Candidates qualified in **AP EAPCET-2025** and have not taken admission in any institution are eligible for Spot Admissions. If **AP EAPCET-2025** qualified candidates are not available, the candidates having percentage of aggregate marks in qualifying examination or its equivalent as per the eligibility criteria by the Chairman/Convener, **APSCHE, AP EAPCET-2025 (Admissions)** will be considered.
The interested candidates may attend the Institutional Spot Admissions in our college on **20-11-2025 (Thursday) at 10.00 AM** along with all original certificates and requisite fee.
The vacant seats will be filled as per the guidelines of Chairman/Convener, **APSCHE, AP EAPCET-2025** Admissions and the admitted candidates are not eligible for tuition fee reimbursement.
For details Contact: 08922-248014,15

14-11-2025 Mob: 9177779084, 9490302033 Principal

SRI VISVODAYA EDUCATION SOCIETY, M.H.COLONY,VIZAG

WANTED

DESIGNATION	QUALIFICATION/EXPERIENCE	NO. OF POSTS
Principal/ Vice Principal	PG With M. Ed / B. Ed in respective stream with 07 yrs experience in CBSE domain with profound knowledge in affiliation aspects, SARAS compliance and overall adminstration of school activities	01
TGT Physics	PG/ Graduation with B. Ed in respective specialization with 02yrs experience. Post Graduates will be preferred	01
TGT Maths		01
PET (Male)	PG/Graduation in Physical Education with 02 yrs Experience. Post Graduates will be preferred	01

Interested candidates are required to submit resume along with self attested photo copies of educational qualifications, experience certificates and co-curricular activities to the Visvodaya CBSE school office located at Meghadripeta. defence Civilian colony, Kancharapalem post, Visakhapatnam-530008 between 9am-2pm on or before 09 Dec 2025. Passport Size photographs should be affixed on the resume. Applications forwaded through online/postal mode will not be accepted . Shortlisted candidates alone will be contacted for written test and those qualified in the Written test will only be contacted for interview. For any other clarifications, candidates may contact Correspondent on telephone no.0891-2507281/82 . Email id: **srivisvodayaeducationsociety@gmail.com.** The advertisement May also be accessed on **http://visvodayaedn.com.**

అన్నదాతలకు సకాలంలో పెట్టుబడి సాయం

తగరపువలస, న్యూస్‌టుడే: ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని రైతులకు సకాలంలో అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన భీమిలి మండలం తాటితూరులో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. జిల్లాలో 16,769 మందికి పీఎం కిసాన్ కింద రూ.2వేలు చొప్పున రూ.3.35 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 18,573 మందికి రూ.9.28 కోట్లు మంజూరైందన్నారు.

నమూనా చెక్కును రైతులకు అందిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

★ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అని, ప్రభుత్వం ఏడాదికి మూడు విడతలుగా ఒక్కో రైతుకు రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తోందని అన్నారు. అనంతరం తాటితూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నియోజకవర్గంలో ఎనిమిది చోట్ల వీటిని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి అప్పలస్వామి, భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, సహకారశాఖ జిల్లా అధికారి ప్రవీణ, తహసీల్దార్ రామారావు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, తెదేపా, జనసేన మండలశాఖల అధ్యక్షులు సరగడ అప్పారావు, నక్కా శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎలా కట్టుకున్నా.. అనుమతిస్తారు !

'బీపీఎస్' దరఖాస్తులకు ఉత్తర్వులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 'బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జీవీఎంసీ పరిధిలో అనధికారికంగా, అక్రమంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం వచ్చింది.

రూ.80 కోట్లు రావొచ్చు: ★ గతంలో ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణకే అనుమతించిన ప్రభుత్వం, తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అసలు ప్లాన్ తీసుకోకపోయినా.. క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు కల్పించింది. ★ నగరంలో దాదాపు 15 వేల వరకు బీపీఎస్ దరఖాస్తులు వస్తాయని, తద్వారా రూ. 80 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

120 రోజుల్లోపు..!: ఈ ఏడాది ఆగస్టు 31వ వరకు నిర్మించిన వాటికే బీపీఎస్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హులైన వారంతా 120 రోజుల్లోపు (ఈనెల 12 నుంచి) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబరు ఒకటి నుంచి చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఉపేక్షించొద్దని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఇదీ పరిస్థితి..: నగరంలో ఏటా 2,500 నుంచి 2,800 వరకు కొత్త భవనాల నిర్మాణానికి సంబంధించి జీవీఎంసీకి దరఖాస్తులు వస్తుంటాయి. వాటిలో ఎక్కువ శాతం భవనాలను ప్లాన్‌కు విరుద్ధంగానే నిర్మిస్తుంటారు. ★ 250 గజాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో భవనాలు నిర్మించే వారు జీవీఎంసీకి 10 శాతం మార్ట్‌గేజ్ చేసి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ప్లాన్ ప్రకారం నిర్మాణం పూర్తి చేసి, మార్ట్‌గేజ్ విడుదల చేయించుకుని, నివాస యోగ్య ధ్రువీకరణ పత్రం పొందాలి. అయితే మార్ట్‌గేజ్ విడుదల కాని భవనాలు 10 వేల వరకు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

★ కనీసం ప్లాన్ లేకుండా నిర్మాణాలు చేపట్టి, జీవీఎంసీకి అదనంగా ఆస్తి పన్ను చెల్లిస్తున్న వారంతా బీపీఎస్‌ను వినియోగించుకుని, అదనపు ఆస్తి పన్ను నుంచి ఉపశమనం పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

గాలికి తిరిగే 'కోడిపుంజు'ను చూస్తారా..!

వాతావరణం, సముద్ర అధ్యయన శాస్త్రం విభాగం ఆవరణలో ఉన్న కోడిపుంజు బొమ్మ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: గాలికి తిరిగే కోడిపుంజును చూడాలనుకుంటున్నారా.. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వెళితే ఈ దృశ్యం కనిపిస్తుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వాతావరణం, సముద్ర అధ్యయన శాస్త్రం విభాగాన్ని 80ఏళ్ల కిందట బ్రిటిష వారి హయాంలో ఏర్పాటు చేశారు. సాంకేతికత అభివృద్ధి చెందని ఆ కాలంలో గాలి దిశను తెలుసుకోవడానికి విభాగం ఆవరణలో ఇనుముతో చేసిన కోడిపుంజు బొమ్మను ఏర్పాటు చేశారు.

■ ఇది గాలి ఎటు వీస్తే అటువైపు తిరుగుతుంది. గాలి దిశను చెప్పే దీన్ని 'వెదర్ కాక్' లేదా 'విండ్ కాక్' అని పిలిచేవారని ఈ కేంద్రం అధికారి ఎస్.వి.జె.కుమార్ తెలిపారు.

■ కాలక్రమంలో సాంకేతికత అభివృద్ధి చెందడంతో ఇది నిరుపయోగంగా మారింది. అయినా తొలగించకుండా అలాగే ఉంచడంతో సందర్శకులకు వింతగా కనిపిస్తోంది.

■ 'గాలి దిశను తెలుసుకునేందుకు 'గెలీలియో' కాలంలో ఈ విధానాన్ని వాడేవారు. అలాగే పూర్వం చర్చిలపై కోడిపుంజు బొమ్మను ఉంచేవారు. ఈ విభాగం ఏర్పడిన తొలినాళ్లలో దీన్ని ఏర్పాటు చేశార'ని ఎస్‌వీజే కుమార్ చెప్పారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

ప్రైవేటు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

మాధవధార, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఐడీటీఆర్), రీజినల్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌డీటీసీ), డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ల (డీటీసీ) ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినట్లు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి డీటీసీ ఆర్.సి.హెచ్. శ్రీనివాస్ తెలియజేశారు. డ్రైవింగ్‌లో నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీటి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ మేరకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పూర్తి వివరాల కోసం www.morth.nic.in వెబ్‌సైట్ చూడవచ్చని, లేదా 92816 07042 నంబరుకు ఫోనులో సంప్రదించవచ్చునని తెలియజేశారు. అర్హత గల సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

LIC HFL — LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్.ఐ.సి. ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం - 530004. ఫోన్: 0891-2746480

(రూల్ 8 (1)) స్వాధీనతా ప్రకటన

U/s,13(4) SARFAESI చట్టం 2002 ప్రకారం (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సదరు చట్టము సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని (రూల్-3)తో చదువబడే సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత: శ్రీ విజయ వర్మ ఉద్దరాజు & సహ-ఋణగ్రహీత: శ్రీమతి దండు అమిత, నివాసం : డి.నెం.1-365/ఎ, ప్లాట్ నెం.18 & 18ఎ, కో-ఆపరేటివ్ సొసైటీ లే అవుట్, విశాలాక్షి నగర్, చినగదిలి, విశాఖపట్నం, మరియు హామీదారు : శ్రీ ఉద్దరాజు వెంకట రామరాజు, నివాసం : డి.నెం.50-1-50, ఎఎస్ఆర్ నగర్, అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర, సీతమ్మధార, విశాఖపట్నం వారు చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.74,04,363.13/- (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల నాలుగు వేల మూడు వందల అరవై మూడు రూపాయల పదమూడు పైసలు మాత్రమే) + తేది.12.08.2025 నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు మొదలగునవి కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.11-08-2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది మరియు సదరు నోటీసు తేది.04.09.2025న ఆంధ్రప్రభ తెలుగు దినపత్రిక & తేది.04.09.2025న టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంగ్లీష్ దినపత్రికలలో ప్రచురించడమైనది. (లోన్ ఖాతా నెం.711500011094, ఏరియా ఆఫీస్ : విశాఖపట్నం).

ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు నందలి రూలు 8 ప్రకారము LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌నకు తనఖా చేయబడిన దిగువ తెలిపిన ఆస్తిని తేది.15-11-2025న లాంఛనాత్మకంగా స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం తేది.11.08.2025 నాటికి రూ.74,04,363.13/- మరియు తేది.12.08.2025 నుండి ఒప్పంద రేటు ప్రకారం వర్తించు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జీకి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (మీ ద్వారా ఏవైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును).

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు ఆస్తి : తీసుకున్న ఋణం తిరిగి చెల్లించడానికి కంపెనీ వారికి సెక్యూరిటీగా, మీరు టైటిల్ డీడ్ నెం.7723/2014 రిజిష్టర్డు తనఖా చేయించినారు: విశాఖపట్నం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మరియు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలో, చినగదిలి గ్రామం, సర్వే నెం.156/1 లోని కో-ఆపరేటివ్ సొసైటీ లే అవుట్, విశాలాక్షి నగర్, ప్లాట్ నెం.18 & 18ఎ లోని 124.33 చ॥గ॥లు లేదా 103.956 చ॥మీ॥ల స్థల విస్తీర్ణంలో వాటర్ అసెస్మెంట్ నెం.MH03147-1, పాత మున్సిపల్ అసెస్మెంట్ నెం.100002/50078, మున్సిపల్ కొత్త అసెస్మెంట్ నెం.1086058781, సమీప డోర్ నెం.1-365/ఎతో క్రింది అంతస్తు నందు 1000 చ॥అ॥లు, మొదటి అంతస్తు నందు 1000 చ॥అ॥లు, రెండవ అంతస్తునందు 1000 చ॥అ॥లు మరియు మూడవ అంతస్తు నందు 700 చ॥అ॥లు విస్తీర్ణంతో గల ఆర్‌సిసి నివాస ఇంటి (గ్రౌండ్ + 3 అంతస్తులు) యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం : రోడ్డు, పడమర : ప్లాట్ నెం.19, ఉత్తరం : ప్లాట్ నెం.12 మరియు 13.

ఇకపై 'ది సెక్యూర్డ్ అస్సెట్' గా పిలువబడుతుంది.

తేది.15.11.2025న నా స్వహస్తములతో కంపెనీ ముద్రతో జారీచేయబడినది.

తేది. : 15.11.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్స్‌డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ. వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 79951 98451.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) / రూల్ 9(1) కు నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖాచేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తి/ఆస్తుల ఇ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత : మెస్సర్స్ ఉప్పల మంగరాజు, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ ఉప్పల మంగరాజు, తండ్రి: చిన వెంకట రమణ, డి. నెం. 5-48-7, మార్కెట్ వీధి, తగరపువలస, విశాఖపట్నం జిల్లా-531162. మరియు హామీదారు(లు) : 1) శ్రీ ఉప్పల మంగరాజు, తండ్రి : చిన వెంకట రమణ, డి.నెం.5-48-7, మార్కెట్ వీధి, తగరపువలస, విశాఖపట్నం జిల్లా-531162. 2) శ్రీ ఉప్పల రమేష్ బాబు, తండ్రి : వి. చిన వెంకట రమణ, డి.నెం.6-45-185, సత్యనారాయణపేట, తగరపువలస, విశాఖపట్నం జిల్లా-531162. డిమాండ్ నోటీసు తేది: 26.08.2022

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.26.08.2022 నాటికి రూ.35,12,453/- + తేది 27.08.2022 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.15.11.2025 నాటికి రూ.69,23,629/- + తేది 16.11.2025 నుండి భవిష్య వడ్డీ మరియు అన్ని ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూలు ఆస్తి వివరములు

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం యస్ఆర్ఓ, భీమునిపట్నం మున్సిపాలిటీ, తగరపువలస, విజయనగరం రోడ్డు, సత్యనారాయణపేట దగ్గర, వార్డు నెం.10, బ్లాక్ నెం.45, సర్వే నెం.45/1లోని 69.25 చ॥గ॥ల కమర్షియల్ స్థలం అందుగల అసెస్మెంట్ నెం.1089007946, డోర్ నెం.6-45-189తో గల 312 చ॥అ॥ల పరిధిలో మంగుళూరు టైల్స్ రూఫింగ్‌తో క్రింద అంతస్తుతో కూడిన భవనం శ్రీ ఉప్పల రమేష్ బాబు, తండ్రి : శ్రీ చిన వెంకట రమణ గారికి చెందినది. (డాక్యుమెంట్ నెం.455/2010, తేది. 15-02-2010 ప్రకారం). హద్దులు: తూర్పు: ఈ ఆస్తికి మరియు శేఖర్ మహంతి మురళి గారి ఆస్తికి మధ్యగల ఉమ్మడి గోడ, పడమర: ఈ ఆస్తికి మరియు మార్నాన రాజేంద్ర ప్రసాద్ వారి ఆస్తికి మధ్యగల ఉమ్మడి గోడ, దక్షిణం: కొప్పాల వెంకట రమణ యొక్క డైలీ మార్కెట్, ఉత్తరం : మున్సిపల్ రోడ్డు.

ఎన్‌కంబరెన్స్ : దాత రిజిష్టర్డు గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ ద్వారా తనఖాదారుకు ఇచ్చిన ఆస్తిని నెల్లూరు రిజిస్ట్రార్ ఆఫీస్ నందు డీడ్ నెం.1320/2021 ప్రకారం బ్యాంక్‌నకు తనఖా పెట్టిన తరువాత రద్దు చేసినారు.

రిజర్వు ధర : రూ.33,24,000/- ధరావత్తు : రూ.3,32,400/- బిడ్ పెంపుదల : రూ. 10,000/-

ఇ-వేలం తేది : 09-12-2025 సమయం: ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది 20-11-2025 నుండి తేది 08-12-2025 వరకు ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు :

(1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్: www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇ.ఎమ్.డి. వేలం వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ఇ-వేలం పోర్టల్: https://baanknet.com/eauction-psb/bidder-registration & https://www.baanknet.com మరియు టోల్ ఫ్రీ నెంబర్లు +91 - 8291220220, మెయిల్ ఐడి: support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

(2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు / అదనపు స్టాంపు డ్యూటీ / బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మొదలగునవి మరియు చట్టపరమైన / నాన్ స్టేట్యూటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలుదారే భరించవలెను.

గమనిక-1: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు పిఎస్‌బి అలయన్స్ నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి. మొత్తం మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ బ్యాంక్ అకౌంట్లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరచిన తరువాత మాత్రమే బిడ్డర్ యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు. కావున బిడ్డర్లు చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి.ను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించడమైనది.

గమనిక-2: ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ. 50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు అమ్మకం ధరలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం. 16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజనల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంక్ వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది: 15.11.2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్రికెటోత్సవానికి వేళాయె...

EENADU SPORTS LEAGUE 2025

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAHMAHENDRAVARAM, A.P.
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.net, ETV BHARAT
Organised by: ఈనాడు

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు).

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా

ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీస్, రత్నమాల రెసిడెన్సీ, డోర్ నెం. 45-40-42, 3వ అంతస్థు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, విశాఖపట్నం-530016.

వివరాలకు: 9618775577

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబరులో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫోటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫోటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు బుధవారం రాత్రి గీతం డీమ్డ్ వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ముగిశాయి. పురుషుల విభాగంలో విశాఖ జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రథమ, విశాఖ జట్టు ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్-15 బాలుర విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, విశాఖ జిల్లా, బాలికల విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, అనంతపురం జిల్లా జట్లు వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు గీతం డీమ్డ్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖర్, శాప్ డైరెక్టర్ ఎండీ.రమేష్‌కుమార్, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.అప్పలరాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్‌కార్తీక్, ఏపీ టేబుల్‌టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మ, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎం.ఎం.పాత్రో, వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

విజేతలతో గీతం డీమ్డ్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖర్, శాప్ డైరెక్టర్ రమేష్‌కుమార్, తదితరులు

ఏరో స్పేస్ రంగంలో 400 మందికి ఉద్యోగాలు

రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డీడీ ఎం.ఎ.వి.రామకృష్ణ

కంచరపాలెం, న్యూస్‌టుడే: ఏరో స్పేస్ రంగంలో 400 మంది డిప్లొమా మెకానికల్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) ఎం.ఎ.వి.రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం మెకానికల్ విభాగం చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న మెకానికల్ విద్యార్థులకు ఏరో స్పేస్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. బోయింగ్ సీఎస్ఆర్ నిధులతో లెర్నింగ్ లింక్ ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించే నిమిత్తం ఇప్పటి వరకు ప్రముఖ పది ఏరో స్పేస్ కంపెనీలను సంప్రదించామన్నారు. 40 డిప్లొమా ఇంజినీరింగ్ ట్రైనీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని, ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో ఎంపికైన వారికి రూ.3 లక్షల వార్షిక వేతనం ఇస్తారని చెప్పారు. లెర్నింగ్ లింక్ ఫౌండేషన్ డీజీఎం రఘు మిశ్రా, సీనియర్ మేనేజర్ ఎ.శేఖర్‌రెడ్డి, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రత్నకుమార్, టీపీఓ నారాయణ, మెకానికల్ విభాగాధిపతి పణి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం.ఎ.వి.రామకృష్ణ

సింహగిరిపై వైభవంగా శ్రీనృసింహ హోమం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆవిర్భావ తార స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీనృసింహ హోమం వైభవోపేతంగా జరిపించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో అర్చక బృందం వైదిక కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా జరిపించింది. సుదర్శన పెరుమాళ్ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని హోమగుండం ఎదుట అధిష్ఠింపజేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపి అగ్నిప్రతిష్ఠాపన చేశారు. వేదమంత్రాలు, నృసింహ మూలమంత్ర సహితంగా హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణ కలశంతో అర్చకులు, అధికారులు, భక్తులు ఆలయ బేడామండపం ప్రదక్షిణం చేసి స్వామికి సమర్పించారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూర్ణ కలశంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు, అధికారులు

'సింహాద్రి ఎన్టీపీసీ'లో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ, బీఈఈ ఆదేశాల మేరకు పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్ సంగం హాలులో బుధవారం 'ఎనర్జీ కన్జర్వేషన్ (శక్తి ఆదా)' అంశంపై రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం గ్రూప్-ఏలో 5 నుంచి 7వ తరగతి విద్యార్థులకు, గ్రూప్-బీలో 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు వేర్వేరుగా పోటీలను ప్రారంభించారు. గ్రూప్-ఏలో జి.హమ్సిత(నారాయణ కాన్సెప్ట్ స్కూల్ నెల్లూరు), కె.జాహ్నవి (ఎస్ఆర్ జెడ్‌పీహెచ్ స్కూల్, లక్కవరం) బి.ప్రత్యేక (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఉక్కునగరం); గ్రూప్-బీలో బి.తేజశ్వని (బాలభారతి పబ్లిక్‌స్కూల్, ఎన్టీపీసీ) కె.పరిణీత్ (డీపాల్ స్కూల్, ఉక్కునగరం) డి.దుర్గానిత్య (ఎన్ఎస్‌సీ మ్యాథ్యూస్ పబ్లిక్‌స్కూల్, పటమట, విజయవాడ) వరుస విజేతలుగా నిలిచారు. గ్రూప్-ఏ, బీ విజేతలుగా నిలిచిన వారికి వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు నగదు బహుమతి, మరో 20 మందికి కన్సొలేషన్ కింద ఒక్కొక్కరికి రూ.7500 నగదు, ప్రశంసా పత్రాలను సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ చేతుల మీదుగా అందజేశారు. రెండు గ్రూపుల్లో మొత్తం ఆరుగురు విజేతలను డిసెంబర్ 11న దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు రమణ, మహాపాత్రో, అనిత్ కుమార్, ప్రకాశరావు, శివసింగ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, తదితరులు

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్. ✆ 9396 999 669.

HOME NEEDS

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడి బారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్య? 7675873377.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Trinadha Rao Pragada, S/o: Pragada Apparao, R/o: 38-21-10/1 Bapuji Nagar, 104 Area Marripalem, Visakha patnam, 530007. Have Changed My Name To Thrinadha Rao Pragada.

LOST

Sudhabattula Satya Padmalatha W/o. Srihari I Have Lost My Original Document no: 4260/2013, if any Found. ✆ 9908019939.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

121Sq.Yds. Cellar+G+1 Building for sale. North-East Facing. Exclnt Vastu - Prime Location Assured Rental. A.G.M.T. ✆ 9885824528.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, బ్యాంక్‌లోన్ సదుపాయంతో VUDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకం. ✆ 8686997700.

SECOND SALE

మిథున్ ఏజెన్సీ కొనబడును. పాత A/C లు, సెంట్రల్ A/C లు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్స్, ఫర్నీచర్, ఆన్‌లైన్ UPS లు, ఆడియోలు: 6309745364.

JOBS

Wanted *Project Manager *Accountant (F) *Logistics Faculty *IT Faculty *English & Soft Skills Faculty @ Srikalash Rushikonda. ✆ 8464848488.

Need Teaching Staff and Principal for ITI Anakapalli and Atchuthapuram. Salary: 15K/ 25K. Contact: 7032015042.

@**@ ISO Co. Needs for Vizag Branch 1. Admin Managers (Rtd./ VRS) 2. Telecaller (F) 2 yrs. exp. Good Package. ✆ 9848551846.

ఉద్యోగ అవకాశము
ప్రముఖ ISO సంస్థలో నూతన బ్రాంచ్‌నందు పనిచేయుటకు అభ్యర్థులను ఎంపిక చేయబడును.
❖ అసిస్టెంట్ జనరల్ మేనేజర్స్: M/F
❖ మేనేజర్స్/ మేనేజర్ ట్రైనీస్: M/F
❖ కో-ఆర్డినేటర్స్: M/F
అర్హత: ప్రైవేట్/ ప్రభుత్వ సంస్థలో పనిచేయువారు & పదవీ విరమణ చేయువారు మరియు ఇన్సూరెన్స్ రంగంలో వారు కూడా కావలెను. "నో ఫీల్డ్ వర్క్"
MONTHLY PACKAGE: 80 వేలు నుండి లక్షా 60 వేలు వరకు నిర్ణయించబడినది.
గమనిక: 1. పైన పేర్కొన్న ఉద్యోగము, మంత్లీ ప్యాకేజ్ ఇంటర్వ్యూ సమయంలో తెలియజేయబడును. 2. వెంటనే అపాయింట్ చేయబడును.
INTERVIEWS: 20, 21, 22 NOV-25
Con: S. VISWESWARA RAO - DGM DOCTORS COLONY, VSP Ph: 9985461280

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 - 29000. వ: 18-35. ✆: 7730958410.

భోగాపురం, ఆనందపురం కొత్త లేఅవుట్‌కి మార్కెటింగ్ చేయుటకు రియల్ ఎస్టేట్ చేసినవారు Rtd. పర్సన్స్, Working పర్సన్స్, హౌస్‌వైఫ్స్ కావలెను. శాలరీ+ఇన్సెంటివ్స్+ కమీషన్ ఇవ్వబడును. ఆసక్తి కలవారు సంప్రదించగలరు. ✆ 9440123604.

ప్రముఖ విద్యాసంస్థకు మేల్ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. (ఓన్లీ మేల్) Contact Phone Number: 9849413138.

వాంటెడ్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్స్ 10 M/F DTP/Tally ఫ్యాకల్టీ-1 M/F ఎగ్జిక్యూటివ్స్ (F) 5 cmsvizag.com@gmail.com ✆8465870102

ప్రముఖ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్, స్టోర్స్, టెలీకాలర్స్, అకౌంటెంట్, క్యాషియర్స్, రిసెప్షనిస్టు, మార్కెటింగ్, హెల్పర్స్ కావలెను. 8341177761/ 8019647888.

ప్రముఖ FMCG కంపెనీలో పనిచేయుటకు 3/4 వీలర్ డ్రైవర్స్ & సేల్స్‌మెన్స్, ప్యాకింగ్ కోసం హెల్పర్స్ (Female) కావలెను. ✆ 8897731257.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

దేదీప్యమానం

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువైన శ్రీఅనంత పద్మనాభ స్వామి వారి కొండ మెట్ల దీపోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ పునర్ నిర్మాణ పనులు పూర్తి కావడం, ఘాట్ రోడ్డు అందుబాటులోకి రావడంతో భక్తులు పోటెత్తారు. ఈ వేడుకలను పురస్కరించుకొని కొండ దిగువనున్న కుంతీమాధవస్వామి ఆలయం నుంచి సాయంత్రం నాలుగు గంటలకు మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఅనంత పద్మనాభస్వామి వారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై తొలి పావంచా వద్దకు తోడ్కొని వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ సిబ్బంది జేగంట మోగించాక మెట్లకు ఇరువైపులా ముందుగా సిద్ధం చేసిన తైల దీపాలను భక్తులు వెలిగించడంతో ఈ ఉత్సవం ప్రారంభమైంది.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

తరలివచ్చిన భక్తజన సందోహం

ఆకట్టుకున్న నమూనా విన్యాసాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : బీచ్‌రోడ్డులోని నొవాటెల్ హోటల్లో బుధవారం ఆక్టోపస్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనుకోని విధంగా తీవ్రవాదులు చొరబడితే.. వారిని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అనుమానితులను ప్రశ్నించడం, ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే తప్పించుకునే తీరు.. తదితర అంశాలపై విన్యాసాలు నిర్వహించి... స్థానికులను, పర్యాటకులను అప్రమత్తం చేశారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ జగ్గునాయుడు, డీఎస్పీ బి.కృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఉమాశంకర్ తదితరులు పర్యవేక్షించారు. మహారాణిపేట శాంతిభద్రతల విభాగం పోలీసులు, ట్రాఫిక్, రెవెన్యూ, అగ్నిమాపక, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు విన్యాసాల్లో భాగస్వాములయ్యారు.

మాక్ డ్రిల్‌లో పాల్గొన్న భద్రతా సిబ్బంది

కోనసీమలో పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ

అయినవిల్లి, న్యూస్‌టుడే: కోనసీమ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోందని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఎంపీగా గెలుపొందిన తరువాత తొలిసారిగా బుధవారం ఆయన స్వగ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలోని ఎస్.మూలపాలెం రాగా గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. దారిపొడవునా హారతులు ఇచ్చారు. బంధువులతో సెల్ఫీలు తీసుకున్నారు. శానపల్లిలంకలో ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. సిద్ధిగణపతి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా గెలుపొందే సమయానికి తన తాత మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి లేకపోవడం తీరనిలోటన్నారు.

శానపల్లిలంక గ్రామంలో ఎంపీ శ్రీభరత్‌కు హారతి ఇస్తున్న బంధువులు

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
కాంత
స్క్రీన్-2
ది గర్ల్‌ఫ్రెండ్

రేపు మెగా జాబ్ మేళా

సింధియా, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. 25 కంపెనీల యాజమాన్య ప్రతినిధులు అభ్యర్థుల ఎంపిక చేయనున్నారన్నారు.

పెందుర్తి

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం చింతగట్ల గ్రామానికి చెందిన రెండు వర్గాలకు చెందిన వారిని రూ.లక్ష పూచీపై బైండోవర్ చేసినట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14న రాత్రి రెండు వర్గాల మధ్య తగాదా జరిగింది. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా 13 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. ఈ మేరకు బుధవారం పెందుర్తి తహసీల్దార్ ఎ.వెంకట అప్పారావు ఎదుట ఇరువర్గాల వారిని హాజరుపరిచి ఆరు నెలల పాటు మంచి ప్రవర్తనతో ఉండాలని బైండోవర్ చేయించినట్లు తెలియజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా
80085 74978 సమయం: ఉ.10 నుంచి మ. ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: శ్రీసాయిమాధవ నగర్‌లో రహదారి పక్కన చెట్లు పెరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. – రామకృష్ణ
✓: పరిశీలించి తొలగిస్తాం. – శంకర్‌రావు, ఇన్‌ఛార్జి, జోనల్ కమిషనర్

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం శివారు గొల్లలపాలెం గ్రామంలో కాలువలు పూడుకుపోయాయి. –శ్రీనివాసరావు
✓: కాలువలను తొలగించే ఏర్పాట్లు చేస్తాం. –వై.రాజేశ్వరరావు, గ్రామకార్యదర్శి
?: సబ్బవరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న కాలువలో మురుగు కదలడం లేదు. –ఎం.గౌరీశు
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వై.రాజేశ్వరరావు, ఈవోపీఆర్డీ, ఇన్‌ఛార్జి, సబ్బవరం

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ నుంచి తానాం వెళ్లే మార్గంలో వీధి దీపాలు సరిగా లేవు. రాత్రివేళ ఇబ్బంది పడుతున్నాం. – రమణ
✓: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –మురళీధర్ పట్నాయక్, ఈవోపీఆర్డీ, పరవాడ

రైతన్నలకు అండగా అన్నదాత సుఖీభవ

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు అన్నారు. 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్' పథకం ఆర్థిక సాయం విడుదల నేపథ్యంలో బుధవారం పెందుర్తి మండలం రాంపురంలో రైతులు సంబరాలు చేశారు. పంట పొలాల్లో జరిగిన కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, రైతులు

దీక్ష విరమణకు.. సదుపాయాలెన్నో

పెందుర్తి, న్యూస్‌టుడే

◆ అయ్యప్ప ఆలయాలకు పెరుగుతున్న భక్తులు

ప్రతి ఏటా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కేరళ రాష్ట్రంలోని శబరిమల క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది దీక్షాధారులు తరలివెళ్తుంటారు. వీరితో పాటు సాధారణ భక్తులు సైతం అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. దీంతో ఏటా రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో మాలధారులు స్థానిక ఆలయాల్లో దీక్ష విరమణకు దృష్టిసారిస్తున్నారు. ఈ మేరకు ఆయా ఆలయ కమిటీలు అయ్యప్ప దీక్షల విరమణకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నాయి.

సిద్ధంగా ఉంచిన అరవణ ప్రసాదం

■ ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..: పెందుర్తిలోని ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో మండల, మకర విళక్కు, దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అయ్యప్ప సేవా ట్రస్ట్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో దీక్షల విరమణ, మాల విసర్జన చేసే భక్తులకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఇరుముడి ద్రవ్యాలు తీసుకువచ్చే భక్తులకు గురుస్వామి చేతుల మీదుగా ఇరుముడి ధారణ జరిపిస్తామన్నారు. శబరిమల తరహాలోనే మాలధారులు ఇరుముడితో పదునెట్టాంబడి మీదుగా ప్రధాన ఆలయం వద్దకు చేరుకునే సదుపాయం కల్పించారు. ఇరుముడి ద్రవ్యాలను సమర్పించి, నెయ్యి కొబ్బరి కాయ నేతితో స్వామికి అభిషేకం చేయిస్తున్నారు. మాలికపురత్తమ్మ దర్శనం చేసుకునే అవకాశం ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచితంగా వసతి, భిక్ష సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలోని పదునెట్టాంబడి

అందుబాటులో అరవణ ప్రసాదం

అయ్యప్ప భక్తులు ఎంతో పవిత్రంగా భావించే అరవణ ప్రసాదాన్ని పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. శబరిమల తరహాలోనే ప్రసాదాల డబ్బాల్లో ఈ ప్రసాదాన్ని నెలల పాటు నిల్వ ఉండేలా ఇక్కడే తయారు చేస్తున్నారు. మాల విరమణ చేసిన భక్తులకు ఇది ఎంతగానో సంతృప్తినిస్తోంది.

■ సుజాతనగర్ ధర్మశాస్తా ఆలయంలో..: సుజాతనగర్‌లోని శ్రీపూర్ణ పుష్కల సమేత ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి సమర్పణ, దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇరుముడితో వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి పదునెట్టాంబడి మీదుగా మణికంఠుడి సన్నిధికి వెళ్లవచ్చని తెలిపారు. స్వామి దర్శనం అనంతరం మాలికాపురత్తమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయ దొర్లించి ఇరుముడి విప్పుతారు. అందులోని నెయ్యి కొబ్బరి కాయలోని నేతితో స్వామిని అభిషేకించి భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. దీక్షల విరమణకు భక్తులకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కృష్ణానగర్ (వేపగుంట), న్యూస్‌టుడే: అన్నదాన సత్రాలతో పేదల కడుపు నింపడం అభినందనీయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. కృష్ణానగర్ ధర్మశాస్తా సహిత అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న మూడు అంతస్తుల అన్నపూర్ణ శ్రీ అన్నదాన సత్రం శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల క్రితం తాత్కాలిక రేకుల షెడ్డుతో ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాన్ని తాను ప్రారంభించానని.. ప్రస్తుతం మూడు అంతస్తుల శాశ్వత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. స్వాములు, భక్తులు, స్థానిక పెద్దలు అంతా కలిసి స్వచ్ఛందంగా ఈ భవనాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం భక్తుల ఐక్యతకు నిదర్శనమన్నారు. భవన నిర్మాణానికి వ్యక్తిగతంగా తన వంతు సహాయసహకారాలు అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఛైర్మన్‌గా సత్యనారాయణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం లింగాల తిరుగుడు ఆలయ కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షుడిగా బొడ్డి రామ వెంకట సత్యనారాయణ, సభ్యులుగా దాడి సత్యనారాయణ, వల్లభ పైడిరాజు పార్వతి, వెంకట పాపమ్మ, ఐరోతి భవాని, నారాయణమ్మ, వల్లభ జోస్యుల సీతారామమూర్తి, ఆళ్ల శ్రీనివాసరావు, ఎం. సత్యాసినాయుడు, నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కమిటీ సభ్యులను శాలువతో సత్కరించి అభినందించారు. ఆలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో విద్యార్థులకు ప్రయోజనం

వేపగుంట, న్యూస్‌టుడే : అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్ అన్నారు. డీఈవో ఆదేశాల మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం వేపగుంట జడ్పీ పాఠశాల టింకరింగ్ ల్యాబ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని.. ఆ విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉపకరిస్తాయన్నారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సింహాచలం నాయుడు, శిక్షకులుగా ఎన్ఆర్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు ఎన్.రాజేశ్, ఎన్.రమేశ్‌లు మెంటర్స్, ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణలో ఆరు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరవుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్

ఉత్సాహంగా థాంగ్‌టా పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పరవాడలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి థాంగ్‌టా పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 24 మంది విద్యార్థులను వచ్చే నెల 5, 6 తేదీల్లో పరవాడ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సత్యవతి, శ్రీదేవి, శ్రావణి, థాంగ్‌టా క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు. * జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 ఖోఖో పోటీలను పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గుర్రం అప్పలరాజు ప్రారంభించారు. బాలబాలికలకు వేర్వేరుగా జరిగిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, తదితరులు

ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్, థాంగ్‌టా క్రీడా ప్రతినిధులు

సైబర్ మోసాలపై అవగాహన

పరవాడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని ఎంఏఎస్ఆర్ఎం భవనంలో ఫార్మా కంపెనీలకు చెందిన సేఫ్టీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సైబర్ నేరస్థుల వలలో చిక్కుకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డిజిటల్ అరెస్టులు, ఫేక్ ఏపీకే ఫైల్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్ పేరిట జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు, ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్తు సరఫరా లైన్లు, సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరవాడ, వాడచీపురుపల్లి, పెదముషిడివాడ, వెంకటాపురం విద్యుత్తు ఉప కేంద్రాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

21న సబ్బవరంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం సబ్బవరం, అంతకాపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 21న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని కశింకోట సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయా సెక్షన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం వస్త్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. చినముషిడివాడ వార్డు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శానాపతి వసంత ముఖ్య అతిథిగా పాల్గొని వస్త్రాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ప్రహ్లాదపురంలో సుమారు 75 ఏళ్ల వయసున్న వృద్ధుడు స్పృహలేని స్థితిలో ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మరణించినట్లు తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు పెందుర్తి పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలంటూ ధర్నా

పొర్లుపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే : పొర్లుపాలెం, చింతలగ్రహారం రైతుల భూముల మీదుగా నిర్మించ తలపెట్టనున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలంటూ బుధవారం పొర్లుపాలెంలో రైతులు ధర్నా చేశారు. ఈ మేరకు చర్చలు జరిపేందుకు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఆర్డీవో పిలుపు మేరకు మోటార్ సైకిళ్లతో రైతులంతా ర్యాలీగా తరలివెళ్లి చర్చల్లో పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా శిబిరంలో భాగంగా బుధవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ జరిగింది. సుజాతనగర్ కాలనీలో విద్యార్థులు నినాదాలు చేస్తూ అవగాహన ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్, ఎన్ఎస్ఎస్ పీవో జి.మంజుల, వార్డు సచివాలయ అడ్మిన్ మోహన్‌రావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నందీశ్వరుడికి పంచామృతాభిషేకం

పెందుర్తి, న్యూస్‌టుడే: కార్తిక త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు శివాలయాల్లో మంగళవారం రాత్రి నందీశ్వరాభిషేకాలు ఘనంగా జరిగాయి. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, 96వ వార్డు పెందుర్తి సూర్యానగర్‌లోని పశుపతినాథ్ ఆలయాల్లో నందీశ్వరుడిని అర్చకులు పంచామృతాలతో అభిషేకించారు.

శ్రమశక్తినగర్‌లో నందికి అభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పెందుర్తి సూర్యానగర్‌లో..

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి

సూరాడ ముత్యాలు (పాతచిత్రం)

బోల్తాపడిన బోటు

పరవాడ, న్యూస్‌టుడే: బోటు బోల్తాపడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సూరాడ ముత్యాలు(56), చింతకాయల పెంటయ్య, తిత్తి రాజయ్య, కొవిరి సత్తెయ్య, అర్జిల్లి బండియ్య, తిత్తి కుల్లయ్య, నూకరాజు ఏడుగురు మత్స్యకారులు కలిసి బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఫైబర్ బోటుపై తీరంలో చేపల వేటకు వెళ్లారు. కొంతదూరం వెళ్లేసరికి బలమైన రాకాసి కెరటం రావడంతో ఒక్కసారిగా బోటు బోల్తాపడింది. దీంతో ముత్యాలు గల్లంతయ్యాడు. మిగిలిన వారు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. పెంటయ్య, బండయ్యకు స్వల్పగాయాలయ్యాయి. బోటు, వేట సామగ్రి దెబ్బతిన్నాయి. మాజీ సర్పంచి, తెదేపా నేత చింతకాయల ముత్యాలు, కూటమి నాయకులు ఒడ్డుకు చేరుకున్న వారితో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముత్యాలు మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య అప్పలనర్సమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోలీసులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరవాడ ఎస్సై కల్యాణ్‌రాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయాన్ని జరిపించారు.

బాలికలకు ముగ్గుల పోటీలు

పెందుర్తి, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో పాఠకులు, బాలలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలు, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వారంతా పాల్గొని ఉత్సాహంగా రంగవల్లికలు అలంకరించారు.

సబ్బవరం, పరవాడ, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్, రమాదేవి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

★ పరవాడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.

పెందుర్తి శాఖా గ్రంథాలయం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు, విద్యార్థులు

సబ్బవరం: చిత్రలేఖనం పోటీలో ..

కుండలేశ్వరంలో భక్తురాలి మృతి

సీపీఆర్ చేస్తున్న యువకుడు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కుండలేశ్వరుడిని దర్శించుకోవడానికి వచ్చిన ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందారు. భక్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన బొట్టా నిర్మల(66).. సోదరీమణులు సాయికుమారి, మాధవీలత, మరో మహిళతో కలిసి బుధవారం ఉదయం ఆలయాల దర్శనానికి వచ్చారు. ఉదయం పిఠాపురంలో కుక్కుటేశ్వర స్వామి దర్శనాంతరం సాయంత్రం కుండలేశ్వరం చేరుకున్నారు. దర్శనం అనంతరం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానిక యువకులు పీఎస్ఎన్‌రాజు, రవివర్మ మరికొంత మంది ఆమెకు సీపీఆర్ చేస్తూనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వాహనం వచ్చే సరికి మృతి చెందారు. స్థానిక యువకులు అంబులెన్స్ ఏర్పాటుచేసి మృతదేహాన్ని స్వస్థలానికి పంపించారు.

మొరపెట్టుకున్నా పట్టించుకోరా..?

మురుగు నిలిచిన చోట నిరసన తెలుపుతున్న కాలనీ సంఘం ప్రతినిధులు, నివాసితులు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ పోర్టు కాలనీలో ఇరవై రోజులుగా రహదారిపై మురుగు తిష్ఠ వేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేశారు. ఆ మేరకు బుధవారం కాలనీలో నిరసన చేపట్టారు. మూడవ లే అవుట్‌లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు ప్రవహిస్తోంది. ఇదంతా రోడ్డుపై నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన, అపరిశుభ్రత నెలకొంది. ఇప్పటికే కాలనీ వాసులు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదని వాపోయారు. పత్రికల్లో కథనాలు వచ్చినా యంత్రాంగంలో కదలిక లేదని అసహనం వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్ తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

'టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి'

పెందుర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్ అన్నారు. పెందుర్తి మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శి చుక్క సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. టెట్ పరీక్షకు వ్యతిరేకంగా డిసెంబర్ 9న భీమిలి, 10న పెందుర్తి డివిజన్లలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ సహాధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి, జిల్లా కార్యదర్శి వంగ రామలక్ష్మి, నాయకులు తమ్మారావు, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్

సుస్థిరాభివృద్ధి వనరులపై దృష్టి సారించాలి

సూచనలిస్తున్న శిక్షకుడు నాగరాజు

పెందుర్తి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు సుస్థిరాభివృద్ధి వనరులపై దృష్టి సారించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు సూచించారు. స్థానిక సంస్థల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై బుధవారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ శిక్షకుడు నాగరాజు పాల్గొని పరిశుభ్రత, పచ్చదనంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కొల్లి వెంకటరావు, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక, భరణికం, తానాం పంచాయతీల్లో గురువారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. కూటమి నాయకులు పాల్గొనాలని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

పరవాడ, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు 'అభ్యుదయం' పేరుతో పోలీసు సిబ్బంది చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం లంకెలపాలెం కూడలికి చేరుకుంది. ఈ మేరకు డీఎస్పీ, సీఐ మల్లికార్జునరావు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యమని వెల్లడించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డీఎస్పీ సుమారు 7 కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో పరవాడ కళాశాల ప్రిన్సిపల్ వినోద్‌బాబు, ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు, జేఎన్‌పీసీఎంఏ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు, తదితరులు

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేష్- **కాంత**
రాములమ్మ- **జిగ్‌రీస్**
తాతా- **జటాధర**
సప్తగిరి- **గర్ల్‌ఫ్రెండ్**

ఆక్రమణ తొలగింపు అడ్డగింత

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కృష్ణాకాలనీ వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని తొలగించేందుకు వచ్చిన రెవెన్యూ సిబ్బందిని ఆక్రమణదారులు అడ్డుకున్నారు. అక్కడ అక్రమంగా షెడ్డు వేసిన నీలాపు అప్పల రాజు అనే వ్యక్తి శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోవడానికి ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. స్థానిక నాయకుడు బోని కృష్ణ మాట్లాడుతూ పేదవాడైన నీలాపు అప్పల రాజుకు న్యాయం చేయాలని కోరారు.

పాఠశాలకు సామగ్రిని అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, నాని తదితరులు

■ పాఠశాలకు చేయూత

దాకమర్రి(తగరపువలస) , న్యూస్‌టుడే: భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు చెల్లూరి నాని రూ.50వేల విలువైన క్రీడా సామగ్రి, దుస్తులు, ఫర్నిచర్, ఇతర సామగ్రిని బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచి జీవీ నారాయణ, ఎమ్పీటీసీ సభ్యులు చెల్లూరి నగేశ్, నాయకులు గెద్ద చిరంజీవి, గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

■ డీఫార్మసీలో 20మందికి ప్రవేశాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు బుధవారం నిర్వహించారు. మొత్తం 27 సీట్లకు గాను 20 భర్తీ అయ్యాయి. రిజర్వేషన్ కోటాలో కొన్ని మిగిలి ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు ఎం.ఎ.వి.రామకృష్ణ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్నకుమార్, స్టూడెంట్స్ అడ్వయిజరు ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

■ ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఆస్తి పన్ను వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన రెవెన్యూ ఉప కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జోన్ల వారీగా బకాయిలపై కమిషనర్ ఆరా తీశారు. ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీవీఎంసీ వాణిజ్య సముదాయాల నుంచి అద్దెలు సకాలంలో వసూలు చేయాలన్నారు. అలాగే ప్రతి జెడ్సీ రూ.2 లక్షల వరకు నిధులు ఖర్చు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని, అత్యవసర సమయంలో వాటిని వినియోగించాలన్నారు.

■ అరుదైన పుస్తకాల డిజిటలీకరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలోని అరుదైన పుస్తకాలను డిజిటలైజ్ చేయాలని వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సూచించారు. బుధవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను పరిశీలించారు. తాళపత్ర గ్రంథాలు సహా అరుదైన పుస్తకాలు భావితరాలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ విధానం అనుసరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. లైబ్రరీ సైన్స్ చదువుతున్న విద్యార్థులు రెండు వారాలకు ఒకసారి ఒక ప్రత్యేక అంశంపై సొంతంగా సెమినార్ ఇచ్చేలా ప్రోత్సహించాలని గ్రంథాలయ విభాగాధిపతిని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆచార్య శ్రీనివాసరావు, గ్రంథాలయ విభాగాధిపతి ఆచార్య ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాజా భజంత్రీలు మోగేదెప్పుడో..!

మధురవాడ, న్యూస్‌టుడే

పేద, మధ్య తరగతి ప్రజల వివాహాది శుభ కార్యాలతో నిరంతరం కళకళలాడే కల్యాణ మండపం నేడు నిర్వహణ లేక వెలవెలబోతోంది. విశాలమైన ప్రాంగణం, ఎంతో మంది సౌకర్యవంతంగా కూర్చునే వెసులుబాటు, పార్కింగ్ ప్రదేశం తదితరాలతో సామాన్యులకు ఉపయోగకరంగా ఉండాల్సిన ఈ మండపం అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు వ్యయప్రయాసలకోర్చి ప్రైవేటు కల్యాణ మండపాలను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

జీవీఎంసీ ఏడోవార్డు పరిధి కృష్ణానగర్ కాలనీలో అప్పటి రాజ్యసభ సభ్యుడు దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ హయాంలో ఎంపీ నిధులతో దీన్ని నిర్మించారు. కాలక్రమేణా ఈ ప్రాంతాలు గ్రేటర్‌లో విలీనం కావడంతో సంబంధిత మండపం నిర్వహణ బాధ్యత జీవీఎంసీ ఆధీనంలోకి వెళ్లింది. 2010 వరకు స్థానికంగా ఉన్న చంద్రంపాలెం, కళానగర్, స్వతంత్రనగర్, వాంబే కాలనీ, రేవళ్లపాలెం, మధురవాడ ప్రాంతాల్లోని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇదే మండపంలో వివాహ శుభ కార్యక్రమాలు జరుపుకొనేవారు.

మరమ్మతులకు నోచుకోని ద్రోణంరాజు కల్యాణ మండపం

■ కొన్నేళ్లుగా జోన్-2 అధికారులు మండపం నిర్వహణ గాలికొదిలేశారు. దాంతో భవనం పలు చోట్ల దెబ్బతినడంతో పాటు మరుగుదొడ్లు వినియోగానికి దూరమయ్యాయి. మండపం వెనుక ప్రహరీ కూలి పోయింది. వర్షం పడితే ఆవరణలో నీరు నిలిచిపోయి బురదమయంగా మారుతోంది. ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలు పెరిగి విషజంతువులకు ఆవాసంగా తయారైంది.

■ ఎంతో ప్రాధాన్యం కల్గిన ఈ కల్యాణ మండపం ఆవరణను జోన్-2 అధికారులు పారిశుద్ధ్య క్లాప్ వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. దాంతో పారిశుద్ధ్య సామగ్రి, వాహనాలకు సంబంధించిన టైర్లు, మరమ్మతులకు గురైన సామగ్రితో సంబంధిత ప్రాంగణం అధ్వానంగా తయారైంది.

■ ఆధునిక వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలి

పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా నిలిచే ఈ కల్యాణ మండపానికి జీవీఎంసీ యంత్రాంగం ఆధునిక వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి. దీనిపై జోన్-2 అధికారులకు పలుమార్లు వినతులు అందించినా ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదు. దీనికి అవసరమైన మరమ్మతులు చేపట్టి అందంగా తీర్చిదిద్దితే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. – పిల్లా సూరిబాబు, మధురవాడ

వినియోగానికి దూరంగా మరుగుదొడ్లు

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

కప్పస్తంభం వద్ద సునీల్

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామిని బుధవారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జీపీ రాజశేఖర్ దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వారిని వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

వీసీ రాజశేఖర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు

రేపు మత్స్యకార దినోత్సవ సభ

చేపలుప్పాడ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర మత్స్యకార సేవాసంఘం ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని చేపలుప్పాడ పరిధి చొక్కావానిపాలెం గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు చొక్కా భాస్కరరావు అన్నారు. స్థానిక రామాలయం సమీపంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి పలువురు మత్స్యకార నేతలు హాజరు కానున్నారన్నారు.

సెమిస్టర్ పరీక్షల తనిఖీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఆర్ట్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు బుధవారం తనిఖీ చేశారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

మధురవాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఏడోవార్డు పరిధి స్వతంత్రనగర్ శ్రీసాయిలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. కాండూరి వెంకటేశ్వరరావు దంపతులు, స్థానిక నాయకులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం స్వామికి అన్నాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పరదేశమ్మ కోలాటం బృందం మహిళల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం చేపట్టిన అన్నసమారాధన కార్యక్రమాన్ని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, తెదేపా నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు తదితరులు ప్రారంభించారు. సుమారు 4 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. నాయకులు నక్కా శ్రీధర్, నాగోతి సత్యనారాయణ, నమ్మి రమణ, కె.సురేష్, పిళ్లా మోహన్ శివకృష్ణ, నాగోతి అనిత, పోతిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత తదితరులు

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కనులపండువగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయాన్ని జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో..

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీరాధా మదన మోహన స్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. అంతకు ముందు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పద్మనాభ స్వామికి భక్తుల నీరాజనం

శ్రీపార్వతీ నారాయణేశ్వర స్వామి

పద్మనాభం, న్యూస్‌టుడే: కొండ మెట్ల దీపోత్సవం కోసం బుధవారం సూర్యోదయానికి ముందు నుంచే భక్తులు తండోపతండాలుగా పద్మనాభం చేరుకున్నారు. స్వామిని స్మరించుకుంటూ మెట్లను పసుపు, కుంకుమలతో సిద్ధం చేసి చీకటి పడే వేళ దీపాలు వెలిగించి జేజేలు పలికారు.

ఉత్సవంలో అప..అప.. ★ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం సీపీ శంఖబ్రత బాగ్చీ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు కంట్రోల్ రూమ్‌లు, సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టారు. వైద్య శిబిరాలు నిర్వహించారు. అగ్నిమాపక శకటం, 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచారు.

కుంతీమాధవ స్వామి

★ భక్తులకు వివిధ ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రసాదాలు, తాగునీటి ప్యాకెట్లు, మజ్జిగ అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. పలువురు గృహస్థులు సైతం స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ వంతు సాయం అందించారు.

★ ఈ ఉత్సవంలో బాణసంచా వెలుగులు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఓ పక్క దీపపు కాంతులు, మరో పక్క నింగిలో బాణసంచా మెరుపులు ఉత్సవానికి ఎంతో శోభను తీసుకొచ్చేవి. ఈ ఏడాది భద్రతా కారణాల పేరిట బాణసంచా మెరుపులు లేకపోవడంతో భక్తులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

★ ఓ పద్ధతి లేకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు నిర్మించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మెట్ల మార్గంలో నీళ్ల ప్యాకెట్లు అందుబాటులో ఉంచినా గుడి వద్ద 11 గంటలకే అవి అయిపోవడంతో భక్తులు దాహంతో అల్లాడిపోయారు. కొండ దిగువనున్న పార్వతీ నారాయణేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల నుంచి టికెట్టు వసూలు చేయడానికి సిబ్బంది ఆలయం తలుపులు మూసేయడంతో తీవ్ర రద్దీ నెలకొంది. ఘాట్ రోడ్డులో మెట్ల మార్గం కలిసే చోట కూడా ఉండడంతో భక్తుల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

స్వామివారి ఉత్సవ మూర్తులను మండపానికి తీసుకొస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

పూజలందుకున్న అనంతపద్మనాభ స్వామి

★ ఈ ఏడాది కూడా ప్రమిదల పరిమాణం తగ్గించేయడంతో అరగంటకు మించి దీపాల వెలుగులు లేవు. గతంలో పెట్టిన ప్రమిదలలో అరకిలో పైగా నూనె పట్టేది. దీపం రెండు మూడు గంటలు వెలిగేది. ప్రస్తుతం 50 ఎం.ఎల్. నూనె మాత్రమే పట్టే ప్రమిదలు పెట్టడంతో దీపం వెలిగే సమయం అరగంట కూడా ఉండడం లేదు.

సామాన్య భక్తులకు పెద్దపీట

మార్గశిర మాసోత్సవాల గోడపత్రిక విడుదల

గోడపత్రిక ప్రదర్శిస్తున్న ఈఓ శోభారాణి, ఈఈ రమణ, సమాచార శాఖ డీడీ సదారావు, అర్చకులు, తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 21 నుంచి వచ్చే నెల 19 వరకే నిర్వహించే మార్గశిర మాసోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని ఆలయ ఈఓ కె.శోభారాణి వెల్లడించారు. బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు అమ్మవారి ఉత్సవాలు సంప్రదాయంగా ప్రారంభిస్తామన్నారు. 27న తొలి గురువారం పూజలు, డిసెంబరు 18న ఆఖరి గురువారాన్ని పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కలెక్టర్, నగర పోలీసు కమిషనర్ సూచనల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. డిసెంబరు 7న వేద, అర్చక సదస్సు, 13న రథయాత్ర, 18న సహస్రఘటాభిషేకం ఉంటాయన్నారు. అనంతరం ఉత్సవాల గోడపత్రికను విడుదల చేశారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ డీడీ కె.సదారావు, ఈఈ సీహెచ్.వెంకటరమణ, ఏఈఓ రాజేంద్రకుమార్, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గృహాలు.. దుర్గంధ పరిసరాలు

కొమ్మాది, న్యూస్‌టుడే

జీవీఎంసీ 6వవార్డు పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయాలైన ఎం-1(సేవానగర్), కె-1 (గురజాడనగర్), కె-2 (శ్రీసాయి శక్తినగర్) తదితర కాలనీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పగుళ్ల పైపులు, అధ్వానంగా మారిన విద్యుత్తు తీగలు, శిథిలావస్థకు చేరిన శ్లాబులు, బీటలు వారిన గోడలు, అపరిశుభ్ర వాతావరణం మధ్య జీవిస్తూ రోగాల బారిన పడుతున్నారు. కాలనీల్లో బ్లాకుల మధ్య మురుగునీటితో పాటు వ్యర్థాలు పేరుకుపోయి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక్కడి ఇబ్బందులపై స్థానికులతో పాటు వివిధ పార్టీల నేతలు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ పరిస్థితిలో పాలకులు స్పందించి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గురజాడనగర్‌లో బ్లాకుల మధ్య ఇలా..

భద్రత ఏర్పాట్లపై సీపీ ఆరా

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నెల రోజుల పాటు నిర్వహించే మార్గశిర మాసోత్సవాల్లో పటిష్ఠమైన భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ సూచించారు. బుధవారం ఆయన డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ కాశిదాసు, ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ తదితరులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. స్థానిక సీతారామస్వామి ఆలయం వద్ద కమాండ్ కంట్రోలు రూం ఏర్పాటు చేయాలని, డ్రోన్లతో పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. ఆలయ ఈఓ శోభారాణి, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల విభాగంలో జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్, సెలక్షన్ ట్రయల్స్ చంద్రంపాలెం ఉన్నత పాఠశాల క్రీడామైదానం వేదికగా బుధవారం జరిగాయి. 11బాలుర జట్లు, 4 బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర ఫైనల్స్‌లో పాయకరావుపేట శ్రీప్రకాష్ పాఠశాల జట్టుపై చంద్రంపాలెం పాఠశాల జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో చంద్రంపాలెం ఉన్నత పాఠశాల జట్టుపై సిల్వర్‌ఓక్స్ జట్టు గెలుపొందింది. సెలక్షన్ కమిటీ సభ్యులుగా శ్యామ్ సుందర్, బాలాజీ, శ్రీనివాస్ వ్యవహరించారు. ఆయా బృందాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. విశాఖ జట్టుగా బాలికల విభాగంలో 12మందిని, బాలురు విభాగంలో 12మందిని ఎంపిక చేయగా వీరందరూ ఏలూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. లలిత్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి బొజ్జ రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటరావు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరం.. వ్యక్తి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: సైబర్ మోసాల ద్వారా కొల్లగొట్టిన నగదును మ్యూల్ ఖాతాల ద్వారా బయటకు తీసి వాటిని క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకు అందించిన వ్యక్తిని ఎండాడ సైబర్ క్రైం స్టేషన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఆ వివరాలిలా..నగరానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ ముఠా సభ్యుల మోసానికి బలై మూడు బ్యాంకు ఖాతాలకు రూ.కోటి బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయిన విషయం తెలుసుకుని ఈ ఏడాది జులై నెలలో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టగా.. తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు చెందిన లక్కాకుల మనోజ్(23)ను ఈ నేరంలో భాగస్వామిడిగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు. మనోజ్ వేర్వేరు యాప్‌ల ద్వారా ట్రేడింగ్ చేస్తున్నపుడు కొంత మందితో పరిచయం ఏర్పడింది. అధిక నగదుకు ఆశపడి వారి వలలో పడ్డాడు. వారి సూచనల మేరకు తప్పులు చేసేవాడు. ప్రస్తుతం ఇతడి ఖాతాలో సుమారు రూ.8 కోట్ల వరకు నగదు లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దుబాయ్‌లో ఉన్నట్లు తెలిసిందని, ఇతడికి సహకరించిన మరో ఇద్దరిని కూడా ఇక్కడికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

లక్కాకుల మనోజ్

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ సమీప రేవళ్లపాలెంకు చెందిన ఓ విద్యార్థి (16) బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదు అందినట్లు పీఎంపాలెం పోలీసు స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆ యువకుడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కొన్ని దుస్తులు బ్యాగు సర్దుకుని వెళ్లిపోయాడన్నారు. పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించక పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

మహిళ దుర్మరణం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. ముచ్చర్ల గ్రామానికి చెందిన షిణగం లక్ష్మి (55) గోపాలపట్నం రైతు బజారు వద్ద కూరగాయలు విక్రయించుకొని జీవనోపాధి పొందుతోంది. ఎప్పటి మాదిరిగానే బుధవారం ఉదయం ఆనందపురం మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసి ఆటోలో గోపాలపట్నం బయలుదేరింది. కణమాం సమీపంలో ఆగి ఉన్న లారీని ఈమె ప్రయాణిస్తున్న ఆటో ఢీకొట్టడంతో లక్ష్మి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ షిణగం అప్పలనాయుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. భీమునిపట్నం ప్రభుత్వాసుపత్రిలో శవ పరీక్ష జరిగాక మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతురాలికి వివాహం జరిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పక్కాగా జనాభా గణన ప్రక్రియ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జరుగుతున్న జనాభా గణన ప్రక్రియకు ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ భీమిలి జోన్ మూడోవార్డు రెల్లివీధిలో ఆయన పర్యటించి గణన తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రయోగాత్మకంగా భీమిలి జోన్‌లోని 2, 3 వార్డుల్లో ఎన్యూమరేటర్ల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిచ్చి ఇళ్ల వద్దకు వచ్చే వాహనాలకు చెత్త అందించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. జనాభా గణన డిప్యూటీ డైరెక్టర్ ఎస్.దయాసాగర్, జిల్లా ఇన్‌ఛార్జి పి.రేవతి, భీమిలి జెడ్సీ వి.అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

★ ఇటీవల అభివృద్ధి చేసిన గాడువీధి శ్మశాన వాటికను కమిషనర్ కేతన్‌గార్గ్ పరిశీలించి చేపట్టిన పనుల నాణ్యతపై ఆరా తీశారు. త్వరలో ఇక్కడ మరణాల నమోదు, ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిర్వహించేందుకు శానిటేషన్ కార్యదర్శికి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ఎన్జీఓల భాగస్వామ్యంతో పచ్చదనాన్ని పెంపొందిస్తామన్నారు. తర్వాత కస్తూర్బా పాఠశాల రోడ్డును పరిశీలించారు. వార్డు కార్పొరేటర్ జి.చిన్నికుమారి లక్ష్మి, తెదేపా నాయకులు జి.నూకరాజు, జి.నరేంద్రకుమార్, అధికారులు పాల్గొన్నారు.

భీమిలి రెల్లివీధిలో జనాభా గణన తీరును పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రంలో బుధవారం ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె దేశానికి అందించిన సేవలను కొనియాడారు. లక్షలాది మంది విద్యార్థులకు ఇగ్నో తక్కువ ఫీజులతో ఉన్నతవిద్యను అందిస్తోందని పేర్కొన్నారు. అదనపు సంచాలకులు డాక్టర్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 12 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : డిసెంబరు 12 నుంచి 14 వరకు తిరుపతిలో నిర్వహించే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 25వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం జగదాంబకూడలి సిటూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాసభల గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్సిటీల్లో అధ్యాపకుల ఖాళీల భర్తీకి,విద్యార్థుల వసతి గృహాల ఆధునికీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం సభ్యులు ఎల్‌జే.నాయుడు, వెంకటరమణ, కుసుమాంజలి, నరేష్, నిఖిల్, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, పాఠకులు, విద్యార్థులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత దేవులపల్లి పద్మజ, వాణీ విద్యానికేతన్ కరస్పాండెంట్ అపర్ణలను సత్కరించారు. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలోనూ ఈ వేడుకలు నిర్వహించారు. భీమిలి సీహెచ్‌సీ డెంటల్ సర్జన్ డా.బెహరా సురేఖ ఆధ్వర్యంలో జాతీయ వెటరన్ క్రీడాకారిణి కందుకూరి లావణ్యను సత్కరించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి శాఖా గ్రంథాలయంలో కందుకూరి లావణ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

'మావోయిస్టులను కోర్టులో హాజరుపర్చాలి'

అల్లిపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వం అరెస్టు చేసిన మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం వివిధ ప్రజా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ముందుగా అదుపులోకి తీసుకున్న వారినే, ఎంపిక చేసి మరీ చంపేశారని ఆరోపించారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్న కేంద్రం, ముందుగా తేదీలను ప్రకటించి మరీ మావోయిస్టులను అంతం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు చంద్రశేఖర్, విష్ణువర్ధనరావు, కె.పద్మ, తిరుపతిరావు, అన్నపూర్ణ, లక్ష్మి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విశాఖ తూర్పు

విద్యార్థులకు ప్రేమతో బోధించాలి..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తరగతి గదులలో విద్యార్థులను దండించే విధానానికి స్వస్తి పలికి ప్రేమతో బోధించాలని, తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆర్జేడీ విజయ్‌భాస్కర్ అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా 'సపోర్టెడ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్' కార్యక్రమం జరుగుతోంది. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమంలో ఆర్జేడీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలుపరచాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారి సోమయాజులు, ఏఎంఓలు లక్ష్మి, శ్రీదేవి, ఎంఈఓ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం:	పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ:
ఉ॥ 10 నుంచి	8008574769
మ॥ ఒంటి గంట మధ్య	మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 13వ వార్డు లక్ష్మీపార్వతీనగర్, భగత్‌సింగ్‌నగర్ కాలనీల్లో కొన్ని వీధి దీపాలు 20 రోజులుగా వెలగడం లేదు. – కె.శ్రీనివాస్, భగత్‌సింగ్ నగర్ ✓: పరిశీలించి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – ఎం.రామకృష్ణ, వీధి దీపాల నిర్వాహకులు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఎంవీపీకాలనీ రోప్‌వే వద్ద చెత్తకుండీ నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలో వ్యర్థాలు ఉండడంతో మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. – అప్పలస్వామి, నడక సంఘం ప్రతినిధి. ✓: సిబ్బందితో వ్యర్థాలు తొలగించి సమస్య లేకుండా చూస్తాం. – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: ఇందిరానగర్, రాజీవ్‌నగర్‌లలో రెండు రోజులుగా కుళాయిలు ఇవ్వడం లేదు. మంచినీటికి ఇబ్బందులు పడుతున్నాం. – స్వర్ణలత, స్థానికులు ✓: మరమ్మతుల కారణంగా బుధవారం కుళాయిలు ఇవ్వలేదు. గురువారం సరఫరా ఇస్తాం. – శ్రీనివాస్, ఏఈ.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 20వ వార్డు కిర్లంపూడి లేవుట్ ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో రహదారిపై వ్యర్థాలు పోగులుగా ఉన్నాయి. ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. – శర్మ, ఈస్టుపాయింట్‌కాలనీ. ✓: తక్షణమే సిబ్బందితో వ్యర్థాలను తొలగిస్తాం. – ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఆరిలోవ, న్యూస్‌టుడే ?: 11వ వార్డు బాలాజీనగర్, ముస్తఫాకాలనీలో ఆరు వీధి దీపాలు రెండు వారాల నుంచి వెలగడంలేదు.– పి.నాయుడు, బాలాజీనగర్ ✓: దీపాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – ఎం.రామకృష్ణ, వీధి దీపాల నిర్వాహకులు.

స్పందనకు వందనం

ఆరిలోవ, న్యూస్‌టుడే: పైనాపిల్‌కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని శనివారం 'ఈనాడు' పత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి జీవీఎంసీ విద్యుత్తు విభాగ ఏఈ గాయత్రి శరణ్య స్పందించారు. సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పాతడెయిరీఫారం పోస్టాఫీసు వీధి నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిలో వీధి దీపాలు వెలగక చీకటిగా ఉంటోందని బుధవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి వీధి దీపాల పర్యవేక్షకుడు రామ్‌శంకర్ స్పందించారు. సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 19వ వార్డు లాసన్సుబేకాలనీ పోస్టాఫీస్ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయని బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పందించారు. వెంటనే సిబ్బందితో చెత్తను తరలించి పరిసరాలను శుభ్రం చేయించారు.

సామాజిక ఇతివృత్తం.. అంకురించిన చిత్రం

శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆరిలోవ, న్యూస్‌టుడే

కళకు సామాజిక దృక్పథం ఉండాలంటున్నారు శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల విద్యార్థులు. అంతేకాదు చిత్రలేఖనంలో ఆ విధానాన్నే అనుసరిస్తున్నారు. చుట్టూ ఉన్న పరిసరాలు, ప్రకృతి, పర్యావరణం, వరదలు వారి కళకు సాధనాలయ్యాయి. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆ కళలో మరింత ప్రావీణ్యం సాధించారు. వారి కుంచె నుంచి జాలువారిన చిత్రాలకు జాతీయస్థాయి అవార్డులు వరించాయి.. ఆ వివరాలు ఇలా..

నీటి సంరక్షణ చాలా ముఖ్యం: చిన్నతనం నుంచి చిత్రలేఖనం అంటే ఇష్టం. నా అభిరుచిని ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. నా చిత్రాలకు ఇప్పటికి 5 జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. మాది అనకాపల్లి జిల్లాలో ఓ కుగ్రామం. అమ్మానాన్న వ్యవసాయ కూలీ పనులు చేసుంటారు. వ్యవసాయానికి నీరు ఎంత ముఖ్యమో నాకు తెలుసు. ఆ నీటిని వృథా చేయకుండా నిల్వ చేయాలనే అంశంపై సేవ్ వాటర్ చిత్రం గీశా. ఇటీవల డ్రీమ్ ఆర్ట్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు ఆ చిత్రం పంపా. దానికి బంగారు బహుమతి లభించింది.
– కె.రాజ్‌కుమార్, ఇంటర్ ప్రథమ సంవత్సరం

చిత్రాలతో ప్రకృతిపై అవగాహన కల్పిస్తా..: మాది అనకాపల్లి దగ్గర కొత్తూరు. ప్రకృతి, పర్యావరణంపై ఆసక్తి ఎక్కువ. వాటిపై గీసిన చిత్రాలకు 7 జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. ఇటీవల 'కాలుష్యం నుంచి కాపాడండి... ప్రకృతిని ప్రేమించండి' అంశంతో వేసిన చిత్రానికి జాతీయ అవార్డు వచ్చింది. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెరిగేలా చిత్రాలు గీస్తా. చిత్రకారుడుగా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా. చుట్టూ ఉన్న పరిసరాలు నాకు స్ఫూర్తినిస్తుంటాయి. వాటిని చిత్రాల రూపంలోకి తేవడానికి సాధన చేస్తున్నా. – టి.జ్ఞానేంద్ర, 9వ తరగతి

కేరళ వరద విలయం కదిలించింది..: గురుకులంలో చేరిన తరువాత చిత్రలేఖనం అలవాటైంది. ఇప్పుడు నిత్య కృత్యంగా మారింది. సామాజిక ప్రయోజనం ఉన్న చిత్రాలు వేయడమంటే ఇష్టం. అటువంటి వాటికి రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయి. డ్రీమ్ ఆర్ట్ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు కేరళ రాష్ట్రంలో వరద సృష్టించిన విలయంపై చిత్రాన్ని గీసి పంపా. దానికి జాతీయ స్థాయిలో బంగారు పతకం లభించింది.
– ఎం.బాలు, పదో తరగతి

రూ.55లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధి ఆదర్శనగర్, పాతడెయిరీఫారం, వివేకానందనగర్‌లలో రూ.55 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో రహదారులు, కాలువలు, మంచినీటి సౌకర్యం లాంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు వేమల వెంకటరావు, మద్దిల రాజశేఖర్, రాజేష్, కుందూరు కొండమ్మ, తులసీపార్వతి, దొంత రమణ, బండి రాజారమేష్, సీహెచ్ శ్రీనివాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

సత్యసాయిబాబా సేవలు చిరస్మరణీయం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా సమాజానికి చేసిన సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమని కేంద్ర మాజీ సహాయ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సత్యసాయిబాబా శతవర్ష ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీకాలనీలోని సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో సత్యసాయి మహిళా దినోత్సవం నిర్వహించారు. కిల్లి కృపారాణి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేద పఠనం, అష్టోత్తర శతనామార్చన సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. బి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కిల్లి కృపారాణి, హరివెంకటకుమారి తదితరులు

ఆరోగ్యవంతమైన పిల్లలతోనే దేశ ప్రగతి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన పిల్లలతోనే దేశ ప్రగతి సాధ్యపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాలల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఎంవీపీ కాలనీలోని ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో ఛైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆయుర్జీవ ఎన్జీఓ, మెడికవర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధులను గుర్తించి ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే ఈ శిబిరంలో ఎన్జీఓ సంస్థలతో పాటు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సూత్రాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఛైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం, ఆయుర్జీవ సంస్థ ఫౌండర్ ఎస్.సుబ్బలక్ష్మి, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ప్రియాంక, తులసి, ఆదిత్య, పాఠశాల హెచ్‌ఎం కె.వి.ఎస్.వాణి, తదితరులు పాల్గొన్నారు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సన్యాసినాయుడు తదితరులు

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకొని పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం ఆవరణలో బుధవారం సాయంత్రం దీపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తితిదే లోకల్ బాడీ సభ్యులు చోడే వెంకట పట్టాభిరామ్, ఈవో గాయత్రి, అర్చకులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు కాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు ప్రతాప్‌రుద్ర హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఆలయ ఛైర్మన్ సి.హెచ్.జ్యోతి, ప్రధాన అర్చకులు కాళీప్రసాద్, కమిటీ సభ్యులు వేణుగోపాల్, చిన్నఅప్పారావు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: పెదగదిలి అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో రాత్రి 7 గంటలకు ఆకాశ దీపారాధన కార్యక్రమం జరిగింది. కార్తిక మాసం ప్రారంభం నుంచి జరుగుతున్న ఆకాశ దీపారాధన గురువారంతో ముగుస్తుందని, పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు దార్లమూడి లక్ష్మణశాస్త్రి తెలిపారు. కైలాసనగర్ కొండపై ఉన్న గౌరీశంకర ఆలయంలో నెల రోజులపాటు ఆకాశ దీపోత్సవం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ తెలిపారు.

కరకచెట్టు పోలమాంబ ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు, కాశీవిశ్వేశ్వరాలయంలో అన్నదానం

ఏయూ సమాచారం

అరుదైన పుస్తకాల డిజిటలీకరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలోని అరుదైన పుస్తకాలను డిజిటలైజేషన్ చేయాలని వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సూచించారు. బుధవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలను పరిశీలించారు. తాళపత్ర గ్రంథాలు సహా అరుదైన పుస్తకాలు భావితరాలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ విధానం అనుసరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. లైబ్రరీ సైన్స్ చదువుతున్న విద్యార్థులను రెండు వారాలకు ఒకసారి ఒక ప్రత్యేక అంశంపై సొంతంగా సెమినార్ ఇచ్చేలా ప్రోత్సహించాలని గ్రంథాలయ విభాగాధిపతిని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆచార్య శ్రీనివాసరావు, గ్రంథాలయ విభాగాధిపతి ఆచార్య ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

విదేశీ పరిశోధక విద్యార్థికి నగదు బహుమతి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలు చేస్తున్న టాంజానియా దేశానికి చెందిన విద్యార్థి డాసన్ న్యోని పరిశోధన పత్రానికి అవార్డు లభించింది. ఆచార్య వి.వి.ఎస్.ప్రసాద్ మార్గదర్శకత్వంలో మెరైన్ ఇంజినీర్స్ రివ్యూ (ఇండియా) పత్రికలో 'అసెస్‌మెంట్ ఆఫ్ షిప్ హుల్ హీలింగ్ మూమెంట్ కాస్డ్ బై రుడ్డర్ టర్నింగ్ మనువర్స్' అంశంపై పరిశోధన పత్రాన్ని ప్రచురించారు. ఈ పత్రం 'హెచ్ ఎస్ రావు మెమోరియల్ అవార్డు 2024-2025'కు ఎంపికైంది. ఈ మేరకు నిర్వాహకులు రూ.25వేల నగదు బహుమతి, ధ్రువపత్రం తపాలా ద్వారా డాసన్ న్యోనికి పంపించారు. వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ బుధవారం తన కార్యాలయంలో డాసన్ న్యోనిని అభినందించారు.

డాసన్ న్యోనిని అభినందిస్తున్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

బోటనీ మ్యూజియాన్ని సందర్శించిన కర్ణాటక విద్యార్థులు

మ్యూజియాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం హోస్పేట లోని విజయనగర కళాశాల నుంచి బీఎస్సీ విద్యార్థుల బృందం, అధ్యాపకులు బుధవారం ఆంధ్రవిశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర హెర్బేరియం, మ్యూజియం, బొటానికల్ గార్డెన్‌లను సందర్శించారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య డి.సంధ్య దీపిక వారికి స్వాగతం పలికి ఆయా విభాగాల ప్రత్యేకతల గురించి వివరించారు. హెర్బేరియం, మ్యూజియం క్యూరేటర్ జె.ప్రకాశరావు అంతరించిపోతున్న మొక్కల ప్రాముఖ్యత, వాటి సంరక్షణకు చేపడుతున్న విధానాలను వివరించారు.

జెన్‌జీలకు అందుబాటులో ఆధునిక తపాలా సేవలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీసీఎంఎస్) విభాగం సెమినార్ హాల్‌లో బుధవారం డీసీఎంఎస్, తపాలాశాఖ సంయుక్తంగా 'ఇన్నోవేషన్ జెన్ జీ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి అధ్యక్షత వహించారు. తపాలా శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొని జనరేషన్ జడ్ కోసం రూపొందిస్తున్న ఆధునిక సేవలు, డిజిటల్ అవకాశాలు, ఇన్నోవేటివ్ పరిష్కారాలను వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ పి.కోమల్ కుమార్ మాట్లాడుతూ 'జనరేషన్ జెడ్ హ్యాంగ్ అవుట్' కార్యక్రమం ద్వారా యువతకు అందుబాటులో ఉన్న డిజిటల్ పోస్టల్ సేవలు, ఫైనాన్షియల్ టెక్నాలజీలు, ఆన్‌లైన్ అవకాశాలపై అవగాహన పెంచుతాయన్నారు. క్యూఆర్ ఆధారిత సేవలు, డిజిటల్ పేమెంట్స్, డోర్‌స్టెప్ బ్యాంకింగ్ వంటి కొత్త సేవలను 'జెన్ జెడ్' తరానికి చేరువ చేస్తున్నట్లు చెప్పారు. తపాలాశాఖ అధికారులు ఎన్.రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

కోమల్ కుమార్‌ను సత్కరిస్తున్న ఆచార్య జాలాది రవి తదితరులు

ఘనంగా ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రంలో బుధవారం ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఇగ్నో లక్షలాది మంది విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఉన్నతవిద్యను అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు సంచాలకులు డాక్టర్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ధర్మారావు తదితరులు

బాలల హక్కుల కమిషన్‌ను నియమించాలని వినతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బాలల హక్కుల కమిషన్ గడువు ముగిసి సుమారు 8 నెలలైనా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోలేదని రైట్ టు ఎడ్యుకేషన్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి లేఖ రాసినట్లు చెప్పారు. కమిషన్ లేకపోవడంతో బాలలు హక్కులు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంపై మహిళా శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎ.సూర్యకుమారికి కూడా లేఖ పంపినట్లు పేర్కొన్నారు.

రోడ్డుపైకి వ్యర్థాలు.. బడిలోకి దుర్గంధం..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద చెత్తకుండీ నిండిపోయి వ్యర్థాలు కిందకు చేరాయి. అవి కుళ్లిపోయి వస్తున్న దుర్వాసనకు తరగతి గదులలో ఉండలేకపోతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణ వ్యాధులైన జ్వరం, జలుబు, దగ్గు లాంటి వ్యాధులు వస్తున్నందున అధికారులు స్పందించి చెత్తకుండీలలో వ్యర్థాలను సకాలంలో తొలగించాలని కోరుతున్నారు.

తోటగరువు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద..

డీఫార్మసీలో 20మందికి ప్రవేశాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. మొత్తం 27 సీట్లకు గాను 20 భర్తీ అయ్యాయి. రిజర్వేషన్ కోటాలో కొన్ని మిగిలి ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు ఎం.ఎ.వి.రామకృష్ణ ధ్రువపత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్ని ప్రమాదం

ఆరిలోవ, న్యూస్‌టుడే: పాత ఆరిలోవ బీసీ కాలనీ కొండపైన ఓ ఇంట్లో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని, వెంటనే ఇంటికి విద్యుత్తు సరఫరా నిలిపివేశామని ఆరిలోవ విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ రవికుమార్ తెలిపారు. యజమానులు కె.ఈశ్వరరావు, లక్ష్మి దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. లోపలి నుంచి పొగలు వస్తుండటంతో చుట్టుపక్కల నివాసితులు గుర్తించి వారికి సమాచారం ఇచ్చారు. తలుపులు తీసి చూడగా దుస్తులు, మంచం, పరుపు, టీవీ, ఫ్యాన్లు కాలిపోయి కనిపించాయి. రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ వీఆర్‌ఓను ఘటనా స్థలానికి పంపారని స్థానిక నాయకులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దుస్తులు, సామగ్రి

ద్విచక్ర వాహనాల స్వాధీనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. వలయంలా ఏర్పడి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులు తప్పించుకోలేని విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మద్యం విక్రయాలు, గంజాయి నిల్వలపై అనుమానంతో సిద్ధార్థనగర్ ప్రాంతంలోని పలు ఇళ్లల్లో సోదాలు చేశారు. స్వాధీనం చేసుకున్న 8 వాహనాల్లో ఐదింటికి రికార్డులు చూపించడంతో విడిచిపెట్టామని సీఐ పైడయ్య తెలిపారు. మూడు వాహనాలకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలతో పోలీసులు

23న గురు వైభవం వేదాంత శ్రవణం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: శ్రీశృంగేరి శారదా పీఠం అనుబంధ సంస్థ అహం బ్రహ్మాస్మి ఆధ్వర్యంలో ఈనెల 23న ఎంవీపీకాలనీ తి.తి.దే. కల్యాణ మండపంలో గురువైభవం వేదాంత శ్రవణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త అవసరాల సంపత్ తెలిపారు. బుధవారం కల్యాణ మండపం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 23న సాయంత్రం 5గంటలకు ప్రవచనం జరుగుతుందన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి హాజరవుతారన్నారు. ఆసక్తిగలవారు 95022 38017 ఫోన్ నెంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అవసరాల సంపత్ తదితరులు

సెమిస్టర్ పరీక్షల తనిఖీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఆర్ట్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు బుధవారం తనిఖీ చేశారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం పాల్గొన్నారు.

భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : బాలికలు ఆవేశంలో కలిగే భావోద్వేగాలను అదుపులో పెట్టుకుని మానసికంగా దృఢంగా ఉండాలని మనస్తత్వవేత్త పద్మజ సూచించారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా గ్రామీణ తహసీల్దారు కార్యాలయం పక్కన గల బాలికల గృహంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలు సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం క్షయవ్యాధిపై అవగాహన కల్పించి వ్యక్తిగత శుభ్రత, ఆహార నియమాల గురించి వివరించారు. పర్యవేక్షణాధికారిణి నయోమి, సకల్య ఎన్జీఓ ప్రతినిధులు వి.వీరబ్రహ్మం, యు.అప్పలకృష్ణ, మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మనస్తత్వవేత్త పద్మజ

సైబర్ నేరం.. వ్యక్తి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: సైబర్ మోసాల ద్వారా కొల్లగొట్టిన నగదును మ్యూల్ ఖాతాల ద్వారా బయటకు తీసి వాటిని క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకు అందించిన వ్యక్తిని ఎండాడ సైబర్ క్రైం స్టేషన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఆ వివరాలిలా.. నగరానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ ముఠా సభ్యుల మోసానికి బలై మూడు బ్యాంకు ఖాతాలకు రూ.కోటి బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయిన విషయం తెలుసుకుని ఈ ఏడాది జులై నెలలో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టగా.. తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు చెందిన లక్కాకుల మనోజ్(23)ను ఈ నేరంలో భాగస్వామిడిగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు.

మనోజ్ వేర్వేరు యాప్‌ల ద్వారా ట్రేడింగ్ చేస్తున్నప్పుడు కొంతమందితో పరిచయం ఏర్పడింది. అధిక నగదుకు ఆశ పడి వారి వలలో పడ్డాడు. వారి సూచనల మేరకు తప్పులు చేసేవాడు. ప్రస్తుతం ఇతడి ఖాతాలో సుమారు రూ.8 కోట్ల వరకు నగదు లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దుబాయ్‌లో ఉన్నట్లు తెలిసిందని, ఇతడికి సహకరించిన మరో ఇద్దరిని కూడా ఇక్కడికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

(c) eenadu

బాలికలకు స్వీయ రక్షణపై శిక్షణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీ ఉన్నత పాఠశాలలో బాలికలకు స్వీయ రక్షణపై శిక్షణ ఇచ్చారు. బుధవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా హెచ్‌ఎం రాధాకుమారి ఆధ్వర్యంలో బాలికలకు మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొక్క శ్రావణి, తెదేపా అధ్యక్షుడు కిశోర్‌కుమార్, శిక్షకుడు యోగేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణి, హెచ్‌ఎం రాధాకుమారి, తదితరులు

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

డీఫార్మసీలో 20 మందికి ప్రవేశాలు

కంచరపాలెం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. మొత్తం 27 సీట్లకుగాను 20 భర్తీ అయ్యాయి. రిజర్వేషన్ కోటాలో కొన్ని మిగిలి ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్నకుమార్, స్టూడెంట్ అఫైర్స్ అధ్యక్షుడు ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న దృశ్యం

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

న్యూస్‌టుడే, జ్ఞానాపురం: ?: జీవీఎంసీ 41వ వార్డు వడివిద్య వీధిలోని 200బి/6 విద్యుత్తు స్తంభంపై దీపం 15 రోజులుగా వెలగడం లేదు. –ప్రాన్సిస్, జ్ఞానాపురం ✓: సిబ్బందిని పంపి, తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. –సంతోష్, జీవీఎంసీ విద్యుత్తు అధికారి.

న్యూస్‌టుడే, అల్లిపురం: ?: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోటలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ఒంటరిగా నడిచి వెళ్లే వారిపై తరచూ దాడులు చేస్తున్నాయి. –నాగేశ్వరరావు, కొబ్బరితోట ✓: వెంటనే కుక్కల్ని పట్టించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. –డాక్టర్ కృష్ణారావు, ఏఎంఓహెచ్.

న్యూస్‌టుడే, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 37వ వార్డు జాలారిపేట రామాలయం సమీప భూగర్భడ్రైనేజీ నుంచి మురుగు లీకవుతుండంతో, తీవ్ర దుర్వాసన వస్తుంది. –అప్పన్న, స్థానికుడు ✓: పరిశీలించి, శుభ్రత పనులు చేయిస్తాం. – నవీన్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

న్యూస్‌టుడే, మురళీనగర్: ?: 49వ వార్డు అయ్యప్పనగర్‌లో 87/2/6 నెంబరు స్తంభానికి ఉన్న వీధి దీపం ఆరు నెలలుగా వెలగడం లేదు. – రాజగోపాలరావు, స్థానికుడు ✓: వీధి దీపాన్ని పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – అర్జున, విద్యుత్ ఏఈ.

న్యూస్‌టుడే, మాధవధార: ?: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ ప్రధాన రహదారిలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. –ఎం.అప్పారావు, స్థానికుడు ✓: వెంటనే సిబ్బందిని పంపి శుభ్రత చర్యలు చేపడతాం. –వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

పోలీసుల గస్తీ ఏర్పాటు

–న్యూస్‌టుడే, జగదాంబకూడలి: జీవీఎంసీ 29వ వార్డు కోడిపందాల వీధిలో పార్కింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనాల్లోంచి గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో పెట్రోల్ చోరీ చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ అంశంపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఒకటో పట్టణ సీఐ వరప్రసాద్ స్పందించారు. ఆ ప్రాంతంలో రాత్రి గస్తీని ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ వినియోగం.. తీవ్ర అనర్థం..!

నామమాత్ర తనిఖీలతో సరి పెడుతున్న జీవీఎంసీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఇటీవల నగరంలో ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. ఒక్కసారి వాడిన తర్వాత వృథాగా పడేసే వస్తువుల వ్యర్థాలన్నీ తీరంలోకి చేరి, సముద్ర జీవులకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ...

ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ప్లాస్టిక్ వినియోగించినందుకు అపరాధ రుసుం విధిస్తున్నారు. అంతకుమించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వ్యాపారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు.

ఆ చర్యలేవీ..?: గతంలో నగరంలో ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు అమలు చేశారు. వస్త్ర సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా ఉన్న వాటిని నగరవాసులకు పరిచయం చేశారు. హోటళ్లలోను ప్లాస్టిక్ సంచుల్లో ప్యాకింగ్ నిషేధించారు. ఇప్పుడు నగరంలో అలాంటి చర్యలేవీ కనిపించక పోవడంతో, పరిస్థితి మొత్తం మారిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను జీవీఎంసీ అధికారులు నగరంలో అమలు చేయకపోవడంతో సమస్య తీవ్రత పెరుగుతుంది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి... ప్లాస్టిక్ వినియోగించే వారికి భారీగా జరిమానాలు విధించాలి, ఒకటికి రెండుసార్లు పట్టుబడితే వ్యాపార లైసెన్సులు రద్దు చేయాలని, ఆ బాధ్యతలను పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లకు అప్పగించి, తరచూ తనిఖీలు చేయించాలని పర్యావరణహితులు కోరుతున్నారు.

రోజూ ఇలా చేస్తే..

➤ నగరంలో ఇటీవల నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో పర్యావరణహితమైన వస్తువులను మాత్రమే వినియోగించారు. రాసే పెన్నుల నుంచి తాగే టీ కప్పుల వరకు అన్నీ పర్యావరణహితమే. జీరో ప్లాస్టిక్ సమ్మిట్‌గా నిర్వహిస్తామని స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ ముందుగానే ప్రకటించగా, అందుకు అనుగుణంగా సదస్సు నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

➤ సదస్సు ఆవరణలో ఉత్పత్తి అయిన చెత్తను అక్కడికక్కడే తడి, పొడి చెత్తగా విభజించారు. తడి చెత్తను వర్మీకంపోస్టు తయారీ కేంద్రానికి, పొడి చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించారు. ఇప్పటి వరకు నిర్వహించిన సదస్సుల్లో తొలిసారిగా జీరో ప్లాస్టిక్ వేస్టేజ్‌గా విశాఖలో నిర్వహించిన సదస్సు నిలిచింది. ఇలాంటి చర్యలు నిత్యం నగరంలో అమలు చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భద్రత ఏర్పాట్లపై సీపీ ఆరా

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నెల రోజుల పాటు నిర్వహించే మార్గశిర మాసోత్సవాల్లో పటిష్ఠమైన భద్రతా ప్రణాళిక ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ సూచించారు. బుధవారం ఆయన డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ కాళిదాసు, ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ తదితరులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. స్థానిక సీతారామస్వామి ఆలయం వద్ద కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, డ్రోన్‌తో పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. ఆలయ ఈఓ శోభారాణి, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

★ ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక దర్శన క్యూలైన్లతో పాటు, ఉచిత దర్శనాల క్యూలైన్లు టౌన్ కొత్తరోడ్డు నుంచి ప్రారంభమై, రీడింగ్ రూం మీదుగా ఆలయం వరకు కొనసాగుతాయని ఈఓ ప్రకటనలో తెలిపారు. ప్రోటోకాల్ దర్శనాల క్యూలైన్లు మాత్రం విక్టోరియా ఆసుపత్రి నుంచి మొదలవుతాయన్నారు. టౌన్ కొత్తరోడ్డు, రీడింగ్ రూం, విక్టోరియా ఆసుపత్రి వద్ద చెప్పులు భద్రపరుచుకునే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఆలయ అధికారులకు సూచనలు ఇస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

★ ఆలయ ఆవరణలో ఉన్న 6వ నంబరు హుండీ పొంగి పొర్లుతుండడంతో హుండీని తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. నగదు రూపంలో రూ.37,269 లభించిందని ఈఓ శోభారాణి తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఆస్తి పన్ను వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన రెవెన్యూ ఉప కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జోన్ల వారీగా బకాయిలపై కమిషనర్ ఆరా తీశారు. ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీవీఎంసీ వాణిజ్య సముదాయాల నుంచి అద్దెలు సకాలంలో వసూలు చేయాలన్నారు. అలాగే ప్రతి జెడ్సీ రూ.2 లక్షల వరకు నిధులు ఖర్చు చేసేలా ఉత్తర్వులు ఇచ్చామని, అత్యవసర సమయంలో వాటిని వినియోగించాలన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్, చిత్రంలో శ్రీనివాసరావు

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సీతంపేట, న్యూస్‌టుడే : సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం సాయంత్రం దామోదర కార్తిక దీపోత్సవం నిర్వహించారు. పలువురు మహిళలు హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

గోతులు.. జనం బెంబేలు..!

అల్లిపురం, న్యూస్‌టుడే : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా మారడంతో, నిత్యం రాకపోకలు సాగించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పలువురు చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిధులు ఖర్చయినా..?

» ఇటీవల వర్షాలకు అల్లిపురం, చావలమదుం, కొబ్బరితోట, అచ్చియమ్మపేట తదితర ప్రాంత రహదారుల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

» కొన్నాళ్ల కిందట ఎక్కడికక్కడ గోతులు పూడ్చడానికి జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ. కోట్లలో నిధులు ఖర్చు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరమ్మతులు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది.

చావలమదుం కూడలిలో..

రాకపోకలకు తప్పని అవస్థలు

» చావలమదుం ప్రాంతంలో ఎక్కువగా హోటళ్లు ఉండటంతో, వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చిన వారు బస చేస్తున్నారు. వారంతా రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..!

★ జ్ఞానాపురం సమీప రావులపల్లి వీధి నుంచి బాబూజగ్జీవన్‌రామ్ కూడలికి వెళ్లే మార్గంలో గోతులు ఏర్పడ్డాయి. ★ చావులమదుం మూడురోడ్ల కూడలిలో ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. ★ నేరెళ్లకోనేరు ప్రాంతం నుంచి రామకృష్ణకూడలికి వెళ్లే దారిలో ప్రతి అడుగుకో గుంత ఉండడంతో స్థానికులు, వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ★ అల్లిపురం నుంచి డాల్ఫిన్‌హోటల్ కూడలికి వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది.

" **మరమ్మతులు చేయిస్తాం..:** నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తున్నాం. గుంతల వివరాలు సేకరించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపిస్తాం. నిధులు విడుదల కాగానే, మరమ్మతు పనులు చేయిస్తాం. –ఎం.మల్లయ్యనాయుడు, జెడ్సీ

సామాన్య భక్తులకు పెద్దపీట

మార్గశిర మాసోత్సవాల గోడపత్రిక విడుదల

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 21 నుంచి వచ్చే నెల 19 వరకే నిర్వహించే మార్గశిర మాసోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని ఆలయ ఈఓ కె.శోభారాణి వెల్లడించారు. బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు అమ్మవారి ఉత్సవాలు సంప్రదాయంగా ప్రారంభిస్తామన్నారు. 27న తొలి గురువారం పూజలు, డిసెంబరు 18న ఆఖరి గురువారాన్ని పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కలెక్టర్, నగర పోలీసు కమిషనర్ సూచనల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. డిసెంబరు 7న వేద, అర్చక సదస్సు, 13న రథ యాత్ర, 18న సహస్రఘటాభిషేకం ఉంటాయన్నారు. అనంతరం ఉత్సవాల గోడపత్రికను విడుదల చేశారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ డీడీ కె.సదారావు, ఈఈ సీహెచ్.వెంకటరమణ, ఏఈఓ రాజేంద్ర కుమార్, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ప్రదర్శిస్తున్న ఈఓ శోభారాణి, ఈఈ రమణ, ఏఈఓ రాజేంద్రకుమార్ తదితరులు

● బాధ్యతల స్వీకరణ



సీతంపేట, న్యూస్‌టుడే : ఏపీఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా (అదనపు బాధ్యతలు) చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.హరిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను సంస్థ ఉద్యోగులు అభినందించారు.

పక్కాగా జనాభా గణన ప్రక్రియ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలో జరుగుతున్న జనాభా గణన ప్రక్రియకు ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ భీమిలి జోన్ మూడోవార్డు రెల్లివీధిలో ఆయన పర్యటించి గణన తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రయోగాత్మకంగా భీమిలి జోన్‌లోని 2, 3 వార్డుల్లో ఎన్యూమరేటర్ల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిచ్చి ఇళ్ల వద్దకు వచ్చే వాహనాలకు చెత్త అందించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. జనాభా గణన డిప్యూటీ డైరెక్టర్ ఎస్.దయాసాగర్, జిల్లా ఇన్‌ఛార్జి పి.రేవతి, భీమిలి జెడ్సీ వి.అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

★ ఇటీవల అభివృద్ధి చేసిన గాడువీధి శ్మశానవాటికను కమిషనర్ కేతన్‌గార్గ్ పరిశీలించి చేపట్టిన పనుల నాణ్యతపై ఆరా తీశారు. త్వరలో ఇక్కడ మరణాల నమోదు, ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిర్వహించేందుకు శానిటేషన్ కార్యదర్శికి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. తర్వాత కస్బూర్బా పాఠశాల రోడ్డును పరిశీలించారు.

'ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయించాలి'

అల్లిపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వం అరెస్టు చేసిన మావోయిస్టులను వెంటనే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.వి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో బుధవారం వివిధ ప్రజా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ముందుగా అదుపులోకి తీసుకున్న వారినే, ఎంపిక చేసి మరీ చంపేశారని ఆరోపించారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్రం, ముందుగా తేదీలను ప్రకటించి మరీ మావోయిస్టులను అంతం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు చంద్రశేఖర్, విష్ణువర్ధనరావు, కె.పద్మ, తిరుపతిరావు, అన్నపూర్ణ, లక్ష్మి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

అభివృద్ధి పనులకు విన్నపం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : దక్షిణం పరిధిలో అభివృద్ధి పనులు చకచకా సాగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గానికి ఇప్పటికే కేటాయించిన పనులు ప్రారంభించేలా చూడాలని, మంజూరైన పనులకు టెండర్లు ఆహ్వానించేలా ఇంజినీర్లను ఆదేశించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతి అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డిసెంబరు 12 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : డిసెంబరు 12 నుంచి 14 వరకు తిరుపతిలో నిర్వహించే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 25వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం జగదాంబకూడలి సిటూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాసభల గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్సిటీల్లో అధ్యాపకుల ఖాళీల భర్తీకి, విద్యార్థుల వసతి గృహాల ఆధునికీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం సభ్యులు ఎల్‌జే.నాయుడు, వెంకటరమణ, కుసుమాంజలి, నరేష్, నిఖిల్, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నేటి యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి లావణ్య సూచించారు. బుధవారం కళాశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి లావణ్య, తదితరులు

మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

'ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలి'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేయాలే గాని, కార్మికులపై నిందలు మోపడం సరికాదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. బుధవారం జగదాంబకూడలి సమీప సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని కోరుతున్న రాష్ట్ర ప్రభుత్వం, విశాఖ ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికైనా ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం కార్యదర్శి జగ్గునాయుడు, జిల్లా కమిటీ సభ్యుడు పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు 'కెరీర్ గైడెన్స్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆర్.మంజుల మాట్లాడుతూ... కళాశాల స్థాయిలో ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు గ్రామీణాభివృద్ధితో పాటు స్వీయ అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్ అభియాన్ రీజినల్ కో-ఆర్డినేటర్ పావని పలు అంశాలపై మాట్లాడారు. రిసోర్స్‌పర్సన్ కె.జనార్దన్, కో-ఆర్డినేటర్ బి.రాధమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మంజుల

సాయం చేయాలని వినతి

కలెక్టరేట్ వద్ద బాధిత కుటుంబీకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కిడ్నీ రాకెట్‌లో చిక్కుకుని ఇటీవల మృతి చెందిన యమున కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యమున తల్లి బోస సూరమ్మ మాట్లాడుతూ... కుటుంబానికి ఆర్థికసాయం అందజేయడంతో పాటు, యమున కుమారుడిని ప్రభుత్వమే చదివించాలని కోరారు.

● సేవలు మరువలేనివి

అల్లిపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 34వ వార్డు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వాసుపల్లి మసేన్ సేవలు మరువలేనివని, గత ఎన్నికల్లో కూటమి విజయానికి ఆయన ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మసేన్ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి అర్పించారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట, న్యూస్‌టుడే : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి చిన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కవి, సాహితీవేత్త డాక్టర్ సాధనాల వెంకటస్వామినాయుడు ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాలపై ప్రసంగించారు. గౌరవ అతిథిగా డాక్టర్ డీవీ.సూర్యారావు, ఇతరులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి నాయుడు

ఉత్తరాంధ్ర మేధావులకు అవకాశం ఇవ్వాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడిగా ఎంపికైన ఎం.ఆదినారాయణను వెంటనే తొలగించాలని పాతనగరంలోని అమర్‌నగర్ పులే సేవా సంఘం అధ్యక్షుడు ఎన్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గొల్లలపాలెం దుర్గాదేవి ఆలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆదినారాయణను తొలగించి, ఉత్తరాంధ్రలో ఉన్న మేధావులు, విద్యావంతుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలన్నారు. సంఘం సభ్యులు పి.రోజా, గంగ, ఆర్.దేవి, చిన్నశివ, లక్ష్మణరావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరం.. వ్యక్తి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: సైబర్ మోసాల ద్వారా కొల్లగొట్టిన నగదును మ్యూల్ ఖాతాల ద్వారా బయటకు తీసి వాటిని క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకు అందించిన వ్యక్తిని ఎండాడ సైబర్ క్రైం స్టేషన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఆ వివరాలిలా..నగరానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ ముఠా సభ్యుల మోసానికి బలై మూడు బ్యాంకు ఖాతాలకు రూ.కోటి బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయిన విషయం తెలుసుకుని ఈ ఏడాది జులై నెలలో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టగా.. తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు చెందిన లక్కాకుల మనోజ్(23)ను ఈ నేరంలో భాగస్వాముడిగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు.

మనోజ్

మనోజ్ వేర్వేరు యాప్‌ల ద్వారా ట్రేడింగ్ చేస్తున్నపుడు కొంతమందితో పరిచయం ఏర్పడింది. అధిక నగదుకు ఆశపడి వారి వలలో పడ్డాడు. వారి సూచనల మేరకు తప్పులు చేసేవాడు. ప్రస్తుతం ఇతడి ఖాతాలో సుమారు రూ.8 కోట్ల వరకు నగదు లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దుబాయ్‌లో ఉన్నట్లు తెలిసిందని, ఇతడికి సహకరించిన మరో ఇద్దరిని కూడా ఇక్కడికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్ బలవన్మరణం!

మాధవధార, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. 104 ఏరియా బాపూజీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ పిట్ట మురళీ (32) వివాహితుడు. మనస్పర్థల కారణంగా భార్యాభర్తలిద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో మురళీకి మరో మహిళతో పరిచయం ఏర్పడి కొంత కాలంగా ఆమె ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వీరిరువురికి మధ్య వాగ్వాదం తలెత్తడంతో ఇద్దరూ వేర్వేరు గదుల్లో నిద్రించారు. కాగా..బుధవారం తెల్లవారుజామున మురళీ ఉరేసుకొని కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

★ తన కుమారుడిని హత్య చేసి, ఆత్మహత్యగా చెబుతున్నారని మురళీ తల్లి ఆరోపిస్తోంది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామిని బుధవారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జీపీ రాజశేఖర్ దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-8 వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తకాలు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు, వివిధ దేశాల కరెన్సీ, స్టాంపుల ప్రదర్శనను కాలనీవాసులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పర్యవేక్షకులు ఎన్.బుచ్చయ్య, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మురళీనగర్, న్యూస్‌టుడే : స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు కుర్చీలాట పోటీలు నిర్వహించారు. విజేతలు ఎస్.పావని, ఎం.శరణ్య, వి.నీలిమ, పి.జాహ్నవి, ఎస్.చైతన్య, డి.హాసినిలకు గురువారం బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారిణి వై.పద్మజ తెలిపారు.

(c) eenadu

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జీవీఎంసీ 74 వార్డులోని దయానందనగర్‌లో 80 మంది పారిశుద్ధ్య కార్మికులకు 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, జోన్-6 ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ వస్త్రాలను పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేశారు. శానిటేషన్ అధికారి నవరత్నం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు వీటిని కార్మికులకు అందించారు. జీవీఎంసీ 63వ వార్డులో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను అందజేశారు.

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు పరిధిలోని గణపతినగర్ సామాజిక భవనం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ వస్త్రాలు పంపిణీ చేశారు. కార్మికులకు ఇంతవరకు ఏ ప్రభుత్వం వస్త్రాలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అందించడాన్ని వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంత ఆశీలు వేలం పాటకు ఏర్పాట్లు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి కూడలిలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న సంతలో వ్యాపారుల నుంచి ఆశీలు వసూలుకు సంబంధించి వేలం పాట నిర్వహణకు ఏర్పాట్లు చేశామని శ్రీ జగన్నాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిణి పద్మావతి తెలిపారు. రెండేళ్ల కాలపరిమితో కూడిన వేలంలో పాల్గొనేవారు ఈనెల 21న ఆలయం వద్ద టెండర్ దాఖలు చేయవచ్చన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం ఆంజనేయ, పీడీలు సుజాత, రఘు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : మిందిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీలు సుజాత, రఘు తెలిపారు. వడ్లపూడిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 14 ఏళ్లలోపు విభాగంలో అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 30న అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. అక్కడ రాణించి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తేవాలని హెచ్ఎం కోరారు.

సేవలు అంతంతమాత్రమే..
ఎఫ్ఆర్‌యూ చుట్టూ సమస్యలే..

న్యూస్‌టుడే, సింధియా : పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురంలో ఉన్న ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్.ఆర్.యు.) సేవలు రోగులకు అరకొరగానే అందుతున్నాయి. గతంలో నమోదైన ఓపీకి.. ఇప్పటి ఓపీకి చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. ఆసుపత్రి సేవలు ఎలా ఉన్నాయనడానికి క్రమంగా తగ్గిపోతున్న ఓపీలే చెప్పాలి అంటున్నారు.

తగ్గిపోతున్న ఓపీలు..: గతంలో మనమున్నట్లు గుల్లలపాలెం ఎఫ్.ఆర్.యు. గతంలో ఎన్టీపీ సంస్థలు, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధీనంలో ఉన్నప్పుడు రోగులకు మంచి సేవలు అందేవి. అప్పుడు సోమవారం 200 ఓపీలు నమోదయ్యేవి. మామూలు రోజుల్లో ఈ ఓపీ 150గా ఉండేది. ఇప్పుడు సోమవారం సుమారు 50 ఓపీలు నమోదవుతుండగా.. మిగతా రోజుల్లో ఆ సంఖ్య ఇంకా తగ్గిపోతుందని సమాచారం.

పనిచేయని సీసీ కెమెరాలు

స్పెషలిస్టులు లేరు : ఎఫ్.ఆర్.యు.లో గతంలో స్పెషలిస్టు డాక్టర్లు ఉండేవారు. ఇప్పుడు ఒక్క డెంటిస్ట్ తప్ప ఇతర డాక్టర్లు లేరు. ముఖ్యంగా ఆడవారికోసం గైనిక్ వైద్యురాలు ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. ఇప్పుడు గైనిక్ లేకపోవడం వల్ల మహిళలు ఇక్కడకు రావడం లేదు. ఆరిలోవ ఆసుపత్రిలో గైనిక్ వైద్యురాలు ఉండటం వల్ల పెద్దసంఖ్యలో గర్భిణులు ఈ ఆసుపత్రి సేవలు వినియోగించుకుంటున్నారు. సోమవారం ఈ ఆసుపత్రికి మహిళలు బారులు తీరి ఉంటారు.

కొత్త బాధ్యతలన్నారు..: ఈ ఆసుపత్రిని ప్రస్తుతం గోపాలపట్నం చెందిన ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం నిర్వహిస్తోంది. మూడేళ్లుగా ఈ యాజమాన్యమే నిర్వహిస్తుండగా.. ఇటీవల పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఓ కార్పొరేట్ సంస్థ తీసుకుంటుందని చర్చ జరిగింది. ఆ తర్వాత ఏమైందో తెలియదు. అయితే ఆసుపత్రి నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ చేతిలోనే ఉంచాలని కార్మిక సంఘాలు, స్థానిక సంఘాలు కోరుతున్నాయి.

సౌకర్యాలు లేవు.. సేవలు లేవు..

■ ఈ ఆసుపత్రిలో వైద్యులు మినహా మొత్తం 17 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రతి నెలా జీతాల రూపంలో రూ.2.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వీరికి నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఆసుపత్రిని నిర్వహిస్తున్న సంస్థకు నెలకు రూ. 8 లక్షలు జీవీఎంసీ బిల్లు చెల్లిస్తుంది. మరి సిబ్బందికి జీతాలు ఎందుకు అందడం లేదో ప్రశ్నార్థకంగా ఉంది.

■ వైద్యులు రోగులను చూశాక మందులు రాస్తారు. అయితే నాలుగు రకాల మందులు రాస్తే రెండు రకాల మందులు మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయని రోగులు చెప్తున్నారు. బయట డబ్బులు పెట్టి కొనక తప్పటం లేదని అంటున్నారు.

■ డిజిటల్ ఎక్స్‌రే యంత్రం ఉన్నా ఉపయోగంలోకి తేవడం లేదు. దీనివల్ల రోగులు బయటకు వెళ్లి డబ్బులు పెట్టి ఎక్స్‌రే తీయించుకోవాల్సి వస్తోంది.

■ ఆసుపత్రిలో ల్యాబ్ ఉన్నా.. అన్ని రకాల పరీక్షలు జరగడం లేదని తెలుస్తోంది. జ్వరాల టెస్టులు బయటకు వెళ్లక తప్పడం లేదని అంటున్నారు.

■ సీసీ కెమెరాలు ఉన్నా పని చేయడం లేదు.

రేపు మెగా జాబ్ మేళా

సింధియా, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 25 కంపెనీల యాజమాన్య ప్రతినిధులు అభ్యర్థుల ఎంపిక చేయనున్నారన్నారు. నిరుద్యోగులు దీనిని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

కరాస: కార్తీకమాసం సందర్భంగా 52వ వార్డు పాతకరాసలో ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వరాలయంలో బుధవారం కార్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీదేవి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

WANTED TEACHERS
❖ALL SUBJECT TEACHERS
From Class 3 to 10th Class
❖TRANSPORT FACILITY FOR TEACHERS
Around Gajuwaka 5 Km Radius
SIDDARDHA'S FUTURE RISE WORLD
ENGLISH MEDIUM SCHOOL
SHIVAJI NAGAR, SIMHAGIRI COLONY
Gajuwaka. Ph: 9290738909

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య : చినగంట్యాడ జగ్గుసెంటర్ నుంచి వై.జంక్షన్‌కు వెళ్లే దారంతా గుంతలతో అధ్వానంగా ఉంది. అటుగా వెళ్లే వాహనాలు పడిపోతున్నాయి. –సుబ్రహ్మణ్యం, కిరణ్, కర్నవానిపాలెం, **సమాధానం:** ఈ రహదారిని రూ.8 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. –శేషాద్రి, జెడీ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్రకాలనీ ప్రధాన కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. – ఎస్.కె.రెహమాన్, నాగేంద్రకాలనీ, ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ?: జీవీఎంసీ 52వ వార్డు పాతకరాసలో ఇంటింటా చెత్తసేకరణ చేపట్టడం లేదు. – రాము, పాత కరాస, ✔: ఇంటింటా చెత్తసేకరణ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెద్ద గెడ్డలో పూడికతీత

స్పందనకు వందనం

గాజువాక(భరత్‌నగర్), న్యూస్‌టుడే : గాజువాక 76వ వార్డు భరత్‌నగర్-నడుపూరు ప్రధాన గెడ్డలో ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపట్టారు. 'ఈనాడు' 'మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి ప్రజలు పూడిక సమస్యను తీసుకురాగా సంబంధిత అధికారులు రంగంలోకి దిగి జేసీబీ సాయంతో వ్యర్థాలను తొలగించారు.

ఇందిర సేవలు ఆదర్శనీయం

ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముత్యాలు, తదితరులు

సింధియా, న్యూస్‌టుడే : మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ అందించిన సేవలు ఆదర్శంగా నిలిచాయని సెయింట్ ఆన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. బుధవారం గ్రంథాలయంలో నిర్వహించిన ఇందిర జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నోడల్ అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, పాఠకులు పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే: ఇందిరా గాంధీ జయంతిని బుధవారం గాజువాక కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు ముఖ్యఅతిథిగా హాజరై ఇందిర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా, పట్టణ కమిటీ ప్రతినిధులు యరబాల భూలోక, వీరుబాబు, అప్పారావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే

గాజువాక, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం కింద గాజువాక ప్రాంతానికి చెందిన 459 మంది లబ్ధిదారులకు రూ.34 లక్షల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నగర తెదేపా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ అమల, కూటమి నాయకులు మొల్లి పెంటిరాజు, ములకలపల్లి పెంటయ్య, ప్రకాశ్, వరలక్ష్మి, అనిత, డైరెక్టర్ రాంబాయి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా, కూటమి నాయకులు కోన, కరణంరెడ్డి తదితరులు

బ్రహ్మోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

గాజువాక, న్యూస్‌టుడే : తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గాజువాక కళారాధన మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నృత్యాలతో అలరించారు. నాట్యాచార్యుడు డాక్టర్ తాళ్లపాక సందీప్‌కుమార్ పర్యవేక్షణలో 22 మంది బాలికలు వేంకటేశ్వర వైభవం, శ్రీవారి కల్యాణం, అన్నమయ్య కీర్తనలతో మాడ వీధుల్లో ప్రదర్శనలిచ్చారు. తితిదే కమిటీ ప్రతినిధులు చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

LOSS OF PASSPORT
I, **MURA GLORY**, D/o. Geddam Soma Raju, Resident of kakaralova, Gandhigram, Scindia,Visakhapatnam- 530005, I have lost my **Passport No. M2648656** while Shifting my house on way from old house Scindia towards Kakaralova New house on 29-10-2025. If anyone finds it please return to the above address Ph : **96767 92699**.

PUBLIC NOTICE
Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Madhurawada Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan to **SMT. JUMMU VASANTHA** W/o Busala Raju by keeping the below mentioned schedule property of **Mr. BUSALA RAJU** S/o Late B Demudu as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE IMMOVABLE PROPERTY
Visakhapatnam District, Gopalapatnam Sub-District, Greater Visakhapatnam Municipal Corporation Area, Gopalapatnam village accounts covered by S. No.25-2, Bapuji Colony Area, an extent of 53.9 Sq. yards or 45.06 Sq. meters of site together with RCC building with plinth area of 200 SFT bearing D. No.8-134, assessment No.1086405996 is measured and bounded by: **EAST:** CC Road - 27.6 feet or 8.41 meters; **SOUTH:** RCC building of Pilli Sujatha -17.6 feet or 5.36 meters; **WEST:** RCC building of Boddu Vara Lakshmi - 27.6 feet or 8.41 meters; **NORTH:** CC Road -17.6 feet or 5.36 meters

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar
Seethammadhara,
Visakhapatnam-13.
Visakhapatnam Mobile No.**9885166648**
Dt.18.11.2025. **Mail: sreenivaskoduri@gmail.com**

సత్యసాయి జయంత్యుత్సవాలు ప్రారంభం

సాయికృపా మందిరంలో చిత్రపటాల అలంకరణ

సాయిరాంనగర్ (గాజువాక), న్యూస్‌టుడే : కొత్తగాజువాక సాయిరాంనగర్‌లోని సాయికృపా మందిరంలో భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పీఠంపై బాబా చిత్రపటాలను సర్వాంగ సుందరంగా అలంకరించి సాయి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. కన్వీనర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంత వేడుక జరిపారు. జనరేషన్ యువ ఆధ్వర్యంలో అనాథ బాలలకు ఆహార పంపిణీ, నారాయణ సేవ నిర్వహించారు.

సామూహిక సీమంతాలు..

అక్కిరెడ్డిపాలెం: భగవాన్ సత్యసాయి 100వ జన్మదినోత్సవాల్లో భాగంగా తుంగ్లాం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పరిసర కాలనీల్లోని గర్భిణులకు సాయి భక్తులు సంప్రదాయబద్ధంగా సీమంతాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాకి శ్రీదేవి, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

సమస్యల పరిష్కారానికి కమిషనర్‌కు వినతి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డులోని ప్రధాన సమస్యలపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అలాగే జీవీఎంసీ 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష దంపతులు కమిషనర్‌ను కలిసి ముఖ్య సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక కాలనీలో శ్రీ వేంకటేశ్వర వైభవస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని సతకంపట్టు కూడలి వద్ద మహిళలు 2501 దీపాలు వెలిగించారు. పైడిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సమితి ప్రతినిధులు జి.సునీత, కన్యాకుమారి, లక్ష్మి, మంగ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవంలో పాల్గొన్న సమితి ప్రతినిధులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న నిత్యావసరాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు గణేశ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టిక, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. నెలవారీ సరకుల పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

PUBLIC NOTICE
Under the instructions of my client **M/s. SHRIRAM FINANCE LIMITED, DWARAKA NAGAR Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan **SMT. MALLA DEVI PRIYA** W/o Malla Parameswara Rao by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one has any claims, charges, mortgages, Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices, otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULES OF THE PROPERTY
Visakhapatnam District, Pedagantyada Sub-District, Gajuwaka Mandalam, Greater Visakhapatnam Municipal Corporation Area, Vadlapudi village accounts zeriothy dry land covered by S.No. 103/8 an extent of Ac.0.17 cents, S.No.103-9 an extent of Ac.0.46 cents, and S.No.103-4 an extent of Ac.0.18 cents totaling Ac.0.81 cents divided into house sites in which Plot No. 23 A an extent of 126 Sq.yards of 105.34 Sq. meters of vacant site nearby D.No.30-48-7 is measured and bounded by:

East: Plot No.24 site - 42 feet or 12.81 meters; **South:** Others vacant site - 27 feet or 08.23 meters; **West:** Remaining property of donor - 42 feet or 12.81 meters; **North:** 30 feet wide road - 27 feet or 08.23 meters.

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments,
Behind Rythu Bazar,
Seethammadhara,
Visakhapatnam-13.
VISAKHAPATNAM Dt.18.11.2025.
Cell No. **9885166648**
Mail: **sreenivaskoduri@gmail.com**

గంజాయి నిందితుల అరెస్టు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గంజాయి కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు నెలల వ్యవధిలో రెండు గంజాయి కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన నిందితులైన.. హుకుంపేటకు చెందిన జి.కార్తిక్(32), కోరాపుట్‌కు చెందిన బాబుల కొర్ర(30) పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. పరారీలో ఉన్న వీరు హుకుంపేట, జ్వాలాపుట్ ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు బుధవారం సి.ఐ. తెలిపారు.

కాలభైరవ స్వామికి మహాభిషేకం

వాంబేకాలనీ(పెదగంట్యాడ): వాంబేకాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కాలభైరవస్వామి వారికి కార్తిక అమావాస్య సందర్భంగా బుధవారం మహాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మంజుల, ఛైర్మన్ దొడ్డి రమణ పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సైబర్ నేరం.. వ్యక్తి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: సైబర్ మోసాల ద్వారా కొల్లగొట్టిన నగదును మ్యూల్ ఖాతాల ద్వారా బయటకు తీసి వాటిని క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకు అందించిన వ్యక్తిని ఎండాడ సైబర్ క్రైం స్టేషన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఆ వివరాలిలా.. నగరానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ ముఠా సభ్యుల మోసానికి బలై మూడు బ్యాంకు ఖాతాలకు రూ.కోటి బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయిన విషయం తెలుసుకుని ఈ ఏడాది జులై నెలలో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టగా.. తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేటకు చెందిన లక్కాకుల మనోజ్(23)ను ఈ నేరంలో భాగస్వామిడిగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు. మనోజ్ వేర్వేరు యాప్‌ల ద్వారా ట్రేడింగ్ చేస్తున్నపుడు కొంతమందితో పరిచయం ఏర్పడింది. అధిక నగదుకు ఆశపడి వారి వలలో పడ్డాడు. వారి సూచనల మేరకు తప్పులు చేసేవాడు. ప్రస్తుతం ఇతడి ఖాతాలో సుమారు రూ.8 కోట్ల వరకు నగదు లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దుబాయ్‌లో ఉన్నట్లు తెలిసిందని, ఇతడికి సహకరించిన మరో ఇద్దరిని కూడా ఇక్కడికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సైబర్ పోలీసులు పేర్కొన్నారు.

ఎస్‌టీబీఎల్‌లో సినిమాలు

స్క్రీన్-1: సంతాన ప్రాప్తిరస్తు, స్క్రీన్-2: కాంతార
స్క్రీన్-3: శివ, స్క్రీన్-4: ది గర్ల్‌ఫ్రెండ్

పడేలా ఉంది.. పట్టించుకోండి

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : ఎన్ఎస్‌టీఎల్ 80 అడుగుల రహదారిలో వంటిల్లు సమీపంలో కుడివైపు ఓ విద్యుత్తు స్తంభం రోడ్డు వైపు ఒరిగి ఉంది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరిగా నిలబెట్టాల్సిన అవసరం ఉంది.

తవ్వేసి.. ఇలా వదిలేసి..
దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే : కొత్తగాజువాక బీసీ రోడ్డులో ఇటీవల డ్రైనేజీపై అనధికార నిర్మాణాలను తొలగించిన జీవీఎంసీ అధికారులు ఆ తర్వాత సీసీ డ్రైనేజీ పనులను గాలికి వదిలేశారు. దీంతో మురుగు సమస్య మొదటికి వచ్చింది. హడావుడిగా తవ్వేసి తమపని కాదన్నట్లు మిన్నకుండడంతో దుకాణదారులు, ఇళ్ల యజమానులు అవస్థలెదుర్కొంటున్నారు. ఎందుకు తవ్వారో, ఎందుకు వదిలేశారో తెలియక దిక్కులు చూస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఇలా డ్రైనేజీ తవ్వకాల వల్ల బయటకు రాలేకపోతున్నామంటూ దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మలుపులో బిక్కుబిక్కు

హైస్కూలురోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే : కొత్తగాజువాక సాయిరామ్‌నగర్‌లో ప్రధాన మలుపు మార్గం ప్రమాదాలకు నిలయంగా తయారైంది. జోగవానిపాలెం నుంచి కొత్తగాజువాక వెళ్లే మెలికల దారి చెంతన డ్రైనేజీపై ఎలాంటి రక్షణగోడ లేదు. దీంతో వాహనదారులు వేగంగా రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారి విశాలంగా ఉన్నా డ్రైనేజీకి రక్షణ వ్యవస్థలేక పాఠశాల విద్యార్థులు కాలుజారి పడిపోతున్న సంఘటనలు ఉన్నాయి. రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ఫోకస్

బాబోయ్.. మట్టి గుట్టలు..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక వంటిల్లు జంక్షన్ వద్ద కైలాస్‌నగర్‌లో జనావాసాల మధ్య ఖాళీ స్థలం చెత్త డంపింగ్ యార్డుగా తయారైంది. ఎక్కడెక్కడి నుంచో డెబ్రిస్, మట్టి, ఇతర వ్యర్థాలను గుట్టలుగా పోగులు పెట్టారు. ఒకవైపు జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది 'స్వచ్ఛత' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కొండల్లా పేరుకుపోయిన వ్యర్థాల సంగతిని పట్టించుకోవడం లేదని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఆధీనంలో ఉన్న స్థలం చెత్త కుండీలా మారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో
మహిళ దుర్మరణం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. ముచ్చర్ల గ్రామానికి చెందిన షిణగం లక్ష్మి (55) గోపాలపట్నం రైతు బజారు వద్ద కూరగాయలు విక్రయించుకొని జీవనోపాధి పొందుతోంది. ఎప్పటి మాదిరిగానే బుధవారం ఉదయం ఆనందపురం మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసి ఆటోలో గోపాలపట్నం బయలుదేరింది. కణమాం సమీపంలో ఆగి ఉన్న లారీని ఈమె ప్రయాణిస్తున్న ఆటో ఢీకొట్టడంతో లక్ష్మి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ షిణగం అప్పలనాయుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. భీమునిపట్నం ప్రభుత్వాసుపత్రిలో శవ పరీక్ష జరిగాక మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతురాలికి వివాహం జరిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక అవగాహన

గాజువాక గ్రంథాలయంలో బాలికలకు నిర్వహించిన కుర్చీలాట

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం గాజువాక, పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాల్లో బాలికలకు ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమం, కుర్చీలాట, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారులు పి.సూర్యకళ, పీవీ రమణ, సాహిత్య సుధ వ్యవస్థాపకుడు అద్దంకి రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రలేఖన పోటీలు

మల్కాపురం, న్యూస్‌టుడే : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రాం షిప్‌యార్డుకాలనీలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సన్యాసిరావు, గ్రంథాలయాధికారి బి.కనకరాజు పర్యవేక్షించారు.

తాము గీసిన చిత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

జారిపడతారు జాగ్రత్త..

ఇసుకతో నిండిన సేవా రహదారి

సింధియా, న్యూస్‌టుడే : గాజువాక డిపో దరి సబ్‌స్టేషన్ నుంచి భూగర్భ తీగల పనులు మొదలయ్యాయి. ఈ పనుల కోసం లారీలకొద్దీ ఇసుకను పెద్ద పెద్ద గుట్టలుగా పోశారు. దీంతో వంద, రెండొందల మీటర్ల వరకు సేవా రహదారి మొత్తం ఇసుకమయమైంది. ద్విచక్ర వాహనదారులు ఇక్కడ జారిపడుతున్నారు. పనులయ్యాక మట్టిని, ఇసుకను తొలగించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రకటన
మహారాజశ్రీ X వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టు, నరసాపురం, ప॥గో॥జిల్లా
I.A. 584/2025 in D.O.P. 122/2025
బిట్వీన్:
శ్రీమతి చిక్కాల విజయ మౌనిక ... పిటీషనర్
మరియు
చిక్కాల గ్రేస్ సుధీర్ కిరణ్ @ తియోఫిలస్ ...రెస్పాండెంట్
సమన్స్ టు:
రెస్పాండెంట్: చిక్కాల గ్రేస్ సుధీర్ కిరణ్ @ తియోఫిలస్, S/o. చిక్కాల హిజ్కియా రాజు, పురుషుడు, వయస్సు 34 సం.రం., ప్రైవేటు ఎంప్లాయ్, డోర్ నెం. 58-13-74, ఫ్లాట్ నెం. 301, గణేష్ నగర్, వాసవి పారడైస్, NAD జంక్షన్, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్. సెల్: 81213 00135.
మీ పై శ్రీమతి చిక్కాల విజయ మౌనిక అను వారు పై నెంబరు గల D.O.P 122/2025 పిటీషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్టు ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికీ, మీరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తునందున సబ్‌స్టిట్యూట్ సర్వీస్‌గా ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా. ది. 04-12-2025 సం. తేదీన ఉదయం 10.30 నిమిషములకు మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని, కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షముగా సదరు D.O.P విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.
స్థలం: నరసాపురం సం/- **చదలవాడ జ్ఞాన ప్రకాష్**
తేదీ: 18-11-2025 పిటీషనర్ తరపున న్యాయవాది
నరసాపురం, సెల్: 9848704087

ఈనాడు విజయనగరం

గురువారం నవంబరు 20, 2025 5

ఒక్క పిలుపుతో దాతలు కదిలారు..
పాఠకులకు అండగా నిలుస్తామని ముందుకొచ్చారు..
మీరు చదవండి.. వెనుక మేముంటామని భరోసానిచ్చారు..
వందలాది మంది యువత, నిరుద్యోగులకు పుస్తకాలు విరాళమిచ్చారు.

విజ్ఞానం వెలుగొందేలా.. విజయం సాధించేలా

గ్రంథాలయాలకు పుస్తకాల అందజేత

ఈనాడు పిలుపుతో కదిలిన దాతలు

ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో సరైన పుస్తకాలు, తాజా మెటీరియల్ లేకపోవడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల వేళ వారికి అండగా నిలిచేందుకు 'ఈనాడు' సంకల్పించింది. 'న్యూస్‌టుడే' బృంద సభ్యుల చొరవతో నగరం, పట్టణాల్లో గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాలు అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. శాఖల వారీగా అవసరాలను తెలుసుకుని బుధవారం సమకూర్చారు. బ్యాంకింగ్, రైల్వే, డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్, ఎస్ఎస్సీ, గ్రూప్స్, సివిల్స్ తదితర పుస్తకాలను అందించారు. దీంతో పాఠకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిలి: పుస్తకాలు, నగదు అందిస్తున్న జేసీ రాజు

బొబ్బిలి శాఖ గ్రంథాలయానికి నిత్యం 100 మంది పాఠకులు వస్తుంటారు. కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేసీ రాజు రూ.16 వేల విలువైన పుస్తకాలను అందజేశారు. మరికొన్ని కొనుగోలుకు రూ.15 వేలు ఇచ్చారు. భవిష్యత్తులో రామభద్రపురం, తెర్లాం, బాడంగి గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేస్తామని ఆయన చెప్పారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి

- మరింత మంది దాతల సాయం 6లో

సేవల్లో రాజమార్గం.. ఆపదలో అభయహస్తం

– న్యూస్‌టుడే, డెంకాడ

జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ ద్వారా ఫీజును వసూలు చేస్తుంటారు. ప్రయాణం చేసే వాహనదారులకు టోల్ రుసుము వసూలు చేసే యాజమాన్యాలు కొన్ని సౌకర్యాలు కల్పించాలి. అత్యవసర పరిస్థితుల్లో సేవలు వినియోగించుకోవచ్చని పలువురు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఎస్‌ఓఎస్ పెట్టెలు..

జాతీయ రహదారులపై ప్రతి 2, 3 కి.మీ దూరంలో ఎస్‌ఓఎస్ పెట్టెలు ఉంటాయి. ఏదైనా ప్రమాదాలు, తక్షణ సాయం కోసం ఈ పెట్టెపై ఉండే బటన్ నొక్కి చెబితే వెంటనే టోల్ సిబ్బంది చేరుకుని సాయం అందిస్తారు.

అప్‌లోడ్ చేస్తే రివార్డులు

జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో అత్యవసరాలు ఏర్పడితే పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సదుపాయాలను హైవే అధికారులు కల్పిస్తున్నారు. ఇవి అపరిశుభ్రంగా ఉంటే ఫొటో తీసి 'రాజమార్గ్ యాత్ర' యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డులు సైతం పొందవచ్చు. ★ చోదకుల కోసం అక్కివరం కూడలి, రణస్థలం సమీపంలో విశ్రాంతి గదులు నిర్మించారు. వాహనాలు నిలిపేందుకు అక్కివరం కూడలి సమీపంలో ట్రక్కు బే త్వరలో అందుబాటులోకి రానుంది.

జాతీయ రహదారిపై నాతవలస టోల్‌గేట్

పార్కింగ్, విశ్రాంతికి..

వాహనాల పార్కింగ్, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు స్థలాలు ఉండాలి. ఇంధన స్టేషన్లు, వాహన మరమ్మతు దుకాణాలు సమీపంలోనే ఉండాలి. నగదు జమ, ఉపసంహరణకు ఏటీఎం యంత్రాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

15 నిమిషాల్లో అత్యవసర సేవలు

ప్రయాణికులకు తాగునీరు, ఇతరత్రా సేవలతోపాటు ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందిస్తారు. టోల్‌ప్లాజా వద్ద ఉన్న అంబులెన్స్ 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటుంది. జాతీయ రహదారిలో వాహనదారులు సేవలపై అవగాహన కల్పిస్తున్నామని ఎన్‌హెచ్-16 ఇన్సిడెంట్ మేనేజర్ పి.రామస్వామి చెప్పారు.

1033కి కాల్ చేస్తే..

రహదారిపై వాహనం ఆగిపోతే.. నెట్టడానికి ఎక్కడి నుంచో ఎవరినో పిలవాల్సిన అవసరం ఉండదు. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు కాల్ చేస్తే తక్షణ సాయం అందుతుంది. పోలీసు సేవల కోసం 112 నంబరును సంప్రదించాలి. ఇలా విజయనగరం జిల్లాలో ప్రతినెలా 10-15 కాల్స్‌కు సమాధానం ఇస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని టోల్‌గేట్లు

- చెన్నై-కోల్‌కతా(నాతవలస, విజయనగరం)
- విశాఖపట్నం-రాయపూర్(జొన్నాడ, విజయనగరం)
- విజయనగరం-పార్వతీపురం(మానాపురం, గజపతినగరం)
- సబ్బవరం-రాయపూర్, ఎక్స్‌ప్రెస్ హైవే (జామి వద్ద, ఇంకా ప్రారంభం కాలేదు)
- గజపతినగరం-బొబ్బిలి (ఇంకా ప్రారంభం కాలేదు)
- టోల్‌గేట్ల నుంచి వెళ్లే వాహనాలు: రోజుకు సుమారు 50 వేలు

అక్రమాలపై దర్యాప్తునకు ఉత్తర్వులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణ ప్రణాళికా విభాగంలో 2022లో చోటుచేసుకున్న అక్రమాల వ్యవహారంలో 12 మంది ఉద్యోగులపై ఆరోపణలొచ్చాయి. ఇప్పటికే వారికి ఛార్జి మెమోలు జారీ అయ్యాయి. దీనిపై దర్యాప్తునకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఎం.మల్లయ్యనాయుడు, టీపీఎస్ వరప్రసాద్, బాలాజీ, కేన వసంత, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, ఎం.ఉషారాణి, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు వి.రమేష్, ఎం.రాజేష్, వై.ఉదయకుమార్, సౌజన్యకుమార్, మోహినిలపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. సభ్యులు నివేదిక సమర్పించాక చర్యలు తీసుకునే అవకాశముంది.

సిక్సులు కొట్టిన మంత్రి.. క్యాచ్‌లు పట్టిన ఎంపీ

బ్యాటింగ్ చేస్తున్న కొండపల్లి శ్రీనివాస్, వికెట్ కీపర్‌గా ఎంపీ కలిశెట్టి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బ్యాట్ పట్టి సిక్సులు, ఫోర్లు కొట్టగా.. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వికెట్ కీపర్‌గా మారి క్యాచ్‌లు అందుకున్నారు.. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు ప్రేక్షకుల్లా చప్పట్లు కొట్టారు. నగరంలోని విజ్జీ మైదానంలో బుధవారం అండర్-19 క్రికెట్ టోర్నమెంటు ప్రారంభమైన సందర్భంగా ప్రజాప్రతినిధులు ఇలా సందడి చేశారు. అంతకుముందు ఎంపీ కలిశెట్టి టాస్ వేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కిట్లను మంత్రి బహూకరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు స్టేడియం అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించినట్లు ఎంపీ అప్పలనాయుడు ప్రకటించారు. ఈ టోర్నమెంటులో 12 జట్లు తలపడుతున్నాయని, ఈనెల 25 వరకు జరుగుతుందని క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి సీతారామరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం క్రీడా విభాగం

ఇళ్ల మంజూరులో సందేహాలా..?

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. ఈనెల 30 లోగా లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలి. గతంలో ఈ పథకం ద్వారా జిల్లాలో 36,862 మంది సచివాలయాల్లో దరఖాస్తులు చేశారు. ఈ నేపథ్యంలో వారు మళ్లీ సంప్రదించాలా.. వద్దా.. కొత్తవారికి ఏఏ పత్రాలు ఉండాలి.. సొంత స్థలం ఉండాలా.. గతంలో లబ్ధి పొందితే పరిస్థితి ఏంటి.. ఇంట్లో మరొకరి పేరున మంజూరైతే ఏం చేయాలి.. తదితర సందేహాల నివృత్తికి 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే. గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి గండి మురళీమోహన్ మీతో మాట్లాడనున్నారు.

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

★ **తేదీ:** 21.11.2025(శుక్రవారం)
★ **సమయం:** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ★ సంప్రదించాల్సిన నంబరు: 70939 30102 – న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

గుప్పెడంత గుండెకు కొండంత నిబ్బరం

రూ.40 వేల విలువైన ఇంజెక్షన్ ఉచితం



రాజాం పట్టణానికి చెందిన సీతబాబుకు ఇటీవల ఉదయాన్నే గుండెలో నొప్పి వచ్చింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లడంతో వైద్యులు రూ.40 వేలు విలువైన 'టెనెక్ట్‌ప్లేస్' ఇంజెక్షన్ ఉచితంగా వేశారు. విశాఖలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లే వరకూ ఎలాంటి ప్రాణహాని లేకుండా దోహదపడింది. అక్కడ పరీక్షలు నిర్వహించి, రెండు స్టంట్లు వేయడంతో బయటపడ్డారు. –న్యూస్‌టుడే, రాజాం

మారుతున్న జీవనశైలి, ఒత్తిడి తదితర కారణాలతో ఇటీవల కాలంలో గుండెపోటు మరణాలు అధికమవుతున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం వంటివి తోడై అధిక రక్తపోటుకు దారితీస్తున్నాయి. ఫలితంగా చిన్న వయసులోనే గుండెపోటు వస్తోంది. బాధితులకు మొదటి గంట సమయం చాలా కీలకం. ఈ సమయంలో సరైన వైద్యం అందితే కోలుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో 'టెనెక్ట్‌ప్లేస్' ఇంజెక్షన్లు ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. స్టెమీ పేరిట 2023 అక్టోబరు 23 నుంచి ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు.

తొలి గంట కీలకం..

జిల్లాలోని గుండెవ్యాధి నిపుణులతో కూడిన ఒక గ్రూప్ ఏర్పాటు చేశారు. రోగి ప్రభుత్వాసుపత్రిలో చేరిన వెంటనే ఈసీజీ తీస్తారు. ఈ నివేదికను గ్రూప్‌లో పోస్టు చేస్తారు. వైద్యుల సూచన మేరకు రూ.40 వేలు విలువైన ఇంజెక్షన్ ఉచితంగా ఇస్తారు. బాధితులు గుండెపోటు వచ్చిన వెంటనే తొలి గంటలోనే సమీప ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలని డీసీహెచ్ఎస్ ఎన్.పద్మశ్రీరాణి తెలిపారు. ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇంతవరకు ఆసుపత్రుల వారీగా ఇంజెక్షన్ల వినియోగం..
★ జీజీహెచ్ : 10 ★ రాజాం ప్రాంతీయాసుపత్రి: 24 ★ చీపురుపల్లి: 10 ★ గజపతినగరం: 13 ★ ఎస్.కోట: 03 ★ బాడంగి సీహెచ్‌సీ: 09 ★ బొబ్బిలి: 56 ★ భోగాపురం: 02 ★ నెల్లిమర్ల: 05

రూ.1.5 కోట్లతో ఆసుపత్రి రహదారి విస్తరణ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం నీరు-పారిశుద్ధ్యం, జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం, నీటి నాణ్యత, మరుగుదొడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత తదితర అంశాలపై సమీక్షించారు. ఆదర్శ ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. స్వచ్ఛభారత్, జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. విజయనగరం నగరపాలక సంస్థలో కాలుష్యాన్ని తగ్గించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈమేరకు ఆటోమెటిక్ టెస్టింగ్ యంత్రం ఏర్పాటు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.2.8 కోట్లు ఉన్నాయని, వాటిని పార్కుల అభివృద్ధి, 50 వేల మొక్కల పంపిణీ, రహదారుల విస్తరణ పనులకు ఉపయోగించాలన్నారు. రూ.1.5 కోట్లతో మహారాజా ఆసుపత్రి నుంచి రైతుబజారు వరకు రహదారి విస్తరణ పనులకు ఆమోదం తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, జడ్పీ సీఈవో సత్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ ఛైర్మన్ రాక

విజయనగరం బాబామెట్ట: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టరు ఎస్.రాంసుందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు జడ్పీ అతిథి గృహంలో ఎస్సీ సంఘాల ప్రతినిధులతో సమావేశం కానున్నారని, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

కష్టాలు తీరితేనే.. లాభాలు వరించేది

ఖరీఫ్ వరి పంట చేతికొచ్చింది. రైతులు ముమ్మరంగా కోతలు, నూర్పులు చేపడుతున్నారు. విక్రయాలకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు కూడా ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. ఇటీవల మొంథా తుపానుకు కొంత నష్టపోయిన రైతులు ఉన్న పంటనైనా సమయానికి విక్రయించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ఎదురైన ఇబ్బందులు అధికారులు ఈసారి అధిగమిస్తేనే అన్నదాతలకు ప్రయోజనం చేకూరుతుంది. – న్యూస్‌టుడే, రాజాం

తేమ ఉందంటూ దోపిడీ

గతేడాది ఆర్‌ఎస్‌కేల్లో కొనుగోళ్లు జరిపి మిల్లులకు పంపినా అక్కడ కొర్రీలు పెట్టారు. తేమ శాతంలో తేడా ఉందని రెండు నుంచి అయిదు కిలోల వరకు అదనంగా పిండేశారు. రైతులకు గోనె సంచులు సమకూర్చలేదు. ఇచ్చినవీ పాడయ్యాయి. చాలా మందికి రవాణా ఛార్జీలూ చెల్లించలేదు. ★ మిల్లుల వద్ద సరిపడా హమాలీలు ఉండకపోవడం, నిల్వ సామర్థ్యం లేకపోవడంతో రోజుల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. ట్రక్ షీట్లు సకాలంలో ఇవ్వలేదు. ★ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించలేదు. ఈ ఏడాది 159 మిల్లులు గుర్తించినా.. ఇంకా చాలావరకు బ్యాంకు గ్యారెంటీలు అందలేదు. ★ ఆర్‌ఎస్‌కే, మిల్లుల వద్ద ఒకే రకమైన తేమ యంత్రాలు ఉండాలి. చాలా చోట్ల మిల్లర్లు ఇందులో తేమ మరోలా ఉందంటూ మోసం చేశారు.

లక్ష్యాలతో తంటా..

లక్ష్యాల మేరకు ధాన్యాన్ని సేకరిస్తారు. ముందుగా పంట వచ్చిన మండలాల్లో శతశాతం సేకరిస్తున్న అధికారులు.. తర్వాత చేతులెత్తేస్తున్నారు. గతేడాది ధాన్యం సేకరించాలని సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది.

సంతకవిటి మండలం వాసుదేవపట్నం పొలాల్లో వరి కంకులు

పటిష్ఠం చేయాలి

ధాన్యాన్ని ఎక్కడైనా విక్రయించుకునేందుకు వీలుండడంతో దళారులు ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. తనిఖీ కేంద్రాల్లో లెక్కలు ఉండడం లేదు. ఏ రైతు వద్ద ఎంత మేర కొనుగోలు చేశారనేది తెలడం లేదు. ఒడిశాలో తక్కువ ధరకు ధాన్యం దొరుకుతున్నాయి. వాటిని తెచ్చి ఇక్కడ రైతుల పేరున విక్రయించే అవకాశముంది.

ప్రత్యేక దృష్టి.. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్, జేసీ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈసారి ఎలాంటి ఇబ్బందులు రానీయం. 4 లక్షల టన్నులు సేకరిస్తాం. కామన్ రకం క్వింటా రూ.2,369.. 'ఏ' గ్రేడ్ రూ.2,389 చొప్పున పూర్తి మద్దతు ధర చెల్లిస్తాం. – బి.శాంతి, డీఎం, పౌరసరఫరాల సంస్థ

రైతులకు అన్నదాత సుఖీభవ సాయం

వేపాడ, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో మార్పునకు నాంది పలుకుదామని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం వేపాడలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ విజయోత్సవ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో 2.27 లక్షల మంది రైతులకు రూ.150.30 కోట్లు విడుదలైనట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడతల్లో ఒక్కో రైతు బ్యాంకు ఖాతాకు రూ.20 వేలు చొప్పున జమ చేస్తున్నాయన్నారు. బిందు సేద్యానికి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. విజయనగరం డీసీఎంఎస్ ఛైర్మన్ జి.కృష్ణ, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, అయిదు మండలాల తెదేపా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

సాంకేతికత అందిపుచ్చుకుంటే ఉన్నత శిఖరాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. బుధవారం ఎస్.కోట మండలంలోని చీడిపాలెం సమీప సాయిపల్లెలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన యువ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. సైబరు మోసాలకు గురికాకుండా అవగాహన పెంచుకుని, తల్లిదండ్రులు, బంధువులకు వివరించాలన్నారు. మద్యం, గంజాయి వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. సత్యసాయి దివ్యామృతం వ్యవస్థాపకుడు స్వామి, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సులర్ ముర్రు ముత్యాలనాయుడు, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో రవి, రామగోపాల్, శ్రీకాంత్, రాజు, పావని, విజయనగరం ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ వి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

నేడు చీపురుపల్లిలో ఉద్యోగ మేళా

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు గద్దె అనురాగ్‌చౌదరి తెలిపారు. 2020-2025 మధ్య బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని, ఎంపికైన వారికి విశాఖ ఫార్మా పరిశ్రమలో ఉద్యోగం కల్పిస్తారన్నారు.

రుద్రాక్ష రూపం పరమశివ నాదం

విజయనగరం జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి శివ దీక్షాధారుల ఊరేగింపు వైభవంగా సాగింది. దాదాపు 500 మంది మాలధారులు పాల్గొన్నారు. శివాలయం వీధిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి సామ్రాట్ లాడ్జి, అంబటిసత్రం, మూడులాంతర్లు, కోట వరకు వెళ్లారు. ఈ సందర్భంగా 50 వేల రుద్రాక్షలతో చేసిన శివలింగం ఆకట్టుకుంది.
– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్



RAGHU COLLEGE OF PHARMACY
(Approved by PCI, New Delhi, Affiliated to Andhra University, VSP)
Dakamarri, Bheemili (M), Visakhapatnam - 531162, A.P
Ph. 08922-248014, 15 Email Id: raghucollegeofpharmacy@rediffmail.com

B.PHARMACY SPOT ADMISSIONS (CAT-A) AP EAPCET-2025

Candidates qualified in **AP EAPCET-2025** and have not taken admission in any institution are eligible for Spot Admissions. If **AP EAPCET-2025** qualified candidates are not available, the candidates having percentage of aggregate marks in qualifying examination or its equivalent as per the eligibility criteria by the Chairman/Convener, **APSCHE, AP EAPCET-2025 (Admissions)** will be considered.
The interested candidates may attend the Institutional Spot Admissions in our college on **20-11-2025 (Thursday) at 10.00 AM** along with all original certificates and requisite fee.
The vacant seats will be filled as per the guidelines of Chairman/Convener, **APSCHE, AP EAPCET-2025** Admissions and the admitted candidates are not eligible for tuition fee reimbursement.
For details Contact: 08922-248014,15

14-11-2025 Mob: 9177779084, 9490302033 Principal

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

కాంతి రేఖలు.. ఉపాధికి బాటలు

ఉమ్మడి జిల్లాకు పరిశ్రమల కళ
● రూ.వేల కోట్లతో పెట్టుబడులు

ఉమ్మడి విజయనగరం జిల్లా ముఖచిత్రం మారనుంది. భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పన దిశగా అడుగు పడనుంది. పారిశ్రామిక, ఆతిథ్య, ఆహార శుద్ధి రంగాల్లో వెలుగు కనిపించనుందని నిపుణుల్లో అభిప్రాయం వ్యక్తం అవుతోంది. విశాఖలో ఇటీవల రెండు రోజులపాటు నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. అంచనాలకు మించి పెట్టుబడులతో నెలకొల్పనున్న వివిధ పరిశ్రమలతో ఉద్యోగాలు లభిస్తాయని నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి.
– ఈనాడు, విజయనగరం

మరుపల్లిలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏపీఐఐసీ సిద్ధం చేసిన భూములు

రూ.256 కోట్లు.. మూడు ప్లాంట్లు

వంగర మండలం అరసాడలో పీవీపీ సంస్థ రూ.102 కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్‌ప్లాంటు ఏర్పాటు చేయనుంది. వారం క్రితం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా దీనికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా విజయనగరం జిల్లాలో ఎస్2ఎస్ రెన్యూవబుల్ గ్యాస్ ప్రై.లి. రూ.121 కోట్లతో, గంట్యాడ మండలం తాటిపూడి వద్ద శ్రీ వీరాంజనేయ గ్రీన్ ఎనర్జీ సంస్థలు రూ.33 కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మూడింటితో వెయ్యి మందికిపైగా ఉపాధి లభించనుంది. ఈ ప్లాంట్లకు అవసరమైన గడ్డి పెంచి ఇచ్చేందుకు ముందుకొస్తే ఆ ప్రాంత రైతులు, కూలీలకు మేలు జరగనుంది.

ఒప్పందం కుదిరింది

శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో రూ.10 వేల కోట్లు చొప్పున పెట్టుబడితో ఏఎం గ్రీన్ (ఇండియా) ప్రైవేటు కంపెనీ బయోఫ్యూయల్ రిఫైనరీలు నెలకొల్పేందుకు ప్రభుత్వంతో తాజాగా ఒప్పందం కుదిరింది. సుమారు రెండు వేల మందికి ఉపాధి దొరుకుతుంది. కొత్తవలస మండలం చినరావుపల్లిలో 172.84 ఎకరాల్లో పతంజలి ఫుడ్ అండ్ హెర్బల్ పార్కు ఏర్పాటుకు 2017లోనే ఆ సంస్థ ముందుకొచ్చి, వెనకంజ వేసింది. నాలుగు రోజుల క్రితం రూ.370 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 800 మందికి ఉపాధి కల్పించనుంది.

ఆచరణలో మరికొన్ని..

● ఎస్.కోట మండలం బొడ్డవరలో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు లిమిటెడ్ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.531.36 కోట్లతో 1166.43 ఎకరాల్లో వివిధ పరిశ్రమలు నెలకొల్పనుంది. సుమారు 45 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఈ సంస్థ పేర్కొంది. ● పార్వతీపురం మన్యం జిల్లాలో ఈజీఎం ఎల్‌ఎల్‌పీ సంస్థ రూ.15 కోట్లతో హోటల్ కమ్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ● మరుపల్లిలో అన్నమి స్పేస్ కార్పొరేషన్ రూ.600 కోట్లతో ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. 1,650 మందికి ఉపాధి లభిస్తుంది. ● గుర్ల మండలం కెల్ల పరిధిలో ఎస్ఎస్ఎల్ కంపెనీ రూ.8,570 కోట్లతో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ముందుకొచ్చింది. దీనికి 1,068 ఎకరాలు అప్పగించేందుకు అంగీకరిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రత్యక్షంగా వెయ్యి, పరోక్షంగా నాలుగు వేల మందికిపైగా ఉపాధి కలగనుంది.

(c) eenadu

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం

EENADU SPORTS LEAGUE 2025

దరఖాస్తుల ప్రక్రియ షురూ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
Organised by: ఈనాడు

ఈనాడు, హైదరాబాద్: కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతారు. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

నాకౌట్ పద్ధతిలో..

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్,
ఈనాడు, పెదపాడు విలేజ్
శ్రీకాకుళం - 532 401
వివరాలకు:
90634 38852

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

పోటీలో నిలిచేలా.. జీవితంలో గెలిచేలా

పుస్తకాలు అందిస్తున్న కిశోర్ తదితరులు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పుస్తకాలను అందించేందుకు ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్, పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరావు, చంద్రమౌళి ముందుకొచ్చారు. రూ.7,500 విలువైన పుస్తకాలు సమకూర్చారు. ఈ గ్రంథాలయంలో 40 మంది వరకు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వారికి ఉపయుక్తంగా ఉంటాయని గ్రంథాలయ పాలకాధికారిణి కృష్ణవేణి చెప్పారు. 'ఈనాడు' కృషిని నిరుద్యోగ యువతి, యువకులు అభినందించారు.

రాజాం పట్టణంలో..


పుస్తకాలు ఇస్తున్న రోటరీ అధ్యక్షుడు జి.పాపారావు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయానికి స్థానిక రోటరీ అధ్యక్షుడు గట్టి పాపారావు రూ.2,530 విలువైన పుస్తకాలను సమకూర్చారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి అమర్‌నాథ్ వీటిని అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గజపతినగరంలో..

గ్రంథాలయాధికారిణి సృజనకు అందిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీదేవి

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరంలోని శాఖా గ్రంథాలయంలో రోజూ 90 మంది వరకు నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సంబంధించిన సమాచారం చదివేందుకు వస్తున్నారు. వారికి ఉపయోగపడేలా గ్రూప్స్, డీఎస్సీ, ఆర్ఆర్బీ, కానిస్టేబుల్ తదితర పరీక్షలకు సంబంధించిన రూ.5,400 విలువచేసే పుస్తకాలను మాజీ ఎంపీపీ, తెదేపా మండలాధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి స్థానిక గ్రంథాలయాధికారిణి సృజనకు అందించారు. గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

విజయనగరంలో..

విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయానికి రూ.5 వేల విలువ చేసే పుస్తకాలను దాతలు అందించారు.

500 మందికి ఉపయోగం..

వారు. 500 మంది ఉపయోగించుకుంటున్నారని గ్రంథాలయ అధికారిణి లక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి కూరశి, సూర్యనారాయణ దంపతులను అభినందించారు. సమూర్త గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాల సేకరణకు ఆధునిక సాంకేతికత

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాల సేకరణకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి సూచించారు. బుధవారం పార్వతీపురంలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద క్రైమ్ స్పాట్ క్లూస్ టీం వాహనాలను ఆయన ప్రారంభించారు. మన్యంస్థలంలో ప్రత్యేక ఆధారాలను సేకరించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ప్రజల భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కోసం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామన్నారు. ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, సోషల్ మీడియా ఏసీ శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐ రాంబాబు, ఎస్బీ డీఎస్పీ ఎన్నెలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయం వద్ద వాహనాలను ప్రారంభించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

జాతీయ స్థాయిలో భామిని విద్యార్థుల సత్తా

ట్రోఫీతో భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

భామిని, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపల్ గంగాదేవి తెలిపారు. ఈ నెల 11 నుంచి 15 వరకు ఒడిశాలో జరిగిన 4వ నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో ఖోఖోలో చంద్రిక, లావణ్య, సన్నిహిత, శ్రీవల్లి మొదటి స్థానంలో నిలిచారన్నారు. కృష్ణవేణి 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. బుధవారం వారిని అభినందించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

న్యాయవార్తా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చేనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. విజయనగరంలోని న్యాయస్థానంలో బుధవారం పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. ఇరువర్గాల సమ్మతితో కేసులను రాజీ చేయాలన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి లక్ష్మీకుమారి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత, చిత్రంలో న్యాయమూర్తి లక్ష్మీకుమారి

అత్యవసర వైద్యానికి అడుగులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో త్వరలో అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాంతీయాసుపత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు రూ.23 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రెండు అంతస్తుల భవన సముదాయం నిర్మించనున్నారు. ఈ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య బృందంతో 24 గంటలు సేవలు అందనున్నాయి. వచ్చే ఏడాది చివరి నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సూపరింటెండెంట్ చిరంజీవి తెలిపారు.

382 ఆర్ఎస్‌కేల్లో ధాన్యం కొనుగోళ్లు

వేపాడ, న్యూస్‌టుడే: జిల్లాలోని 261 క్లస్టర్ల పరిధిలో ఉన్న 382 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు తెలిపారు. వేపాడ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే లలితకుమారి, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి పాల్గొని స్టాళ్లను పరిశీలించారు. జేడీ మాట్లాడుతూ సాధారణ రకం క్వింటాకు రూ.2,369, ఫైన్ రకం రూ.2,389గా మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. మొంథా తుపాను కారణంగా జిల్లాలో 783 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. రూ.2 కోట్ల పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక అందజేశామన్నారు. మండల ప్రత్యేకాధికారి పి.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దారు రాములమ్మ, వ్యవసాయాధికారిణి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీసీఎంఎస్ ఛైర్మన్

రుణ లక్ష్యం రూ.6 వేల కోట్లు

బలిజిపేట, న్యూస్‌టుడే: రీజియన్ పరిధిలోని పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని వ్యవసాయదారులు, డ్వాక్రా మహిళలు, వ్యాపారవర్గాలకు ఈ ఆర్థిక సంవత్సరాంతం లోగా రూ.6 వేల కోట్ల రుణాలను ఇచ్చేందుకు లక్ష్యం పెట్టుకున్నామని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ హెడ్ పైడి రాజా చెప్పారు. బలిజిపేటలోని బ్యాంకు శాఖలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రాంతీయ పరిధిలోని 70 వేల మంది రైతులకు వ్యవసాయ రుణాల కింద రూ.600 కోట్లు అందజేశామన్నారు. డ్రోన్ల కొనుగోలుకు 22 మందికి మంజూరు చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసి లెవీ బియ్యం తరలించేందుకు మరో రూ.150 కోట్లు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మిల్లర్ల నుంచి పది శాతం నగదు వసూలు చేయించి, ఎలక్ట్రానిక్ బ్యాంకు గ్యారెంటీ పత్రాలు అందజేస్తామన్నారు. అయిదు శాతం నగదు చెల్లించేందుకు అనుమతినివ్వాలని మిల్లర్లు కోరుతున్నారని, ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట బలిజిపేట బ్యాంకు మేనేజర్ తాపస్‌కుమార్ సేథీ ఉన్నారు.

మాట్లాడుతున్న యూబీఐ ప్రాంతీయ హెడ్ రాజా, బీఎం సేథీ

ఈ చక్రం.. దిగుబడుల సూత్రం

వీరఘట్టంలోని మార్కెట్ యార్డులో పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం ఉద్యోగులు బుధవారం వేసిన సార్వత్రిక సూత్రం చక్రం ఆకట్టుకుంది. ఏఏ విత్తనాలు వాడాలి, ఎలాంటి ఎరువులు వినియోగించాలో తెలియజేసినట్లు ఆ విభాగం జిల్లా ప్రబంధకుడు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, వీరఘట్టం

మణికంఠకు మహా పడిపూజ

ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసాకాలనీలో శ్రీమణికంఠ ధర్మశాస్త్ర పీఠంలో అయ్యప్ప స్వాములు పంబా విళక్కు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాలతో శివరామరాజు కోనేరు వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

వేలిముద్ర.. వేసి వెళ్లు

మావోయిస్టుల కదలికలు, దిల్లీ పేలుళ్ల ఘటనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రద్దీ ప్రాంతాల్లో తిరిగే ప్రజల నుంచి గత రెండు రోజులుగా వేలిముద్రలు సేకరించే ప్రక్రియను ముమ్మరం చేసింది. ఎంఎస్‌సీడీ(మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్) పరికరంతో వేలిముద్రలు సేకరిస్తోంది. దేశంలో ఏ మూల కేసు నమోదైనా ఇందులో తెలిసిపోతుంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధితో పాటు, రద్దీ ప్రాంతాల్లో, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించేందుకు ఈ పరికరాన్ని వాడుతున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బుధవారం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పలువురి ముద్రలు తీసుకున్నామన్నారు.

వేలిముద్రలు సేకరిస్తున్న సీసీఎస్ పోలీసులు

– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

EENADU eClassifieds

HOME NEEDS

WATER PURIFIER

హార్డ్ వాటర్‌తో స్నానం చేస్తుంటే జుట్టు రాలడం, చర్మం పొడిబారడం & బట్టలు, పాత్రలు కడిగిన, ఉతికిన తెల్లగా రాకపోవడం మీ సమస్యా? ✆ 7675873377.

PEOPLE CARE

OLD AGE HOME

SVS Old Age Home, VZM AC/Non AC రూమ్స్ డే & నైట్ ఆయా, నర్సింగ్ ఇంటివద్దకే ఫిజియోథెరపీ సేవలు, రుచికరమైన భోజనం ✆ 9440435006, 9347978375

JOBS

పరవాడ, అచ్యుతాపురం, పైడిభీమవరం, HYD, ఫార్మాకంపెనీలో (B.Sc, M.Sc, బి.టెక్, డిప్లొమా, ITI, MBA (Fin.&HR) ✆ 8341177761, 8019647888.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

పనితనమే కొలమానం

ఈనాడు, విజయనగరం: తెదేపా ఎమ్మెల్యేల పనితీరుపై ఆ పార్టీ నాయకత్వం దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో అత్యధిక శాతం మందిపై శ్రేణుల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోందని గ్రహించింది. తొలిసారి శాసనసభలో అడుగుపెట్టినవారు సైతం మెరుగుపర్చుకోవడం లేదని నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారంతో అప్రమత్తమైంది. భవిష్యత్తులో వారి పనితనమే కొలమానంగా వివిధ పదవులు, బాధ్యతలు అప్పగించాలని యోచిస్తోంది. ఈమేరకు శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక బృందం పర్యటించనుంది.

అమలులో వెనుకబాటు..

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కొందరు వెనుకబడ్డారని పార్టీ కేంద్ర కార్యాలయానికి అందిన సమాచారంతో అధినేత విశ్లేషించారు. బాధిత వ్యక్తులు, కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మంది ఎమ్మెల్యేల్లో జనసేన సభ్యురాలు మినహా ఎనిమిది మందిలో సగం మంది పనితీరుపై అధినేత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. శుక్రవారం నుంచి రెండు, మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించే పరిశీలకులు వివిధ వర్గాల నుంచి సేకరించిన సమాచారంతో నాయకత్వానికి నివేదించనున్నారు. ఆ తర్వాత దాని ఆధారంగా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	127	224	234

వ్యాన్ ఢీకొని పాల వ్యాపారి దుర్మరణం

గరివిడి/రాజాం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన గరివిడి మండలంలో జరిగింది. ఎస్సై లోకేశ్వరరావు వివరాల ప్రకారం.. రాజాం పట్టణంలోని తెలగవీధికి చెందిన జె.వెంకటరమణ(40), ఎస్.హరీష్ ద్విచక్ర వాహనంపై బుధవారం రాజాం నుంచి చీపురుపల్లి వస్తుండగా బీజే.పాలెం సమీపంలోని నర్సరీ వద్ద వెనుక వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న వెంకటరమణ బలంగా కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న హరీష్ స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయాడు. వ్యాన్ చోదకుడి నిర్లక్ష్యం, అతివేగమే ఈ ఘటనకు కారణమని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీఐ శంకరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందడంతో భార్య మంగ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు.

ఘటనాస్థలంలో ఎస్.హరీష్

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కురుపాం మండలం గుమ్మ గ్రామానికి చెందిన జి.హరిప్రసాద్(32) బుధవారం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా.. జనసేన నాయకుడు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హరిప్రసాద్ నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హరిప్రసాద్ (పాతచిత్రం)

కుదమలో చెరకు పంట దగ్ధం

జియ్యమ్మవలస: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అగ్ని ప్రమాదం గంటల వ్యవధిలోనే దగ్ధం చేసింది. కుదమ పంచాయతీ సమీపంలో పి.బుచ్చిశెట్టి, పి.సింహాద్రి, సత్తి, పి.రాము, పి.సీతారాం, పి.తిరుపతిరావు, పి.నీలమ్మ, జగ్గిశెట్టి, పెంటశెట్టి, ఒమ్మ అప్పిశెట్టి, పి.సింహాచలం, పి.గౌరమ్మ, ఎం.ధనుంజయ, ఎం.వెంకటనాయుడు, పల్ల ఉదయ్, జి.సూరినాయుడు, ఎస్.లక్ష్మి, ఎం.మోహన, పి.లక్ష్మి, పి.సాయిరాం, పి.నారాయణరావు, వై.శ్రీను, పి.సురేష్ తదితరులు చెరకు తోటలు వేశారు. బుధవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సుమారు 30 నుంచి 40 ఎకరాల మేర పంట కాలిపోయిందని వారు తెలిపారు. పార్వతీపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి కొంతమేర మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

కాలిపోయిన పంట

పార్టీ నాయకుడ్ని.. నన్నే పొమ్మంటావా

ఘోషాలో సెక్యూరిటీ గార్డుపై దాడి

విజయనగరం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని ఘోషాసుపత్రిలో ఓ సెక్యూరిటీ గార్డుపై దాడి జరిగింది. చికిత్స పొందుతున్న నవజాత శిశువును చూసేందుకు వచ్చిన రోగి సహాయకుడు విచక్షణ కోల్పోయి వ్యవహరించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బాధితుడి వివరాల ప్రకారం.. రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల మధ్య బయట నుంచి వచ్చేవారిని గదుల్లోకి అనుమతిస్తారు. బుధవారం ఎస్ఎన్‌సీయూ వార్డులోకి వెళ్లేందుకు ఓ వ్యక్తి వచ్చాడు. అప్పటికే సమయం అయిపోవడంతో సెక్యూరిటీ గార్డు సురేష్ లోపలికి వెళ్లొద్దని సూచించాడు. దీంతో వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో కోపోద్రిక్తుడైన సదరు వ్యక్తి దాడి చేశాడు. తానో పార్టీ నాయకుడినంటూ విరుచుకుపడ్డాడు. తననే అడ్డుకుంటావా అని చెంపపై కొట్టాడు. మిగిలిన సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. పోలీసులు చేరుకుని ఇద్దరినీ స్టేషన్‌కు తరలించారు. అయితే కేసు నమోదు చేయలేదు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి, ఫిర్యాదు చేస్తానని బాధితుడు తిరిగి వెళ్లిపోయాడు.

ఇద్దరి మధ్య ఘర్షణ

ఆసుపత్రిలో ఉద్యోగాల పేరిట వసూళ్లు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: ఘోషాసుపత్రిలో సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ కార్మికుల పోస్టులు ఇప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేశాడు. బాధితులు, నగదు తీసుకున్న వ్యక్తికి మధ్య గొడవ జరగడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో ఆసుపత్రిలో పనిచేసేవాడినని, ప్రస్తుతం తన కుటుంబ సభ్యులు అక్కడే విధులు నిర్వహిస్తున్నారని సదరు వ్యక్తి గ్రామీణ ప్రాంతానికి చెందిన కొంతమందిని నమ్మించాడు. వివిధ విభాగాల్లో ఉద్యోగాలు వేయిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల వరకు తీసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం అతడు స్పందించకపోయేసరికి బాధితుల్లో ఇద్దరు అందరి ముందు నిలదీశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఫిర్యాదు రాలేదని సూపరింటెండెంటు అల్లు పద్మజ తెలిపారు. ఏ ఉద్యోగమైనా ప్రకటన ఇస్తామని, ఎవరూ మోసపోవద్దని సూచించారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? తెర్లాం జగనన్న కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ విద్యుత్తు శాఖ సిబ్బందితో మాట్లాడి, సమస్య పరిష్కరిస్తాం. - **రవికుమార్, ఈఈ** - న్యూస్‌టుడే, తెర్లాం

? బుడతనాపల్లి- మదనాడ కొత్తవలస రహదారిలో కాజ్‌వే శిథిలమై అవస్థలు పడుతున్నాం. - **స్థానికులు** ★ మరమ్మతులు చేపడతాం. - **కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ** - గంట్యాడ గ్రామీణం

? రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డులో శ్రీచైతన్య పాఠశాల సమీపంలో వ్యర్థాలు వేస్తున్నారు. పురపాలిక చెత్త తొట్టెల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సమస్య వస్తోంది. - **స్థానికులు** ★ చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

? అమరాం గ్రామం వద్ద రహదారి పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ★ కార్యదర్శికి చెప్పి, చెత్త తొలగింపజేస్తాం. - **ఆనందరావు, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

? రామభద్రపురం ఎస్సీ కాలనీలో తాగునీటి బోరు చుట్టూ గచ్చు లేదు. ఇబ్బంది పడుతున్నాం. - **మహిళలు** ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **సూరిబాబు, ఈవో** - న్యూస్‌టుడే, రామభద్రపురం

ప్రమాదం తప్పింది

స్పందనకు వందనం

రాజాం, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి శ్రీనివాసా థియేటర్ దారిలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురవడంతో రోడ్డును తవ్వారు. పూడ్చకుండా వదిలేశారు. సమస్యపై బుధవారం 'ఈనాడు'లో 'సగ్గిలం వదిలేస్తే ఊడుకుంటనా' శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనర్ ఎ.రామచంద్రరావు స్పందించారు. సిబ్బందితో గొయ్యిని పూడ్చించారు. దీనిపై సీసీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో బుధవారం కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో).. ● టమాటా: 62 ● వంకాయలు: 58 ● దొండ: 60 ● బీర: 58 ● బెండ: 62 ● కాకర: 50 ● చిక్కుడు: 55 ● ఆనపకాయ (ఒకటి): 25 ● అరటి (ఒక): 20 ● మునగ: 70 ● ఉల్లి: 30 ● బంగాళదుంపలు: 32 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 80 ● పచ్చిమిర్చి: 68 ● క్యాబేజీ: 42 - న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ సీతారామ: **శివ** ★ ఎస్వీసీ సీతారామ మినీ: **ది గర్ల్ ఫ్రెండ్** ★ ఎస్వీసీ అప్సర: **కాంత.** - న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో.. ★ లక్ష్మి: **కాంత** ★ వాసవి: **మాస్ జాతర** ★ టీవీఆర్ స్క్రీన్-1: **శివ** ★ టీవీఆర్ స్క్రీన్-2: **ది గర్ల్ ఫ్రెండ్** - న్యూస్‌టుడే, బొబ్బిలి

అక్రమం పట్టదు.. సక్రమంగా నీరు రాదు

న్యూస్‌టుడే - బొబ్బిలి

బొబ్బిలి పురపాలిక పరిధిలో అక్రమ తాగునీటి కుళాయి కనెక్షన్లు అధికంగా ఉన్నాయి. అధికారికంగా ఉన్నవాటికి సక్రమంగా నీరు సరఫరా కావడంలేదు. దీంతో పుర ఖజానాకు గండిపడుతోంది. మరోవైపు అధికారికంగా నీటి తీరువా చెల్లిస్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు.

15 ఏళ్ల కిందట అధికారులు ఇష్టానుసారం కుళాయిలు వేసేశారు. సంబంధిత యజమానుల నుంచి డిపాజిట్ల 'పేరు'తో రూ. వేలల్లో వసూలు చేసి.. పురపాలికకు జమచేయలేదు. ప్రస్తుతం పురపాలిక లెక్కల్లో ఆయా కుళాయిలు లేవు. కానీ నీటిని మాత్రం వినియోగించుకుంటున్నారు. నెలవారీ చెల్లించాల్సిన రుసుములు లేవు. అక్రమ కుళాయిలపై ఐదేళ్ల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు అధికారులను నిలదీశారు. వాటిని గుర్తించి క్రమబద్ధీకరించాలని పట్టుబట్టారు. దీంతో తాజాగా 300 పైచిలుకు ఉన్నట్లు గుర్తించారు. కానీ క్రమబద్ధీకరణలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది.

అమ్మిగారికోనేరు గట్టు వీధిలో ఇక్కట్లు

కుదరని ఏకాభిప్రాయం..

అక్రమ కుళాయి కనెక్షన్ల క్రమబద్ధీకరణకు ఎంత డిపాజిట్ వసూలు చేయాలనే అంశంపై అధికారులు, కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి డిపాజిట్ రూ.12 వేలు. కానీ సభ్యులు రూ.6 వేలు తీసుకోవాలని చర్చిస్తున్నట్లు సమాచారం. ఇందుకు నిబంధనలు ఒప్పుకోవని అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు నీటిని అక్రమంగా వాడుకున్న వ్యక్తుల నుంచి అపరాధ రుసుము కూడా విధించాల్సి ఉంది. అప్పుడే డిపాజిట్ తగ్గించడం కష్టమంటున్నారు.

పుర ఖజానాకు కన్నం..

ఏడాదికి ఒక కుళాయికి నీటి తీరువా రూ.1200.. ఈ లెక్కన 300 కుళాయిలకు రూ.3.60 లక్షలు కన్నం పడుతోంది. ఈ మొత్తం 15 ఏళ్లకు రూ.54 లక్షల వరకు రావాల్సి ఉంది.

చర్చించి నిర్ణయం తీసుకుంటాం..

సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఈ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. పుర ఖజానాకు డబ్బులు సమకూరేలా చూస్తాం. ఇప్పటికే 300 అక్రమ కుళాయిలను గుర్తించాం. - రామలక్ష్మి, పుర కమిషనర్ బొబ్బిలి

పట్టణంలోని మొత్తం కుళాయి కనెక్షన్లు: 3,700
ఇందులో అక్రమం: 300 పైచిలుకు
అధికారిక కనెక్షన్లకు డిపాజిట్: రూ.12 వేలు
నెలవారీ తాగునీటి రుసుము: రూ.100

సత్యసాయి మార్గం అనుసరణీయం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చీపురుపల్లి ఆంజనేయపురం సత్యసాయిబాబా ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బాబా చిత్రపటాన్ని కలశాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. సేవాసమితి కన్వీనర్ పీవీ రవిప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ● **రాజాం:** సత్యసాయి మార్గం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. రాజాం పట్టణంలోని మెంటిపేట సత్యసాయి సుందరం మందిరం, ఈశ్వరనారాయణ కాలనీ శివ మందిరంలో 'మహిళా దినోత్సవం' వేడుకలు నిర్వహించారు.

చీపురుపల్లిలో ర్యాలీ చేస్తున్న భక్తులు

మహిళా ఉద్యోగులకు సత్కారం

బొబ్బిలి, న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బొబ్బిలి సమితి ఆధ్వర్యంలో భక్తులు స్వామిని పల్లకిలో ఊరేగించారు. పలువురు పేదలకు అమృత కలశం పేరుతో నిత్యావసరాలు అందించారు. మహిళా ఉద్యోగులు డీఎస్పీ భవ్యారెడ్డి, కమిషనర్ రామలక్ష్మి తదితరులను సత్కరించారు. సమితి ప్రతినిధులు అబ్బిరాజు, వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ భవ్యారెడ్డి, కమిషనర్ రామలక్ష్మిని సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆర్ఎస్‌కే ప్రారంభించేదెన్నడో..?

సంతకవిటి మండలం వాసుదేవపట్నంలో రైతుసేవా కేంద్రం అసంపూర్తిగా ఉంది. రూ.23 లక్షలతో అయిదేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించారు. నేటికీ పూర్తికాలేదు. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చివరి దశలో ఆగిపోయింది. దీంతో రైతులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ రియాజ్ తెలిపారు. - న్యూస్‌టుడే, సంతకవిటి

ప్రజారోగ్యానికి ముప్పు..!

రాజాం పట్టణంలోని డోలపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు దుర్గంధంగా ఉన్నాయి. సమీపంలోని కొత్తచెరువును చెత్తతో నింపేస్తున్నారు. దీంతో జలాలు కలుషితమవుతున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ చేస్తున్న చెత్తను పురపాలిక సిబ్బంది తరలించడంలేదని వాపోతున్నారు. సమస్యను పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం

పట్టణ దారి.. అధ్వానంగా మారి

బొబ్బిలి పట్టణంలోని రాజా కళాశాల దారిలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. లారీలు, భారీ వాహనాలు కూరుకుపోతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనాలు శుభ్రపరిచే వాటర్ సర్వీసింగ్ సెంటర్ల నీటిని రహదారిపైకి విడిచిపెడుతుండడంతో గోతుల్లో చేరుతోంది. రత్నాలనగర్‌లో కాలువలు లేక మురుగు ఇళ్ల ముందు చేరుతోంది. సర్వీసింగ్ సెంటర్ల సిబ్బందికి నోటీసులు ఇచ్చామని కమిషనర్ రామలక్ష్మి చెప్పారు. రత్నాలనగర్‌లో కాలువల పనులు జరుగుతున్నాయన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి

నిర్మించి నిరుపయోగం

రేగిడి మండలం తోకలవలసలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. వీటిపై పనికిరాని మొక్కలు పెరుగుతున్నాయి. సుమారు 20 మరుగుదొడ్లు ఈ సముదాయంలో ఉన్నాయి. వినియోగంలోకి తీసుకొస్తే పేదలకు ప్రయోజనకరంగా ఉంటుంది. అలానే వదిలేస్తే శిథిలమై పోతాయి. విషయం ఈవోపీఆర్డీ జగన్నాథం వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రేగిడి

నది ఒడ్డే శ్మశాన వాటిక

బొబ్బిలి మండలం పెంట పంచాయతీలో శ్మశాన వాటిక లేక గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా మృతి చెందితే వేగావతి నది ఒడ్డునే దహనం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటిక నిర్మించాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. నదిలో ప్రవాహం పెరిగితే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఉపాధి హామీ నిధులతో ప్రతిపాదనలు పంపిస్తామని ఎంపీడీవో రవి కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

పటేల్ సేవలు చిరస్మరణీయం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా చీపురుపల్లిలో బుధవారం రాష్ట్రీయ ఏక్తా భారత్ దివస్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాలుగు స్టేషన్ల పోలీస్ సిబ్బంది, విద్యార్థులు గాంధీ కూడలి నుంచి విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారి మీదుగా మండల పరిషత్తు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. డీఎస్పీ ఎస్. రాఘవులు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక్‌నాయుడు, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో నాయకులు, పోలీసులు

పండ్ల కవచాలతో మేలైన దిగుబడులు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రైతులు మామిడి పంటలో మేలైన దిగుబడులు సాధించేందుకు పండ్ల కవచాలు వినియోగించాలని రాస్తకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం చిన కాద గ్రామంలో మామిడి రైతులతో మాట్లాడారు. గజపతినగరం ఉద్యాన శాఖ అధికారి బి.దీప్తి పాల్గొన్నారు. ★ **రామభద్రపురం:** సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరావు అన్నారు. రామభద్రపురం సచివాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ అధికారి పి.మోహన్‌కృష్ణ, బొబ్బిలి ఏఎంసీ వైస్ ఛైర్మన్ గొర్లి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గరివిడి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండవ విడత కింద చీపురుపల్లి నియోజకవర్గంలో 36,916 మంది రైతులకు రూ.23.91 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. బుధవారం గరివిడిలో చెక్కు ఆవిష్కరించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తామన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ★ **మెంటాడ:** మెంటాడ పీఏసీఎస్ ఛైర్మన్ జి.ముసలినాయుడు, తెదేపా మండలాధ్యక్షుడు సీహెచ్.వెంకటరావు మెంటాడ, జక్కువ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఇనాం భూములకు లబ్ధి ఇవ్వాలని వినతి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి నియోజకవర్గంలో ఇనాం భూములకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఆర్ఈసీఎస్ మాజీ ఛైర్మన్ దన్నాన రామచంద్రుడు, తెదేపా నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రాంబాబు తదితరులు కోరారు. బుధవారం సంయుక్త కలెక్టర్ సేధుమాధవన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని ఐసీడీఎస్ డీఎంసీ సమన్వయకర్త సుజాత అన్నారు. బుధవారం నరవ జ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యవేక్షకురాలు అనురాధ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డీఎంసీ సమన్వయకర్త

డోలపేట.. సమస్యలే అంతటా

కోవెలవీధి చివరి మురుగు కాలువ దుస్థితి

మౌలిక వసతులు కరవు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పురపాలిక పరిధిలోని డోలపేటలో ప్రజలను సమస్యలు పీడిస్తున్నాయి. చాలా వీధుల్లో రహదారులు, కాలువలు వంటి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రాజాం- పాలకొండ ప్రధాన రహదారి నుంచి శ్మశాన వాటిక వరకూ ప్రధాన రహదారిని నవీకరిస్తామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరుతోంది.. రూ.30 లక్షలతో కోవెలవీధి వరకు రహదారిని నిర్మించినా శిథిలమైంది. మిగిలిన దారి ఊసే లేకుండా పోతోంది.

నిధులున్నా అంతే..

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు రూ.2.25 కోట్లు పురపాలికకు మంజూరయ్యాయి. ఎస్సీ వీధి వద్ద ప్రధాన దారిలో మురుగంతా రహదారిపైకి వస్తోందని, కాలువ నిర్మించి పైన సిమెంటు పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీ చుట్టూ వరద నీరు చుట్టేస్తోంది. స్లూయిస్ కాలువ నిర్మించాలని గతం నుంచి ఉన్న ప్రతిపాదనలు అటకెక్కాయి.

ఇదీ పరిస్థితి..

★ కోవెల వీధి శివారున, పంటల వీధిలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రహదారిపైకి మురుగునీరు పోటెత్తుతోంది ★ గ్రామం మధ్యలో ఉన్న కోనేరు దుర్గంధంగా మారింది. దీన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. ★ పీఎన్‌కాలనీ రెండో వీధిలో వర్షం నీరు ముంచెత్తుతోంది. మురుగంతా రహదారిపైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఒక మహిళ చేయి విరిగి ఆసుపత్రి పాలైంది. ★ పెద్దవీధి వెనుక మురుగు కాలువ నిర్మించాలని కోరుతున్నా.. ఆచరణలోకి రాలేదు. ★ యూపీహెచ్‌సీ వరకు రహదారి నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గజపతినగరం, న్యూస్‌టుడే: రైతులకు సేవలు అందించడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం గజపతినగరంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండో విడత మంజూరైన చెక్కును ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, ఏఎంసీ అధ్యక్షుడు గోపాల రాజు, జనసేన నేత పడాల అరుణ, భాజపా రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని పాల్గొన్నారు. ★ **రాజాం:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. చెక్కును ఆవిష్కరించారు. నాయకులు కొల్ల అప్పలనాయుడు, గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, వ్యవసాయశాఖ ఏడీ చంద్రరావు పాల్గొన్నారు. ★ **బొబ్బిలి గ్రామీణం:** మాజీ మంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు మెట్టవలసలో చెక్కు అందజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆయన పరిశీలించారు. ఏఎంసీ ఛైర్మన్ వెంకటనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు పాల్గొన్నారు.

చెక్కుతో మాజీ మంత్రి సుజయ్ తదితరులు

చెక్కు ఆవిష్కరిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున

తమ్ముడిపై దాడిచేసిన అన్న అరెస్టు

బాడంగి: సొంత తమ్ముడిపై కత్తితో దాడిచేసిన అన్నను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై తారకేశ్వరరావు బాడంగి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లికి చెందిన కృష్ణ, గురుమూర్తి అన్నదమ్ములు. కృష్ణ కొన్నాళ్లుగా భార్యకు దూరంగా, గ్రామంలో తమ్ముడి వద్ద ఉంటూ.. తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అన్నదమ్ముల మధ్య ఇంటి విషయమై గొడవ జరగడంతో కత్తితో దాడి చేశాడు. కేసు నమోదు చేసి, కృష్ణను అరెస్టు చేశామన్నారు.

20 మంది బైండోవర్

గుర్ల: అనధికారికంగా మద్యం విక్రయిస్తూ దొరికిన పది మందిని గుర్ల తహసీల్దారు ఆదిలక్ష్మి ఆదేశాలతో ఏడాది పాటు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరావు తెలిపారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు విలువైన బాండ్లు పూచీకత్తుగా తీసుకున్నామన్నారు. ● **దత్తిరాజేరు:** గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పది మందిని తహసీల్దారు హరికిరణ్ ఎదుట హాజరుపర్చినట్లు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు, ఎస్సై నరేంద్ర కుమార్ తెలిపారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే రూ.2 లక్షలు జరిమానా విధించేలా పూచీకత్తు ఇవ్వాలని ఆదేశించారన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

రేగిడి, న్యూస్‌టుడే: రేగిడి మండలం తునివాడకు చెందిన యువత దాతృత్వం చాటారు. గ్రామానికి చెందిన మత్స్యకారుడు ముంతల లక్ష్మణరావు ఇటీవల నాగావళి నదిలో కొట్టుకుపోయి మృతిచెందారు. నిరుపేద కుటుంబం కావడంతో స్ఫూర్తి యువజన సంఘం సభ్యులు మృతుడి కుటుంబానికి బుధవారం రూ.13 వేలు ఆర్థిక సాయం అందించారు.

కార్తిక దీపారాధన

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా రాజాం పట్టణం పరిధిలోని కొండంపేట ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద బుధవారం అఖండ దీపారాధన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం

రాజాం: పట్టణంలో శతశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యమని కమిషనర్ రామచంద్రరావు అన్నారు. బుధవారం సత్యనారాయణపురం సచివాలయంలో ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ● మాదిగవీధి సచివాలయాన్ని కమిషనర్ సందర్శించారు. ఆస్తి, తాగునీటి పన్ను ప్రగతిపై ఆరా తీశారు. ఆదర్శ నగర్‌లో పన్నుల వసూలును పరిశీలించారు.

150 మందికి ఉచిత నేత్ర వైద్యం

గరివిడి: గరివిడి సూర్య సదనంలో బుధవారం సద్గురు కృష్ణయాజీ ఛారిటబుల్ ట్రస్టు, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు వి.సూర్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

శ్మశాన స్థల పరిశీలన

రేగిడి: రేగిడి మండలం బూరాడలో దళితులకు శ్మశానవాటిక లేదని, స్థలం కేటాయించాలని గతంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్ఐ గిరి, సర్వేయరు లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి భారతి బుధవారం స్థలం పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

వంతెన నిర్మాణ సామగ్రి దొంగల అరెస్టు

సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి మండలం వాల్తేరు వద్ద వంతెన నిర్మాణ సామగ్రి చోరీ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. వంతెన నిర్మాణ పనులకు సంబంధించి రూ.48 వేలు విలువచేసే 16 బ్యాటరీలు, 20 సెంటరింగ్ సీట్లు అక్టోబరు 21న చోరీకి గురయ్యాయి. సిరిపురం పంచాయతీకి చెందిన పి.ప్రసాద్, జి.సంతోష్, కె.ప్రసాద్, ఓ మైనర్ బాలుడు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న నిందితులను బుధవారం శేషాద్రిపురం కూడలిలో పోలీసులు పట్టుకున్నారు. బ్యాటరీలు, సెంటరింగ్ సీట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు లావేరు మండలంలో నాలుగు ఆంప్లిఫైయర్‌లు దొంగతనం చేసి, ఆమదాలవలసలో ఓ ఎలక్ట్రీషియన్‌కు విక్రయించినట్లు అంగీకరించారు. నలుగురిని అరెస్టు చేసి రాజాం కోర్టుకు తరలించామన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ జాబ్ కార్డు ఉన్న కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. గుచ్చిమి గ్రామంలో పండ్ల తోటల్లో నీటి కుంటలు, కందకాలు, ఎరువుల తయారీ కుంటల పనులు బుధవారం పరిశీలించారు. ప్రతి మండలంలో రోజుకు వెయ్యి మంది పని చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో కామేశ్వరరావు పాల్గొన్నారు. ★ **బొబ్బిలి గ్రామీణం:** ఉపాధి వేతనదారుల సంఖ్య పెంచాలని ఇన్‌ఛార్జి ఏపీడీ చంద్రకుమార్ ఆదేశించారు. బొబ్బిలి మండల పరిషత్తు కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. 22న ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి, ఈ- కేవైసీ వివరాలు ప్రజలకు చదివి వినిపించాలన్నారు.

పనులు పరిశీలిస్తున్న పీడీ శారదాదేవి

హాకీ పోటీలకు ఎంపిక

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో షికారుగంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-19లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానాచార్యుడు ఎం.ఈశ్వరరావు బుధవారం తెలిపారు. తాటిపూడి వంశీ, బొత్స స్వప్న, ఎన్.జోత్స్న ఈనెల 22, 23, 24 తేదీల్లో అనకాపల్లిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు.

జిల్లాస్థాయి ఆటల్లో ప్రతిభ

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం తోండ్రంగి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు జనార్దన్, వినయ్‌కుమార్, జశ్వంత్, దీక్షితలహరి, దీపిక, భవ్య అండర్-19 విభాగంలో హాకీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు అనకాపల్లిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

లీకు ఆగదు.. నీరు అందదు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలం బుడతనాపల్లి ప్రధానవీధిలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురై నీరు వృథాగా పారుతోంది. దీంతో నేలబావులు, వ్యవసాయ మోటార్లపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. విషయం కార్యదర్శి లక్ష్మి వద్ద ప్రస్తావించగా.. తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

భూములు ఏపీఐఐసీవే: ఆర్డీవో

బొబ్బిలి, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద కాకర్లవలస, కారేడువలస భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు పెడితే ఊరుకునేది లేదని గిరిజనులు బుధవారం ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ● ఆందోళనకారులతో ఆర్డీవో రామ్మోహనరావు, ఏపీఐఐసీ జోనల్ ప్రబంధకుడు మురళీమోహనరావు, సీఐ నారాయణరావు చర్చలు జరిపారు. ఏపీఐఐసీ అప్పట్లో రూ.7.50 కోట్లకు భూములు కొనుగోలు చేసిందన్నారు. గతంలో 27 మందికి 2 ఎకరాలు చొప్పున పట్టాలు ఇచ్చారని గిరిజనులు అనగా.. వేరే చోట ఇచ్చారని ఆర్డీవో స్పష్టం చేశారు. నాలుగు రోజుల సమయం ఇవ్వాలని గిరిజనులు కోరడంతో చర్చలు వాయిదా పడ్డాయి.

కార్యాలయం ముందు బైఠాయించిన గిరిజనులు

రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా

గుర్ల, న్యూస్‌టుడే: గుర్ల మండలం గుజ్జంగివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పుష్పారావు తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు అనకాపల్లిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. వల్లాపురం ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని, 21 నుంచి 23 వరకు కర్నూలులో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం అప్పారావు చెప్పారు. చింతలపేటకు విద్యార్థులు అయిదుగురు అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని గౌరిదేవి తెలిపారు. విద్యార్థులను బుధవారం అభినందించారు.

గుజ్జంగివలస విద్యార్థులతో ఉపాధ్యాయులు

సదుపాయాలు లేవు.. సమస్యలు తీరవు

రాజాం పట్టణం పరిధి కొత్తవలసకు వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా తయారైంది. రాజాం- చీపురుపల్లి ప్రధాన దారి నుంచి కొత్తవలస, మారేడుబాక, ఇల్లంనాయుడువలస గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో ప్రమాదాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాల సమస్య వేధిస్తోందని కొత్తవలస వాసులు వాపోతున్నారు. విషయం పీఆర్ జేఈ ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కమిషనర్ రామచంద్రరావు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

(c) eenadu

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

బాలాజీనగర్‌లో సమస్యల తిష్ఠ

ఐనాక్స్ వెనుక మురుగునీటి కాలువ దుస్థితి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరంలోని 33వ డివిజన్ పరిధిలో ఉన్న బాలాజీనగర్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ పెద్ద ఎత్తున అపార్టుమెంట్లు, పాఠశాలలు, కళాశాలలు, రీడింగ్ రూములు, దేవాలయాలున్నాయి. ఏళ్ల నాటి రోడ్లు, కాలువలే ఉండటంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ప్రధాన రోడ్డు మలుపు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఐనాక్స్ వెనుక ప్రాంతం మురికి కూపాన్ని తలపిస్తోంది. కాశీరామ కళ్యాణ మండపం దగ్గర పార్కు, బ్యాంకు కాలనీలోని ఉద్యానాన్ని బాగు చేయాల్సి ఉంది. పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. వెంకటేశ్వరస్వామి కోవెల పక్క సందులో కాలువలపై పలకలు లేవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇందిరానగర్ రోడ్డు అధ్వానంగా మారింది. సమీపంలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

రాములోరికి ఎంపీ పూజలు

కలిశెట్టికి ఆశీర్వచనం అందిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో బుధవారం స్వామివారికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పూర్ణకుంభంతో వేదపండితులు ఎంపీకి స్వాగతం పలికారు. ఆశీర్వచనాలు అందించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది, అర్చకస్వాములు పాల్గొన్నారు.

కూటమితోనే రైతులకు న్యాయం

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం గ్రామీణం, డెంకాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. బుధవారం సాయంత్రం విజయనగరం మండలం గుంకలాంలో అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని రైతులకు రూ.2.96 కోట్ల నగదు అందనుందన్నారు. అనంతరం గ్రామంలోని వరి పొలాల్లో కోత కోశారు. తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి, ఏఎంసీ అధ్యక్షుడు కర్రోతు నర్సింగరావు, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు బొద్దుల నర్సింగరావు, పూసపాటి రాజేష్‌బాబు పాల్గొన్నారు. డెంకాడలో ఎమ్మెల్యే నాగమాధవి ప్రారంభించారు.

తెరపై ఈనాడు

• ఎస్వీఎన్: శివ • శ్రీకృష్ణ: జిగిరీస్ • ఆదిత్య: కె.ర్యాంప్ • లీలామహల్: ది గర్ల్ ఫ్రెండ్ • రంజనీ స్క్రీన్-1: శివ, ది గర్ల్‌ఫ్రెండ్ • శివరంజనీ స్క్రీన్-2: జిగిరీస్, కాంత • హిమగిరి: కాంత • సప్తగిరి: ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం- 80089 02900
విజయనగరం గ్రామీణం- 80085 74317
ఎస్.కోట- 80085 74326
భోగాపురం- 70959 54646

? : శ్రీరామ్‌నగర్ కాలనీ, గురజాడ రోడ్, వైఎస్సార్ నగర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. - జానకి, అప్పారావు, మురళి, స్థానికులు ☛: సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. - ప్రశాంతి, ఏఈ

? : ఓంమందిరం ప్రాంతంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. - స్థానికులు ☛: పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

? : పోలయ్యపేటలో చేతిపంపు పనిచేయడం లేదు. - స్థానికులు ☛: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. - రవి, ఏఈ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వ్యర్థాల తరలింపు

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: గుమ్చీలలో శివజ్యోతి అపార్టుమెంట్ల వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయని 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

గుంతల పూడ్చివేత

విజయనగరం పట్టణం: నగరంలోని ఎన్జీఎస్ రోడ్డులో వైర్లైన్ల మరమ్మతుల కోసం తీసిన గుంతలు పూడ్చలేదని స్థానికులు 'మేమున్నాం..'కు ఫిర్యాదు చేశారు. ఏఈ దృష్టికి తీసుకెళ్లగా పూడ్చించారు.

మరమ్మతులు చేపట్టారు

విజయనగరం పట్టణం: నగరంలోని రంగాలవీధిలో సామాజిక మరుగుదొడ్డి మరమ్మతులకు గురైందని ఆ కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ పి.నల్లనయ్య దృష్టికి తీసుకెళ్లగా బాగు చేయించారు.

తరగని కుప్పలు.. ప్రజలకు తిప్పలు

● కొత్త వాహనాలు వచ్చినా తరలని చెత్త

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నగర పాలక సంస్థకు వస్తున్న ఆదాయంలో సింహభాగం పారిశుద్ధ్య నిర్వహణపైనే ఖర్చు చేస్తున్నా.. ఆ స్థాయిలో ఫలితం రావడం లేదు. వాహనాలు మెండుగా ఉన్నా సకాలంలో చెత్త తరలించక ఎక్కడికక్కడ గుట్టలుగా పేరుకుపోతోంది. ఏడాదికి రూ.28 కోట్ల వరకు వ్యయం చేస్తున్నా పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతుండడంతో ముక్కున వేలేసుకుంటున్నారు.

నిర్వహణ దూరం

డంపర్ బిన్లు పాడై చెత్త రోడ్లపై చిందరవందరగా పడి ఉంటోంది. చిన్న సందుల్లోకి వెళ్లే పుష్‌కార్టులు మూలకు చేరాయి. పాత వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వీటి బాగుకు రూ.లక్షల్లోనే ఖర్చవుతోంది. దీనికి తోడు కార్మికులకు సక్రమంగా పారిశుద్ధ్య పరికరాలు అందజేయడం లేదని చెబుతున్నారు. 172 మంది రెగ్యులర్, 644 మంది ఒప్పంద కార్మికులు ఉన్నారు. ఇటీవల 45 మందిని గుత్తేదారు ద్వారా తీసుకున్నారు. రూ.8 నుంచి రూ.10 వేలు జీతమే ఇస్తుండటంతో పూర్తిస్థాయిలో కొందరు పనిచేయడం లేదు. ఇతర పనులకు వెళ్లిపోతుండడంతో పనిభారం పడుతోంది. కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావిస్తున్నా ఫలితం రావడం లేదు. పలు సచివాలయాల పరిధిలో మస్టర్ మాయాజాలంతో కొందరు విధులకు హాజరుకాకుండా డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులుగా చేరి సూపర్‌వైజర్లు, మేస్త్రీలుగా వ్యవహరిస్తున్న వారు ఉన్నారు.

చర్యలు చేపడుతున్నాం..

పారిశుద్ధ్యం మెరుగుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతుకు గురైనవి త్వరితగతిన బాగు చేస్తున్నాం. 98 డంపర్‌బిన్లు వినియోగంలోకి తీసుకొచ్చాం. పాడైనవి మరమ్మతులు చేయించాం. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వచ్చిన కాంపాక్టర్లు వినియోగంలోకి తీసుకొస్తాం. చీపుర్లు, పారలు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు కార్మికులకు అందజేస్తున్నాం.

– పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

ఇదీ పరిస్థితి..

ఇటీవలే కొత్తగా 10 చెత్త తరలింపు వాహనాలు కొనుగోలు చేయగా, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి మరో రెండు వచ్చాయి. దీంతో ప్రస్తుతానికి నగర పరిధిలో 55 వరకు ఉన్నాయి. 25 ట్రాక్టర్లకు రెండు మరమ్మతులకు గురయ్యాయి. ఆరు టిప్పర్లకు నాలుగు పని చేస్తున్నాయి. అయిదు చిన్న కంపాక్టర్లలో ఒకటి పాడైంది. మూడు పెద్ద కంపాక్టర్లు ఉన్నాయి. జేసీబీలు మూడింటికి ఒకటి మరమ్మతుకు గురైంది. బాబ్‌కార్ట్‌లు నాలుగుకు మూడు పని చేస్తున్నాయి. స్వీపింగ్ మిషన్ ఉన్న రెండు వాహనాల్లో ఒకటి పాడైంది. పది ఆటోలకు రెండే వినియోగంలో ఉన్నాయి. 10 హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. 98 వరకు కొత్త డంపర్‌బిన్లు వినియోగంలోనికి తీసుకొచ్చారు. అయిదు ట్రాక్టర్ తొట్టెల కొనుగోలుకు ప్రతిపాదించారు.

పొంచిఉన్న ప్రమాదం

సోంపురం కూడలి నుంచి వేపాడ వెళ్లే ప్రధాన మార్గంలోని ఓ పురాతన భవనం గోడ ఇది. గతంలో కొంతమేర కూలి ఇలా తయారైంది. శిథిలం కావడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. నిత్యం జనసంచారం ఉండే ఈ మార్గంలో వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎల్.కోట మేజరు పంచాయతీ కార్యదర్శి జానకీ స్వరూపిణిని మాట్లాడితే భవన యజమానికి నోటీసు ఇచ్చి, తొలగించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

ఏళ్లుగా.. అసంపూర్తిగా

కొత్తవలస మేజరు పంచాయతీ బలిఘట్టం సచివాలయం-3 వద్ద మరుగుదొడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత వైకాపా హయాంలో వీటి నిర్మాణం ప్రారంభించారు. నిధులు విడుదల, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా మధ్యలో ఆగిపోయాయి. నేటికీ పునః ప్రారంభించలేదు. దీంతో ఇక్కడికి వచ్చే ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు చాలక పనులు ఆగాయని, వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని మండల ఇంజినీరింగ్ అధికారి సీహెచ్.వి.స్వామినాయుడు తెలిపారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

రక్షణ గోడలు లేక అవస్థలు

ఎల్.కోట మండలంలోని రంగాపురం, రెల్లిగైరమ్మపేట గ్రామాల్లో పేదలకు గత ప్రభుత్వం ఇచ్చిన కాలనీలు చెరువుల అంచున ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అక్కడే ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారు వర్షాల సమయంలో చెరువుల్లో నీరు నిండి కాలనీల్లోకి వస్తుందంటూ ఇబ్బంది పడుతున్నారు. రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రక్షణ గోడల నిర్మాణానికి రూ.20 లక్షలతో ప్రతిపాదించామని, నిధులొచ్చిన వెంటనే పనులు చేపడతామని గృహ నిర్మాణశాఖ ఇంజినీరింగ్ అధికారి ఉమాశంకర్ తెలిపారు.

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

విధుల్లో నిర్లక్ష్యం తగదు

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనరు నల్లనయ్య

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య హెచ్చరించారు. బుధవారం నగరంలోని 1, 2, 4 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణపై ఆరా తీశారు. సకాలంలో పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ● నగరంలో అనధికార కట్టడాలను అనుమతించబోమని కమిషనర్ అన్నారు. తన కార్యాలయంలో ప్రణాళిక కార్యదర్శులకు సూచనలు చేశారు.

అధ్వాన రహదారిలో వెళ్లేదెలా?

విజయనగరం మండలంలోని చెల్లిపేట నుంచి దుప్పాడ వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. మట్టి దారి కావడంతో ఒక్కోసారి బురదమయం అవుతోంది. జొన్నవలస, వీటి అగ్రహారం, బీసీకాలనీ, వైకుంఠం, ముడిదాం తదితర ప్రాంతాల వారికి ఇదే కీలక మార్గం. దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకటరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: బొప్పడాం ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ హాకీ పోటీలకు అండర్-14, 17, 19 విభాగాల్లో ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సూర్యారావు బుధవారం తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.ఈశ్వరరావు, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ చందక స్వామినాయుడు, సర్పంచి కిరణ్‌కుమార్, పెద్దలు అభినందించారు. * నెల్లిమర్ల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎర్రంశెట్టి హారిక రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వి.ఆనంద్‌కిషోర్ తెలిపారు. హెచ్ఎం జీఎం.శారద, ఉపాధ్యాయులు అభినందించారు. ● ఎస్.కోట: జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన శరణ్య అండర్-17లో, సీహెచ్ దీపిక, కె.హర్షిత అండర్-14లో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి.శైలజారాణి తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు వరలక్ష్మి, జ్యోతి అభినందించారు. ● కొత్తవలస: వియ్యంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.యోగేంద్ర రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్ఎం గోవిందరాజులు, వ్యాయామ సహాయకుడు బి.సూర్య చంద్రశేఖర్ అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం ఈశ్వరరావు

గ్రామాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

నెల్లిమర్ల సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ రాజు

నెల్లిమర్ల, డెంకాడ, వేపాడ, ఎస్.కోట, ఎల్.కోట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు సూచించారు. బుధవారం నెల్లిమర్ల ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులకు పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా కార్మికులకు ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బంగార్రాజు ఉన్నారు. ● డెంకాడలో ఎంపీడీవో వై.భవాని, ఉప ఎంపీడీవో శ్రీనివాసరావు నిర్వహించారు. వేపాడలో 29 పంచాయతీల సర్పంచులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ సభ్యుడు శానాపతి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో సూర్యనారాయణ శిక్షణ ఇచ్చారు. ఎస్.కోటలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, జామిలో డీపీఆర్‌సీ ఆర్‌పీఎన్ ఖాన్ ఆధ్వర్యంలో చేపట్టారు. జడ్పీటీసీ జి.సరయు, ఎంపీడీవో నీలం అప్పలనాయుడు పాల్గొన్నారు. ఎల్.కోట మండలంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఇతర అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

ఎంటీఎస్, హెచ్‌ఆర్ పాలసీలు అమలు చేయాలి

ఏపీసీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటీఎస్, హెచ్‌ఆర్ పాలసీలను అమలు చేయాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం సంఘం జిల్లా నాయకులతో కలిసి ఏపీసీ ఎ.రామారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎ.రామకృష్ణ, జి.శ్రీనివాసరావు, కె.రమేష్‌కుమార్, డి.నరసింహులు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంత్యుత్సవాలు

గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సాయి భక్తులు

బాబామెట్ట: నగరానికి చెందిన భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయినాథ్ కాలనీలోని ఆలయంలో సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరై పూజలు చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలను అందజేశారు. ● ఎల్.కోట, కొత్తవలస: ఎల్.కోటలో ఎమ్మెల్యే లలితకుమారి, కొత్తవలసలో సాయి ప్రశాంతి మందిరంలో కన్వీనర్ పి.రవికుమార్ ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. ● భోగాపురం: మండలంలోని ముంజేరు సాయిబాబా ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించారు. 100 మంది మహిళలు పాల్గొన్నారు. రుద్రాభిషేక సహిత లక్ష బిల్వార్చన జరిపారు. సాయిగురు అడ్డగర్ల రమేష్ పాల్గొన్నారు.

పొగ తాగితే ముప్పు తప్పదు

వైద్య విభాగం: పొగ తాగితే ఆరోగ్యానికి ముప్పు తప్పదని మహారాజా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంటు అల్లు పద్మజ అన్నారు. ఆసుపత్రి వద్ద బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య నిపుణుడు బి.సంతోష్ కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సరోజినీ దేవి పాల్గొన్నారు.

జాతీయస్థాయికి అయిదుగురు

క్రీడా విభాగం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.వేణుగోపాలరావు తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే టోర్నమెంటుకు వెళ్లనున్నారన్నారు.

మహిళా దినోత్సవం

అయ్యన్నపేట: గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. అతివలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి ఆకాంక్షించారు.

మండలాధ్యక్ష, కార్యదర్శుల నియామకం

జామి: మండల తెదేపా అధ్యక్షునిగా వర్రి రమణను, ప్రధాన కార్యదర్శిగా లగుడు చినవెంకటరావును నియామకం చేశారు. ఎమ్మెల్యే లలిత కుమారి, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాదు, కార్యకర్తలు, నాయకులు అభినందించారు.

ఉత్తమ సేవలకు అవార్డు

కొత్తవలస: జిల్లాలో స్కౌట్స్, గైడ్స్ కార్యక్రమాల అభివృద్ధిలో ఉత్తమ సేవలకు కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య సహాయకురాలు ఎ.కనక లక్ష్మికి కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, డీఈవో యు.మాణిక్యంనాయుడు ఉత్తమ సేవ అవార్డు అందజేశారు.

వేర్వేరుగా చెత్త సేకరించాలి

కొత్తవలస, న్యూస్‌టుడే: చీడివలసలో జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ బుధవారం పర్యటించారు. పారిశుద్ధ్యం నిర్వహణపై ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఎంపీడీవో ఎస్.రమణయ్య, కార్యదర్శి ఆర్.అప్పారావు, సర్పంచి అప్పలనాయుడు ఉన్నారు.

ఆదాయం పెంచే చర్యలేవీ?

ఎస్.కోట: పంచాయతీ ఆదాయం పెంచే చర్యలు చేపట్టడం లేదని సర్పంచి ఎ.మహేశ్వరరావు అన్నారు. గోపాలపల్లిలో స్వామిత్వ గ్రామసభలో మాట్లాడారు. విశాఖకు చెందిన ఒకరు అనుమతులు లేకుండా పంచాయతీలో నిర్మించిన రిసార్టుకు పన్ను కట్టడంలేదని దీనిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

చెక్కులు అందజేస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

భోగాపురం: బాధితులకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం మండలం చేపల కంచేరుకు చెందిన ఎ.సాత్విక్‌కి మంజూరైన రూ.60వేలు, నెల్లిమర్ల మండలం కొత్తపేటకు చెందిన గొర్లె శోభకు రూ.90,266 విలువైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు బుధవారం పోలిపల్లిలో అందజేశారు. రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ ఎన్.అప్పలరామిరెడ్డి, నాయకులు తాతారావు, యల్లాజీ పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి గాయాలు

ఎల్.కోట: మండలంలోని మల్లివీడుకు సమీపంలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఎస్.కోట మండలం చుక్కవాని వలసకు చెందిన గొర్రెల కాపరి జనా జగ్గులు(49) ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలైనట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు. కొంతమందితో కలిసి సబ్బవరంలో గొర్రెలు కాచుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఆయనతో వస్తున్న వారు ఎస్.కోటలో ప్రాథమికి చికిత్స అనంతరం విజయనగరం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అమర జవాన్‌కు నివాళులు

విగ్రహానికి పూలమాలలు, చిత్రంలో జగదీష్ పాతచిత్రం

నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: మావోయిస్టు అగ్రనేత హిడ్మా మరణంతో తన సోదరుడు రౌతు జగదీష్ ఆత్మకు శాంతి లభించిందని నగరానికి చెందిన సరస్వతి కన్నీటి పర్యంతమయ్యారు. గాజులరేగ ప్రాంతానికి చెందిన జగదీష్ నాలుగేళ్ల కిందట ఛత్తీస్‌గఢ్ అడవుల్లో జరిగిన మావోల ఎదురు కాల్పుల్లో మృతిచెందాడు. హిడ్మా ఆధ్వర్యంలోనే ఈ దాడి జరిగింది. తాజాగా అతడు మృతిచెందడంతో నగరంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ఏడాది జైలు శిక్ష

న్యాయవార్తా విభాగం: భార్యను వేధిస్తున్న వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. నగరానికి చెందిన కె.వీరబాబు అదనపు కట్నం కోసం మానసికంగా వేధిస్తున్నాడని అతని భార్య సుజాత 2022లో పోలీసులను ఆశ్రయించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు.

సూరిబాబుపై ఫిర్యాదు

కొత్తవలస, న్యూస్‌టుడే: మాజీ ఎంపీటీసీ సభ్యుడు మిందివలసకు చెందిన వై.సూరిబాబుపై తహసీల్దారు పి.అప్పలరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసత్య ఆరోపణలతో సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. తనను కులం పేరుతో దూషించాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని తహసీల్దారు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2021లో జరిగిన మ్యూటేషన్‌కి ఇప్పుడు తనను తప్పు పట్టడం సరికాదన్నారు. తాను డబ్బులు అడగలేదన్నారు. కార్యాలయానికి వచ్చినప్పుడల్లా ఎవరెవరికో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అడిగేవాడని, అందుకే ఆయనను లోపలకి రానివ్వలేదన్నారు.

సమస్యలు విన్నాం.. పరిష్కరిస్తాం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధి నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లోని 20 వార్డుల్లో సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ జయరాం తెలిపారు. బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్'లో పాల్గొని నగరవాసుల నుంచి వచ్చిన సమస్యలను విన్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

మాట్లాడుతున్న కమిషనరు జయరాం

సమస్య : నెల్లిమర్లలోని ఎంజేపీ పాఠశాలకు, మిమ్స్ వైద్య కళాశాల నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మార్గాల్లో వీధి దీపాలు వెలగడం లేదు.

- ఎ.వేణుగోపాలరావు, ఎస్‌వీ ఇబ్రహీం, సతివాడ పీఏసీఎస్ ఉద్యోగి

పరిష్కారం : ఎంజేపీ పాఠశాల మార్గంలో ఇటీవల మూడు దీపాలు వేశాం. త్వరలో మిగతావి వేస్తాం. మిమ్స్ వైద్య కళాశాల దారిలో లోవోల్టేజీ వల్ల పాడయ్యాయి. చర్యలు తీసుకుంటాం.

? జరజాపుపేటలో తాగునీటి ట్యాంకు మెట్లు పాడై గత ఆరు నెలలుగా శుభ్రత, క్లోరినేషన్ జరగడం లేదు. రోగాలు ప్రబలే అవకాశం ఉంది. - పి.శ్రీనివాసరావు, పోస్టుమాస్టర్

● మెట్లు మరమ్మతులకు చర్యలు చేపడతాం. ట్యాంకు శుభ్రతకు ప్రత్యామ్నాయ ఏర్పాటు, తాగునీరు క్లోరినేషన్ చేస్తాం. రోగాలు రాకుండా జాగ్రత్తలు పాటిస్తాం.

? జరజాపుపేట 18వ వార్డులో పైపులైన్లు సక్రమంగా లేక కుళాయిలు ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. - కె.రాజశేఖర్, విశ్రాంత జవాను

● పైపులైన్లు సరిచేసి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

? నెల్లిమర్ల అగురువీధిలో తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. జరజాపుపేట దేవిగుడి వద్ద లీకు ఏర్పడింది. నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నాం. - ఆర్.వాసు, అగురువీధి, కె.నీలకంఠం, జరజాపుపేట

● పైపులైన్లకు మరమ్మతులు చేసి తాగునీరు సరఫరా చేస్తాం.

? థామస్‌పేటలో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. జరజాపుపేటలో కొంచవాణి చెరువు వద్ద చెత్త పేరుకుపోయింది. - పి.రాము, ఫార్మసీ ఉద్యోగి, థామస్‌పేట, బి.ప్రసాద్, మిమ్స్ ఉద్యోగి, జరజాపుపేట

● కాలువలో పూడికలు, చెరువు వద్ద చెత్త చెదారాన్ని తొలగిస్తాం.

విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస మేజరు పంచాయతీ శివారు బలిఘట్టం సమీపంలో 'న్యూహోప్' అనాధాశ్రమం ఎదురుగా ఉన్న లేవుట్‌లో నివసిస్తున్న కోలగట్ల భాగ్యలక్ష్మి ఇంటికి అధికారులు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. గతనెల 23న రాత్రి కండక్టర్‌ను దొంగిలించారు. దీంతో 26 రోజులుగా బాధితులు తాగునీటికి, రాత్రి అంధకారంతో ఇబ్బందులు పడ్డారు. సమస్యను జి.ఎం.ఎస్.రావు 'ఈనాడు'కు చెప్పడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఏఈ సూరిబాబు చర్యలు చేపట్టారు.

నైపుణ్యాలను మెరుగుపరచాలి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మార్లాపల్లి పాఠశాల సందర్శించారు. పిల్లల సామర్థ్యాలు పరిశీలించారు. మధ్యాహ్నం పిల్లలతో కలిసి భోజనం చేశారు. దస్త్రాల నిర్వహణ తీరుని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు బంగారు ఉమామహేశ్వరరావు ఉన్నారు. ● వేపాడ: బొద్దాం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో పి.బాల భాస్కరరావు తనిఖీలు నిర్వహించారు. దస్త్రాలు, పరిసరాలు, తరగతి గదులు, పెరటితోట, మరుగుదొడ్లు పరిశీలించారు. ఉపాధ్యాయులు ఆర్.రామసత్యం, కె.రమణమూర్తి, ఎం.తాతంనాయుడు, ఆర్ఎంటీ కె.రాంప్రసాదు పాల్గొన్నారు.

పిల్లలతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాసరావు

15 వ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ జెర్రిపోతుల రంగారావు గారు
Retd. MPHS
దుర్గ ఆలయ కమిటీ ఛైర్మన్

మీరు మానుండి దూరమై నేటికి
15సం॥ కాలం గడిచినను
మీ మధుర స్మృతులు మా మదిలో
మెదులుతూనే ఉన్నాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుణ్ణి ప్రార్థిస్తూ...

భార్య : J. త్రినాథమ్మ
96421 81381

కుమార్తెలు - అల్లుళ్లు
G. శాంతిలక్ష్మి - G. శ్రీనివాసరావు (లాలు) లేటు
Ln. S. పద్మావతి (తులసి) - Ln. S. ఉదయ్‌శంకర్

మనుమలు, మనుమరాళ్లు మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

ఈనాడు పశ్చిమగోదావరి

ఆ వేంకన్న వైద్య చలవ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే

ఆపద మొక్కులవాడు ద్వారకా తిరుమల చిన్న వేంకన్నను దర్శించుకుంటే భక్తుల కష్టాలు తీరతాయనేది నమ్మకం. ఆ స్వామి చలవతో నడుస్తున్న విర్డ్ ఆసుపత్రి ఆధునిక వైద్యాలయంగా రోగులకు పునర్జన్మనిస్తోంది.

● పోలియో బాధితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రారంభమైన ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో సామాన్యులకు అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. అత్యాధునిక పరికరాలతో ఏడు ఆపరేషన్ థియేటర్లు, ల్యాబొరేటరీ, ఎక్స్‌రే విభాగం సమకూర్చారు. ఇక్కడ ఓపీ ఉచితం.

ఇప్పటి వరకు వైద్య పరీక్షలు **3,18,400**

శస్త్రచికిత్సలు **8,400**

కాలిపర్స్ అందుకున్న దివ్యాంగులు **3000**

దేశ, విదేశాల నుంచి వస్తోన్న శస్త్రచికిత్సల నిపుణులు. ఇక్కడ ఆర్థోపెడిక్ విభాగంలో రోగులకు ఉచిత సేవలు అందిస్తున్నారు. **12 మంది**

ఆర్థోపెడిక్

● ట్రామా, యాక్సిడెంట్ కేసులు. ● మోకాలు, తుంటి, మోచెయ్యి, భుజం మార్పిడి శస్త్రచికిత్సలు ● కీహోల్ సర్జరీ (మోకాలు, తుంటి, మోచెయ్యి, భుజం ● వెన్నెముక (మెడ, నడుము) సమస్యలకు చికిత్సలు, సర్జరీలు ● పోలియో, సెరిబ్రల్ పాల్సీ, అంగవైకల్యం వైద్య సేవలు

రోగులను పరీక్షిస్తున్న ప్రముఖ వైద్యుడు భాస్కరానంద్

కృత్రిమ అవయవాలు

● ఏలూరు గుప్తా ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు కాలిపర్స్ ● ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు పోగొట్టుకున్న వారికి 3డీ సాంకేతికతతో కృత్రిమ అవయవాలు ● అత్యాధునిక వసతులతో 16 పడకల ఫిజియోథెరపీ విభాగం

నెఫ్రాలజీ, యూరాలజీ

● కిడ్నీలో రాళ్లు, ప్రొస్టేట్ ఎన్లార్జ్‌మెంట్ సమస్యలకు ఎండోస్కోపీ లేజర్ చికిత్స. ● మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లకు చికిత్స. తదితర వాటికి...

జనరల్ సర్జరీ

● గాల్ బ్లాడర్‌లో రాళ్లు, హెర్నియా, హైడ్రోసెల్, గర్భసంచిలో గడ్డలు, 24గంటల నొప్పి, పేగు పూత, పైల్స్, ఫిస్టులా, ఫిషర్, థైరాయిడ్ వంటి సమస్యలకు శస్త్రచికిత్సలు చేస్తారు. (లాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తారు).

చెవి, ముక్కు, గొంతు సర్జరీలు

● చెవిలో చీము, చెవుడుకు మైక్రోస్కోపిక్ ● సైనోసైటిస్‌కి ఎండోస్కోపి ● ట్రాన్సిల్స్, ఎడినాయిడ్స్.

మరిన్ని సేవలు

ఆర్థోపెడిక్స్, యూరాలజీలో ఎన్టీఆర్ వైద్య సేవ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లు అందుబాటులో ఉన్నాయి. డయాలసిస్ సేవలు అందుతున్నాయి. వైద్యం కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు ఉచిత భోజనం సదుపాయం, అత్యవసర సేవలకు అంబులెన్స్ ఉన్నాయి.

- ఎస్.వి.సుధాకర్, ఆసుపత్రి ఛైర్మన్

క్షీరపురి.. ఆధ్యాత్మిక ఝురి..

విద్యుద్దీప కాంతుల్లో దేదీప్యమానంగా ఆలయం

కుమారస్వామి తన ఆయుధంతో తారకాసురుని కంఠంలో అమృత లింగాన్ని ఛేదించగా అయిదు ముక్కలుగా పడిపోయిందని పురాణ ఇతిహాసం. అందులోని ఒక భాగాన్ని క్షీరపురి(పాలకొల్లు)లో విష్ణుమూర్తి ప్రతిష్ఠించారు. రెండోది ద్రాక్షారామంలో దక్షుడు, మూడోది సామర్లకోటలో కుమార భీమేశ్వరున్ని కుమారస్వామి, నాలుగోది భీమవరంలో చంద్రుడు సోమేశ్వరుడిని, అయిదో భాగాన్ని ఇంద్రుడు అమరావతిలో అమరేశ్వరుడిని ప్రతిష్ఠించారు. పాలకొల్లులో శివలింగాన్ని త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు పునఃప్రతిష్ఠించి పూజించడంతో క్షీరారామ లింగేశ్వరస్వామి క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పట్టణంలో ఎటునుంచి చూసినా గోపురం కనువిందు చేస్తోంది.

- ఈనాడు, పాలకొల్లు

రైతుల సమక్షంలో చెక్కు విడుదల చేస్తున్న ఉపసభాపతి రఘురామ

అన్నదాతకు అండగా ప్రభుత్వాలు

పెదఅమిరం (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గంలో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం రెండో విడతగా 9,629 మంది రైతుల ఖాతాల్లో రూ.6.61 కోట్లు జమ చేసినట్లు ఉపసభాపతి రఘురామకృష్ణరాజు బుధవారం తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని ఆయన కార్యాలయంలో రైతుల సమక్షంలో చెక్కును విడుదల చేసి మాట్లాడారు. రైతుల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయన్నారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు కలిపి ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాయన్నారు. ఉండి నియోజకవర్గంలో మొదటి విడత 9,629 మందికి రూ.6.50 కోట్లు జమ చేశామన్నారు. రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అల్లిక.. కొత్త కళ ఇక

● లేసు పార్కుకు పూర్వవైభవం ● అబలకు చేతి నిండా ఉపాధి

● అనగనగా నరసాపురం లేసు పార్కు.. ఒకప్పుడు ఇక్కడ మహిళల చేతి అల్లికలకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉండేది. కొత్తగా నేర్చుకునే వారికి శిక్షణ ఇచ్చేవారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం ఉండేది.

● కానీ గత అయిదేళ్లు శిక్షణ లేదు.. ఉపాధి ఊసు లేదు. నరసాపురం లేసుకు ప్రాణం పోసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలు:	గ్రామాలు: 250
పశ్చిమ, కోనసీమ అంబేడ్కర్	మహిళలు: 95 వేల మంది
	ఎగుమతిదారులు 50

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే

నరసాపురంలోని సీతారాంపురంలో కేంద్ర జౌళి శాఖ నేతృత్వంలో కేంద్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా లేసు పార్కును ఏర్పాటు చేశారు. దీనికి అనుసంధానంగా 51 సొసైటీలు, అలంకృతి మినీ లేసుపార్కుల పేరిట భవనాలు నిర్మించారు. ఆధునిక కుట్టు యంత్రాల కొనుగోలు, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ ప్రారంభించారు. కానీ వైకాపా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో మహిళలు శిక్షణకు నోచుకోలేదు. ఉపాధికి ఢోకా పడింది.

శిక్షణ, ఉపాధి.. నాబార్డుతో కలిసి అధునాతన డిజైన్లలో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు, వ్యక్తిగత నైపుణ్యం పెంచేందుకు, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు ఒక ఎన్జీవో ద్వారా అయిదేళ్లు ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికే నాబార్డు బృందం రెండు నెలల్లో మూడు సార్లు లేసు పార్కును సందర్శించి అక్కడి ఉత్పత్తులను పరిశీలించింది.

చేతితో దుస్తులు అల్లుతున్న మహిళలు

ఎన్నో గుర్తింపులు

● గతేడాది జులైలో భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ - జీఐ) దక్కింది.

● జులైలో కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి అవార్డును సొంతం చేసుకుంది.

సీఎస్ఆర్ నిధులు.. కలెక్టర్ చదలవాడ నాగరాణి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.4 లక్షల రుణాలు అందించారు. 200 మంది హస్తకళాకారులను గుర్తించి దారాలను అందించి వివిధ రకాల ఉత్పత్తులను చేసి ఎగ్జిబిషన్లకు తరలించి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో అల్లికలు వేగవంతం అవుతాయని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు.

నాన్నా.. తీసుకెళ్లావా.. తిరిగి రాని లోకానికి..!

నా తల్లి అన్నావ్..
నా బంగారు కొండవన్నావ్..
నా గుండెంతా నువ్వేనన్నావ్..

రా.. అమ్మా..
రా.. బయటకు వెళ్దామంటే..
భలే భలే..
మా నాన్నతో వెళ్తున్నా..
అన్ని చూపిస్తాడు..
అడిగినవన్నీ కొనిస్తాడు..
ఆనందంగా ఇంటికి తీసుకొస్తాడని..
అనుకున్నా..

కానీ..
అదేంటి నాన్న..
అలా చేశావ్..
అడగనంత దూరానికి..
తిరిగి రాని లోకానికి
తీసుకెళ్లిపోయావు..

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం చించినాడ వంతెన పైనుంచి గోదావరిలో ఇద్దరు పిల్లలతో దూకిన తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్(35), కుమారుడు మోహిత్ (14)ల మృతదేహాలు మంగళవారం సాయంత్రం లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి (9) మృతదేహం దిండి సమీపంలో బుధవారం సాయంత్రం దొరికింది. పాలకొల్లు గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరానికి చెందిన దుర్గాప్రసాద్, భార్య నాగవేణికి మధ్య కొంత కాలంగా తగాదాలు ఉన్నాయి. ఈ కారణంగా దుర్గాప్రసాద్ ఈ ఘాతుకం చేసి ఉంటాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీనిపై దుర్గాప్రసాద్ తండ్రి సత్యనారాయణ, బావమరిది రమేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురి మృతదేహాలకు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించి బంధువులకు అప్పగించనున్నట్లు వివరించారు.

మాయ చేస్తారు.. డబ్బు కాజేస్తారు

నకిలీ పత్రాలతో రుణాలు

➤ ఇటీవల ఏలూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న సిబ్బంది రుణాలిప్పిస్తామని పలువురు దగ్గర వారి ఆధార్, పాన్‌కార్డు తీసుకుని వేరే వారి ఇళ్ల ఫొటోలను వారి ఆస్తిగా చూపి నకిలీ పత్రాలతో రిజిస్టర్ చేయించి రూ.2 కోట్ల వరకు రుణాలు పొందారు. ఆడిట్ సమయంలో విషయం పడటంతో బ్యాంకు మేనేజర్ పోలీసులను ఆశ్రయించారు.

➤ నరసాపురం గ్రామీణ మండలం వేములదీవికి చెందిన భూములకు నకిలీ దస్త్రాలు సృష్టించి రూ.2 కోట్ల వరకు నరసాపురంలోని ఓ బ్యాంకులో రుణం పొందారు. మొగల్తూరు మండలానికి చెందిన పేరుపాలెం, శేరేపాలెం, మొగల్తూరు తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములకు నకిలీ లీజు పత్రాలు సృష్టించి గతంలో గణపవరం, కైకలూరు, గుడివాడల్లోని బ్యాంకుల్లో అక్రమార్కులు రుణాలు పొందారు. దీనిపై సీఐడీ నమోదు చేసిన కేసుల విచారణ కొనసాగుతోంది.

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, ఉండి, న్యూస్‌టుడే: తేలికగా సంపాదనకు అలవాటు పడిన అక్రమార్కులు నకిలీ దస్త్రాలతో కొన్నిచోట్ల బ్యాంకులను బురిడీ కొట్టిస్తుంటే.. మరికొన్నిచోట్ల బ్యాంకు సిబ్బందే చేతివాటానికి పాల్పడుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లాలో ఉలిక్కిపాటుకు గురిచేస్తున్నాయి. సంబంధం లేని భూములను, ఆక్వా చెరువులను తామే సాగు చేస్తున్నట్లు, ఆధార్, పాన్‌కార్డులతో వేరే వారి ఇళ్లకు నకిలీపత్రాలు సృష్టించి రూ.కోట్లలో రుణాలు పొంది ఆనక ముఖం చాటేస్తున్నారు.

ఇదీ పరిస్థితి బ్యాంకుల్లో రుణం పొందాలంటే ఆస్తి పత్రాలు తనఖా పెట్టుకుంటారు. చేపలు, రొయ్యల చెరువులు లీజుకు చేస్తున్నట్లు, దాన్ని ఆదాయ మార్గంగా చూపి అక్రమార్కులు రూ.కోట్లలో రుణం పొందుతున్నారు. జిల్లాలో ఆక్వా మరింత విస్తరిస్తుండటంతో నరసాపురం, భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకు రుణం పొందాక ఆనం ముఖం చాటేసిన ఘటన లూ గతంలో బయట పడ్డాయి.

అవసరమైతే ఫోర్జరీ తనఖాకు అవసరమైన దస్త్రాల కోసం సబ్ రిజిస్ట్రార్, బ్యాంకు సిబ్బందికి కొంతమొత్తం ముట్టచెప్పి ఫోర్జరీ సంతకాలు సైతం చేస్తున్నారు. బ్యాంకులకు వాయిదాలు చెల్లించకపోవడంతో విషయం బయటపడిన తర్వాత వసూళ్లకు వెళ్లినా కోర్టులో తేల్చుకోండంటూ ఎదురు సమాధానమిస్తున్నారు. గతంలో ఓ ఆక్వా రైతు భీమవరానికి చెందిన ఓ షెడ్యూలు బ్యాంకులో నకిలీ డాక్యుమెంట్లతో రూ.3 కోట్ల రుణం పొందారు. అవి నకిలీవని తెలిసి రుణం వసూళ్లకు ప్రయత్నించగా బ్యాంకు సిబ్బంది మా ఇంటి వద్దకు రావద్దంటూ కోర్టును ఆశ్రయించారు.

ప్రలోభాలకు లోనై.. బ్యాంకు రుణానికి దరఖాస్తు చేసినప్పుడు సిబ్బంది వారి పత్రాలు సవ్యంగా ఉన్నాయా, లేవా అని పరిశీలించాలి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూడాలి. కానీ కొంతమంది బ్యాంకర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది రుణ దరఖాస్తుదారులతో కుమ్మక్కై అవేమీ పట్టించుకోవడం లేదు. ప్రతిఫలంగా భారీస్థాయిలో వస్తు, ధన రూపంలో ముడుపులు తీసుకుంటున్నారు. నరసాపురం, భీమవరం, కాళ్ల, ఉండి, ఆకివీడు తదితర ప్రాంతాల్లో చాపకింద నీరులా ఈ వ్యవహారాలు జరుగు తున్నాయి. గతంలో భీమవరంలో రెండు బ్యాంకులు నకిలీ పత్రాలకు రుణాలు అందించి దెబ్బతిన్నాయి. ప్రలోభాలకు లోనైన సిబ్బంది బలవన్మరణం చెందిన ఉదాంతాలూ ఉన్నాయి.

ఉదయం నుంచీ ఉత్కంఠ

భారీ బందోబస్తుతో న్యాయస్థానానికి తరలింపు

మహిళా పోలీసుస్టేషన్ నుంచి మావోయిస్టులను కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరులో 15 మంది మావోయిస్టులను బుధవారం ఉదయం నుంచి కోర్టుకు తీసుకువెళ్లే వరకు ఉత్కంఠ కొనసాగింది. ఎస్పీ కార్యాలయం వెనుక మహిళా పోలీసుస్టేషన్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వారిని అక్కడే ఉంచారు. తర్వాత రెండు వాహనాల్లో న్యాయస్థానానికి తరలించారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు కోటేశ్వరరావు, అశోక్‌కుమార్, విల్సన్, శుభాష్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య పరీక్షలు, స్టేట్‌మెంట్‌ల నమోదు కొంత ఆలస్యం కావటంతో 2 గంటల సమయంలో కోర్టుకు తీసుకువెళ్లారు. అప్పటికే న్యాయమూర్తి భోజన విరామం కోసం వెళ్లటంతో మావోయిస్టులను మళ్లీ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో రెండో సారి కోర్టుకు తరలించారు. మావోయిస్టులు అందరూ 30 నుంచి 35 ఏళ్ల లోపు వారే.

అందరూ కీలక నేతలే: మావోయిస్టులందరూ కీలకమైనవారేనని, వీరిలో కొందరిపై రివార్డులు ఉన్నాయని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. 13 మంది డివిజన్ కమాండర్ స్థాయికి చెందినవారు. వీరి కింద ఒక్కొక్కరి వద్దే 10 నుంచి 15 మంది అనుచరగణం ఉంటారని అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఎస్పీ తెలిపారు.



ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సమక్షంలో తరలింపు

45 నిమిషాల్లో ఆపరేషన్ ముగించాం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: 'నిఘా వర్గాలు స్పష్టమైన సమాచారాన్ని ఇచ్చాయి. మేము పట్టుకోబోయేది మావోయిస్టుల కీలక నేతలనని తెలుసు. వారి వద్ద ఆయుధాలు ఉంటాయని ఎదురుదాడికి దిగే అవకాశం ఉందని గుర్తించి అత్యంత పకడ్బందీగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాం. వారికి అవకాశం ఇవ్వకుండా ఒక్కసారిగా చుట్టుముట్టి 45 నిమిషాల్లో ముగించాం' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పేర్కొన్నారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బంది లేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టంగా అన్నీ పరిశీలించాకే ఈ ఆపరేషన్ చేశామన్నారు. పట్టుబడిన మావోయిస్టులందరూ అగ్రనేత హిడ్మా కింద పనిచేసిన వాళ్లేనని, ఆయనతో మంచి సంబంధాలున్నాయని, హిడ్మా గతంలో చేసిన అనేక దాడుల్లో వీళ్లు పాల్గొన్నారన్నారు. గ్రీనుసిటీలో పనికి వచ్చిన వారిగా ఇంటిని అద్దెకు తీసుకున్నారని, ఆ ఇల్లు ఎవరిది అనే దానిపై లోతుగా విచారణ చేస్తున్నామని చెప్పారు.

గోదారి జనానికి.. సత్యసాయి జలప్రసాదం

7.50 లక్షల మంది దాహం తీరుస్తున్న పథకం

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం మండలం పట్టిసీమ పరిధిలోని కన్నాపురం కూడలిలో గోదావరిపై సత్యసాయి మంచినీటి పథకానికి 2003-04లో శ్రీకారం చుట్టారు. గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా తూర్పు గోదావరి జిల్లా పరిధి గోపాలపురం మండలం హుకుంపేట వద్ద నిర్మించిన ఫిల్టర్‌బెడ్‌ల్లోకి నీటిని పైపుల ద్వారా తరలిస్తున్నారు. అక్కడ శుద్ధి చేసిన తర్వాత 150 కిలోమీటర్ల పైబడి పైపులైన్ల ద్వారా మెట్ట ప్రాంత ప్రజలకు అందిస్తున్నారు.

నాడు: గోదావరి పక్కనే ఉన్నా.. తాగేందుకు చుక్కనీరు అందని పరిస్థితి. వేసవిలో వాగులు, చెలమల్లో నీరే దిక్కు.. కొన్ని చోట్ల అడుగంటిన బోర్ల నుంచి వచ్చే శుద్ధ నీరు తాగి దాహార్తి తీర్చుకోవాల్సిన దుస్థితి.

నేడు: భగవాన్ సత్యసాయి పుణ్యమా అని స్వయంగా ఏజెన్సీ గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేసిన పథకం నేడు లక్షలాది మంది దాహార్తి తీరుస్తోంది.

పథకం పేరు: సత్యసాయి మంచినీటి పథకం	
ప్రారంభం: 2006	నిర్మాణ వ్యయం: రూ.160 కోట్లు
నియోజకవర్గాలు: పోలవరం, గోపాలపురం, చింతలపూడి, కొవ్వూరు	
మండలాలు: 17	గ్రామాలు: 250
లబ్ధి పొందే ప్రజలు: 7.50 లక్షలు	
పంపిణీ లక్ష్యం: రోజుకు 2 కోట్ల లీటర్లు	పనిచేసే సిబ్బంది: 110

చేగొండపల్లిలో ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజనులు

సోమేశ్వరునికి భూదానం

రూ. 44 లక్షలతో సెంటున్నర కొనుగోలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయానికి రాజమహేంద్రవరానికి చెందిన గన్నమనేని శివరామకుమార్ భూదానం చేశారు. స్వామి వారి క్షేత్రానికి పక్కన ఉత్తరం వైపు గోడకు ఆనుకుని ఉన్న సెంటున్నర స్థలం ఖరీదు రూ.44 లక్షలు. దానిని కొనుగోలు చేసి స్వామికి ఇచ్చేందుకు ఆయన ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. బుధవారం భూమి రిజిస్ట్రేషన్ చేయించారు. ఈవో రామకృష్ణంరాజు, పాలకవర్గ ఛైర్మన్ బంగార్రాజు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం అవకతవకలకు పాల్పడితే చర్యలు: మంత్రి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పీడీఎస్ బియ్యం అవకతవకలకు పాల్పడిన వారు ఎంతటివారైనా చర్యలు తప్పక తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో జరిగిన కుంభకోణంలో ఎవరినీ వదిలి పెట్టేది లేదన్నారు. రూ.5.48 కోట్లు పీడీఎస్ బియ్యం దారి మళ్లిన సంఘటనపై కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే కొంతమంది కారకులపై చర్యలు తీసుకున్నామని, కమిటీ నివేదిక రాగానే మిగిలిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,752 చౌకధరల దుకాణాల ద్వారా ప్రతి నెలా 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేస్తున్నామని, గతంలో వ్యాన్ ద్వారా గంట, అరగంట మాత్రమే పంపిణీ చేశారన్నారు.

ఆక్వాపై పగమంచు

గగ్గోలు పెడుతున్న రైతులు

ఉండి, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: గత వారం రోజులుగా పొగ మంచు పెరుగుతోంది. దీంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ఈ ప్రభావంతో రొయ్యలు, చేపలు వివిధ రకాల వ్యాధుల బారిన పడి రైతులను ఆర్థికంగా నష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. ఆక్సిజన్ లోటుకు గురైన చోట్ల ఆకస్మికంగా పట్టుబడులు జరుపుకోవడమే సాగుదారుడి ఎదుట ప్రత్యామ్నాయం మార్గంగా కన్పిస్తోంది.

చేపకు శంఖుజలగ వ్యాధి

జలచరాలు శీతల రక్తజీవులు. చెరువుల్లోని నీటి ఉష్ణోగ్రతల ఆధారంగా వాటి శరీరంలో జీవ ప్రక్రియ మారుతోంది. ప్రస్తుతం రోజులో అత్యధిక సమయం 17- 19 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో రొయ్యలు, చేపల్లో అరుగుదల శాతం తగ్గి మేతలు సరిగ్గా తినడం లేదు. ఈ కారణంగా వారానికి రెండున్నర, మూడు గ్రాముల మధ్య రొయ్యలు, 150-200 గ్రాముల వరకు చేపలు ఎదగాల్సింది పోయి తగ్గుతున్నాయి.

ఒత్తిడితో అడుగుకు.. చలి తీవ్రత, పొగమంచుతో చెరువుల్లో వృక్ష ప్లవకాలు దెబ్బతింటున్నాయి. తద్వారా జంతు ప్లవకాలు వృద్ధి తగ్గి చేపలు, రొయ్యల పెరుగుదల, ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతున్నాయని మత్స్య నిపుణులు ఎన్.వీరభద్రరావు, ఏ.శ్రీనివాసరావు తెలిపారు. చెరువులో నీటి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలతో పీహెచ్ పెరిగి నీటి మధ్య, అడుగు భాగాల్లో ఎక్కువ సమయం ఉండిపోతున్నాయి. దీంతో చేపల్లో పేను, శంఖుజలగ, తాటాకు తెగులు, రొయ్యల్లో వైట్‌స్పాట్, ఈహెచ్‌పీ వ్యాధులు పెరుగుతున్నాయని చెబుతున్నారు.

వైరస్ బారిన పడిన రొయ్యలు

ఏం చేయాలంటే..! నీటి లోతు 5 అడుగులకు మించి ఉంటే పొగ మంచు అడుగుకి చేరదు.
➤ మేతలు 20-30 శాతం తగ్గించాలి. కొవ్వు పదార్థాలతో కూడిన లివర్ ఆయిల్ మేతలో జత చేయాలి. ➤ మేత సంచులు ఎండలో ఆరబెట్టి శానిటైజ్ చేయాలి.
➤ వ్యవసాయ సున్నం (లైమ్) ఎకరానికి ఒకట్రెండు బస్తాలు పది రోజులకు ఒకసారి చల్లుకోవాలి. ➤ చెరువు గట్లపై ఉన్న గడ్డిని తొలగించాలి. పేను మందు మేతలతో కలిపి అందించాలి.

ఉభయ జిల్లాలో ఇలా..
చెరువుల విస్తీర్ణం : 282,331 ఎకరాలు
అనుకూల స్థాయి ఉష్ణోగ్రతలు : 28-32 డిగ్రీల మధ్య
ప్రస్తుత నమోదు స్థాయి : 17-31 డిగ్రీల మధ్య

(c) eenadu

వైద్య విద్యార్థుల వాలీబాల్ జట్టు ఎంపిక

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఆశ్రం వైద్య కళాశాలలో డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైద్య విద్యార్థుల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ వైద్య కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. అంతకుముందు కళాశాల ప్రధానాచార్యుడు చేబ్రోలు శ్రీనివాస్, సీఈవో కె.హనుమంతరావు ప్రారంభించి మాట్లాడారు. ఎంపిక కమిటీ సభ్యులుగా ఇ.త్రిమూర్తులు, ఎ.ఆంజనేయులు, శ్రీనివాస్, నల్లయ్య, శ్రీనివాసరాజు వ్యవహరించారు. డిసెంబరు 15 నుంచి 19 వరకు చెన్నై వేదికగా నిర్వహించే దక్షిణ భారత యూనివర్సిటీ మహిళల వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున క్రీడాకారులు పాల్గొంటారని శ్రీనివాసరాజు తెలిపారు.

జట్టు సభ్యులు వీరే.. ఎన్.యామిని, కేజేఎల్ఎస్ అనీల, ఎం.వేద కృష్ణ, డి.సృజనావర్మ, ఎం.ఎం.హేమలత, బి.సాయి జ్యోతిర్మయి, టి.గ్రీష్మ, ఎన్.సుమేధ, ఎస్కే చరిస్మా, బీఎన్‌జీజీ అన్నపూర్ణాదేవి, ఎస్కే అఫ్రీన్, ఎ.భార్గవి, జి.సిరి, కె.నవ్య గీతిక.

స్టాండ్‌బై.. కె.నాగ శ్రీవల్లి, డి.సంజనా, ఎం.శివ జ్యోత్స్న, కె.నికిత, ఎస్.శ్రీనిజ, ఇ.వినుషా

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మనోజ్ఞ

విద్యార్థినిని అభినందిస్తున్న ఉషారాణి, హిమబిందు

తణుకు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని మానె మనోజ్ఞ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ భూపతి రాజు హిమబిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో ఐకాన్ స్పోర్ట్స్ హబ్ విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. జనవరి 2 నుంచి 7 వరకు ఢిల్లీలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ఞను హిమబిందు, కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి, తదితరులు అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

EDUCATION

B.Sc. Ag. / B.Sc. Forensic Science / Cyber Forensics / BBA - Aviation Mgt. Courses in Vijayawada - ICAR Syllabus. ✆ 9912178237.

BPT/B.Sc. MLT / DMLT / DRGA / DMIT / O.T. Tech / DANS / D.Cardio/Dialysis - Courses in Vijayawada - MGT./Convener Quota. ✆ 7995945835.

REAL ESTATE

PLOT FOR SALE

తణుకు, వేమవరం 10వ వార్డులో, చిట్టూరి బాపినీడు గారి ఇంటి వెనుక లేఔట్‌లో తూర్పు పంటకాలువ ఉన్న N/E కార్నర్ ఈశాన్య ప్లాట్ (నెం.42) 253 చ॥గజాలు అమ్మకానికి కలదు. మున్సిపాలిటీ వారిచే క్రమబద్ధీకరణ చేయించబడినది. ✆ 8639 779 569.

వైజాగ్ Google డేటా సెంటర్ - ఎయిర్‌పోర్ట్ మధ్య హైవే ఫేసింగ్ వెంచర్‌లో మీపెట్టుబడికి. గజానికి అధిక ఆదాయం. త్వరపడండి. ✆ 9949000033

JOBS

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 - 29000. వ: 18-35. ✆: 7730958410.

లక్ష్మి మోటార్స్ (YAMAHA షోరూమ్) తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, ఏలూరు నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 96667 14613.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల్ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.38 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

92.7 FM Rajamahendravaram (ఈ FM 92.7 Mee FM)

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Regional Sponsor: City Chalapathi Institute of Technology (Autonomous), Mothadaka Campus
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్ | Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat | Organised by: ఈనాడు

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

నమోదు కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్ సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు కార్యాలయం
తాడేపల్లిగూడెం - 534411
వివరాలకు: 99592 24506
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

మేనల్లుడిపై పైశాచికం

- వేడి గరిటెతో వాతలు పెట్టిన మామ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: దసరా సెలవులకు ఇంటికొచ్చిన 11 ఏళ్ల మేనల్లుడిపై మామ పైశాచికంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చేబ్రోలు పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన బాలుడు పెంటపాడులోని ఓ వసతి గృహంలో ఉంటూ అయిదో తరగతి చదువుతున్నాడు. బాలుడి మేనమామ 23 ఏళ్ల చిన్నమిల్లి కుమార్‌రాజు ఓ పరిశ్రమలో పని చేస్తూ నాచుగుంట-వెంకట్రామన్నగూడెం మధ్య నివాసముంటున్నాడు. దసరా సెలవులకు బాలుడిని తన ఇంటికి తీసుకెళ్లి ఇద్దరూ భవానీ దీక్ష తీసుకున్నారు. సెలవులు పూర్తయిన కొన్ని రోజుల తర్వాత బాలుడిని వసతి గృహానికి తీసుకెళ్లాడు. తలపై గాయం ఉండటంతో ఏమైందని మేనమామను వసతి గృహ పర్యవేక్షకుడు ప్రశ్నించారు. ప్రమాదం జరగడంతో గాయమైందని బదులిచ్చాడు. గాయం మానడానికి పత్యం చేయాలని.. కొన్నాళ్లు ఇంటి నుంచి తీసుకొస్తానని చెప్పాడు.

బాలుడి కాలుపై గాయం

పొంతనల్లేని సమాధానంతో..

తర్వాతి రోజు బాలుడు బడికొచ్చినప్పుడు కాలుపైనా కాలిన గాయాలుండటంతో కుమార్ రాజును ఉపాధ్యాయులు ప్రశ్నించడంతో పొంతనల్లేని సమాధానాలిచ్చాడు. కొన్ని రోజులుగా బాధితుడిని ఉదయం పాఠశాలకు తీసుకొచ్చి సాయంత్రం ఇంటికి తీసుకెళ్లేవాడు. విషయం విద్యార్థి సహచరుల ద్వారా మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్త తెలియడంతో.. ఆమె సెక్టారు పర్యవేక్షకురాలి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె పెంటపాడు పోలీసులకు సమాచారం తీసుకెళ్లారు. ఆ ప్రాంతం వెంకట్రామన్నగూడెం పరిధిలోకి రావడంతో తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీసులకు విషయం తీసుకెళ్లారు. చివరకు నాచుగుంట పరిధి కావడంతో చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కుమార్ రాజును అదుపులోకి తీసుకున్నారు.

మంచంపై మూత్రం పోశాడని.. మంచంపై మూత్రం పోశాడని బాలుడిపై మేనమామ కర్కశంగా ప్రవర్తించాడు. గరిటెను బాగా వేడి చేసి శరీరంపై ఎక్కడి పడితే అక్కడ వాతలు పెట్టాడు. ముఖంపై కొరికేయడంతో పంటి ఆనవాళ్లున్నాయి. దాదాపు బాలుడిని చంపే ప్రయత్నం చేశాడు. లైంగిక దాడికి కూడా పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

రూ.15 లక్షల విలువైన బంగారం అపహరణ

పోలీసుల అదుపులో నిందితులు?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం నుంచి నరసాపురంలోని దుకాణానికి తీసుకెళ్తున్న బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడని కె.ఆంజనేయ ప్రసాద్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 17న భీమవరం బస్టాండులో బస్సు ఎక్కుతుండగా నీలిరంగు చొక్కా వేసుకున్న వ్యక్తి బాధితుడ్ని తోచుకుని వెళ్లిన సమయంలో బంగారం ఉన్న ప్యాకెట్‌ను లాక్కెళ్లిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన బంగారం విలువ రూ.15 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొనగా సీఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

మాట్లాడుతున్న నాగరాణి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం పెదమైనవానిలంకలో డిజిటల్ సామాజిక భవనం వద్ద రామకృష్ణ మఠం మిషన్ ఆధ్వర్యంలో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం బుధవారం మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేశారు. దానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ నాగరాణి, రామకృష్ణ మిషన్ రాజమహేంద్రవరం కార్యదర్శి పరిజ్ఞేయానందజీ మహారాజ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పేద మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచేందుకు తోడ్పాటు అందిస్తున్న రామకృష్ణ మఠం మిషన్ నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. మొంథా తుపాను కారణంగా నరసాపురం తీర ప్రాంతంలో నష్టపోయిన ప్రజలకు తమ వంతు సాయం అందించేందుకు రామకృష్ణ మఠం ముందుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా నరసాపురం, మొగల్తూరు తీర ప్రాంతంలోని వంద మంది మత్స్యకారులను ఎంపిక చేశామన్నారు. ఒక్కొక్కరికి రూ.50 వేల విలువైన సంప్రదాయ వేట పడవ, రూ.20 వేల విలువైన వల అందజేస్తామన్నారు.

మరింత మందికి సాయంపై త్వరలో నిర్ణయం.. పరిజ్ఞేయానంద స్వామి మాట్లాడుతూ.. సేవ చేయడం ఎంత ముఖ్యమో అది నిజమైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. మరింత మందికి సాయం చేయాలని కలెక్టర్ సూచించినందున మరో వంద మందికి సహాయం చేయడానికి మిషన్ ప్రతినిధులతో చర్చించి త్వరలో ప్రకటిస్తామన్నారు.

'సాగర్ కవచ్'కు సన్నాహకం

మెరైన్ పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న శ్రీవేద

నరసాపురం, న్యూస్‌టుడే: సీమాంతర ఉగ్రవాదాన్ని పీచమణుద్దామని డీఎస్పీ జి.శ్రీవేద సిబ్బందికి సూచించారు. సముద్ర తీరప్రాంత రక్షణపై మాక్‌డ్రిల్‌లో భాగంగా గురువారం 'సాగర్ కవచ్' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీవో కార్యాలయ ఆవరణలో బుధవారం సాయంత్రం పోలీసు, మెరైన్ పోలీసు సిబ్బందితో 'సాగర్ కవచ్' సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి పరిస్థితుల్లో అయినా సీమాంతర ఉగ్రవాదుల ప్రయత్నాలకు తగిన గుణపాఠం చెప్పే విధానాలు వివరించారు.

పేదలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు

జిల్లా ఆస్పత్రిలో కీళ్లు, వెన్నుపూస వ్యాధుల ఓపీ ప్రారంభం

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: తణుకు జిల్లా ఆస్పత్రిలో పేదలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో కీళ్లు, వెన్నుపూస వ్యాధులకు సంబంధించి ఓపీ విభాగాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో లయన్స్ సహకారంతో కిడ్నీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం పరిధి పెంచేందుకు మరో అయిదు డయాలసిస్ పరికరాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కంటి వ్యాధులకు సబంధించి శస్త్ర చికిత్సలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో యాపిల్ ఆసుపత్రి సౌజన్యంతో కిడ్నీ సంబంధిత ఓపీ ప్రారంభించామన్నారు. నిమ్మగడ్డ ఆసుపత్రి సహకారంతో న్యూరో, కీళ్లు, వెన్నుపూస వ్యాధులకు సబంధించి ఓపీ ప్రారంభించామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్, దొమ్మేటి వెంకట సుధాకర్, వంటెద్దు రాజా, వైద్యులు పాల్గొన్నారు.

ఉత్తరాయణం వరకూ అఖండ జ్యోతి



ఆచంట, న్యూస్‌టుడే: ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం అఖండ అన్నసమారాధన జరగనుంది. వేల సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయ నూతన కమిటీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం పాడ్యమి పోలిస్వర్గంతో ఆలయంలో కార్తికమాస పూజలు సమాప్తమయినా.. ఇక్కడ అఖండ జ్యోతి ఉత్తరాయణ పుణ్యకాలం వరకూ.. అంటే మరో రెండు నెలలకు పైగా వెలుగుతుంది. ఇప్పటికే భక్తులు సమర్పించిన వెయ్యి కిలోలకు పైగా ఆవు నెయ్యి సిద్ధంగా ఉంది.

సచివాలయంలోకి మొగల్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గ్రామంలోని కుక్కలవారితోట సచివాలయంలోకి మార్చారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం లేదు. ఇప్పటివరకూ నిర్వహించిన అద్దె భవన యజమాని ఖాళీ చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో ఖాళీ చేయాల్సి వచ్చింది. సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో అక్కడకు మార్చామని ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

మహిళను వేధిస్తున్న విలేకర్లపై కేసు

ఈనాడు డిజిటల్, భీమవరం: ఒంటరి మహిళను రూ.లక్ష ఇవ్వాలని బెదిరిస్తూ వేధింపులకు గురి చేస్తున్న ఇద్దరు డిజిటల్ మీడియా విలేకర్లపై తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ ఎండీ జిలానీ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లికి చెందిన మహిళ ఒంటరిగా జీవిస్తున్నారు. గతంలో ఆమెకు పలువురి విలేకర్లతో వివాదం చోటుచేసుకోవడంతో 'రచ్చ మీడియా'కు చెందిన తమ్మిశెట్టి రంగ సురేశ్‌ను సంప్రదించారు. ఆ సమయంలో రంగసురేశ్ ఆ మహిళకు సంబంధించిన వీడియోలు రికార్డు చేశారు. బాధితురాలు గతంలో దాఖలు చేసిన కేసును న్యాయస్థానంలో సామరస్యంగా పరిష్కరించుకుంది. దీన్ని ఆసరాగా చేసుకొని తమ్మిశెట్టి రంగసురేశ్, దేవ శివప్రసాద్ ఆమెపై కక్ష పెంచుకొని రూ.లక్ష ఇవ్వాలని.. లేకుంటే గతంలో తీసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తామని బెదిరించారు. అక్కడితో ఆగకుండా మహిళకు సంబంధించిన వీడియోను దేవ శివప్రసాద్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేసి ఆమెపై అసభ్యకర పోస్టులు పెట్టారు. దీంతో తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (सेन्ट्रल बैंक ऑफ़ इंडिया) "CENTRAL" TO YOU SINCE 1911
భీమవరం (బ్రాంచి), డోర్ నెం.23-8-20, మునిసిపల్ ఆఫీస్ రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534201. E-Mail Id: bmvija0826@centralbank.bank.in

అనుబంధం: IV-A [నిబంధన 8(6) అంశాలు చూడండి]

స్థిరాస్తులు అమ్మకం కొరకు అమ్మకం కమ్ ఇ-వేలం ప్రకటన

[illegible]

అకౌంట్ పేరు / ఋణగ్రహీత / హామీదారు / తాకట్టుదారు యొక్క చిరునామా	తనఖాపెట్టిన ఆస్తి యొక్క వివరములు	SARFAESI నోటీసుల తేదీలు	ఇ-వేలం వివరాలు
[illegible]	[illegible]	డిమాండ్ నోటీసు 05.04.2025; బకాయిపడిన మొత్తం రూ.4,35,64,457/-; 13(4) స్వాధీన నోటీసు 24.07.2025; 04-09-2025	[illegible]

ఇ-వేలం తేదీ: 22-12-2025, [illegible]

[illegible]

తేదీ: 18-11-2025, ప్రదేశం: భీమవరం — సం/- అధీకృత అధికారి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SHRIRAM Finance — శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా: డి.నెం. 22బి-13-8, 2వ ఫ్లోర్, వెంకట రామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002.

స్వాధీనత ప్రకటన

[illegible]

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి	స్వాధీనత తేదీ
[illegible]	ఋణ ఖాతా నెం. TDPLMTF1409300007 ... రూ.19,81,931/- ... డిమాండ్ నోటీసు తేదీ: 30-07-2025	18 నవంబర్, 2025

[illegible]

ప్రదేశం: ఏలూరు, తేదీ: 18-11-2025 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్

భీమవరం

•భీమవరం •ఉండి

పరిశుభ్రత...సామాజిక బాధ్యత

ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్-స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.15 వేలతో రాయకుదురులో వి.లక్ష్మి నివాసంలో నిర్మించిన మరుగుదొడ్డిని ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, డీఈఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో వైజయంతి, తహసీల్దార్ రామాంజనేయులు, సర్పంచి భారతి పాల్గొన్నారు.

మహిళల సత్కారంలో అతిథులు, నిర్వాహకులు

విద్యతో సాంకేతిక పరిజ్ఞానం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్య ద్వారా ఉపయోగించుకోవాలని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉత్తమ సేవలందిస్తున్న ఉభద్రాదేవి, గంధం శ్రీదేవి, జాన్సీలక్ష్మి, రమ్య, శాంతిలక్ష్మి, దయాప్యారి, రూపవాణి, మారియాకౌసర్, సరోజిని, పుష్పలను సత్కరించారు. ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకూ ఛిద్రం

వాహన చోదకులకు ఇబ్బందులు

ప్రయాణం అవస్థలమయం

భీమవరం నియోజకవర్గంలో ప్రధాన రహదారులు చాలాచోట్ల ఛిద్రంగా కనిపిస్తున్నాయి. భీమవరం- వెంప, వీరవాసరం -నవుడూరు, భీమవరం-కాళీపట్నం, గొల్లపాడు-దొంగపిండి, గొల్లవానితిప్ప-లోసరి తదితర ప్రాంతాల్లోని రహదారులు గుంతలు పడటంతో వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల పరిధిలో రహదారులకు మరమ్మతులు పనులు చేయాల్సి ఉందని అధికారులు అంచనా వేశారు. ఆ పనులకు రూ. 30 కోట్ల నిధులు అవసరమని వివరిస్తున్నారు.

వీరవాసరం మండలంలోని వడ్డిగూడెం రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షలతో కొంతభాగాన్ని అభివృద్ధి పరిచారు. మిగిలిన రహదారిని అలాగే వదిలేశారు.

భీమవరం అర్బన్, వీరవాసరం, న్యూస్‌టుడే: ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో ప్రధాన రహదారులే కాదు.. మారుమూల మార్గాలు సైతం అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఇవన్నీ చాలా దయనీయంగా మారాయి. పలుచోట్ల రాళ్లు లేచిపోతూ.. పెచ్చులు ఊడిపోతూ.. గుంతలు పడుతున్నాయి.

ఉండి-చేబ్రోలు మధ్య భారీ గుంతలు పడి దెబ్బతిన్న రాష్ట్రీయ రహదారి ఇది. ఇటీవల వర్షాలకు మరింత దయనీయంగా మారింది. ఏడాది నుంచి మరమ్మతులకు నోచుకోని చోట్ల ఇలా తయారైంది.

ఉండి నియోజకవర్గ పరిధిలో సుమారు 315 కిలోమీటర్ల పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారులున్నాయి. అధికవర్షాలకు 184 కిలోమీటర్ల పరిధిలో రహదారులు నామరూపాలు లేకుండా పోయాయి. ఇప్పటికే సభాపతి రఘురామకృష్ణరాజు ప్రత్యేక కృషితో దాతలు రెండుచోట్ల ముందుకొచ్చారు. వాటిలో భాగంగా ఉండి-కొల్లేరు మార్గంలో వాల్లం పరిధిలోని ఆయిగురుకుల పారిశ్రామికవేత్తలు పీ-4లో రూ.12 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. అదేరీతిలో జువ్వలపాలెం-భీమవరం రాష్ట్రీయ రహదారిలో జక్కరం, సీసలి ప్రాంతాల్లో పీ-4లో మరమ్మతులు చేయించారు. చేబ్రోలు-ఉండి రాష్ట్రీయ రహదారి దయనీయస్థితికి చేరింది. మిగిలిన 12 మార్గాల్లో 55 కిలోమీటర్లకు పైబడే ప్రాంతాల్లో అత్యవసరంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని అధికారులు తేల్చారు. ఇందుకు రూ.34 కోట్ల నిధులు అవసరమని తేల్చారు. మిగిలిన రహదారుల మరమ్మతులకు రూ.11 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించామని వివరించారు.

స్పందనకు సందేశం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి వెలివర్రు మీదుగా చిలుకూరు, గరగపర్రు మార్గంలోని బొండాడ మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెనను ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరిరాజు బుధవారం పరిశీలించారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. వంతెన పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

మేమున్నాం... మీకు తోడుగా...

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే:

? పట్టణంలో 14వ వార్డులోని భీమవరం, మినిస్ట్రీ వీధిల్లో వీధి దీపాలు వారం నుంచి వెలగట్లేదు. - 14వ వార్డు, నివాసితులు.

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - సాంబశివరావు, పురపాలక ఏఈ

కాల భైరవ పూజ

ఆకివీడు, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకుని ఆకివీడు పిల్లలమర్రి అగ్రహారం వీధిలోని పార్వతీ సమేత వెంకట లింగేశ్వర స్వామికి బుధవారం రాత్రి కాల భైరవ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు హరహర శివ నామస్మరణతో ఆలయం మార్మోగింది.

చెన్నమల్లేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి రాజులపేటలోని శ్రీచెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం ఆఖరి బుధవారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేయించారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, దాతలు ముదునూరి గోపాలరాజు, తక్కెళ్ల నరేశ్, నాగేశ్వరరావు, కొమ్మన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశామని ఆలయ అర్చకుడు సన్నిధిరాజు శేషగిరిరావు తెలిపారు.

చంద్రబాబు అనుభవంతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న రామాంజనేయులు, వేదికపై నాగరాణి తదితరులు

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడుదల సందర్భంగా బుధవారం రాయకుదురు వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంబర సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబబు తనకున్న అనుభవంతో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేశారన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సాంకేతిక పద్ధతులతో ఎక్కువ దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం సొసైటీ ఇచ్చిన వడ్డీ రాయితీ నగదును రైతులకు అందజేశారు. ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచి భారతి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు సీతారామలక్ష్మి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమర్థంగా పథకాలు అమలు.. చెరుకుమిల్లి (ఆకివీడు), న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు తెలిపారు. బుధవారం చెరుకుమిల్లి రైతు సేవాకేంద్రం వద్ద అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో రైతుల ఖాతాల్లో నగదు జమ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, తహసీల్దార్ ఫరూక్, ఏవో ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేయూత.. కాళ్ల, న్యూస్‌టుడే: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఉండి డీసీ ఛైర్మన్ తోట ఫణిబాబు అన్నారు. సీసలి గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. సర్పంచి శ్రీనివాసరావు, తెదేపా గ్రామాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బాలకృష్ణ, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న అన్నారు. భీమవరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో బూత్ స్థాయి కమిటీలతో సమీక్షించారు. రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నార్ని తాతాజీ, కపర్ది, రాంబాబు, ఈతకోట తాతాజీ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రబీలో అనువైన వంగడాలనే సాగు చేయండి

హాజరైన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ఉండి, న్యూస్‌టుడే: రబీలో అనువైన వరి వంగడాలనే సాగు చేయాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ ప్రసార కార్యక్రమాన్ని కేవీకే, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ మండలాల వచ్చిన రైతులకు పంట యాజమాన్యం అవగాహన కల్పించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆకివీడు ఏడీఏ జీవన్ ప్రతాప్ మాట్లాడారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, ఉండి ఏవో శ్రీనివాసు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కనువిందుగా సోమేశ్వరుని దర్శనం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయంలో స్వామి వారికి బుధవారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి బంగారు శిరస్సు, వెండి ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సహస్ర నామ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని ఈవో రామకృష్ణంరాజు తెలిపారు.

యాంటీ బయాటిక్స్ అతిగా వాడొద్దు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడితే దుష్ప్రయోజనాలు ఉంటాయని డీఎంహెచ్‌వో గీతాబాయి అన్నారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్ల రోజు నిర్వహించారు. వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

పుస్తకాలు అందజేస్తున్న మౌనిక

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: రాయకుదురు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులు, రహదారి భద్రత, వ్యక్తిగత రక్షణ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలను అందజేశారు. ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఆకుల మౌనిక, వాలంటీర్లు, ప్రధానోపాధ్యాయుడు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ బలోపేతానికి కృషి

ఉండి, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో ఉపాధ్యాయ సంఘ బలోపేతానికి మరింత కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఉండి కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఆ అసోసియేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, దినేశ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎలీషా, మహిళా కార్యదర్శిగా కళావతి, కోశాధికారిగా శ్యామ్‌ప్రసాద్, జిల్లా కార్యదర్శులుగా సాల్మన్ రాజు, చిరంజీవిలను ఎన్నికయ్యారు.

రహదారి పనులు ప్రారంభం

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరంలోని 1వ వార్డు అరుంధతీపేట పుంత రహదారికి మోక్షం కలిగింది. రహదారి అభివృద్ధికి ఇటీవల మండల పరిషత్తు రూ.8 లక్షల నిధులు విడుదల చేసింది. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు వీరవల్లి కనక ఉషారాణి బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. 500 మీటర్ల పొడవున్న రహదారిని తొలుత రూ.8 లక్షలతో 100 మీటర్ల నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన 400 మీటర్ల రహదారిని ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి చేయడానికి రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పూర్తి చేసినట్లు ఎంపీపీ తెలిపారు.

లారీ చోదకుడికి ఆరు నెలలు జైలు

ఆకివీడు, న్యూస్‌టుడే: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన కేసులో లారీ చోదకుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన కలిదిండి సత్యనారాయణరాజు 2021 డిసెంబర్ 10న సాయంత్రం వ్యవసాయ పనుల నిమిత్తం కాళింగగూడెం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా సిద్ధాపురంలో లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై అప్పట్లో ఆకివీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఒకరి మృతికి కారణమైన లారీ చోదకుడు బండ్రెడ్డి వీరవెంకట సత్యనారాయణకు బుధవారం భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జి.సురేశ్‌బాబు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కట్నం తీసుకురావాలని వేధింపులతో పాటు శారీరక, మానసికంగా హింసించడం వంటి నేరాలపై నిందితునిపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన ఎల్.సుష్మిత ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. కళాశాలలో చదువుకునే రోజుల్లో బాలుప్రసాద్‌ను ప్రేమపెళ్లి చేసుకోగా కొద్దికాలానికే అతని ప్రవర్తనలో మార్పులు వచ్చాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని వివరించారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

మోసగించి నగదు తీసుకున్నారని ఫిర్యాదు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: తపాలాశాఖలోని ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను తన అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని విత్‌డ్రా చేసుకున్నారని బి.గీత ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బాధితురాలి భర్త దాదాపు 20 ఏళ్ల కిందట మృతి చెందారు. అప్పట్లో అత్తమామలు ఇచ్చిన రూ.2 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా ఉదయ్, అతని భార్య నాగదుర్గ ఈ ఏడాది జూన్‌లో నగదు డ్రా చేయించి తనను మోసగించారని వివరించారు. రూ.2.15 లక్షలు ఇవ్వడంలేదని, తన ఎల్ఐసీ బాండుపై కూడా రూ.55 వేలు వివిధ రూపాల్లో రుణాలు తీసుకున్నారని ఫిర్యాదు చేయగా ఎస్సై ఎస్.కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలపై ప్రదర్శన

జువ్వలపాలెం డ్వాక్రా సభ్యుల అవగాహన ప్రదర్శనలో డీసీ ఛైర్మన్

కాళ్ల, న్యూస్‌టుడే: డ్వాక్రా సభ్యులు ఆర్థిక లావాదేవీల్లో మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్గదర్శకాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని డీసీ ఛైర్మన్ గోకరాజు వెంకట శివ రామరాజు అన్నారు. జువ్వలపాలెంలో బుధవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో మన డబ్బులు, మన లెక్కలపై అవగాహన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌతమి, సీసీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల స్థావరాలను నిర్మూలించండి

పంట బోదెను పరిశీలిస్తున్న డీఎంవో క్రాంతి తదితరులు

ఉప్పులూరు (ఉండి), న్యూస్‌టుడే: ఖాళీ స్థలాలు, పల్లపు ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతున్న స్థావరాలను నిర్మూలించాలని జిల్లా మలేరియా అధికారి క్రాంతి ప్రజలకు సూచించారు. ఉప్పులూరు గ్రామాన్ని బుధవారం ఆయన పర్యటించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏఎస్ఎస్ఎన్ మూర్తి, యండగండి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కీర్తన, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వరరావు, గ్రామాభివృద్ధి అధికారుల సంఘం మండల అధ్యక్షుడు జేవీటీ నాయుడు, గ్రామాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు కలిసి పంట, మురుగు బోదెలు, నీరు నిల్వ చేసిన ప్రదేశాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం, గ్రంథాలయాల వద్ద రెండు వైద్య శిబిరాలు నిర్వహించి 35 మందిని పరీక్షించామని వైద్యాధికారిణి కీర్తన తెలిపారు. పారిశుద్ధ్య సమస్య అరికట్టేందుకు బ్లీచింగ్ చల్లించామని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెదకాపవరం : సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఆరోగ్యశ్రీ, బీమా సేవలు ఇప్పించాలని, 11వ పీఆర్‌సీ ఇచ్చే ముందు 30 శాతం ఐఆర్ తదితర సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ సంఘ నాయకులు విన్నవించారు. బుధవారం ఆకివీడులోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మండలంలోని పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, మండలాధ్యక్షుడు ఎన్ఎన్‌వీ సత్యనారాయణ, ఎండీ అబ్దుల్లా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా పట్టణ కార్యదర్శికి సత్కారం

సురేశ్‌బాబును సత్కరిస్తున్న రాము, ప్రతినిధులు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ తెదేపా కార్యదర్శిగా నియమితులైన యాళ్ల సురేశ్‌బాబుకు అభినందన సత్కారం బుధవారం నిర్వహించారు. స్థానిక 23వ వార్డు నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్ పాల్గొని సత్కరించారు. వార్డు మాజీ కౌన్సిలర్ యాళ్ల వెంకటేశ్వరరావు పలువురు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.500 బోనస్ ప్రకటించి ఆదుకోండి

పాలకోడేరు, న్యూస్‌టుడే: ధాన్యం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ డిమాండ్ చేశారు. మోగల్లులో రెండ్రోజుల పాటు జరిగిన జిల్లా మహాసభలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా పుల్లారెడ్డి, హరేరామ్, ఉపాధ్యక్షులుగా తవిటినాయుడు, శ్రీరామచంద్రుడు, సహాయ కార్యదర్శిగా హరిహర లక్ష్మణ్, మార్టిన్ లోథరన్, 12 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

కొల్లేరుపై ఆంక్షలు ఎత్తేయాలి: వ్యకాసం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొల్లేరుపై ఆంక్షలు ఎత్తేయాలని.. రైతులు, పేదలపై అటవీ శాఖాధికారుల వేధింపులు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అన్నేభవనంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు.

అవి ఇవి అన్నీ

ప్రావిడెంట్ ఫండ్‌పై అవగాహన.. భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ అంశంపై పీఎఫ్ రీజనల్ కమిషనర్(రాజమహేంద్రవరం) వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్లలో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు భీమవరంలోని ఎంపెడా కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రొయ్యల ఎగుమతి సంస్థల ప్రతినిధులు, ఎంపెడా అధికారులు పాల్గొన్నారు.

ఝాన్సీ ధైర్యం స్ఫూర్తి .. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్యం, సాహసం మహిళల్లో రావాలని అప్పుడే అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంతవర్మ అన్నారు. మిషన్ సాహసి కార్యక్రమాన్ని కళాశాలలో బుధవారం నిర్వహించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పన సమావేశం.. కాళ్ల, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రధాన పార్టీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సుందర్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల) రత్నకుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పన విషయాలపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు అవకాశం.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘ పరిధిలో ఆగస్టు 31కి ముందు నిర్మించిన అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 తర్వాత అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణాలను నిబంధనల మేరకు తొలగిస్తామని ప్రకటనలో తెలిపారు.

కాలంతో పాటు మారాలి.. పాలకోడేరు : కాలంతో పాటు జరుగుతున్న మార్పులకు అనుగుణంగా సామాజిక సమస్యలు గుర్తించి.. వాటి పరిష్కారం దిశగా కవుల రచనలు, కవితలు ఉండాలని కవి తెన్నేటి మాస్టారు తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పాలకోడేరు శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు గోపాలశర్మ, నాగశశికళ, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి గ్రంథాలు, రచనలు గురించి వివరించారు. గ్రంథాలయాధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పల్లెల సమగ్ర అభివృద్ధిపై దృష్టి .. భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లెల సమగ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో మురళీ గంగాధరరావు అన్నారు. భీమవరం మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన శాఖల వారీగా పల్లెల్లో చేయాల్సిన అభివృద్ధి గురించి వివరించారు. పంచాయతీ విస్తరణాధికారి రామాంజనేయ ప్రసాద్, గృహనిర్మాణసంస్థ ఏఈ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాల వినియోగంపై శిక్షణ.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: డక్‌విడ్‌లో లభ్యమయ్యే పోషకాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జక్కరం, పెదఅమిరం, కోపల్లె గ్రామాలకు చెందిన యువతకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పశుపోషణకు తక్కువ ఖర్చుతో డక్‌విడ్‌తో మంచి పౌష్టికాహారం అందించవచ్చని భీమవరం గ్రామీణ వెటర్నరీ వైద్యుడు పండరీబాబు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంతవర్మ, డైరెక్టర్ జగపతిరాజు, ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళులు భీమవరం టూటౌన్, పాలకోడేరు, న్యూస్‌టుడే: మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతిని బుధవారం భీమవరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరికుమార్ రాజు, భీమవరం ఇన్‌ఛార్జి సీతారామ్ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆకివీడు మెయిన్ బ్రాంచ్-01440, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235

ఇ-వేలం ద్వారా వాహనం అమ్మకం

''ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా నిబంధన'' లో మా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆకివీడు మెయిన్ బ్రాంచ్-01440, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235 వారు ఋణగ్రహీత యొక్క దిగువ తెలిపిన వాహనము ఇ-వేలం కొరకు ఇ-కొటేషన్ కోరబడుచున్నవి. EMI లు చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున బ్యాంకు వారు కారు ను సీజ్ చేసినారు, అది తేది.28.11.2025 న (శుక్రవారం) ఆన్‌లైన్‌లో వేలం వేయబడుచున్నది.

ఋణగ్రహీత పేరు & ఖాతా నెం.	వాహనము మోడల్	వాహనము నెం.	రిజర్వు ధర & ధరావత్తు
శ్రీ గోపిశెట్టి నాగ వెంకట సత్యనారాయణ, తండ్రి : గంగ రాజు, డి.నెం.12-97, హరిజన పేట, ఆకివీడు, పశ్చిమ గోదావరి జిల్లా-534235, అకౌంట్ నెం. 37140542417	RENAULT-LODGY-TEPWAYDCIRXZ-JSRDF9	AP37 DG 3344	రూ. 2,40,000/- & రూ.24,000/-

ఇ-వేలం తేదీ మరియు సమయం: 28.11.2025
సమయం ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ గం.04.00 వరకు
బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేదీ & సమయం: 27.11.2025, సా॥ 04.00 గం.ల వరకు

ఇ-వేలం నిబంధనలు మరియు షరతులు : (1) ఇ-వేలం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ప్రాతిపదికన" ఆన్‌లైన్‌లో నిర్వహించబడును. అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనలు కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices. లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s PSB Alliance యొక్క వెబ్ పోర్టల్ : https://baanknet.com/ eauction-psb టోల్ ఫ్రీ ఫోన్ నెం. : 82912 20220 ను సంప్రదించండి. (2) పూర్తి బిడ్ మొత్తం చెల్లించిన తరువాత RTA కొత్త RC కొరకు దరఖాస్తు చేయుటకు ద్వారా కాలక్రమంలో గెలుపొందిన RC ఏర్పాటు : చేయబడుతుంది. సంబంధిత ఖర్చులు మొత్తం గెలుపొందిన బిడ్డరు భరించవలెను. అయితే అమ్మకం సర్టిఫికేట్ వెంటనే ఏర్పాటు చేయబడుతుంది. (3) వాహనమును తనిఖీ మరియు ఇతర వివరములకు తేది: 21.11.2025 నుండి 27.11.2025 వరకు ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు సంప్రదించగలరు. (4) రిజిస్ట్రేషన్ ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు విజయవంతమైన బిడ్డరు మాత్రమే భరించవలెను. ఎవరికైనా చెల్లించాల్సిన అన్ని చట్టబద్ధమైన/చట్టబద్ధతలేని బకాయిలు, పన్నులు, GST, రేట్లు అసెస్మెంట్లు, ఛార్జీలు, రుసుములు మొదలైన వాటి చెల్లింపులు విజయవంతమైన బిడ్డరే పూర్తిగా చెల్లించవలెను. (5) వేలం సమయం ప్రతిసారి 10 ని॥ల అపరిమిత పొడిగింపులతో రెండు గంటలు ఉంటుంది. కనీస బిడ్ పెంపుదల రూ.10,000/- (6) పాల్గొనుటకు అభ్యర్థన/KYC డాక్యుమెంట్లు/బయానా చెల్లింపు ఋజువు వగైరాలు తేది.27.11.2025 న మ॥ 03.00 గం॥లలోపుగా దాఖలు /అప్లోడ్ చేయవలెను. (7) అమ్మకం బ్యాంకు నిర్ధారించిన నియమాలు/ నిబంధనలకు లోబడి ఉంటుంది మరియు ఏ కారణం తెలుపకుండా ఏదేని అన్ని ఆఫర్లను అంగీకరించుట లేదా తిరస్కరించుటకు బ్యాంకుకు హక్కు కలదు. (8) వాహనము తనిఖీ మరియు విక్రయం యొక్క ఏదైనా స్పష్టీకరణ కోసం బిడ్డర్లు అధీకృత అధికారి, బ్రాంచ్ మేనేజర్ ఫోన్ నెం. 90198 46999, ఇ-మెయిల్ ఐడి : sbi.01440@sbi.co.in నందు సంప్రదించవలెను మరియు బిడ్డర్లు బ్యాంక్ ఆమోదించబడిన రిజల్యూషన్ ఏజెన్సీ శ్రీ ఆనంద్, మొబైల్ : 93944 42626 ని కూడా సంప్రదించవచ్చును.

తేది : 19.11.2025
స్థలం : ఆకివీడు
సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఏసిబి భీమవరం బ్రాంచ్(05366),జె.పి.రోడ్, భీమవరం, ప.గో. జిల్లా

వాహనము ఇ-వేలం అమ్మకపు ప్రకటన

"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా నిబంధన" లో మా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏసిబి భీమవరం బ్రాంచ్, జె.పి.రోడ్, ప.గో. జిల్లా వారు ఋణగ్రహీత యొక్క దిగువ తెలిపిన వాహనము ఇ-వేలం కొరకు ఇ-కొటేషన్ కోరబడుచున్నవి. EMI లు చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున బ్యాంకు వారు కారు ను సీజ్ చేసినారు, అది తేది.28-11-2025న (శుక్రవారం) "ఆన్‌లైన్" లో వేలం వేయబడుచున్నది.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	వాహనము యొక్క వివరములు రిజిస్ట్రేషన్ నెం./ మోడల్	రిజర్వు ధర & ధరావత్తు	వేలం తేది & సమయం
శ్రీమతి రాపాక రాణి సునీత, తండ్రి / భర్త : కేరాఫ్ : సాకా సుదర్శనరావు, డోర్ నెం. 14-14-12, మేతనిపేట రోడ్డు, భీమవరం, ప.గో.జిల్లా-534201 లోన్ ఖాతా నెం. : 36233721192	registration No: AP37CU9343, MAHINDRA XUV500 R FWD-2016	రూ.3,46,500/- & రూ.34,650/-	తేది.28-11-2025 ఉ॥గం.11.00 ల నుండి మ॥ గం.12-00 వరకు

ఇ-వేలం నిబంధనలు మరియు షరతులు: (1) ఇ-వేలం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ప్రాతిపదికన" ఆన్‌లైన్ లో నిర్వహించబడును. అమ్మకం యొక్క సవిరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s PSB Alliance యొక్క వెబ్‌పోర్టల్ : https://baanknet.com/eauction-psb టోల్ ఫ్రీ ఫోన్ నెం. : 82912 20220 ను సంప్రదించండి. (2) పూర్తి బిడ్ మొత్తం చెల్లించిన తరువాత RTA కొత్త RC కొరకు దరఖాస్తు చేయుటకు ద్వారా కాలక్రమంలో గెలుపొందిన బిడ్డరుకు RC ఏర్పాటు చేయబడుతుంది. సంబంధిత ఖర్చులు మొత్తం గెలుపొందిన బిడ్డరు భరించవలెను. అయితే అమ్మకం సర్టిఫికేట్ వెంటనే ఏర్పాటు చేయబడుతుంది. (3) వాహనమును తనిఖీ మరియు ఇతర వివరములకు తేది: 25.11.2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు సంప్రదించగలరు. (4) రిజిస్ట్రేషన్ ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు విజయవంతమైన బిడ్డరు మాత్రమే భరించవలెను. ఎవరికైనా చెల్లించాల్సిన అన్ని చట్టబద్ధమైన/చట్టబద్ధతలేని బకాయిలు, పన్నులు, GST, రేట్లు అసెస్‌మెంట్లు, ఛార్జీలు, రుసుములు మొదలైన వాటి చెల్లింపులు విజయవంతమైన బిడ్డరే పూర్తిగా చెల్లించవలెను. (5) వేలం సమయం ప్రతిసారి 10 ని॥ల అపరిమిత పొడిగింపులతో రెండు గంటలు ఉంటుంది. కనీస బిడ్ పెంపుదల రూ.10,000/- (6) పాల్గొనుటకు అభ్యర్థన/KYC డాక్యుమెంట్లు/బయానా చెల్లింపు ఋజువు వగైరాలు తేది: 27.11.2025న మ. 03.00 గం॥లలోపుగా దాఖలు /అప్లోడ్ చేయవలెను. (7) అమ్మకం బ్యాంకు నిర్ధారించిన నియమాలు/ నిబంధనలకు లోబడి ఉంటుంది మరియు ఏ కారణం తెలుపకుండా ఏదేని/అన్ని ఆఫర్లను అంగీకరించుట లేదా తిరస్కరించుటకు బ్యాంకుకు హక్కు కలదు. (8) వాహనము తనిఖీ మరియు విక్రయం యొక్క ఏదైనా స్పష్టీకరణ కోసం బిడ్డర్లు అధీకృత అధికారి, బ్రాంచ్ మేనేజర్, మొబైల్ నెం. : 98803 56085, ఇ-మెయిల్ ఐడి : sbi.05366.@sbi.co.in నందు సంప్రదించవలెను మరియు బిడ్డర్లు బ్యాంక్ ఆమోదించబడిన రిజల్యూషన్ ఏజెన్సీ, శ్రీ ఆనంద్, మొబైల్ : 93944 42626 ని కూడా సంప్రదించవచ్చును.

తేది : 19.11.2025, ప్రదేశము : భీమవరం
సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

వనరుల పెంపుతోనే సుస్థిర అభివృద్ధి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లోని వనరుల పెంపుతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని డీఎల్‌డీవో జి.రాణి అన్నారు. 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం నుంచి రెండ్రోజుల పాటు సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అనేక రూపాల్లో ఉండే వనరులను గుర్తించి వాటి ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. వీటితో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీకే వీరభద్రరావు, ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ మాట్లాడారు.

బసవేశ్వరుడికి లక్ష బిల్వార్చన

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా నరసాపురం పట్టణంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో మహన్యాస, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్ష సమర్పణ, లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు. కపిలమల్లేశ్వర, పార్వతీ విశ్వేశ్వర, పార్వతీ సమేత బసవేశ్వర, కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర, అమరేశ్వర స్వామి ఆలయాల్లో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించి పంచ హారతులు ఇచ్చారు.

బసవేశ్వరస్వామి, క్రతువులో స్వామి, అమ్మవార్లు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట	: 90631 44737
పాలకొల్లు	: 80085 74510	పెనుగొండ	: 80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర	: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? స్థానిక రైతుబజారు సమీపంలోని డ్రెయిన్‌లో మురుగు పారడం లేదు. రహదారిపైకి చేరుతోంది. దోమల బెడదతో కంటి మీద కునుకు ఉండటం లేదు. సమస్య పరిష్కరించగలరు. **- జె.నరసింహారావు, నరసాపురం**

✔ వెంటనే పరిశీలించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. **- పాత్రుడు, పురపాలక పారిశుద్ధ్య అధికారి**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? దారతిప్పలో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. **- కె.చిన్నబాబు, దారతిప్ప**

✔ వెంటనే పాదులు తీయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. **- ప్రభాకరరావు, విద్యుత్తు ఇన్‌ఛార్జి ఏఈ**

అంతా మురుగుమయం.. ఎప్పటికి మాయం!

- అధ్వానంగా డ్రెయిన్లు
- కానిరాని స్వచ్ఛత

నరసాపురం గ్రామీణ, ఆచంట, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, పల్లెలు శుభ్రంగా ఉండాలని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. గ్రామాల్లోని సీసీ, కచ్చా డ్రెయిన్లలో పూడిక తొలగించకపోవడం, శుభ్రం చేయకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలుస్తోంది. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేస్తోంది. ఫలితంగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

అత్యధిక జనాభా కలిగిన ఆచంటకు రెండు మురుగు కాలువలు ప్రజలకు శాపంగా మారాయి. ఈ రెండు మురుగు కాలువలు గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్నాయి. వీధి డ్రెయిన్లలోని మురుగు వీటి ద్వారా బయటకు వెళ్లాల్సి ఉంది. వీటి ప్రక్షాళన నలభై ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. పారిశుద్ధ్య పనివారితో చెత్త తీసే తాత్కాలిక పనులు మాత్రమే చేయిస్తున్నారు. ఆచంటలో దోమలు పెరిగి స్థానికులు రోగాలు పాలవుతున్నారు.

☛ నరసాపురం మండలం కొప్పర్రు రామాలయం వీధిలో కచ్చా డ్రెయిన్‌లో మురుగు ముందుకు సాగకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలుస్తోంది.

☛ సీతారాంపురం నార్త్ గ్రామ సచివాలయం సమీపంలో డ్రెయిన్‌లో నీరు ఎప్పుడూ అలాగే ఉండటంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

☛ సరిపల్లిలో మంచినీటి చెరువును ఆనుకుని ఉన్న నివాస ప్రాంతంలో డ్రెయిన్లు శుభ్రం చేయకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

☛ పాత నవరసపురం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సీసీ డ్రెయిన్, రామాలయం వీధిలో కచ్చా డ్రెయిన్ శుభ్రం చేయకపోవడంతో మురుగు సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆలయాల్లో విశేష పూజలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణం కుమ్మరి వీధిలోని రామాలయం, రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయాల్లో బుధవారం పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అష్ట బుధవార ప్రదక్షిణలు చేసి, స్వామికి అటుకులు, పంచదార, తులసి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక అలంకారంలో సీతారాములు

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు: పితాని

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం సిద్ధాంతంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ. 20 వేలు ఇస్తోందన్నారు. సిద్ధాంతం- పెనుగొండ రహదారికి త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభిస్తామన్నారు. 2027 సంవత్సరంలో గోదావరి పుష్కరాలు రానున్నాయని, కేదార్ ఘాట్ పునరుద్ధరణ, బ్రెల గ్రౌండ్ పునఃనిర్మాణ పనులు చేపట్టి ఏడాది కాలంలోనే పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. అనంతరం సిద్ధాంతం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

కూటమి ప్రభుత్వంతో మేలు: అంగర

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమం, మేలు కోరేది కూటమి ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. లంకలకోడేరులో బుధవారం నియోజకవర్గ రైతులతో రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాలు తెలిసిన మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం వారికి అండగా ఉంటున్నారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ వై.దుర్గాకిశోర్ పాల్గొన్నారు.

నమూనా చెక్కు అందిస్తున్న ఆర్డీవో, కూటమి నాయకులు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. సారవలో రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ నగదు విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 11,965 మంది రైతులకు రూ. 7.63 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు గుత్తుల సాయి, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు ఇస్తున్న రామరాజు తదితరులు

కేదారేశ్వరస్వామికి హోమాలు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం వశిష్ఠ గోదావరి తీరానున్న కేదారేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి, రుద్ర హోమం సంప్రదాయ పద్ధతిలో చేశారు.

క్షీరారామంలో లక్ష దీపాలంకరణ

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం జరిగింది. భక్తులు దీపాలు వెలిగించారు.

శివయ్యకు జ్యోతిర్లింగార్చన

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా నరసాపురం పట్టణంలో కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర, బసవేశ్వరస్వామి ఆలయాలతో పాటు శివాలయాల్లో బుధవారం జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. శివలింగం, ఓంకారం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు ఏర్పాటు చేశారు.

మొక్కల పంపిణీ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో రాజగోపాలస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాల ముగింపులో భాగంగా అంగర శ్రీధర్ ఆధ్వర్యంలో 108 మంది భక్తులకు 108 తులసి మొక్కలు, 108 సాలగ్రామలకు పూజలు నిర్వహించారు. పూజలనంతరం తులసి మొక్కలను భక్తులకు ఆలయ ఈవో కె.రామచంద్రరావు, ఆలయ పాలక మండలి ఛైర్మన్ రామవరపు శ్రీరామ్ అందజేశారు.

ఘనంగా కార్తిక వన సమారాధన

పెనుగొండ, న్యూస్‌టుడే: వడలి పంచాయతీ ఆవరణలో బుధవారం వడలి కమ్మవారి మహిళల కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఉసిరి చెట్టుకు మహిళలు భక్తిశ్రద్ధలతో దామోదర పూజలు నిర్వహించారు. అనంతరం గీతాపారాయణం, సంహపంక్తి భోజనాలు చేశారు.

ఆక్వా సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: లక్ష్మణేశ్వరంలోని మత్స్య కళాశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించే 'రొయ్యల సాగు యాజమాన్యం' అనే అంశంపై శిక్షణ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. జాతీయ మత్స్యాభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మత్స్యశాఖ విస్తరణ సంచాలకుడు కె.మాధవన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రొయ్యలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరదీపికను ఆవిష్కరించారు.

కరదీపిక విడుదల చేస్తున్న నిపుణులు

21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని జనసేన కార్యాలయం సమీపంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, వరల్డ్ ఫోరం ఆఫ్ ఫిష్ హార్వెస్టర్స్ అండ్ ఫిష్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం నిర్వహించనున్నామని మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మత్స్య సహకార సంఘ జిల్లా అధ్యక్షుడు మైలా వసంతరావు వెల్లడించారు. జనసేన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించే సదస్సుకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నారన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

రబీలో అనువైన వంగడాలనే సాగు చేయండి

ఉండి, న్యూస్‌టుడే: రబీలో అనువైన వరి వంగడాలనే సాగు చేయాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ ప్రసార కార్యక్రమాన్ని కేవీకే, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులకు పంట యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్-స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.15 వేలతో రాయకుదురులో వి.లక్ష్మి నివాసంలో నిర్మించిన మరుగుదొడ్డిని ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీవో శ్రీనివాసరావు, డీఈఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో వైభవతి, తహసీల్దార్ రామాంజనేయులు, సర్పంచి భారతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్శన

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో పీహెచ్‌సీ వైద్యురాలు హేనా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా ఉప వైద్యాధికారి వి.ప్రసాద్ సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

దారికి బీటలు.. లేవు చర్యలు

పెనుగొండ జెవీఎల్ నగర్‌కాలనీ రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, బాటసారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రహదారి బీటలు వారి ఎల్లప్ప కాలువ వైపు కుంగిపోయింది. కాలువ వెంబడి మొక్కలు పెరిగి రహదారిని కమ్మేశాయి. రాకపోకలు సాగించే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, పెనుగొండ**

విద్యార్థుల కస్సుబస్సు

బస్టాప్‌లలో బస్సులను సరిగ్గా ఆపడం లేదని విద్యార్థులు, ఉద్యోగులు వాపోతున్నారు. ఉచిత బస్సు పుణ్యమా అంటూ భారీ సంఖ్యలో మహిళలు బస్సుల కోసం బస్టాప్‌ల వద్ద గుంపులు గుంపులుగా ఉండటంతో అప్పటికే నిండి వస్తున్న బస్సులను ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం పరిస్థితి మరింత దారుణంగా మారిందని చెబుతున్నారు. ఫలితంగా విద్యార్థులు కళాశాలలకు సమయానికి వెళ్లక.. తరగతులకూ ఆలస్యంగా వెళ్తున్నామని వాపోతున్నారు. డబ్బులు పెట్టి తీసుకున్న పాస్‌లు ఉన్నా.. ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉదయం, సాయంత్రం అదనపు సర్వీసులు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెనుగొండ గ్రామీణ**

సిద్ధాంతంలో వేచి చూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

పుంత.. రైతుల చింత

పుంత దారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పెనుగొండ మండలంలో సన్న, చిన్న, మేజర్ పుంతలు కలిపి సుమారు 50 ఉండగా.. వీటి ద్వారా మండలంలోని సుమారు 13 వేల ఎకరాల పంట భూముల ఉత్పత్తులను తరలించాల్సి ఉంది. కానీ పెనుగొండ మార్కెట్ యార్డు ద్వారా గత కొన్నేళ్లుగా పుంత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. దీంతో వర్షాకాలంలో బురదలో కిలోమీటర్ల మేర పంట ఉత్పత్తులను మోసుకుని ప్రధాన రహదారుల వద్దకు తీసుకురావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై మార్కెట్ యార్డు ఛైర్మన్ బ్రహ్మాజీ మాట్లాడుతూ.. పుంత రోడ్లను ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పెనుగొండ గ్రామీణ**

బహుమతుల అందజేత

పోడూరు, న్యూస్‌టుడే: వేడంగిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కబడ్డీ, మ్యూజికల్ ఛైర్స్, ధారణ శక్తి అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు గ్రామంలోని కొట్టి సూర్యనారాయణ-వెంకట నరసమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొట్టి భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం వారణాసి శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ కొట్టి వెంకటేశ్వరరావు, సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

इंडियन बैंक Indian Bank | इलाहाबाद ALLAHABAD

పోడూరు బ్రాంచి
మెయిన్ రోడ్డు, గ్రామ పంచాయతీ ఆఫీస్ ఎదురుగా,
పోడూరు, వయా పాలకొల్లు,
పశ్చిమ గోదావరి-534327.

స్వాధీనత ప్రకటన APPENDIX - IV (Rule-8(1), (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం, ఇండియన్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సందలి రూల్ 8 & 9 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీత **శ్రీమతి వర్దినీడి సూర్య ప్రభావతి,** భర్త: సుబ్బారావు వారు **పోడూరు బ్రాంచి** నుండి లోన్ క్రింద చెల్లించవలసిన బకాయి సొమ్ము మొత్తం **రూ. 14,51,417/-** (అక్షరాలా పద్నాలుగు లక్షల యాభై ఒక్క వేల నాలుగు వందల పదిహేడు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, నోటీసు అందిన 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **డి.11-08-2025**న డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్ము చెల్లించడంలో విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ సందలి రూల్ 8 మరియు 9 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని **డి.17-11-2025**న స్వాధీనత తీసుకోవడమైనది. ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ఇచ్చి తెలియజేయడమైనది.

[illegible]

తేదీ: 17-11-2025
ప్రదేశము: పోడూరు
అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

इंडियन बैंक Indian Bank | इलाहाबाद ALLAHABAD

పోడూరు బ్రాంచి
మెయిన్ రోడ్డు, గ్రామ పంచాయతీ ఆఫీస్ ఎదురుగా,
పోడూరు, వయా పాలకొల్లు,
పశ్చిమ గోదావరి-534327.

స్వాధీనత ప్రకటన APPENDIX - IV (Rule-8(1), (స్థిరాస్తి కొరకు)

[illegible]

తేదీ: 17-11-2025
ప్రదేశము: పోడూరు
అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: స్థానిక జీవీఎస్ఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.భవానీప్రసాద్ మాట్లాడారు. ధైర్యానికి, దేశభక్తికి నిలువెత్తు రూపం లక్ష్మీబాయి అని విద్యార్థులకు వివరించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకొల్లు: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, చిన్నారులు

మొగల్తూరు, న్యూస్‌టుడే: వీరనారి ఝాన్సీలక్ష్మీబాయికి ఘనంగా నివాళి అర్పించారు. ఆమె జయంతి సందర్భంగా ఆరోగ్య వర్ధిని ట్రస్టు ఆధ్వర్యంలో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఇందిరాగాంధీకి నివాళులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పాలకొల్లు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. స్థానిక పార్టీ భవనంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి, గాంధీ బొమ్మల సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు గోగులమండ భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

పోడూరు, న్యూస్‌టుడే: పండితవిల్లూరు శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా గ్రామంలో పనిచేసే మహిళా ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా కానిస్టేబుల్ సానబోయిన దేవిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఆడుతాం.. గెలుస్తాం..

పాలకొల్లు మార్కెట్, నరసాపురం, మొగల్తూరు, పెనుమంట్ర, పోడూరు, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో కొనసాగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పాలకొల్లు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పోటీలో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పెనుమంట్ర శాఖా గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పెనుమంట్రలో ముగ్గుల పోటీ

పాలకొల్లు: వేషధారణల్లో విద్యార్థులు

తాగునీటి ట్యాంకర్ సమకూర్చడం అభినందనీయం

మొగల్తూరు, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జనసేన నాయకుడు బొమ్మిడి సునీల్ నాయకర్ అన్నారు. కాళీపట్నం పడమరలో సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ ఆధ్వర్యంలో గ్రామ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచి ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.2లక్షల విలువైన ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగించాలి

మొగల్తూరు, న్యూస్‌టుడే: ప్రజలు ఆరుబయటకు వెళ్లే దురాచారాన్ని విడనాడి మరుగుదొడ్లు వినియోగించాలని మండల పరిషత్తు పర్యవేక్షకుడు శ్రీనివాస్ అన్నారు. మొగల్తూరులో బుధవారం వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మౌనిక, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెత్త వేయొద్దని ధర్నా

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో పడవల రేవు రహదారి పక్కన చెత్త వేయొద్దని కోరుతూ శ్రీహరిపేట వాసులు బుధవారం ఆందోళన చేశారు. పట్టణంలో సేకరించిన చెత్త వేసేందుకు డంపింగ్ యార్డుకు స్థలం లేదు. దీంతో చెత్తను ఆ ప్రాంతంలో నాలుగు రోజులుగా వేస్తున్నారు. ఫలితంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. చెత్త వేయకుండా అడ్డుకున్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీహరిపేట వాసులు

వ్యక్తి అదృశ్యం

నరసాపురం, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. వేములదీవికి చెందిన మైలాబత్తుల ప్రభాకరరావు ఇంటికి కంసాలబేతపూడి తమ్ములపల్లికి చెందిన ఆయన బావమరిది కుర్మ విజయకుమార్ ఇటీవల వచ్చారు. ఈ నెల 12న విజయకుమార్ తిరిగి వెళ్లిపోతానని చెప్పగా.. ఆయన్ను ద్విచక్రవాహనంపై ప్రభాకరరావు నరసాపురంలో వదిలివెళ్లారు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ లేదు. దీనిపై ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆందోళనకారులపై కేసు

మొగల్తూరు, న్యూస్‌టుడే: కేపీపాలెంసౌత్ ఉప్పులూరివారి మెరకకు చెందిన కొట్టు శివన్నారాయణపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం గ్రామంలోని మద్యం దుకాణం వద్ద ఆందోళన చేసిన 14 మందిపై మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ విషయం గోప్యంగా ఉంచారు. రాత్రి 11 గంటల తర్వాత కూడా మద్యం దుకాణం తెరిచి ఉంచారని, ఆ దుకాణం వద్ద జరిగిన దాడికి బాధ్యుడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని, ఆందోళన చేస్తే తమపైనే కేసు నమోదు చేస్తారా..? అని వారంతా ప్రశ్నిస్తున్నారు. దీనిపై పోలీసు సిబ్బందిని 'న్యూస్‌టుడే' సమాచారం కోరగా.. కేసు నమోదు వాస్తవమే అని నిర్ధారించారు.

జూదరుల అరెస్టు

పోడూరు, న్యూస్‌టుడే: వద్దిపర్రు నక్కల డ్రెయిన్ గట్టును ఆనుకుని వ్యవసాయ భూమిలో బుధవారం జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ రమేష్‌బాబు తెలిపారు. వీరి నుంచి రూ.11,130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కనికరించరు.. కనిపించదు..

జాతీయ రహదారిపై సీతారామపురం వంతెన సమీపంలో ఖాళీ స్థలంలో పంచాయతీలో సేకరించిన చెత్త వేస్తున్నారు. దానికి తరచూ నిప్పు పెడుతున్నారు. ఆ చెత్త నుంచి వెలువడే పొగ.. ఆ ప్రాంతమంతా కమ్ముకుంటుంది. దీంతో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వెళ్లే వాహనాలు సమీపంలోకి వచ్చేవరకూ కనిపించక.. ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. మంగళవారం రాత్రి చెత్తకు నిప్పుపెట్టారు. మరసటిరోజు తెల్లవారుజామున రహదారిపై కిలోమీటరు మేర 'పొగ' మంచులా కమ్ముకోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. **- న్యూస్‌టుడే, నరసాపురం, గ్రామీణ**

హుండీ కానుకల లెక్కింపు

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి గ్రామంలో వెలసిన మంటలాలు అమ్మవారి ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకల్ని బుధవారం లెక్కించారు. 7 నెలల 19 రోజుల కాలానికి రూ.6,02,940 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సూర్యనారాయణ తెలిపారు.

మహిళా సాధికారతపై అవగాహన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆరవల్లి గ్రామ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ మహిళా పోలీసు ప్రసన్నలక్ష్మిని సత్కరించారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

స్వచ్ఛ, హరిత గ్రామాలే లక్ష్యం

ఇరగవరం, న్యూస్‌టుడే: స్వచ్ఛ, హరిత గ్రామాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీలపై ఎంపీపీ కొప్పిశెట్టి అనిల్ మంగతాయారు అధ్యక్షతన బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ఏవో రంగమ్మారెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు హాజరయ్యారు.

ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు



నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం : బొలిశెట్టి

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రైతు పక్షపాతినంటూ బాకా ఊదిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆయన హయాంలో అన్నదాతల్ని అన్ని విధాలా మోసం చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ, పీఎం-కిసాన్ పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో 18,361 మంది రైతులకు రూ.12.14 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యాన ప్రదర్శన ఆకట్టుకుంది. విస్తరణ సంచాలకుడు బి.గోవిందరాజులు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి, వర్సిటీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తణుకులో ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆధ్వర్యంలో..

రైతులను నిర్లక్ష్యం చేసిన వైకాపా : ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో విడత రైతుల ఖాతాల్లో నగదు జమ అయిన సందర్భంగా బుధవారం స్థానిక కమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో ఈ ఏడాది ఆగస్టు 2న మొదటి విడతగా 16,954 మంది రైతులకు రూ.11.66 కోట్లు జమ చేయగా రెండో విడతలో 16 వేల మందికి రూ.11.51కోట్ల మేర వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. గతంలో తుపాను కారణంగా తణుకు నియోజకవర్గంలో పంట నష్టం ఏర్పడితే 3,434 మంది రైతులకు రూ.3.14 కోట్ల ఇన్‌పుట్ రాయితీ కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా 3,783 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనాలు వేసి 3857 మంది రైతులకు రూ.3.84 కోట్ల నష్టం అంచనాలు ప్రభుత్వానికి పంపినట్లు గుర్తు చేశారు. కాలువల్లో తూడు తొలగించడానికి దాదాపు రూ.10కోట్లు ఖర్చు చేశామన్నారు. అనంతరం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు ధాన్యంతో అభిషేకం చేసి నమూనా చెక్కును రైతులకు అందించారు.

34,361 మందికి.. రూ.23.65 కోట్లు

○ అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత సొమ్ము జమ

○ రెండు నియోజకవర్గాల రైతులకు లబ్ధి



న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం వన్‌టౌన్, తణుకు: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన అన్నదాతలను ప్రస్తుత కూటమి సర్కారు అండగా నిలుస్తోంది. రబీ ప్రారంభానికి ముందే ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా కూటమి ప్రభుత్వం వారి ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'లో భాగంగా రెండో విడత నగదు జమ చేస్తోంది. తమ ఖాతాల్లో నగదు జమ కావడంతో రైతులు హర్షిస్తున్నారు. సూపర్-6 అమలులో భాగంగా ఏటా ఒక్కో రైతుకు రూ.20 వేలు అందిస్తోంది. ఇప్పటికే తొలి విడతగా ఆగస్టులో రూ.7 వేలు, రెండో విడతగా బుధవారం నుంచి మరో రూ.7 వేలు జమ చేస్తోంది. తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో 34,361 మంది రైతులకు రూ.23.65 కోట్ల లబ్ధి చేకూరింది. కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత వైకాపా ప్రభుత్వం రైతులకు వార్షికంగా రూ.13,500 జమ చేయగా కూటమి సర్కారు రూ.20 వేలు మూడు విడతలుగా జమ చేస్తోంది. ఒక పక్క ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ అవుతున్నాయి. దీంతో రైతులు కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది.

పెట్టుబడి సాయం

నా పేరు కంకనాల ప్రసాద్. మాది జగన్నాథపురం. నాకు సొంత పొలం 4 ఎకరాలు ఉంది. పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నా ఖాతాలో సొమ్ములు పడ్డాయి. రబీలో వ్యవసాయ పెట్టుబడులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

అప్పుల భారం తగ్గుతుంది

నా పేరు కొండపల్లి చిన్న శ్రీనివాస్. మాది బోడపాడు గ్రామం. నేను 10 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. కూటమి సర్కారు అందించిన సాయం పెట్టుబడికి ఆసరాగా ఉంది.

అదనపు ఆసరా

నా పేరు ఆలపాటి శ్రీనివాస రావు. మాది మోజ్జీపాడు గ్రామం. నేను 8 ఎకరాలు కౌలు పొలం సాగు చేస్తున్నాను. పండించిన పంటకు ప్రభుత్వం సకాలంలో గిట్టుబాటు ధర కల్పిస్తోంది. అదనపు ఆసరాగా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ సొమ్ములు ఇస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు (గ్రామీణ)	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగా ధ్యాన మందిరం రోడ్డులో చెత్త పేరుకుపోయి రహదారిపై వ్యాపిస్తోంది - విక్రమ్

✔ రహదారిపై చెత్త తొలగింపజేస్తాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? వీకర్స్ కాలనీ నుంచి వానపల్లిగూడెం వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది - రామారావు

✔ రహదారికి మరమ్మతులు చేయిస్తాం - ఎం.ఏసుబాబు పురపాలక కమిషనర్

రేపు తెదేపా కార్యాలయంలో అర్జీల స్వీకరణ

తాడేపల్లిగూడెం అర్బన్ (న్యూస్‌టుడే) : తాడేపల్లిగూడెం పట్టణం భాగ్యలక్ష్మిపేటలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు పాల్గొని సమస్యలు విన్నవించుకోవచ్చన్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బాబ్జీ చెప్పారు.

సొంత ఆదాయ వనరులతో గ్రామాల అభివృద్ధి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామంలో లభించే సొంత ఆదాయ వనరులను ఉపయోగించుకొని గ్రామాభివృద్ధి సాధించేలా అధికారులు కృషి చేయాలని అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఎంపీడీవో శామ్యూల్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 కార్యాచరణ ప్రణాళిక విడుదల చేశారు. సర్పంచులు, ఉప సర్పంచులు, ఉప ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలి

తణుకు, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని ఎంపీపీ రుద్రా ధనరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ ప్రాంగణంలో ధనరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలకు అధికారులు తమకు సమాచారం ఇవ్వడంలేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురావడంతో ధనరాజు స్పందించి మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బుశ్రా మాట్లాడుతూ గతంలో చేపట్టి నిలిచిపోయిన జల్‌జీవన్ మిషన్ పనుల స్థానంలో వాటర్ గ్రిడ్ పథకంలో చేపట్టి పూర్తి చేస్తామని చెప్పారు. ఎంపీడీవో ఆర్.లోహిత్ జయసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెంచేలా కృషి చేయాలన్నారు. డీవైఈవో మురళీ సత్యనారాయణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పాఠశాల స్థాయిలో ప్రణాళికాబద్ధంగా అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ శేషకుమారి, డీఆర్‌పీ ప్రసంగిరాజు, ఉప ఎంపీడీవో ఎస్‌వీవీ నరసింహమూర్తి, ఏవో కృష్ణచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధనరాజు

ఆక్వా సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: లక్ష్మణేశ్వరంలోని మత్స్య కళాశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించే 'రొయ్యల సాగు యాజమాన్యం' అనే అంశంపై శిక్షణ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. జాతీయ మత్స్యాభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మత్స్యశాఖ విస్తరణ సంచాలకుడు కె.మాధవన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రొయ్యలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరదీపికను ఆవిష్కరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

సూర్యనారాయణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: నాగార్జున యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీల్లో మండపాక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) సంకు సూర్యనారాయణ 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించారు. డిసెంబర్ 13 నుంచి 15 వరకు బిహార్ రాష్ట్రం పట్నాలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.ఫణిశ్రీ తెలిపారు. వరుసగా మూడో సంవత్సరం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సూర్యనారాయణను సర్పంచి జాన వెంకటలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మి అభినందించారు.

పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత పంచాయతీలదే

తాలూకాఫీసు కూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత పంచాయతీలదేనని, అందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో బుధవారం సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు ఎంపీడీవోలు వి.చంద్రశేఖర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లికార్జునరావు

శీతల శవపేటిక అందజేత

కొమ్ముగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గారపాటి వైకుంఠం ఆర్థిక సహకారంతో మానవత తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో బుధవారం శీతల శవపేటిక అందజేశారు. గారపాటి రమేష్, నల్లూరి శ్రీనివాస్, మానవత అధ్యక్షుడు జనపనేని రాజేంద్ర కుమార్, కార్యదర్శి మిరియాల కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రాయకుదురు (వీరవాసరం), న్యూస్‌టుడే: పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్-స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.15 వేలతో రాయకుదురులో వి.లక్ష్మి నివాసంలో నిర్మించిన మరుగుదొడ్డిని ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీవో శ్రీనివాసరావు, డీఈఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో వైభవతి, తహసీల్దార్ రామాంజనేయులు, సర్పంచి భారతి పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

ధ్వంసమైన సిమెంటు పలకలు

తాడేపల్లిగూడెం పట్టణం సీతారాంపేట ఏరియా మార్కెట్ ప్రాంతంలోని మురుగు బోదెపై వేసిన సిమెంటు పలకలు ధ్వంసమయ్యాయి. భారీ వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తుండడంతో సిమెంటు పలకలు ధ్వంసమై ఇనుప ఊచలు బయటకు వచ్చి పాదచారులు, వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

మురుగు పారదు.. సమస్య తీరదు

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర పేరుతో ప్రభుత్వం పలు అవగాహన, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆ గ్రామంలో మాత్రం అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెంటపాడు మండలం దర్శిపర్రులో పలుచోట్ల మురుగు కాలువలు పూర్తిగా పూడికపోయి మురుగంతా రహదారులపై పారుతుండడమే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో దోమల బెడద తీవ్రమై స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

దర్శిపర్రులో ఇళ్ల ముందు ఇలా..

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్

తాడేపల్లిగూడెం పట్టణం సత్యవతినగర్ మసీద్ రోడ్డులో విద్యుత్తు నియంత్రిక, ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉంది. చేతికందే ఎత్తులో ఫ్యూజ్ బాక్స్ ఉండడంతో పాటు, రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

దారి కాసిన ప్రమాదం

తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీ కూడలి నుంచి డి-మార్ట్ వరకు రహదారికి ఇరువైపులా చాలాచోట్ల వాహనాలను రోజుల తరబడి నిలిపి ఉంచుతున్నారు. దీంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలకు దారి ఇవ్వాలంటే ముందు వెళ్లే వాహన చోదకులకు కష్టంగా ఉంటోంది. రోడ్డు పక్కకు దిగుదామంటే వాహనాలు నిలిపి ఉంచడంతో సాధ్యం కావడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా లారీలు, బస్సులు నిలిపి ఉంచకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం అర్బన్

వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: కొండ్రుప్రోలులోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ పాల్గొని స్వామికి పూజలు చేశారు. అనంతరం బాబ్జీని ఆలయ కమిటీ సత్కరించింది. ఏపీ టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బినీసు కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

తణుకు, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి ఎస్.ప్రవీణ ఆధ్వర్యంలో ముందుగా భారత మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ శ్రీదేవి మహిళల చట్టాలు, ఆరోగ్య భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. కమిటీ సభ్యులు రాజ్యలక్ష్మి, లక్ష్మీదేవి, వీరమణి పాల్గొన్నారు. ✦ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన ఉక్కు మహిళ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సంకు మనోరమ అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ✦ ఇరగవరం మండల శాఖా గ్రంథాలయంలో అధికారి వి.అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తణుకు, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కృష్ణరాజు, లోవరాజు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి, ఇరగవరం శాఖా గ్రంథాలయాల్లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు జి.అయ్యప్పస్వామి పాల్గొన్నారు.

పోటీలో మహిళలు

ఆరోగ్యవంతమైన సమాజానికి రోడ్ రన్

తణుకు, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజం నెలకొల్పేందుకు డిసెంబర్ 7న పట్టణంలో రోడ్ రన్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో రోడ్ రన్ పోస్టర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తణుకులో పలువురు యువకులతో రోడ్ రన్ సొసైటీ ఏర్పాటు చేసి ప్రజల్లో ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పచ్చదనంపై అవగాహన కల్పిస్తామన్నారు. డిసెంబరు మొదటి ఆదివారం ఉదయం 5.30 గంటలకు స్థానిక ఎస్కేఎస్‌డీ... ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఇందులో 3 కి.మీ., 5 కి.మీ., 10 కి.మీ. విభాగాలుగా నిర్వహిస్తున్నామని.. సుమారు రెండు వేల మంది వరకు పాల్గొంటారని తెలిపారు. దీనికి సంబంధించి పది కి.మీ. రన్‌కు రూ.60 వేల నగదు బహుమతి అందజేస్తారన్నారు. ఇందులో పాల్గొనాలనుకునేవారు ఈ నెల 25లోపు www.tanuku.run ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. రోడ్ రన్‌లో పాల్గొనే వారికి బ్యాగ్, టీషర్ట్‌తో పాటు ప్రశంసాపత్రం, మెడల్ అందిస్తారన్నారు. సమన్వయకర్తలుగా విశ్వతేజ, కిరణ్, దీప్తి వ్యవహరిస్తున్నారని తెలిపారు. అనంతరం తణుకు రోడ్ రన్ వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, గొల్లగూడెం సెంటర్, D.No. 1-10-8/2, నివాసి ఆదిన సత్యనారాయణ S/o. వీరాస్వామికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం. 3644/1965 ఇంటి వద్దనుండి గొల్లగూడెం సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. కావున దొరికినవారు క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరు.

ఆదిన సత్యనారాయణ
సెల్: 96032 77357

సంకటహరుడికి దీపాలంకరణ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం వీధిలో వెలసిన వరసిద్ధి వినాయకుడికి బుధవారం ఆలయ అర్చకులు వాడపల్లి రామాచార్యులు, హనుమంతాచార్యులు, కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి దీపాలంకరణ సేవ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు చేశారు.

విశేష దీపాలంకరణలో వినాయకుడు

పేదలకు అమృత కలశాల పంపిణీ

తణుకు, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా భక్తులు పేదలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించే వేడుకల్లో భాగంగా మొదటి రోజైన బుధవారం ఉదయం కనకవర్ష నగర్‌లోని మందిరంలో ఉదయం జ్యోతి ప్రజ్వలన, పతాకావిష్కరణ, వేద పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బాబా నామసంకీర్తన, ఉపన్యాసం అనంతరం స్థానిక ఎన్‌ఎస్‌సీబోస్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో 64 మంది పేదలకు అమృత కలశాలు (బియ్యం, నిత్యావసర సరకులు), చీరలు అందజేసినట్లు భక్తులు తెలిపారు. 23న స్వామి జయంతి సందర్భంగా సామూహిక సత్యసాయి వ్రతాలు, ఊంజల్ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న భక్తులు

ఉపాధ్యాయ సంఘ బలోపేతానికి కృషి

ఉండి, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో ఉపాధ్యాయ సంఘ బలోపేతానికి మరింత కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఉండి కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఆ అసోసియేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, దినేశ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎలీషా, మహిళా కార్యదర్శిగా కళావతి, కోశాధికారిగా శ్యామ్‌ప్రసాద్, జిల్లా కార్యదర్శులుగా సాల్మన్ రాజు, చిరంజీవిలను ఎన్నికయ్యారు.

అదిగదిగో ఆహ్లాదం..

✦ ఉద్యానాల అభివృద్ధికి రూ.6.23 కోట్లు

✦ ఎమ్మెల్యే రాధాకృష్ణ చొరవతో పట్టణంలో సౌకర్యాలు

తణుకు, న్యూస్‌టుడే: లక్షకుపైగా జనాభా.. నిత్యం ఉరుకులు పరుగులతో యాంత్రిక జీవనం. సాయంత్రం సేదతీరేందుకు సౌకర్యాలు లేక పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు పట్టణ వాసులకు ఆహ్లాదం పంచేందుకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో మొత్తం 15 చోట్ల నూతన ఉద్యానాల ఏర్పాటుతోపాటు, పాతవాటిని ఆధునికీకరించేందుకు రూ.6.23 కోట్లతో పనులు చేపట్టారు. 6 చోట్ల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

గాలికొదిలేసిన గత వైకాపా సర్కారు.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణవాసులకు ఆహ్లాదం కరవైంది. ఉద్యానాల అభివృద్ధి మాట ఎలా ఉన్నా.. ఉన్న పార్కుల నిర్వహణ సైతం గాలికొదిలేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ఉద్యానాల్లో తుప్పలు పెరిగి చిట్టడవులను తలపిస్తుండడంతో పాటు విషసర్పాలకు నిలయాలుగా మారాయి. ఆట పరికరాలు సైతం తుప్పుపట్టి శిథిలమయ్యాయి. నిర్వహణ పేరుతో ఏటా ఖర్చులు మాత్రం చూపించడం గమనార్హం.

ఒనగూరనున్న సౌకర్యాలు

● ఐక్యనగర్‌లో రూ.40 లక్షలతో వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో ఉద్యానం ● 3వ వార్డు లక్ష్మణరావునగర్‌లో 0.22 ఎకరాల్లో రూ.79 లక్షలతో ఉద్యానం ● 17వ వార్డు బ్యాంక్ కాలనీలో 0.127 ఎకరాల్లో రూ.59 లక్షలతో పార్కు ● 14వ వార్డు పల్లాలమ్మనగర్‌లో 0.48 ఎకరాల్లో రూ.109 లక్షలతో ఉద్యానం ● 11వ వార్డు కృష్ణానగర్‌లో 0.25 ఎకరాల్లో రూ.69 లక్షలతో ఉద్యానం ● 11వ వార్డు శ్రీకుమార్ లేఅవుట్‌లో రూ.15.33 లక్షలతో ఉద్యానం ● 17వ వార్డు మాంటిస్సోరీ పాఠశాల సమీపంలో రూ.11.90 లక్షలతో ఖాళీ స్థలానికి ప్రహరీ ● 15వ వార్డు వీరభద్రపురంలో ఖాళీ స్థలానికి రూ.35.50 లక్షలతో ప్రహరీ ● 11వ వార్డులో శ్రీకుమార్ లేఅవుట్‌లో ఖాళీ స్థలానికి రూ.22 లక్షలతో ప్రహరీ ● ఎన్టీఆర్ పార్కులో రూ.94.50 లక్షలతో బోటింగ్, ఫైబర్ విగ్రహాలు, చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటుతోపాటు ఆధునికీకరణ ● 14వ వార్డు పల్లాలమ్మనగర్‌లో రూ.21 లక్షలతో బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణం ● 34వ వార్డు గురునగర్‌లో రూ.28 లక్షలతో బాక్స్ క్రికెట్ ఏర్పాటు ● వివిధ ప్రాంతాల్లో రూ.20 లక్షలతో కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టుల నిర్మాణం ● 2వ వార్డులో రూ.10 లక్షలతో ఓల్డ్ ఆర్టీవో కార్యాలయం రోడ్డులోని పిల్లల పార్కు ఆధునికీకరణ ● 3వ వార్డులో నల్లముత్తన్న రోడ్డులో రూ.8.80 లక్షలతో ఉద్యానం ఆధునికీకరణ.

నిర్మాణంలో బాక్స్ క్రికెట్



(c) eenadu

గ్రామోత్సవానికి కళాభిషేకం

చాపాడు, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వాముల గ్రామోత్సవాన్ని చిన్న గురువలూరులో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు దీపాలతో సామూహికంగా పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఒళ్లును విల్లులా వంచి!

స్కూల్ గేమ్స్‌లో భాగంగా యోగా అండర్-14, 17 విభాగాలకు సంబంధించిన జిల్లాస్థాయి ఎంపికలు కడప వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 200 మంది వరకు బాలబాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒంటిని విల్లులా వంచుతూ బాలబాలికలు ప్రదర్శించిన ఆసనాలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, కడప క్రీడలు

ఇసుకలో రూ. 1.25 కోట్లకు మస్కా

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నాటి నేతల అండతో తమకు ఎదురే లేదన్నట్లు బరితెగించారు. ఇసుకలో రూ. కోట్లకు మస్కా కొట్టి జేబులు నింపుకొన్నారు. తీరా వ్యవహారం బయట పడటంతో తప్పు ఇతరుల పైకి నెట్టి తాము మాత్రం ఇంకా బాధ్యతలు వెలగబెట్టే ప్రయత్నాల్లో ఉన్నారు.

13,678 మెట్రిక్ టన్నుల దోపిడీ

గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇదే అదనుగా ప్రొద్దుటూరు గృహ నిర్మాణ శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కయ్యారు. గుత్తేదారులతో కలిసి ఇసుకలో కాసులు పిండుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పట్లో హౌసింగ్ అధికారులు సక్రమంగా విచారణ చేయలేదు. వైకాపా గద్దె దిగాక కూటమి ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ఈ విషయంపై ఆ శాఖ రాష్ట్ర ఎండీకి ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి 13,678 మెట్రిక్ టన్నుల ఇసుక దోపిడీకి గురైందని, విలువ రూ.1.25 కోట్లని తేల్చారు.

బలి పశువులను చేసే యత్నం!

ఇసుక దోపిడీలో ముఖ్య భూమిక పోషించిన ఏఈ వెంకటేశ్వర్లును తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ, వర్క్ ఇన్‌స్పెక్టర్లైన గురప్ప, కుమారి, ఇందిరను విధుల నుంచి 2024 అక్టోబర్‌లో తొలగించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఏఈకి తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ చాపాడు మండలానికి బదిలీ చేశారు. పీడీ మౌఖిక ఆదేశాలతో ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు అనధికారికంగా విధులు నిర్వర్తించేవారు. ఇటీవల ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా అధికారి రాజారత్నంను కోరుతూ ఆ శాఖ ఎండీ అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. దీంతో ఈ వ్యవహారంలో వారిని బలిపశువులను చేసేందుకు ఏఈ చక్రం తిప్పుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ప్రొద్దుటూరు గృహ నిర్మాణ శాఖ ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇసుక కుంభకోణంపై పునర్విచారణ చేయనున్నట్లు చెప్పారు. బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు.

మన గ్రోమోర్ కేంద్రంలో పురుగు మందులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

మహిళా రైతులతో మాటామంతీ.. రచ్చబండకు హాజరైన రైతులు

రైతులు మీసం మెలేసే రోజులొస్తాయి

◆ అన్నదాతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభయం
◆ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జనంతో మమేకం

రాత్రి వేళ రైతులతో కలిసి అరటి తోటలోకి వెళుతున్న చంద్రబాబు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, పెండ్లిమర్రి, కడప వ్యవసాయం, కమలాపురం, సీకేదిన్నె: 'ప్రపంచ వ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులొస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయం కింద పండించిన పంటలకు డిమాండ్ పెరిగింది. అందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలి. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. రైతులు గర్వంగా మీసం మెలేసే రోజులు తెస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

● పెండ్లిమర్రి మండలంలో సీఎం చంద్రబాబు బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ● వెల్లటూరులోని మన గ్రోమోర్ కేంద్రానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. వ్యవసాయంలో తలెత్తుతున్న సమస్యలు, ఇబ్బందులు, నష్టాలు, కష్టాలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామని.. పరిష్కారం లభించొచ్చని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ● అనంతరం బైరవగుట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ వేదిక వద్దకు సీఎం చేరుకున్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాలను ప్రారంభించి మాట్లాడారు. ● ఆ తర్వాత రాత్రి అయినప్పటికీ చెర్లోపల్లె పంచాయతీ చిన్న దాసరిపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన అరటి, చామంతి, చీనీ, చిక్కుడు, టమాట పంటలు పరిశీలించారు. గొర్రెల పెంపకందారులు, మహిళా కూలీలతో మాట్లాడారు. డ్రోన్ శిక్షకురాలు జ్యోత్న్స నుంచి పురుగు మందుల పిచికారీని తెలుసుకున్నారు.

● చిన్నదాసరిపల్లె పొలంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులోనే రైతులతో కలిసి పంటలను పరిశీలించారు.

● యూరియాను విరివిగా వాడొద్దని రైతులకు సూచించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు.

● అక్కడి నుంచి వెల్లటూరులో పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుని మాట్లాడారు.

రైతులతో ముఖాముఖిలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్

● అనంతరం కడప విమానాశ్రయానికి చేరుకుని విజయవాడ బయలుదేరి వెళ్లారు.

● ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, కమిషనర్ మంజీర్ జిలానీ సమూన్, డీఐజీ ప్రవీణ్, కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితీసింగ్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, తెదేపా నేతలు పుత్తా నరసింహారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఒక్కడు.. కదలడు.. వదలడు



కడప విద్య, న్యూస్‌టుడే: ఓ ఉద్యోగి ఇరవై సంవత్సరాల పైబడి ఒకే కార్యాలయంలో విధులు నిర్వర్తించడం లేదా! కేవలం 20 హెచ్‌ఎం పైస్కూల్ సొంత ర్యాలతో ఏళ్ల తరబడి జీవనం సాగించడాలు ఓ వైపు కార్యాలయంలో పనిచేస్తూ.. మరోవైపు యథావిధిగా సెకండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందినప్పటికీ సొంత కాదనుకుంటే తప్పులో కాలేసినట్లే.. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఓ ఉపాధ్యాయుడు వీటన్నింటినీ నిజం చేసి చూపుతున్నారు. వక్రమార్గాల్లో తనకెవ్వరు సాటిరారని తెలుపుతున్నారు.

● వసూళ్లలో సిద్ధహస్తుడు: సదరు ఉపాధ్యాయుడు కాగితాల్లో కడప నగర సమీపంలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్నట్లు కనిపిస్తుంటుంది. విధులు మాత్రం విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తుంటారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల సమయంలో తన ప్రభావం చూపుతారు. జిల్లా కేంద్రంలో విద్యాశాఖ నుంచి ఏ పని ముందుకు సాగాలన్నా తానే అంతా అంటూ చక్రం తిప్పుతుంటారు. తెర వెనుక కాసుల పెట్టె నింపుకోవడంలో సిద్ధహస్తులు. తన కన్నా ఎక్కువ కేడర్‌లో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను ఏ మాత్రం లెక్క చేయరు. ఈ అసాధారణ సర్వీసుపై ఇటు జిల్లా విద్యాశాఖలో, అటు ఉపాధ్యాయ వర్గాల్లో ఇపుడు విస్తృత చర్చ సాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

పింఛన్లలో తేలేనా వంచన!

'సదరం' పునః పరిశీలన మొదలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో అధికారుల అండదండలతో కొందరు వక్ర మార్గంలో పింఛన్లు పొందారు. తప్పుడు పత్రాలు సృష్టించి అందిన కాడికి ప్రభుత్వ సొమ్మును అప్పనంగా మింగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బోగస్ బాగోతంపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో అధికారులతో పరిశీలన చేయించింది. దొంగ పత్రాలతో అర్హులుగా లబ్ధి పొందుతున్న వారిని గుర్తించింది. వీటిపైనా అభ్యంతరాలు రావడంతో సదరం పత్రాల పునఃపరిశీలనకు మరోమారు నిర్ణయించింది. ఈ ప్రక్రియ ప్రస్తుతం సాగుతోంది.

● మొత్తం పింఛనుదారులు: 2,56,817
● ప్రతి నెల చెల్లింపు: రూ. 111.45 కోట్లు

● జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్న 4,575 మందిని గుర్తించి రెండు నెలల కిందట గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది తాఖీదులు ఇచ్చారు. ● కడప సర్వజన ప్రభుత్వాసుపత్రి(రిమ్స్), ప్రొద్దుటూరు జిల్లా వైద్యాలయం, జమ్మలమడుగు, పులివెందుల ఆసుపత్రుల్లో పునఃపరిశీలన శిబిరాలు నిర్వహించారు. ● వైద్యుల బృందం ద్వారా ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో సదరం పత్రాలను పరిశీలించి పరీక్షలు చేస్తున్నారు. ● అర్హత ఉంటే పింఛన్ కొనసాగింపునకు సిఫార్సు చేస్తారు. అనర్హత ఉంటే వేటు తప్పదని అధికారులు తెలుపుతున్నారు.

ఆదారానికి దిగులు

● నెలల వ్యవధిలోనే పెరిగిన ధరలు
● చేనేతల ఉపాధికి తప్పని ఇబ్బందులు
● 12 వేల మందిపై ప్రభావం

పట్టు చీరల తయారీలో ముడి సరుకు ధర పెరిగిన వార్పు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టు గూళ్ల ఉత్పత్తి తగ్గింది. దీంతో ముడి సరుకు ధరలు రెండు నెలల వ్యవధిలోనే పెరిగాయి. ఫలితంగా మాస్టర్ వీవర్లు అధిక ధరకు ముడి సరుకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితి చేనేత కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపుతోంది. పట్టు చీరలు, దూపియాన్ వస్త్రాల తయారీ పనులు కొరవడి దుస్థితి తలెత్తుతోంది. మొత్తంగా అటు మాస్టర్ వీవర్లు, ఇటు నేతన్నలు నలిగిపోతున్నారు.

ప్రభావం: కర్ణాటక రాష్ట్రంలోని 14 పట్టుగూళ్ల విక్రయ కేంద్రాల నుంచి జిల్లాకు ముడి పట్టు సరఫరా అవుతుంటుంది. ప్రొద్దుటూరు పట్టణంలోని సిరిసిల్క్ కార్యాలయంలో వేలం పాట ద్వారా దూపియాన్ పట్టుదారం కొనుగోలు చేస్తుంటారు. పట్టు చీరల తయారీలో వినియోగించే వార్పు(పేపర్) ధర అమాంతం పెరగడం ఇబ్బందికరంగా పరిణమించింది. దీంతో జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కడప, కమలాపురం నియోజకవర్గాల పరిధిలోని సుమారు 12 వేల మంది చేనేత కార్మిక కుటుంబాలకు పనులు లేకపోతున్నాయి. అన్నమయ్య జిల్లాలోనూ ఇదే పరిస్థితి. ఈ విషయమై జిల్లా పట్టు పరిశ్రమ, సిరిసిల్క్ అధికారి రామకిషోర్‌ను 'న్యూస్‌టుడే' మాట్లాడగా.. వేసవి వచ్చే వరకు దూపియాన్ ముడిపట్టు దారం ఉత్పత్తి తక్కువగా ఉంటుందని.. అందుకే ధరల్లో పెరుగుదల ఉందని తెలిపారు.



ఇనుముతో ఆకృతులు పుట్టెనే!

ఈ చిత్రాలు కడప నగర శివారులోని శిల్పారామంలోనివి. ఇనుప వ్యర్థాలను జంతువులు, పక్షుల ఆకృతులుగా మలచారు. వీటిని శిల్పారామంలోని పలు ప్రదేశాల్లో నిలిపారు. ఇనుముతో రూపొందించిన ఈ ఆకృతులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు వీటిని చూసి ఆశ్చర్యానికి లోనవుతూ కేరింతలు కొడుతున్నారు.

- న్యూస్‌టుడే, మారుతీనగర్(కడప)

ప్రేమవన్నె తోడేళ్లు

● కడప రిమ్స్ ఠాణా పరిధిలో యువతీ యువకుడు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోమంటే అతను ముఖం చాటేశాడు. పెద్దల మధ్య పంచాయితీ చేశారు. పోలీసులు చెప్పినా ససేమిరా అంగీకరించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చివరకు మోసగాడిపై కేసు నమోదు చేశారు.

● కడప రామాంజినేయపురానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో యువతిని నమ్మించాడు. తీరా పెళ్లి మాటెత్తే సరికి దూరమయ్యాడు. బాధితురాలు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సి వచ్చింది.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రేమ ఈ సృష్టిలో అత్యంత మధురమైనది. బాధ్యతతో పెనవేసుకున్నది. అటువంటి రెండు అక్షరాలను కొందరు హేళన చేస్తున్నారు. యువతులను వంచిస్తూ పబ్బం గడుపుకొంటున్నారు. ఈ తరహా ఘటనలు జిల్లాలో ఇటీవల కాలంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. యుక్త వయసులో ఆకర్షణనే ప్రేమని నమ్మేస్తున్నారు. కొందరు ఇళ్లు వదిలిపెట్టి వెళ్తున్నారు. మోసపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. ఈ క్రమంలో ఇంకొందరు మనస్తాపంతో ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు.

సంవత్సరం	నమోదైన మోసం కేసులు
2022	13
2023	11
2024	14
2025	10

(సెప్టెంబరు వరకు)

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం: ప్రేమను ఎవరూ కాదనరు. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణనే కొందరు ప్రేమని భ్రమిస్తున్నారు. ఆ తర్వాత మోసపోయినట్లు తెలుసుకుని సమస్యల్లో చిక్కుకుంటున్నారు. చాలా మంది చరవాణుల కారణంగానే ఈ తరహా ఊబిలో చిక్కుకుంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల నిఘా అవసరం. ప్రవర్తన, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి వాటిని ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

- సునీత, సైకాలజిస్టు, కడప

నాన్నకు ప్రేమతో...

విద్యాశాఖ కార్యాలయం ఎదుట తీర్చిదిద్దిన ఉద్యానవనం (అంతర చిత్రంలో) నాగభూషణం

రాజుపాలెం, న్యూస్‌టుడే: నంద్యాల నాగభూషణం.. రాజుపాలెం విద్యాశాఖ కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన అటెండర్‌గా పనిచేస్తున్నారు. అతని తండ్రి నారాయణ. అతను కూడా అదే చోట ఏళ్లుగా విధులు నిర్వహించారు. ఆయన గుర్తుగా కార్యాలయానికి ఏదేని చేయాలని తలిచారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు.. పలువురికి ఆహ్లాదాన్ని పంచేలా ఉద్యాన వనాన్ని తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు. విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉన్న స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. కంప చెట్లు, పిచ్చి మొక్కలతో నిండి ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేశారు. మట్టితో చదును చేయించారు. పూలు, పండ్ల మొక్కలు నాటారు. నిత్యం కంటికి రెప్పలా కాపాడుతూ చూడచక్కని ఉద్యాన వనంలా తీర్చిదిద్దారు. రూ. 3.50 లక్షలతో మహాత్మా గాంధీ విగ్రహం నెలకొల్పారు. ఇంత చేసేటప్పటికి అతని నెల జీతం కేవలం రూ. 7 వేలే కావడం గమనార్హం. ఇప్పటికీ మొక్కలు, చెట్లను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఉద్యానం పచ్చగా ఉంటేనే తన తండ్రి సంతోషిస్తున్నట్లు అని చెబుతుంటారు.

చక్రాలు తొడిగిన చిచ్చుబుడ్లు

స్కేటింగ్ రింక్‌లో చిన్నారుల ప్రతిభ

ప్రాయంలో చిన్నారులు. స్కేటింగ్ రింక్‌లో దిగితే మాత్రం చిరుతలు. చక్రాలు కట్టిన చిచ్చుబుడ్డుల్లా చెలరేగిపోతారు. రాకెట్ వేగంతో దూసుకెళ్తారు. తమ ప్రతిభతో సత్తా చాటుతూ శెభాష్ అనిపించుకుంటారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిలో ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం. 4-6 సంవత్సరాల విభాగంలో మరో చిన్నారి మనస్విని కూడా మన్ననలు అందుకుంటోంది.

- న్యూస్‌టుడే, కడప క్రీడలు

ఏషియన్ గేమ్స్‌లో ఆడుతా

కడప నగరం కోఆపరేటివ్ కాలనీలో నివాసం ఉంటున్న సురేష్ రెడ్డి, ఉమామహేశ్వరి దంపతుల కుమారుడు **సుచిత్ రెడ్డి.** గత ఏడాది మైసూరులో నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించాడు. ఈ ఏడాది కాకినాడలో సాగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రింక్-1, రింక్-2 రెండింటిలోనూ బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాడు.

ప్రోత్సాహంతో దూసుకెళ్తున్నా

ఉమామహేశ్వరి, సురేష్‌రెడ్డి దంపతుల రెండో కుమారుడు **హార్దిక్ రెడ్డి.** కడపలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మూడేండ్లుగా స్కేటింగ్‌లో రాణిస్తున్నాడు. గత ఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటి రజతం, కాంస్య పతకాలు అందుకున్నాడు. ఈ ఏడాది కూడా రాష్ట్రస్థాయిలో రెండు బంగారు పతకాలు అందుకుని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.

మరింత సత్తా చాటుతా

కడప నగరం ఎర్రముక్కపల్లెకు చెందిన ప్రవీణ్, శిరీష దంపతుల కుమార్తె **మనస్విని.** అక్టోబరులో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. కాకినాడలో సాగిన 4-6 సంవత్సరాల విభాగంలో రాణించి రజత పతకం సాధించింది. ఈ వయసు విభాగానికి సంబంధించి జాతీయ స్థాయి పోటీలు లేకపోవడంతో రాష్ట్ర స్థాయి పతకంతోనే సరిపెట్టుకుంది.

CODE: ANCP
ANNAMACHARYA COLLEGE OF PHARMACY
AUTONOMOUS
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist., A.P. - 516126.
SPOT & CAT-B ADMISSIONS 2025-26
Eligible Candidates for Admission into 1st year B.Pharmacy and Pharm.D Courses who have not taken admission in any college can attend for the Spot and Category-B admissions on or before 24.11.2025 at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor AP EAPCET-2025.
Contact: 9848998651, 9912342118 PRINCIPAL

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు.
ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

వైకాపా ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి ఆగదు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: పులివెందుల ప్రజలను మభ్యపెట్టి వైఎస్ కుటుంబం రాజకీయం చేస్తోందని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు జమ్మలమడుగులో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న విజయవాడ భాజపా కార్యాలయంలో తాను చేసిన వ్యాఖ్యలపై ఎంపీ అవినాష్‌రెడ్డి విమర్శించడం తగదన్నారు. పులివెందులు పులులు అన్నది వైఎస్ కుటుంబ సభ్యులలేనని స్పష్టం చేశారు. పులివెందుల ప్రజలను మభ్యపెట్టి రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ భారతి 400 కిలోల బంగారు కొన్నది వాస్తవమేనన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించాల్సిన జగన్ ప్రతినాయకుడిగా మారి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. వైకాపా ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు వైవీయూ వాలంటీర్లు

అడ్వెంచర్ క్యాంపులో పాల్గొనే విద్యార్థులతో వెంకటరామిరెడ్డి

వైవీయూ, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్ మనాలిలో నిర్వహించే అడ్వెంచర్ క్యాంపులో యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవా పథకం వాలంటీర్లు అద్వితీయమైన పాత్ర పోషించి విశ్వవిద్యాలయానికి గుర్తింపు తీసుకుని రావాలని వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి కోరారు. మనాలికి బయలుదేరుతున్న వాలంటీర్లతో స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈ క్యాంపునకు కంటిజెంట్ లీడర్‌గా వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లలిత వ్యవహరిస్తున్నారని.. వైవీయూ పీజీ కళాశాల, పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప ఆర్ట్స్ కళాశాల, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులు వెళ్లనున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు జరిగే ఈ క్యాంపులో వీరి సాహసాలను ప్రదర్శించనున్నారని తెలిపారు.

క్రికెటోత్సవానికి వేళాయె...

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్‌కు రంగం సిద్ధం ● దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2013 మధ్య జన్మించిన వారే అర్హులు)

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులకు తుది గడువు

డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, ఆలంఖాన్‌పల్లి, కడప-516 003.
వివరాలకు: 9154991003, 8008551774
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —

Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY, MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE, www.mits.ac.in

TV Partner: ETV ఆంధ్రప్రదేశ్

Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT

Organised by: ఈనాడు

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్–1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్–1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్–4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

వైకాపాకూ ఆర్జేడీ గతే!

- లాలూ ప్రసాద్ కంటే జగన్‌వే ఎక్కువ తప్పులు
- సుపరిపాలనలో అందరూ కావాలి భాగస్వాములు
- తెదేపా కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

కడప విమానాశ్రయంలో చంద్రబాబుతో ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, చైతన్యరెడ్డి, కలెక్టర్ శ్రీధర్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, పెండ్లిమర్రి: బిహార్‌లో ఆర్జేడీ పార్టీ గతే రాష్ట్రంలో వైకాపాకూ పడుతుందని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు జోస్యం చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ కార్యకర్తలతో ఆయన బుధవారం రాత్రి పెండ్లిమర్రిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన అరాచకాలే మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా చేశారని విమర్శించారు. అందుకే బిహార్‌లో ఇరవై ఏళ్లయినా ఆర్జేడీ అధికారంలోకి రాలేదని, లలూ కుమారుడు వచ్చినా పార్టీని ఇటీవల ఎన్నికల్లో గట్టున పడేయలేకపోయారని అన్నారు. 'గుజరాత్‌లోనూ మరోసారి ఎన్డీఏ గెలువబోతోంది. అక్కడ 25 ఏళ్లుగా భాజపా అధికారంలో ఉంది. తెదేపా కూడా 23 ఏళ్లుగా అధికారంలో ఉంది. పార్టీ వరుసగా అధికారంలో ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుంది. ఆపై పార్టీ కార్యకర్తలు, నేతలు బాగుపడుతారు. మధ్యలో అధికారం కోల్పోతే చాలా ఇబ్బందులెదురవుతాయి. ఇప్పటి నుంచే అప్రమత్తమవుతున్నా. అందరూ కలిసిరండి. సుపరిపాలనలో భాగస్వామ్యులై ప్రజలతో అనుసంధానంగా ఉండండి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'ఎన్నడూ గెలవనన్ని స్థానాలను రాయలసీమలో ఈసారి గెలిచాం. కాస్త దృష్టి పెట్టి ఉంటే పులివెందుల, బద్వేలు కూడా గెలిచేవాళ్లం. రానున్న ఎన్నికల్లో వీటిని నిలబెట్టుకోవడానికి అందరూ కృషి చేద్దాం. గెలిచిన స్థానాల్లోనూ పార్టీ బలహీనంగా ఉన్న చోట పటిష్ఠానికి చర్యలు చేపట్టాం' అని వివరించారు. 'రాయలసీమలో ముఠాలను అణిచివేయడంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. కొప్పర్తి, ఓర్వగల్లు పారిశ్రామికవాడల్లో పలు పరిశ్రమలొస్తున్నాయి. విమానాల తయారీ పరిశ్రమ సైతం రాయలసీమలో ఏర్పాటు చేస్తున్నాం. పండ్ల గుజ్జు పరిశ్రమలు విస్తారంగా వస్తాయి. ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం. ఈ పరిస్థితిలో పార్టీని బలోపేతం చేసుకోవాలి. అరాచక శక్తులు తిరిగి అధికారంలోకి రాకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు.

సీఎం చంద్రబాబుకు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు

'రామానాయుడు'లా అందరూ ఉండాలి

'మంత్రి రామానాయుడు నిత్యం ప్రజలతో మమేకం అవుతారు. సైకిల్‌పై తిరుగుతూ ప్రజల్ని కలుస్తారు. ఓటమి లేకుండా వరుసగా గెలుస్తున్నారు. అందరూ ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలి. కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి ఇంకా ప్రజలతో మమేకమై రాణించాలి. యువకుడిగా మంచి భవిష్యత్తు ఉంది. నెలాఖరులోపు జిల్లా, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆ తర్వాత పార్టీ కార్యక్రమాలు మరింతగా విస్తరించాలి. కార్యకర్తలు అలక వహించనప్పుడల్లా పార్టీ నష్టపోతోంది. ఆ విషయాన్ని గుర్తించి వారి బాగోగులకు దృష్టి పెట్టాం. నేతలు, కార్యకర్తలు ఏ తప్పూ చేయకుండా పని చేయాలి' అని చంద్రబాబు సూచించారు. అధికారులు మాట వినడం లేదని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని కార్యకర్తలు కొందరు నినదించారు. బదులుగా చంద్రబాబు మాట్లాడుతూ.. అధికారులు తప్పు చేసినా వదిలిపెట్టనని.. త్వరలో చూస్తారు కదా అని చంద్రబాబు చెప్పినప్పుడు కార్యకర్తలు కేరింతలు కొట్టారు.

అధిక సంఖ్యలో కేసులు రాజీ కావాలి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని, చిత్రంలో న్యాయమూర్తులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని జిల్లాలోని న్యాయమూర్తులను సూచించారు. జిల్లా కోర్టులో బుధవారం జాతీయ లోక్ అదాలత్‌పై ముందస్తు సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. రాజీ అవ్వదగిన కేసులపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి చర్చించారు. కార్యక్రమంలో రాజంపేట మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్, కడప కోర్టు నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి దీనబాబు, ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి రమేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, మొబైల్ కోర్టు జడ్జి ఆశాప్రియ, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మీ, కడప మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రేష్మా, కడప రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వర్‌వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తెదేపా నాయకులు క్షీరాభిషేకం చేశారు. రెండో విడతగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంపై రైతుల ఖాతాలో నగదు జమ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు మల్లు వెంకటసుబ్బారెడ్డి, మణి, అయ్యప్ప, పార్ల శ్రీనివాసులు, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

మైక్రోబయాలజీ విభాగం స్కాలర్‌కు డాక్టరేట్

వెంకటలోకేశ్

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ విభాగం స్కాలర్ తమ్మన వెంకటలోకేశ్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆ శాఖ ఆచార్యులు డాక్టర్ నరాల వెంకటరామిరెడ్డి పర్యవేక్షణలో 'న్యాచురల్ ప్రొడక్ట్స్ టార్గెటింగ్ పెరాక్సిసోమ్ ప్రొలిఫరేటర్-యాక్టివేటెడ్ రెసెప్టార్ గామా యాజ్ ఏ థెరపీ ఫర్ అక్యూట్ లంగ్ ఇంజ్యూరీ' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ పరిశోధన అక్యూట్ లంగ్ ఇంజ్యూరీ చికిత్స కోసం కొత్త ఔషధ సమ్మేళనాలను గుర్తించడం, వాటిని మూల్యాంకనం చేయడంపై దృష్టి సారించింది. దీంతో వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా పరిశోధకుడు వెంకటలోకేశ్‌కు డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్వీ కృష్ణారావు స్కాలర్‌కు పీహెచ్‌డీ నోటిఫికేషన్ ప్రకటించారు.

అతిథి ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య జిల్లాల్లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఉదయశ్రీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కమలాపురం జేఎల్ సివిక్స్, పులివెందుల టీజీటీ హిందీ, కొండాపురం జేఎల్ ఫిజిక్స్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ, బీఈడీ (సంబంధిత సబ్జెక్ట్‌లో మెథడాలజీ) టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులతో పాటు ధ్రువ పత్రాల నకళ్లను ఒక సెట్టు జతపరిచి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడపలోని కొత్త కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లో ..

తిరుపతి(గ్రామీణం): రాష్ట్రీయ సేవా సమితి(రాస్) తిరుపతి, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం పాఠశాలల్లో ఒక్కో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. తిరుత్తణి(తమిళనాడు)లో రెండు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. తిరుపతి, చిత్తూరులో ఒక్కో ప్రైమరీ టీచర్ పోస్టు, కడపలో రెండు, తిరుత్తణిలో మూడు ప్రైమరీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి ప్రత్యేక పాఠశాల, ఆశ్రమ పాఠశాలలో, అనంతపురం, చిత్తూరు, తిరుత్తణి పాఠశాలల్లో ఒక్కో స్పీచ్ థెరపిస్టు పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు.

ఆర్టీపీపీకి అసెంబ్లీ కమిటీ సభ్యుల రాక నేడు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ తాప విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (ఆర్టీపీపీ)కి అసెంబ్లీ కమిటీ గురువారం రానుంది. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆధ్వర్యంలో 12 మంది సభ్యులు ఆర్టీపీపీ పరిశ్రమ పనితీరు, అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించనున్నారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

వెంకట్రామయ్య (పాతచిత్రం)

మైదుకూరు, న్యూస్‌టుడే : ప్రైవేట్ కళాశాల బస్సు కిందపడి మైదుకూరు మండలం వనిపెంటలోని లెక్కలవారిపల్లెరోడ్డులో బుధవారం అక్కులాయపల్లెకు చెందిన ముక్కుమల్ల వెంకట్రామయ్య (67) మృతి చెందారు. వెంకట్రామయ్య రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా తూలుతూ కిందపడ్డారు. అదే సమయంలో వచ్చిన కళాశాల బస్సు వృద్ధుడిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

21న ఉద్యోగ మేళా

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఈ నెల 21న జమ్మలమడుగులోని న్యాక్ కేంద్రంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల కంపెనీల్లో పని చేసేందుకు ఏడో తరగతి, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. సంబంధిత విద్యార్హత పత్రాలు, ఫొటోలు తీసుకుని రావాలన్నారు.

విద్యుత్తు లోక్ అదాలత్ రేపు

పులివెందుల, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పులివెందుల డివిజన్ కార్యాలయంలో ఈ నెల 21న విద్యుత్తు అదాలత్ నిర్వహించనున్నట్లు డీఈ ప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. నియోజకవర్గంలోని వినియోగదారులు ఏసమస్య ఉన్నా అదాలత్ కార్యక్రమం దృష్టికి తెస్తే వెంటనే పరిష్కార మార్గాలు చూపుతామన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647

REAL ESTATE

PLOT FOR SALE

రంగంపేట, మోహన్‌బాబు కాలేజ్ ఎదురుగా, తిరుపతి మదనపల్లి హైవేకి 15 అ|| దూరంలో 66 అంకణాల ప్లాట్ కలదు. వివరాలకు సం||. 8008685569.

TO LET

COMMERCIAL

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell :7702936190.

JOBS

K K Enterprises Kadapa. Telecaller (Male & Female) Salary: 10000 + Incentives. Contact : 8639923418

Amaravathi Software, Kadapa. Job Offer For Any B.Tech, M.Tech, MBA. Interview Date: 23-11-2025, Time: 9 AM - 5 PM, Cont: 9849720149.

ప్రముఖ ట్రాక్టర్ కంపెనీ డీలర్షిప్‌లో పని చేయుటకు స్పేర్స్ ఇన్‌ఛార్జి కావలెను. హనుమాన్ మోటార్స్, M.G.Auto Nager, Proddatur 9390032810.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ|| 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గురి పెడితే.. గెలుపు తథ్యం

జాతీయ స్థాయికి పసిడిపురి విద్యార్థుల ఎంపిక

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

సాధన చేస్తున్న క్రీడాకారులు

రైఫిల్ షూటింగ్ క్రీడలో బుల్లెట్‌లా ప్రొద్దుటూరు విద్యార్థులు దూసుకెళ్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్- 14, 17 బాల బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారు. వారి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరి నెలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్, ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నారు.

బంగారు పతకమే గురి

నా పేరు **పి.వీరవినీత్,** ఎనిమిదో తరగతి చదువుతున్నా. అమ్మానాన్న చంద్రకళ, మురళీ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరి ప్రోత్సాహంతో రైఫిల్ షూటింగ్ క్రీడను ఎంపిక చేసుకున్నా. నిత్యం సాధన చేస్తున్నా, తొలి ప్రయత్నంలోనే జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచా. ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. చక్కగా రాణించి బంగారు పతకం సాధించాలన్నదే లక్ష్యం.

భారత్ తరఫున ఆడటమే లక్ష్యం



నా పేరు **ఉమ్మడి జాగృతి.** 9వ తరగతి చదువుతున్నా. మాది ప్రొద్దుటూరు పద్మానగర్. అమ్మానాన్న మృదుల, అనిల్‌కుమార్‌రెడ్డి రైతు. వీరి ప్రోత్సాహంతో రైఫిల్ షూటింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్నా. 4 ఏళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నా. గతేడాది ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయిలో 7వ స్థానంలో నిలిచాను. మళ్లిప్పుడు జాతీయ జట్టుకు ఎంపికయ్యాను. ఈ సారి ఎలాగైనా చక్కని ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీలకు ఎంపికవ్వాలని సాధన చేస్తున్నా.

ఒలింపిక్స్ ఎంపికవ్వడమే ధ్యేయం

నా పేరు **డి.మహమ్మద్ తౌఫిక్.** 8వ తరగతి చదువుతున్న, మాది జిన్నారోడ్డు, తల్లిదండ్రులు కరిమూన్, దాదా బాషా చికెన్‌కొట్టు నడుపుతున్నారు. వీరి ప్రేమతో రైఫిల్ క్రీడలో 8 నెలలుగా తర్ఫీదు పొందుతున్నా. జిల్లా, రాష్ట్రస్థాయిల్లో రెండో స్థానంలో నిలిచి రజత పతకాలు అందుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ ప్రతిభ చూపాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు ఆడటమే నా కల.

ముగిసిన యోగా, క్రికెట్ జిల్లా స్థాయి ఎంపికలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్‌లో భాగంగా బుధవారం వైఎస్సార్ ఇండోర్ స్టేడియంతో పాటు డీఎస్ఏ క్రికెట్ నెట్స్‌లో నిర్వహించిన యోగా, క్రికెట్ జిల్లా స్థాయి ఎంపికలు ముగిశాయి. ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు చంద్రావతి, శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపికలు చేపట్టారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్ చక్రవర్తి, ఇజ్రాయిల్, మహబూబ్ బాషా, బాబు, హసీనా, లక్ష్మీ, రాజేశ్వరి వ్యవహరించారు. అండర్-14, 17 వయసు విభాగాలకు చెందిన బాల బాలికలు సుమారు 200 మంది యోగా జిల్లా స్థాయి ఎంపికలకు హాజరు కాగా.. అండర్-14 విభాగానికి సంబంధించి క్రికెట్‌లో 115 మంది బాలురు ఎంపికలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు చంద్రావతి, శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ... ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాల్సి ఉందని చెప్పారు. యోగా రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు జిల్లా బాపట్లలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. క్రికెట్ అండర్-14 బాలురకు సంబంధించిన రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరులో ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారి పేర్లను ప్రకటించారు.

యోగాసనాలు వేస్తున్న బాలికలు

★ **రాష్ట్రస్థాయి యోగా పోటీలకు (అండర్-17) ఎంపికైన బాలబాలికలు :** వంశీ, లక్ష్మీనాథ్, రత్నాకర్, ప్రశాంత్, సాద్విక్, రోహిత్... శశి, నాగవైష్ణవి, తేజోమయి, పావని, అమృత, దుర్గ.

★ **రాష్ట్రస్థాయి అండర్-14 యోగా పోటీలకు ఎంపికైన బాలబాలికలు :** విష్ణు, గురువిష్ణు, వెంకట సుదర్శన్, వెంకట నితిన్, మహిధర్, మనోజ్, లావణ్య, రాణి, సుభాహని, మోహతాజ్ భాను, చందు, యశ్విత.

★ **అండర్-14 క్రికెట్ పోటీలకు క్రికెట్ ఎంపికైన బాలురు :** భాను వర్షిత్‌రెడ్డి, ఇర్ఫాన్, అజయ్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతీక్‌రెడ్డి, వేణు, ప్రణీత్, ఫర్హాన్, హనీఫ్, లక్ష్మీ చెన్నకేశవ, జయసాగర్, మోక్షజ్ఞ, షాహిద్, అన్వర్, దినకర్, చాణక్య.

(c) eenadu

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

పర్యావరణ పరిరక్షణకు కృషి

విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న అధికారులు

మైదుకూరు, న్యూస్‌టుడే : జాతీయ సేవా పథకంలో భాగంగా బుధవారం మూడోరోజు మైదుకూరు మండలం అన్నలూరు గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సచివాలయం, సంపద సృష్టి కేంద్రాల వద్ద మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జ్యోత్స్న, అసోసియేట్ డీన్ ఎన్.వాణి, సర్పంచి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు

జెండా ఎగురవేసి వందనం చేస్తున్న టౌన్ బ్యాంకు ఛైర్మన్ బి.వి.సుబ్బారెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో అఖిల భారత సహకార వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు కార్యాలయం వద్ద ఛైర్మన్ బి.వి.సుబ్బారెడ్డి, డీసీవో ఎం.వెంకటసుబ్బయ్య, డివిజనల్ అధికారి సత్యానందం, జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి జెండా ఎగురవేసి వందనం చేశారు. బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో నిరంజన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ బి.ఎం.గౌస్, సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు గుర్తించేందుకు చర్యలు

నెహ్రూరోడ్డులో పరిశీలిస్తున్న పుర కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహసీల్దారు గంగయ్య

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రవహిస్తున్న దొరసానిపల్లె, ప్రొద్దుటూరు కాలువ-2ను పుర కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహసీల్దార్ గంగయ్యలు బుధవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను గుర్తించారు. కాలువలపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నూతన నిర్మాణాలు చేపట్టాలనే ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం పుర కార్యాలయంలో పురపాలక, రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లతో సమీక్ష జరిగింది. ఆయా ప్రాంతాల్లో ప్రవహిస్తున్న కాలువల ఆక్రమణలను గుర్తించేందుకు మండల, పురపాలక సర్వేయర్, టౌన్‌ప్లానింగ్ విభాగ వార్డు కార్యదర్శులను ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేశారు. పట్టణ ప్రణాళిక విభాగ టీపీవోబీ చంద్రమోహన్, పట్టణ సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ప్రొద్దుటూరు: రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, అధికారులు

ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ పథకానికి సంబంధించి రెండో విడత నిధుల పంపిణీ సందర్భంగా బుధవారం సమావేశాలు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎంపీడీవో సభా భవనంలో ఏడీఏ అనితా ఆధ్వర్యంలో పథకం రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి రైతులకు మెగా చెక్కు అందజేశారు. నియోజకవర్గంలో 10,326 మంది రైతులకు రూ.7.2 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలో 35,184 మంది రైతులకు సంబంధించి రూ.23.81 కోట్ల విలువైన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. వనిపెంట కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 34,081 మంది రైతులకు సంబంధించి రూ.23.19 కోట్ల విలువైన మెగా చెక్కు ఆవిష్కరించారు. బద్వేలు, గోపవరం ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, కూటమి నాయకుడు బొజ్జా రోశన్న పాల్గొని రైతులకు మెగా చెక్కు అందజేశారు. నియోజకవర్గంలోని 34,148 రైతులకు రూ.23.25 కోట్లు ఖాతాల్లో జమ చేశారు.

జమ్మలమడుగు: రైతులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

మైదుకూరు : వనిపెంటలో మెగా చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బద్వేలు:అన్నదాతలతో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెదేపా ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి

కాకిరేనిపల్లెలో స్వచ్ఛత పనులు

స్థానిక కాకిరేనిపల్లెలోని వీధులు, రోడ్లపై నీటి మడుగులు లేకుండా పంచాయతీ సిబ్బంది స్వచ్ఛత పనులు చేపట్టారు. దీనిపై ఈ నెల 18న ఈ ప్రాంతంలో ఈనాడు ఆధ్వర్యంలో జరిగిన ‘వాక్‌విత్ ఈనాడు’ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డికి తెలియజేశారు. కార్యదర్శి రాజేశ్వరి తమ సిబ్బందితో స్వచ్ఛత పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

రహదారికి మరమ్మతులు

కొండాపురం పరిధిలోని తిమ్మాపురం నుంచి పొట్టిపాడు వెళ్లే రహదారికి మరమ్మతు పనులు చేశారు. ఈ రోడ్డు దుస్థితిపై ఈ నెల 12న ‘ఈనాడు’లో ‘అడుగుకో గుంత.. వాహనదారులకు చింత’ శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గుంతలను పూడ్చి చదును పనులు చేపట్టారు. - న్యూస్‌టుడే, కొండాపురం

పగిడాలలో పశువైద్య శిబిరం

రాజుపాళెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులు తమ పశువులకు ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే పశు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి సూచించారు. రాజుపాళెం మండలం పగిడాల గ్రామంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనంతో మనో వికాసం

ప్రొద్దుటూరు పట్టణం, జమ్మలమడుగు, కొండాపురం, చాపాడు, న్యూస్‌టుడే : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రంథాలయ అధికారి ఎస్.ఉమాదేవి, వసంతపేట పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప పాల్గొన్నారు. చాపాడులో గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి, మహిళా ఉద్యోగులు మాజీ ప్రధాని ఇందిర చిత్రపటానికి నివాళి అర్పించారు. కొండాపురం గ్రంథాలయాధికారిణి వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జమ్మలమడుగు గ్రంథాలయంలో ఇందిరాగాంధీ, గ్రంథాలయ ఉద్యమ నాయకుడు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలికల సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్ అనిత, గ్రంథాలయ అధికారి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న గ్రంథాలయ అధికారిణి ఉమాదేవి, విద్యార్థులు

చాపాడులో..

ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు

ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో బుధవారం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సంస్కృతీ సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆంగ్లేయులపై ఆమె చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రమణయ్య, భాస్కర్, షేక్షావల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో అద్భుత ప్రతిభ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ‘ఈనాడు’ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ప్రొద్దుటూరులోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ‘కృత్రిమ మేధ (ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు’ అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు సమీయా, ఆయేషాఖాన్, స్నేహలత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ ఖాజామొహిద్దీన్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఖాజీపేట, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్లో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ‘విద్యార్థుల జీవితాల్లో సెల్‌ఫోన్ ప్రభావం’ అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసాలు ఇచ్చారు. ఇందులో పి.లక్ష్మీ తేజరెడ్డి (పదో తరగతి), కె.రమ్యశ్రీ (తొమ్మిదో తరగతి) బి.ఫణీంద్ర (ఎనిమిదో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఎం.విజయనరసింహ, ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

ప్రొద్దుటూరు విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ ఖాజామొహిద్దీన్

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.విజయనరసింహ, ఉపాధ్యాయులు

ఉపాధి పనులు గుర్తించండి

దువ్వూరు, న్యూస్‌టుడే : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల గుర్తింపును త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో బుధవారం ఉపాధి క్షేత్రసహాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

టెట్ రద్దు చేయాలని విన్నపం

బద్వేలు, న్యూస్‌టుడే: రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి కూటమి ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. స్థానిక తెదేపా కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

గుంతలు పూడ్చక.. చోదకులకు అవస్థ

స్థానిక రామేశ్వరం-ఆర్టీపీపీ మార్గంలో పెన్నా మీదుగా ఇటీవల మైలవరం జలాలు ప్రవహించడంతో ఎర్రమట్టి రోడ్డు కోతకు గురైంది. దీంతో రాళ్లు రహదారిపై కనిపిస్తున్నాయి. గుంతలు పూడ్చకపోవడంతో రాకపోకలు సాగించే చోదకులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రాత్రివేళల్లో ఎవరూ గుర్తించకపోతే ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాల్లోని అనుసంధాన గ్రామాలతో పాటు తాడిపత్రి, అనంతపురం గమ్యస్థానాలకు ఇదే మార్గంలో ప్రయాణికులు వెళ్తున్నారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

పొంచి ఉన్న ప్రమాదం.. అధికారుల నిర్లక్ష్యం

పూడికతీత కోసం మైదుకూరు పట్టణం బద్వేలురోడ్డులోని సహకార సంఘం వద్ద మురుగుకాలువ పైకప్పును తొలగించి నెలలు గడుస్తున్నా అలాగే వదిలేశారు. కాలువలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించి పైకప్పు వేయాల్సి ఉన్నా చర్యలు తీసుకోలేదు. ఫలితంగా సహకార సంఘ భవనాల్లోకి రాకపోకలకు సమస్యగా మారింది. ఈ విషయమై కమిషనర్ వై.రంగస్వామిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

వైకాపా జమ్మలమడుగు ఇన్‌ఛార్జిగా రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిని నియమించారు. రెండు రోజుల క్రితం పీఆర్‌ను తాడేపల్లెకు పిలిపించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించారు. ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రామసుబ్బారెడ్డిని జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా, సుధీర్‌రెడ్డిని సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించారు.

వెనుకబడిన వర్గాలపై దాడులు అరికట్టరూ!

తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: జన, కుల గణనలు ఒకేసారి చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెనుకబడిన వర్గాలపై దాడులు అరికట్టి, న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మందుల అతివినియోగం తగ్గించుకోవాలి

మాట్లాడుతున్న ఐకార్ ప్రాజెక్టు కో-ఆర్డినేటరు ఆనంద ప్రసాదు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పశువులకు విచక్షణరహితంగా రోగనిరోధక మందులను వినియోగిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని జాతీయ పశువైద్య మండలి (ఐకార్) ప్రాజెక్టు కో-ఆర్డినేటరు డాక్టరు ఆనంద ప్రసాదు హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పశువైద్య కళాశాలలో సెమినార్ నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస ప్రసాదు, పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన రైల్వే పోలీసులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్యాయత్నానికి యత్నించిన కటిక నాగమునెయ్యను బుధవారం జీఆర్పీ సిబ్బంది కాపాడారు. రైల్వే పోలీసుల కథనం మేరకు ముద్దనూరు గ్రామానికి కటిక నాగమునెయ్య కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా రైల్వే పోలీసులు గుర్తించి అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లి నాగమ్మకు అప్పగించారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేరుస్తామనే ఎన్నికల హామీని నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బద్వేలులో విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీపై రుణాలు అందించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఆదరణ-3 కింద ముదిరాజ్ సామాజిక వర్గానికి ఆధునిక పరికరాలు అందించాలని విన్నవించారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం అభినందనీయం

హెచ్‌ఎం గంగాభవానీకి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయుడు రాధా నరసింహరాజు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు బాలికల ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రాధా నరసింహరాజు దాతృత్వాన్ని చాటుకున్నారు. పదో తరగతికి చెందిన 66 మంది బాలికల పరీక్ష ఫీజు మొత్తం రూ.8,250 చెల్లించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నగదు రూపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాభవానీ దేవికి అందజేశారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం

అజయ్‌కుమార్, ఇస్మాయిల్‌ను సత్కరిస్తున్న మైదుకూరు న్యాయవాదులు

మైదుకూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో తలపడుతున్న విజయవాడకు చెందిన చలసాని అజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మైదుకూరు బార్ అసోసియేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. విశ్రాంత ఏడీజే ఇస్మాయిల్‌తో కలిసి బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులను కలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్, ఇస్మాయిల్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, కార్యదర్శి శివరాం, సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, న్యాయవాదులు శాలువాకప్పి పూలమాల వేసి సత్కరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రామిరెడ్డి తెలిపారు. రైల్వేకోడూరులో నిర్వహించిన బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొనగా మాధవి జాతీయ జట్టుకు ఎంపికైంది. విద్యార్థినిని ప్రిన్సిపల్, పీడీ నాగేశ్వరరెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

పోల్‌వాల్ట్‌లో విద్యార్థి సత్తా : జమ్మలమడుగు: స్థానిక చల్లపల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీకాంత్ రెడ్డి పోల్‌వాల్ట్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18న కడపలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి ఎంపికయ్యారు.

బ్యాడ్మింటన్ విభాగంలో.. : ప్రొద్దుటూరు విద్య : ఈ నెల 15న విశాఖపట్నం జిల్లా పరవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రొద్దుటూరు పట్టణం దీప్తి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని జింక మునిగీతిక రెండో స్థానంలో నిలిచారని కళాశాల నిర్వాహకులు సుదర్శన్‌రెడ్డి, బాలసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని బుధవారం కళాశాలలో అభినందించారు.

పోరుమామిళ్ల : బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన మాధవి

ప్రొద్దుటూరులో మునిగీతికను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

అసంపూర్తి నిర్మాణాలు.. లబ్ధిదారులకు అవస్థలు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగులోని ఎన్టీఆర్ నగర్‌లో వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. లేఅవుట్-1లో నీటి సమస్య వేధిస్తుంటే, అంబవరం లేఅవుట్‌లో అంతర్గత రహదారుల పనులు చేపట్టకపోవడం, దొంగల భయం వంటి కారణాలతో నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు సాయం ఇస్తున్నా నీటి సమస్యతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.

నీటి సమస్య, దొంగల బెడద

జమ్మలమడుగులోని అంబవరం లేఅవుట్‌లో 2,131 ఇళ్లు మంజూరుకాగా కేవలం 715 మాత్రమే పూర్తయ్యాయి. జమ్మలమడుగు హౌసింగ్ సబ్ డివిజన్ పరిధిలో 4,799 ఇళ్లకు 1,926 పూర్తికాగా 2,873 వివిధ దశల్లో ఉన్నాయి. అంబవరం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు చేపట్టకపోవడంతో కంపచెట్లు పెరిగి చిట్టడవిలా మారింది. జన సంచారం లేకపోవడంతో దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సిమెంటు బస్తాలు, ఇనుప కడ్డీలు, తలుపులు, కిటికీలు, నీటి మోటార్లు రాత్రి వేళల్లో చోరీ చేస్తున్నారు. అంబవరం లేఅవుట్-1లో నీటి సౌకర్యం లేక పోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.

అంబవరం లేఅవుట్‌లో పెరిగిన కంపచెట్లు

జమ్మలమడుగు కాలనీల్లో మౌలిక వసతుల కొరత

జమ్మలమడుగు మండలం పొన్నతోట, పెద్దముడియం, మైలవరం, ఎర్రగుంట్ల, ముద్దనూరు లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు లేక నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

ప్రతిపాదనలు పంపుతాం

వివిధ శాఖల అధికారులతో మాట్లాడి మౌలిక సదుపాయాల కోసం ఏ మేర నిధులు కావాలో ప్రతిపాదనలు పంపాలని సూచించాం. పూర్తి సమాచారం అందగానే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. - రాజశేఖర్, గృహనిర్మాణశాఖ డీఈ, జమ్మలమడుగు

ప్రత్యేక రాయలసీమ సాధనకు పోరాటం

మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

ముద్దనూరు, న్యూస్‌టుడే: రాయలసీమను ప్రత్యేక రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని ప్రధాన మంత్రికి లేఖ రాస్తున్నట్లు రాయలసీమ రాష్ట్ర సాధన సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రయోజనాల కోసం జరిగిన శ్రీబాగ్ ఒప్పందాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సాధిక్ వలి, ముష్కిన్ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాష్ట్ర కార్యవర్గం ముద్రించిన కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలలను ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్వహిస్తామని కేబినేట్ సమావేశంలో నిర్ణయించడం సరికాదన్నారు. నాయకులు వసుంధర, భార్గవి, హర్షిణి, ఖ్యాతిని, రాణి, ప్రేమ్‌కుమార్, మైనుద్దీన్, శివగంగాధర్, ఆనంద్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రశంసాపత్రాలు అందుకున్న నర్సింగ్ విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపల్ శశికళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమారి

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఫిట్ ఇండియా కోసం యువత, నా భారత్ కోసం యువత అనే నినాదంతో రిమ్స్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులు వారం రోజులుగా సీకేదిన్నె పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఆరోగ్య శిబిరం బుధవారంతో ముగిసింది. రిమ్స్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ శశికళ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమారి తెలిపారు. వారు మాట్లాడుతూ.. వారం రోజుల పాటు దత్తత గ్రామం సీకేదిన్నె మండల పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు, విద్యార్థులు, మహిళలకు శుభ్రత, పరిశుభ్రత, పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు.

రూ. రెండు కోట్ల పథకం.. దాహం తీరక సతమతం

● వరదలకు తరచూ దెబ్బతింటున్న పైపులైన్

● మరమ్మతులతో రూ.లక్షల్లో నిధులు దుర్వినియోగం

సిద్దవటం, న్యూస్‌టుడే: ప్రపంచ బ్యాంకు నిధులతో సిద్దవటం పెన్నా లోలెవెల్ కాజ్‌వేపై నిర్మించిన తాగునీటి పైపులైన్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. పెన్నాకు వరదలు వచ్చినప్పుడల్లా నీటి ఉద్ధృతికి పైపులైన్ నిర్మాణాలు కొట్టుకుపోతూ నష్టం వాటిల్లుతోంది. దీంతో ప్రజలకు తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయి. పైపులైన్ మరమ్మతుల కోసం తరచూ రూ.లక్షలతో నిధులు ఖర్చు చేయడం మళ్లీ పైపులైన్ దెబ్బతింటుండడం ఇలా ప్రభుత్వ నిధులు తరచూ దుర్వినియోగం అవుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా శాశ్వత పనులు చేపట్టకపోవడం పట్ల పలువురు పెదవి విరుస్తున్నారు.

వరదలకు దెబ్బతిన్న పైపులైన్ నిర్మాణం

ఇదీ పరిస్థితి

మండల కేంద్రమైన సిద్దవటం పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరా కోసం 2014లో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.2 కోట్లతో స్థానిక పెన్నానదిలో మంచినీటి పథకం నిర్మించారు. పెన్నానదిలో బోరుబావి ఏర్పాటు చేసి తద్వారా పెన్నా లోలెవెల్ కాజ్‌వే మీదుగా పైపులైన్ గ్రామంలోకి ఏర్పాటు చేశారు. ఏటా వర్షాకాలంలో పెన్నానదిలో నీటిమట్టం పెరిగి ప్రవహించడంతో లోలెవెల్ కాజ్ వేపై ఉన్న పైపులైన్ నీటి ఉద్ధృతికి దెబ్బతింటోంది. పైపులైన్ కొట్టుకుపోయినపుడల్లా తాగునీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనులు చేసినప్పుడల్లా రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వ నిధులు ఖర్చవుతూ దుర్వినియోగం అవుతున్నాయి.

పనులకు మోక్షమెప్పుడో!

పైపు లైన్ తరచూ వరదలకు దెబ్బతింటుండడం వల్ల నివారణ కోసం పక్కనే ఉన్న పైవంతెన ఫుట్‌పాత్‌పై పైపులైన్ నిర్మించడానికి స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రయత్నాలు చేశారు. కొత్తగా పైపులైను ఏర్పాటుకు రెండేళ్ల కిందట రూ.15 లక్షలతో అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. రెండేళ్లు గడిచినా నిధులు మంజూరు కాలేదు. ఇటీవల పెన్నా ఒడ్డున కొత్తగా రూ.1.50 లక్షలతో బోరు వేసినా తక్కువ నీరు పడడంతో అందరికీ తాగునీరు అందడం లేదు.

శాశ్వత పనులకు రూ.40 లక్షలు అవసరం

పెన్నా లోలెవెల్ కాజ్‌వేపై ఉన్న పైపులైన్ పైవంతెనపైకి మార్చేందుకు ఆర్అండ్‌బీ అధికారుల అనుమతి తీసుకున్నాం. కొత్తగా ఏర్పాటు చేయనున్న పైపులైన్ పనులకు రూ.40 లక్షల నిధులు అవసరం. ప్రతిపాదనలు రూపొందించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. గతంలో రూ.15 లక్షలతో పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు కాలేదు. - గురుప్రసాద్, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, సిద్దవటం

ప్రతిభ చాటారు.. బహుమతులు గెలిచారు

విజేతలతో నాగార్జున మోడల్ స్కూల్ కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణవేణి

విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సాయిబాబా ఉన్నత పాఠశాల సీఈవో ఎంవీ శ్రీదేవి, ప్రిన్సిపల్ సుబ్బరాయుడు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో బుధవారం ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో కె.సుమన్మయి (8వ తరగతి), కె.సిరిచందన (8వ తరగతి), సి.హెచ్.దేవ్న్ష్ (8వ తరగతి) నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణవేణి, 8వ తరగతి ఇన్‌ఛార్జి వాసవి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరం అక్కాయపల్లెలోని సాయిబాబా ఉన్నత పాఠశాలలో బుధవారం ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ఎస్.దీప్తి (9వ తరగతి), ఎం.మన్విత (9వ తరగతి), వి.ప్రణవి (6వ తరగతి) నిలిచారు. విజేతలకు డైరెక్టర్ ఎంవీ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి, సీఈవో ఎంవీ శ్రీదేవి, ప్రిన్సిపల్ సుబ్బరాయుడు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మునిసిపాలిటీ గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కడప

ఓ.ఎస్.నెం. 16/2025

[illegible]

వాయిదా తేది : 01-12-2025

జట్టు: శ్రీ పి.రాంప్రసాద్ రెడ్డి, న్యాయవాది, కడప నగరం, సెల్ నెం. 8985259609

సర్వారాయసాగర్ పంట కాలువలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వినతి

నిధులిస్తామని సీఎం హామీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

కమలాపురం, పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: 'కమలాపురం నియోజకవర్గంలో 90 శాతం మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2012లో తన తండ్రి పుత్తా నరసింహారెడ్డి ఆ ప్రాంతమంతా తిరిగి పూర్తి చేయాలని విన్నవించారు. 2014-2019లోని తెదేపా ప్రభుత్వంలో వీఎన్‌పల్లి మండలంలో సర్వారాయసాగర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయించారు. దానికి సంబంధించిన పంట కాలువ పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేయిస్తే 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది' అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు. పెండ్లిమర్రి మండలంలోని భైరవగుట్ట వద్ద బుధవారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమలాపురంలో రైల్వే పైవంతెన నిర్మాణం, కమలాపురం నగర పంచాయతీని మేజర్ పంచాయతీగా మార్చి నరేగా నిధులు వినియోగ సౌకర్యం కల్పించాలని, గాలేరు- నగరి ప్రాజెక్టు పనులు వేగంగా చేయించాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి ముఖ్యమంత్రిని విన్నవించారు. ఉల్లి రైతుల్ని ఆదుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. స్పందించిన సీఎం సర్వారాయసాగర్ ప్రాజెక్టు కాలువలు తవ్వడానికి నిధులిస్తామని, ఏడాది లోపు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


కడపలో రైతులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి, వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

పులివెందులలో రైతులకు చెక్కు అందజేస్తున్న బీటెక్ రవి, జడ్పీటీసీ సభ్యురాలు లతారెడ్డి, తదితరులు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాధవి అన్నారు. కడప మండలం పాళెంపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించిన నగదును రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మండలంలో 1,576 రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ కింద రూ.79 లక్షలు, పీఎం కిసాన్ కింద రూ.19 లక్షలు కలిపి రూ.98 లక్షలు జమ చేశారని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ యంత్రాంగం పాల్గొన్నారు.

పులివెందుల: పులివెందులలోని ఇస్తా భవనంలో జరిగిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం నగదు జమ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటెక్ రవి, పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు లతారెడ్డి పాల్గొన్నారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా 41,980 మంది రైతులకు రూ.28.31 కోట్లు జమయిందని వివరించారు. కార్యక్రమంలో తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ప్రాజెక్టు డైరెక్టర్ జోగిరెడ్డి, పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అమర్నాథ్ యాదవ్, ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏవో చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కమలాపురం, న్యూస్‌టుడే: స్థానిక వెంకటేశ్వర ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కడప అఖిలాష్ నేత్ర వైద్యశాల సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నగర పంచాయతీ కమిషనర్ ప్రహర్ష్ మాట్లాడుతూ.. ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లింగాల: కామసముద్రంలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య విజ్ఞాన సంస్థ, స్నేహిత అమృత హస్తం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని సర్పంచి వెంకటనారాయణ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 90 మందికి పరీక్షలు చేయించగా 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు.

IN THE COURT OF THE IVth ADDL DISTRICT AND SESSIONS JUDGE & MACT AT MADHUGIRI

MVC No: 786/2025.

PETITIONERS V/s RESPONDENTS

Smt. Yashoda & others — Bhusam Subbarayudu & Anr

NEWS PAPER DRAFT UNDER ORDER 5 RULE 20 (1) OF C.P.C

Bhusam Subbarayudu S/o B.Venkatasami, Aged about 50 Years, R/o No 6/198 Bharathi Barline, Sankapuram. Kadapa Taluk, Kadapa YSR District, AP State, 516002.

Whereas. The petitioner has instituted a petition for a motor accident claim of Rs 50,00,000 against the Respondent. **Bhusam Subbarayudu S/o B.Venkatasami,** Mahendra Tractor/Trailer vehicle bearing Registration No AP04UA 2017. for the accident on 20-02-2025 at about 11:00 AM, SSK Circle Pavagada-Town, Pavagada Taluk, Tumkur District, Karnataka. That your hereby summoned to appear before this Hon'ble IVth ADDL DISTRICT AND SESSIONS judge & MACT at Madhugiri in a person or by a Pleader/s on 22-12-2025 at 11 A.M. to answer the same failing which the petition will be disposed Ex-parte and determined in your absence. Given under my hand seal of this court 19 day of November 2025 at Madhugiri.

By order of the Court

Sd/- SHIRESTEDAR

IVth ADDL DISTRICT AND SESSIONS Judge & MACT at Madhugiri

L.Bharatha Bhushana, Advocate for Petitioner Office Address: Vinayaka Nagar, Lingenahalli, Madhugiri Town, Tumkur District, Karnataka-572132 Mobil No: 9449471793

సమస్యలు పరిష్కరించమంటే నోటీసులిస్తారా?

మారుతీనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా సమస్యలు సృష్టిస్తామని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పోలీసులతో నోటీసులు ఇప్పించడం దుర్మార్గమని సీపీఎం, సీపీఐ, డీవైఎఫ్ఐ, ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. జిల్లాకు నిధులు కేటాయించి జిల్లాను అభివృద్ధి చేయమని అడగడమే తప్పా అని ప్రశ్నించారు.

వైవీయూలో శిక్షణ తరగతులు ప్రారంభం

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థుల అభివృద్ధి కోసం యూజీసీ, నెట్, ఏపీ సెట్, సీఎస్ఐఆర్ నెట్ శిక్షణ తరగతులు బుధవారం వైవీయూలో ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా పేపర్-1 పూర్తి సిలబస్ బోధిస్తారని, నిపుణులైన అధ్యాపకులతో సందేహాలను నివృత్తి చేసే సెషన్ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి, కామర్స్ విభాగం ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, ఎకనామిక్స్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, పొలిటికల్‌సైన్స్ ప్రొఫెసర్ సతీష్‌బాబు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు

కమిటీల నియామకం చేపట్టాలి

నగరపాలక న్యూస్‌టుడే: పంచాయతీ స్థాయి నుంచి అన్ని దశల్లోనూ కమిటీల నియామకం పూర్తి చేయాలని వైకాపా నాయకులు నిర్ణయించారు. జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిటీల నియామకాన్ని డిసెంబర్ 10లోపు పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి విమానాశ్రయంలో వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యేలు, తెదేపా నాయకులు

సీఎం పర్యటనలో పర్యవేక్షిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

- న్యూస్‌టుడే, బృందం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. కడప విమానాశ్రయానికి బుధవారం రాత్రికి చేరుకున్నారు. ఎమ్మెల్యేలు మాధవి, చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డిలతో పాటు డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టరు శ్రీధర్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, బద్వేలు ఇన్‌ఛార్జి రితికేష్‌రెడ్డిలు వీడ్కోలు పలికారు. జిల్లా అభివృద్ధి పరమైన అంశాలపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. అనంతరం విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లారు.

● ముఖ్యమంత్రి పర్యటనలో డీఐజీ కోయ ప్రవీణ్, కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటం

మారుతీనగర్, న్యూస్‌టుడే: మహిళల హక్కుల సాధనకు ఏపీ మహిళా సమాఖ్య పోరాడుతుందని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భాగ్యలక్ష్మి అన్నారు. నగరంలోని 11వ డివిజన్ మృత్యుంజయకుంటలో ఏపీ మహిళా సమాఖ్య వార్షిక సభ్యత్వాన్ని బుధవారం ప్రారంభించారు. కృష్ణా జిల్లాలో 1937లో ప్రారంభమైన ఈ సమాఖ్య నాటి నుంచి నేటి వరకు మహిళల స్థితిగతులు, సామాజిక పరిస్థితులపై సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యంతో పాటు నిర్ణయాధికారంలో భాగస్వామ్య కోసం కృషి చేస్తుందన్నారు. భాగ్యమ్మ, దేవకుమారి, సుకన్య, పెంచలమ్మ, మల్లీశ్వరి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకున్న మహిళలతో భాగ్యలక్ష్మి

Estd : 2010

SPIRITS DEGREE COLLEGE

(Approved by APSCHE & Affiliated to YV University)

RIMS Road, KADAPA - 516004

UG DEGREE SPOT & MQ ADMISSIONS

Applications are invited from the eligible candidates for admission into **1st Year BA (Pol. Science), B.Com (CA) & B.Sc(CS)** courses under **Spot Admissions** and **Management Quota (Category-B)** for the **Academic Year 2025-26. Application Forms** available at the **College Office** or can be **downloaded from** www.spiritsdc.in. **Last Date to submit Applications** 20-11-2025. Admissions will be conducted as per the guidelines of APSCHE.

Date : 19-11-2025 SECRETARY / CORRESPONDENT

Contact : 9848664650 / 8919772073 / 9010314497

VASAVEE ADS,KDP

ఆర్ఎం వైఖరిని నిరసిస్తూ దీక్ష

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఆర్ఎం నియంత వైఖరి విడనాడాలని ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, సుధాకర్‌లు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆర్ఎం వైఖరిని నిరసిస్తూ ఆర్ఎం కార్యాలయం ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆర్ఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. . కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులను అమలు చేయడం లేదన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకపోయినప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూ నాయకులు

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

సమస్యలపై ప్రశ్నిస్తున్న మాధవరం ఎంపీటీసీ సభ్యుడు శివయ్య

సిద్దవటం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు నిర్వహించాలని పెద్దపల్లె ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి ప్రశ్నించారు. సభ్యుల నుంచి సంతకాల సేకరణ కోసమే మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉందని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దవటంలోని మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బొగ్గిడివారిపల్లె ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేకనాపురంలో రాజ్యసభ సభ్యుడి నిధులతో నిర్మించిన శుద్ధిజల కేంద్రాన్ని ప్రారంభించకుండానే స్థానికుడొకరు శుద్ధి జలం విక్రయిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని.. ఆయనకు ఆ అధికారం ఎవరిచ్చారని ధ్వజమెత్తారు. మాధవరం-1 సచివాలయం భవనం వద్ద గేతెలు ఉంచడం వల్ల మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని నివారణ చర్యలు చేపట్టాలని మాధవరం-1 ఎంపీటీసీ సభ్యుడు శివయ్య డిమాండ్ చేశారు. సమస్యలపై విన్నవిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలిపారు. ఉప ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



इंडियन बैंक Indian Bank ALLAHABAD

ఇండియన్ బ్యాంక్

రాజీవ్ పార్క్, కడప శాఖ

1-2553/1, హౌసింగ్ బోర్డ్ కాలనీ, మారుతి నగర్, కడప, ఫోన్: 08562-254170

డిమాండ్ నోటీసు ప్రచురణ

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన నోటీసు

ఋణగ్రహీత : శ్రీ దారా సుధాకర్ బాబు, తండ్రి: దారా యేసు దాస్, డోర్ నెం.3/1766/37, సియోన్ పురం, రాజా రెడ్డి స్ట్రీట్, కడప, కడప జిల్లా-516001.

సహ-ఋణగ్రహీత & తనఖాదారు : శ్రీమతి దారా వసుంధర దేవి, భర్త: దారా సుధాకర్ బాబు, డోర్ నెం. 3/1766/37, సియోన్ పురం, రాజా రెడ్డి స్ట్రీట్, కడప, కడప జిల్లా-516001.

విషయం : ఇండియన్ బ్యాంక్, రాజీవ్ పార్క్, కడప బ్రాంచ్ వద్ద గల మీ హోమ్ లోన్ ఖాతా నెం.6989680180 గురించి

మీరు తేది.13-11-2025 నుండి తిరిగి చెల్లింపు తేదీ వరకు అంగీకరించిన రేటు వంతున తదుపరి వడ్డీతో రూ.42,29,890/- ల ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనారు. తేది.13-11-2025 నాటికి రూ.42,29,890/- బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించమని మిమ్మల్ని కోరుతూ తేది.14-11-2025న చట్టం క్రింద బ్యాంక్ నోటీసు జారీ చేసింది. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా మీకు పంపిన నోటీసు అందజేయకుండా తిరిగి వచ్చినది. దాని కాపీ పైన తెలిపిన చిరునామాలో అతికించబడింది. ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా తేది.13-11-2025 నుండి చెల్లింపు తేదీ వరకు వడ్డీతో పాటు రూ.42,29,890/- మొత్తాన్ని చెల్లించవలసినదిగా మీరు కోరబడుతున్నారు. లేనట్లయితే దిగువ షెడ్యూల్‌లో ఇచ్చిన సెక్యూర్డ్ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ హక్కులను వినియోగించుకొనుట బ్యాంక్‌కు తప్పనిసరి అవుతుంది.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు లభించే ఏదేని ఇతర హక్కు / పరిష్కారానికి ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఉంటుంది. సెక్యూరిటీలను విడిపించుకునే మీ హక్కులతో వ్యవహరించే SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలను మరియు దాని క్రింద రూపొందించబడిన నియమాలను మేము గమనిస్తున్నాము.

డిఆర్‌టి/ఆర్ఓ ఆఫ్ డిఆర్‌టి / డిఎఆర్‌టి / కోర్ట్ సమక్షంలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ప్రొసీడింగ్స్ తో ముందుకు కొనసాగించేందుకు మరియు పొందిన / పొందుటకు ఆర్డర్ / డిక్రీ అమలుతో ముందుకు కొనసాగించేందుకు ఉన్న తమ హక్కులతో సహా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు లభించే ఏదేని ఇతర పరిష్కారానికి ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ నోటీస్ ఉంటుంది.

స్థిరాస్తుల వివరములు : మీలోని నెం.2వ వారి పేరున గల తనఖాలోని ఆస్తులు : ఆంధ్రప్రదేశ్, వై.ఎస్.ఆర్. జిల్లా, కడప, కడప మున్సిపల్ కార్పొరేషన్, నాగరాజుపల్లి, సియోన్‌పురం, వార్డు నెం.03, సర్వే నెం-257/3, డోర్ నెం: 3/1766/37లో మొత్తం విస్తీర్ణం 99.80 చదరపు గజాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ తో గల రెసిడెన్షియల్ భవనం.

హద్దులు: తూర్పు: పెద్ద సుబ్బయ్య డోర్ నెం.3/1766/38 నుండి 41 వరకు హవేలి హౌస్. పడమర: డోర్ నెం-3/1766/36తో గల మహబూబ్ ఉన్నీసా గారి ఇల్లు & రేస్ వాల్, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: అయ్యవారు రెడ్డి గారి ఇల్లు.

విస్తీర్ణం: గ్రౌండ్ ఫ్లోర్ 1026 చదరపు అడుగులు ఆర్‌సిసి మరియు ఫస్ట్ ఫ్లోర్ 1026 చదరపు అడుగులు ఆర్‌సిసి

తేది: 14.11.2025, ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99899 97626

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 91771 11468

ఇందిరాగాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

కడప : ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, తదితరులు

కడప గ్రామీణ, వేంపల్లె, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం పాత రిమ్స్ కూడలిలో ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, నాయకులు సల్మాన్‌రాజు, సిరాజుద్దీన్, గౌస్‌పీర్, ముబారక్ పాల్గొన్నారు. వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

వేంపల్లెలో నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

దొంగ.. దొంగ బెంగళూరు పోలీసులు మళ్లీ పరుగందుకున్నారు. ఓ ప్రముఖ బ్యాంకు ఏటీఎంలలో ఉంచాల్సిన రూ.7.11 కోట్ల సొమ్మును వాహనంలో తరలిస్తుండగా.. దోపిడీ దొంగలు బుధవారం మధ్యాహ్నం నడిరోడ్డుపై దోచుకుని పరారయ్యారు. దుండగుల వేట కీలకంగా మారింది. దోపిడీకి గురైన వాహనాన్ని పట్టుకున్నా.. అందులో డబ్బు ఖాళీ చేసుకుని వెళ్లారు. దుండగులు వదిలివెళ్లిన వాహనాన్ని అణువణువునా శోధిస్తున్న పోలీసులు... (న్యూస్‌టుడే, యశ్వంతపుర)

తొక్కిసలాటపై అభియోగపత్రం సిద్ధం

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : ఐపీఎల్‌లో విజయం సాధించిన వేళ బెంగళూరులో నిర్వహించిన ప్రశంసోత్సవంలో 11 మంది మరణించిన ఘటనకు సంబంధించి దర్యాప్తు పూర్తి చేసిన సీఐడీ అధికారులు అభియోగపత్రాన్ని సిద్ధం చేశారు. ఆర్‌సీబీ, కేఎస్‌సీఏ, డీఎన్‌ఏ సంస్థలు బాధ్యతను పక్కన పెట్టి, నిర్లక్ష్యంగా విజయోత్సవాలకు చర్యలు తీసుకోవడంతో ఈ ఘటనకు కారణమని తన 2200 పుటల అభియోగపత్రంలో అధికారులు పేర్కొన్నారు. చిన్నస్వామి మైదానంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక, నిర్వహణ వ్యవస్థ లేకపోవడం, కీలక నిర్ణయాలు తీసుకోకపోవడం, పోలీసులకు పూర్తి సమాచారాన్ని అందించకపోవడం, అధ్వానంగా ఈ టికెట్ల విక్రయం, ఆన్‌లైన్‌లో సమాచారం, ట్వీట్ల విషయంలో గందరగోళం, వదంతులు, ఎక్కువ మంది అభిమానులు ఒకేసారి మైదానంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో 11 మంది మరణించి 56 మంది గాయపడేందుకు కారణమని తమ దర్యాప్తులో సీఐడీ గుర్తించింది. అభియోగపత్రాన్ని న్యాయస్థానంలో దాఖలు చేసేందుకు ముందుగా న్యాయకోవిదుల పరిశీలనకు ఇచ్చామని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు.

ఏకాంత వేళ.. తేనెవల

తల్లిని అడ్డు పెట్టుకుని దుశ్చర్య

విజయపుర, న్యూస్‌టుడే : ఇండి పట్టణంలోని ఒక బ్యాంకు మేనేజరును హనీట్రాప్‌లో ఇరికించేందుకు ఒక యువకుడు (24) చేసిన ప్రయత్నం విస్మయం గొలుపుతుంది. దాని కోసం తన తల్లి (44)నే అడ్డు పెట్టుకున్నాడు. తన బ్యాంకు సమీపంలో కొబ్బరి బొండాలు విక్రయించే మహిళతో మేనేజరుకు పరిచయమైంది. అది స్నేహంగా మారింది. నవంబరు 1న తాను ఇంట్లో ఒంటరిగా ఉంటానని, రమ్మని ఆమె ఆహ్వానించింది. ఆమెతో సన్నిహితంగా ఉన్నప్పుడు కిటికీలో చరవాణి ఉంచి, ఈ సన్నివేశాలను చిత్రీకరించింది. దాన్ని ఆ మేనేజరు గుర్తించి, చరవాణి అక్కడ ఎందుకు పెట్టావని ప్రశ్నించగా.. అది పడిపోయిందని బుకాయించింది. నవంబరు 5న ఆమె ఫోన్ చేసి, మన ఏకాంతాన్ని ఎవరో రికార్డు చేశారని, నగదు కోసం బెదిరిస్తున్నారని చెప్పడంతో అతను కంగుతిన్నాడు. వాళ్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించింది. ఆమె కొడుకు అమూల్, అల్లుడు మహేశ్ జగలి, ఓ పత్రికకు విలేకరిగా పనిచేస్తున్న తౌసిఫ్ ఖురేశీ ముఠాగా ఏర్పడి, ఆ మేనేజరుకు ఫోన్ చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని, లేకపోతే టీవీ చానళ్లకు దాన్ని ఇస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడు ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి తొలుత అమూల్‌ను అరెస్టు చేశారు. ఆ మహిళతో పాటు మరో ఇద్దరు పరారయ్యారు. ఇదే తరహాలో ఆ మహిళను అడ్డుపెట్టుకుని పలువురి నుంచి వీరు నగదు గుంజారని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

సాంకేతిక సదస్సు.. పెట్టుబడుల ఉష్షస్సు

భలేభలే.. : బెంగళూరు సాంకేతిక సమ్మేళనంలో రోబోతో శునకరాజం కరచాలన ఘట్టం.. ఆసక్తికరం

ఈనాడు, బెంగళూరు : బెంగళూరు అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రం (బీఐఈసీ)లో నిర్వహిస్తున్న బెంగళూరు సాంకేతిక సమ్మేళనం (బీటీఎస్)లో తొలి రోజున మూడు కీలక విధానాలను ఆవిష్కరించిన సర్కారు.. రెండో రోజున రూ. వేల కోట్ల పెట్టుబడులపై ప్రతిపాదన పత్రాలు (లెటర్ ఆఫ్ ఇంటెంట్-ఎల్ఓఐ) సాధించుకుంది. సెమీకండక్టర్, విద్యుత్తు వాహనాలు, జీవ సాంకేతిక రంగాల్లో పలు కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి చూపాయి. మరోవైపు క్వాంటమ్ సిటీ ప్రణాళికపైనా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ సమ్మేళనంలో దేశ, విదేశీ అంకురాలు ఆవిష్కరించిన సాంకేతిక ఉత్పత్తులు కొత్త తరం జీవన విధానానికి భరోసా కల్పించాయి. మూడు రోజుల ఈ సమ్మేళనం గురువారం ముగియనుంది.

క్వాంటమ్ సిటీ ప్రణాళిక ఆవిష్కరణ

ఉపాధి అవకాశాలు

స్వదేశీ కియో ఏఐ పీసీని ఆవిష్కరించిన కియోనిక్స్ బీటీఎస్ వేదికపై మరిన్ని ఉత్పత్తుల తయారీకి సిద్ధమైంది. బుధవారం డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, గ్లోబల్ హెచ్‌డీఐ, త్స్యయో మ్యానుఫ్యాక్చరింగ్, మినీమైన్స్ క్లీన్‌టెక్ సొల్యూషన్ వంటి సంస్థల నుంచి రూ.2,600 కోట్ల ఎల్ఓఐలను స్వీకరించింది. డ్రోన్ ఫెడరేషన్ ఇండియా సహకారంతో రాష్ట్రంలో డ్రోన్ల పరీక్ష కేంద్రాలు స్థాపించి ప్రతి చోటా కనీసం 600మందికి ఉపాధి అందించే అవకాశం ఉంది. గ్లోబల్ హెచ్‌డీఐ రూ.1,500 కోట్లతో కర్ణాటకలో యూనిట్ స్థాపన, ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఎస్ఎస్‌సీఐ) కర్ణాటక ప్రభుత్వ సహకారంతో మార్వెల్ సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటు చేసి కనీసం వంద మంది మహిళలకు ఈ రంగంలో శిక్షణ, ద్వితీయశ్రేణి నగరాల్లో ఈ పెట్టుబడులు విస్తరించేలా చేయనున్నారు. ఈ ఎల్ఓఐలు కార్యరూపం దాలిస్తే కనీసం 3,500 మందికి ఉపాధి అందే వీలుంది.

క్వాంటమ్ సిటీకి రూపు..

రాష్ట్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో రూ.1,000 కోట్లతో క్వాంటమ్ సిటీ ఏర్పాటుపై ఈ సమ్మేళనంలో సమగ్ర ప్రణాళికను విడుదల చేశారు. ఈ రంగంలో కేవలం పరిశోధనలే కాకుండా క్వాంటమ్ హార్డ్‌వేర్‌ల ఎగుమతులు, క్లౌడ్ సర్వీస్‌లు, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ లేబొరేటరీలు, హార్డ్‌వేర్ పార్కులు, డీప్‌టెక్ క్వాంటమ్ వెంచర్లను ఈ సిటీలో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర మంత్రి బోసురాజు, ఇస్రో ఛైర్మన్ డా.వి.నారాయణన్, ఐఐఎస్‌సీ ఆచార్యులు అరిందమ్ ఘోష్ తదితరులు ఈ క్వాంటమ్ సిటీ కాన్సెప్ట్‌ను ఆవిష్కరించారు.

సమ్మేళన ప్రాంగణంలో వివిధ ప్రదర్శనాంశాల వీక్షణలో సందర్శకుల సందడి

పిల్లలను మొబైల్స్ నుంచి దూరం చేసే ఏఐ యాక్సిలేటర్



ధాన్యాల నాణ్యత తెలిపే యాప్

కొత్తతరం సృజనలివిగో..

ఈనాడు, బెంగళూరు : ఈ సమ్మేళనంలో కొత్తతరం సాంకేతిక ఉత్పత్తులు ఆధునిక జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా ఉన్నాయి. వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, రక్షణ, సమాచార సాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విపణిలో ఉన్న ఉత్పత్తిని ఉన్నతీకరించేందుకు యువ సాంకేతిక మేధ పోటీ పడుతోంది. ఆధునిక సాంకేతిక విప్లవానికి చిరునామాగా మారిన కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ సాంకేతికతలతో ఉత్పత్తులు తయారు చేశారు. రైతులు పండించే పంటకు నాణ్యతను నిర్ణయించుకునే స్మార్ట్ పోర్టబుల్ ఏఐ పవర్డ్ మల్టీగ్రైన్ అనాలసిస్, ఐఐఎస్‌సీ ఆర్ట్ పార్క్ రూపొందించిన మల్టీమోడల్ ప్రైమరీ హెల్త్ ఏఐ అసిస్టెంట్, పిల్లలను మొబైల్, ట్యాబుల వాడకం నుంచి తప్పించే ఏఐ ఆడియో యాక్సిలేటర్లు, గృహ వ్యర్థం నుంచి గంటల వ్యవధిలో ఎరువు తయారు చేసే పర్యావరణ స్నేహ కంపోస్టర్ డోస్ట్‌బిన్ వంటి ఆధునిక ఉత్పత్తులు బెంగళూరు సాంకేతిక సమ్మేళనం స్థాయిని ప్రపంచానికి చాటేలా చేశాయి. ఈ ఏడాది 60దేశాలకు చెందిన కంపెనీలు ఈ సమ్మేళనంలో తమ ఉత్పత్తులను ఆవిష్కరించాయి. నేటితో ఈ సమ్మేళనానికి తెరపడనుంది.

ప్రజారోగ్య డేటాను భద్రపరిచే ఏఐ ప్రోగ్రామర్

వంటింటి చెత్తను ఎరువుగా మార్చే డోస్ట్‌బిన్

బావ.. తప్పుచేశాడు

యాదగిరి, న్యూస్‌టుడే : వివాహం చేసుకుంటానని నమ్మించి తన మరదల్ని (16) ఒక యువకుడు వంచించి, శారీరక సుఖాలను తీర్చుకున్నాడు. వాంతులు ఎక్కువ కావడంతో బాలికను ఆమె తల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లినప్పుడు రెండు నెలల గర్భిణి అని వైద్యులు గుర్తించారు. సురపుర తాలూకా కెంబావికి చెందిన బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుని కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

నిండా ముంచిన క్రిప్టో కరెన్సీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సైబర్ కేటుగాళ్లు 'క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్' పేరిట ఓ వ్యక్తి (45)ని వంచించారు. రూ.42 లక్షలు పోగొట్టుకున్న ఆ వ్యక్తి చివరికి బుధవారం సైబర్ ఠాణా మెట్లెక్కారు. నగరంలో వెలుగులోకి వచ్చింది. 'క్రిప్టో' వ్యాపారమేందో బాగుందని ఓ ఇన్‌స్టాగ్రామ్‌లో సమాచారాన్ని ఆయన తెలుసుకున్నారు. ఆ వేదికపై అశుతూష్ శర్మ అనే వ్యక్తి పరిచయం కావడంతో.. అతని సలహాలు తీసుకున్నారు. నెలకు 15 శాతం లాభాలు మూటగట్టుకోవచ్చని ఆశపడ్డారు. తొలి విడతలో పెట్టిన పెట్టుబడికి భారీగా లాభాలు రావడంతో.. ఏకంగా రూ.42 లక్షలు ఆ వ్యాపారానికి వెచ్చించారు. ఎన్ని రోజులు గడిచినా లాభాలకు సంబంధించిన డబ్బు బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

అగ్రహార ఆలయంలో మహిళపై కత్తితో దాడి

బెంగళూరు (ఆడుగోడి), న్యూస్‌టుడే : సంపిగెహళ్లి పోలీసు ఠాణా పరిధిలో నివసిస్తున్న రమ్య (25) అనే యువతిపై ఓవ్యక్తి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం కలకలం రేపింది. నగర శివార్లలోని ఆనేకల్‌కు చెందిన ఓ యువకుడితో ఆమెకు రెండేళ్ల కిందట వివాహమైంది. ప్రస్తుతం పుట్టింటికి వచ్చింది. తెల్లవారుజామున అగ్రహారలో ఉన్న ఆలయానికి ఆమె చేరుకున్నారు. అక్కడే ఆమెపై దుండగుడు దాడికి పాల్పడినట్లు గుర్తించారు. దాడికి గురయ్యాక.. ఆమె ఎటెళ్లిపోయిందో తెలియని పరిస్థితి నెలకొంది. క్షుద్రపూజల్లో భాగంగా ఆమెపై ఆలయ పరిధిలో దాడి చేశారా? అనే కోణంలోనూ అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం మేనత్తపై దాడి

బెళగావి, న్యూస్‌టుడే : ఆస్తి వివాదానికి సంబంధించి తనపై దావా వేసిన మీనాక్షి రామచంద్ర శింధే (50) అనే మహిళపై ఆమె మేనల్లుడు బాబా సాహెబ్ చౌహాన్ కొడవలితో దాడికి ప్రయత్నించాడు. అథణిలోకి న్యాయస్థానానికి వచ్చిన ఆమెపై కొడవలితో దాడికి వస్తుండగా.. తప్పించుకునేందుకు ఒక హాల్‌లోకి ఆమె ప్రవేశించింది. న్యాయమూర్తి ముందే మేనత్తపై వేటు వేశాడు. అందరూ కలిసి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు.

కారాగారంలో నిద్రకు దూరం

దర్శన్‌కు కంబళి భాగ్యం

నటుడు దర్శన్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : తన అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో విచారణ ఖైదీగా ఉన్న సినీ కథానాయకుడు దర్శన్‌కు కంబళి ఇవ్వాలని సంబంధిత కోర్టు న్యాయమూర్తి బుధవారం కారాగార అధికారులకు సూచించారు. దర్శన్, ఇతర నిందితులను 57వ సీసీహెచ్ న్యాయస్థానం ముందు వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరు పరిచారు. నీలి రంగు టీషర్టు, నల్లని ట్రాక్ ప్యాంటు ధరించి దర్శన్ విచారణకు హాజరయ్యాడు. ప్రత్యేక దర్యాప్తు దళం దాఖలు చేసిన సీఆర్‌పీసీ 294 అర్జీకి ఆక్షేపణ వ్యక్తం చేసేందుకు నిందితులకు న్యాయమూర్తి సూచించారు. ఇంటి నుంచి దుప్పటి, కంబళి తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఒక నిందితుడు నాగరాజ్ కోరగా, 'ఉయ్ కాంట్ ఈవెన్ స్లీప్' అని దర్శన్ ఆంగ్లంలో మాటల్ని ప్రారంభించారు. 'రాత్రుళ్లు చలి తీవ్రంగా ఉంది. నిద్ర పోవడమే సాధ్యం కావడం లేదు. అదనంగా కంబళి ఇప్పించండి' అని దర్శన్ మనవి చేసుకున్నాడు. 'చలి ఎక్కువగా ఉంటే కంబళి ఇవ్వాలి కదా. పదే పదే ఎందుకు చెప్పించుకుంటారు? నిందితులకు కావలసిన అదనపు కంబళ్లను ఇవ్వండి' అని కారాగారం అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసులో నిందితుడు ప్రదోశ్‌కు మధ్యంతర బెయిలును ఈ నెల 22 వరకు విస్తరించిన న్యాయమూర్తి తదుపరి విచారణను డిసెంబరు 3కు వాయిదా వేశారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

వస్తు ప్రదర్శన వేదిక ప్రారంభిస్తున్న మంత్రి హెచ్‌కే పాటిల్

ఆకట్టుకునేలా జపాన్ కళాకారుల స్టాల్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఆవరణలో అంతర్జాతీయ మహిళా పారిశ్రామిక దినోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రమల్లో తయారవుతున్న ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎగుమతి చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు, సమాఖ్య తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సొంతంగా పరిశ్రమను నెలకొల్పేందుకు ప్రభుత్వం సాలీనా 3 శాతం వడ్డీతో రూ.5 కోట్ల వరకు రుణాన్ని ఇస్తోందని తెలిపారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ఇక్కడి స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచారు. అనంతరం నిర్వహించిన సదస్సులో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మాట్లాడారు.

దత్తజయంతి వేళ నిషేధాజ్ఞలు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : దత్త జయంతిని పురస్కరించుకుని డిసెంబరు ఒకటో తేదీ నుంచి నాలుగు వరకు బాబా బుడాన్‌గిరి, చుట్టుపక్కల ప్రాంతాలకు పర్యాటకులు రాకుండా నిషేధాజ్ఞలను జారీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ముళ్లయ్యనగిరి, దత్తపీఠం, సీతాళయ్యనగిరి, గాళికెరె, మాణిక్యధార వరకు పర్యాటకులు రావద్దని జిల్లాధికారి మీనా నాగరాజ్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. డిసెంబరు 5న ఉదయం 10 నుంచి పర్యాటకులు యథావిధిగా రావచ్చని ఆమె తెలిపారు. దత్త జయంతిని ఘనంగా నిర్వహించేందుకు విశ్వ హిందూ పరిషత్తు, బజరంగదళ, భాజపా కార్యకర్తలు ఇప్పటి నుంచే సన్నాహాలు చేపట్టారు.

నీలి మేఘమాల!

ఆకాశానికి ఏవేవో వర్ణాలు అద్దినట్లున్నా.. కార్తికమాస చివరి గడియల్లో ప్రశాంత నీలి రంగు మెరుపులీనుతోంది! నిర్మల తటాక తీరంలో చీకట్లను పులిమి.. సంధ్యాభానుడు కదలిపోతున్న వేళ కానవచ్చిన సుందర దృశ్య రాజమిదీ. బెళగావి నగర శివారు ఖిల్లా చెరువు వెనుక జలాల వద్ద కానవచ్చిన చక్కని చిత్ర సౌరభం. **- న్యూస్‌టుడే, బెళగావి**

రాజధాని.. వ్యర్థాల గని

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బెంగళూరు నగరంలోనే నిత్యం 900 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా పర్యావరణ ఉద్యమకారిణి సాలుమరద తిమ్మక్క పేరిట ఐదుగురు పర్యావరణవేత్తలకు పురస్కారాలు ఇస్తామని ప్రకటించారు. కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్యాలెస్ మైదానంలో ఏర్పాటు చేసిన సువర్ణ మహోత్సవాలను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మండలిలో రూ.కోటితో ట్రస్టు ఏర్పాటు చేసి, వచ్చే వడ్డీని ఐదుగురు పర్యావరణవేత్తలకు అందిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తు చేశారు. ఇందిరాగాంధీ పిలుపుతోనే కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటైందని గుర్తు చేశారు. కేంద్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం బెంగళూరు, దావణగెరె, హుబ్బళ్లి-ధార్వాడ, కలబురగి కూడా కాలుష్య నగరాల జాబితాలో ఉండడం దురదృష్టకరమని అన్నారు. పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే తదితరులు ప్రసంగించారు.

కార్యక్రమ ప్రారంభ జ్యోతి వెలిగిస్తున్న సీఎం సిద్ధరామయ్య

సంక్షేమానికి 'ఇందిరా' బాటలు

బెంగళూరు (యశ్వంతపుర): పేదరిక నిర్మూలనకు మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ 20 సూత్రాల పథకాన్ని రూపొందించి అమలు చేశారని, ఆమె చూపిన సంక్షేమ బాటలోనే మా సర్కారు నడుస్తోందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఆమె చిత్రపటానికి పుష్పార్చన చేశారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం పేదల వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నట్లు సిద్ధ మండిపడ్డారు. భాజపా పాలనలో పేదరికం మరింత పెరిగిపోయిందన్నారు. ఇదివరకటి కాంగ్రెస్ ప్రభుత్వమే దేశ ప్రజలకు సంక్షేమ పథకాలు చక్కగా అమలు చేసిందన్నారు. భూసంస్కరణలు, బ్యాంకుల జాతీయాకరణ తదితర పథకాలను అమలు చేసిన ఘనత ఇందిరాకే దక్కుతుందన్నారు. భాజపా పాలకులు ఆ బ్యాంకులను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాల్లో పడ్డారని నిందించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన ముంతాజ్‌బేగం, బీటీ లలితానాయక్ తదితరులను సత్కరించారు. కన్నడభాషలో ముద్రించిన ఇందిరాగాంధీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, మాజీ ఎంపీలు జయప్రకాశ్‌హెగ్డే, ఉగ్రప్ప, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ ముంతాజ్‌బేగం, మాజీ మంత్రి బీటీ లలితా నాయక్ తదితరులకు సత్కారం

ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న సిద్ధరామయ్య

అధికారుల వేధింపులతో ఉద్యోగి బలవన్మరణం

కలబురగి, న్యూస్‌టుడే : ఉన్నతాధికారుల వేధింపులు భరించలేక పరమేశ్వర అనే విద్యుత్తు శాఖ లైన్‌మన్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బసవపట్టణలో కొన్నేళ్లుగా జెస్కాంలో బాధితుడు లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పట్టణ శివార్లలోని ఒక పొలంలో స్తంభానికి ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని బుధవారం ఉదయం గుర్తించారు. ఫరహతాబాద్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జగమంతా ఒక్కటిగా శాంతిసాధన

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : శాంతిసౌభాత్రుత్వాలను పెంపొందించే దిశగా ప్రపంచం మొత్తం ఏకతాటిపై నడవాలని సద్గురు మధుసూదన సాయి పిలుపునిచ్చారు. 'ఒక ప్రపంచం- ఒక కుటుంబం' అనే నినాదంతో చిక్కబళ్లాపుర సమీప సత్యసాయి శాంతిగ్రామ్‌లో 93 రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఫిజి ఏడో రాష్ట్రపతి రతు నైకామా తవాకేకొలీ, ఫిజి ప్రథమ మహిళ ఎమిలీ లాలాబలవుతో కలిసి కేకు కోసి మాట్లాడారు. దక్షిణ పసిఫిక్‌కు చెందిన ఏడు ద్వీప దేశాల సంస్కృతి ప్రతిబింబించేలా వేడుక నిర్వహించారు.

కేకు కోస్తున్న మధుసూదన సాయి తదితరులు

నటిపై కేసు నమోదు

కలబురగి, న్యూస్‌టుడే : దళితులు, వెనుకబడిన సామాజిక వర్గాలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన నటి, 'కామెడి కిలాడిగళు' ఫేం నయనపై కలబురగి సబ్ అర్బన్ ఠాణాలో కేసు నమోదైంది. కలబురగిలో మనిమిత్ర కంపెనీ అక్టోబరు 29న నిర్వహించిన బహిరంగ సభలో ఆమె చేసిన వ్యాఖ్యలపై దళిత సేన జిల్లా అధ్యక్షుడు మంజునాథ భండారి నిప్పులు చెరిగారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఆడియో, వీడియో దస్త్రాలను పోలీసులకు అందజేశారు.

మఠాధిపతుల తీరుపై అసహనం

మైసూరు, న్యూస్‌టుడే : కొందరు మఠాధిపతులు తాము ప్రజా సేవకుల్లా వ్యాఖ్యలు చేయడం, ఇతర పీఠాధిపతులపై అనుచితంగా మాట్లాడడం దురదృష్టకరమని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ వ్యాఖ్యానించారు. వారు కాషాయ వస్త్రాలను విడిచిపెట్టి, ఆకుపచ్చ కండువా వేసుకోవాలని సూచించారు. సాణేహళ్లి స్వామి, నిజగుణానంద స్వామి తదితరులు కన్నేరి కాడ అదృశ్య సిద్ధేశ్వర స్వామిని దూషించడం, నిర్బంధం విధించడం దురదృష్టకరమని బుధవారం ఇక్కడ వ్యాఖ్యానించారు. వీరశైవులు, లింగాయతలు హిందూ ధర్మంలో భాగమని చెప్పారు. బవసవణ్ణను మాజీ మావోయిస్టులా చిత్రీకరించి మాట్లాడేవారిని కూడా కొందరు వెనకేసుకు వస్తున్నారని దుయ్యబట్టారు. దిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు ముస్లిం సముదాయంలోని విద్యావంతులే కారకులని గుర్తు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

అర్థవంతంగా సభాపర్వం: హొరట్టి

హావేరి, న్యూస్‌టుడే : దక్షిణ కర్ణాటక ప్రాంతంలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు- ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని సమస్యలను చర్చించినా, ఇక్కడి వారు మాత్రం అక్కడి సమస్యలపై నోరు మెదపరని విధానపరిషత్తు అధ్యక్షుడు బసవరాజ హొరట్టి వ్యాఖ్యానించారు. డిసెంబరు 8 నుంచి బెళగావి సువర్ణసౌధలో జరిగే కాలం సమావేశాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చురుకుగా చేపట్టామని చెప్పారు. ఆయన బుధవారం హావేరిలో విలేకరులతో మాట్లాడుతూ బెళగావి సమావేశాలంటే కేవలం ఆందోళనలు, నిరసనలకు పరిమితమన్న అభిప్రాయాన్ని తొలగించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. నిరుద్యోగం, ఉద్యోగం, తపాలా, చెరకు రైతు సమస్యలు, వరదతో పంటనష్టం పోయిన వారికి పరిహారం తదితర అంశాలపై సహేతుకంగా చర్చించాలని ఎమ్మెల్సీలకు సూచిస్తున్నారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చకు అవకాశం ఇస్తానని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరికీ ఫోన్ చేసి, చర్చకు పెద్ద పీట వేయాలని కోరతానన్నారు. ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎమ్మెల్యే రాజు కాగే చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందనడం అర్థరహితమన్నారు. రాష్ట్ర విభజన ఆలోచనను నేను వ్యతిరేకమన్నారు. తనపై సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి, పదవి నుంచి తప్పిస్తే మాజీని అవుతానన్నారు. ఏదో ఒక రోజు మాజీగా మారే నేను.. కాస్త ముందుగా పదవి వీడితే వచ్చిన నష్టం ఏముందన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యేలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.

పిలికుళ.. చెరగని ప్రకృతి కళ!

పిలికుళ మృగాలయంలో ఆకట్టుకునే తటాకం

ఆ నగరం.. నయన మనోహరం. సముద్ర తీరంలో విరాజిల్లే మంగళూరుకు తూర్పు వైపున మహా పడమటి కనుమలు విస్తరించి వక్కని అందాలను తెచ్చిపెట్టాయి. ఆ అందాల కోనకు దిగువగా విస్తరించి.. పర్యాటకులను మరో లోకంలోకి తీసుకువెళ్లే కేంద్రమే.. పిలికుళ!

అరుదైన ఆకుపచ్చ పక్షి

మంగళూరు వాసులను మురిపించే తెల్ల పులి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దేశంలో పర్యావరణ వైభవానికి నిలువెత్తు దర్పణంగా మంగళూరు పిలికుళ జీవ ఉద్యానవనం- మృగాలయం విరాజిల్లుతోంది. దీని నిర్వహణ బాధ్యతలను అటవీ శాఖ చేపట్టడంతో పచ్చందాలకు పెట్టని కోటగానూ మారిపోయింది. నిజానికి దీని ఆలనా, పాలన 'పిలికుళ జైవిక ఉద్యానవన ప్రాధికార' చూస్తున్నా.. అభివృద్ధి వ్యవహారాలకు అటవీ శాఖ అండగా నిలిచిందని ప్రాధికార సంచాలకుడు జయప్రకాశ్ భండారి తెలిపారు. దేశంలోని అతి పెద్ద మృగాలయాల్లో ఒకటిగా పేరొందిన.. మొత్తం 500 ఎకరాల్లో విస్తరించి, పర్యాటకులను ఎంత తిరిగినా తరగనంతగా రూపుదిద్దుకుంది. పడమటి కనుమల దిగువన- మంగళూరు దిశగా ఈ వన సీమ పాదుకుంది. ఎన్నో రకాల వృక్షరాజాలు, ఆయుర్వేద వనమూలికల మొక్కలు, విశాలమైన చెరువులో జలచరాలు, అందులో పడవ విహారం, వివిధ విభాగాల్లో సింహాలు, సింగాలు, పులులు, తెల్ల పులి, జింకలు, అనేకరకాల పాములు, మొసళ్లు, జిరాఫీ, ఏనుగులు.. ఇలా ఎన్నెన్నో చూడొచ్చు. మొత్తం 1,440 వన్య జీవులను ప్రత్యేకంగా పోషిస్తున్నారు. వీటి కోసం నెలకు రూ. 30 లక్షలు ఖర్చు చేయాలి. ఏడాదికి రూ. 3.60 కోట్లు ఖర్చు వస్తుందని.. టికెట్ కౌంటర్ల నుంచి రూ. 3 కోట్లు సమకూరుతోంది. నిధుల కొరత ఏర్పడకుండా దాతలు ముందుకొచ్చారు. ఎంఆర్‌పీఎల్, కుద్రేముఖ్ గనుల సంస్థ, రిలయన్స్ యాజమాన్యం నిధులు సమకూర్చడంతో నిర్వహణ సులువవుతోంది. పలువురు ప్రముఖులు వన్యజీవులను దత్తత తీసుకుని సాయం చేస్తున్నారు. తీర ప్రాంత పర్యాటకానికి వెళ్లేవారెవరైనా.. తప్పనిసరి మజిలీల జాబితాలో పిలికుళ ఉండాల్సిందే!

ప్రజల సొమ్ము దోపిడీ

నిఖిల్ కుమారస్వామి నిప్పులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్మును దోచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని యువ జనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి ఆరోపించారు. నగరంలో చెత్తను శుభ్రం చేసేందుకు 46 యంత్రాలను ఏడేళ్లకు బాడుగకు తీసుకునేందుకు రూ. 613 కోట్లను కేటాయించడాన్ని తప్పు పట్టారు. అవే యంత్రాలను కొనుగోలు చేయాలంటే ఒక్కోదానికి రూ. 1.3 కోట్ల నుంచి రూ. 3 కోట్ల ఖర్చు వస్తుందన్నారు. గ్రేటర్ బెంగళూరుకు 50 వాహనాలు కొన్నా రూ. 150 కోట్లు కావన్నారు. వాటిని కొనుగోలు చేయవద్దని నిపుణుల సమితి సూచించినా, ఉప ముఖ్యమంత్రి ఏకపక్ష నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారని ట్వీట్ చేసి గట్టిగా నిలదీశారు. తగిన సమాధానం ఇవ్వాలని డిమాండు చేశారు.

కోర్టుకు హాజరైన మహదేవ స్వామి

చామరాజనగర, న్యూస్‌టుడే : హనూరు తాలూకా సుళ్వాడి మారియమ్మ ఆలయంలో విషం కలిపిన ప్రసాదాన్ని వితరణ చేసి 17 మంది మరణానికి కారకుడైన ఇమ్మడి మహదేవ స్వామి మైసూరు కారాగారం నుంచి బెయిలుపై సోమవారం విడుదలయ్యాడు. హైకోర్టు సూచించడంతో స్థానిక న్యాయస్థానం ముందు మంగళవారం హాజరైనట్లు అధికారులు ధ్రువీకరించారు. కాషాయం ధరించకుండా, తెల్లని వస్త్రాలు ధరించి వచ్చిన ఆయనపై సుళ్వాడి ప్రజలు దాడికి దిగకుండా పోలీసులు భద్రత కల్పించారు. మూత్రపిండాల వైఫల్యంతో సమస్యలు ఎదుర్కొంటున్న మహదేవస్వామి చికిత్స చేయించుకునేందుకు హైకోర్టు ఏడాది పాటు బెయిలు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

తక్షణమే సాగు పట్టాలు ఇవ్వాలి

ప్రదర్శనగా వస్తున్న సంఘం అధ్యక్షుడు, సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: బగర్ హుకుం భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని కోరుతూ అఖిలభారత రైతు కృషి కార్మిక సంఘం (ఎ.ఐ.కె.కె.ఎం.ఎస్.) నేతృత్వంలో బుధవారం బళ్లారి నగరంలో ఆందోళన నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ నేతృత్వంలో సభ్యులు డా.రాజ్‌కుమార్ రహదారి నుంచి డీసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రం జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది చిన్నకారు రైతులు ఏళ్లుగా ప్రభుత్వ, అటవీశాఖ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాగు పట్టాలు ఇవ్వాలన్నారు. సభ్యులు హనుమంతప్ప, గురుళ్లి రాజ, రామదాసు, మల్లప్ప, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల తుంగభద్ర అభియాన్ ఉపయోగకరం

నిర్మల తుంగభద్ర అభియాన్ గోడపత్రాలు విడుదల చేస్తున్న మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రులు

గంగావతి, న్యూస్‌టుడే: నిర్మల తుంగభద్ర అభియాన్ ఎంతో ఉపయుక్తమైందని మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పేర్కొన్నారు. ఆయన బుధవారం ఆనెగుంది నవబృందావనంలో నిర్మల తుంగభద్ర అభియాన్ మూడోదశ పాదయాత్ర గోడపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ జలజాగృతి యాత్రకు తాము పూర్తిగా సహకరిస్తామన్నారు. అందరూ ఈ యాత్రలో పాల్గొని మలినమవుతున్న నదుల సంరక్షణకు చేయి కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య అక్షోభ్యతీర్థ బాళగారు మఠం స్వామీజీ రామప్రియతీర్థులు, శ్రీపాదరాజమఠం సేజయనిధి తీర్థులు, జాతీయ స్వాభిమాన్ ఆందోళన ప్రతినిధులు బసవరాజ్‌పాటిల్, మాధవన్, లలితారాణి శ్రీరంగదేవరాయలు, సంతోష్ కెలోజీ, శివకుమార్ మాలీపాటిల్, విష్ణుతీర్థ జోషి పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధిపై అవగాహన అవసరం

జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న అధికారులు గిరీష్ కులకర్ణి, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: వ్యాపారాభివృద్ధిపై అవగాహన అవసరమని, యువతీ, యువకులు ఇలాంటి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంకు జిల్లా వ్యవస్థాపకుడు గిరీశ్ కులకర్ణి సూచించారు. జిల్లా పరిశ్రమ, వాణిజ్య శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పరిశ్రమలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వ్యాపారాభివృద్ధిపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ప్రతి వృత్తి, వ్యాపారంలో పోటీతత్వం పెరిగిందని, ఆన్‌లైన్ వ్యాపారాలు పెరిగాయన్నారు. ఇలాంటి సందర్భంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాభివృద్ధి ఎలా చేసుకోవాలో నిపుణుల సలహాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కె.ఎస్.ఎఫ్.సి.యు. విభాగం అధికారి డా.చంద్రప్ప వ్యాపార వృద్ధి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్, సరఫరా వంటి విషయాలను వివరించారు. అధికారులు రంగనాథ్, రాజాసాబ్, ప్రసన్న, వినోద్‌కుమార్, జడెప్ప తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ కాల్ చేస్తారు.. మొత్తం దోచేస్తారు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు, సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న ఎనిమిది మంది అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి బ్యాంకు ఖాతాల నుంచి రూ.2.5 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో కేసు వివరాలకు ఆయన మీడియా వివరించారు. 'ఆగస్టు 26న మనీ లాండరింగ్ కేసు పేరుతో తిరుపతికి చెందిన విశ్రాంత ఉద్యోగి(65)కి వాట్సప్ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు బదిలీ చేయమని రెండు (దొంగ పేర్లతో) బ్యాంకు ఖాతాల్లో రూ.80 లక్షలు జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు 1930కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాతాల్లో ఉన్న రూ.2.5 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. మిగిలిన రూ.77.5 లక్షల నగదు బాధితుడి ఖాతా నుంచి ఆ రెండు బ్యాంకు ఖాతాల ద్వారా 14 రాష్ట్రాల్లోని ఇతరుల ఖాతాలకు.. చివరకు గేమింగ్ యాప్ వినియోగదారుల ఖాతాలకు చేరినట్లు గుర్తించారు.

కంబోడియా వెళ్లి.. నెట్‌వర్క్‌తో పనిచేసి..

మొదట అనంతపురం జిల్లాకు చెందిన క్రాంతికుమార్, పవన్‌కుమార్ మ్యూల్ ఖాతాలకు జమైనట్లు తెలుసుకుని దర్యాప్తు చేశారు. వీరి వెనుక హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు ఓ ముఠాను నడుపుతున్నట్లు గుర్తించారు. అతడు 2024 జనవరిలో కంబోడియాకు వెళ్లి 24 రోజుల పాటు సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌తో కలిసి పనిచేశాడు. ఆ సమయంలో అతడు విదేశీ నెట్‌వర్క్‌తో సంబంధాలు పెంచుకున్నాడు. తర్వాత ఇండియాకు వచ్చి క్రాంతికుమార్, పవన్‌కుమార్‌తోపాటు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాస్, కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గౌతమ్‌ల ద్వారా భారీ సంఖ్యలో మ్యూల్ ఖాతాలను సేకరించాడు. ఆ వివరాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సాక్ష్యాలు టెలిగ్రామ్ ద్వారా విదేశాలకు పంపుతూ.. ప్రతి లావాదేవీపై కమీషన్ పొందేవాడు. ఈ కేసుతో ఎనిమిది మందికి సంబంధం ఉండటంతో అరెస్టు చేశారు. మరో కీలక నిందితుడు హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన మహమ్మద్ కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

నేటి ధార్మిక కార్యక్రమాలు



- ఎర్రితాత మఠంలో ముత్తిన పల్లకీ ఉత్సవం, రథోత్సవం, నిర్వహిస్తున్నట్లు మఠం అధ్యక్షుడు తెలిపారు.
- కప్పగల్లు రోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కోటి దీపోత్సవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు చిదానందరెడ్డి తెలిపారు.
- అల్లీపురం మఠంలో మహదేవతాతకు అమావాస్య దీపోత్సవ పూజలు జరుపుతామని మఠం కమిటీ సభ్యులు తెలిపారు.

చెళ్లగుర్కిమఠంలో మహన్యాస కుంభాలకు విశేష అలంకరణ

భక్తిశ్రద్ధలతో కనక దాసు జయంతి

కనకదాసు జయంతిలో పాల్గొన్న స్వామీజీ, ఎమ్మెల్యే, సంఘం సభ్యులు

కుడతిని(బళ్లారి), న్యూస్‌టుడే: బళ్లారి తాలూకా కకనదాస యువక సంఘం ఆధ్వర్యంలో కనకదాసు జయంతిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగినెల కనక గురు పీఠం మహాసంస్థాన మఠం పీఠాధిపతి సిద్ధరామనంద మహాస్వామి, తదితరులు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఎమ్మెల్యే అన్నపూర్ణ, ప్రముఖులు కోరి బసప్ప, కె.ఎం.తాయప్ప, ఆనంద్, భీమప్ప, దాసర కుచ్చప్ప పాల్గొన్నారు.

ఘనంగా కార్తికోత్సవం

కార్తికోత్సవంలో మాట్లాడుతున్న స్వామీజీ

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా సిరిగేరి గ్రామంలోని కొట్టూరు స్వామి గురు పరంపర శాఖ విరక్త మఠంలో బుధవారం కార్తికోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మఠం బసవలింగ మహాస్వామి, బంద్రాళ్ మృత్యుంజయస్వామి, గంగాధరగయ్య స్వామి, సి.ఎం.నాగరాజ స్వామి, డా.మృత్యుంజయ స్వామి, ప్రకాశయ్య, వీరభద్రగౌడ, నాగరాజస్వామి, మల్లనగౌడ, అడివయ్య స్వామి పాల్గొన్నారు. స్వామీజీ కార్తికోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

గనినాడులో ఐక్యతా పాదయాత్ర

తరలివచ్చిన భాజపా నేతలు, విద్యార్థులు

ఐక్యతా పాదయాత్రలో విద్యార్థులు

పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం నగరంలో ఐక్యతా పాదయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం యువ కార్య, క్రీడా సచివాలయం, మేరా యువ భారత్ కేంద్రం సంయుక్తంగా స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని ప్రభుత్వ మున్సిపల్ క్రీడామైదానం వద్ద ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్, మేయర్ పూజారి గాదెప్ప ఐక్యతా పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి డా.రాజ్‌కుమార్ రహదారి, గడిగి చెన్నప్ప కూడలి, బెంగళూరు రహదారి, తేరు వీధి, జైన్ మార్కెట్, హెచ్.ఆర్.గవియప్ప కూడలి నుంచి డా.జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం వరకు యాత్ర కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తదితరులు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జీవిత చరిత్ర, తీసుకున్న నిర్ణయాలను వివరించారు. యాత్రలో నగరంలోని 15 పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేయిమందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రితాతకు..అష్టోత్తర కుంభాభిషేక పూజలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: చెళ్లగుర్కిలో వెలసిన ఎర్రితాత మఠంలో బుధవారం తాతకు మహన్యాసపూర్వక అష్టోత్తర కుంభాభిషేక పూజలు వైభవంగా జరిపారు. ఏకాదశ రుద్రాభిషేక కలశ పూజలు చేపట్టారు. తాత విగ్రహానికి పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలను తిలకించారు. భక్తులందరికీ మఠం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మఠం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాలనగౌడ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రితాతకు పుష్పాలంకరణ

EENADU eClassifieds
PROFESSIONAL SERVICES
VAASTU
ఇల్లు, ఆఫీస్, స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా॥ కుంచాల హనుమంతరావు గారు బెంగుళూరులో 4 రోజులు మాత్రమే ఉంటారు. సెం॥ 9246624248

కన్నడ భాషాభివృద్ధికి ప్రతిన

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిద్ధలింగప్ప కొట్నేకల్

మాన్వి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని భాష, సంస్కృతి రక్షణకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సిద్ధలింగప్ప కొట్నేకల్ పేర్కొన్నారు. స్థానిక సర్వోదయ పీయూ కళాశాలలో కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా, తాలూకా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దత్తి ఉపన్యాసం, సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నివసించే అందరూ కన్నడిగులేనన్నారు. పురపాలక సంఘం ప్రతిపక్ష నాయకుడు రాజా మహేంద్రనాయక్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సంగమేశ్ ముదోళ్ ఉపన్యసించారు. పాత్రికేయ సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన వారిని, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను వేదికపై ఘనంగా సత్కరించారు. కసాప అధ్యక్షుడు శరణబసవ నీరమాన్వి, సర్వోదయ శిక్షణ సంస్థ అధ్యక్షుడు మనోజ్‌మిశ్రా, కరవే అధ్యక్షుడు డి.బసనగౌడ, ప్రిన్సిపల్ రేణుక, ఉపన్యాసకురాలు శ్రావణి, మూకప్ప కట్టిమని, లక్ష్మణజానేకల్, రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

టైర్ల గోదాములో అగ్నిప్రమాదం

గోదాము వద్ద మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హొసపేటె, న్యూస్‌టుడే: టైర్లను నిల్వచేసిన గోదాములో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పట్టణ శివారు జంబునాథమార్గంలో చోటు చేసుకుంది. నిప్పంటుకుని పొగలు కమ్ముకోవడంతో పొరుగున ఉన్న తినుబండారాల చిన్న పరిశ్రమ సిబ్బంది, కొన్ని ఇళ్లవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. విషయం తెలియగానే డ్యాం సీఐ మహ్మద్ గౌస్, ఎస్సై విరూపాక్షి నేతృత్వంలో పోలీసు, అగ్నిమాపక సిబ్బంది రెండు ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని సుమారు గంటసేపు కష్టపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ తీవ్రనష్టం వాటిల్లినట్లు గోదాము యజమాని వాపోయారు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

భక్తిశ్రద్ధలతో ఇరుముళ్ల కార్యక్రమం

సిరివార,(మాన్వి): తాలూకాలోని చాగభావి క్యాంపులోని కోదండ రామాలయంలో అయ్యప్పస్వామి మాలధారులు బుధవారం ఇరుముళ్లు కట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు క్యాంపునకు వచ్చారు. వీరిలో 21మంది మాలధారులు ఇరుముళ్లు కట్టుకున్నారు. ఆలయ సేవా సమితి వారు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో క్యాంపు వాసులు అయ్యప్ప స్వాములు, వారి బంధుమిత్రులు, హాజరైన భక్తులు, ప్రజలకు ప్రత్యేక అన్నసంతర్పణ చేశారు.

రామాలయంలో ఇరుముళ్లు కట్టుకుంటున్న అయ్యప్ప మాలధారులు

పోలీసులూ ఆరోగ్యం జాగ్రత్త

ప్రారంభమైన వార్షిక క్రీడాపోటీలు

గాలిబుడగలను ఎగురవేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో డాక్టర్ బసవరాజ్, ఎస్పీ శోభారాణి, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో తలమునకలై ఉండే పోలీసులు తరచూ క్రీడల్లో పాల్గొంటే మానసిక ఒత్తిడి తగ్గి దైహికంగా ఆరోగ్యంగా ఉంటారు. నిత్యం వ్యాయామం, నడక, యోగా వంటివి దినచర్యగా చేసుకోవాలని జిల్లా అటవీశాఖ ఉప సంరక్షణ అధికారి డాక్టర్ బసవరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ క్రీడామైదానంలో పోలీస్ వార్షిక క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటముల కంటే పాల్గొనడం ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. సమాజంలో పోలీసుల పాత్ర ప్రముఖమైందని, సమాజానికి సైబర్ నేరాలు సవాల్‌గా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, ఇతర కొత్త నేరాల కార్యకలాపాల సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా పోలీస్ అధికారి డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు పోలీస్ శాఖ అవసరమన్నారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఉత్తమ సేవలు అందించాలన్నారు. పని ఒత్తిడి మధ్య ఏడాది పొడవునా పనిచేసే పోలీసులు, అధికారులు, సిబ్బంది మూడు రోజులపాటు జరిగే క్రీడల్లో పాల్గొనాలన్నారు. గతేడాది పోలీస్ వార్షిక క్రీడాపోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన కృష్ణనాయక్ అతిథులకు క్రీడా జ్యోతిని అందించి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవికుమార్, నవీన్ కుమార్, డీఎస్పీలు తిప్పేస్వామి, చంద్రశేఖర్ నందారెడ్డి, తిప్పేస్వామి, ప్రసాద్ గోఖులే, సీఐలు ఎస్ఐలు, బళ్లారి సబ్ డివిజన్, బళ్లారి గ్రామీణ (సిరుగుప్ప), తోరణగల్లు, డీఆర్‌పి విభాగం, మహిళ పోలీస్ విభాగం జట్లు పాల్గొన్నాయి.

పరుగులు తీస్తున్న పోలీసులు



400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచిన పోలీస్

కవాతులో మహిళా పోలీసులు

(c) eenadu

ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించిన మహిళలు

సామూహిక వన భోజనాలు

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శ్రీరామనగర్‌లో మహిళలు బుధవారం సామూహిక వన భోజనాలు నిర్వహించారు. ఇళ్ల వద్ద వంటలు చేసుకుని గుండూరు క్యాంపు మార్గంలోని పొలాల పక్కన ఉన్న ఉసిరి చెట్టుకు పూజలు జరిపి భోజనాలు ఏర్పాటు చేశారు. హరే శ్రీనివాస భజన మండలి సభ్యులతో భజన, ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళలు, అయ్యప్ప మాలధారులు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

బళ్ళారి

• బళ్లారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

మస్కి నగర ప్రాధికార అధ్యక్షుడిగా సిద్ధనగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: మస్కి నగర యోజనా ప్రాధికార అధ్యక్ష పదవి ఎమ్మెల్యే ఇంటివారికే దక్కింది. మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ తమ్ముడు సిద్ధనగౌడను మస్కి నగర యోజనా ప్రాధికార అధ్యక్ష పదవి వరించింది. బెంగళూరులో బుధవారం ఆయన మంత్రి భైరతి సురేశ్ చేతుల మీదుగా ఆదేశ పత్రం అందుకున్నారు. కేపీసీసీ సభ్యుడు నల్ల వెంకటేశ్వరరావు కూడా ఆయన వెంట ఉన్నారు. ఆర్.బసనగౌడ అనుయాయులు ఆనందంతో మంత్రికి మిఠాయిలు అందించగా వాటిని మంత్రి సిద్ధనగౌడకు తినిపించి ఆనందం పంచుకున్నారు. రెండు రోజుల్లో సిద్ధనగౌడ ప్రాధికార పదవిని చేపట్టనున్నారు.

బెంగళూరులో సిద్ధనగౌడకు ఆదేశ పత్రం ఇచ్చి మిఠాయి తినిపిస్తున్న పట్టణాభివృద్ధి మంత్రి భైరతి సురేశ్

హక్కు పత్రాల కోసం 26న బెంగళూరు చలో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు దేవరమనె సురేశ్

హొసపేటె, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయం చేస్తున్న భూములకు, నిరుపేదలు నివసించే స్థలానికి సంబంధించి వెంటనే వారికి హక్కుపత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఇళ్లస్థలాల వంచితుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న బెంగళూరు చలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని సమితి ప్రముఖుడు కరియప్ప గుడిమని తెలిపారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయం చేస్తున్న భూముల హక్కుపత్రాలు మంజూరు చేస్తామని 2013లో ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించగా, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42 లక్షల మంది రైతులు దరఖాస్తులను సమర్పించారన్నారు. ఇప్పటివరకూ కేవలం 25 లక్షలమందికి మాత్రమే హక్కుపత్రాలు మంజూరు చేశారని విచారం వ్యక్తంచేశారు. మిగిలిన 17 లక్షల మంది రైతులు పత్రాల కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారని వివరించారు. వారికి న్యాయం చేకూర్చేవరకూ తమ ఉద్యమం ఆగదన్నారు. ప్రముఖులు దేవరమనె సురేశ్, సణ్ణమారెప్ప, న్యాయవాది తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఉపన్యాసకుడిపై అపరిచితుడి దాడి

హొసపేటె, న్యూస్‌టుడే: వీధుల్లో చెత్త ఏరుతున్న ఓ అపరిచితుడు ఇంట్లో చొరబడి ఉపన్యాసకుడిపై దాడికి పాల్పడిన ఘటన పట్టణ పరిధి రాజీవ్‌నగర్‌లో జరిగింది. అపరిచితుడి దాడిలో ఉపన్యాసకుడు లేపాక్ష జవళి మోకాలు, చేయి, పెదవులపై గాయాలయ్యాయి. ఇంట్లో ఆయన ఒక్కరే ఉన్న సమయంలో అపరిచిత వ్యక్తి చెత్త ఏరుతూ ఇంట్లోకి చొరబడ్డాడు. అతన్ని బయటకు గెంటే సమయంలో దాడికి పాల్పడ్డాడు. ఆ ఇంటి పొరుగున ఉన్న కిరాణాకొట్టు యజమాని వచ్చి అపరిచితుడిని బయటకు గెంటేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కొద్ది దూరంలో చెత్త ఏరుతున్న అపరిచితుడిని పట్టుకుని విచారించగా, అతను మానసిక అస్వస్థత, మద్యం తాగిన మత్తులో అలా ప్రవర్తించాడని పోలీసులు తెలిపారు. ఇలాంటి వ్యక్తులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

ఉపన్యాసకుడిపై దాడికి పాల్పడిన చెత్త ఏరే వ్యక్తి

జాతీయ ఐక్యతా ప్రమాణ స్వీకారం

కొప్పళలో జాతీయ ఐక్యతా ప్రమాణం చేస్తున్న అధికారులు

గంగావతి, న్యూస్‌టుడే: జాతీయ ఐక్యతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కొప్పళ జిల్లా పరిపాలనా భవనంలో ప్రమాణం స్వీకరించారు. జిల్లాపాలనాధికారి సురేశ్ ఇట్నాళ మాట్లాడుతూ ఏటా నవంబరు 19 నుంచి 25వరకు ఈ వారోత్సవాలను ఆచరిస్తున్నారు. దేశ స్వాతంత్ర్యం, ఐక్యతను బలోపేతం చేయడం, హింస, మత సంఘర్షణలను నివారించడం దీని ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లాధికారి సిద్ధరామేశ్వర, తహసీల్దార్ విశ్వల చౌగలా పాల్గొన్నారు.

23న ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

హొసపేటె, న్యూస్‌టుడే: జిల్లా యంత్రాంగం, ఆయుష్ వైద్యశాఖ, రోటరీక్లబ్‌లు సంయుక్తంగా 23న రోటరీ హాల్లో ఉచిత ఆయుర్వేద చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేశామని వైద్యాధికారి డాక్టర్ మునివాసుదేవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులకు కూడా శిబిరంలో ఉచితంగా చికిత్స చేసి, అవసరమైతే మందులు వితరణ చేస్తామన్నారు. పేర్ల నమోదు, అదనపు వివరాలకోసం వైద్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

వాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

కంప్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన కంప్లి ఎస్‌బీఐ బ్యాంకు వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానిక 12వ వార్డు రవి (20) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళ్లడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

మంటల్లో పూరిల్లు దగ్ధం

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి మారుతీనగర్‌లోని ఎడమ వైపు మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. వడ్డెర హనుమంతమ్మ అనే మహిళ ఇల్లు దగ్ధమై ఇంట్లోని వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలు వ్యాపించకుండా నియంత్రించారు. గంగావతి నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

పట్టణ స్వచ్ఛతకు సహకరించండి

ప్రజల్లో జాగృతి కలిగిస్తున్న పురసభ అధికారులు, సిబ్బంది

కంప్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను సద్వినియోగం చేసుకొని పట్టణ స్వచ్ఛతకు సహకరించాలని కంప్లి పురసభ ముఖ్యాధికారి మల్లికార్జున కోరారు. విశ్వ శౌచాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని తొమ్మిదో వార్డు, జెస్కాం కార్యాలయ ప్రాంతాల్లో బుధవారం ప్రజల్లో జాగృతి కలిగించారు. సముదాయ మరుగుదొడ్లను వ్యక్తిగత మరుగుదొడ్ల మాదిరిగా వినియోగించాలన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

19-11-2025 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1,624.21	1630.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,654	4,076
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,205	6,929
నీటి నిల్వ (టి.ఎం.సి)	73.939	97.181

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

వేరుసెనగ..అధరగొట్టిందిగా!

- దిగుబడి తగ్గినా.. గట్టెక్కిన రైతన్న
- బళ్లారి ఏపీఎంసీకి తరలివస్తున్న ఉత్పత్తి

ఏపీఎంసీ మార్కెట్‌కు రైతులు తీసుకుని వచ్చిన వేరుసెనగ

బళ్లారి, న్యూస్‌టుడే: ఉత్తర కర్ణాటకలో వర్షం ముఖం చాటేయడంతో వేరుసెనగ దిగుబడి తగ్గుముఖం పట్టినా..ధర కలసి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌కు వారానికి కళ్యాణదుర్గం, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, చిత్రదుర్గం జిల్లా మొలకాల్మూరు, విజయనగర జిల్లాలోని కూడ్లిగి, హగరిబొమ్మనహళ్లి, బళ్లారి సమీప సండూరు తాలూకా నుంచి 10వేల బస్తాలకుపైగా కాయలు వస్తున్నాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.

ఏపీఎంసీ ఖజానా గలగల

ఏపీఎంసీకి సెస్ 0.6 శాతం చెల్లిస్తున్నారు. అక్టోబరులో రూ.61.10 లక్షలు లక్ష్యం ఉండగా రూ.1.46 కోట్ల ఆదాయం వచ్చింది. ఏడాది లక్ష్యం రూ.8.60 కోట్లు కాగా, అక్టోబరు నెలకే రూ.7.78 కోట్ల రాబడి పన్నులు రూపంలో వచ్చింది. మరో ఐదు నెలలు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కలిసొచ్చిన కొరత

బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో గతేడాది నవంబరులో 17వ తేదీ వరకు 10,488 బస్తాలు రాగా, ధర క్వింటాల్ రూ.1,569 నుంచి రూ.7,077 ఉండగా, ఈ ఏడాది కొద్దిగా దిగుబడి తగ్గడంతో 9,402 బస్తాలు వచ్చాయి. ధర రూ.2వేల నుంచి రూ.7,669 పలికింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేరుసెనగ నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఊరట కలిగించింది

- పంపనగౌడ, బసాపుర గ్రామం

ఉత్తర కర్ణాటకలో వరుణుడు ముఖం చాటేయడంతో వేరుసెనగ దిగుబడి తగ్గింది. నేను మూడు ఎకరాల్లో 150 కిలోల విత్తనాలు వేశాను. 25 బస్తాల దిగుబడి వచ్చింది. ధర బాగుండటంతో రైతులకు కలిసి వచ్చింది. పెట్టుబడి వస్తోంది.

నాణ్యత ప్రకారమే ధర

- జయకుమార్, ఏపీఎంసీ కార్యదర్శి

ప్రస్తుతం సీజన్ కావడంతో వేరుసెనగ ఉత్పత్తి వస్తోంది. రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా టెండర్ ద్వారా వేరుసెనగ కాయల నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తున్నాం. ఈ ఏడాది రూ.2వేల నుంచి రూ.7,669 ధర పలుకుతోంది. నిబంధనల ప్రకారం బిల్లు కావాల్సి ఉంది. గతంతో పోలిస్తే 50 శాతం మార్కెట్ ఆదాయం పెరిగింది. ఏడాదికి ఇచ్చిన లక్ష్యం ఏడు నెలల్లోనే సాధించాం. మరో ఐదు నెలల్లో అదనంగా రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నాం.

ప్రతి ఒక్కరూ సమాజ హితం కోరాలి

ఉమ్లుట్టి మొరార్జీ స్కూలు ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: మనిషి జన్మ మహత్తరమైంది.. దాన్ని సార్థకం చేసుకునే ప్రయత్నం చేయాలి, మన యోగక్షేమాలు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ సమాజ హితమూ కోరుతూ జీవించాలని మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ పిలుపునిచ్చారు. రాజ్యోత్సవ పురస్కారం అందుకున్న సింధనూరు వనసిరి ఫౌండేషన్ సంస్థ సింధనూరు తాలూకా సివారు గ్రామం ఉమ్లుట్టిలోని మొరార్జీ వసతి పాఠశాల ప్రాంగణంలో బుధవారం పద్మశ్రీ సాలుమరద తిమ్మక్క జ్ఞాపకార్థం పెద్దఎత్తున వనమహోత్సవం ఆచరించింది. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పలు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం అటవీశాఖ అధికారులు, వనసిరి సంస్థ ప్రతినిధులు వరుసగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పద్మశ్రీ వంటి ఉన్నతమైన పురస్కారాన్ని అందుకోవడం సామాన్య విషయం కాదు. సాలుమరద తిమ్మక్క తన జీవితాన్ని ధారపోసి ప్రజాక్షేమం కోసం పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమానికి వనసిరి ఫౌండేషన్ అధ్యక్షుడు అమరేగౌడ మల్లాపూరు అధ్యక్షత వహించారు.

సమాజాభివృద్ధికి సంఘటిత కృషి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సమష్టిగా నేకార సముదాయ అభివృద్ధికి పాటుపడుదామని నేకార సముదాయ ఒక్కూట రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం నేకార ఒక్కూట ఆధ్వర్యంలో మార్కాండేయ స్వామి కల్యాణమంటపంలో ఏర్పాటు చేసిన ఒక్కూట మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ శాసనమండలి సభ్యుడు లక్ష్మీనారాయణ, నగర మేయర్ గాదెప్ప, వాణిజ్య పారిశ్రామిక మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, వివిధ రంగాల్లో సాధన చేసిన ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో ఒక్కూట జిల్లా అధ్యక్షుడు దేవానంద, తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ సుధాకర్ దేశాయ్, ఆలయ ధర్మకర్త తిరువీధుల వెంకటేశులు, నేకార సమాజ బాంధవులు, తదితరులు పాల్గొన్నారు.

మేయర్ గాదెప్ప, మాజీ శాసనమండలి సభ్యుడు లక్ష్మీనారాయణ, సోమశేఖర్‌లను సత్కరిస్తున్న నేకార ఒక్కూట ప్రముఖులు

ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఒకరి మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: చెళ్లకెర- పావగడ రహదారిలో తాలూకాలోని గౌరీపుర గ్రామం వద్ద రోడ్డు మలుపులో చోదకుని అదుపుతప్పి ద్విచక్ర వాహనం పల్లపు ప్రాంతంలో బోల్తా పడిన ఘటనలో అనంతపురం జిల్లా శెట్టూరు మండలం ములకలేడు గ్రామానికి చెందిన ముద్దయ్యగారి తిప్పేస్వామి(58) మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం జరిగిందని పోలీసులు తెలిపారు. బుధవారం వారు తెలిపిన వివరాల మేరకు.. తిప్పేస్వామి తన ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం అమరాపురానికి వెళ్లి సొంతూరుకు బయలుదేరినప్పుడు ఈ ఘటన చోటుచేసుకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. పరశురాంపురం పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

విద్యార్థుల్లో వైజ్ఞానిక మనోభావాన్ని పెంపొందిద్దాం

సత్కారం పొందిన విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: విద్యార్థుల్లో వైజ్ఞానిక మనోభావాన్ని పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర వైజ్ఞానిక పరిశోధనా పరిషత్ అధ్యక్షుడు డా.హులికల్ నటరాజ్ పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ జాతీయ స్థాయిలో ఇస్రో నిర్వహించిన బాల విజ్ఞానుల పోటీ పరీక్షల ద్వారా ఎంపికై శిక్షణ పొందిన 13 మంది విద్యార్థులను సత్కరించి మాట్లాడారు. దేశాభివృద్ధికి శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. ఈ విభాగాల్లో పనిచేయడానికి విజ్ఞానుల ఆవశ్యకత ఉందన్నారు. చిన్నప్పటి నుంచి విజ్ఞానంపై ఆసక్తిని రేకెత్తించడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమన్నారు. పరిషత్ జిల్లా అధ్యక్షురాలు లోలాక్షమ్మ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలతేశ్ ముద్దజ్జి, విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి రేవణసిద్ధప్ప, జగదీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థుల వీధి నాటకాలు

సింధనూరు: సింధనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ బృందం, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం పలు రద్దీ ప్రదేశాల్లో వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. స్థానిక ప్రయాణ ప్రాంగణం, ఏపీఎంసీ, మార్కెట్, మినీ విధానసౌధ ప్రాంతాల్లో ఈ నాటకాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తొలుత డిగ్రీ కళాశాల ప్రాచార్యుడు పాండు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరోగ్యబృందం ఫ్లకార్డులతో నినాదాలు చేసుకుంటూ ప్రయాణ ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మల్లప్ప బంగారుశెట్టి, హనుమంతప్ప, అమరేశ్, ఓంప్రసాద్, అధ్యాపకులు వైద్యనాథ్, సిద్ధరామరెడ్డి, డా.అనిల్‌కుమార్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీ సభ్యురాలి నియామకం

రాయచూరు, న్యూస్‌టుడే: కర్ణాటక సాహిత్య అకాడమీ (బెంగళూరు) కార్యనిర్వాహక సమితి సభ్యురాలిగా డాక్టర్ పద్మజా దేశాయి నియమితులయ్యారు. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఆమె మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఆదికవి మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం (రాయచూరు) ఇతిహాస విభాగం అతిథి అధ్యాపకురాలు పద్మజా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 18 ఏళ్లుగా కల్యాణ కర్ణాటక ప్రాంతానికి సంబంధించిన చరిత్ర, పురాతత్వ, నాణేలు, శాసనాలపై అనేక పరిశోధనలు చేశారు. ఆ అంశాలను జాతీయ, రాష్ట్ర సదస్సులు, సమ్మేళనాల్లో ప్రవేశపెట్టారు. చారిత్రక కోటలు, స్మారకాల సంరక్షణపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సమగ్ర వ్యవసాయ పద్ధతుల్లో పత్తిసాగు

పత్తి చేలో క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

మాన్వి, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయాన్ని మూసపద్ధతిలో కాకుండా సమగ్ర పద్ధతులను పాటించటం ద్వారా లాభపడొచ్చని రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం సంచాలకుడు డాక్టర్ తిమ్మణ్ణ పేర్కొన్నారు. కురిడి గ్రామంలో రైతు వెంకటరెడ్డి పత్తి చేలో క్షేత్రోత్సవాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తిమ్మణ్ణ మాట్లాడుతూ తక్కువ సాంద్రతతో, 120 రోజుల్లో రెండు సార్లు పత్తిని తీసే నూతన వంగడాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతు వెంకటరెడ్డి తక్కువ పెట్టుబడులతో ఎకరాకు 18 క్వింటాళ్ల పత్తి దిగుబడిని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఉమేశ్, డాక్టర్ అస్సన్, కురిడి రైతు సంపర్క కేంద్రం అధికారి ఫయాజ్ జలాల్ రైతు ప్రముఖులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం తొలగించొద్దని ధర్నా

హైవే అధికారులతో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్

మాన్వి,న్యూస్‌టుటే: సాథ్ మైల్ నుంచి సింధనూరు వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలో కూడా పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో వాల్మీకి కూడలి వద్ద విగ్రహం తొలగించాల్సి ఉంటుందని హైవే అధికారులు చెప్పడంతో ప్రజలు ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. కూడలి చుట్టుకొలతలు తీసుకుని మధ్యలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కన ఎవరైనా రహదారి స్థలంలో నిర్మాణాలు చేసి ఉంటే వాటిని తొలగించాలని ఆయన పురపాలక సంఘ అధికారులకు సూచించారు. అదే విధంగా బసవ కూడలి, అంబేద్కర్ కూడలి వద్ద కూడా స్థల లభ్యత ఆధారంగా విగ్రహాలను నెలకొల్పాలన్నారు.

ఈత పోటీల్లో 'బళ్లారి' సత్తా

ఈతలో రాణించిన ప్యారా విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఈత కొలనులో 15 నుంచి 18 వరకు జరిగిన జాతీయ ప్యారా ఈత పోటీల్లో నలుగురు బళ్లారి విద్యార్థులు సత్తాచాటారు. వారిలో గోపిచంద్, సాయి నిఖిల్, బేబి సాయి, యోజిత్ రాణించారు. గోపినాథ మూడు బంగారు, ఒక వెండి పతకం సాధించాడు. సాయి నిఖిల్ రెండు వెండి పతకాలు, బేబీ సాయి స్వర్ణ పతకం, యోజిత్ వెండి పతకం సాధించారు. ఈతలో రాణించిన విద్యార్థులను ఎమ్మెల్యేలు బి.నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి, డీసీ నాగేంద్రప్రసాద్ ఎస్పీ డా.శోభారాణి తదితరులు అభినందించారు.

రాణించిన గోపినాథ్, సాయి నిఖిల్ తదితరులు

రాష్ట్ర స్థాయి యువ సంసత్ పోటీలకు ఎంపిక

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యువ సంసత్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు నితిన్, లక్ష్మీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మంజునాథ్ తెలిపారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన విద్యార్థుల క్విజ్ పోటీల్లో హిరియూరు తాలూకా హరియబ్బే కేపీఎస్ పాఠశాల విద్యార్థి నితిన్, హొసదుర్గం తాలూకా కేపీఎస్ పాఠశాల విద్యార్థిని లక్ష్మీలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరు బెంగళూరులో జరిగే అంతర జిల్లా పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. యువ సంసత్ పోటీల్లో 6 తాలూకాల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నోడల్ అధికారి ప్రశాంత్, సబ్జెక్టు ఇన్‌స్పెక్టర్లు రంగనాయక, నిత్యానంద, బసవరాజ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువ సంసత్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పేదల జీవితంలో వెలుగులు నింపిన ఇందిరాగాంధీ

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పార్చన చేసిన కార్యకర్తలు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: గరీబీ హఠావో నినాదం ద్వారా దేశంలో కోట్ల మంది పేదల జీవితంలో వెలుగులు నింపిన ఘనత మాజీ ప్రధానమంత్రి, దివంగత ఇందిరాగాంధీకి దక్కిందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు మునీరా ఖలందర్ పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళి అర్పించారు. నాయకులు నజ్మాతాజ్, ఆశారాణి, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, మైలారప్ప, ఎన్.డి. కుమార్ పాల్గొన్నారు.

గంగావతిలో జయంతి ఆచరణ

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని ఆచరించారు. శాసనసభ్యుడు రాఘవేంద్ర హిట్నాళ మాట్లాడుతూ ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి అమూల్యమైన సేవలు అందించారన్నారు. పలు సంస్కరణలు అమలు చేసి అణగారిన వర్గాలను ఆదుకున్నారన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి గొండబాళ, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ జిల్లా సంయోజకుడు సురేశ్ దాసరెడ్డి, గ్యారంటీ పథకాల జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ గొండబాళ, కృష్ణా ఇట్టంగి, అక్బర్ పాషా పాల్గొన్నారు.

కొప్పళలో ఇందిరాగాంధీకి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఈడిగల సమస్యలపై రాజధానికి పాదయాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే: 'ఈడిగ సామాజిక వర్గాన్ని ఎస్టీ (దళిత గిరిజన)లో చేర్చేలా కేంద్రానికి సిఫార్సు చేయాలి. నారాయణగురు అభివృద్ధి నిగమకు రూ.500 కోట్లు కేటాయించాలి. కాంగ్రెస్‌లోని ఈడిగ నాయకులకు రాజకీయ పదవులు ఇవ్వాలని' నారాయణ గురు శక్తి పీఠం పీఠాధిపతి ప్రణవానంద స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్.శ్రీనాథ్‌తో కలిసి పత్రికా భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన వర్గాల్లో అన్ని కులాలకు న్యాయం చేసినప్పుడే సామాజిక న్యాయం నినాదానికి సార్థకత చేకూరగలదన్నారు. గత భాజపా ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ హయాంలో ఈడిగలకు అన్ని విధాల అన్యాయం జరిగిందని ఆరోపించారు.

(c) eenadu

అర్థవంతంగా సభాపర్వం: హొరట్టి

హావేరి, న్యూస్‌టుడే : దక్షిణ కర్ణాటక ప్రాంతంలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు- ఉత్తర కర్ణాటక ప్రాంతంలోని సమస్యలను చర్చించినా, ఇక్కడి వారు మాత్రం అక్కడి సమస్యలపై నోరు మెదపరని విధానపరిషత్తు అధ్యక్షుడు బసవరాజ హొరట్టి వ్యాఖ్యానించారు. డిసెంబరు 8 నుంచి బెళగావి సువర్ణసౌధలో చలికాల సమావేశాలు నిర్వహించనుండటంతో అన్ని ఏర్పాట్లను చురుకుగా చేపట్టామని చెప్పారు. ఆయన బుధవారం హావేరిలో విలేకరులతో మాట్లాడుతూ, బెళగావి సమావేశాలంటే కేవలం ఆందోళనలు, నిరసనలకు పరిమితమన్న అభిప్రాయాన్ని తొలగించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. నిరుద్యోగం, ఉద్యోగం, ఉపాధి, వెరసి సమస్యలు, వరదతో పంటనష్టపోయిన వారికి పరిహారం తదితర అంశాలపై సహేతుకంగా చర్చించాలని ఎమ్మెల్సీలకు సూచిస్తానన్నారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చకు అవకాశం ఇస్తానని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరికీ ఫోన్ చేసి, చర్చల్లో పెద్ద పీట వేయాలని కోరతానన్నారు. ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎమ్మెల్యే రాజు కాగే చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనడం అర్థరహితమన్నారు. రాష్ట్ర విభజన ఆలోచనను నేను వ్యతిరేకిస్తున్నా. తనపై సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి, పదవి నుంచి తప్పిస్తే మాజీని అవుతానన్నారు. ఏదో ఒక రోజు మాజీగా మారే నేను.. కాస్త ముందుగా పదవి వీడితే వచ్చిన నష్టం ఏముందన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యేలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.

పిలికుళ.. చెరగని ప్రకృతి కళ!

పిలికుళ మృగాలయంలో ఆకట్టుకునే తటాకం

ఆ నగరం.. నయన మనోహరం. సముద్ర తీరంలో విరాజిల్లే మంగళూరుకు తూరు వైపున మహా పడమటి కనుమలు విస్తరించి చక్కని అందాలను తెచ్చిపెట్టాయి. ఆ అందాల కోసం దిగువన విస్తరించి.. పర్యాటకులను మరో లోకంలోకి తీసుకువెళ్లే కేంద్రమే.. పిలికుళ!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దేశంలో పర్యావరణ వైభవానికి నిలువెత్తు దర్పణంగా మంగళూరు పిలికుళ జీవ ఉద్యానవనం- మృగాలయం విరాజిల్లుతోంది. దీని నిర్వహణ బాధ్యతలను అటవీ శాఖ చేపట్టడంతో పచ్చందాలకు పెట్టని కోటగానూ మారిపోయింది. నిజానికి దీని ఆలనా, పాలన పిలికుళ జైవిక ఉద్యానవన ప్రాధికార చూస్తున్నా.. అభివృద్ధి వ్యవహారాలకు అటవీ శాఖ అండగా నిలిచిందని ప్రాధికార సంచాలకుడు జయప్రకాశ్ భండారి తెలిపారు. దేశంలోని అతి పెద్ద మృగాలయాల్లో ఇదీ ఒకటిగా పేరొందింది. మొత్తం 500 ఎకరాల్లో విస్తరించి, పర్యాటకులు ఎంత తిరిగినా తరగనంతగా రూపుదిద్దింది. పడమటి కనుమల దిగువన- మంగళూరు శివారు ఈ వన సీమ పాదుకుంది. ఎన్నో రకాల వృక్షరాజాలు, ఆయుర్వేద వనమూలికల మొక్కలు, విశాలమైన చెరువులో జలచరాలు, అందులో పడవ విహారం, వివిధ విభాగాల్లో సింహాలు, సింగాలు, పులులు, తెల్ల పులి, జింకలు, అనేకరకాల పాములు, మొసళ్లు, జిరాఫీ, ఏనుగులు.. ఇలా ఎన్నెన్నో చూడొచ్చు. మొత్తం 1,440 వన్య జీవులను ప్రత్యేకంగా పోషిస్తున్నారు. వీటి కోసం నెలకు రూ.30 లక్షలు ఖర్చు చేయాలి. ఏడాదికి రూ.3.60 కోట్లు ఖర్చు వస్తుందని.. టికెట్ కౌంటర్ నుంచి రూ.3 కోట్లు సమకూరుతోంది. నిధుల కొరత ఏర్పడకుండా దాతలు ముందుకొచ్చారు. ఎంఆర్‌పీఎల్, కుద్రేముఖ్ గనుల సంస్థ, రిలయన్స్ యాజమాన్యం నిధులు సమకూర్చడంతో నిర్వహణ సులువవుతోంది. పలువురు ప్రముఖులు వన్యజీవులను దత్తత తీసుకుని సాయం చేస్తున్నారు. తీర ప్రాంత పర్యాటకానికి వెళ్లేవారెవరైనా.. తప్పనిసరి మజిలీల జాబితాలో పిలికుళ ఉండాల్సిందే.

అరుదైన ఆకుపచ్చ పక్షి

మంగళూరు వాసులను మురిపించే తెల్ల పులి

ప్రజల సొమ్ము దోపిడీ

నిఖిల్ కుమారస్వామి నిప్పులు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్మును దోచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని యువ జనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి ఆరోపించారు. నగరంలో చెత్తను శుభ్రం చేసేందుకు 46 యంత్రాలను ఏడేళ్లకు బాడుగకు తీసుకునేందుకు రూ.613 కోట్లను కేటాయించడాన్ని తప్పు పట్టారు. అవే యంత్రాలను కొనుగోలు చేయాలంటే ఒక్కొదానికి రూ.1.3 కోట్ల నుంచి రూ.3 కోట్లు ఖర్చు వస్తుందన్నారు. గ్రేటర్ బెంగళూరుకు 50 వాహనాలు కొన్నా రూ.150 కోట్లు కావచ్చన్నారు. వాటిని కొనుగోలు చేయవచ్చని నిపుణుల సమితి సూచించినా, ఉప ముఖ్యమంత్రి ఏకపక్ష నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారని ట్వీట్ చేసి గట్టిగా నిలదీశారు. తగిన సమాధానం ఇవ్వాలని డిమాండు చేశారు.

బిళిమలె వ్యాఖ్యలతో దుమారం

నిప్పులు చెరిగిన విజయేంద్ర

మంగళూరు, న్యూస్‌టుడే : 'యక్షగాన కళాకారుల్లో పలువురు హోమో 'సెక్సువల్స్' ఉన్నారు' అని వ్యాఖ్యలు చేసిన కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలెపై చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు. దివంగత ప్రధాన మంత్రి వాజ్‌పేయీ శతాబ్ది జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుత్తూరుకు వచ్చిన ఆయన బుధవారం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. తీర ప్రాంత జిల్లాలకు చెందిన కళాకారులను మాత్రమే కాకుండా, హిందూ సమాజాన్ని ఆయన అవమానించారని దుయ్యబట్టారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి పోరాటం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం నేతలు పోటీ పడుతూ, పాలనా వ్యవహారాలను పక్కన పెట్టేశారని విజయేంద్ర దుయ్యబట్టారు. అవినీతి పెరిగిపోయిందని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఢిల్లీ యాత్రలతోనే కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని, చెరకు రైతులకు టన్నుకు రూ.3500 మద్దతు ధర ప్రకటించే ధైర్యం కూడా ప్రభుత్వం చేయలేకపోతుందన్నారు. స్పీకరు యూటీ ఖాదర్ అక్రమాలకు పాల్పడ్డారని మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి, ఆధారాలతో సహా దాఖలాలు విడుదల చేసినా, ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. బెళగావి శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని విపక్ష సభ్యులు లేవనెత్తుతారని ప్రకటించారు.

చివరికి.. క్షమాపణ

● 'తీర ప్రాంత జిల్లాల్లోని యక్షగాన కళాకారుల్లో పలువురు స్వలింగ సంపర్కులు ఉన్నారు. అది వారికి అనివార్యమైపోయింది. ఇది నేను కొత్తగా చెబుతున్న విషయం కాదు' అని వ్యాఖ్యలు చేసిన కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలె తన తప్పును తెలుసుకున్నారు. 'నేను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా. నా వ్యాఖ్యలు బాధపెడితే క్షమాపణలు కోరతాను. యక్షగాన కళాకారులు, వారి అభిమానులు కూడా బేషరతుగా క్షమాపణలు కోరుతున్నా. ప్రాధికార అధ్యక్షుని స్థానం నుంచి తొలగిస్తే ఇంటికి వెళతా. నేను ఎవరినీ అవమానించే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదు' అని బిళిమలె వివరణ ఇచ్చారు.

మేకెదాటు నివేదిక సిద్ధం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కావేరి నదిపై 'మేకెదాటు' జలాశయ నిర్మాణానికి కొత్తగా డీపీఆర్‌ను (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) దాఖలు చేశామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలతో డీపీఆర్‌ను మరోసారి రూపొందించి, కేంద్రానికి అందించామని వెల్లడించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు, కావేరి నీరావరి నిగమ డైరెక్టర్ల మండలి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అయ్యే ఖర్చు, ముంపునకు గురయ్యే అటవీ భూమి ఇతర వివరాలను డీపీఆర్‌లో పొందుపరిచామని వెల్లడించారు. హారోబెలె వద్ద ఇప్పటికే మేకెదాటు ప్రాజెక్టు నిర్వహణ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. బెంగళూరు దక్షిణ జిల్లా రామనగరలో సీఈ, సీసీఎఫ్‌లకు ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించి, వారికి అవసరమైన సిబ్బందిని సమకూర్చుతామని వెల్లడించారు. తుమకూరు వరకు మెట్రో విస్తరణకు సంబంధించి అధ్యయన నివేదిక వచ్చిన అనంతరం దానిపై నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి దిల్లీకి వెళ్లే ఆలోచన తన ముందు లేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

సమావేశంలో డీకే శివకుమార్

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	95
క్యారెట్-	90
బీరకాయలు-	65
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	50
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	95
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	65
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	155
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	70
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

'కృష్ణ' మృగాలకు సూక్ష్మ క్రిముల కాటు

బెళగావి, న్యూస్‌టుడే : బెళగావి సమీప భూతరామనహట్టి సమీపంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ మృగాలయంలో 31 కృష్ణ మృగాల మరణానికి వైరస్ కారణమని ప్రాథమిక దర్యాప్తులో పశు వైద్యులు గుర్తించారు. మిగిలి ఉన్న ఏడు కృష్ణమృగాలను క్వారంటైన్‌లో ఉంచి చికిత్స అందిస్తూ నిఘా కొనసాగిస్తున్నారు. బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం నుంచి వెళ్లిన పశు వైద్యులు, అటవీశాఖ సిబ్బంది ఈ జంతుప్రదర్శనశాలను శుద్ధీకరణ (శ్యానిటైజ్) చేశారు. అధికారులు మంజునాథ చౌహాన్, ఎన్ఈ క్రాంతి, నాగరాజ బాళెహోసూ, పవన కురనింగ నేతృత్వంలోని సిబ్బంది కృష్ణజింకలతో పాటు, ఇతర ప్రాణులపైనా నిఘా ఉంచారు. ఇతర జంతు ప్రదర్శనశాలలు, జాతీయ ఉద్యానాల్లోని ప్రాణులు, పక్షులకు అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రే వెల్లడించారు.

రాణి చెన్నమ్మ జంతు ప్రదర్శనశాలను రసాయనాలతో శుద్ధీకరిస్తున్న కార్మికుడు

కారణాల గుర్తింపు..

బెళగావి: రాణి చెన్నమ్మ మృగాలయంలో వరుసగా 31 కృష్ణ మృగాలు (బ్లాక్‌బక్) మరణం వెనుక హెమరేజిక్ సెప్టిసిమియా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌తోనే మరణించాయని వైద్య నిపుణులు ప్రకటించారు. జంతుప్రదర్శన శాలలో మిగిలిన ఏడు కృష్ణమృగాలను రక్షిస్తున్నామని వివరించారు. పులి, సింహం, చిరుత, భల్లూకం, వేర్వేరు జాతుల జింకలు తదితరాలు ఉన్నాయని, వాటికి వైరస్ సోకకుండా ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకున్నారు. హెచ్ఎన్ వైరస్‌కు సంబంధించి అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రేకు అధికారులు నివేదిక అందజేశారు.

నాడ కచేరీపై 'లోకా' దాడి

కోలారు, న్యూస్‌టుడే : బోనిఫైడ్ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు లంచాలు తీసుకుంటున్నారని వచ్చిన ఫిర్యాదులతో కోలారు జిల్లా నరసాపుర పరిధిలోని నాడ కచేరీపై లోకాయుక్త అధికారులు మంగళవారం దాడి చేశారు. అక్కడ సేకరించిన సమాచారం ఆధారంగా ఉప తహసీల్దారు ఎస్.నారాయణ స్వామి, ఒప్పంద పద్ధతిపై పని చేస్తున్న ఆపరేటర్ అంబుజ, దళారి మంజునాథ్, ఒక ట్రాక్టర్ షోరూమ్‌లో సేల్స్ మేనేజరు గోకుల్ రెడ్డి, మేనేజరు ఆంజనేయ రెడ్డి, మధ్యవర్తి అశ్వత్థనారాయణ నివాసాలపై దాడులు చేశారు. వారి నివాసాల్లో పలు దస్త్రాలను జప్తు చేసుకుని విచారణ కొనసాగించారు. లంచం తీసుకుని, నకిలీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

అటవీ గ్రామాల్లో పులుల ఆటకట్టు

మైసూరు, న్యూస్‌టుడే : సరగూరు, చుట్టుపక్కల గ్రామాల్లో ముగ్గురు రైతులను బలిగొన్న పులితో పాటు గత 32 రోజుల్లో 15 పులులను అటవీశాఖ పట్టుకుంది. వీటిలో ఏడు పెద్ద పులులు, ఎనిమిది పులి పిల్లలు ఉన్నాయని మైసూరు వలయ డీసీఎఫ్ పరమేశ్వర్ చెప్పారు. అడవులకు సరిహద్దుగా ఉన్న గ్రామాల్లో ప్రజలు పశువులు మేపుకొనేందుకు వెళుతున్న సమయంలో ఫేస్ మాస్కులను తలకు వెనుక కట్టుకుని వెళ్లాలని జాగృతి కల్పిస్తున్నామని చెప్పారు. పులి కనిపించినప్పుడు కిందకు వంగకుండా, దాడికి ప్రయత్నించకుండా, నిశ్చలంగా నిలబడితే అది ఏమీ చేయకుండా వెళ్లే అవకాశం ఉందన్నారు. హఠాత్తుగా పులి వస్తే అలా చేయాలన్న స్పృహ ఎవరికీ ఉండదన్నారు. సాధ్యమైనంత గుంపులుగా పశువులను మేపేందుకు వెళ్లాలని రైతులకు సూచించారు. అన్ని గ్రామాల పరిధిలో బోనులు ఏర్పాటు చేసి నిఘా ఉంచామని వివరించారు.

ఓ గ్రామంలో వలపన్ని పట్టుకున్న పులి

శివుడికి పట్టం కచ్చితం: బాలకృష్ణ

రామనగర, న్యూస్‌టుడే : మంత్రివర్గ విస్తరణ అనంతరం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని మాగడి ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ వ్యాఖ్యానించారు. డిసెంబరులో శాసన సభ సమావేశాలు పూర్తయిన అనంతరం ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటారని జోస్యం చెప్పారు. మళ్లీ హస్తినకు వెళ్లి మంత్రివర్గం కూర్పు, మార్పులకు సంబంధించి పార్టీ అధిష్ఠానంతో చర్చించేందుకు తమ నాయకుడు సిద్ధమయ్యారని మంగళవారం ఇక్కడ తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు.

అప్పకు మరోసారి సమన్లు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : పోక్సో కేసులో స్వయంగా విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఒకటో ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అప్పతో పాటు వైఎం అరుణ్, రుద్రేశ్ మరుళ సిద్ధయ్య, జి.మరిస్వామికీ సమన్లు జారీ అయ్యాయి. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఇప్పటి వరకు ఉన్న స్టేను ఉన్నత న్యాయస్థానం ఇప్పటికే తొలగించింది. ఈ నేపథ్యంలో డిసెంబరు 2న విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం సమన్లు జారీ చేసిందని ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది అశోక్ నాయక తెలిపారు.

'బహిరంగ ప్రదేశాల' వినియోగానికి నిబంధనలు

బెంగళూరు (రాజాజీనగర) : బహిరంగ ప్రదేశాలు, ఉద్యానాలు, ఆట మైదానాలు, రహదారుల్లో అనుమతి తీసుకోకుండా పది మంది కన్నా ఎక్కువ మంది గుమి గూడడం, కార్యక్రమాలు, జాతా, ప్రదర్శనలు నిర్వహించడంపై ప్రభుత్వం విధించిన నిర్బంధాన్ని జస్టిస్ ఎం.నాగప్రసన్న సమర్థించారు. ఈ ఆదేశాలు ఒకరిని ఉద్దేశించి ఇచ్చినవి కాదని ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత న్యాయస్థానానికి ప్రమాణపత్రాన్ని దాఖలు చేసింది. ప్రభుత్వం 2025 అక్టోబరు 18న ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ హుబ్బళ్లికి చెందిన పునశ్చేతన సేవా ట్రస్టు, వి-కేర్ ఫౌండేషన్‌తో కలిపి వచ్చిన నాలుగు అర్జీలపై విచారణ పూర్తి చేశారు. ప్రభుత్వం, పోలీసుల అనుమతులు తీసుకుని కార్యక్రమాలను నిర్వహించుకుంటే ప్రజా జీవితానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

కోర్టుకు హాజరైన మహదేవ స్వామి

చామరాజనగర, న్యూస్‌టుడే : హనూరు తాలూకా సుళ్వాడి మారియమ్మ ఆలయంలో విషం కలిపిన ప్రసాదాన్ని వితరణ చేసి 17 మంది మరణానికి కారకుడైన ఇమ్మడి మహదేవ స్వామి మైసూరు కారాగారం నుంచి బెయిలుపై సోమవారం విడుదలయ్యాడు. హైకోర్టు సూచించడంతో స్థానిక న్యాయస్థానం ముందు మంగళవారం హాజరైనట్లు అధికారులు ధ్రువీకరించారు. కాషాయం ధరించకుండా, తెల్లని వస్త్రాలు ధరించి వచ్చిన ఆయనపై సుళ్వాడి ప్రజలు దాడికి దిగకుండా పోలీసులు భద్రత కల్పించారు. మూత్రపిండాల వైఫల్యంతో సమస్యలు ఎదుర్కొంటున్న మహదేవస్వామి చికిత్స చేయించుకునేందుకు హైకోర్టు ఏడాది పాటు బెయిలు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

పరిశ్రమల బాధ్యత నాయకులకు ఏలనో?

బెంగళూరు (జయనగర) : ప్రభుత్వ కంపెనీ లేదా పరిశ్రమలకు రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తులను నియమించడం సరికాదని జస్టిస్ డీకే సింగ్, జస్టిస్ టి.వెంకటేశ్ నాయక్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. మైషుగర్ పరిశ్రమకు 2008 నుంచి 2012 వరకు అధ్యక్షుడిగా పని చేసిన తనపై దర్యాప్తునకు ఆదేశించి, ఉప లోకాయుక్తకు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించడాన్ని ప్రశ్నిస్తూ మండ్యకు చెందిన నాగరాజప్ప (80) వేసుకున్న అర్జీని ధర్మాసనం తోసిపుచ్చింది. నాగరాజప్ప అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మైషుగర్ సంస్థ రూ.127 కోట్ల నష్టాన్ని చవి చూసింది. రాజకీయ నేపథ్యం ఉన్నవారిని ప్రభుత్వ రంగ సంస్థలకు అధ్యక్షులుగా నియమిస్తే ఇటువంటి పరిస్థితులే ఎదురవుతాయని ధర్మాసనం మౌఖిక వ్యాఖ్యలు చేసింది.

EENADU Classifieds
PROFESSIONAL SERVICES
VAASTU
ఇల్లు, ఆఫీస్, స్థలాలకు వాస్తు సరిచేసుకోండి. వాస్తు సిద్ధాంతి డా॥ కుంచాల హనుమంతరావు గారు బెంగళూరులో 4 రోజులు మాత్రమే ఉంటారు. సం॥ 9246624248

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

సోదరభావం.. వీడని బంధం

మంత్రి పాటిల్ విశ్లేషణ

సర్వధర్మ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి ఎం.బి.పాటిల్, చిత్రంలో డాక్టర్ వీరేంద్ర హెగ్గడే తదితరులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన భారతదేశం విశ్వగురువుగా గుర్తింపు పొందిందని భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎం.బి.పాటిల్ విశ్లేషించారు. ధర్మస్థల పుణ్యక్షేత్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన లక్షదీపోత్సవం సందర్భంగా కొనసాగిన 93వ సర్వధర్మ సమ్మేళనాన్ని మంత్రి ప్రారంభించి ప్రసంగించారు. అన్ని మతాలూ సత్యం, అహింస, పరోపకారం, సేవ, కరుణ, తదితర మానవీయ విలువలకు ప్రాధాన్యమిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. వసుధైక కుటుంబం అన్న భావన మనదేనన్నారు. మానవ ధర్మమే ఉత్తమమైందని వివరించారు. పరస్పర ప్రీతి, విశ్వాసాలు, శాంతి, సామరస్యం, సోదరభావం ఎన్నటికీ వీడరాదన్నారు. లక్షదీపోత్సవం.. ఓ వైభవ సంబరంగా కొనసాగిస్తున్న శ్రీక్షేత్ర నిర్వాహకులను అభినందించారు. ధర్మాధికారి డాక్టర్ వీరేంద్ర హెగ్గడే ప్రసంగిస్తూ మానవీయతే సకల ధర్మాల సారంగా ఉద్బోధించారు. మతాలనేవి కేవలం పూజలు, జీవన ఆచరణలకు మాత్రమే పరిమితం కాకుండా.. సత్యం, అహింస, కరుణ, శాంతి, సహనాలను పెంచి పోషిస్తున్నట్లు మెచ్చుకున్నారు. కార్తిక మాసంలో చీకటి పారదోలే దీపజ్వాలల ప్రత్యేకతలను విశదీకరించారు. బెంగళూరు నుంచి ధర్మస్థలకు పాదయాత్ర చేసిన రచయిత, కాలమిస్టు తన్వీర్ అహమద్ ఉల్లా ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎల్లవేళలా సత్యానిదే జయమని తేల్చిచెప్పారు. పాదయాత్ర అమూల్య జీవిత అనుభవాన్ని నేర్పిందన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు సూర్యప్రకాశ్ పండిత్, హేమావతి హెగ్గడే తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల ఆలయ ప్రాంగణంలో కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు

మరో మెట్రో రైలు సిద్ధం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : రాజధాని నగర మెట్రో వ్యవస్థ పసుపుపచ్చ (ఎల్లో) మార్గంలో పరుగులు తీయడానికి పైలెట్ రహిత యంత్రం సమకూరింది. కోల్‌కతా నుంచి వచ్చిన ఈ రైలు యంత్రం, ఆరు బోగీలను హెబ్బగోడి మెట్రో డిపోకు తరలించారు. వీటిని ఇక్కడి పట్టాలపై జోడించడానికి రెండువారాల సమయం పడుతుందని బీఎంఆర్‌సీఎల్ అధికారులు వెల్లడించారు. కొద్ది రోజులు ఆ రైలును ప్రయోగాత్మకంగా పట్టాలపై నడిపి, సరిచూస్తారు. ఆర్వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర మధ్య 19.5 కిలోమీటర్ల పొడవునా పైలెట్ రహిత మెట్రో రైళ్లు సంచరిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ మార్గంలో నాలుగు రైళ్లు నడుస్తున్నాయి. ప్రతి పది నిమిషాలకు ఒకటి చొప్పున ఆయా ప్రాంగణాల్లో అందుబాటులోకి వస్తుంటాయి. కొత్త రైలు సమకూరడంతో ప్రతి ఏడు నిమిషాలకు ఒకటి చొప్పున ప్రయాణికులను తరలించనున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు తాము పెద్ద పీట వేస్తున్నామని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్రాధ్యక్షుడు పీఎం నరేంద్రస్వామి పేర్కొన్నారు. గత ఐదు దశాబ్దాలుగా సుస్థిర ప్రగతికి, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, నగర సంస్థలు, పౌరులు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో పరిస్థితులను మరింత చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. (లౌకవాద ఆర్థిక వ్యవస్థ, స్థిరత్వం' అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాలను మంత్రి ఈశ్వర ఖండ్రే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, జస్టిస్ సుభాష్ బి.ఆది, ఎమ్మెల్సీ దినేశ్ గూళిగౌడ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యర్థాలను సంస్కరించడం ద్వారా ఇంధన ఉత్పాదనతో పాటు, ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవచ్చని వివరించారు. కర్ణాటకలో ప్లాస్టిక్ వ్యర్థాలను సంస్కరించేందుకు 1407, ఈ-వ్యర్థాల కోసం 1063, బ్యాటరీలను సంస్కరించేందుకు 11 కేంద్రాలు ఉన్నాయని గుర్తు చేశారు. కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా వాతావరణంలో పెను మార్పులు రాకుండా అడ్డుకోవచ్చని చెప్పారు. మండలి ప్రతినిధులు శరణ కుమార మోది, శ్రీనివాసులు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

యోధుని స్మరణార్థం రూపొందించిన కార్డును ప్రదర్శిస్తున్న మహిళ. చిత్రంలో మంత్రి ఈశ్వర ఖండ్రే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు

గనినాడులో ఐక్యతా పాదయాత్ర

ఐక్యతా పాదయాత్రలో విద్యార్థులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం నగరంలో ఐక్యతా పాదయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం యువ కార్య, క్రీడా సచివాలయం, మేరా యువ భారత్ కేంద్రం సంయుక్తంగా స్థానిక డా.రాజ్‌కుమార్ రహదారిలోని ప్రభుత్వ మున్సిపల్ క్రీడామైదానం వద్ద ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్, మేయర్ పూజారి గాదెప్ప ఐక్యతా పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి డా.రాజ్‌కుమార్ రహదారి, గడిగి చెన్నప్ప కూడలి, బెంగళూరు రహదారి, తేరు వీధి, జైన్ మార్కెట్, హెచ్.ఆర్.గవియప్ప కూడలి నుంచి డా.జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం వరకు యాత్ర కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీష్, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తదితరులు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జీవిత చరిత్ర, తీసుకున్న నిర్ణయాలను వివరించారు. యాత్రలో నగరంలోని 15 పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేయిమందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట్యాన్‌కు బెయిలు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్‌ను అనుచిత వ్యాఖ్యలతో దూషించి, కారాగారం చేరిన భాజపా జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు సంతోశ్ కోట్యాన్‌కు షరతులతో కూడిన బెయిలు మంజూరైంది. నాలుగు రోజులు కారాగారంలో ఉన్న కోట్యాన్‌కు సోమవారం బెయిలు మంజూరైంది. రామేనహళ్లి సమీపంలోని కారాగారం నుంచి మంగళవారం విడుదలైన అతనికి కార్యకర్తలు స్వాగతం పలికి, బైకు ర్యాలీలో తోడ్కొని వెళ్లారు.

పీఠోపకరణాలు స్వాధీనం

మండ్య, న్యూస్‌టుడే : మద్దూరు తాలూకా హెబ్బెరళు గ్రామానికి చెందిన జవరేగౌడకు పరిహారం ఇవ్వడంలో జాప్యం చేసినందుకు ఇంజినీరు కార్యాలయంలోని పీఠోపకరణాలను న్యాయస్థానం సిబ్బంది జప్తు చేసుకున్నారు. ముత్తురాయనకెరె వద్ద కాలువ నిర్మాణానికి జవరేగౌడకు చెందిన 1.17 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నా నామమాత్రపు పరిహారాన్ని ఇచ్చారు. మిగిలిన రూ.84 లక్షల పరిహారాన్ని ఆయనకు చెల్లించాలని కావేరి నీరావరి నిగమకు మండ్య జిల్లా న్యాయస్థానం 2022లో సూచించింది. మూడేళ్లుగా పరిహారం ఇవ్వకపోవడంతో రైతు మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజినీరు కార్యాలయం పీఠోపకరణాలను జప్తు చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన సిబ్బంది మంగళవారం అక్కడి పీఠోపకరణాలను తమతో తీసుకువెళ్లారు. కేసు తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

ధర్నా చేస్తున్న ఆయమ్మలు

సేవలకూ గుర్తింపు లేదాయెనే

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు ఆందోళనకు దిగారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ బెంగళూరు స్వాతంత్య్ర ఉద్యానవనంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఏళ్ల తరబడి దినకూలీ వేతనాలపై పని చేస్తున్నామని, ఉద్యోగ భద్రత కరవైందని, విధులు క్రమబద్ధీకరించాలని కోరారు. పాఠశాలల్లో ఆయాలు చేస్తున్న పనికి గుర్తింపు ఇవ్వాలంటూ నినదించారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల మందికి న్యాయం చేయాలని కోరారు.

(c) eenadu

బెంగళూరు

• బెంగళూరు • కోలారు • మైసూరు • హోసూరు • చిక్కబళ్లాపుర • తుమకూరు



అవార్డును ప్రదర్శిస్తున్న సీఈఓ డాక్టర్ బాగేవాడి

కోలారు జిల్లాకు నీటి సంరక్షణ జాతీయ అవార్డు

కోలారు జిల్లాకు నీటి సంరక్షణ జాతీయ అవార్డు లభించింది. జల్ సంచాయ్ జన్ భాగీదారీ జేఎస్‌జేబీ అభియాన్ కింద జిల్లా ఈ అవార్డును గెలుచుకుంది. రూ.25 లక్షల బహుమతి, ప్రశంసాపత్రాన్ని జిల్లా పంచాయతీ సీఈఓ డాక్టర్ పి.బాగేవాడి అందుకున్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ఏర్పాటైన జాతీయ జల అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహాయ మంత్రి వి.సోమన్న హాజరయ్యారు. - న్యూస్‌టుడే, ముళబాగిలు

సుశీల, నీళకు సిద్ధరామయ్య ప్రశస్తి

సుశీల సుబ్రహ్మణ్య ఎం.హెచ్.నీళ

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరానికి చెందిన ప్రముఖ మహిళా పాత్రికేయులు సుశీల సుబ్రహ్మణ్య, ఎం.హెచ్.నీళ 2025-సిద్ధరామయ్య ప్రశస్తికి ఎంపికయ్యారు. వీరు కర్ణాటక మహిళా పాత్రికేయుల సంఘం సభ్యులు. సదరన్ ఎకనామిస్ట్ ఆంగ్ల పత్రిక సంపాదకురాలు సుశీల సుబ్రహ్మణ్య, ప్రజావాణి దినపత్రిక ముఖ్య సంపాదకురాలైన ఎం.హెచ్.నీళ పాత్రికేయరంగంలో చేసిన కృషికి గాను వారిని ఈ ప్రశస్తికి ఎంపిక చేసినట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. ప్రశస్తి కింద వారికి రూ.25వేల నగదు, జ్ఞాపికను ప్రదానం చేయనున్నారు. ఈ నెల 28న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశస్తి ప్రదానం చేయనున్నట్లు కర్ణాటక మహిళా పాత్రికేయుల సంఘం ప్రధాన కార్యదర్శి మంజుశ్రీ కడకోళ తెలిపారు. సిద్ధరామయ్య తన పేరిట ప్రశస్తిని ఇచ్చే నిమిత్తం వర్ధనిధి స్థాపించారు. ఈ ప్రశస్తిని ప్రథమంగా ప్రముఖ మహిళా పాత్రికేయులకు ప్రదానం చేయనుండడం తమకు గర్వకారణమని సంఘం అధ్యక్షురాలు పద్మాక్షిమొగ్గె, కార్యదర్శి మంజు కడకోళ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు కెంపజ్జి బసప్ప ఆడిటోరియంలో జరుగునుంది. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

హోసూరు కబుర్లు

నివాళులర్పిస్తున్న ఎంపీ అభిమానులు, కార్పొరేటర్ ఇంద్రాణి తదితరులు

తవ్వారో జరిమానాయే

ఆదేశాలిచ్చిన చీఫ్ కమిషనర్

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) ఐదు నగర పాలికెల పరిధిలో రహదారులను అనాధికారికంగా తవ్వే వారిని గుర్తించి జరిమానా విధించి వసూలు చేయాలని చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు అధికారులను సూచించారు. బుధవారం ఇక్కడ ఆయన ఐదు నగర పాలికె కమిషనర్లతో సమావేశమయ్యారు. రహదారి తవ్వకాల అనుమతి పత్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. తవ్వకాలు చేపట్టే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. తవ్వకాల వల్ల రహదారులు త్వరగా పాడవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను వసూలు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని, నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. పన్ను బకాయిలను గుర్తించి వసూలు చేయాలన్నారు. బి.ఖాతా నుంచి ఎ.ఖాతా మార్పు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. రహదారుల పక్కన రోజులు తరబడి నిలిపిన వాహనాలను తొలగించేందుకు టోయింగ్ యంత్రాలను కొనుగోలు ప్రక్రియను తక్షణం చేపట్టాలన్నారు.

నగర పాలికె కమిషనర్లతో సమావేశమైన చీఫ్ కమిషనర్ మహేశ్వరరావు

పన్ను చెల్లించని మంత్రిమాల్‌కు తాళం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ వాణిజ్య ప్రదేశంగా గుర్తింపు పొందిన మంత్రిమాల్‌కు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార(జీబీఏ) అధికారులు బుధవారం తాళం వేశారు. మల్లేశ్వరంలో ఉన్న మంత్రిమాల్ యజమానులు ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో అధికారులు ఈ చర్య చేపట్టారు. దాదాపు రూ.30.81కోట్లు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చిన ప్రయోజనం లేకపోవడంతో మంత్రి మాల్‌కు తాళం వేసి బంద్ చేసినట్లు కేంద్ర నగర పాలికె కమిషనర్ రాజేంద్ర చోళన్ తెలిపారు. గతంలో పలు మార్లు తాళం వేసేందుకు ప్రయత్నించగా తక్షణం ఆస్తి పన్ను చెల్లిస్తామని హామీ ఇచ్చారని, న్యాయస్థానాన్ని ఆశ్రయించి పన్ను చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోవడంతో తాళం వేయాల్సిన పరిస్థితి వచ్చినట్లు తెలిపారు.

తాళం వేస్తున్న జీబీఏ అధికారులు

ఇందిర సేవలు నిరుపమానం

హోసూరు, న్యూస్‌టుడే: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 100వ జయంత్యుత్సవాన్ని బుధవారం హోసూరులో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.మురళీధరన్ నేతృత్వంలో గాంధీ విగ్రహం దగ్గర చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పార్లమెంటు సభ్యుడు కె.గోపీనాథ్ అభిమానులు సాదిక్, నీలకంఠన్ నేతృత్వంలో వేర్వేరు ప్రాంతాల్లో వేడుకలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. మురళీధరన్ నేతృత్వంలో పట్టణ అధ్యక్షుడు త్యాగరాజన్, మహిళా విభాగం అధ్యక్షురాలు సరోజ, లలిత, ప్రదీప్‌కుమార్ శివప్రెడ్డి, ఐ.ఎన్.టి.యు.సి. నేతలు ముత్తప్ప, చిన్నగుట్టప్ప తదితరులు పాల్గొన్నారు. ఎంపీ గోపీనాథ్ అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఇంద్రాణి, ప్రవీణ్ కుమార్, నీలకంఠన్, అక్బర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను శ్లాఘించారు.

బెంగళూరు (జేపీ నగరు): మాజీ ప్రధాని ఇందిర సేవలు అపారమని మాజీ ఎమ్మెల్యే, కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని జేపీనగర సార్వత్రిక కూడలి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఇందిర విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదల కోసం వేర్వేరు పథకాలను జారీ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్, మంజునాథ్, రఘునాథ నాయుడు, అరుణ్ కుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సౌమ్యారెడ్డి, రఘునాథ నాయుడు, మంజునాథ్ తదితరులు

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నారాయణస్వామి, పార్టీ కార్యకర్తలు

చిత్రదుర్గంలో 38 వేల పట్టభద్ర ఓటర్లు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర విధానపరిషత్ ఆగ్నేయ పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు చిత్రదుర్గం జిల్లాలో మొత్తం 38 వేల మంది పట్టభద్రులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకొన్నారని రాష్ట్ర విధానపరిషత్ సభ్యుడు వై నారాయణ స్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇక్కడి భాజపా పార్టీ కార్యాలయములో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. చిత్రదుర్గం, దావణగెర, తుమకూరు, చిక్కబళ్లాపురం, కోలారు జిల్లాల పరిధిలో విస్తరించిన ఈ నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికలకు సుమారు 3 లక్షల మంది డిగ్రీ హోల్డర్లు ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకోనే అవకాశం ఉందన్నారు.

వైభవంగా అమావాస్య దీపోత్సవం

చక్కార్లకొండ, (బేలికె), న్యూస్‌టుడే: తాలూకాలోని యూనియన్ పులరి గ్రామ సమీపంలోని 800 ఏళ్లకు పైగా చరిత్ర ప్రసిద్ధి చెందిన చక్కార్లు కొండపై శ్రీ మునేశ్వరస్వామి, శ్రీమాగేశ్వరస్వామి, అంజనేయస్వామి కొలువై ఉన్నారు. 36వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం సాధుమాత వెంకమ్మ ఆధ్వర్యంలో కార్తీకమాస అమావాస్య దీపోత్సవాన్ని నిర్వహించారు. ఓ కొండ గుహలో వెలసిన దేవతలను గుర్తించిన సాధుమాత ఈ స్థలంలోనే ఆలయం నిర్మించారు. సుమారు 7 కిలో మీటర్ల దూరం భక్తులు కాలినడకన ఏటా దీపాన్ని తలపై మోసుకుని కొండపై దేవతలకు పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. సాయంత్రం సాధుమాత వెంకటమ్మ, భక్తుడు నారాయణస్వామి, ధ్వజ స్తంభంపై దీపం వెలిగించారు.

తలపై దీపాన్ని మోసుకొస్తున్న భక్తులు

కోలాహలంగా వేరుసెనగ జాతర

బాగలూరు, (బేలికె): బాగలూరు సమీపంలోని శ్రీగుట్టలసవేశ్వరస్వామి ఆలయంలో వేరుసెనగ జాతర 40వ వార్షికోత్సవాలను గ్రామస్థులు కనులపండువగా జరుపుకొన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నిన్న సాయంత్రం స్వామికి వేరుసెనగలు నైవేద్యంగా పెట్టి భక్తులు పిండితో తయారుచేసిన దీపాలు వెలిగించి స్వామికి పూజలు నిర్వహించారు. స్వామిని వెండి రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిభా ప్రోత్సాహం ప్రశంసనీయం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: యువప్రతిభను ప్రోత్సహించడం చాలా గొప్ప విషయమని మంత్రి రామలింగారెడ్డి అన్నారు. సీఎంఆర్ విశ్వవిద్యాలయం 34వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్త అకాడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. శ్రీచిక్కమునియప్ప గౌరవార్థం రూ.12.82 కోట్ల విలువైన ఉపకార వేతనాలను విద్యార్థులకు అందించారు. 207 సీఎంఆర్ ఉపకార వేతనాలు, 18 క్రీడా ప్రోత్సాహక వేతనాలు, 22 నాయకత్వ అవార్డులను మంత్రి ప్రదానం చేశారు. బుధవారం ఏర్పాటైన ప్రారంభ వేడుకల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు సీఎంఆర్ విశ్వవిద్యాలయం, ఛైర్మన్ డాక్టర్ కె.సి.రామమూర్తి(ఐపీఎస్), జ్ఞానధార ట్రస్ట్ కార్యదర్శి కె.సి.జగన్నాథరెడ్డి, డాక్టర్ సబితా రామమూర్తి, కులపతి జయదీప్ కె.ఆర్.రెడ్డి, డాక్టర్ త్రివిక్రమమూర్తి, ఉపకులపతి డాక్టర్ హెచ్.బి.రామచంద్ర తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.64 లక్షలతో తారురోడ్డు

డెంకణీకోట న్యూస్‌టుడే: ప్రజల అత్యవసర వసతులు, సమస్యల పరిష్కారానికి ఎల్లపుడూ అందుబాటులో ఉంటానని తళి ఎమ్మెల్యే రామచంద్రన్ తెలిపారు. బుధవారం డెంకణీకోట తేరుపేట నుంచి బేటరాయ స్వామి ఆలయం వరకు నిర్మించ తలపెట్టిన తారు రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. పూజలో పట్టణ పంచాయతి అధ్యక్షుడు శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు అబ్దుల్‌కలాం, జిల్లా కౌన్సిలర్ బూధట్టయప్ప, యూనియన్ కౌన్సిలర్ కృష్ణన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రాణ త్యాగశీలి..

తుమకూరు: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జీవితాంతం దేశం కోసం శ్రమించిన గొప్ప నేతని మాజీ ఎమ్మెల్యే ఎస్.షఫీ అహమ్మద్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇందిరా జయంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. ఆమె అమలులోకి తెచ్చిన 20 అంశాల కార్యక్రమం, గరీబీ హఠావో తదితర కార్యక్రమాలు దేశ స్థితిగతుల్లో కొత్తమార్పు తెచ్చాయన్నారు. ప్రస్తుతం దేశ బాగు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు కెంచమారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ, సిద్ధయ్య, మంజునాథ్, శివాజీ మహబూబ్ బాషా యశోద, భాగ్యమ్మ మురళీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సహనా విద్యార్థులు

విజేతలయిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

పావగడ, న్యూస్‌టుడే: తాలూకాలోని కోటగుడ్డ సహనా ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక, ఉన్నత పాఠశాల బాలబాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధుగిరిలో బుధవారం జరిగిన పలు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందారు. ప్రాథమిక పాఠశాల బాలుర విభాగంలో టేబుల్ టెన్నిస్‌లో శశాంక్‌గౌడ, కె.ఆర్. సృజన్, జీవన్‌యాదవ్, విశాల్, ఒ.ఎన్.జీవన్ మొదటి స్థానం, చదరంగంలో ఉదయ్‌కుమార్, హర్షితరెడ్డి, జనార్దన గౌడ మొదటి స్థానంలో నిలిచారు. ప్రాథమిక పాఠశాల బాలికల విభాగం టెన్నిస్ పోటీలో ఇ. ప్రత్యూష, మౌనిక, హేమ, పూర్ణిమ విజేతలుగా నిలిచారు. ఉన్నత పాఠశాల బాలుర విభాగం త్రో బాల్‌లో ధనుష్ మొదటి స్థానం, బాలికల విభాగం టేబుల్ టెన్నిస్‌లో నవ్యశ్రీ, కీర్తన, హేమప్రియ, తనుశ్రీ గెలుపొందారు. విజేతలను సహనా విద్యా సంస్థ కార్యదర్శి శ్రీనివాస్ ఉపాధ్యాయులు మల్లికార్జున, హనుమంతరాయప్పలు అబినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే: నిత్యం నగరాన్ని శుభ్రపర్చి ప్రజారోగ్య సేవల్లో తలమునకలవుతున్న పారిశుద్ధ్య కార్మికులను పురసభ ముఖ్యఅధికారి ఎస్.మంజూనాథ్ అభినందించారు. వారి సేవలు నిరుపమానమని ఆయన పేర్కొన్నారు. చిక్కబానువార పురసభ పరిధిలో పనిచేస్తున్న 40 మంది పౌర కార్మికులను కార్మిక దినోత్సవం సందర్భంగా సత్కరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భద్రత నిమిత్తం కొన్ని సౌకర్యాలతో పాటు శుభ్రంగా ఉంచుకోవడానికి గ్లౌజులు, హెల్మెట్లు, మాస్కులు , టోపీలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కణ్ణ, దాసరహళ్లి పత్రికా సంఘం అధ్యక్షుడు హెచ్. ఆర్.రవీష్, పురసభ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

కార్మికులను సత్కరించిన పురసభ ముఖ్య అధికారి మంజునాథ్, చిక్కణ్ణ తదితరులు

జిల్లాధికారి ఆకస్మిక తనిఖీ

తుమకూరు, న్యూస్‌టుడే: మహానగర పాలికెలో సామాన్య ప్రజలకు ఇ-స్వత్తులకు సంబంధించిన దాఖలాలను అందించడంలో జాప్యం, అవ్యవస్థ గురించి జిల్లాధికారి శుభాకల్యాణ్ ఆరా తీశారు. మహానగర పాలికె పరిధిలోని ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతుండడంతో జిల్లాధికారి పాలికెలో ఆకస్మిక తనిఖీకి వచ్చారు. పాలికెలోని ఆస్తుల దాఖలాల విభాగంలో ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన అనేక అర్జీలు రెవెన్యూశాఖ అధికారి స్థాయిలోనే పెద్దఎత్తున పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దాంతో దాఖలాల పరిశీలన కోసం నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కొన్ని చోట్ల అధికారుల అసమర్థతను గుర్తించిన జిల్లాధికారి వారిపై మండిపడ్డారు. అధికారులు సమర్పించిన గణాంకాల ప్రకారం వందలాది ఇ-స్వత్తుల అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లాధికారి హెచ్చరించారు.

మహానగర పాలికెలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లాధికారి శుభాకల్యాణ్

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు

హోసూరు, న్యూస్‌టుడే: కృష్ణగిరి పార్లమెంటు సభ్యుడు కె. గోపినాథ్ తన పుట్టిన రోజును కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో బుధవారం ఘనంగా ఆచరించారు. కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు ఆయన నివాసం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కె.ఎ.మనోహరన్, టి.వి.ఎస్. ఐన్.టి.యు.సి. కార్మిక సంఘం అధ్యక్షుడు కుప్పుసామి, కార్పొరేటరు ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, మహిళ విభాగం నాయకురాలు సరోజ, డి.ఎం.కె. కార్పొరేటరు ఎన్.ఎస్. మాదేశ్వరన్, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. కార్పొరేటరు హెచ్.శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో కేక్ కోసి కార్యకర్తలు తమ నాయకునికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా నేతాజీ రోడ్డులో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అందరికీ మిఠాయిలు పంచారు.


ఎంపీ గోపినాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహరన్

ఏనుగు సంచారంతో జనం బెంబేలు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే: కెలమంగలం నుంచి ఉద్దనపల్లి వెళ్లే రహదారిలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏనుగు సంచారంతో జనం బెంబేలెత్తారు. ఈ ఏనుగు అక్కడి రైతులు పండించిన రాగులు, అనప, వరి, జొన్న పంటలను తొక్కి నాశనం చేసింది. టెంకాయ చెట్లను కుదుపుతూ బీభత్సం సృష్టించింది. ఒంటరి ఏనుగు కావడంతో స్థానికులు భయపడుతున్నారు. అడవిలోకి తరిమేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కళాశాల సమీపంలో తిరుగుతున్న ఏనుగు

ఇంటి కోసం అప్పులు.. తీర్చలేక అధ్యాపకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక.. ఈ విషయంగా భార్యతో ఏర్పడ్డ మనస్పర్థలతో జీవితంపై విరక్తి చెందిన అధ్యాపకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి తూర్పు పీఎస్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం తుమకూరుకు చెందిన సతీష్‌కుమార్(48) అక్కడి యూనివర్సిటీలో హిస్టరీ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొత్త ఇల్లు నిర్మించారు. అనుకున్న దానికన్నా ఎక్కువ కావడంతో అప్పుల పాలయ్యారు. ఈ విషయంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య మాట్లాడకుండా ఉంది. మనస్తాపానికి గురైన సతీష్‌కుమార్ ఈ నెల 17వ తేదీ ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. తిరుపతి బస్టాండు సమీపంలోని లాడ్జిలో దిగారు. సోమవారం ఉదయం తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి తిరిగి లాడ్జికి వచ్చి.. ఫ్యానుకు ఉరేసుకున్నారు. లాడ్జి నిర్వాహకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతని చరవాణి ద్వారా కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. భర్త కోసం భార్య యమున చుట్టుపక్కల వెతికి తిరుపతికి వచ్చినట్లు తెలుసుకుని బుధవారం ఉదయం తిరుపతికి చేరుకుంది. లాడ్జిలో భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సతీష్‌కుమార్‌కు భార్యతోపాటు కుమార్తె ఉంది.

నూర్పిడి యంత్రంలో చిక్కుకొని మహిళ మృతి

ముళబాగిలు, న్యూస్‌టుడే: తాలూకాలోని దొడ్డగుట్టహళ్లి గ్రామంలో వరి ధాన్యాన్ని వేరు చేసే యంత్రంలో చిక్కుకుని ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. శ్యామలమ్మ(45) అనే మహిళ గంగాధరప్ప అనే రైతు వద్దకు వరి ధాన్యాలు కోసే కూలి పనికి వెళ్లింది. పని చేస్తుండగా ఆమె చీర యంత్రం జాయింట్‌లో చిక్కుకుని గొంతు చుట్టూ బిగుసుకుపోయింది. దాంతో ఊపిరాడక చనిపోయింది. మహిళకు భర్త ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నంగలి పోలీసుస్టేషన్ పీఎస్ఐ విద్యాశ్రీ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

21న జేడీఎస్ రజతోత్సవం

తుమకూరు, న్యూస్‌టుడే: జనతాదళ్ ప్రాంతీయ పార్టీగా ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈనెల 21న బెంగళూరు జె.పి. భవన్‌లో రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప తెలిపారు. తుమకూరు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో జేడీఎస్ పార్టీ ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొంటారన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధాని దేవేగౌడ పార్టీని స్థాపించగా కేంద్రమంత్రి కుమారస్వామి సారథ్యంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ అపారమైన కార్యకర్తలు, పార్టీ ప్రతినిధులతో ముందుకు సాగుతోందని అంజినప్ప వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఆర్.ఉగ్రేష్, గంగణ్ణ, కృష్ణమూర్తి, ముదిమడు రంగస్వామి, నాగరాజు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజినప్ప, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితరులు

క్రైం కార్నర్

ఒంటరి మహిళ హత్య: మామ అరెస్టు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఇటీవల బొమ్మనహళ్లి పోలీసుఠాణా పరిధిలోని హొంగసంద్రలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఒంటరి మహిళ ప్రమోదా(35)ను హత్య చేశాడనే ఆరోపణపై ఆమె మామ మందణ్ణ(67)ను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర కన్నడ జిల్లా శిరసి ప్రాంతానికి చెందిన ఆమె, సురేష్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. కొన్ని కారణాలతో ఇద్దరు వేర్వేరుగా జీవిస్తున్నారు. ఆమె మామ గుట్టుచప్పుడు కాకుండా నివసిస్తున్న ఇంటికి వచ్చి హఠాత్తుగా కత్తితో ఆమెను పొడిచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు దృశ్యాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నకిలీ బీడీలు స్వాధీనం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మంగళూరు బీడీ లోగోను ఉపయోగించి నకిలీబీడీలు తయారు చేస్తున్న మంజు అనే వ్యక్తిని ఆర్.ఎం.సి యార్డు పోలీసులు అరెస్టు చేశారు. రూ.22వేల విలువ చేసే నకిలీ బీడీ కట్టలను స్వాధీనం చేసుకున్నారు. నకిలీబీడీలను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువధరలకు వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులోఉంది.

ఐదుగురి రౌడీషీటర్లకు బేడీలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: దారి దోపిడీలకు పాల్పడుతున్న రౌడీషీటర్లు విఘ్నేష్(29), హేమంత్(23) ప్రజ్వల్(23),బాలాజి(21), విశాల్‌మూర్తి(21)లను కెంగేరి పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల కెంగేరి ప్రాంతంలో తెల్లవారు జామున సంచరిస్తున్న నలుగురు పాదచారులను అడ్డగించి కత్తులు చూపించి బెదిరించి నగదు చరవాణిలను దోచుకుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

విధానసౌధ ముందు దారిదోపిడీ

బెంగళూరు (యలహంక): విధానసౌధ ముందు ఉన్న మెట్రో స్టేషన్‌వద్ద నడిచి వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను నిందితులు అడ్డగించి కత్తులు చూపించి బెదిరించి రూ.9వేలు నగదు, చరవాణి తదితర వాటిని దోచుకుని పరారైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఐదుగురు ద్విచక్ర వాహనంలో వచ్చి దోపిడీకి పాల్పడినట్లు బాధితుడు విమల్ గిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధానసౌధ పోలీసులు సవాలుగా స్వీకరించి కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రూ.8 లక్షల రసాయనాలు స్వాధీనం

ముళబాగిలు, న్యూస్‌టుడే: తాలూకాలోని ఎన్.వడ్డహళ్లిలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్, ఉపమార్కెట్, వాణిజ్య సముదాయంలో అక్రమంగా ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్న దుకాణంపై వ్యవసాయ అధికారులు బుధవారం దాడి చేసి రసాయన పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.ఎనిమిది లక్షలుంటుంది. దుకాణ యజమాని సుధాకర్ వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందకుండానే వివిధ రకాల మందులు, ఎరువులు ఇతర వస్తువులను ఏడాది నుంచి అక్రమంగా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న కోలారు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు దుకాణంపై దాడి చేశారు. పెద్ద మొత్తంలో వస్తువులను స్వాధీనం చేసుకున్న తర్వాత సుధాకర్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జావేద్ నసీమా ఖాన్, డిప్యూటీ డైరెక్టర్ ప్రమోద్, మురళీ అధికారుల బృందం పాల్గొన్నారు.

చేపల వ్యాపారి దుర్మరణం

బెంగళూరు (బాణసవాడి): ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో దొడ్డబళ్లాపుర నివాసి రోషన్(22) మృతి చెందిన ఘటన మంగళవారం చిక్కజాల సంచార పోలీసుఠాణా పరిధిలో జరిగింది. తీవ్రంగా గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తరబనహళ్లి కూడలి వద్ద ఆ ఘటన చోటుచేసుకుంది. కేసుదర్యాప్తులో ఉంది.

మహారాజరాజశ్రీ పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో
O.S. 525/2022
వాది : పి.భారతి
ప్రతివాది : పి.వెంకటరమణ రెడ్డి అలియాస్ రమణ వగైరా
ప్రతివాదికి దావా సమన్లు
పి.వెంకటరమణ రెడ్డి, అలియాస్ రమణ, డోర్ నెం.8, ఫస్ట్ మెయిన్, హచెంప్ప లేఅవుట్, దేవసంద్ర, కె.ఆర్.పురం, బెంగళూరు.
పై దావాలో మీకు ఎన్ని మార్లు దావా సమన్లు పంపినను తీసుకోనందున కోర్టువారు మీకు పేపరు ద్వారా సమన్లు ఉత్తర్వులు పొలించినారు. దావా 01-12-2025న వాయిదా వున్నది. సదరు వాయిదాకు మీరు హాజరు కానంతట దావా పరోక్షముగా తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
"కోర్టు ఉత్తర్వు మేరకు"
గల్లా శివశంకరనాయుడు
న్యాయవాది, పుంగనూరు

మహారాజరాజశ్రీ పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో
I.A.No.65/2020
O.S. 221/2019
వాది : డి. ఉషా వగైరా
ప్రతివాదులు : డి. శాంతమ్మ వగైరా
R9కు నోటీసు
జి. వెంకటేశప్ప S/o గోవిందప్ప, పేగలపల్లి, సోమయాజులపల్లి హోబళి, శ్రీనివాసపుర తాలూకు, కోలారు జిల్లా, కర్నాటక రాష్ట్రం.
పై దావాలో సదరు I.A.No.65/2020 లో మీకు ఎన్ని మార్లు నోటీసు పంపినను తీసుకోనందున కోర్టువారు మీకు పేపరు ద్వారా నోటీసు ఉత్తర్వులు పొలించినారు. దావా 15-12-2025న వాయిదా వున్నది. సదరు వాయిదాకు మీరు హాజరు కానంతట దావా పరోక్షముగా తీర్మానం చేయబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
"కోర్టు ఉత్తర్వు మేరకు"
గల్లా శివశంకరనాయుడు
న్యాయవాది, పుంగనూరు

ఆలయాల ఆవరణల్లో లక్ష మొక్కలు

కెలమంగలం (డెంకణీకోట) న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆలయాల ఆవరణల్లో లక్ష మొక్కలను నాటాలని నిర్ణయించి కెలమంగలం శివారు ఒన్నగురుక్కై గ్రామంలోని శ్రీ నామునేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీకారం చుట్టారు. బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వేల్‌రాజ్ 200 మొక్కల్ని నాటారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివప్ప, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటుతున్న దేవాదాయశాఖ అధికారులు

విదేశీయురాలిని రక్షించిన ఈతగాళ్లు

కార్వార, న్యూస్‌టుడే: కుమటా తాలూకా కుడ్లె బీచ్‌కు వచ్చిన కజకిస్థాన్‌కు చెందిన ఐదాలి (25) అనే విదేశీయురాలిని గజ ఈతగాళ్లు రక్షించారు. భర్తతో కలిసి వచ్చిన ఆమె అరేబియా సముద్రంలో ఈతకు దిగి, అలల తాకిడికి కొట్టుకు పోవడాన్ని గురించిన అక్కడి గజ ఈతగాళ్లు మంజునాథ్ హరికంత్ర, గిరీశ్ గౌడ, నాగేంద్ర ఆమెను రక్షించారు. గోకర్ణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైతులకు ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సత్కారం

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి వల్ల ప్రయోజనాలు పొందిన బెంగళూరు గ్రామీణ జిల్లాకు చెందిన ముగ్గురు రైతులను బుధవారం ఇక్కడ హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ(ఐసీఏఆర్)లో శాస్త్రవేత్తలు సత్కరించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్‌నిధి 20వ కంతును ప్రధాని నరేంద్రమోదీ రైతుల బ్యాంకు ఖాతాల్లో వేశారు. కోయంబత్తూరులో జరిగిన కార్యక్రమాన్ని ఐసీఏఆర్ డాక్టర్ జీవన్ రాంధన భవన్‌లో ఏర్పాటు చేసిన తెరపై రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది అందరూ కలిసి తిలకించారు. - న్యూస్‌టుడే, బెంగళూరు(యలహంక)

(c) eenadu

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

భక్తిశ్రద్ధలతో ఇరుముళ్ల కార్యక్రమం

రామాలయంలో ఇరుముళ్లు కట్టుకుంటున్న అయ్యప్ప మాలధారులు

సిరివార,(మాన్వి): తాలూకాలోని వాగబావి క్యాంపులోని కోదండరామాలయంలో అయ్యప్పస్వామి మాలధారులు బుధవారం ఇరుముళ్లు కట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు క్యాంపునకు వచ్చారు. వీరిలో 21 మంది మాలధారులు ఇరుముళ్లు కట్టుకున్నారు. ఆలయ సేవా సమితి వారు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో క్యాంపు వాసులు అయ్యప్ప స్వాములు, వారి బంధుమిత్రులు, హాజరైన భక్తులు, ప్రజలకు ప్రత్యేక అన్నసంతర్పణ చేశారు.

మరో మెట్రో రైలు సిద్ధం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: రాజధాని నగర మెట్రో వ్యవస్థ పసుపువర్ణ (ఎల్లో) మార్గంలో పరుగులు తీయడానికి పైలెట్ రహిత యంత్రం సమకూరింది. కోల్‌కతా నుంచి వచ్చిన ఈ రైలు యంత్రం, ఆరు బోగీలను హెబ్బగోడి మెట్రో డిపోకు తరలించారు. వీటిని ఇక్కడి పట్టాలపై జోడించడానికి రెండువారాల సమయం పడుతుందని బీఎంఆర్‌సీఎల్ అధికారులు వెల్లడించారు. కొద్ది రోజులు ఆ రైలును ప్రయోగాత్మకంగా పట్టాలపై నడిపి, సరిచూస్తారు. ఆర్వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర మధ్య 19.5 కిలోమీటర్ల పొడవున పైలెట్ రహిత మెట్రో రైళ్లు సంచరిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ మార్గంలో నాలుగు రైళ్లు నడుస్తున్నాయి. ప్రతి పది నిమిషాలకు ఒకటి చొప్పున ఆయా ప్రాంగణాల్లో అందుబాటులోకి వస్తుంటాయి. కొత్త రైలు సమకూరడంతో ప్రతి ఏడు నిమిషాలకు ఒకటి చొప్పున ప్రయాణికులను తరలించనున్నాయి.

సాహిత్య అకాడమీ సభ్యురాలి నియామకం

రాయచూరు, న్యూస్‌టుడే: కర్ణాటక సాహిత్య అకాడమీ (బెంగళూరు) కార్యనిర్వాహక సమితి సభ్యురాలిగా డాక్టర్ పద్మజా దేశాయి నియమితులయ్యారు. ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఆమె మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఆదికవి మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం (రాయచూరు వీవీ) ఇతిహాస విభాగం అతిథి అధ్యాపకురాలు పద్మజా

అధ్యాపకురాలు పద్మజా

విదుల నిర్వర్తిస్తున్నారు. ఆమె 18 ఏళ్లుగా కళ్యాణ కర్ణాటక ప్రాంతానికి సంబంధించిన చరిత్ర, పురాతత్వ, నాణేలు, శాసనాలపై అనేక పరిశోధనలు చేశారు. ఆ అంశాలను జాతీయ, రాష్ట్ర సదస్సులు, సమ్మేళనాల్లో ప్రవేశపెట్టారు. చారిత్రక కోటలు, స్మారక కట్టడాల సంరక్షణపై నిరంతర చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆమె కృషిని గుర్తిస్తూ సర్కారు అకాడమీ సభ్యురాలిగా అవకాశం కల్పించింది. పద్మజను ఉప కులపతి ఆచార్య శివానంద, రిజిస్ట్రార్ చెన్నప్ప, మూల్యాంకన రిజిస్ట్రార్ జ్యోతి ప్రకాశ్, విద్యార్థి సంక్షేమ అధికారి బిరాదార్ తదితరులు అభినందించారు.

అప్పకు మరోసారి సమన్లు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: పోక్సో కేసులో స్వయంగా విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఒకటో ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అప్పతో పాటు వైవం అరుణ్, రుద్రేశ్ మరుళ సిద్దయ్య, జి.మరిస్వామికి సమన్లు జారీ అయ్యాయి. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఇప్పటి వరకు ఉన్న స్టేను ఉన్నత న్యాయస్థానం ఇప్పటికే తొలగించింది. ఈ నేపథ్యంలో డిసెంబరు 2న విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం సమన్లు జారీ చేసిందని ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది అశోక్ నాయక తెలిపారు.

అధర పోతున్న కూరగాయలు

మార్కెట్లో భగ్గుమంటున్న సరకు

ఉస్మానియా మార్కెట్

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక ఉస్మానియా మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీపావళి తర్వాత రెండు వారాలు ధరలు అందుబాటులో ఉండేవి. కొన్ని రోజులుగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనే పరిస్థితి మాత్రం లేదు. అమాంతంగా పెరిగిన ధరలను చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. ప్రధాన విపణిలో ధరలు నిలకడగా ఉంటాయని భావించి అత్యధిక మంది ఉస్మానియా మార్కెట్ వైపు మొగ్గు చూపుతారు. ఇబ్బడిముబ్బడిగా ధరలు పెరగడంతో అన్ని రకాలను ఖరీదు చేయడం లేదు. ధర తక్కువగా ఉన్న కూరగాయల్నే ఎక్కువ మొత్తంలో కొంటున్నారు. కిలో టమాటా (జవారి), టమాటా (హైబ్రీడ్) రూ.35, రూ.40 చొప్పున, కిలో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ రూ.30 చొప్పున కొనేలా ఉన్నాయి. ధరల ప్రభావంతో గత 15 రోజులుగా జనం పలుచగా కన్పిస్తున్నారు. గిరాకీ లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వాహనాల్లో విక్రయిస్తున్న ఉల్లి రూ.20కే లభిస్తోంది.

మిగిలిన రకాలు..

వంకాయ, బెండకాయ, కాకర, బీర, బీట్‌రూట్, దొండకాయ, చిక్కుడు రూ.50కు అమ్ముతున్నారు. క్యారెట్, క్యాప్సికమ్, మిరప రూ.60 పైగా విక్రయిస్తున్నారు. బీన్స్ కిలో రూ.80 చెల్లించాలి. ఉస్మానియాలో ధరల జాబితా ఉండదు. దీంతో ఒక్కో వ్యాపారి ఒక్కో రేటు చెబుతున్నారు. కొన్ని రకాలు మాల్‌లో కంటే అధిక ధర ఉంటోంది.

డిసెంబరు రెండో వారంలో తగ్గుదల

అతివృష్టి, తుపాను కారణంగా పంటలను నష్టపోవడం, దిగుబడులు పతనమైనందున పెరుగుతోంది ముఖ్య కారణం. డిసెంబరు రెండోవారంలో కొత్త పంట మార్కెట్‌కు రావడం మొదలవుతుంది. అప్పటి నుంచి తగ్గుముఖం పడతాయి. రాష్ట్రంలోని బెళగావి, చిక్కబళ్లాపూరు, కోలారులో తప్పా మిగిలిన అన్ని జిల్లాల్లో పెరిగాయి. -ఎన్.మహావీర(వ్యాపారుల క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు)

ఈడిగల సమస్యలపై రాజధానికి పాదయాత్ర

ప్రణవానంద స్వామి

రాయచూరు, న్యూస్‌టుడే: 'ఈడిగ సామాజిక వర్గాన్ని ఎస్టీ (దళిత గిరిజన)లో చేర్చేలా కేంద్రానికి సిఫార్సు చేయాలి. నారాయణగురు అభివృద్ధి నిగమకు రూ.500 కోట్లు కేటాయించాలి. కాంగ్రెస్‌లోని ఈడిగ నాయకులకు రాజకీయ పదవులు ఇవ్వాలని' నారాయణ గురు శక్తి పీఠం పీఠాధిపతి ప్రణవానంద స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్.శ్రీనాథ్‌తో కలిసి పత్రికా భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన వర్గాల్లో అన్ని కులాలకు న్యాయం చేసినప్పుడే సామాజిక న్యాయం నినాదానికి సార్థకత చేకూరగలదన్నారు. గత భాజపా ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ హయంలో ఈడిగలకు అన్ని విధాల అన్యాయం జరిగిందని ఆరోపించారు. అన్ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనవరి 6న కలబురగి జిల్లా చిత్తాపూరలోని కరదాళ గ్రామం నుంచి బెంగళూరుకు పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థుల వీధి నాటకాలు

సింధనూరు: సింధనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ బృందం, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం పలు రద్దీ ప్రదేశాల్లో వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. స్థానిక ప్రయాణ ప్రాంగణం, ఏపీఎంసీ, మార్కెట్, మినీ విధాన సౌధ ప్రాంతాల్లో ఈ నాటకాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తొలుత డిగ్రీ కళాశాల ప్రాచార్యుడు పాండు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆరోగ్యబృందం ప్లకార్డులతో నినాదాలు చేసుకుంటూ ప్రయాణ ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మల్లప్ప బంగారుశెట్టి, హనుమంతప్ప, అమరేశ్, ఓంప్రసాద్, అధ్యాపకులు వైద్యనాథ్, సిద్ధరామరెడ్డి, డా.అనిల్‌కుమార్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ పద్ధతుల్లో పత్తిసాగు

పత్తి చేలో క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

మాన్వి, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయాన్ని మూసపద్ధతిలో కాకుండా సమగ్ర పద్ధతులను పాటించటం ద్వారా లాభపడొచ్చని రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం సంచాలకుడు డాక్టర్ తిమ్మణ్ణ పేర్కొన్నారు. కురిడి గ్రామంలో రైతు వెంకట రెడ్డి పత్తి చేలో క్షేత్రోత్సవాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తిమ్మణ్ణ మాట్లాడుతూ తక్కువ సాంద్రతతో, 120 రోజుల్లో రెండు సార్లు పత్తిని తీసే నూతన వంగడాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతు వెంకటరెడ్డి తక్కువ పెట్టుబడులతో ఎకరాకు 18 క్వింటాళ్ల పత్తి దిగుబడిని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఉమేశ్, డాక్టర్ అస్సన్, కురిడి రైతు సంపర్క కేంద్రం అధికారి ఫయాజ్ జలాల్ రైతు ప్రముఖులు పాల్గొన్నారు.

మస్కి నగర ప్రాధికార అధ్యక్షుడిగా సిద్ధనగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు మాదిరిగానే మస్కి నగర యోజనా ప్రాధికార అధ్యక్ష పదవి ఎమ్మెల్యే ఇంటివారికే దక్కింది. మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ తమ్ముడు సిద్ధనగౌడను మస్కి నగర యోజనా ప్రాధికార అధ్యక్ష పదవి వరించింది. బెంగళూరులో బుధవారం ఆయన మంత్రి భైరతి సురేశ్ చేతుల మీదుగా ఆదేశ పత్రం అందుకున్నారు. కేపీసీసీ సభ్యుడు నల్ల వెంకటేశ్వరరావు కూడా ఆయన వెంట ఉన్నారు. ఆర్.బసనగౌడ అనుయాయులు ఆనందంతో మంత్రికి మిఠాయిలు అందించగా వాటిని మంత్రి సిద్ధనగౌడకు తినిపించి ఆనందం పంచుకున్నారు. రెండు రోజుల్లో మస్కిలో సిద్ధనగౌడ ప్రాధికార అధ్యక్ష పదవిని చేపట్టనున్నారు.

బెంగళూరులో సిద్ధనగౌడకు ఆదేశపత్రం ఇచ్చి మిఠాయి తినిపిస్తున్న పట్టణాభివృద్ధి మంత్రి భైరతి సురేశ్

భారత కీర్తిని రెపరెపలాడించిన ఇందిర

నివాళులు అర్పిస్తున్న నాయకులు

రాయచూరు, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతిని బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ సమితి అధ్యక్షుడు బసవరాజ పాటిల్ ఇటగి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నాయకులతో కలసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇటగి ప్రసంగిస్తూ ప్రధానిగా ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన గరీబీ హఠావో, వృద్ధాప్య పింఛన్, పక్కా ఇళ్లు, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, ఇతర సంక్షేమ పథకాలను ఇప్పటికీ ప్రజలు ప్రశంసిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఏ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు కురుబదొడ్డి ఆంజనేయ, తాయణ్ణ నాయక్, అస్లాం పాషా, శంకర కల్లూరు, శివమూర్తి, అమరేగౌడ హంచినాళ, ఎన్.శ్రీనివాసరెడ్డి, వి.ఎస్.యల్లప్ప పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమాజ హితం కోరాలి

సింధనూరు, న్యూస్‌టుడే: మనిషి జన్మ మహత్తరమైంది.. దాన్ని సార్థకం చేసుకునే ప్రయత్నం చేయాలి, మన యోగ క్షేమాలు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ సమాజ హితమూ కోరుతూ జీవించాలని మస్కి ఎమ్మెల్యే ఆర్.బసనగౌడ పిలుపునిచ్చారు. రాజ్యోత్సవ పురస్కారం అందుకున్న సింధనూరు వనసిరి ఫౌండేషన్ సంస్థ సింధనూరు తాలూకా సివారు గ్రామం ఉమ్లుట్టి లోని మొరార్జీ వసతి పాఠశాల ప్రాంగణంలో బుధవారం పద్మశ్రీ సాలుమరద తిమ్మక్క జ్ఞాపకార్థం పెద్దఎత్తున వనమహోత్సవం ఆచరించింది. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన తన చేతులతో పలు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం అటవీశాఖ అధికారులు, వనసిరి సంస్థ ప్రతినిధులు వరుసగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మశ్రీ వంటి ఉన్నతమైన పురస్కారాన్ని అందుకోవడం సామాన్య విషయం కాదు. సాలుమరద తిమ్మక్క తన జీవితాన్ని ధారపోసి ప్రజాక్షేమం కోసం పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమానికి వనసిరి ఫౌండేషన్ అధ్యక్షుడు అమరేగౌడ మల్లాపూరు అధ్యక్షత వహించారు.

మొక్క నాటి నీరు పోస్తున్న మస్కి ఎమ్మెల్యే బసనగౌడ

పిలికుళ.. చెరగని ప్రకృతి కళ!

పిలికుళ మృగాలయంలో ఆకట్టుకునే తటాకం

ఆ నగరం.. నయన మనోహరం. సముద్ర తీరంలో విరాజిల్లే మంగళూరుకు తూర్పు వైపున మహా పడమటి కనుమలు విస్తరించి చక్కని అందాలను తెచ్చిపెట్టాయి. ఆ అందాల కోనకు దిగువగా విస్తరించి.. పర్యాటకులను మరో లోకంలోకి తీసుకువెళ్లే కేంద్రమే.. పిలికుళ!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దేశంలో పర్యావరణ వైభవానికి నిలువెత్తు దర్పణంగా మంగళూరు పిలికుళ జీవ ఉద్యానవనం- మృగాలయం విరాజిల్లుతోంది. దీని నిర్వహణ బాధ్యతలను అటవీ శాఖ చేపట్టడంతో పచ్చందాలకు పెట్టని కోటగానూ మారిపోయింది. నిజానికి దీని ఆలనా, పాలన 'పిలికుళ జైవిక ఉద్యానవన ప్రాధికార' చూస్తున్నా.. అభివృద్ధి వ్యవహారాలకు అటవీ శాఖ అండగా నిలిచిందని ప్రాధికార సంచాలకుడు జయప్రకాశ్ భండారి తెలిపారు. దేశంలోని అతి పెద్ద మృగాలయాల్లో ఇదీ ఒకటిగా పేరొందగా.. మొత్తం 500 ఎకరాల్లో విస్తరించి, పర్యాటకుడు ఎంత తిరిగినా తరగనంతగా రూపుదాల్చింది. పడమటి కనుమల దిగువన- మంగళూరు దిశగా ఈ వనసీమ పాదుకుంది. ఎన్నో రకాల వృక్షరాజాలు, ఆయుర్వేద వనమూలికల మొక్కలు, విశాలమైన చెరువులో జలచరాలు, అందులో పడవ విహారం, వివిధ విభాగాల్లో సింహాలు, సింగాలు, పులులు, తెల్ల పులి, జింకలు, అనేకరకాల పాములు, మొసళ్లు, జిరాఫీ, ఏనుగులు.. ఇలా ఎన్నెన్నో చూడొచ్చు. మొత్తం 1,440 వన్య జీవులను ప్రత్యేకంగా పోషిస్తున్నారు. వీటి కోసం నెలకు రూ.30 లక్షలు ఖర్చు చేయాలి. ఏడాదికి రూ.3.60 కోట్లు ఖర్చు వస్తుండగా.. టికెట్ కౌంటర్ల నుంచి రూ.3 కోట్లు సమకూరుతోంది. నిధుల కొరత ఏర్పడకుండా దాతలు ముందుకొచ్చారు. ఎంఆర్‌పీఎల్, కుద్రేముఖ్ గనుల సంస్థ, రిలయన్స్ యజమానులు నిధులు సమకూర్చడంతో నిర్వహణ సులువవుతోంది. పలువురు ప్రముఖులు వన్యజీవులను దత్తత తీసుకుని సాయం చేస్తున్నారు. తీర ప్రాంత పర్యాటకానికి వెళ్లేవారెవరైనా.. తప్పనిసరి మజిలీల జాబితాలో పిలికుళ ఉండాల్సిందే!

అరుదైన ఆకుపచ్చ పక్షి

మంగళూరు వాసులను మురిపించే తెల్ల పులి

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు తాము పెద్ద పీట వేస్తున్నామని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్రాధ్యక్షుడు పీఎం నరేంద్రస్వామి పేర్కొన్నారు. గత ఐదు దశాబ్దాలుగా సుస్థిర ప్రగతికి, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, నగర సంస్థలు, పౌరులు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో పరిస్థితులను మరింత చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 'లౌకికవాద ఆర్థిక వ్యవస్థ, స్థిరత్వం' అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాలను మంత్రి ఈశ్వర ఖండ్రే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, జస్టిస్ సుభాష్ బి.ఆది, ఎమ్మెల్సీ దినేశ్ గూళిగౌడ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యర్థాలను సంస్కరించడం ద్వారా ఇంధన ఉత్పాదనతో పాటు, ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవచ్చని వివరించారు. కర్ణాటకలో ప్లాస్టిక్ వ్యర్థాలను సంస్కరించేందుకు 1407, ఈ-వ్యర్థాల కోసం 1063, బ్యాటరీలను సంస్కరించేందుకు 11 కేంద్రాలు ఉన్నాయని గుర్తు చేశారు. కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా వాతావరణంలో పెను మార్పులు రాకుండా అడ్డుకోవచ్చని చెప్పారు. మండలి ప్రతినిధులు శరణ కుమార మోది, శ్రీనివాసులు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

19-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1624.21	1630.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	2,654	4,076
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,205	6,929
నీటి నిల్వ (టి.ఎం.సి)	73.939	97.181

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

యోధుని స్మరణార్థం రూపొందించిన కార్డును ప్రదర్శిస్తున్న మహిళ. చిత్రంలో మంత్రి ఈశ్వర ఖండ్రే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు

కన్నడ భాషాభివృద్ధికి ప్రతిన

మాన్వి,న్యూస్‌టుడే: రాష్ట్రంలోని భాష, సంస్కృతి ప్రతి ఒక్కరూ ప్రతిన భూనాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సిద్ధలింగప్ప కొట్నేకల్ పేర్కొన్నారు. స్థానిక సర్వోదయ పీయూ కళాశాలలో కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా, తాలూకా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దత్తి ఉపన్యాసం, సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నివసించే అందరూ కన్నడిగులేనన్నారు. పురపాలక సంఘం ప్రతిపక్ష నాయకుడు రాజా మహేంద్రనాయక్, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సంగమేశ్ ముదోళ్ ఉపన్యసించారు. పాత్రికేయ సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన వారిని, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను వేదికపై ఘనంగా సత్కరించారు. కసాప అధ్యక్షుడు శరణబసవ నీర్‌మాన్వి, సర్వోదయ శిక్షణ సంస్థ అధ్యక్షుడు మనోజ్‌మిశ్రా, కరవే అధ్యక్షుడు డి.బసనగౌడ, ప్రిన్సిపల్ రేణుక, ఉపన్యాసకురాలు శ్రావణి, మూకప్ప కట్టిమని, లక్ష్మణజానేకల్, రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిద్ధలింగప్ప కొట్నేకల్

పొగాకు సేవించొద్దని హితవు

రాయచూరు, న్యూస్‌టుడే: ఆరోగ్యానికి హాని చేసే పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలను సేవించవద్దని స్థానిక సియాతలాబ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి గుండమ్మ విద్యార్థులకు సూచించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పొగాకు వల్ల కల్గే అనర్థాలపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వైద్యులు మాట్లాడుతూ పొగాకు తాగడం, నమలడం వల్ల శ్వాసకోశ, క్యాన్సర్, హృద్రోగాల బారిన పడుతున్నారని, దంత సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్ప ప్రసంగిస్తూ పొగాకులోని రసాయనాలు శరీరంలోని అన్ని అవయవాలను పాడు చేస్తాయని వెల్లడించారు. పొగాకుకు దూరంగా ఉంటామని అధ్యాపకుడు గోవర్ధనరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ రవీంద్ర, ఆరోగ్య శిక్షణ ఉప అధికారి బసయ్య, క్షేత్ర ఆరోగ్య శిక్షణాధికారి సరోజా, అధ్యాపకులు మల్లమ్మ మేటి, మహబూబ్, వెంకనగౌడ హాజరయ్యారు.

ప్రసంగిస్తున్న డాక్టర్ గుండమ్మ

వాల్మీకి విగ్రహం తొలగించరాదని ధర్నా

మాన్వి,న్యూస్‌టుటే: సాథ్ మైల్ నుంచి సింధనూరు వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలో కూడా పనులు ప్రారంభమైయ్యాయి. ఈ క్రమంలో వాల్మీకి కూడలి వద్ద విగ్రహం తొలగించాల్సి ఉంటుందని హైవే అధికారులు చెప్పడంతో ప్రజలు ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే హంపయ్య నాయక్ వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. కూడలి చుట్టుకొలతలు తీసుకుని మధ్యలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కన ఎవరైనా రహదారి స్థలంలో నిర్మాణాలు చేసి ఉంటే వాటిని తొలగించాలని ఆయన పురపాలక సంఘ అధికారులకు సూచించారు. అదే విధంగా బసవ కూడలి, అంబేడ్కర్ కూడలి వద్ద కూడా స్థల లభ్యతను బట్టి విగ్రహాలను నెలకొల్పాలని తెలిపారు. ఆదివారం మంత్రి ఎన్.ఎస్.బోసురాజు తాలూకా కేంద్రంలో అందుబాటులో ఉంటారని సమస్యను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లి విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కర్ణాటక రాష్ట్ర రోడ్డు అభివృద్ధి నిగమం బళ్లారి వలయం అధికారి మురళీధర్, పురపాలక సంఘం ముఖ్యాధికారి పరశురామ్ దేవమానే, ప్రజాపనుల శాఖ అధికారి మక్సూద్, వివేక్, పీఐ సోమశేఖర్ ఎస్.కెంచరెడ్డి, యువ జనతాదళ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు రాజా రామచంద్ర నాయక్, పికార్డు బ్యాంకు అధ్యక్షుడు రాజా సుభాశ్చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్, హైవే అధికారులు

21, 22 తేదీల్లో దళ్ రజతోత్సవ వేడుకలు

రాయచూరు, న్యూస్‌టుడే: జనతాదళ్(ఎస్) ఆవిర్భావ రజతోత్సవ వేడుకలను ఈ నెల 21, 22 తేదీల్లో బెంగళూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు విరూపాక్షి వెల్లడించారు. ఆయన బుధవారం పత్రికా భవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కన్నడిగుల ఆత్మాభిమానికి ప్రతీకగా స్థాపించిన దళ్ అనేక ఆటుపోట్లను తట్టుకుని నిలబడిందని, రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నట్లు వివరించారు. తొలి రోజు సాయంత్రం 4.30 గంటలకు పతాకావిష్కరణ చేస్తారని, పాతికేళ్లలో సాధించిన విజయాలపై ఛాయా చిత్రాల, వీడియోల రూపంలో ప్రదర్శన 5 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జరిగే పార్టీ సమావేశంలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు జరిగే రాష్ట్ర, జాతీయ పరిషత్ మహా సమావేశానికి ముఖ్యులు. కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. డిసెంబరు 15 తర్వాత జిల్లాల్లో రజతోత్సవ సంబరాలు చేసుకోనున్నట్లు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంతేశ్ పాటిల్, దళపతులు శివశంకర్, సణ్ణ నరసింహనాయక్, లక్ష్మీపతి గాణదాళ, నరసప్ప ఆశాపూరు, రామకృష్ణ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న విరూపాక్షి

మేకెదాటు నివేదిక సిద్ధం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : కావేరి నదిపై 'మేకెదాటు' జలాశయ నిర్మాణానికి కొత్తగా డీపీఆర్‌ను (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) దాఖలు చేశామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలతో డీపీఆర్‌ను మరోసారి రూపొందించి, కేంద్రానికి అందించామని వెల్లడించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు, కావేరి నీరావరి నిగమ డైరెక్టర్ల మండలి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అయ్యే ఖర్చు, ముంపునకు గురయ్యే అటవీ భూమి ఇతర వివరాలను డీపీఆర్‌లో పొందుపరిచామని వెల్లడించారు. హారోబెలె వద్ద ఇప్పటికే మేకెదాటు ప్రాజెక్టు నిర్వహణ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. బెంగళూరు దక్షిణ జిల్లా రామనగరలో సీఈ, సీసీఎఫ్‌లకు ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించి, వారికి అవసరమైన సిబ్బందిని సమకూర్చుతామని వెల్లడించారు. తుమకూరు వరకు మెట్రో విస్తరణకు సంబంధించి అధ్యయన నివేదిక వచ్చిన అనంతరం దానిపై నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి దిల్లీకి వెళ్లే ఆలోచన తన ముందు లేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

(c) eenadu

డిసెంబరు 25 నుంచి మండీలు

బరగఢ్‌లో విక్రయానికి సిద్ధంగా ధాన్యం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డిసెంబరు 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మండీలు తెరుచుకుంటాయని, ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని సహకార శాఖ మంత్రి ప్రదీప్ బలసామంత్ చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులందరి నుంచి ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. మండీలు ఖాళీ చేయించాలని మిల్లర్లను ఆదేశించినట్లు తెలిపారు. మండీల కొరత నివారణకు 100 మోడల్ మండీల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించిందని, ప్రస్తుతానికి 32 టెండర్లు ఖరారయ్యాయని, ఇందుకోసం రూ.300 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ పంట ప్రతి గింజ తీసుకుంటామని, మండీల్లో అవినీతి, అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

22న బంగాళాఖాతంలో

అల్పపీడనం

24న వాయుగుండంగా మారే అవకాశం

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: ఈ నెల 22న (శనివారం) దక్షిణ, తూర్పు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, 24 నాటికిది వాయుగుండంగా మారే అవకాశం ఉందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి ఉమాశంకర్‌దాస్ బుధవారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ అల్పపీడనం కేంద్ర బంగాళాఖాతంలో దిశ మార్చుకుని దక్షిణ, తూర్పు తీరానికి చేరువయ్యే సూచనలున్నాయని తెలిపారు. ఈ విపత్తు ప్రభావం 24 నుంచి రాష్ట్రంపై ఉంటుందన్న అంచనా ఉందని, అధ్యయనం జరుగుతోందని చెప్పారు.

సిమిలిగుడలో 7.1 డిగ్రీలు: రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత కొనసాగుతోందని బుధవారం సిమిలిగుడలో అత్యల్ప ఉష్ణోగ్రత 7.1 డిగ్రీలుగా నమోదు కాగా, జి.ఉదయగిరిలో 7.7, దారింగబాడిలో 8.5, ఫుల్బాణిలో 9 డిగ్రీలుగా ఉందని, మిగతా కేంద్రాల్లో 11 నుంచి 17 డిగ్రీలుగా నమోదైందన్నారు. గురువారం (20న) రవుర్కెలా, భవానీపాట్నా, కొరాపుట్‌లలో మంచు కురిసే సూచనలున్నందున 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు.

ఒడియా ప్రముఖ గాయకుడు హ్యూమన్ సాగర్ మృతికి నివాళులర్పిస్తూ బ్రహ్మపురం చెందిన కళాకారుడు సత్యనారాయణ మహారణా బుధవారం సైకత యానిమేషన్ తీర్చిదిద్ది, ఆ మధుర గాయకుడికి నివాళులర్పించారు. -న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

సీఎంను కలిసిన విదేశీ పార్లమెంటరీ బృందం

భువనేశ్వర్ వచ్చిన 12 దేశాలకు చెందిన 40 మంది ప్రజా ప్రతినిధులు బుధవారం సాయంత్రం లోక్‌సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని కలిశారు. వివిధ అంశాలపై మాట్లాడారు. అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో లోక్‌సేవాభవన్ అధికారులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, భువనేశ్వర్

పార్లమెంటరీ ప్రతినిధులతో సీఎం మోహన్‌చరణ్ మాఝి ముచ్చట్లు

రవుర్కెలా ఉక్కు విస్తరణ

మోహన్, కుమారస్వామి చర్చలు

రవుర్కెలా ఉక్కు కర్మాగారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక రవుర్కెలా ఉక్కు కర్మాగారం విస్తరణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. బుధవారం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి రవుర్కెలా ఉక్కు కర్మాగారాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. అన్ని యూనిట్లు పరిశీలించారు. తర్వాత భువనేశ్వర్ వచ్చిన కేంద్రమంత్రి లోక్‌సేవాభవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝితో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం రవుర్కెలా ఉక్కు కర్మాగారం ఏడాదికి 4.5 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తోంది. దీన్ని 9.5 మిలియన్ టన్నులకు పెంచాలని నిర్ణయించారు.

పూర్తి సహాయ సహకారాలు

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న రవుర్కెలా ఉక్కు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని సీఎం కేంద్ర మంత్రికి చెప్పారు. ఆధునికీకరణ, విస్తరణ పనులకు స్థల సేకరణ కీలకం. ఇది త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని మోహన్ చెప్పారు.

కుమారస్వామిని స్వాగతిస్తున్న మోహన్‌చరణ్ మాఝి

ఉక్కు ఆసుపత్రిని ప్రైవేటీకరించవద్దు

రవుర్కెలా ఉక్కు ఆసుపత్రి (ఆర్‌జీహెచ్) ప్రైవేటీకరణ చేయవద్దని, బిర్మిత్రపుర విమానాశ్రయం విస్తరణ పనులు జరుగుతాయని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి చెప్పారు. బుధవారం సాయంత్రం లోక్‌సేవా భవన్‌లో తొలుత ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝితో కేంద్రమంత్రి ముఖాముఖీ చర్చించారు. తర్వాత కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జోయల్ ఓరం భువనేశ్వర్ వచ్చారు. ఇద్దరు కేంద్రమంత్రులు, అధికారులతో సీఎం చర్చలు జరిపిన తర్వాత కుమారస్వామి విలేకర్లతో మాట్లాడారు.

కోణార్క్ నృత్యోత్సవాలకు సన్నాహాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ కోణార్క్ నృత్యోత్సవాలకు సన్నాహాలు మొదలయ్యాయి. డిసెంబరు 1 నుంచి 5 వరకు ఉత్సవాలు జరగనుండగా, పూరీ జిల్లా యంత్రాంగం, పర్యాటక శాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతిసారి మాదిరిగా ఈసారీ ఒడిస్సీ, కథక్, కూచిపూడి, కథాకళి, భరత నాట్యాలు ప్రదర్శితమవుతాయి. కోణార్క్ శిల్పకళారామం వేదికగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిగాంచిన కళాకారులు తమ అభినయంతో సందర్శకులను సమ్మోహనం చేయనున్నారు. ఇక్కడ అంతర్జాతీయ సైకతశిల్ప ప్రదర్శన ఏర్పాటవుతుంది. విదేశాలకు చెందిన శిల్పులూ వస్తున్నారు. పర్యాటక శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ స్వయంగా సమీక్షిస్తున్నారు. దీనికి సంబంధించి బుధవారం పూరీ కలెక్టరేట్‌లో పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ అధ్యక్షతన అధికారులంతా సమావేశమయ్యారు. ఉత్సవాలు వీక్షించడానికి విదేశీయులు పెద్దసంఖ్యలో వస్తారు. సందర్శకులకు అతిథ్యమివ్వడానికి పంథనివాస్, ఇతర హోటళ్లతోపాటు పూరీ, భువనేశ్వర్‌లలో విడిది కల్పించాలని నిర్ణయమైంది. పూరీ ఎస్పీ ప్రతీక్‌సింగ్ బుధవారం కోణార్క్ వెళ్లి పరిస్థితి సమీక్షించారు.

శిల్ప కళారామంలో పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతీక్‌సింగ్, ఇతర పోలీసు అధికారులు

పాముకాటు పరిహారం రూ.10 లక్షలు

కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్న సురేష్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పాముకాట్లతో మృతి చెందుతున్నవారి కుటుంబ సభ్యులకు పరిహారంగా రూ.4 లక్షలు చెల్లిస్తుండగా, దీన్ని రూ.10 లక్షలకు పెంచాలని కేంద్రానికి తెలియపరిచినట్లు రెవెన్యూ, విపత్తు నివారణ శాఖల మంత్రి **సురేష్ పూజారి** చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు పరిహారం పెంచాలని సూచించిందని, దీనిపై ఇతర రాష్ట్ర ప్రభుత్వాలూ స్పందించాయన్నారు. జల సమాధి, పిడుగుపాట్లలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షలుగా చెల్లిస్తున్న సాయం రూ.10 లక్షలకు పెంచాలన్న ధ్యేయంతో ఉన్నామన్నారు. ఎక్కువ పరిధి ఉన్న తహసీల్దార్ కార్యాలయాలను విభజించి ఈ కార్యాలయాల సంఖ్య పెంచాలని నిర్ణయించామన్నారు. పట్టణాలు, గ్రామాలకు వేర్వేరు తహసీల్దారు కార్యాలయాలు ఉండాలన్న నిర్ణయం తీసుకున్నామని, ప్రస్తుతానికి భువనేశ్వర్, కటక్, సంబల్‌పూర్ నగరాల్లో అమలుపరుస్తామన్నారు. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్.ఐ.) ఉన్నందున పనిభారం పెరుగుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రెండేసి పంచాయతీలకు ఒక ఆర్.ఐ. కార్యాలయం ప్రారంభించాలని భావిస్తున్నామని, దశలవారీగా అమలుపరుస్తామని చెప్పారు.

పందుల దాడి... అన్నదాతల అలజడి

పంట రక్షణకు ఇక్కట్లు

పొలాల్లో రాత్రి కాపలాకు బయలుదేరిన రైతులు

పంటపొలంలో అలికిడి వచ్చిన వైపు లైటు వేసి చూస్తున్న రైతు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: చుట్టూ చిమ్మచీకటి.. వణికిస్తున్న చలి.. పైగా మంచు... ఎప్పుడు.. ఏవైపు నుంచి వన్యప్రాణులు దాడి చేస్తాయోనన్న భయం.. పొలాల్లో అలికిడి వచ్చిన వైపు లైట్లు వేస్తూ.. బ్యాటరీతో నడిచే మైక్‌లో రకరకాల శబ్దాలు చేస్తూ రాత్రుళ్లు పంటపొలాల్లో రైతులు కాపలా కాస్తున్నారు. ఇవి గంజాం జిల్లా ఛత్రపురం సమితిలోని అగస్తినువాగావ్ పంచాయతీలో రాత్రిపూట దృశ్యాలు.

రాత్రంతా పొలాల్లోనే...

అగస్తి నువాగావ్ పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంటను సమీపంలోని అడవుల నుంచి వస్తున్న పందులు నాశనం చేస్తున్నాయి. అవి తినే పంటకన్నా, తొక్కి పాడు చేస్తున్నదే ఎక్కువగా ఉంటోంది. దీంతో పంచాయతీలోని గ్రామాల రైతులు పంటల్ని కాపాడుకునేందుకు నడుం బిగించారు. ప్రతిరోజు రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకూ పొలాల్లో కాపలా కాస్తున్నారు. పొలాల్లో మంచెలపై కూర్చుని, శబ్దాలు వచ్చినవైపు లైట్లు వేస్తూ, మైక్‌లో వివిధ రకాల జంతువుల అరుపులు, ఇతర శబ్దాలు వినిపిస్తున్నారు. 'పిల్ల అడవి పందులు ఈ శబ్దాలకు తిరిగి అడవుల్లోకి పారిపోతున్నాయి. పెద్దవి మాపై దాడి చేసేందుకు మీదకు వస్తున్నాయి' అని అగస్తి నువాగావ్‌కు చెందిన రైతులు పూర్ణ గౌడ, జటియా నాహక్, భాస్కర నాహక్, బిజయ జెనాలు విలేకరులకు చెప్పారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, మిగిలిన పంటల్ని అడవి పందులు నాశనం చేస్తున్నాయని వారు వాపోయారు. వన్యప్రాణులు దాడి చేస్తాయన్న భయం ఒకవైపు, గజగజలాడిస్తున్న చలి మరోవైపు బాధిస్తున్నా.. పంటల్ని కాపాడుకునేందుకు సామూహికంగా పొలాల్లో రాత్రి కాపలా కాస్తున్నామని వారు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొలంలో బ్యాటరీతో నడిచే మైక్ సెట్ ద్వారా శబ్దాలు వినిపిస్తూ...

శ్రీక్షేత్రం దేదీప్యమానం

మూడురోజుల దేవ దీపావళి వేడుకలు ప్రారంభం

గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రం బుధవారం సాయంత్రం దేదీప్యంగా విరాజిల్లింది. మార్గశిర మాసం బహుళపక్షమి చతుర్దశి తిథిని పురస్కరించుకుని మూడు రోజుల (శుక్రవారం వరకు) దేవ దీపావళి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శ్రీక్షేత్రం (బొడొదండొ) నుంచి గుండిచాదేవి ఆలయం వరకు లక్షలాది దీపాల కాంతులతో తూర్పుతీర పుణ్యధామం మెరిసింది. జగన్నాథ నామస్మరణతో స్వామి సన్నిధి ప్రతిధ్వనించింది.

అలంకరణలో జగన్నాథుడు

శ్రాద్ధ అవతారంలో పురుషోత్తముడు

కార్తిక అమావాస్య పర్వదినాన ప్రజలు దీపావళి పండగ జరుపుకొని దివంగతులకు (పితృదేవతలు) దివిటీలు వెలిగిస్తారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు పురుషోత్తముడు సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రలతో కలిసి మార్గశిర బహుళ పక్షమి చతుర్దశి నుంచి శుక్ల పక్షమి పాడ్యమి (3 రోజులు) వరకు తమ పితృదేవతలు అదితి, దశరథ, కౌసల్య, దేవకి, వసుదేవులు, యశోద నందులకు పిండ ప్రదానాలు చేసి దీపాలు వెలిగిస్తారు. త్రేతాయుగం, ద్వాపరం నాటి పితృదేవతలకు ఈ వేడుకలు చేపట్టడం ఆనవాయితీ. ఇది పూరీలో పెద్ద పండగ. పురుషోత్తముడు శ్రాద్ధ అవతారంలో పూర్వీకులకు సంతర్పణలిస్తాడు. ఈ నేపథ్యంలో శ్రీక్షేత్రంలో ఉదయం నుంచి సేవాయత్‌లు ముగ్గురు మూర్తుల పేరిట సేవలు చేపట్టారు. సాయంత్రం పూరీ వాసులు, భక్తులు దీపాలు వెలిగించి ప్రార్థనలు చేశారు.



బొడొదండొలో దీప కాంతులు

సెంచూరియన్ వర్సిటీలో జీఐఎస్ దినోత్సవం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఆర్.సీతాపురం గ్రామంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం 5వ అంతర్జాతీయ భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.ఎల్.నరసింహం, జిల్లా వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ పట్నాయక్, వర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు, ఛాన్సలర్ డాక్టర్ బిశ్వజిత్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు. సుస్థిర రేపటి కోసం జియోఏఐ, స్మార్ట్ మ్యాపింగ్ ద్వారా ఖనిజ అధ్యయనాల నుంచి వరద ప్రమాద అంచనా, వ్యాధి మ్యాపింగ్ తదితర అంశాల గురించి వివరించారు. 350 మందికి పైగా శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

భౌగోళిక పుస్తకాన్ని చూపిస్తున్న వర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు, అతిథులు

వలస కార్మికురాలిపై అత్యాచారం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడలో వలస కార్మికురాలు అత్యాచారానికి గురైంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దీపక్ నాయక్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొరాపుట్ జిల్లా లక్ష్మీపుర సమితికి చెందిన వలస కార్మిక దంపతులు పొరుగు రాష్ట్రంలో కూలిపనులు చేస్తూ జీవిస్తున్నారు. స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం రాత్రి రైలులో రాయగడకు వచ్చారు. చివరి బస్సు కూడా వెళ్లిపోవడంతో బస్టేండ్‌లోనే ఉండిపోయారు. అక్కడ స్వీపర్‌గా పనిచేస్తున్న దీపక్ నాయక్ వారి వద్దకు వచ్చి చలి ఎక్కువగా ఉంది రాత్రికి తన ఇంట్లో ఆశ్రయం ఇస్తాను రమ్మని వారికి చెప్పారు. ఆయన మాటలు నమ్మి దంపతులు వెళ్లేందుకు అంగీకరించారు. ముందుగా బాధితురాలి భర్తను తన ఇంటికి బైక్‌తో తీసుకెళ్లాడు. అనంతరం ఆమెను అదే బైక్‌తో కాలనీ సమీపంలో ఉన్న పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

సీఎం మోహన్

వేదికపై సీఎం మోహన్, ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, ఇతర అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి తమ ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు పరుస్తోందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. బుధవారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్రమోదీ తమిళనాడులోని కోయంబత్తూరు కేంద్రంగా రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.2 వేలు చొప్పున డీబీటీ మాధ్యమంలో బదిలీ చేశారు. ఈ కార్యక్రమం భువనేశ్వర్‌లోని లోక్ సేవా భవన్‌లో ప్రత్యక్ష ప్రసారం జరిగింది. సీఎం మోహన్, ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవిందపాఢి, రాష్ట్ర వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ) వీసీ ఆచార్య ప్రతాప్‌కుమార్ బిశ్వాల్ తదితర అధికారులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని 34.12 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు పీఎం కిసాన్ సొమ్ము జమయినట్లు చెప్పారు. కేవలం వరి సాగుకే అన్నదాతలు పరిమితం కాకుండా పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, పూలు, పళ్లు, తేనె, పత్తి తదితర ఉత్పత్తులు సాధించాలని, తద్వారా సమృద్ధ ఒడిశాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా 'ఆర్య వైశ్య అభయ హస్తం' (బ్రహ్మపుర) ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని మండపంలో బుధవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త ఆత్మకూరి అప్పల నరసయ్య శ్రేష్ఠి సహకారంతో నిర్వహించిన వ్రతాల్ని దేవస్థానం ప్రధాన అర్చకులు జరిపించారు.

వ్రతంలో పాల్గొన్న భక్తులు

రేవణ సిద్ధేశ్వరునికి 'అమరనాథ్' అవతారంతో అలంకరణ

శ్రీ సిద్ధేశ్వర స్వామికి అలంకరణ

బ్రహ్మపురలో మార్వాపేటలోని పురాతన రేవణ సిద్ధేశ్వరస్వామి మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి 'అమరనాథ్' అవతారంతో విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం మందిరం ఆవరణలో వందలాది మందికి అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలను మందిరం ప్రధాన అర్చకుడు బి. కిరణ్‌కుమార్ స్వామి ఇతరులు పర్యవేక్షించారు.

గొంతు తడవాలంటే కాళ్లు అరగాల్సిందే..

ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా తాగు నీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయంతో గ్రామాల్లో వసుధ పథకం ప్రవేశపెట్టారు. కానీ మారుమూల గ్రామాలకు నీటి ఎద్దడి తప్పడం లేదు. కొండ ప్రాంతాల్లో ఉన్న చిన్నచిన్న జోరన (జలపాతం) నుంచి నీటిని తీసుకొని తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇందుకోసం కి.మీ. దూరం నడిచి వెళుతున్నారు. రాయగడ జిల్లా కల్యాణ సింగుపూర్ సమితి కొరప పంచాయతీ లెలింగపాదర్‌వాసులదీ పరిస్థితి. దీనిపై అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఇప్పటికైనా తాగునీటి కష్టాలు తీర్చాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడామని, త్వరలోనే తాగునీరు అందజేస్తామని బీడీవో మానిసదాస్ అన్నారు. – న్యూస్‌టుడే, రాయగడ గ్రామీణం

సూర్యుడు అస్తమిస్తే.. వారిలో భయం ఉదయిస్తుంది

విద్యుత్తు వెలుగులకు నోచుకోని సువర్ణపూర్ గ్రామం

బ్రహ్మపుర నగరం న్యూస్‌టుడే

ఆ ఊళ్లో ప్రజలు సాయంత్రంలోగా వంటలు పూర్తి చేసుకుని, ఇళ్లల్లో తలుపులు బిగించుకుంటారు. రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడుపుతూ పగటి వెలుగుల కోసం ఎదురు చూస్తుంటారు. రాత్రివేళల్లో అత్యవసర పనులు పడితే వారి గుండెల్లో రాయి పడుతుంది. దశాబ్దాలుగా అంధకారంలో మగ్గుతున్న ఈ గ్రామస్థులు నేటికీ విద్యుత్తు వెలుగులకు నోచుకోలేదు. గంజాం జిల్లా ధారాకోట సమితిలో ఝూడబంధ పంచాయతీలోని మారుమూల సువర్ణపూర్ గ్రామం దీన స్థితి ఇది.

రాత్రి వేళ కట్టెలు కాల్చిన మంటల వెలుగులో గ్రామస్థులు

మూడు దశాబ్దాలుగా..

సుమారు మూడు దశాబ్దాల కిందట ఏర్పడిన సువర్ణపూర్ గ్రామంలో ముప్పై కుటుంబాలకు చెందిన 150 మంది ఉన్నారు. గ్రామానికి చెందిన ముప్పై మంది విద్యార్థులు సమీపంలోని సింగిపూర్‌కు చదువుకునేందుకు వెళ్లి వస్తుంటారు. వీరిలో పలువురు ప్లస్‌టు విద్యార్థులు కూడా ఉన్నారు. వీరు ఇళ్లల్లో కొవ్వొత్తుల వెలుగుల్లో చదువుకుంటూ నానా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కేంద్రం నుంచి సుమారు మూడు కి.మీ. దూరంలోని ఈ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం లేదు. సాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో గ్రామస్థులు మొక్కజొన్న తదితర పంటలు పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రాత్రుళ్లు వన్యప్రాణుల భయం వెంటాడుతోందని గ్రామస్థులు అర్పా గమాంగ్, సబాళ సబర, ఫగుణి గమాంగ్‌లు విలేకరులకు చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై పలు మార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ధారాకోట సమితి కార్యాలయంలో జిల్లా యంత్రాంగం నిర్వహించిన సంయుక్త వినతుల స్వీకరణ 'స్పందన'కు హాజరై వినతిపత్రాలు ఇచ్చామని గ్రామస్థులు పేర్కొన్నారు. అంధకారంలో మగ్గుతున్న సువర్ణపూర్ గ్రామంపై ఇటీవల ప్రసార మాధ్యమాల్లో వార్తలు రావడంతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్పందించారు. భువనేశ్వర్‌లోని లోక్ సేవా భవన్‌లో ఏర్పాటైన పాలనాధికారుల సదస్సులో ఈ విషయాన్ని ప్రస్తావించిన సీఎం మాఝి సువర్ణపూర్‌లో విద్యుత్తు వెలుగులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్‌కు ఆదేశించారు.

ధారాకోట సమితిలోని సువర్ణపూర్ గ్రామం

కొవ్వొత్తుల వెలుగులో చదువులు

(c) eenadu

పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరగాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీలో లోపాలుండరాదని, ఆహార నాణ్యత ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. బుధవారం ఉదయం భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో అంగన్‌వాడీల పనితీరు, పౌష్టికాహారం పంపిణీకి సంబంధించి మహిళా, శిశు సంక్షేమశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. పౌష్టికాహార సామగ్రి వివరాల సంచిక ఆవిష్కరించారు.

పౌష్టికాహార వివరాల సంచిక ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి

25 లక్షల మంది లక్షపతి దీదీలు... దీనికి ముందుగా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల ప్రగతికి సంబంధించి ఉపముఖ్యమంత్రి సమీక్షించారు. సంఘాల మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు కేటాయిస్తున్న నేపథ్యంలో 2,24,884 సంఘాలకు వడ్డీ చెల్లింపు కింద రూ.117.12 లక్షల కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 17 లక్షల మంది లక్షపతి దీదీలు కాగా, మార్చి నాటికి ఈ సంఖ్య 25 లక్షలకు పెరగాలన్నది ధ్యేయమని చెప్పారు. మిషన్ శక్తి సంచాలకులు మోనికా ప్రియదర్శిని, సహాయ కార్యదర్శి జ్యోతిశంకర్ మహాపాత్ర్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బాలబాలికలు, యువతీయువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, నిత్య సాధనతో పోటీల్లో పాల్గొంటూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్ అన్నారు. బ్రహ్మపుర పురపాలక సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మపుర లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ క్రీడోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడి నగరంలోని స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించిన ప్రారంభ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వీటిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ జేత్ మహోత్సవ్ ద్వారా మరెందరో ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి రావాలని, క్రీడారంగం అభివృద్ధి పరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రీడల్లో పతకాలు సాధిస్తున్న క్రీడాకారులకు ప్రభుత్వం నగదు పారితోషికాలందజేస్తోందని ఎమ్మెల్యే అనిల్ పేర్కొన్నారు. బీఈఎంసీ మేయర్ సంఘమిత్ర దొలాయి, ఉపకమిషనర్లు కల్యాణి సంఘమిత్ర, ఆశీర్వాద్ పండా, సిటీ ఇంజినీర్ మనోజ్ పండా, ఎంపీ ప్రతినిధి బాలకృష్ణ సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు ఎరీనాలో వాలీబాల్ మ్యాచులు, బ్యాడ్మింటన్, మహాత్మాగాంధీ క్రీడామైదానంలో క్రికెట్ మ్యాచులు జరిగాయి.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, చిత్రంలో మేయరు దొలాయి, ఎంపీ ప్రతినిధి సామంతరాయ్ తదితరులు

చట్టసభలు ఆదర్శ దేవాలయాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు ఆదర్శ దేవాలయాలుగా మన్ననలు అందుకుంటున్నాయని, ప్రజల గుండె చప్పుడుకు అద్దం పడుతున్నాయని శాసనసభాపతి సురమాపాఢి చెప్పారు. మంగళవారం సాయంత్రం భువనేశ్వర్‌లోని అసెంబ్లీకి 12 దేశాలకు చెందిన 40 మంది ప్రజాప్రతినిధులు వచ్చారు. వారిని స్వాగతించిన సభాపతి శాసన వ్యవస్థ, విలువల గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, రాజ్యసభ ఎంపీ సుజీత్‌కుమార్, అసెంబ్లీ అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందుగా శాసనసభ ఎదుట గ్రూపు ఫొటో దిగారు.

అసెంబ్లీ ఆవరణలో విదేశీ ప్రతినిధులతో సభాపతి సురమాపాఢి, మంత్రి మహాలింగ తదితరులు

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ వేదిక ఇడితాల్

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలను, కళలను పరిరక్షించుకుంటూ కళాకారులను ప్రోత్సాహించేందుకు నిర్వహించే సాంస్కృతిక ఇడితాల్ అని సబ్ కలెక్టర్ దిలీప్ అభిషేక్ అన్నారు. మంగళవారం గుణుపురంలో జరిగిన ఇడితాల్ సన్మాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పురాధ్యక్షురాలు మమత గౌడ, ఉపాధ్యక్షుడు శివప్రసాద్ గౌడ పాల్గొన్నారు. ● రామనగుడ సమితి పెకా గ్రామ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన సమితి స్థాయి విజ్ఞాన మేళాను దిలీప్ అభిషేక్ హాజరై మేళా ప్రారంభించారు.

వేదికపై మమత, అభిషేక్ తదితరులు

జిల్లా బాలుర ఫుట్‌బాల్ ఎంపిక శిబిరం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పాఠశాల క్రీడా సంఘం ఆధ్వర్యంలో జిల్లా పాఠశాలల బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక శిబిరం బుధవారం జరిగింది. స్థానిక కేసీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపికలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్-17 బాలురు పాల్గొన్నారు. వీరికి మ్యాచులు నిర్వహించి ఉత్తమ ఆట కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. శిక్షకులు అశుతోష్ ప్రధాన్, మోహిన్ ఖాన్, కైలాష్ శర్మ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఎంపికైన గంజాం జట్టు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు బొలంగిర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా వ్యాయామ విద్యాధికారి బీరేన్ స్వయిన్ ‘న్యూస్‌టుడే’కు చెప్పారు.

క్రీడాకారులను ఎంపిక చేస్తున్న శిక్షకులు

ఉత్తరాఖండ్‌లో దురువా నృత్య ప్రదర్శన

దురువా ఆదర్శ నాట్య అకాడమీ బృందం భువనేశ్వర్‌లో బిర్సాముండా జయంతి కార్యక్రమంలో దురువా సంప్రదాయ నృత్యం ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. వీరు కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి హల్దికుండ పంచాయతీకి చెందిన వారు. ఉత్తరాఖండ్, లఖ్‌నవూ, దిల్లీలో దురువా నృత్య ప్రదర్శనలు చేసి రాష్ట్ర ఖ్యాతిని పెంచారు. - న్యూస్‌టుడే, జయపురం

బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక వేడుకలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థానిక గిరిరోడ్డులోని బ్రహ్మకుమారీల శాంతికుండ్ ఆధ్వర్యంలో భారీ ఆధ్యాత్మిక వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్థానిక కళ్లికోట పబ్లిక్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ వక్త బ్రహ్మకుమారీ శివాని పాల్గొన్నారు. ఆమె ‘ఆధునిక ప్రపంచంలో భావోద్వేగ శ్రేయస్సు’ (ఎమోషనల్ వెల్‌బీయింగ్ ఇన్ ది మోడర్న్ వరల్డ్) అనే అంశంపై ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా బ్రహ్మకుమారీలు హాజరయ్యారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బ్రహ్మకుమారీలు

పోర్చుగల్‌కు రాష్ట్ర జిమ్నాస్టిక్స్ జట్టు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పోర్చుగల్‌లో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ కాంటినెంటల్ కప్ జిమ్నాస్టిక్స్ పోటీలకు రాష్ట్ర యువతీయువకుల జట్టు సిద్ధమైంది. కళింగ మైదానంలో ఉన్న జిమ్నాస్టిక్స్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న జట్టు క్రీడాకారులతో మంగళవారం రాష్ట్ర క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసి ఒడిశా గర్వకారణంగా నిలిచి పతకాలతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు.

సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు

సిమిలిగుడ, ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా శత జయంతి వార్షిక వేడుకలు మంగళం ప్రారంభమయ్యాయి. 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ● ఖరగ్‌పూర్ పట్టణ నింపురా శ్రీ కనకదుర్గ మల్లేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి వేడుకలు జరిగింది.

సిమిలిగుడ: వ్రతం చేస్తున్న మహిళలు

గర్భాశయ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ ఖరగ్‌పూర్ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం గర్భాశయ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం జరిగింది. గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఐఐటీ డైరెక్టర్ ఆచార్య సుమన్ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది.

కార్యక్రమంలో అతిథులు

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

పర్లాఖెముండి: మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ సేవలు మరవలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇందిరా గాంధీ 108వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాగర్ మృతిపై సంతాపం

రాయగడ, న్యూస్‌టుడే: ఒడిశా చలన చిత్ర గాయకుడు హ్యూమన్ సాగర్ మృతిపై మ్యూజిక్ గేలాక్సీ సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

మత్స్య, పశుసంపద మేళా

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి కార్యాలయం ప్రాంగణంలో గురువారం సమితి స్థాయి మత్స్య, పశు సంపద మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, అతిథులుగా జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సమితి అధ్యక్షుడు ఎల్.వీర్రాజు, సమితి అభివృద్ధి అధికారి గౌరచంద్ర పట్నాయక్ పాల్గొన్నారు. గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు చేపలు, పశువులు, మేకలు, కోళ్ల పెంపకం చేపడితే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు.

వేదికపై నిల్చొని ఉన్న ఎమ్మెల్యే రూపేష్, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు

‘అమ్మ దగ్గరకు పంపించండి మేడమ్’

జయపురం, న్యూస్‌టుడే: బస్సు బయలుదేరిన తన తల్లి రాలేదని బాలుడు ఏడవడంతో కండక్టర్ స్పందించి జయపురం సదర్ ఠాణాలో అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి తల్లి, కుమారుడితో పాటు మరో ఇద్దరు బంధువులు మల్కాన్‌గిరి వరకు ఒక ప్రైవేటు బస్సులో వచ్చారు. అక్కడ జయపురం బస్సు ఎక్కారు. బస్సులో సామాన్లు, బాలుడిని విడిచిపెట్టి ముందుకు ఎక్కుతానని చెప్పి దిగిపోయారని బాలుడు చెప్పడంతో ఇన్‌స్పెక్టర్ సులోచన ప్రధాన్ వారి వివరాల కోసం ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో బాలుడిని శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. బాలుడి తల్లి మళ్లీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనుమానంతో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

సిమిలిగుడ, జయపురం, న్యూస్‌టుడే: పొట్టంగి సమితి పెట్రులో శనివారం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ముఖ్య వైద్యాధికారి భగవత్ మఝి శిబిరాన్ని ప్రారంభించారు. 78 మందికి నేత్ర పరీక్షలు జరిపారు. ● లక్ష్మీపూర్ సమితి కుసుమగుడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాన సరంజన్ జెనా 49వ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ● జయపురం పట్టణం విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది.

శిబిరంలో రక్తదానం చేస్తున్న వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు

వర్సిటీ రిజిస్ట్రార్ మహేశ్వర్ చంద్రనాయక్, డా.రుషభ్‌సాహు, డా.ప్రశాంత్‌కుమార్ పాత్ర్ పాల్గొన్నారు.

బీడీఓపై ముఖ్యమంత్రి ప్రశంసలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నందహండి సమితి బీడీఓ క్షీరోద్ చంద్రసాహును ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. రెండు రోజుల కిందట కొండమీద ఉన్న పుట్‌ఘర్ గ్రామానికి 3 కి.మీ. నడుచుకుంటూ వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని త్వరలో పరిష్కరిస్తానని బీడీఓ హామీ ఇచ్చారు. ఈ వీడియోలు వైరల్ అవ్వడంతో ప్రతి బీడీఓ క్షీరోద్ మాదిరిగా విధులు నిర్వర్తించాలని సీఎం ప్రశంసించారు.

క్షీరోద్ చంద్రసాహు

పీఎం కిసాన్ యోజన ప్రారంభం

నవరంగపూర్, న్యూస్‌టుడే: దేశంలో రైతుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి 21వ సహాయం పంపిణీ కార్యక్రమం బుధవారం నవరంగపూర్‌లో విజయవంతంగా జరిగింది. ఎమ్మెల్యే గౌరీశంకర్‌మాఝి, అదనపు పాలనాధికారి తపన్‌కుమార్ ఖుంటియా హాజరయ్యారు. జిల్లాలోని 1,04,093 మంది రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.20.81 కోట్లు జమ చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, రైతులు

స్వామి ఆభరణాల లెక్కింపుపై 21న సమీక్ష

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: ఈ నెల 21న (శుక్రవారం) పూరీలోని నీలాద్రి భక్త నివాస్‌లో గజపతి దివ్యసింగ్ దేవ్ అధ్యక్షతన శ్రీక్షేత్ర పాలకవర్గ సమావేశం జరగనుంది. జగన్నాథుని రత్నభాండాగారం మరమ్మతులు పూర్తయ్యాయి. తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న స్వామి ఆభరణాలు భాండాగారానికి తెచ్చి లెక్కిస్తామని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఇదివరకే చెప్పారు. ఇందుకోసం శుక్రవారంనాటి సమావేశంలో తేదీ నిర్ణయిస్తారు.

ఈ కర్ర ఆపగలదా.. ప్రమాదాన్ని

పర్లాఖెముండి నుంచి ఏపీలోని పాతపట్నానికి అనుసంధానం చేస్తూ మహేంద్రతనయ నదిపై వంతెన 2018లో అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. ఆరేళ్ల కిందట నిర్మించిన వారధిపై గుంతలు ఏర్పడటంతో పాటు వంతెన రక్షణగోడ విరిగిపోయి ప్రమాదకరంగా ఉందని రాకపోకలు చేసేవారు భయపడుతున్నారు. పనుల్లో నాణ్యత లోపించడం దీనికి కారణమని తెలుస్తోంది. అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పర్లాఖెముండి

పారిశుద్ధ్యం పరమ అధ్వానం

అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వంతో పురపాలక పరిధిలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్యం రోజురోజుకు దిగజారుతోంది. కైలాస్, ఇందిరా, గాంధీ, ఓసీసీ నగర్, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు బయటకు పడుతుంది. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కార్యనిర్వాహక అధికారి సుజిత్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, సిమిలిగుడ, కొరాపుట్

ఆదమరిస్తే... ఆసుపత్రికే

పర్లాఖెముండి - కాశీనగర్ ముఖ్య రహదారి పట్టణ శివారులోని కిరోసిన్ బంకు ప్రాంతంలో గుంతలమయంగా దర్శనమిస్తోంది. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదమేనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు దృష్టిసారించి మరమ్మతులు చేయాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పర్లాఖెముండి

‘పెచ్చు’ మీరుతున్న ప్రమాదం

పదేళ్ల కిందట నిర్మించిన పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో విద్యాబోధన ఇబ్బందిగా ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొరాపుట్ జిల్లా నందిగావ్ పంచాయతీ మధుబిశాలి ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇది. నూతన భవనం నిర్మించాలని పలుమార్లు అధికారులను ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కుమార్ కోరినా ఫలితం లేకపోయింది. బీడీఓ డంబరుదొర మాలిక్‌ను ‘న్యూస్‌టుడే’ అడగ్గా, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, జయపురం

పైవంతెనకు మరమ్మతులు

ప్రమాదకరంగా మారిన రాయగడ పట్టణ పైవంతెనకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. దీనికోసం సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వాహనాల రద్దీ పెరగడం, ప్రమాదాలు జరగడంతో పలువురు మరమ్మతులు చేయాలని కోరారు. దీనికోసం కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక నిరసనలు కూడా చేశారు. ఎట్టకేలకు పనులు జరుగుతుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాయగడ గ్రామీణం

సమీర్ సేవలు చిరస్మరణీయం ● సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, భాజపా అగ్రనేత సమీర్ దే రాష్ట్ర హితం, ప్రజల సంక్షేమం, పార్టీని బలోపేతం చేయడానికి తన జీవిత కాలంలో ఎంతో చేశారని, భౌతికంగా ఆయన లేకపోయినా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా ఉన్నారని ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి చెప్పారు. మంగళవారం రాత్రి కటక్‌లోని సమీర్ నివాసంలో ఆయన తొలి వర్ధంతి కార్యక్రమం జరిగింది.

సమీర్ చిత్రపటం వద్ద సీఎం మోహన్ శ్రద్ధాంజలి

EENADU Classifieds

PEOPLE CARE

OLD AGE HOME

SVS Old Age Home, VZM AC/Non AC రూమ్స్ డే & నైట్ ఆయా, నర్సింగ్ ఇంటివద్దకే ఫిజియోథెరపీ సేవలు, రుచికరమైన భోజనం ✆ 9440435006, 9347978375

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన

మాట్లాడుతున్న రాజేష్‌కుమార్ మిశ్ర, పక్కన సంతోష్‌కుమార్

పర్లాఖెముండి: జిల్లా పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం జిల్లా న్యాయ సేవల అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలపై వయోవృద్ధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సివిల్ కోర్టు రిజిస్ట్రార్ ప్రసన్నకుమార్, న్యాయవాది రాజేష్ కుమార్ మిశ్ర, ఎల్.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలంటూ ఆందోళన

నవరంగపూర్: తమ కుమార్తె మృతికి నష్టపరిహారం ఇవ్వాలంటూ బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నవరంగపూర్ జిల్లా ప్రధానాసుపత్రి ప్రాంగణంలో బుధవారం ఆందోళన చేశారు. ఉమ్మర్‌కోట్ ఠాణా బుర్జా పంచాయతీలో కస్తూర్బా గాంధీ వసతిగృహంలో ఉంటూ చదువుతున్న భవాని హరిజన్(13) వసతిగృహ సిబ్బంది నిర్లక్ష్యం కారణంతో సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు బంధువులు ఆందోళన చేయడంతో డీఈఓ, తహసీల్దార్ అక్కడికి చేరుకుని నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇస్తూ ప్రధానోపాధ్యాయురాలు మమతస్వాయిను విధుల నుంచి తొలగించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

‘దేశి’ శిక్షణ పునఃప్రారంభం

జయపురం, న్యూస్‌టుడే: నాలుగు సంవత్సరాల తరువాత జయపురంలో దేశి(ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవా డిప్లొమా) పునఃప్రారంభమైంది. వ్యవసాయం, రైతు సాధికారత శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని 35 మంది ఇన్‌పుట్, నాన్ ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారని, 48 వారాల పాటు వారానికి ఒకసారి నిర్వహిస్తామని జిల్లా ప్రధాన వ్యవసాయ శాఖాధికారి గోకుల్ చంద్ర ప్రధాన్ తెలిపారు. పొగాకు రహిత భారత దేశం ప్రచారాన్ని విజయవంతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. లలాటేందు మహాపాత్ర్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో ఉన్నతాధికారులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఆగ్నేయ రైల్వేబోర్డు ఉన్నతాధికారులు సంజయ్ మిశ్ర, దేవేంద్రకుమార్ ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో గల సంత్రాగాచి, అందుల్ రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించినట్లు రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

వ్యాధులపై అవగాహన

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ప్రధానాసుపత్రిలో ‘ప్రపంచ దీర్ఘకాలిక అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ డే’ను బుధవారం జరిపారు. డా.సంతోష్‌కుమార్ పండా, ఏడీపీహెచ్‌ఓ డా.సుకాంత్ శత్పథి, డీపీహెచ్‌ఓ డా.మలాయ్‌కుమార్ ప్రధాన్ తదితరులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అతిథులుగా మాట్లాడుతూ ధూమపానం, పర్యావరణ కాలుష్యం కారణంగా వ్యాధి రేటు పెరుగుతుంది. దీని కారణంగా మరణాలు, వైకల్యం రేటు రోజు రోజుకూ పెరుగుతోందని తెలిపారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న వైద్యాధికారులు

ప్లాస్టిక్ బొమ్మ మింగిన బాలుడి మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఓ చిప్స్ ప్యాకెట్‌లో వచ్చిన చిన్న ప్లాస్టిక్ తుపాకీ బొమ్మను పొరపాటున మింగిన నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన కొంధమాల్ జిల్లాలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. బ్రాహ్మణిగావ్ ఠాణా పరిధిలో తాజుంగియా పంచాయతీలోని శికరమహ సమీపాన ముసుమహ గ్రామానికి చెందిన బిగిల్ ప్రధాన్ (4)కు మధ్యాహ్నం ఆయన బజారులో కొనుగోలు చేసిన ఓ చిప్స్ ప్యాకెట్‌ను కొడుక్కి ఇచ్చాడు. అందులోని చిప్స్ తిన్న బిగిల్ వాటితోపాటు ప్యాకెట్‌లో వచ్చిన చిన్న ప్లాస్టిక్ తుపాకీ బొమ్మతో ఆడుకుంటూ పొరపాటున దాన్ని మింగడంతో అది గొంతుకు అడ్డం పడింది. దీంతో బిగిల్‌ను తల్లిదండ్రులు సుమారు ముప్పై కి.మీ. దూరంలోని దారింగిబాడిలోని ఆరోగ్య కేంద్రంలో సాయంత్రం చేర్పించగా, అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

విశ్రాంతి గదిలో మృతదేహం లభ్యం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణ ఆదర్శ ఠాణా పరిధిలోని పాత కోర్టు కూడలి ప్రాంతంలో ఉన్న ప్రయాణికుల విశ్రాంతి గదిలో వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఠాణా అధికారి ప్రశాంత్ భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.ఉదయగిరి ఠాణా పరిధిలోని చెలిగడ పంచాయతీ తలడా గ్రామానికి చెందిన బబుల దొళాయి(45)గా గుర్తించారు. వ్యక్తి మద్యం తాగి గదిలో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికుల విశ్రాంతి గదిలో మృతదేహం

విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా బేల్దా పోలీస్ స్టేషన్ పరిధి చోటా మట్కట్వార్‌కు చెందిన సహిలీ దేవ్(22) మంగళవారం తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి ఉరేసుకుని కనిపించింది. ఆమెను బేల్దాలో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజిలెన్స్ వలలో ఆబ్కారీ సూపరింటెండెంట్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లా ఆబ్కారీ సూపరింటెండెంట్ సీతారాణి పట్నాయక్ బుధవారం సాయంత్రం విజిలెన్స్ వలకు చిక్కారు. ఒక మద్యం వ్యాపారి నుంచి రూ.40 వేలు లంచం పుచ్చుకుంటున్న సమయంలో సీతారాణి పట్టుబడ్డారు. కేంఝర్ జిల్లాలోని చంపువాకు చెందిన ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ బిజయ్ మహంతి కూడా విజిలెన్స్‌కు పట్టుబడ్డారు.

హత్య, దోపిడీ కేసులో జైలుశిక్ష

నవరంగపూర్, న్యూస్‌టుడే: హత్య, చోరీ కేసులో అరెస్టయిన ఇద్దరు నిందితులకు నవరంగపూర్ న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించింది. న్యాయవాది మనోజ్‌కుమార్ ఎక్కా తెలిపిన వివరాల ప్రకారం.. 2024 నవంబరు 28న పపదహండి సమితి ఉసిగావ్ గ్రామానికి చెందిన ఘస్సీరామ్ మాఝి, జగదీష్ మాఝిలు ద్విచక్ర వాహనంపై మైదల్‌పూర్ నుంచి స్వగ్రామానికి వెలుతుండగా, డాబుగావ్ ఠాణా పరిధిలో ఖైరా పంచాయతీ తెంతులిగుడ గ్రామానికి చెందిన దుండగులు రమేష్ హరిజన్, సుశాంత్ హరిజన్ వారిని అడ్డగించి వారి దగ్గర నుంచి డబ్బులు, చరవాణులు దోచుకున్నారు. ఘస్సీరామ్ తన చరవాణి ఇవ్వటానికి నిరాకరించడంతో దుండగులు ఆయనపై దాడిచేయడంతో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘస్సీరామ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వారిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి న్యాయమూర్తి సుబ్రత్ మహంతి బుధవారం తుది తీర్పు ప్రకటించారు. పదేళ్ల జైలు శిక్షతో పాటు ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలని పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం అన్నారు. జిల్లా సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి సర్గిఫుల్ కార్యక్రమం సునాబెడ-1 హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కడం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలకా, రాజేంద్రకుమార్ పాత్ర్, లలాట రంజన్ శెట్టి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కడం

ప్రతిభకు వేదిక పరబ్

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాలో లోకోత్సవం పరబ్ ఉత్సవాలు పంచాయతీ స్థాయిలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పరబ్ జ్యోతిని ర్యాలీగా తీసుకువచ్చారు. ఎమ్మెల్యే రఘురాం మచ్చో, పురపాలక ఉపాధ్యక్షురాలు సబితా పండా, పురపాలిక అధ్యక్షుడు లలాట రంజన్ సేథీలు పాల్గొన్నారు.

గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి మందిరంలో నుంచి బయలుదేరిన పరబ్ జ్యోతి

కళాశాలలో నషా ముక్త్ అభియాన్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ ప్రభుత్వ కళాశాలలో శనివారం నషాముక్త్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఝూన్సీ సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు దేవ్‌రాజ్ నాయక్, గీత పట్నాయక్, పింకీ గోయల్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

జిల్లాస్థాయి 72వ సహకార సంఘాల వారోత్సవాలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో స్థానిక సంధ్య ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి 72వ సహకార సంఘాల వారోత్సవాలు బుధవారం జరిగాయి. డీఆర్‌సీఎస్ మోనికారాయ్, ఎఆర్‌సీఎస్ కైలాష్ సీహెచ్.జెన్నా, చంద్ర సత్య పాల్గొని, సహకార సంఘాల ద్వారా రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలు, విత్తనాలు, ఎరువులు అందజేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

సమితి స్థాయి విజ్ఞాన ప్రదర్శన

రాయగడ జిల్లా మునిగుడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బుధవారం సమితి స్థాయి విజ్ఞాన ప్రదర్శన జరిగింది. సమితి విద్యాధికారి గణేష్ సబర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుశ్మంత్ మాఝి పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాయగడ

(c) eenadu

పందులతో రైతులకు అవస్థలు

కపాసుకుద్ది, కుసుంపురం, కవిటి బీల ప్రాంతంలో అడవి పందులు రాత్రి సమయంలో పంటలు నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల చుట్టూ ఇనుప తీగలు, వలలతో కంచెను ఏర్పాటు చేసి గోనె సంచులను జెండాల మాదిరిగా పొలంలో ఏర్పాటు చేసినా పందుల బెడద తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కవిటి అటవీ శాఖాధికారి ఎ.రవికుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

చిన్న వర్షానికే చెరువవుతోంది..

బెనుగానిపేట సమీప జగనన్న కాలనీ చిన్నపాటి వర్షానికే చెరువులా మారుతోంది. ఏళ్లు కావస్తున్నా ఈ ప్రాంతంలో సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్లు ఇంకా నిర్మాణదశలోనే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ విశ్వనాథంను వివరణ కోరగా అంచనాలు వేసి పంపించామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

గోడ కూలి.. ప్రమాదకరంగా మారి!

డోకుల పాడు తీర రహదారి కూడలి సమీప వంతెన రక్షణ కూలడంతో ప్రమాదకరంగా మారింది. వంతెన అడుగు భాగంలో పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడ లేని ప్రదేశంలో రేడియం స్టిక్కర్లతో ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని, రహదారి అభివృద్ధి పనుల్లో వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటామని రోడ్లు, భవనాల శాఖ జేఈ జగదీష్ తెలిపారు.– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

తవ్వారు.. వదిలేశారు

మూలిపాడులో సుజల స్రవంతి పథకంలో భాగంగా పైపులైను పనులు కొద్దిరోజులుగా చేపడుతున్నారు. ప్రధాన వీధిలో సీసీ రహదారి పక్కన పెద్ద గొయ్యి తవ్వారు. అక్కడ పైపులైను పనులు పూర్తయి వారమైనా గొయ్యిని మాత్రం పూడ్చలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల్లో గ్రామంలోని గొయ్యిలు పూడ్చివేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసన్న తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

పడిపోతోంది.. సరి చేయండి

డీజీపురంలో నీటి ట్యాంకు సమీపంలో విద్యుత్తు స్తంభం పూర్తిగా ఒక వైపు వాలిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఏ ప్రమాదం జరగకముందే స్పందించి స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ ఏఈ గురవయ్య వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

పుస్తకావిష్కరణ

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వెంకమ్మపేట జంగాలచెరువును ఆనుకుని ఉన్న శివాలయాల విశిష్టతను వివరిస్తూ పట్టణానికి చెందిన భాసూరు శివశంకర ప్రసాద్ పుస్తకాన్ని రచించారు. పాలకొండ పంచ శివలింగ వైభవం శివ క్షేత్ర దర్శనం పేరిట ఈ ఆలయాల చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ రచించిన పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. విశ్రాంత గ్రంథాలయాధికారి కె.చౌదరినాయుడు, తెదేపా పట్టణ అధ్యక్షుడు జి.సంతోష్, అభ్యుదయ రైతు కె.ప్రసాదరావు, వాణిజ్యవేత్త ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

పక్క దారి పడుతున్న పట్టణ ప్రణాళిక

- ప్రధాన పోస్టుల ఖాళీతో సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులపై భారం

– న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం

పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో ఆదాయ వనరులు తెచ్చి పెట్టే శాఖల అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోజురోజుకు పట్టణ పరిధి పెరగడం, ఆక్రమణల పర్వంతోపాటు అక్రమ నిర్మాణాలు అధికమవుతున్న నేపథ్యంలో నియంత్రించే అధికార యంత్రాంగం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు పట్టణ ప్రణాళిక అధికారులు కీలకంగా వ్యవహరిస్తుంటారు. పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల పరిధిలో పట్టణ ప్రణాళిక అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో సచివాలయ ఉద్యోగులు, పొరుగు సేవల సిబ్బందితోనే ప్రక్రియ నడుస్తోంది. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు.

సస్పెన్షన్‌తో ఖాళీ...

విశాఖలో జరిగిన నిర్మాణ ఘటనతో పలాస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇద్దరు పట్టణ ప్రణాళిక అధికారులను సస్పెండ్ చేశారు. దీంతో 5 నెలలుగా ఈ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు పర్యవేక్షణ అప్పగించడం, పొరుగు సేవల సిబ్బంది పెత్తనం చెలాయిస్తూ పనిచేస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసే వారే కరవయ్యారు.

ఇచ్ఛాపురంలో పట్టణ ప్రణాళిక విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 31 వార్డుల పరిధిలో 16 సచివాలయాలుండగా, 9 మంది సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులున్నారు. పట్టణ ప్రణాళిక అధికారిగా రాజాం పురపాలక సంఘం నుంచి డిప్యుటేషన్‌పై వేసినా నేటి వరకు రాలేదు. తాజాగా ప్రభుత్వం ప్లానింగ్ కార్యదర్శులుగా పనిచేస్తున్న ముగ్గురిని టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీస్ (టీపీబీవో)లను ఇన్‌ఛార్జులుగా నియమించేందుకు సిద్ధమైనా.. పూర్తిస్థాయి ఉత్తర్వులు రాకపోవడంతో ప్లానింగ్, పొరుగు సేవల సిబ్బందితోనే పట్టణ ప్రణాళిక విభాగం నడిపించాల్సి వస్తోంది.

ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో 23 వార్డుల పరిధిలో 10 సచివాలయాలుండగా, ఆరుగురు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులున్నారు. వీరిలో ఇద్దరిని స్వచ్ఛ ఆంధ్రా ప్రాజెక్టుకు డిప్యుటేషన్‌పై పంపించారు. పుర కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీవో, టీపీఎస్‌లతోపాటు ఇద్దరు టీపీబీవోలు, ఒక ట్రాసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వార్డు టౌన్ ప్లానింగ్ కార్యదర్శుల్లో ఒకరికి టీపీబీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పుర కమిషనర్ రమేష్ పర్యవేక్షిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

పట్టణ ప్రణాళిక విభాగంలో పోస్టుల ఖాళీపై విభాగాల వారీగా సమీక్షించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అక్రమ నిర్మాణాలకు ఎవరైనా సహకారం అందించినట్లు ఫిర్యాదు లొస్తే చర్యలు తీసుకుంటాం.

– ఇ.శ్రీనివాసులు, ఎన్.రమేష్ పురకమిషనర్లు, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం

విద్యార్థులకు రంగవల్లికల పోటీలు

రంగవల్లిక పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయులు

సీతంపేట, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రంగవల్లిక పోటీలు నిర్వహించినట్లు స్థానిక గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు తెలిపారు. 40 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. హెచ్ఎం వి.వెంకటరావు, గ్రంథాలయ సహాయకుడు బి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.150 లాక్కొన్నాడని.. ప్రాణం తీశాడు!

మద్యం మత్తులో ఘాతుకం

ఈనాడు-విశాఖపట్నం: ఇద్దరి మధ్య రూ.150ల కోసం జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. డైమండ్ పార్కులో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఒడిశాకు చెందిన టి.చిరంజీవి (35) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఒడిశాకు చెందిన చిరంజీవి విశాఖలో ఉంటున్నాడు. భార్యతో మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన లక్ష్మణ్‌రెడ్డి, చిరంజీవి మధ్య కొంతకాలంగా స్నేహం కుదిరింది. వీరిద్దరూ తెలుగుతల్లి పైవంతెన కింద ఉంటూ, దాతలిచ్చే ఆహారం తీసుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. బుధవారం డైమండ్ పార్కులో ఇద్దరి మధ్య రూ.150ల విషయంలో గొడవ మొదలైంది. ఆ తరువాత ఇద్దరూ కలిసి మద్యం తాగారు. ఈ సమయంలో 'నా జేబులో డబ్బులు లాక్కొంటావా?' అంటూ లక్ష్మణ్‌రెడ్డి పక్కనే ఉన్న కర్రతో బలంగా చిరంజీవి తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిరంజీవిపై గోపాలపట్నం, టూటౌన్ పరిధిలో పలు దొంగతనం కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిధి ఎవరిదంటూ...: హత్య జరిగిన చోటు ద్వారకా, నాలుగో పట్టణ స్టేషన్ సరిహద్దుల్లో ఉండటంతో కేసు ఎవరు నమోదు చేయాలనేదానిపై తర్జనభర్జన సాగింది. డైమండ్ పార్కు వద్ద సాయిరాం పార్లర్ వైపు నాలుగో పట్టణ స్టేషన్, మరో వైపు ద్వారకా స్టేషన్ పరిధిలోకి వస్తాయి. హత్య పార్కులో బెంచిపై జరగడంతో మీ పరిధంటే మీపరిధని పోలీసు సిబ్బంది మధ్య చర్చ సాగింది. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నాలుగో పట్టణ పరిధిగా నిర్ణయించడంతో ఆ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు లక్ష్మణ్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఆదిత్యాలయం.. అభివృద్ధి పథం!

- భూసేకరణపై కలెక్టర్‌కు నివేదించిన కమిటీ

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి అవసరమైన భూమిని ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అన్నదానం, ప్రసాదాల తయారీ భవనం, శాశ్వత మరుగుదొడ్లు, పూర్తి సౌకర్యాలతో కూడిన కేశఖండన శాల, వాణిజ్య సముదాయం నిర్మాణానికి స్థలాలు సేకరించనున్నారు.

మంత్రి ఆదేశాలతో కదలిక

- ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ఆర్‌జేసీ, శ్రీకాకుళం ఆర్డీవో, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ, ఆదిత్యాలయ ఈవోతో కూడిన కమిటీని నియమించారు.
- ప్రైవేటు వ్యక్తుల స్థలాలు, భవనాలు ఆలయానికి స్వచ్ఛందంగా ఇస్తే వారికి ఆలయ భూములు ఎక్కడ ఎంత మేర ఇవ్వాలనే విషయమై ఈ కమిటీ నిర్ణయిస్తుంది.
- భూములిచ్చే వ్యక్తుల అంగీకార పత్రాలను కమిటీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదించింది. దేవాదాయ శాఖ అనుమతి రాగానే భూముల మార్పిడికి చర్యలు చేపట్టడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.
- ఈ ప్రక్రియ పూర్తికాగానే రూ.12 కోట్లతో పనులు పూర్తి చేయనున్నట్లు ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

హాయ్ చెప్పు ధాన్యం అమ్ము..!

వాట్సాప్ ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, రణస్థలం, పాతశ్రీకాకుళం

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకుంటే రైతులు పడిన శ్రమ వృథా అవుతుంది. సకాలంలో విక్రయించుకోలేక.. ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియక చాలా మంది దళారులు అడిగిన ధరకు ఇచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ఖరీఫ్‌లో వర్షాలు బాగా కురవడంతో జిల్లాలో వరి పెద్దఎత్తున సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉంది. కొన్నిచోట్ల కోతలు ప్రారంభం కాగా.. మిగిలిన ప్రాంతాల్లో సన్నాహాలు చేసుకుంటున్నారు. పంటను విక్రయించుకోవడానికి పడే ఇబ్బందుల నుంచి గట్టెక్కించడానికి కర్షకులు సాంకేతికతను అందిపుచ్చుకునేలా వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

గార మండలం బూరవెల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రం

406 కేంద్రాల ఏర్పాటు

- జిల్లాలో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 3.58 లక్షల మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి ఇవ్వనున్నారు.
- ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేస్తాయి. సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- సాధారణ రకాలు క్వింటాల్‌కు రూ.2,369, సన్న రకాలు క్వింటాల్‌కు రూ.2,389లు చెల్లిస్తారు. జిల్లా వ్యాప్తంగా 406 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 39 ఏజెన్సీలకు అప్పగించారు.

తగ్గనున్న ఖర్చులు

- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతుల కోసం ఇటీవల వాట్సాప్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.
- హాయ్ అని మెసేజ్ పెట్టగానే పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతు వద్ద ఎన్ని బస్తాలున్నాయి.. పంట రకం.. బస్తాలు ఎప్పటికి సిద్ధమవుతాయి.. వంటి వివరాలు ఆరా తీస్తారు.
- ఏ కేంద్రంలో ఏ రోజు, ఏ సమయానికి.. ఏ రకం ధాన్యం, ఎన్ని బస్తాలు అమ్ముతారో తదితర వివరాలతో స్లాట్ బుక్ అవుతుంది.
- ఈ విధానంతో రైతులు పంట ఎక్కడ అమ్ముకోవాలి.. ఏ మిల్లుకు తరలించాలన్న ఆందోళన ఉండదు. సమయం ఆదా అవడంతో పాటు ఖర్చులు తగ్గి ఇబ్బందులు తప్పుతాయి.

45 గంటల్లో సొమ్ము జమ

ధాన్యం విక్రయించిన 45 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది. ఈ-పంట నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తయిన వారి నుంచి మాత్రమే కొనుగోలు చేస్తాం.

– వేణుగోపాల్, మేనేజర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ, శ్రీకాకుళం

- రైతులు పంట విక్రయానికి ఇబ్బందులు ఎదురైతే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 1967కు, కంట్రోల్ రూం నంబరు **99634 79141** కు ఫోన్ చేయొచ్చు.

- రైతులు మెసేజ్ పెట్టాల్సిన నంబరు **73373 59375**

అత్యవసర వైద్యానికి అడుగులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో త్వరలో అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు రూ.23 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రెండు అంతస్తుల భవన సముదాయం నిర్మించనున్నారు. ఈ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య బృందంతో 24 గంటలు సేవలు అందనున్నాయి. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ కొత్త విభాగం ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆసుపత్రి పర్యవేక్షకుడు కె.చిరంజీవి తెలిపారు.

మన'సారా' వదిలేశారు.. ఆసరా మరిచారు

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

నేలబొంతు గ్రామానికి చెందిన కోసంటి యోగేశ్వరరావు, సారా విక్రయించి జీవనం సాగిస్తున్నాడు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా విక్రయాలు చేయొద్దని ప్రత్యామ్నాయ ఉపాధి చూపిస్తామని ఆబ్కారీ అధికారులు హామీ ఇచ్చారు. దాంతో సారా వదిలేశాడు. ఇంత వరకు మరో ఉపాధి చూపించకపోవడంతో అవస్థలు పడుతున్నాడు. జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగానే ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు.

- సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 110 ప్రభావిత గ్రామాలను ఆబ్కారీ అధికారులు గుర్తించారు. 1023 మంది సారా విక్రేతలను గుర్తించి రెవెన్యూ అధికారుల వద్ద బైండోవర్ చేయించారు. 110 కమిటీలు వేసి నిరంతరం వ్యాపారంపై నిఘా ఉంచారు. ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించారు. దీంతో మార్పు రావడంతో 200 మందికి పైగా సారా వ్యాపారం వదిలేసి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.
- పరివర్తన చెంది ఉపాధి కోసం ఎదురు చూసేవారికి ప్రత్యామ్నాయం కల్పిస్తేనే.. నవోదయం కార్యక్రమానికి సార్థకత చేకూరుతుంది. వ్యాపారం వదిలేసి వారికి ప్రత్యేక పథకాలు అందించాలని చేసిన ప్రతిపాదనలు డీఆర్‌డీఏకి పంపించినట్లు అధికారులు తెలిపారు. 'మరోసారి అధికారులతో మాట్లాడి ప్రక్రియ వేగవంతం చేస్తాం' అని ఆబ్కారీ ఈఎస్ తిరుపతి నాయుడు తెలిపారు.

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నేలబొంతు గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆబ్కారీ అధికారులు

నమ్మించి.. నట్టేట ముంచి..!

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నర్సు ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా నియమిస్తామని 10 మంది వద్ద ఓ సంస్థ ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసింది. నియామక పత్రాలిచ్చి ఉద్యోగాల్లో చేరాలని సూచించింది. విధుల్లో చేరడానికి వెళ్లిన అభ్యర్థుల వద్ద పత్రాలను చూసిన వైద్యాధికారులు అవి నకిలీవని ధ్రువీకరించడంతో మోసపోయామని తెలుసుకుని బోరుమన్నారు.

- టెరిటోరియల్ ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కంచిలికి చెందిన ఓ వ్యక్తి టెక్కలికి చెందిన ముగ్గురు యువకుల వద్ద రూ.5 లక్షలు చొప్పున వసూలు చేశాడు. నకిలీ పత్రాలు చేతిలో పెట్టి ఉడాయించాడు.

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

'ఎలాంటి రాత పరీక్ష అవసరం లేదు. మంచి ఉద్యోగం..నెలకు రూ.లక్షల్లో జీతం..కుటుంబ భద్రత కలిగిన ఉపాధి.. కొన్ని పోస్టులు మాత్రమే ఉన్నాయి.. కొంత మొత్తం ఇస్తే జాయినింగ్ ఆర్డర్లు వచ్చేస్తాయి. పది రోజుల్లో పనైపోతుంది' అంటూ మాయమాటలు చెప్పి నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. రూ.లక్షలు కాజేసి ఉడాయించాక అసలు విషయం తెలుసుకుంటున్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

నమోదు కానివే ఎక్కువ

2023 నుంచి ఇప్పటివరకు 270 మోసం కేసులు నమోదు కాగా వాటిలో ఉద్యోగాల పేరిట 150 పైగా ఉంటాయి. ఆధారాలు సక్రమంగా లేనివి.. కేసులు నమోదు చేయనివి సుమారు 500 పైగానే ఉంటాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. మోసపోయిన వారిలో ఉన్నత విద్యావంతులూ ఉన్నారని సమాచారం.

పక్కా ప్రణాళికతో ఎర

- మొదట ఉపాధి అవసరాన్ని ఎరగా చేసుకుంటారు.
- ఆయా రంగాల్లో బాగా తెలిసిన వారున్నారని.. డబ్బులు ఇస్తే పనైపోతుందని నమ్మిస్తారు.
- సంబంధిత ప్రభుత్వ కార్యాలయానికి తీసుకెళ్లి అంతా మనదే అన్నట్లుగా వ్యవహరిస్తారు.
- డబ్బులు తీసుకుని సంతకాలు, వేలిముద్రలు, చిత్రాలు సేకరిస్తారు.
- నకిలీ ధ్రువపత్రాలు చేతిలో పెడతారు.
- రోజులు గడిచినా జాయినింగ్ ఆర్డర్లు రాకపోవడంతో డబ్బు అందజేసిన ప్రదేశానికి వెళ్తే అక్కడ ఎవరూ ఉండరు.
- మోసపోయినట్లు తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు.
- కుటుంబ సభ్యుల సూచన మేరకు పోలీసు స్టేషన్ బాట పడుతున్నారు.

రికవరీ కష్టమే..

మోసపోతున్న వారిలో ఎక్కువగా యువతులు, కోచింగ్ సెంటర్లలో కోర్సులు నేర్చుకుంటున్న యువకులు ఉంటున్నారు. మధ్యవర్తులు ఒకరిని పూర్తిగా నమ్మించి వారి ద్వారా తెలిసిన స్నేహితులతో రూ.లక్షల్లో కట్టిస్తున్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులు దొరికినప్పటికీ రికవరీ చేయడం పోలీసులకు సాహసంగా మారుతోంది. చాలా వరకు కేసులు కట్టకుండానే వదిలేస్తున్న ఉదంతాలు ఉన్నాయి.



అప్రమత్తంగా ఉండాలి.. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మకండి. చాలా వరకు కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో మోసపోయిన బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి కేసులకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. నిందితులపై కఠిన చర్యలు ఉంటాయి. ఎవరినీ ఉపేక్షించబోం.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ

బలిమెల నిర్వహణపై సమీక్ష

సీలేరు, న్యూస్‌టుడే: బలిమెల జలాశయం నిర్వహణ, నీటి వాడకంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు బుధవారం సీలేరు ఎస్ఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 79.66 టీఎంసీల నీరుండగా.. జోలాపుట్ జలాశయంలో 29.83 టీఎంసీలు నీరుందని, మొత్తం 109.49 టీఎంసీలు నీరుందని పేర్కొన్నారు. రాబోయే నెలలో సుమారు 6.50 టీఎంసీల వరకూ నీటి నిల్వలు రెండు జలాశయాల్లోకి చేరే అవకాశముందని లెక్కగట్టారు. మొత్తం సుమారు 115.99 టీఎంసీల్లో ఒడిశా 46.75, ఏపీ జెన్‌కో 69.24 టీఎంసీలు వాడుకోవడానికి నిర్ణయించారు. అక్టోబర్ నెలలో ఏపీ 2.73 టీఎంసీలు, ఒడిశా 9.35 టీఎంసీలు వాడుకున్నట్లు లెక్కలు తేల్చారు. ప్రస్తుతానికి గ్రిడ్ డిమాండ్, విద్యుత్తు అవసరాల నిమిత్తం ఒడిశా 2500 క్యూసెక్కులు, ఏపీ 3700 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి వాడుకోవడానికి నిర్ణయించారు. ఒడిశా జలవనరులశాఖ నుంచి ముఖ్యనిర్మాణ ఇంజినీరు సిబాప్రసాద్ పాణిగ్రహి, పర్యవేక్షక ఇంజినీర్ రామకంత పాత్రో, ఏఈ గదాదర్ ప్రధాన్, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ తరఫున డిప్యూటీ మేనేజర్ బెహరా, అసిస్టెంట్ మేనేజర్ సుబదీప్ పండా, ఏపీపీ జెన్ తరఫున ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈ చింతాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో ఇరు రాష్ట్రాల అధికారులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

పత్తి రైతు నెత్తిన నష్టాల మూట

– న్యూస్‌టుడే, భామిని

ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఒక పక్క తేమ శాతం మరోవైపు దళారులతో పత్తి రైతులు అవస్థలు పడుతున్నారు. తుపాను, వరుస వర్షాల కారణంగా పత్తి పంట నీటిలో తడిచి పోయింది. ఎండు తెగులు విస్తరిస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తీత పూర్తికాగానే పంటను తొలగించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఆరబెడితే 16 నుంచి 20 శాతం వరకు తేమ ఉంటోంది. 12 శాతానికి మించితే తిరస్కరిస్తామని సీసీఐ చెప్పినందున రైతులు దళారుల ఉచ్చులో పడి మరింత నష్టాలు చవిచూస్తున్నారు. వీరు క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు.

భామినిలో ఎండిపోయిన పత్తి పంట

కూలీల కొరత

కూలీల కొరత కారణంగా తీత ఖర్చు పెరుగుతోంది. రైతులు కిలోకు రూ.15 చొప్పున కూలీలతో ఒప్పందం చేసుకుంటున్నారు. క్వింటా పత్తి తీయడానికి రూ.1,500 వరకు వెచ్చించాల్సి వస్తోంది. రవాణా ఖర్చు రూ.300 అవుతోంది.

సీసీఐ కనీస మద్దతు ధర రూ.8,100. కానీ నిబంధనలు కఠినంగా ఉండడంతో రైతులు ఇటువైపు రావడం లేదు. తేమ 18 శాతం వరకు అనుమతించాలని కోరుతున్నా సీసీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలోని

కొనుగోళ్లు అంతంతమాత్రమే

కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలవ్వ లేదని రైతులు వాపోతున్నారు. తమ దగ్గరున్న సరకును కేంద్రానికి తీసుకువెళితే నిబంధనల పేరుతో తిరస్కరించే అవకాశం ఉందని వాపోతున్నారు. గతేడాది భామిని మండలంలో సీసీఐ అధికారులు, కొందరు దళారులు ఒక్కటైపోయి చెప్పిందే ధరగా నిర్ణయించారని రైతులు చెబుతున్నారు. పురుగు మందుల దుకాణ యజమానులు రైతులకు పెట్టుబడులకు కొంత మొత్తం ఇచ్చి సరకుని వారు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు మరింత దోపిడీకి గురవుతున్నారు.

(c) eenadu

ఈనాడు తమిళనాడు

గురువారం నవంబరు 20, 2025 5

అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తున్న ముసిరి ప్రాంతానికి చెందిన యువ రైతు ఇ.ప్రవీణ్‌కుమార్‌ను జ్ఞాపికతో సన్మానిస్తున్న ప్రధాని

కోయంబత్తూరులో ప్రధాని రోడ్‌షో

సేంద్రియ సాగుకు భారత్ గ్లోబల్ హబ్

'దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సమాఖ్య'లో ప్రధాని మోదీ

ఈనాడు-చెన్నై

'సేంద్రియ వ్యవసాయం నా మనసుకు దగ్గరగా ఉంది. ఇక్కడి రైతుల ప్రదర్శనలు చూశాను. మెకానికల్ ఇంజినీరింగ్, పీహెచ్‌డీ చేసి, నాసాలో వచ్చిన ఉద్యోగాన్ని వదిలి రైతుగా మారినవారున్నారు. వారు యువరైతుల్ని తయారుచేస్తున్నారు. ఇక్కడికి రాకపోయుంటే నా జీవితంలో చాలా కోల్పోయేవాడిని. ఇక్కడికొచ్చి చాలా నేర్చుకున్నాను. తమిళనాడులో పరివర్తన చెందుతున్న రైతులకు వందలాది వందనాలు చేస్తున్నాను' అని ప్రధాని

విమానాశ్రయంలో ప్రధానితో మాట్లాడుతున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్, టీఎంసీ(ఎం) అధ్యక్షుడు జి.కె.వాసన్

మోదీ చెప్పారు. కోయంబత్తూరులో 3 రోజుల దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సమాఖ్యను ప్రారంభించిన ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. తమిళనాడులోని సేంద్రియ వ్యవసాయానికి స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల నుంచి మంచి మద్దతుందని, వారంతా కలిసి పనిచేయడం శుభపరిణామమని వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో పెనుమార్పులు రాబోతున్నాయని, సేంద్రియ వ్యవసాయానికి భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదగనుందని తెలిపారు. దేశ యువత ఈ వ్యవసాయాన్ని ఆధునికంగా చూస్తున్నారని, ఇదే గ్రామీణ ప్రాంతాలకు బలమని వ్యక్తపరిచారు.

ఆదర్శ రైతులకు సన్మానం

సేంద్రియ వ్యవసాయంలో ఆదర్శ రైతుల్ని ప్రధాని మోదీ జ్ఞాపికలతో సన్మానించారు. వారిని వేదికపై పిలిచి, వారు చేసే సాగును అడిగి తెలుసుకున్నారు. 'భవిష్యత్తు తరాలకు మీలాంటి రైతులు స్ఫూర్తిగా నిలవబోతున్నారు' అని తెలిపారు. అంతకుముందు ప్రాంగణంలోనే ఏర్పాటుచేసిన ఉత్పత్తుల ప్రదర్శనలు, సాంకేతికతల్ని మోదీ పరిశీలించారు. రైతులు తెచ్చిన పర్యావరణహిత, ఆరోగ్యకర ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ వ్యవసాయంలో సరికొత్త ప్రయత్నాలుగా కొన్ని ఉత్పత్తుల్ని సదస్సులో ప్రదర్శించారు. ఎరువుల వాడకం, ఉత్పత్తుల నిల్వ, ప్యాకేజింగ్, స్వదేశీ సాంకేతికత వినియోగం ఇలా వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. మోదీకి తమిళనాడు రైతు సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షులు పీఆర్ వీరపాండియన్, సదస్సు ప్రధాన సమన్వయకర్త డాక్టర్ కె.రామసామి తదితరులు 'ఎత్తుల బండి' జ్ఞాపికను అందించారు.

రోడ్‌షోలో రెపరెపలు

ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి నుంచి కోయంబత్తూరు విమానాశ్రయానికి వచ్చిన ప్రధాని మోదీకి ఘనస్వాగతం లభించింది.

అరటినారతో తయారు చేసిన ఫొటో ఫ్రేమ్‌ను మోదీకి అందిస్తున్న సుగంధి

గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేంద్రమంత్రి ఎల్. మురుగన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి, మాజీ మంత్రి వేలుమణి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్, టీఎంసీ(ఎం) అధ్యక్షులు జి.కె.వాసన్ తదితరులు కలిసి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి వేదిక వరకు ప్రధాని రోడ్‌షో నిర్వహించారు. దారిపొడవునా భాజపా కార్యకర్తలు, స్థానికులు పూలవర్షం కురిపించారు. పార్టీ జెండాలు, సదస్సు బ్యానర్లు ఆకట్టుకున్నాయి.

ఇద్దరు విద్యార్థినులతో..

మోదీ ప్రసంగం సమయంలో ఇద్దరు విద్యార్థినులు ప్రధానిని ఆకట్టుకున్నారు. మోదీ వచ్చినప్పటి నుంచి చేతులు పైకెత్తి ప్లకార్డులు చూపుతూ నుంచోవడాన్ని గమనించిన ఆయన.. తన ప్రసంగం మధ్యలో వారి ప్రస్తావన తెచ్చారు. 'మీ ఇద్దరు నామీద చూపుతున్న ప్రేమ మరువలేను. మీ దగ్గరుండే ప్లకార్డులు నాకు పంపండి. ఇందుకు భద్రతాసిబ్బంది మీకు సహకరిస్తారు' అంటూ వారిని పలకరించారు. వారు ఉత్సాహంగా వేదిక దగ్గరికి వెళ్లారు. ఆ విద్యార్థులు తమ ప్లకార్డుల్లో.. 'నేను ఆర్థిక వ్యవస్థ రెండోర్యాంకుగా ఉన్నప్పుడు పట్టభద్రురాల్ని అవుతాను. 1వ ర్యాంకులో ఉన్నప్పుడు రిటైరవుతాను. మోదీ విజన్‌కు ధన్యవాదాలు' అని రాసుంది.

50 వేల మంది రైతుల రాక

21 వరకు కోయంబత్తూరులో జరిగే దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సమాఖ్యకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక నుంచి 50వేల మంది రైతులు, నిపుణులు తరలొచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ప్లకార్డులు చూపుతున్న విద్యార్థినులు

"సేంద్రియ వ్యవసాయరంగం వృద్ధికి ప్రత్యేక పాలసీతో కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలి. ఇది రైతులకు భరోసానిచ్చేలా ఉండాలి. రాష్ట్రంలో చాలాచోట్ల జంతువుల కారణంగా వ్యవసాయ భూములు, పంటలు పాడవుతున్నాయి. దీన్ని నిరోధించాలి.

పి.ఆర్.పాండియన్ - తమిళనాడు రైతు సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షులు"

అరుణాచలేశ్వర ఆలయానికి వెలుగుల శోభ

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి కార్తిక మహా దీపోత్సవాలు ప్రారంభమవుతాయి. డిసెంబరు నెల మూడో తేదీ మహాదీపం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో పలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ఉన్న అన్ని గోపురాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం ఆలయ గోపురాలు విద్యుత్ దీపాలతో వెలుగులీనాయి.

విద్యుత్ దీపాల అలంకరణలో తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయ గోపురాలు

గ్రూప్-2 పోస్టుల పెంపు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: గ్రూప్-2, 2ఏ పోస్టులను 1,270కి పెంచుతున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. సబ్-రిజిస్ట్రార్, జూనియర్ ఉపాధి కల్పనాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సహా 645 ఖాళీల భర్తీకి జులై 15 నుంచి ఆగస్టు 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రిలిమ్స్ పరీక్ష సెప్టెంబరు 28న జరిగింది. 2లక్షలమందికిపైగా రాశారు. టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాల సుందరాజ్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుతం 625 పోస్టులు అదనంగా జోడిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెట్టుబడులపై అవాస్తవాలు

సైదాపేట, న్యూస్‌టుడే: పారిశ్రామిక పెట్టుబడులపై డీఎంకే ప్రభుత్వం అబద్ధాలు చెబుతూనే ఉందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ఆరోపించారు. 'డీఎంకే ప్రభుత్వ అబద్ధపు పారిశ్రామిక పెట్టుబడులు' అనే పుస్తకాన్ని ఆయన బుధవారం చెన్నై ఎగ్మూర్‌లో విడుదల చేశారు. కార్యక్రమానంతరం అన్బుమణి రామదాస్ విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్ర పురోగతి కోసం పీఎంకే ఇప్పటివరకు 57 పుస్తకాలు విడుదల చేసిందన్నారు. పెట్టుబడులు ఆంధ్ర, తెలంగాణలకు వెళుతుండటానికి కారణం తమిళనాడులో అవినీతి, కమీషన్ కారణమని ఆరోపించారు. దేశంలో పరిశ్రమలు స్థాపించేందుకు అనుకూలమైన రాష్ట్రాల జాబితా ఇటీవల కేంద్రం విడుదల చేయగా అందులో తమిళనాడు పేరు లేదని పేర్కొన్నారు. పీఎంకే కోశాధికారి తిలకభామ, న్యాయవాది బాలు తదితర పలువురు పాల్గొన్నారు.

పుస్తకం విడుదల చేస్తున్న అన్బుమణి

డీఎంకేలో అన్నాడీఎంకే నిర్వాహకులు చేరిక

స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరిన అన్నాడీఎంకే నిర్వాహకులు

చెన్నై, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేను వీడి ఆ పార్టీ నిర్వాహకులు పలువురు డీఎంకేలో చేరారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో బుధవారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను అన్నాడీఎంకే విరుదునగర్, తిరునెల్వేలి జిల్లాల నిర్వాహకులు 70 మందికిపైగా కలిశారు. తమ పార్టీ నుంచి వైదొలగి డీఎంకేలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిని పార్టీలోకి స్టాలిన్ ఆహ్వానించారు. వెంట డీఎంకే ఉప ప్రధానకార్యదర్శి, ఎంపీ కనిమొళి, వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి తదితరులు ఉన్నారు.

మదురై, కోవైకు మెట్రోరైలు తీసుకొస్తాం: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: మదురై, కోయంబత్తూర్‌కు మెట్రోరైలు ప్రాజెక్టును కేంద్రం నిరాకరించిన నేపథ్యంలో వాటిని తీసుకొస్తామంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఉద్ఘాటించారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో.. 'ఆలయ నగరం' మదురైకు, 'దక్షిణ భారతదేశ మాంచెస్టర్' కోయంబత్తూర్‌కు మెట్రోరైలు ప్రాజెక్టును కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిరాకరించిందన్నారు. అందరికీ ఉమ్మడిగా వ్యవహరించడమే ప్రభుత్వానికి నిర్వచనమని, దానికి భిన్నంగా భాజపాను తమిళనాడు ప్రజలు నిరాకరించినందుకు ఇలా కక్షసాధించడం దిగజారుడు వైఖరని విమర్శించారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని రెండోస్థాయి నగరాలకు కూడా మెట్రోరైలును ఆమోదించి ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిరాకరించడం సరికాదన్నారు. సమాఖ్యపాలన భావజాలాన్ని విచ్ఛిన్నం చేయడాన్ని ఆత్మాభిమానం కలిగిన తమిళనాడు ఎన్నటికీ ఆమోదించదని తెలిపారు. చెన్నై మెట్రో పనులను జాప్యం చేసి స్తంభింపచేసే ప్రయత్నాలను తిప్పికొట్టి ముందడుగు వేసినట్లే మదురై, కోయంబత్తూర్‌ల భవిష్యత్తు అభివృద్ధికి అసమాన అవసరమైన మెట్రోరైలును తీసుకొస్తామని ఉద్ఘాటించారు.

20, 21 తేదీల్లో ఎస్‌పీఏ ఆందోళన

చెన్నై: కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు లౌకికవాద ప్రగతిశీల కూటమి(ఎస్‌పీఏ) ప్రకటించింది. కూటమి తరఫున బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రానికి జీఎస్టీ నిధుల వాటాలో పక్షపాతం, విద్యానిధి కేటాయించడానికి నిరాకరించడం అంటూ తమిళనాడును, తమిళులను వరుసగా నిరాకరిస్తున్న కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రస్తుతం మదురై, కోయంబత్తూర్ మెట్రోరైలు ప్రాజెక్టులనూ స్తంభింపచేసి దగా చేసిందని ఆరోపించింది. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ఉద్దేశంతో వ్యవహరించే కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి నిరసనగా లౌకికవాద ప్రగతిశీల కూటమి తరఫున గురువారం కోయంబత్తూర్‌లో, శుక్రవారం మదురైలో భారీ ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

కేంద్రం తిరస్కరించడం అవాస్తవం: జీకే వాసన్

వేళచ్చేరి: కేంద్ర ప్రభుత్వం కోవై, మదురై మెట్రో రైలు ప్రాజెక్టులను తిరస్కరించడం అవాస్తవమని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ అన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నేడు తమిళనాడు అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. కోవై, మదురై మున్సిపల్ కార్పొరేషన్లలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి అదనపు సమాచారం కోసం వివరాలు అడిగినట్లు తెలిసిందన్నారు. జనాభా, ఆర్థికాభివృద్ధి ఆధారంగా కోవై, మదురై మెట్రో రైలు ప్రాజెక్టులు ఆగిపోయే అవకాశం లేదని పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

■ 24న వాయుగుండంగా బలపడే అవకాశం ■ రాష్ట్రానికి ఆరు రోజుల పాటు భారీవర్ష సూచన

ప్యారిస్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో 22న ఏర్పడే అల్పపీడనం 24న వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, రాష్ట్రంలో ఆరు రోజుల పాటు భారీవర్షాలకు అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. కన్నియాకుమరి సముద్రతీరం వెంబడి ఉన్న అల్పపీడనం బుధవారం లక్షద్వీప్, మాల్దీవుల ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉందని, రాబోయే 24 గంటల్లో పశ్చిమ, వాయవ్య దిశలో నెమ్మదిగా కదులుతుందని పేర్కొంది. 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, 24న వాయుగుండంగా బలపడి, ఆ తర్వాత 48 గంటల్లో పశ్చిమ, వాయవ్య దిశలో పయనించి మరింత బలపడుతుందని తెలిపింది. ఈ కారణంగా 25వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

మైలాడుతురై, తూత్తుకుడిలో.. 20న మైలాడుతురై, కడలూరు, 21న కన్నియాకుమరి, తిరునెల్వేలి, తూత్తుకుడి, రామనాథపురం, నాగపట్టణం, మైలాడుతురై, కడలూరు, కారైక్కాల్‌లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. 22న రామనాథపురం, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్నియాకుమరి, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుతురై, పుదుక్కోట్టై, కడలూరు, శివగంగై, కారైక్కాల్‌లో, 23న రామనాథపురం, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్నియాకుమరి, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుతురై, పుదుక్కోట్టై, కడలూరు, శివగంగై, కారైక్కాల్‌లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. 24న రామనాథపురం, పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుతురై, కడలూరు, కారైక్కాల్, 25న పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుతురై, కడలూరు, విళుపురం, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

కురుక్కుతునై మురుగన్ ఆలయం చుట్టూ వరదనీరు

గత 24 గంటల్లో వర్షపాతం.. (సెం.మీలలో)	
తిరునెల్వేలి జిల్లాలో	
ఊత్తు	23
నాలుముక్కు	21
కాక్కాచ్చి	19
మాంజోలై	18
తెన్‌కాశిలోని	
ఆయిక్కుడి	14
తెన్‌కాశి	13

చెన్నైలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 20న అండమాన్ సముద్రతీరం, దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ, మధ్య బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, 21 నుంచి 23 వరకు దక్షిణ అండమాన్ సముద్రతీరాల్లో గంటకు 45 నుంచి 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని జాలర్లు ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరించింది.

తిరునెల్వేలిని ముంచెత్తిన వర్షాలు

టీనగర్: తిరునెల్వేలి జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమల్లోని మాంజోలై ఊత్తు ప్రాంతంలో ఏకంగా 232 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం పాళయంగోట్టయ్, వన్నారపేట, కొక్కరకుళం ప్రాంతాల్లో సుమారు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. జిల్లాలోని పాపనాశం డ్యామ్, మణిముత్తారు డ్యామ్ లలోనూ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. తామరభరణి నదిలో వరద ఉద్ధృతి పెరిగింది. నెల్లైలోని కురుక్కుతునై మురుగన్ ఆలయం చుట్టూ వరదనీరు చేరింది.

అభివృద్ధి పనుల పరిశీలన

మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి పి.కె.శేఖర్‌బాబు

చెన్నై, న్యూస్‌టుడే: తిరు.వి.క నగర్ జోన్‌లో జరుగుతున్న పలు నిర్మాణ పనులను మంత్రి పి.కె.శేఖర్‌బాబు బుధవారం పరిశీలించారు. చెన్నై మహానగర పాలకసంస్థ(జీసీసీ) తరఫున 68వ డివిజన్ కొళత్తూర్ పేపర్‌మిల్స్ రోడ్డులోని రాజా గార్డెన్ అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు నివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న బహుళార్థ సాధక భవనం, 69వ డివిజన్ జీకేఎం కాలనీలోని జంబులింగం రోడ్డులో కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పరిశీలించారు. 74వ డివిజన్‌లో హిందూ దేవాదాయశాఖ తరఫున సోమాత్తమ్మన్ ఆలయంలో జరుగుతున్న మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. మేడవాక్కం 2వ వీధిలోని ఖాళీ స్థలంలో తిరు.వి.క నగర్ శాసనసభ నియోజకవర్గం అభివృద్ధి నిధి కింద పార్కు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. జీసీసీ మేయర్ ప్రియ, మధ్య ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ హెచ్.ఆర్.కౌశిక్, జోన్ కమిటీ ఛైర్మన్ సరితా మహేశ్‌కుమార్, ప్రభుత్వ అధికారులు పలువురు పాల్గొన్నారు.

ప్రాజెక్టు రద్దు ఆమోదయోగ్యం కాదు

మాట్లాడుతున్న వైగో

కోయంబత్తూరు: జనాభా ప్రాతిపదికన కోయంబత్తూరులో మెట్రో రైలు ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం ఆమోదయోగ్యం కాదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తెలిపారు. తిరుచ్చి గాంధీపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మద్యం, మాదకద్రవ్యాల విధ్వంసం ప్రభావాల నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులను నిరోధించడానికి జనవరి 2న తిరుచ్చిలో సమానత్వ నడక ప్రారంభమవుతుందని తెలిపారు. మదురైలో ముగుస్తుందన్నారు.

దివ్యాంగులకు రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

పరుగుపందెంలో దివ్యాంగ క్రీడాకారిణులు

సైదాపేట, న్యూస్‌టుడే: దివ్యాంగులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు బుధవారం చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 14 రకాల పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర దివ్యాంగ సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి మధుమతి ప్రారంభించారు. దివ్యాంగుల సంక్షేమశాఖ కమిషనర్ ఎం.లక్ష్మీ, డిప్యూటీ డైరెక్టర్ ఫెర్మీ విద్యా, దివ్యాంగుల సంక్షేమ బోర్డు, ఆలోచనా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు నిర్వహిస్తున్నారు. సుమారు 600 మంది పాల్గొంటున్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

పర్యాటకులకు ఉచిత ప్రవేశం

మహాబలిపురం, న్యూస్‌టుడే: ప్రపంచ వారసత్వ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం నుంచి 25వ తేదీ వరకు మహాబలిపురంలో శిల్ప సౌందర్యాలను సందర్శించేందుకు పర్యాటకులు పురావస్తు శాఖ అధికారులు ఉచితంగా అనుమతిస్తున్నారు. పల్లవ రాజుల కాలంలో నిర్మించిన కట్టడాలు, అర్జున తపస్సు, పంచ రథాలు, వెన్న ముద్ద రాయి, గుహాలయాలు వంటి వాటిని పర్యాటకులు వారం రోజులపాటు ఉచితంగా సందర్శించవచ్చు.

'సర్' పనుల నిలిపివేత తాత్కాలికంగా వాయిదా

చెన్నై, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) పనులను బహిష్కరించినట్లు ప్రకటించిన రెవెన్యూ సంఘాల సమాఖ్య ప్రతినిధులు ప్రస్తుతం తమ పోరాటాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. 'సర్' పనుల ఒత్తిడిని తొలగించాలని, తగిన సమయం అందించాలనే డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా 18న రెవెన్యూ సంఘాల సమాఖ్య బహిష్కరించింది. సమాఖ్య ప్రతినిధులతో రెవెన్యూశాఖ అదనపు ప్రధానకార్యదర్శి అముద, రెవెన్యూ పరిపాలన కమిషనర్ సాయికుమార్ చర్చలు జరిపారు. కొలిక్కి రాకపోవడంతో బుధవారం మరోసారి చర్చలు జరిపారు. తంజావూర్, శివగంగై జిల్లాల్లో పర్యటిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ తదితరులు గురువారం చెన్నై రానుండగా ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి తగిన ఉత్తర్వులు అందించనున్నట్లు భరోసా ఇచ్చారు. తమ పోరాటాన్ని తాత్కాలికంగా వాయిదా వేసి విధులకు హాజరవుతున్నట్లు సమాఖ్య ప్రతినిధులు ప్రకటించారు.

చర్చలు జరుపుతున్న అముద తదితరులు

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు వచ్చిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చెన్నై విమానాశ్రయంలో శక్తివంతమైన బాంబు పేలుతుందని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ-మెయిల్ వచ్చింది. వెంటనే పోలీసులు చెన్నై విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చారు. బాంబు స్క్వాడ్ నిపుణుల తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువు లభించలేదు. విమానాశ్రయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుప్పూర్ కలెక్టరేట్‌కు..

ఆర్కేనగర్: తిరుప్పూర్ పల్లడం రోడ్డులోని కలెక్టరేట్‌కు బుధవారం బాంబు బెదిరింపు ఈ-మెయిల్ అందింది. కలెక్టర్ మణిష్ నరవనర్ ఎస్పీ రాజేంద్రన్‌కు సమాచారం ఇచ్చారు. బాంబ్ స్క్వాడ్ నిపుణుల సోదాలు జరిపారు. ఎలాంటి పేలుడు పదార్థం చిక్కలేదు.

సోదాలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్ నిపుణులు

బిహార్ ఫలితాలు డీఎంకే కూటమిపై ప్రభావం చూపవు



కేవీ తంగబాలు

చెన్నై, న్యూస్‌టుడే: బిహార్ శాసనసభ ఎన్నికల ఫలితాలు తమిళనాడులో డీఎంకే కూటమిపై ప్రభావం చూపవని టీఎన్‌సీసీ ఆస్తుల భద్రత కమిటీ అధ్యక్షుడు కేవీ తంగబాలు తెలిపారు. ఓ తమిళ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. బిహార్ ఎన్నికల ప్రకటన సమయంలో 1.40 కోట్ల మంది మహిళలకు రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఇవ్వడం ప్రభావం చూపిందన్నారు. ఇది రాజ్యాంగం, ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకమని తెలిపారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని తమ కూటమి పటిష్ఠంగా ఉందని చెప్పారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు వంటి విషయాల్లో తుది నిర్ణయం జాతీయ నాయకత్వానిదేనని స్పష్టం చేశారు. టీఎన్‌సీసీలో మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదన్న ఆరోపణలను కొట్టిపారేశారు. గతంలో కన్నా ఎక్కువ మంది ప్రజాప్రతినిధులుగా ఉన్నారన్నారు. కూటమి ఏర్పాటుపై టీవీకేకు కబురు పంపినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ప్రభుత్వ ఉద్యోగఖాళీల భర్తీ, పాత పింఛను పథకం అమలు, మహిళలపై నేరాలు, శాంతిభద్రతలు వంటి ఆరోపణలు రాబోయే ఎన్నికల్లో తమ కూటమికి సవాలు కాబోవన్నారు.

(c) eenadu

బిడ్డ సంరక్షణకు పునర్వివాహం చేసుకున్న తల్లి

నగదు ఇవ్వాలన్న పిటిషన్ కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: బిడ్డ సంరక్షణకు నగదు అందించాలని పునర్వివాహం చేసుకున్న తల్లికి ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం కొట్టివేసింది. ఓ దంపతులకు కుమారుడు ఉన్నాడు. అభిప్రాయభేదాల కారణంగా దంపతులు విడాకులు తీసుకున్నారు. ఇద్దరు వేర్వేరుగా పునర్వివాహాలు చేసుకున్నారు. ఆ బిడ్డ తాత, నానమ్మ సంరక్షణలో ఉన్నాడు. బిడ్డ సంరక్షణ నెలవారీ ఖర్చులను తండ్రి ఇస్తున్నారు. బిడ్డ పేరుపై నగదు డిపాజిట్ చేశారు. ఇన్సూరెన్స్ చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిడ్డ సంరక్షణ ఖర్చులను భరించడానికి నగదు ఇవ్వాలని అతని తల్లికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరి తాత.. సంబంధిత ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ఆ కోర్టు బిడ్డకు తాత సహజ సంరక్షకుడు కాదని, ఆయన పిటిషన్ దాఖలు చేసేందుకు ఎలాంటి కారణం లేదని, తండ్రి ప్రాణాలతోనే ఉన్నాడని, ఆయన ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నాడని పిటిషన్ కొట్టివేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ తాత మదురై ధర్మాసనంలో అప్పీల్ చేశారు. విచారించిన న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ జారీ చేసిన ఉత్తర్వుల్లో... భార్యాభర్తలు పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారన్నారు. తల్లి ప్రశాంతమైన కొత్త కుటుంబ జీవితాన్ని ఇబ్బంది పెట్టడానికే తప్పుడు ఉద్దేశంతో ఈ పిటిషన్ దాఖలైందన్నారు. వివాహ విషయమై ముగింపుపలికిన వ్యక్తిని విడాకుల తర్వాత మళ్లీ తెరిచేందుకు సంరక్షణ నిబంధనలను దుర్వినియోగం చేయడాన్ని న్యాయస్థానం నిరాకరిస్తుందని, కింది కోర్టు ఉత్తర్వులను సమర్థిస్తున్నట్లు తెలిపి పిటిషన్ కొట్టివేశారు.

ఆధునిక సౌకర్యాలతో అంబత్తూర్ బస్టాండ్

✦ నెలాఖరులో ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ బస్టాండ్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుంది. దీనిని ఆధునిక సౌకర్యాలతో చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సీఎండీఏ) సిద్ధం చేసింది. మొత్తం 1.6 ఎకరాల్లో 26 వేల చదరపు అడుగుల భవనంలో ఎంటీసీ పరిపాలనా భవనం ఉంది. బస్టాండ్ నిర్మాణానికి సుమారు రూ.12 కోట్లు వెచ్చించారు. 1967లో నిర్మించిన అంబత్తూర్ బస్ టెర్మినస్‌ను ప్రస్తుతం శుభ్రమైన విశ్రాంతి గదులు, తాగునీటి సౌకర్యం, వెయిటింగ్ హాలు, సీసీ కెమెరాల వంటి సౌకర్యాలతో ఆధునికీకరించారు. ప్రారంభమయ్యాక రోజుకు సుమారు 140 బస్సులను 1,400 కంటే ఎక్కువ ట్రిప్పులు నడపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బస్ షెల్టర్ పనులు అడ్డగింత

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి జీఎన్టీ రోడ్డులో రూ.15 లక్షలతో కొత్తగా బస్ షెల్టర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మిస్తే రెట్టంబేడు రోడ్డులో రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని డీఎంకే నేత శంకర్ నేతృత్వంలో కార్యకర్తలు బుధవారం అడ్డుకున్నారు. పట్టణ డీఎంకే కార్యదర్శి అరివళగన్ అక్కడికి చేరుకొని చర్చించినా ఫలితం లేకపోవడంతో పనులను తాత్కాలికంగా నిలిపి వేశారు.

న్యాయవాదుల ఆందోళన

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి రెట్టంబేడు రోడ్డులో కోర్టు ఉంది. కోర్టు ప్రాంగణంలో మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన భారీ అంబేడ్కర్ చిత్రపటం బుధవారం కనిపించలేదు. దీనికి నిరసనగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సంపత్ నేతృత్వంలో న్యాయవాదులు బుధవారం ఆందోళనకు దిగారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో మనోజ్

అథ్లెటిక్స్‌లో టీజేఎస్ పాఠశాలకు ఛాంపియన్‌షిప్

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం పెరువాయల్‌లోని టీజేఎస్ పబ్లిక్ పాఠశాల మైదానంలో రియల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు బుధవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 85 పాఠశాలలకు చెందిన 800 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. టీజేఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు 23 పతకాలు సాధించి ఛాంపియన్‌షిప్ పొందారు. విజేతలను కరస్పాండెంట్ మనోజ్ అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మరిన్ని పోటీల్లో రాణించాలని కోరారు.

భాజపా బృందంలా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఎన్నికల సంఘం భాజపా బృందంలా వ్యవహరిస్తోందని కరూర్ ఎంపీ ఎస్.జ్యోతిమణి ఆరోపించారు. ఆమె మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సంఘం భాజపా పాలిత రాష్ట్రాల్లో ఒకలా, ఇతర పార్టీల ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో మరో వైఖరి పాటిస్తోందన్నారు. ఆలయ భూముల సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నా కరూర్‌లో మాత్రం ఎందుకు ఖాళీ చేయమంటున్నారో తెలియడంలేదన్నారు. కాంగ్రెస్ టీవీకెతో కూటమి ఏర్పాటు చేస్తుందని సాగుతున్న ప్రచారంపై మాట్లాడుతూ ఆధారం లేని సమాచారం ప్రసారమవుతోందన్నారు. 2010లో కాంగ్రెస్‌లో చేరడానికి విజయ్ రాహుల్ గాంధీని సంప్రదించారని, పలు కారణాలతో కుదరలేదని గుర్తు చేశారు.

మాట్లాడుతున్న ఎంపీ జ్యోతిమణి

తిరువణ్ణామలైకు గొడుగుల ఊరేగింపు

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మహా దీపోత్సవాలు ఈ నెల 21న ప్రారంభమై డిసెంబరు 7 వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం న్యాయంలోని సర్వాంబిగై సమేత పుష్పవదేశ్వరర్ ఆలయం నుంచి గొడుగులు, పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ మేరకు ప్రత్యేక పూజల అనంతరం గొడుగులు బుధవారం తిరువణ్ణామలైకి బయలుదేరాయి. 23న చేరుకుంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గొడుగులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ఈత కొలను ప్రారంభం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మేలకోట్టైయూర్‌లో ఉన్న తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో బుధవారం క్రీడలకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రాంగణంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈత కొలను, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ తరఫున ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం చెంగల్పట్టు జిల్లా వీఐటీ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కార్పొరేషన్, పురపాలక సంఘం, పట్టణ పంచాయతీ, ప్రాంతాల్లో విద్యార్థులకు కళైజ్ఞర్ క్రీడా ఉపకరణాలను అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో రైతులు

మధ్యప్రదేశ్‌లో తిరుచ్చి రైతులు అరెస్ట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీకి నిరసన తెలిపేందుకు దిల్లీ వెళ్లిన తిరుచ్చి రైతులను పోలీసులు మధ్యప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. మేకెదాటు ఆనకట్ట నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని, 60 ఏళ్లు పైబడిన రైతులకు నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు రెట్టింపు ధర ఇవ్వాలనే డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జాతీయ దక్షిణ నదుల అనుసంధానం సంఘం అధ్యక్షుడు అయ్యాకన్ను నేతృత్వంలో మంగళవారం తిరుచ్చి నుంచి దిల్లీకి వందల మంది రైతులు బయలుదేరి వెళ్లారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర హసంగబాత్ జిల్లా నర్మదాపురం రైల్వేస్టేషన్‌లో రైలు నిలిపి ఉన్నప్పుడు పోలీసులు వారిని కిందకు దించి అరెస్ట్ చేశారు.

మెట్రో రైలు విలాసం కాదు

✦ తంగం తెన్నరసు

సైదాపేట, న్యూస్‌టుడే: మెట్రో రైలు విలాసం కాదని, అవసరమైన మౌలిక సదుపాయమని ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మదురై, కోవై రాష్ట్రానికి గర్వకారణమైన నగరాలని తెలిపారు. ఇవి దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ముఖ్యమైనవన్నారు. ఈ నగరాలకు మెట్రో అనేది విలాసం కాదని, అవసరమని చెప్పారు. ప్రజా రద్దీ తగ్గించటానికి, ఆర్థిక వ్యవస్థ మెరుగుకు మెట్రో అవసరమని తెలిపారు. మెట్రో రైలు ఏర్పాటుకు కేంద్రం నిరాకరించటం సమంజసం కాదని పేర్కొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై ప్యారిస్ సమీపంలోని కేడీసీటీ బాలికల మహోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయిని అనిల స్వాగతం పలికారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షురాలు లతా బాలాజీ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. 1964లో పాఠశాల విద్యను పూర్తి చేసిన పూర్వ విద్యార్థిని కస్తూరి ఈశ్వరన్ పాల్గొని తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాను, మాలతి, మల్లికా ప్రకాష్, లీలారాణి, సరళ, ప్రసన్న, భారతి, లక్ష్మి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. నారాయణ గురువయ్య శెట్టి ఛారిటీస్ సౌజన్యంతో రూ.10 వేల విరాళాన్ని పూర్వ విద్యార్థుల సంఘం తరపున పాఠశాల నిర్వాహకులకు అందజేశారు.

విజేతలతో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు తదితరులు

ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తిరుచ్చిలో బుధవారం అధ్యక్షుడు నెల్లై ముబారక్ నేతృత్వంలో నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యుల సంఖ్యను పెంచాలని, భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న సర్‌ను రద్దు చేయాలని, కోర్టులో కేసు వేసేందుకు తీర్మానించారు. వీధి కుక్కలను పట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కోవై, మదురైలో మెట్రో రైలు ప్రాజెక్టుకు అనుమతి నిరాకరించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. డిసెంబరు 6న బాబ్రీ మసీదు కూల్చివేతకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు.

పంచలోహ విగ్రహం లభ్యం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కళ్లకురిచ్చి జిల్లా తిరుక్కోవిలూర్ సమీపం ముడియనూర్‌లో 12వ శతాబ్దపు నాటి అరుణాచలేశ్వర ఆలయం ఉంది. భక్తుల వినతి మేరకు కొద్ది రోజుల కిందట దేవాదాయశాఖ ఆలయ పునరుద్ధరణకు రూ.2.63 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది. మంగళవారం సాయంత్రం పురాతన కట్టడాన్ని తొలగిస్తుండగా రాళ్ల మధ్యలో రెండున్నర అడుగుల ఎత్తు, చేతుల్లో త్రిశూలం, కపాలం, ఆయుధంతో కూడిన పురాతన పంచలోహ అమ్మవారి విగ్రహం, పూజకు ఉపయోగించే పంచలోహ గంట లభించింది. అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

లభ్యమైన విగ్రహం

ప్రపంచ మరుగుదొడ్డి దినం సందర్భంగా రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మేయర్ ప్రియ అధ్యక్షతన అధికారులు, శుభ్రతా సిబ్బంది అవగాహన ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం. డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, కమిషనర్ కుమరగురుభరన్ తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, చెన్నై

ఉమర్ నబీ చెన్నైలో బస చేశాడా? : ఎన్ఐఏ దర్యాప్తు

ప్యారిస్, న్యూస్‌టుడే: దిల్లీలో కారు పేలుడుకు కారణమైన ఉగ్రవాది చెన్నైలో ఉన్న ఫామ్‌హౌస్‌లలో అనుచరులతో కలిసి బస చేశాడా అనే విషయమై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆరా తీస్తోంది. దిల్లీ ఘటన కారకులకు కోయంబత్తూరులో 2022లో జరిగిన కారు పేలుడు ఘటనకు పాల్పడిన వారితో సంబంధం ఉందా అనే విషయమై దర్యాప్తు చేస్తున్నారు. కోవై కేసులో అరెస్టైన 17 మంది, కేరళ జైల్లో ఉన్న అజారుద్దీన్ వద్ద విచారణ సాగుతోంది. అధికారులు మాట్లాడుతూ.. శ్రీలంకలో 2019లో ఈస్టర్ రోజు వరుస బాంబు పేలుళ్లకు పాల్పడిన సహ్రాన్ హాసీమ్ చెన్నై మన్నడి, కోయంబత్తూరుకి వచ్చాడని, ఉమర్ నబీ కూడా తన అనుచరులతో తమిళనాడుకి వచ్చి ఉంటాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణేశుడికి మొక్కిన గజరాజు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా సత్యమంగళం వద్ద తింబం కొండ మార్గం పక్కనున్న వినాయకుని ఆలయానికి రెండు రోజుల కిందట ఓ ఏనుగు వెళ్లి స్వామివారికి మొక్కుకొని వెళ్లింది. ఈ దృశ్యాన్ని అటువైపు వెళ్తున్న వారు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (HON'BLE IV ADDITIONAL DISTRICT JUDGE) :: AT NIZAMABAD

O.P. No. 168 of 2024

Between:

Banoth Anand Rao ...Petitioner

AND

1. Sathish Kumar Muthu Samy and 2 others ....Respondents

To,

Sathish Kumar Muthu Samy S/o. Muthu Samy, Age: 42 years, Occ: Driver of Lorry bearing No.TN-52-B-3099, R/o. No.59, Poosarikadu /Moruru West, Sankari RS Post, Sankari Taluka, Sankari Salem, Tamil Nadu-637302. Cell No. 9976059793.

Whereas, the above petitioner have filed a petition for grant of compensation under section 166(1)(a) of M.V. Act R/W Rule 455 of M.V. Rules before this Court against you and others. Several times notices were sent to you, but the same were returned un-served.

Take notice that the above case is posted for your appearance. You are hereby directed to appear in person or through a pleader before the Hon'ble MACT (Hon'ble IV Additional District Judge), at Nizamabad on 03-12-2025 at 10-30 a.m., failing which the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)

Sd/- **ALGOTE RAVINDER**, Advocate

Nizamabad, Cell No: 94404 85525

తామర పుష్పాల పొడితో ఎరువు

✦ విద్యార్థినికి ప్రశంసలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పాళయంకోట్టై పుష్పలతా విద్యామందిర్ పాఠశాల 11వ తరగతి విద్యార్థినులు సన్నితా, శలాకా రూపొందించిన 'ప్రాజెక్ట్ బ్లూ' అందరి ప్రశంసలు అందుకుంది. నీటిని కలుషితం చేస్తున్న తామర మొక్కను ఎలా తొలగించాలి, దాని నాణ్యమైన సహజపొడిని ఎరువుగా ఎలా తయారు చేయాలి, మొక్కల పెరుగుదలకు ఎలా ఉపయోగించాలో నివేదిక సమర్పించారు. టాప్-200 కేటగిరీలో ఉన్న ఈ ప్రాజెక్ట్ దేశం నుంచి నేరుగా ఐక్యరాజ్య సమితికి సమర్పించే అవకాశం లభించింది. శలాకాకు వీసా అందడంలో ఆలస్యం కావడంతో సన్నితా గతవారం జెనీవాలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్ట్ నివేదిక సమర్పించింది. సన్నితాను పతకం, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఇటీవల దేశానికి తిరిగొచ్చిన విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ పుష్పలత పూరణన్, ప్రిన్సిపల్ పుష్పవేణి అయ్యప్పన్, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

ప్రశంసాపత్రం, పతకంతో సన్నితా

మూడు నెలలకే కూలిన రక్షణగోడ

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపం కుశస్థలి నది ఒడ్డున కిల్కాల్‌పడ్డాడ గ్రామం ఉంది. వరద సమయంలో గ్రామంలోకి నీరు చేరుతుండటంతో రూ.10 లక్షలతో వరద అడ్డుగోడ మూడు నెలల క్రితం నిర్మించారు. ఇటీవల ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పళ్లిపట్టు సమీపం కృష్ణాపురం జలాశయం నుంచి నీటిని కుశస్థలి నదిలోకి వదిలారు. ఆ సమయంలో అడ్డుగోడ వరద తాకిడికి కూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక యూనియన్ బీడీవో అరుపుదరాజ్ గోడను పరిశీలించి గుత్తేదారులకు చెల్లించాల్సిన నగదును నిలిపి వేశారు.

కుశస్థలి నదిలో కూలిన గోడ

డీఎంకే పాలన అంతం కావాలి: నయినార్

సైదాపేట, న్యూస్‌టుడే: మహిళా వ్యతిరేక డీఎంకే పాలన అంతం కావాలని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రామేశ్వరంలో ప్రేమించేందుకు నిరాకరించిన 12వ తరగతి విద్యార్థినిని యువకుడు దారుణంగా హత్య చేశాడన్నారు. డీఎంకే పాలనలో అరెస్టులు పెరుగుతున్నాయే తప్ప మహిళా వ్యతిరేక నేరాలు తగ్గటం లేదని తెలిపారు. ఇలాంటి పాలన రాష్ట్రంలో కొనసాగకూడదని పేర్కొన్నారు.

'విన్నైత్తాండి వరువాయా' సంగీతం ఉపయోగించేందుకు స్టే

ప్యారిస్, న్యూస్‌టుడే: 'విన్నైత్తాండి వరువాయా' సినిమాలోని సన్నివేశాలు, నేపథ్య సంగీతాన్ని 'ఆరోమలే'లో ఉపయోగించేందుకు మద్రాసు హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఇటీవల విడుదలైన 'ఆరోమలే'లో విన్నైత్తాండి వరువాయా సన్నివేశాలు, నేపథ్య సంగీతాన్ని ఉపయోగించడానికి వ్యతిరేకత తెలిపి ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ సంస్థ తరపున మద్రాసు హైకోర్టులో సివిల్ కేసు దాఖలైంది. అనుమతి లేకుండా మినీ స్టూడియో ఉపయోగించినట్లు, నిషేధం విధించాలని పిటిషన్‌లో తెలిపారు. బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్.. కాపీరైట్ చట్ట నిబంధనలు ఉల్లంఘించారని తెలిపి సన్నివేశాలు, సంగీతాన్ని ఆరోమలేలో ఉపయోగించేందుకు మధ్యంతర స్టే విధించారు.

సీబీఐ దర్యాప్తునకు మధ్యంతర స్టే

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసును సీబీఐ దర్యాప్తు చేసేందుకు మధ్యంతర స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్మ్‌స్ట్రాంగ్ గతేడాది జులై 5న తన ఇంటి ముందు హత్యకు గురయ్యాడు. సెంబియం పోలీసులు 27 మందిని అరెస్టు చేశారు. వారిలో రౌడీ తిరువేంగడం ఎన్‌కౌంటర్‌లో, రౌడీ నాగేంద్రన్ అనారోగ్యంతో మృతిచెందారు. ఇద్దరు విదేశాల్లో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ నేతలకు సంబంధం ఉందని, సీబీఐ దర్యాప్తునకు ఉత్తర్వులు ఇవ్వాలని ఆర్మ్‌స్ట్రాంగ్ సోదరుడు మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఎన్వీ అంజారియా ధర్మాసనంలో బుధవారం విచారణకు వచ్చింది. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అభియోగపత్రం దాఖలు చేసినట్లు తమిళనాడు ప్రభుత్వం తరపున వాదించారు. ఆమోదించిన న్యాయమూర్తులు సీబీఐ దర్యాప్తునకు బదిలీ చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు మధ్యంతర స్టే విధించారు. ప్రతి కేసులో సీబీఐ దర్యాప్తు చేయాలని ఉత్తర్వులు ఇవ్వాలని కోరడం ఆమోదించరని తెలిపి, తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఆర్మ్‌స్ట్రాంగ్ సోదరుడు జవాబివ్వాలని తెలిపి విచారణ వాయిదా వేశారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా నీరవళ్లూర్ 110/33-11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల్లో 21వ తేదీ శుక్రవారం మాసాంతర అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నీర్ వళ్లూర్, దాని పరిసర ప్రాంతాలైన చిన్నయ్యన్ సత్రం, రాజకులం, కరూర్, అత్తివాక్కం, తొడూర్, మేల్ మదుర మంగళం, సిరువాక్కం, ఆడి సిరువళ్లూర్, పరందూర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తు శాఖ అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

నిరసనలో పాల్గొన్న తమిళనాడు ల్యాండ్ సర్వే అధికారుల సంఘం ప్రతినిధులు

పోస్టులు భర్తీ చేయాలి

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు కలెక్టరేట్‌లో తమిళనాడు ల్యాండ్ సర్వే అధికారుల సంఘం తరపున బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, కార్యదర్శి సుదర్శన్ తదితరులు మాట్లాడు ల్యాండ్ సర్వేయింగ్ పోస్టులు భర్తీ చేయాలని, వేతన వ్యత్యాసాలు తొలగించాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయంలో పిల్లల సైన్స్ పార్క్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నా సెంటినరీ లైబ్రరీలో పిల్లల సైన్స్ పార్క్‌ను మంత్రి అన్బిల్ మహేష్ ప్రారంభించారు. దీనిని రూ.80.24లక్షలతో ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆచరణాత్మక అనుభవం ద్వారా శాస్త్రీయ భావనలు బోధించడానికి, సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడానికి సైన్స్ పరికరాలు ఏర్పాటు చేశారు.

పరికరాలను తిలకిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

మహిళలు బయట తిరగలేకున్నారు: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే అసమర్థ పాలనలో మహిళలు, పిల్లలు బయట తిరగలేని పరిస్థితి నెలకొందని అన్నా డీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రామేశ్వరంలో 12వ తరగతి విద్యార్థినిని యువకుడి చేతిలో హత్యకు గురైన ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు. ప్రతి నిముషం మహిళలు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు.

శుద్ధిచేసిన తాగునీరు పంపిణీ

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పట్టణంలో మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో 50 మందికిపైగా ఆసుపత్రి పాలయ్యారు. తాగునీటిలో మురుగు చేరడమేనని కారణమని పట్టణ పంచాయతీ నిర్వాహకులు గుర్తించారు. రెండు రోజులుగా పైపుల ద్వారా తాగునీటి సరఫరా ఆపేశారు. శుద్ధిచేసిన మంచినీటిని ట్యాంకర్ ద్వారా ప్రతి వార్డులో ప్రజలకు అందిస్తున్నారు. వేడిచేసి చల్లార్చుకుని తాగాలని పంచాయతీ నిర్వాహకులు స్థానికులకు సూచించారు.

వర్షపు నీటిలో వెళ్తున్న వాహనాలు

గుమ్మిడిపూండిలో భారీ వర్షం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. తామర చెరువు పూర్తిగా నిండడంతో అదనపు నీటిని బుధవారం దిగువకు వదిలారు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై మోకాళ్లలోతు నీరు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో నేల వంతెన ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిండిన వల్లూరు చెక్‌డ్యామ్

పొన్నేరి: పొన్నేరి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలకు మీంజూరు సమీప సీమావరంలోని చెక్‌డ్యామ్‌కు నీరు చేరుతోంది. దీనికితోడు పూండి, చోళవరం చెరువుల నుంచి నీటిని దిగువకు వదలడంతో కుశస్థలి నదిలో వరద ఏర్పడింది. ఈ నీరు చెక్‌డ్యామ్‌కు చేరడంతో పూర్తిగా నిండి పొంగిపొర్లుతోంది. చెక్‌డ్యామ్ వద్ద స్నానాలు చేసేందుకు, బట్టలు ఉతికేందుకు పోలీసులు నిషేధం విధించారు. బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెక్‌డ్యామ్ వద్ద జలకళ

సముద్రపు ఒడ్డుకు చేరిన పడవ

పొన్నేరి: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం పళవేర్కాడు ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో ఓ పడవ బుధవారం ఒడ్డుకు చేరింది. అందులో ఎవరూ లేరు. సమాచారం అందుకున్న తిరుపాళైవనం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా పడవ ఒడిశా రాష్ట్రానికి చెందినదిగా గుర్తించారు. ఒడ్డుకు ఎలా చేరిందనే వివరాలు తెలియరాలేదు.

కులం పేర్ల తొలగింపు జీవోకు మధ్యంతర స్టే పొడిగింపు

ప్యారిస్, న్యూస్‌టుడే: కులం పేర్లు తొలగించే జీవోకి విధించిన మధ్యంతర స్టేను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం పొడిగించింది. రాష్ట్రంలోని నివాస ప్రాంతాలు, వీధులు, రహదారులు, నీటి వనరులు, ఇతర ప్రజాసంస్థల పేర్లలో ఉన్న కులం పేర్లు తొలగించాలని, వీధులు, రహదారులకు నాయకులు, కవులు, పూల పేర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఇందుకు వ్యతిరేకంగా మదురై మేల అనుప్పాండికి చెందిన పరమశివం మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. వీధులు, రోడ్లకు కులం పేర్లు ఉన్నందుకు సమస్యలు వచ్చినట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం అధికారపార్టీ జనం మధ్య శత్రుత్వం ప్రోత్సహించేలా, ప్రజలను విభజించేలా ఈ చర్యలు చేపట్టిందన్నారు. ఈ పిటిషన్‌ను ఇదివరకే విచారించిన మదురై ధర్మాసనం తుది నిర్ణయం తీసుకునే వరకు పాత పేర్లను తొలగించడం, కొత్త పేర్లను అమలుచేయడం చేపట్టకూడదని మధ్యంతర స్టే విధించింది. మళ్లీ విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తరపున జవాబు ఇచ్చేందుకు గడువు కావాలని అదనపు అడ్వకేట్ జనరల్ కోరారు. నమోదు చేసుకున్న ధర్మాసనం విచారణ డిసెంబరు 10కి వాయిదా వేసింది. ఇదివరకే విధించిన మధ్యంతర స్టేను పొడిగించారు.

(c) eenadu

21న ఫ్రెండ్స్ రీరిలీజ్

కార్యక్రమంలో పేరరసు, రమేశ్ కన్నా తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: సిద్ధిక్ దర్శకత్వంలో విజయ్, సూర్య కలిసి నటించిన 'ఫ్రెండ్స్' 2001లో విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. 24ఏళ్ల తర్వాత ఈ చిత్రాన్ని 4కే సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరించి జాక్సన్ స్టూడియోస్ తరఫున మళ్లీ సినిమా థియేటర్లలో శుక్రవారం(21న) విడుదల చేయనున్నారు. చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు. పాను మాట్లాడుతూ... చిత్రాన్ని ఆధునిక సాంకేతికతతో పునరుద్ధరించడానికి 70 రోజుల కష్టాన్ని పట్టిందన్నారు. ఈ సినిమాను ఎప్పుడు చూసినా నవ్వు తెప్పిస్తుందని తెలిపారు. మలయాళంలోని 'ఫ్రెండ్స్' చిత్రం కన్నా ఇది భిన్నంగా ఉంటుందన్నారు. దర్శకుడు గౌతమ్ రాజ్ మాట్లాడుతూ... నిజమైన పాన్ ఇండియా దర్శకుడు సిద్ధిక్ అని కొనియాడారు. కార్యక్రమంలో నిర్మాత వినోద్ జైన్, దర్శకులు పేరరసు, గజేశ్‌బాబు, పాన్ కమనన్, నటుడు రమేశ్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు ఆధారంగా లక్ష్మీకాంతన్ కొలై వళక్కు

చిత్రబృందంతో సుభ.వీరపాండియన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఓ హత్యకేసు ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'లక్ష్మీకాంతన్ కొలై వళక్కు'. దర్శకత్వం, నిర్మాత బాధ్యతలను దయాళ్ పద్మనాభన్ చేపట్టారు. వెట్రి, ప్రముఖ పాత్రికేయుడు దురై పాండే, శరవణన్, లాళు సభ మారన్, ఆకరవు, కవితా భారతి తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. చెన్నైలో ప్రారంభమైన చిత్రీకరణ పనులు ప్రస్తుతం పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. చరిత్రకారుడు, పెరియార్ భావజాలకుడైన సుభ.వీరపాండియన్ ఓ చిత్రంలోని ఓ ముఖ్యమైన పాత్రలో నటించనున్నారు. పాత్రకు జీవం పోయడానికి ఆయన్ను ఆ పాత్ర కోసం ఎంచుకున్నట్లు దర్శకుడు వెల్లడించారు.

రెట్ట తల ప్రత్యేక పోస్టరు ఆవిష్కరణ

చిత్రం పోస్టరు

చెన్నై, న్యూస్‌టుడే: తిరుకుమరన్ దర్శకత్వంలో అరుణ్ విజయ్, సిద్ధి ఇద్నాని జంటగా నటిస్తున్న చిత్రం 'రెట్ట తల'. తన్యా రవిచంద్రన్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. శామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. డిసెంబరు 18న థియేటర్లలోకి రానుంది. అరుణ్ విజయ్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పోస్టరును చిత్రబృందం విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపింది.

హాస్యభరితంగా సావు వీడు



ఫస్ట్‌లుక్ పోస్టరు

చెన్నై, న్యూస్‌టుడే: ఆంటన్ అజిత్ ప్రొడక్షన్స్ పతాకంపై ఆంటన్ అజిత్ నిర్మించి దర్శకత్వం వహించిన చిత్రం 'సావు వీడు'. వైవిధ్యమైన కమర్షియల్ బాణీలో రూపొందించిన చిత్రంలో ఉదయ్ దీప్, ఆదేశ్‌బాలా ఆశిక, మాస్టర్ అజయ్, కవితా సురేశ్, శ్యామ్ జీవా తదితరులు నటించారు. నెలాఖరులో విడుదల కానున్న నేపథ్యంలో ఫస్ట్‌లుక్ పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది. దర్శకుడు మాట్లాడుతూ... చావు ఇంట్లో అనూహ్యంగా చోటుచేసుకునే మలుపు, దాని తర్వాతి పరిణామాలతో హాస్యభరితంగా రూపొందించినట్లు తెలిపారు. కథను రాయడానికి ముందే టైటిల్‌ను ఖరారు చేశానన్నారు.

డీఎంకే కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

గోమతికి బ్యాంకు చెక్కు అందిస్తున్న స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో డీఎంకే కార్యకర్త మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రూ.10 లక్షలను ముఖ్యమంత్రి స్టాలిన్ అందించారు. అనూహ్యంగా రోడ్డు ప్రమాదంలో మరణించే డీఎంకే కార్యకర్తల కుటుంబంలో వారసులు 21ఏళ్ల కన్నా తక్కువగా ఉంటే ఆ కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు స్టాలిన్ గతంలో ప్రకటించారు. ఇప్పటి వరకు 9 మందికి అందించారు. జూన్ 21న బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదేనెల 28న మరణించిన సేలం తూర్పు జిల్లా కార్యకర్త మురుగన్ భార్య గోమతికి అన్నా అరివాలయంలో బుధవారం రూ.10లక్షల బ్యాంకు చెక్కును స్టాలిన్ అందించారు. వెంట పార్టీ ఉప ప్రధానకార్యదర్శి, ఎంపీ కనిమొళి, వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్.భారతి, సేలం తూర్పు జిల్లా కార్యదర్శి ఎస్.ఆర్.శివలింగం, ఎంపీ వీరపాండి తదితరులు ఉన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ ఎన్నికైన డి.రాజా అన్నా అరివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను స్టాలిన్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వెంట ఎంపీ కనిమొళి, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్.ఎస్. భారతి ఉన్నారు. -న్యూస్‌టుడే, చెన్నై

మిరప, పసుపు పొడుల్లో మోతాదుకు మించిన

క్రిమిసంహారకాలు

తయారీ సంస్థలపై ఫిర్యాదు

చెన్నై: రాష్ట్రంలో తయారయ్యే రెండు ప్రముఖ మసాలా పొడి తయారీ సంస్థల మిరప, పసుపు పొడుల్లో మోతాదుకు మించి క్రిమిసంహారకాలు ఉన్నట్లు కోయంబత్తూర్ జిల్లా ఆహార భద్రత శాఖకు వ్యాపారులు ఫిర్యాదు చేశారు. రసం, సాంబారు తదితర ఆహారాల్లో చేర్చే పసుపు, మిరపపొడి వంటివాటిని రాష్ట్రంలోని కొన్ని సంస్థలు తయారు చేసి ప్యాకెట్లలో విక్రయిస్తున్నాయి. వాటిలోని ప్రముఖ సంస్థల మిరపపొడిలో కాపర్ ఆక్సిక్లోరైడ్, కాపర్ హైడ్రాక్సైడ్, కాపర్ సల్ఫేట్ వంటి రసాయనాలు నిర్ణీత మోతాదును మించి ఉన్నాయని కోయంబత్తూర్ కిరాణా వ్యాపారుల సంఘం ప్రతినిధులు ఆరోపించారు. క్రిమిసంహారిణి పనిచేసే పసుపు పొడిలో సైపర్‌మెత్రిన్, థియామెథాక్సామ్ వంటి క్రిమిసంహారక మందులు నిర్ణీత మోతాదును మించి కలిసినట్లు ఆరోపించారు. గత ఆరునెలలుగా శాంపిళ్లను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయించగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ పొడులను ఉపయోగిస్తే నాడీవ్యవస్థ, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతినవచ్చని, ఇవి గర్భిణులు, పిల్లలకు అత్యంత ప్రమాదకరమని తెలిపారు. జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి అనురాధను మీడియా ప్రతినిధులతో మాట్లాడగా జిల్లా ఆహార శాఖ తరఫున శాంపిళ్లను ల్యాబ్‌కు పంపామని, నివేదిక అందిన తర్వాత ఫలితాల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన డార్లింగ్ క్లాసిక్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళీ వెంకటసుబ్బు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి బుధవారం దాత విరాళం డీడీ అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో విజయ్ ప్రభావం చూపుతారు

ఎంపీ కార్తి చిదంబరం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ కచ్చితంగా ప్రభావం చూపుతారని శివగంగ ఎంపీ కార్తి చిదంబరం తెలిపారు. అది విజయంగా మారుతుందా లేదా అనేది తెలియడం లేదన్నారు. పుదుకోట్టై జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిహార్‌లో రిగ్గింగ్‌పై తన వద్ద ఎలాంటి వివరాలు లేవన్నారు. అక్కడ కాంగ్రెస్ ఓడిపోవడానికి కారణం చివరి నిమిషంలో మహిళలకు రూ.10వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడమేనని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో 'సర్' తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు పూరించి తమ ఓట్లు సరిచూసుకోవాలన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కావాలనే తన కోరికను వ్యక్తం చేస్తూ విజయ్ గతంలో రాహుల్‌తో చర్చలు జరిపిన మాట నిజమేనని చెప్పారు.

భాజపా, ఎన్నికల కమిషన్ కుట్ర

తిరుమావళవన్

సైదాపేట, న్యూస్‌టుడే: భాజపా, ఎన్నికల కమిషన్ కలిసి బిహార్ ఎన్నికల్లో కుట్ర చేశాయని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ ఆరోపించారు. బుధవారం ఆయన చెన్నై అశోక్‌నగర్‌లోని వీసీకే కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'సర్'ను వ్యతిరేకిస్తూ 24న వీసీకే తరఫున చెన్నైలో ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. బిహార్ ఎన్నికల ఫలితాలు ఎవరూ ఊహించనివన్నారు. ఎన్నికలు నిజాయితీగా జరగలేదనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తక్కువ సమయంలో పూర్తి చేయడం సవాలుతో కూడుకున్నదని రెవెన్యూ అధికారులే చెబుతున్నారన్నారు. కేరళలో 'సర్' విధుల్లో పాల్గొన్న అధికారి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు.

ఏఐ టెక్నాలజీతో 'సర్' ఫారం భర్తీ

చెన్నై యువకుడి ఆవిష్కరణ

చెన్నై, న్యూస్‌టుడే: తన ప్రాంతంలోని ప్రజలు ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) ఫారాన్ని ఇబ్బంది లేకుండా ఏఐ టెక్నాలజీ సాయంతో భర్తీ చేసేలా చెన్నైకు చెందిన యువకుడు వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఆర్కేనగర్ శాసనసభ నియోజకవర్గంలోని పటేల్ నగర్‌కు చెందిన అబ్బాస్ పాఠశాల విద్యార్థులకు ఏఐ టెక్నాలజీ సాయంతో బోధించే, వైద్యశాల ఉన్నవారికి నిపుణుల సేవల్లో ఉండేలా ఏఐ టెక్నాలజీతో పనిచేసే ఆండ్రాయిడ్ యాప్‌లు, వెబ్‌సైట్లను రూపొందించారు. ప్రస్తుతం తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్యూమరేషన్ ఫారాలను భర్తీ చేయడంలో తలెత్తే ఇబ్బందులను నివృత్తి చేసేలా ఏఐ టెక్నాలజీతో పనిచేసే వెబ్‌సైట్‌ను రూపొందించారు. అబ్బాస్ మాట్లాడుతూ... ఎన్యూమరేషన్ ఫారంలో అవసరమైన ఓటరు పేరు, బంధువు పేరు వంటి వివరాలను ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఫారాన్ని పూర్తిచేసే ఇతర సమాచారాన్ని ఏఐ టెక్నాలజీ ద్వారా అందిస్తుందని తెలిపారు. ఇందుకోసం ఆర్కేనగర్ శాసనసభ నియోజకవర్గం 38వ డివిజన్‌లోని ఓటర్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఇదే సాంకేతికతతో రాష్ట్రంలోని ఓటర్లందరికీ ఉపయోగపడేలా వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ అనుమతిస్తే వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

ప్రధాని పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన

నల్లజెండాలు ప్రదర్శిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ కోయంబత్తూరు పర్యటనను వ్యతిరేకిస్తూ కోవై దక్షిణ తాలూకా కార్యాలయం ఎదుట నల్లజెండాలతో నిరసన జరిగింది. వివిధ రైతు సంఘాలకు చెందిన పలువురు పాల్గొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముగ్గురు మహిళలు సహా 83 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

తిరుచ్చి జైల్లో విదేశీ ఖైదీల ఘర్షణ

తిరుచ్చి సెంట్రల్ జైలు వద్ద భద్రతా విధుల్లో పోలీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి సెంట్రల్ జైల్లోని ప్రాంగణంలో ఖైదీలు ఘర్షణ పడిన ఘటనలో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సెంట్రల్ జైలులో వివిధ కేసులకు సంబంధించి అరెస్టైన శ్రీలంక, సూడాన్, నైజీరియా, బల్గేరియా, ఉగాండా దేశాలకు చెందిన 140 మందికి పైగా విదేశీయులు ఉన్నారు. నైజీరియా, ఉగాండా దేశాలకు చెందిన ఖైదీలు బుధవారం తెల్లవారుజామున ఘర్షణ పడ్డారు. జిల్లా కలెక్టర్ శరవణన్, కమిషనర్ కామిని అక్కడికి చేరుకుని ఇరువర్గాల ఖైదీలతో చర్చించారు. జైలు వద్ద వందల సంఖ్యలో పోలీసులను భద్రతా విధుల్లో ఏర్పాటు చేశారు. ఫ్రాన్సిస్, యూసఫ్, పీటర్, జేమ్స్ అనే నలుగురు ఖైదీలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారిని పుళల్ జైలుకు తరలించాలని తిరుచ్చి జిల్లా నిర్వాహకం నిర్ణయించింది.

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.24 లక్షలు మోసం

అరెస్టైన తేజస్, ప్రణవ్, ముహమ్మద్ సమీర్

ప్యారిస్, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరుతో మోసానికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు జైలుకు పంపారు. పోలీసులవివరాల మేరకు... చెన్నై తండయార్‌పేటకు చెందిన చిత్రలేఖ సెల్‌ఫోన్‌కు వీడియో కాల్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు తాము పోలీసు, సీబీఐ అధికారులమని చెప్పి ఆమె ఆధార్ కార్డును ఓ వ్యక్తి కిడ్నాప్ కేసుతో సంబంధం ఉందని డిజిటల్ అరెస్టు చేశారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు తమతో సంప్రదింపులు జరపాలని తెలిపారు. ఆమె నుంచి రూ.24 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లోకి పంపించాలని తెలిపి మోసానికి పాల్పడ్డారు. చిత్రలేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి కర్ణాటకకు చెందిన తేజస్, ప్రణవ్, ముహమ్మద్ సమీర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

డీఎంకేను గద్దె దింపడమే లక్ష్యం

మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడులో డీఎంకేను గద్దె దింపడమే లక్ష్యంగా అన్నాడీఎంకే పావులు కదుపుతోందని, అవసరమైతే తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో పొత్తు చర్చలు జరిపేందుకు తమ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి సిద్ధంగా ఉంటారని మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం తిరునెల్వేలిలో విలేకర్లతో మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, భాజపా మిత్రపక్షాల కూటమి 220కి పైగా స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. ఎడప్పాడి పళనిస్వామికి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్నాడీఎంకేను చీల్చి, సమస్యలు సృష్టించిన వారికి తిరిగి పార్టీలోకి ఆహ్వానం ఉండదని తేల్చి చెప్పారు. పార్టీలో ఇప్పుడు ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై ఇనుప ముక్కలు

ఐదుగురు యువకుల అరెస్టు

పట్టాపై ఉంచిన ఇనుప ముక్కలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ట్రాక్‌పై ఇనుప ముక్కలు పెట్టి రైలును కూలదోయడానికి కుట్ర పన్నిన యువకులను రైల్వే పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఈనెల 9న చెన్నై నుంచి కారైక్కుడికి బయలుదేరిన పల్లవన్ ఎక్స్‌ప్రెస్ దిండివనం వద్ద వెళుతుండగా సాయంత్రం 6 గంటల సమయంలో ట్రాక్‌పై వింతశబ్దం వినిపించడంతో లోకో పైలెట్ బండిని ఆపేసి విషయాన్ని దిండివనం రైల్వే భద్రతా అధికారులకు తెలియజేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అనంతరం 3 గంటల ఆలస్యంగా రైలు అక్కడి నుంచి కారైక్కుడి బయలుదేరింది. సిబ్బంది ట్రాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా దిండివనం సమీప మేల్‌పాక్కం వద్ద దెబ్బతిన్నట్లు గుర్తించి రైల్వే భద్రతా అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మేల్‌పాక్కం వద్ద సీసీటీవీ పుటేజీలు పరిశీలించగా రైల్వే ట్రాక్‌పై 5 మంది యువకులు కూర్చొని మద్యం తాగుతుండటాన్ని గుర్తించారు.

వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరిపారు. ట్రాక్‌పై ఇనుప ముక్కలు ఉంచి రైలు కూలదోయడానికి కుట్ర పన్నినట్లు తెలిసింది. బిహార్‌కు చెందిన అభిషేక్ కుమార్, ఆకాష్ కుమార్, రాజారాం సహా ఐదురుగు యువకులను అరెస్టు చేసి మంగళవారం విళుపురం కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

రూ.50 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఎర్రచందనం దుంగలతో పోలీసులు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా మేల్ నగర్ గ్రామంలో అన్నాడీఎంకే ప్రముఖుడు ఎంసీ రవి ఇంట్లో రూ.50 లక్షల విలువైన 2 టన్నుల ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొద్దిరోజులుగా జవ్వాదుకొండ నుంచి అమిర్థి మీదుగా కన్నమంగళం ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను తెచ్చి గోదాంలో దాచి, అక్కడి నుంచి ఆంధ్ర రాష్ట్రానికి తరలిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. బుధవారం ప్రత్యేక పోలీసులు కన్నమంగళం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఎంసీ రవి ఇంట్లో ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రవి రెండేళ్లుగా బయట ఊర్లో నివాసం ఉంటున్నారని, ఆ ఇంటిని రవి అన్న కుమారుడు రమేష్ ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. రమేష్‌పై ఆంధ్ర రాష్ట్రంలో ఎర్రచందనం దుంగలు తరలించినట్లు కేసు నమోదైంది. ప్రస్తుతం రమేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మత్తుపదార్థాల విక్రయం: వైద్య విద్యార్థి అరెస్ట్

ప్యారిస్: మత్తుపదార్థాలను విక్రయించేందుకు యత్నించిన వైద్య విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై నొళంబూర్ పోలీసులు స్థానికంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనంలో వచ్చిన యువకుడి వద్ద తనిఖీ చేయగా 50 గ్రాముల మత్తు పుట్ట గొడుగులు, 102 ఎల్‌ఎస్‌డీ స్టాంపులు స్వాధీనం చేసుకున్నారు. అతని పేరు మోనీష్ అని, ప్రైవేటు వైద్య కళాశాలలో నాలుగో ఏడాది చదువుతున్నట్లు తెలిసింది. ఆన్‌లైన్ ద్వారా నగదును బిట్‌కాయిన్‌గా మార్చి కొరియర్ ద్వారా మత్తుపదార్థాలు కొనుగోలు చేసేవాడని గుర్తించారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

లింగ నిర్ధారణ కేసులో ఐదుగురు..

విల్లివాక్కం, న్యూస్‌టుడే: స్కానింగ్ సమయంలో శిశువు లింగ నిర్ధారణచేసిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్మపురి జిల్లా పాలక్కోడు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం వస్తున్న గర్భిణిలకు శిశువు లింగ నిర్ధారణ తెలియజేస్తున్నట్లు ప్రధాన వైద్యాధికారి బాలసుబ్రమణ్యంకు సమాచారం అందింది. సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించగా ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు పరిమళ సహాయంతో కొంతమంది మధ్యవర్తులు ఈ దురాగతానికి పాల్పడినట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు ప్రత్యేక పోలీసు బృందం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్లారా మేనకాదేవి, ప్రదీప్, పాలక్కోడు సమీపంలోని అనుమంతపురం ప్రాంతానికి చెందిన వడివేల్ సహా ఐదుగురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. పరారీలో ఉన్న నర్సు కోసం గాలిస్తున్నారు.

లంచం తీసుకున్న తహసీల్దార్

వళ్లియమ్మ

వేలూరు, న్యూస్‌టుడే: లంచం తీసుకున్న నాట్రంపల్లి ప్రత్యేక తహసీల్దార్‌ను అవినీతి నిరోధక శాఖ(అనిశా) అరెస్టు చేసింది. తిరుపత్తూరు జిల్లా మల్లపల్లికి చెందిన మలర్ నెల కిందట మృతి చెందింది. రైతు రక్షణ పథకం కింద సహజ మరణం పొందిన మహిళ అంత్యక్రియలకు ప్రభుత్వం రూ.25 వేలు ప్రకటించింది. మృతురాలి కుమారుడు శేఖర్ మంగళవారం నాట్రంపల్లి ప్రత్యేక తహసీల్దార్ వళ్లియమ్మ సంతకం కోసం సంప్రదించగా రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.2 వేలు మాత్రమే ఇస్తానని శేఖర్ ఒప్పుకొన్నాడు. అనంతరం అనిశాకు ఫిర్యాదు చేశాడు. తిరుపత్తూరు జిల్లా అనిశా డీఎస్పీ రాజు, ఇన్‌స్పెక్టర్ గౌరి నేతృత్వంలోని ఐదుగురి బృందం శేఖర్‌కు రసాయనం పూసిన నగదును ఇచ్చి పంపారు. శేఖర్ వద్ద నగదు తీసుకున్న తహసీల్దార్ వళ్లియమ్మను అధికారులు పట్టుకున్నారు. విచారణ సమయంలో ఆమె తనను చంపేయమని ఏడ్చి స్పృహ తప్పి పడిపోయారు. తిరుపత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను అరెస్టు చేసి వేలూరు జైలుకు తరలించారు.

కోర్టులో హాజరవడాన్ని రీల్స్ చేసిన వ్యక్తి ..

ప్యారిస్, న్యూస్‌టుడే: కోర్టు బోనులో నిల్చోవడాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు...చెన్నైలో కోర్టులోపల ఉన్న బోనులో నిలబడడాన్ని వీడియో రికార్డు చేసి భరత్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. కేసు దర్యాప్తునకు హాజరైన అతను తన స్నేహితుడితో వీడియో తీయాలని చెప్పి, ఆ తర్వాత ఎడిట్ చేసి రీల్స్ పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో రీల్స్ పోస్ట్ చేసిన భరత్, వీడియో తీసిన 17 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. భరత్‌పై నార్త్ బీచ్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

అప్పు చెల్లించలేదని యువకుడి అపహరణ

ప్యారిస్, న్యూస్‌టుడే: అప్పు తిరిగి చెల్లించలేదని యువకుడిని కిడ్నాప్ చేసి నగలు దోచుకున్న పారిశ్రామికవేత్తను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చెన్నై వ్యాసర్పాడికి చెందిన ముకేష్ చెన్నై రిచ్చి స్ట్రీట్‌లో ఎలక్ట్రానిక్ దుకాణం నడుపుతున్నాడు. మూడు నెలల కిందట చూళైకి చెందిన పారిశ్రామికవేత్త రాజేష్ జైన్ వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. రూ.8 లక్షలు తిరిగిచ్చాడు. మంగళవారం ఇంటి నుంచి బయటికొచ్చిన ముకేష్‌ను రాజేష్ జైన్ కారులో తీసుకెళ్లి మిగిలిన నగదు ఇవ్వాలని బెదిరించి అతను ధరించిన 41 గ్రాముల బంగారు గొలుసు, రూ.10 లక్షలకు సంబంధించి బాండు పేపర్లో సంతకం చేయించుకుని ఇంటి వద్ద విడిచి వెళ్లాడు. ముకేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు రాజేష్ జైన్‌ను అరెస్టు చేశారు. ముకేష్‌కు రాజేష్ జైన్ రూ.25 లక్షలు ఇచ్చినట్లు, రూ.6 లక్షలు మాత్రమే తిరిగిచ్చినట్లు, మిగిలిన నగదు అడిగేందుకు ఇంటికి వెళ్లగా బయటకు వెళ్లి మాట్లాడుకుందామని చెప్పడంతో కారులో వెళ్లినట్లు పేర్కొన్నాడు.

చెట్టును ఢీకొన్న కారు

ముగ్గురు ఎంబీబీఎస్ విద్యార్థుల దుర్మరణం

నుజ్జునుజ్జయిన కారు

ప్యారిస్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వైద్య విద్యార్థులు దుర్మరణం పాలైన విషాద ఘటన తూత్తుకుడిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తూత్తుకుడి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో ఏడాది చదువుతున్న తిరుపత్తూర్ జిల్లాకు చెందిన చరణ్(23), ముగిలన్(23), పుదుక్కోట్టై జిల్లాకు చెందిన రాహుల్ జెబస్టియాన్(23), కోయంబత్తూరుకు చెందిన సారుబన్(23), తూత్తుకుడికి చెందిన కృతిక్ కుమార్(23) ఒకే కారులో బుధవారం తెల్లవారుజామున బీచ్ రోడ్డులో వెళ్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో రోచ్ పార్కు వద్ద రోడ్డుపై పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు కనిపించలేదు. దగ్గరకు వెళ్లి చూడగానే తప్పించేందుకు కారును వేగంగా పక్కకు తిప్పడంతో పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. రాహుల్ జెబస్టియాన్, సారూబన్‌లు ఘటనా స్థలిలో మృతి చెందారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు కారులో ఉన్న వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో ముగిలన్ ప్రాణాలు కోల్పోయాడు. కృతిక్‌కుమార్, చరణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

విల్లివాక్కం: అందియూర్ సమీపంలోని చిందగౌండన్‌పాళయానికి చెందిన కార్మికుడు పెరుమాళ్(55) ద్విచక్ర వాహనంలో మంగళవారం బ్రహ్మదేశం-అందియూర్ రోడ్డులో వెళుతున్నాడు. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన పెరుమాళ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంలో వచ్చిన బర్గూర్‌కు చెందిన రాజ్‌కుమార్‌కు బలమైన గాయాలు తగిలాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైనికుడి ఆత్మహత్య

సంతోశ్ (పాతచిత్రం)

వేలూరు: సైనికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వేలూరు జిల్లా ఒడుక్కత్తూరుకు చెందిన వెంకటేశన్ కుమారుడు సంతోశ్(28) రెండేళ్లుగా సైన్యంలో పనిచేస్తున్నారు. ఇంకా వివాహం కాలేదు. విధుల్లో మానసిక ఒత్తిడి ఉందని, చికిత్స నిమిత్తం సొంత ఊరికి వచ్చారు. మంగళవారం రాత్రి అక్కడి రైతు పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వేప్పంకుప్పం పోలీసులు మృతదేహాన్ని వేలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జుట్టు రాలుతోందని యువతి..

ప్యారిస్: కన్నియాకుమరి జిల్లా తెన్‌తామరైకుళంకి చెందిన తంగసామి కుమార్తె ఐశ్వర్య(27). బీఎస్సీ చదివిన ఆమె ప్రస్తుతం ఇంట్లో ఉంటోంది. మూడేళ్లుగా తలజుట్టు అధికంగా రాలుతుండడంతో మానసిక ఒత్తిడికి గురైంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఐశ్వర్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భాజపా నాయకుడిపై హత్యాయత్నం

చికిత్స పొందుతున్న సెంథిల్

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీప పెరుంగళత్తూర్ శ్రీనివాసనగర్‌కు చెందిన సెంథిల్ భాజపా క్రీడలు, నైపుణ్యాభివృద్ధి విభాగాల పీర్కంగరణై జోన్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల క్రితం పెరుంగళత్తూర్ రైల్వేస్టేషన్ సబ్‌వే వద్ద ద్విచక్ర వాహనంపై స్నేహితులతో వెళుతుండగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి గస్తీలో ఉన్న పోలీసులను చూసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన సెంథిల్‌ను సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పీర్కంగరణై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థిరాస్తి వ్యాపారంలో పోటీ కారణంగా కిరాయి గూండాలతో హత్యాయత్నం జరిపినట్లు దర్యాప్తులో తెలిసింది. విగ్నేష్, విజయ్, సుధాకర్‌ను సీసీ టీవీ పుటేజీల ఆధారంగా అరెస్టు చేశారు. వారిని పంపిన వారెవరనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

లారీ ఢీకొని అయ్యప్ప భక్తులు మృతి

గంగాధర్, సూర్య (పాతచిత్రాలు)

వేలూరు, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఇద్దరు అయ్యప్ప భక్తులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణికి చెందిన ఓ బృందం శబరిమలకు వెళ్లి తిరిగి తిరుత్తణికి బస్సులో బయల్దేరింది. ఆంబూరు వద్ద సెంగిలికుప్పం మిన్నూర్ ప్రాంతంలో బస్సు పక్కన ఆపి టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొంది. తీవ్రగాయాలకు గురైన గంగాధరన్(35), సూర్య (22) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలకు గురైన ఆది, నరసిమ్మన్‌ను వాణియంబాడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వేలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆంబూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

12 మందికి గాయాలు

టీనగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సులోని ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం రాత్రి చెన్నై నుంచి కోయంబత్తూరుకు బయలుదేరిన బస్సు బుధవారం ఉదయం సేలం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఎనిమిదేళ్ల బాలిక సహా 12 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో మొత్తం 28 మంది ఉన్నట్లు తెలిసింది.

బాలుడి కిడ్నాప్ కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష

మురుగన్, పాండియన్

ట్రిప్లికేన్: బాలుడి కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. తేని వద్ద ఓ గ్రామానికి చెందిన కార్మికుడి 11 ఏళ్ల కుమారుడు స్థానికంగా ఆరో తరగతి చదువుతున్నాడు. 2017 ఫిబ్రవరి 6వ తేదీ పాఠశాలకు వెళ్లిన బాలుడు ఇంటికి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు తేని పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలించారు. పాఠశాల ప్రాంతంలోని సీసీ కెమెరా దృశ్యాల్లో బాలుడిని 50 ఏళ్ల వ్యక్తి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. పోలీసులు బాలుడిని గుర్తించలేకపోయారు. కేసును 2017 డిసెంబరులో సీబీసీఐడీకి అప్పగించారు. బాలుడిని చిన్నమనూరుకు చెందిన మురుగన్ కిడ్నాప్ చేసి ఉసిలంపట్టికి చెందిన పాండియన్ ద్వారా బెంగళూరులో ఉన్న ఓ కంపెనీలో బాల కార్మికుడిగా పనిలో చేర్చినట్లు తేలింది. 2018న జనవరిలో బాలుడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించి మురుగన్, పాండియన్‌ను అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో ఇద్దరికీ పదేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తేని జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి అనురాధ మంగళవారం తీర్పునిచ్చారు.

టైరుపేలి వ్యాన్ బోల్తా.. కోడిగుడ్లు ధ్వంసం

రోడ్డుపై పడ్డ వ్యాన్.. ధ్వంసమైన కోడిగుడ్లు

పళ్లిపట్టు: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి-అరక్కోణం రోడ్డుకు చెందిన నాగరాజన్ కోడిగుడ్ల హోల్‌సేల్ వ్యాపారి. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు నుంచి 63 వేల కోడిగుడ్లను వ్యానులో తీసుకుని తిరుత్తణికి బయలుదేరారు. పళ్లిపట్టు సమీపం అత్తిమాంజేరిపేట వద్ద వ్యాన్ టైరు పేలి రోడ్డుపై బోల్తాపడింది. రూ.4లక్షల విలువైన కోడిగుడ్లు రోడ్డు పాలయ్యాయి. పొదట్టూరుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు సమీపం సెంజిపనపాక్కంలో పొన్నియమ్మవారి ఆలయం ఉంది. పురోహితుడు బుధవారం ఉదయం దేవాలయానికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉంది. అమ్మవారి మెడలోని సవరు బంగారు నగలు, హుండీలోని కానుకలు కనిపించలేదు. సమీపంలోని మురుగన్ ఆలయంలోని హుండీలోని కానుకలు కూడా చోరీకి గురయ్యాయి. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu